*Saheeh Bukhari (Vol-4)*
*(Telugu)*

# సహీహ్ బుఖారీ

## (4వ సంపుటం)

మూలం
**హజ్రత్ అల్లామా వహీదుజ్జమా (రహ్మ)**

తెలుగు అనువాదం
**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

ప్రకాశకులు :
**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్–500 002.
ఫోన్: 040–24564583

# Saheeh Bukhari *(Vol-4)*

## Saheeh Bukhari (Vol-4) (Telugu)

**TIP Series No.** : **339**

Written by : **Hazrat Allama Waheeduzzama** (R.H)

Translated by : **Muhammad Azeezur Rahman**

*All Rights Reserved with Publishers*

First Edition : June 2022

Copies : 1000

**Price : Rs. 400/-**

ISBN : **978 - 93 - 81111 - 90 - 1**

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 040 - 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

**"దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని**
**సంతోషంగా స్వీకరించండి.**
**ఆయన మిమ్మల్ని వారించిన**
**దాని జోలికి పోకండి."**

*(అల్ హష్ర్ : 7)*

# విషయసూచిక


## 1. సాక్ష్యాధారాల ప్రకరణం 1

అధ్యాయం : 01 సాక్ష్యాలను సమర్పించవలసిన బాధ్యత వాదిదే 1
అధ్యాయం : 02 ఒకవేళ ఎవరయినా మరొకరి మంచి అలవాట్లను ప్రస్తుతించటానికి... 3
అధ్యాయం : 03 చాటుమాటుగా సాక్ష్యమివ్వటం సరైనదే 4
అధ్యాయం : 04 అనేకమంది సాక్షులు ఏదేని వ్యవహారంలో అవునని సాక్ష్యమిచ్చినప్పుడు 6
అధ్యాయం : 05 సాక్షి న్యాయవర్తనుడై ఉండటం అవసరం 7
అధ్యాయం : 06 ఒకరి సాక్ష్యాన్ని న్యాయబద్ధంగా ఖరారు చేయడానికి ఎంతమంది సాక్షులు కావాలి? 8
అధ్యాయం : 07 వంశపరంగా, పాల వరుస సంబంధం దృష్ట్యా ప్రసిద్ధి చెందటం... 9
అధ్యాయం : 08 వ్యభిచారపు అపనింద మోపేవారి, ... సాక్ష్యం గురించి... 11
అధ్యాయం : 09 అన్యాయం, దౌర్జన్యంతో కూడుకున్న వ్యవహారంపై సాక్ష్యమివ్వమని కోరితే 13
అధ్యాయం : 10 అబద్ధపు సాక్ష్యం పెద్ద పాపం 15
అధ్యాయం : 11 అంధుని సాక్ష్యం, అతని వ్యవహారాల గురించి వివరణ.... 16
అధ్యాయం : 12 స్త్రీల సాక్ష్యం గురించి 19
అధ్యాయం : 13 బానిసల, బానిస స్త్రీల సాక్ష్యం 19
అధ్యాయం : 14 పాలిచ్చిన తల్లి సాక్ష్యం గురించి 20
అధ్యాయం : 15 స్త్రీలు పరస్పరం ఒండొకరిలోని మంచిని గురించి సాక్ష్యమివ్వటం 21
అధ్యాయం : 16 ఒక పురుషుడు మరో పురుషుణ్ణి మంచివాడని అంటే చాలు 28
అధ్యాయం : 17 ఒకరి పొగడ్తలో అతిశయిల్లటం అయిష్టకరం. తనకు తెలిసినంత వరకే చెప్పాలి 29
అధ్యాయం : 18 పిల్లలు ప్రాజ్ఞులవటం, వారి సాక్ష్యం గురించి 30
అధ్యాయం : 19 నిందితుని చేత ప్రమాణం చేయించే ముందు 'నీ దగ్గర సాక్ష్యాధారం ఉందా?' 31
అధ్యాయం : 20 సివిల్, క్రిమినల్ వివాదాలలో నిందితుని చేత ప్రమాణం చేయించటం 32
అధ్యాయం : 21 "ఎవరయితే వేరొకరి సొమ్మును కబళించే ఉద్దేశ్యంతో ప్రమాణం చేస్తాడో.. 33
అధ్యాయం : 22 ఎవరయినా వేరొకరిపై నిందారోపణ చేస్తే ..... 34
అధ్యాయం : 23 అస్ర్ నమాజ్ అనంతరం (అబద్ధపు) ప్రమాణం చేయడం 35
అధ్యాయం : 24 'ప్రమాణంచేసి చెప్పు' అని ఆజ్ఞాపించబడిన చోటే ప్రమాణం చేయాలి 36
అధ్యాయం : 25 ప్రతి ఒక్కరూ ప్రమాణం చేయడానికి తొందరపడినప్పుడు... 37
అధ్యాయం : 26 "ఎవరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని స్వల్పమైన వెలకు విక్రయిస్తారో 37
అధ్యాయం : 27 ప్రమాణం ఎలా చేయించాలి? 38
అధ్యాయం : 28 (నిందితుడు) ప్రమాణం చేసిన మీదట ఎవరైనా సాక్ష్యాధారాన్ని సమర్పిస్తే... 40
అధ్యాయం : 29 వాగ్దానాన్ని నెరవేర్చటం అవసరం 41

అధ్యాయం : 30 "కపటి (మునాఫిక్) చిహ్నాలు మూడు 42
అధ్యాయం : 31 ముష్రిక్కుల సాక్ష్యం స్వీకార యోగ్యమవదు 43
అధ్యాయం : 32 కష్టకాలంలో చీటీలు వేయటం 44

## 2. సంధి ప్రకరణం 48

అధ్యాయం : 1 ప్రజల మధ్య సంధి చేయించినందుకు ప్రాప్తమయ్యే పుణ్యం 48
అధ్యాయం : 2 జనుల మధ్య రాజీ కుదర్చడానికి అబద్ధం చెప్పేవాడు అబద్ధీకుడు కాడు. 51
అధ్యాయం : 3 "మమ్మల్ని తీసుకెళ్ళండి, మేము సంధి చేయిస్తాము" అని పాలనాధికారి చెబితే... 52
అధ్యాయం : 4 "భార్యాభర్తలు గనక పరస్పరం రాజీకి వస్తే ..... 52
అధ్యాయం : 5 ఒకవేళ అన్యాయం, అక్రమంపై సంధి చేసుకుంటే అట్టి సంధి వ్యర్థం 53
అధ్యాయం : 6 సంధి పత్రంపై ... కుటుంబీకుల గురించి గానీ 55
అధ్యాయం : 7 బహు దైవారాధకులతో సంధి చేసుకోవటం గురించి 58
అధ్యాయం : 8 'దియత్'పై సంధి చేసుకోవటం 59
అధ్యాయం : 9 "నా ఈ పు(పౌ)త్రుడు ముస్లింల నాయకుడు. ఇతని ద్వారా అల్లాహ్ ముస్లింల రెండు పెద్ద వర్గాల మధ్యన సంధి చేయించవచ్చు" 60
అధ్యాయం : 10 నాయకుడు రాజీ కోసం సంకేత ప్రాయంగా ఏమైనా చెప్పగలడా? 62
అధ్యాయం : 11 జనుల మధ్య సయోధ్యకు, న్యాయం చేయడానికి కృషి చేయటం 64
అధ్యాయం : 12 ఒకవేళ పరిపాలకుడు ఉభయ తారకమైన సూచన చేసినప్పుడు .... 64
అధ్యాయం : 13 మృతుని బకాయిలను చెల్లించమని కోరినవారికి....రాజీ కుదర్చటం 65
అధ్యాయం : 14 రుణానికి బదులుగా కొంత నగదు సొమ్మును చెల్లించి రాజీపడటం 67

## 3. షరతుల ప్రకరణం 68

అధ్యాయం : 1 ఇస్లాంలో ప్రవేశించేటప్పుడు క్రయ విక్రయ సంబంధిత షరతులలో... 68
అధ్యాయం : 2 అంటు కట్టిన తరువాత గనక ఖర్జూర వృక్షాన్ని అమ్మితే... 70
అధ్యాయం : 3 క్రయ విక్రయాలలో షరతులు విధించుకోవటం 70
అధ్యాయం : 4 ఒకవేళ వాహనాన్ని అమ్మే వ్యక్తి, నేను ఫలానా స్థలం వరకు ..... 71
అధ్యాయం : 5 వ్యవహారాలలో షరతులు పెట్టుకోవటం 72
అధ్యాయం : 6 వివాహ సమయంలో 'మహర్'పై షరతు విధించటం 73
అధ్యాయం : 7 వ్యవసాయంలో ధర్మసమ్మతమైన షరతులు 74
అధ్యాయం : 8 వివాహంలో ధర్మసమ్మతం కాని షరతులు 75
అధ్యాయం : 9 శిక్షల విషయంలో ధర్మసమ్మతం కాని షరతులు 74
అధ్యాయం : 10 'ముకాతబ్' గనక బానిసత్వం నుండి విడుదల అయ్యే షరతులపై క్రయ విక్రయాల వ్యవహారానికి అంగీకరిస్తే అది సమంజసమే. 76

అధ్యాయం : 11 విడాకుల సందర్భంగా షరతులు పెట్టడం 77
అధ్యాయం : 12 జనులకు మూజువాణి షరతు పెట్టడం 78
అధ్యాయం : 13 'వలా' గురించి షరతు పెట్టడం 78
అధ్యాయం : 14 భూమి యజమాని సాగు చేసే వానితో, 'నేను తలచుకున్నపుడు... 79
అధ్యాయం : 15 ధర్మయుద్ధంలో షరతులు విధించటం ... 81
అధ్యాయం : 16 అరువు వ్యవహారంలో షరతు పెట్టడం 94
అధ్యాయం : 17 యజమానితో లిఖితపూర్వక ఒప్పందం చేసుకున్న బానిస గురించి.... 94
అధ్యాయం : 18 వ్యవహారం చేసేటప్పుడు నోటి మాటగా షరతు పెట్టడం... 95
అధ్యాయం: 19 'వక్ఫ్'లో షరతులు విధించటం 96


## 4. వీలునామాల ప్రకరణం 98


అధ్యాయం : 1 తన వారసులను ఇతరుల ముందు చేయి చాచి అర్థించేలా వదలిపెట్టడం 100
అధ్యాయం : 2 మూడో వంతు ఆస్తిని వసీయతు చేయడం 102
అధ్యాయం : 3 వసీయతు చేసే వ్యక్తి తాను వసీయతు చేసిన వానితో..'దావా' చేయటం 103
అధ్యాయం : 4 ఒకవేళ రోగి గనక, అర్థమయ్యేలా తల ఊపితే (సంజ్ఞ చేస్తే) 104
అధ్యాయం : 5 వారసుని కొరకు వసీయతు చేయడం ధర్మసమ్మతం కాదు 105
అధ్యాయం : 6 మరణ ఘడియలలో దానధర్మాలు చేయటం 105
అధ్యాయం : 7 "మృతుడు వ్రాసిన వీలునామాను అమలుపరచి, అతనిపై ఉన్న అప్పులు 106
అధ్యాయం : 8 వీలునామాను అమలు పరచి, అప్పులు తీర్చిన మీదటే... 107
అధ్యాయం : 9 ఒకవేళ ఎవరయినా తన సమీపబంధువుల పేర ఏ వస్తువైనా 'వక్ఫ్' చేస్తే 109
అధ్యాయం : 10 దగ్గరి బంధువులలో స్త్రీలు, పిల్లలు కూడా చేరి ఉంటారా? 110
అధ్యాయం : 11 వక్ఫ్ చేసిన వ్యక్తి తన వక్ఫ్ ఆస్తి ద్వారా ఏమైనా లబ్ది పొందగలడా? 111
అధ్యాయం : 12 ఒకవేళ వక్ఫ్ చేసిన వ్యక్తి, ఆ వక్ఫ్ ఆస్తిని ఇతరులకు స్వాధీనపరచకుండా (తన వద్దనే) ఉంచుకుంటే అది కూడా సమ్మతమే. 112
అధ్యాయం : 13 ఒకవేళ ఎవరయినా 'ఈ ఇల్లు దైవమార్గంలో అంకితం' అని చెప్పి... 113
అధ్యాయం : 14 "నా భూమి లేదా నా తోట (మృతురాలైన) నా తల్లి తరపున సదఖా" అని ఎవరయినా అంటే అది కూడా ధర్మబద్ధమే. 114
అధ్యాయం : 15 ఒకవేళ ఎవరయినా ఏదైనా వస్తువును లేదా బానిస స్త్రీని సదఖాగా ఇస్తే 114
అధ్యాయం : 16 ఒకవేళ దానం ఇస్తూ ఎవరినయినా 'వకీల్'గా పెడితే ... 115
అధ్యాయం : 17 "ఆస్తి పంపకం జరిగేటప్పుడు (వారసులు కాని) ఇతర బంధువులు, అనాథులు, నిరుపేదలు వస్తే.... 116
అధ్యాయం : 18 ఒకవేళ ఎవరికయినా ఆకస్మిక మరణం సంభవిస్తే ... 117

అధ్యాయం : 19 వక్ఫ్‌పై, సదఖాపై సాక్షిని పెట్టడం 117
అధ్యాయం : 20 అన్ నిసా సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం గురించి 118
అధ్యాయం : 21 సూరయె నిసాలో అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం గురించి 119
అధ్యాయం : 22 వీలునామా పొందిన వ్యక్తి అనాధుల సొమ్మును పెట్టుబడిగా పెట్టడం.. 120
అధ్యాయం : 23 "అనాథుల ఆస్తిని అన్యాయంగా తినేవారు ..నరకాగ్నిలో త్రోయబడతారు." 121
అధ్యాయం : 24 "అనాధులతో వ్యవహరించే తీరును గురించి .... 121
అధ్యాయం : 25 ప్రయాణంలోనూ, ఇంట్లో ఉన్న సమయంలోనూ అనాధుని చేత.... 123
అధ్యాయం : 26 ఒకవేళ ఎవరయినా (సుప్రసిద్ధమైన) ఒక భూభాగాన్ని 'వక్ఫ్'గా ఇస్తూ... 124
అధ్యాయం : 27 ఒకవేళ అనేకమంది అవిభాజ్యంగా ఉన్న తమ ఉమ్మడి భూమిని వక్ఫ్ చేస్తే 125
అధ్యాయం : 28 వక్ఫ్ దస్తావేజు ఎలా వ్రాయాలి? 125
అధ్యాయం : 29 అససరార్థులకు, స్థితిమంతులకు, అతిథులకు కూడా ఆస్తిని వక్ఫ్ చేయవచ్చు 126
అధ్యాయం : 30 మస్జిద్ కొరకు భూమిని వక్ఫ్ చేయటం 127
అధ్యాయం : 31 పశువులు, గుర్రాలు, సామాను,వెండీ బంగారాలను వక్ఫ్ చేయటం 127
అధ్యాయం : 32 వక్ఫ్ ఆస్తులకు నిర్వాహకుడుగా ఉన్న వ్యక్తి తన ఖర్చులను.. 128
అధ్యాయం : 33 ఎవరయినా ఒక బావిని 'వక్ఫ్' చేస్తూ, సామాన్య ముస్లింల మాదిరిగా తాను కూడా నీళ్ళు తోడుకుంటానని షరతు విధిస్తే 128
అధ్యాయం : 34 ఒకవేళ వక్ఫ్ చేసే వ్యక్తి, 'నేను దీని మూల్యాన్ని అల్లాహ్ నుండి 130
అధ్యాయం : 35 అల్లాహ్ (అల్ మాయిదా సూరాలో) ఈ విధంగా సెలవీయటం 130
అధ్యాయం : 36 మృతుని వారసులు హాజరు కాలేకపోయినా సరే వీలునామా పొందిన.. 132


## 5. సమర ప్రకరణం 134


అధ్యాయం : 1 జిహాద్ మహత్మ్యం, మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) స్థితిగతులు 134
అధ్యాయం : 2 దైవమార్గంలో తన ధన ప్రాణాలతో పోరాడేవాడే జనులందరిలోకెల్లా.. 137
అధ్యాయం : 3 జిహాద్ కొరకు, అమరగతి కొరకు స్త్రీ పురుషులు ప్రార్థించటం... 139
అధ్యాయం : 4 దైవమార్గంలో పోరాడే యోధుల అంతస్తులు..... 140
అధ్యాయం : 5 దైవమార్గంలో ఉదయం సాయంత్రం నడవటం ... 142
అధ్యాయం : 6 పెద్ద కన్నులుగల స్వర్గ కన్యలు (హూర్), వారి లక్షణాలు 142
అధ్యాయం : 7 అమరగతి నొందాలన్న ఆకాంక్ష కలిగి ఉండటం 143
అధ్యాయం : 8 ఎవరయినా దైవమార్గంలో వాహనం మీద నుండి క్రిందపడి మరణిస్తే.. 145
అధ్యాయం : 9 ఎవరికయినా దైవమార్గంలో బాధ కలిగితే... 146
అధ్యాయం: 10 దైవ మార్గంలో గాయపడిన వాని సౌభాగ్యం 147
అధ్యాయం : 11 "మీరు మా విషయంలో దేనికొరకు నిరీక్షిస్తున్నారో... 148

| | | |
|---|---|---|
| అధ్యాయం : 12 | దైవోపదేశం : "విశ్వాసులలో, అల్లాహ్‌కు తాము చేసిన వాగ్దానాన్ని .. | 148 |
| అధ్యాయం : 13 | యుద్ధానికి ముందు ఏదైనా సత్కార్యం చేయటం | 151 |
| అధ్యాయం : 14 | ఒక వ్యక్తికి అకస్మాత్తుగా ఒక బాణం గుచ్చుకుంది.... | 152 |
| అధ్యాయం : 15 | దైవ వాక్కుకు ఉన్నతి లభించాలన్న కాంక్షతో పోరాడిన వ్యక్తి ఔన్నత్యం | 153 |
| అధ్యాయం : 16 | దైవమార్గంలో పాదాలు దుమ్ము కొట్టుకున్న వానికి లభించే పుణ్యఫలం | 153 |
| అధ్యాయం : 17 | దైవమార్గంలో దుమ్ము పడిన వారి దుమ్మును తుడవటం | 154 |
| అధ్యాయం : 18 | యుద్ధం తర్వాత, దుమ్ము కొట్టుకున్న తర్వాత స్నానం చేయటం | 155 |
| అధ్యాయం : 19 | ఏ అమరవీరుల నేపథ్యంలో దైవ వచనాలు అవతరించాయో.. | 155 |
| అధ్యాయం : 20 | అమరగతులకు దైవదూతల నీడ కల్పించటం | 157 |
| అధ్యాయం : 21 | అమరగతులు మళ్ళీ ఈ ప్రపంచానికి తిరిగి రావాలని కోరుకోవటం | 157 |
| అధ్యాయం : 22 | స్వర్గం ఖడ్గాల మెరుపుల క్రింద ఉండటం | 157 |
| అధ్యాయం : 23 | జిహాద్ చేసేందుకు సంతాన భాగ్యం ప్రసాదించమని కోరటం | 158 |
| అధ్యాయం : 24 | యుద్ధ సమయంలో పరాక్రమం, పిరికితనం గురించి | 158 |
| అధ్యాయం : 25 | పిరికితనం నుండి అల్లాహ్ శరణు వేడుకోవటం | 160 |
| అధ్యాయం : 26 | తన పోరాట పటిమను గురించి చెప్పుకోవటం | 161 |
| అధ్యాయం : 27 | జిహాద్ కొరకు సన్నద్ధమవటం, జిహాద్ సంకల్పం కలిగిఉండటం | 161 |
| అధ్యాయం : 28 | ఎరవయినా అవిశ్వాస స్థితిలో ముస్లింను చంపి, పిమ్మట ముస్లింగా మారితే | 162 |
| అధ్యాయం : 29 | జిహాద్ (నఫిల్) ఉపవాసాలకన్నా మిన్న | 164 |
| అధ్యాయం : 30 | దైవమార్గంలో చంపబడటం గాకుండా అమరగతికి సంబంధించిన.. | 165 |
| అధ్యాయం : 31 | దైవోపదేశం | 165 |
| అధ్యాయం : 32 | అవిశ్వాసులతో పోరాడేటప్పుడు మొక్కవోని సాహసాన్ని చూపాలి | 167 |
| అధ్యాయం : 33 | సత్య తిరస్కారులతో పోరాడండి అని ముస్లింలను ప్రేరేపించటం | 167 |
| అధ్యాయం : 34 | కందకం (అగడ్త) త్రవ్వకం గురించి | 168 |
| అధ్యాయం : 35 | తగు కారణం వల్ల ధర్మయుద్ధంలో పాల్గొనలేకపోయిన వారి గురించి | 169 |
| అధ్యాయం : 36 | జిహాద్‌లో ఉపవాసముండటం | 169 |
| అధ్యాయం : 37 | దైవ మార్గం (జిహాద్)లో ఖర్చు : దాని మహత్తు | 169 |
| అధ్యాయం : 38 | యోధుని కొరకు సామానును సమకూర్చిన వాని లేదా.... | 171 |
| అధ్యాయం : 39 | యుద్ధ సందర్భంగా సువాసన పూయటం | 171 |
| అధ్యాయం : 40 | శత్రువుల కదలికలను పసిగట్టే గూఢచార దళం– దాని విశిష్ఠత | 172 |
| అధ్యాయం : 41 | గూఢచర్యం కొరకు ఒక్కగానొక్క వ్యక్తిని పంపించవచ్చునా? | 173 |
| అధ్యాయం : 42 | ఇద్దరు వ్యక్తులు కలసి ప్రయాణించటం | 173 |
| అధ్యాయం : 43 | ప్రళయం వరకూ అశ్వం నుదుటికి శుభం కట్టబడి ఉంది | 173 |

| | | |
|---|---|---|
| అధ్యాయం : 44 | ముస్లింల రాజు న్యాయవర్తనుడైనా, అన్యాయవర్తనుడైనా ... | 174 |
| అధ్యాయం : 45 | ఎవరయితే ధర్మసంస్థాపనార్థం గుర్రం పెంచాడో... | 175 |
| అధ్యాయం : 46 | గుర్రానికి, గాడిదకు పేరు పెట్టడం | 175 |
| అధ్యాయం : 47 | కొన్ని గుర్రాలు దరిద్రపుగొట్టు అయి ఉంటాయి!? | 177 |
| అధ్యాయం : 48 | గుర్రం పెంచేవారు మూడు రకాల వారై ఉంటారు | 177 |
| అధ్యాయం : 49 | జిహాద్‌లో ఇతరుల పశువును కొట్టడం | 179 |
| అధ్యాయం : 50 | పొగరుబోతు జంతువుపై, పోతు గుర్రంపై స్వారీ అవటం | 180 |
| అధ్యాయం : 51 | యుద్ధప్రాప్తి నుండి గుర్రం వాటా ఇవ్వవలసి వస్తే... | 180 |
| అధ్యాయం : 52 | ఒకవేళ యుద్ధంలో ఎవరయినా ఇతరుల జంతువును లాక్కుని తోలితే | 181 |
| అధ్యాయం : 53 | పశువుపై 'రికాబు' లేదా 'గర్జ్' పెట్టడం | 181 |
| అధ్యాయం : 54 | (జీను లేకుండా) గుర్రం వీపుపై స్వారీ అవటం | 181 |
| అధ్యాయం : 55 | మందగమనం కల గుర్రంపై స్వారీ అవటం | 182 |
| అధ్యాయం : 56 | గుర్రపు పందెం గురించి | 182 |
| అధ్యాయం : 57 | పరుగు పందాల కొరకు గుర్రాలను సిద్ధం చేయటం | 183 |
| అధ్యాయం : 58 | తయారు చేయబడిన గుర్రాలను ఎంతవరకు పరుగెత్తించవచ్చు? | 183 |
| అధ్యాయం : 59 | ప్రవక్త మహనీయుల(సఅసం) వారి ఒంటె గురించి | 183 |
| అధ్యాయం : 60 | మహాప్రవక్త(సఅసం) వారి తెల్ల కంచెర గాడిద గురించి | 184 |
| అధ్యాయం : 61 | మహిళల సతత సమరం ఏది? | 185 |
| అధ్యాయం: 62 | సముద్రంలో ప్రయాణమై స్త్రీ ధర్మయుద్ధం చేయడం | 186 |
| అధ్యాయం : 63 | మనిషి జిహాద్‌కు తన భార్యలలో ఒకామెను తన వెంట తీసుకెళ్ళినా, | 187 |
| అధ్యాయం : 64 | స్త్రీలు యుద్ధం చేయటం- పురుషులతో కలసి పోరాటంలో పాల్గొనటం | 188 |
| అధ్యాయం : 65 | ధర్మయుద్ధంలో స్త్రీలు నీళ్ళ తిత్తులు మోసుకుంటూ పురుషుల వద్దకు వెళ్ళటం | 188 |
| అధ్యాయం : 66 | యుద్ధ సందర్భంగా స్త్రీలు క్షతగాత్రులకు కట్లు కట్టవచ్చు | 188 |
| అధ్యాయం : 67 | క్షతగాత్రులను, అమరవీరులను స్త్రీలు తరలించగలరు | 189 |
| అధ్యాయం : 68 | (సిపాయీల) శరీరాల నుండి బాణాలను వెలికి తీయటం | 189 |
| అధ్యాయం : 69 | దైవమార్గంలో- యుద్ధ సందర్భంగా- కాపలా కాయటం | 189 |
| అధ్యాయం : 70 | ధర్మయుద్ధంలో చేసే సేవలకు గల ప్రాముఖ్యత | 191 |
| అధ్యాయం : 71 | ప్రయాణంలో తోటి సహవాసి సామానును ఎత్తిన వాని గొప్పతనం | 192 |
| అధ్యాయం : 72 | దైవమార్గంలో- సరిహద్దుల్లో- ఒక రోజు పహరా కాయటం | 193 |
| అధ్యాయం: 73 | ఒక పిల్లవాణ్ణి సేవ కోసం యుద్ధ ప్రయాణానికి తీసుకువెళ్ళడం | 193 |
| అధ్యాయం : 74 | ధర్మయుద్ధం కొరకు సముద్రంలో ప్రయాణమవటం | 195 |
| అధ్యాయం : 75 | యుద్ధంలో బలహీనుల సహాయం కోరటం | 196 |

| | | |
|---|---|---|
| అధ్యాయం : 76 | ఫలానా వ్యక్తి అమరవీరుడు అని ఖచ్చితంగా అనరాదు | 197 |
| అధ్యాయం : 77 | విలు విద్యకై ప్రోత్సహించటం | 199 |
| అధ్యాయం : 78 | ఈటెలతో సాము (విన్యాసం) చేయటం | 201 |
| అధ్యాయం : 79 | 'డాలు'ను గురించి... తన తోటి వాని డాలును వాడుకోవటం గురించి | 201 |
| అధ్యాయం :80 | డాలు గురించి.... | 203 |
| అధ్యాయం : 81 | ఖడ్గాలను మెడలో వ్రేలాడదీయటం | 204 |
| అధ్యాయం : 82 | ఖడ్గాన్ని ఆభరణంతో అలంకరించటం | 204 |
| అధ్యాయం : 83 | ప్రయాణ సందర్భంగా- మధ్యాహ్న సమయంలో- విశ్రమించినప్పుడు | 205 |
| అధ్యాయం : 84 | శిరస్త్రాణం ధరించటం | 206 |
| అధ్యాయం : 85 | మరణం తర్వాత, అతని ఆయుధాలను విరగ్గొట్టడం సమంజసంకాదు | 206 |
| అధ్యాయం : 86 | మధ్యాహ్న సమయంలో సైనికులు తమ నాయకుని ఆనతితో ... | 207 |
| అధ్యాయం : 87 | ఈటెల (బల్లెముల) గురించి... | 207 |
| అధ్యాయం : 88 | మహాప్రవక్త (సఅసం) యుద్ధంలో కవచం ధరించటం | 208 |
| అధ్యాయం : 89 | ప్రయాణంలో, యుద్ధంలో జుబ్బా తొడగటం | 210 |
| అధ్యాయం : 90 | యుద్ధంలో పట్టు వస్త్రం ధరించటం | 211 |
| అధ్యాయం : 91 | చాకును ఉపయోగించటం సమంజసమే | 212 |
| అధ్యాయం : 92 | క్రైస్తవులతో పోరాడటం | 212 |
| అధ్యాయం : 93 | యూదులతో యుద్ధం జరగటం గురించి... | 213 |
| అధ్యాయం : 94 | తుర్కీలతో పోరాటం గురించి | 214 |
| అధ్యాయం : 95 | వెంట్రుకల చెప్పులు ధరించినవారితో యుద్ధం చేయటం గురించి | 214 |
| అధ్యాయం : 96 | ఓడిపోగానే నాయకుడు వాహనం పైనుండి దిగిపోయి, దైవాన్ని ప్రార్థించటం | 215 |
| అధ్యాయం : 97 | బహు దైవారాధకులను ఓడించమని,..... దైవాన్ని ప్రార్థించటం | 216 |
| అధ్యాయం : 98 | ముస్లింలు గ్రంథవహులకు ధార్మిక విషయాలు తెలుపాలి | 218 |
| అధ్యాయం : 99 | బహుదైవారాధకుల హృదయాలను కదిలించటానికి వారికి సన్మార్గం చూపమని | 218 |
| అధ్యాయం : 100 | యూదులు, క్రైస్తవులను ఎలా ఆహ్వానించాలి? | 219 |
| అధ్యాయం : 101 | ప్రవక్త (స) ఇస్లాం వైపునకు (ముస్లిమేతరులను) ఆహ్వానించటం | 220 |
| అధ్యాయం : 102 | యుద్ధ స్థలాన్ని రహస్యంగా ఉంచటం | 228 |
| అధ్యాయం : 103 | జుహ్ర్ నమాజ్ అనంతరం ప్రయాణించటం | 229 |
| అధ్యాయం : 104 | నెల చివరి రోజుల్లో ప్రయాణించటం | 229 |
| అధ్యాయం : 105 | రమజాన్ మాసంలో ప్రయాణం చేయటం | 230 |
| అధ్యాయం : 106 | ప్రయాణీకునికి వీడ్కోలు పలకటం | 230 |
| అధ్యాయం : 107 | ఇమామ్ (నాయకుడు లేదా రాజ్యాధికారి)కి విధేయత చూపటం | 231 |

అధ్యాయం : 108 నాయకునితో కలసి యుద్ధం చేయటం... 231
అధ్యాయం : 109 యుద్ధం నుండి పరారు అవనని మాటివ్వటం .... 232
అధ్యాయం : 110 శాయశక్తులా చక్రవర్తికి విధేయత చూపాలి 235
అధ్యాయం : 111 ప్రవక్త (స) సూర్యోదయ సమయంలో గనక యుద్ధం మొదలెట్టకపోతే... 236
అధ్యాయం : 112 ఎవరయినా యుద్ధ రంగం నుండి తిరిగి రాదలిస్తే ... 237
అధ్యాయం : 113 కొత్తగా పెళ్ళయినప్పటికీ జిహాద్‌కు వెళ్ళినవారు 239
అధ్యాయం : 114 కొత్త పెళ్ళి కొడుకు తన వధువుతో సమాగమం.... 239
అధ్యాయం : 115 భయాందోళనల సమయంలో నాయకుడు ముందుకు పోవటం 239
అధ్యాయం : 116 భయాందోళనల సమయంలో గుర్రాన్ని వేగంగా పరుగెత్తించటం 239
అధ్యాయం: 117 భయోత్పాతం నెలకొన్నప్పుడు ఒంటరిగా బయలుదేరడం 240
అధ్యాయం : 118 ఎవరికయినా వేతనమిచ్చి, తన తరఫున ధర్మయుద్ధానికి పంపటం 240
అధ్యాయం : 119 వేతనం పుచ్చుకుని ధర్మయుద్ధంలో పాల్గొనే వ్యక్తి 241
అధ్యాయం : 120 మహాప్రవక్త(స) పతాకం గురించి... 242
అధ్యాయం : 121 ఒక నెల ప్రయాణ దూరం నుండే అల్లాహ్ నా పట్ల ... 244
అధ్యాయం : 122 యుద్ధ ప్రయాణంలో సామగ్రిని (ఖర్చులను) తీసుకెళ్ళటం 245
అధ్యాయం : 123 భోజన సామగ్రిని తమ భుజాలపై ఎత్తుకుని వెళ్ళటం 247
అధ్యాయం : 124 స్త్రీ తన సోదరునితోపాటు ఒకే ఒంటెపై స్వారీ అవటం 248
అధ్యాయం : 125 యుద్ధ ప్రయాణంలో, హజ్జ్ యాత్రలో ఇద్దరేసి వ్యక్తులు
ఒక వాహనంపై స్వారీ అవటం 249
అధ్యాయం : 126 ఒక గాడిదపై ఇద్దరు వ్యక్తులు స్వారీ అవటం 249
అధ్యాయం : 127 రికాబు పట్టుకుని ఎవరినయినా వాహనంపై కూర్చోబెట్టినందుకు 250
అధ్యాయం : 128 ఖుర్ఆన్ వ్రాత ప్రతిని తీసుకుని శత్రు రాజ్యంలోనికి వెళ్ళరాదు 250
అధ్యాయం : 129 యుద్ధ సమయంలో బిగ్గరగా తక్బీర్ పలకటం 251
అధ్యాయం : 130 మరీ బిగ్గరగా అరుస్తూ తక్బీర్ పలకరాదు 252
అధ్యాయం : 131 పల్లపు ప్రాంతంలో ప్రవేశిస్తున్నప్పుడు 'సుబ్‌హానల్లాహ్' అనాలి 252
అధ్యాయం : 132 ఎత్తయిన ప్రదేశం పైకెక్కినప్పుడు 'అల్లాహు అక్బర్' పలకాలి 252
అధ్యాయం : 133 ప్రయాణీకుడు తన ఇంటి వద్ద చేసుకునే ఆరాధనలు 254
అధ్యాయం : 134 ఒంటరిగా ప్రయాణించటం 254
అధ్యాయం : 135 ప్రయాణంలో వేగంగా నడవటం 255
అధ్యాయం : 136 దైవమార్గంలో వాహనంగా గుర్రాన్ని ఇచ్చి...... 256
అధ్యాయం : 137 తల్లిదండ్రుల అనుమతితో జిహాద్‌కు వెళ్ళాలి 257
అధ్యాయం : 138 ఒంటెల మెడలలో శబ్దం వచ్చే గంటల్లాంటివి కట్టడం 258

అధ్యాయం : 139 ఎవరైనా తమ పేరును సైనికుల జాబితాలో రాయించాక ... 258
అధ్యాయం : 140 గూఢచర్యం గురించి 259
అధ్యాయం : 141 ఖైదీలకు వస్త్రాలు సమకూర్చటం 261
అధ్యాయం : 142 సన్మార్గానికి కారకుడైన వ్యక్తి గొప్పతనం 261
అధ్యాయం : 143 ఖైదీలను సంకెళ్ళతో బిగించి కట్టడం 263
అధ్యాయం : 144 యూదులు లేదా క్రైస్తవులు ముస్లింలుగా పరివర్తన చెందితే.... 263
అధ్యాయం : 145 ఒకవేళ (కయ్యానికి కాలు దువ్వే) అవిశ్వాసులపై రేదాడి చేస్తే, .. 264
అధ్యాయం : 146 యుద్ధంలో పసిపిల్లలను వధించటం... 265
అధ్యాయం : 147 యుద్ధంలో స్త్రీలను వధించటం... 265
అధ్యాయం : 148 అల్లాహ్ విధించే (అగ్ని) శిక్షతో ఎవరినీ శిక్షించకూడదు 265
అధ్యాయం : 149 ఖైదీలకు మేలైనా చేయండి లేదా వారి నుండి పరిహారం తీసుకుని.. 266
అధ్యాయం : 150 ఒకవేళ ఏ ముస్లిం అయినా అవిశ్వాసి చెరలో ఉంటే,.... 267
అధ్యాయం : 151 ఎవరయినా ఒక బహుదైవారాధకుడు ఏ ముస్లిమునైనా అగ్నికి ఆహుతి చేస్తే, 267
అధ్యాయం : 152 ఒక దైవప్రవక్తకు చీమ కుట్టినప్పుడు... 268
అధ్యాయం : 153 (శత్రువులైన అవిశ్వాసుల) ఇండ్లను, వృక్షాలను కాల్చటం 269
అధ్యాయం : 154 ముష్రిక్కు నిద్రిస్తున్నప్పుడు అతనిని కడతేర్చటం సమంజసమా? 270
అధ్యాయం : 155 శత్రువును మార్కొనాలని ఎన్నడూ కోరుకోరాదు 271
అధ్యాయం : 156 ఎత్తుగడలకు మరో పేరే యుద్ధం 272
అధ్యాయం : 157 రణతంత్రపుటెత్తుగడలో భాగంగా అబద్ధం చెప్పటం సరైనదే 273
అధ్యాయం : 158 శత్రువు అయిన అవిశ్వాసిపై అకస్మాత్తుగా మెరుపు దాడి చేసి చంపటం 274
అధ్యాయం : 159 ఒకవేళ ఎవరి ద్వారానయినా ఉపద్రవం పొంచి ఉన్నప్పుడు,... 275
అధ్యాయం : 160 యుద్ధంలో కవిత్వం చెప్పటం, కందకం త్రవ్వేటప్పుడు ... 276
అధ్యాయం : 161 గుర్రంపై బాగా కూర్చోలేని వానికై (దుఆ చేయటం) 276
అధ్యాయం : 162 చాపను కాల్చి గాయానికి మందుగా అద్దటం ... 277
అధ్యాయం : 163 యుద్ధ సందర్భంగా పరస్పరం గొడవ పడటం ... 277
అధ్యాయం : 164 రాత్రివేళ శత్రు భయం పట్టుకుంటే... 280
అధ్యాయం : 165 శత్రువును చూసి బిగ్గరగా 'యా సబాహా' అని నినదించటం... 281
అధ్యాయం : 166 దాడి చేసే సమయంలో, "ఇదిగో చూసుకో..అని ఎలుగెత్తి ప్రకటించడం 282
అధ్యాయం : 167 సత్య తిరస్కారులు ఒక ముస్లిం తీర్పును అంగీకరించి .... 283
అధ్యాయం : 168 ఖైదీని హతమార్చటం, ఎవరినయినా నిలబెట్టి లక్ష్యాన్ని ఛేదించటం 284
అధ్యాయం : 169 తమ అధీనంలో ఉన్న వారిని బంధించటం... 284
అధ్యాయం : 170 (ముస్లిమ్) ఖైదీలకు స్వేచ్ఛ నొసగటం 287

అధ్యాయం : 171 బహుదైవారాధకుల నుండి పరిహారం పుచ్చుకోవడం 288
అధ్యాయం : 172 శత్రు వర్గానికి చెందిన అవిశ్వాసి రక్షణ పొందకుండానే
ముస్లింల రాజ్యంలోనికి జొరబడితే... 289
అధ్యాయం : 173 జిమ్మీ అవిశ్వాసుల రక్షణకై పోరాడటం. వారిని బానిసలుగా చేసుకోరాదు 289
అధ్యాయం : 174 (దౌత్యం కొరకు వచ్చిన) అవిశ్వాసులతో ఎలా వ్యవహరించాలి? 290
అధ్యాయం : 175 జిమ్మీల కొరకు సిఫారసు. వారి పట్ల వ్యవహారం 290
అధ్యాయం : 176 ప్రతినిధి బృందాలతో సమావేశమయ్యేందుకు సన్నద్ధమవడం 291
అధ్యాయం : 177 చిన్నపిల్లవానికి ఇస్లామ్ గురించి ఎలా చెప్పాలి? 292
అధ్యాయం : 178 "మీరు గనక ఇస్లామ్ స్వీకరిస్తే (ఇహపరాలలో) ... 294
అధ్యాయం : 179 ఒకవేళ ఎవరయినా 'దారుల్ హరబ్'లో ఉంటూ, ఇస్లామ్ స్వీకరిస్తే, 294
అధ్యాయం : 180 ఖలీఫా తరఫున జనగణన 296
అధ్యాయం : 181 ఒక పాపాత్ముని చేత కూడా అల్లాహ్ ధర్మసేవ చేయించుకుంటాడు 297
అధ్యాయం : 182 ఏ వ్యక్తి అయినా శత్రు భయం ఉన్నప్పుడు, 298
అధ్యాయం : 183 సహాయం కొరకు సైన్యాన్ని పంపించడం 299
అధ్యాయం : 184 శత్రువుపై విజయం సాధించిన వ్యక్తి మూడు రోజుల వరకూ .... 300
అధ్యాయం : 185 ప్రయాణంలోనూ, యుద్ధంలోనూ విజయప్రాప్తిని పంపిణీ చేయటం 300
అధ్యాయం : 186 ఏ ముస్లిం సంపదనయినా బహుదైవారాధకులు దోచుకుని వెళితే, 300
అధ్యాయం : 187 పారసీక భాషలో లేదా మరేదయినా అజమీ భాషలో మాట్లాడటం 301
అధ్యాయం : 188 యుద్ధప్రాప్తి పంపిణీ అవకముందే అందులో నుండి అపహరించటం 303
అధ్యాయం : 189 యుద్ధ ప్రాప్తిలో నుండి కొద్దిపాటి సొమ్ము కాజేయటం 304
అధ్యాయం : 190 విజయప్రాప్తి (మాలె గనీమత్) క్రింద వచ్చిన మేకలు,
ఒంటెలను పంపిణీకి ముందే జిబహ్ చేయటం అవాంఛనీయం 305
అధ్యాయం : 191 విజయ (శుభ)వార్తను వినిపించడం 306
అధ్యాయం : 192 శుభవార్త వినిపించిన వానికి కానుక ఇవ్వటం 307
అధ్యాయం :193 మక్కా విజయం తర్వాత ఇక అక్కడినుండి ప్రస్థానం చేయనవసరం లేదు 307
అధ్యాయం : 194 అత్యవసర పరిస్థితిలో జిమ్మీలు లేదా ముస్లిం స్త్రీల శిరోజాలు చూడటం 308
అధ్యాయం : 195 యోధులకు స్వాగతం పలకడానికి వెళ్ళడం 309
అధ్యాయం : 196 జిహాద్ నుండి తిరిగి వస్తున్నప్పుడు ఏమని చెప్పాలి? 310
అధ్యాయం : 197 ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు (నమాజ్ చేయటం) 312
అధ్యాయం: 198 ప్రయాణీకుడు దూర ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు 312

## 6. 'ఖుముస్' ప్రకరణం 314


| | | |
|---|---|---|
| అధ్యాయం : 1 | బద్ర్ యుద్ధంలో చేజిక్కిన విజయ ప్రాప్తిలో నుండి నా వాటాగా... | 314 |
| అధ్యాయం : 2 | యుద్ధప్రాప్తి నుండి ఐదవ భాగాన్ని చెల్లించడం ధర్మం... | 322 |
| అధ్యాయం : 3 | మహాప్రవక్త(స) పరమపదించిన తరువాత, ఆయన భార్యామణుల జీతభత్యాల గురించి.... | 322 |
| అధ్యాయం : 4 | దైవప్రవక్త(సఅసం) సతీమణుల కుటీరాల గురించి... | 323 |
| అధ్యాయం : 5 | దైవప్రవక్త(స) కవచం, లాఠీ, ఖడ్గం, చెంబు, ఉంగరం గురించి.... | 326 |
| అధ్యాయం : 6 | "విజయప్రాప్తిలోని ఐదవ భాగం (ఖుముస్) దైవప్రవక్త అవసరాలకు... | 329 |
| అధ్యాయం : 7 | అల్ అన్ఫాల్ సూరాలో అల్లాహ్ ఆదేశం... | 331 |
| అధ్యాయం : 8 | "విజయ సంపద ధర్మసమ్మతం గావించబడింద"న్న ప్రవక్త ప్రవచనం | 333 |
| అధ్యాయం : 9 | యుద్ధంలో పాల్గొన్న వారికే 'యుద్ధప్రాప్తి' | 336 |
| అధ్యాయం : 10 | ఒకవేళ ఎవరయినా విజయధనాన్ని పొందే ఉద్దేశంతో పోరాడినట్లయితే | 336 |
| అధ్యాయం : 11 | ముస్లింల ఖలీఫా వద్దకు అన్యులు పంపిన కానుకలను పంచి పెట్టడం | 337 |
| అధ్యాయం : 12 | దైవప్రవక్త(స) బనూ నజీర్, బనూ ఖురైజా ఆస్తులను ఎలా పంచిపెట్టారు? | 338 |
| అధ్యాయం : 13 | ప్రవక్త (స) సహచరుల త్యాగాలు | 338 |
| అధ్యాయం : 14 | ఒకవేళ నాయకుడు ఎవరినయినా దౌత్యంపై పంపిస్తే.... | 342 |
| అధ్యాయం : 15 | ఎవరయితే 'ఐదవ భాగం' ముస్లింల అవసరాల నిమిత్తం ఉందని చెప్పారో.. | 343 |
| అధ్యాయం : 16 | ఉపకార భావంతో ప్రవక్త(స) ఖైదీలను ఉచితంగా విడుదల చేయటం... | 349 |
| అధ్యాయం : 17 | ఐదవ భాగం (ఖుముస్) నాయకునికి ప్రత్యేకం అన్న దానికి ఆధారం | 349 |
| అధ్యాయం : 18 | హతుని శరీరంపై ఉన్న వస్తువులు పంపకంలోగానీ, ఖుముస్‌లోకి గానీ రావు | 350 |
| అధ్యాయం : 19 | హృదయాలను గెలవటానికిప్రవక్త(స) కొంతమందికి 'ఖుముస్' నుండి ఇవ్వటం | 353 |
| అధ్యాయం : 20 | తినుబండారమేదైనా అవిశ్వాసుల భూమిలో చేజిక్కితే...... | 359 |


## 7. జిజ్‌యా, యుద్ధ విరమణ ప్రకరణం 361


| | | |
|---|---|---|
| అధ్యాయం : 1 | జిజ్‌యా గురించి, అవిశ్వాసులతో ఒక నిర్ణీత వ్యవధి వరకు ... | 361 |
| అధ్యాయం : 2 | ఒకవేళ పురపాలకునితో సంధి కుదిరితే .... | 365 |
| అధ్యాయం : 3 | దైవప్రవక్త(స) భద్రత కల్పించిన అవిశ్వాసులకు, వారి భద్రతను కొనసాగించేలా వసీయతు చేయటం | 366 |
| అధ్యాయం : 4 | దైవప్రవక్త(స) బహరైన్ సొమ్ము నుండి సహాయం చేయటం- | 366 |
| అధ్యాయం : 5 | 'జిమ్మీ'గా ఉన్న ఒక అవిశ్వాసిని అన్యాయంగా చంపటం...నేరమంటే... | 368 |
| అధ్యాయం : 6 | యూదులను అరేబియా క్షేత్రం నుండి వెళ్ళగొట్టడం | 368 |
| అధ్యాయం : 7 | ఒకవేళ అవిశ్వాసులు ముస్లింలను మోసగిస్తే .... | 370 |
| అధ్యాయం : 8 | ఒడంబడికను భగ్నపరచినవారిని నాయకుడు శపించటం | 371 |

అధ్యాయం : 9 (ముస్లిమ్) స్త్రీలు గనక ఎవరికయినా రక్షణ కల్పిస్తే... 372
అధ్యాయం : 10 ముస్లిములంతా పరస్పరం సమానులే.... 373
అధ్యాయం : 11 ఒకవేళ యుద్ధ సమయంలో ఏ అవిశ్వాసి అయినా కలవరం చెంది.... 374
అధ్యాయం : 12 బహుదైవారాధకుల నుండి ధనం పుచ్చుకుని సంధి చేసుకోవటం.... 374
అధ్యాయం : 13 ఒడంబడికను నెరవేర్చటం- దాని మహత్తు 376
అధ్యాయం : 14 ఏ 'జిమ్మీ' వ్యక్తి అయినా క్షుద్ర విద్య (చేతబడి) చేస్తే క్షమించవచ్చునా? 376
అధ్యాయం : 15 మోసం నుండి తప్పించుకోవాలా? 377
అధ్యాయం : 16 ఒడంబడికను ఎలా త్రిప్పికొట్టాలి? 378
అధ్యాయం : 17 ఒడంబడిక చేసుకున్న తర్వాత నమ్మకద్రోహం చేసేవానికి అయ్యే పాపం 379
అధ్యాయం : 18 (అలీకి-ముఆవియాకి మధ్య) సిఫ్ఫీన్ యుద్ధం జరిగినప్పుడు ... 380
అధ్యాయం : 19 మూన్నాళ్ళ కొరకు లేదా ఒక నిర్ణీత వ్యవధి కొరకు సంధి చేసుకోవటం 382
అధ్యాయం : 20 సంధి : నిరవధిక గడువు 384
అధ్యాయం : 21 ముష్రిక్కుల మృతదేహాలను బావిలో పడవేయటం ..... 384
అధ్యాయం : 22 నమ్మకద్రోహం మంచి వానికి చేసినా, దుర్మార్గునికి చేసినా ద్రోహమే 385

## 8. సృష్టి ఆరంభ ప్రకరణం 387

అధ్యాయం : 1 ఆయనే మొదటిసారి సృష్టిని ప్రారంభిస్తాడు... 387
అధ్యాయం : 2 ఏడు భూభాగాల గురించి 389
అధ్యాయం : 3 నక్షత్రాల గురించి 392
అధ్యాయం : 4 సూర్యుడు, చంద్రుడు ఒక నియమావళికి కట్టుబడి ఉన్నాయనే ఆయత్.. 392
అధ్యాయం : 5 అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం... 394
అధ్యాయం : 6 దైవ దూతల గురించి... 395
అధ్యాయం: 7 స్వర్గం గురించి. స్వర్గం సృష్టించబడింది[1] అన్న దాని గురించి... 411
అధ్యాయం : 8 స్వర్గ ద్వారాల గురించి.... 417
అధ్యాయం : 9 నరకం తీరుతెన్నుల గురించి... 417
అధ్యాయం : 10 ఇబ్లీసు, అతని సైనిక దళం గురించి... 420
అధ్యాయం : 11 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 432
అధ్యాయం : 12 మేము జిన్నుల ఒక వర్గాన్ని...... 433
అధ్యాయం : 13 "భువిలో రకరకాల ప్రాణులను వర్ధిల్లజేశాము.' 433
అధ్యాయం : 14 ముస్లిం సంపదలో అత్యుత్తమమైనది గొర్రెల సంపద.... 435
అధ్యాయం : 15 అయిదు రకాల జంతువులు చాలా చెడ్డవి... 438
అధ్యాయం : 16 ఈగ గనక నీరు, ఆహార (ద్రవ) పదార్థంలో పడినప్పుడు ... 439

# భూమిక

'హదీసు'కు సంబంధించిన ముఖ్యమయిన, అవసరమయిన చర్చలన్నీ ఈ క్లుప్తమయిన 'భూమిక'లో చేర్చడం సాధ్యపడదు. వీటిగ్గాను ప్రత్యేకంగా వేరే రచన అవసరం. ప్రస్తుతానికి హదీసు సంకలనం, సంచయనాలకు సంబంధించిన సంక్షిప్త మయిన ఒక స్వరూపాన్ని పఠితల ముందుంచడం జరిగింది. ప్రవక్త ప్రవచనాల అమూల్యమయిన సంపద గత 13 వందల ఏళ్ళుగా ఎన్నెన్ని దశలు దాటుకుంటూ మన వరకు చేరిందో విజ్ఞతకు, వివేచనకు, మార్గదర్శకత్వానికి మూలమయిన ఈ వెలలేని ఖజానా తమ తరువాతి తరాలకు భద్రంగా చేరవెయ్యడానికి ఏయే పవిత్రాత్ములు తమ జీవితాలను అంకితం చేశాయో, అవసరమైతే తమ ప్రాణాలకు సైతం ఎలా తెగించి ఈ కార్యాన్ని నిర్వహించాయో కాస్తయినా బోధపరచడానికి ఇందులో కృషి జరిగింది.

ప్రవక్త ప్రవచనాలు మనకు మూడు విధాలుగా చేరాయి.

1. ముస్లిమ్ సముదాయం నిరంతర ఆచరణ
2. లిఖితపూర్వకంగా భద్రపరిచిన సంకలనాలు, పుస్తకాలు.
3. జ్ఞాపకశక్తి ఆధారంగా ఉల్లేఖన ప్రక్రియ- అంటే పాఠ్య పఠనాల ద్వారా.

ఈ విధంగా సంచయనం, సంకలనం, రచనలు జరిగిన మొత్తం కాలాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు.

1. ప్రవక్త కాలం నుంచి మొదటి శతాబ్ది హిజ్రీ వరకు
2. మొదటి శతాబ్ది మొదలుకుని రెండవ అర్థ శతాబ్ది వరకు
3. రెండవ అర్థ శతాబ్ది మొదలుగా నాల్గవ శతాబ్ది చివరి వరకు.
4. అయిదవ శతాబ్ది మొదలుకుని ఇంకా కొనసాగుతోంది.

## మొదటి దశ

ఈ కాలంలో హదీసు సంచయన కర్తలు, ఆనాటి లిఖిత ప్రతులు, సంచయనాల వివరాలు ఇలా ఉన్నాయి.

# ప్రఖ్యాత హదీసు స్మర్తలు

| సంఖ్య | పేరు | మరణం | వయసు | ఉల్లేఖనాలు |
|---|---|---|---|---|
| 1. | హజ్రత్ అబూహురైరా (రజి) (అబ్దుర్రహ్మాన్) శిష్యులు 800 | హి.59 | 78 | 5374 |
| 2. | హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) | హి.68 | 71 | 2660 |
| 3. | హజ్రత్ ఆయిషా సిద్దికా (ర.అ) | హి.58 | 67 | 2210 |
| 4. | హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) | హి.73 | 84 | 1630 |
| 5. | హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) | హి.78 | 94 | 1560 |
| 6. | హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) | హి. 93 | 103 | 1286 |
| 7. | హజ్రత్ అబూ సయీద్ ఖుద్రి (రజి) | హి. 74 | 84 | 1170 |

వెయ్యికన్నా ఎక్కువ హదీసులు జ్ఞాపకమున్న ఘనులయిన ప్రవక్త సహచరులు వీరు. వీరుకాక హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (హి.63), హజ్రత్ అలీ (హి. 40), హజ్రత్ ఉమర్ ఫారూక్ (హి. 23) వీరంతా 500 నుంచి వెయ్యి వరకు హదీసులు ఉల్లేఖించినవారు.

అలాగే హజ్రత్ అబూబక్ర్ (హి. 13), హజ్రత్ ఉస్మాన్ (హి.36), హజ్రత్ ఉమ్మె సలమా (హి.59), హజ్రత్ అబూ మూసా అష్అరీ (హి.52), హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (హి.32), హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారి(హి. 51), హజ్రత్ ఉబై బిన్ కఅబ్(హి.19), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (హి.18)- వీరంతా వందకు పైగా 500కు తక్కువగా హదీసులు ఉల్లేఖించారు.

వీరేకాక ఆ కాలంలోని గొప్ప అనుచర గణాన్నీ మరువలేము. వారి అనన్యమయిన పరిశ్రమ వల్లనే ప్రవక్త సంప్రదాయ సంపద అంతా ప్రవక్త అనుచర సముదాయానికి అందగలిగింది. ప్రళయం వరకూ తరగని ఈ సంపద ద్వారా ముస్లిమ్ సముదాయం ప్రయోజనం పొందుతూనే ఉంటుంది.

కొందరు మహనీయుల పరిచయం క్రిందనిస్తున్నాము.

1. **సయీద్ బిన్ ముసయ్యిబ్ :** ఫారూకీ హయాంలో రెండవ సంవత్సరం మదీనాలో పుట్టారు. హి. 105లో మరణించారు.

   హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ ఆయిషా, హజ్రత్ అబూ హురైరా, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర) ద్వారా హదీసు విద్యనభ్యసించారు.

2. **ఉర్వా బిన్ జుబైర్ :** ఈయన మదీనాకు చెందిన ప్రముఖ పండితుల్లో

పరిగణించబడతారు. హజ్రత్ ఆయిషా అక్క కుమారులు. అధికాంశం తన పిన్ని చెప్పిన హదీసులను ఉల్లేఖించారు. ఇంకా హజ్రత్ అబూ హురైరా, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ వద్ద కూడా శిష్యరికం చేసిన ఘనత ఉంది. ఈయన శిష్యుల్లో సాలిహ్ బిన్ కైసాన్, ఇమామ్ జుహ్రి లాంటి పండితులున్నారు. ఈయన హి.94లో పరమపదించారు.

3. **సాలిమ్ బిన్ అబ్దుల్లా బిన్ ఉమర్:** మదీనాకు చెందిన 7 గురు షరీఅత్ వేత్తల్లో ఈయన్ని గణిస్తారు. ఈయన తన తండ్రి గారు, ఇతర ప్రవక్త సహచరుల ద్వారా హదీసు పాండిత్యాన్ని గడించారు. నాఫె జుహ్రి తదితర ప్రముఖ అనుచరులు ఈయన శిష్యులు. హి. 106లో మరణించారు.

4. **నాఫె మౌలా అబ్దుల్లా బిన్ ఉమర్:** వీరు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ శిష్యుల్లో ప్రముఖులు, ఇమామ్ మాలిక్‌కు గురువు. హదీసువేత్తల దృష్టిలో ఈ ప్రమాణ పరంపర (మాలిక్ నాఫె నుండి, ఆయన అబ్దుల్లా బిన్ ఉమర్ నుండి, ఆయన దైవ సందేశహరుల నుండి) సిల్సిలతుజ్జహబ్ (స్వర్ణ పరంపర)గా పరిగణించ బడుతుంది. ఈయన హి.117లో దివంగతులయ్యారు.

## తొలి దశలోని లిఖిత సంపద

1. **సహీఫా సాదికా:** ఇది హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (హి.13-వయసు 77) సంకలనం చేసింది.

   హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్‌కు రచన, సంకలనాల అభిరుచి మెండుగా ఉండేది. దైవ సందేశహరులు పలికే ప్రతి మాటను రాసుకునేవారు. ఈ విషయంలో స్వయాన ప్రవక్త మహనీయులు ఆయనకు అనుమతినిచ్చారు. ఈ సంకలనంలో ఒక వెయ్యి హదీసులుండేవి. చాలాకాలం వరకు వారి వంశంలో భద్రంగా ఉండేవి. ఇప్పుడు అది ముస్నద్ ఇమామ్ అహ్మద్‌లో ఒక భాగమయిపోయింది.

2. **సహీఫా సహీహా:** సంకలన కర్త, హుమామ్ బిన్ మునబ్బిహ్ (హి.101). వీరు హజ్రత్ అబూ హురైరా గారి ప్రముఖ శిష్యుల్లో ఒకరు. ఈయన తన గురువు ఉల్లేఖనాలన్నింటినీ ఒకేచోట గ్రంథస్థం చేసుకున్నారు. దాని రాత ప్రతులు బెర్లిన్, డెమాస్కస్ గ్రంథాలయాల్లో ఉన్నాయి. ఇంకా ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ తన విఖ్యాత ముస్నద్‌లోనూ 'అబూ హురైరా' అన్న శీర్షికన ఈ మొత్తం పుస్తకాన్ని యధాతథంగా చేర్చారు. (ముస్నద్ అహ్మద్, సంపుటి 2, పుటలు

312- 318) ఈ సంకలనం కొన్నేళ్ళ క్రితం డాక్టర్ హమీదుల్లా (ప్యారిస్) ప్రయత్నాల ఫలితంగా హైదరాబాద్‌లో ప్రచురించడం జరిగింది. ఇందులో 138 ఉల్లేఖనాలున్నాయి.

ఈ సహీఫా, హజ్రత్ అబూ హురైరా ఉల్లేఖనాలన్నింటిలోని ఒక భాగం మాత్రమే. దీని ఉల్లేఖనాలు అనేకం బుఖారి, ముస్లిమ్ గ్రంథాలలోనూ దొరుకుతాయి. పదాలు ఒకేలాగుంటాయి. పెద్ద వ్యత్యాసం కనిపించదు.

3. **బషీర్ బిన్ సహీక్:** హజ్రత్ అబూహురైరా శిష్యుల్లో రెండవ వారు. ఈయన కూడా ఒక సంకలనం తయారు చేశారు. దీన్ని ఈయన హజ్రత్ అబూ హురైరాకు చివరి రోజుల్లో వినిపించి ధ్రువీకరించుకున్నారు.

4. **ముస్నద్ అబూహురైరా :** దీని ప్రతులు సహచరుల కాలంలోనే గ్రంథస్థమయ్యాయి. దీని ఒక ప్రతి హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ తండ్రి, అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్ (ఈజిప్ట్ గవర్నర్ హి.86) వద్ద కూడా ఉండేది. అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్ కసీరా బిన్ ముర్రాకు, 'నీ వద్ద సహచరులు ఉల్లేఖించిన హదీసులుంటే వాటిని వ్రాసి పంపు. హజ్రత్ అబూ హురైరా హదీసులు అక్కరలేదు. అవి నా వద్ద గ్రంథస్థమయి ఉన్నాయి' అని వ్రాశారు. 'ముస్నద్ అబూ హురైరా' గ్రంథ ప్రతి ఒకటి, ఇమామ్ ఇబ్నె తయిమియ్య వ్రాసినది జర్మనీ గ్రంథాలయంలో భద్రంగా ఉంది.

5. **సహీఫా హజ్రత్ అలీ:** ఇమామ్ బుఖారి విశదీకరించిన దాని ప్రకారం, ఇది చాలా ఘనమయిన సంపుటం. ఇందులో జకాత్, మదీనా పవిత్రత, హజ్జతుల్ విదా ప్రసంగం, ఇస్లామీయ రాజ్యాంగ అంశాలు లాంటి విషయాలు అనేకం ప్రస్తావించబడి వున్నాయి.

6. **ప్రవక్త మహనీయుని ప్రసంగ పాఠం :** మక్కా ప్రవేశం నాడు, అబూ షా యమని కోరిక మేరకు దైవ ప్రవక్త తన ప్రసంగాన్ని సవివరంగా రాయించారు. ఈ ప్రసంగంలో మానవ హక్కులకు సంబంధించిన ముఖ్యమయిన వివరాలున్నాయి.

7. **సహీఫా హజ్రత్ జాబిర్ :** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనాలను ఆయన శిష్య గణం, వహబ్ బిన్ మునబ్బ(హి.110), సులైమాన్ బిన్ కైస్ లష్కరి వ్రాత మూలకంగా సంకలనం చేసుకున్నారు. ఈ సంకలనంలో హజ్ విధి నిషేధాలు, వీడ్కోలు హజ్ ప్రసంగం ఉన్నాయి.

8. **హజ్రత్ ఆయిషా(ర) ఉల్లేఖనాలు :** హజ్రత్ ఆయిషా ఉల్లేఖనాలను ఆవిడ శిష్యుడు ఉర్వా బిన్ జుబైర్ వ్రాసి భద్రపరిచారు.

9. **ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనాలు :** హజ్రత్ అబ్దుల్లా ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనాల అనేక సంకలనాలున్నాయి. హజ్రత్ సయీద్ బిన్ జుబైర్ తాబయీ కూడా ఈయన ఉల్లేఖనాలను వ్రాసి సంకలనం చేసుకున్నారు.

10. **అనస్ బిన్ మాలిక్ సహీఫాలు:** సయీద్ బిన్ హిలాల్ ప్రకారం, "హజ్రత్ అనస్ తాను వ్రాసిపెట్టుకున్న ప్రతుల్ని మాకు చూపి, 'ఈ ఉల్లేఖనాలు నేను స్వయంగా దైవ సందేశహరుని నోట విన్నాను, అప్పుడే రాసుకున్నాను, తరువాత ఆయన (స)కు వినిపించి ధ్రువీకరించుకున్నాను కూడా' అని అనేవారు".

11. **అమ్ర్ బిన్ హజ్మ్ :** ఈయన్ని యమన్ గవర్నరుగా నియమిస్తూ పంపేటప్పుడు ప్రవక్త మహనీయులు (స) రాతమూలకంగా ఒక సూచనా పత్రాన్ని ఇచ్చి పంపారు. ఈయన ఆ సూచనాపత్రాన్ని భద్రపరచటమేకాక దైవప్రవక్త ఇచ్చిన ఇంకా 21 ఆదేశ పత్రాలను జతచేసి ఒక పుస్తకాన్నే సంకలనం చేశారు.

12. **సముర బిన్ జున్దబ్ పుస్తకం:** ఇది ఈయన తనయునికి వారసత్వంలో లభించింది. ఇందులోనూ ఉల్లేఖనాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి.

13. **సహీఫా సఅద్ బిన్ ఉబాదా :** హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా ప్రవక్త సహచరులు, అజ్ఞానకాలం నుండే చదవనూ, వ్రాయనూ వచ్చినవారు.

14. **హజ్రత్ నాఫె లేఖలు:** సులైమాన్ బిన్ మూసా ఉల్లేఖనం ప్రకారం, అబ్దుల్లా బిన్ ఉమర్ చెబుతూ ఉంటే నాఫె (ర) వ్రాస్తూ ఉండేవారు.

15. మ'అన్ ఉల్లేఖనం ప్రకారం, 'అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లా బిన్ మస్ఊద్(ర) నా ఎదుట గ్రంథం తీసి ప్రమాణం చేస్తూ 'ఇది నా తండ్రి అబ్దుల్లా బిన్ మస్ఊద్ తన స్వహస్తాలతో వ్రాసిన గ్రంథం' అని అన్నారు."

పరిశోధనను అన్వేషణను ఇంకా కొనసాగిస్తే ఇవి కాక ఇంకా ఎన్నో ఉదాహరణలు, సంఘటనలు దొరకవచ్చు.

ఈ దశలో ప్రవక్త సహచర మాన్యులు, గొప్ప అనుచరులు ఇతోధికంగా తమ వ్యక్తిగత స్మృతిలోని హదీసుల్ని గ్రంథస్థం చెయ్యడం పట్ల శ్రద్ధ చూపారు. కాని రెండవ దశలో సంచయన, సంపాదన కార్యం ఇంకా విస్తృతి పొందింది. హదీసు సంకలనకర్తలు తమకు సొంతంగా తెలిసినవాటితోపాటు తమ నగరం, ప్రాంతంలోని పండితుల్ని కలుసుకుని వారి ఉల్లేఖనాలను సయితం క్రమబద్ధం చేశారు.

## రెండవ దశ

ఈ దశ దాదాపు రెండవ శతాబ్ది (హి(జీ) తొలి యాభయ్యేళ్ళకు ముగుస్తుంది. ఈ దశలో అనుచరుల ఒక పెద్ద వర్గం సిద్ధమయింది. ఈ వర్గంలోనివారు తొలి దశలోని లిఖిత సంపదనంతా విస్తృత సంకలనాలతో క్రోడీకరించారు.

## హదీసు సంకలన కర్తలు

**1. ముహమ్మద్ బిన్ షిహాబ్ జుహ్రీ (మ : హి.124)** : ఈయనను సమకాలీన హదీసువేత్తలలో ముఖ్యులుగా పరిగణించేవారు. ఈయన హదీసు విద్యను దిగువ పేర్కొన్న మహనీయ వ్యక్తుల ద్వారా అభ్యసించారు.

**సహచరుల్లో** : 1. అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) 2. అనస్ బిన్ మాలిక్ (ర) 3. సహల్ బిన్ సఅద్(ర).

**అనుచరుల్లో** : సయీద్ బిన్ ముసయ్యిబ్, మహ్మూద్ బిన్ రబీ ప్రభృతులు.

ఈయన గారి శిష్యగణంలో, ఇమామ్ ఔజాయి, ఇమామ్ మాలిక్, సుఫియాన్ బిన్ ఉయియ్యాన వంటి హదీసువేత్తలున్నారు. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ హి.శ. 101లో ఈయనకు హదీసులు సంకలనం చేసే కార్యాన్ని అప్పగించారు. ఈయనతోపాటు మదీనా గవర్నరు అబూబక్ర్ ముహమ్మద్ బిన్ ఉమర్ బిన్ హజ్మ్‌కు ఆదేశాలు పంపి, ఉర్వా బిన్తు అబ్దుర్రహ్మాన్, కాసిమ్ బిన్ ముహమ్మద్ వద్ద వున్న హదీసు భండారాన్నీ గ్రంథస్థం చెయ్యమని ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ పురమాయించారు.

పైన పేర్కొన్న ఉర్వా, హజ్రత్ ఆయిషాకు ముఖ్య శిష్యురాలు. కాసిమ్ బిన్ ముహమ్మద్ ఆవిడ సోదరుని కొడుకు. హజ్రత్ ఆయిషా తన సంరక్షణలో వీరికి శిక్షణ, బోధనలు గరిపారు.

ఇంతేకాక హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఇస్లామీయ రాజ్యంలో బాధ్యతాయుత స్థానంలో ఉన్న నాయకులందరినీ హదీసుల్ని కూడబెట్టాలని, వాటిని క్రమబద్ధం చేయాలన్న తాకీదుతో ఫర్మానాలు జారీ చేశారు. ఫలితంగా హదీసు పెను గ్రంథాలే రాజధాని నగరమయిన డెమాస్కస్ చేరాయి. ఖలీఫా వాటి నకళ్ళను రాజ్యంలో మూల మూలన చేరవేశారు.

ఇమామ్ జుహ్రీ హదీసు సంకలనాన్ని సిద్ధం చేసిన తరువాత ఆ కాలంలోని ఇతర విద్యావంతులు సయితం సంకలనం, సంపాదన కార్యక్రమాలు చేపట్టారు.

2. అబ్దుల్ మలిక్ బిన్ జరీహ్ (హి. 150) మక్కాలో ఈ మహత్కార్యాన్ని చేపట్టారు.

3. ఇమామ్ ఔజాయి (హి. 157) - సిరియాలో

4. ముఅమ్మర్ బిన్ రాషిద్ (హి.153) - యమన్‌లో

5. ఇమామ్ సుఫియాన్ సౌరి (హి. 161)- కూఫాలో

6. ఇమామ్ హమ్మాద్ బిన్ సల్లమ(హి. 167) - బస్రాలో

7. ఇమామ్ అబ్దుల్లా బిన్ ముబారక్ (హి. 181)- ఖురాసాన్‌లో

వీరంతా హదీసుల సంకలనం, వాటి క్రమబద్ధీకరణ కృషిలో ముమ్ముందు ఉండిన మహనీయులు.

8. ఇమామ్ మాలిక్ బిన్ అనస్(హి.93- 179): మదీనాలో ఇమామ్ జుహ్రీ తరువాత ప్రవక్త హదీసు సంకలనా శుభకార్యం చేపట్టే ఘనత తనకే దక్కింది. ఈయన నాఫె, జుహ్రీ ఇంకా ఇతర ప్రముఖ పండితుల వద్ద విద్యనభ్యసించారు. ఈయన గురువుల సంఖ్య 900 వరకు ఉందని అంటారు. ఈ విద్యామృత సరోవరం నుండి హిజాజ్, సిరియా, ఇరాక్, పాలస్తీనా, ఈజిప్ట్, ఆఫ్రికా, స్పెయిన్‌కు చెందిన వేలాది ప్రవక్త సంప్రదాయ పిపాసువులు తనివితీరా గ్రోలారు. ఈయన శిష్యుల్లో లైస్ బిన్ సఅద్ (హి.175), ఇబ్ను ముబారక్ (హి. 181), ఇమామ్ షాఫియీ (హి. 204), ఇమామ్ ముహమ్మద్ బిన్ హసనుష్షైబాని (హి.189) లాంటి మహామహులున్నారు.

ఈ దశలో హదీసు సంకలనాలు అనేకం జరిగాయి. వీటిలో ఇమామ్ మాలిక్ సంకలనం చేసిన ముఅత్తాకు ప్రత్యేక స్థానముంది. దీని సంకలనా కాలం హి.130 నుండి 141 మధ్యన ఉంటుంది. మొత్తం ఉల్లేఖనాల సంఖ్య 1700. వీటిలో నుంచి మర్ఫూ 600; ముర్సల్ 228, మౌకూఫ్ 613; అనుచరుల సూక్తులు 285 ఉన్నాయి. ఈ దశలోని కొన్ని ఇతర సంకలనాల పేర్లు : 1. జామె సుఫియాన్ సౌరి (హి.161) 2. జామె ఇబ్ను ముబారక్ (హి.181); 3. జామె ఇమామ్ ఔజాయి (హి.157), 4. జామె ఇబ్ను జురైజ్ (హి.150) 5. కితాబుల్ ఖరాజ్, కాజీ అబూ యూసుఫ్ (హి.183); 6. కితాబుల్ అసార్, ఇమామ్ ముహమ్మద్(హి.189)

ఈ దశలో ప్రవక్త మహనీయుని హదీసులు, సహచరుల అనుచరుల ఫత్వాలు (తీర్పులు)- అన్నింటినీ ఒకే గ్రంథంలో సంచయనం చేసేవారు. అయితే ఫలానా విషయం సహచరుల లేక అనుచరుల సూక్తి అని లేక ప్రవక్త(స) హదీసు అని విశదీకరించడం జరిగేది.

## మూడవ దశ

ఇది దాదాపు హిజ్రీ 150 మొదలు 400 వరకు ఉంటుంది. ఈ దశ ప్రత్యేకతలు ఇవి :

1. ప్రవక్త ప్రవచనాలను (హదీసులను) సహచరుల 'ఆసార్' (ప్రభావకాలు), అనుచరుల సూక్తుల నుండి వేరు చేసి సంకలనం చెయ్యడం జరిగింది.
2. విశ్వసనీయమయిన ఉల్లేఖనాల సంకలనాలు వేరుగా తయారయ్యాయి. ఈ విధంగా అన్వేషణ, పరిశోధన, అనుశీలనల తరువాత రెండవ దశలోని రచనలు మూడవ దశలో ఘనమయిన పుస్తకాలుగా రూపొందాయి.
3. ఈ దశలో ఉల్లేఖనాలను ప్రోగు చెయ్యడమేకాక హదీసు శాస్త్రాన్ని భద్రపరచడానికి హదీసువేత్తలు వందకు పైగా వివిధ విద్యల్ని ఆవిష్కరించారు. వాటి మీద ఇప్పటివరకు వేలాది పుస్తకాల రచన జరిగింది.

   'వారు చేసిన కృషికి దైవానికి కృతజ్ఞతలు, దైవం వారి ఆ కృషికి గాను ఉత్తమమయిన ప్రతిఫలాన్నివ్వుగాక'

   ఆ విద్యల్లో కొన్నింటి క్లుప్తమయిన పరిచయం

## 1. అస్మాఉర్రిజాల్ విద్య

ఈ విద్యలో ఉల్లేఖకుల జీవిత విశేషాలు, జనన కాలం, వారి గురువులు, శిష్యులు ఇత్యాధి విషయాల వివరాలు; విద్యాప్రాప్తికై చేసిన ప్రయాణాలు, వారి విశ్వసనీయత ప్రమాణాన్ని గురించి హదీసువేత్తల నిర్ణయాలున్నాయి. ఇది చాలా విస్తృతమయిన శాస్త్రం, ఆసక్తికరమయింది కూడా.

కొందరు పక్షపాత బుద్ధి గల ప్రాచ్య విద్యా నిపుణులయిన పాశ్చాత్యులు (Orientalists) కూడా దీని ప్రశస్తతను కొనియాడకుండా ఉండలేకపోయారు. ఈ శాస్త్రం వల్ల అయిదు లక్షల మంది ఉల్లేఖకుల జీవన వృత్తాంతాలు భద్రంగా ఉన్నాయి. ఈ ప్రత్యేకతలో ముస్లిమ్ పండితులకు సరితూగేవారు దొరకడం అసాధ్యం.

ఈ శాస్త్రంలో వందలాది పుస్తకాలు రచించారు. కొన్నింటి పేర్లు :

అ) **తహ్జీబుల్ కమాల్ - రచయిత** : ఇమామ్ యూసుఫ్ (హి.742). ఈ శాస్త్రంలో ఇది అత్యంత ప్రామాణికమయిన గ్రంథం.

ఆ) **తహ్జీబుత్తహ్జీబ్ :** రచయిత - హాఫిజ్ ఇబ్ను హజర్, బుఖారీ టీకా కర్త, ఈ గ్రంథం 12 సంపుటాల్లో ఉంది; హైదరాబాద్ (దాయరతుల్ మఆరిఫ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రచురించింది).

ఇ) తజ్‌కిరతుల్ హుఫ్ఫాజ్ - రచయిత : అల్లామా జహబి (హి. 748)

## 2. ముస్తలహుల్ హదీస్ విద్య

ఇది హదీసు విద్యకు ప్రాతిపదిక సూత్రావళి. ఈ శాస్త్రం వెలుగులోనే హదీసుల స్థాయి, బలహీనతల నియమాలు తెలుస్తాయి.

ఈ శాస్త్రానికి సంబంధించిన ప్రఖ్యాత పుస్తకం 'ఉలూముల్ హదీసు' దీన్ని 'ముకద్దమ ఇబ్నుస్సలాహ్' అని కూడా అంటారు. రచయిత : అబూ ఉమర్, ఉస్మానిబ్నుస్సలాహ్ (హి. 577)

గత 100 ఏళ్ళల్లో హదీసు సూత్రావళి మీద రెండు గ్రంథాలు వెలువడ్డాయి.

**(అ) తౌజీహున్నజర్ - రచయిత:** అల్లామా తాహిర్ బిన్ సాలిహ్ అల్ జజాయిరీ (హి.1338)

**(ఆ) కవాయిదుత్తహదీసు - రచయిత** : అల్లామా సయ్యద్ జమాలుద్దీన్ కాసిమీ (హి.1332)

మొదటి పుస్తకం విషయ విస్తృతికి, రెండవది సక్రమ సంకలనానికి ఖ్యాతి గడించాయి.

## 3. గరీబుల్ హదీసు విద్య

ఈ శాస్త్రంలో హదీసుల్లోని కఠినపదాల శాబ్దిక అర్థాల పరిశోధన విరివిగా జరిగింది. ఈ శాస్త్రంలో ఇదికాక అల్లామా జమఖ్షరీ (హి.538) రచించిన అల్ ఫాయిక్, ఇబ్నుల్ అసీర్ (హి.606) రచించిన నిహాయ ప్రముఖమయినవి.

## 4. తఖ్‌రీజుల్ అహాదీస్ విద్య

ప్రముఖ ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన గ్రంథాలు, ఫికహ్ గ్రంథాలు, సూఫీయిజానికి సంబంధించిన గ్రంథాలు, విశ్వాసాలకు సంబంధించిన గ్రంథాలు- వీటన్నింటిలో ప్రస్తావించిన ఉల్లేఖనాలకు మూల గ్రంథాలేవీ అన్న విషయం తెలుసుకోదలిస్తే ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, 'హిదాయ' (బుర్హానుద్దీన్ అలీ బిన్ అబీబక్ర్ అల్ మర్గీనాని (హి. 592). 'ఇహ్‌యాఉల్ ఉలూమ్' (ఇమామ్ గజాలి -హి. 505)లలో అనేక ఉల్లేఖనాలు, ఎలాంటి ప్రామాణికత తెలుపకుండా, మూలాన్ని తెలుపకుండా ప్రస్తావనలోకి వచ్చాయి. ఎవరైనా ఆ ఉల్లేఖనాల ప్రామాణికత ఏ పాటిదని, ఏఏ ప్రముఖ హదీసు పుస్తకాల్లో అవి వచ్చాయని తెలుసుకోగోరితే ఈ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాల్లో అవి లభ్యమవుతాయి. మొదట పేర్కొన్న పుస్తకం కోసం హాఫిజ్ జైలయి (హి. 792) రచించిన 'నసబుర్రాయ' అన్న పుస్తకాన్ని, హాఫిజ్ ఇబ్ను హజర్ అస్‌కలాని (హి.852) వ్రాసిన 'అద్దరాయ' అన్నదాన్నీ చూడవలసి వుంటుంది. రెండవ పుస్తకంలోని హదీసుల

కొరకు హాఫిజ్ జైనుద్దీన్ ఇరాకీ (హి. 808)రచించిన 'అల్ ముగ్నీ అన్ హమలిల్ అస్ఫార్' అనేది ఉచితమయింది.

## 5. అల్ అహదీసుల్ మౌజూఅ విద్య

ఈ శాస్త్రంలో పండితులు ప్రత్యేక పుస్తకాలు రచించారు. 'మౌజూ' (కల్పించిన-అబద్ధపు) ఉల్లేఖనాలను వేరు చేశారు. ఈ విషయంలో కాజీ షౌకాని (హి.1255) రచించిన 'అల్ ఫవాయిదుల్ మజ్మూఅ'తోపాటు హాఫిజ్ జలాలుద్దీన్ సుయూతి (హి.911) వ్రాసిన 'అల్ లఆలి అల్ మస్నూఅ' ప్రముఖమయినవి.

## 6. అన్నాసిఖ్ వల్ మన్సూఖ్ విద్య

ఈ శాస్త్రంలో ఇమామ్ ముహమ్మద్ బిన్ మూసా హాజమి హి.784- వయసు 35) రచించిన 'కితాబుల్ ఈ'తిబార్' చాలా ప్రామాణికమయింది. ఖ్యాతి గడించింది కూడా.

## 7. అత్ తౌఫీక్ బైనుల్ అహాదీస్- విద్య

ఈ శాస్త్రంలో, స్థూలంగా చూస్తే పరస్పర విరుద్ధంగా కనిపించే ఉల్లేఖనాల మధ్య సమాన అర్థాన్వయం చెయ్యడం జరిగింది. ప్రథమంగా ఇమామ్ షాఫియి (హి. 204) ఈ విషయాన్ని చర్చించారు. ఈయన వ్రాసిన పుస్తకం 'ముఖ్తలిఫుల్ హదీసు' అనే పేరుతో ఖ్యాతి గడించింది. ఇమామ్ తహావి (హి. 321) రచించిన 'ముష్కిలుల్ అసార్' అనే పుస్తకం కూడా ఈ శాస్త్రంలో ఉపయోగకరమయిన పుస్తకం.

## 8. అల్ ముఖ్తలిఫ్ వల్ ముఅత్తలిఫ్ విద్య

ఈ శాస్త్రంలో ముఖ్యంగా ఉల్లేఖన కర్తల పేర్లు, వాళ్ళ సంతానం, తండ్రిపేర్లు, బిరుదులు, తాత ముత్తాతల పేర్లు, లేక గురువుల పేర్లు ఒకేలా కనిపించిన వారి ప్రస్తావన వుంది. ఇలాంటి అనుమానాస్పద స్థితి వల్ల ఎరుగని వ్యక్తి అపార్థానికి గురయ్యే ఆస్కారముంది. ఈ శాస్త్రంలో హాఫిజ్ ఇబ్ను హజర్ విరచితమయిన 'తాబీర్ అల్ మున్తబహ్' అనే పుస్తకం చాలా సమగ్రమయింది.

## 9. అత్రాఫుల్ హదీస్ విద్య

ఈ శాస్త్రం ద్వారా ఏ ఉల్లేఖనం ఏ పుస్తకంలో ఉందో, దాని ఉల్లేఖనకర్తలెవరో తెలుస్తుంది. ఉదాహరణకు మీకు 'ఇన్నమల్ ఆమాలు బిన్నియ్యాత్' అనే హదీసు

వాక్యం ఒకటి గుర్తుంది. అది ఎక్కడి నుండి లభించిందో, ఉల్లేఖనం పూర్తి పాఠమేమిటో, ఉల్లేఖన కర్తలెవరో మీరు తెలుసుకోదలిస్తే ఈ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను చూడవలసి వుంటుంది. ఈ శాస్త్రాన్ని హాఫిజ్ మజి (హి. 742) రచించిన 'తుహఫతుల్ అష్రాఫ్' అన్న పుస్తకంలో సవివరంగా చర్చించడం జరిగింది. ఇందులో 'సిహాసిత్తా' (ఆరు అతి సవ్యమయిన హదీసు పుస్తకాలు)లోని ఉల్లేఖనాల పట్టిక మొత్తం వచ్చేసింది. ఈ పుస్తకంలో హాఫిజ్ అబూ యూసుఫ్ మజీ 26 సంవత్సరాలు వెచ్చించారు. ఎంతో కఠిన శ్రమతో దీన్ని పూర్తి చేశారాయన. నేటి ప్రాచ్య శాస్త్రాల పాశ్చాత్య నిపుణులు (Orientalists) ఇలాంటి పుస్తకాలను అనుసరించే కాస్త కొత్తరూపంలో హదీసుల పట్టిక ఒకటి తయారు చేశారు. ఉదాహరణకు 'కునూజుస్సున్నహ్' అనే పుస్తకం ఇంగ్లీషులో ప్రచురించారు. దాని అరబీ అనువాదం క్రీ.శ. 1934లో ఈజిప్ట్ నుండి వెలువడింది. ఇప్పుడొక విస్తృత పట్టిక 'అల్ము'జముల్ ముఫహ్రిస్' అనే పేరుతో సంకలనం చేస్తున్నారు. దీని 20 సంపుటాలు వెలువడ్డాయి.

## 10. ఫిక్హుల్ హదీస్

ఈ శాస్త్రంలో ధార్మిక ఆదేశాలకు సంబంధించిన హదీసుల మర్మ హేతువును, అందులో నిగూఢమయి ఉన్న వివేచనను ఆవిష్కరించడం జరిగింది. ఈ విషయం మీద హాఫిజ్ ఇబ్ను కయ్యిమ్ (హి. 751) రచించిన 'ఆలాముల్ మౌకియీన్' అన్న పుస్తకంతోపాటు షా వలీయుల్లా 'హుజ్జతుల్లాహుల్ బాలిగ' అనే పుస్తకం ప్రయోజన కరమయినవి. ఇవేకాక జీవితంలోని విభిన్న సమస్యల్ని స్పర్శిస్తూ పండితులు వేర్వేరు పుస్తకాలు రచించారు. ఉదాహరణకు ఆర్థిక విషయాలకు సంబంధించిన పుస్తకం 'కితాబుల్ అమ్వాల్'ని అబూ ఉబైదా కాసిమ్ బిన్ సల్లామ్ (హి.224) వ్రాశారు. అలాగే భూమి, సేద్యపు భూమి, ఉష్ర్ (పంటలో జకాత్) ఖరాజ్ ఇత్యాధి విషయాల మీద కాజీ అబూ యూసుఫ్ వ్రాసిన 'కితాబుల్ ఖరాజ్' అత్యుత్తమ రచన. ఇంకా సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) షరీఅత్కు మూలం అనడానికి, హదీసు తిరస్కారులు వ్యాపింపజేసిన అపార్థాలను తొలగించడానికి దిగువ పేర్కొన్న పుస్తకాలు చూడవచ్చు.

1) కితాబుల్ ఉమ్మ్ 7వ సంపుటం; 2) అల్ రిసాల (ఇమామ్ షాఫియి); 3) అల్ ముఆఫికాత్, నాల్గవ సంపుటం (అబూ ఇస్హాక్ షాతిబి (హి.790); 4) సవాఇకు ముర్సల, సం.2 (ఇబ్నుకయ్యిమ్), 5) అల్ అహ్కామ్ (ఇబ్ను హజ్మ్ ఉన్దులుసి హి.456); 6) తర్జుమానుస్సున్న (ఉర్దు, మౌలానా బద్రెఆలమ్, మీరఠీ); 7) ఇస్బాతుల్ ఖబర్ (మా

తండ్రి గారు, మౌలానా హాఫిజ్ అబ్దుస్సత్తార్ హసన్, ఉమర్‌పూరి, హి. 1324, హదీసు, ఖుర్‌ఆన్ (మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది) 9) ఇన్కారె హదీస్ కా మన్జర్ ఔర్ పస్‌మన్జర్ (ఇఫ్తిఖార్ అహ్మద్ బల్ఖి), 10) కొంతకాలం ముందు అల్లామా ముస్తఫా సబాయి, అల్ ముస్లిమూన్ అనే పత్రికలో, హదీసులు తార్కిక నిదర్శనాలన్న విషయం మీద వ్యాసాల పరంపర ప్రారంభించారు. వాటి ఉర్దూ అనువాదం మౌలానా మలిక్ గులామ్ అలీ గారు చేశారు. ఈ పుస్తకం 'నాతె రసూల్' పేరుతో వెలువడింది.

హదీసు విద్యల చరిత్ర, తదితర సంబంధిత చర్చలకుగాను దిగువ ప్రస్తావించిన రచనలు సమగ్రమైనవి, ప్రయోజనకరమయినవి.

1) ముకద్దమ ఫత్‌హుల్ బారి (హాఫిజ్ ఇబ్ను హజర్); 2) జామె బయానుల్ ఇల్మ్ వ అహ్‌లిహీ, (హాఫిజ్ ఇబ్ను అబ్దుల్ బర్ ఉందులుసి(హి.463) 3) ముఅరిఫతు ఉలూముల్ హదీస్ (ఇమామ్ హాకిమ్- హి.405); 4) ముకద్దమ తుహఫతుల్ అహూజీ (మౌలానా అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి- హి.1353) ఈ పుస్తకం కొత్తగా వచ్చిన పుస్తకాలన్నింటిలో సమగ్రమయింది, ప్రయోజనకరమయిందీను; అలాగే 5) ముకద్దమ ఫత్‌హుల్ ముల్హిమ్ (మౌలానా షబ్బీర్ అహ్మద్ ఉస్మాని); 6) తద్వీనె హదీస్ (ఉర్దూ- మౌలానా మనాజిర్ అహ్సన్ గీలాని)

## మూడవ దశలో హదీసు సంకలన కర్తలు

ఈ దశలోని ప్రముఖ ఖ్యాతిగాంచిన హదీసువేత్తల ప్రామాణిక గ్రంథాలను క్రింద పరిచయం చేస్తున్నాము.

1) **ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (హి.164- 241):** ఈయనగారి ప్రముఖ సంకలనం 'ముస్నద్ అహ్మద్' పేరుతో ఖ్యాతి గడించింది. ఇందులో 30 వేల ఉల్లేఖనాలున్నాయి. దీని సంపుటాలు 24. చెప్పుకోదగ్గ హదీసులన్నీ ఇందులో ఉన్నాయి. ఇందులో సంకలనా విధానం విషయశీర్షికనుబట్టికాక ఉల్లేఖన కర్త అయిన ప్రవక్త సహచరుని శీర్షికన జరిగింది. దీన్ని అధ్యాయాల రీత్యా అంటే విషయానుక్రమంగా తిరిగి కూర్చే పని హసనుల్ బన్నా షహీద్ తండ్రిగారు అయిన అహ్మద్ అబ్దుర్రహ్మాన్ సాఅతి ప్రారంభించారు. ఇప్పటివరకు 14 సంపుటాలు వెలువడ్డాయి. ఈజిప్ట్‌కే చెందిన ప్రముఖ పండితులు అహ్మద్ షాకిర్ కూడా ఈ సందర్భంలో పని చేస్తున్నారు. ఇప్పటివరకు 15 భాగాలు సంకలనమయ్యాయి.

2. **ఇమామ్ ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ అల్ బుఖారి (హి.194- 256):** ఈయన గారి పుట్టుక సంవత్సరం అరబీ సంఖ్యా శాస్త్రం రీత్యా 'సిద్క్' (194) మరణ సంవత్సరం 'నూర్' (256) వస్తాయి. ఇమామ్ బుఖారి రచనల్లో అన్నింటికన్నా ప్రముఖమయింది, ప్రామాణికమయింది 'సహీహ్ బుఖారి'. దాని పూర్తి పేరు 'అల్ జామి ఉస్సహీహుల్ ముస్నదుల్ ముఖ్తసర్ మిన్ ఉమూరు రసూలుల్లాహి సల్లల్లాహు అలైహి వ ఆలిహి వసల్లం వ అయ్యామహ్.'

ఈ గ్రంథ సంకలనంలో 16 ఏళ్ళు పట్టాయి. ఆయన ద్వారా నేరుగా సహీహ్ బుఖారి చదివిన శిష్య గణం సంఖ్య 90వేల వరకు ఉంటుంది. కొన్ని పర్యాయాలు ఒకే సమావేశంలో హాజరైన వారి సంఖ్య 30వేల వరకు చేరేది. ఇలాంటి సమావేశాల్లో ఆయన చెబుతూ ఉండగా తిరిగి చెప్పి వ్రాయించే వారి సంఖ్య 300కు మించి ఉండేది. మొత్తం హదీసుల సంఖ్య 9684. అయితే పునరుక్తమయిన ఉల్లేఖనాలు (ముకర్రర్ రివాయాత్), అప్రామాణికమయిన ఉల్లేఖనాలు (తాలీకాత్), సహచరుల సాక్ష్యాధారమయిన ఉల్లేఖనాలు (షవాహిద్ (అసార్), ముర్సల్ హదీసులను తీసివేస్తే మర్ఫూ ఉల్లేఖనాలు 623 మిగులుతాయి. ఇతర హదీసువేత్తలను పోల్చి చూస్తే ఉల్లేఖనకర్తలను ఏరివేసే ప్రమాణం ఈయన కాస్త ఉన్నతంగా పెట్టారు.

3. **ఇమామ్ ముస్లిమ్ బిన్ హజ్జాజ్ కషీరి (హి.202- 261):** ఇమామ్ బుఖారి, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ ఈయన గురువుల్లోనూ, ఇమామ్ తిర్మిజీ, అబూ హాతిమ్ రాజి, అబూబక్ర్ బిన్ ఖుజైమా ప్రభృతులు ఈయన శిష్యగణంలోని వారు. ఈయన సంకలనం 'సహీహ్ ముస్లిమ్' సంకలనాక్రమం రీత్యా ప్రముఖమయిందిగా పరిగణించబడుతుంది.

4. **అబూ దావూద్ అష్అస్ బిన్ సులైమాన్ సజిస్తానీ (హి. 202- 275):** ఈయన ప్రముఖ సంకలనం 'సునన్ అబూ దావూద్' పేరుతో ప్రఖ్యాతమయింది. ఇందులో అధికాంశం ధర్మశాస్త్ర ఆదేశాలకు సంబంధించిన ఉల్లేఖనాలను సమగ్ర రూపంలో ఒకచోట చేర్చడం జరిగింది. ఫికహ్‌కు సంబంధించిన, శాసనాంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఇది అత్యుత్తమ మూల గ్రంథమని చెప్పవచ్చు.

5. **ఇమామ్ అబూ ఈసా తిర్మిజి(హి. 209- 279):** ఇందులో ఫికహ్‌కు సంబంధించిన విషయాలను, విభిన్న పంథాల వివరాలను విశదపరచడం జరిగింది.

6. **ఇమామ్ అహ్మద్ బిన్ షుఅయిబ్ నసాయి (హి. 303):** ఈయన సంకలనం పేరు 'అస్సుననుల్ ముజ్తబా'

7. **ఇమామ్ ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ మాజా కుజ్వయిని (హి. 273):** ఈయన పుస్తకం సునన్ ఇబ్ను మాజా పేరుతో ప్రఖ్యాతమయింది.

   ముస్నద్ అహ్మద్ తప్ప మిగతా 6 గ్రంథాలను హదీసువేత్తల పరిభాషలో 'సిహాహ్ సిత్తా' అంటారు. కొందరు పండితులు ఇబ్ను మాజాకు బదులు ముఅత్తా 'ఇమామ్ మాలిక్'ని సిహాహ్ సిత్తాలో ఒకటిగా పరిగణిస్తారు.

   ఇవికాక ఆ దశలో ఇంకా అనేక ప్రయోజనకరమయిన, సమగ్రమయిన రచనలు, సంకలనాలు జరిగాయి. వాటిని వివరించడం ఇక్కడ సాధ్యపడదు. బుఖారి, ముస్లిమ్, తిర్మిజీ ఈ మూటిని 'జామె' అని అంటారు. అంటే వీటిలో విశ్వాసాలు, ఆరాధనలు, నైతక నియమాలు, వ్యవహారాలు తదితర సకల విషయాలకు సంబంధించిన హదీసులున్నాయన్నమాట. అబూ దావూద్, నసాయి, ఇబ్నుమాజ- వీటిని సునన్ అని అంటారు. అంటే వీటిలో క్రియాత్మక జీవితానికి సంబంధించిన ఉల్లేఖనాలు మటుకే ఉన్నాయని అర్థం.

## హదీసు గ్రంథాల వర్గీకరణ

హదీసువేత్తలు ఉల్లేఖనాల బలం, సవ్యతల ఆధారంగా హదీసు గ్రంథాలన్నింటినీ నాలుగు వర్గాలుగా విభజించారు.

1. **ముఅత్తా** ఇమామ్ మాలిక్, సహీహ్‌బుఖారి, సహీహ్ ముస్లిమ్. ఈ మూడు గ్రంథాలు, సవ్యత రీత్యాను, ఉల్లేఖనకర్తల విశ్వసనీయత దృష్ట్యాను అత్యున్నత స్థాయికి చెందినవి.

2. **అబూ దావూద్, తిర్మిజి, నసాయి-** ఈ గ్రంథాల ఉల్లేఖనకర్తలు కొందరు విశ్వస నీయత రీత్యా మొదటి వర్గానికి కాస్త దిగువన ఉన్నవారు. అయినా ఇవీ విశ్వసనీయ గ్రంథాలే. ముస్నద్ అహ్మద్ కూడా వీటితో సమంగా పరిగణించ బడుతుంది.

3. **దారిమి (హి.225),** ఇబ్ను మాజ, బైహకీ, దారుల్‌ఖుతని (హి.385), తబ్రానీ (హి.360) పుస్తకాలు, తహావి (హి.311) రచనలు, ముస్నద్‌షాఫియీ, ముస్తద్‌రక్ హాకిమ్ (హి. 405) - ఈ గ్రంథాలలో సహీహ్ (సవ్యమయినవి), జయీఫ్ (బలహీనమయినవి) అన్ని రకాల ఉల్లేఖనాలున్నాయి. కాని విశ్వసనీయమయిన ఉల్లేఖనాలే అధికంగా ఉన్నాయి.

4. ఇబ్ను జరీర్ తబ్రీ (హి.310) రచనలు, ఖతీబ్ బగ్దాదీ(హి.463) పుస్తకాలు, అబూ నుఅయిమ్ (హి.403), ఇబ్ను అసాకిర్ (హి.571), దైలమి, ఫిర్‌దౌస్ కృతికర్త (509), కామిల్ ఇబ్ను అదీ (హి.365), ఇబ్ను మర్దూయ (హి.410) సంకలనాలు, వాకిది(హి.207) ఇంకా ఇలాంటి ఇతర రచయితల పుస్తకాలు ఈ కోవకు చెందినవి. ఈ పుస్తకాలు కలగూర గంప లాంటివి. మౌజూ (కల్పిత) ఉల్లేఖనాలు కూడా వీటిలో అధికంగా చోటుచేసుకున్నాయి. సాధారణ మత బోధకులు, సూఫీ పండితులకు ఆధారాలు ఈ గ్రంథాలే. అయితే కష్టపడి ప్రక్షాళన జరిపితే ఈ సంకలనాల నుండి కూడా మణిమాణిక్యాలు వెదికి తీయవచ్చు.

## నాల్గవ దశ

ఈ దశ దాదాపు అయిదవ శతాబ్ది హిజ్రీ నుండి మొదలయింది. ఇంకా కొనసాగుతోంది. దీనికి పూర్వం మూడవ దశలో జరిగిన సంకలనా విధానం ముగిసింది. ఈ సుదీర్ఘ కాలంలో జరిగిన రచన, పరిశోధనా కార్యకలాపాల వివరాలు ఇవి:

1. ప్రముఖ హదీసు గ్రంథాల టీకా తాత్పర్యాలు, వివరణలు, ఇతర భాషల్లోకి అనువాదాలు జరిగాయి.
2. పైన పేర్కొన్న హదీసు శాస్త్రాల మీద అనేక రచనలు జరిగాయి. వాటి వ్యాఖ్యానాలు, వివరణలు, సంక్షిప్తాలు వ్రాయడం జరిగింది.
3. పండితులు తమ అభిరుచులకనుగుణంగా లేక అవసరాల రీత్యా మూడవ దశలో జరిగిన సంకలనాల నుండి హదీసులను ఎన్నుకుని ప్రయోజనకరమయిన కూర్పులు చేశారు. వాటిలో కొన్ని దిగువన ఇస్తున్నాము.

అ) **మిష్కాతుల్ మసాబీహ్** (వలీయుద్దీన్ ఖతీబ్): ఇందులో విశ్వాసాలు, ఆరాధనలు, నైతిక నియమాలు, వ్యవహారాలు, సామాజిక నియమాలు, ప్రళయ దిన వివరాలు ఇత్యాది విషయాలకు సంబంధించిన ఉల్లేఖనాలన్నీ సమకూర్చడం జరిగింది.

ఆ) **రియాజుస్సాలిహీన్** (ఇమామ్ అబూ జక్రియ్యా యహ్యా బిన్ షరఫ్ నవవి- ఈయన 'ముస్లిమ్' గ్రంథానికి టీకా కూడా వ్రాశారు. హి.676) ఈ గ్రంథం అధికంగా నైతికత, మర్యాదలకు సంబంధించిన హదీసులున్న పుస్తకం. ప్రతి ఆధ్యాయం ప్రారంభంలో శీర్షికను బట్టి ఖుర్‌ఆన్ వచనాలను కూడా ఉటంకించడం జరిగింది. ఇది ఈ గ్రంథం ప్రత్యేకత. సహీహ్ బుఖారి సంకలనా విధానం కూడా ఇదే. *(తెలుగులో ఇది 'హదీసు కిరణాలు' పేరుతో ప్రచురించబడింది)*

4) **మున్తకల్ అఖ్‌బార్** (ముజద్దిదుద్దీన్, అబుల్ బర్కాత్, అబ్దుస్సలామ్ బిన్ తైమియ్యా -హి.652) : ఈయన ప్రఖ్యాత ఇస్లామీయ తత్వవేత్త షేఖుల్ ఇస్లామ్ తకీఉద్దీన్ అహ్మద్ బిన్ తైమియ్యా (హి.728) గారి పితామహులు. కాజి షౌకాని, ఈ గ్రంథానికి నైలుల్ ఔతార్ పేరిట ఒక టీకా వ్రాశారు.

5. **బులూగుల్ మరామ్** (హాఫిజ్ ఇబ్ను హజర్, బుఖారి టీకా కర్త (హి.852)ఇందులో అధికంగా ఆరాధనలు, వ్యవహారాలకు సంబంధించిన హదీసులే ఉన్నాయి. ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ సనాని (హి.1182) 'సుబులుస్సలామ్' పేరిట దీనికి టీకా వ్రాశారు. 'మిస్కుల్ ఖిత్తామ్' పేరిట మరో టీకా ఫార్సీ భాషలో నవాబ్ సిద్దీకుల్ హసన్ ఖాన్ (హి.1307) వ్రాశారు. ఈ గ్రంథాల్లో చాలా వాటికి చాలా కాలం క్రితమే ఉర్దూలోనికి అనువాదం జరిగింది. వాటి ప్రచురణ కూడా జరిగింది. *(తెలుగులో ఇది 'హదీసు మకరందం' పేరుతో ప్రచురించ బడింది)*

## భారతదేశంలో

మన దేశంలో మొట్టమొదట షేఖ్ అబ్దుల్ హక్ ముహద్దిస్ దహ్లావీ బిన్ సైఫుద్దీన్ తుర్క్ (హి.1052) హదీసు విద్యాజ్యోతిని ప్రకాశింపజేశారు. ఆయన తరువాత హజ్రత్ షా వలీయుల్లా (హి.1176), ఆయన సంతానం, సేవాపరాయణులు, బోధనాగ్రహకు లయిన శిష్యుల అవిరళ పరిశ్రమ వల్ల ఈ భూభాగంలో ప్రవక్త సంప్రదాయ కాంతి నలుమూలలా వ్యాపించింది. 'భూమి దాని ప్రభు జ్యోతితో ప్రకాశమానమయి పోయింది.' *(దివ్యఖుర్‌ఆన్ -అజ్ జుమర్ : 69)*

షా వలీయుల్లా తరువాత ఈ దేశంలో అనువాదాలు, టీకాలు, చిన్నచిన్న సంకలనాలు, ప్రచురించే సత్కార్య క్రమం ఇంకా కొనసాగుతూనే ఉంది.

'నేను సత్పురుషుల ప్రేమికుణ్ణే కాని వారిలోని వాణ్ణి కాను.'

దీని ద్వారానయినా బహుశా దైవం నాలో సదాచారాన్ని అనుగ్రహిస్తాడేమో! ప్రవక్త కాలం నుండి నేటివరకు హదీసులు వ్రాసే, వాటిని ఉల్లేఖించే కార్యక్రమం సదా ఎడతెగకుండా సాగుతూనే ఉందని పై వివరాల వల్ల తెలుస్తోంది. ఈ విజ్ఞాన పరిశోధనా పరంపరలో పగలూ దేదీప్యమానమయినదే, రేయీ ఉజ్వలమానమయినదే!

**- అబ్దుల్ గఫ్ఫార్ హసన్ ఉమర్‌పూరి**

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 1. సాక్ష్యాధారాల ప్రకరణం

## అధ్యాయం : 1

## సాక్ష్యాలను సమర్పించవలసిన బాధ్యత వాదిదే [1]

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : విశ్వసించిన ప్రజలారా! మీరు పరస్పరం ఒక నిర్ణీత కాలం కొరకు అప్పు తీసుకున్నప్పుడు, ఆ వ్యవహారాన్ని వ్రాసి పదిలపరచండి. ఇరుపక్షాల మధ్య న్యాయంగా దస్తావేజును ఒక వ్యక్తి వ్రాయాలి. అల్లాహ్ ఎవడికైతే అక్షరజ్ఞానం ప్రసాదించాడో, అతడు వ్రాయటానికి నిరాకరించకూడదు. అతడు వ్రాయాలి. బాధ్యత మోపబడిన వ్యక్తి (అప్పు తీసుకునేవాడు) చెప్పి వ్రాయించాలి. అతడు తన ప్రభువైన అల్లాహ్‌కు భయపడాలి. నిర్ణయమైన షరతులలో హెచ్చు తగ్గులు చెయ్యరాదు. కాని రుణం తీసుకునే వ్యక్తి అమాయకుడు లేక బలహీనుడు లేక చెప్పి వ్రాయించలేని అసమర్థుడు అయితే, అతని సంరక్షకుడు న్యాయంగా చెప్పి వ్రాయించాలి. ఇంకా మీరు మీలోని ఇద్దరు పురుషులను దానికి సాక్షులుగా పెట్టుకోవాలి. ఇద్దరు పురుషులు లభించని పక్షంలో, ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండాలి. ఎందుకంటే వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేస్తుంది. ఎవరి సాక్ష్యం మీ అందరికీ ఆమోదయోగ్యమో వారి నుండే ఈ సాక్షులు ఎన్నుకోబడాలి. సాక్ష్యం ఇవ్వండి అని ఆహ్వానించినప్పుడు, సాక్షులు నిరాకరించకూడదు. వ్యవహారం చిన్నదైనా, పెద్దదైనా, దానిని గడువు నిర్ణయంతో దస్తావేజు రూపంలో వ్రాయించటానికి అశ్రద్ధ చెయ్యకూడదు. అల్లాహ్ దృష్టిలో ఈ పద్ధతి మీ కొరకు అత్యంత న్యాయసమ్మతమైనది. సులభంగా సాక్ష్య నిర్ణయం చెయ్యటానికి ఇది తోడ్పడుతుంది. ఇంకా, మీరు అనుమానాలకు, అపోహలకు గురి అయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. కాని మీరు అప్పటికప్పుడు పరస్పరం

**చేసుకునే (సాధారణ) వ్యాపార సంబంధమైన లావాదేవీలను వ్రాయకుండా వుంటే, అందులో అభ్యంతరం లేదు. కాని వ్యాపార వ్యవహారాలు నిశ్చయించేటప్పుడు, తప్పకుండా సాక్షులను పెట్టుకోండి. దస్తావేజు వ్రాసేవానినీ, సాక్షులనూ పీడించ రాదు. ఆ విధంగా చేస్తే అది పాపం అవుతుంది. అల్లాహ్ ఆగ్రహాన్నుండి రక్షించు కోండి. ఆయన మీకు సరియైన పద్ధతిని బోధిస్తున్నాడు. ఆయనకు ప్రతిదీ తెలుసు.** ***(అల్ బఖర – 282)***

**అల్లాహ్ ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు: విశ్వసించిన ప్రజలారా! న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని [2].** ***(అన్ నిసా– 135)***

---

1–1. తనకు రావలసిన ఏదయినా హక్కు లేదా వస్తువు కొరకు ఇతరులపై దావా వేసిన వానిని వాది లేక దావేదారు అంటారు. దావా (అభియోగం) మోపబడిన వ్యక్తిని ప్రతివాది లేక నిందితుడు అంటారు. ఒకరిపై దావా వేసినపుడు, దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను తేవలసిన బాధ్యత వాదిదే. బుద్ధి వాంఛించేది కూడా యిదే.

1–2. ఇస్లామీయ షరీఅత్ (శాసనాంగం) బహు విస్తృతమైనది. అది మనిషి జీవితంలోని విభాగాలన్నింటినీ పరివేష్ఠించి ఉంది. అందులో సివిల్ చట్టాలు, క్రిమినల్ చట్టాలతో పాటు రాజకీయ, నైతిక, వ్యక్తిగత, సామాజిక అంశాలెన్నో వచ్చేస్తాయి. ఒక్కోసారి మనిషి వాదిగా ఉంటే, ఒక్కోసారి ప్రతివాదిగా న్యాయస్థానం బోనులో నిలబడాల్సి వస్తుంది. ఒక్కోసారి సాక్షుల్లో ఒకడిగా కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుంది. అందుకే దైనందిన జీవితంలో ఎదురయ్యే అసంఖ్యాకమయిన సమస్యల్లో సాక్ష్యాధారాల సమస్య కూడా ఒక కీలకమయిన సమస్యగా భావించబడుతోంది. అందుకే షరీఅత్ సూత్రాల అన్వయింపు విషయంలో సాటిలేని మేటి అయిన ఇమామ్ బుఖారీ (రహ్మ) తన జామె సహీహ్‌లో పౌరస్మృతికి సంబంధించిన అంశాలను, సాక్ష్యాధారాలను కూడా దైవగ్రంథం, ప్రవక్త సున్నత్‌ల వెలుగులో విశ్లేషించి చెప్పారు.

ఇమామ్ బుఖారీ (రహ్మ) మొదట్లో పొందుపరచిన రెండు దివ్య వచనాల ద్వారా ఈ అధ్యాయం ఉద్దేశం వెల్లడవుతోంది. ఎందుకంటే ఈ రెండు ఆయత్‌లలో సాక్ష్యమివ్వటం, సాక్షులుగా నిలబెట్టడం గురించి ప్రస్తావించటం జరిగింది.

## అధ్యాయం : 2

### ఒకవేళ ఎవరయినా మరొకరి మంచి అలవాట్లను ప్రస్తుతించటానికి, నేనతన్ని మంచివాడుగానే భావిస్తున్నాననో లేదా అతనిలోని మంచి మాత్రమే నాకు తెలుసు అనో అంటే...

**'అపనింద' (ఇఫ్క్)కు సంబంధించిన హదీసులో ప్రవక్త మహనీయులు (సఅసం) తన సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) గురించి నీ అభిప్రాయమేమిటి? అని హజ్రత్ ఉసామా (రజి)ను అడిగినప్పుడు, 'ఆమెను మీ దాంపత్య బంధంలోనే ఉండనివ్వండి. మేము ఆమెను ఉత్తమురాలనే భావిస్తున్నాము' అని ఉసామా చెప్పారు.[1]**

**1)** ఉర్వా, ఇబ్నె ముసయ్యిబ్, అల్ఖమా బిన్ వఖ్ఖాస్, ఉబైదుల్లాహ్‌లు ఆయిషా(ర.అ) హదీసుకు సంబంధించి సమాచారం అందజేశారు. వారు చెప్పింది పరస్పరం ఒండొకరి విషయానికి ధ్రువీకరణగా ఉంది. అపనింద మోపేవారు అపనింద మోపినప్పుడు ప్రవక్త మహనీయులు(స) అలీ, ఉసామా బిన్ జైద్ (రజి. అన్‌హుమా)లను పిలిచి, తన సతీమణి (ఆయిషా-ర.అ)ని తన నుండి వేరుపరిచే విషయం గురించి సంప్రదించారు. ఎందుకంటే ఆయనపై (అప్పటివరకూ) ఈ విషయమై వహీ (దైవవాణి) అవతరించలేదు. '(దైవప్రవక్తా!) మీ పవిత్ర సతీమణి (ఆయిషా-ర.అ)లో మాకు మంచి తప్ప మరొకటి ఏదీ కనిపించలేదు' అని ఉసామా (రజి) చెప్పారు. బరీరా (ర.అ) ఇలా అంది : 'నేను ఆమెలో ఏ లోపాన్నీ చూడలేదు. కాకపోతే చిన్న పిల్ల. పిండి కలిపిన తరువాత వెళ్ళి నిద్రపోతుంది. మేక వచ్చి దానిని తినేస్తుంది.' ఆ నింద కేవలం అబద్ధమని రుజువైన తరువాత, "నా భార్యపై అపనింద మోపి నన్ను ఆవేదనకు గురి చేసిన వ్యక్తిని నిలదీసేవారెవరు? దైవసాక్షి! నేను నా ఇల్లాలిలో మంచి తప్ప మరొకటి చూడలేద"[1]ని దైవప్రవక్త(సఅసం) చెప్పారు.

---

2-1. సాక్షులు న్యాయశీలురై ఉండాలి. సద్వర్తనులై ఉండాలి. ఎందుకంటే వారిచ్చే సాక్ష్యాల ఆధారంగానే న్యాయమూర్తులు తీర్పు ఇస్తారు.

1-1. విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ)పై అపనింద సంఘటన ఇస్లామీయ చరిత్రలో సుప్రసిద్ధ సంఘటన. ఈ సందర్భంగా దైవప్రవక్త(స), ఆయిషా (ర.అ), మరితర సహచరులు మానసికంగా ఎంతో కృంగిపోవలసి వచ్చింది. చివరకు సూరయె నూర్ అవతరించింది. హజ్రత్ ఆయిషా(ర.అ) సౌశీల్యాన్ని, పాతివ్రత్యాన్ని చాటుతూ అల్లాహ్ అద్వితీయమైన వచనాలను అవతరింపజేశాడు.

## అధ్యాయం : 3

## చాటుమాటుగా సాక్ష్యమివ్వటం సరైనదే

ఇలాంటి సాక్ష్యం సరైనదేనని అమ్ర్ బిన్ హురైస్(రజి) చెప్పారు. [1] అబద్ధాల కోరు, మోసగాడి వ్యవహారంలో ఇలాంటి విధానాన్నే అవలంబించాలి. షాబీ, ఇబ్నె సీరీన్, అతా, ఖతాదా ఏమంటారంటే; ఎవడయినా మరొకరి ద్వారా ఏదన్నా విషయం వింటే, దానిపై సాక్ష్యమివ్వగలడు. సాక్ష్యమివ్వమని తననెవరూ అడగక పోయినా సరే (సాక్ష్యమివ్వగలడు). ఈ విధంగా సాక్ష్యమిచ్చే వ్యక్తి, 'నన్నెవరూ సాక్షిగా పెట్టలేదుగాని నేను ఈ విధంగా విన్నాను' అని చెప్పాలని హసన్ బస్రీ (రహ్మ) అభిప్రాయపడ్డారు.

**2)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పగా తాను విన్నానని సాలిమ్ వివరించారు. ఆయన ఇలా చెప్పారు– ప్రవక్త మహనీయులు(సఅసం) ఉబై బిన్ కాబ్ అన్సారీ (రజి)ని వెంటబెట్టుకుని ఇబ్నె సయ్యాద్ ఉండే ఖర్జూర తోట వైపునకు

---

ఈ అపనింద వెనుక సూత్రధారిగా పనిచేసినవాడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై అనే కపట విశ్వాసి. మొదటినుంచే ఇస్లాం పట్ల తన మనసులో అక్కసును దాచుకున్న ఈ వంచకుడు, ఏ చిన్న అవకాశం దొరికినా దానిని జారవిడువకుండా తన కపట బుద్ధిని చాటుకునేవాడు. చివరకు అతను సఫ్వాన్ బిన్ ముఅత్తల్(రజి) అనే నిజాయితీపరుడైన సహాబీని కూడా ఈ ఘటనలో ఇరికించాడు. సఫ్వాన్ బిన్ ముఅత్తల్ అమరగతి నొందారు.

3–1. ఈయన పిన్న వయస్కుడైన సహాబీ. ఈయన తండ్రి కూడా సహాబీయే. ఈ ప్రకరణంలో ఈ ఒక్కచోటే ఈయన ప్రస్తావన వచ్చింది. దీనిని ఇమామ్ బైహఖీ వసల్ చేశారు. అబద్ధీకుడు, మోసగాడు అయిన వ్యక్తి వ్యవహారంలో ఇలాగే వ్యవహరించబడుతుంది.

రాబోయే హదీసులో ఇబ్నె సయ్యాద్ ప్రస్తావన వచ్చింది. అతనొక యూదు పుత్రుడు. ఇస్లాం పట్ల ప్రజలలో సందేహాలను రేకెత్తించి వారిని మార్గభ్రష్టుల్ని చేసే ఉద్దేశ్యంతో అతను తనపై దైవవాణి అవతరిస్తుందని కట్టుకథలు అల్లేవాడు. అతనిలో దజ్జాల్ లక్షణాలు ఎక్కువగా కనిపించేవి. ప్రవక్త మహనీయులు(స) అతని మోసాన్ని బట్ట బయలు చేయడానికి ఖర్జూర చెట్ల మాటున అతన్ని చూడటానికి వెళ్ళారు. ఇమామ్ బుఖారీ(రహ్మ) ఈ అధ్యాయాన్ని ఏర్పరచటంలోని ఉద్దేశమిదే. అంటే ఇలాంటి సందర్భాలలో ఒకరి మాటలను చాటుమాటుగా వినటం సరైనదే. వినటం సరైనదైనప్పుడు, సాక్ష్యమివ్వటం కూడా సరైనదే.

**వెళ్ళారు. తోటలోనికి ప్రవేశించిన తరువాత ఆయన(స) చెట్లచాటున దాక్కుంటూ నడవసాగారు. ఇబ్నె సయ్యాద్ కంటబడకుండా ఉండాలని ఆయన(స) కాంక్షించారు. అలా చేసినట్లయితే– రహస్యంగా– అతని మాటలు వినవచ్చని భావించారాయన(స). ఇబ్నె సయ్యాద్ ఒక నూలు పోగును కప్పుకుని పడుకున్నాడు. ఏవో కూనిరాగాలు తీస్తున్నాడు. ఇబ్నె సయ్యాద్ తల్లి చెట్లచాటున ఉన్న దైవప్రవక్త(స) కదలికల్ని పసిగట్టి "సాఫ్! ఇదిగో ముహమ్మద్(స) వస్తున్నారు చూడు' అంది. అంతే. ఇబ్నె సయ్యాద్ ఉలిక్కిపడ్డాడు. "అరె! వాణ్ణి వాడి మానాన అలాగే ఉండనిస్తే అసలు విషయం బయటపడేది కదా!" [1] అని దైవప్రవక్త(స) చెప్పారు.**

**3) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : రిఫాఅ ఖురజీ (రజి) భార్య దైవప్రవక్త(సఅసం) సన్నిధిలో హాజరై ఇలా విన్నవించుకుంది : '(దైవప్రవక్తా!) నేను రిఫాఅ భార్యగా ఉండేదాన్ని. ఆయన నాకు విడాకులిచ్చారు. మళ్ళింపునకు ఆస్కారంలేని తలాక్ ఇచ్చేశారు. తరువాత నేను అబ్దుర్రహ్మాన్ బిన్ జబీర్ (రజి)ను వివాహమాడాను. కాని ఏం చెప్పమంటారు? ఆయన వద్ద ఉన్నది (పురుషాంగం) ఈ గుడ్డ అంచు మాదిరిగా ఉంది (అంటే అంగస్తంభనే జరగటం లేదు)'. "మరైతే నీవు మళ్ళీ రిఫాఅ వివాహ బంధంలోకి వెళ్ళగోరుతున్నావా? కాని నీవు మరో పురుషుని (అబ్దుర్రహ్మాన్ బిన్ జబీర్) దగ్గర పడక సుఖం పొందనంతవరకూ, అతను కూడా నీ నుండి సుఖం పొందనంతవరకూ నీవు రిఫాఅను మళ్ళీ పెళ్ళి చేసుకోలేవు" అని దైవప్రవక్త(సఅసం) స్పష్టం చేశారు. ఆ సమయంలో అబూబకర్(రజి) దైవ ప్రవక్త(స) సమక్షంలోనే ఉన్నారు. ఖాలిద్ బిన్ సయీద్ బిన్ ఆస్(రజి) గుమ్మంవద్ద (నిలబడి లోపల రావడానికి) అనుమతికై నిరీక్షిస్తున్నారు. ఖాలిద్ ఇలా అన్నారు: 'ఓ అబూబకర్(రజి)! ఈ స్త్రీ ఏ విధంగా దైవప్రవక్త(స) ఎదుట బిగ్గరగా మాట్లాడుతుందో మీరు గమనించటంలేదా?'[1]**

---

2–1. ఇబ్నె సయ్యాద్ మదీనాలోని ఒక యూదుని కుమారుడు. టీనేజీ కుర్రాడు. తనపై దైవవాణి (వహీ) అవతరిస్తోందని ప్రగల్భాలు పలికేవాడు. వాస్తవానికి అతనికి దెయ్యం పట్టింది. ఎల్లవేళలా మగతలో ఉండేవాడు. పిచ్చిపిచ్చిగా వాగుతూ ఉండేవాడు. అతని వాగుడును చాటున ఉండి వినాలని భావించారు దైవప్రవక్త(స). ఆ విషయమే ఈ హదీసులో వచ్చింది. ఈ సంఘటన ఆధారంగానే ఇమామ్ బుఖారీ(రహ్మా) ఈ అధ్యాయాన్ని ఏర్పరచారు.

3–1. ఖాలిద్ పలికిన ఈ మాట ఆధారంగానే ఇమామ్ బుఖారీ (రహ్మా) ఈ అధ్యాయాన్ని

## అధ్యాయం: 4

## ఒకరు లేదా అనేకమంది సాక్షులు ఏదేని వ్యవహారంలో అవునని సాక్ష్యమిచ్చినప్పుడు, అవతలివారు ఆ విషయం తమకేమీ తెలియదని చెప్పినాసరే, అనుకూలంగా సాక్ష్యమిచ్చినవారి మాట ఆధారంగానే తీర్పు ఇవ్వబడుతుంది.

**హుమైదీ ఇలా అన్నారు: ఈ వ్యవహారం ఎలాంటిదంటే; ప్రవక్త మహనీయులు (సఅసం) కాబా గృహం లోపల నమాజ్ చేశారని హజ్రత్ బిలాల్(రజి) తెలిపారు. అయితే ఆయన(స) కాబా గృహం లోపల నమాజ్ చేయలేదని ఫజల్ బిన్ అబ్బాస్(రజి) చెప్పారు. అప్పుడు జనులంతా బిలాల్(రజి) సాక్ష్యాన్ని స్వీకరించారు. అలాగే- ఫలానా వ్యక్తి ఫలానా అతనికి వెయ్యి దిర్హములు బాకీపడి ఉన్నాడని సాక్ష్యమిచ్చినప్పుడు, (లేదా) వెయ్యిన్నర దిర్హములు బాకీ పడి ఉన్నాడని మరో ఇద్దరు వ్యక్తులు సాక్ష్యమిస్తే ఎక్కువ బకాయిపై సాక్ష్యమిచ్చిన వారి మాట ప్రకారం తీర్పు ఇవ్వబడుతుంది.**

**4)** ఉఖబా బిన్ హారిస్(రజి) కథనం: ఈయన అబూ ఇహాబ్ బిన్ అజీజ్ కుమార్తెను వివాహమాడారు. తరువాత ఒక మహిళ (ఆమె పేరు తెలియలేదు) వచ్చి, 'నేను ఉఖబాకు కూడా నా చనుబాలిచ్చాను. ఇతను వివాహమాడిన స్త్రీకి కూడా నా పాలు త్రాపాను' అని చెప్పింది. నీవు నాకు పాలు ఇచ్చిన సంగతి నాకైతే తెలియదు. లోగడ నీవు ఈ సంగతి ఎప్పుడూ నాకు చెప్పనూలేదు కదా!' అని ఉఖబా (రజి) పలికారు. తరువాత ఆయన అబూ ఇహాబ్ కుటుంబీకులకు కూడా దీని

పొందుపరిచారు. అంటే ఏదయినా ఒక సంఘటనకు చాటుగా ఉండి సాక్ష్యం పలకటం సబబే. ఆ క్షణంలో ఖాలిద్ గుమ్మం బయట ఉన్నారు. ఆ స్త్రీ ముందుకు రాలేదు. అయినప్పటికీ ఆ స్త్రీ ధోరణిని ఆయన తప్పు పట్టారు.

ఇకపోతే అబ్దుర్రహ్మాన్ బిన్ జబీర్(రజి); చూడబోతే ఆయన అప్పటికి సంతాన భాగ్యం కలిగిన పురుషుడే. కాని ఏదైనా జబ్బు కారణంగా ఆయన మగసిరి క్షీణించి ఉంటుంది. అందుకే ఆ స్త్రీ ఆయన పురుషాంగాన్ని గుడ్డ అంచుతో పోల్చింది. అంటే తన భర్తలో అంగస్తంభన గానీ, కామోద్రేకంగానీ బొత్తిగా లేదన్నది ఆమె మాటల్లోని అంతరార్థం. అయితే అబ్దుర్రహ్మాన్ బిన్ జబీర్ ఆమె ఆరోపణను ఖండించారు.

ఈ హదీసు ద్వారా వెల్లడైన మరో ముఖ్యాంశం ఏమిటంటే ఒక పురుషుని నుండి విడాకులు పొందిన మహిళ మరో పెళ్ళి చేసుకుని, రతిక్రీడ జరిపి రసాస్వాదన పొందిన మీదట విడాకులు తీసుకోనంతవరకూ ఆమె తన మొదటి భర్త వివాహ బంధంలోకి తిరిగి రాజాలదు. అయితే ఈ ప్రక్రియ అంతా యాదృచ్ఛికంగానే జరగాలి గాని ఉద్దేశ పూర్వకంగా జరగరాదు.

**గురించి అడిగించారు. ఆ స్త్రీ తమ కుమార్తెకు చనుబాలిచ్చిన సంగతి తమకు కూడా తెలియదని వాళ్ళూ చెప్పారు. అప్పుడు ఉఖబా (రజి) మదీనాకు ప్రయాణమై ప్రవక్త మహనీయుల(స) సమక్షంలో దీని గురించి ధర్మ సందేహం వెలిబుచ్చారు. దానిపై దైవప్రవక్త(స) "విషయం స్పష్టమయ్యాక ఇక నీవు ఆ స్త్రీని నీ దాంపత్యబంధంలో ఎలా ఉంచగలవు? (ఆమె నీకు పాలవరుస సోదరి అవుతుంది కదా!)" అన్నారు. అందువల్ల ఉఖబా (రజి) ఆమెకు విడాకులిచ్చి మరో నికాహ్ చేసుకున్నారు.** [1]

## అధ్యాయం : 5

## సాక్షి న్యాయవర్తనుడై ఉండటం అవసరం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"మీలో న్యాయశీలురైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా పెట్టుకోండి." *(అత్ తలాఖ్: 2)***

అల్లాహ్ ఈ విధంగా కూడా సెలవిచ్చాడు : **"సాక్షులలో మీకు ఆమోద యోగ్యమైన వారుండాలి." *(అల్ బఖరా : 282)***

**5) హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ ఉతబా తెలిపారు : ఉమర్(రజి) ఇలా అన్నారు– "దైవప్రవక్త(సఅసం) కాలంలో 'వహీ' (దైవవాణి) ఆధారంగా జనుల నిలదీత జరిగేది. కాని ఇప్పుడు 'వహీ' పరం పర నిలిచిపోయింది. కాబట్టి ఇప్పుడు మేము, మీ బాహ్యాచరణల ద్వారా వ్యక్తమయ్యే చెడుగులపైనే నిలదీసి అడుగుతాము. కనుక ఎవరయితే బాహ్యంలో మా ముందు మంచి చేస్తాడో అతనికి మేము అభయం ఇస్తాము. అతనిని మా దగ్గరకు రానిస్తాము. అతని అంతరంగ స్థితితో మాకెట్టి సంబంధం లేదు. దాని లెక్క తీసుకునే వాడు అల్లాహ్‌యే. మరెవరయితే మా ముందు చెడుకు ఒడిగడతాడో అతనిని మేము నమ్మబోము.[1] అతనిని సత్యవంతునిగా ధ్రువపరచము. తన మనసు మంచిదని అతను ఎన్ని గొప్పలు చెప్పుకున్నా సరే (మా దృష్టిలో మాత్రం అతను చెడ్డవాడే)."[2]**

---

4–1. ఉఖబా (రజి)తోపాటు ఆయన అత్తవారు కూడా ఆ స్త్రీ మాటను 'కాద'ంటూ త్రోసిపుచ్చారు. కాని పాలిచ్చిన ఆ స్త్రీ మాత్రం 'అవున'ంది. అప్పుడు దైవప్రవక్త(స) ఆ స్త్రీ సాక్ష్యాన్నే స్వీకరించారు. దీనిని బట్టి విదితమయిందేమంటే, సాక్ష్యం విషయంలో 'అవును' అన్న దానికి 'కాదు' అన్న దానిపై ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుంది.

5–1. ఈ అధ్యాయంలోని ప్రధానాంశం ఇదే. అన్యాయవర్తనుడు, అవినీతిపరుడు, అబద్ధాలకోరు అయిన వ్యక్తి మాట స్వీకారయోగ్యం కాదు. అతని సాక్ష్యం కూడా

## అధ్యాయం : 6

## ఒకరి సాక్ష్యాన్ని న్యాయబద్ధంగా ఖరారు చేయడానికి ఎంతమంది సాక్షులు కావాలి?

**6)** హజ్రత్ అనస్(రజి) కథనం : ప్రవక్త ముహమ్మద్(సఅసం) దగ్గరి నుండి ఒక శవయాత్ర సాగిపోయింది. అక్కడ ఉన్న జనులు ఆ మృతుణ్ణి మెచ్చుకున్నారు. ఇది విన్న దైవప్రవక్త(స) "తప్పనిసరి అయిపోయింది" అని పలికారు. కాసేపటికే మరో శవయాత్ర కూడా సాగిపోయింది. ప్రజలు ఆ మృతుని గురించి చెడుగా చెప్పుకున్నారు. లేదా మరో విధంగా పలికారు (ఉల్లేఖకుడు ఇక్కడ సందిగ్ధానికి లోనయ్యారు). ఆయన(స) దీనిపై కూడా "తప్పనిసరైపోయింది" అని పలికారు. 'దైవప్రవక్తా! తమరు ఈ మృతుని గురించి కూడా తప్పనిసరైపోయిందన్నారు. ఇందాక తీసుకుపోబడిన మృతుని గురించి కూడా తప్పనిసరైపోయిందన్నారు (ఎందుకిలా?)' అని సహచరులు సందేహపడగా, "విశ్వాసులు (మోమినీన్) అయిన జనుల సాక్ష్యం దైవసన్నిధిలో స్వీకృతి పొందుతుంది. వీరు ధరణిలో దేవుని సాక్షులు"[1] అని ప్రవక్త మహనీయులు(స) సమాధానమిచ్చారు.

**7)** అబ్దుల్లాహ్ బిన్ బురైదా గారు అబుల్ అస్వద్‌తో ఇలా అన్నారు: నేను మదీనా నగరానికి వచ్చినప్పుడు అక్కడ అంటువ్యాధి ప్రబలి ఉంది. జనులు చాలా వేగంగా మృత్యువాతన పడుతున్నారు. నేను హజ్రత్ ఉమర్(రజి) దగ్గర కూర్చుని ఉండగా ఒక శవయాత్ర వెళ్ళింది. ప్రజలు ఆ మృతుని మంచితనం గురించి కొనియాడారు. ఇది విని హజ్రత్ ఉమర్(రజి) 'అవశ్యమైపోయింది' అన్నారు. తరువాత మరో జనాజా వెళ్ళింది. జనులు ఆ మృతుణ్ణి కూడా ప్రశంసించారు. దానిపై ఉమర్(రజి) 'అవశ్యమైపోయింది' అని పలికారు. కొద్దిసేపటి తర్వాత ఇంకొక

---

ఎన్నదగ్గది కాదు. దీనినిబట్టి అవగతమయిందేమంటే సాక్షి న్యాయశీలుడై ఉండాలి. ప్రాజ్ఞుడై ఉండాలి. బుద్ధిమంతుడై ఉండాలి.

5-2. హజ్రత్ ఉమర్(రజి) గారి ఈ పలుకుల ద్వారా, 'బాహ్యంతో పనేముంది, అంతరంగం బాగుంటే చాలు' అని బొంకే అవివేకుల కల్లబొల్లి కబుర్లు ఖండించబడుతున్నాయి. ఉమర్(రజి) వంటి ఘనాపాటికే వ్యక్తుల అంతరంగ స్థితి గురించి తెలియనప్పుడు మీరు ఏపాటి? అని వారిని అడగండి.

6-1 అంటే ముస్లింలు ఎవరిని ప్రశంసించారో వారికి స్వర్గం తప్పనిసరైపోతుంది. ముస్లింలు ఎవరిని తూలనాడారో వారికి నరకం తప్పనిసరి అయిపోతుంది.

శవయాత్ర వెళ్ళింది. అప్పుడు ప్రజలు ఆ మృతుని గురించి చెడుగా చెప్పుకున్నారు. దానిపై ఉమర్(రజి) 'అవశ్యమైపోయింది' అనన్నారు. 'అమీరుల్ మోమినీన్! ఇంతకీ ఏం అవశ్యమైపోయింది?' అని నేను అడిగితే, దైవప్రవక్త(సఅసం) పలికినట్లుగానే నేను పలికానయ్యా. ఆయన(సఅసం) ఇలా చెప్పారు : "ఏ ముస్లింలోని మంచితనం గురించి నలుగురు వ్యక్తులు సాక్ష్యమిస్తారో అతనిని అల్లాహ్ స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు." 'ఒకవేళ ముగ్గురు వ్యక్తులు సాక్ష్యమిస్తే...!?' అని మేము సందేహపడగా, "ముగ్గురు వ్యక్తులు సాక్ష్యమిచ్చినా సరే"అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. 'ఒకవేళ ఇద్దరు వ్యక్తులు సాక్ష్యమిస్తేనో?' అని మేము సందేహం వ్యక్తం చేయగా, "ఇద్దరు సాక్ష్యమిచ్చినా సరే" అని ఆయన(స) జవాబిచ్చారు. మేము ఒక వ్యక్తి సాక్ష్యం గురించి ఆయన్ని అడగలేదు.[1]

## అధ్యాయం : 7

## వంశపరంగా, పాల వరుస సంబంధం దృష్ట్యా ప్రసిద్ధి చెందటం... అలాగే చాలాకాలం క్రితం జరిగిన మరణంపై సాక్ష్యమివ్వటం

ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా సెలవిచ్చారు: "నాకూ, అబూ సలమాకు (అబూ లహబ్ బానిసరాలైన) సువైబా పాలు త్రాపింది" - అలాగే పాల వరుస సంబంధాల విషయంలో జాగ్రత్త పడటం.[1]

**8)** విశ్వాసుల మాతృశ్రీ హ(జత్ ఆయిషా(ర.అ) తెలిపారు : (పరదా ఆజ్ఞ అవతరించిన మీదట) అఫ్లా(రజి) వచ్చి తనను (మా ఇంట్లోకి) వచ్చేందుకు అనుమతి ఇవ్వమని కోరారు. కాని నేనాయనకు అనుమతి ఇవ్వలేదు. 'అయ్యో! మీరు నాతో పరదా పాటిస్తున్నారా! నేను మీకు పాల వరుస బాబాయినవుతాను'

---

7-1. ఈ హదీసు ఆధారంగా ఇమామ్ బుఖారీ (రహ్మ) సంగ్రహించిన ఒక ముఖ్యాంశం ఏమిటంటే, ఒక వ్యక్తి సౌశీల్యం, మంచితనం గురించి కనీసం ఇద్దరు వ్యక్తులు సాక్ష్యమివ్వటం అవసరం. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియీలు చెప్పేది ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా(రహ్మ) దృష్టిలో ఒక వ్యక్తి సాక్ష్యం కూడా సరిపోతుంది.

7-1. అంటే ఫలానా వ్యక్తితో పాల వరుస సంబంధం ఉందన్న విషయం రూఢీ కానంత వరకూ చెప్పుడు మాటలను నమ్మరాదు. రాబోయే హ(జత్ ఆయిషా(ర.అ) హదీసు ద్వారా కూడా ఈ విషయం రుజువవుతోంది.

**అని ఆయన చెప్పగా, 'అదెలా?' అని నేను అడిగాను. దానికి ఆయన, 'నా సోదరుడైన వాయెల్ భార్య మీకు పాలిచ్చారమ్మా' అని చెప్పారు. హ్జ్రత్ అయిషా(ర.అ) ఇలా అంటున్నారు: ఈ విషయం గురించి నేను దైవప్రవక్త(సఅసం)ను అడిగితే, "అఫ్లా నిజం చెప్పాడు. అతన్ని (లోనికి వచ్చేందుకు) అనుమతిస్తూ ఉండు" అని ఆయన (స) చెప్పారు.**

**9) హ్జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు హమ్జా కుమార్తె (ఉమామా లేదా అమ్మారా) గురించి చెబుతూ 'ఆమె నా కొరకు సమ్మతం (హలాల్) కాదు. ఎందుకంటే ఏ సంబంధాలు వంశపరంగా నిషిద్ధమవుతాయో అవి పాల వరుస కారణంగా కూడా నిషిద్ధం (హరామ్) అయిపోతాయి. ఈమె నా పాల వరుస సోదరుని పుత్రిక" [1] అన్నారు.**

**10) దైవప్రవక్త(సఅసం) సతీమణి హ్జ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసం) తన ఇంట్లో ఉండగా ఆమె గారు ఒక సహాబీ కంఠస్వరం విన్నారు. ఆ సహాబీ (విశ్వాసుల మాత హ్జ్రత్ హఫ్సా) ఇంట్లోకి రావడానికి అనుమతి కోరారు. హ్జ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: 'దైవప్రవక్తా! ఆ వ్యక్తి మీ ఇంట్లో రావడానికి అనుమతి కోరుతున్నారు' అని నేను చెప్పగా "ఓహో, అతను ఫలానా వ్యక్తి కదూ! అతను హఫ్సాకు పాల వరుస సోదరుడవుతాడు" అని దైవ ప్రవక్త(సఅసం) అన్నారు. హ్జ్రత్ ఆయిషా (ర.అ) కూడా తన పాల వరుస సోదరుని గురించి ప్రశ్నిస్తూ, 'ఒకవేళ అతను బ్రతికి ఉంటే పరదా లేకుండా నా ఇంట్లోకి రాగలిగేవాడా?' అని అంటే, "అవును. రక్త సంబంధం వల్ల నిషిద్ధం అయ్యే**

---

9–1. హ్జ్రత్ హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి) నిజానికి దైవప్రవక్త(స) పినతండ్రి. అయితే వారిద్దరి వయసులో పెద్దగా వ్యత్యాసం లేదు. హమ్జా బాల్యంలో (రజి) పాలు త్రాగే కాలంలోనే దైవప్రవక్త(స) కూడా పాలు త్రాగేవారు. అబూ లహబ్ దగ్గర బానిసరాలిగా ఉన్న సువైబా వీరిద్దరికీ బాల్యంలో చనుబాలిచ్చారు. ఆ విధంగా వారిరువురూ పాల వరుస సోదరులయ్యారు. ఈ కారణంగానే హ్జ్రత్ హమ్జా పుత్రికను వివాహమాడటం తనకు ధర్మసమ్మతం కాదని దైవప్రవక్త(సఅసం) చెప్పారు.

ఖుస్తులానీ ఇలా అన్నారు : ఇందులో నాలుగు సంబంధాలకు మినహాయింపు ఉంది. అవి వంశపరంగా నిషిద్ధం (హరాం) అవుతాయి గాని పాలు త్రాగటం వల్ల నిషిద్ధం అవవు. వాటి ప్రస్తావన దైవచిత్తమైతే 'కితాబున్నికాహ్'లో రానున్నది.

**సంబంధాలన్నీ పాల సంబంధం వల్ల కూడా నిషిద్ధం (హరామ్) అయిపోతాయి" అని ఆయన(స) అన్నారు.**

**11) హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ఒకసారి ఏం జరిగిందంటే ప్రవక్త మహనీయులు (సఅసం) నా వద్దకు (ఇంటికి) వచ్చినప్పుడు నా దగ్గర ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. "ఆయిషా! ఎవరితను?" అని ఆయన(స) విచారించగా, 'ఇతను నా పాల వరుస సోదరుడు' అని నేను సమాధానమిచ్చాను. దానికాయన(స), "ఆయిషా! ఎవరు నీకు పాల వరుస సోదరుడో కాస్త జాగ్రత్తగా చూసుకో. ఎందుకంటే పసితనంలో ఒక స్త్రీ చనుబాలు త్రాగితేనే పాల వరుస సంబంధం ఏర్పడుతుంది"[1] అని చెప్పారు– ముహమ్మద్ బిన్ కసీర్‌తోపాటు ఈ హదీసును అబ్దుర్రహ్మాన్ బిన్ మెహ్దీ కూడా సుఫ్యాన్ సౌరీ నుండి ఉటంకించారు.**

## అధ్యాయం : 8

## వ్యభిచారపు అపనింద మోపేవారి, దొంగతనం చేసేవారి, వ్యభిచారానికి ఒడిగట్టేవారి సాక్ష్యం గురించి...

**అల్లాహ్ సూరయె నూర్‌లో ఇలా సెలవిచ్చాడు: "వారి సాక్ష్యాన్ని ఇక ఎన్నడూ అంగీకరించకండి. వారు దుర్మార్గులు– ఈ చేష్ట తరువాత పశ్చాత్తాపపడి తమను తాము సంస్కరించుకున్నవారు తప్ప (అలాంటి వారికి ఈ ఆంక్ష నుండి మినహాయింపు ఉంది)"[1] (24 : 4,5)**

**హజ్రత్ ఉమర్(రజి) గారు అబూబక్రా, షిబ్ల్ బిన్ మాబద్, నాఫె బిన్ హారిస్‌లకు శిక్ష విధించారు. ఎందుకంటే వారు ముగీరాపై అపనింద మోపారు.[2] తరువాత వారిచేత పశ్చాత్తాప ప్రకటన చేయించారు. పశ్చాత్తాపపడిన వారి సాక్ష్యం స్వీకార యోగ్యం అవుతుందని చెప్పారు. అబ్దుల్లాహ్ బిన్ ఉతబా, ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్, సయీద్ బిన్ జుబైర్, తావుస్, ముజాహిద్, షాబీ, ఇక్రిమా, జుహ్రీ, ముహారిబ్ బిన్ దిసార్, షురైహ్, ముఆవియా బిన్ ఖుర్రాహ్ ప్రభృతులు కూడా పశ్చాత్తాపపడిన**

---

11–1. అంటే లేత్రాయంలో ఒక తల్లి చనుబాలు త్రాగటం వల్లనే పాలవరుస సంబంధం ఏర్పడుతుంది. ఈ వయో పరిమితి 2 సంవత్సరాలు. రెండేళ్ల లోపు వయసులో ఎవరయినా ఒక స్త్రీ పాలు త్రాగి ఉంటే, వారి మధ్య శాశ్వతంగా సోదర సోదరీ సంబంధం ఏర్పడుతుంది. వారు ఎన్నటికీ ఒండొకరిని వివాహం చేసుకోలేరు.

తర్వాత ఇచ్చే సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా ఖరారు చేశారు. అబూ జినాద్ [3] ఇలా అన్నారు : అపనింద మోపిన వ్యక్తి తన ఆరోపణను ఉపసంహరించుకుని క్షమాపణ వేడుకుంటే, అతని సాక్ష్యం సమ్మతించబడుతుంది. మా దృష్టిలో - మదీనా తయ్యిబాలో– ఉన్న ఆజ్ఞ మాత్రం ఇదే. మనిషి తాను చేసిన ఆరోపణ తప్పుని ఒప్పుకున్నప్పుడు, అతనికి శిక్ష కూడా విధించబడినప్పుడు అతని సాక్ష్యం అంగీకరించబడాలి అని షాబీ, ఖతాదా అభిప్రాయపడ్డారు. అపనింద మోపినందుకు ఒక బానిసకు శిక్ష విధించబడిన తరువాత, అతను బానిసత్వం నుండి స్వేచ్ఛ పొందినట్లయితే అతని సాక్ష్యం స్వీకరించబడుతుందని సుఫ్యాన్ సౌరీ వక్కాణించారు. ఒక వ్యక్తి వేరొకరిపై వ్యభిచార అపనింద మోపినందుకు శిక్ష అనుభవించిన మీదట, న్యాయమూర్తిగా అతను నియమించబడితే, అతని తీర్పు చెలామణి అవుతుంది. వ్యభిచార అపనింద మోపినవారు పశ్చాత్తాపం చెందినప్పటికీ, అలాంటి వారి సాక్ష్యం అంగీకరించబడదని కొందరు (ఇమామ్ అబూ హనీఫా– రహ్మ) అంటున్నారు. మరి వారే ఈ విధంగా కూడా అంటున్నారు: 'ఇద్దరు సాక్షులు లేకుండా చేసుకున్న నికాహ్ సరైనది కాదు. కాని వ్యభిచార అపనింద వేసినందుకు శిక్ష అనుభవించిన వ్యక్తుల సాక్ష్యంతో నికాహ్ చేసుకుంటే, అట్టి నికాహ్ సరైనదిగా పరిగణించబడుతుంది. ఒకవేళ ఇద్దరు బానిసల సాక్ష్యంతో నికాహ్ చేసుకుంటే, అది సరైనది కాదు. మరి ఈ ప్రభృతులే, వ్యభిచార అపనిందలో శిక్ష అనుభవించిన వారి సాక్ష్యాన్ని, బానిస స్త్రీ సాక్ష్యాన్ని రమజాన్ చంద్ర దర్శన వ్యవహారంలో సరైనదిగా ఖరారు చేశారు. వ్యభిచార అపనిందకు ఒడిగట్టిన వాని పశ్చాత్తాపం ఎలా తెలుస్తుంది? అన్న వివరణ ఈ అధ్యాయంలో ఉంది. ప్రవక్త మహనీయులైతే (సఅసం) వ్యభిచారిని ఒక ఏడాది కాలంపాటు నగర బహిష్కారం గావించారు. కాబ్ బిన్ మాలిక్ (రజి)తో, ఆయన సహవాసులిద్దరితో ఎవరూ మాట్లాడకండి అని కూడా ఆయన(సఅసం) ఆదేశించారు. యాభై రాత్రుల వరకు వారు అలాగే గడిపారు.[4]

---

8–1. దీని ఆధారంగా ఇమామ్ బుఖారీ (రహ్మ) చెప్పదలచిన ముఖ్య విషయం ఏమిటంటే 'ఖాజిఫ్' (ఒకరిపై వ్యభిచార అపనిందను మోపినవాడు) గనక పశ్చాత్తాపపడితే, భవిష్యత్తులో అతని సాక్ష్యం స్వీకారయోగ్యమవుతుంది. ఈ ఆయత్ ద్వారా వెల్లడయ్యే భావం కూడా యిదే. హనఫీ పంథాననుసరించే వారేమంటారంటే, పశ్చాత్తాపపడటం వల్ల అతను అవిధేయుడుగా ఉండడుగాని, అతని సాక్ష్యం మటుకు స్వీకార యోగ్యమవదు. మరి కొంతమంది ఏమంటారంటే, అతనికి కొరడా దెబ్బల శిక్ష

**12) ఉర్వా బిన్ జుబైర్ తెలియజేశారు : మక్కా విజయం సందర్భంగా ఒక స్త్రీ (ఫాతిమా బిన్తె అస్వద్) దొంగతనం చేసింది. ఆమెను దైవప్రవక్త(సఅసం) సమక్షంలో హాజరుపరచడం జరిగింది. ఆయన(స) ఆదేశాన్ననుసరించి ఆమె చేయి నరకబడింది. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : ఆమె నిష్కల్మషమైన పశ్చాత్తాపం చెందింది. తరువాత పెళ్ళి చేసుకుంది. ఆ తరువాత ఆమె ఎప్పుడొచ్చినా ఆమెకు ఏం కావాలో నేను దైవప్రవక్త(స)కు చెబుతుండే దానిని.**[1]

**13) జైద్ బిన్ ఖాలిద్ (రజి) కథనం : అవివాహితులై ఉండి, వ్యభిచారానికి పాల్పడిన వారికి నూరు కొరడా దెబ్బలు కొట్టి ఒక ఏడాది కాలంపాటు వారిని నగరం నుండి బహిష్కరించాలని దైవప్రవక్త(సఅసం) ఆజ్ఞాపించారు.**

## అధ్యాయం : 9

## అన్యాయం, దౌర్జన్యంతో కూడుకున్న వ్యవహారంపై సాక్ష్యమివ్వమని కోరితే తిరస్కరించాలి

---

విధించినట్లయితే, అప్పుడు అతని సాక్ష్యం అంగీకరించబడుతుంది. అన్యథా అంగీక రించబడదు.

8-2. ఇంతకీ ఏం జరిగిందంటే, ముగీరా బిన్ షూబా (రజి) కూఫా గవర్నర్‌గా ఉండేవారు. ఆయన ఉమ్మె జమీల్ అనే స్త్రీతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నారని ఈ ముగ్గురు వ్యక్తులు నింద మోపారు. కాగా; వారిద్దరూ ఒకే దుప్పట్లో ఉండగా తాను చూశానని, ముగీరా రొప్పుతూ ఉన్నట్లు తాను గమనించానని నాల్గవ సాక్షి జియాద్ చెప్పారు. అంతకు మించి తానేమీ చూడలేదని కూడా ఆయన సాక్ష్యమిచ్చారు. దీని ఆధారంగా హజ్రత్ ఉమర్(రజి) ఆ ముగ్గురికీ కొరడా దెబ్బల శిక్ష విధించారు.

8-3. ఈయన మదీనాలో ఆనాటి గొప్ప ధర్మవేత్తలలో ఒకరు.

8-4. దీని ఆధారంగా ఇమామ్ బుఖారీ (రహ్మ) చెప్పదలచిన ముఖ్య విషయం ఏమిటంటే తప్పు చేసిన వ్యక్తికి శిక్ష పడితే చాలు, అదే పశ్చాత్తాపం. ఎందుకంటే దైవప్రవక్త(స) కాబ్ బిన్ మాలిక్‌ను, ఆయన సహవాసులను శిక్షించిన మీదట, మళ్ళీ వేరుగా పశ్చాత్తాపం చేయించలేదు.

12-1. ఖురైషీలలోని మఖ్జూమ్ తెగకు చెందిన కులీన స్త్రీ ఆమె. ఆమె దైవప్రవక్త(స) ఇంటి నుండి ఒక దుప్పటిని దొంగిలించింది. ఇబ్ను మాజా ఉల్లేఖనంలో ఇలాగే ఉంది. ఇబ్నె సాద్ ఉల్లేఖనంలో ఆభరణం దొంగిలించినట్లు ఉంది. బహుశా రెండు వస్తువుల్నీ కూడా తస్కరించి ఉంటుంది. అయితే శిక్షను అనుభవించిన తరువాత ఆమె పట్ల సద్వ్యవహారం చేయడంలో దైవప్రవక్త(స) ఏ లోటూ రానివ్వలేదు.

**14)** నోమాన్ బిన్ బషీర్ (రజి) వివరించారు: నాకు ఏదైనా వస్తువును కానుకగా ఇవ్వమని మా అమ్మ మా నాన్న గారిని కోరింది. (మొదట ఆయన నిరాకరించారు. ఎందుకంటే రెండవ భార్య సంతానం కూడా ఉంది). ఎట్టకేలకు ఆయన ఒప్పుకుని నాకు ఒక వస్తువును కానుకగా ఇచ్చారు. అయితే మా అమ్మ అభ్యంతరం తెలుపుతూ, 'ఈ వ్యవహారంపై దైవప్రవక్త(స)ను సాక్షిగా పెట్టనంతవరకూ దీనికి అంగీకరించను' అంది. అందువల్ల మా నాన్నగారు నా చేయి పట్టుకుని దైవ ప్రవక్త(సఅసం) దగ్గరకు వెళ్ళారు. అప్పటికి నేను పిన్న వయస్కుణ్ణే. 'దైవప్రవక్తా! రవాహ కుమార్తె అయిన ఈ అబ్బాయి తల్లి ఇతనికి ఏదైనా వస్తువును కానుకగా ఇవ్వమని కోరుతోంది' అని మా నాన్న చెప్పారు. "ఇతనొక్కడే నీ పిల్లవాడా? లేక ఇంకా పిల్లలున్నారా?" అని దైవప్రవక్త(స) అడిగారు. 'ఉన్నారు' అని ఆయన చెప్పారు. "నీవు నన్ను అన్యాయంతో కూడిన వ్యవహారంపై సాక్షిగా పెట్టకు" అని దైవప్రవక్త(స) పలికారు. అబూ హరీజ్ గారు షాబీ నుండి నకలు చేసిన ఉల్లేఖనం ప్రకారం, "నేను దౌర్జన్యపూరితమైన వ్యవహారంపై సాక్షిగా ఉండను"[1] అని దైవ ప్రవక్త(స) పలికారు.

**15)** ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "మీలో అందరికన్నా ఉత్తములు నా కాలం వారై ఉంటారు (అంటే నా సహాబా). ఆపైన వారి తరువాతి వారై ఉంటారు (అంటే తాబయీన్). ఆపైన వారి తరువాతి వారై ఉంటారు (అంటే తబయె తాబయీన్)". దైవప్రవక్త(సఅసం) తన తరువాత రెండు కాలాల గురించి చెప్పారో లేక మూడు కాలాల గురించి చెప్పారో నాకు సరిగ్గా జ్ఞాపకం లేదని ఇమ్రాన్ వివరించారు– ఆ తరువాత దైవప్రవక్త(స) ఇలా వక్కాణించారు : "మీ తరువాత వచ్చేవారు దొంగలై ఉంటారు. వారిలో నిజాయితీ అన్నదే ఉండదు. సాక్ష్యం ఇవ్వమని వారిని ఎవరూ పిలవరు. కాని వారంతట వారే సాక్ష్యమిస్తూ తిరుగుతుంటారు. వారిలో ఊబకాయం సర్వసామాన్యమవుతుంది."[1]

---

14–1. వ్యవహారం న్యాయసమ్మతంగా లేదని సాక్షికి తెలిసినప్పుడు, అతను ఆ వ్యవహారానికి సాక్షిగా ఉండకూడదు. అన్యథా అతను కూడా ఆ అన్యాయంలో భాగస్థుడవుతాడు.

15–1. అంటే వారిలో దైవభీతి తగ్గిపోతుంది. సాక్ష్యాన్ని చాలా తేలికైన విషయంగా భావిస్తారు. అడగకపోయినా సాక్ష్యమివ్వడానికి ముందుకు వస్తుంటారు. పదేపదే ఒట్టేసుకుంటూ ఉంటారు. అధర్మ సంపాదన తింటూ ఉంటారు. తత్కారణంగా బాగా ఉబ్బిపోతారు.

**16) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "నా కాలం వారు అందరి కన్నా మంచివారు. ఆ తరువాత వారికి దగ్గరగా ఉన్నవారు. ఆ తరువాత వారికి దగ్గరగా ఉన్నవారు. ఆ తరువాత వచ్చే కాలంలో జనుల పరిస్థితి ఎలా ఉంటుందంటే, వారు ప్రమాణం చెయ్యకముందే సాక్ష్యమిస్తారు. సాక్ష్యానికి ముందే ఒట్టేసుకుంటూ ఉంటారు". ఇబ్రాహీమ్ నఖ్యీ(రహ్మ) ఇలా అన్నారు : "బాల్యంలో మేము 'సాక్ష్యం' 'ఒట్టు' లాంటి పదాలు పలికితే చాలు, మాకు మా పెద్దల తరపున దెబ్బలు పడేవి."[1]**

## అధ్యాయం : 10

## అబద్ధపు సాక్ష్యం పెద్ద పాపం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **"వారు (కరుణామయుని సిసలైన దాసులు) అబద్ధానికి సాక్షులుగా ఉండరు."** ***(అల్ ఫుర్ఖాన్ : 72)***

ఈ విధంగా కూడా సెలవీయబడింది: **"ఎట్టి పరిస్థితిలోనూ సాక్ష్యాన్ని దాచకండి. సాక్ష్యాన్ని దాచేవాడి హృదయం పాపభూయిష్టమైనది. మీరు చేసేవన్నీ అల్లాహ్‌కు తెలుసు."** ***(అల్ బఖరా – 283)***

**"ఒకవేళ మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే (తిరకాసుగా మాట్లాడితే), న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, అల్లాహ్‌కు మీరు చేసేదంతా తెలుసు అని."** ***(అన్ నిసా : 135)***

**17) మహనీయ అనస్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) వారిని పెద్దపెద్ద అపరాధాల గురించి ప్రశ్నించగా, "అల్లాహ్‌తోపాటు వేరొకరిని సహవర్తులుగా ఎంచటం, తల్లిదండ్రులను ఎదిరించటం, ఒకరి ప్రాణాన్ని (అన్యాయంగా) బలిగొనటం, అబద్ధపు సాక్ష్యమివ్వటం (మహాపరాధాలుగా పరిగణించబడతాయి)"[1] అని ఆయన(స) సమాధానమిచ్చారు.**

---

16–1. అంటే దైవసాక్షి, దేవుని తోడు వంటి మాటలు తమ నోట వెలువడగానే పెద్దలు దండించేవారు. చీటికిమాటికీ ఇలా ఒట్టేసుకోవడం మంచిది కాదని చెప్పేవారు. ఆ విధంగా వారు తమ చిన్నపిల్లల మనస్సులలో దైవభీతిని నాటేవారు.

17–1. పై హదీసులో పేర్కొనబడిన నాలుగు విషయాలు మాత్రమే పెద్ద పాపాలన్నది దీని అర్థం కాదు. పెద్దపెద్ద పాపాలు ఇంకా చాలా ఉన్నాయి. అబద్ధపు సాక్ష్యం కూడా పెద్ద

**18)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లుగా తన తండ్రి తనతో చెప్పారని అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బక్రా తెలిపారు : "అన్నిటికన్నా పెద్ద పాపాలేవో నేను మీకు చెప్పనా?" అని మహాప్రవక్త(స) పలికినప్పుడు, 'తప్పకుండా చెప్పండి దైవప్రవక్తా(స)' అని ప్రియసహచరులు బదులిచ్చారు. అప్పుడు ఆయన(స) ఇలా విశదపరిచారు : "అల్లాహ్‌కు భాగస్వామిగా ఎవరినయినా కల్పించటం, తల్లిదండ్రుల యెడల అవిధేయులుగా ప్రవర్తించడం." ఆ సమయంలో ఆయన(స) ఒరుగు దిండుకు ఆనుకుని కూర్చుని ఉన్నవారల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడి తిన్నగా కూర్చుని, "అబద్ధపు సాక్ష్యమివ్వటం కూడా (మహాపరాధమే)" అన్నారు. దైవప్రవక్త(స) ఈ వాక్యాన్ని మూడుసార్లు పలకటంతో, 'ఇక ఆయన(స) నిశ్శబ్దంగా ఉండిపోతే బాగుండు'నని మేము మా మనస్సులలో అనుకున్నాము.[1]

## అధ్యాయం : 11

## అంధుని సాక్ష్యం, అతని వ్యవహారాల గురించి వివరణ

అంధుడు నికాహ్ చేసుకోవటం, మరొకరి నికాహ్ చేయించటం, లేదా అతని క్రయ విక్రయాలు లేదా అతని అజాన్ పిలుపు మొదలగునవి. అంధుని నమాజ్ సారథ్యం, ఇఖామత్ పలుకులు సరైనట్లే అతని సాక్ష్యం కూడా ఈ వ్యవహారాలన్నింటిలో అతని కంఠ స్వరం ద్వారా అర్థం చేసుకోబడతాయి.

ఖాసిమ్, హసన్ బస్రీ, ఇబ్నె సీరీన్, జుహ్రీ, అతా ప్రభృతులు కూడా అంధుని

---

పాపాలలో ఒకటి. ఇమామ్ బుఖారీ ఈ అధ్యాయం క్రింద ఈ హదీసును పొందు పరచటంలోని అంతరార్థం ఇదే.

18–1. దైవప్రవక్త(సఅసం) పదేపదే ఉద్వేగంతో ఇలా పలకటం వల్ల ఆయన(స)కు ఇబ్బంది కలుగుతుందేమోనన్న ఉద్దేశంతో మేము అలా అనుకున్నాము. పండితులు పాప కార్యాలను చిన్న తరహా పాపాలు, పెద్ద తరహా పాపాలని రెండు తరగతులుగా విభజించారు. దానికి సంబంధించిన ఆధారాలను కూడా వారు ప్రస్తావించారు. మరికొంత మంది ప్రకారం 'చిన్న తరహా పాపాలు' అన్నవే లేవు. పాపాలన్నీ పెద్దవే. "అబద్ధపు సాక్ష్యమివ్వటం కూడా పెద్ద పాపాలలోనిదే" అని మహాప్రవక్త(స) మూడుసార్లు పలకటం గమనార్హ విషయం. అబద్ధపు సాక్ష్యం సమాజంలో ఎన్నో కలహాలకు, చెడుగులకు మూల కారణమవుతుంది. ముస్లిం అయినవాడు ఎట్టి పరిస్థితిలోనూ ఈ అపరాధానికి ఒడిగట్టరాదన్నదే దైవప్రవక్త(స) మనోరథం.

సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా భావించారు. ఎన్నో విషయాలలో అతని సాక్ష్యాన్ని సమ్మతంగా పరిగణించవచ్చని హకమ్ అభిప్రాయపడ్డారు. జుహ్రీ ఇలా అన్నారు: అది సరేగాని, మీరొక విషయం చెప్పండి- ఇబ్నె అబ్బాస్(రజి) గనక ఏదైనా వ్యవహారంలో సాక్ష్యం ఇస్తే దానిని మీరు కాదనగలరా? మరి ఇబ్నె అబ్బాస్(రజి)గారే (కంటిచూపు పోయినప్పుడు) సూర్యాస్తమయ సమయంలో ఒక వ్యక్తిని పంపేవారు (ఆ వ్యక్తి ఊరి బయటకు వెళ్ళి సూర్యాస్తమయం పూర్తిగా జరిగిందని నిర్ధారించుకుని వచ్చి చెప్పిన తరువాత) ఆయన ఉపవాస విరమణ చేసేవారు. అలాగే ఆయన ఉషోదయం గురించి కూడా విచారించేవారు. ఫజ్ర్ సమయం అయిందని తెలియజేసిన మీదట ఆయన(రజి) రెండు రకతుల సున్నత్ నమాజ్ చేసేవారు.

సులైమాన్ బిన్ యసార్ (రహ్మ) ఇలా అంటున్నారు: ఆయిషా(ర.అ) వద్దకు హాజరయ్యేందుకు నేను ఆమె గారి అనతిని కోరగా, ఆమె గారు నా కంఠస్వరాన్ని తెలుసుకుని, “సులైమాన్! లోపలికి రా. ఎందుకంటే నీవు బానిసవు. నీవు ముకాతబత్ (లిఖితపూర్వక ఒప్పందం) చేసుకున్నవాడివే అయినప్పటికీ ఆ బకాయిని పూర్తిగా చెల్లించనంతవరకూ నీవు బానిసవే” అన్నారు. సమురా బిన్ జుందబ్ (రజి) గారు ముఖంపై ముసుగు వేసుకున్న మహిళ సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా ఖరారు చేశారు.[1]

ఖుస్తులానీ ఇలా అన్నారు: మాలికీల ప్రకారం అంధుని సాక్ష్యం వాక్పరంగా, చెవిటివాని సాక్ష్యం క్రియాపరంగా సరైనదే. సాక్ష్యం కొరకు మనిషి కళ్ళున్నవాడై, వినగలిగేవాడై ఉండనవసరం లేదని మాలికీలంటారు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) గారి అసర్‌ను అబ్దుర్రజ్జాఖ్ వసల్ చేశారు. అంధుడు తన వ్యవహారాలలో మరో వ్యక్తిపై నమ్మకం ఉంచగలడని ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ ‘అసర్’ ఆధారంగా అభిప్రాయపడ్డారు.

సులైమాన్ బిన్ యసార్ హజ్రత్ ఆయిషా(ర.అ) గారి బానిస. బానిస ముందు పరదా పాటించాల్సిన అవసరం లేదని హజ్రత్ ఆయిషా భావించేవారు.

**19)** విశ్వాసుల మాతృశ్రీ హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) ఒక వ్యక్తి (అబ్దుల్లాహ్ బిన్ యజీద్) మస్జిద్‌లో ఖుర్ఆన్

---

11-1. పైన ప్రస్తావనకు వచ్చిన ‘ఆసార్’లలో ఖాసిమ్ గారి అసర్‌ను సయీద్ బిన్ మన్సూర్ వసల్ చేయగా; హసన్, ఇబ్నె సీరీన్, జుహ్రీ ప్రభృతుల అసర్‌ను ఇబ్నె అబీషైబా గారు, అతా యొక్క అసర్‌ను అస్రమ్ వసల్ చేశారు.

పారాయణం చేస్తూ ఉండగా విని, "అల్లాహ్ ఇతనిపై దయజూపుగాక! ఇతను ఈ పారాయణం ద్వారా నేను ఫలానా సూరాలో మరచిపోయిన ఫలానా ఫలానా ఆయత్ లను జ్ఞాపకం చేశాడు" అని ప్రశంసించారు. అబ్బాద్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) గారు హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖనాన్ని ఉటంకిస్తూ అదనంగా ఈ వాక్యాన్ని కూడా చేర్చారు– "ప్రవక్త మహనీయులు (స) నా కుటీరంలో నమాజ్ చేస్తూ ఉన్నారు. 'ఆయిషా! ఇది అబ్బాద్ బిన్ బిషర్ కంఠస్వరమేనా?' అని ఆయన(స) అడిగారు. దానికి నేను, 'అవున'న్నాను. అప్పుడు ఆయన(స), "అల్లాహ్ అబ్బాద్‌ను కరుణించు గాక!'[1] అని పలికారు.

**20)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు : "చూడండి! బిలాల్ (రజి) రాత్రి ఉండగానే అజాన్ ఇస్తూ ఉంటారు. కాని మీరు ఇబ్నె ఉమ్మె మక్తూమ్(రజి) అజాన్ ఇచ్చేవరకూ లేదా ఆయన అజాన్ పిలుపు మీకు వినబడేవరకూ అన్న పానీయాలు సేవిస్తూ ఉండండి". ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) అంధుడు. తెల్లవారుతోంది అని తోటి జనులు చెప్పనంతవరకూ ఆయన అజాన్ ఇచ్చేవారు కారు. [1]

**21)** మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) వివరించారు : దైవప్రవక్త(సఅసం) దగ్గరకు కొన్ని ప్రత్యేక అంగీలు (జుబ్బాలు) వచ్చాయి. అప్పుడు మా నాన్నగారు (మఖ్రమా– రజి), 'నా వెంట రా. దైవప్రవక్త(స) దగ్గరకు వెళదాం. బహుశా ఆయన(స) నాకూ ఒక జుబ్బాను ఇస్తారేమో!' అని నాతో చెప్పారు. మా నాన్నగారు (దైవప్రవక్త–సఅసం– ఇంటికి వెళ్లి) గుమ్మం వద్ద నిలబడి మాట్లాడసాగారు. దైవ ప్రవక్త(సఅసం) ఆయన కంఠస్వరం విని వెలుపలికి వచ్చారు. ఆ సమయంలో ఆయన(స) దగ్గర ఒక జుబ్బా ఉంది. ఆయన(స) ఆ అంగవస్త్రం ప్రత్యేకతలను

---

19–1. ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకురావటంలోని ముఖ్య ఉద్దేశం విదితమే– దైవప్రవక్త(సఅసం) అబ్దుల్లాహ్ బిన్ యజీద్‌ను గానీ, అబ్బాద్ బిన్ బిషర్‌నుగానీ చూడలేదు. కేవలం వారి కంఠస్వరం విని వారేనని ధ్రువపరిచారు. దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే గుడ్డివాడు కూడా మనిషి కంఠస్వరం విని, దాని ఆధారంగా సాక్ష్యం ఇవ్వగలడు.

20–1. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) అంధుడైనప్పటికీ ఆయన ఇచ్చిన అజాన్ (పిలుపు) ఆధారంగా ప్రజలు సహ్రీని ముగించేవారు. ఈ విధంగా ఈ హదీసు ఈ అధ్యాయానికి అనుగుణంగా ఉంది.

**వివరిస్తూ, "నేను దీనిని నీ కోసమే అట్టే పెట్టాను. నీకు ఇవ్వడానికి భద్రపరచి ఉంచాన"ని అన్నారు.**

## అధ్యాయం : 12

## స్త్రీల సాక్ష్యం గురించి

అల్లాహ్ అల్ బఖరా సూరాలో ఇలా సెలవిచ్చాడు: **"ఒకవేళ ఇద్దరు పురుషులు లభించని పక్షంలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండాలి."** ***(2: 282)***

**22) ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖించారు : ఆయన(స), "ఏమిటి, స్త్రీ సాక్ష్యం పురుషుని సాక్ష్యంలో సగ భాగానికి సమానం కాదా?" అని ప్రశ్నించగా, 'అవును, పురుషుని సగం సాక్ష్యానికి సమానం' అని మేము సమాధానమిచ్చాము. అప్పుడు ఆయన (స), "స్త్రీ బౌద్ధికంగా బలహీనురాలన్న దానికి ఇది తార్కాణం" [1] అని వక్కాణించారు.**

## అధ్యాయం : 13

## బానిసల, బానిస స్త్రీల సాక్ష్యం

**బానిస గనక న్యాయశీలుడై ఉంటే అతని సాక్ష్యం సమ్మతమేనని మహనీయ**

---

22-1. అందుకే అల్లాహ్ ఇద్దరు స్త్రీల సాక్ష్యాన్ని ఒక పురుషుని సాక్ష్యానికి సమానంగా ఖరారు చేశాడు. స్వతహాగా స్త్రీ పురుషునికన్నా బలహీనురాలనీ, ఆమె శారీరక, మానసిక శక్తి కూడా పురుషుని కన్నా తక్కువన్న విషయంలో విజ్ఞులంతా ఏకీభవించారు. ఒకవేళ ఏ స్త్రీ అయినా, ఎక్కడయినా అరుదుగా పురుషుని కంటే ఎక్కువ శక్తిమంతురాలై ఉంటే, ఈ అరుదైన సంఘటన ఆధారంగా ఆమె పురుషుని కన్నా బలోపేతమైనదని అనటం సరైనది కాదు. వ్యాయామం ద్వారా, క్రీడలు, కసరత్తుల ద్వారా స్త్రీ పురుషునిపై పైచేయి సాధిస్తుందని అంటే వారి ఈ వాదన తప్పు.

ఇమామ్ షాఫయి (రహ్మ) గారు తన తల్లికి ఎదురైన ఒక సంఘటనను ఉదహరించారు. ఆమె గారు మక్కా నగరంలోని న్యాయస్థానానికి ఒక మహిళామణితో కలసి వెళ్ళారు. అక్కడి న్యాయాధిపతి వారిని పరీక్షించే నిమిత్తం వారిద్దరినీ వేర్వేరుగా ఉంచాలనుకున్నాడు. కాని వెంటనే తేరుకుని, అలా చేయటం ధర్మసమ్మతం కాదన్నాడు. ఎందుకంటే, "వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేస్తుంది" (అల్ బఖరా: 282) అని అల్లాహ్ ఖుర్ఆన్‌లో సెలవిచ్చినట్లు చెప్పాడు. అలాంటప్పుడు వారిద్దరినీ వేర్వేరుగా ఉంచితే, తమ లక్ష్యం నెరవేరదని ఒప్పుకున్నాడు.

**అనస్(రజి) వక్కాణించారు. షురైహ్, ఔఫాలు కూడా దీనిని ధర్మసమ్మతంగా ఖరారు చేశారు. బానిస తన యజమాని పక్షాన సాక్ష్యం ఇవ్వకుండా ఉండే మాటైతే అతని సాక్ష్యం సమ్మతమేనని ఇబ్నె సీరీన్ చెప్పారు (ఎందుకంటే అతను తన యజమానికి అనుకూలంగా సాక్ష్యమిచ్చేందుకు ఆస్కారముంటుంది). హసన్, ఇబ్రాహీమ్‌లు సామాన్యమైన విషయాలలో బానిస సాక్ష్యానికి అనుమతి ఇచ్చారు. "మీలోని ప్రతి ఒక్కరూ బానిసల, బానిస స్త్రీల సంతానమే"[1] నని ఖాజీ షురైహ్ అన్నారు.**

**23) ఉఖబా బిన్ హారిస్ (రజి) చెప్పగా తాను విన్నానని ఇబ్నె అబీ ములైకా తెలిపారు : ఆయన (ఉఖబా) ఉమ్మె యహ్యా బిన్తె అబీ ఇహాబ్‌ను వివాహమాడారు. తరువాత ఒక నల్లని బానిస స్త్రీ వచ్చి, "నేను మీ ఇద్దరికీ నా పాలు త్రాపి ఉన్నాన"ని చెప్పింది. నేను ఈ విషయాన్ని దైవప్రవక్త(సఅసం) వద్ద ప్రస్తావించగా, ఆయన(స) నావైపు నుండి ముఖం త్రిప్పుకున్నారు. నేను మరోవైపు నుండి ఆయన(స) ముందుకు వచ్చి, మరోసారి ఇదే విషయాన్ని విన్నవించుకున్నాను. అప్పుడు ఆయన (స), "మీరిద్దరికీ తన పాలు ఇచ్చానని ఆ స్త్రీ చెబుతుండగా, ఇక మీ వివాహ బంధం ఎలా ధర్మసమ్మతమవుతుంది?" అని అన్నారు. అంటే; ఉమ్మె యహ్యాను నికాహ్‌లో ఉంచకూడదన్నది ఆయన(స) మాటల్లోని అంతరార్థం.[1]**

## అధ్యాయం : 14

## పాలిచ్చిన తల్లి సాక్ష్యం గురించి

**24) ఉఖ్బా బిన్ హారిస్(రజి) కథనం: నేను ఒక మహిళను నికాహ్ చేసుకున్నాను. తరువాత ఒక స్త్రీ వచ్చి, 'నేను మీ ఇద్దరికీ నా పాలు త్రాపి ఉన్నాన'ని చెప్పింది. అందువల్ల నేను ప్రవక్త మహనీయుల (సఅసం) వారి సన్నిధిలో హాజరై**

---

13-1. షురైహ్ పలుకుల్లోని ఆంతర్యం ఏమిటంటే ఏ కుటుంబీకుల్లోనయినా ఎవరో ఒకరు, ఎప్పుడో ఒకప్పుడు బానిసలుగా బ్రతికినవారే. మరొక అర్థంలో తీసుకుంటే మీరంతా అల్లాహ్ దాసులే, దాసీలే. కాబట్టి ఎవరూ మరొకరిపై గర్వాహంకారాన్ని ప్రదర్శించటం ధర్మసమ్మతం కాదు. ఇమామ్ అహ్మద్ (రహ్మ) గారేమంటారంటే బానిస అయినా, బానిస స్త్రీ అయినా న్యాయశీలురు, నమ్మకస్తులైనప్పుడు వారి సాక్ష్యం స్వీకారయోగ్యమే. అయితే మిగిలిన ముగ్గురు ఇమాములు దీనిని సమ్మతంగా భావించలేదు.

23-1. అంటే, ఒక బానిస స్త్రీ ఇచ్చిన 'సాక్ష్యం' ఆధారంగా దైవప్రవక్త(స) ఉఖబా బిన్ హారిస్-ఉమ్మె యహ్యాల మధ్య వేర్పాటు చేయించారు. దీనినిబట్టి బానిసల సాక్ష్యాధారం ఎన్నదగినదేనని విదితమవుతోంది.

**జరిగినదంతా చెప్పుకున్నాను, దానికాయన(స), "(ఒకే స్త్రీ మీ భార్యాభర్తలిరువురికీ పాలిచ్చిన) విషయం స్పష్టపరచిన తరువాత మిగిలిన మార్గం ఏముంటుంది? కాబట్టి నీ భార్యను నీ నుండి వేరుపరచు" అని బోధించారు. లేదా అలాంటివే వేరే వాక్యాలు పలికారు.**

## అధ్యాయం : 15

## ఇఫ్క్ (అపనింద) సంఘటన

## స్త్రీలు పరస్పరం ఒండొకరిలోని మంచిని గురించి సాక్ష్యమివ్వటం

**25)** దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (ర.అ) గారు తనపై అభాండం మోపినవారు అభాండం మోపినప్పటి సంఘటన[1]ను వివరించారు. అయితే అల్లాహ్ స్వయంగా ఆమె గారిని ఆ అభాండం విషయంలో నిర్దోషిగా ప్రకటించాడు. జుహ్రీ ఇలా అన్నారు: ఈ హదీసుకు సంబంధించినంతవరకు ఉల్లేఖకులందరిలో ప్రతి ఒక్కరి ఉల్లేఖనం రెండవ దానిని ధ్రువపరిచేదిగా ఉంది. ఉల్లేఖకుల ప్రకారం హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : దైవప్రవక్త(సఅసం) ఏదయినా ప్రయాణానికి బయలుదేరాలని సంకల్పించుకున్నప్పుడల్లా తమ భార్యల మధ్య చీటీలు వేసేవారు. ఎవరి పేరు వస్తే వారినే ప్రయాణంలో తమ వెంట తీసు కెళ్ళేవారు. ఒక యుద్ధ (బనీ ముస్తలఖ్) సందర్భంగా చీటీలు వేసినప్పుడు, నా పేరు వచ్చింది. పరదా ఆజ్ఞ (ఆయత్) అవతరించిన తరువాత జరిగిన సంఘటన ఇది. నేను హౌదజ్ (ఒంటెపై స్త్రీలు కూర్చునే తొట్లు)లోనే ఉండి స్వారీ అయ్యేదానిని. నేను ఆ తొట్లలో కూర్చుని ఉన్న స్థితిలోనే నన్ను దించటం జరిగేది. ప్రయాణమంతా ఇలాగే సాగింది. దైవప్రవక్త(సఅసం) తన యాత్రను ముగించుకుని తిరిగి వస్తు న్నారు. మదీనా నగరం మరికొంత దూరాన ఉండగా– రాత్రివేళ మజిలీ చేసిన చోటు నుండి బయలుదేరమని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఈ ఆదేశాన్ని వినగానే

---

25–1. ఇస్లామీయ చరిత్రలో ఇది 'ఇఫ్క్ సంఘటన'గా ప్రసిద్ధికెక్కింది. అంటే అతిపెద్ద అభాండం లేదా అపనింద అని అర్థం. పైగా ఈ అపనింద ఎవరిపైన? సాక్షాత్తూ దైవప్రవక్త(స) సతీమణి, విశ్వాసుల మాతృశ్రీ హజ్రత్ ఆయిషా(ర.అ)పైన! ఈ సంఘటనకు సమాధానంగా అల్లాహ్ నూర్ సూరాలోని ఆయత్‌లను అవతరింపజేసి, అమ్మ ఆయిషా (ర.అ) సౌశీల్యాన్ని, నిర్దోషిత్వాన్ని ప్రకటించాడు. అంతేకాదు, హదీసువేత్తలు, ధర్మవేత్తలు ఈ సంఘటన ఆధారంగా అనేక ధార్మిక నియమ నిబంధనలను సంగ్రహించారు.

నేను లేచి సైనికుల విడిది స్థలం నుండి కొంత దూరం వెళ్ళిపోయాను. కాలకృత్యాలు తీర్చుకున్న మీదట నేను బయలుదేరవలసిన చోటికి వచ్చాను. తీరా నేను వచ్చి నా మెడ దగ్గర చేయి పెట్టేసరికి, నా రత్నాల కంఠహారం కనిపించలేదు. అందువల్ల నేను మళ్లీ కాలకృత్యాలు తీర్చుకున్న చోటికే తిరిగి వెళ్ళాను. ఈ లోగా నా హౌదజ్ (ఒంటె మీది తొట్ల)ను ఒంటెపై పెట్టేవారు వచ్చి దానిని ఎత్తుకెళ్ళి ఒంటెపై పెట్టే శారు. నేను ఆ హౌదజ్‌లో కూర్చుని ఉన్నానని వారు భావించారు. ఆ రోజుల్లో మా ఆడవాళ్ళు చాలా తేలికగా ఉండేవారు. లావుగా ఉండేవారు కాదు. వారి శరీరాలపై మాంసం చాలా తక్కువగా ఉండేది. ఎందుకంటే వారు అల్పాహారం తినేవారు. అందువల్ల వారు నా హౌదజ్ ఎత్తినప్పుడు, దాని బరువు గురించి పెద్దగా పట్టించు కోలేదు. ఎందుకంటే నేను ఆ రోజుల్లో పిన్న వయస్కురాలిని. చాలా తక్కువ బరువు ఉండే దానిని. అందువల్ల వారు నా ఒంటెను తోలుకుని వెళ్ళిపోయారు. ప్రయాణ బృందం బయలుదేరిన తరువాత నా కంఠహారం దొరికింది. నేను విడిది స్థలానికి వచ్చేసరికి అక్కడ ఎవరూ లేరు. అందుచేత నేను విశ్రాంతి తీసుకున్న స్థలం వద్దకు వచ్చి కూర్చున్నాను. నేను 'హౌదజ్'లో లేనన్న సంగతి తెలుసుకుని వారు తిరిగి వస్తారని తలపోశాను. నేను కూర్చున్న స్థలంలోనే నాకు నిద్రపట్టింది. సఫ్వాన్ బిన్ ముఅత్తల్ సులమీ(రజి) అటు వైపుగా వచ్చారు. సైనికులు మరచిపోయిన వస్తువులు వెనుక నుంచి ఎత్తుకుని వచ్చి, వాటి యజమానులకు అప్పగించే బాధ్యతపై ఆయన నియమించబడ్డారు. విడిది స్థలంలో ఒక మనిషి నిద్రిస్తున్నట్లు కనిపించగానే ఆయన దగ్గరకు వచ్చారు. పరదా ఆజ్ఞలు రాకముందు ఆయన నన్ను చూసి ఉన్నారు. నిద్రలో ఉన్న నన్ను చూడగానే 'ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్' అని బిగ్గరగా పలికారు. నాకు మెలకువ వచ్చింది. ఆయన తన ఒంటెను కూర్చోబెట్టి, దాని ముంగాలును మడత పెట్టారు. (నేను ఇతరుల సహాయం లేకుండానే స్వయంగా ఒంటెపైకెక్కి కూర్చోవడానికి గాను ఆయన అలా చేశారు). నేను ఒంటెపై స్వారీ అయ్యాను. ఆయన ఒంటె పగ్గాలు పట్టుకుని ముందుండి నడవసాగారు. మేము మా సైనిక దళాన్ని సమీపించేసరికి, మండుటెండలో జనులు విశ్రాంతి కొరకు విడిది చేశారు (జరిగింది మాత్రం ఇంతే. దీని ఆధారంగా) నాశనం కావలసినవారు నాశనమయ్యారు. ఈ అపనింద వ్యవహారంలో కీలకపాత్ర పోషిం చినవాడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై (అతను మునాఫిక్). తరువాత మేము మదీనా చేరుకున్నాము. నేను ఒక నెల రోజుల వరకూ అస్వస్థతకు గురయ్యాను. ఈలోగా

అపనింద మోపినవారి మాటలు ఊపందుకున్నాయి. నాకు జబ్బు చేసినప్పుడు దైవ ప్రవక్త(స) నన్ను ప్రత్యేకంగా కనిపెట్టుకుని ఉండేవారు. కాని ఈసారి ఆయన (స) గారి ప్రేమానురాగాలు నాకు కరువయ్యాయి. ఆయన(స) ఇంట్లోకి వచ్చినప్పుడు సలామ్ చేసేవారు. ఆరోగ్యం ఎలా ఉంది? అని మాత్రం అడిగేవారు. అపనింద మోపినవారు వ్యాపింపజేసే వదంతుల గురించి అసలు నాకేమీ తెలీదు. నా ఆరోగ్యం కాస్త కుదుటపడిన తరువాత నేను ఒకరోజు (రాత్రివేళ) ఉమ్మె మిస్తహ్ వెంట మనాసియ వైపు నడిచి వెళ్ళాను. అది మేము కాలకృత్యాలు తీర్చుకునే బహిర్ భూమి. రాత్రివేళ మాత్రమే మేము అక్కడికి వెళ్ళేవారం. ఆ కాలంలో మా ఇండ్లకు సమీపంలో మరుగుదొడ్లు ఉండేవి కావు. (కాలకృత్యాలు తీర్చుకోవడానికి) మేము బహిర్ భూమి వెళ్ళే తీరు ప్రాచీన అరబ్బు సంప్రదాయం ప్రకారమే ఉండేది. నేనూ, ఉమ్మె మిస్తహ్ బిన్తె అబీ రుహ్మ్ అలా బహిర్ ప్రదేశానికి నడిచి వెళుతుండగా ఆమె కాలు దుప్పటిలో చిక్కుకుని క్రింద పడిపోయింది. ఆ క్షణంలో అప్రయత్నంగా ఆమె నోట, "మిస్తహ్ నాశనమవ్వ" అనే మాట వెలువడింది. దానికి నేను, "అయ్యో! నీ నోట ఇలాంటి చెడ్డ మాట వచ్చిందేమిటి? బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న ఒక సహాబీ (పైగా ఆయన నీ కుమారుడు) గురించి నోరు జారావేమిటి?" అన్నాను. "అయ్యో పిచ్చి పిల్లా! నీ గురించి వాళ్ళు చెప్పుకుంటున్నదేమిటో నీవు వినలేదా?" అని ఆమె ప్రశ్నించింది. తరువాత ఆమె, అపనింద మోపినవారు చెప్పే మాటలన్నింటినీ ఏకరువు పెట్టింది. ఆ మాటలు విన్న మీదట నా ఆరోగ్యం మరింతగా క్షీణించింది. నేను ఇంటికి తిరిగి వచ్చిన కొద్దిసేపటికే దైవప్రవక్త(స) కూడా లోపలికి విచ్చేశారు. "ఆరోగ్యం ఎలా ఉంది?" అని క్లుప్తంగా అడిగారు. 'నా తల్లిదండ్రుల దగ్గరకెళ్ళాలనుకుంటున్నాను. అనుమతి ఇవ్వండి' అన్నాను. తల్లిదండ్రుల దగ్గరకెళ్ళి ఈ సంఘటన గురించి ఆరా తీయాలని నాకనిపించింది. దైవప్రవక్త(స) నాకు అనుమతి ప్రదానం చేశారు. నేను నా పుట్టింటికి రాగానే ఈ నీలాపనిందల గురించి నా తల్లి (ఉమ్మె రూమాన్)ని అడిగాను. దానికి మా అమ్మ "అమ్మాయ్! ఈ అవాకులు చెవాకుల గురించి పట్టించుకోకు. దైవసాక్షి! నీలాంటి అందగత్తె ఒక పురుషుని ఇంట భార్యగా ఉండగా, పైగా ఆమెకు సవతులు కూడా ఉండగా, ఇలాంటి మాటల్ని వ్యాపింపజేయకుండా ఉండటమన్నది జరుగదు" అని సముదాయించబోయింది. "సుబ్హానల్లా! (సవతులను అని ఏం లాభం?) ఈ వదంతుల్ని వ్యాపింపజేసేవారు వేరేవారు కదా!" అన్నాను. ఆ రాత్రి నేను అక్కడే గడిపాను.

**తెల్లవారే వరకూ నా కన్నీళ్ళు ఆగలేదు. నిద్రపట్టలేదు. తెల్లవారిన తరువాత దైవప్రవక్త(సఅసం) తన భార్యకు విడాకులిచ్చే విషయమై సంప్రతించడానికి అలీ బిన్ అబీ తాలిబ్(రజి)ను, ఉసామా బిన్ జైద్(రజి)ను పిలిపించారు. ఎందుకంటే ఈ వ్యవహారంపై ఆనాటి వరకూ 'వహీ' (దైవవాణి) అవతరించలేదు. దైవప్రవక్త(స) తన భార్యలను ఎంతగా ప్రేమిస్తారో ఉసామా (రజి)కు తెలుసు. అందువల్ల ఆయన తదనుగుణంగానే సలహా ఇచ్చారు. ఉసామా ఇలా అన్నారు : 'మీ సతీమణి గురించి చెప్పమంటున్నారా దైవప్రవక్తా! మాకు ఆమె గురించి మంచి తప్ప మరొకటి తెలియదు'. హజ్రత్ అలీ (రజి) ఇలా అన్నారు- 'దైవప్రవక్తా! అల్లాహ్ మీపై ఎలాంటి ఇబ్బంది (ఆంక్ష)నీ ఉంచలేదు. ఆమె కాకపోతే చాలా మంది స్త్రీలు ఉన్నారు. బానిస స్త్రీని కూడా మీరు విచారించండి. నిజమేమిటో ఆమె మీకు చెబుతుంది'. అందువల్ల దైవప్రవక్త(సఅసం) బరీరా (ర.అ)ను పిలిపించారు. (బరీరా హజ్రత్ ఆయిషా-ర.జి గారి ప్రత్యేక సేవకురాలు). "బరీరా! ఒక విషయం చెప్పు. ఆయిషా(ర.అ) శీలాన్ని శంకించే వస్తువు ఏదయినా నీవు ఆమెలో గమనించావా?" అని అడిగినప్పుడు, ఆమె ఇలా సమాధానమిచ్చింది: 'మిమ్మల్ని సత్యం ఇచ్చి ప్రభవింపజేసిన వాని సాక్షిగా చెబుతున్నాను. నేను ఆమెలో లోపాన్ని ఎంచే విషయమేదీ చూడలేదు. కాకపోతే చిన్నపిల్ల. పిండి నానబెట్టి నిద్రలోకి జారుకుంటుంది. అంతలో మేక వచ్చి ఆ పిండి తినేసిపోతుంది. అంతే[2]. దైవప్రవక్త(సఅసం) ఆ రోజు (వేదికపై) నిలబడి, అబ్దుల్లాహ్ బిన్ ఉబై విషయంలో తనకు సహాయం చేయమని కోరారు- "ఏ వ్యక్తి వేధింపులు, ఆగడాల పరంపర ఇప్పుడు నా సతీమణి వరకూ చేరిందో అతని వ్యవహారంలో నాకు తోడ్పడే వారెవరు? అల్లాహ్ సాక్షి! నా భార్యలో మంచి తప్ప మరొకటేదీ నాకు తెలీదు. అదీగాక ఈ రొంపిలోకి అతను ఎలాంటి వ్యక్తిని లాగాడంటే, అతను సౌశీల్యానికి ప్రతిరూపం. ఆ వ్యక్తిలో నేను మంచి తప్ప మరొకటి ఏదీ చూడలేదు" అన్నారు. (ఇది విని) సాద్ బిన్ ముఆజ్(రజి) లేచి నిలబడి, 'దైవ ప్రవక్తా! దైవసాక్షిగా! ఈ వ్యవహారంలో నేను మీకు సహాయకునిగా ఉన్నాను. ఒకవేళ**

---

25-2. హజ్రత్ బరీరా (ర.అ) ఒక బానిస స్త్రీ అయి వుండి కూడా, యజమానురాలి క్యారెక్టర్ గురించి అడిగినప్పుడు ఆమె ఎంతో విజ్ఞతతో కూడుకున్న సమాధానం ఇచ్చింది. ఒకవైపు ఆయిషా(ర.అ)లోని సౌశీల్యాన్ని గురించి సాక్ష్యమిస్తూనే, దైనందిన పనులలో ఆమె వల్ల జరిగే అశ్రద్ధ గురించి కూడా ప్రస్తావించింది. చిన్న పిల్ల అయినందున ఇంటి పనుల విషయంలో తగు శ్రద్ధ చూపటం లేదని చెప్పింది.

ఆ వ్యక్తి (అభాండం మోపినవాడు) ఔస్ తెగకు చెందినవాడై ఉంటే, మేము అతని మెడ నరికివేస్తాము (ఎందుకంటే సాద్ ఔస్ తెగ నాయకుడు). ఒకవేళ అతను ఖజ్రజ్ తెగకు చెందినవాడై ఉంటే, మేం ఏం చేయాలో తమరు ఆజ్ఞాపించండి. మీరు చెప్పినట్లే చేస్తాము'. ఈ మాట వినగానే ఖజ్రజ్ తెగ నాయకుడైన సాద్ బిన్ ఉబాదా (రజి) లేచి నిలబడ్డారు. నిజానికి ఆయన చాలా మంచివారు. కాని ఆ క్షణంలో (సాద్ బిన్ ముఆజ్ నోట వెలువడిన మాట వినగానే) ఒక్క సారిగా ఆయనలోని– అజ్ఞాన కాలంనాటి– పౌరుషం పురి విప్పింది. ఆగ్రహావేశంతో (సాద్ బిన్ ముఆజ్‌ని ఉద్దేశించి) 'ఎప్పటికీ మిగిలి ఉండే ప్రభువు సాక్షిగా! నీవు కేవలం బొంకుతున్నావు. నీవు అతన్ని చంపలేవు. అది నీ వల్ల అయ్యే పని కూడా కాదు'[3] అన్నారు. అంతలో (సాద్ బిన్ ముఆజ్– రజి– బాబాయి కొడుకు) ఉసైద్ బిన్ హుజైర్(రజి) చివాలున లేచి, 'దైవసాక్షి! మేమతన్ని చంపి తీరుతాము. నీవు కూడా కపటివే. ఎందుకంటే నువ్వు కపటుల తరపున వకాల్తా పుచ్చుకుంటున్నావు' అని చెప్పారు. అంతే. మాటా మాటా పెరిగింది. ఔస్– ఖజ్రజ్ తెగలకు చెందిన వారంతా నిలబడి పరస్పరం తలపడే పరిస్థితి ఏర్పడింది. వేదికపైనుండి ఇదంతా గమనిస్తున్న దైవప్రవక్త(సఅసం) వేదిక దిగివచ్చి అందరినీ శాంతపరిచారు. అందరూ మౌనం వహించారు. దైవప్రవక్త(సఅసం) కూడా నిశ్శబ్దంగా ఉండిపోయారు. నేను ఆ రోజు కూడా అదే పనిగా ఏడ్చాను. నా కన్నీటి ప్రవాహం ఆగలేదు. నిద్ర కూడా పట్టలేదు. అంతలో మా అమ్మానాన్నలు నా దగ్గరకు వచ్చారు. ఒక పగలు ఒక రాత్రి నిరాఘాటంగా ఏడుస్తూ గడిపాను. అలా ఏడ్చి ఏడ్చి నా హృదయం ముక్కచెక్కలయి పోతుందేమోననిపించింది. నా తల్లిదండ్రులు నా దగ్గర కూర్చుని ఉండగానే ఒక అన్సార్ మహిళ లోనికి వచ్చేందుకు అనుమతి కోరింది. నేనామెకు అనుమతి ఇచ్చాను. ఆమె కూడా నాతోపాటే కూర్చుని దుఃఖంతో విలపించసాగింది. మేము ఆ స్థితిలో ఉండగానే దైవప్రవక్త(సఅసం) లోనికి వచ్చి కూర్చున్నారు. ఏ రోజు నుంచి నా గురించి ఎన్నడూ చెప్పుకోని మాటలు చెప్పుకుంటున్నారో, ఆ రోజు నుంచి ఆయన(స) నా దగ్గర కూర్చోవటం అదే మొదటిసారి. ఆయన (స) నెలరోజుల వరకూ నిరీక్షించారు. కాని ఈ వ్యవహారంలో ఆయన(స)పై దైవవాణి

---

25–3. సాద్ బిన్ ఉబాదా (రజి)లోని చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరు. కాకపోతే ఆ క్షణంలో ఆయన అపోహకు గురయ్యారు. అజ్ఞాన కాలం నాటి వర్గ తెగల దురభిమానం ఆయనలో ఒక్కసారిగా జాగృతం అయింది.

(వహీ) అవతరించలేదు. ఆయిషా ఇలా అంటున్నారు: ఆయన(సఅసం) 'తషహ్హుద్' పఠించిన మీదట ఇలా అన్నారు: "ఆయిషా! నీ గురించి నేను ఈ మాటలు విన్నాను. నీవు గనక ఈ వ్యవహారంలో నిర్దోషివి అయివుంటే అల్లాహ్ కూడా నీ నిర్దోషిత్వాన్ని తప్పక బహిర్గతం చేస్తాడు. ఒకవేళ నీవు గనక తప్పు చేసి వుంటే, క్షమాపణకై అల్లాహ్‌ను అర్థించు. ఆయన సన్నిధిలో పశ్చాత్తాపపడు. దాసుడు తప్పు చేసిన మీదట, తప్పును ఒప్పుకుని పశ్చాత్తాపపడితే, అల్లాహ్ కూడా అతని పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడు." ఆయన (సఅసం) తన సంభాషణను ముగించిన తరువాత నా కళ్ళల్లోని కన్నీరు కూడా పూర్తిగా ఇంకిపోయింది. ఒక్క చుక్క కన్నీరు కూడా రాదనిపించింది. 'నా గురించి దైవప్రవక్త(స)కు మీరైనా చెప్పండి' అని మా నాన్న గారితో అన్నాను. కాని ఆయన ఇలా అన్నారు: 'అల్లాహ్ తోడు! ఇప్పుడు నేను దైవప్రవక్త(స)కు ఏం చెప్పాలో అర్థం కావటంలేదు.' 'అమ్మా! కనీసం నువ్వయినా దైవప్రవక్త(సఅసం) మాటలకు సమాధానం ఇవ్వు' అని ప్రాధేయపడ్డాను. కాని అమ్మ కూడా అదే మాట అంది– 'దైవసాక్షి! దైవప్రవక్త(స)కు ఏం చెప్పాలో నాకు తోచటం లేదు' అని. అప్పటికి నేను టీనేజీలోనే ఉన్నాను. నాకు ఖుర్‌ఆన్ ఎక్కువగా కంఠస్థం అవలేదు. నేనిలా అన్నాను : 'అల్లాహ్ సాక్షి! మీరు కూడా జనుల ద్వారా వ్యాపింపజేయబడిన వదంతుల్ని విని వాటిని ధ్రువపరుస్తున్నారని నాకనిపిస్తోంది. ఒకవేళ ఈ సమయంలో నేను ఏ పాపం ఎరుగని నిర్దోషినని, ఈ అపవాదుతో నాకెలాంటి సంబంధంలేదని నేను చెప్పినా–నేను నిర్దోషినన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు– మీరు నా మాటను నమ్మరు. కాని నేను గనక ఈ వ్యవహారానికి (పాపానికి) నేనే బాధ్యురాలినని అంటే మాత్రం– నేనేపాపం ఎరుగనన్న సంగతి అల్లాహ్ ఎరుగు– మీరంతా దానిని ధ్రువపరుస్తారు. అల్లాహ్ సాక్షి! నేను ఈ సమయంలో నా ఉపమానాన్ని, మీ ఉపమానాన్ని హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) తండ్రి (యాఖూబ్– అలైహిస్సలాం) ఉపమానంలా భావిస్తున్నాను.[4] ఆ సమయంలో ఆయన, "సరే ఓపిక పడతాను. ఉత్తమ రీతిలో ఓపిక పడతాను. మీరు కల్పిస్తున్న మాటలపై సహాయం కొరకు అల్లాహ్‌నే అర్థించాలి" (యూసుఫ్– 18)

---

25–4. అమ్మ ఆయిషా(ర.అ) అప్పటికి పిన్న వయస్కురాలే. అయితేనేమి, ఆమె సమయోచితంగా స్పందించారు. ఔచితీ విజ్ఞతలు ఉట్టిపడేలా సమాధానమిచ్చి, పాండిత్యంలో తాను ఎవరికీ తీసిపోనని నిరూపించుకున్నారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న దానికి ఇది తార్కారణం.

అని వేడుకున్నారు. ఆ తరువాత నేను పడకపై మరో వైపునకు తిరిగి పడుకున్నాను. అల్లాహ్ స్వయంగా నా నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తాడన్న ఆశ నాకుండేది. అయితే నా వ్యవహారంలో అల్లాహ్ 'వహీ' (దైవవాణిని, ఖుర్ఆన్ ఆయత్‌లను) అవతరింపజేస్తాడని మాత్రం నేను ఊహించలేదు. నా దృష్టిలో, నా వ్యవహారం ఖుర్ఆన్‌లో ఆదేశం అవతరించదగినంత కీలకమైనది కాదు. కాకపోతే దైవప్రవక్త(సఅసం) కలగంటారనీ, ఆ కలలో అల్లాహ్ ఆయన(స)కు వాస్తవం తెలియజేసి, నన్ను నిర్దోషిగా తెలియజేస్తాడని మాత్రం తలపోశాను. దైవసాక్షి! ఆయన(స) తన చోటినుండి లేవకముందే, ఆ సమయంలో ఇంట్లో ఉన్నవారు బయటికి వెళ్ళకముందే ఆయన(స)పై 'వహీ' అవతరించింది. వహీ అవతరించినప్పుడు (తీవ్రమైన ఒత్తిడి వల్ల) ఆయన(స)కు చెమటలు పట్టేవి. ఈసారి కూడా అదే పరిస్థితికి ఆయన(స) లోనయ్యారు. చెమట బిందువులు ముత్యాల్లా ఆయన(స) పవిత్ర మేను నుండి రాలసాగాయి. నిజానికి అది చలికాలం. వహీ అవతరణ పూర్తవగానే ఆయన చిరు మందహాసం చేశారు. ఆ క్షణంలో ఆయన(స) నోట వెలువడిన మొదటి మాట, "ఆయిషా! అల్లాహ్‌ను స్తుతించు. ఆయన నిన్ను నిర్దోషిగా ఖరారు చేశాడు." ఈ మాట వినగానే, 'అమ్మాయ్! వెళ్ళు. వెళ్ళి దైవప్రవక్త(స) ఎదుట నిలబడు' అని మా అమ్మ చెప్పింది. దానికి నేను, 'లేదు, దైవసాక్షిగా! నేను ఆయన ముందు నిలబడను. నేను కేవలం దైవస్తోత్రం చేస్తాను. దైవానికే కృతజ్ఞతలు తెలుపుకుంటాన'ని[5] అన్నాను. అల్లాహ్ అవతరింపజేసిన ఆయత్ ఇది: "ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గంవారే..." (అన్ నూర్-11). అల్లాహ్ నా నిర్దోషిత్వాన్ని చాటుతూ ఈ ఆయత్‌ను అవతరింపజేసినప్పుడు అబూబకర్(రజి) గారికి మిస్తహ్ బిన్ ఉసాసా (రజి)పై చాలా కోపం వచ్చింది. అప్పటివరకూ ఆయన బంధుత్వ అనురాగంతో మిస్తాహ్ కుటుంబ పోషణా బాధ్యతను వహించేవారు. కాని యదార్థం తేటతెల్లమైన తరువాత, 'ఇక మీదట నేను మిస్తాహ్‌కు చిల్లిగవ్వ కూడా ఇవ్వను. ఎందుకంటే అతను (నా కన్న

---

25-5. ఇది కూడా ఆమెలోని స్వాభిమానానికి, ధార్మికతకు ప్రతిబింబిమే. ఏ తప్పూ చేయని మాననీమణికి ఆ క్షణంలో ఒక వైపు పౌరుషం పెల్లుబకటం, మరోవైపున దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో అంతరాళం ఆనందాతిశయంతో ఉవ్విళ్ళూరటం సహజం. ఆ క్షణంలో ఆమె కేవలం ఒక ప్రవక్త అనుయాయి మాత్రమే కాదు, ఒక భర్తకు భార్య కూడా అన్న సంగతిని మరువరాదు.

కూతురు) ఆయిషా(ర.అ)పై అభాండం మోపినవారిలో ఒకడు' అని ఆయన ఒట్టేసుకున్నారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: "మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో వలస వచ్చిన ప్రజలకూ సహాయం చేయబోమని ప్రమాణం చేయరాదు. వారిని క్షమించాలి. వారి (తప్పుల)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే ఆయన క్షమించేవాడు, కరుణించే వాడూను." (అన్ నూర్: 22). అంతే. అబూబక్ర్(రజి) వెంటనే రుజువర్తనులై 'దైవసాక్షి! అల్లాహ్ నన్ను క్షమించాలన్నదే నా ఆకాంక్ష' [6] అన్నారు. లోగడ మిస్తాహ్ (రజి)కు ఇచ్చే పోషణా ఖర్చుల్ని తిరిగి ఇవ్వసాగారు. దైవప్రవక్త(స) జైనబ్ బిన్తె జహష్ (ర.అ)ను కూడా నా గురించి విచారణ జరిపారు. "జైనబ్ (ర.అ)! (ఆయిషా గురించి) నీకేం తెలుసు?" అని ఆయన(స) ప్రశ్నించినప్పుడు, 'నేను నా కళ్ళు, చెవుల విషయంలో చాలా జాగ్రత్త వహిస్తాను. (నేను ఆమెగారి విషయంలో చూసింది, విన్నది మాత్రమే చెబుతాను). దైవసాక్షి! నేను ఆమెలో మంచి తప్ప మరేదీ చూడలేదు' అని ఆమె జవాబిచ్చింది. మరి చూడబోతే దైవప్రవక్త(స) సతీమణులలో నాకు సమ ఉజ్జీగా ఉన్నది ఆమె ఒక్కతే. అయితే భయభక్తుల కారణంగా అల్లాహ్ ఆమెను కాపాడుకున్నాడు. [7]

## అధ్యాయం : 16

## ఒక పురుషుడు మరో పురుషుణ్ణి మంచివాడని అంటే చాలు

**అబూ జమీలా ఇలా అంటున్నారు : ఒక పసిపిల్లవాడు దారిలో పడిఉన్నట్లు**

---

25–6. మహనీయ అబూబకర్(రజి)లోని మంచితనానికి, ఉపకార భావానికి ఇదొక మచ్చుతునక మాత్రమే. కన్న కూతురిపై అభాండం మోపిన వారితో కుమ్మక్కు అయ్యాడన్న సాకుతో ఆయన జీవితాంతం మిస్తాహ్ పట్ల సద్వ్యవహారం చేయటం మానుకోలేదు. పైగా దైవాదేశానికి తలవంచుతూ మిస్తాహ్‌ను క్షమించారు. దేవుని క్షమాభిక్ష తనకు ఎంతైనా అవసరమని గుర్తించారు. మిస్తాహ్ పోషణా బాధ్యతను తిరిగి కొనసాగించారు– రజిఅల్లాహు అన్‌హు.

25–7. ఇది హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ (ర.అ)లోని దైవభీతికి, నిష్పక్షపాత బుద్ధికి ఒక మచ్చుతునక. హజ్రత్ ఆయిషా(ర.అ) జైనబ్ సాక్ష్యంపై వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "ఆమె కూడా నా సవతి. అయితే ఆమెలోని ధర్మపరాయణత కారణంగా అల్లాహ్ ఆమెను వక్రభాష్యం నుండి కాపాడాడు"– ఈ అధ్యాయంలో ప్రధానాంశం కూడా ఇదే.

**నేను గమనించాను. ఆ సమయంలో హజ్రత్ ఉమర్(రజి) నన్ను చూసి, "ఈ గుహ విపత్కర గుహ కారాదు సుమా!" అన్నారు. అంటే, ఆయన గారు నా గురించి చెడుగా అనుమానించారు. అయితే మా తెగ నాయకుడు కల్పించుకుని "ఈయన సత్పురుషుడు" అని[1] ధ్రువీకరించారు. అప్పుడు హజ్రత్ ఉమర్, "అలాగా! అలాగైతే ఈ పిల్లవాణ్ణి ఎత్తుకెళ్ళు. అతని పోషణా బాధ్యత మాపైన ఉంటుంది (అంటే బైతుల్ మాల్ నుండి ఇతని పోషణా ఖర్చులు ఇవ్వబడతాయి)" అని చెప్పారు.**

**26) తన తండ్రి తనకు తెలిపినట్లు అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబక్రా (రజి) ఉటంకించారు; ఒక వ్యక్తి దైవప్రవక్త(సఅసం) సమక్షంలో మరో వ్యక్తిని గురించి ప్రశంసించాడు. ఇది విని "శోచనీయం! నీవు నీ సహవాసి మెడ నరికేశావ్. నీవు నీ సహవాసి మెడ నరికేశావ్" అని అనేక మార్లు ఆయన(సఅసం) పలికారు. పిదప ఆయన(స) ఇలా ఉద్బోధించారు : "ఎవరయినా తమ సోదరుణ్ణి మెచ్చుకోవటం అవసరమని భావిస్తే, 'నేను ఆ వ్యక్తి గురించి ఈ విధంగా భావిస్తున్నాను. అంతకన్నా ఎక్కువగా అతని గురించి అల్లాహ్‌కే తెలుసు. నేను అల్లాహ్ ముందు ఎవరినీ లోపం లేనివాడు అని అనలేను. అతను ఇలాంటివాడు అలాంటివాడు అని మాత్రం తలపోస్తున్నాను' అనాలి."**

## అధ్యాయం : 17

### ఒకరి పొగడ్తలో అతిశయిల్లటం అవాంఛనీయం. తనకు తెలిసినంత వరకే చెప్పాలి.

**27) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) ఉల్లేఖించారు : ఒక వ్యక్తి**

---

16–1. అంటే ఒక వ్యక్తి క్యారెక్టర్‌ను ఒక్క పురుషుడు ధ్రువీకరిస్తే సరిపోతుంది. షాఫియీల, మాలికీల ప్రకారం కనీసం ఇద్దరు వ్యక్తులు కాండక్ట్ సర్టిఫికేట్ ఇవ్వాలి.

ఈ సందర్భంగా 'గుహ' ప్రస్తావన రావటం గమనార్హం. పైన బాగానే ఉండి లోపలి నుండి ప్రమాదం పొంచి ఉందనిపించినప్పుడు, దానిని 'విపత్కర గుహ'గా అభివర్ణించే వారు. దీని పూర్వాపరాలలోకి వెళితే, కొంతమంది తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ఒక గుహలో తలదాచుకున్నారు. ఆ గుహ విరిగి వారిపై పడింది. శత్రువు వచ్చి, వాళ్ళను కబళించాడు. హజ్రత్ ఉమర్(రజి) ఈ సందర్భంగా 'విపత్కర గుహ' అనటంలోని అంతరార్థం ఏమిటంటే; బహుశా ఆ వ్యక్తి అక్రమ సంబంధం పెట్టుకుని ఉంటాడని, అతని వీర్యంతోనే ఆ పసివాడు పుట్టి ఉంటాడని అనుమానించారు. కాని తెగ ప్రముఖుడు, ఆ వ్యక్తి సౌశీల్యం గురించి ధ్రువీకరించగానే, ఆ పిల్లవాణ్ణి తీసుకెళ్ళటానికి అనుమతి ఇచ్చారు. పైగా ఆ అనామకుని పోషణా బాధ్యతను కూడా స్వీకరించారు.

**మరొకతని పొగడ్తలో మితిమీరిపోతుండగా ప్రవక్త మహనీయులు (సఅసం) విని, "మీరు ఆ వ్యక్తిని చంపేశారు, అతని వెన్ను విరిచేశారు"[1] అని పలికారు.**

## అధ్యాయం : 18

## పిల్లలు ప్రాజ్ఞులవటం, వారి సాక్ష్యం గురించి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:**"మీ పిల్లలు యుక్త వయస్సుకు చేరుకున్నప్పుడు, తమ పెద్దలు అనుమతి తీసుకునే విధంగానే వారు కూడా అనుమతి తీసుకుని మరీ రావాలి." (అన్ నూర్: 59). "నాకు పన్నెండేళ్ళ ప్రాయంలోనే వీర్య స్ఖలనం అవటం మొదలయింది"[1] అని ముగీరా (రజి) చెప్పారు. ఆడపిల్లలు ప్రాజ్ఞతకు చేరుకున్నా**

---

27–1. ఆ వ్యక్తిని అలా పొగడటం వల్ల అతనిలో గర్వం, అహంకారం జనిస్తుందేమోనని దైవ ప్రవక్త(స)కు భయమేసింది. ఒక వ్యక్తిలోని మంచితనాన్ని గురించి తగురీతిలో చెప్పు కుంటే ఫరవాలేదు. కాని మితిమీరితే మాత్రం ఆ వ్యక్తిలో స్వోత్కర్ష, ఆత్మస్తుతి జనించ వచ్చు. ఇవి మనిషి వినాశనానికి దారితీస్తాయి.

18–1. అంటే 12 ఏండ్ల వయసులోనే ఆయన యుక్త వయసుకు చేరుకున్నారు. అమ్ర్ బిన్ ఆస్ కూడా తన కుమారుడు అబ్దుల్లాహ్ కన్నా కేవలం 12 ఏండ్ల పెద్దవారని అంటారు. ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫియి, అహ్లె హదీసు వారి దృష్టిలో పురుషుని ప్రాజ్ఞతకు కనిష్ట వయసు 15 సంవత్సరాలు. స్త్రీ రజస్వల అవటంతోనే ఆమె ప్రాజ్ఞతకు చేరుకుంటుంది. కాగా కనీసం 18 లేక 19 ఏండ్లు రానంతవరకు పిల్లలు యుక్త వయసుకు చేరుకోలేరని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ) వక్కాణించారు.

ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది : స్త్రీకి బహిష్టు అయినప్పుడు, పురుషునికి వీర్య స్ఖలనం అవటం మొదలైనప్పుడు వారు యుక్త వయస్కులవుతారని కొందరు అభిప్రాయపడ్డారు. మర్మస్థానం వద్ద వెంట్రుకలు మొలవటం యుక్త వయస్సుకు తార్కాణమని మరి కొందరన్నారు.

వాస్తవమేమంటే, ప్రాజ్ఞతకు 'వయో పరిమితి'ని ఖచ్చితంగా నిర్ధారించటం చాలా కష్టం. అది ఆయా దేశాల భౌగోళిక, వాతావరణ పరిస్థితులపై ఆధారభూతమై ఉంటుంది. అరేబియా వంటి ఉష్ణ ప్రదేశాలలో ఆడపిల్లలు పదేండ్లలోనే రజస్వల అవుతారు. రష్యా వంటి శీతల ప్రదేశాలలో ఆడవారు 20 ఏండ్ల వరకూ 'పెద్ద మనుషులు' అవరు. ఇకపోతే బాలల సాక్ష్యం గురించి; అత్యధిక మంది విద్వాంసులు బాలల సాక్ష్యాన్ని ధర్మసమ్మతంగా పరిగణించలేదు. అయితే పిల్లలు పరస్పరం కొట్లాడుకుని ఒకరింకొక రిని గాయపరిచే వయస్సుకు చేరినప్పుడు వారి సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చని ఇమామ్ మాలిక్(రహ్మ) వక్కాణించారు.

రనడానికి నిదర్శనం 'రజస్వల' అయి బహిష్టు మొదలవటం. దీనికి ఆధారం ఖుర్‌ఆన్‌లోని ఈ దైవోపదేశం : "మీ స్త్రీలలో ఎవరయినా ఋతుక్రమం విషయంలో ఆశ వదులుకుంటే, వారి విషయంలో మీకేదైనా అనుమానం కలిగితే, అప్పుడు వారి నిర్ణీత గడువు మూడు మాసాలు (అని మీరు తెలుసుకోండి). ఇదే ఆజ్ఞ ఇంకా ఋతుక్రమం ప్రారంభం కాని వారికి కూడా వర్తిస్తుంది. గర్భిణీ స్త్రీల నిర్ణీత గడువు వారి కాన్పు అయ్యేవరకు ఉంటుంది." *(అత్ తలాఖ్ : 4)*

**28)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : ఉహుద్ యుద్ధ సందర్భంగా తాను ప్రవక్త మహనీయుల (సఅసం) సన్నిధికి వెళ్ళి (యుద్ధరంగానికి వెళ్ళేందుకు అనుమతి ఇవ్వమని అడిగి)నప్పుడు, ఈయనకు అనుమతి లభించలేదు. అప్పటికి ఈయన వయస్సు **14** ఏండ్లు. కందక పోరాటం సందర్భంగా హాజరైనప్పుడు మాత్రం ఆనతి లభించింది. అప్పటికి ఈయనకు **15** సంవత్సరాలు నిండాయి. నాఫె ఇలా అన్నారు : నేను ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ) ఖలీఫాగా ఉన్న కాలంలో ఆయన దగ్గరకు వెళ్ళి, ఈ హదీసును వినిపించినప్పుడు, ఆయన గారు **15** ఏండ్ల వయో పరిమితిని చిన్న- పెద్దకు మధ్య హద్దుగా ఖరారు చేశారు. తరువాత ఆయన తన అధికారులకు లేఖలు వ్రాస్తూ, ఏ పిల్లవానికి **15** ఏండ్లు నిండుతాయో, అతనికి ప్రభుత్వ కోశాగారం నుండి (సైనిక) పెన్షన్‌ను నిర్ధారించండి అని ఆదేశించారు.[1]

**29)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు : "వీర్య స్ఖలనం అయ్యే (అంటే యుక్త వయస్సుకు చేరిన) ప్రతి ఒక్కరూ శుక్రవారం రోజున స్నానం (గుసుల్) చేయటం తప్పనిసరి."

## అధ్యాయం : 19

## నిందితుని చేత ప్రమాణం చేయించే ముందు 'నీ దగ్గర సాక్ష్యాధారం ఉందా?' అని న్యాయాధిపతి ఆరోపణ మోపిన వానిని అడగటం

**30)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "ఎవరయితే ఒక ముస్లిం

28-1. దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే, 15 ఏండ్ల వయసుకు చేరుకోగానే పిల్లలపై షరీఅత్ ఆజ్ఞలు విధితమవుతాయి. వారు సాక్ష్యం కూడా ఇవ్వగలుగుతారు.

సొమ్మును కబళించే ఉద్దేశంతో అబద్ధపు ప్రమాణం చేస్తాడో, అతను అల్లాహ్‌ను ఆగ్రహోదగ్రుడై ఉన్న స్థితిలో కలుసుకుంటాడు.” దానిపై అష్అత్ బిన్ ఖైస్(రజి) ఇలా అన్నారు : ‘దైవసాక్షిగా చెబుతున్నాను. నా వ్యవహారంలోనే దైవప్రవక్త(సఅసం) ఈ మాటలన్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే; ఒక భూమి వ్యవహారంలో నాకూ–ఒక యూదునికి మధ్య వివాదం తలెత్తింది. యూదు వ్యక్తి నాకు లభించవలసిన హక్కును తిరస్కరించాడు. అందువల్ల నేను ఈ వివాదాన్ని దైవప్రవక్త (సఅసం) దృష్టికి తీసుకెళ్ళాను. ఆయన(స) నన్ను ఉద్దేశించి (ఎందుకంటే అవతలి వ్యక్తిపై నిందమోపిన వాణ్ణి నేనే), “దీనికి సంబంధించిన సాక్ష్యాధారం సమర్పించవలసిన బాధ్యత నీదే” అన్నారు. కాని నా దగ్గర సాక్ష్యాధారం ఏమీ లేదు. అందువల్ల దైవ ప్రవక్త(స) యూదునితో, “మరైతే నీవు ప్రమాణం చెయ్యి” అన్నారు. అష్అత్ (రజి) ఇలా అన్నారు– ‘దైవప్రవక్తా! ఇతను సునాయాసంగా ప్రమాణం చేసేస్తాడు. ఆనక నా సొమ్మును స్వాహా చేసేస్తాడు’ అని నేనన్నాను. ఈ సంఘటనపైనే అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: “ఎవరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను స్వల్పమైన ధరకు అమ్ముకుంటారో, వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. ప్రళయం రోజున అల్లాహ్ వారిని పలుకరించడు. వారి వైపు చూడడు. వారిని పరిశుద్ధులుగానూ చెయ్యడు. పైగా వారికి అత్యంత బాధాకరమైన శిక్ష పడుతుంది.”[1]

*(ఆలి ఇమ్రాన్: 77)*

## అధ్యాయం : 20

## సివిల్, క్రిమినల్ వివాదాలు రెండింటిలోనూ నిందితుని చేత ప్రమాణం చేయించటం

ప్రవక్త మహనీయులు (సఅసం) నేరారోపణ చేసిన వ్యక్తితో, “నీవు నీ

30–1. న్యాయాధికారి చేయవలసిన మొట్టమొదటి పనేమిటంటే; అతను నేరారోపణ చేసే వ్యక్తిని, సాక్ష్యాధారం సమర్పించమని కోరాలి. ఒకవేళ అతని వద్ద సాక్ష్యాధారం లేకపోతే, అప్పుడు నిందితుని చేత ప్రమాణం చేయించాలి. నిందితుడు గనక అబద్ధపు ప్రమాణం చేసినట్లయితే అతను ఘోరమయిన పాపాన్ని మూటకట్టుకుంటాడు. కాని కోర్టులకు వచ్చే చాలా మంది ఈ విషయాన్ని సులభంగా తీసుకుంటూ ఉంటారు. ఇతరుల సొమ్మును స్వాహా చేసే దురుద్దేశ్యంతో అబద్ధపు ప్రమాణాలు చేసేవారు ఎంత పెద్ద పాపానికి ఒడిగడుతున్నారో ఆలోచించాలి.

**తరపున ఇద్దరు సాక్షులను సమర్పించు. లేదంటే నిందితుని ప్రమాణం ఆధారంగా తీర్పు ఇవ్వబడుతుంది" అన్నారు. ఖుతైబా ఇలా వివరించారు. ఆయన ద్వారా సుఫ్యాన్ ఇలా వినిపించారు. ఆయన ద్వారా (కూఫా న్యాయమూర్తి) ఇబ్నె షుబ్రుమా ఇలా వివరించారు : (మదీనా న్యాయమూర్తి) అబూ జినాద్ [1] నాతో, నేరారోపణ చేసిన వ్యక్తి ప్రమాణం చేసి ఒక్కగానొక్క సాక్షిని సమర్పించినా సరే తీర్పు విధితమైపోయే విషయం గురించి చర్చించినప్పుడు నేను దైవ వచనాన్ని ఉదహరించాను. ఆ వచనంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మీరు మీలోని ఇద్దరు పురుషులను దానికి సాక్షులుగా పెట్టుకోవాలి. ఇద్దరు పురుషులు లభించని పక్షంలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండాలి. ఎందుకంటే వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేస్తుంది..." (2: 282)**

**నిందారోపణ చేసే వ్యక్తి ప్రమాణం చేసి, ఒక్కగానొక్క సాక్ష్యాన్ని సమర్పించే మాటైతే మరి 'ఒకామె మరచి రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేస్తుంది' అని చెప్పాల్సిన అవసరం ఏముంటుంది? అని నేనాయన్ని అడిగాను. అంటే రెండవ స్త్రీ జ్ఞాపకం చేయటం వల్ల ఒరిగిందేమిటి? అని ప్రశ్నించాను.**

**31) ఇబ్నె అబ్బాస్(రజి) ఈ విధంగా (తనకు) వ్రాసి పంపినట్లు ఇబ్నె అబీ ములైకా తెలిపారు : "దైవప్రవక్త(సఅసం) నిందితుని చేత ప్రమాణం చేయించమని ఆదేశించారు."**

## అధ్యాయం : 21

### అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తమకు తెలిపారని అబూ వాయల్ వివరిం

20-1. అబూ జినాద్ మదీనాకు చెందిన న్యాయమూర్తి. ధర్మజ్ఞాని. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియి, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, అహ్లె హదీసు వర్గం వారు అబూజినాద్ అభిప్రాయాన్నే అనుసరించారు. అంటే నేరారోపణ చేసిన వ్యక్తి వద్ద ఒకే సాక్షి ఉన్నప్పుడు, అతని చేత ప్రమాణం చేయించి, ఒక్క సాక్షి ఆధారంగానే తీర్పు ఇవ్వవచ్చు. అంటే అతను చేసిన ప్రమాణం రెండవ సాక్ష్యానికి ప్రత్యామ్నాయం అన్నమాట. ఇమామ్ ముస్లిం గారు ఇబ్నె అబ్బాస్ (రజి) నుండి వెలికి తీసిన ప్రామాణిక హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. అంటే దైవప్రవక్త(స) ఒక సాక్షి, ఒక ప్రమాణం ఆధారంగా తీర్పు ఇచ్చారు.

ఇబ్నె షుబ్రుమా కూఫా న్యాయాధీశులు. అబూ జినాద్ అభిప్రాయంతో ఈయన ఏకీభవించలేదు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మా) కూడా ఒక సాక్ష్యం, ఒక ప్రమాణం ఆధారంగా తీర్పు ఇవ్వడాన్ని ధర్మసమ్మతంగా భావించలేదు.

చారు : "ఎవరయితే వేరొకరి సొమ్మును కబళించే ఉద్దేశ్యంతో (అబద్ధపు) ప్రమాణం చేస్తాడో, అతను అల్లాహ్‌ను ఆగ్రహోదగ్రుడై ఉన్న స్థితిలో కలుసుకుంటాడు." ఆ తరువాత అల్లాహ్ (ఈ హదీసుకు) ధ్రువీకరణగా ఈ ఆయత్‌ను అవతరింపజేశాడని చెప్పారు: "ఎవరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను స్వల్పమైన వెలకు విక్రయిస్తారో, వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. ప్రళయం రోజున అల్లాహ్ వారిని పలుకరించడు, వారి వైపు చూడడు. వారిని పరిశుద్ధులుగానూ చెయ్యడు. పైగా వారికి అత్యంత బాధాకరమైన శిక్షపడుతుంది." *(3: 77)*

తరువాత అష్‌అత్ బిన్ ఖైస్(రజి) మా వైపుగా వచ్చి 'అబూ అబ్దుర్రహ్మాన్ (అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్-రజి) ఇందాక 'మీకు వినిపించిన హదీసు ఏది?' అని అడిగారు. మేము ఈ హదీసు గురించి చెప్పగా, ఆయన ఇలా అన్నారు : ఆయన చెప్పింది నిజం. ఆ ఆయత్ నా గురించే అవతరించింది. ఒక వ్యక్తితో నేను గొడవ పడ్డాను. మేమిద్దరం ఆ వివాదాన్ని దైవప్రవక్త(స) దృష్టికి తీసుకెళ్ళాము. (అంతా విన్న మీదట), "నీవు ఇద్దరు సాక్షులను హాజరుపరిస్తే సరి. లేదంటే అతని (నిందితుని) ప్రమాణం ఆధారంగా తీర్పు జరుగుతుంది" అని ఆయన(స) నాతో అన్నారు. దానికి నేను '(దైవప్రవక్తా!) నా వద్ద సాక్ష్యాధారం లేదు. ఒకవేళ (అతని ప్రమాణం ఆధారంగా) తీర్పు జరిగే మాటైతే అతను తప్పకుండా ప్రమాణం చేసేస్తాడు. దానిని ఎంతమాత్రం లక్ష్యపెట్టడ'ని అన్నాను. దైవప్రవక్త(సఅసం) నా గోడు విన్న తరువాత ఇలా అన్నారు : "ఎవరయినా సరే వేరొకరి సొమ్మును స్వాహా చేసే ఉద్దేశంతో (అబద్ధపు) ప్రమాణం చేసినట్లయితే, 'అతను అల్లాహ్‌తో క్రోధా వేశంలో ఉన్న స్థితిలో సమావేశమవుతాడు." దీనికి ధ్రువీకరణగా అల్లాహ్ పైఆయత్‌ను అవతరింపజేశాడు- పిదప ఆయన ఈ ఆయత్‌ను పారాయణం చేశారు.

## అధ్యాయం : 22

## ఎవరయినా వేరొకరిపై నిందారోపణ చేస్తే లేదా (తన భార్యపై) వ్యభిచార నిందను మోపి, సాక్ష్యాధారాల కొరకు గడువు కోరినట్లయితే...[1]

22-1. అతనికి గడువు ఇవ్వబడుతుంది. లెక్కలు తనిఖీ చేయడానికి గడువు ఇవ్వటం వంటిదే ఇదీను. నిర్ధారిత గడువు తరువాత అతను ఒక సాక్షిని హాజరుపరచి, మరికొంత గడువు కోరితే మరోసారి కూడా గడువు ఇవ్వబడుతుంది.

**33)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) ప్రవక్త మహనీయుల(సఅసం) సన్నిధికి వచ్చి, తన భార్య షరీక్ బిన్ సహ్మాతో కులుకుతోందని నిందమోపారు. దానికి ఆయన(సఅసం), "దీనిపై సాక్షులను సమర్పించు. లేదంటే నీ వీపుపై కొరడా దెబ్బలు పడతాయి" అని చెప్పారు. ఈ మాట విని, 'దైవప్రవక్తా(స)! ఏమిటి, మాలోని ఒక వ్యక్తి తన భార్య పరాయి మగాడితో అక్రమ సంబంధం పెట్టుకుని ఉండగా, కళ్ళారా చూసిన మీదట కూడా సాక్షుల్ని వెతుక్కోవడానికి పరుగులు తీయాలా?' అని హిలాల్ బిన్ ఉమయ్యా సందేహాన్ని వ్యక్తం చేశారు. అయితే దైవప్రవక్త(స) మాత్రం పదే పదే అదే మాట అంటూ ఉండిపోయారు– "సాక్షుల్ని తీసుకుని రా. లేకపోతే నీ వీపుపైన కొరడా దెబ్బలు పడతాయి"[1] అని. ఆ తరువాత 'లియాన్' (శాప ప్రమాణం)కు సంబంధించిన హదీసును (ఇబ్నె అబ్బాస్) ప్రస్తావించారు.

## అధ్యాయం : 23

## అస్ర్ నమాజ్ అనంతరం (అబద్ధపు) ప్రమాణం చేయడం

**34)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "మూడు రకాల మనుషులున్నారు. అల్లాహ్ (ప్రళయదినాన) వారితో మాట్లాడడు. వారి వైపు చూడడు, వారిని పరిశుద్ధ పరచడు. పైగా వారికి వ్యధాభరితమయిన శిక్ష పడుతుంది. వారిలో ఒక రకం వ్యక్తి; అతను ప్రయాణంలో అవసరంకన్నా ఎక్కువ మంచినీరు తీసుకుపోతాడు. కాని (దాహమైన) ఏ బాటసారికీ నీరు త్రాపడు. రెండవ వ్యక్తి; అతను రాజ్యాధికారి (ఖలీఫతుల్ ముస్లిమీన్) సమక్షంలో విధేయతా ప్రమాణం (బైఅత్) చేస్తాడు. ఈ ప్రమాణం వెనుక కేవలం ప్రాపంచిక ప్రయోజనాలే లక్ష్యమై ఉంటాయి. ఆ ప్రయోజనాలు

33–1. నిందారోపణ చేసిన మీదట అతను గనక తక్షణం సాక్షుల్ని హాజరు పరచలేకపోతే, అతనికి తగినంత గడువు ఇవ్వటం జరుగుతుంది. సాధారణంగా పౌరుషం ఉన్న ఏ మగవాడు కూడా తన భార్య వేరొక పురుషునితో అక్రమ సంబంధం పెట్టుకోవడాన్ని చూసి సహించలేడు. హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) కూడా కళ్ళారా చూడరానిది చూశారు. పైగా అది ఆయన ఇల్లాలి వ్యవహారం. అదే సమయంలో షరీఅత్ శాసనాంగం ప్రకారం నలుగురు సాక్షుల్ని హాజరుపరచమని దైవప్రవక్త(స) చెప్పేసరికి, ఆ సహాబీ ఆశ్చర్యపోయారు. చివరకు అల్లాహ్ 'శాప ప్రమాణానికి' సంబంధించిన ఆదేశాన్ని అవతరింపజేశాడు.

**సిద్ధస్తున్నంత కాలం అతనికి విధేయుడై మసలుకుంటాడు. లేకుంటే అతనికి వ్యతిరేకంగా వ్యవహరిస్తాడు. మూడవ వ్యక్తి; అతను అస్ర్ నమాజ్ చేసిన తరువాత, వస్తు సామగ్రికి వెలను నిర్ధారించి, ఈ వస్తువును ఇంత ధరకు కొంటానన్నా అమ్మ లేదని దేవునిపై ప్రమాణం చేసి చెబుతాడు. కొనుగోలుదారులు (అతని ప్రమాణం కారణంగా) ఆ వస్తువును కొంటారు. కాని అతని ప్రమాణం అబద్ధపు ప్రమాణం అయి వుంటుంది”[1].**

## అధ్యాయం : 24

## ‘ప్రమాణం చేసి చెప్పు’ అని ఆజ్ఞాపించబడిన చోటే నిందితుడు ప్రమాణం చేయాలి. వేరొక చోటికి వెళ్ళి ప్రమాణం చేయవలసిన అవసరం లేదు.

**మర్వాన్ బిన్ హకమ్ వేదికపై కూర్చుని ఉండే జైద్ బిన్ సాబిత్(రజి) గారి వివాదంపై తీర్పు ఇచ్చాడు. వేదికపైకి వచ్చి ప్రమాణం చేయవలసినదిగా అతడు జైద్ బిన్ సాబిత్(రజి)ను కోరాడు. కాని జైద్ మాత్రం తానున్న చోటి నుండే ప్రమాణం చేయసాగారు. వేదిక ఎక్కడానికి నిరాకరించారు. ఆయన ధోరణిపై మర్వాన్‌కు ఆశ్చర్యమేసింది. కాగా; దైవప్రవక్త(స) (అష్అత్ బిన్ ఖైస్‌తో) “ఇద్దరు సాక్షులను తీసుకురా. లేకపోతే (యూదుని) ప్రమాణం ఆధారంగా తీర్పు జరుగు తుంది” అని చెప్పారు. అంతేగాని ప్రత్యేక స్థలాన్ని నిర్ధారించలేదు.[1]**

---

34–1. పైన పేర్కొనబడిన ముగ్గురు వ్యక్తులలో మూడవ వ్యక్తి నేపథ్యంలో ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద పొందుపరిచారు. వ్యాపారంలో అసలు అబద్ధమాడటమే పాపం. పైగా అస్ర్ నమాజ్ తరువాత అబద్ధపు ప్రమాణం చేసి వస్తువును అమ్మటం ఘోరమైన పాపం.

24–1. ఉదాహరణకు : మస్జిద్‌లోనికి వచ్చి ప్రమాణం చెయ్యి అని ఆదేశిస్తే నిందితుడు మస్జిద్‌కు వెళ్ళనవసరం లేదు. హనఫీలు చెప్పేది కూడా ఇదే. హంబలీల అభిప్రాయం కూడా ఇదే. షాఫియీల ప్రకారం; న్యాయమూర్తి గనక ఆ విధంగా ఆజ్ఞాపిస్తే నిందితుడు దానిని శిరసావహించవలసి ఉంటుంది.

మర్వాన్ సంఘటనను ఇమామ్ మాలిక్ (రహ్మ) తన ‘ముఅత్తా’లో వసల్ చేశారు. జైద్ బిన్ సాబిత్‌కి– అబ్దుల్లాహ్ బిన్ ముతీకి మధ్యన ఒక నివాస గృహం విషయంలో తగాదా వచ్చింది. ఆ కాలంలో మర్వాన్ ముఆవియా (రజి) తరఫున మదీనా గవర్నర్‌గా ఉండేవాడు. వేదికపైకి వచ్చి ప్రమాణం చేయవలసినదిగా అతడు జైద్(రజి) గారిని ఆదేశించాడు. కాని జైద్ తిరస్కరించారు. కాబట్టి మర్వాన్ అభిప్రాయం ప్రకారం ఆచరించటం కన్నా జైద్ పద్ధతి ప్రకారం ఆచరించటం ఉత్తమం.

**35)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరయితే వేరొకరి సొమ్మును స్వాహా చేసేందుకు (అబద్ధపు) ప్రమాణం చేస్తాడో, అతడు అల్లాహ్‌ను తీవ్రంగా అప్రసన్నుడై ఉన్న స్థితిలో కలుసుకుంటాడు."

## అధ్యాయం : 25

## నిందితులు కొంతమంది ఉండి, ప్రతి ఒక్కరూ ప్రమాణం చేయడానికి తొందరపడినప్పుడు, మొదట ఎవరిచేత ప్రమాణం చేయించాలి?

**36)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) కొంతమందికి ప్రమాణం చెయ్యమని చెప్పినప్పుడు (నిందితులైన) ప్రతి ఒక్కరూ ప్రమాణం చేయడానికి పరస్పరం పోటీపడ్డారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం), వారి మధ్యన చీటీలు వేసి ముందుగా ఎవరు ప్రమాణం చేయాలో తేల్చమని ఆదేశించారు. [1]

## అధ్యాయం : 26

### (ఆలి ఇమ్రాన్ సూరాలో) అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం :

"ఎవరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను స్వల్పమైన వెలకు విక్రయిస్తారో వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. ప్రళయం రోజున అల్లాహ్ వారిని పలుకరించడు, వారివైపు చూడడు. వారిని పరిశుద్ధులుగానూ చెయ్యడు. పైగా వారికి అత్యంత బాధాకరమైన శిక్ష పడుతుంది." *(ఆలి ఇమ్రాన్ : 77)*

**37)** అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి) చెప్పగా విని ఇబ్రాహీమ్ అబూ ఇస్మాయీల్ సక్‌సక్కీ వివరించారు : ఒక వ్యక్తి (పేరు తెలియలేదు) మార్కెట్‌లో వర్తక

---

36–1. అబూ దావూద్, నసాయిలోని ఉల్లేఖనం ప్రకారం ఇద్దరు వ్యక్తులు ఒక వస్తువు తమదంటే తమదని వాదించారు. కాని వారి వద్ద సాక్షులు లేరు. అప్పుడు, వారిద్దరి పేరు మీద చీటీలు వేసి, వారిలో ఎవరి పేరు వస్తే, వారిచేత ముందుగా ప్రమాణం చేయించండి అని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించారు. హాకిమ్‌లోని ఉల్లేఖనం ప్రకారం ఇద్దరు వ్యక్తులు ఒక ఒంటె గురించి దావా వేశారు. వారిద్దరు కూడా సాక్షులను సమర్పించారు. అప్పుడు దైవప్రవక్త(స) ఆ ఒంటెను వారికి చెరి సగం ఇప్పించారు. అబూదావూద్‌లో ఇలా వుంది : ఆయన(స) చీటీలు వేయమని ఆజ్ఞాపించారు. ఎవరి పేరు వచ్చిందో వారికి దానిని ఇప్పించారు.

సామగ్రిని పెట్టి, నేను ఈ వస్తువులను 'ఇంతకు' కొన్నానని ప్రమాణం చేశాడు. కాని వాస్తవానికి అతను 'అంతకు' కొనలేదు. ఆ సమయంలో ఈ ఆయత్ అవతరించింది : "ఎవరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను స్వల్పమైన వెలకు విక్రయిస్తారో..." కొనుగోలుదార్లను బోల్తా కొట్టించేందుకు ధరలు పెంచేవారు వడ్డీ సొమ్ము తినే సంఘద్రోహుల్లాంటివారని అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి) వక్కాణించారు.

**38)** ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించినట్లుగా అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజి) తెలిపారు: "ఎవడయితే ఇతరుల సొమ్మును స్వాహా చేసే ఉద్దేశ్యంతో అబద్ధపు ప్రమాణం చేస్తాడో (లేదా తన సోదరుని సొమ్మును కబళించేందుకు అని పలికారు) అతను అల్లాహ్‌ను తన పట్ల క్రోధావేశంలో ఉన్న స్థితిలో కలుసుకుంటాడు." అల్లాహ్ దీనికి ధ్రువీకరణగా ఖుర్‌ఆన్‌లో ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు– "ఎవరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను స్వల్పమైన మూల్యానికి అమ్ముకుంటారో...". తరువాత అష్‌అత్ (రజి) నన్ను కలుసుకుని, 'అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజి) మీకు ఏ హదీసు వినిపించారు?' అని అడిగారు. నేను ఆయనకు వివరించాను. అప్పుడాయన : 'మీకు తెలుసా! ఈ ఆయత్ నా వ్యవహారంపైనే అవతరించింది' అన్నారు.

## అధ్యాయం : 27

## ప్రమాణం ఎలా చేయించాలి?

(సూరయె నిసాలో) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "అప్పుడు వారు నీ వద్దకు ప్రమాణాలు చేస్తూ వస్తారు. వచ్చి, 'దేవుని సాక్షిగా! మేము మంచినే కాంక్షించాము. ప్రత్యర్థుల మధ్యన ఏదో ఒకవిధంగా రాజీ కుదరాలనేదే మా ఉద్దేశం' అని అంటారు" ***(4 : 62)***

"వారు దేవుని మీద మాటిమాటికీ ప్రమాణంచేసి, మేము మీ వారమే అని అంటారు." ***(అత్ తౌబా– 56)***

"వారు మీ ముందు ప్రమాణాలు చేస్తారు, మిమ్మల్ని సంతోషపెట్టడానికి."
***(అత్ తౌబా– 62)***

వారు అల్లాహ్‌పై ప్రమాణం చేసి ఇలా చెప్పాలి : "మా సాక్ష్యం వారి సాక్ష్యం కంటే ఎక్కువ సత్యమైనది." ***(అల్ మాయిదా– 107)***

**ప్రమాణం చేస్తున్నప్పుడు 'బిల్లాహ్', 'తల్లాహ్', 'వల్లాహ్' (అల్లాహ్ సాక్షిగా!) లాంటి పదాలు పలకాలి.**

ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు : "అస్ర్ నమాజ్ అనంతరం అల్లాహ్ పేరు మీద అబద్ధపు ప్రమాణం చేసిన వ్యక్తి..."

అల్లాహ్ పేరు మీద తప్ప ఇతరుల పేరున ప్రమాణం చేయరాదు.

**39)** తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) కథనం : ఒక వ్యక్తి (జమామ్ బిన్ సాలబా) దైవప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చి, ఇస్లామ్ గురించి అడిగారు. సమాధానంగా దైవప్రవక్త(స) "రేయింబవళ్లలో అయిదు పూటల నమాజులు చేయాలి" అని అన్నారు. 'ఇవిగాక నా మీద మరేవైనా నమాజులు విధితమై ఉంటాయా?' అని ఆ వ్యక్తి ప్రశ్నించగా, "లేదు. కాని నీవంతట నీవుగా చేసుకుంటే అవి నీ పాలిట స్వచ్ఛంద (నఫిల్) నమాజులుగా పరిగణించబడతాయి" అని ఆయన(స) జవాబిచ్చారు. తరువాత ప్రవక్త మహనీయులు(స) "రమజాన్ నెలలో ఉపవాసాలుండాలి" అని చెప్పారు. 'ఇవిగాక మరింకా ఏవైనా ఉపవాసాలు నేను తప్పనిసరిగా పాటించవలసి ఉంటుందా?' అని ఆ వ్యక్తి సందేహపడగా, "లేదు. ఒకవేళ నీవు పాటిస్తే అవి నీ పాలిట నఫిల్ ఉపవాసాలవుతాయి" అని ఆయన(స) సమాధానమిచ్చారు. తల్హా (రజి) ఇలా అంటున్నారు : దైవప్రవక్త(స) ఆ వ్యక్తికి 'జకాత్' గురించి కూడా బోధించారు. అప్పుడు ఆ వ్యక్తి '(విధిగా చెల్లించవలసిన జకాత్ సంగతి సరే) ఇది గాకుండా మరేవైనా దానధర్మాలు నాపైన తప్పనిసరిగా ఉంటాయా?' అని అడిగాడు. దానికి ఆయన (స), "లేదు. కాని నీవు స్వచ్ఛందంగా ఇవ్వదలిస్తే ఇచ్చుకోవచ్చు" అని స్పష్టం చేశారు. ఆ తరువాత ఆ వ్యక్తి, 'దైవసాక్షిగా! (వల్లాహ్) ఇందులో నేను ఎలాంటి హెచ్చుతగ్గులు చేయను' అని చెప్పి వెళ్ళిపోయాడు. దైవప్రవక్త(సఅసం) అతని గురించి చెబుతూ, "ఈ వ్యక్తి తాను ఆడిన మాటను తప్పకుండా ఉంటే సాఫల్యం పొందుతాడు" [1] అని అన్నారు.

**40)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఉద్బోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలియజేశారు: "ఎవరయినా ప్రమాణం చెయ్యాలనే అంతగా

39–1. అంటే, అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు. ఆ వ్యక్తి దైవప్రవక్త(స) ఎదుట 'వల్లాహ్' (దైవసాక్షిగా!) అనే పదం ఉపయోగించాడు. ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం ఇదే. ప్రమాణం చేసేందుకు ఇలా అంటే సరిపోతుంది. వల్లాహ్, బిల్లాహ్, తల్లాహ్– ఇవన్నీ ప్రమాణానికి సంబంధించిన పదాలే.

అనుకుంటే అల్లాహ్ పేరు మీద ప్రమాణం చేయాలి. లేదంటే మౌనం వహించాలి."[1]

## అధ్యాయం : 28

## (నిందితుడు) ప్రమాణం చేసిన మీదట ఎవరైనా సాక్ష్యాధారాన్ని సమర్పిస్తే...[1]

మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించారు : "(నేరారోపణ చేసేవాడు, నిందితుడు) ఇద్దరిలో ఒకరు మరొకరి కన్నా తన వాదాన్ని గట్టిగా వినిపించటం సంభవమే"- తావుస్, ఇబ్రాహీమ్, షురైహ్ ప్రభృతులు ఏమంటారంటే; 'ఎన్నదగిన సాక్ష్యం అబద్ధపు ప్రమాణం కన్నా ఎక్కువ స్వీకార యోగ్యమైనది.'

**41)** హజ్రత్ ఉమ్మె సలమా (రజిఅల్లాహు అన్హా) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(సఅసం) ఇలా ప్రవచించారు : "మీరు నా దగ్గరకు మీ వివాదాలు తీసుకు వస్తుంటారు. (వాగ్ధాటి కారణంగా) వాదోపవాదాలలో మీలో ఒకరు మరొకరిని మించిపోవచ్చు. పిదప నేను అతనికి అతని సోదరుని హక్కును ఇప్పిస్తే, దానిని అతను (ధర్మసమ్మతంగా భావించకూడదు) తీసుకోకూడదు. ఎందుకంటే నేనతనికి నరకంలోని నిప్పు కణికను ఇప్పిస్తున్నాను."[1]

---

40-1. న్యాయస్థానంలో అల్లాహ్ పేరు మీద చేసే ప్రమాణమే ఎన్నదగినదనీ, దైవేతరుల పేరున చేసే ప్రమాణం ఎన్నదగినది కాదనీ, పైగా అది పాపం అనీ దీని ద్వారా అవగతం అవుతోంది. దైవేతరుల పేరు మీద ప్రమాణం చేసినవాడు షిర్క్‌కి ఒడిగట్టాడు.

28-1. అతని సాక్ష్యం స్వీకరించబడుతుంది. కూఫా వాసుల అభిప్రాయం ఇదే. షాఫియీలు, హంబలీలు చెప్పేది కూడా ఇదే. ఇమామ్ మాలిక్ ఇలా అంటారు : సాక్షుల గురించి నేరారోపణ చేసిన వ్యక్తికి మొదట తట్టలేదు. నిందితుడు ప్రమాణం చేసిన పిదప అతనికి తన సాక్షుల గురించి తెలిసింది. ఇట్టి పరిస్థితిలో అతను హాజరుపరిచే సాక్ష్యాధారాలు సమ్మతమే. అతను తన సాక్షులను ఉద్దేశ్యపూర్వకంగా ఉపేక్షించి ఉంటే మాత్రం అది స్వీకారయోగ్యం అవదు.

41-1. ఈ హదీసు ప్రకారం ఇమామ్ మాలిక్, షాఫియి, ఇమామ్ అహ్మద్ మరియు అత్యధిక మంది విద్వాంసుల పంథా సరైనదని రూఢీ అవుతోంది. అంటే న్యాయమూర్తి ఆజ్ఞ బాహ్యంపైనేగాని అంతరంగం మీద కాదు. అంటే న్యాయమూర్తి గనక పొరపాటున తీర్పు ఇస్తే అట్టి తీర్పు దైవసన్నిధిలో సరైనది కాజాలదు. ముహమ్మద్(సఅసం) పురుషోత్తములు, సర్వశ్రేష్ఠులైనప్పటికీ ఆయన(స) ద్వారా సయితం పొరపాటు జరగటం సహజమేనని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఎందుకంటే ఆయన(స)కు అగోచర

## అధ్యాయం : 29

## వాగ్దానాన్ని నెరవేర్చటం అవసరం

ఇమామ్ హసన్ బస్రీ (రహ్మ) దానిని నెరవేర్చారు. దైవప్రవక్త హజ్రత్ ఇస్మాయీల్(అలైహిస్సలామ్)లోని సుగుణాన్ని ప్రస్తుతిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "అతను వాగ్దాన పాలనలో సత్యవంతుడు" (మర్యమ్ : 54). సయీద్ బిన్ అష్వా, వాగ్దానాన్ని నెరవేర్చమని ఆదేశించారు. సమురా బిన్ జున్దబ్ (రజి) ఇలాగే నకలు చేశారు. ప్రవక్త మహనీయులు (సఅసం) చెప్పగా తాను విన్నానని మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) అన్నారు: దైవప్రవక్త(స) తన అల్లుళ్ళలో ఒకరి (అబుల్ ఆస్) గురించి ప్రస్తావిస్తూ, "అతడు నాకు చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడు" అని చెప్పారు. అబూ అబ్దుల్లాహ్ (ఇమామ్ బుఖారీ–రహ్మ) ఇలా అన్నారు: ఇస్హాఖ్ బిన్ ఇబ్రాహీమ్ గారిని నేను చూశాను, వాగ్దానం నెరవేర్చటం తప్పనిసరి అనే దానికి ఆయన ఇబ్నె అష్వా హదీసును ఉదాహరించేవారు. [1]

**42)** అబూ సుఫ్యాన్ తనకు ఈ విధంగా తెలియజేశారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) చెప్పారు: (రోము చక్రవర్తి) హెరిక్లస్ నాతో ఇలా అన్నాడు– "ఆయన (ముహమ్మద్–సఅసం) మీకు ఏ ఏ విషయాల గురించి ఆజ్ఞాపిస్తున్నారని నేను నిన్ను అడిగితే, ఆయన(స) మాకు నమాజ్ గురించి, సత్యం, సౌశీల్యం, వాగ్దాన పాలన[1], అమానతులను కాపాడటం గురించి ఆజ్ఞాపిస్తున్నారని నువ్వు చెప్పావు". "ఒక ప్రవక్తలోని సుగుణాలు ఇవే" అని హెరిక్లస్ చెప్పాడు.

## అధ్యాయం : 30

**43)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ఉద్బోధిం

---

జ్ఞానం లేదు. అంతటి గొప్ప ప్రవక్త వల్లనే పొరపాటు జరిగే అవకాశం ఉన్నప్పుడు, లోకంలోని ఇతర న్యాయమూర్తులు ఏపాటి?

29–1. వాగ్దానం నెరవేర్చటం అవశ్యం అన్న వాక్కును ఇమామ్ బుఖారీతోపాటు మరికొంతమంది విద్వాంసులు సమర్థిస్తారు. ఒకవేళ ఎవరయినా దానిని నెరవేర్చకపోతే న్యాయాధికారి దానిని పూర్తి చేయిస్తాడు. కాని మెజారిటీ విద్వాంసులు ఏమంటారంటే; వాగ్దానాన్ని నెరవేర్చడం అభిలషణీయం, నైతికంగా అవసరం కూడా. అయితే న్యాయాధిపతి మాత్రం బలవంతంగా దానిని పూర్తి చేయించలేడు.

42–1. దీని ఆధారంగానే ఇమామ్ బుఖారీ (రహ్మ) వాగ్దాన పాలన తప్పనిసరి అన్న అంశాన్ని వెలికి తీశారు.

**చారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "కపటి (మునాఫిక్) చిహ్నాలు మూడు. 1) అతను మాట్లాడితే అబద్ధం చెబుతాడు 2) ఏదైనా అమానతును అప్ప గిస్తే, అందులో ద్రోహానికి పాల్పడతాడు. 3) వాగ్దానం చేస్తే దానిని నెరవేర్చడు."[1]**

**44) హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసం) పరమపదించిన తరువాత (బహ్రైయిన్ అధికారి) అలా బిన్ హజ్రమీ (రజి) హజ్రత్ అబూబకర్(రజి) వద్దకు డబ్బు పంపించాడు. అప్పుడు అబూబకర్(రజి), "దైవప్రవక్త(స)కు రుణం ఇచ్చి ఉన్నవారు, లేదా దైవప్రవక్త(స) నుండి వాగ్దానం పొంది ఉన్నవారు నా దగ్గరకు రావచ్చు" అని ప్రకటన చేయించారు. అప్పుడు నేను, 'దైవప్రవక్త(సఅసం) నాకు ఇంత ఇంత డబ్బిస్తానని వాగ్దానం చేసి ఉన్నార'ని చెప్పాను. అంతే. అబూబకర్(రజి) మూడు సార్లు తన దోసిళ్ళు నావైపు చాపి ఐదేసి వందల చొప్పున డబ్బులిచ్చారు.[1]**

**45) సయీద్ బిన్ జుబైర్(రజి) కథనం : 'దైవప్రవక్త మూసా - అలైహి స్సలాం (తన మహర్‌ను చెల్లించే విషయంలో) ఏ గడువును అనుసరించారు?' అని హీరా[1]కు చెందిన యూదుడు నన్ను ప్రశ్నించినప్పుడు, "ఈ విషయం నాకైతే తెలియదు. అయితే అరేబియాలోని గొప్ప విద్వాంసుణ్ణి అడిగి నీకు చెబుతాన"ని అన్నాను. తరువాత నేను హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి)ను అడిగితే, "ఆయన పెద్ద గడువునే అనుసరించారు (అంటే పదేండ్ల గడువును). ఇదే ఆ రెండు గడువులలో ఉత్తమమైనది.[2] మహాప్రవక్త ముహమ్మద్(స) కూడా ఎప్పుడయినా, ఎవరికయినా వాగ్దానం చేస్తే దానిని నెరవేర్చేవారు"[3] అని సమాధానమిచ్చారు.**

---

43-1. ఈ హదీసు ఇంతకుముందు 'విశ్వాస ప్రకరణం'లో కూడా వచ్చింది. వాగ్దానం నెరవేర్చటం తప్పనిసరి (వాజిబ్) అని చెప్పడానికి దీనిని ఇక్కడ పునరావృతం చేయాల్సి వచ్చిందని ఇమామ్ బుఖారీ (రహ్మా) పేర్కొన్నారు.

44-1. వాగ్దానం నెరవేర్చటం తప్పనిసరి అనడానికి ఇది మరొక ఉదాహరణ. మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్(రజి) అప్పులు తీర్చడంతోపాటు వాగ్దానాలను కూడా నెరవేర్చారు.

45-1. 'హీరా' ఒక పట్టణం పేరు. ఇది సుప్రసిద్ధ కర్బలా మైదానానికి సమీపంలో ఉంది.

45-2. దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) ముందు రెండు గడువులు పెట్టబడ్డాయి. హజ్రత్ షుఐబ్ (అ) ఆయనతో, "నేను నా కూతుళ్ళలో ఒకామెను నీకిచ్చి పెండ్లి చేయాలనుకుంటు న్నాను. అయితే నీవు నా దగ్గర 8 ఏండ్లు ఉద్యోగం చేయాలి. ఒకవేళ పదేండ్ల పాటు చేయగలిగితే ఇది నీ ఉపకారం అనుకుంటాను. అంతేగాని నీపైన బలవంతం చేయను" అని అన్నారు.

## అధ్యాయం : 31

## ముష్రిక్కుల సాక్ష్యం స్వీకార యోగ్యమవదు

షాబీ ఇలా అన్నారు: అన్య మతస్థుల సాక్ష్యం ఒండొకరికి వ్యతిరేకంగా ధర్మ సమ్మతం కాదు. "మేము వారి మధ్యన పరస్పరం ఓర్వలేనితనాన్ని సృష్టించిన కారణంగా ఇది ధర్మసమ్మతం కాదని అల్లాహ్ సెలవిచ్చాడు. ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు: "గ్రంథం కల ప్రజలు (తమ ధార్మిక ప్రవచనాలపై) చెప్పే దానిని ధ్రువీకరించటం గానీ, తిరస్కరించటం గానీ చేయకండి, 'మేమంతా అల్లాహ్‌నూ, ఆయన మా వైపునకు పంపిన హితోపదేశాన్ని విశ్వసించాము' **(2: 136)** అని మాత్రం అనండి."

**46)** ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు :"ముస్లింలారా! మీరు గ్రంథవహులకు (దీని గురించి) ఆ ప్రశ్నలు ఎందుకు వేస్తారు? వాస్తవానికి మీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)పై అవతరించిన మీ గ్రంథం, అల్లాహ్ తరఫున అవతరించిన గ్రంథాలలో చిట్టచివరిది. మీరు దానిని చదువుతుంటారు. అందులో ఎలాంటి కల్తీ లేదు. గ్రంథవహులు దేవుని తరఫు నుండి అవతరించిన గ్రంథంలో మార్పులు చేశారన్న విషయాన్ని అల్లాహ్ మీకు ముందుగానే చెప్పేశాడు. వారు స్వయంగా దైవగ్రంథంలో మార్పులు చేయడమేగాక, ఇది దైవగ్రంథమని బుకాయించారు. తద్వారా కొంత (ప్రాపంచిక) మూలధనం గడించాలన్నది వారి లక్ష్యం. ఏ జ్ఞానమైతే మీ వద్దకు వచ్చిందో అది మిమ్మల్ని, వారిని (గ్రంథవహులను) అడగటం నుండి వారించటం లేదా? దైవసాక్షి! వారిలోని ఏ మనిషీ మిమ్మల్ని మీ ప్రవక్త ద్వారా అందజేయబడిన గ్రంథ వాక్యాల గురించి ప్రశ్నిస్తుండగా నేను చూడలేదు."

---

45-3. అంటే దైవప్రవక్తలు వాగ్దాన భంగానికి పాల్పడరు. సయీద్ ఇలా అన్నారు : కొంతకాలం తర్వాత ఆ యూదుడు నన్ను కలుసుకున్నప్పుడు, ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పిన విషయాన్ని అతనికి తెలిపాను. ఇది విని, 'నిజంగా ఇబ్నె అబ్బాస్(రజి) ధర్మజ్ఞాని' అని అభిప్రాయపడ్డాడు. ఇబ్నె అబ్బాస్(రజి) ఈ విషయం దైవప్రవక్త(స) ద్వారా విన్నారు. దీని గురించి దైవప్రవక్త(స) జిబ్రీల్ (అ)ను అడగ్గా, జిబ్రీల్ (అ) అల్లాహ్‌ను అడిగారు. సమాధానంగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "మూసా(అ) మేలైన గడువును, సుదీర్ఘమైన దానిని అవలంబించాడు."

## అధ్యాయం : 32

## కష్టకాలంలో చీటీలు వేయటం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మర్యమ్ సంరక్షకుడు ఎవరు అవ్వాలి? అనే విషయ నిర్ణయం కొరకు, ఆలయ సేవకులు తమ కలములను విసరినప్పుడు..." (ఆలి ఇమ్రాన్ : 44). ఈ ఆయత్‌కు వ్యాఖ్యానంగా హ(జత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : వారంతా తమ కలములను (జోర్డాన్ కాలువ) నీటిలో విసిరినప్పుడు కలములన్నీ ఆ నీటిలో కొట్టుకుపోసాగాయి. కాని మహనీయ జకరియ్యా (అలైహిస్సలాం) కలం మాత్రం ఆ ప్రవాహంలో పైకి తేలింది. అందువల్ల ఆయనే మర్యమ్ (అలైహస్సలాం) సంరక్షణా బాధ్యతను స్వీకరించారు. అంటే వారు లాటరీ పద్ధతిలో చీటీలు వేయగా, అందులో ఆయన (జకరియ్యా) పేరే వచ్చింది. హ(జత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం ఒకానొక వ్యవహారంలో దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రతివాదిగా ఉన్నప్పుడు, కొంతమందిని ప్రమాణం చేసి చెప్పండి అని కోరగా, వారంతా ఒకేసారి ప్రమాణం చేయడానికి ముందుకువచ్చారు. అందుచేత వారి పేర్ల మీద చీటీలు వేసి, అందరికన్నా ముందు ఎవరి పేరు వస్తే వారిచేత ప్రమాణం చేయించమని ఆయన(స) ఆదేశించారు.[1]

**47)** ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించారని నోమాన్ బిన్ బషీర్ (రజి) తెలిపారు : ప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా చెప్పారు– "అల్లాహ్ హద్దుల (నేరము– శిక్ష) విషయంలో చూసీచూడనట్లుగా, తెలిసీ తెలియనట్లుగా వ్యవహరించేవారి ఉపమానం ఒక ఓడలో ప్రయాణం చేస్తూ తమ తమ సీట్ల నిర్ధారణకై చీటీలు వేసిన జనుల వంటిది. తరువాత వారిలో కొంతమంది క్రింది అంతస్తులో ప్రయాణమవగా, మరికొంత మంది పై అంతస్తులో పయనమయ్యారు. క్రింది అంతస్తులో ఉన్నవాళ్ళు నీళ్ళ కోసం పదేపదే పై అంతస్తు ప్రయాణీకుల మీదుగా సాగిపోవలసి వచ్చేది. దానివల్ల సహజంగానే పైనున్న వారికి ఇబ్బంది కలిగేది. పై అంతస్తువారిని ఇబ్బంది పెట్టడమెందుకని భావించి క్రింది అంతస్తులో

32–1. అత్యధిక మంది విద్వాంసుల దృష్టిలో వివాదాలలో ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు లాటరీ పద్ధతిలో చీటీలు వేయడం ధర్మసమ్మతమే. ఇమామ్ అబూహనీఫా(రహ్మ) కూడా దీనిని సరైనదిగా భావించినట్లు ఇబ్నె ముంజిర్ నకలు చేశారు. ఈ విధంగా దైవ వచనాల ద్వారా, ప్రవక్త ప్రవచనాల ద్వారా కూడా చీటీలు వేసే విధానం సరైనదని రూఢీ అయింది.

ఉన్న వ్యక్తి గొడ్డలితో ఓడ అడుగు భాగాన్ని నరకసాగాడు. (అలా చేస్తే క్రింది నుండే నీరు తీసుకోవచ్చని తలపోశాడు) పైవారు వచ్చి "నాయనా! ఇదేం చేస్తున్నావ"ని అడిగితే, 'నేను మాటిమాటికీ పైకి రావటం వల్ల మీకు ఇబ్బంది కలుగుతోంది కదా, అందుకే ఈ పని చేస్తున్నాను. ఎందుకంటే నాకూ నీళ్ళ అవసరం ఉంది' అని సమాధానమిచ్చాడు. ఇప్పుడు పై అంతస్తు వారు వచ్చి, అతని చెయ్యి పట్టి ఆపితే తామూ సురక్షితంగా ఉంటారు, వారిని కూడా రక్షించినవారవుతారు. కాని వారు తమకెందుకులే అని నిర్లిప్తంగా ఉండిపోతే వాళ్ళనూ నాశనం చేస్తారు, తామూ స్వయంగా నాశనమవుతారు."[1]

**48)** ఖారిజా బిన్ జైద్ అన్సారీ తెలిపారు : ఉమ్మె అలా అనే ఒక మహిళ ఉండేది. ఆమె దైవప్రవక్త(సఅసం) సమక్షంలో విధేయతా ప్రమాణం కూడా చేసింది. ఆమె నాతో ఇలా అనేది– అన్సార్లు ముహాజిర్లకు ఆశ్రయం కల్పించే విషయమై చీటీలు వేసినప్పుడు, ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి)కు ఆతిథ్యం ఇచ్చే బాధ్యత మాకు దక్కింది. ఉమ్మె అలా (ర.అ) ఇంకా ఇలా అంది: ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి) మా ఇంట్లో విడిది చేశారు. కొన్నాళ్ళ తర్వాత ఆయన అస్వస్థతకు గురయ్యారు. మేము ఆయనకు అన్ని విధాలా సపర్యలు చేశాము. కాని జబ్బు చేసిన కొన్నాళ్ళకే ఆయన చనిపోయారు. మేము ఆయన్ని కఫన్ వస్త్రంలో చుట్టిన తర్వాత ప్రవక్త మహనీయులు (సఅసం) విచ్చేశారు. 'అబూ సాయబ్(ఉస్మాన్–రజి– కునీయత్ ఇది)! మీపైన అల్లాహ్ కారుణ్యం వర్షించుగాక! అల్లాహ్ సన్నిధిలో మీకు గౌరవం, పెద్దరికం ప్రాప్తిస్తాయన్న విషయానికి నేను సాక్ష్యంగా ఉంటాను' అని నేనన్నాను. దైవప్రవక్త(స) ఈ మాట వినగానే, "అల్లాహ్ సన్నిధిలో ఈయనకు గౌరవం, పెద్దరికం ప్రాప్తిస్తుందన్న సంగతి నీకెలా తెలుసు?" అని అడిగారు. దానికి నేను, 'నా తల్లిదండ్రులు మీకు సమర్పితం. నాకు ఎవరి ద్వారా కూడా ఈ సంగతి తెలియ

---

47–1. ఈ హదీసు ద్వారా కూడా, సంక్లిష్ట పరిస్థితిలో చీటీలు వేయడం సరైనదేనని రూఢీ అవుతోంది. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఇక్కడ పొందుపరచటంలోని మరో ముఖ్య ఉద్దేశ్యమేమంటే; మంచిని పెంపొందించే, చెడును నిర్మూలించే పని అవశ్యంగా జరగాలి. లేకపోతే అందరూ చెడుల వాతన పడే ప్రమాదం పొంచి ఉంటుంది. శక్తి ఉంటే చెడును చేత్తో ఆపాలి. లేకపోతే నోటితోనయినా చెప్పాలి. అది కూడా సాధ్యం కాకపోతే మనసులోనయినా దానిని చెడుగా భావించాలి. ఇది విశ్వాసం (ఈమాన్) యొక్క అధమ శ్రేణి.

**లేదు' అని సంజాయిషీ ఇచ్చాను. పిదప ఆయన(సఅసం) ఇలా అన్నారు: "ఉస్మాన్ విషయానికి వస్తే, ఈయన మరణించారన్న దానికి అల్లాహ్‌యే సాక్షి. నేను మటుకు, అల్లాహ్ ఈయనకు మంచి చేస్తాడనే ఆశిస్తున్నాను. కాని అల్లాహ్ సాక్షిగా! నేను దైవప్రవక్తనైనప్పటికీ ఈయన పట్ల ఎటువంటి వ్యవహారం జరగనున్నదో నాక్కూడా తెలియదు." ఉమ్మె అలా (ర.అ) ఇలా అంది: 'అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. ఇక మీదట నేను ఏ వ్యక్తి పవిత్రత గురించి కూడా (ధ్రువీకరణ స్థాయిలో) చెప్పనుగాక చెప్పను. (నాకు తెలియని దానిని గురించి దైవప్రవక్త(స) సమక్షంలో ప్రేలాపన చేసినందుకు) నాకు చాలా బాధ కలిగింది'. ఆమె ఇలా అంది: (ఒక రోజు) తాను నిద్రిస్తుండగా కలలో ఉస్మాన్ బిన్ మజ్‌ఊన్ కోసం ప్రవహించే సెలయేరును చూశాను. నేను దైవప్రవక్త(స) దగ్గరకు వెళ్ళి, నేను కన్న కలను గురించి చెప్పగా, "ఇది అతని సదాచరణ"అని దైవప్రవక్త(స) వివరించారు.**[1]

**49) విశ్వాసుల మాత హ్‌జ్రత్ ఆయిషా (ర.అ) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసం)ఏదైనా ప్రయాణానికి సంకల్పించుకున్నప్పుడల్లా తమ సతీమణుల మధ్య చీటీలు వేసేవారు. ఎవరి పేరు వస్తే వారిని తన వెంట తీసుకెళ్ళే వారు. ఆయన(స) గారి ఇంకొక ఆనవాయితీ ఏమిటంటే, తన భార్యలలో ప్రతి ఒక్కరికీ- వంతులవారీగా- ఒక పగలు, ఒక రేయి కేటాయించేవారు. కాకపోతే**

---

48-1. ఎంతటి ధర్మపరాయణులైనా సరే వారు ఖచ్చితంగా 'స్వర్గవాసులు' అని తేల్చి చెప్పే హక్కు మనకెవరికీ లేదు. ఈ హక్కు, అధికారం కేవలం దైవానికి, దైవప్రవక్తకే చెల్లు. ఈ హదీసులో 'దైవసాక్షి' అనే పదం పదేపదే పునరావృతం అయింది. ఈ కారణంగానే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఈ ప్రకరణంలో నమోదు చేశారు.

వేరొక ఉల్లేఖనంలో, "నా పరిస్థితి ఏమవుతుందో, ఉస్మాన్ పరిస్థితి ఎలా ఉంటుందో.." అని ఉంది. ఈ వాక్యం అహ్‌ఖాఫ్ సూరాలోని ఈ ఆయత్‌కు అనుగుణంగా ఉంది : "రేపు మీకు ఏమి జరుగనున్నదో, నాకు ఏమి కానున్నదో నాకైతే తెలియదు" (46: 9)

మీ ప్రవక్తకు, తన మోక్షం గురించే ఏమీ తెలియనప్పుడు, ఇతరులకు ఆయన(స) విముక్తి ఎలా ఇస్తాడు అని క్రైస్తవ మతాధిపతులు అభ్యంతరం లేవనెత్తారు. కాని ఇది అర్థంలేని ఆక్షేపణ. ఎందుకంటే ఆయనే(స) గనక సత్యవంతుడైన ప్రవక్త కాని పక్షంలో, అందరి తరఫున వకాల్తా పుచ్చుకుని నేనలా చేసేస్తాను, ఇలా చేసేస్తానని ప్రగల్భాలు పలికి ఉండేవారు. సత్యసంధులు సదా వినయ శీలురుగానే ఉంటారు. ఈ కారణంగానే ఆయన(స) అలా పలికారు.

సౌదా బిన్తె జమా(ర.అ) తన వృద్ధాప్యంలో తన వంతును హజ్రత్ ఆయిషా (ర.అ)కు ఇచ్చుకున్నారు. దైవప్రవక్త(సఅసం) సంతోషాన్ని చూరగొనే ఉద్దేశ్యంతో ఆమె గారు ఇలా చేశారు (ఈ హదీసు ద్వారా కూడా చీటీలు వేయటం సరైనదేనని విదితమవుతోంది)

**50)** ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "అజాన్ పిలుపు ఇవ్వటంలో, మొదటి పంక్తిలో ఉండటంలో ఎంత పుణ్యం లభిస్తుందో జనులకు తెలిస్తే (దానిని పొందడానికి) వారు చీటీలు వేసుకోవాల్సి వస్తే చీటీలు కూడా వేసుకునేవారు. ఒకవేళ నమాజ్‌ను తొలి వేళలో చేయటం వల్ల ప్రాప్తించే పుణ్యఫలం గురించి వారికి తెలిస్తే (స్థలం దొరకదేమోనన్న భయం చేత) చీటీలు వేయవలసి వస్తే వారు అందుకు వెనుకాడేవారు కారు. అలాగే వారికి గనక ఇషా నమాజ్, ఫజ్ర్ నమాజ్ శ్రేష్ఠత గురించి తెలిస్తే, దానిని చేయడానికి వారు మోకాళ్ళ మీద నడుచుకుంటూ రావలసి వచ్చినాసరే వచ్చేవారు."

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 2. సంధి ప్రకరణం

## అధ్యాయం : 1

## ప్రజల మధ్య సంధి చేయించినందుకు ప్రాప్తమయ్యే పుణ్యం[1]

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"ప్రజలు జరిపే రహస్య సమాలోచనలలో సాధారణంగా ఏ మేలూ ఉండదు. కాని ఎవరయినా రహస్యంగా దానధర్మాలు చెయ్యండి అని బోధిస్తే లేక ఏదయినా సత్కార్యం కొరకు లేదా ప్రజల వ్యవహారాలను చక్కబరిచే ఉద్దేశ్యంతో ఎవరితోనయినా ఏదైనా రహస్యం చెబితే అది మంచి విషయమే. ఎవరయినా అల్లాహ్ సంతోషం కొరకు ఈ విధంగా చేస్తే వారికి మేము గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము." *(అన్ నిసా: 114)*- నాయకుడు (పరిపాలకుడు) అయినవాడు స్వయంగా తన అనుయాయులలోకి వెళ్ళి వారి మధ్యన వ్యవహారాలను చక్కబరిచే పని చేయాలని ఈ అధ్యాయంలో చెప్పటం జరిగింది.**[2]

---

1-1. ఘర్షణలను నివారించడానికి, కలతలను రూపుమాపటానికి చేసే కృషిని సంధి యత్నం అంటారు. సంధి ఎట్టి పరిస్థితిలోనూ వాంఛించదగినదే. అవతలి పక్షం వారు సంధికి సుముఖంగా లేకపోయినా సరే వారిని సంప్రతించి, సంధికి ఒప్పించటం గొప్ప సత్కార్యం. గొడవ గాయపడిన వారికి సంబంధించినదయినా, ఆలుమగల మధ్య ఏర్పడిన మనస్పర్థలయినా, ఇరువర్గాల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలోనయినా సంధి స్వాగతించదగినది.

1-2. ఇమామ్ బుఖారీ (రహ్మ) సంధి ప్రాముఖ్యత విషయంలో ఈ ఒక్క ఆయత్‌తోనే సరిపెట్టుకున్నారు. బహుశా ఆయన గారికి తన నియమ నిబంధనలకు తగిన హదీసు ఏదీ ఈ అధ్యాయంలో లభించలేదేమో! ఇమామ్ అహ్మద్ (రహ్మ) గారు అబూ దర్దా ఆధారంగా- మర్ఫూఅన్‌గా - వెలికి తీసిన హదీసు ప్రకారం మహాప్రవక్త(స) ఇలా

**51) సహ్లె బిన్ సాద్(రజి) వివరించారు : (ఖుబాలో నివసించే) బనూ అమ్ర్ బిన్ ఔఫ్ తెగ వారి మధ్య పరస్పర సంఘర్షణ మొదలయింది. అప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసం) కొంతమంది సహచరులను వెంటబెట్టుకుని, వారి మధ్య సయోధ్య కోసం అక్కడికి వెళ్ళారు. నమాజ్ వేళ అయింది. కాని ఆయన(స) రాలేదు. వేళ అవగానే హజ్రత్ బిలాల్(రజి) అజాన్ ఇచ్చారు. అప్పటికీ దైవ ప్రవక్త (సఅసం) రాకపోవటంతో, ప్రవక్త(స) ఇంతకుముందు ఇచ్చిన సూచన ప్రకారం బిలాల్ (రజి) అబూబకర్(రజి) దగ్గరకు వచ్చి, 'దైవప్రవక్త(స) అక్కడే ఇరుక్కుని ఉన్నారు. మరేమో నమాజ్ వేళ అయిపోయింది. మీరు నమాజ్‌కు సారథ్యం వహిస్తారా?' అని అడగ్గా, 'సరే. నువ్వు పద' అన్నారు అబూబకర్(రజి). తరువాత బిలాల్(రజి) తక్బీర్ పలుకగా, అబూబకర్ ఇమామత్ చేయడానికి ముందుకు వెళ్ళి నిలబడ్డారు. నమాజు జరుగుతూ ఉండగా దైవప్రవక్త(స) వచ్చి, పంక్తులను చీల్చుకుంటూ వచ్చి ముందు వరుసలో నిలబడ్డారు. ఇది గమనించిన నమాజీలు చప్పట్లు చరచసాగారు. కాని అబూబకర్(రజి) విధానమేమిటంటే, ఆయన ఒకసారి నమాజ్‌లో నిమగ్నులయ్యారంటే అటూఇటూ చూడకుండా ఏకాగ్రతతో మనసును నమాజ్‌లోనే లగ్నం చేసేవారు. కాని జనులు మాటిమాటికీ చప్పట్లు చరచటంతో ఆయన క్రీగంట చూశారు. దైవప్రవక్త(స) వచ్చి తన వెనుక నిలబడి ఉన్నారన్న విషయాన్ని పసిగట్టారు. నీవు అక్కడి నుండి కదలాల్సిన అవసరం లేదు. యథాస్థానంలో నీ నమాజ్‌ను కొనసాగించు అన్నట్లు దైవప్రవక్త(స) 'సంజ్ఞ' చేశారు. అయితే అబూబకర్(రజి) చేతులెత్తి దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుని, తల త్రిప్పకుండానే వెనక్కి జరిగి జనుల పంక్తిలో కలసిపోయారు. అప్పుడు దైవప్రవక్త(స) ముందుకు వెళ్ళి నమాజ్‌కు సారథ్యం వహించారు. నమాజ్‌ను ముగించిన తరువాత ఆయన(స) జనుల వైపునకు తిరిగి ఇలా ఉపదేశించారు:**

---

అన్నారు : "నమాజ్ మరియు దానధర్మాల కంటే కూడా శ్రేష్ఠమైన విషయం ఏదో నేను మీకు చెప్పనా! అదేమిటంటే; పరస్పరం సయోధ్య కుదర్చటం." పరస్పరం నెలకొన్న కలహం సత్కార్యాలను హరిస్తుంది. కక్షలు, కార్పణ్యాలను ఖుర్‌ఆన్ చాలా తీవ్రంగా ఖండించింది. అల్లాహ్ కలహకారులను ఇష్టపడదని ఖుర్‌ఆన్ పదేపదే వక్కాణించింది. పైగా ఆయన సంధిని, శాంతిని, పరస్పర సహాయ సహకారాలను ఇష్ట పడతాడు.

**"ప్రజలారా! మీరు నమాజ్‌లో ఏదయినా అసాధారణ విషయం ఎదురైనప్పుడు చప్పట్లు చరుస్తున్నారు. చప్పట్లు మ్రోగించటం అనేది ఆడవాళ్ళకు. మగవారు అలా చేయకూడదు. నమాజ్‌లో ఏదయినా అసాధారణ విషయం సంభవించినప్పుడు పురుషులు 'సుబ్‌హానల్లాహ్' అని పలకాలి. ఎందుకంటే ఈ పదం విన్నవారు అప్రమత్తులై పొరబాటును పసిగడతారు. అబూబకర్! నమాజ్‌ను కొనసాగించండి అని నేను సంజ్ఞ కూడా చేశాను కదా! మరి మీరు నమాజ్‌కు సారథ్యం ఎందుకు వహించలేదు?"అని అడగ్గా, సమాధానంగా అబూబకర్(రజి) ఇలా అన్నారు : 'దైవ ప్రవక్త(సఅసం) వెనక నిలబడి ఉండగా నమాజ్‌కు సారథ్యం వహించటం అబూ ఖుహాఫా పుత్రునికి శోభించదు.'[1]**

**52) హజ్రత్ అనస్(రజి) కథనం: 'తమరు ఒకసారి అబ్దుల్లాహ్ బిన్ ఉబై (కపటి) దగ్గరకు విచ్చేస్తే బాగుంటుందేమో' అని కొంతమంది జనులు దైవ ప్రవక్త(సఅసం)కు సలహా ఇవ్వగా,[1] దైవప్రవక్త(సఅసం) ఒక గాడిదపై స్వారీ అయి అతని దగ్గరకు వెళ్ళారు. ప్రియ సహచరులు (ర.అన్‌హుమ్) ఆయన వెనుకే నడిచి**

---

51–1. ఈ హదీసు వెనుకటి అధ్యాయంలో కూడా వచ్చింది. సంధికి యత్నించటం ఎంత గొప్ప సత్కార్యమో గుర్తు చేయడానికే ఇమామ్ బుఖారీ (రహ్మ) మరోసారి దీనిని ఇక్కడ పునరావృతం చేశారు. సమాజంలోని అత్యుత్తమ శ్రేణి వ్యక్తులు సయితం సామాన్యుల మధ్య రాజీకి కృషి చేయవచ్చు. ప్రవక్త మహనీయుల(స) కంటే గొప్పవారు ఎవరుంటారు? అయినప్పటికీ ఆయన(స) ఈ పవిత్ర కార్యం కొరకు 'ఖుబా' వాడకు వెళ్ళారు.

52–1. అబ్దుల్లాహ్ బిన్ ఉబై మదీనాలోని 'ఖజ్రజ్' తెగ నాయకుడు. మదీనా వాసులు అతనికి కిరీటం తొడిగించి, తమ రాజుగా చేసుకోవాలనుకున్నారు. కాని దైవప్రవక్త(స) మదీనాకు హిజ్రత్ చేసి రావటం వల్ల పరిస్థితుల స్వరూపం మారింది. తమరు ఒకసారి అతని దగ్గరకు వెళ్ళి మాట్లాడితే అతని మనసులోని కల్మషం దూరమవుతుందని, అతని వర్గానికి చెందిన చాలామంది ఇస్లాం స్వీకరిస్తారని కొంతమంది ప్రియ సహచరులు దైవప్రవక్త(స)కు సలహా ఇచ్చారు.

దైవప్రవక్తలు గర్విష్టులై ఉండరు. వారు సదా ప్రజల సన్మార్గాన్నే లక్ష్యంగా పెట్టుకుంటారు. అందుకే మహాప్రవక్త(స) అబ్దుల్లాహ్ బిన్ ఉబైతో సంప్రతింపులు జరపటానికి వెంటనే సిద్ధమయ్యారు. కాని ఆ కపటి ఒక అహంభావి. తనను తాను పరిశుభ్రతా ప్రియుడుగా ఊహించుకునేవాడు. అందుకే దైవప్రవక్త(స)ను కించపరిచే దుర్బుద్ధితో, ఆయన(స) గారి వాహనాన్ని (గాడిదను) దుర్గంధభరితమైనదిగా అభివర్ణించాడు. వాస్తవానికి అది అతని ఆంతర్యంలోని అక్కసుకు ప్రతిబింబం. ఒక అన్సార్ శిష్యుడు

**వచ్చారు. అక్కడి నేల చవుడు నేల (అవటం వల్ల దుమ్ము ధూళి రేగింది). తీరా దైవప్రవక్త(సఅసం) అతని దగ్గరకు విచ్చేసినప్పుడు, 'మీరు కాస్త దూరం జరగండి. మీ గాడిద కంపు వల్ల నా మెదడు మొద్దుబారిపోయింద'ని ప్రేలాడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై. ఇది విన్న ఒక అన్సార్ సహాబీ, 'దైవసాక్షి! దైవప్రవక్త(స) గారి గాడిద వాసన నీకన్నా సువాసన కలదే' అని వ్యాఖ్యానించారు. సహాబీ చెప్పిన ఈ మాట విన్న అబ్దుల్లాహ్ బిన్ ఉబై (తెగకు చెందిన) మనిషికి కోపం వచ్చింది. వారిద్దరూ పరస్పరం నిందారోపణలకు దిగారు. తరువాత వారిద్దరి తరఫున ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత ఏర్పడింది. పరస్పరం లాఠీలు ఝుళిపించుకునేవరకూ వెళ్ళారు. ఈ ఆయత్ ఆ సందర్భంగా అవతరించినదేనని మాకు తెలిసింది: "ఒకవేళ విశ్వాసుల లోని రెండు వర్గాల వారు పరస్పరం పోట్లాడుకుంటే, వారి మధ్య రాజీ కుదిరించండి."[2] *(49 : 9)***

## అధ్యాయం : 2

## జనుల మధ్య రాజీ కుదర్చడానికి అబద్ధం చెప్పేవాడు అబద్ధీకుడు కాదు.

**53) ప్రవక్త మహనీయులు(సఅసం) చెబుతుండగా తాను విన్నానని ఉమ్మె కుల్సుమ్ బిన్తె ఉఖబా తెలిపారు : "ప్రజల మధ్యన సయోధ్య కుదిర్చే ప్రయత్నంలో, ఆ పని కోసం ఏదైనా మంచి మాటను చేరవేసేవాడు లేదా ఒక మంచి మాటను పలికేవాడు అబద్ధీకుడు కాదు."[1]**

---

అతని మాటకు దీటుగా జవాబిచ్చేసరికి, అతని వర్గానికి చెందిన కొంతమంది ఆవేశంతో ఊగిపోయారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగింది. పరస్పరం కత్తులు దూసుకునే వరకూ వచ్చింది వ్యవహారం.

అయితే దైవప్రవక్త(స) దూరదృష్టితో వ్యవహరించి, ఇరువర్గాలను శాంతపరిచారు. ఈ సందర్భంగా అవతరించిన ఆయత్‌లో ముస్లింల మధ్య సఖ్యతకు ప్రయత్నించమని ఆదేశించబడింది.

52-2. ముస్లింలకు చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినప్పుడు వారి మధ్య రాజీ కుదిరించండి అని పై ఆయత్‌లో చెప్పబడింది. ఇక్కడ ఒక ఆక్షేపణ ఉత్పన్నం కావచ్చు- ఆయత్‌లో 'ముస్లింల మధ్య గొడవ జరిగినప్పుడు...'అని ఉంది కదా! మరి అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఆ సమయంలో ముస్లిం కాడు కదా! అని కొందరు ప్రశ్నించవచ్చు. అయితే అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తఫ్సీర్ ఆధారంగా ఖుస్తులానీ ఏమంటారంటే, అప్పటికే అబ్దుల్లాహ్ బిన్ ఉబై వర్గీయుల్లో చాలామంది ఇస్లాం స్వీకరించారు. అందువల్ల ఈ ఆయత్ ఆ ఇరువర్గాల వారిని ఉద్దేశించినదే.

## అధ్యాయం : 3

## "మమ్మల్ని తీసుకెళ్ళండి, మేము సంధి చేయిస్తాము" అని పాలనాధికారి చెబితే...

**54)** సహ్ల్ బిన్ సాద్(రజి) తెలిపారు : ఖుబా జనులు పరస్పరం ఘర్షణ పడ్డారు. వ్యవహారం ఒకరింకొకరిపై రాళ్ళు రువ్వుకునే వరకూ వచ్చింది. ఈ విషయం దైవప్రవక్త(సఅసం)కు తెలియజేసినప్పుడు, "మమ్మల్ని (వారి వద్దకు) తీసుకెళ్ళండి. మేము వారి మధ్య రాజీ కుదిరిస్తాము"[1] అని ఆయన(స) పలికారు.

## అధ్యాయం : 4

## "భార్యాభర్తలు గనక పరస్పరం రాజీకి వస్తే ఇది ఎంతో మేలైనది"అని (అన్ నిసా సూరాలో) అల్లాహ్ సెలవీయటం

**55)** విశ్వాసుల మాత హ(జ్రత్ ఆయిషా(ర.అ), "ఒక స్త్రీ, తనను భర్త నిరాదరించి, వేధిస్తాడేమో అనీ లేదా విముఖుడై ఈసడించుకుంటాడేమో అనీ

---

53–1. ఉదాహరణకు: ఇద్దరు వ్యక్తుల మధ్య మనస్పర్థలు వచ్చి దూరాలు ఏర్పడినప్పుడు, వారిద్దరినీ కలిపే సదుద్దేశ్యంతో, 'అయ్యో! అతను మీ శ్రేయోభిలాషి అండీ, ఎప్పుడూ మీ గురించి మంచిగా చెబుతుంటాడు' అని అనటం అబద్ధం అనిపించుకోదు. ఖుస్తులానీ ఏమంటారంటే, ఇలాంటి చిన్న అబద్ధం క్షంతవ్యమే. దీనిద్వారా మేలు జరుగుతుంది. ఇమామ్ ముస్లిం (రహ్మ) ఉల్లేఖనంలో అదనంగా ఇలా ఉంది : "మూడు చోట్ల అబద్ధం చెప్పేందుకు అనుమతి ఉంది– 1) యుద్ధంలో 2) ఇద్దరు ముస్లింల మధ్య రాజీ కోసం 3) తన భార్యను ప్రసన్నురాల్ని చేసుకునేందుకు. ప్రయోజనం, పరమార్థం ఉందనుకున్నచోట కూడా ఇలా చెప్పవచ్చని కొందరు భాష్యం చెప్పారు. నష్టం వాటిల్లుతుందని, పరమార్థం లేదని అనుకున్నచోట మాత్రమే అబద్ధం చెప్పటం నిషిద్ధ మని వీరంటారు. మరికొంతమంది ప్రకారం ఎట్టి పరిస్థితిలోనూ అబద్ధం చెప్పకూడదు. కాకపోతే 'తౌరియా' చేయవచ్చు. ఉదాహరణకు: ఒక దుర్మార్గునితో, 'నేను నీ కోసం దుఆ చేస్తాను' అనవచ్చు. అనివార్యమైనప్పుడు అబద్ధం చెప్పవచ్చు అనే విషయంలో అందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. అంటే ఇద్దరు వ్యక్తుల మధ్య సంధి కోసం లేదా దౌర్జన్యపరుని దౌర్జన్యం నుండి రక్షణ కోసం లేదా ఒకరి ప్రాణాలను కాపాడటం కోసం. 'ఇన్నమల్ ఆమాలు బిన్నియ్యాత్' అంతరార్థం కూడా ఇదే కదా!

54–1. అంటే దైవప్రవక్త(స) ఖుద్దుగా సంధి పట్ల ఆసక్తి కనబరిచారు. ఈ అధ్యాయంలో ప్రధానాంశం ఇదే. పరస్పర సంఘర్షణలకు ఎల్లప్పుడూ ఆస్కారం ఉంటుంది. అయితే మానవత్వం వాంఛించేదేమిటంటే ఎంతో నేర్పుతో, ఓపికతో సంఘర్షణను నివారించి జనుల మధ్య సంఘీభావాన్ని సృజించాలి.

**భయపడితే, భార్యాభర్తలిరువురూ పరస్పరం (ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో) సర్దుబాటు చేసుకోవటంలో తప్పులేదు" (4: 128) అన్న దైవోపదేశంపై వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు : "భర్తకు తన భార్యలో తనకు ఇష్టంకానిదేదైనా కనిపించినప్పుడు, ఉదాహరణకు, వృద్ధాప్యం కారణంగా ఆమెను తన నుండి వేరు చేయగోరినప్పుడు, భార్య తన భర్తతో, 'నాకు విడాకులు ఇవ్వకు. నీకు చేతనైన మేరకు భరణం ఇస్తూ ఉండు' అని చెబితే, ఈ విషయమై వారిద్దరి మధ్య ఒక అంగీకారం కుదిరితే అందులో దోషం ఏమీలేదు."[1]**

## అధ్యాయం : 5

## ఒకవేళ అన్యాయం, అక్రమంపై సంధి చేసుకుంటే అట్టి సంధి వ్యర్థం

**56) అబూ హురైరా, జైద్ బిన్ ఖాలిద్ జుహన్నీ (ర.అన్హుమా)ల కథనం: ఒక పల్లెటూరి వ్యక్తి వచ్చి 'దైవప్రవక్తా! మా మధ్య దైవగ్రంథం ప్రకారం తీర్పు ఇవ్వండి' అని విన్నవించుకున్నాడు. అవతలి వ్యక్తి కూడా అదే మాటన్నాడు- 'ఇతను చెప్పేది నిజం. మా ఇద్దరి మధ్య దైవగ్రంథం ప్రకారం తీర్పు చెయ్యండి' అని. పల్లెటూరి వ్యక్తి ఇలా అన్నాడు: 'నా కుమారుడు[1] ఇతని దగ్గర పాలేరుగా ఉన్నాడు. తరువాత వాడు ఇతని భార్యతో వ్యభిచారం చేశాడు. నీ కుమారునిపై రాళ్ళు రువ్వబడతాయి అని జనులు చెప్పారు. కాని నేను నా అబ్బాయిని ఈ శిక్ష నుండి కాపాడేందుకు- పరిహారంగా- నూరు మేకలను, ఒక సేవకురాలిని ఇతనికి ఇచ్చుకున్నాను.[2] తరువాత నేను ఈ వ్యవహారం గురించి జ్ఞాన సంపన్నులను విచారించగా[3] నీ కుమారునికి నూరు కొరడా దెబ్బలు కొట్టడంతోపాటు ఒక ఏడాది కాలం**

---

55-1. మరి ఈ అంగీకారం ప్రకారం భర్త తన భార్య వంతును మరో భార్యకు కేటాయించుకున్నా లేదా లోగడ ఇచ్చే ఇంటి ఖర్చుల్లో కోత విధించినా అతను దోషి కాజాలడు. ఎందుకంటే భార్య స్వయంగా తన హక్కును వదులుకుంది కాబట్టి. ఉదాహరణకు- విశ్వాసుల మాత హజ్రత్ సౌదా బిన్తె జమాఁ (ర.అ) తన వంతును మనస్ఫూర్తిగా హజ్రత్ ఆయిషా(ర.అ)కు- కానుకగా- ఇచ్చుకున్నారు. ఈమె వంతు వచ్చిన రోజున దైవ ప్రవక్త(స) ఆయిషా(ర.అ) దగ్గర ఉండేవారు. భార్యాభర్తలు జీవితాంతం సంఘర్షణా పూరితంగా ఉండటం కన్నా వారిరువురూ ఒక అవగాహనకు రావటం ఎంతో మేలు.

56-1. ఆ పల్లెటూరి వ్యక్తి పేరుగాని, అతని కుమారుని పేరుగానీ, అతని ఆసామీ పేరు గానీ, అతని భార్య పేరు గానీ ఎక్కడా పొందుపరచబడిలేదు.

**పాటు అతనిని దేశం నుండి బహిష్కరించటం తప్ప మార్గాంతరం లేదని వారు చెప్పారు' (ఎందుకంటే ఆ అబ్బాయి అవివాహితుడు). ఇదంతా విన్న మీదట ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా పలికారు : "నేను దైవగ్రంథం ప్రకారమే నీ వివాదాన్ని పరిష్కరిస్తాను. నీ సేవకురాలు, నీ మేకలు నీకు వాపసు చేయబడతాయి. అయితే నీ కుమారునికి మాత్రం నూరు కొరడా దెబ్బలు కొట్టబడతాయి. ఒక సంవత్సర కాలంపాటు అతన్ని నీ ఊరి నుండి బహిష్కరించటం జరుగుతుంది. ఉనైస్! (ఈయన అస్లం తెగకు చెందిన సహాబీ) నువ్వు ఆ స్త్రీ ఇంటికి వెళ్ళు. (ఆమె గనక వ్యభిచారం చేసినట్లు ఒప్పుకుంటే) ఆమెకు రాళ్ళు రువ్వే శిక్షను అమలుపరచు". ఉనైస్ ఆ స్త్రీ దగ్గరకు వెళ్ళారు (ఆమె తన తప్పును ఒప్పుకుంది అందువల్ల)ఆమెకు రాళ్ళు రువ్వే శిక్ష విధించారు.**

**57) అమ్మ ఆయిషా(ర.అ) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరయినా మా ధర్మం (దీన్)లో లేని విషయాన్ని తమంతట తాముగా– సరికొత్తగా – కల్పించుకుంటే అది నిషిద్ధమైనది, రద్దు పరచదగినది" ఈ హదీసును అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ మఖ్రమీ, అబ్దుల్ వాహెద్ బిన్ అబీ ఔన్‌లు కూడా సాద్ బిన్ ఇబ్రాహీమ్ నుండి ఉల్లేఖించారు.** [1]

---

56–2. అంటే నూరు మేకలను, ఒక బానిస స్త్రీని పరిహారంగా ఇచ్చి తన కొడుక్కి శిక్ష పడకుండా చూసుకున్నాడు. కాని ఆ సర్దుబాటు షరీఅత్‌కు విరుద్ధమైనది.

56–3. ఇక్కడ 'జ్ఞాన సంపన్నులు' అంటే దైవప్రవక్త(సఅసం) జీవిత కాలం నుండే ధార్మిక తీర్పులు ఇచ్చే సహాబీలు అని భావం. వీరిలో నలుగురు మార్గదర్శక ఖలీఫాలతోపాటు ముఆజ్ బిన్ జబల్, ఉబై బిన్ కాబ్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర.అన్‌హుమ్) కూడా ఉన్నారు.

ఒక విషయం గురించి తెలియనప్పుడు లేదా సందిగ్ధం ఏర్పడినప్పుడు విద్వాంసులను అడిగి నిజనిర్ధారణ చేసుకోవటం మంచిదని ఈ హదీసు ద్వారా సుబోధకం అవుతోంది. కాకపోతే ఈ విచారణ దైవగ్రంథం, దైవప్రవక్త సున్నత్ వెలుగులోనే జరగాలి. "మీకు తెలియకపోతే జ్ఞాపిక కలవారిని అడగండి" (16:43) అన్న దైవాదేశంలోని అంతరార్థం కూడా ఇదే.

57–1. అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ గారి ఉల్లేఖనాన్ని ఇమామ్ ముస్లిం, అబ్దుల్ వాహెద్ గారి ఉల్లేఖనాన్ని దారె ఖుత్నీ వసల్ చేశారు. ఈ హదీసు ద్వారా విదితమయ్యేదేమిటంటే షరీఅత్ సూత్రాలకు విరుద్ధంగా ఉన్న సయోధ్య వ్యర్థమైనది, అధర్మమైనది. రాజీ ఒప్పందమే మిథ్య అయినప్పుడు, అది ఏ వర్గంతో చేసుకున్నా రద్దుపరచదగినదే.

## అధ్యాయం : 6

**సంధి పత్రంపై 'ఇది సంధి పత్రం. ఫలానా కుమారుడగు ఫలానా వ్యక్తి, ఫలానా పుత్రుడగు ఫలానా వ్యక్తి ఈ సంధి చేసుకున్నారు' అని వ్రాస్తే సరిపోతుంది. కుటుంబీకుల గురించి గానీ, వంశపారంపర్యం గురించి గానీ వ్రాయవలసిన అవసరం లేదు.**

**58)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) హుదైబియా ఒడంబడిక (ఖురైషులతో) చేసుకున్నప్పుడు, ఆ దస్తావేజును హజ్రత్ అలీ (రజి) లిఖించారు. 'దైవ సందేశహరుడగు ముహమ్మద్ (సఅసం) తరఫున వ్రాయునదేమనగా..' అని ఆయన లిఖించినప్పుడు, ముష్రిక్కులు దానికి అడ్డు తగులుతూ, 'ముహమ్మద్(స)తోపాటు దైవ సందేశహరుడు అనే పదం వ్రాయ కండి. మిమ్మల్ని గనక మేము దైవసందేశహరునిగా అంగీకరించినట్లయితే, మీతో మేము పోరాడవలసిన పనేముంటుంది?' అని అభ్యంతరం లేవనెత్తారు. అప్పుడు మహాప్రవక్త(స) అలీతో, 'రసూలుల్లాహ్' (దైవ సందేశహరుడు) అనే పదాన్ని కొట్టివేయమని ఆదేశించారు. దానికి హజ్రత్ అలీ (రజి) 'దానిని కొట్టి వేయటం ఎన్నటికీ నా వల్ల కాద'ని[1] బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) స్వయంగా ఆ పదాన్ని తన చేత్తో కొట్టి వేసి[2] ముష్రిక్కులతో ఒడంబడిక చేసుకున్నారు. ఆ ఒడం బడికలోని షరతు ఇది : దైవప్రవక్త (స) వచ్చే ఏడాది తన సహచరులతో కలసి మూడు రోజుల కొరకు మక్కా రావచ్చు. ఖడ్గాలను ఒరల్లో పెట్టుకుని నగరంలో ప్రవేశించాలి.[3] (ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన పదం) 'జులుబ్బానిస్సలాహ్' అంటే ఏమిటి? అని శిష్యులు ప్రశ్నించగా, "ఒర మరియు అందులో పెట్టబడేది" అని ఆయన జవాబిచ్చారు.

---

ఈ హదీసు షరీఅత్ మూలసూత్రాలకు ప్రాతిపదిక వంటిది. దీని ద్వారా ప్రజలు ధర్మం (దీన్)లో కల్పించుకునే కొత్త పోకడలన్నీ రద్దుపరచబడతాయి.

58-1. హజ్రత్ అలీ (రజి) పలికిన ఈ మాట ఆజ్ఞోల్లంఘన క్రిందికి రాదు. కాకపోతే విశ్వాసం (ఈమాన్) వల్ల జనించిన పౌరుషం కారణంగా ఆయన అలా చెప్పాల్సి వచ్చింది.

58-2. వేరొక ఉల్లేఖనం ప్రకారం ఆయన(స) 'సందేశహరుడు' అని వ్రాసిన చోట 'దాసుడు' అని వ్రాశారు. ఇది ప్రవక్త(స) గారి అద్భుతాలలో ఒకటి. ఆయనకు చదవటం, వ్రాయటం రాదు. కాని ఇక్కడ మాత్రం ఆయన(స) 'సందేశహరుడు' అనే పదాన్ని చదువుకుని, దానిని కొట్టి వేసి 'దాసుడు' (అబ్ద్) అనే పదాన్ని లిఖించారు. అంటే ఆ ఒడంబడిక పత్రంలో 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అనే వాక్యానికి బదులు 'ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్' అని వ్రాయటం జరిగింది.

**59)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసం) జీఖఅదా మాసంలో ఉమ్రా కొరకు ఇహ్రామ్ కట్టుకున్నారు. కాని మక్కా వారు ఆయన్ని (స) నగరంలో ప్రవేశించనివ్వలేదు. చివరకు ఉభయ వర్గాల మధ్య సంధి జరిగింది. దాని ప్రకారం (వచ్చే సంవత్సరం) ఆయన మక్కాలో మూడు రోజులపాటు విడిది చేయవచ్చు. ఒడంబడిక వ్రాయటం మొదలెట్టినప్పుడు, 'దైవప్రవక్త యగు ముహమ్మద్(స) తరఫున లిఖించబడిన ఒడంబడిక పత్రమిది' అని వ్రాయటం జరిగింది. కాని బహుదైవారాధకులు దానిపై అభ్యంతరం తెలుపుతూ "మేము దీనిని సుతరామూ అంగీకరించము. మిమ్మల్ని దైవప్రవక్తగా అంగీకరించే మాటైతే అసలు గొడవే ఉండేదికాదు కదా! మీరు కేవలం 'అబ్దుల్లాహ్ కుమారుడైన ముహమ్మద్(స)' అని మాత్రమే వ్రాయండి" అని పేచీ పెట్టారు. దానికి సమాధానంగా ఆయన(స) "నేను దైవప్రవక్తను, అబ్దుల్లాహ్ కుమారుడైన ముహమ్మద్(స)ను కూడా" అని పలికారు. పిదప ఆయన(స) అలీ (రజి)తో, "దైవప్రవక్త(స) అనే పదాన్ని చెరిపివెయ్యి" అని ఆజ్ఞాపించారు. 'దైవసాక్షిగా చెబుతున్నాను. ఈ పదాన్ని నేను ఎప్పటికీ చెరిపేది లేదు' అని హజ్రత్ అలీ(రజి) బదులిచ్చారు. చివరకు ఆయన(స) స్వయంగా ఆ దస్తావేజును తీసుకుని ఇలా వ్రాయించారు : ఇది ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్[1] చేసుకున్న ఒడంబడిక పత్రం. దీనిప్రకారం ఆయన(స) వచ్చే ఏడాది ఖడ్గాన్ని ఒరలో పెట్టనంత వరకూ మక్కాలో ప్రవేశించలేరు.ఒకవేళ మక్కాకు చెందిన ఏ వ్యక్తి అయినా ఆయన(స) వెంట వెళ్ళదలిస్తే అతనిని తన వెంట తీసుకెళ్ళలేరు. కాని ఒకవేళ ఆయన శిష్యులలో ఎవరయినా మక్కాలో ఉండిపోదలిస్తే, ఆయన దానికి అభ్యంతరం చెప్పకూడదు. (వచ్చే ఏడాది ఆయన మక్కాకు వెళ్ళి) విడిది చేసిన గడువు పూర్తయిన మీదట, ఖురైషులు హజ్రత్ అలీ(రజి) దగ్గరకు వచ్చి, 'మీకివ్వబడిన గడువు పూర్తయింది. ఇక బయలుదేరమని మీ పెద్దాయనతో చెప్పండి' అని కోరారు. అందువల్ల దైవ ప్రవక్త(స) మదీనాకు బయలుదేరారు. ఆ సమయంలో హజ్రత్ హమ్జా (రజి)గారి

---

58–3. ఇది శాంతికి, నిర్యుద్ధ సంధికి చిహ్నం. అంటే వారు దురాక్రమణ దారులుగా కాకుండా, ప్రత్యర్థుల అంగీకారంతో ప్రవేశిస్తారు.

59–1. అధ్యాయంలోని ముఖ్యాంశం ఇదే. ఎందుకంటే ఒడంబడిక పత్రంలో కేవలం 'ఫలానా కుమారుడగు ఫలానా' అని మాత్రమే వ్రాయబడింది. అంతకుమించి వంశవృక్షం గురించి వ్రాయలేదు.

**అమ్మాయి ఒకామె 'బాబాయి, బాబాయి' అంటూ పరుగెత్తుకు వచ్చింది.[2] అలీ(రజి) ఆ అమ్మాయి చేయి పట్టుకుని, ఫాతిమా (ర.అ) దగ్గరకు తీసుకువచ్చారు. '(ఫాతిమా!) నీ బాబాయి కూతుర్ని కూడా వెంటబెట్టుకో' అని ఆదేశించారు. అందువల్ల ఆమె ఆ అమ్మాయిని తన వాహనంపై కూర్చోబెట్టుకున్నారు. తరువాత అలీ, జైద్, జాఫర్ (ర.అన్హుమ్)ల మధ్యన గొడవ జరిగింది. 'ఆ అమ్మాయిని సాకే మొదటి హక్కు నాది. ఎందుకంటే ఆమె నా పినతండ్రి కూతురు' అని అలీ (రజి) వాదించగా 'ఈమె నాకూ పినతండ్రి కూతురే అవుతుంది. పైగా ఈ పిల్ల పినతల్లి నా వివాహ బంధంలో ఉంది' అని జాఫర్(రజి) వాదించారు. 'ఈమె నా సోదరుని పుత్రిక' అని జైద్(రజి) వాదించారు. వారి వాదోపవాదాలను విన్న మీదట దైవప్రవక్త(స), పినతల్లి పక్షాన తీర్పు ఇచ్చారు. "పినతల్లి తల్లి స్థానాన్ని పూరిస్తుంది" అని పలికారు. పిదప అలీ (రజి)ని ఉద్దేశించి, "నీవు నా వాడవు. నేను నీ వాడను" అన్నారు[3]. ఆపైన జాఫర్ (రజి)తో, "నీవు రూపురేఖలలో, అలవాట్లలో, నడవడికలో అందరికన్నా నన్ను పోలినవాడవు" అంటూ బుజ్జగించారు. ఆ తరువాత జైద్(రజి)నుద్దేశించి, "నీవు నా వారసుడవు. నా మౌలా కూడా" అంటూ ఓదార్చారు.**

---

59-2. హజ్రత్ హమ్జా (రజి) దైవప్రవక్త(స)కు పాలవరుస సోదరుడు కూడా. అందువల్లనే హమ్జా (రజి) కూతురు ఆయన్ని (స) 'బాబాయి' అని పిలిచింది. మరి జైద్(రజి) ఆ అమ్మాయిని తన అన్న కుమార్తెగా ఎందుకు పేర్కొన్నారంటే, దైవప్రవక్త(స) హమ్జాకి-జైద్‌కి మధ్య సోదర బంధం ఏర్పరిచారు.

దైవప్రవక్త(స) జైద్‌ను 'మౌలా' అని సంబోధించడం గమనార్హం. బానిసత్వం నుండి విడుదల చేసిన వ్యక్తిని అరబీలో 'మౌలా' అంటారు. ఆయన(స) జైద్‌కు స్వేచ్ఛను ప్రసాదించి తన కొడుకుగా చేసుకున్నారు. కాని ముగ్గురి మధ్య న్యాయ నిర్ణయం గైకొనేటప్పుడు మాత్రం జాఫర్(రజి)కు ప్రాధాన్యత ఇచ్చారు. ఎందుకంటే ఆ అమ్మాయి పిన తల్లి జాఫర్ భార్యగా ఉంది. తల్లి తర్వాత స్థానం పిన తల్లిదే.

59-3. ఈ హదీసు ద్వారా హజ్రత్ అలీ(రజి) గొప్పతనం తెలిసివచ్చింది. దైవప్రవక్త(సఅసం) అలీ(రజి)ని ఉద్దేశించి, "నీవు నా వాడవు, నేను నీ వాడను" అన్నారు. అంటే మన మిద్దరం ఒకే తాత గారి మనవళ్ళము, రక్త సంబంధీకులము అని అర్థం.

తీర్పు వెలువరించిన తరువాత ఆ ముగ్గురిని ఓదార్చే ఉద్దేశ్యంతో దైవప్రవక్త(సఅసం) పలికిన మాటలివి. నాయకుడు, సంస్కర్త అయిన వారు తమ జనుల యెడల ఇలాగే వ్యవహరిస్తారు. ఇది అందరికీ ఆదర్శనీయం.

## అధ్యాయం : 7

## బహు దైవారాధకులతో సంధి చేసుకోవటం గురించి

ఈ అధ్యాయంలో అబూ సుఫ్యాన్ (రజి) హదీసు ఉంది. దైవప్రవక్త(స) ప్రవచించారని ఔఫ్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు: ఒకానొక రోజు రానున్నది. అప్పుడు మీకూ - క్రైస్తవులైన రోమనులకు మధ్య సంధి జరుగుతుంది. ఈ అధ్యాయంలో సహ్లో బిన్ హునైఫ్, అస్మా బిన్తె అబూబకర్(రజి), మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) ఉల్లేఖనాలు కూడా ఉన్నాయి.

బరా బిన్ ఆజిబ్(రజి)తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసం) మూడు షరతులపై బహు దైవారాధకులతో హుదైబియా ఒడంబడిక చేసుకున్నారు. ఆ షరతులు ఇవి : 1) బహుదైవారాధకులు ఎవరయినా దైవప్రవక్త(స)వద్దకు వస్తే, ఆయన వారిని వాపసు చేయాలి. కాని ముస్లింలలో ఎవరయినా వచ్చి బహుదైవా రాధకుల శరణు కోరితే మాత్రం, వారు ఆ వ్యక్తిని వాపసు చేయరు. 2) దైవ ప్రవక్త(స) వచ్చే ఏడాది మక్కాకు రావచ్చు. కాని కేవలం మూడురోజులు మాత్రమే ఉండాలి. 3) ముస్లింలు తమ ఆయుధాలను ఒరలలో, అంబుల పొదుల్లో పెట్టుకుని మరీ మక్కాలో ప్రవేశించాలి– ఒకవైపు ఈ ఒప్పందం జరుగుతుండగానే (ముస్లింగా ధర్మపరివర్తన చెందిన) అబూ జందల్ అక్కడికి వచ్చారు. ఆ సమయంలో ఆయన సంకెళ్ళతో బంధించబడి ఉన్నారు. అయితే దైవప్రవక్త(స) సంధి షరతులకు కట్టుబడి అబూ జందల్‌ను వాపసు చేసేశారు– ఇమామ్ బుఖారీ (రహ్మ) ఏమంటారంటే; ముఅమ్మిల్ సుఫ్యాన్ సౌరీ ముందు అబూ జందల్ గురించి ప్రస్తావించలేదు; 'ఇల్లా బిజులుబిస్సలాహ్' పదాలు మాత్రమే నకలు చేశారు.

**60)** ఇబ్నె ఉమర్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసం) ఉమ్రా చేసే ఉద్దేశ్యంతో ఇహ్రామ్ దీక్షబూని మరీ బయలుదేరారు. కాని ఖురైషుల్లోని సత్య తిరస్కారులు ఆయన్ని(స) కాబా గృహ సందర్శనం నుండి అడ్డుకున్నారు. అందువల్ల ఆయన(స) ఖుర్బానీ పశువులను హుదైబియాలోనే జిబహ్ చేశారు. శిరోముండనం కూడా అక్కడే చేయించుకున్నారు. క్రింది షరతులకు కట్టుబడి ఆయన(స) మక్కా అవిశ్వాసులతో సంధి చేసుకున్నారు :

ఒకటి: ఆయన(స) వచ్చే సంవత్సరం మాత్రమే ఉమ్రా చేసుకోగలరు.

**రెండు: ఖడ్గాలు తప్ప మరొక ఆయుధం తెచ్చుకోరాదు (ఆ ఖడ్గాలైనా ఒరల్లోనే ఉండాలి).**

**మూడు: ఖురైషులు కోరినన్ని రోజులు మాత్రమే మక్కాలో ఉండాలి. అంతకన్నా ఎక్కువ సమయం ఉండరాదు (అంటే మూడు రోజులన్నమాట)**

**ఒప్పందం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసం) మరుసటి సంవత్సరం మక్కా నగరంలో ప్రవేశించారు. మూడు రోజులు గడిచిన తరువాత ఖురైషులు వచ్చి, మక్కా నుండి వెళ్ళిపొమ్మని చెప్పారు. అంతే, ఆయన(స) అక్కడి నుండి బయలు దేరారు.**[1]

**61) సహ్ల్ బిన్ అబీ హస్మా (రజి) కథనం: అబ్దుల్లాహ్ బిన్ సహ్ల్ మరియు ముహైసా బిన్ మస్ఊద్ బిన్ జైద్(ర.అన్హుమా) లిద్దరూ ఖైబర్ వైపునకు ప్రయాణ మయ్యారు. ఎందుకంటే ఆ రోజుల్లో ఖైబర్ యూదులకు- ముస్లింలకు మధ్యన ఒడంబడిక జరగవలసి ఉంది.**[1]

## అధ్యాయం : 8
## 'దియత్'పై సంధి చేసుకోవటం[1]

**62) హజ్రత్ అనస్ (రజి) కథనం : నజర్ పుత్రిక యగు రబీ- ర.అ (ఈమె**

---

60-1. బహుదైవారాధకులు విధించిన ఈ షరతులు అనుచితమైనవే అయినప్పటికీ కారుణ్య మూర్తి ముహమ్మద్(సఅసం) అనేక పరమార్థాల దృష్ట్యా వాటిని శిరసావహించారు. ధార్మిక పరమార్థాల దృష్ట్యా తలవంచి సంధికి అంగీకరించటం కూడా ఒక్కోసారి అనివార్యమవుతుంది. ఎవరయితే కల్లోలాన్ని నివారించడానికి తన హక్కును సయితం వదులుకుని సంధి చేసుకుంటాడో అతనికి అల్లాహ్ అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదిస్తాడని ఒక ఉల్లేఖనంలో ఉంది. హజ్రత్ హసన్ (రజి), హజ్రత్ అమీర్ ముఆవియా (రజి)ల మధ్య జరిగిన సంధి కూడా ఈ కోవకు చెందినదే.

61-1. ముస్లిమేతరులతో ఒడంబడిక చేసుకోవటం సరైనదే అనడానికి మూలాధారం ఇదే. ఇస్లాం శాంతిని, సహిష్ణుతను వాంఛిస్తుంది. అది సాధారణంగా యుద్ధాలను, సంఘర్షణ లను ఇష్టపడదు. "(ప్రవక్తా!) శత్రువు గనక సంధీశాంతుల వైపునకు మొగ్గు చూపితే, నీవు కూడా దానికి సిద్ధపడు" (8: 61) అన్నది దైవాదేశం. దివ్య ఖుర్ఆన్‌లో ఎక్కడ యుద్ధం కొరకు ఆజ్ఞలు వచ్చినా, అవి ఆత్మరక్షణ కొరకే గాని, పరాక్రమం కొరకు కాదు.

8-1. అంటే ప్రతీకార (ఖిసాస్) హక్కును క్షమించి (వదులుకుని) రక్తశుల్కం పుచ్చుకుని రాజీపడిపోవటం.

హజ్రత్ అనస్ గారి మేనత్త) ఒక అమ్మాయి పన్ను విరగ్గొట్టింది. రబీ తరఫు వారు ఆ అమ్మాయి వారసుల వద్దకు వచ్చి, జరిగిందేదో జరిగిపోయింది. నష్టపరిహారం తీసుకుని, మమ్మల్ని క్షమించి వదిలిపెట్టండి అని ప్రాధేయపడ్డారు. కాని వాళ్ళు ఒప్పుకోలేదు. వివాదం దైవప్రవక్త(సఅసం) వరకూ వచ్చింది. ఆయన(సఅసం) ప్రతీకారం (ఖిసాస్) తీర్చుకోమని ఆదేశించారు. అనస్ బిన్ నజర్ (అనస్ బిన్ మాలిక్ పినతండ్రి) ఈ ఆజ్ఞ విని, 'ఏమిటి, ఇప్పుడు రబీ పన్ను విరగ్గొట్టబడు తుందా!? దైవప్రవక్తా! మీకు సత్యం ఇచ్చి పంపినవాని సాక్షిగా చెబుతున్నాను. ఇలా ఎన్నటికీ జరగదు'[1] అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స), "అనస్! దైవగ్రంథం ప్రతీకార న్యాయం (ఖిసాస్) గురించి ఆజ్ఞాపిస్తోంది (కాబట్టి ఖిసాస్ తప్పనిసరి)" అన్నారు. తరువాత దైవవశాత్తు ఆ అమ్మాయి వారసులు అంగీకరించారు. అప్పుడు దైవ ప్రవక్త(స) ఇలా అన్నారు : "దైవదాసులు కొందరున్నారు. వారు గనక దైవసాక్షిగా ఏదన్నా చెబితే, అల్లాహ్ వారి ప్రమాణాన్ని తప్పకుండా నిజం చేసి చూపుతాడు"- మరొక ఉల్లేఖనంలో, వారు ఖిసాస్‌ను వదులుకోవటంతోపాటు, నష్టపరిహారం పుచ్చుకున్నారని ఉంది.

## అధ్యాయం : 9

## "నా ఈ పు(పౌ)త్రుడు ముస్లింల నాయకుడు. బహుశా ఇతని ద్వారా అల్లాహ్ ముస్లింల రెండు పెద్ద వర్గాల మధ్యన సంధి చేయించవచ్చు" అని హజ్రత్ హసన్ బిన్ అలీ (రజి) గురించి ప్రవక్త మహనీయులు(సఅసం) వక్కాణించటం

"వారి మధ్య రాజీ కుదిరించండి"అని అల్లాహ్ సెలవిచ్చాడు **(49: 9)**

**63)** ఇమామ్ హసన్ బస్రీ చెప్పగా తాను విన్నానంటూ అబూ మూసా వివరించారు. ఆయన (హసన్ బస్రీ) ఏమన్నారంటే; దైవసాక్షి! హసన్ బిన్ అలీ (రజి) పర్వతాల్లాంటి సైన్యాలను తీసుకుని (అమీర్ ముఆవియా- రజి-కి వ్యతిరే కంగా) దండెత్తి వచ్చినప్పుడు, అమీర్ ముఆవియా (రజి) ప్రత్యేక సలహాదారుడుగా

---

62-1. అల్లాహ్ తన మొరను తప్పక ఆలకిస్తాడన్న దృఢ నమ్మకంతోనే అనస్ బిన్ నజర్(రజి) ఒట్టేసి మరీ చెప్పారు. అలాగే జరిగింది కూడా. అల్లాహ్ ప్రత్యర్థుల మనసు మార్చేశాడు. వారు ప్రతీకారం తీర్చుకునే బదులు నష్టపరిహారంతో సరిపెట్టుకునేందుకు సంసిద్ధు లయ్యారు. దైవప్రవక్త(సఅసం) సయితం అలాంటి సజ్జనులైన దైవదాసుల ప్రమాణాలను కొనియాడటం విశేషం.

ఉన్న అమ్ర్ బిన్ ఆస్(రజి), "నేను ఒక బ్రహ్మాండమైన సైనిక దళాన్ని చూస్తున్నాను. అది తన ప్రత్యర్థిని సర్వనాశనం చేసి గాని తిరిగి వెళ్ళదు" అని పలికారు. ఈ మాట విన్న అమీర్ ముఆవియా (రజి)[1] : "అల్లాహ్ సాక్షిగా! వారిద్దరిలో మరలే వాడే మంచివాడు. ఓ అమ్ర్! ఒకవేళ ఈ సైన్యం ఆ సైన్యాన్ని తుదముట్టించినా లేదా ఆ సైన్యం ఈ సైన్యాన్ని కడతేర్చినా, (దైవ సన్నిధిలో) ప్రజల వ్యవహారాలకు సంబంధించి (సంజాయిషీ ఇచ్చే) బాధ్యత ఎవరు తీసుకుంటారు? వితంతువుల మంచీ చెబ్బరలను పర్యవేక్షించే విషయంలో నాతోపాటు బాధ్యత వహించేదెవరు?" అని అన్నారు. ఎట్టకేలకు అమీర్ ముఆవియా (రజి) ఖురైష్ తెగలోని బనూ అబ్దె షమ్స్‌కు చెందిన ఇద్దరు మనుషులు– అబ్దుర్రహ్మాన్ బిన్ సమురా, అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ బిన్ కురైజ్‌లను– ఇమామ్ హసన్ (రజి) దగ్గరకు పంపాలని నిర్ణయించు కున్నారు. ఆయన వారిద్దరినీ ఉద్దేశించి, "మీరు అలీ కుమారుడగు హసన్ (రజి) వద్దకు వెళ్ళండి. ఆయన ముందు సంధి ప్రస్తావన చేయండి. సంధి గురించి క్షుణ్ణంగా చర్చించిన మీదట, నిర్ణయాధికారాన్ని ఆయనకే వదిలిపెట్టండి" అని ఆదేశించారు. వారిద్దరూ వచ్చి, 'హసన్ బిన్ అలీ (రజి)తో చర్చలు జరిపిన మీదట, నిర్ణయాధికారాన్ని ఆయనకే వదిలిపెట్టారు. చివరకు హసన్ బిన్ అలీ (రజి) ఇలా అన్నారు : "మేము బనూ అబ్దుల్ ముత్తలిబ్ సంతతికి చెందినవారము. ఖిలాఫత్ కారణంగా డబ్బు ఖర్చుపెట్టడం మాకు అలవాటుగా మారిపోయింది.[2] మా వెంట ఉన్న ఈ జనులు (సైనికులు) రక్తం చిందించడానికి సిద్ధంగా ఉన్నారు. డబ్బు ఇవ్వనంత వరకూ సంధికి సుముఖత చూపరు." 'అమీర్ ముఆవియా (రజి) ఇంత ఇంత డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. ఎందుకంటే సంధి జరగాలన్నది

---

63–1. అంటే అమీర్ ముఆవియా, అమ్ర్ బిన్ ఆస్‌లలో ముఆవియాయే మెరుగైనవారు. ఎందుకంటే యుద్ధ పరిణామాల గురించి ఆలోచించినపుడు ఆయన మనసు కరిగింది. దైవ దాసుల రక్తపాతానికి ఆయన భయపడ్డారు. కాని అమ్ర్ బిన్ ఆస్ ఆలోచనలు తద్భిన్నంగా ఉన్నాయి. ఆయన యుద్ధం జరగాలనే కోరుకున్నారు.

63–2. అంటే, ఇప్పుడు మేము 'ఖిలాఫత్'ను వదులుకుంటే డబ్బు ఎక్కడి నుండి వస్తుంది? అడిగిన వారందరికీ కాదనకుండా ఆర్థిక సహాయం చేయటం నాకు అలవాటు అయిపోయింది అన్నది ఆయన పలుకుల్లోని ఆంతర్యం. వాస్తవమేమంటే మహనీయ హసన్ గొప్ప ధర్మదాత. అడిగిన వారిని ఖాళీ చేతులతో పంపేవారు కారు. ఒక్కోసారి ఇంట్లో ఉన్నదంతా ఇచ్చేసేవారు. సుబ్‌హానల్లా! ఎవరి మనవడు!? విశ్వ కారుణ్యమూర్తి(సఅసం) ముద్దుల మనవడు కదా! అల్లాహ్ ఆయన యెడల ప్రసన్నుడవుగాక!

ఆయన ఆకాంక్ష. అయితే అంతిమ నిర్ణయం మీకు వదిలిపెట్టార'ని ఆ దూతలిద్దరూ చెప్పారు. "దీని బాధ్యత ఎవరు తీసుకుంటార"ని హ్జ్రత్ హసన్ (రజి) ప్రశ్నించగా, 'దానికి మేము బాధ్యులం' అని వారిద్దరూ అన్నారు. ఈ సందర్భంగా హ్జ్రత్ హసన్ (రజి) ఏ ప్రశ్న వేసినా, ఆ సంగతి మాకు వదలిపెట్టండి అనే వారు సమాధానమిచ్చారు. ఎట్టకేలకు ఆయన సంధి చేసుకున్నారు.[3] తరువాత ఆయన ఇలా అన్నారు: నేను అబూబక్రా (రజి) చెప్పగా విన్నాను. ఆయన ఇలా అనేవారు– 'ప్రవక్త మహనీయులు (సఅసం) వేదికపైనుండి ఇలా చెప్పగా నేను విన్నాను. ఆ సమయంలో హసన్ బిన్ అలీ(రజి) దైవప్రవక్త(స) చంకలోనే ఉన్నారు. ఆయన(స) ఒకసారి ప్రజల వైపు చూస్తే, మరొకసారి హసన్ (రజి) వైపు చూడసాగారు. పిదప ఇలా అన్నారు: "నా ఈ కుమారుడు (మనవడు) నాయకుడు. బహుశా అల్లాహ్ ఇతని ద్వారా ముస్లింలలోని రెండు పెద్ద వర్గాల మధ్య రాజీ కుదుర్చవచ్చు". ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇలా అన్నారు– అలీ బిన్ అబ్దుల్లాహ్ మదీనీ నాతో ఏమన్నారంటే, ఈ హదీసును హసన్ బస్రీ అబూబక్రా (రజి) నుండి విన్నట్లు మా వద్ద ఆధారాలున్నాయి.

## అధ్యాయం : 10

## నాయకుడు రాజీ కోసం (ఇరువర్గాల వారికి) సంకేత ప్రాయంగా ఏమైనా చెప్పగలడా?

**64)** హ్జ్రత్ ఆయిషా (రజి) చెప్పగా తాను విన్నానని ఉమ్రహ్ బిన్తె అబ్దుర్రహ్మాన్ తెలియజేశారు : ప్రవక్త మహనీయులు(సఅసం) ఇంటి తలుపు వద్దనే ఉండి (మస్జిద్ ఆవరణలో) గొడవ పడుతున్న ఇద్దరు వ్యక్తుల మాటలను విన

---

63–3. ఈ హదీసులో సంధి ప్రాముఖ్యత ముఖ్యాంశం. హ్జ్రత్ హసన్ బిన్ అలీ (రజి), తన దగ్గర భారీ సైనిక దళం ఉన్నప్పటికీ, చివరకు సంధి వైపునకే మొగ్గు చూపారు. ఆ విధంగా తన మనవడు హసన్ బిన్ అలీ (రజి) గురించి మహాప్రవక్త(స) చెప్పిన భవిష్య వాణి అక్షర సత్యమయింది. రక్తపాతం తప్పింది. ఒకవైపు యుద్ధ కాముకులైన సైనికులు! మరోవైపు అమీర్ ముఆవియా (రజి) దూరదృష్టి!! ఇంకొక వైపు ఇమామ్ హసన్ (రజి)లోని మంచిని స్వీకరించే గుణం!!!– వెరసి ఒక ఉన్నత ఆదర్శం. ఇవి ఉమ్మత్కు గుణపాఠం కావలసింది. కాని బహుకొద్ది మంది మాత్రమే ఇలాంటి సంఘటనల నుండి గుణపాఠం నేర్చుకుంటారు.

**సాగారు. క్రమక్రమంగా మాటామాటా పెరిగింది. హెచ్చుస్వరంతో వారు వాదించు కోసాగారు. ఇంతకీ జరిగిందేమిటంటే ఒక వ్యక్తి మరొకతనితో, 'రుణ భారాన్ని కాస్త తగ్గించమని, రుణం తీర్చమంటూ కాస్త మృదువుగా మాట్లాడమని' చెప్పారు. అవతలి వ్యక్తి, 'దైవసాక్షి! ఎట్టి పరిస్థితిలోనూ తగ్గించను' అని తెగేసి చెప్పాడు. చివరకు దైవప్రవక్త(స) బయటకు వచ్చి, "సత్కార్యం చేయను (అప్పు తగ్గించను) అని దేవుని మీద ప్రమాణం చేసి చెప్పిన వ్యక్తి మీలో ఎవరు?" అని అడిగారు. అంతే, 'నేనే ఓ దైవప్రవక్తా! ఇప్పుడు నా ధార్మిక సోదరుడు చెప్పినదల్లా నాకు సమ్మతమే'[1] అని ఆ వ్యక్తి అన్నాడు.**

**65) మహనీయ కాబ్ బిన్ మాలిక్(రజి) తనకు తెలిపినట్లు అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ తెలిపారు: అబ్దుల్లాహ్ ఉబై బిన్ హద్రద్ అస్లమీ (రజి) కాబ్ బిన్ మాలిక్‌కు కొంత సొమ్ము బాకీ పడ్డారు. ఆయన కనబడగానే అప్పు తీర్చు అంటూ కాబ్ బిన్ మాలిక్ వెంబడించసాగారు. వారిద్దరి మధ్య మాటామాటా పెరిగింది. బిగ్గరగా వాదించుకోసాగారు. అంతలో అటువైపు నుండి ప్రవక్త మహనీయులు (సఅసం) సాగిపోతూ, "ఓ కాబ్!" అన్నారు. తరువాత తన చేత్తో సైగ చేశారు. నీకు రావలసిన బకాయిలో సగం తగ్గించు అన్నది దాని అర్థం. అందువల్ల కాబ్ సగం అప్పు తీసుకుని, మిగతా సగాన్ని మాఫీ చేశారు.**[1]

---

64–1. ప్రవక్త మహనీయులు(సఅసం) వారిద్దరి మంచిని కోరి, సంకేత ప్రాయంగా ఒక మాట న్నారు. దానికి ఆ సహచరుడు తక్షణం 'చిత్తం' అన్నాడు. బుద్ధిమంతునికి ఒక్క సంజ్ఞ చాలు. ఆ ఇద్దరు వ్యక్తుల పేర్లు తెలియలేదని హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మా) చెప్పారు.

ఒక మంచి పని చేయనని దేవుని మీద ఒట్టేసి చెప్పటం అవాంఛనీయం. అందుకే ముందు ఆ వ్యక్తి గురించి దైవప్రవక్త(స) వాకబు చేశారు. అతని గురించి ఆరా తీసే సరికి, ఆ వ్యక్తికి జ్ఞానోదయం అయింది. రుణగ్రస్తుడైన వ్యక్తి చెప్పినట్లుగా మసలు కుంటానని మాటిచ్చాడు. సంస్కరణా ప్రియులైన పెద్దలు మన మధ్యన ఉండి, ఏదైనా సలహా ఇచ్చినప్పుడు, వారి సలహాను స్వాగతించటం హర్షనీయం అని దీనిద్వారా తేటతెల్లమవుతోంది.

65–1. రుణగ్రస్తుడు పేదవాడైనప్పుడు అతనికి తగినంత గడువు ఇవ్వాలి. లేదా రుణాన్ని మాఫీ చేయాలి. అలా చేస్తే అది రుణదాత పాలిట పుణ్యకార్యంగా లిఖించబడుతుంది. "మీ బాకీదారుడు ఆర్థిక ఇబ్బందులలో ఉంటే, అతని పరిస్థితి మెరుగుపడేవరకు గడువు ఇవ్వండి, లేదా మీరు తెలిసినవారే అయితే, ఆ బాకీని అతనికి దానం చెయ్యండి. అది మీకు ఎక్కువ శ్రేయస్కరం" (అల్ బఖరా– 280) అన్న ఆయత్‌లోని అంతరార్థం ఇదే.

## అధ్యాయం : 11

## జనుల మధ్య సయోధ్యకు, న్యాయం చేయడానికి కృషి చేయటం

**66)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు : "ఆదం పుత్రుని శరీరంలో ఉండే (**360** కీళ్ళలో) ప్రతి కీలుపై, పొద్దుపొడిచే ప్రతి రోజు దానం (సదఖా) చేయడం అవశ్యం. (ఎందు కంటే అతని శరీరంలో ఉన్న ప్రతి కీలు దేవుని వరప్రసాదమే). జనుల మధ్యన న్యాయం చేయడం కూడా ఒక దానమే."[1]

## అధ్యాయం : 12

## ఒకవేళ పరిపాలకుడు ఉభయ తారకమైన సూచన చేసినప్పుడు, ఒక వర్గం దానికి అంగీకరించకపోతే, శాసనబద్ధమైన ఉత్తర్వును జారీ చేయవచ్చు.

**67)** జుబైర్ (రజి) తమతో చెప్పేవారని ఉర్వా బిన్ జుబైర్ తెలియజేశారు: ఆయనకు– బద్ర్ యుద్ధంలో పాల్గొన్న ఒక అన్సార్ సహాబీకి మధ్య పొలం నీళ్ల దగ్గర గొడవ జరిగింది. మదీనాలోని రాతి ప్రదేశంలో ఉన్న పిల్ల కాలువ ద్వారా వారిద్దరూ తమ తమ తోటలను తడుపుకునేవారు. "నీవు నీ తోటలోని చెట్లకు నీరు సరఫరా చేసిన వెంటనే నీ పొరుగునున్న వారి తోటలకు నీళ్ళు వదులు" అని ప్రవక్త మహనీయులు(సఅసం) జుబైర్‌ను ఆదేశించారు. ఈ తీర్పు వినగానే అన్సార్ సహాబీకి కోపం వచ్చింది. (షైతాన్ ఆవహించిన ఆ క్షణంలో ఆయన) 'అవున్లెండి. దైవ ప్రవక్తా! ఎంతయినా జుబైర్ (రజి) మీ మేనత్త కొడుకే కదా!' అన్నారు. ఈ మాట వినగానే (ఆగ్రహంతో) దైవప్రవక్త(స) ముఖం కందిపోయింది. ఇలా అన్నారు : "జుబైర్! నీ చెట్లను బాగా తడుపుకో. గట్లపైకి వచ్చేవరకూ నీళ్లను ఆపి ఉంచు" అని ఆజ్ఞాపించారు. ఈ విధంగా దైవప్రవక్త(స) జుబైర్ హక్కును పూర్తిగా ఇప్పిం

---

66–1. అంటే ప్రజల మధ్యన న్యాయం చేయడం వల్ల తప్పనిసరిగా ఇవ్వవలసిన ఒక దానం ఇచ్చినట్లే. ఒకవిధంగా చెప్పాలంటే ప్రజల మధ్యన వివాదాలు తలెత్తినప్పుడు, జోక్యం చేసుకుని వారి మధ్య న్యాయబద్ధంగా రాజీ కుదర్చటం కూడా దేవుని వరప్రసాదాలకు కృతజ్ఞత తెలుపుకోవటం వంటిదే. దీని ఫలితాలు సుదీర్ఘమైనవి. అందుకే పరస్పరం సయోధ్యకు కృషిచేయటం నఫిల్ నమాజులు చేయడం కన్నా, నఫిల్ ఉపవాసాలు ఉండటం కన్నా ముఖ్యమైనది.

**చారు. మొదట ఆయన(స) చేసిన ఆదేశం అటు జుబైర్‌కి, ఇటు అన్సార్ సహాబీకి కూడా లాభసాటిగా ఉంది. కాని అన్సార్ సహాబీ (మంచీ మర్యాదలను విస్మరించి) రెచ్చగొట్టడంతో, ఆయన(స) శాసనబద్ధంగా వ్యవహరించి జుబైర్(రజి)కు దక్కవలసిన హక్కును పూర్తిగా ఇప్పించారు.[1] ఉర్వా ఇలా అన్నారు : జుబైర్(రజి) చెబుతుండేవారు– 'దైవసాక్షి! (సూరె నిసాలోని) ఈ ఆయత్ ఈ వివాదం నేపథ్యంలోనే అవతరించిందని నేను భావిస్తున్నాను. అందులో ఈ విధంగా సెలవీయబడింది: "కాదు, ఓ ముహమ్మద్! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయ నిర్ణేతగా స్వీకరించనంత వరకూ, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో కూడా ఏమాత్రం సంకోచం లేకుండా దానిని యథాతథంగా శిరసావహించనంతవరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు." (అన్ నిసా– 65)**

## అధ్యాయం : 13

## మృతుని బకాయిలను చెల్లించమని కోరిన వారికి- మృతుని వారసులకు మధ్య రాజీ కుదర్చటం. ఒక అంచనా ప్రకారం బకాయిలు చెల్లించటం

**అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా అన్నారు: ఒకవేళ ఇద్దరు భాగస్వాములు ఉండి, వారిలో ఒకరు, 'నాకు రావలసిన వాటాను అప్పుల వసూళ్ల ద్వారా తీసుకుంటాను, నగదు సొమ్ములను నీ వాటా క్రింద తీసుకో' అని అంటే, అందులో తప్పులేదు. ఇప్పుడు ఒకవేళ ఒక భాగస్వామి వాటా అతనికి దక్కకపోతే (ఉదాహరణకు– అప్పుల వసూళ్లలో మునిగిపోతే), అతను తన రెండవ భాగస్వామి నుండి ఏమీ తీసుకోలేదు.**

---

67–1. నియమబద్ధంగా ఆలోచిస్తే మొదటి హక్కు జుబైర్(రజి)ది. ఆయన తన తోటకు పూర్తిగా నీటి సరఫరా చేశాకే దిగువ ప్రాంతానికి నీళ్ళు వదలాలి. ఎందుకంటే ఆయన తోట నీటి బోదికి ఆనుకుని ఉంది. అయితే దైవప్రవక్త(స) పొరుగు వారి హక్కును దృష్టిలో పెట్టుకుని, వీలైనంత తొందరగా, నీ పొరుగు వారి తోటలకు నీళ్లు వదులు అని జుబైర్(రజి)కి ఆదేశించారు. కాని ఈ నిర్ణయం అన్సార్ సహాబీకి రుచించలేదు. దైవప్రవక్త(స) బంధుప్రీతితో వ్యవహరిస్తున్నారని భావించారు. దానిపై ఈ ఆయత్(4: 65) అవతరించింది. దైవప్రవక్త(స) గైకొనే న్యాయ నిర్ణయాన్ని శిరసావహించకపోతే, విశ్వాసం ప్రమాదంలో పడుతుందని ఇందులో హెచ్చరించటం జరిగింది.

**68)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : మా నాన్నగారు అమరగతులైనప్పుడు, ఆయనపై అప్పుల భారం ఉంది. నేను అప్పిచ్చిన వారిని సంప్రతించి, 'మీకు రావలసిన అప్పులకు బదులుగా (ఈ ఏడాది ఖర్జూరపండ్ల) ఫలసాయాన్ని తీసేసుకోండి' అని అభ్యర్థించాను. కాని వాళ్లు నా ప్రతిపాదనను త్రోసిపుచ్చారు. ఎందుకంటే ఈ ఫలసాయం ద్వారా అప్పులు తీరవని వారు భావించారు. నేను ప్రవక్త మహనీయుల(సఅసం) వారి సన్నిధిలో హాజరై నా సమస్యను గురించి చెప్పుకున్నాను. "నువ్వు వెళ్లి తోటపండ్లు కోయి. పండ్లను ఒకచోట– ఆరబెట్టే స్థలంలో– ప్రోగుచేశాక నాకు కబురంపు" అని ఆయన(స) నాకు సూచించారు. నేను, ఆయన (స) చెప్పినట్లుగానే చేసి కబురంపాను. ఆయన(స) అక్కడికి ఏతెంచారు. ఆయన (స) వెంట అబూబకర్, ఉమర్(రజిఅల్లాహు అన్హుమా) కూడా ఉన్నారు. దైవ ప్రవక్త(స) ఆ ఖర్జూరపు రాశిపై కూర్చుని, అందులో శుభం కొరకు ప్రార్థించారు. పిదప, "పో, పోయి నీ రుణదాతలను పిలుచుకుని రా. వారి రుణాన్ని తీర్చు" అని ఆజ్ఞాపించారు. నేను వారికి పండ్లు కొలవసాగాను. ఒక్కరి బాకీ కూడా మిగులకుండా అందరి బకాయిలను చెల్లించాను. అయినప్పటికీ, **13** వసఖ్‌ల ఖర్జూరాలు మిగిలి ఉన్నాయి.[1] వాటిలో ఏడు వసఖ్‌లు 'అజ్వా' రకానికి చెందినవి. ఆరు వసఖ్‌లు 'లౌన్' రకానికి చెందినవి. తరువాత నేను – మగ్రిబ్ వేళ– దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి, దీని గురించి ప్రస్తావించాను. ఇది విని ఆయన(స) నవ్వారు. "అబూబకర్, ఉమర్‌ల దగ్గరకు వెళ్ళి, వారికి కూడా ఈ సంగతిని వినిపించు" అని ఆదేశించారు. నేను వెళ్ళి జరిగినదంతా వాళ్ళకు వినిపించాను. 'దైవప్రవక్త(స) చేయవలసింది చేశారు. ఇలా జరుగుతుందని మేము అప్పుడే అనుకున్నాము' అని వాళ్ళు సమాధానమిచ్చారు. మరికొన్ని ఉల్లేఖనాలలో జాబిర్(రజి) 'అస్ర్' వేళ దైవప్రవక్త(స) దగ్గరకు వెళ్ళారని ఉంది. వాటిలో అబూబకర్(రజి) ప్రస్తావనగానీ, దైవప్రవక్త(స) నవ్విన సంగతి గానీ లేదు. వేరొక ఉల్లేఖనంలో 'జుహ్ర్' వేళ వెళ్ళారని ఉంది.

---

68–1. ఒక 'వసఖ్' అరవై 'సా'లకు సమానం. మదీనాలోని ఖర్జూర పండ్లలో 'అజ్వా' మేలు జాతికి చెందినది. 'లౌన్' దానికన్నా కొంత అధమ శ్రేణికి చెందినది. దైవప్రవక్త(స) చేసిన 'దుఆ' శుభం వల్ల జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తన అప్పును పూర్తిగా తీర్చేశారు. అయినా చాలా పండ్లు మిగిలిపోయాయి. దైవప్రవక్త(స) వారి శుభానికి నోచుకున్న జాబిర్(రజి) ఎంతో అదృష్టవంతులు.

## అధ్యాయం : 14

## రుణానికి బదులుగా కొంత నగదు సొమ్మును చెల్లించి రాజీపడటం

**69)** తన తండ్రి కాబ్ బిన్ మాలిక్(రజి) తనతో చెప్పారని అబ్దుల్లాహ్ బిన్ కాబ్ తెలిపారు : ఇబ్నె ఉబై హద్రద్ ఆయనకు (కాబ్‌కు) కొంత సొమ్ము బాకీ పడ్డారు. తన అప్పు తీర్చమని కాబ్ గట్టిగా అడిగారు. దైవప్రవక్త(సఅసం) కాలంలో, ప్రత్యేకించి మస్జిదె నబవీలో వారిద్దరూ హెచ్చు స్వరంతో వాదించుకోసాగారు. దైవప్రవక్త(స) కుటీరం లోపలి నుంచి ఇదంతా విని, బయటికి వచ్చి– తలుపు వద్ద ఉన్న తెరను ఎత్తుతూ, "కాబ్.. కాబ్!" అని పిలిచారు. దానికాయన, 'హాజరయ్యాను దైవప్రవక్తా!' అన్నారు. ఆయన (స) చేత్తో సంజ్ఞ చేస్తూ, సగం అప్పును మాఫీ చెయ్యి అని సూచించారు. దానికి కాబ్, 'చిత్తం దైవప్రవక్తా! మాఫీ చేసేశాను' అన్నారు. అప్పుడు ఆయన(స) ఇబ్నె ఉబై హద్రద్‌ను ఉద్దేశించి, "ఇక వెళ్ళు. వెళ్ళి అప్పు తీర్చు" అని చెప్పారు.

*అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో*

# 3. షరతుల ప్రకరణం

## అధ్యాయం : 1

## ఇస్లాంలో ప్రవేశించేటప్పుడు క్రయ విక్రయ సంబంధిత షరతులలో వేటిని విధించటం ధర్మసమ్మతం?

**70)** ఉర్వా బిన్ జుబైర్ అందజేసిన సమాచారం : ఈయన మల్వాన్, మిస్వర్ బిన్ మఖ్రమాలు చెప్పగా విన్నారు. వారిద్దరూ ప్రవక్త ప్రియ సహచరులు చెప్పిన దానిని ఉటంకించేవారు. వారిలా అన్నారు: సుహైల్ బిన్ అమ్ర్ (హుదైబియాలో ఖురైషుల తరఫున) నిర్యుద్ధ సంధి షరతులు వ్రాయిస్తున్నప్పుడు, అతను దైవ ప్రవక్త(స) ముందు పెట్టిన షరతులలో ఒకటేమంటే, మాలోని వ్యక్తి ఎవరయినా సరే మీ దగ్గరకు పారిపోయి వస్తే, అతను మీ మత ధర్మాన్ని అవలంబించే వాడైనా సరే, అతనిని మీరు బేషరతుగా మాకప్పగించాలి. కాని ముస్లింలకు ఈ ఏకపక్ష షరతులు ఆమోదయోగ్యంగా లేవు. వారు దుఃఖవదనులై ఉన్నారు. మరోవైపు సుహైల్ ఈ షరతు లేకుండా ఒడంబడిక జరగదని మొండిపట్టు పట్టాడు. ఎట్టకేలకు దైవప్రవక్త(సఅసం) ఆ షరతుకు అంగీకరిస్తూ ఒడంబడికను వ్రాయించారు. యాదృచ్ఛికంగా ఆ రోజే- ముస్లింగా ధర్మపరివర్తన చెంది, అక్కడికి పరారై వచ్చిన అబూజందల్ (రజి)ను, ఒప్పందానికి కట్టుబడి (అన్య మనస్కంగానే) ఆయన తండ్రి, సుహైల్ బిన్ అమ్ర్‌కి అప్పగించటం జరిగింది. అలాగే ఆ ఒడంబడిక అమలులో ఉన్నంత కాలం ఏ పురుషుడు మక్కా నుండి దైవప్రవక్త(స) వద్దకు వచ్చినా - అతను ముస్లిం అయినాసరే - అతనిని ఖురైషులకు అప్పగించటం జరిగింది. అలా పరారై వచ్చిన వారిలో ఉమ్మె కుల్సుమ్ బిన్తు ఉఖబా బిన్ అబీ

**ముఅయ్‌త్(ర.అ) కూడా ఒకరు. ఆమె అదేరోజు (మక్కా నుండి బయలుదేరి) ఆయన(స) సన్నిధిలోనికి వచ్చింది. ఆమె యుక్త వయస్కురాలు. ఆమె కుటుంబీకులు వచ్చి, ఆమెను వాపసు చేయమని దైవప్రవక్త(స)ను కోరారు. కాని ఆమెను వారికి స్వాధీనపరచలేదు. ఎందుకంటే స్త్రీలకు సంబంధించి అల్లాహ్ (ముమ్తహినహ్ సూరాలో) ఇలా సెలవిచ్చాడు : "విశ్వసించిన ప్రజలారా! విశ్వాసులైన స్త్రీలు మీ వద్దకు వలస వచ్చినప్పుడు (వారు విశ్వసించిన వారవునో కాదో) పరీక్షించి తెలుసుకోండి. వారి విశ్వాసం ఎంత వాస్తవమైనదో అల్లాహ్‌యే బాగా ఎరుగును. తరువాత, వారు విశ్వసించినవారే అని మీకు తెలిస్తే, వారిని అవిశ్వాసుల వద్దకు తిప్పి పంపకండి. వారూ అవిశ్వాసులకు ధర్మసమ్మతం కారు, అవిశ్వాసులు కూడా వారికి ధర్మసమ్మతం కారు"(అల్ ముమ్తహినహ్ : 10) ఉర్వా ఇలా అంటున్నారు : ఈ ఆయత్ ప్రకారం ప్రవక్త మహనీయులు(స) తన వద్దకు హిజ్రత్ చేసి వచ్చిన స్త్రీలను పరీక్షించే వారని హజ్రత్ ఆయిషా(ర.అ) నాతో చెప్పారు. అంటే 'ముస్లింలారా! విశ్వసించిన స్త్రీలు మీ వద్దకు వలస వచ్చినప్పుడు... నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు. (అల్ ముమ్తహినహ్ : 10-12) ఈ షరతులను ఒప్పుకున్న స్త్రీలతో, "మీ నుండి నేను విధేయతా ప్రమాణం (బైఅత్) తీసుకున్నాను" అని పలికేవారు. అది కేవలం నోటితో మాత్రమే. దైవ సాక్షిగా! విధేయతా ప్రమాణస్వీకారం (బైఅత్) సందర్భంగా ఆయన(స) చేయి ఎన్నడూ ఏ స్త్రీ చేతినీ తాకలేదు. ఆయన(స) కేవలం నోటి మాటగానే ప్రమాణ స్వీకారం చేయించుకునేవారని[1] హజ్రత్ ఆయిషా(ర.అ) తనతో చెప్పారని ఉర్వా తెలిపారు.**

---

70-1. స్త్రీల నుండి ప్రమాణ స్వీకారం (బైఅత్) చేయించేటప్పుడు, కేవలం నోటి మాట సరిపోతుందని, నేటి సోకాల్డ్ పీర్లు ముర్షిదుల మాదిరిగా వారి చేతిలో చెయ్యేసి ప్రతిజ్ఞ చేయించాల్సిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అల్లాహ్ వీళ్ళకు సద్బుద్ధిని ప్రసాదించుగాక!

హుదైబియా ఒప్పందం షరతులకు కట్టుబడి చేసుకోబడింది. వాటిలోని కొన్ని షరతులు పైకి ముస్లింలకు అవమానకరంగా కనిపించాయి. కాని ఆ షరతులకు తలొగ్గి ఒడంబడిక చేసుకోవటం జరిగింది. ఆ అపజయం నుండే అల్లాహ్ విజయ ద్వారాలు తెరిచాడని రానున్న రెండు సంవత్సరాలు నిరూపించాయి. ఈ హదీసు ద్వారా రూఢీ అయిన ఇంకొక విషయం ఏమిటంటే, ఇలాంటి సందర్భాలలో ఉభయ పక్షాల వారు సముచితమైన షరతులు పెట్టుకోవచ్చు.

**71)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) చెప్పగా తాను విన్నానని జియాద్ బిన్ అలాఖా తెలిపారు : జరీర్ (రజి) ఇలా చెప్పారు – "నేను దైవప్రవక్త(సఅసం) సమక్షంలో విధేయతా ప్రమాణం (బైఅత్) చేశాను. ప్రతి ముస్లిం యెడల శ్రేయోభిలాషిగా మసలుకోవాలన్న షరతుపై ఆయన(స) నానుండి ప్రమాణం తీసుకున్నారు."

**72)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తనతో ఇలా చెప్పారని ఖైస్ బిన్ ఉబై హాజిమ్ తెలియజేశారు: "నేను ప్రవక్త మహనీయుల(సఅసం) సమక్షంలో, 1) నమాజ్ వ్యవస్థకు కట్టుబడి ఉంటాను 2) జకాత్ ఇస్తూ ఉంటాను 3) ప్రతి ముస్లిం పట్ల శ్రేయోభిలాషతో మెలుగుతాను" అన్న షరతులపై విధేయతా ప్రమాణం(బైఅత్) చేశాను."

## అధ్యాయం : 2

## అంటు కట్టిన తరువాత గనక ఖర్జూర వృక్షాన్ని అమ్మితే...

**73)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "ఎవరయినా అంటు కట్టిన ఖర్జూరపు తోటను అమ్మినట్లయితే (ఆ సంవత్సరపు) ఫలసాయం అమ్మిన వానికే చెందుతుంది. ఒకవేళ కొనుగోలుదారుడు (పండ్లు కూడా తనవే) అని షరతు విధిస్తే (అప్పుడు పండ్లతో సహా ఆ తోట అతనిదే అవుతుంది)[1]

## అధ్యాయం : 3

## క్రయ విక్రయాలలో షరతులు విధించుకోవటం

**74)** హజ్రత్ ఆయిషా(ర.అ) తనతో చెప్పారని ఉర్వా తెలిపారు: బరీరా అనే బానిస స్త్రీ తన యజమానులతో చేసుకున్న లిఖితపూర్వక (ముకాతబత్)

73–1. అంటే క్రయ విక్రయాలు జరిగేటప్పుడు ఈ విధమయిన షరతులు పెట్టుకోవటంలో తప్పులేదు. షరతులు విధించుకున్న మీదట ఆ వ్యవహారమంతా తదనుగుణంగానే జరగాలి. అంటు వేసిన మీదట ఎవరయినా ఆ తోటను కొనుగోలు చేస్తూ, ఈ ఏడాది వచ్చే పంటతో సహా నేను ఈ తోటను కొంటాను అని షరతు పెడితే, అట్టి పరిస్థితిలో కొనుగోలుదారుడే ఆ పంటకు హక్కుదారుడు. అన్యథా ఆ సంవత్సరపు పంట అమ్మకందారునికి చెందుతుంది.

వ్యవహారంలో అమ్మ ఆయిషా(ర.అ) సహాయం కోరడానికి వచ్చింది. అప్పటివరకు ఆమె తన యజమానులకు ఏమీ చెల్లించలేదు. హజ్రత్ ఆయిషా(ర.అ) బరీరాతో ఇలా అన్నారు: "వెళ్ళి నీ యజమానులతో మాట్లాడు. వారు నీకు స్వేచ్ఛను వొసగటానికి సిద్ధంగా ఉంటే, నీ ముకాతబత్ సొమ్మునంతా నేను ఒకేసారి చెల్లిస్తాను. అయితే నీ 'వలా' హక్కు మాత్రం నా వద్దనే ఉంటుంది." బరీరా ఈ విషయమై తన యజమానులను సంప్రతించినపుడు, వాళ్ళు ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. 'ఆమె (ఆయిషా- ర.అ) గనక తలచుకుంటే పుణ్యఫలాపేక్షతో ఈ మంచి పని చేయవచ్చు. కాని 'వలా' హక్కును వదులుకోవడానికి మేము సిద్ధంగా లేము' అని వారు నిర్దిష్టంగా చెప్పేశారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఈ విషయాన్ని దైవప్రవక్త(స) ముందు ప్రస్తావిస్తే, "నువ్వు ఆమెను కొనుగోలు చేసి స్వేచ్ఛను వొసగు. స్వేచ్ఛను వొసగిన వారికే 'వలా' హక్కు చెందుతుంది"[1] అని ఆయన(స) చెప్పారు.

## అధ్యాయం : 4

## ఒకవేళ వాహనాన్ని అమ్మే వ్యక్తి, నేను ఫలానా స్థలం వరకు ఈ పశువు (వాహనం)పై స్వారీ అవుతానని షరతు విధిస్తే, అది ధర్మసమ్మతమే.

**75)** మహనీయ జాబిర్(రజి) కథనం : ఆయన (ఒక యుద్ధ సందర్భంగా) తన ఒంటెపై స్వారీ అయి వస్తున్నారు. ఒంటె బాగా అలసిపోయింది. ప్రవక్త మహనీయులు (సఅసం) అటునుంచే వస్తూ, దానిని (బెత్తంతో) ఒక దెబ్బకొట్టి, దాని కొరకు ప్రార్థించగానే అది బాగా పుంజుకుంది. అంతకుముందెన్నడూ నడవనంత వేగంగా నడవసాగింది. తరువాత దైవప్రవక్త(స) నన్ను ఉద్దేశించి, "ఈ ఒంటెను ఒక ఊఖియాకు బదులుగా నాకు అమ్మేసేయ్" అన్నారు. నేను నిరాకరించాను. కాని ఆయన(స) మరీ మరీ అడగటంతో, కాదనలేక ఆయన(స)కు అమ్మివేశాను. అయితే నేను నా స్వస్థలానికి చేరుకునేవరకూ ఆ ఒంటెపై స్వారీ అయి వస్తానని షరతు పెట్టాను. ఎట్టకేలకు నేను నా స్వదేశానికి (మదీనాకు) చేరుకున్న మీదట, ఒంటెను ఆయన(స) ముందు నిలబెట్టాను. ఆయన(స) దాని వెలను చెల్లించారు. కాని నేను తిరిగి వెళుతుండగా, నా వెనుక ఒక వ్యక్తిని పంపించి, నన్ను రమ్మని ఆదేశించారు (నేను ఆయన సమక్షంలో హాజరయ్యాను). "నేను నీ ఒంటెను

74-1. వర్తక వ్యవహారంలో షరీఅత్‌కు విరుద్ధమయిన షరతులు పెట్టకూడదు. ఒకవేళ ఎవరయినా ఇలాంటి అధర్మమయిన షరతులు విధించినా అవి వీగిపోతాయి.

**తీసేసుకున్నానని అనుకున్నావా ఏమి? ఇదిగో, నీ ఒంటెను తోలుకుని పో. దీని వెలను కూడా నువ్వే ఉంచుకో" అని ప్రవక్త మహనీయులు (సఅసం) సెలవిచ్చారు. ఈ హదీసు వివిధ ఉల్లేఖకుల ద్వారా విభిన్న పదజాలాలతో వివరించబడింది. ఒక ఉల్లేఖనంలో, 'నేను మదీనా వరకు స్వారీ అయ్యే షరతులపై ఒంటెను అమ్మాను' అని ఉంది. మరొక ఉల్లేఖనంలో "మదీనా వరకు నీవు దీనిపై స్వారీ అవవచ్చు" అని (దైవప్రవక్త–సఅసం– పలికినట్లుగా) ఉంది. "నీ ఇంటివరకు నీవు దీనిపై స్వారీ అయి రావచ్చు" అని చెప్పినట్లు ఇంకొక ఉల్లేఖనంలో ఉంది. "నేను నీ ఒంటెను నాలుగు దీనార్లకు కొంటాను" అని (దైవప్రవక్త–సఅసం) చెప్పినట్లుగా వేరొక ఉల్లేఖనంలో ఉంది. ఒక దీనారు విలువ దాదాపు పది దిర్హములకు సమానం. నాలుగు దీనార్ల విలువ ఒక 'ఊఖియా'కు సమానం... (ఈ విధంగా ఈ ఒంటె 'వెల'పై ఉల్లేఖకులు చెప్పిన దానిలో వైవిధ్యం ఉంది). 'మదీనా వరకు స్వారీ అయి వస్తాన'న్న షరతు ఎక్కువ ఉల్లేఖనాలలో ఉందనీ, అదే తన దృష్టిలో చాలావరకు ఎన్నదగినదని ఇమామ్ బుఖారీ (రహ్మ) అన్నారు.** [1]

## అధ్యాయం : 5

## వ్యవహారాలలో షరతులు పెట్టుకోవటం

**76) హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం: (ప్రవక్త మహనీయులు–సఅసం– ముహాజిర్లకు– అన్సార్లకు మధ్య సోదర బంధం ఏర్పరచిన తర్వాత) అన్సార్లు దైవప్రవక్త(స)తో, 'దైవప్రవక్తా! మా ఖర్జూర తోటలను మాకూ– మా సోదరులకు మధ్య పంచిపెట్టండి' అని అన్నారు. దానికి ఆయన(స), "లేదు. అలా జరగనేరదు (ఎందుకంటే అది మీ ఆస్తి)" అన్నారు. 'సరే. అలాగైతే మా తోట**

75–1. దీని ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మ) పాండితీ ప్రకర్ష ప్రస్ఫుటం అవుతోంది. ఆయన ఒక్కో హదీసును ఎన్నెన్ని ఒనరుల ద్వారా సేకరించినారో, ఎన్నెన్ని కోణాల నుండి దానిని తమ గీటురాయిపై పరికించినారో కూడా మనకు అవగతం అవుతోంది. వర్తక వ్యవహారంలో ఈ విధమైన షరతులు విధించటం సబబేనన్న సంగతి కూడా దీనిద్వారా విదితమవుతున్నది. ఇలాంటి నిశిత దృష్టి విషయంలో ఇమామ్ బుఖారీ (రహ్మ) తర్వాత హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ) పేరు వస్తుంది. ఈయన దృష్టికి రాని హదీసు గ్రంథమేదీ బహుశా లేదు. సహీహ్ బుఖారీ విషయానికి వస్తే, అది 'అల్‌హమ్దు' (ఫాతిహా సూరా) మాదిరిగా ఆయనకు కంఠస్థం అయిపోయింది. తత్కారణంగానే ఆయన 'హాఫిజ్'గా పిలువబడ్డారు.

**పనులలో మీరు సహాయపడండి. ఫలసాయంలో మీరూ మేము భాగస్థులవుదాము' అని అన్సార్లు ముహాజిర్ల ముందు ప్రతిపాదించారు. దానికి వారు, 'సరే, అలాగే కానివ్వండి' అని సమాధానమిచ్చారు.**

**77) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసం) ఖైబర్ వ్యవసాయ భూములను, స్థానిక యూదులకు (కౌలుపై) ఇస్తూ, "మీరు వ్యవసాయ పనులు చేయండి. మొక్కలు నాటండి. వచ్చిన పంటలో సగభాగం మీరు తీసుకోండి" అని షరతు పెట్టారు.**

## అధ్యాయం : 6

## వివాహ సమయంలో 'మహర్'పై షరతు విధించటం

**హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: "విధించుకున్న షరతు ప్రకారం మసలుకున్నప్పుడే దాని హక్కు నెరవేరుతుంది. నీవు పెట్టిన షరతుకు కట్టుబడి ఉండటం నీ బాధ్యత". మిస్వర్ బిన్ మఖ్రమా ఇలా అన్నారు: "నేను దైవప్రవక్త (సఅసం) చెప్పగా విన్నాను. ఆయన తన అల్లుడు (అబుల్ ఆస్) గురించి ప్రస్తావించినప్పుడు, అతనిని మెచ్చుకున్నారు. అతను ఒక అల్లుడిగా (బంధుత్వపు) బాధ్యతను బహు చక్కగా నిర్వర్తించాడని, ఇచ్చిన మాటను నిలుపుకున్నాడని ప్రశంసించారు."**

**78) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని ఉఖబా బిన్ ఆమిర్(రజి) ఉల్లేఖించారు: "ఏ ఏ షరతుల ఆధారంగా మీరు స్త్రీల మానాన్ని మీ కొరకు ధర్మసమ్మతం (హలాల్) చేసుకున్నారో, అవి అన్నిటికన్నా అధికంగా నెరవేర్చదగినవి."** [1]

---

78–1. ఈ షరతులలో అత్యంత కీలకమైనవి 'ఏజాబ్', 'ఖుబూల్', 'మహర్'. ఎవరయినా మహర్ సొమ్మును నిర్ధారించేటప్పుడు, దానిని ఎగ్గొట్టే ఉద్దేశం అతని మనసులో ఉంటే, అట్టి నికాహ్ దైవ సన్నిధిలో ధర్మబద్ధం కాదు. విధించుకునే షరతులు కూడా ధర్మబద్ధమై ఉండాలని ఖుస్తులానీ అన్నారు. ఉదాహరణకు: నన్ను వివాహమాడిన మీదట నీవు రెండో పెళ్ళి చేసుకోకూడదనీ, నాకు సవతి పోరు ఉండకూడదని షరతు విధిస్తే, అలాంటి షరతులు షరీఅత్ పరంగా సమ్మతమైనవి కావు. కాని ఇమామ్ అహ్మద్(రహ్మా), అహ్లె హదీసు వారేమంటారంటే, షరతు అన్నాక షరతే. దానికి కట్టుబడాల్సిందే. పై హదీసు అర్థం అదే.

## అధ్యాయం : 7

## వ్యవసాయంలో ధర్మసమ్మతమైన షరతులు

**79) రాఫె బిన్ ఖదీజ్ (రజి) చెప్పగా తాను విన్నానని హన్జలా జుర్ఖీ తెలిపారు: ఆయన ఇలా చెప్పారు– అన్సారులమైన మాలో చాలా మంది వ్యవసాయం చేసేవారు. మేము వ్యవసాయ భూములను 'పంట పంపకం'పై (కౌలుకు) ఇచ్చేవారం. కాని సాధారణంగా ఏం జరిగేదంటే పొలంలోని ఒక భాగం బాగా పండితే, మరో భాగం పండేదికాదు. అందువల్ల ఈ విధానం నుండి మమ్మల్ని వారించటం జరిగింది.[1] అయితే నగదు (వెండి మొదలగునవి)కు బదులుగా అద్దెకు ఇవ్వటం నుండి వారించటం జరగలేదు.**

## అధ్యాయం : 8

## వివాహంలో ధర్మసమ్మతం కాని షరతులు

**80) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు: "పట్టణవాసి అయిన ఏ వ్యక్తీ పల్లెటూరి వ్యక్తి సొమ్మును అమ్మరాదు.[1] 'నజష్' చేయరాదు. (ముస్లిం అయిన) మీ సోదరుడు నిర్ణీత ధరపై వస్తువును కొనుగోలు చేస్తూ ఉండగా, మధ్యలో తలదూర్చి దాని రేటు పెంచకండి. మీ సోదరుడు ఎవరికయినా వివాహ సందేశం ఇచ్చి ఉండగా, మధ్యలో మీరు సందేశం పంపకండి. అలాగే ఏ స్త్రీ కూడా తన సవతి హక్కును తానే కాజేయాలనే (దుర్) ఉద్దేశ్యంతో, ఆమెకు విడాకులు ఇప్పించరాదు."[2]**

## అధ్యాయం : 9

## శిక్షల విషయంలో ధర్మసమ్మతం కాని షరతులు

---

79–1. అంటే, వ్యవసాయ భూములను కౌలుకు ఇస్తూ, పొలంలోని 'ఈ భాగం'లో పండిన పంట మేము తీసుకుంటాము. 'ఆ భాగం'లోని పంటను మీరు తీసుకోండి అని చెప్పటం అనుచితం. ఎందుకంటే, ఇందులో మోసం ఉంది. కారణం ఆ భూభాగం నిస్సారమైనది కావచ్చు. అక్కడ దిగుబడి రాకపోవచ్చు.

80–1. దీని వివరణ లోగడ, 'వాణిజ్య ప్రకరణం'లో వచ్చింది.

80–2. ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం యిదే. నువ్వు నీ సవతులకు విడాకులు ఇచ్చే మాటైతేనే, నిన్ను పెళ్ళి చేసుకుంటానని ఏ స్త్రీ అయినా చెప్పటం సమంజసం కాదు. తన సుఖ సంసారం కోసం,తోటి అక్కాచెల్లెళ్ళ కొంపల్ని కూల్చే పని ఇది.

**81) అబూ హురైరా (రజి), జైద్ బిన్ ఖాలిద్ జుహన్నీ (రజి)– వీరిద్దరూ చెప్పారని ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉతబా బిన్ మస్ఊద్ ఉటంకించారు: ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! నేను దేవునిపై ఒట్టేసి అభ్యర్థిస్తున్నాను. నా వివాదంలో దైవగ్రంథం ప్రకారం తీర్పు ఇవ్వండి' అని విజ్ఞప్తి చేశాడు. అతని ప్రత్యర్థి అతని కన్నా వివేకవంతుడు. అతనిలా విన్నవించు కున్నాడు: 'అవును. దైవగ్రంథం ప్రకారమే మా ఇద్దరి వివాదాన్ని పరిశీలించి తీర్పు చెయ్యండి. కాని అసలు జరిగిందేమిటో నన్ను చెప్పనివ్వండి'. "సరే. చెప్పు" అని ప్రవక్త మహనీయులు(స) ఆనతినివ్వగా, 'నా కుమారుడు ఇతని దగ్గర సేవకునిగా పని చేసేవాడు. వాడు ఇతని భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. నీ కొడుక్కి రాళ్లు రువ్వే శిక్ష విధించబడవచ్చు అని జనులు చెప్పారు. నేను నూరు మేకలను, ఒక సేవకురాలిని ఇతనికి నష్టపరిహారంగా ఇచ్చి, నా కుమారుణ్ణి విడిపించు కున్నాను.[1] తరువాత నేను పండితులను సంప్రతిస్తే, 'నీ కుమారునికి వంద కొరడా దెబ్బలు మాత్రమే పడతాయి (అతడు అవివాహితుడు కాబట్టి). ఒక ఏడాది కాలం పాటు స్వదేశం నుండి బహిష్కరించబడతాడు. అయితే ఆ వ్యక్తి భార్యపై రాళ్ళు రువ్వబడతాయి' అని వారు విడమరిచి చెప్పారు. ఇదంతా విన్న మీదట ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా సెలవిచ్చారు: "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా! దైవగ్రంథం ప్రకారమే నేను మీ మధ్య తీర్పు ఇస్తాను. నువ్వు ఇచ్చిన మేకలు, సేవకురాలు నీకు వాపసు చేయబడతాయి. నీ కుమారునికి నూరు కొరడా దెబ్బలు కొట్టి, ఒక ఏడాదికాలం పాటు స్వదేశం నుండి వెళ్ళగొట్టాలి. ఉనైస్! రేపు**

---

81–1. ఇది దేవుని హద్దులకు (శిక్షలకు) సంబంధించిన వ్యవహారం. తీర్పు ఇచ్చేవారు తదను గుణంగానే ఇవ్వవలసి ఉంటుంది. కాని ఆ అబ్బాయి తండ్రి నూరు మేకలను, ఒక సేవకురాలిని పరిహారంగా ఇచ్చి, అతన్ని విడిపించుకున్నాడు. అధ్యాయంలోని ప్రధా నాంశం ఇదే. ఎందుకంటే అతను వ్యభిచారానికి గాను పడవలసిన శిక్ష నుండి తప్పించు కోవడానికి మరో మార్గం అవలంబించాడు. నష్టపరిహారం ఇచ్చుకున్నాడు. ఇది దేవుని హక్కులకి సంబంధించిన కేసు కాబట్టి, దాసుల పరస్పరం అంగీకారం వల్ల 'శిక్ష' వైదొలగలదు. ఇలాంటి నేరం ఎప్పుడు, ఎక్కడ బయటపడినా (ఇస్లామీయ వ్యవస్థలో, ఇస్లామీయ శాసనాంగం ప్రకారం) అవశ్యంగా హద్దు (శిక్ష) విధించబడుతుంది. అయితే మానవహక్కులకు సంబంధించిన కేసులలో పరస్పర అంగీకారానికి, రాజీకి ఆస్కారం ఉంటుంది.

**నీవు ఆ రెండవ వ్యక్తి భార్య దగ్గరకెళ్ళి వ్యభిచారం చేసిందో లేదో అడిగి తెలుసుకో” అని ఆదేశించారు. మరునాడు ఉదయం ఉనైస్(రజి) విచారణ జరిపితే, ఆ స్త్రీ వ్యభిచారం చేశానని ఒప్పుకుంది. “ఆమెకు రాళ్ళు రువ్వండి” అని ప్రవక్త మహ నీయులు(స) ఆదేశించారు.**

## అధ్యాయం : 10

## ‘ముకాతబ్’ గనక బానిసత్వం నుండి విడుదల అయ్యే షరతులపై క్రయ విక్రయాల వ్యవహారానికి అంగీకరిస్తే అది సమంజసమే.

**82)** **తన తండ్రి తనతో చెప్పారంటూ అబ్దుల్ వాహెద్ బిన్ ఐమన్ మక్కీ తెలియజేశారు. ఈయన తండ్రి అమ్మ ఆయిషా(ర.అ)ను కలుసుకోవడానికి వెళ్ళినప్పుడు, ఆమె ఇలా వివరించారు: తన యజమానులతో స్వేచ్ఛ కొరకు లిఖిత పూర్వక ఒప్పందం చేసుకున్న బరీరా (ర.అ) నా దగ్గరకు వచ్చి, ‘ఉమ్ముల్ మోమినీన్! నా యజమానులు నన్ను అమ్మటానికి సిద్ధంగా ఉన్నారు. కాబట్టి నన్ను మీరు కొనుగోలు చేసి, నాకు బానిసత్వం నుండి స్వేచ్ఛను ప్రసాదించండి అమ్మ గారూ!’ అని విన్నవించుకుంది. దానికి ఆమె “సరే, అలాగే” అన్నారు. ‘కాని అమ్మ గారూ! వలా హక్కు తమకు దక్కేలా షరతు విధించనంతవరకూ వాళ్ళు నన్ను అమ్మరేమో!’ అని బరీరా (ర.అ) సందేహపడగా, “అలాగైతే ఈ కొనుగోలు వ్యవహారం నాకు వద్దు”[1] అని హజ్రత్ ఆయిషా(ర.అ) నిర్ద్వంద్వంగా చెప్పేశారు. ఈ సంగతిని దైవప్రవక్త విన్నారు లేదా ఆయనకు సమాచారం అందింది (ఉల్లే ఖకుడు సందిగ్ధంలో పడ్డారు). దైవప్రవక్త(స) “బరీరా సంగతి ఏమైంది?” (అని అడిగితే నేను జరిగినదంతా వివరించాను అని అమ్మ ఆయిషా చెప్పారు) “నీవు ఆమెను కొనుగోలు చేసి, స్వాతంత్ర్యం ప్రసాదించు. వాళ్ళు ఎన్ని షరతులు విధించు కుంటారో విధించుకోనివ్వు” అన్నారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: “నేను బరీరాను కొనుగోలు చేసి, ఆమెకు స్వేచ్ఛనొసగాను. ఆమె ‘వలా’ హక్కును ఆమె యజమానులే తమ దగ్గర ఉంచుకున్నారు. అప్పుడు దైవప్రవక్త(సఅసం),**

---

82-1. అంటే, ‘వలా’ హక్కును వారు తమ వద్దనే ఉంచే మాటైతే, నేను నిన్ను కొనే ప్రసక్తే లేదు. అవగతమయ్యే ఇంకొక విషయం ఏమంటే, ధర్మవిరుద్ధమైన షరతులు ఎవరెన్ని విధించుకున్నా అవి స్వీకారయోగ్యమవవు.

**"స్వాతంత్ర్యం ప్రసాదించిన వారికే 'వలా' హక్కు దక్కుతుంది. (ఇతరులు) వంద షరతులు విధించుకున్నా సరే (అవి చెల్లనేరవు)" అని వక్కాణించారు.**

## అధ్యాయం :11

## విడాకుల సందర్భంగా షరతులు పెట్టడం

**సయీద్ బిన్ ముసయ్యిబ్, హసన్ బస్రీ, అతా బిన్ అబీ రబాహ్ ఇలా అన్నారు: షరతు తరువాత పెట్టినా, లేక ముందుగా విధించినా ఎట్టి పరిస్థితిలోనూ షరతు ప్రకారమే అమలు పరచటం జరుగుతుంది.**

**83) మహనీయ అబూ హురైరా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) మార్కెట్ బయటకు వెళ్ళి, సామాను తెచ్చే వర్తక బిడారులను కలుసుకోవడాన్ని వారించారు. అలాగే ఒక పట్టణవాసి పల్లెటూరి నుండి వచ్చిన వాని సరుకును అమ్మడాన్ని, అలాగే ఒక స్త్రీ తన సోదరికి (సవతికి) విడాకులివ్వమని షరతు పెట్టడాన్ని కూడా ఆయన (స) వారించారు.[1] అలాగే తన సోదరుడు ఒక వస్తువును బేరమాడినప్పుడు, మధ్యలో తలదూర్చి బేరమాడటాన్ని, 'నజష్' చేయడాన్ని, పశువు పొదుగులో పాలు ఆపి ఉంచడాన్ని కూడా ఆయన(స) వారించారు. ముహమ్మద్ బిన్ అర్అరాతోపాటు ఈ హదీసును ముఆజ్ బిన్ ముఆజ్, అబ్దుస్సమద్ బిన్ అబ్దుల్ వారిస్ కూడా షూబా ఆధారంగా ఉటంకించారు.**

---

83-1. ఈ అధ్యాయంలోని ప్రధానాంశం ఇదే. ఒక స్త్రీ వివాహితుడైన పురుషుని వివాహ బంధంలోకి రాదలిస్తే అందులో తప్పులేదు. కాని తన సవతికి విడాకులు ఇవ్వాలని షరతు విధించటం తప్పు. అయినా సరే షరతు షరతే. ఆ స్త్రీ పెట్టిన షరతు ప్రకారం ఆ భర్త ఆమె సవతికి విడాకులిస్తే విడాకులు అయిపోతాయి. అన్యధా అలా షరతు పెట్టడంలో అర్థం లేదు.

ఇకపోతే 'నజష్'; మోసగించే ఉద్దేశ్యంతో వస్తువు ధరను పెంచడాన్ని లేదా అమ్ముడు అవుతున్న వస్తువు గురించి కొనుగోలుదారునికి లేనిపోని లోపాలను చూపి వర్తక వ్యవహారాన్ని చెడగొట్టడాన్ని 'నజష్' అంటారు. పశువుల పొదుగులలో పాలు ఆపి ఉంచి, ఇది ఎక్కువ పాలు ఇస్తుందని కొనుగోలుదారునికి నమ్మబలకటాన్ని 'తస్రియా' అంటారు. ఇలాంటివన్నీ ఇస్లాంలో నిషిద్ధాలే.

## అధ్యాయం : 12

## జనులకు మూజువాణి షరతు పెట్టడం

**84)** సయీద్ బిన్ జుబైర్ కథనం: మేము ఇబ్నె అబ్బాస్(రజి) దగ్గరకు వెళ్ళాము. ఆయన ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించారని ఉబై బిన్ కాబ్(రజి) తెలిపారు– "ఖిజర్(అలైహిస్సలాం) వద్దకు వెళ్ళి, ఆయన్ని కలుసుకున్న దైవప్రవక్త హజ్రత్ మూసా(అలైహిస్సలాం)"... తరువాత హదీసును చివరి వరకూ వినిపించారు. "మీరు నా వెంట ఉండి సహనం వహించ లేరని నేను మీతో ముందే అనలేదా?" అని ఖిజర్(అ) మూసా(అ)తో అన్నారు. మూసా (అ) తరపున వేయబడిన మొదటి ప్రశ్న మరుపు వల్ల జరిగింది. రెండవది: షరతు రూపంలో. మూడవది : ఉద్దేశపూర్వకంగా. ఆయన ఖిజర్(అ)ను, "నేను మరిచిపోయిన దానిపై మీరు నన్ను నిలదీయకండి. నా కార్యక్రమాన్ని కష్టతరం చేయకండి" అని అభ్యర్థించారు.[1] వారిద్దరికీ ఒక కుర్రవాడు కనిపించాడు. ఖిజర్(అ) ఆ అబ్బాయిని హతమార్చారు. ఆ తరువాత వారు ముందుకు సాగిపోతున్నప్పుడు, వారికి ఒక గోడ కనిపించింది. అది కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఖిజర్(అ) దానిని మరమ్మత్తు చేశారు– ఇబ్నె అబ్బాస్(రజి) 'అమామహుమ్ మలిక్' (వారికి ఎదర ఒక చక్రవర్తి ఉన్నాడు) అని చదివారు.

## అధ్యాయం : 13

## 'వలా'[1] గురించి షరతు పెట్టడం

**85)** హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు : బరీరా (ర.అ) నా దగ్గరకు వచ్చి ఇలా విన్నవించుకుంది– 'నేను నా యజమానులతో తొమ్మిది ఊఖియాల (వెండి)ని చెల్లించి విడుదల అయ్యేలా లిఖితపూర్వక ఒప్పందం కుదుర్చుకున్నాను.

---

84–1. హజ్రత్ ఖిజర్(అ)– హజ్రత్ మూసా(అ)ల మధ్య పెట్టుకోబడిన షరతులు మూజువాణి షరతులు. ఈ అధ్యాయంలో కీలకాంశం ఇదే.

13–1. 'వలా' అనేది ఒక హక్కు. బానిసను లేదా బానిస స్త్రీని బానిసత్వం నుండి విడుదల చేసిన వ్యక్తికి వలా హక్కు ఉంటుంది. అరబ్బులు ఈ హక్కును ఇతరులకు అమ్మివేయటమో, కానుకగా ఇచ్చివేయటమో చేసేవారు. దైవప్రవక్త(స) ఇలా చేయడాన్ని వారించారు.

ఏడాదికి ఒక ఊఖియా చొప్పున చెల్లించాలని నిర్ణయించటం జరిగింది. (అమ్మా!) ఈ వ్యవహారంలో నాకు సహాయం చెయ్యండి'. దానికి హజ్రత్ ఆయిషా(ర.అ), "నీ యజమానులు గనక ఇష్టపడితే, ఆ తొమ్మిది ఊఖియాలను నేను ఒకేసారి చెల్లిస్తాను. అయితే నీ వలా హక్కు నాకు చెందాలి" అని చెప్పారు. బరీరా తన యజమానుల వద్దకు వెళ్ళి, వారికి విషయం చెప్పింది. కాని వారు ససేమిరా అన్నారు. అందువల్ల ఆమె తిరిగి ఆయిషా(ర.అ) దగ్గరకు వచ్చింది. ఆ సమయంలో ప్రవక్త మహనీయులు (స) అక్కడే కూర్చుని ఉన్నారు. 'అమ్మా! మీ మాటను నా యజమానులకు వినిపించాను. కాని వాళ్ళు ఎంతకీ ఒప్పుకోవటం లేదు. ఎట్టి పరిస్థితిలోనూ 'వలా' హక్కును తమ వద్దనే ఉంచుకుంటామని అంటున్నార'ని బరీరా చెప్పింది. ఆమె చెప్పినదంతా ప్రవక్త మహనీయులు(సఅసం) విన్నారు. హజ్రత్ ఆయిషా(ర.అ) కూడా ఆ వృత్తాంతమంతా ఆయన(స)కు వివరించారు. ఆయన (స) ఇలా అన్నారు: "(ఆయిషా!) నీవు బరీరాను కొనుగోలు చెయ్యి. 'వలా' షరతును వాళ్ళు పెడితే పెట్టుకోనివ్వు. నిజానికి వలా హక్కు స్వేచ్ఛనొసగిన వారికే దక్కుతుంది." హజ్రత్ ఆయిషా(ర.అ) అలాగే చేశారు. తరువాత ప్రవక్త మహనీయులు(స) ఉపన్యసించడానికి ప్రజల మధ్యన నిలబడ్డారు. తొలుత దైవస్తోత్రం చేశారు. ఆయన గొప్పతనాన్ని అత్యధికంగా కొనియాడారు. తరువాత ఇలా అన్నారు: "కొంతమంది జనులకు ఏమైంది? వారు దైవగ్రంథంలో ప్రస్తావనకు రాని షరతులు విధిస్తున్నారేమిటి? దైవగ్రంథంలో లేని షరతులు వంద పెట్టుకున్నా సరే అవి అధర్మమే. అల్లాహ్ నిర్ణయం మాత్రమే సత్యమైనది. అల్లాహ్ షరతులే స్థిరమైనవి. 'వలా' మాత్రం స్వాతంత్ర్యం ఇచ్చిన వారికే దక్కుతుంది."[1]

## అధ్యాయం : 14

## భూమి యజమాని సాగు చేసే వానితో, 'నేను తలచుకున్నపుడు నిన్ను వ్యవసాయ క్షేత్రం నుండి తొలగిస్తాన'ని షరతు విధిస్తే...[1]

---

85-1. ఈ హదీసు ఇంతకుముందు కూడా అనేక సార్లు వచ్చింది. దైవగ్రంథం ద్వారా నిరూపితం కాని ఏ షరతు పెట్టినా, అది నిషిద్ధమేనన్నది దీని సారాంశం. ధర్మసమ్మత మైన షరతులను ఉభయ వర్గాల వారు విధించుకున్నట్లయితే, వాటికి కట్టుబడి ఉండాల్సిందే.

14-1. సాగు చేసే వ్యక్తి నిరభ్యంతరంగా శిరసావహించేటట్లయితే, ఈ షరతు ధర్మసమ్మతమే

**86)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారని నాఫె ఉటంకించారు: ఖైబర్‌లోని యూదులు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కాళ్ళు చేతులు మెలిక పెట్టి (త్రిప్పి)నప్పుడు, ఖలీఫా మహనీయ ఉమర్(రజి) ప్రసంగించదానికి నిలబడ్డారు. ఆయన ఇలా అన్నారు : "ప్రవక్త మహనీయులు (సఅసం) ఖైబర్‌లోని యూదులతో, వ్యవసాయ దిగుబడులను పంచుకునే ఒప్పందం చేసుకున్నారు. అల్లాహ్ మిమ్మల్ని ఇక్కడ ఆపి ఉంచినంతకాలం మేము కూడా మిమ్మల్ని ఉండనిస్తామని కూడా ఆయన(స) చెప్పి ఉన్నారు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తమకు రావలసిన ఫలసాయాన్ని వసూలు చేయడానికి అక్కడ (ఖైబర్)కు వెళ్ళినప్పుడు, వాళ్ళు రాత్రికి రాత్రే ఆయనపై హింసకు ఒడిగట్టారు. దాంతో ఆయన కాళ్ళు చేతులు విరిగి పోయాయి. ఖైబర్‌లో వాళ్ళు తప్ప మాకు శత్రువులెవరూ లేరు. వాళ్ళే మా శత్రు వులు. వాళ్ళపైనే మాకు అనుమానం ఉంది. అందుకే వాళ్ళను ఖైబర్‌నుండి బహిష్క రించటం సమంజసమని నేను భావిస్తున్నాను"– ఈ విధంగా మహనీయ ఉమర్ (రజి) దృఢ సంకల్పం చేసుకున్నప్పుడు అబూ హఖీఖ్ అనే ఒక యూదు యువ కుడు ఆయన దగ్గరకు వచ్చి, 'అమీరుల్ మోమినీన్! ఏమిటి, మీరు మమ్మల్ని పట్నం నుండి వెళ్ళగొడతారా? నిజానికి ముహమ్మద్(సఅసం) మమ్మల్ని ఇక్కడ ఉండనిచ్చారు. మాతో ఆయన ఒక వ్యవహారం కూడా చేశారు. ఖైబర్‌లో మేము ఉండగలిగినప్పుడే, మేము దానికి కట్టుబడి ఉండగలం' అని విజ్ఞప్తి చేశాడు. సమాధానంగా హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు : "ఏమిటి, ప్రవక్త మహనీయుల(స) వారి ఫర్మానాను నేను మరచిపోయాననుకుంటున్నావా? 'ఖైబర్ నుండి మిమ్మల్ని వెళ్ళగొట్టిన నాడు మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి! మీ ఒంటెలు మిమ్మల్ని రాత్రికి రాత్రే మోసుకుంటూ తిరుగుతాయి' అని ఆయన(స) చెప్పలేదా?". దానికతను, 'ఓహో! అదా. అది అబుల్ ఖాసిం (దైవప్రవక్త) నవ్వులాటకు అన్న మాటలెండి' అన్నాడు. దానిపై ఉమర్, "ఓయీ దైవ విరోధీ! నువ్వు అబద్ధమాడుతున్నావ్?" అన్నారు. చివరకు ఉమర్(రజి), వాళ్ళను ఖైబర్ నుండి బహిష్కరించారు. వారికి రావలసిన ఫలసాయాన్ని, కొంత నగదును,

---

గాని, ఇందులో ఒకింత ఔచిత్యం ఉందని అనిపించదు. షరతులు ఇష్టపూర్వకంగా పెట్టుకున్నప్పుడే అవి ఉభయ తారకంగా ఉంటాయి. అలాంటి షరతులు నాలుగు కాలాలపాటు నిలుస్తాయి. అదే సమయంలో అటు కౌలు చేసేవారు కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి, ఫలసాయాన్ని యజమానికి ఇస్తూ ఉండాలి.

ఒంటెలను, కొంత వస్తు సామగ్రిని, ఒంటెలపై ఉండే తొట్టెలను, త్రాళ్ళను ఇప్పించారు.[1]

## అధ్యాయం : 15

## ధర్మయుద్ధంలో షరతులు విధించటం. అవిశ్వాసులతో సంధి చేసుకునేటప్పుడు షరతులను లిఖించటం

**87)** మిస్వర్ బిన్ మఖ్రమా, మర్వాన్‌లు చెప్పగా విని ఉర్వా బిన్ జుబైర్ తెలియజేశారు. వారిద్దరూ చెప్పిన హదీసు ఒకరింకొకరు చెప్పిన దానిని ధ్రువపరిచేదిగా ఉంది. ఇంతకీ వారేమన్నారంటే; ప్రవక్త మహనీయులు (సఅసం) హుదైబియా ఒడంబడిక సందర్భంగా మక్కా వైపునకు సాగిపోతున్నారు.[1] వారు మార్గంలో ఉండగానే, "ఖాలిద్ బిన్ వలీద్ (రెండు వందల మంది) ఖురైషు వాహన దళాన్ని తీసుకుని మన కదలికలను పసిగట్టడానికి 'గమీమ్'లో మోహరించి ఉన్నాడు. కాబట్టి

---

86-1. కౌలు చేసే వ్యక్తి భూమి యజమాని పట్ల విశ్వాసఘాతుకానికి పాల్పడినప్పుడు అతనిని ఆ కమతం నుండి తొలగించటంలో తప్పులేదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఖైబర్ విజయం తర్వాత అక్కడి యూదులు ప్రవక్త(స) సన్నిధికి వచ్చి, విజయప్రాప్తిగా ముస్లింల కైవసమైన వ్యవసాయ భూముల్లో సాగు చేసుకోవడానికి అనుమతిని ఇవ్వమని అభ్యర్థించారు. దైవప్రవక్త(స) అందుకు అనుమతించారు. కాని గడువు నిర్ధారించలేదు. దైవచిత్తమైనంత కాలం మేము మీకు ఈ అవకాశం ఇస్తామని అన్నారు. కాని యూదులు ఏటేటా పంట పంపకం దగ్గర ఏదో ఒక పేచీ పెట్టేవారు. వసూళ్ళ కోసం వెళ్ళిన వారికి లంచాలు ఇవ్వజూశారు. ఆఖరికి ఖలీఫా కుమారునికే కీడు తలపెట్టారు. తత్కారణంగా ఖలీఫా వారిపై దేశ బహిష్కార శిక్షకు పూనుకున్నారు.

87-1. హిజ్రీ 6వ సంవత్సరంలో జరిగిన సంఘటన ఇది. ప్రవక్త మహనీయులు (సఅసం) జీఖఅదా నెల చివర్లో సోమవారం నాడు ఉమ్రా చేసే సంకల్పంతో మదీనా నుండి మక్కాకు బయలుదేరారు. ఆయన(స) వెంట 700 మంది సహచరులు ఉన్నారు. 70 ఖుర్బానీ ఒంటెలున్నాయి. ప్రతి పది మందికి ఒక ఒంటె చొప్పున అవి ఏడువందల మందికి సరిపోతాయి. వేరొక ఉల్లేఖనంలో ఆయన వెంట 1400 మంది ఉన్నారని ఉంది. ఈ సమాచారం తెలుసుకున్న మక్కావాసులు ఖాలిద్ బిన్ వలీద్ నేతృత్వంలో ఒక సైనిక దళాన్ని, ప్రతిఘటన నిమిత్తం పంపారు. మక్కాకు రెండు మైళ్ళ దూరంలో ఉన్న 'కురాఅ ఘమీమ్'లో ఖాలిద్ బిన్ వలీద్ తన సైన్యాన్ని మోహరించారు. ఆయన అప్పటికింకా ముస్లిం కాలేదు.

మీరు కుడివైపునకు కదలండి” అని ప్రవక్త మహనీయులు(సఅసం) అన్నారు. దైవసాక్షి! ఖాలిద్‌కు ఈ వ్యూహం గురించి ఏమీ తెలియలేదు. అటు మహాప్రవక్త(స) ముందుకు సాగిపోయారు. చివరకు ఆయన(స) మక్కాలో ప్రవేశానికి ముందు విడిది చేసే పర్వత కనుమ వరకూ వెళ్ళిపోయారు. ఆయన(స) ఒంటె అక్కడే కూర్చుండి పోయింది. ప్రియ సహచరులు (ఒంటెను లేపడానికి) 'లే...లే' అన్నారు. కాని అది లేవలేదు. ఖస్వా[2] హఠం చేస్తోందని వారన్నారు. “ఖస్వా హఠం చేయదు. హఠం చేయటం దాని అలవాటు కానే కాదు. అసలు విషయం ఏమిటంటే ఏనుగుల వాళ్ళను ఆపినవాడే దీనిని (మక్కాలో ప్రవేశించకుండా) ఆపేశాడు” అని ప్రవక్త మహనీయులు(స) చెప్పారు. తరువాత ఆయన(స) ఇలా అన్నారు: “ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను- అల్లాహ్ పవిత్ర స్థలాలను గౌరవించే ఏ విషయాన్ని ఖురైషులు ప్రతిపాదించినా నేను దానిని సమ్మతించి ఆమోదిస్తాను.” చివరకు ఆయన(స) ఒంటెను విదిలించగా అది లేచింది. ఉల్లేఖకుడు ఇలా అన్నారు: దైవప్రవక్త (స) మక్కా వైపునకు వెళ్ళకుండా హుదైబియా ఆఖరి అంచు వరకూ సాగిపోయారు. అక్కడ ఒక గొయ్యి ఉంది. కాని అందులో నీరు చాలా తక్కువగా ఉంది. ఆయన అక్కడే విడిది చేశారు. జనులు కొద్ది కొద్దిగా ఆ నీటిని ఉపయోగించుకోసాగారు. నీటిని నిల్వ ఉంచకుండా పూర్తిగా తోడుకున్నారు. దాహం అవుతోందని సహచరులు ఫిర్యాదు చేయగా, ఆయన(స) తన అంబుల పొది నుండి ఒక బాణాన్ని తీసి, దీనిని అందులో పాతిపెట్టండి అని పురమాయించారు. అంతే, అందరి దాహాన్ని తీర్చడానికి ఒక్కసారిగా నీటి ఊట పెల్లుబికింది. వారంతా దాహం తీర్చుకున్నారు. అంతలోనే బుదైల్ బిన్ వరఖా ఖుజాయి (రజి) తన తెగ మనుషులను వెంటబెట్టుకుని అక్కడికి వచ్చాడు. వీళ్ళంతా 'తిహామా' వాసులు. దైవప్రవక్త(స) శ్రేయాన్ని అభిలషించేవారు. అతనిలా అన్నాడు: 'నేను కాబ్ బిన్ లోయీని, ఆమిర్ బిన్ లోయీని నా వెనుక వదలి వచ్చాను. వాళ్ళు హుదైబియాలోని నీటిబుగ్గల దగ్గర మోహరించి ఉన్నారు. వారి వెంట పుష్కలంగా పాలిచ్చే ఒంటెలు వాటి లేగదూడలతో సహా ఉన్నాయి. వాళ్లు మీతో పోరాడుతారు. మిమ్మల్ని బైతుల్లాహ్ వరకూ చేరుకోకుండా అడ్డుకుంటారు'. దానికి ఆయన (స)

---

87-2. దైవప్రవక్త(సఅసం) స్వారీ అయ్యే ఒంటె పేరు 'ఖస్వా'. ఇది చాలా వేగంగా నడుస్తుంది. దైవప్రవక్త(స) ఈ ఒంటెపైననే స్వారీ అయి హిజ్రత్ చేశారు.

“మేము యుద్ధం చేయడానికి రాలేదు. కేవలం ఉమ్రా చేసుకునే ఉద్దేశంతోనే వచ్చాము. యథార్థమేమంటే, ఎడతెరిపి లేని యుద్ధాలు ఖురైషులను కోలుకోకుండా చేశాయి. వారు తీవ్రంగా నష్టపోయారు. కనుక ఇప్పుడు వారు కోరినట్లయితే, ఒక నిర్ణీత వ్యవధి వరకు నేను వారితో నిర్యుద్ధ సంధి చేసుకుంటాను. ఈ లోగా వారు మాకూ– మా శత్రువులకు మధ్య తలదూర్చకూడదు. పిదప నేను ప్రాబల్యం వహించినట్లయితే, వారు కోరుకుంటే ఈ (ఇస్లాం) జీవన వ్యవస్థలోకి వచ్చి చేరవచ్చు. ఒకవేళ నాకు విజయం వరించకపోతే, కొన్నాళ్ళపాటు వారు ప్రశాంతంగా ఉండవచ్చు. ఒకవేళ వారు నా ప్రతిపాదనను త్రోసిపుచ్చినట్లయితే (వినండి), ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను– నా తల నా శరీరం నుండి వేరయ్యేవరకూ నేను ఈ జీవన ధర్మం (దీన్) కొరకు పోరాడుతూనే ఉంటాను. లేదా అల్లాహ్ ఈ జీవన వ్యవస్థను స్థాపించడమైనా చేస్తాడు” అని చాలా స్పష్టంగా చెప్పేశారు. ఇదంతా విని, ‘నేను మీ సందేశాన్ని వారికి చేరవేస్తాన’ని బుదైల్ చెప్పాడు, చెప్పినట్లే అతను తిరిగి రాగానే ఖురైషుల వద్దకు వెళ్ళి, ‘మేము ఆ వ్యక్తి (దైవప్రవక్త–సఅసం) వద్ద నుండి వస్తున్నాము. అతను చెప్పిన ఒక ముఖ్య విషయాన్ని మేము విన్నాము. మీరు కోరినట్లయితే, దానిని మీకు వినిపిస్తాము’ అన్నాడు. ‘అక్కరలేదు. ఆ వ్యక్తి మాట వినవలసిన అగత్యం మాకు లేద’ని ఖురైషులలోని మూర్ఖులు తెగేసి చెప్పారు. కాని వారిలోని ఆలోచనాపరులు, ‘సరే. మీరు విన్నదేమిటో మాకు వినిపించండి’ అని చెప్పారు. ‘ఆయన(స) ఈ విధంగా చెప్పగా నేను విన్నాను..’ అంటూ దైవప్రవక్త(సఅసం) చెప్పినదంతా పూర్తిగా వినిపించాడు. అప్పుడు ఉర్వా బిన్ మస్ఊద్(అప్పటికి ఆయన అవిశ్వాసుల వెంటే ఉన్నారు) లేచి, ‘నా జాతి ప్రజలారా! మీరు నా మీద ఒక తండ్రి మాదిరిగా వాత్సల్యాన్ని కురిపించటం లేదా?’ అని అడిగారు. దానికి వారంతా, ‘అందులో సందేహమేముంది?’ అన్నారు. ‘మరి నేను ఒక కొడుకు మాదిరిగా మీ అందరి శ్రేయాన్ని కోరటం లేదా?’ అని ఉర్వా ప్రశ్నించగా, ‘నిస్సందేహంగా’ అని వారంతా బదులిచ్చారు. ‘మీరు ఏ విషయంలోనయినా నాపై అపనింద మోపగలరా?’ అని ఉర్వా మళ్ళీ ప్రశ్నించగా, ‘లేదు’ అని వారంతా సమాధానమిచ్చారు. ‘మీ సహాయం కొరకు కదలిరండి అని నేను ఉకాజ్ వారిని కోరినప్పుడు, వారు నా మాటను త్రోసిపుచ్చిన సంగతి మీకు తెలియదా? అప్పుడు

**నేను నా వంశీయులను, నా పిల్లలను, నా మాట విన్న జనులందరినీ తెచ్చి మీకు సహాయకులుగా నిలబెట్టిన సంగతి మీకు గుర్తు లేదా?' అని ఉర్వా తిరిగి ప్రశ్నించగా, 'నీవు చెప్పినదంతా నిజం. మేము ఆ సంగతిని మరువలేద'ని ఖురైషులు ఒక్కుమ్మడిగా బదులిచ్చారు. అప్పుడు ఉర్వా 'చూడండి! ఇప్పుడు ఆ వ్యక్తి (ముహమ్మద్–సఅసం) మీ ముందు ఒక మంచి ప్రతిపాదన చేశాడు. దానిని ఆమోదించండి. (చర్చల నిమిత్తం) నన్ను అతని దగ్గరకు వెళ్ళనివ్వండి' అని కోరాడు. దానికి వారంతా, 'తప్పకుండా వెళ్లు' అన్నారు. అందువల్ల ఉర్వా బిన్ మస్ఊద్ (రజి) దైవప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చి, చర్చలు మొదలెట్టారు. బుదైల్ ముందు పెట్టిన ప్రతిపాదననే దైవప్రవక్త(స) ఈయన ముందు కూడా పెట్టారు. ఆ క్షణంలో ఉర్వా ఇలా అన్నారు : 'ఓ ముహమ్మద్(స)! మీరే చెప్పండి, ఒకవేళ మీరు మీ జాతి వారిని అంతమొందిస్తే, మీకంటే ముందు ఏ అరబ్బు వ్యక్తి గురించి అయినా, తాను తన కుటుంబీకులను నామరూపాల్లేకుండా తుదముట్టించానని చెప్పగా విన్నారా? ఒకవేళ వ్యవహారం తద్భిన్నంగా ఉంటే (అంటే ఖురైషులే మీపై విజయం సాధిస్తే), దేవుని సాక్షిగా చెబుతున్నాను– ఈనాడు మీ పంచన చేరిన ఈ విభిన్న వర్గాల జనులు (హబషీలు, రోమనులు, పారసీకులు) అప్పుడు మిమ్మల్ని ఒంటరివాణ్ణి చేసి, మీ నుండి పారిపోతారు'. ఈ మాటలు విన్న అబూబకర్(రజి) కోపంతో, 'పోరా పో. పోయి లాత్ విగ్రహం చనులు చప్పరించు. ఏమిటి, మేము దైవప్రవక్త (సఅసం)ను విడిచి పారిపోతామా? ఆయన్ని(స) ఒంటరివాణ్ణి చేస్తామా? ఏం మాట్లాడుతున్నావ్‌రా?' అన్నారు.[3] 'ఇంతకీ ఈయన గారెవరు?' అనడిగారు ఉర్వా. 'ఈయన అబూబకర్(రజి)' అని అక్కడ ఉన్నవారు చెప్పారు. 'ఎవరి అధీనంలో**

---

87–3. ఉర్వా బిన్ మస్ఊద్ అప్పటికింకా ముస్లిం కారు. కాని ఆయన విజ్ఞత వివేచనలు గల మనిషి. 'మీ వెంట ఉన్న ఈ బహుజన సముదాయం మిమ్మల్ని ఏకాకిని చేసి, వెళ్ళిపోతుంది' అని ఉర్వా చెప్పేసరికి హజ్రత్ అబూబకర్(రజి) అగ్గి మీద గుగ్గిలం అయ్యారు. సాధారణంగా అబూబకర్(రజి) మృదు స్వభావి. కోపం రాదు. కాని దైవప్రవక్త(స)కు తోడుగా ఉన్న సహచరుల చిత్తశుద్ధిని శంకిస్తూ మాట్లాడేసరికి ఆయనకు ఎక్కడలేని కోపం వచ్చింది. కోపావేశంలో అనరాని మాట అనేశారు. 'లాత్ చనులు చప్పరించు' అన్నారు. నిజానికి 'లాత్' విగ్రహానికి చనులు ఉండవు. చనులు స్త్రీకి ఉంటాయి. 'పోయి నీ తల్లిపాలు త్రాగరా' అని చెప్పదలిచారాయన. కాని ఆగ్రహావేశంలో 'తల్లి' బదులు 'లాత్ దేవత' పేరు ఆయన నోట వెలువడింది.

నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. లోగడ ఈయన చేసిన ఒక ఉపకారం నా మీద ఉన్నది. దానికి బదులుగా నేను ఇంతవరకు ప్రత్యుపకారం చేయలేకపోయాను. చేసి ఉంటే ఇప్పటికిప్పుడే దీటుగా జవాబిచ్చి ఉండేవాణ్ణి' అన్నారు ఉర్వా. తరువాత ఆయన దైవప్రవక్త(స)తో చర్చల్లో మునిగిపోయారు. మాటల మధ్యలో మాటిమాటికీ దైవప్రవక్త(స) పవిత్ర గడ్డాన్ని పట్టుకోసాగారు. ఆ సమయంలో దైవప్రవక్త(స)కు సమీపంలోనే నిలబడి ఉన్న ముగీరా బిన్ షూబా (రజి) మెడలో ఖడ్గం వ్రేలాడుతూ ఉంది. ఆయన శిరస్త్రాణం కూడా ధరించి ఉన్నారు. ఉర్వా దైవప్రవక్త(స) గడ్డాన్ని పట్టుకున్నప్పుడల్లా, ముగీరా ఖడ్గం మొనతో ఆయన చేతిని తాకుతూ, ముందు నీ చేతిని ప్రవక్త(స) గడ్డానికి దూరంగా ఉంచు అనేవారు. ఉర్వా తలపైకెత్తి 'ఇంతకీ ఈ ప్రబుద్ధుడు ఎవరు?' అని అడిగారు. 'ఈయన ముగీరా బిన్ షూబా' అని ప్రజలు చెప్పారు. 'ఓహో నువ్వా! ఓయీ దగుల్బాజీ!! నీ విశ్వాస ఘాతుకానికి పడే శిక్ష నుండి నేను నిన్ను కాపాడలేదా?' అని ప్రశ్నించారు ఉర్వా. ఇంతకీ ఏం జరిగిందంటే ముగీరా (ఇస్లాం స్వీకరించక ముందు) అజ్ఞాన కాలంలో ఒక అవిశ్వాసుల ముఠాలో కలసి ఉండేవారు. ఆయన వారందరినీ చంపేసి, వారి సొమ్ములను దోచుకుని మదీనా వచ్చారు. ఇస్లాం స్వీకరించారు. (దైవప్రవక్త-సఅసం- సమక్షంలో దోపిడీ సొమ్మును సమర్పించి, దీని విషయంలో తమరి ఆజ్ఞ ఏమిటో చెప్పండి అన్నారు). దానికాయన(స), "నువ్వు ఇస్లాం స్వీకరించావు. అంతవరకు బాగానే ఉంది. కాని ఈ దోపిడీ ధనంతో నాకెట్టి సంబంధం లేద"ని బదులిచ్చారు. (ఎందుకంటే అది మోసపూరితంగా ఆర్జించిన ధనం. దానిని నేను స్వీకరించలేను). తరువాత ఉర్వా ప్రవక్త సహచరుల కదలికలను చాలా శ్రద్ధగా గమనించసాగారు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు (స), ఎప్పుడయినా కాండ్రించి ఉమ్మినాసరే, ఆ కళ్ళాన్ని సయితం ప్రియ సహచరులు క్రింద పడనివ్వకుండా తమ చేతుల్లోకి తీసుకుని, తమ ముఖాలకు శరీరాలకు రుద్దుకుంటున్నారు. ఆయన(స) ఏదయినా పని కోసం ఆజ్ఞాపిస్తే దానిని తామే చేయడానికి పరస్పరం పోటీపడుతున్నారు. ఆయన(స)వుజూ చేయసాగితే, ఆ ఉపయోగిత నీటి వద్ద కూడా పొట్లాట జరిగేలా ఉంది వ్యవహారం. (ఎందుకంటే ఆ నీటి చుక్క క్రింద పడకుండా దానిని తమ శరీరాలకు పూసుకోవటానికి వారు ఎగబడుతున్నారు). ఆయన(స) మాట్లాడసాగితే ఒక్కసారిగా నిశ్శబ్దం రాజ్యమేలు

తుంది. ఆయన(స) యెడల వారి గౌరవ ప్రపత్తులు ఎటువంటివంటే, వారు కళ్ళెత్తి ఆయన్ని పూర్తిగా చూడనయినా లేని పరిస్థితి. ఉర్వా అక్కడి నుండి తిరిగి వచ్చిన తర్వాత, తన వాళ్ళను ఉద్దేశించి ఇలా అన్నారు: "ప్రజలారా! దైవసాక్షిగా చెబుతున్నాను. నేను చక్రవర్తుల దర్బారుల్లోకి ప్రతినిధి బృందాలను తీసుకుని వెళ్ళాను. రోము, పారసీక, నజాషీ దర్బారులకు వెళ్ళాను. కాని దైవసాక్షిగా! ఏ రాజదర్బారులో కూడా ప్రజలు ముహమ్మద్(స) సహచరుల మాదిరిగా తమ చక్రవర్తుల పట్ల గౌరవ ప్రపత్తులతో మెలగటం నేను చూడలేదు. దైవసాక్షిగా చెబుతున్నాను. ముహమ్మద్(స) ఉమ్మినా సరే, ఆ చిక్కటి ఉమ్మిని సయితం వారు తమ చేతుల్లోకి తీసుకుని తమ ముఖాలకు, శరీరాలకు రుద్దుకుంటున్నారు. ఆయన(స) దేనికోసమైనా ఆజ్ఞాపిస్తే చాలు, దానిని శిరసావహించటానికి వారు పరస్పరం పోటీపడుతున్నారు. ఆయన(స) వుజూ చేసినా అంతే. ఆయన ఉపయోగించిన నీటి కోసం అక్కడ పోట్లాట జరిగేలా ఉంది. ఆయన ఏదన్నా చెప్పటం మొదలెడితే నలువైపులా ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరిస్తోంది. వాళ్ళ ఆంతర్యాలలో ఆయన(స) పట్ల గల గౌరవాదరణలు ఎలాంటివంటే, వారు కళ్ళెత్తి ఆయన్ని తనివితీరా చూడనయినా లేకపోతున్నారు. ఆయన(స) మీకు ఒక ప్రతిపాదన చేశారు. మీరు దానిని స్వీకరించటం మంచిది."

ఇదంతా విన్న మీదట బనూ కనానాకు చెందిన ఒక వ్యక్తి, 'ఒకసారి నన్ను కూడా ఆయన వద్దకు వెళ్ళేందుకు అనుమతి ఇవ్వండి' అన్నాడు. 'సరే. నీకు అనుమతి ఇవ్వబడింది' అని ఖురైషు ప్రముఖులన్నారు. ఆ వ్యక్తి దైవప్రవక్త(స)ను, ఆయన ప్రియ సహచరులను సమీపించినప్పుడు, "ఇతను ఖుర్బానీ పశువులను గౌరవించే తెగకు చెందిన వ్యక్తి. కాబట్టి ఖుర్బానీ పశువులను తెచ్చి ఇతని ముందు నిలబెట్టండి" అని ఆజ్ఞాపించారు. ప్రియ సహచరులు ఖుర్బానీ పశువులను తోలుకుని వచ్చి అతని సమక్షంలో నిలబెట్టారు. 'లబ్బైక్' నినాదాలతో అతనికి స్వాగతం పలికారు. అతను ఆ దృశ్యాన్ని చూసి, 'సుబ్హానల్లాహ్! ఇలాంటి వాళ్ళను కాబా గృహాన్ని సందర్శించకుండా ఆపటం ఎంతమాత్రం సమంజసం కాద'న్నాడు. ఆ తర్వాత ఖురైషులలోని మరొక వ్యక్తి మిక్రజ్ బిన్ హఫస్ నిలబడి 'నన్ను కూడా వాళ్ళ దగ్గరకు వెళ్ళనివ్వండి' అని అభ్యర్థించాడు. 'సరే. నువ్వూ వెళ్ళవచ్చు' అని వారన్నారు. అతను దైవప్రవక్త(స)ను, ఆయన సహచరులను సమీపించినప్పుడు, "ఇతను

మిక్రజ్. పరమ నీచుడు" అని దైవప్రవక్త(స) పలికారు. అతను దైవ ప్రవక్త(స)తో సంభాషించటం మొదలెట్టాడు. సంభాషణ జరుగుతుండగానే సుహైల్ బిన్ అమ్ర్ వచ్చాడు. అతను రాగానే, "ఇక మీ వ్యవహారం సులభతరం అయినట్లే" నని దైవప్రవక్త(స) అతని రాకను శుభసూచకంగా భావించి చెప్పారు. అతను వచ్చీ రావటంతోనే, 'మీకూ– మాకూ మధ్యన సంధిపత్రం రాసుకోండి' అన్నాడు. ప్రవక్త మహనీయులు(స) లేఖకుణ్ణి పిలిపించి, 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్' అని వ్రాయి అని చెప్పారు. దానికి సుహైల్ అల్లాహ్ సాక్షిగా! 'రహ్మాన్' ఎవరో, అతనేమిటో మాకు తెలీదు. మునుపటి రివాజు ప్రకారమే 'బిస్మికల్లాహుమ్మ' అని వ్రాసుకోండి అన్నాడు. దానికి ముస్లింలు ససేమిరా అన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్' అని తప్ప మరో వాక్యం వ్రాయడానికి వీల్లేదు అని చెప్పారు. అయితే ప్రవక్త మహనీయులు(స), "ఫరవాలేదు. బిస్మికల్లాహుమ్మ అనే వ్రాయండి" అని ఆదేశించారు. తరువాత ఆయన(స), "దైవసందేశహరుడైన ముహమ్మద్(స) తరఫున వ్రాయించబడిన సంధి పత్రం" అని లిఖించండి అన్నారు. ఈ వాక్యానికి సుహైల్ అభ్యంతరం చెబుతూ, 'తమరు దైవసందేశహరుడు అన్న విషయం మాకు బోధపడితే మిమ్మల్ని కాబా గృహం నుండి ఆపవలసిన, మీతో యుద్ధాలు చేయవలసిన అవసరమే ఉండేది కాదు కదా! కేవలం 'అబ్దుల్లాహ్ కుమారుడగు ముహమ్మద్' అని మాత్రమే వ్రాయండి' అన్నాడు. దానికి ఆయన(స), "మీరు నన్ను ఎంతగా అబద్ధీకరించినా నేను దేవుని సత్య సందేశహరుణ్ణే. ఈ విషయానికి సాక్షిగా అల్లాహ్ చాలు. వ్రాయండి బాబూ! 'అబ్దుల్లాహ్ కుమారుడగు ముహమ్మద్' అనే వ్రాయండి" అని ఆజ్ఞాపించారు. జుహ్రీ ఇలా అంటున్నారు. దైవప్రవక్త(స) ఈ సందర్భంగా ఇంత మృదువుగా, పారదర్శకంగా వ్యవహరించడానికి గల కారణాలలో ఒకటేమంటే; ఇంతకు ముందు ఆయన(స) బుదైల్ బిన్ వరఖాకు మాటిచ్చి ఉన్నారు– అల్లాహ్ పవిత్ర చిహ్నాలను గౌరవించే క్రమంలో ఖురైషులు ఏ డిమాండు చేసినా దానిని గౌరవిస్తానని! అందుకే దైవప్రవక్త(స) సుహైల్ పట్ల ఎంతో ఉదారంగా వ్యవహరించారు. అయితే మొదటి షరతుగా, కాబా గృహ ప్రదక్షిణ కొరకు మీరు మాకు అనుమతి ఇచ్చి తీరాలన్నారు. దానికి సుహైల్, 'దైవసాక్షి! అలా జరగనివ్వము. ఒకవేళ అదే గనక జరిగితే మేము ఓడిపోయి, అనుమతిని ఇచ్చామని అరబ్బులంతా మమ్మల్ని ఎద్దేవా చేస్తారు. కాకపోతే వచ్చే ఏడాది మీకు అనుమతి ఉంటుంది'

**అన్నాడు. ఈ విషయం కూడా వ్రాసుకోబడింది. తరువాత సుహైల్, '(ఇది కూడా వ్రాయండి) మా వద్ద నుండి ఏ ఒక్కడు పరారై మీ దగ్గరకు వచ్చినా, అతను మీ మతధర్మాన్ని అవలంబించే వాడైనా సరే, మీరు(స) అతనిని మాకు అప్పగించాలి' అన్నాడు. ముస్లింలు (ఈ షరతు విని), 'ముస్లింగా ధర్మపరివర్తన చెంది, మా వద్దకు వచ్చిన వ్యక్తిని ముష్రిక్కులకు తిరిగి అప్పజెప్పటమా!? (ఎంత అవమానకరం?)' అన్నారు. ఈ తర్జనభర్జన జరుగుతుండగానే స్వయంగా సుహైల్ కుమారుడగు అబూ జందల్ (రజి) అక్కడకు వచ్చారు. ఆయనకు బేడీలు వేయబడి ఉన్నాయి. ఆయన మక్కా పల్లపు ప్రాంతం నుండి పరారై వచ్చి ముస్లింల ముందు ఆత్మ సమర్పణ చేసుకున్నారు. ఇప్పుడు సుహైల్‌కి అవకాశం దొరికింది. 'ముహమ్మద్! పారిపోయి మీ దగ్గరకువచ్చిన వారిని నాకు తిరిగి అప్పగించమని నేను కోరే మొదటి వ్యక్తి ఇతనే. సంధి షరతు ప్రకారం ఇతనిని నాకు అప్పగించండి' అన్నాడు. దానికి దైవ ప్రవక్త(సఅసం), "మనం ఇంకా ఈ అధికరణను సంధి పత్రంలో రాయనేలేదు కదా! (సంధి పత్రం పూర్తిగా లిఖించబడి, సంతకాలయ్యాకే దీని ప్రకారం అమలు అవుతుంది)" అని చెప్పారు. దానికి సుహైల్ 'దైవసాక్షిగా చెబుతున్నా. ఇలాగైతే ఎట్టి పరిస్థితిలోనూ మీతో సంధి జరగదు' అని తెగేసి చెప్పాడు. "సరే. ఇతనొక్కణ్ణీ ఇచ్చి నాకు మేలు చెయ్యి" అని దైవప్రవక్త(సఅసం) కోరారు. 'ఈ విషయంలో నేను మీకు ఎలాంటి మేలు చేయలేను' అన్నాడు సుహైల్. "లేదు. నువ్వు మేలు చేయాల్సిందే" అని దైవప్రవక్త(స) అభ్యర్థించగా, "అలా ఎన్నటికీ జరగనేరదు"అని సుహైల్ తెగేసి చెప్పాడు. మిక్రజ్ కల్పించుకుని 'సరే, ఇతనొక్కని విషయంలో మీ పట్ల ఉపకార భావంతో వ్యవహరిస్తామ'న్నాడు. కాని అతని మాట చెల్లలేదు. అప్పుడు నిస్సహాయుడుగా ఉన్న అబూ జందల్ ముస్లింలనుద్దేశించి, 'ముస్లిం సోదరులారా! నేనొక ముస్లింగా మీ వద్దకు వచ్చాను. మీరు నన్ను ముష్రిక్కులకే అప్పగిస్తారా? నా పట్ల ఎలాంటి వ్యవహారం జరిగిందో మీరు చూడటం లేదా?' అని ఆవేదన వ్యక్తం చేశారు. అబూ జందల్ (రజి)కు దైవ మార్గంలో పెట్టబడిన హింస వర్ణనాతీతం.** [4]

---

87-4. హుదైబియా సంధి షరతులు పైకి ఖురైషుల విజయంగా, ముస్లింల పరాజయంగా కనిపిస్తాయి. కాని ఈ సంధి షరతుల్లోని ప్రతి ఒక్కటి ముస్లింలకు అనుకూలమైనదని ఆ తర్వాతి రెండేళ్ళలో సంభవించిన పరిణామాలే నిరూపించాయి. ప్రవక్త ప్రియ సహచరులు (రజిఅల్లాహు అన్హుమ్) సయితం ఈ సంధిని జీర్ణించుకోలేకపోయారు.

ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు : ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఏమన్నారంటే, చివరకు నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై, 'తమరు దైవ సందేశహరులు అన్న విషయం నిజం కాదా?' అని అడిగాను. దానికి ఆయన(స), "ఎందుకు కాదు. నేను దైవ సందేశహరుణ్ణే" అన్నారు. 'మరైతే మనం సత్యంపైన లేమా? మన శత్రువులు అసత్యంపైన లేరా?' అని ప్రశ్నించాను. దానికి ఆయన(స), "నిజం. మనం సత్యంపైనే ఉన్నాము" అని బదులిచ్చారు. 'మరలాంటప్పుడు మనం ధర్మావలంబన విషయంలో అణగిమణగి ఉండాల్సిన అవసరం ఏముంది?' అని నేను నిలదీసి అడిగితే, "నేను దైవ సందేశహరుణ్ణి. కాబట్టి నేను దైవాజ్ఞను ఉల్లంఘించలేను. ఆయనే నా సహాయకుడు" అని సమాధానమిచ్చారు. 'మనం బైతుల్లాహ్‌కు వెళతాము. కాబా గృహ ప్రదక్షిణ చేస్తాము' అని మీరు మాతో అనలేదా?' అని కూడా అడిగాను. దానికి ఆయన(స) "అన్నాను. కాని ఈ సంవత్సరమే మనం బైతుల్లాహ్‌కు చేరుకుంటామని మీతో అన్నానా?" అని ఎదురు ప్రశ్న వేశారు. ఉమర్(రజి) ఇలా అంటున్నారు: 'లేదు. ఈ ఏడాదే అని తమరు అనలేదు.' "అలాగైతే వినండి. మీరు బైతుల్లాహ్ వరకు తప్పక వెళతారు. ఒకానొక రోజు మీరు కాబా గృహ ప్రదక్షిణ చేస్తార"ని దైవప్రవక్త(స) సెలవిచ్చారు. ఆ తర్వాత నేను అబూబకర్ (రజి) దగ్గరకు వెళ్ళి, ఆయనకు కూడా ఈ ప్రశ్నలే వేశాను. 'అబూబకర్! చెప్పండి, ముహమ్మద్(స) దైవ సందేశహరుడు అన్న విషయం వాస్తవం కాదా?' అని అడిగితే, "ఎందుక్కాదు? ఖచ్చితంగా ఆయన దైవప్రవక్తే" అన్నారు. 'ఏమిటి, మనం సత్యంపైన లేమా? మన శత్రువు అసత్యంపైన లేడా?' అని అడిగాను. దానికి అబూబకర్ (రజి), "అవును మనం సత్యంపైన్నే ఉన్నామ"ని బదులిచ్చారు. 'మరలాంటప్పుడు మనం అవలంబించే జీవన విధానాన్ని ఎందుకు పరాభవం పాల్జేయాలి?' అని నేను సూటిగా అడగ్గా, "మహాశయా! ఆయన(స) దైవ సందేశహరుడన్న విషయంలో సందేహానికి తావులేదు. ఆయన తన ప్రభువు ఆదేశాన్ని అతిక్రమించలేరు. ప్రభువే ఆయన సంరక్షకుడు, సహాయకుడూను. కాబట్టి ఆయన త్రాటిని గట్టిగా పట్టుకోండి. ఆయన(స) సత్యంపైన ఉన్నారన్న విషయానికి అల్లాహ్‌యే సాక్షి" అని అబూబకర్(రజి) చెప్పారు. 'త్వరలోనే మనం అల్లాహ్

---

హజ్రత్ ఉమర్(రజి) గారైతే తీవ్రంగా కలత చెందారు. ఆ కారణంగానే ఆయన దైవప్రవక్త(స) సమక్షంలో అనుచితంగా మాట్లాడారు. తరువాత బాధపడ్డారు.

గృహానికి చేరుకుని తవాఫ్ (ప్రదక్షిణ) చేస్తామని దైవప్రవక్త(స) మనతో అనలేదా?' అని ఉమర్(రజి) ప్రశ్నించగా, 'ఇందులో కూడా సందేహమే లేదు. మీరు ఒకానొకనాడు కాబా గృహంలో ప్రవేశిస్తారు. అక్కడ తవాఫ్ చేస్తారు' అని అబూ బకర్(రజి) సమాధానమిచ్చారు.

జుహ్రీ ఇలా అంటున్నారు : ఆ తరువాత నేను నా తొందరపాటు ధోరణికి పరిహారంగా సత్కార్యాలు చేశానని ఉమర్(రజి) చెప్పారు. సంధిపత్రం వ్రాయటం పూర్తయిన తరువాత ప్రవక్త మహనీయులు(స) తన సహచరులతో, "ఇక లేవండి. (మీరు మీ వెంట తెచ్చుకున్న పశువుల) ఖుర్బానీ ఇచ్చి, శిరోముండనం చేయించుకోండి" అని చెప్పారు. కాని దైవసాక్షిగా! సహచరులలో ఏ ఒక్కరు కూడా లేవలేదు. దైవప్రవక్త(స) మూడుసార్లు చెప్పారు- ఖుర్బానీ ఇచ్చి శిరోముండనం చేయించుకోండి అని. ఎవరూ లేవకపోవడంతో ఆయన(స) ఉమ్మె సలమా (ర.అ) ఉన్న గుడారం లోనికి వెళ్ళి, ప్రజల మొండి వైఖరి గురించి ఆమె ముందు ప్రస్తావించారు. దానికి ఆమె, 'దైవప్రవక్తా! మీరు బయటికి వెళ్ళి, ఎవరితోనూ ఏమీ అనకుండా మీ ఖుర్బానీ పశువును జిబహ్ చేయండి. తరువాత మీ క్షురకుడిని పిలిపించి శిరోముండనం చేయించుకోండి. ఇలా చేయటం మీకు ఇష్టకరం కాదా!?' అన్నారు. అందువల్ల ప్రవక్త మహనీయులు(సఅసం) బయటకు వచ్చి, ఎవరితోనూ మాట్లాడకుండా చేయవలసినదంతా చేసేశారు. అంటే ఖుర్బానీ ఇచ్చారు. క్షురకుణ్ణి పిలిపించి శిరోముండనం చేయించుకున్నారు. ఇది గమనించిన సహాబా కూడా ఒకరింకొకరి తలలు గొరిగించటం మొదలెట్టారు. వారి వాలకాన్ని చూస్తుంటే ఏ క్షణంలో పరస్పరం కొట్లాటకు దిగుతారా అనిపించింది. తరువాత (మక్కా నుండి) కొంతమంది విశ్వసించిన స్త్రీలు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు : "విశ్వసించిన ప్రజలారా! విశ్వసించిన స్త్రీలు మీ వద్దకు వలస వచ్చినప్పుడు (వారు విశ్వసించిన వారవునో కాదో) పరీక్షించి తెలుసుకోండి. వారి విశ్వాసం ఎంత వాస్తవమైనదో అల్లాహ్‌యే బాగా ఎరుగును. తరువాత, వారు విశ్వసించినవారే అని మీకు తెలిస్తే, వారిని అవిశ్వాసుల వద్దకు తిప్పి పంపకండి. వారూ అవిశ్వాసులకు ధర్మసమ్మతం కారు. అవిశ్వాసులు కూడా వారికి ధర్మసమ్మతం కారు. అవిశ్వాసులైన వారి భర్తలు వారికిచ్చిన 'మహర్'ను వారికి తిరిగి ఇచ్చివేయండి. మీరు వారికి ఇవ్వవలసిన మహర్‌ను వారికి ఇచ్చి వేస్తే,

అప్పుడు మీరు వారిని వివాహ మాడటంలో దోషం లేదు. స్వయంగా మీరు కూడా అవిశ్వాసులైన స్త్రీలను మీ వివాహ బంధంలో ఆపి ఉంచకండి" *(అల్ ముమ్తహినహ్ – 10).*

ఆ రోజు హజ్రత్ ఉమర్(రజి) అప్పటివరకూ ఇస్లాం స్వీకరించకుండా ఉన్న తన ఇద్దరు భార్యలకు విడాకులిచ్చారు. తరువాత వారిలో ఒకామె ముఆవియా బిన్ అబూ సుఫ్యాన్(రజి)ను వివాహమాడగా, మరొకామె సఫ్వాన్ బిన్ ఉమయ్యాను మనువాడింది. ఆ తర్వాత దైవప్రవక్త(స) మదీనాకు తిరిగి వచ్చినప్పుడు, ఖురైషులకు చెందిన ఒక వ్యక్తి అబూ బసీర్(రజి) మక్కానుండి పరారై వచ్చారు. ఆయన ముస్లింగా ధర్మపరివర్తన చెందారు. ఆయన్ని వెనక్కి రప్పించటానికి ఖురైషులు ఇద్దరు వ్యక్తులను పంపించారు. వారొచ్చి, 'మీకూ– మాకూ మధ్య జరిగిన ఒడంబడిక ప్రకారం అబూ బసీర్(రజి)ని మాకు వాపసు చేయండి' అని దైవప్రవక్త(స)కు విజ్ఞప్తి చేశారు. ఒడంబడిక ప్రకారం దైవప్రవక్త(స) అబూ బసీర్(రజి)ను వాపసు చేశారు. ఖురైషు ప్రతినిధులు ఆయన్ని తీసుకుని మక్కా వెళుతూ 'జుల్ హులీఫా'కు చేరుకోగానే తమ వద్ద ఉన్న ఖర్జూర పండ్లు తినడానికి దిగారు. అబూబసీర్ (రజి) వాళ్ళను మాటల్లో దింపి, 'దైవసాక్షి! నీ దగ్గరున్న ఈ ఖడ్గం చాలా బాగుంది' అన్నారు. రెండవ వ్యక్తి ఆ ఖడ్గాన్ని ఒరలోనుంచి బయటికి తీసి, 'అవును. దైవసాక్షిగా! ఇది అత్యుత్తమ మైన ఖడ్గమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాన'ని అన్నాడు. 'కాస్త నాకు చూపెట్టగలవా' అంటూ అబూబసీర్ (రజి) ఆ ఖడ్గాన్ని తన స్వాధీనంలోకి తీసుకుని ఒక్క వ్రేటువేశారు. దాంతో ఆ ఖడ్గ యజమాని కథ సమాప్తమైంది. అది చూసిన రెండవ వ్యక్తి మదీనా వైపు పరుగులు తీశాడు. మస్జిదె నబవీలోకి వచ్చిన ఆ వ్యక్తిని దైవప్రవక్త(స) చూసి, "అతను భయాందోళనకు గురైనట్టు ఉన్నాడు" అన్నారు. అతను దైవప్రవక్త(స)దగ్గరకువచ్చి, 'అయ్యా, దైవసాక్షిగా! నా సహవాసి హత మార్చబడ్డాడు. మీరు గనక అబూబసీర్‌ను ఆపకపోతే నేను కూడా హత్యకు గురి కావచ్చు' అన్నాడు. అంతలోనే అబూబసీర్ కూడా వచ్చి 'దైవప్రవక్తా! మీ కర్తవ్యాన్ని మీరు నెరవేర్చారు. అయితే అల్లాహ్ నాకు వీళ్ళబారి నుండి విముక్తిని ప్రసాదించాడు' అన్నారు. ఈ మాట విని, "నీ అమ్మ కడుపుమాడ! ఒకవేళ అతని (హతుని) సమర్థకుడు ఏ ఒక్కడున్నా మళ్ళీ యుద్ధాగ్ని జ్వాలలు రగులుతాయి" అన్నారు దైవప్రవక్త(స). ప్రవక్త(స) పలికిన మాటలనుబట్టి, ఆయన మళ్ళీ తనను ఖురైషులకు

అప్పగిస్తారని తలపోసి అబూబసీర్ (రజి) అక్కడి నుండి పలాయనం చిత్తగించారు. సముద్ర తీర ప్రాంతానికి వచ్చి అక్కడే నివసించసాగారు.

ఉల్లేఖకుడు ఇలా అన్నారు : అటు మక్కాలో తన ఇంటివారల నుండి తప్పించుకుని పరారైన అబూ జందల్ బిన్ సుహైల్ (రజి) కూడా వచ్చి అబూబసీర్‌కి తోడయ్యారు. ఈ విధంగా మక్కాలో ఖురైషుల చెరనుండి తప్పించుకున్న ప్రతి ఒక్క ముస్లిం మదీనా వెళ్ళే బదులు తీరప్రాంతానికి వచ్చి అబూబసీర్(రజి)ను ఆశ్రయించసాగారు. క్రమక్రమంగా అది పలాయన వాదుల స్థావరంగా మారింది. ఒక ముఠా తయారయింది. ఖురైషుల వర్తక బిడారు ఆ ప్రాంతం గుండా సిరియాకు వెళ్తుందని తెలియగానే, దారిలోనే అటకాయించి వర్తక సామగ్రిని దోచుకునేవారు. ప్రయాణికులను చంపేసేవారు. ఈ పరిణామాలకు విసుగెత్తి పోయిన ఖురైషులు దైవప్రవక్త(స) వద్దకు దరఖాస్తు పంపుతూ, మా యందు దయవుంచి అబూబసీర్‌ను, అతని ముఠా మనుషులను కాస్త నిలువరించండి. వారు ఖురైషులను తీవ్రంగా బాధిస్తున్నారని విజ్ఞప్తి చేశారు. అప్పుడు దైవప్రవక్త(స) వారి దగ్గరకు తన దూతను పంపించారు. ఇక మీదట ఏ ఒక్కడు (మక్కా నుండి) మీ దగ్గరకు రాదలచినా అతనికి పూర్తి రక్షణ ఉంటుందని హామీ కూడా ఇచ్చారు. ఈ సందర్భంగానే అల్లాహ్ ఈ ఆయత్‌లను అవతరింపజేశాడు :

"మక్కాలోయలో వారి చేతులను మీ నుండి, మీ చేతులను వారి నుండి ఆపినవాడు ఆయనే. వాస్తవానికి ఆయన మీకు వారిపై ఆధిక్యం ఇచ్చాడు. మీరు చేస్తూ ఉన్నదంతా అల్లాహ్ చూస్తూ ఉండినాడు. సత్యాన్ని తిరస్కరించి, మిమ్మల్ని మస్జిదె హరామ్‌కు రాకుండా నిరోధించి, ఖుర్బానీ ఒంటెలను వాటి వధ్య స్థలాల దగ్గరకు చేరనీయకుండా చేసినది వారే కదా! (మక్కాలో) నీవు ఎరుగని విశ్వాసులైన స్త్రీ పురుషులు లేకుండా ఉన్నట్లయితే, తెలియకపోవటం వల్ల నీవు వారిని కాలరాస్తావనే ప్రమాదం, దానివల్ల నీపై అపవాదు వస్తుందనే భయం లేకపోయినట్లయితే (యుద్ధాన్ని ఆపటం జరిగేది కాదు. దానిని ఎందువల్ల ఆపటం జరిగిందంటే) అల్లాహ్ తన కారుణ్యంలోకి తాను కోరిన వారిని ప్రవేశింపజేసేటందుకు. ఆ విశ్వాసులు వేరుగా పోయి ఉంటే, (మక్కావాసులలోని) అవిశ్వాసులను తప్పకుండా మేము కఠినంగా శిక్షించి ఉండేవారము. (ఈ కారణం వల్లనే) ఈ అవిశ్వాసులు

తమ హృదయాలలో మూఢాభిమానాన్ని పెంచుకున్నప్పుడు, అల్లాహ్ తన ప్రవక్తపై విశ్వాసులపై 'సకీనత్' (ప్రశాంత స్థితి)ని అవతరింపజేశాడు." *(అల్ ఫతహ్ :24-26)*

వారి మూఢాభిమానానికి పరాకాష్ఠ ఏమిటంటే (ఒడంబడిక సందర్భంగా) వారు ఆయన్ని(స) దైవ సందేశహరునిగా ఒప్పుకోలేదు. చివరకు 'బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్' అనే వాక్యాన్ని కూడా వ్రాయనివ్వలేదు. ఈ విధంగా వారు ఆయన్ని(స) కాబా గృహం వరకు చేరకుండా అడ్డుకున్నారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పారని ఉర్వా తెలిపారు : (ముస్లింగా ధర్మపరి వర్తన చెంది మక్కానుండి) మదీనాకు వలస వచ్చిన స్త్రీలను ప్రవక్త మహనీయులు (సఅసం) పరీక్షించేవారు (జుహ్రీ ఏమన్నారంటే) ముష్రిక్కులు విశ్వసించిన తమ భార్యలపై ఖర్చుచేసిన దానిని ముస్లింలు వారికి వాపసు చేయాలని, ఇంకా ముస్లింలు అవిశ్వాసులైన స్త్రీలను తమ వివాహ బంధంలో ఉంచరాదన్న ఆయత్‌ను అల్లాహ్ అవతరింపజేసినప్పుడు హజ్రత్ ఉమర్(రజి) తన భార్యలలో అవిశ్వాసులైన ఇద్దరు స్త్రీలకు విడాకులిచ్చారు. వారిలో ఒకామె ఖురైబా బిన్తె అబీ ఉమయ్యా, మరొకామె జర్వల్ ఖుజాయి కూతురు. తరువాత ఖురైబాను ముఆవియా (రజి) పెండ్లి చేసు కున్నారు (అప్పటికింకా ఆయన ముస్లిం కారు). మరొకామెను అబూజహమ్ వివాహమాడారు. కాని ముస్లింలు అవిశ్వాసులైన తమ భార్యలపై పెట్టిన ఖర్చులను చెల్లించడానికి అవిశ్వాసులు నిరాకరించినప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింప జేశాడు :

ఒకవేళ అవిశ్వాసినులైన మీ భార్యల మహర్‌లోని కొంత భాగమేదైనా అవిశ్వాసుల నుండి మీకు తిరిగి లభించకపోతే, తరువాత మీ వంతు వచ్చినప్పుడు, ఎవరి భార్యలైతే ఆ వైపున ఉండిపోయారో, వారికి వారు ఇచ్చి ఉన్నంత మహర్ మొత్తాన్ని చెల్లించండి." *(అల్ ముమ్తహినహ్ : 11)*

అవిశ్వాసుల భార్యలలో ఎవరయినా విశ్వసించి, హిజ్రత్ చేసి తమ వద్దకు వస్తే వారి భర్తలకు ముస్లింలు నష్టపరిహారం క్రింద సొమ్ము చెల్లించాలి. తరువాత వచ్చిన అల్లాహ్ ఆదేశం ప్రకారం, ముస్లిం పురుషుని భార్య గనక ధర్మభ్రష్టురాలై (ముర్తద్ అయి) అవిశ్వాసుల వద్దకు వెళ్ళిపోతే, ఆమెకు ఇవ్వవలసిన (మనోవర్తి) ఖర్చులను, మక్కా నుండి హిజ్రత్ చేసి వచ్చిన విశ్వాసులైన స్త్రీల ఖర్చుల్లోనుండి మినహాయించుకోవాలి. అయితే విశ్వసించిన మీదట ఏ 'ముహాజిరా' కూడా

**'ముర్తద్' అయి వెళ్ళిపోయినట్టు మా వద్ద ఆధారమేదీ లేదు. మాకు చేరిన రివాయతులలో ఇది కూడా ఒకటి : అబూబసీర్(రజి) హుదైబియా ఒడంబడిక జరిగి ఉన్న కాలంలో ముస్లింగా ధర్మపరివర్తన చెంది, ఒక ముహాజిర్‌గా వచ్చినప్పుడు, అఖ్‌నస్ బిన్ షరీఖ్ దైవప్రవక్త(స)కు ఉత్తరం వ్రాస్తూ, ఒడంబడిక ప్రకారం అబూబసీర్(రజి)ను వాపసు చేయమని కోరాడు. తరువాత ఇదే హదీసును చివరి వరకు వినిపించారు.**

## అధ్యాయం : 16

## అరువు వ్యవహారంలో షరతు పెట్టడం

**అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి), అతా బిన్ అబీ రబాహ్ ఏమన్నారంటే, ఒకవేళ అరువు వ్యవహారం చేస్తున్నప్పుడు, గడువు పెట్టుకుంటే అది సమ్మతమే.**

**88) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం, మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఒక వ్యక్తి గురించి ప్రస్తావించారు. అతను (బనీ ఇస్రాయీల్‌కి చెందిన) మరొకతని వద్ద వెయ్యి బంగారు నాణాలు అరువుగా ఇవ్వమని అడిగినప్పుడు, అప్పిచ్చువాడు ఒక నిర్ణీత గడువును పెట్టి మరీ అప్పు ఇచ్చాడు.[1]**

## అధ్యాయం : 17

## యజమానితో లిఖితపూర్వక ఒప్పందం చేసుకున్న బానిస గురించి, దైవగ్రంథానికి విరుద్ధంగా ఉన్న షరతుల గురించి...

**మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) 'ముకాతబత్' చేసుకున్నవారికీ-వారి యజమానులకు మధ్య విధించుకోబడిన షరతులు ప్రామాణికమైనవని చెప్పారు. కాగా; ఇబ్నె ఉమర్ లేదా ఉమర్ (రజి) ఏమన్నారంటే, దైవగ్రంథానికి విరుద్ధంగా ఉన్న షరతు అధర్మం. అలాంటి షరతులు వంద ఉన్నా సరే (అవి చెల్లనేరవు)**

---

88-1. అప్పిచ్చే వ్యక్తి ఈ రకమయిన షరతులను పెట్టగలడని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. అలాంటి షరతుపై అప్పు తీసుకున్నవాడు నిర్ధారిత గడువులోగా అప్పు చెల్లించాలి. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. అప్పు ఇచ్చిపుచ్చుకున్న ఆ ఇద్దరు ఇస్రాయీల్ సంతతి వ్యక్తుల పేర్లు మాత్రం తెలియలేదు.

**89)** హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు: బరీరా (ర.అ) తన 'ముకాత బత్' విషయంలో సహాయం కోరడానికి వచ్చినప్పుడు, "నీవు గనక కోరితే, ఆ ముకాతబత్ సొమ్మునంతా నేను ఒకేసారి చెల్లిస్తాను. అయితే నీ 'వలా' హక్కు నాకు చెందాలి" అని నేను చెప్పాను. దైవప్రవక్త(స) ఇంటికి వచ్చినప్పుడు, నేను ఈ విషయాన్ని ఆయన(స) ముందు ప్రస్తావించగా, "నువ్వు ఆ బానిస స్త్రీని కొనుగోలు చేసి, స్వేచ్ఛను ప్రసాదించు. ఇక 'వలా హక్కు' అంటావా, అది ఎట్టి పరిస్థితిలోనూ స్వేచ్ఛను ప్రసాదించిన వారికే దక్కుతుంది" అని చెప్పారు. తరువాత ప్రవక్త మహనీయులు(స) వేదికనెక్కి ప్రసంగించారు. "ప్రజలకు ఏమైంది? దైవగ్రంథంలో ఎక్కడా ప్రస్తావనకు రాని షరతులను వారు విధిస్తున్నారేమిటి? దైవగ్రంథంలో లేని షరతులను ఎవరు విధించినా, అలాంటి షరతులు వంద ఉన్నాసరే వాటి వల్ల ప్రయోజనం ఏమీలేద"ని చెప్పారు.

## అధ్యాయం : 18

## వ్యవహారం చేసేటప్పుడు నోటి మాటగా షరతు పెట్టడం లేదా మినహాయింపు ఇవ్వటం సమ్మతమే.

ప్రజాబాహుళ్యంలో చెలామణిలో ఉన్న వ్యవహారాలలో ఒకవేళ ఎవరయినా, 'నాకు ఫలానా వ్యక్తి నుండి వంద దిర్హములు రావలసి ఉన్నాయి. ఒకవేళ ఒకట్రెండు వదులుకున్నా తొంభై తొమ్మిది లేదా తొంభై ఎనిమిది ఇవ్వవలసి ఉంటాయి'' అని అనటం.

అబ్దుల్లాహ్ బిన్ ఔన్ గారు ఇబ్నె సీరీన్ నుండి ఇలా నకలు చేశారు: ఒక వ్యక్తి ఒంటె కలిగి ఉన్నవానితో, 'నీవు నీ ఒంటెను తోలుకుని వచ్చి, లోన కట్టివేయి. ఒకవేళ నేను గనక ఫలానా రోజువరకు నీతో కలసి (ప్రయాణానికి) బయలుదేరక పోతే, నువ్వు వంద దిర్హములు నా దగ్గర నుండి వసూలు చేసుకోవచ్చు' అని అంటాడు. కాని అతను ఆ రోజు వరకు వెళ్ళలేకపోతాడు. అప్పుడు ఖాజీ షురైహ్ (రహ్మా) ఏమన్నారంటే; ఎవరయినా మనస్ఫూర్తిగా తన తరఫున షరతు విధించు కుంటే, అతనిపై ఎవరూ ఆ మేరకు బలవంతం చేయకపోతే, అట్టి పరిస్థితిలో అతను ఆ షరతును నెరవేర్చవలసి ఉంటుంది. అయ్యూబ్, ఇబ్నె సీరీన్ (రహ్మా) నకలు చేసిన దాని ప్రకారం; ఎవరయినా ఒక వ్యక్తి ధాన్యం అమ్మాడు, కొనుగోలుదారుడు

అతనితో, 'ఒకవేళ నేను బుధవారం వరకు నీ దగ్గరకు రాలేకపోతే నీకూ- నాకూ మధ్య ఈ వర్తక వ్యవహారం మిగిలి ఉండదు' అని మాటిచ్చాడు. మరి అతను ఆ రోజువరకు రాలేదు. అందువల్ల షురైహ్ కొనుగోలుదారుని ఉద్దేశించి, "నీవు వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు" అని చెబుతూ అతనికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు.

**90)** ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "అల్లాహ్‌కు **99** పేర్లు ఉన్నాయి. అంటే వందకు ఒకటి తక్కువ. ఎవరయితే వీటన్నింటినీ పదిలపరచుకున్నాడో (అంటే కంఠస్థం చేసుకున్నాడో) అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు."[1]

## అధ్యాయం: 19

## 'వక్ఫ్'లో షరతులు విధించటం

**91)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)కు ఖైబర్‌లో (విజయప్రాప్తిగా) ఒక భూభాగం (పంట పొలం) లభించింది. దీని విషయంలో సలహా కోరుతూ ఆయన(రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. 'దైవప్రవక్తా! నాకు ఖైబర్‌లో ఒక భూభాగం లభించింది. నాకు ఇంతవరకు దానికన్నా విలువైన ఆస్తి ఏదీ లభించలేదు. దీని గురించి తమరేమంటారు? అని విన్నవించుకున్నారు. దానికాయన (సఅసం), "నీవు కోరుకుంటే అసలు భూమిని నీ యాజమాన్యంలోనే ఉంచుకుని, దాని ఫలసాయాన్ని మాత్రం దానం (సదఖా) చెయ్యవచ్చు" అని సలహా ఇచ్చారు. ఇబ్నె ఉమర్(రజి) ఇలా వివరించారు: ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఆ పంట పొలాన్ని సదఖా(దానం)గా ఇస్తూ షరతులు పెట్టారు. వాటి ప్రకారం భూభాగాన్ని అమ్మటానికి గానీ, కానుకగా ఇవ్వటానికి గానీ వీలులేదు. ఇందులో వారసత్వ సంక్రమణ కూడా చెల్లదు. ఆ విధంగా ఆయన ఆ పొలాన్ని అవసరార్థుల కోసం, బంధువుల కోసం, బానిసలను విడుదల చేయటం

---

90-1. ఈ హదీసులో దైవప్రవక్త(సఅసం) వందలో ఒకటి మినహాయించారు. దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే అధిక సంఖ్యలో నుండి అల్ప సంఖ్యను మినహాయించటం సబబే. అల్లాహ్‌కు గల ఈ 99 నామాలు 'అస్మావుల్ హుస్నా' అనబడతాయి. వీటిలో ఒక్కటి మాత్రమే అల్లాహ్ స్వంత పేరు. మిగతావన్నీ గుణనామాలే. వీటిలో అత్యధిక నామాలు ఖుర్ఆన్‌లో వచ్చాయి. మిగిలినవి హదీసులలో ఉన్నాయి.

**కోసం, దైవధర్మ పరివ్యాప్తి కోసం, అతిథుల కోసం సదఖాగా 'వక్ఫ్' చేశారు. దాని ధర్మకర్త (ముతవల్లీ) గనక నిబంధనావళి ప్రకారం– తన అవసరార్థం– అందులో నుండి కొంత మొత్తం తీసుకుంటే లేదా అగత్యపరులకు ఇస్తే, అట్టి పరిస్థితిలో అతను నిందార్హుడు కాడు[1]– ఇబ్నె ఔన్ ఇలా అంటున్నారు: నేను ఈ హదీసు గురించి ఇబ్నె సీరీన్ ముందు ప్రస్తావించినప్పుడు, "ముతవల్లీ (ధర్మకర్త) ఆ సొమ్మును కూడబెట్టే ఉద్దేశ్యంతో తీసుకోలేదు" అని వ్యాఖ్యానించారు.**

91–1. ఈ హదీసుకు– అధ్యాయంలోని మకుటానికి గల సామ్యం సువిదితమే. తన ఆస్తిపాస్తులను వక్ఫ్ చేసే వ్యక్తి తాను కోరిన విధంగా షరతులు విధించగలడు. ఉదాహరణకు– హజ్రత్ ఉమర్(రజి) విధించిన షరతులు చాలా వివరంగా ఉన్నాయి. వక్ఫ్ చేసే వ్యక్తి తన వక్ఫ్ ఆస్తిపై తన యాజమాన్యపు హక్కును కొనసాగించగలడని కూడా ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. వక్ఫ్ ఆస్తికి ధర్మకర్త (ముతవల్లీ)గా ఉన్న వ్యక్తి అవసరార్థుడై ఉంటే, అతను సదుద్దేశంతో ఆ ఆదాయం నుండి– శాస్త్రం ప్రకారం– కొంత సొమ్మును తీసుకోగలడన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా తేటతెల్లమయింది. వక్ఫ్ షరతులలో 'దైవమార్గంలో ఖర్చు' అనే పద్దు కూడా ఒకటి ఉంది. దీని ప్రకారం; సత్యధర్మ సమున్నతికై పాటుపడే యోధులకు కూడా ఈ పద్దు క్రింద ఇవ్వవచ్చు.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 4. వీలునామాల ప్రకరణం

**అల్ బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"మీలో ఎవరికైనా మరణకాలం సమీపించినప్పుడు, వారు ఆస్తిపాస్తులు కలవారైతే, తమ తల్లిదండ్రులకు, బంధువులకు న్యాయ సమ్మతంగా పంచిపెడుతూ మరణ శాసనం విధిగా వ్రాయాలి. ఇది అల్లాహ్ పట్ల భయభక్తులు కలవారి విధ్యుక్త ధర్మం. ఇంకా, మరణ శాసనం విన్నవారు, తరువాత ఒకవేళ దాన్ని మార్చితే, దాని పాపమంతా ఆ మార్చిన వారిదే. అల్లాహ్ అంతా వింటాడు. ఆయనకు అన్నీ తెలుసు. కాని మరణ శాసనం చేసిన వ్యక్తి, తెలియకపోవటం వల్లనో లేక బుద్ధిపూర్వకంగానో అన్యాయం చేశాడనే అనుమానం ఎవరికైనా కలిగితే, వారు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వారందరి మధ్య రాజీ కుదిరిస్తే, అందులో ఏమాత్రం దోషం లేదు. అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూను."★ (అల్ బఖరా : 180–182)**

**92) ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు :"ఏ ముస్లిం అయినాసరే అతని వద్ద 'వసీయతు' చేయదగ్గ సొమ్ము ఏదయినా ఉంటే, రెండు రాత్రులు కూడా వసీయతు (లిఖితపూర్వకంగా) చేయకుండా గడవటం ఏమాత్రం సమంజసం కాదు". ఇమామ్**

---

★ చనిపోయే ముందు మనిషి, నా తదనంతరం ఈ విధంగా చేసుకోండి, ఫలానా వారికి ఇంత ఇవ్వండి అని చెప్పిపోతే, దానిని 'మరణశాసనం(వసీయత్) అంటారు. వసీయతు చేసిన వ్యక్తిని 'మౌసీ'గా వ్యవహరిస్తారు. ఎవరి పేరున వసీయతు చేయటం జరిగిందో అతనిని 'మౌసీలహు' అంటారు. వారసత్వానికి సంబంధించిన ఆయత్ అవతరించిన తరువాత, ఏ వ్యక్తి అయినా తన ఆస్తిలో 'మూడో వంతు' మాత్రమే మరణశాసనంగా వ్రాయగలడు. మిగతాది వారసుల మధ్యన పంపిణీ అవుతుంది.

**మాలిక్‌తోపాటు ఈ ఉల్లేఖనాన్ని ముహమ్మద్ బిన్ ముస్లిం గారు కూడా అమ్ర్ బిన్ దీనార్ నుండి సంగ్రహించారు. మరి ఆయనేమో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) నుండి ఉటంకించగా, ఆయన(రజి) ప్రవక్త మహనీయుల(సఅసం) నుండి ఉల్లేఖించారు.[1]**

**93) ప్రవక్త మహనీయుల(సఅసం) వారి బావమరిది, ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ జువైరియా బిన్తె హారిస్(ర.అ) సోదరుడగు అమ్ర్ బిన్ హారిస్(రజి) తెలిపారు: "దైవప్రవక్త(సఅసం) తన మరణ సమయంలో తన తెల్లని కంచెర గాడిదను, తన ఆయుధాలను, తాను 'వక్ఫ్' చేసిన భూమిని తప్ప[1] ఏ దిర్హములను గానీ, దీనార్లనుగానీ, బానిసలను గానీ, బానిస స్త్రీలనుగానీ, మరే వస్తువునుగానీ (తన ఆస్తిగా) వదలిపోలేదు."**

---

92-1. వారసత్వ హక్కులను నిర్దేశించే ఆయత్ అవతరించక పూర్వం అల్ బఖరా సూరాలోని 180వ ఆయత్ ప్రకారం వీలునామా వ్రాయటం విధి (ఫర్జ్)గా ఉండేది. మీరాశీ ఆయత్ అవతరించిన తరువాత ఈ మరణశాసనం 'విధి'గా చేయాలన్న ఆదేశం మిగులలేదు.

మరణ శాసనాన్ని మార్చటం మహాపరాధం. అయితే మరణశాసనం వ్రాసిన వ్యక్తి తెలీకపోవటం వల్ల షరీఅత్‌కు విరుద్ధంగా వ్రాసి ఉంటే అట్టి పరిస్థితిలో వారసులంతా ఒక అంగీకారానికి వచ్చి, షరీఅత్ ప్రకారం దానిని మార్చవచ్చు.

అలాగే ఏ ఆస్తిపరుడైనా తన ఆస్తిలో మూడోవంతు మాత్రమే వసీయతు చేయగలడు. అలాగాకుండా అతడు హక్కుదారులకు హక్కు దక్కకుండా ఎవరికయినా మూడవ వంతుకన్నా ఎక్కువ ఆస్తిని వ్రాసి ఇస్తే అది ధర్మవిరుద్ధంగా పరిగణించబడుతుంది. అట్టి పరిస్థితిలో హక్కుదారులంతా ఏకాభిప్రాయంతో ఆ వీలునామాను మార్చటం కూడా తప్పు కాదు. తప్పు ఏ దశలో జరిగినా వీలునామా వ్రాయబడిన వ్యక్తి వారసులందరినీ సమావేశపరచి, అందరికీ అసలు విషయాన్ని విశదీకరించి తప్పును సరిదిద్దటం అభిలషణీయం.

'వసీయతు' మూజువాణీగా కాకుండా వ్రాతపూర్వకంగా ఉండటం తప్పనిసరి. ఎందుకంటే మరణం ఎప్పుడు వస్తుందో, ఎక్కడ వస్తుందో తెలీదు. కాబట్టి ఆస్తిపరుడు ప్రతి విషయం క్షుణ్ణంగా రాసిపెడితే, వారసులకు మేలు చేసినవాడవుతాడు.

93-1. అంటే, తాను ఆరోగ్యవంతునిగా ఉన్నప్పుడు ఈ భూమిని 'వక్ఫ్' చేసేశారు. తరువాత మరణ ఘడియలు సమీపించినప్పుడు కూడా ఆ విషయాన్ని గుర్తు చేసి తాకీదు చేశారు. మరికొంతమంది ప్రకారం "వజఅల సదఖతన్" అనే వాక్యం ప్రకారం కంచెర గాడిదను, ఆయుధాలను, భూమిని కూడా వక్ఫ్ చేసేశారు.

**94)** తల్హా బిన్ ముస్‌రిఫ్ ఇలా అన్నారు: 'ప్రవక్త మహనీయులు (స) ఏదైనా వసీయతు చేశారా?' అని నేను అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి)ను అడగ్గా, 'లేద'ని ఆయన చెప్పారు. 'మరలాంటప్పుడు ప్రజలపై వసీయతు (మరణ శాసనం) ఎలా విధితమవుతుంది?' లేదా (ఉల్లేఖకులు ఇలా చెప్పారు) 'వసీయతు గురించి ప్రజలకు ఎలా ఆదేశించారు?' అని నేను ప్రశ్నించగా, ఆయన ఇలా సమాధానమిచ్చారు. "దైవగ్రంథం ప్రకారం ఆచరించండి" అని దైవప్రవక్త(సఅసం) వసీయతు చేశారు[1] (కాబట్టి ఇందులో వసీయతు కూడా వచ్చేస్తుంది).

**95)** అస్వద్ బిన్ యజీద్ కథనం : కొంతమంది హజ్రత్ ఆయిషా(ర.అ) సన్నిధికి వచ్చి, 'హజ్రత్ అలీ(రజి) ప్రవక్త మహనీయుల(స) వారి శాసనాధికారి (వసీ)గా నియుక్తులయ్యారా?' అని ప్రశ్నించగా, ఆమె ఇలా అన్నారు. "మరణ సమయంలో ఆయన(స) పవిత్ర శిరస్సు నా గుండెలపైనే ఉంది (లేదా ఆమె ఇలా అన్నారు), ఆయన(స) తన శిరస్సును నా ఒడిలోనే ఉంచారు. తరువాత ఆయన(స) నీటిపాత్ర తెప్పించారు. అంతలోనే ఆయన తల నా ఒడిలో వాలిపోయింది. ఆయన (స) పరమపదించారన్న సంగతి కూడా నాకు అర్థం కాలేదు. మరలాంటప్పుడు ఆయన(స) అలీ (రజి)ని 'వసీ'గా ఎప్పుడు చేసినట్టు!?'[1]

## అధ్యాయం : 1

## తన వారసులను ఇతరుల ముందు చేయి చాచి అర్థించేలా వదలిపెట్టడం కన్నా వారిని ఆస్తిపరులుగా వదలిపోవటం మిన్న

---

94-1. దైవగ్రంథం ప్రకారం ఆచరించండి అన్న ఆజ్ఞ ఒక సమగ్రమైన వసీయతు (మరణ శాసనం) వంటిది. షరీఅత్ ఆదేశాలన్నీ అందులోకి వచ్చేస్తాయి. ముస్లింలు ఖుర్ఆన్, హదీసు ప్రకారం నడుచుకుంటూ ఉన్నంతకాలం వారు సర్వవిధాలా అభివృద్ధి చెందారు. ఖుర్ఆన్ హదీసులను వీపు వెనుక పడవేసి తమ స్వంత అభిప్రాయాలపై అంచనాలపై ఆధారపడటం మొదలెట్టినప్పటి నుండే సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వారిలో చీలికలు వచ్చాయి. వేర్వేరు ముఠాలు ఏర్పడ్డాయి. సర్వత్రా ముస్లింలు ప్రవాహంలోని గడ్డిపోచల్లా మారి ఓటమి పాలయ్యారు.

95-1. అస్వస్థతకు గురైననాటి నుండి మరణం వరకు ఆయన(స) నా వద్దనే ఉన్నారు. నా ఒడిలోనే తనువు చాలించారు. అలీ(రజి)ని ఆయన(స) తన తదనంతర అధికారిగా నియమించి ఉంటే, ఆ విషయం నాకు తప్పకుండా తెలిసి ఉండేది అన్నది హజ్రత్ ఆయిషా(ర.అ) మాటల్లోని అంతరార్థం.

**96) హజ్రత్ సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) వీడ్కోలు హజ్జ్ యాత్ర సందర్భంగా- నన్ను పరామర్శించడానికి వచ్చారు. అప్పుడు నేను మక్కాలో ఉన్నాను. ఒక స్థలం నుండి హిజ్రత్ (వలస) చేసిన వ్యక్తి అదే స్థలంలో మరణించడాన్ని దైవప్రవక్త(సఅసం) ఇష్టపడేవారు కారు. "అల్లాహ్ అఫ్రా పుతునిపై దయజూపుగాక!"[1] అని దైవప్రవక్త(స) పలికారు. 'దైవప్రవక్తా! నా ఆస్తిపాస్తులన్నింటినీ (దైవమార్గంలో) వసీయతు చేయగోరుతున్నాను' అని నేను విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "వద్దు" అన్నారు. 'సగం ఆస్తి వ్రాసి ఇచ్చే యనా?' అని అడిగాను. దానికి కూడా ఆయన (స) "వద్దు" అనే చెప్పారు. 'పోనీ మూడింట ఒకవంతు వసీయతు చేయమంటారా?' అని నేను అడిగితే, "సరే. మూడింట ఒక వంతు ఇవ్వగలవు. అయినా అది కూడా ఎక్కువే. నీవు నీ వారసు లను జనుల ముందు చేయి చాపి ముష్టెత్తుకునేలా విడిచిపెట్టడం కన్నా, వారిని ఆస్తిపరులుగా వదిలిపోవటం మంచిది. నీవు నీ వస్తువు ఏదయినా ఇస్తే (దైవ మార్గంలో ఖర్చుపెడితే) అది నీ యెడల 'దానం' అవుతుంది. నీవు నీ భార్య నోటికి అందించే ముద్ద కూడా నీ పాలిట దానం అవుతుంది. (కాబట్టి నీవు ఇప్పుడే మరణ శాసనం చేయనవసరం లేదు). బహుశా అల్లాహ్ నీకు ఆరోగ్యాన్ని ప్రసాదించవచ్చు. ఆ తరువాత నీ ద్వారా చాలామందికి లాభం చేకూరవచ్చు. అన్యులు అనేక మందికి (నీ ద్వారా) నష్టం కూడా వాటిల్లవచ్చు"[2] అని ఆయన (సఅసం) ఉపదేశించారు. ఆ సమయంలో హజ్రత్ సాద్ బిన్ అబీ వక్ఖాస్ (రజి)కు ఒక్కగానొక్క కూతురు మాత్రమే ఉంది.**

---

96-1. సాద్ బిన్ అబీ వక్ఖాస్ తల్లి పేరు ఖౌలా. ఆమెను 'అఫ్రా' అని కూడా పిలిచేవారు. 'అఫ్రా' ఆమె బిరుదు అని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఆమె మక్కాలోనే మరణించారు.

96-2. ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పినట్లే జరిగింది. సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి)కు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించబడింది. ఒక దశలో ఆయన(రజి) తన ప్రాణాలపై ఆశ వదులుకున్నారు. అయితే దైవప్రవక్త(స) దీవెనలు ఆయనపై కురిశాయి. ఆ తరువాత ఆయన(రజి) మరో యాభై ఏళ్ళు బ్రతికారు. అల్లాహ్ ఆయన(స)కు సిరి సంతానాదులను ఇచ్చాడు. ఆయనకు పదిమంది కుమారులు, పన్నెండు మంది కుమార్తెలని చరిత్రకారులు వ్రాశారు. ఇస్లామీయ చరిత్రలో ఆయన ఘనకార్యాలు ఎన్నదగినవి.

## అధ్యాయం : 2
## మూడో వంతు ఆస్తిని వసీయతు చేయడం

**మరణ శాసనం చేసే వ్యక్తి 'జిమ్మీ' అయివుంటే, అతను కూడా తన ఆస్తిలో మూడింట ఒక వంతు మాత్రమే విల్లు వ్రాయించగలడని ఇమామ్ హసన్ బస్రీ (రహ్మ) అన్నారు. ఖుర్ఆన్‌లో ఆదేశించబడిన విధంగా వారి మధ్యన (జిమ్మీల మధ్య) నిర్ణయం గైకొనమని[1] దైవప్రవక్త(సఅసం) ఆదేశించబడ్డారని మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు. అల్లాహ్ (అల్ మాయిదా సూరాలో) ఇలా ఆజ్ఞాపించాడు : "(ఓ ప్రవక్తా!) అల్లాహ్ అవతరింపజేసిన దానికి అనుగుణంగానే నీవు వారి మధ్యన తీర్పు చెయ్యి."** ***(అల్ మాయిదా- 49)***

**97) ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అన్నారు : ఒకవేళ ప్రజలు మూడింట ఒక వంతు కన్నా తక్కువ- నాల్గవ వంతు వసీయతు చేస్తే మరీ మంచిది. ఎందుకంటే ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ఉద్బోధించారు: మూడోవంతు వసీయతు చేయదలిస్తే సరి. కాని మూడోవంతు కూడా ఎక్కువే."**

**98) తన తండ్రి సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి)తనతో చెప్పారని ఆమిర్ బిన్ సాద్ తెలిపారు : నేను మక్కాలో అస్వస్థతకు గురయ్యాను. నన్ను పరామర్శించటానికి ప్రవక్త మహనీయులు(సఅసం) విచ్చేశారు. నేను ఆయన(స)కు 'దైవప్రవక్తా! నేను ఏ స్థలం నుండి వచ్చానో అక్కడికే తిప్పి పంపవద్దని (అంటే మక్కాలోనే మరణం వొసగవద్దని) ప్రార్థించండి' అని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స) "అల్లాహ్ నీకు సంపూర్ణ స్వస్థతను ప్రసాదించవచ్చు. నీ ద్వారా చాలామంది లబ్ది పొందవచ్చు" అని సమాధానమిచ్చారు. అప్పుడు నేను, 'ప్రవక్తా! నేను నా ఆస్తిని వసీయతు**

---

2-1. జిమ్మీలకయినా, ముస్లింలకయినా ఈ శాసనం సమానంగా వర్తిస్తుంది. అంటే ఏ వ్యక్తి అయినా తన ఆస్తిలో మూడింట ఒక వంతు మాత్రమే 'వసీయతు' చేయగలడు. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫియి, ఇమామ్ అహ్మద్‌లు కూడా ఇదే విధానాన్ని అవలంబించారు. ఒకవేళ మృతునికి వారసులెవరూ లేని పక్షంలో అతని మిగతా రెండు వంతుల ఆస్తి ప్రభుత్వ ధనాగారానికి చేరుతుంది. హనఫీ ఫికహ్ ప్రకారం మృతుని వారసులు గనక అనుమతి ఇచ్చినట్లయితే, అతను మూడింట ఒక వంతుకన్నా ఎక్కువ కూడా 'వసీయతు' చేయగలడు. ఇమామ్ బుఖారీ (రహ్మ) గారు ఇమామ్ హసన్ బస్రీ (రహ్మ) పలుకులను ఉదహరిస్తూ హనఫీ దృక్పథాన్ని త్రోసిపుచ్చారని ఇబ్నె బతాల్ తెలిపారు.

చేయదలుస్తున్నాను. నాకు ఒక్కగానొక్క కుమార్తె తప్ప పిల్లలెవరూ లేరు. నా ఆస్తిలో సగభాగాన్ని వ్రాసి ఇవ్వమంటారా?' అని అడిగాను. దానికి ఆయన(స) "సగభాగం చాలా ఎక్కువ" అన్నారు. 'పోనీ మూడింట ఒక వంతు వసీయతు చేయమంటారా?' అని అడిగితే, "సరే కానివ్వు. ఒకవిధంగా చెప్పాలంటే ఇది కూడా ఎక్కువే (లేదా) ఇదీ చాలా పెద్ద మొత్తమే" అని చెప్పారు. అందువల్ల జనులు తమ ఆస్తిలో మూడింట ఒకవంతు వసీయతు చేయడం మొదలెట్టారు. అది వారి కొరకు ధర్మసమ్మతం అయిపోయింది.

## అధ్యాయం : 3

## వసీయతు చేసే వ్యక్తి తాను వసీయతు చేసిన వానితో 'కాస్త నా పిల్లల్ని కనిపెట్టుకుని ఉండు' అని చెప్పటం. అటు వసీయతు పొందిన వ్యక్తి 'దావా' చేయటం

**99)** మహాప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వా బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు : ఉతబా బిన్ అబీ వక్ఖాస్ మరణ సమయంలో తన సోదరుడైన సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి)కు వసీయతు చేస్తూ, '(సోదరా!) జమా వద్ద బానిస స్త్రీగా ఉన్న ఆమెకు పుట్టిన పిల్లవాడు నిజానికి నా కుమారుడు. కాబట్టి (ఏనాటికైనా) నువ్వు అతన్ని నీ సంరక్షణలోకి తీసేసుకో' అని చెప్పాడు. అందువల్ల 'మక్కా విజయం' సందర్భంగా సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) ఆ అబ్బాయిని తీసేసుకుని, 'ఇతను నా అన్న కొడుకు' అని దావా చేశారు. ఆ మేరకు తన అన్న తనకు వసీయతు చేసినట్టు చెప్పారు. మరోవైపున అబ్ద్ బిన్ జమా (రజి) లేచి, 'అయ్యో! ఇతను నా సోదరుడు. ఎందుకంటే ఈ పిల్లవాణ్ని మా నాన్నగారి బానిస స్త్రీ కన్నది. వీడు మా నాన్న గారి పడకపై పుట్టాడ'ని వాదించారు. పిదప వారిద్దరూ ఈ వివాదాన్ని తీసుకుని దైవప్రవక్త(సఅసం) సన్నిధిలో హాజరయ్యారు. 'దైవప్రవక్తా! ఇతను నా అన్న కొడుకు. నా అన్న ఈ మేరకు మరణ శాసనం చేసి పోయాడ'ని సాద్ బిన్ అబీ వక్ఖాస్(రజి) విన్నవించుకున్నారు. అయితే అబ్ద్ బిన్ జమా (రజి) తన వాదనను వినిపిస్తూ, 'ఇతను నా తమ్ముడు. నా తండ్రి వద్ద దాసిగా ఉన్న స్త్రీకి పుట్టినవాడు' అని చెప్పారు. తరువాత ప్రవక్త మహనీయులు(సఅసం) ఇలా తీర్పు వినిపించారు: "అబ్ద్ బిన్ జమా! పిల్లవాడు ఎవరి పడకపై పుట్టాడో వారికే

**చెందుతాడు. వ్యభిచారం చేసినవాని వాటా క్రింద రాళ్ళే వస్తాయి". కాని ఆయన(స) తన సతీమణి సౌదా బిన్తె జమా (ర.అ)నుద్దేశించి, "ఆ పిల్లవాని పట్ల పరదా పాటించు" అని ఉపదేశించారు. ఎందుకంటే ఆ అబ్బాయిలో ఉతబా పోలికలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందువల్ల ఆ పిల్లవాడు సౌదా (ర.అ)ను జీవితాంతం చూడలేకపోయాడు. కడకు ఆమె అల్లాహ్‌ను చేరుకుంది.**[1]

## అధ్యాయం : 4

## ఒకవేళ రోగి గనక, అర్థమయ్యేలా తల ఊపితే (సంజ్ఞ చేస్తే) దాని ప్రకారం నిర్ణయం గైకొనబడుతుంది

**100) మహనీయ అనస్(రజి) కథనం : ఒక యూదుడు ఒక అన్సార్ బాలిక తలను రెండు రాళ్ళ మధ్యన పెట్టి నుజ్జునుజ్జు చేసేశాడు. 'నీకు ఈ దుర్గతిని పట్టించినదెవరు? ఫలానా వ్యక్తి ఇలా చేశాడా? ఫలానా మనిషి ఈ దారుణానికి ఒడిగట్టాడా? అని విచారణ జరుపుతూ ఆ యూదుని పేరు ప్రస్తావించగానే, ఆ బాలిక అవునని తలూపుతూ సైగ చేసింది. అప్పుడు ఆ యూదు వ్యక్తిని పిలిపించి విచారణ జరిపితే అతను తన నేరాన్ని అంగీకరించాడు. తరువాత దైవప్రవక్త(స) ఆదేశంపై అతని తలను కూడా రాళ్ళతో బద్దలుగొట్టడం జరిగింది.**[1]

---

99–1. ఉతబా తన తమ్ముడు సాద్ బిన్ అబీ వక్కాస్‌కు వసీయతు చేస్తూ, ఆ పిల్లవాణ్ణి నువ్వు తీసుకో. అతనిని కనిపెట్టుకుని ఉండు అని చెప్పి మరీ పోయాడు. అందుకే సాద్(రజి) తన అన్న చెప్పిన మాటకు కట్టుబడి, ఆ అబ్బాయి కోసం పట్టుపట్టారు. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం. ఆ అబ్బాయి పేరు అబ్దుర్రహ్మాన్. దైవప్రవక్త(స) అతన్ని జమా పుత్రుడుగా కూడా ఖరారు చేశారు. ఆ లెక్కన అతను సౌదా బిన్తె జమా(ర.అ)కు తమ్ముడవుతాడు. కాని అతని ముందుకు రావద్దని ఆయన(స) తన భార్యకు తాకీదు చేశారు. కారణం; అతడు ఉతబాను పోలి ఉండటమే.

100–1. ఆ బాలిక తల ఊపి చేసిన సంజ్ఞ ఆధారంగా దానిని సాక్ష్యంగా స్వీకరించి యూదుణ్ణి నిర్బంధంలోకి తీసుకోమని ఆజ్ఞాపించారు. అంతేగాని కేవలం ఆ బాలిక సంజ్ఞ ఆధారంగా ప్రతీకార శిక్ష విధించలేదు. యూదునికి ఇంటరాగేషన్ చేశారు. అతను తన అపరాధాన్ని ఒప్పుకున్న మీదట ప్రతీకార న్యాయం (ఖిసాస్) కొరకు ఆదేశించారు. అందుకే న్యాయశాస్త్ర ప్రవీణులు మరణించే వ్యక్తి సంజ్ఞ ద్వారా ఇచ్చిన సాక్ష్యాన్ని ఎన్నదగినదిగా భావించారు. ఎందుకంటే చనిపోయే వ్యక్తి సాధారణంగా నిజమే చెబుతాడు, అబద్ధం చెప్పడు.

## అధ్యాయం : 5

## వారసుని కొరకు వసీయతు చేయడం ధర్మసమ్మతం కాదు[1]

**101)** ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: ఇస్లాం తొలి కాలంలో (వారసత్వ) సొమ్ము సంతానానికి లభించేది. తల్లిదండ్రులు మరణ శాసనం చేయడం తప్పనిసరి అయి ఉండేది. అయితే అల్లాహ్ తాను కోరిన విధంగా ఈ ఆదేశాన్ని రద్దుపరిచాడు. తరువాత మగ పిల్లవాని వాటాను ఇద్దరు ఆడపిల్లల వాటాకు సమానంగా ఖరారు చేశాడు. తల్లిదండ్రులలో ప్రతి ఒక్కరికీ ఆరవ భాగం, భార్యకు (పిల్లలుంటే గనక) ఎనిమిదవ భాగం, (పిల్లలు లేని పక్షంలో) నాల్గవ భాగాన్ని ఖరారు చేశాడు. అలాగే భర్తకు (పిల్లలు లేకుండా ఉంటే) సగభాగం (పిల్లలుంటే) నాల్గవ భాగాన్ని ఖరారు చేశాడు.

## అధ్యాయం : 6

## మరణ ఘడియలలో దానధర్మాలు చేయటం

**102)** మహనీయ అబూహురైరా (రజి) కథనం: ఒక సహచరుడు ప్రవక్త మహనీయుల(సఅసం)ను, 'దైవప్రవక్తా! దానాలలోకెల్లా గొప్ప దానం ఏది?' అని ప్రశ్నించగా, ఆయన(స) ఇలా బదులిచ్చారు: "నీవు ఆరోగ్యవంతుడిగా ఉండి, ధన వ్యామోహం తీవ్రంగా ఉన్నప్పుడు, ఆ ధనాన్ని పెట్టుబడిగా పెడితే లాభం వస్తుందన్న ఆశాభావం నీకు ఉన్నప్పుడు, దానిని ఖర్చుపెడితే పేదరికం దాపురిస్తుందన్న భయం నీకు ఉన్నప్పుడు నీవు చేసే దానం అన్నింటికన్నా మేలైనది. నీ (గుండెలోని) ప్రాణం గొంతు దాకా వచ్చినప్పుడు ఫలానా వారికి ఇంత సొమ్ము ఇవ్వండి, ఫలానా వారికి ఇంత ఇవ్వండి అని చెప్పాల్సిన పరిస్థితిని రానీయవద్దు. ఎందుకంటే అప్పుడు అది ఎలాగూ ఫలానా వారిది అయిపోయింది (మరి నువ్వేమో ఈ లోకాన్ని వీడి పోతావు)."

---

5-1. ఈ విషయం ఒక హదీసులో చాలా వివరంగా వచ్చింది. దీనిని అస్హాబె సునన్ తదితరులు అబూ ఉమామా(రజి), ఇబ్నె అబ్బాస్(రజి)ల ద్వారా ఉటంకించారు. అయితే ఆ హదీసు సనదుపై చర్చకు తెర లేచింది. అందుకే ఇమామ్ బుఖారీ (రహ్మ) దానిని ఇక్కడ పొందుపరచలేకపోయారు. ఇమామ్ షాఫియి (రహ్మ) ఈ ఉల్లేఖనాన్ని 'ముత వాతిర్'గా పేర్కొన్నారు. ఇమామ్ ఫఖ్రుద్దీన్ రాజీ దీనిని నిరాకరించారు.

## అధ్యాయం : 7

### "మృతుడు వ్రాసిన వీలునామాను అమలుపరచి, అతనిపై ఉన్న అప్పులు తీర్చిన తరువాతే ఆస్తి పంపకం జరగాలి" అని అల్లాహ్ సెలవీయటం. (సూరె నిసా: 11)

ఖాజీ షురైహ్, ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్, తావుస్, అతా, అబ్దుర్రహ్మాన్ బిన్ ఉజైనా ప్రభృతులు వ్యాధిగ్రస్త స్థితిలో అప్పుకు సంబంధించి చేసిన ధ్రువీకరణ సరైనదేనని చెప్పారు. ప్రపంచంలో ఎవరి ఆఖరి దినం పరలోకంలో అతని మొదటి దినమై ఉంటుందో అటువంటి మనిషిని అందరికన్నా సత్యవంతుడని భావించాలి అని ఇమామ్ హసన్ బస్రీ వక్కాణించారు. ఇబ్రాహీమ్ నఖ్యీ, హకమ్ బిన్ ఉతబా ఇలా అన్నారు : "ఒకవేళ వ్యాధిగ్రస్తుడు, వారసునితో, నేనతనికి ఏమీ బాకీ పడిలేను" అని చెబితే అతని వాంగ్మూలం సరైనదిగానే పరిగణించబడుతుంది." తన భార్య ఫజారియా తలుపు లోపల నిక్షిప్తమై ఉన్న ధనాన్ని తెరువరాదని రాఫె బిన్ ఖదీజ్(రజి) వసీయతు చేశారు. ఎవరయినా చనిపోయే ముందు తన బానిసతో, నేను నిన్ను బానిసత్వం నుండి విడుదల చేస్తున్నాను అని చెబితే అది ధర్మసమ్మతమే నని ఇమామ్ హసన్ బస్రీ వక్కాణించారు. స్త్రీ తన మరణ ఘడియలలో, 'నా భర్త నాకు మహర్ సొమ్ము చెల్లించాడు. నేను దానిని పుచ్చుకున్నాను' అని చెబితే అది ధర్మసమ్మతమేనని షాబీ చెప్పారు. వ్యాధిగ్రస్తుని అంగీకారం వారసుల మధ్య దురను మానాలకు దారితీసే అవకాశం ఉంటే, అట్టి అంగీకారం సరైనది కాదని కొంత మంది (హనఫీలు) అంటారు. మరి చూడబోతే ఈ మహానుభావులే అమానత్, బిజాఅత్, ముజారిబత్ వంటి వ్యవహారాలలో వ్యాధిగ్రస్తుని ఒప్పుకోలు సరైనదేనని చెబుతారు. కాగా; ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా సెలవిచ్చారు : "మీరు దురనుమానాలకు దూరంగా ఉండండి, దురనుమానం అతి పెద్ద అబద్ధం." ముస్లింలు (తోటి వారసుల) హక్కును కాజేయటం ఎంతమాత్రం సమంజసం కాదు. ఎందుకంటే, "అమానతు (అప్పగింత)లో నమ్మకద్రోహం చేయటం కపటి చిహ్నమ"ని మహాప్రవక్త(సఅసం) చెప్పారు. అల్లాహ్ అన్ నిసా సూరాలో ఇలా సెలవిచ్చాడు : "అమానతులను వాటి అర్హులైనవారికి అప్పగించండి"[1] అని అల్లాహ్

---

7–1. ఈ ఆయత్ అవతరణా నేపథ్యం గమనించదగినది. మక్కా విజయం సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసం) ఉస్మాన్ బిన్ తల్హా (రజి)నుండి కాబా గృహం తాళం చెవులు తీసుకొని లోపలికి వెళ్ళారు. హజ్రత్ అబ్బాస్(రజి) తాళంచెవులు అడిగినప్పుడు ఈ

**మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. (4: 58) ఈ విషయంలో వారసుడు, వారసుడు కానివాడు అన్న తారతమ్యం లేదు. ఈ విషయంలోనే అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చే మర్ఫూ హదీసు ఉల్లేఖించబడింది.**

**103) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు : "కపట విశ్వాసి (మునాఫిక్) చిహ్నాలు మూడు. అతడు మాట్లాడితే అబద్ధం చెబుతాడు. అతన్ని నమ్మి అతని దగ్గర అమానతును భద్రపరిస్తే అందులో నమ్మకద్రోహానికి పాల్పడతాడు. అతడు ఎప్పుడయినా వాగ్దానం చేస్తే, దానికి విరుద్ధంగా వ్యవహరిస్తాడు."**

## అధ్యాయం : 8

## వీలునామాను అమలుపరచి, అప్పులు తీర్చిన మీదటే వాటాలు వేయబడతాయన్న దైవాదేశం గురించి...

**వీలునామాను అమలుపరచటం కన్నా ముందు అప్పులు తీర్చమని దైవ ప్రవక్త(సఅసం) ఆజ్ఞాపించినట్లు అనబడుతోంది. అన్ నిసా సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : "అమానతులను అర్హులైన వారికి అప్పగించండి" (58). కాబట్టి అమానతులను (అప్పులను) చెల్లించటం స్వచ్ఛందమైన వీలునామాను అమలుపరచటం కన్నా ఎక్కువ అవసరం. "దానం చేసిన మీదట కూడా మనిషి ధనవంతుడుగా ఉండగలిగితేనే అది ఉత్తమమైన దానం అవుతుంది" అని మహా ప్రవక్త(స) వక్కాణించారు. యజమాని ఆనతి లేకుండా బానిస వీలునామా వ్రాయ లేదని ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పారు. "బానిస తన యజమాని సొమ్ముకు పర్య వేక్షకుడు" అని మహాప్రవక్త(స) ప్రవచించారు.**

**104) (సుప్రసిద్ధ సహాబీ) హకీమ్ బిన్ హిజామ్(రజి) తెలిపారు : నేను దైవ ప్రవక్త(సఅసం) సమక్షంలో ధన సహాయం అడిగాను. ఆయన(స)నాకు ఇచ్చారు. మళ్ళీ అడిగాను. మళ్ళీ ఇచ్చారు. ఆ తరువాత ఆయన (స) ఇలా అన్నారు:**

---

ఆయత్ అవతరించింది. తరువాత ఆ తాళం చెవిని ఆయన(స) ఉస్మాన్ బిన్ తల్హాకు తిరిగి ఇచ్చేశారు. నాటి నుంచి నేటివరకు ఆ కుటుంబీకులే కాబా తాళం చెవులను భద్రపరుస్తున్నారు. నేటికీ సఊదీ పరిపాలకులు కాబాగృహం లోపలికి వెళ్ళదలచినప్పుడు ఆ కుటుంబీకుల నుండి తాళం చెవులు తీసుకుని మళ్ళీ వాపసు చేయవలసి ఉంటుంది.

**"హకీమ్! ఈ ప్రాపంచిక సొమ్ము చూడటానికి ఎంతో మనోహరంగా, రుచిలో ఎంతో తియ్యగా ఉంటుంది. కాని ఎవరయితే దీనిని 'ఆత్మ తృప్తి'తో తీసుకుంటారో వారి పాలిట శుభకరం అవుతుంది. మరెవరయితే దీనిని అత్యాశతో తీసుకుంటారో వారికి అందులో శుభం కలుగదు. అతని ఉపమానం ఎటువంటిదంటే, అతను సుష్టుగా తింటాడు గాని అతని కడుపు నిండదు. పై చేయి (ఇచ్చే చేయి) క్రింది చేయి (పుచ్చు కునే చేయి) కన్నా మేలైనది." ఈ ఉపదేశం విన్న హకీమ్ బిన్ హిజామ్ (రజి) 'దైవప్రవక్తా! మిమ్మల్ని సత్యసందేశహరునిగా పంపినవాని సాక్షిగా చెబుతున్నాను. ఈ రోజు తర్వాత ఇక ఎన్నడూ ఎవరినీ ఏమీ అడగను. చనిపోయే వరకూ ఎవరి నుండీ ఏమీ తీసుకోను' అని అన్నారు. ఆనాటి నుండి ఆయన పరిస్థితి ఎలా ఉండేదంటే, అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఆయన్ని సాలుసరి పెన్షన్ ఇవ్వడానికి పిలిచే వారు. కాని ఆయన దానిని స్వీకరించడానికి నిరాకరించేవారు. తరువాత హజ్రత్ ఉమర్(రజి) తన ఖిలాఫత్ కాలంలో పెన్షన్ ఇవ్వడానికి పిలిపించారు. కాని హకీమ్ మృదువుగా తిరస్కరించారు. అప్పుడు హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: "ముస్లిములారా! విజయప్రాప్తిలో నుండి అల్లాహ్ హకీమ్ కొరకు రాసిపెట్టి ఉన్న వాటాను ఇవ్వడానికి నేను పిలిపిస్తూ ఉంటాను. కాని అతను తీసుకోడు. ఈ విషయానికి మీరంతా సాక్షులుగా ఉండాలి." చెప్పవచ్చిందేమంటే, దైవప్రవక్త(స) ఉపదేశించిన నాటి నుండీ హకీమ్ బిన్ హిజామ్ మరణించేవరకూ ఎవరి నుండీ ఏ వస్తువూ తీసుకోలేదు (ప్రభుత్వ ధనాగారం నుండి తనకు రావలసిన పెన్షన్ కూడా తీసుకోలేదు). అల్లాహ్ ఆయన్ని కరుణించుగాక![1]**

**105)** **ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు. ప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "మీలోని ప్రతి ఒక్కడూ పర్యవేక్షకుడే. తన పర్యవేక్షణలో ఉన్నవారి**

---

104-1. ఇంతకుముందు కూడా ఈ హదీసు 'జకాత్ ప్రకరణం'లో వచ్చింది. అయితే ఈ అధ్యాయం క్రింద ఈ హదీసును పొందుపరచటంపై కొంతమంది ఆశ్చర్యం వెలిబుచ్చారు. మరికొందరేమన్నారంటే, ప్రవక్త మహనీయులు (సఅసం) బహుమానాన్ని స్వీకరించటాన్ని అథమ శ్రేణి విషయంగా ఖరారు చేశారు. వసీయతు కూడా ఇందులోకే వస్తుంది. కాని అప్పును వసూలు చేయటం అథమశ్రేణి అంశం కాదు. వసీయతుపై అప్పుకు (రుణాల లావాదేవీలకు) ఎక్కువ ప్రాధాన్యత ఉంది.

గురించి అతడు ప్రశ్నించబడతాడు. పరిపాలకుడు కూడా పర్యవేక్షకుడే. అతడు తన ఏలుబడిలో ఉన్నవారి గురించి ప్రశ్నించబడతాడు. పురుషుడు తన ఇంటివారల పర్యవేక్షకుడు. అతను తన బాధ్యతలో ఉన్నవారి గురించి ప్రశ్నించబడతాడు. స్త్రీ తన భర్త ఇంటికి పర్యవేక్షకురాలు. ఆమె తన కార్యపరిధిలో ఉన్నవారి గురించి ప్రశ్నించబడుతుంది. బానిస తన యజమాని సొమ్ముకు పర్యవేక్షకుడు. తన పర్య వేక్షణలో ఉన్న దానిని గురించి అతను (కూడా) ప్రశ్నించబడతాడు"[1]- ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు. బహుశా ఆయన(స) ఈ విధంగా కూడా చెప్పారని నేననుకుంటున్నాను: "పురుషుడు తన తండ్రి సొమ్ముకు పర్యవేక్షకుడు. అతను తన పర్యవేక్షణలో ఉన్న దానిని గురించి ప్రశ్నించబడతాడు."

## అధ్యాయం : 9

## ఒకవేళ ఎవరయినా తన సమీపబంధువుల పేర ఏ వస్తువైనా 'వక్ఫ్' చేస్తే లేదా వారి పేరిట వీలునామా వ్రాస్తే అట్టి పరిస్థితిలో ఆదేశమేమిటి? సమీప బంధువులంటే ఎవరెవరు?

హజ్రత్ అనస్(రజి) ఉల్లేఖించినట్లుగా సాబిత్ తెలిపారు. దీని ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసం) అబూతల్హాతో, "నువ్వు ఆ తోటను అవసరార్థులైన నీ బంధువులకు ఇవ్వు"అని చెప్పారు. అందువల్ల ఆయన దానిని హస్సాన్‌కు, ఉబై బిన్ కాబ్‌కు ఇచ్చివేశారు (వారిద్దరూ అబూతల్హా బాబాయి కొడుకులే).

తన తండ్రి తనతో చెప్పినట్లు ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ తెలిపారు. ఆయనేమో సుమామా నుండి, ఆయన అనస్ (రజి) నుండి సాబిత్ తరహాలో

---

105-1. ఈ హదీసు ఇంతకుముందు 'బానిస విమోచన ప్రకరణం'లో కూడా వచ్చింది. బానిస తన యజమాని సొమ్ముకు పర్యవేక్షకుడు అన్నమాట విడ్డూరంగా అనిపిస్తుంది. ఎందుకంటే అందులో బానిస కష్టార్జితం కూడా ఉంది. ఆ సొమ్ముపై వారిద్దరికీ యాజమాన్యపు హక్కు ఉంది. అయితే యజమాని హక్కుకు ప్రాథమ్యం ఇవ్వటం జరిగింది. ఎందుకంటే అతడు ఎక్కువ బలవంతుడు. అలాగే 'అప్పు- వసీయతు' గురించి చర్చించేటప్పుడు 'అప్పు'కు మొదటి ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. ఎందుకంటే అప్పు తీర్చటం అనివార్యం. వసీయతు ఒక రకమైన దానం. అంటే అది స్వచ్ఛందమైనది. అందులో వారసుల ప్రమేయం ఉండదని షాఫియీలు అంటారు. మరికొంత మంది ప్రకారం వారసులు కూడా అందులో చేరి ఉన్నారు.

ఉటంకించారు. అందులో "అగత్యపరులైన నీ బంధువులకు ఇవ్వు" అని ఉంది. అనస్(రజి) ఇలా అన్నారు : "అబూతల్హా ఆ తోటను హస్సాన్‌కు, ఉబై బిన్ కాబ్‌కు ఇచ్చేశారు. వారిద్దరూ నాకన్నా ఎక్కువగా అబూ తల్హాకు సమీప బంధువులు. హస్సాన్, ఉబై బిన్ కాబ్‌ల రక్త సంబంధం అబూ తల్హాతో ఇలా ఉంది- అబూతల్హా అసలు పేరు జైద్. ఈయన సుహైల్ కుమారుడు. ఆయన అస్వద్ కుమారుడు... ఇలా ఆరు తరాలు వెనక్కిపోతే... ఈ బంధుత్వం ఆ ముగ్గురినీ కలుపుతుంది. (ఇమామ్ అబూ హనీఫా-రహ్మ) గారి (ప్రియమైన శిష్యుడు) అబూ యూసుఫ్ ఏమంటారంటే, బంధువుల పేర వసీయతు చేస్తే, వారి వెనుక గడిచిన వారి ముస్లిం తాతముత్తాలంతా అందులోకి వచ్చేస్తారు.

**106)** హజ్రత్ అనస్ (రజి) కథనం: తన బైర్హా తోటను దైవమార్గంలో ఇవ్వాలని అబూ తల్హా సంకల్పించుకున్నప్పుడు, ప్రవక్త మహనీయులు (సఅసం) ఆయననుద్దేశించి, "నువ్వు ఆ తోటను నీ సమీప బంధువులకు ఇస్తే బావుంటుందని నేను అనుకుంటున్నాను" అన్నారు. ఇది విని అబూ తల్హా 'చిత్తం. అలాగే చేస్తాన' న్నారు. తరువాత ఆయన ఆ తోటను తన దగ్గరి బంధువుల్లో - పినతండ్రి కుమారుల్లో- పంచిపెట్టారు. ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: "నీ దగ్గరి బంధువులను (దైవశిక్ష గురించి) భయపెట్టు" **(26:214)** అన్న ఆయత్ అవతరించినప్పుడు, దైవప్రవక్త ఖురైషు వంశీయులైన బనీ ఫిహ్ర్, బనీ అదీలను పిలిచి వారికి భయబోధ చేశారు. ఈ ఆయత్ అవతరించినప్పుడు మహాప్రవక్త, "ఓ ఖురైషు ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి" అంటూ పిలుపు ఇచ్చారని మహనీయ అబూ హురైరా (రజి) తెలిపారు.

## అధ్యాయం : 10

## దగ్గరి బంధువులలో స్త్రీలు, పిల్లలు కూడా చేరి ఉంటారా?

**107)** మహనీయ అబూ హురైరా (రజి) తమకు చెప్పారని అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ తెలియజేశారు : "నీ దగ్గరి బంధువులకు భయబోధ చెయ్యి" అన్న (అష్ షుఅరా : **214**) ఆయత్ అవతరించినప్పుడు ప్రవక్త మహనీయులు (సఅసం) వారిని ఇలా సంబోధించారు- "ఖురైషు ప్రజలారా! (లేదా అటువంటి వాక్కునే పలికారు) మీరు మీ మీ ప్రాణాలను సదాచరణలకు బదులుగా కొనుగోలు

**చేసుకోండి (కాపాడుకోండి). నేను అల్లాహ్ సమక్షంలో మీకు ఏవిధంగానూ తోడ్పడ లేను. (అంటే దేవుని అభీష్టానికి వ్యతిరేకంగా నేను మీకు ఎలాంటి సహాయం చేయలేను).**

**అబ్దె మునాఫ్ కుమారులారా! నేను దైవసమక్షంలో మీకు ఏ విధంగానూ ఉపయోగపడలేను. అబ్దుల్ ముత్తలిబ్ పుత్రుడగు అబ్బాస్! నేను దైవ సమక్షంలో ఏవిధంగా కూడా పనికిరాను. ఓ నా మేనత్త సఫియా! అల్లాహ్ సమక్షంలో నేను నీకు ఏవిధంగానూ సహాయపడలేను. నా ముద్దుల పుత్రిక ఫాతిమా! నీకు కావా లంటే నా దగ్గర ఉన్న సొమ్ము తీసేసుకో. కాని అల్లాహ్ సమక్షంలో నేను నీకు ఏ విధంగానూ తోడ్పడలేను."[1] అబుల్ యమాన్‌తోపాటు ఈ హదీసును అస్‌బఘ్ కూడా అబ్దుల్లాహ్ బిన్ వహబ్ నుండి, ఆయన యూసుఫ్ నుండి, మరి ఆయన ఇబ్నె షిహాబ్ నుండి ఉటంకించారు.**

## అధ్యాయం : 11

## వక్ఫ్ చేసిన వ్యక్తి తన వక్ఫ్ ఆస్తి ద్వారా ఏమైనా లబ్ది పొందగలడా?

**మహనీయ ఉమర్(రజి) తన ఆస్తిని వక్ఫ్‌గా వ్రాసి ఇస్తూ, దానికి ధర్మకర్తగా ఉండే వ్యక్తి ఆ ఆస్తి నుండి కొంత లబ్ది పొందగలడని షరతు విధించారు.[1] కొన్ని సందర్భాలలో వక్ఫ్ చేసిన వ్యక్తి కూడా ఆ వక్ఫ్ ఆస్తికి ధర్మకర్త (ముతవల్లీ)గా ఉంటాడు. వేరే వ్యక్తి కూడా కార్యదర్శిగా ఉంటాడు. అలాగే ఒకవేళ ఎవరయినా**

---

107-1. మొదట ఆయన (స) తన తెగ వారైన ఖురైషులను ఉద్దేశించి హెచ్చరించారు. తరువాత ముత్తాత అయిన అబ్దె యునాఫ్ సంతతి వారిని సంబోధించి మాట్లాడారు. ఆ తరువాత తన పినతండ్రిని, మేనత్తను, కుమార్తెను ఉద్దేశించి హెచ్చరించారు. సమీప బంధువులలో స్త్రీలు కూడా చేరి ఉన్నారని ఇమామ్ బుఖారీ (రహ్మా) ఈ హదీసు ద్వారా రూఢీ చేశారు. ఎందుకంటే తన మేనత్త గారిని కూడా దైవప్రవక్త(స) హెచ్చరించారు. తన గారాల పట్టి ఫాతిమా (ర.అ)కు కూడా భయబోధ చేశారు.

11-1. దీని ఆధారంగా ఇమామ్ బుఖారీ (రహ్మా) వెలికి తీసిన ముఖ్యాంశం ఏమిటంటే, వక్ఫ్ ఆస్తికి ధర్మకర్తగా ఉన్న వ్యక్తి సైతం ఆ ఆస్తి ద్వారా లబ్ది పొందవచ్చని హజ్రత్ ఉమర్(రజి) రాసి ఇచ్చినపుడు వక్ఫ్ చేసిన వానికి కూడా ఆ ఆస్తి ద్వారా ప్రయోజనం పొందటం సమంజసమే అవుతుంది. ఎందుకంటే ఒక్కోసారి వక్ఫ్ చేసిన వ్యక్తి కూడా దానికి ధర్మకర్త (ముతవల్లీ)గా ఉంటాడు.

దైవమార్గంలో ఒంటెనుగానీ, మరేదయినా వస్తువును గానీ వక్ఫ్ చేస్తే, ఇతరులు దాని ద్వారా లబ్ధి పొందినట్లే అతను కూడా లబ్ధి పొందగలడు. వక్ఫ్ చేస్తున్నప్పుడు, ఆ మేరకు అతను షరతు పెట్టకపోయినప్పటికీ అతను ప్రయోజనం పొందగలడు.[2]

**108)** హజ్రత్ అనస్(రజి) కథనం : ఒక వ్యక్తి ఖుర్బానీ ఒంటెను తోలుకుని (నడిచి) పోవటాన్ని ప్రవక్త మహనీయులు(సఅసం) గమనించి, "దానిపై స్వారీ అయి వెళ్ళు" అని అతనికి సూచించారు. దానికి ఆ వ్యక్తి , 'దైవప్రవక్తా! ఇది ఖుర్బానీ ఒంటె' అన్నాడు. మూడు లేక నాలుగుసార్లు అతనికి సూచించారు. (అయినా ఆ వ్యక్తి ప్రవక్త మాటను శిరసావహించకపోవటంతో) "నీ ధోరణి కడు శోచనీయం. స్వారీ అయి వెళ్ళు" అన్నారు లేదా "నీ పాడు గాను" అని చెప్పారు.

**109)** హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : ఒక వ్యక్తి ఖుర్బానీ ఒంటెను తోలుకుని (పాదయాత్ర ద్వారా) ముందుకు సాగటం దైవప్రవక్త(సఅసం) గమనించారు. "దానిపై స్వారీ అయివెళ్ళు" అని ఆయన(సఅసం) సలహా ఇవ్వగా ఆ వ్యక్తి సంజాయిషీ ఇస్తూ, 'అయ్యా దైవప్రవక్తా! ఇది ఖుర్బానీ కొరకు ప్రత్యేకించిన పశువు కదండీ' అన్నాడు. ఆయన(స) మళ్ళీ, "నీ పాడుగాను... స్వారీ అవ్వు"[1] అని కోప్పడ్డారు. ఈ మాట ఆయన(స) మూడోసారో లేక నాలుగో సారో అన్నారు.

## అధ్యాయం : 12

## ఒకవేళ వక్ఫ్ చేసిన వ్యక్తి, ఆ వక్ఫ్ ఆస్తిని ఇతరులకు స్వాధీనపరచకుండా (తన వద్దనే) ఉంచుకుంటే అది కూడా సమ్మతమే.[1]

---

11-2. ఈ విషయంలో భేదాభిప్రాయం ఉంది. ఎందుకంటే ఒక వ్యక్తి పేదల కోసం ఒక ఆస్తిని వక్ఫ్ చేస్తాడు. వక్ఫ్ చేసినవాడు పేదవాడు కానపుడు, దాని ద్వారా లబ్ధి పొందటం సబబు కాదు. ఒకవేళ అతడు పేదవాడైపోతే, లేదా అతని పిల్లల్లో ఎవరయినా పేదవారైపోతే అట్టి పరిస్థితిలో వారు ఆ ఆస్తి ద్వారా ప్రయోజనం పొందవచ్చు.

109-1. ఈ హదీసు ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మ) వెలికి తీసిన ప్రధానాంశం ఏమిటంటే, వక్ఫ్ చేయబడిన వస్తువు ద్వారా వక్ఫ్ చేసిన వ్యక్తి కూడా ప్రయోజనం పొందగలడు. నివాస గృహానికి కూడా ఇది వర్తిస్తుంది. ఒక వ్యక్తి ఒక ఇల్లును వక్ఫ్ చేసినప్పటికీ, అవసరం ఏర్పడినప్పుడు ఆ ఇంట్లో ఉండగలడు.

12-1. ఈ విషయంలో అభిప్రాయ భేదం ఉంది. అత్యధికమంది విద్వాంసులు ధర్మసమ్మతమే అనంటారు. అయితే మాలికీల, ఇబ్నె అబీలైలా, ఇమామ్ ముహమ్మద్‌ల దృష్టిలో 'వక్ఫ్'

**ఎందుకంటే హ‌జ్రత్ ఉమర్(రజి) ఖైబర్‌లోని తన భూమిని వక్ఫ్ చేస్తూ, దాని ధర్మకర్త కూడా అందులో నుండి కొంత తింటే అభ్యంతరం లేదని షరతు విధించారు. ధర్మకర్తగా స్వయంగా తానే ఉంటారా? లేక ఇతరులు ఆ బాధ్యతను నిర్వహిస్తారా? అన్న విషయాన్ని ఆయన ప్రత్యేకంగా నిర్ధారించలేదు.[2] ప్రవక్త మహనీయులు(సఅసం) అబూతల్హా (రజి)కు సలహా ఇస్తూ, "నా ఉద్దేశంలో, నువ్వు ఆ భూమిని (బైర్హా తోటను) దానంగా ఇవ్వదలిస్తే నీ బంధువులకే ఇస్తే బాగుంటుంది" అన్నారు. దానికి ఆయన 'చిత్తం, అలాగే చేస్తాను' అని బదులిచ్చారు. అందువల్ల ఆయన ఆ తోటను తన సమీప బంధువుల, పినతండ్రి కుమారుల మధ్యన పంచిపెట్టేశారు.**

## అధ్యాయం : 13

## ఒకవేళ ఎవరయినా 'ఈ ఇల్లు దైవమార్గంలో అంకితం' అని చెప్పి, పేదవారు తదితర పద్దులను గురించి స్పష్టంగా వివరించకపోయినా, అలాంటి 'వక్ఫ్' కూడా ధర్మసమ్మతమే.

**ఇలాంటి పరిస్థితిలో అతను తన వక్ఫ్ ఆస్తిని తన దగ్గరి బంధువులకూ ఇవ్వగలడు, ఇతరులకు కూడా ఇవ్వగలడు. ఎందుకంటే దానం చేస్తున్నప్పుడు, ఇది ఫలానా వారికి చెందాలి అని ప్రత్యేకంగా పేరుపెట్టి చెప్పలేదు. 'నా ఆస్తిపాస్తులలో బైర్హా తోట నాకు అన్నింటికన్నా ప్రీతికరమైనది. దీనిని నేను దైవమార్గంలో అంకితం చేస్తున్నాను' అని అబూతల్హా (రజి) చెప్పినప్పుడు, ప్రవక్త మహనీయులు (సఅసం) ఆ వక్ఫ్‌ను ధర్మసమ్మతంగా ఖరారు చేశారు. (మరి నిజానికి అబూతల్హా ఆ తోటను**

---

చేసే వ్యక్తి, ఆ ప్రాపర్టీని తన అధీనంలో నుంచి తీసి, ఇతరులకు స్వాధీనం చేయనంత వరకూ అట్టి వక్ఫ్ సరైనది కాదు. కాగా; జమ్‌హూర్ విద్వాంసులు తమ వాదనకు ఆధారంగా హ‌జ్రత్ ఉమర్(రజి), హ‌జ్రత్ అలీ (రజి), హ‌జ్రత్ ఫాతిమా (ర.అ)ల ఆచరణలను ఉదహరిస్తారు. వీరంతా తమ వక్ఫ్ ఆస్తులను తమ స్వాధీనంలోనే ఉంచి, తద్వారా వచ్చే రాబడిని పేద ప్రజలకు దానం చేసేవారు.

12-2. కాబట్టి దీని ద్వారా రూఢీ అయ్యేదేమంటే, హ‌జ్రత్ ఉమర్(రజి) కూడా స్వయంగా ఆ వక్ఫ్ ఆస్తికి ధర్మకర్తగా ఉండగలిగేవారు. ఎందుకంటే దైవప్రవక్త(స) దాని నుండి వారించలేదు. ఒకవేళ ఉమర్ (రజి) ధర్మకర్త అయ్యే మాటైతే, ఆ ఆస్తిలో కొంత లబ్ధి పొందటం కూడా ఆయనకు సమ్మతమే అయి ఉండేది.

ఎవరెవరికి ఇస్తున్నారో స్పష్టంగా చెప్పలేదు). కాని షాఫియీలు ఏమంటారంటే, సదఖా ఎవరెవరికి చెందాలో స్పష్టంగా విడమరచి చెప్పనంతవరకూ అది ధర్మ సమ్మతం కాబోదు. అయితే మొదటి పలుకే చాలావరకు సరైనది.

## అధ్యాయం : 14

## "నా భూమి లేదా నా తోట (మృతురాలైన) నా తల్లి తరఫున సదఖా" అని ఎవరయినా అంటే అది కూడా ధర్మబద్ధమే. ఆ సదఖా ఎవరికి చెందాలో స్పష్టంగా పేర్కొనకపోయినా సరే అది ధర్మసమ్మతమే.

**110)** మహనీయ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: సాద్ బిన్ ఉబాదా (రజి) తల్లి ఉమ్రహ్ బిన్తె మస్ఊద్ మరణించినప్పుడు, ఆయన తల్లి దగ్గర లేరు. ఆయన ప్రవక్త మహనీయుల(సఅసం) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! నా తల్లి మరణించినప్పుడు నేను ఆమె సేవలో లేను. మరైతే ఇప్పుడు నేను ఏదైనా వస్తువును ఆమె పేరు మీద దానంగా ఇస్తే, ఆమెకు దాని లాభం చేరుతుందా?' అని దర్యాప్తు చేయగా, ఆయన(స) అవునని సమాధానమిచ్చారు. దానికి ఉబాదా, 'అలాగైతే నేను తమరిని సాక్షిగా పెట్టి, నా 'మిఖ్రాఫ్' తోటను ఆమె తరఫున దానం (సదఖా) చేస్తున్నాను' అని చెప్పారు.[1]

## అధ్యాయం : 15

## ఒకవేళ ఎవరయినా ఏదైనా వస్తువును లేదా బానిస స్త్రీని, బానిసను లేదా పశువును సదఖాగా ఇస్తే లేదా వక్ఫ్ చేస్తే అది ధర్మసమ్మతమే.

**111)** కాబ్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ కాబ్ వివరించారు: ఆయన (కాబ్ బిన్ మాలిక్) ఇలా చెప్పేవారు- 'దైవప్రవక్తా! నా పశ్చాత్తాపం (తౌబా) ఆమోదించబడినందుకు కృతజ్ఞతా సూచకంగా నేను నా ఆస్తిని దైవమార్గంలో, దైవప్రవక్త(స) మార్గంలో అంకితం చేస్తున్నాను' అని విన్నవించుకున్నప్పుడు, "నీ ఆస్తిలోని ఒక భాగం నీవు నీ దగ్గరే ఉంచుకుంటే అది నీ

---

110-1. హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) 'దూమతుల్ జందల్' యుద్ధానికి దైవప్రవక్త(స) వెంట వెళ్ళారు. ఆ రోజుల్లోనే ఆయన తల్లి మరణించారు. 'మిఖ్రాఫ్' అనేది ఆయన తోట పేరు లేదా మిఖ్రాఫ్ అంటే ఎక్కువ దిగుబడిని ఇచ్చే తోట అన్న అర్థం కూడా వస్తుంది.

**పాలిట శ్రేయస్కరం"అని ప్రవక్త మహనీయులు(స) సలహా ఇచ్చారు. 'అలాగైతే ఖైబర్‌లో నాకు లభించిన భూమిని నా కోసం ఉంచుకుంటాన'ని నేను చెప్పాను.[1]**

## అధ్యాయం : 16

## ఒకవేళ దానం ఇస్తూ ఎవరినయినా 'వకీల్'గా పెడితే, వకీల్ ఆ దానాన్ని మళ్ళిస్తే...

**ఇస్‌హాఖ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అబీ తల్హా కథనం: (ఇమామ్ బుఖారీ– రహ్మ– ఏమన్నారంటే) ఈ ఉల్లేఖనాన్ని ఆయన బహుశా మహనీయ అనస్(రజి) నుండి గ్రహించి ఉంటారు. ఆయన ఇలా అన్నారు: *(ఆలి ఇమ్రాన్ సూరాలోని)* "మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టనంతవరకూ సత్కార్య స్థాయికి చేరుకోలేరు (3: 92) అన్న ఆయత్ అవతరించినప్పుడు అబూ తల్హా (రజి) ప్రవక్త మహనీయుల(స) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! మీరు అమితంగా ప్రేమించే వస్తువులను దైవమార్గంలో ఖర్చుపెట్టనంత వరకూ మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరని అల్లాహ్ సెలవిస్తున్నాడు కదా! నా సిరిసంపదలలో నాకు అన్నిటికన్నా ప్రియమైనది బైర్హా' అని విన్నవించుకున్నారు. బైర్హా ఒక తోట. ప్రవక్త మహనీయులు (స) కూడా ఆ తోటలోనికి వెళ్ళేవారు. అక్కడి చెట్ల నీడలో కూర్చుని, అక్కడి (బావి లోని) నీరు త్రాగేవారు. 'అందువల్ల నేను ఆ తోటను దైవ మార్గంలో, దైవప్రవక్త(స) కొరకు అంకితం చేస్తున్నాను. తద్వారా నాకు పరలోకంలో పుణ్యనిధి ప్రాప్తమవు తుందన్న ఆశ ఉంది. కనుక ఓ ప్రవక్తా! అల్లాహ్ మీకు సూచించిన విధంగా మీరు ఈ తోటను వెచ్చించుకోండి' అన్నారు. దీనికి సమాధానంగా ప్రవక్త మహనీయులు (స) ఇలా అన్నారు: "వాహ్వా! శెభాష్ అబూ తల్హా! ఇది ఎంతో లాభసాటి**

---

111–1. కాబ్ బిన్ మాలిక్(రజి) పశ్చాత్తాపం సుప్రసిద్ధం. ఈయన తబూక్ యుద్ధ సందర్భంగా షరీఅత్ పరమైన తగు కారణమేదీ లేకపోయినప్పటికీ– అశ్రద్ధ వల్ల– యుద్ధానికి వెళ్ళలేదు. నిజాయితీగా తన తప్పును అంగీకరించారు. ఒక నిర్ణీత గడువు వరకు సంఘ బహిష్కరణకు గురయ్యారు. ఎట్టకేలకు అల్లాహ్ ఆయన పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. ఈ సంఘటన 'కితాబుల్ మగాజీ'లో వివరంగా రానున్నది. ఆస్తినంతటినీ దైవమార్గంలో దానంగా ఇవ్వటం అవాంఛనీయం అన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా విదితమయింది.

**వ్యవహారం (సంపద). మేము దీనిని నీ నుండి స్వీకరించి, తిరిగి నీకే అప్పగిస్తు న్నాము.[1] ఇప్పుడు నీవు దానిని నీ బంధువులకు ఇచ్చేయ్". అందువల్ల అబూ తల్హా (రజి) ఆ తోటను తన బంధువులకు ఇచ్చేశారు. ఆ తోటను పొందిన వారిలో ఉబై, హస్సాన్‌లు ఉన్నారని అనస్(రజి) తెలిపారు. అయితే హస్సాన్ తన వాటాను ముఆవియా (రజి)కు అమ్మేశారు. అబూతల్హా (రజి) మీకు ఇచ్చిన ఆస్తిని మీరు అమ్మేస్తున్నారా? అని ఎవరో ఆయన్ని ప్రశ్నించగా, "ఒక 'సా' ఖర్జూరాలకు బదులుగా ఒక 'సా' దిర్హములొస్తుండగా నేను దీనిని ఎందుకు అమ్మకూడదు?"[2] అని హస్సాన్(రజి) సమాధానమిచ్చారు. ఆ తోట బనీ హుదైలా వాడకు సమీపంలో ఉండేదని, ముఆవియా (రజి) అక్కడ ఒక కోటను నిర్మించుకున్నారని అనస్(రజి) తెలిపారు.**

## అధ్యాయం : 17

అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: **"ఆస్తి పంపకం జరిగేటప్పుడు (వారసులు కాని) ఇతర బంధువులు, అనాథులు, నిరుపేదలు వస్తే, ఆ ఆస్తి నుండి వారికి కూడా కొంత ఇవ్వండి."[1] (అన్ నిసా-8)**

**112) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: "ఈ ఆయత్ (సూరయె నిసాలోని 8వ ఆయత్) వారసత్వ ఆయత్ ద్వారా రద్దు పరచబడిందని కొంతమంది అనుమానిస్తున్నారు. లేదు. దైవసాక్షిగా! ఈ ఆయత్ రద్దు అవలేదు. కాకపోతే**

---

16-1. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం. అబూతల్హా ఈ సదఖా వ్యవహారంలో దైవప్రవక్త (స)ను 'వకీల్'గా చేసుకున్నారు. కాగా, దైవప్రవక్త(స) ఆ సదఖాను స్వీకరించి, దానిని ఆయనకే తిరిగి ఇచ్చేశారు.

16-2. అంటే ఇలాంటి మంచి బేరం ఎక్కడ దొరుకుతుంది? అన్నది ఆయన మాటల్లోని మర్మం. ఖర్జూరపండ్లు వెండి బరువుకు సమానంగా అమ్ముడుపోతున్నప్పుడు ఎవరయినా ఎలా వదులుకుంటారు? అని హస్సాన్ చెప్పదలిచారు. అబూ తల్హా ఆ తోటను తన బంధువులకు ఇస్తున్నప్పుడు, అవసరమైతే దానిని అమ్ముకోవచ్చు అని ఆనతిని ఇచ్చి ఉంటారు. అన్యథా వక్ఫ్ ఆస్తిని అమ్మకూడదు. హస్సాన్ తన వాటాను అమ్మినందుకు ముఆవియా ఆయనకు లక్ష దిర్హములు చెల్లించారు.

17-1. ఒకవేళ ఇవ్వలేకపోతే వారితో మృదువుగా మాట్లాడి, మంచి పద్ధతిలో దాటవేయండి. ఈ ఆజ్ఞ ఇస్లాం తొలి కాలంలో ఉండేది. ఆ తరువాత ఇది రద్దుపరచబడింది. కాని మరికొంతమంది ప్రకారం ఇప్పటికీ ఈ ఆదేశం మిగిలి ఉంది.

జనులు దీని ప్రకారం అమలు జరపటంలో బద్ధకం వహిస్తున్నారు. వారసత్వ హక్కును పుచ్చుకునే వారిలో రెండు రకాల వారుంటారు. 1) వారసులు. వారికి వారి వాటా ఇవ్వబడుతుంది 2) వారసులు కానివారు. ఇలాంటి వారికి మృదువుగా సర్ది చెప్పాలని ఆదేశించటం జరిగింది. నాయనా! నీకు వాటా ఇచ్చే అధికారం నాకు లేదు. క్షంతవ్యుణ్ణి అని చెప్పి, సద్వ్యవహారం చేసి సాగనంపాలి."

## అధ్యాయం : 18

## ఒకవేళ ఎవరికయినా ఆకస్మిక మరణం సంభవిస్తే, అతని తరఫున దానం చేయటం వాంఛనీయం. అలాగే మృతుని మొక్కుబడులను చెల్లించటం

**113)** విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ప్రవక్త ప్రియ సహచరులొకరు (సాద్ బిన్ ఉబాదా) దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'యా రసూలల్లాహ్! నా తల్లి ఆకస్మిక మరణానికి గురయింది. నాతో మాట్లాడే అవకాశమే గనక ఆమెకు లభించి ఉంటే, దానం చేయమని చెప్పి ఉండేదని నా అనుమానం. మరి నేనిప్పుడు ఆమె తరువాత ఏమన్నా దానం చేయగలనా?' అని విన్నవించుకోగా, "అవును. ఆమె తరఫున దానం చెయ్యి"[1] అని ఆయన(స) చెప్పారు.

**114)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : సాద్ బిన్ ఉబాదా (రజి) ప్రవక్త మహనీయుల(సఅసం) సమక్షంలో ఒక ధర్మసందేహం వెలిబుచ్చారు. 'నా తల్లి చనిపోయింది. ఆమె మీద మొక్కుబడి చెల్లించవలసిన బాధ్యత ఒకటి ఉంది (ఇప్పుడు నేనేం చేయను?)' అని ఆయన విన్నవించుకోగా, "ఆమె తరఫున మొక్కుబడిని చెల్లించు" అని దైవప్రవక్త(స) చెప్పారు.

## అధ్యాయం : 19

## వక్ఫ్‌పై, సదఖాపై సాక్షిని పెట్టడం

**115)** ఇబ్నె అబ్బాస్ (రజి) తనకు తెలిపారని ఆయన బానిస అయిన

---

113-1. వారసులు మృతుని తరఫున చేసే దానధర్మాల పుణ్యం మృతునికి (మృతురాలికి) చేరుతుందన్న విషయం ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అహ్లె హదీసు వారు దీనితో ఏకీభవిస్తారు. కాని మోతజిలా వర్గీయులు దీనిని నిరాకరించారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం; 'దానాలలో ఏది గొప్పది?' అని సాద్ అడగ్గా, "దాహం తీర్చటం" అని దైవప్రవక్త(స) చెప్పారు. దీనిని ఇమామ్ నసాయి ఉల్లేఖించారు.

ఇక్రిమా చెప్పారు: బనీ సాయిదా తెగ సోదరుడు సాద్ బిన్ ఉబాదా (రజి) తల్లి తనువు చాలించినప్పుడు, ఆయన ఆమె దగ్గర లేరు (ఆ సమయంలో ఆయన దైవ ప్రవక్త–సఅసం–తో కలసి దూమతుల్ జందల్ యుద్ధానికి వెళ్ళారు). అందువల్ల ఆయన దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! నా తల్లి చనిపోయింది. ఆ సమయంలో నేను ఆమె దగ్గర లేను. మరి నేను ఆమె తరఫున దానం చేస్తే, దాని పుణ్యఫలం ఆమెకు చేరుతుందా?' అని సందేహపడగా, "చేరుతుంది" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. 'అలాగైతే నేను తమరిని సాక్షిగా పెడుతూ 'మిఖ్రాఫ్' అనే నా తోటను ఆమె తరఫున దానంగా ఇస్తున్నాను'[1] అన్నారు.

## అధ్యాయం : 20

## అన్ నిసా సూరాలో అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం గురించి

"అనాథుల ఆస్తిని వారికి తిరిగి ఇవ్వండి. పరిశుద్ధమైన, ధర్మసమ్మతమైన వస్తువులకు బదులు అపవిత్రమయిన, అధర్మమైన వస్తువులను తీసుకోకండి.[1] వారి ఆస్తిని మీ ఆస్తితో కలిపి స్వాహా చేయకండి. ఇది మహా పాపం. (మీ సంరక్షణలో ఉన్న) తండ్రి లేని ఆడపిల్లలను వివాహమాడి, వారికి న్యాయం చేయలేమన్న భయం మీకు ఉంటే మీకు నచ్చిన ఇతర స్త్రీలను వివాహమాడండి." ***(4: 2,3)***

**116)** ఉర్వా బిన్ జుబైర్(రజి) కథనం: ఈయన హజ్రత్ ఆయిషా (ర.అ)ను, "అనాథలకు న్యాయం చేయలేమనే భయం మీకు కలిగితే..." (అన్ నిసా– 3) అనే ఆయత్‌లోని అంతరార్థం ఏమిటని అడిగినప్పుడు, ఆమె ఇలా వివరించారు: "తన సంరక్షకుని పెంపకంలో ఉన్న తండ్రిలేని ఆడపిల్లల గురించి ఈ ఆయత్ అవతరించింది. ఆమె అందచందాలను, ఐశ్వర్యాన్ని చూసి సంరక్షకుడు ఆమెను మనువాడగోరుతాడు. కాని ఆమె అంతస్తుకు తగ్గ 'మహర్' సొమ్మును చెల్లించ

---

115–1. ఈ అధ్యాయంలోని కీలక విషయం ఇదే. వక్ఫ్, సదఖా– ఈ రెండింటికీ ఒకే ఆజ్ఞ వర్తిస్తుంది.

20–1. అంటే మీ దగ్గర ఉన్న నాసిరకం వస్తువును మీరు అనాథల మేలి రకం వస్తువులలో కలిపేశారు. మంచివస్తువులను మీరు స్వాహా చేసేశారు– అలా చేయకండి. ఎందుకంటే అనాథుల సొమ్ము మీ కొరకు నిషిద్ధం (హరామ్). మీ దగ్గర ఉన్న వస్తువు నాసిరకం అయినప్పటికీ అది మీ కొరకు ధర్మసమ్మతమైనది, పవిత్రమైనది.

లేకపోతాడు. ఆ అనాథ బాలికను నికాహ్ చేసుకోగోరిన సంరక్షకుడు, ఆమె స్థాయికి తగ్గ మహర్ సొమ్మును చెల్లించి, ఆమెకు న్యాయం చెయ్యగలిగితేనే ఆమెను వివాహమాడాలి. అన్యథా ఇతర స్త్రీలను వివాహమాడాలి." హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు : తరువాత జనులు అడిగినప్పుడు"ప్రజలు నిన్ను స్త్రీల వ్యవ హారంలో ధార్మికతీర్పు ఏమిటో అడుగుతున్నారు. వారితో చెప్పు. వారి విషయంలో అల్లాహ్ మీకు ధార్మిక తీర్పు ఇస్తున్నాడు..." అనే ఆయత్ (అన్ నిసా- 127)ను అల్లాహ్ అవతరింపజేశాడు. తమ సంరక్షణలో ఉన్న అనాథ బాలికలు అందం, ఐశ్వర్యం కూడా కలిగి ఉన్నప్పుడు సంరక్షకులు వారిని నికాహ్ చేసుకోదలిస్తే, వారి వంశంలో ఉన్న సంప్రదాయానికి కట్టుబడి మహర్ చెల్లించాలి. లేకపోతే వారిని పెండ్లి చేసుకోరాదు. ఒకవేళ వారికి అందం, ఐశ్వర్యం తక్కువగా ఉంటే వారి సంరక్షకులు వారి మంచీ చెబ్బరల్ని సరిగా పట్టించుకోరు. వారి పట్ల ఆసక్తి కనబరచరు. వారిని మనువాడే బదులు ఇతర స్త్రీలను వెతుకుతారు. ఉల్లేఖకులు ఇలా అంటున్నారు : ఆసక్తి లేనప్పుడు వీళ్ళు ఏవిధంగానైతే ఆ అనాథ బాలికలను వదిలేస్తున్నారో, అదే విధంగా ఆ అనాథ బాలికల పట్ల శ్రద్ధాసక్తులు ఉన్నప్పుడు పూర్తి మహర్‌ను చెల్లించి, వారి హక్కులను వారికి ఇవ్వటంలో న్యాయంగా వ్యవహ రించలేకపోతే, వారిని నికాహ్ చేసుకోరాదు.

## అధ్యాయం : 21

## సూరయె నిసాలో అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం గురించి

"అనాథులకు పెళ్లి ఈడు వచ్చేవరకు వారిని అజమాయిషీ చేస్తూ ఉండండి. వారిలో మీకు యోగ్యత కనిపించినపుడు వారి ఆస్తిని వారికి అప్పగించండి. వారు పెద్దవారై తమ హక్కును కోరుతారేమో అని భయపడి వారి ఆస్తిని న్యాయ సీమలను అతిక్రమించి తొందర తొందరగా ఎన్నడూ తినకండి. అనాథుల సంరక్షకుడు సంపన్నుడైతే, అతడు వారి సొమ్ముకు దూరంగా ఉండాలి. ఒకవేళ అతడు పేద వాడైతే దాన్ని ధర్మసమ్మతంగా అనుభవించాలలి. తరువాత వారి ఆస్తిని వారికి అప్ప గించేటప్పుడు దానికి ఇతరులను సాక్షులుగా పెట్టండి. లెక్క తీసుకోవటానికి అల్లాహ్ చాలు. తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు

కూడా భాగం ఉంది- అది తక్కువైనా సరే లేక ఎక్కువైనా సరే. ఈ భాగం (అల్లాహ్‌చే) నిర్ణయించబడింది. *(అన్ నిసా-6,7)*

ఆయత్(6)లో 'హసీబా' అనే పదం వచ్చింది. దీనికి 'చాలు', 'సరిపోతాడు' అనే అర్థాలు వస్తాయి.[1]

## అధ్యాయం : 22

## వీలునామా పొందిన వ్యక్తి అనాధుల సొమ్మును పెట్టుబడిగా పెట్టడం, కష్టపడటం సబబే. తాను పడిన శ్రమకు తగ్గ ప్రతిఫలం తీసుకోవడం కూడా సమంజసమే.

**117)** ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయుల(సఅసం) కాలంలో హజ్రత్ ఉమర్(రజి) తన ఆస్తిలో ఒక భాగాన్ని వక్ఫ్ చేశారు. ఆ ఆస్తి పేరు 'సమ్గ్'. అదొక ఖర్జూర తోట. 'దైవప్రవక్తా(సఅసం)! నాకొక ఆస్తి లభించింది. నా దృష్టిలో అది ఎంతో ఉత్తమమైనది. అందుకే నేను దానిని దానం చేయాలను కుంటున్నాను' అని హజ్రత్ ఉమర్(రజి) విన్నవించుకున్నప్పుడు, ప్రవక్త మహనీ యులు(స), "స్థిరాస్తిని సదఖాగా ఇవ్వు. అయితే దానిని ఎవరూ అమ్మకుండా, కానుకగా ఇవ్వకుండా, దానికి ఎవరూ వారసులు కాకుండా, కేవలం దాని ఫలసాయం మాత్రం (దైవమార్గంలో) వెచ్చించబడేలా ఆంక్ష విధించు" అని సూచిం చారు. అందువల్ల హజ్రత్ ఉమర్(రజి) ఆ తోటను సదఖాగా ఇస్తూ, అది యోధు లకు, బానిసల విముక్తికి, అగత్యపరులకు, బలహీనులకు, బాటసారులకు, బంధువు లకు ఉపయోగపడేలా షరతు విధించారు. దాని పర్యవేక్షకుడు సయితం ప్రఖ్యాత (మారూఫ్) పద్ధతిననుసరించి అందులో నుండి కొంత తినవచ్చని లేదా తన స్నేహితునికి తినిపించవచ్చని కూడా రాయితీ కల్పించారు. అయితే డబ్బు కూడబెట్టే ఉద్దేశంతో అలా చేయరాదని షరతు విధించారు.[1]

**118)** హజ్రత్ ఆయిషా(ర.అ) దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్- "అనాధుల

---

21-1. పూర్వం అజ్ఞాన కాలంలో అరబ్బులు మృతుని ఆస్తిలో కేవలం పురుషులకు మాత్రమే హక్కు ఉందని, స్త్రీలకు ఎలాంటి వాటా లేదని భావించేవారు. అల్లాహ్ ఈ అనాచారాన్ని అధర్మంగా ఖరారు చేస్తూ, పురుషుల,స్త్రీల హక్కులను నిర్ధారించాడు. ఇప్పటికీ ధర్మజ్ఞానం లేని అనేకమంది ముస్లింలు స్త్రీలకు ఆస్తి హక్కు ఇవ్వడానికి అంగీకరించరు. ఇది అన్యాయం.

**సంరక్షకుడు సంపన్నుడైతే, అతడు వారి సొమ్ముకు దూరంగా ఉండాలి. ఒకవేళ అతడు పేదవాడైతే ప్రఖ్యాత పద్ధతిననుసరించి తినవచ్చు" (అన్ నిసా-6) గురించి వివరిస్తూ ఇలా అన్నారు : ఇది అనాథుల సంరక్షకుల గురించి అవతరించింది. సంరక్షకుడు పేదవాడైనప్పుడు, అతడు అనాథుల సొమ్ము నుండి ధర్మసమ్మతంగా కొంత అనుభవించగలడు.**[1]

## అధ్యాయం : 23

అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: **"అనాథుల ఆస్తిని అన్యాయంగా తినేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటారు. వారు తప్పకుండా మండే నరకాగ్నిలో త్రోయబడతారు."** *(అన్ నిసా- 10)*

**119)** ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రబోధించారని హజ్రత్ **అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "సర్వనాశనం చేసే ఏడు పాపాల నుండి తప్పించుకుంటూ ఉండండి." 'దైవప్రవక్తా! ఆ పాపాలు ఏవి?' అని ప్రియ సహచరులు (ర.అన్హుమ్) అడగ్గా, ఆయన (సఅసం) ఇలా చెప్పారు : "అల్లాహ్‌కు ఇతరులను సహవర్తులుగా కల్పించటం, చేతబడి చేయటం, అల్లాహ్ నిషిద్ధంగా ఖరారు చేసిన ప్రాణాన్ని బలిగొనడం, వడ్డీ తినటం, అనాథుల సొమ్మును స్వాహా చేయటం, యుద్ధ సమయంలో వెన్నుచూపి పారిపోవటం, శీలవతులు, అమాయికలు అయిన స్త్రీలపై అభాండం మోపటం."**

## అధ్యాయం : 24

అల్ బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**"అనాథులతో వ్యవహరించే తీరును గురించి వారు నిన్ను అడుగుతారు. నీవు వారికి ఇలా బోధించు : "ఏ విధంగా వ్యవహరిస్తే వారికి ఎక్కువ మేలు కలుగు**

---

117-1. వక్ఫ్ఆస్తికి ముతవల్లీగా ఉన్న వ్యక్తి, ఆ ఆస్తిపై తాను పడే శ్రమకు గాను- ప్రఖ్యాత పద్ధతి (మారూఫ్ పద్ధతి)ని అనుసరించి అందులోనుండి కొంత తీసుకోగలడని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఎందుకంటే హజ్రత్ ఉమర్(రజి) తన తోటను వక్ఫ్ చేసే సమయంలో ఈ వెసులుబాటు కల్పించారు.

118-1. సదుద్దేశంతో అనాథుల సొమ్మును వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టడం, తాను కష్టపడిన దానికి ప్రతిఫలంగా ఆ సొమ్ములో నుండి కొంత తీసుకోవటం సమంజసమేనని దీని ద్వారా విదితమవుతోంది.

తుందో, ఆ విధంగా వ్యవహరించటం ఉత్తమం. ఒకవేళ మీరూ వారూ కలిసి వుంటూ, ఉభయుల ఖర్చులను ఉమ్మడిగా భరిస్తే, అందులో అభ్యంతరం లేదు. ఎటొచ్చీ వారు మీకు సోదరతుల్యులే కదా! కీడు చేసే వారెవరో, మేలు చేసేవారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు. అల్లాహ్ కోరితే, ఈ విషయంలో మీతో కఠినంగా వ్యవహరించి ఉండేవాడే. కాని ఆయన సర్వాధికారియే కాదు, వివేకవంతుడు కూడా" (2: 220). దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌లో **'లఆనతకుమ్'** అనే పదం వచ్చింది. అంటే 'అల్లాహ్ మిమ్మల్ని కష్టాల్లో పడవేసి ఉండేవాడే' అని అర్థం. తాహా సూరాలోని **'అనత్'**కు వంగిపోయారు అనే అర్థం వస్తుంది. అంటే సజీవుడు, అందరినీ నిలిపి ఉంచే వాడైన శక్తిమంతుని ముందు తలవంచారన్నమాట!

ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇలా అన్నారు : సులైమాన్ బిన్ హరబ్ మాతో ఏమన్నారంటే... ఇబ్నె ఉమర్(రజి)కు ఎవరయినా వీలునామాను అమలు పరచే బాధ్యత ఇస్తే ఎన్నటికీ నిరాకరించేవారు కారు.[1] ఇబ్నె సీరీన్ తాబయి (రహ్మ) గారికి అత్యంత ప్రియమైన వ్యాపకం ఏమిటంటే; అనాథుల సొమ్ములు, ఆస్తిపాస్తుల విషయంలో ఆయన శ్రేయోభిలాషులను, సంరక్షకులను సమావేశపరిచి వాటిని అభివృద్ధి చేసే పద్ధతుల గురించి ఆలోచించటం. అనాథుల గురించి ఎవరయినా ఏదైనా ప్రశ్న వేసినపుడు తావుస్ తాబయి (రహ్మ) ఈ ఆయత్ పఠించేవారు– **"వల్లాహు యాలముల్ ముఫ్సిద మినల్ ముస్లిహీ"** (కీడు చేసేవారెవరో, బాగుపరచే వారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు). అతా (రహ్మ) అనాథుల గురించి ఇలా అన్నారు: "వారు సామాన్యుల కోవకు చెందినవారైనా లేదా ఉన్నత శ్రేణికి చెందిన వారైనా– వారి సంరక్షకుడు వారి వాటాలో నుండి వారిపై తగిన రీతిలో ఖర్చు పెట్టాలి."[2]

---

24–1. ఎందుకంటే అనాథుల మంచీ చెబ్బరలను పట్టించుకోవటం, వారిని పోషించటం గొప్ప పుణ్యకార్యం.

24–2. సామాన్యులు,ఉన్నత శ్రేణికి చెందినవారు అంటే అర్థం ఏమిటంటే, అనాథులలో కొందరు నిరుపేదలుంటారు. కొందరు కులీనులు, మర్యాదస్తులు అయి ఉంటారు. కాబట్టి వారి స్థాయికి తగ్గ రీతిలో వారిపై ఖర్చుచేయాలి.

"అనాథుల ఆస్తి దరిదాపుల్లోకి పోకండి" (అల్ అన్‌ఆమ్–152) అన్న దైవాదేశం అవత రించినప్పుడు, వారి సంరక్షకులు భయపడిపోయి, వారి భోజన పానీయాలను కూడా

## అధ్యాయం : 25

## ప్రయాణంలోనూ, ఇంట్లో ఉన్న సమయంలోనూ అనాథుని చేత వారి మేలును తలచి పని చేయించటం. తల్లి మరియు సవతి తండ్రి అనాథను దయాభావంతో చూడటం.

**120)** హజ్రత్ అనస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసం) మదీనా నగరానికి (హిజ్రత్ చేసి) వచ్చినప్పుడు, ఆయన(స) దగ్గర సేవకులెవరూ లేరు. అందువల్ల (నా సవతి తండ్రి అయిన) అబూతల్హా నా చేయి పట్టుకుని దైవప్రవక్త(స) సన్నిధికి తీసుకెళ్ళి, 'యా రసూలల్లాహ్! అనస్ బుద్ధిమంతుడైన బాలుడు. ఇతను మీకు తగిన సేవకుడు' అని విన్నవించుకున్నారు. అనస్(రజి) ఇలా అంటున్నారు: "నేను ప్రయాణంలోనూ, ఇంటి వద్దనూ ఆయన(స) సేవ చేసేవాణ్ణి. నేను చేసిన పనిపై ఆయన(స) ఎన్నడూ నన్ను నిలదీయలేదు. ఈ పని నీవు ఇలా ఎందుకు చేశావు?" అని ప్రశ్నించలేదు. నేను ఏదైనా పని చేయలేకపోయినప్పుడు, "నీవు దీనిని ఈ విధంగా ఎందుకు చేయలేదు?" అని కూడా గద్దించలేదు.[1]

---

వేరుగా ఉంచసాగారు. వారు తినగా మిగిలిన అన్నం పాడైపోయేది. ఇంట్లో అనుదినం అనాథుల కోసం అన్నం వేరుగా వండాల్సి వచ్చేది. దాంతో పని రెట్టింపయింది. ఈ సాధక బాధకాలను గురించి వారు దైవప్రవక్త(స)కు చెప్పుకున్నప్పుడు ఈ ఆయత్ (2: 220) అవతరించింది. వారితో కలిసి భుజించటంలో తప్పులేదని, అయితే వారి ఆస్తిపాస్తులను మాత్రం కాపాడాలని బోధపరచటం జరిగింది.

120-1. అల్లాహు అక్బర్! ఉత్తమ నైతికతకు ఇది పరాకాష్ఠ! ఒక్క ప్రవక్తకు తప్ప ఇతరులకు ఇంతటి ఆత్మనిగ్రహం ఉండదు. మనిషికి ఎప్పుడో ఒకప్పుడు తన సేవకునిపై కోపం తప్పక వస్తుంది. పరుష వాక్యం కూడా నోట వెలువడుతుంది.

మరోవైపు హజ్రత్ అనస్(రజి) వివేచన కూడా శ్లాఘనీయమే. ఆయన దైవప్రవక్త(స) అభీష్టాన్ని గుర్తెరిగి, ఆయన(స)కు కోపం తెప్పించే పని ఏదీ చేసేవారు కారు.

ఇంకొక వైపు అనస్ (రజి) తల్లి ఉమ్మె సులైమ్ (ర.అ) దూరదృష్టి కూడా కొనియాడ దగినదే. ఆమె తన భర్తకు చెప్పి ఆ అబ్బాయిని దైవప్రవక్త(స) సేవకై ఒప్పించింది. అబూతల్హా (రజి) అనస్‌కి సవతి తండ్రి. దైవప్రవక్త(స) ప్రయాణానికి బయలుదేరుతున్న సమయంలో ఆయన, అనస్‌ను తీసుకువచ్చి, దైవప్రవక్త(స) సేవకు అంకితం చేశారు. హజ్రత్ అనస్(రజి) 10 ఏండ్లపాటు ప్రవక్త సేవలో ఉన్నారు.

## అధ్యాయం : 26

## ఒకవేళ ఎవరయినా (సుప్రసిద్ధమైన) ఒక భూభాగాన్ని 'వక్ఫ్'గా ఇస్తూ దాని సరిహద్దులను వివరించకపోయినప్పటికీ అది ధర్మసమ్మతమే. అలాగే అలాంటి భూమిని దానం చేయటం.

**121)** అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని ఇస్హాఖ్ బిన్ అబ్దులాహ్ బిన్ అబీ తల్హా తెలిపారు: ఖర్జూర తోటల రీత్యా అబూ తల్హా (రజి) మదీనాలోని అన్సార్లలోకెల్లా ధనవంతులు. ఆయనకు తన సంపదలన్నింటిలోకి మస్జిదె నబవీకి సమీపంలోనున్న బైర్హా తోట ఎంతో ప్రియమైనది. ప్రవక్త మహనీయులు(స) స్వయంగా ఆ తోటలోకి వెళ్ళి, అందలి తియ్యని నీరును త్రాగేవారు. అనస్(రజి) ఇలా అన్నారు : "మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టనంత వరకూ మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు." (ఆలి ఇమ్రాన్– 92) అనే ఆయత్ అవతరించినప్పుడు, అబూతల్హా (రజి) లేచి, ప్రవక్త మహనీయుల(స) సమక్షంలో ఇలా విన్నవించుకున్నారు– 'దైవప్రవక్తా! మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టనంత వరకూ మీరు సత్కార్యస్థాయికి చేరుకోలేరని అల్లాహ్ సెలవిచ్చాడు కదా! నా సిరిసంపదలలో నాకు అత్యంత ప్రియమైనది బైర్హా (తోట). దీనిని అల్లాహ్ మార్గంలో సదఖాగా సమర్పించుకుంటున్నాను. అల్లాహ్ సన్నిధిలో ఇది నా పాలిట సత్కార్యంగా, పరలోక నిధిగా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను'. దైవప్రవక్త(సఅసం) ఇది విని "శభాష్! ఇది ఎక్కువ లాభసాటి సంపద (లేదా ఎడతెగని సంపద)[1] ఉల్లేఖకులు అబ్దుల్లాహ్ బిన్ మస్లమా ఇక్కడ సందిగ్ధంలో పడ్డారు– నీవు చెప్పినదంతా విన్నాను. నీవు ఈ తోటను నీ సమీప బంధువులకు (రాసి) ఇవ్వటం మంచిదని నా అభిప్రాయం" అన్నారు. దానికి అబూ తల్హా (రజి), 'చిత్తం. అలాగే చేస్తాను దైవ ప్రవక్తా!' అన్నారు. అందువల్ల ఆయన ఆ తోటను తన సమీప బంధువుల్లో– తన పినతండ్రి కుమారుల్లో పంచిపెట్టారు. ఇస్మాయీల్, అబ్దుల్లాహ్ బిన్ యూసుఫ్, యహ్యా బిన్ యహ్యా– మాలిక్ ఆధారంగా– 'రాబిహున్'కు బదులు 'రాయిహున్' అని పేర్కొన్నారు.[2]

---

121–1. అంటే ఇలాంటి సంపదను ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు.

121–2. అబూ తల్హా 'బైర్హా' తోటను దానంగా రాసి ఇచ్చారు. కాని దాని సరిహద్దులను వివరించ

**122)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : ఒక సహాబీ (సాద్ బిన్ ఉబాదా) దైవప్రవక్త (సఅసం)ను, తన తల్లి చనిపోయిందని, ఒకవేళ తాను గనక ఆమె తరఫున ఏమన్నా దానం చేస్తే దాని పుణ్యఫలం ఆమెకు చేరుతుందా?' అని అడగ్గా, "అవును" అని ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పారు. 'అలాగైతే నా దగ్గర పంట చేతికి వచ్చిన తోట ఒకటి ఉంది. నేను దానిని ఆమె తరఫున దానం చేస్తున్నాను. ఈ వ్యవహారానికి మిమ్మల్ని సాక్షిగా పెడుతున్నాను' అని ఆ సహాబీ చెప్పారు.

## అధ్యాయం : 27

## ఒకవేళ అనేకమంది అవిభాజ్యంగా ఉన్న తమ ఉమ్మడి భూమిని వక్ఫ్ చేస్తే, అదీ సమ్మతమే.

**123)** మహనీయ అనస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసం) మస్జిద్ నిర్మాణం కొరకు ఆదేశించారు. బనీ నజ్జార్ తెగ వారిని ఉద్దేశించి, "మీరు ఈ తోటను నాకు అమ్మండి" అన్నారు. దానికి వారు, 'అలా ఎన్నటికీ జరగదు. అల్లాహ్ సాక్షిగా! మేము దీని మూల్యాన్ని అల్లాహ్ నుండి తీసుకుంటాము'[1] అనన్నారు.

## అధ్యాయం : 28

## వక్ఫ్ దస్తావేజు ఎలా వ్రాయాలి?

**124)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : మహనీయ ఉమర్ (రజి)గారికి ఖైబర్‌లో ఒక భూమి (విజయప్రాప్తి) లభించింది. ఆయన దైవప్రవక్త

---

లేదు. ఎందుకంటే ఆ ప్రదేశంలో బైర్హా ప్రఖ్యాతి చెందినది. దానిని ఎరుగని వారెవరూ లేరు. ప్రజలలో ఖ్యాతి గడించని భూమిని వ్రాసి ఇచ్చేటప్పుడు మాత్రం, దాని సరిహద్దులను గురించి స్పష్టంగా వ్రాయటం అవసరం.

123-1. అంటే బనీ నజ్జార్ తెగవారు తమ ఉమ్మడి భూమిని మస్జిద్ కొరకు 'వక్ఫ్' చేసేశారు. అధ్యాయంలోని అసలు విషయం ఇదే. కాని ఇబ్నె సాద్ 'తబఖాత్'లో వాఖిదీ ద్వారా ఉటంకించిన దాని ప్రకారం దైవప్రవక్త(స) ఆ భూమిని 10 దీనార్లకు కొన్నారు. హజ్రత్ అబూబకర్(రజి) ఆ మొత్తాన్ని చెల్లించారు. మొదట బనీ నజ్జార్ ఆ స్థలాన్ని వక్ఫ్ చేయదలిచారు. అందుకు దైవప్రవక్త(స) అంగీకరించలేదు. ఎందుకంటే ఆ అవిభాజ్యమైన భూమిలో తండ్రి లేని పిల్లల వాటా కూడా ఉంది.

(సఅసం) సన్నిధిలో హాజరై 'అయ్యా! నాకు ఒక భూమి లభించింది. ఇంతటి విలువైన సంపద నాకు ఎన్నడూ లభించలేదు. దాని గురించి తమరి సలహా ఏమిటి?' అని విన్నవించుకోగా, "నీవు గనక తలచుకుంటే అసలు స్థిరాస్తిని నీ అధీనంలోనే ఉంచుకుని, దాని ఫలసాయాన్ని మాత్రం దానం చేయవచ్చు" అని ప్రవక్త మహనీయులు(స) సలహా ఇచ్చారు. అందువల్ల హజ్రత్ ఉమర్ (రజి) ఆ ఆస్తిని షరతులతో దానం (వక్ఫ్) చేశారు. ఆ షరతులు ఇవి: 1) స్థిరాస్థిని అమ్మరాదు. 2) దీనిని కానుకగా ఎవరికీ ఇవ్వరాదు. 3) అది వారసత్వ సంపదగా కూడా ఎవరికీ సంక్రమించదు. 4) నిరుపేదలు, బంధువులు, బానిసల విమోచనకు, దైవమార్గంలో కృషి చేసే అతిథులకు (యోధులకు), బాటసారులకు ఈ ఆస్తి ఫలసాయం అంకితం. దీనికి ధర్మకర్తగా ఉన్న వ్యక్తి గనక కోరితే ప్రఖ్యాత పద్ధతిని అనుసరించి అందులోనుంచి (కొంత) అనుభవించవచ్చు లేదా ఎవరయినా స్నేహితునికి తినిపించవచ్చు. ఇలా చేయటంలో తప్పు లేదు. కాకపోతే ధనాన్ని కూడబెట్టడం ఉద్దేశ్యమై ఉండరాదు.[1]

## అధ్యాయం : 29

## అవసరార్థులకు, స్థితిమంతులకు, అతిథులకు కూడా ఆస్తిని వక్ఫ్ చేయ వచ్చు.

**125)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)కి ఖైబర్‌లో ఒక భూమి లభించింది. ఆయన ప్రవక్త మహనీయుల (సఅసం) సన్నిధికి వచ్చి దాని గురించి సంప్రతించినప్పుడు, "ఒకవేళ నీవు కోరు కుంటే దానిని దానం చేయవచ్చు" అని దైవప్రవక్త(సఅసం) సలహా ఇచ్చారు. అందువల్ల ఆయన(రజి) ఆ భూమిని నిరుపేదల, అగత్యపరుల, బంధువుల కోసం, అతిథుల కోసం దానం చేసేశారు.

124–1. ఆస్తిని వక్ఫ్ చేస్తున్నప్పుడు, దానిని ఏ ఏ ఉద్దేశ్యాల కొరకు వినియోగించాలో స్పష్టంగా వ్రాసి ఇవ్వాలి. ఒకవేళ వ్రాతపూర్వకంగా ఇచ్చే అవకాశం లేనప్పుడు మూజువాణిగా స్పష్టం చేసి, దానికి సాక్షుల్ని పెట్టుకోవాలి. హజ్రత్ ఉమర్(రజి) గారి ఈ సంఘటన హిజ్రీ 7వ సంవత్సరంలో సంభవించింది. ఆయన మొదట్లో ఈ వక్ఫ్ ఆస్తికి ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా (ర.అ)ను ధర్మకర్తగా నియమించారు. ముఅయ్‌ఖీబ్ ఈ దస్తావేజును వ్రాశారు. అబ్దుల్లాహ్ బిన్ అర్ఖమ్ ఆ వ్యవహారానికి సాక్షిగా ఉన్నారు.

## అధ్యాయం : 30

## మస్జిద్ కొరకు భూమిని వక్ఫ్ చేయటం

**126)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు మదీనా నగరానికి ఏతెంచినపుడు, ఆయన (సఅసం) మస్జిద్‌ను నిర్మించమని ఆదేశిస్తూ, "నజ్జార్ తెగ వారలారా! మీ తోట మూల్యాన్ని నా నుండి తీసుకోండి" అని చెప్పారు. దానికి వారు, 'లేదు (ఓ దైవప్రవక్తా!) దైవసాక్షిగా! మేము దీని మూల్యాన్ని అల్లాహ్ నుండి తీసుకుంటామ'ని చెప్పారు.

## అధ్యాయం : 31

## పశువులు, గుర్రాలు, సామాను,వెండీ బంగారాలను వక్ఫ్ చేయటం

జుహ్రీ (రహ్మ) ఒక వ్యక్తి గురించి ఇలా అన్నారు: అతడు వెయ్యి దీనార్లను అల్లాహ్ మార్గంలో వక్ఫ్ చేశాడు. ఆ ధనంతో వర్తకం చేసేందుకు వారికి ఒక బానిసను కూడా ఇచ్చాడు. తద్వారా వచ్చే లాభాలను అతను అగత్యపరులకు, బంధువులకు దానం చేశాడు. మరైతే ఆ వ్యక్తి లాభాన్ని అగత్యపరులకు దానం చేయనపుడు దాని నుండి ఏమైనా తినగలడా?[1] దాన్నుండి తీసుకుని తినటం అతనికి తగదని ఆయన చెప్పారు.

**127)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: హజ్రత్ ఉమర్(రజి) తన గుర్రాన్ని దైవమార్గంలో (జిహాద్ చేసేందుకు) ఒక వ్యక్తికి ఇచ్చారు. (అంతకు ముందు) దైవప్రవక్త(స) ఉమర్(రజి)కు ఇచ్చిన గుర్రం అది. జిహాద్‌లో ఎవరినయినా ఆ గుర్రంపై స్వారీ చేయించమని చెప్పి మరీ ఇచ్చారు దైవప్రవక్త(స). అయితే తానిచ్చిన గుర్రాన్ని ఆ వ్యక్తి మార్కెట్‌లో అమ్మకానికి పెట్టాడని తెలిసినపుడు, హజ్రత్ ఉమర్(రజి) దైవప్రవక్త(స)ను సంప్రదించారు. తాను ఆ గుర్రాన్ని కొనుగోలు చేయగలనా? అని సందేహపడ్డారు. "ఎట్టి పరిస్థితిలోనూ కొనకూడదు. నీవు

---

31-1. ఎందుకంటే అతను దైవమార్గంలో దీనార్లను (బంగారు నాణాలను) ఇచ్చాడు. అంటే; అతను దానం చేశాడు. అలాంటప్పుడు సదఖా (దానం) సొమ్మును తన కొరకు ఎలా ఖర్చుపెట్టుకుంటాడు? దీనిని (ఈ అసర్‌ను) ఇబ్నె వహబ్ తన ముఅత్తాలో వసల్ చేశారు.

దానంగా ఇచ్చిన దానిని తిరిగి తీసుకోకు"[1] అని ప్రవక్త మహనీయులు (సఅసం) సమాధానమిచ్చారు.

## అధ్యాయం : 32

## వక్ఫ్ ఆస్తులకు నిర్వాహకుడుగా ఉన్న వ్యక్తి తన ఖర్చులను వాటి నుండి తీసుకోగలడు

**128)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు : "నాకు వారసులైన వారు, నేను గనక దీనార్లు దిర్హములను వదలిపోతే, వారు దానిని పంచి పెట్టరాదు. నా భార్యల ఖర్చులను, ఆస్తిని పర్యవేక్షించేవాని ఖర్చులను తీసిన తరువాత, మిగిలిన దానిని దానం (సదఖా)గా పరిగణించాలి.[1]

**129)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: హజ్రత్ ఉమర్ (రజి) తన ఆస్తిని వక్ఫ చేస్తూ, ఆ ఆస్తికి ధర్మకర్తగా ఉన్న వ్యక్తి అందులో నుండి (కొంత) తినగలడనీ, తన స్నేహితునికి తినిపించగలడని, కాని ఆ ఆస్తి ద్వారా ధనం కూడబెట్టలేడని షరతు విధించారు.

## అధ్యాయం : 33

## ఎవరయినా ఒక బావిని 'వక్ఫ్' చేస్తూ, సామాన్య ముస్లింల మాదిరిగా తాను కూడా నీళ్ళు తోడుకుంటానని షరతు విధిస్తే లేదా భూమిని వక్ఫ్ చేస్తే లేదా ఇతరుల మాదిరిగా తాను కూడా దాని ద్వారా లబ్ధి పొందుతానని షరతు పెడితే అది కూడా సబబే

అనస్ బిన్ మాలిక్ (రజి) మదీనాలోని తన నివాస గృహం ఒక దానిని

---

127–1. హజ్రత్ ఉమర్(రజి) ఆ గుర్రాన్ని దానం (సదఖా) చేసి, అది కూడా 'వక్ఫ్' లాంటిదేనని ఊహించారు. 'వక్ఫ'లో అసలు ఆస్తిని ఆపి ఉంచటం జరుగుతుంది. కాని 'సదఖా'లో అసలు ఆస్తి యాజమాన్యం బదిలీ అవుతూ ఉంటుంది. కాబట్టి హజ్రత్ ఉమర్(రజి) గుర్రాన్ని 'వక్ఫ' చేశారని అనటం సరైనది కాదు. వక్ఫ చేసి ఉంటే, గుర్రాన్ని పొందిన వ్యక్తి దానిని మార్కెట్‌లో అమ్మకానికి ఎందుకు పెడతాడు?

128–1. దీనినిబట్టి అవగతమయ్యేదేమంటే, వక్ఫ ఆస్తులకు ధర్మకర్తగా ఉన్న వ్యక్తి తన కష్టార్జితాన్ని – సముచితమైన రీతిలో– పొందడానికి అర్హుడే.

'వక్ఫ్' చేశారు. ఆయన మదీనా వచ్చినప్పుడల్లా ఆ ఇంట్లో విడిది చేసేవారు. హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్(రజి) తన ఇండ్లను 'వక్ఫ్' చేశారు. అయితే విడాకులు పొందిన తన కూతురికి "నీవు కోరితే ఈ ఇంట్లో ఉండవచ్చు. కాని దీనిని పాడు చేయ కూడదు. ఇతరులు కూడా ఈ ఇల్లును పాడు చేయకూడదు" అని తాకీదు చేసేవారు. భర్తతో కలసి కాపురం చేసే కూతురు మాత్రం ఆ ఇంట్లో ఉండరాదని చెప్పారు. హజ్రత్ ఉమర్-రజి- (వక్ఫ్‌గా రాసి ఇచ్చిన) ఇంట్లో తాత్కాలికంగా ఉండేందుకు ఇబ్నె ఉమర్ తన పిల్లల్లోని అవసరార్థులకు అనుమతి ఇచ్చారు.

అబూ అబ్దుర్రహ్మాన్ తెలిపారు: హజ్రత్ ఉస్మాన్(రజి)ను (ఈజిప్టు తిరుగు బాటుదారులు) దిగ్బంధం చేసినప్పుడు, ఆయన తన ఇంటి కప్పుపైకెక్కి తిరుగు బాటుదారులనుద్దేశించి ఇలా అన్నారు: నేను మిమ్మల్ని అల్లాహ్ సాక్షిగా అడుగు తున్నాను. కేవలం దైవప్రవక్త ప్రియ సహచరులను దైవసాక్షిగా అడుగుతున్నాను. మీకు ఈ సంగతి తెలియదా? "బైరె రూమా (బావి)ని త్రవ్వించి, దానిని ముస్లింలకు వక్ఫ్ చేసేదెవరు? అలాంటి వారికి స్వర్గ శుభవార్త ఇస్తున్నాను" అని ప్రవక్త మహనీయులు(స) అడిగినపుడు, నేనే ఆ బావిని త్రవ్వించాను. మీకు ఈ విషయం గుర్తుందా? "తబూక్ పోరాటానికి వెళుతున్న 'జైషె ఉస్రా' సైన్యానికి ఆయుధ సామ గ్రిని సమకూర్చేవారికి స్వర్గ శుభవార్త ఉంది" అని దైవప్రవక్త(స) ప్రకటించినపుడు, నేనే ఆ సైనికుల్ని సాయుధుల్ని చేశాను. ఆయన(రజి) చెప్పిన ప్రతి మాటను ప్రవక్త ప్రియ సహచరులు నిజమని ధ్రువపరచారని ఉల్లేఖకుడు అన్నారు. హజ్రత్ ఉమర్(రజి) తన ఆస్తిని వక్ఫ్‌గా రాసి ఇస్తూ, "దాని నిర్వాహకుడు (ధర్మకర్త) అందులో నుండి కొంత తన కోసం తీసుకుంటే అందులో తప్పేమీ లేదని స్పష్టం చేశారు. ఒక్కోసారి ధర్మకర్త సయితం ఆ ఆస్తిని వక్ఫ్ చేసినవాడై ఉంటాడు. ఇతరులు కూడా దానికి ధర్మకర్తలై ఉంటారు. వారిలో ప్రతి ఒక్కరికీ ఇది ధర్మసమ్మతమే.[1]

---

33-1. అంటే 'వక్ఫ్' చేసే వ్యక్తి, ఆ ప్రాపర్టీ నుండి తాను స్వయంగా కూడా లబ్ధి పొందుతానని షరతు విధిస్తే అందులో తప్పేమీ లేదు. ఉదాహరణకు- ఎవరయినా ఒక బావిని 'వక్ఫ్' చేస్తూ తోటి సాధారణ ముస్లింల మాదిరిగానే ఆ బావిలోని నీరు నేనూ త్రాగుతాను, నేనూ నీరు తోడుకుంటానని షరతు పెడితే అది ధర్మసమ్మతమే.

హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్(రజి) గారి ఈ సంఘటనను దారిమీ తన ముస్నద్‌లో వసల్ చేశారు. భర్త కల తన కుమార్తెను ఆయన గారు వక్ఫ్ ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వకపోవటం గమనార్హం. ఎందుకంటే ఆమె ఎలాగూ తన భర్త వద్ద

## అధ్యాయం : 34

## ఒకవేళ వక్ఫ్ చేసే వ్యక్తి, 'నేను దీని మూల్యాన్ని అల్లాహ్ నుండి తీసుకుంటాను' అని చెబితే, అట్టి వక్ఫ్ సరైనదే.

**130)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: "ఓ బనూ నజ్జార్ తెగవార లారా! మీరు ఈ తోట మూల్యాన్ని నా నుండి తీసుకోండి" అని ప్రవక్త మహ నీయులు (సఅసం) చెప్పినప్పుడు, 'మేము దీని మూల్యాన్ని అల్లాహ్ నుండి తప్ప మరెవరి నుండీ తీసుకోము' అని వారు సమాధానమిచ్చారు.

## అధ్యాయం : 35

## అల్లాహ్ (అల్ మాయిదా సూరాలో) ఈ విధంగా సెలవీయటం

విశ్వాసులారా! మీలో ఎవరికయినా మరణ సమయం ఆసన్నమై అతడు వీలునామా వ్రాయిస్తున్నప్పుడు, దాని సాక్ష్యానికి అనుసరించవలసిన పద్ధతి ఏమి టంటే, మీలో న్యాయవర్తనులైన ఇద్దరు వ్యక్తులు సాక్షులుగా చెయ్యబడాలి లేక ఒకవేళ మీరు ప్రయాణ స్థితిలో ఉండి అక్కడ మీకు మృత్యు విపత్తు సంభవిస్తే అప్పుడు ముస్లిమేతరుల నుండే ఇద్దరు సాక్షులను తీసుకోవాలి. తరువాత ఏదైనా

---

ఉంటుంది. కాకపోతే విడాకులు పొందిన కుమార్తెకు వసతి సౌకర్యం అవసరం కాబట్టి ఆమెకు అనుమతి ఇచ్చారు.

హజ్రత్ ఉస్మాన్(రజి) దాతృత్వ గుణం కూడా ఈ శీర్షిక ద్వారా తేటతెల్లమవుతోంది. దైవప్రవక్త(స) పిలుపునకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ రూమా బావిని కొనుగోలు చేసి, దానిని ముస్లింలకు వక్ఫ్ చేశారు. అయితే ఆయన ఆ బావిని కొనుగోలు చేసినట్లు కొన్ని హదీసులలో లేదు. బహుశా బావి విస్తృతిని పెంచడానికి త్రవ్వించి ఉంటారు.

తబూక్ యుద్ధ సందర్భంగా ముస్లింలకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. ప్రవక్త మహనీయుల(స) ప్రేరణపై హజ్రత్ ఉస్మాన్ (రజి) మరోసారి తన ఔదార్యాన్ని కురిపిస్తూ ముస్లిం సైనికులకు పెద్దఎత్తున ఆర్థిక సహాయం చేశారు. అది చూసి దైవప్రవక్త(స) సంతోషించారు. ఉస్మాన్(రజి)కు స్వర్గలోక శుభవార్తను వినిపించారు.

తిరుగుబాటుదారులు ఉస్మాన్(రజి)ను మదీనాలో దిగ్బంధం చేసి ఆహార సరఫరాలను నిలిపివేసినపుడు, ఆయన కలత చెందిన మనసుతో, పూర్వం తాను ముస్లిం సముదాయానికి చేసిన తన సేవలను గుర్తు చేశారు. ఆ సేవలకు సాక్షులుగా ఉన్న సహాబా కూడా దానిని సత్యమని ధ్రువపరిచారు. ఇలా ధ్రువపరచిన వారిలో హజ్రత్ అలీ, తల్హా, జుబైర్, సాద్ బిన్ అబీ వక్కాస్ (ర.అన్హుమ్) ముఖ్యులు.

అనుమానం కలిగితే, నమాజు చేసిన పిదప ఆ ఇద్దరు సాక్షులనూ (మసీదులో) ఆపాలి. వారిద్దరూ అల్లాహ్‌పై ప్రమాణంచేసి ఇలా చెప్పాలి : “మేము స్వార్థం కొరకు సాక్ష్యాన్ని అమ్మేవాళ్ళం కాము- అతడు మాకు దగ్గర బంధువైనా సరే(మేము అతని విషయంలో పక్షపాతం చూపం). మేము అల్లాహ్ కొరకు ఇచ్చే సాక్ష్యాన్ని దాచేవారం కాము. మేము ఆ విధంగా చేస్తే పాపాత్ములలో లెక్కింపబడతాము.” కాని ఆ ఉభయులు తమను తాము పాపానికి గురిచేసుకున్నట్లు తెలిస్తే అప్పుడు వారి స్థానంలో సాక్ష్యమివ్వటానికి వారికంటే యోగ్యులైన మరో ఇద్దరు వ్యక్తులు- హక్కు విషయంలో అన్యాయం జరిగిన వారినుండి ముందుకు రావాలి. వారు అల్లాహ్‌పై ప్రమాణం చేసి ఇలా చెప్పాలి : “మా సాక్ష్యం వారి సాక్ష్యం కంటే ఎక్కువ సత్యమైనది. మేము మా సాక్ష్యం విషయంలో ఏ విధమైన అక్రమానికి పాల్పడలేదు. మేము ఆ విధంగా చేస్తే అన్యాయపరులలో చేరిపోతాము.” ఈ పద్ధతి వల్ల ప్రజలు నిజమైన సాక్ష్యం ఇస్తారని, లేదా వారి ప్రమాణాలను, తరువాత తీసుకోబడే ఇతరుల ప్రమాణాలు ఖండిస్తాయనే భయమైనా కనీసం వారికి కలుగుతుందనీ ఎక్కువగా ఆశించవచ్చు. అల్లాహ్‌కు భయపడండి, ఆలకించండి, అవిధేయత చూపే వారిని అల్లాహ్ తన మార్గదర్శకత్వానికి దూరం చేస్తాడు.” *(అల్ మాయిదా : 106-108)*

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) తెలిపారు : బనీ సహ్మ్ తెగకు చెందిన ఒక మనిషి తమీమ్ దారీ, అదీ బిన్ బద్దా అనే ఇద్దరు వ్యక్తులతో కలసి ప్రయాణానికి బయలుదేరాడు. అతను ముస్లింలెవరూ లేని దేశంలో మరణించాడు. ఆ ఇద్దరు వ్యక్తులు మృతుడు వదలి పోయిన వస్తు సామగ్రిని తీసుకుని మదీనాకు తిరిగి వచ్చారు. అతని వస్తు సామగ్రిలో వెండి గ్లాసు ఒకటి లేదు. ఆ గ్లాసుపై ఖర్జూరపు ఆకులను పోలిన బంగారు నగిషీ ఉంది. దైవప్రవక్త(స) ఆ ఇద్దరు వ్యక్తులకు ప్రమాణం చేసి చెప్పమని ఆదేశించారు (వారు ప్రమాణం చేశారు). తరువాత ఆ గ్లాసు మక్కాలో (ఒక వర్తకుని వద్ద) లభ్యమయింది. తాను ఆ గ్లాసును తమీమ్, అదీల నుండి కొన్నానని ఆ వర్తకుడు చెప్పాడు. ఆ సమయంలో మృతుని సమీప బంధువులు ఇద్దరు (అమ్ర్ బిన్ ఆస్, ముత్తలిబ్) నిలబడి, ‘ఇది మా సాక్ష్యం, మా సాక్ష్యం తమీమ్, అదీల సాక్ష్యం కన్నా ప్రామాణికమైనది. ఈ గ్లాసు మృతుని ఆస్తి’ అని ఒట్టేసి చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయత్ *(అల్ మాయిదా- 106)* అవతరించిందని అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) చెప్పారు.

## అధ్యాయం : 36

## మృతుని వారసులు హాజరు కాలేకపోయినా సరే వీలునామా పొందిన వ్యక్తి మృతుని రుణాన్ని చెల్లించగలడు

**131)** మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు: తన తండ్రి (అబ్దుల్లాహ్– రజి) ఉహుద్ యుద్ధంలో అమరగతి నొందారు. ఆయన తన వెనుక ఆరుగురు ఆడపిల్లలను వదలిపోయారు. దానికితోడు అప్పులు కూడా ఉన్నాయి. ఖర్జూరపు పంట కోతకు వచ్చినప్పుడు నేను ప్రవక్త మహనీయుల(సఅసం) దగ్గరకు వెళ్ళి, 'అయ్యా దైవప్రవక్తా! నా తండ్రి ఉహుద్ సంగ్రామంలో వీర మరణాన్ని ఆస్వాదించారన్న సంగతి మీకు తెలిసిందే. ఆయన తన వెనుక చాలా అప్పులు కూడా వదలిపోయారు. రుణదాతలు గనక మిమ్మల్ని చూస్తే నా రుణభారాన్ని ఎంతో కొంత తగ్గిస్తారన్న ఆశ నాకుంది' అని విన్నవించుకున్నాను. కాని రుణ దాతలైన యూదులు ఎంతకీ ఒప్పుకోలేదు. అందువల్ల "వెళ్ళు. వెళ్ళి అన్నిరకాల ఖర్జూరాలను వేర్వేరు కుప్పలుగా ఉంచు" అని ఆదేశించారు దైవప్రవక్త(స). ఆ విధంగా ఖర్జూరపండ్లను వేరుపరచిన తరువాత నేను దైవప్రవక్త(స)కు కబురంపాను. దైవప్రవక్త(స) నా పని తీరును పరిశీలించిన మీదట, అన్నిటికన్నా పెద్ద రాశి చుట్టూ మూడుసార్లు కలియ తిరిగి, అక్కడే కూర్చున్నారు. "నీ రుణదాతలను పిలుచుకో" అని ఆజ్ఞాపించారు. ఆ తర్వాత ఖర్జూర పండ్లను కొలిచి ఇవ్వటం మొదలెట్టారు. అల్లాహ్ నా తండ్రి అప్పులన్నీ తీర్చేశాడు. అల్లాహ్ సాక్షిగా (చెబుతున్నాను). నా తండ్రి చేసిన అప్పులన్నీ తీరిపోతే చాలునని, నా చెల్లెళ్ళ కోసం ఒక్క ఖర్జూరపు పండును తీసుకెళ్ళకపోయినా ఫరవాలేదని భావించాను. కాని జరిగిందేమిటంటే, ఖర్జూరపు రాశులు అలాగే మిగిలి ఉన్నాయి. దైవప్రవక్త(స) కూర్చున్న రాశిలో నుండి అసలు ఒక్క ఖర్జూరపు పండు కూడా (కొలిచి) ఇవ్వలేదు.[1]

---

131–1. దైవప్రవక్త(స) తోటకు వచ్చి రుణదాతలతో మాట్లాడితే, రుణదాతలు కాస్త మృదువుగా వ్యవహరిస్తూ, కొంత రుణం మాఫీ చేస్తారని జాబిర్(రజి) ఆశించారు. అందుకే ఒకసారి తోటకు రమ్మని దైవప్రవక్త(స)ను ఆహ్వానించారు. దైవప్రవక్త(స) వచ్చి, వారితో మాట్లాడారు కూడా. కాని ఆ రుణదాతలు పట్టు వీడలేదు. దైవప్రవక్త(స) ఎలాగూ వచ్చారు కాబట్టి, జాబిర్(రజి) రుణం తీరకపోతే, ఆ తీర్చే బాధ్యతను దైవప్రవక్త(స)

స్వీకరిస్తారని రుణదాతలు తలపోశారు. అయితే అక్కడ జరిగింది వేరు. దైవప్రవక్త(స) దుఆ చేశారు. తత్ఫలితంగా జాబిర్(రజి) తోట పండ్లలో సమృద్ధి జరిగింది. ఇది ప్రవక్త మహనీయుల(సఅసం) వారి మహిమలలో ఒకటి.

ఈ హదీసు ఇంతకుముందు అనేకసార్లు వచ్చింది. ఇమామ్ బుఖారీ(రహ్మ) మళ్ళీ ఇక్కడ దీనిని పునరావృతం చేయటంలోని ఉద్దేశం, 'అధ్యాయం'లోని మతలబును సోదాహరణగా విశదీకరించటమే. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తన తండ్రి నుండి వసీయతును పొందినవారు. తండ్రి చేసిన అప్పుల్ని తీర్చవలసిన బాధ్యత ఆయనపై ఉంది. ఆ బాధ్యతను ఆయన నెరవేర్చారు. ఆయనకు చెల్లెళ్ళు ఉన్నారు. (కాని వారు తోటకు రాలేదు)

ఇకపోతే, రుణదాతలు దైవప్రవక్త(స) సలహాను శిరసావహించి ఉంటే, వారికి మేలు జరిగేది. కాని వారు ప్రవక్త(స) సలహాను అంగీకరించకుండా తమ స్వయానికి నష్టం చేకూర్చుకున్నారు.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 5. సమర ప్రకరణం

## అధ్యాయం : 1

## జిహాద్ మహత్త్యం, మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) స్థితిగతులు

అల్లాహ్ సెలవిచ్చాడు: **"యథార్థం ఏమిటంటే, విశ్వాసుల నుండి అల్లాహ్ వారి ప్రాణాలనూ, వారి సంపదలనూ స్వర్గానికి బదులుగా కొన్నాడు. వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు, చంపుతారు, చస్తారు. తౌరాతులో, ఇంజీలులో, ఖురానులో వారికి అల్లాహ్ చేసిన (స్వర్గం యొక్క) వాగ్దానం సత్యమైనది. తన వాగ్దానాన్ని నెరవేర్చటంలో అల్లాహ్‌ను మించినవాడెవడు? కనుక సంబరపడండి, మీరు దేవునితో చేసిన ఈ వర్తకానికి; ఇదే అన్నిటికంటే మహత్తరమైన సాఫల్యం.**[1]

***(అత్ తౌబా- 111)***

**"అల్లాహ్ వైపునకు మాటిమాటికీ మరలేవారూ, ఆయనను ఆరాధించే వారూ, ఆయనను స్తుతించేవారూ, ఆయన కొరకు భూమి మీద సంచారం చేసే వారూ, ఆయన సన్నిధిలో రుకూలూ, సజ్దాలూ చేసేవారు, మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ, చెడు చెయ్యవద్దు అని నిరోధించేవారూ, అల్లాహ్ విధించిన హద్దులను కాపాడేవారూ (ఇటువంటి గుణవిశేషాలు కల విశ్వాసులు అల్లాహ్‌తో ఇటువంటి వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంటారు) ప్రవక్తా! ఇటువంటి విశ్వాసులకు శుభవార్త అందజెయ్యి."** ***(అత్ తౌబా- 112)***

**"అల్లాహ్ హద్దులను కాపాడటమంటే ఆయన ఆజ్ఞలను శిరసావహించటం" అని ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు.**

---

1-1. ఇంజీలు గ్రంథంలో జిహాద్ చేయమన్న ఆజ్ఞ లేదు గాని, ఇంజీలులో తౌరాతు సత్యమైన

**132) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు : 'దైవప్రవక్తా! ధార్మిక కార్యకలాపాలలోకెల్లా శ్రేష్ఠమైనదేది?' అని నేను ప్రవక్త మహనీయుల (సఅసం)ను అడగ్గా, "వేళకు నమాజ్ చేయటం" అని ఆయన(స) చెప్పారు. 'ఆ తర్వాత ఏది?' అని నేను అడిగితే, "తల్లిదండ్రుల యెడల సద్వ్యవహారం చేయటం" అని ఆయన(స) బదులిచ్చారు. 'ఆ తర్వాత ఏది?' అని నేను ప్రశ్నిస్తే "దైవమార్గంలో సమరం చేయడం" అని ఆయన(స) సమాధానమిచ్చారు. ఆ తర్వాత నేను ఆయన (స)కు ఎక్కువ ప్రశ్నలు వేయలేదు. వేస్తే ఆయన(స) ఇలాగే జవాబులు ఇచ్చేవారు.**

**133) మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలియజేశారు: "మక్కా విజయం తరువాత ఇక ఇప్పుడు హిజ్రత్ (విధిగా) లేదు. అయితే దైవమార్గంలో సమరం చేయటం, సత్సంకల్పం చేసుకోవటం ఇప్పటికీ మిగిలి ఉంది. మిమ్మల్ని జిహాద్ కొరకు పిలుపు ఇచ్చినప్పుడు, వెంటనే బయలుదేరండి."[1]**

---

గ్రంథం అన్న విషయం ఉంది. కాబట్టి తౌరాతులోని ఆజ్ఞలన్నీ ఇంజీలులో ఉన్నట్లే. **'వల్ హాఫిజూన లిహుదూదిల్లాహ్'** అనే వాక్యం కూడా ఆయత్(112)లో రావటం గమనార్హ విషయం. దీనికి సంబంధించి ఇబ్నెఅబ్బాస్(రజి) వ్యాఖ్యానాన్ని ఇమామ్ బుఖారీ (రహ్మ) నకలు చేశారు. దీనిని ఇబ్నె అబీ హాతిమ్ తన తఫ్సీర్‌లో వెలికి తీశారు. ఈ ఆయత్ అవతరణ నేపథ్యం ఇది: 'అఖబా ప్రతిజ్ఞ' జరిగిన రాత్రి అన్సార్ల విధేయతా ప్రమాణం (బైఅత్) పూర్వ రంగంలో ఈ ఆయత్ అవతరించినప్పటికీ ప్రళయం వరకూ ఇది సర్వ సామాన్యంగా అందరికీ వర్తిస్తుంది. ఈ ప్రతిజ్ఞ సందర్భంగా, 'దైవప్రవక్తా! మీరు మీ ప్రభువు కోసం, మీ స్వయం కోసం మా చేత ఏ ప్రమాణం చేయించుకుంటారో చేయించుకోండి' అని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) చెప్పగా, "నేను అల్లాహ్ కొరకు ప్రమాణ స్వీకారం చేయిస్తాను– మీరు కేవలం ఆయన్నే ఆరాధించాలి. ఆయనకు భాగస్వాములను కల్పించరాదు. ఇక నా విషయానికి వస్తే మీ లాభనష్టాల్లో నన్ను భాగస్వామిగా చేర్చుకోండి." అని దైవప్రవక్త(స) సమాధానమిచ్చారు. 'దీనికిగాను మాకు లభించే ప్రతిఫలం ఏమిటి?' అని వారు అడగ్గా, "స్వర్గం లభిస్తుంది" అని ఆయన(స) చెప్పారు. 'అలాగైతే ఇది లాభసాటి వర్తకమే' అని అన్సార్లు పలికారు (ఫత్హుల్ బారీ)

133–1. మక్కా విజయం తర్వాత అరేబియా అంతా 'దారుల్ ఇస్లాం'గా మారిపోయింది. అందువల్ల అక్కడి నుండి మదీనాకు వలసపోవలసిన ఆవశ్యకత లేదు. అంతమాత్రాన హిజ్రత్ పరంపర పూర్తిగా పరిసమాప్తం అయిందని అనటం కూడా సరైనది కాదు. చెడు వ్యవస్థ నుండి సత్యప్రధానమైన వ్యవస్థ వైపునకు ప్రస్థానం(హిజ్రత్) చేయవలసిన అవసరం ప్రపంచంలో ఎప్పుడయినా, ఎక్కడయినా ఏర్పడవచ్చు.

**134) విశ్వాసుల మాత హ్రజత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖనం: 'దైవప్రవక్తా! మేలైన ఆచరణలలో జిహాద్ ఒకటని మేము భావిస్తున్నాము.[1] మరలాంటప్పుడు (స్త్రీలమైన) మేము ఎందుకు జిహాద్ చేయకూడదు?' అని నేను అడగ్గా, "అన్నింటి కన్నా శ్రేష్టమైన జిహాద్ పాపకార్యం ఏమాత్రం జరగని హజ్జె మబ్రూర్ (స్వీకృతి పొందిన హజ్జ్)" అని ఆయన(సఅసం) చెప్పారు.**

**135) మహనీయ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు: ఒక వ్యక్తి (పేరు తెలియలేదు) మహాప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చి, 'పుణ్యఫలంలో జిహాద్‌కు సమానమైన ఆచరణ ఏదైనాఉంటే నాకు చెప్పండి' అని విన్నవించుకున్నారు. దానికి ఆయన(స), "నాకు తెలిసినంతవరకు అలాంటి ఆచరణ ఏదీ కనిపించటం లేదు" అన్నారు. తరువాత ఆయన(స)ఇలా ఉద్బోధించారు : "యోధుడు దైవమార్గంలో (పోరాటానికి) బయలుదేరినప్పుడు నీవు మస్జిద్‌కు వెళ్ళి, నిరాఘాటంగా నమాజ్ చేస్తూ ఉండాలి. మధ్యలో ఎలాంటి బద్ధకం వహించకూడదు. అలాగే నీవు ఉపవాసాలు ఎడతెగకుండా పాటించాలి. మధ్యలో ఒక్కరోజు కూడా నాగా చేయకూడదు. నీవు అలా చేయగలవా?"[1] దానికి ఆ వ్యక్తి, 'ఇది ఎవరి వల్లనయినా ఎలా సాధ్యం?' అన్నాడు.**

**అబూ హురైరా(రజి) ఇలా అంటున్నారు : ముజాహిద్(యోధుని) గుర్రం త్రాడుతో కట్టివేయబడినప్పుడు, అది నేలపై కాలుతో కొట్టినా, దానికి కూడా అతని ఖాతాలో సత్కార్యాలు లిఖించబడతాయి.**

---

ఇక జిహాద్ విషయానికి వస్తే, అది ప్రళయం వరకు విధిగా ఉంటుంది. వేరొక హదీసులో దైవప్రవక్త(స) ఇలా వక్కాణించారు : "అల్లాహ్ నన్ను పంపినప్పటి నుండీ ప్రళయం వరకూ జిహాద్ జరుగుతూ ఉంటుంది. కడకు ఆఖరిలో నా అనుచర సమాజం దజ్జాల్‌ను ఎదుర్కొంటుంది." జిహాద్ ఇస్లాం యొక్క ఒక అతి ముఖ్యమైన స్తంభం. ఇది ఫర్జె కిఫాయ. ఏదేని ఒక ప్రదేశంలో ముస్లింలు సత్య తిరస్కారుల చేత నిరంతరం పీడించబడుతున్నప్పుడు, ఆ పీడనను నిరోధించడానికి సతత సమరం సాగించవలసిన విధ్యుక్త ధర్మం వారికి దగ్గరలో ఉన్న ముస్లింలది. ఒకవేళ అవిశ్వాసులు, సత్య తిరస్కారులు ముస్లిం రాజ్యంపై దండెత్తి వస్తే, అప్పుడు ప్రతి ముస్లింపై జిహాద్ 'విధి' అయిపోతుంది. కడకు వృద్ధులు, స్త్రీలు, బాలలపై కూడా అది విధితమైపోతుంది.

134–1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. హ్రజత్ ఆయిషా(ర.అ) దైవమార్గంలో పోరాటాన్ని మేల్తరమైన ఆచరణగా పేర్కొన్నారు. దీనిని దైవప్రవక్త(స) కాదనలేదు.

135–1. ఆయన(స) పలుకుల్లోని అంతరార్థం ఏమిటంటే, యోధుడు దైవమార్గంలో

## అధ్యాయం : 2

## దైవమార్గంలో తన ధన ప్రాణాలతో పోరాడేవాడే జనులందరిలోకెల్లా గొప్పవాడు

అల్లాహ్ (సూరయె సఫ్‌లో) ఈ విధంగా సెలవిచ్చాడు: **"విశ్వసించిన ప్రజలారా! మిమ్మల్ని వ్యధాభరితమైన శిక్ష నుండి రక్షించే వ్యాపారమేమిటో నేను మీకు తెలుపనా? విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను. పోరాడండి అల్లాహ్ మార్గంలో మీ సంపదలను, మీ ప్రాణాలను ధారపోసి. మీరు గనక గ్రహిస్తే, ఇదే మీకు మేలైనది. అప్పుడు అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు, మిమ్మల్ని సెలయేళ్ళ ప్రవహించే వనాలలో ప్రవేశింపజేస్తాడు. అంతేకాదు శాశ్వతమైన[1] ఆ స్వర్గవనాలలో మీకు ఎంతో అందమైన గృహాలను ప్రసాదిస్తాడు. ఇదే గొప్ప సాఫల్యం."**

***(అస్ సఫ్: 10-12)***

**136) హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖించారు : 'దైవప్రవక్తా! జనులందరిలోకెల్లా ఉత్తముడెవడు?' అని ప్రజలు ప్రశ్నించగా "దైవమార్గంలో తన ప్రాణంతో, ధనంతో పోరాడేవాడు"[1] అని దైవప్రవక్త(సఅసం) సమాధానమిచ్చారు. 'ఆ తరువాత ఎవడు?' అని ప్రియ సహచరులు ప్రశ్నించగా, "ఏ కొండలోనో**

---

బయలుదేరినప్పుడు అతను నిద్రించటం, కూర్చోవటం, నడవటం, గుర్రానికి దానా వేయటం, నీరు త్రాపటం- మొదలగు పనులన్నీ ఇబాదత్ (ఆరాధన)గానే పరిగణించబడతాయి. అలాంటప్పుడు జిహాద్‌కు సమానమైన ఆరాధన మరేది కాగలదు? కాకపోతే ఏ వ్యక్తి అయినా ఎడతెగకుండా నమాజ్, ఉపవాసం వంటి ఆరాధనలలో నిమగ్నుడై ఉంటే బహుశా అతను యోధునితో సమానం కాగలడు. కాని ఇది సాధ్యమైన పని కాదు. వేరొక హదీసులో దైవనామస్మరణ జిహాద్ కన్నా మేలైనదని ఉంది. కష్టకాలంలో చేసిన ఆరాధనకు మించిన సత్కార్యం మరొకటి లేదని మరొక హదీసులో ఉంది. అంతమాత్రాన ఈ హదీసులలో వ్యాఘాతం ఏమీ లేదు. సమయం సందర్భాన్ని బట్టి ఒక్కో ఆచరణ మరొక ఆచరణపై ప్రాధాన్యత కలిగి ఉంటుంది. ఉదాహరణకు - అవిశ్వాసుల అత్యాచారాలు పెచ్చరిల్లినప్పుడు జిహాద్ చేయటం ఎంతో అవసరం. సాధారణ పరిస్థితుల్లో దైవనామస్మరణ (జిక్రె ఇలాహి) అన్నిటికన్నా ముఖ్యమైన ఆరాధన.

136-1. నిజానికి ఇలాంటి ముస్లిం ఇతర ముస్లింలందరికన్నా ఉత్తముడు. ఎందుకంటే ప్రాణం, ధనం మనిషికి ప్రపంచంలో అన్నిటికన్నా ప్రీతికరమైనవి. కాబట్టి అలాంటి వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టేవాడు అందరికన్నా గొప్పవాడు. ఈ విషయం నుండి

**(కోనలోనో) బ్రతకటానికి అలవాటుపడి దైవభీతి కలిగి ఉండేవాడు, జనులను వదిలిపెట్టి తన వల్ల జరిగే కీడునుండి వారిని సురక్షితంగా ఉంచేవాడు"[2] అని ఆయన(సఅసం) బదులిచ్చారు.**

**137) ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు: ప్రవక్త (స) ఇలా ప్రవచించారు- "అల్లాహ్ మార్గంలో సమరం సాగించేవాని ఉపమానం - దైవమార్గంలో (చిత్తశుద్ధితో, కేవలం దైవప్రసన్నత నిమిత్తం) పోరాడే వారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు[1] - రాత్రంతా నమాజ్ చేస్తూ, పగలంతా నిరంతరం ఉపవాసాలు పాటించే వ్యక్తిలాంటిది. తన మార్గంలో జిహాద్ చేసేవాని బాధ్యతను అల్లాహ్ తీసుకున్నాడు. అతను గనక వీర మరణాన్ని ఆస్వాదిస్తే లెక్కలేకుండానే అతనికి స్వర్గ ప్రవేశం కల్పిస్తాడు లేదా అతనిని పుణ్యఫలం, యుద్ధప్రాప్తితోపాటు సురక్షితంగా (ఇంటికి) తిరిగి పంపిస్తాడు."**

---

పండితులకు, యోధులకు, సిద్దీఖులకు మాత్రం మినహాయింపు ఉందని కొందరంటారు. కాని నేనేమంటానంటే సత్యధర్మ వ్యతిరేకులకు, నాస్తికులకు ప్రతిగా వాదించటం, దైవధర్మంపై వారు లేవనెత్తే ఆక్షేపణలకు సమాధానాలివ్వటం, అలాంటి పుస్తకాలను ముద్రించటం కూడా దైవమార్గంలో సతత సమరమే.

136-2. మనిషి జన సమూహంలో ఉన్నప్పుడు ఒకరిని పరోక్షంగా నిందించటం, ఒకరి చాడీలు వినటం, ఒకరిని కోపగించుకోటం, ఒకరిని బాధించటం వంటివి చేస్తాడు. అలాంటి వ్యక్తి ఏకాంత కుహరంలో ఉంటే, అతని కీడునుండి జనులు సురక్షితంగా ఉండగలుగుతారు. ప్రజా సమూహంలో ఉండటంకన్నా ఒంటరిగా ఉండటం మంచిదనుకునేవారు ఈ హదీసును 'ప్రమాణం'గా తీసుకున్నారు. అయితే అత్యధిక మంది విద్వాంసులు జన సమూహం మధ్యన ఉండటం మంచిదని అభిప్రాయపడ్డారు. ఏ వ్యక్తి ఉనికి వల్ల ప్రజా బాహుళ్యానికి ప్రాపంచిక, ధార్మిక ప్రయోజనాలు కలుగుతాయో అటువంటి వ్యక్తి ప్రజల మధ్యన జీవిస్తూ వారి వల్ల కలిగే బాధలపై ఓర్పు వహించగలిగితే అతని పాలిట ఈ సామూహికత వరం. మరెవడికి జన సమూహంలో ఉండటం వల్ల పాపాలు జరిగే ప్రమాదముందో, ఇంకెవరి సహచర్యం వల్ల ప్రజలకు హాని కలుగుతుందో అలాంటి వ్యక్తి ప్రజా జీవితాలకు అల్లంత దూరాన ఉండటమే మేలు.

137-1. అంటే చిత్తశుద్ధితో పోరాడేదెవరో, స్వార్థబుద్ధితో పోరాడేదెవరో అల్లాహ్‌కే తెలుసు. అతనిలో చిత్తశుద్ధి ఉంటే సిసలైన యోధుడుగా పరిగణించబడతాడు. పదవి కోసం, పలుకుబడి కోసం, డబ్బు కోసం పోరాడినట్లయితే, ఆ వ్యక్తి దైవమార్గంలో పోరాడిన యోధుడు కాలేదు.

## అధ్యాయం : 3

## జిహాద్ కొరకు, అమరగతి కొరకు స్త్రీ పురుషులు ప్రార్థించటం

**"ఓ అల్లాహ్! నాకు నీ ప్రవక్త నగరి (మదీనా తయ్యిబా)లో వీర మరణాన్ని ప్రసాదించు" అని మహనీయ ఉమర్(రజి) వేడుకున్నారు.[1]**

**138) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసం) అప్పుడప్పుడూ ఉమ్మె హరామ్(ర.అ) ఇంటికి వెళుతూ ఉండేవారు (ఈమె అనస్-రజి- పినతల్లి. ఉబాదా బిన్ సామిత్ సతీమణి). ఒకరోజు ప్రవక్త మహనీయులు(స) ఆమె ఇంటికి వెళ్ళినప్పుడు, ఆయన (స)కు భోజనం వడ్డించారు. ఆయన(స) తలలోని పేలు తీయసాగారు. ఈలోగా ఆయన(స)కు నిద్రపట్టేసింది. మెలకువ వచ్చినప్పుడు ఆయన(స) చిరునవ్వు చిందిస్తూ ఉన్నారు. 'యా రసూలల్లాహ్! ఏ విషయంపై తమరు చిరు మందహాసం చేస్తున్నార'ని ఆమె(ఉమ్మె హరామ్) అడిగితే, ఆయన(స) ఇలా చెప్పారు: "నా అనుచర సమాజానికి చెందిన కొంతమంది నా ముందు ప్రత్యక్షపరచబడ్డారు. వారు దైవమార్గంలో యుద్ధం చేయడానికి నడి సముద్రంలో స్వారీ అయి వెళుతున్నారు, రాజులు సింహాసనంపై స్వారీ అయినట్లుగా! లేదా పయనించే పీఠంపై రాజులు ఆసీనులైనట్లుగా!' ఉల్లేఖకుడు ఇస్హాఖ్ ఇక్కడ సందిగ్ధంలో పడ్డారు. 'దైవప్రవక్తా! నన్ను కూడా వారిలో చేర్చమని తమరు ప్రార్థించండి' అని ఆమె విన్నవించుకోగా, ఆయన(స) ఆమె కొరకు ప్రార్థించారు. తరువాత ఆయన(స) తన తలను వాల్చి నిద్రపోయారు. ఈసారి కూడా ఆయన(స)కు మెలకువ వచ్చినప్పుడు చిరునవ్వు నవ్వుతూ కనిపించారు. 'దైవప్రవక్తా! మీ నవ్వుకు కారణమేమిటి?' అని ఆమె అడిగితే, "నా అనుచర సముదాయానికి చెందిన కొంతమంది, నా ముందు హాజరుపరచబడినప్పుడు వారు దైవమార్గంలో సమరోత్సాహంతో వెళుతున్నారు..' మొదటిసారి మాదిరిగానే ఈసారి కూడా వివరించారు. 'దైవప్రవక్తా! నన్ను కూడా వారిలో చేర్చమని తమరు అల్లాహ్‌ను ప్రార్థించండి' అని ఆమె విజ్ఞప్తి చేశారు. దానికి ఆయన(స), "నువ్వు అందరికన్నా ముందే ఆ సైన్యంలో చేరతావు" అని చెప్పారు. అలాగే హజ్రత్ ముఆవియా(రజి) కాలంలో ఉమ్మె హరామ్(ర.అ) సముద్ర ప్రయాణం చేశారు.**

---

3-1. మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) గారి ఈ దుఆ దైవసన్నిధిలో ఆమోదించబడింది. ఆయన మదీనా నగరంలోనే అబూ లూలూ మజూసీచే వధించబడ్డారు.

**తీరం దాటగానే ఆమె వాహనం ఆమెను క్రింద పడవేసింది. ఆ ప్రమాదంలోనే ఆమె ప్రాణం విడిచారు.[1]**

## అధ్యాయం : 4

## దైవమార్గంలో పోరాడే యోధుల అంతస్తులు

**అరబీలో 'సబీల్' (మార్గం) అనే పదం పుంలింగం, స్త్రీలింగం - రెండు విధాలుగా కూడా ప్రయోగించబడుతుంది.[1] ఇమామ్ బుఖారీ (రహ్మ) ఏమంటారంటే 'గుజ్జన్' అనే పదం 'గాజీ'కి బహువచనం. 'హుమ్ దరజాత్' అంటే 'లహుమ్ దరజాత్' అని అర్థం.**

---

138–1. ఆ సమయంలో ముఆవియా (రజి) ఈజిప్టు గవర్నర్‌గా ఉన్నారు. అది ఉస్మాన్(రజి) ఖిలాఫత్ కాలం. రోముపై దండయాత్ర చేసేందుకు ముఆవియా (రజి) అనుమతి కోరారు. అనుమతి లభించగానే ప్రప్రథమంగా ముస్లింల అతి పెద్ద నౌకాదళం సిద్ధం చేయబడింది. అది రోమనులకు వ్యతిరేకంగా యుద్ధం చేసింది. ఉమ్మె హరామ్(ర.అ) కూడా ఆ యుద్ధానికి తన భర్తతో కలిసి వెళ్ళింది. ఆ విధంగా ఆమె మహాప్రవక్త(స) భవిష్యవాణిననుసరించి ముస్లింల మొట్టమొదటి నౌకాదళ పోరాటంలో పాల్గొని అమరగతి నొందింది– రజిఅల్లాహు అన్హా. ముస్లింలు యుద్ధం నుండి తిరిగివస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఉమ్మె హరామ్(ర.అ) ప్రత్యక్షంగా యుద్ధం చేయలేదు గాని, ఆమె దైవమార్గంలో బయలుదేరారు. ఖుర్ఆన్ హదీసు మూలాల ద్వారా విదితమయ్యేదేమిటంటే, ఎవరయినా దైవమార్గంలో పోరాడేందుకు వెళ్ళినప్పుడు మార్గమధ్యంలో మృత్యువు కబళించినా సరే వారూ అమరగతులే. మొత్తానికి ఉమ్మె హరామ్(ర.అ)కు వీర మరణం వరించింది. దైవప్రవక్త(స) ఆమె కొరకు చేసిన 'దుఆ' ఆమోదించబడింది.

ఉమ్మె హరామ్(ర.అ) దైవప్రవక్త(స)కు పాలవరుస పిన తల్లి అవుతారు. అందువల్ల ఆయన(స) ఆమె ఇంటికి అప్పుడప్పుడూ వస్తూ ఉండేవారు. ఆమె కూడా ఆయన(స)పై తల్లికన్నా ఎక్కువగా మమతానురాగాలను కురిపించేది. ఈ ఉల్లేఖనం ద్వారా స్త్రీలు జిహాద్‌లో పాల్గొన్నట్లు రూఢీ అవుతోంది. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ చెప్పదలచిన ముఖ్యవిషయం ఏమంటే, "నన్ను యోధుల్లో చేర్చు. నాకు వీర మరణం వొసగు" అని పురుషుడు ప్రార్థించినట్లే స్త్రీ కూడా వేడుకోగలదు. దైవప్రవక్త(స) కాలంలో, ఖులఫాయె రాషిదీన్‌ల కాలంలో కూడా మహిళలు జిహాద్‌లో పాల్గొనే పురుషుల వెంట వచ్చారు. పురుషులకు అన్న పానీయాలు సరఫరా చేయటం, క్షతగాత్రులకు కట్లు కట్టడం వంటి సేవలు అందించారు.

4–1. హదీసులో ***ఫీ సబీలిల్లాహ్*** అనే పదం రావటం వల్ల ఇమామ్ బుఖారీ (రహ్మ) 'సబీల్'ని విడమరిచి చెప్పారు. అంటే ఇది పుంలింగానికి, స్త్రీ లింగానికి కూడా వర్తిస్తుందని

**139)** హజ్రత్ అబూ హురైరా (రజి)ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరయితే అల్లాహ్‌ను, ఆయన సందేశహరుణ్ణి విశ్వసిస్తాడో, నమాజును స్థాపిస్తాడో, రమజాన్ ఉపవాసాలు ఉంటాడో అతనికి అల్లాహ్‌పై ఏర్పడే హక్కు ఏమిటంటే, ఆయన అతనికి స్వర్గంలో ప్రవేశం కల్పించాలి– అతడు దైవమార్గంలో పోరాడినా లేదా తాను పుట్టినచోటే పడివున్నా (స్వర్గం మాత్రం నిశ్చయం)". 'దైవప్రవక్తా! మరి మేము ఈ శుభవార్త ప్రజలకు వినిపించవచ్చా?' అని ప్రియ సహచరులు ప్రశ్నించగా, ఆయన(స) ఇలా అన్నారు: "స్వర్గంలో వంద అంతస్తులున్నాయి. అల్లాహ్, తన మార్గంలో సమరం చేసేవారి కోసం వాటిని సిద్ధపరచి ఉంచాడు. వాటిలో ప్రతి రెండు అంతస్తులకు మధ్యన నింగికీ– నేలకు మధ్య ఉన్నంత అంతరం ఉంటుంది. కనుక అల్లాహ్‌ను అర్థించేటప్పుడు 'జన్నతుల్ ఫిర్దౌస్'ను వొసగమని అర్థించండి. ఎందుకంటే అది స్వర్గంలోని నడిబొడ్డున ఉండే భాగం. ఇంకా అది స్వర్గంలోని అత్యున్నత శ్రేణికి చెందినది." "దానిపైన దైవ సింహాసనం ఉంటుందని, అక్కడినుండే స్వర్గ కాలువలు వెలువడతాయి" అని కూడా చెప్పినట్లు నేను భావిస్తున్నానని ఉల్లేఖకులు యహ్యా బిన్ సాలెహ్ చెప్పారు. ముహమ్మద్ బిన్ ఫులైహ్ తన తండ్రి నుండి ఉటంకించిన దానిలో, "దానిపైన కరుణామయుని సింహాసనం ఉంటుంది" అని ఉంది.[1]

**140)** సమురా బిన్ జున్దబ్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా చెప్పారు: "నేను రాత్రి నా దగ్గరకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను చూశాను. తరువాత వారు నన్ను తీసుకుని ఒక చెట్టెక్కారు. పిదప

---

తెలిపారు. ఉదాహరణకు – 'హాజిహీ సబీల్', 'హాజా సబీల్' అలాగే 'హుమ్‌దరజాత్' అంటే 'లహుమ్ దరజాత్' అని అర్థం. అంటే వారికి (గొప్ప) అంతస్తులుంటాయి.

139–1 దీని భావం ఏమిటంటే, ఎవరికయినా దైవమార్గంలో పోరాడే అదృష్టం దక్కకపోయినప్పటికీ, ఇతర విధుల్ని సక్రమంగా నిర్వర్తిస్తూ అదే స్థితిలో అతను చనిపోయినాసరే పరలోకంలో అతనికి స్వర్గం లభిస్తుంది. కాకపోతే 'ముజాహిదీన్'కు లభించే అంతస్తు మాత్రం లభించదు. ఇకపోతే ముహమ్మద్ బిన్ ఫులైహ్ ఉల్లేఖించిన అదనపు వాక్యంలో కూడా సందేహానికి తావులేదు. ఉదాహరణకు– యహ్యా బిన్ సులైమాన్ ఉల్లేఖనంలో "అక్కడి నుంచే స్వర్గ కాలువలు వెలువడతాయి" అనే వాక్యం. అంటే నీటి కాలువలు, పాల కాలువలు, తేనె కాలువలు, మద్యం కాలువలు. ఖుర్‌ఆన్‌లో కూడా ఈ నాలుగు కాలువల ప్రస్తావన ఉంది.

నన్ను ఎంతో అందమైన, పరిశుద్ధమైన ఇంట్లోకి తీసుకెళ్ళారు. అంత అందమైన నివాస గృహాన్ని నేను ఎన్నడూ చూడలేదు. 'ఈ ఇల్లు అమరగతులది' అని వారు చెప్పారు."[1]

## అధ్యాయం : 5

## దైవమార్గంలో ఉదయం సాయంత్రం నడవటం, స్వర్గంలో ఒక ధనుస్సుకు సమానమైన స్థలానికి గల మహత్తు

**141)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు : "అల్లాహ్ మార్గంలో గడిచే ఒక ఉదయం లేక సాయంత్రం ఈ ప్రపంచంకన్నా, అందులో ఉండే వాటన్నింటికన్నా మేలైనది."

**142)** హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు ఇలా ప్రవచించారు: "స్వర్గంలోని ఒక ధనుస్సుకు (పొడవుకు) సమానమైన స్థలం ప్రపంచంలో సూర్యుడు ఉదయించే అస్తమించే వస్తువులన్నింటికంటే మేలైనది." ఆయన (సఅసం) ఇంకా ఇలా అన్నారు: "అల్లాహ్ మార్గంలో ఒక ఉదయం లేదా ఒక సాయంత్రం నడవటం (ప్రపంచంలో) ఏ ఏ వస్తువులపై సూర్యుడు ఉదయించి అస్తమిస్తాడో వాటన్నింటికన్నా మేలైనది."

**143)** ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని హజ్రత్ సహ్ల్ బిన్ సాద్(రజి) ఉల్లేఖించారు: "అల్లాహ్ మార్గంలో గడిచే ఒక ఉదయం, సాయంత్రం ఈ ప్రపంచంకన్నా, ప్రపంచంలో ఉన్న వాటన్నింటికన్నా మేలైనవి." [1]

## అధ్యాయం :6

## పెద్ద కన్నులు కల స్వర్గ కన్యలు (హూర్), వారి లక్షణాలు

**144)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: "దేవుని ఏ దాసుడైనా చనిపోతే, అతను దేవుని వద్ద జమ

140-1. ఇంతకుముందు ఈ హదీసు 'కితాబుల్ జనాయిజ్'లో వివరంగా వచ్చింది. దైవ ప్రవక్త(స) వద్దకు వచ్చిన ఆ ఇద్దరు వ్యక్తులలో ఒకరు హజ్రత్ జిబ్రీల్ (అలైహిస్సలాం), రెండవ వారు హజ్రత్ మీకాయిల్ (అలైహిస్సలాం).

143-1. ఎందుకంటే ఈ ప్రపంచం క్షణభంగురం, ఇది నశించేది. పరలోకం ఎప్పటికీ మిగిలి ఉండేది. నశించే వస్తువు ఎంత మంచిదైనా మిగిలి ఉండే వస్తువుకు సమానం కాజాలదు.

**అయి ఉన్న తన సదాచరణలతో సంతృప్తి చెందుతాడు. అతనికి ఈ ప్రపంచమంతా లభించినా, ప్రపంచంలో ఉన్న సమస్తం ప్రాప్తమయినా ఈ ప్రపంచానికి తిరిగి రావటానికి ఇష్టపడడు- కాని అమరగతుడు అలా కాదు. అతడు (అల్లాహ్ వద్ద) తనకు లభించే అంతస్తును చూసుకుని మళ్ళీ ఈ ప్రపంచానికి వచ్చి, మళ్ళీ (దైవమార్గంలో) చంపబడాలని కోరుకుంటాడు." దైవప్రవక్త(స) చెప్పగా తాను విన్నానని అనస్(రజి) తెలిపినట్లు హుమైద్ ఉటంకించారు: "దైవమార్గంలో ఒక ఉదయం, ఒక సాయంత్రం గడపటం ఈ ప్రపంచంకన్నా, ప్రపంచంలో ఉన్న వాటన్నింటికన్నా మేలైనది. ఎవరికయినా స్వర్గంలో ఒక బారెడు స్థలం లభించినా లేదా ఒక కొరడా అంత స్థలం దొరికినా అది ఈ ప్రపంచం, ప్రపంచంలో ఉన్న సమస్తంకన్నా మేలైనది. ఒకవేళ స్వర్గంలోని స్త్రీ (హూర్) ఈ ప్రపంచం వైపు తొంగిచూసినా సరే ఈ భూమ్యాకాశాలు తమ వైశాల్యంతోపాటు జ్యోతిర్మయం అయిపోతాయి. సువాసనతో గుబాళిస్తాయి. ఆ స్వర్గ స్త్రీ తలపైని ముసుగు కూడా ఈ ప్రపంచం కన్నా, అందులో ఉన్న దాని కన్నా మేలైనది.** [1]

## అధ్యాయం : 7

## అమరగతి నొందాలన్న ఆకాంక్ష కలిగి ఉండటం

**145)** **ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా(రజి) చెప్పారు : ఆయన (సఅసం) ఇలా ప్రవచించారు – "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! నేను ముస్లిములను విడిచి జిహాద్ (ధర్మయుద్ధం) కొరకు వెళ్ళిపోయానన్న ఆవేదన వారి మనసులలో కలగకుండా ఉండే మాటైతే- వారందరినీ వాహనాలపై స్వారీ చేయించి నా**

---

144-1. కొంతమంది నాస్తికులు, ధర్మరాహిత్య భావాలు కలవారు స్వర్గకన్యల కాంతిపై, పరిమళంపై ఆక్షేపణ తెలిపారు. దీనికి సమాధానం ఏమిటంటే స్వర్గాన్ని ఈ ప్రపంచంతో పోల్చటంగానీ, అంచనా వేయటం గానీ సరైనది కాదు. స్వర్గలోక జీవితం ప్రాపంచిక జీవితం వంటిది కాదు. ఎన్నో వస్తువులను మనం ఇక్కడి ప్రపంచంలో చూడలేము. కాని పరలోకంలో చూడగలము. నరకంలోని ఒక చిన్న యాతనను కూడా ఇక్కడ మనిషి భరించలేడు. కాని పరలోకంలో అతనికి భరించే శక్తి ఇవ్వబడుతుంది. క్లుప్తంగా చెప్పవచ్చిందేమంటే పారలౌకిక విషయాలను ప్రాపంచిక విషయాలతో పోల్చేవాడు వివేచనకు నోచుకోలేదన్నమాటే.

వెంట తీసుకెళ్ళగలిగే వాహనాలు నా దగ్గర ఉండిఉంటే, నేను దైవమార్గంలో యుద్ధానికి వెళ్ళే అతి చిన్న సైనిక దళంతో పాటు కూడా వెళ్ళకుండా ఉండను. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆయన మీద ఒట్టు! నా ఆకాంక్ష ఒక్కటే- నేను అల్లాహ్ మార్గంలో వధించబడి మళ్ళీ బ్రతికించబడాలి. మళ్ళీ చంపబడి మళ్ళీ బ్రతికించబడాలి. మళ్ళీ చంపబడి మళ్ళీ బ్రతికించబడాలి. మళ్లీ చంపబడాలి.

**146)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) ఉపన్యసిస్తూ ఇలా అన్నారు: "సైనిక ధ్వజాన్ని ఇప్పుడు జైద్ తన చేతిలోకి తీసుకున్నాడు. అతను వీర మరణాన్ని ఆస్వాదించాడు. తరువాత ఆ పతాకాన్ని జాఫర్ తీసుకున్నాడు. అతను కూడా అమరగతి నొందాడు. ఆ తర్వాత అబ్దుల్లాహ్ బిన్ రవాహ ఆ ధ్వజాన్ని తీసుకున్నాడు. అతను కూడా వధించబడ్డాడు. ఆ తర్వాత తదుపరి ఉత్తర్వుల కోసం వేచి ఉండకుండా ఖాలిద్ బిన్ వలీద్ ఆ పతాకాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. అతని చేతుల మీదుగా ఇస్లామీయ సైన్యానికి విజయం లభించింది". ఆయన(స) ఇంకా ఇలా అన్నారు: "అమరగతి నొందినవారు ఒకవేళ మన మధ్యన బ్రతికి ఉన్నా మాకు అంతగా సంతోషం కలిగేది కాదు. ఎందుకంటే వారు (స్వర్గంలో) భోగవిలాసాలలో ఓలలాడేందుకు వెళ్ళిపోయారు." అయ్యూబ్ ప్రకారం ఆయన (స) ఇలా అన్నారు: "మన మధ్యన బ్రతికి ఉండటం వారికి అంతగా సంతోషకరం అయ్యేది కాదు." ఆ సమయంలో ప్రవక్త మహనీయుల (సఅసం) కళ్ళగుండా కన్నీటి ధార ప్రవహించింది.[1]

---

146-1. ఇంతకీ అసలేం జరిగిందంటే హిజ్రీ 8వ సంవత్సరంలో దైవప్రవక్త(స) మూతా యుద్ధం కొరకు ఒక సైనిక దళాన్ని పంపించారు. జైద్ బిన్ హారిసాను ఆ సైన్యానికి కమాండర్‌గా నియమించారు. ఒకవేళ ఆయన అమరగతి నొందితే జాఫర్‌ను సైన్యాధిపతిగా చేసుకోవాలని, ఆయన కూడా అమరగతి నొందితే అబ్దుల్లాహ్ బిన్ రవాహను సేనానిగా ఎన్నుకోవాలని సూచించారు. యాదృచ్ఛికంగా ఈ ముగ్గురు నాయకులు కూడా ఒకరి తరువాత ఒకరు వీర మరణాన్ని ఆస్వాదించారు. చివర్లో ఖాలిద్ బిన్ వలీద్ నాయకత్వ ధ్వజాన్ని చేబూని ముస్లింలు ధైర్యం కోల్పోకుండా తన వంతు పాత్రను పోషించారు. దైవప్రవక్త(స) ఖాలిద్‌కు ఎలాంటి సూచన ఇవ్వలేదు. అయినప్పటికీ ఆయన సమయోచితంగా తన బాధ్యతను నిర్వర్తించారు. ఆయన ద్వారా ముస్లిం సైన్యానికి విజయం లభించింది. దేవుని కరవాలాలలో ఖాలిద్ ఒక కరవాలమని దైవప్రవక్త(స) చెప్పినట్లు వేరొక ఉల్లేఖనంలో ఉంది.

## అధ్యాయం : 8

## ఒకవేళ ఎవరయినా దైవమార్గంలో వాహనం మీద నుండి క్రిందపడి మరణిస్తే అతను కూడా ఒక యోధుడుగానే పరిగణించబడతాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **"అల్లాహ్ వైపునకు, ఆయన ప్రవక్త వైపునకు వలసపోవటానికి తన గృహం నుండి బయలుదేరి మార్గమధ్యంలోనే మరణించిన వానికి విధిగా ప్రతిఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌దే."[1]** ***(అన్ నిసా: 100)***

**147) అనస్ బిన్ మాలిక్ పినతల్లి ఉమ్మె హరామ్ బిన్తె మిల్హాన్ (ర.అ) ఇలా వివరించారు : ఒక రోజు ప్రవక్త మహనీయులు(సఅసం) నా దగ్గరే నిద్రించారు. ఆయన(స)కు మెలకువ వచ్చినప్పుడు చిరునవ్వు చిందిస్తున్నారు. 'తమరి చిరు మందహాసానికి కారణం ఏమిటి?' అని నేను అడిగితే, "నా అనుచర సమాజానికి చెందిన కొంతమంది నా సమ్ముఖంలో హాజరుపరచబడ్డారు. వారు యుద్ధం చేయడానికి నీలి సముద్రంలో రాజులు రథమెక్కినట్లుగా స్వారీ అయి వెళ్తున్నారు" అని ఆయన(స) చెప్పారు. 'అల్లాహ్ నన్ను కూడా ఆ సేనావాహినిలో చేర్చమని తమరు అల్లాహ్‌ను ప్రార్థించండి' అని నేను విన్నవించుకున్నాను. ఆయన (స) మళ్ళీ నిద్రలోకి జారుకున్నారు. మొదటిసారి లాగే ఈసారి కూడా చేశారు (అంటే మేల్కొంటూ చిరునవ్వు నవ్వారు). ఉమ్మె హరామ్(ర.అ) మొదటిసారి వలెనే ఈసారి కూడా విన్నవించుకున్నారు. దానికి ఆయన(స) అదే జవాబిచ్చారు. 'నన్ను కూడా ఆ సమూహంలో చేర్చమని తమరు అల్లాహ్‌ను వేడుకోండి' అని ఉమ్మె హరామ్ (ర.అ) అభ్యర్థించారు. "నీవు అందరికన్నా ముందు వెళ్ళే పటాలంలో ఉంటావు" అని ప్రవక్త మహనీయులు(స) పలికారు. ఆమె తన భర్త ఉబాదా బిన్ సామిత్ (రజి)తో కలసి ముస్లింల మొట్టమొదటి నౌకాదళంలో వెళ్ళారు. ముఆవియా కాలంలో యుద్ధం నుండి తిరిగివస్తూ ఆ సైనికదళం సిరియా తీరం దాటింది. ఉమ్మె హరామ్ (ర.అ) స్వారీ అయ్యేందుకు ఒక వాహనాన్ని ఆమె దగ్గరకు తీసుకు**

---

8-1. జమురా అనే వ్యక్తి మక్కాలో ఉండిపోయాడు. "మీరు వలస పోవడానికి (హిజ్రత్ చేయడానికి) అల్లాహ్ భూమి విశాలంగా లేదా (4: 98) అనే ఆయత్ అవతరించినప్పుడు, అతడు దానిని విని వ్యాధిగ్రస్తుడై ఉన్న స్థితిలోనే మక్కా నుండి మదీనాకు బయలుదేరాడు. కాని మార్గమధ్యంలోనే అతను మరణించాడు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయత్ అవతరించింది.

రావటం జరిగింది. కాని ఆ జంతువు ఆమెను పడగొట్టడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణం విడిచారు.[1]

## అధ్యాయం : 9

## ఎవరికయినా దైవమార్గంలో బాధ కలిగితే...

**148)** మహనీయ అనస్(రజి) కథనం : మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బనూ సులైమ్ తెగకు చెందిన డెభ్భయి మంది (ఖుర్ఆన్ స్వరశాస్త్రంలో ప్రావీణ్యం ఉన్నవారి)ని బనూ ఆమిర్ తెగ వారి వైపునకు పంపారు.[1] వారంతా అక్కడకు (మవూనా బావి వద్దకు) చేరుకున్నప్పుడు నా మామయ్య గారైన హరామ్ బిన్ మిల్హాన్ (రజి), "ఆగండి, ముందుగా నేను వెళతాను. దైవప్రవక్త(స) ఉపదేశాలను వారికి వినిపించేందుకు. వారు గనక నాకు అభయమిస్తే సరి. అన్యథా మీరెలాగూ నాకు సమీపంలోనే ఉన్నారు కదా!" అన్నారు. అన్నట్లే ఆయన గారు ముందుకు వెళ్ళారు. వాళ్ళు ఆయనకు రక్షణ కల్పించారు. ఆయన ఆ తెగవారికి దైవప్రవక్త (సఅసం) ప్రబోధనలను వినిపిస్తూ ఉండగానే, ఆ తెగవారు ఒక మనిషి (ఆమిర్ బిన్ తుఫైల్)కి సైగ చేశాడు. అంతే, ఆ వ్యక్తి ఆయన శరీరంపై బరిసెతో పొడిచాడు. బరిసె శరీరంలో దిగి ఇటువైపు నుండి అటు వైపుకు వెళ్ళిపోయింది. ఆ సమయంలో ఆయన నోట, 'అల్లాహు అక్బర్! కాబా ప్రభువు సాక్షిగా నేను సాఫల్యం పొందాను' అన్న వాక్యం వెలువడింది. ఆ తరువాత ఆ తెగవారు హరామ్(రజి)తోపాటు వచ్చిన **70** మంది సహచరుల వైపునకు వెళ్ళి, వాళ్ళందరినీ చంపేశారు. కాకపోతే కుంటి వారైన ఒక వ్యక్తి మాత్రం కొండపైకెక్కారు. (హదీసు ఉల్లేఖకులైన) హమ్మామ్ ఇలా అన్నారు: 'బహుశా కొండపైకెక్కిన ఆయన సహవాసి అమ్ర్ బిన్ ఉమయ్యా అని నేననుకుంటున్నాను?' పిదప దైవదూత జిబ్రీల్ (అలైహిస్సలామ్) ఈ సమాచారాన్ని

147-1. దైవప్రవక్తలకు వచ్చే కలలు కూడా 'వహీ' తరహాలో ఉంటాయి. ముస్లింలు దర్జాగా రాజుల మాదిరిగా సముద్ర ప్రయాణం చేస్తున్నట్లు మహాప్రవక్త(స)కు కల వచ్చింది. ఎట్టకేలకు ఆ కల సత్యమయింది. ముఆవియా (రజి) సారధ్యంలో ముస్లింలు నౌకా దళాన్ని సిద్ధం చేసి సిరియాపై దండెత్తారు. ఉమ్మె హరామ్(ర.అ) వాహనం పైనుండి క్రిందపడి మరణించినప్పటికీ దైవప్రవక్త(స) ఆమెను ముజాహిదీన్ల సరసన నిలబెట్టారు. ఈ అధ్యాయంలో ప్రధానాంశం ఇదే. మహాప్రవక్త(స) భవిష్యవాణి నిజ మయింది.

**దైవప్రవక్త(స)కు తెలియపరిచారు– "మీ సహచరులు అల్లాహ్ వద్దకు చేరుకున్నారు. అల్లాహ్ వారి యెడల ప్రసన్నుడయ్యాడు. వారిని కూడా తన పట్ల సంతుష్టపరిచాడు." ఆ తరువాత మేము ఖుర్ఆన్‌లోని ఇతర ఆయత్‌లతోపాటు ఈ ఆయత్‌ను కూడా పఠించేవారం (దాని తర్జుమా ఇది : మేము మా ప్రభువు వద్దకు చేరుకున్నామని, ఆయన మా పట్ల ప్రసన్నుడయ్యాడనీ, మమ్ము కూడా సంతోషపరిచాడని మా జాతి వారికి తెలియపరచండి). ఆ తరువాత ఈ ఆయత్ రద్దు అయింది. ప్రవక్త మహనీయులు(స) 40 రోజుల వరకూ ఫజ్ర్ నమాజ్‌లో దైవాన్ని, దైవప్రవక్త(స)ను ఎదిరించిన రీల్, జక్వాన్, బనీ లిహ్యాన్, బనీ ఉసైయ్యా తెగలను శపించారు.**

**149) జున్దబ్ బిన్ సుఫ్యాన్(రజి) తెలిపారు: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒక యుద్ధంలో పాల్గొన్న సందర్భంలో ఆయన(స)చేతి వ్రేలికి గాయమయింది. ఆయన(స) ఆ వ్రేలినుద్దేశించి, "నీవు గాయపడిన వ్రేలివి తప్ప మరేమీ కావు. నీకు ఏం జరిగినా దైవమార్గంలోనే జరిగింది" అని పలికారు.**

## అధ్యాయం: 10

## దైవ మార్గంలో గాయపడిన వాని సౌభాగ్యం

**150) హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం)ఇలా ప్రవచించారు : "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని తోడు! ఎవరు అల్లాహ్ మార్గంలో గాయపడినా– తన మార్గంలో గాయపడినవారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు– అతను ప్రళయదినాన తన గాయాల**

---

148–1. ఇమామ్ బుఖారీ(రహ్మా) గురువు గారైన హఫ్స్ బిన్ ఉమర్ మరుపు వల్ల ఇక్కడ (హదీసులో) పొరబడ్డారని హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మా) చెప్పారు. ఆ వాక్యం ఈ విధంగా ఉండాల్సింది : "ఉమ్మె సులైమ్‌కు చెందిన ఒక సోదరుడు, అంటే హరామ్ బిన్ మిల్హాన్‌ను దైవప్రవక్త(స) డెబ్భయి మంది సహాబీల వెంట బనీ ఆమిర్ తెగ వారి వైపునకు పంపారు." ఈ 70 మంది అన్సార్ వర్గానికి చెందిన ఖారీలు. ఇస్లాం ధర్మప్రచారం నిమిత్తం ఆయన(స) వారిని బనీ ఆమిర్ వద్దకు పంపారు. ఆ మేరకు ఆ తెగవారే స్వయంగా అభ్యర్థించారు. కాని మార్గమధ్యంలో వారు విశ్వాసఘాతుకానికి పాల్పడి, నిర్దోషులైన ఆ ఖారీలను అమానుషంగా చంపేశారు. ఆమిర్ బిన్ తుఫైల్ బనూ సులైమ్ తెగకు నాయకుడు. దైవప్రవక్త(స) శపించిన వివిధ తెగలన్నీ బనూ సులైమ్ శాఖలే.

**నుండి రక్తం ప్రవిస్తున్న స్థితిలో వస్తాడు. దాని రంగు కూడా రక్తం లాగానే ఉంటుంది. కాని అందులో నుండి కస్తూరి (ముష్క్) సువాసన గుబాళిస్తూ ఉంటుంది."[1]**

## అధ్యాయం : 11

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:**

**వారితో ఇలా అనండి : "మీరు మా విషయంలో దేనికొరకు నిరీక్షిస్తున్నారో అది, రెండు మేళ్ళలో ఒకటి తప్ప మరొకటేముంది?" *(తౌబా- 52)***

**యుద్ధం చేద వంటిది. అది ఒకసారి ఇటు ఒకసారి అటు.**

**151) అబూ సుఫ్యాన్(రజి) తెలిపారు : హెరిక్లస్ తనతో ఇలా అన్నాడు- "ఆయన (అంటే ముహమ్మద్ ప్రవక్త-సఅసం)తో మీరు చేసిన యుద్ధాల ఫలితాలెలా ఉన్నాయి?" అని నేను నిన్ను అడిగితే. 'ఆయనకూ- మాకూ మధ్య జరిగిన యుద్ధం చేద లాంటిదనీ, యుద్ధ ఫలితం ఒకసారి మా పక్షాన ఉంటే, ఒకసారి ఆయన(స) పక్షాన ఉంటుంద'ని నీవు చెప్పావు. "దైవప్రవక్తల పట్ల ఇలాగే జరుగుతుంది. వారు (జయాపజయాల ద్వారా) పరీక్షించబడుతుంటారు. కాని అంతిమ విజయం మాత్రం వారిదే అవుతుంది."[1]**

## అధ్యాయం : 12

దైవోపదేశం : **"విశ్వాసులలో, అల్లాహ్‌కు తాము చేసిన వాగ్దానాన్ని[1] నిజం చేసి చూపినవారు ఉన్నారు. వారిలో కొందరు తమ మొక్కుబడిని తీర్చుకున్నారు. మరికొందరు సమయం కోసం నిరీక్షిస్తున్నారు. వారు తమ వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు." *(అల్ అహ్‌జాబ్- 23)***

---

150-1. కేవలం తన మెప్పు కోసం పోరాడినదెవరో, పేరు ప్రతిష్టల కోసం పోరాడినదెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు. తిరుగుబాటుదారులచే వధించబడిన వారికి లేదా విద్యాబోధన చేస్తూ మరణించినవానికి కూడా ఇదే స్థాయి ప్రాప్తమవుతుందని ఇమామ్ నవవీ (రహ్మ) వ్యాఖ్యానించారు.

151-1. అంటే ఒక ముస్లిం యుద్ధంలో వీరోచిత పోరాటం సాగిస్తూ ప్రాణాలిచ్చేస్తాడు లేదా అతనికి విజయం వరిస్తుంది. విశ్వసించిన తరువాత ఈ రెండు పర్యవసానాలు కూడా అతని పాలిట మంచివే అవుతాయి. విజయం సాధిస్తే దానిని అందరూ సత్ఫలితంగా భావిస్తారు. కాని యుద్ధంలో వీర మరణం ఒక ముస్లిం అంతిమ లక్ష్యం అయి ఉంటుంది. అతను రణరంగంలో పోరాడుతూ, ప్రాణాలర్పించి దైవ సన్నిధికి చేరు కున్నప్పుడు, అతనికి లభించే స్వాగతం, అతిథి మర్యాదలు అనన్య సామాన్యం.

**152) హజ్రత్ అనస్(రజి) తెలిపారు: నా పినతండ్రి అనస్ బిన్ నజర్ (రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు. అందువల్ల ఆయన ఇలా విన్నవించు కున్నారు: 'యా రసూలుల్లాహ్! మీరు బహుదైవారాధకులతో చేసిన మొదటి యుద్ధంలో నేనెలాగూ లేను. కాని ఇక ఇప్పుడు అల్లాహ్ నాకు బహుదైవారాధకులతో పోరాడే అవకాశమే గనక కల్పిస్తే, నేనేం చేస్తానో అల్లాహ్ చూస్తాడు.' తరువాత ఉహుద్ యుద్ధంలో పాల్గొనే అవకాశం వచ్చింది. ఆ యుద్ధంలో ముస్లింలు పలాయనం చిత్తగిస్తున్నప్పుడు, 'ఓ అల్లాహ్! ముస్లింల నిర్వాకంపై నేను క్షమాపణ కోరుతున్నాను. బహుదైవారాధకులు చేసిన దానితో విసిగిపోయాను'[1] అని ఆయన పలికారు. తరువాత ఆయన ముందుకు (బహు దైవారాధకుల వైపునకు) దూసుకుపోతున్నప్పుడు సాద్ బిన్ ముఆజ్(రజి) ఎదురయ్యారు. ఆ సమయంలో అనస్ బిన్ నజర్ (రజి) ఇలా అన్నారు : 'ఓ సాద్ బిన్ ముఆజ్! నేనైతే స్వర్గానికి వెళ్ళదలిచాను. (నా తండ్రి) నజర్ ప్రభువు సాక్షిగా చెబుతున్నాను. ఉహుద్ పర్వత సమీపంలో నేను స్వర్గసువాసనను ఆఘ్రాణిస్తున్నాను'. సాద్(రజి) ఇలా అన్నారు: 'దైవప్రవక్తా! ఆయన చూపినటువంటి పరాక్రమాన్ని చూపే ధైర్యం నాకు లేదు'. అనస్(రజి) ఇలా అంటున్నారు: "ఆ తరువాత అనస్ బిన్ నజర్(రజి)ను మేము కనుగొన్నప్పుడు, ఖడ్గపు వ్రేటులుగానీ, ఈటెలు, బాణాలుగానీ మొత్తం 80 గాయాలు ఆయన శరీరంపై ఉన్నాయి. ఆయన(రజి) వీర మరణాన్ని ఆస్వాదించారు. బహుదైవారాధకులు ఆయన మృతదేహాన్ని 'ముస్‌లా' చేశారు (శరీరావయవాలను కోసేశారు). అందువల్ల ఎవరూ ఆయన్ని గుర్తుపట్టలేకపోయారు. కేవలం ఆయన**

---

12-1. ఉహుద్ యుద్ధం జరిగిన నాడు సహాబా(రజి) చేసిన వాగ్దానమది. లేదా అఖబా రాత్రి ప్రతిజ్ఞ చేసినప్పుడు, ఎట్టి పరిస్థితిలోనూ మీకు రక్షణ కల్పిస్తామని దైవప్రవక్త(స)కు ఇచ్చిన మాట కావచ్చు. వారిలో కొందరు, ఉదాహరణకు- అనస్ బిన్ నజర్, అబ్దుల్లాహ్ అన్సారీ, హమ్జా, తల్హా (రజిఅల్లాహు అన్‌హుం) తదితరులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చారు. మరికొందరు వీర మరణం కొరకు నిరీక్షిస్తున్నారు.

152-1. దీని భావం ఏమిటంటే ఉభయవర్గాల నిర్వాకం వల్ల నేను తీవ్ర అసంతృప్తికి గురయ్యాను. ముష్రిక్కులు ఎలాగూ అసత్యంపై ఉన్నారు. కాబట్టి వారితో నాకు సంబంధం లేదు, కాని సత్యం కొరకు పోరాడవలసిన ముస్లింలు రణరంగం నుండి పారిపోవటం అత్యంత బాధాకర విషయం. నేను మాత్రం ఈ విధంగా యుద్ధ రంగం నుండి పారిపోయేవాణ్ణి కాను.

**సోదరి మాత్రమే వ్రేళ్ళ ఆధారంగా ఆయన్ని గుర్తుపట్టింది.” అనస్(రజి) ఇంకా ఇలా అన్నారు: బహుశా ఈ ఆయత్ ఈయన గురించి, ఈయన లాంటి మరికొంత మంది విశ్వాసుల గురించి అవతరించిందని మేము భావిస్తున్నాము– “విశ్వాసు లలో, అల్లాహ్‌కు తాము చేసిన వాగ్దానాన్ని నిజం చేసిచూపినవారు ఉన్నారు. వారిలో కొందరు తమ మొక్కుబడిని తీర్చుకున్నారు..” అనస్ బిన్ నజర్ (రజి) గారికి రబీ అనే సోదరీమణి ఒకామె ఉండేది. ఆవిడ ఒక స్త్రీ ముందు పళ్ళను (దంతాలను) ఊడగొట్టింది. అందువల్ల దైవప్రవక్త(సఅసం) ‘ఖిసాస్’ తీర్చుకునే (అంటే పంటికి బదులు పన్ను) ఆదేశాన్ని జారీ చేశారు. అప్పుడు అనస్ బిన్ నజర్ (రజి) ‘దైవప్రవక్తా! మీకు సత్యం ఇచ్చి పంపిన వాని సాక్షిగా చెబుతున్నాను. ఖిసాస్ (ప్రతీకారం)గా ఈమె పళ్ళు ఊడవు’ అని విన్నవించుకున్నారు. ఆయన చెప్పినట్లే జరిగింది. కక్షిదారులు జరిమానా (నష్టపరిహారం) తీసుకోవటానికి అంగీకరించారు. అంటే ప్రతీకారం తీర్చుకునే అవకాశాన్ని ఉపసంహరించుకున్నారు. అప్పుడు ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా అన్నారు: “అల్లాహ్ దాసులలో కొందరున్నారు. వారు గనక అల్లాహ్ పేరు మీద ప్రమాణం చేస్తే అల్లాహ్ స్వయంగా వారి ప్రమా ణాన్ని నిజంచేసి చూపుతాడు.”**

**153) హజ్రత్ జైద్ బిన్ సాబిత్(రజి) తెలిపారు : దివ్య ఖుర్‌ఆన్‌ను గ్రంథ (ముస్‌హఫ్) రూపంలో క్రోడీకరిస్తున్నప్పుడు నాకు సూరయె అహ్‌జాబ్‌లోని ఒక ఆయత్ లభ్యం కాలేదు. మహాప్రవక్త(సఅసం) ఆ ఆయత్‌ను కచ్చితంగా పారా యణం చేస్తుండగా నేను విని ఉన్నాను. (నేను దాని అన్వేషణ మొదలెట్టగా) కేవలం ఖుజైమా బిన్ సాబిత్ అన్సారీ(రజి) వద్ద అది లభించింది. ఈ ఖుజైమా ఎవరను కున్నారు? ఎవరి సాక్ష్యం ఇద్దరు మనుషుల సాక్ష్యానికి సమానంగా దైవప్రవక్త (సఅసం) ఖరారు చేశారో ఆ ఖుజైమాయే ఈయన.[1] ఆ ఆయత్ ఇది: “విశ్వాసు లలో, అల్లాహ్‌కు తాము చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపినవారు ఉన్నారు...”**

---

153–1. దీని ఆధారంగా దివ్య ఖుర్‌ఆన్ ఒక్కగానొక్క వ్యక్తి ఉల్లేఖనంపై క్రోడీకరించబడిందని భావించరాదు. నిజానికి ఈ ఆయత్‌ను చాలామంది విన్నారు. ఉదాహరణకు– హజ్రత్ ఉమర్, ఉబై బిన్ కాబ్, బిలాల్ బిన్ ఉమయ్యా, జైద్ బిన్ సాబిత్(ర.అన్‌హుమ్) మొదలగువారంతా విన్నారు. కాని యాదృచ్ఛికంగా అది లిఖితపూర్వకంగా వారి వద్ద లభ్యం కాలేదు.

## అధ్యాయం : 13

## యుద్ధానికి ముందు ఏదైనా సత్కార్యం చేయటం

**"మీరు మీ సదాచరణల పుణ్యమా అని ధర్మయుద్ధం చేస్తారు"[1] అని అబూ దర్దా (రజి) చెప్పారు. అల్లాహ్ (సూరయె సఫ్‌లో) ఈ విధంగా సెలవిచ్చాడు: "విశ్వాసులారా! మీరు చేయని దానిని చేస్తాము అని చెబుతారెందుకు? మీరు చేయని దానిని చేస్తాము అని చెప్పటం అల్లాహ్ దృష్టిలో అత్యంత అప్రియమైన విషయం.[2] అసలు అల్లాహ్‌కు ఆయన మార్గంలో సీసంతో పోసిన గోడ వలె దృఢమైన బారులు తీరి నిలబడి పోరాడే వారంటేనే ఇష్టం." *(61: 2-4)***

**154) బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ తెలిపారు. ఆయన ఇలా చెప్పేవారు: ఒక వ్యక్తి యుద్ధ కవచం ధరించి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) సమక్షంలో హాజరయ్యాడు. 'దైవప్రవక్తా! నేను ముందు యుద్ధంలో పాల్గొనాలా? లేక ముందు ముస్లింగా ధర్మపరివర్తన చెందాలా?' అని అతను విన్నవించుకోగా, "ముందు ఇస్లాం స్వీకరించు. ఆ తర్వాత యుద్ధంలో**

---

మహనీయ ఖుజైమా (రజి) గారి సాక్ష్యాన్ని దైవప్రవక్త(స) ఇద్దరు వ్యక్తుల సాక్ష్యానికి సమానంగా ఖరారు చేశారు. ఒక్క ఖుజైమా కొరకే ప్రవక్త(స) ఆ విధంగా పలికారు. ఇంతకీ జరిగిందేమిటంటే, దైవప్రవక్త(స)ఒక వ్యక్తికి ఒక విషయం చెప్పగా, అతను దానిని నిరాకరించాడు. అప్పుడు 'నేను ఈ విషయానికి సాక్షిని' అని ఖుజైమా చెప్పారు. "సాక్ష్యం ఇవ్వమని నేను నిన్ను కోరలేదు కదా! మరలాంటప్పుడు ఎందుకు సాక్ష్యమిస్తున్నావు?" అనంటే, 'దైవప్రవక్తా! ఆకాశం మీది నుండి మీపైన అవతరించే ఆజ్ఞలను మేము సత్యమని ధ్రువపరుస్తున్నాము. అలాంటప్పుడు ఇదేమంత పెద్ద విషయం?' అని ఖుజైమా బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) ఖుజైమా గురించి ఇలా తీర్పు వినిపించారు.

13-1. అంటే ధర్మయుద్ధంలో సదాచరణలకు గల ప్రమేయం చాలా గొప్పది. సదాచరణల మూలంగానే చిత్తశుద్ధి జనిస్తుంది. ఆత్మ బలం పెంపొందుతుంది.

13-2. ధర్మయుద్ధం విధితం కావడానికి ముందు ముస్లింలు గొప్పలు చెప్పుకున్నారు. అంటే, అల్లాహ్‌కు ఏ కార్యం ఇష్టమో తెలిస్తే దానిని తాము వెంటనే నెరవేరుస్తామని పలికారు. అప్పుడు ఈ ఆయత్‌లు (61: 2-4) అవతరించాయి. అల్లాహ్‌కు ముస్లింలలోని రెండు గుణాలు ఎంతో ప్రియమైనవి. ఒకటి: సామూహిక నమాజులో భుజానికి భుజం ఆనించి నిలబడటం, రెండు : యుద్ధ సందర్భంగా కలసికట్టుగా పోరాడటం.

**పాల్గొను" అని ఆయన(స) సలహా ఇచ్చారు. అందువల్ల ఆ వ్యక్తి మొదట ఇస్లాం స్వీకరించి, ఆ తర్వాత యుద్ధంలో పాల్గొని వీర మరణాన్ని ఆస్వాదించాడు. దైవ ప్రవక్త(స) ఆ వ్యక్తి గురించి, "ఇతని ఆచరణ తక్కువే. కాని ఎక్కువ ప్రతిఫలం పొందాడ"ని[1] అన్నారు.**

## అధ్యాయం : 14

## ఒక వ్యక్తికి అకస్మాత్తుగా ఒక బాణం గుచ్చుకుంది. (బాణం ఎవరు ప్రయోగించారో తెలీదు. కాని) అతను చనిపోయాడు

**155) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : హారిసా బిన్ సురాఖా (రజి) మాతృశ్రీ అయిన ఉమ్మె రబీ బిన్తె బరా (ర.అ) ప్రవక్త మహనీయుల(సఅసం) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకుంది : 'ఓ దైవప్రవక్తా! హారిసా గురించి కూడా నాకు సమాచారం అందజెయ్యండి. హారిసా (రజి) బద్ర్ యుద్ధంలో అమరగతి నొందాడు. అతనికి తెలియని దిశ నుండి ఒక బాణం వచ్చి అతని శరీరంలో దిగబడింది. అతను స్వర్గంలో ఉంటే ఓర్పు వహిస్తాను. అలాగాకుండా అతను మరో చోట ఉంటే ఏడుపు ఒక్కటే నా గతి'. ఇది విన్న దైవప్రవక్త(స), "ఓ ఉమ్మె హారిసా! స్వర్గంలో ఎన్నో అంతస్తులుంటాయి. నీ పుత్ర రత్నానికి జన్నతుల్ ఫిర్దౌస్‌లో ఉన్నత స్థానం లభించింది."[1] అన్నారు.**

---

154–1. ఆ వ్యక్తి అమ్ర్ బిన్ సాబిత్ అన్సారీ అని కొందరు పేర్కొన్నారు. ఇబ్నె ఇస్‌హాఖ్ యుద్ధాల ప్రకరణంలో వెలికి తీసిన దాని ప్రకారం, "ఒక్క నమాజ్ కూడా చేయకుండా స్వర్గంలో ప్రవేశించిన ఆ వ్యక్తి ఎవరో చెప్పండి" అని హజ్రత్ అబూహురైరా(రజి) జనులను అడిగేవారు. ఆ తరువాత, "అతను అమ్ర్ బిన్ సాబిత్" అని ఆయనే చెప్పేవారు. ప్రతి సదాచరణ ఆమోద ముద్రకు ముస్లిం అయి ఉండటం షరతు అని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది.

155–1. ఉమ్మె రబీని బరా కుమార్తెగా పేర్కొనటం ఉల్లేఖకుని వల్ల జరిగిన పొరపాటు. 'ఉమ్మె నజర్ కుమార్తె' అన్నది సరైనది. ఈమె అనస్ బిన్ మాలిక్ మేనత్త. ఈమె కుమారుడు బద్ర్ సంగ్రామంలో తెలియని ఒక వ్యక్తి ప్రయోగించిన బాణం వల్ల చనిపోయారు. ఆ విషయాన్ని అడగటానికే ఆ తల్లి వచ్చింది. దైవప్రవక్త(స) సమాధానం విని ఆమె సంతోషంతో నవ్వుతూ వెళ్ళిపోయింది. 'హారిసా! నీకు శుభం. నీకు శుభం' అని కూడా పలికింది.

## అధ్యాయం : 15

## దైవ వాక్కుకు ఉన్నతి లభించాలన్న కాంక్షతో పోరాడిన వ్యక్తి ఔన్నత్యం

**156) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) తెలిపారు: ఒక సహాబీ(లాహిఖ్ బిన్ జమీలా) దైవప్రవక్త(సఅసం) సన్నిధిలో హాజరై ఇలా విన్నవించుకున్నారు: 'ఒక వ్యక్తి యుద్ధప్రాప్తిని పొందే ఉద్దేశంతో యుద్ధంలో పాల్గొంటాడు. ఒక వ్యక్తి పేరు ప్రఖ్యాతుల కొరకు యుద్ధం చేస్తాడు. ఒక వ్యక్తి, తన శౌర్యం గురించి సర్వత్రా మార్మోగిపోవాలన్న కోర్కెతో యుద్ధం చేస్తాడు. మరి వీరిలో ఎవరు దైవ మార్గంలో పోరాడినట్లు?' సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "దైవవాక్కుకు ఉన్నతి లభించాలనే సంకల్పంతో యుద్ధంలో పాల్గొన్నవాడే దైవమార్గంలో పోరాడినట్లు లెక్క."[1]**

## అధ్యాయం : 16

## దైవమార్గంలో పాదాలు దుమ్ము కొట్టుకున్న వానికి లభించే పుణ్యఫలం

అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: **"మదీనా పౌరులకూ, చుట్టుపక్కల ఉండే ఎడారి అరబ్బులకూ అల్లాహ్ ప్రవక్తను వదిలిపెట్టి ఇళ్ళల్లో కూర్చోవటం, ఆయనను పట్టించుకోకుండా తమను గురించి మాత్రమే ఆదుర్దా పడటం ఎంతమాత్రం శోభించదు. ఎందుకంటే, అల్లాహ్ మార్గంలో వారు ఆకలిదప్పులనూ, శరీర శ్రమకు సంబంధించిన ఏదైనా బాధను సహించి ఉంటే, సత్య తిరస్కారులు**

---

మొదట ఆమెకు తన కొడుకు మరణంపై సందేహం కలిగింది. – అతను శత్రువు చేత వధించబడలేదేమో, అతనికి స్వర్గం ప్రాప్తించదేమోనని. అయితే దైవప్రవక్త(స) నోట శుభవార్త వినగానే ఆమె అంతరాళం ఆనందంతో నిండిపోయింది. సుబ్హానల్లాహ్! ప్రవక్త కాలం నాటి ముస్లిం వనితల విశ్వాసం (ఈమాన్) గురించి ఏమని చెప్పేది. తమ ముద్దుబిడ్డలు దైవమార్గంలో అమరగతి నొంది స్వర్గంలో ప్రవేశించాలని వారు తీవ్రంగా కాంక్షించేవారు.

156–1. సంకల్ప శుద్ధి ముఖ్యం. అది ఉంటే అన్నీ బాగుంటాయి. ప్రళయదినాన ఎందరో ధర్మ దాతలు, ఖుర్ఆన్ సంస్మర్తలు, యోధులు నరకంలో పడవేయబడతారు. కారణం వారు ప్రదర్శనాబుద్ధితో ధర్మసేవ చేయటమే. పేరు ప్రఖ్యాతుల్ని ఆశించి వారు సత్కార్యాలు చేశారు. వారు ఆశించినదంతా ప్రపంచంలోనే వారికి ప్రాప్తమయింది. పరలోకంలో ప్రాప్తంగా వారికి ఏమీ మిగులలేదు. నేరుగా నరకంలోకి త్రోయటం జరిగింది.

సహించలేని మార్గంపై వారు ఏదైనా అడుగు వేస్తే ఏ శత్రువుకైనా (సత్య విరోధానికి) వారు ప్రతీకారం చేస్తే దానికి బదులుగా వారి కొరకు ఒక సత్కార్యం వ్రాయబడ కుండా ఉండటమనేది ఎన్నటికీ జరగదు. నిశ్చయంగా అల్లాహ్ వద్ద సజ్జనుల సేవాఫలం హక్కు హరించబడదు." *(అత్ తౌబా- 120)*

**157)** ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని అబూ అబస్- రజి (అసలు పేరు అబ్దుర్రహ్మాన్ బిన్ జబ్ర్) తెలిపారు: "ఏ దాసుని పాదాలు దైవ మార్గంలో దుమ్ము ధూళికొట్టుకుంటాయో వాటికి (నరక) అగ్ని తాకటమా? (ఇది అసంభవం)"[1]

## అధ్యాయం : 17

## దైవమార్గంలో దుమ్ము అంటిన వారి దుమ్మును తుడవటం

**158)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) గారు ఇక్రిమానూ, తన కుమారుడగు అలీ బిన్ అబ్దుల్లాహ్‌ను ఉద్దేశించి, "మీరిద్దరూ అబూ సయీద్ ఖుద్రీ (రజి) దగ్గరకు వెళ్ళి, ఆయన ద్వారా హదీసులు వినండి" అని చెప్పారు. అందువల్ల మేమిద్దరం ఆయన దగ్గరకు వెళ్ళామని ఇక్రిమా, అలీ బిన్ అబ్దుల్లాహ్ అన్నారు. ఆ సమయంలో అబూ సయీద్ తన (పాల వరుస) సోదరునితో కలసి తోటకు నీరు సరఫరా చేస్తు న్నారు. మమ్మల్ని చూడగానే ఆయన (మా దగ్గరకు) వచ్చి, దుప్పటి కప్పుకుని, గోటు కట్టి కూర్చున్నారు. ఆ తరువాత ఇలా అన్నారు : మేము (హిజ్రత్ అనంతరం) మస్జిదె నబవీ నిర్మాణం కొరకు ఒక్కొక్క ఇటుక చొప్పున మోస్తూ ఉండేవారం. కాని అమ్మార్ (రజి) మాత్రం రెండేసి ఇటుకలు మోసుకుని వచ్చేవారు. అంతలో దైవప్రవక్త (సఅసం) అటువైపుగా వస్తూ, ఆయన తలపై పడివున్న దుమ్మును తుడిచారు. ఇలా అన్నారు: "విచారకరమైన విషయం ఏమిటంటే అమ్మార్‌ను ఒక తిరుగుబాటు సమూహం సంహరిస్తుంది. ఇతనైతే ఆ వర్గం వారిని దైవ (విధేయతా) మార్గం వైపునకు పిలుస్తూ ఉంటాడు. కాని వాళ్ళు ఇతన్ని నరకం వైపునకు పిలుస్తూ ఉంటారు."[1]

---

157-1. దైవమార్గంలో దుమ్ము కొట్టుకున్న కాళ్ళకే నరకాగ్ని తాకనప్పుడు, తమ ధన ప్రాణాలతో దైవమార్గంలో పోరాడిన వారికి లభించే ప్రతిఫలం ఇంకెంత గొప్పదో ఊహించవచ్చు. ఒకవేళ వారి వల్ల తప్పులు జరిగి ఉంటే అల్లాహ్ తన కృపతో వారిని మన్నిస్తాడు. దైవమార్గంలో సతత సమరం సాగించే వారు ఈ హదీసు ద్వారా సంబరపడాలి.

## అధ్యాయం : 18

## యుద్ధం తర్వాత, దుమ్ము కొట్టుకున్న తర్వాత స్నానం చేయటం

**159) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసం) కందక యుద్ధం నుండి తిరిగి వచ్చినప్పుడు, ఆయుధాలను విడిచి స్నానం చేయదలిచారు. అంతలోనే దైవదూత జిబ్రీల్ (అలైహిస్సలాం) ఏతెంచారు. ఆయన తలంతా దుమ్ము ధూళితో నిండి ఉంది : "మీరు అప్పుడే ఆయుధాలు విడిచిపెట్టేశారా? అల్లాహ్ సాక్షిగా! నేనింత వరకు ఆయుధాలను విడువలేద"ని జిబ్రీల్(అ) అన్నారు. "అలాగా! మరైతే ఇప్పుడు ఎక్కడికెళ్ళాలి?" అని ప్రవక్త మహనీయులు(స) అడిగితే, "అటువైపు" అంటూ బనూ ఖురైజా వాడ వైపు సంజ్ఞ చేశారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(స) బనూ ఖురైజాకు వ్యతిరేకంగా సైనిక చర్య గైకొన్నారు.[1]**

## అధ్యాయం : 19

## ఏ అమరవీరుల నేపథ్యంలో దైవ వచనాలు అవతరించాయో వారి ఘనత

**"అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు సజీవులే. తమ ప్రభువు వద్ద జీవికను పొందుతున్నారు. అల్లాహ్ తన కృపతో ప్రసాదించిన దానితో వారు ఎంతో సుఖంగా, సంతోషంగా ఉన్నారు. తమ వెనుక ప్రపంచంలో ఉండిపోయి ఇంకా తమతో చేరని విశ్వాసులకు కూడా ఏ విధమైన భయంకానీ, దుఃఖం కానీ కలిగే అవకాశం లేదని వారు నిశ్చింతగా ఉన్నారు.**

---

158-1. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్(రజి) గొప్పతనం గురించి, ఆయన స్థితిగతుల గురించి ఇంతకుముందు కూడా వచ్చింది. ఇక్కడ సిఫ్ఫీన్ యుద్ధం పూర్వరంగంలో ఈ హదీసు ఉంది. అమ్మార్(రజి) హజ్రత్ అలీ (రజి) తరఫున పోరాడారు. హిజ్రీ 35వ సంవత్సరంలో జరిగిన సిఫ్ఫీన్ యుద్ధంలో ఈయన 93 ఏండ్ల వయసులో అమరగతి నొందారు. దైవప్రవక్త(స) ప్రేమతో ఆయన తల నిమురుతూ, దుమ్మును తుడవటాన్ని బట్టి ఈయన గొప్పదనం ఏమిటో విదితమవుతోంది.

159-1. బనూ ఖురైజా యూదులు మదీనాలో ముస్లిములతో చేసుకున్న ఒడంబడికకు వ్యతిరేకంగా మక్కా బహు దైవారాధకులకు సహాయం చేశారు. వారు సాగించిన లోగుట్టు కార్యకలాపాల వల్ల ముస్లింలకు చాలా నష్టం కలిగింది. అందువల్ల వారి అపవిత్రమైన కుట్రల నుండి మదీనాను కాపాడవలసిన ఆవశ్యకత ఏర్పడింది. దైవాదేశంతో వారిపై సైనిక చర్య గైకొని, బనూ ఖురైజాను మదీనా నుండి బహిష్కరించటం జరిగింది.

అల్లాహ్ బహుమానాలకు, ఆయన అనుగ్రహాలకు వారు పొంగిపోతున్నారు. విశ్వాసుల ప్రతిఫలాన్ని అల్లాహ్ వృధా కానివ్వడని వారికి తెలిసిపోయింది." *(ఆలి ఇమ్రాన్: 169–171)*

**160)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు : అస్హాబె బియరె మవూనా (రజిఅల్లాహు అన్హుమ్)ను వధించిన వారిని ప్రవక్త మహనీయులు (సఅసం) ముప్ఫయి రోజుల వరకూ ఫజ్ర్ నమాజ్‌లో శపించారు. వారు రీల్, జక్వాన్, ఉసయ్యా తెగలకు చెందినవారు. వారు అల్లాహ్, ఆయన సందేశహరుని (స) యెడల అవిధేయతా వైఖరికి ఒడిగట్టారు. బియరె మవూనా వద్ద 70 మంది ప్రవక్త సహచరులు (ఖుర్‌ఆన్ ఖారీలు) సంహరించబడ్డారని మహనీయ అనస్ (రజి) చెప్పారు. వారి నేపథ్యంలో ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది ఆయత్ అవతరించింది. చాలా రోజుల వరకు మేము ఈ ఆయత్‌ను పారాయణం చేసేవారం. తరువాత అది రద్దు అయింది (దాని అనువాదం ఇది) "మేము మా ప్రభువు వద్దకు చేరుకున్నామని, మా ప్రభువు మా యెడల ప్రసన్నుడయ్యాడని, మేము ఆయన యెడల సంతుష్టులమయ్యామని మా జాతి వారికి సమాచారం అందజేయండి."

**161)** మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) కథనం: కొంతమంది సహాబీలు ఉహుద్ యుద్ధం రోజున ఉదయం సారాయి త్రాగారు. (అప్పటికింకా సారాయి నిషేధాజ్ఞలు రాలేదు). తరువాత వారు వీర మరణాన్ని ఆస్వాదించారు. సారాయి త్రాగిన రోజు చివరి భాగంలో వారు వీర మరణం పొందారా? అని (హదీసు ఉల్లేఖకుల్లో ఒకరైన) సుఫ్యాన్(రజి)ను అడిగితే, 'హదీసులో ఆ విషయం ప్రస్తావనకు రాలేద'ని[1] ఆయన చెప్పారు.

---

161–1. ఉహుద్ యుద్ధం జరిగే నాటికి మద్యపాన నిషేధాజ్ఞలు అవతరించలేదు. అమరగతుని ఘనత్వం గురించి ఈ హదీసులో ఎలా తెలిసిందంటే జాబిర్ (రజి)తండ్రితో అల్లాహ్ సంభాషించాడు. 'నేను మళ్ళీ ప్రపంచానికి తిరిగి వెళ్ళాలనేది నా ఆకాంక్ష' అని ఆయన అల్లాహ్‌తో అన్నారు. ఆ తరువాత 'నా పరిస్థితి గురించి నా సహవాసులకు తెలియజెయ్యి' అని ఆయన దుఆ చేశారు. దానిపై ఈ ఆయత్ (ఆలి ఇమ్రాన్– 169) అవతరించింది : "అల్లాహ్ మార్గంలో చంపబడ్డ వారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు సజీవులే." ఈ ఉల్లేఖనాన్ని తిర్మిజీ వెలికి తీశారు. ఈ రివాయతులో అమరగతుల గురించి వివరించేటప్పుడు మద్యపాన ప్రస్తావన సాపేక్షిక విషయంగా వచ్చింది. తరువాత మద్యపాన నిషేధాజ్ఞ అవతరించినప్పుడు ప్రవక్త ప్రియ

## అధ్యాయం : 20

## అమరగతులకు దైవదూతలు నీడ కల్పించటం

**162)** జాబిర్ (రజి) కథనం: (ఉహుద్ యుద్ధ సందర్భంగా) నా తండ్రి ప్రవక్త మహనీయుల(సఅసం) ముందుకు తీసుకురాబడ్డారు. అవిశ్వాసులు ఆయన ముక్కు చెవులు కోసేశారు. ఆయన భౌతికకాయం ప్రవక్త(స) సమక్షంలో ఉంచబడి నప్పుడు నేను ముందుకు వచ్చి, ఆయన ముఖం (పైని వస్త్రం) విప్పబోయాను. కాని నా జాతి జనులు నన్ను వారించారు. అంతలోనే దైవప్రవక్త(స)కు ఏడుపులు వినిపించాయి. (ఈ ఏడుపు ఎవరిది? అని ఆయన విచారించగా) అమ్ర్ కూతురు (అమరగతుని సోదరి) లేదా అమ్ర్ పినతల్లి అని జనులు చెప్పారు– ఇక్కడ ఉల్లేఖ కుడు సందిగ్ధానికి లోనయ్యారు– అప్పుడు ఆయన(సఅసం) ఇలా అన్నారు : "ఎందుకేడుస్తోంది? (లేదా ఆయన–సఅసం–ఇలా అన్నారు) ఏడవవద్దు. దైవ దూతలు తమ రెక్కలు చాచి అతనికి నీడ కల్పిస్తున్నారు."

## అధ్యాయం : 21

## అమరగతులు మళ్ళీ ఈ ప్రపంచానికి తిరిగి రావాలని కోరుకోవటం

**163)** హజ్రత్ అనస్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు: "స్వర్గంలో ప్రవేశించిన తరువాత ఈ ప్రపంచానికి తిరిగి రావాలని కోరుకునేవాడు ఎవడూ ఉండడు. యావత్ప్రపంచం లభించినా సరే అతను దానికి సిద్ధమవడు. కాని అమరగతుడు మాత్రం అలా కాదు. అతడు మళ్ళీ ప్రపంచానికి వెళ్ళి పదిసార్లు (దైవమార్గంలో) చంపబడాలని కోరుకుంటాడు. ఎందుకంటే అక్కడ అమరగతునికి లభించే గౌరవ పురస్కారం ఎటువంటిదో అతను ప్రత్యక్షంగా తిలకించాడు."

## అధ్యాయం : 22

## స్వర్గం ఖడ్గాల ఛాయల క్రింద ఉండటం

ముగీరా బిన్ షూబా (రజి) ఇలా తెలిపారు: "ముస్లింలలో ఎవరు దైవ

---

సహచరులంతా ఆ ఆజ్ఞను శిరసావహిస్తూ మద్యం పాత్రలను పగులగొట్టారు. ఇండ్లల్లో ఉన్న మద్యాన్ని వీధుల్లో పారబోశారు.

మార్గంలో చంపబడినా, అతను సరాసరి స్వర్గానికి పోతాడు" అన్న తన ప్రభువు సందేశాన్ని దైవప్రవక్త(సఅసం) మాకు చేరవేశారు. "మాలోని హతులు స్వర్గ వాసులు, అవిశ్వాసుల్లోని హతులు నరకవాసులు కారా?" అని ఉమర్ (రజి) దైవ ప్రవక్త(స)ను అడగ్గా "కచ్చితంగా" అని ఆయన(స) చెప్పారు.

**164)** ఉమర్ బిన్ ఉబైదుల్లాహ్ బానిస, గుమాస్తా కూడా అయిన సాలిమ్ అబూ నజర్ వివరించారు: ప్రవక్త ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించారని అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి)గారు, ఉమర్ బిన్ ఉబైదుల్లాహ్‌కు వ్రాసి పంపారు: "తెలుసుకోండి! స్వర్గం ఖడ్గాల ఛాయ క్రింద ఉంది."

## అధ్యాయం : 23

## జిహాద్ చేసేందుకు సంతాన భాగ్యం ప్రసాదించమని కోరటం

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "దావూద్ కుమారుడగు సులైమాన్ (అలైహిస్సలాం), 'ఈ రోజు రాత్రి నేను నా వంద మంది భార్యల లేక తొంబై తొమ్మిది మంది భార్యల వద్దకు పోతాను. వారిలో ప్రతి భార్య ఒక్కో గుర్రపు రౌతును కంటుంది. వారంతా దైవమార్గంలో పోరాడుతార"ని చెప్పారు. 'సరేగాని, ఇన్‌షా అల్లాహ్ అని పలకండి' అని ఆయన సహచరుడు సూచించాడు. కాని ఆయన ఇన్‌షా అల్లాహ్ పలకలేదు (మరచిపోయారు). అందువల్ల వంద మంది భార్యలలో ఒక్కావిడ మాత్రమే గర్భవతి అయింది. మరి ఆమె కూడా అసంపూర్ణమైన శిశువును ప్రసవించింది. ఎవరి చేతిలో ముహమ్మద్(స) ప్రాణముందో ఆ శక్తిమంతుని మీద ఒట్టు. ఒకవేళ సులైమాన్(అ) ఆ సమయంలో ఇన్‌షా అల్లాహ్ (దైవచిత్తమైతే) అని పలికి ఉంటే ఆయన సతీమణులంతా దైవమార్గంలో పోరాటం సలిపే గుర్రపు రౌతులను కని ఉండేవారు."[1]

## అధ్యాయం : 24

## యుద్ధ సమయంలో పరాక్రమం, పిరికితనం గురించి

**165)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసం) అందరికన్నా ఎక్కువ సుందర స్వరూపులు, అందరికన్నా ఎక్కువ

---

23-1. మరిన్ని వివరాలు ఇన్‌షా అల్లాహ్ సులైమాన్(అలైహిస్సలాం) ప్రస్తావనలో వస్తాయి.

**శూరులు, అందరికన్నా ఎక్కువ ఉదార స్వభావులు. మదీనా తయ్యిబాలోని జను లంతా (ఒక రాత్రి) భయభ్రాంతులకు లోనయ్యారు (ఎందుకంటే వారికి ఒక అరుపు వినిపించింది. అందరూ అటువైపునకు పోసాగారు). అప్పుడు ప్రవక్త మహనీయులు (స) ఒక గుర్రంపైన స్వారీ అయి అందరికన్నా ముందుకు దూసుకుపోయారు (తిరిగి వచ్చిన తరువాత) "పరుగెత్తటంలో మేము ఈ గుర్రాన్ని పరవళ్ళు తొక్కే నదీ ప్రవాహంలా కనుగొన్నాము" అని చెప్పారు.[1]**

**166) జుబైర్ బిన్ ముత్‌యిమ్(రజి) తెలిపారు : ఈయన దైవప్రవక్త (సఅసం)తో కలసి నడుస్తున్నారు. ఆయన(స)తోపాటు మరెంతోమంది సహాబీలు కూడా ఉన్నారు. హునైన్ లోయ నుండి తిరిగి వస్తున్న సమయంలో కొంతమంది పల్లెటూరి బైతులు ఆయన్ని చుట్టుముట్టారు. ఎట్టకేలకు ఆయన(స) మార్గాంతరం లేక ఒక తుమ్మచెట్టు వద్దకు వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ ఆయన దుప్పటి తుమ్మచెట్టు ముళ్ళలో చిక్కుకుపోయింది. ఆ దుప్పటిని వాళ్ళు తీసేసుకున్నారు (దైవ ప్రవక్త తమకు ఏదన్నా దానం చేస్తే అప్పుడు ఆ దుప్పటిని వాపసు చేయాలన్నది వాళ్ళ ఉద్దేశ్యం). ఆయన(స) అక్కడే నిలబడి, 'నా దుప్పటిని నాకు ఇచ్చేయండి. ఒకవేళ నా దగ్గర ఈ చెట్టుకు ఉన్న ముళ్ళ సంఖ్యలో ఒంటెలు మేకలు ఉన్నాసరే, వాటిని మీ మధ్య పంచిపెట్టేవాణ్ణి. మీరు నన్ను పిసినారిగా గానీ, అబద్ధీకునిగా గానీ, పిరికివానిగా గానీ పొందలేకపోయేవారు"[1] అని చెప్పారు.**

---

165-1. అంటే అలుపు అన్నదే లేకుండా పరుగెత్తుతూ ఉంది. ఎక్కడా ఆగటంగానీ, మొండితనం ప్రదర్శించటం గానీ చేయలేదు. దైవప్రవక్త(స) ఆ రోజు రాత్రి ఒక్కరే– ఒంటరిగా– కేక వినిపించిన దిశలో ముందుకు దూసుకుపోయారు. ఏమాత్రం భయపడలేదు. సుబ్‌హానల్లాహ్! శౌర్యంలోనూ, దాతృత్వంలోనూ, బాహ్య సౌందర్యంలోనూ ఆయన్ని మించిన వారెవరు? ఇక ఆత్మ సౌందర్యం విషయానికివస్తే ఆయనంతటి దయార్ద్ర హృదయులు, మృదు మనస్కులు ఎవరూ లేరు. అడిగినవారికి కాదనకుండా ఇచ్చేవారు. వ్యక్తిగత విషయంలో ఎప్పుడూ ఎవరిపైనా ప్రతీకారం తీర్చుకునేవారు కారు. క్షమాపణ కోరిన వారికి క్షమాభిక్ష పెట్టేవారు. ఇక ఆరాధనల విషయానికి వస్తే రాత్రిళ్లు సైతం ఎక్కువ సమయం దైవారాధనలో నిలబడేవారు. కాళ్ళపై వాపు వచ్చేసేది. దూర దృష్టి, ఉపాయం గురించి ఏమని చెప్పేది? కేవలం కొన్నేండ్లలోనే అరేబియా చిత్రపటాన్ని మార్చివేశారు. ఎవరికీ లొంగని పొగరుబోతులను సయితం సంధికి రప్పించారు. ఓ ప్రవక్తా! మీకు శతకోటి జోహార్లు.

## అధ్యాయం : 25

## పిరికితనం నుండి అల్లాహ్ శరణు వేడుకోవటం

**167)** అమ్ర్ బిన్ మైమూన్ అవదీ తెలిపారు: సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) తన పిల్లలకు ఈ క్రింది వేడుకోలు వచనాలు ఎంత పకడ్బందీగా నేర్పేవారంటే, ఆ నేర్పే వైనం ఒక అధ్యాపకుడు పిల్లలకు నేర్పినట్లే ఉండేది. దైవప్రవక్త(సఅసం) నమాజ్ అనంతరం ఈ వేడుకోలు వచనాల ద్వారా అల్లాహ్ శరణు కోరేవారని కూడా ఆయన తన పిల్లలకు చెబుతూ ఉండేవారు. ఆ వచనాలు ఇవి: "అల్లాహుమ్మ! ఇన్నీ అఊజుబిక మినల్ జుబ్ని వ అఊజుబిక అన్ అరద్ద ఇలా అర్జలిల్ ఉమురి వ అఊజు బిక మిన్ ఫిత్నతిద్దున్యా వ అఊజుబిక మిన్ అజాబిల్ ఖబ్ర్."

(అనువాదం : ఓ అల్లాహ్! పిరికితనం నుండి నేను నీ శరణు వేడుతున్నాను. వయసు యొక్క అత్యంత నికృష్ట స్థితికి చేర్చబడటం నుండి కూడా నీ శరణు వేడుతున్నాను. ప్రాపంచిక ఉపద్రవాల నుండి నేను నీ శరణు వేడుతున్నాను. ఇంకా సమాధి యాతన నుండి నీ శరణు వేడుతున్నాను). తరువాత నేను ఈ హదీసును ముస్అబ్ బిన్ సాద్‌కు వినిపించగా, ఆయన కూడా దీనిని సత్యమని ధ్రువీకరించారు.

**168)** ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా వేడుకుంటూ ఉండేవారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు : *"అల్లాహుమ్మ ఇన్నీ అఊజుబిక మినల్ అజ్జి వల్ కసలి వల్ జుబ్ని వల్ హరమి వ అఊజుబిక మిన్ ఫిత్నతిల్ మహ్యా వల్ మమాతి వ అఊజుబిక మిన్ అజాబిల్ ఖబ్ర్"* (అనువాదం: ఓ అల్లాహ్! దీనావస్థ నుండి, బద్ధకం నుండి, పిరికితనం నుండి, వార్ధక్యపు నికృష్ట స్థితికి చేర్చబడటం నుండి నీ శరణువేడుతున్నాను.[1] ఇంకా, జీవన్మరణాల పరీక్షల నుండి నీ శరణు వేడుతున్నాను. సమాధి యాతన నుండి కూడా నీ శరణు వేడుతున్నాను).

---

166–1. దైవప్రవక్త(స) అలా చెప్పటంలోని ఉద్దేశం ఏమిటంటే పిసినారితనం ఉన్నచోట అబద్ధం, పిరికితనం తిష్ఠ వేస్తుంది. దాతృత్వం ఉన్నచోట సచ్ఛీలత, శౌర్యం అవశ్యంగా ఉంటుంది. హునైన్ యుద్ధం నుండి తిరిగి వస్తున్న సమయంలో ఎదురైన సంఘటన ఇది. మరిన్ని వివరాలు కితాబుల్ మగాజీలో వస్తాయి.

168–1. పండు ముసలిగా మారినప్పుడు మనిషి జవసత్వాలు ఉడిగిపోతాయి. జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. మెదడు సరిగా పనిచేయదు. అప్పుడు మనిషి పసిపిల్లల వలె ప్రవర్తిస్తాడు.

## అధ్యాయం : 26

## తన పోరాట పటిమను గురించి చెప్పుకోవటం[1]

**ఈ అధ్యాయంలో అబూ ఉస్మాన్ గారు సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) నుండి విషయాన్ని ఉటంకించారు.[2]**

**169) సాయబ్ బిన్ యజీద్ ఇలా చెప్పారు : నేను తల్హా బిన్ ఉబైదుల్లాహ్, సాద్ బిన్ అబీ వక్కాస్, మిఖ్దాద్ బిన్ అస్వద్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజిఅల్లాహు అన్‌హుమ్)లతో కలిసి కూర్చుని ఉన్నాను. కాని వారెవరినీ దైవప్రవక్త(సఅసం) ప్రవచనం వినిపిస్తుండగా వినలేదు. కాకపోతే తల్హా (రజి) ద్వారా విన్నాను. ఆయన ఉహుద్ సంగ్రామం గురించి చెబుతుండేవారు.[1]**

## అధ్యాయం : 27

## జిహాద్ కొరకు సన్నద్ధమవటం, జిహాద్ సంకల్పం కలిగి ఉండటం అవశ్యం (వాజిబ్)

అత్ తౌబా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"బయలుదేరండి, తేలికగానైనా సరే, బరువుగానైనా సరే. అల్లాహ్ మార్గంలో పోరాడండి మీ సంపదలనూ, మీ ప్రాణాలనూ ఒడ్డి. ఇది మీకు శ్రేయస్కరమైనది, మీరు గనక తెలుసుకుంటే.**

---

తానేం చేస్తున్నాడో కూడా తనకు తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే అలాంటి నికృష్ట వృద్ధాప్యం నుండి అల్లాహ్ శరణు వేడుకుంటూ ఉండాలి. అలాగే అశక్తత, బద్ధకం, పిరికితనం, జీవన్మరణాల పరీక్షలు మనిషి పాలిట దుర్భరమైనవే. సమాధి యాతన కూడా భరించరానిదే. కాబట్టి వీటన్నింటి నుండి దేవుని శరణు వేడుకుంటూ ఉండాలి.

26-1. తోటి ముస్లింలలో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని నూరిపోసే ఉద్దేశ్యంతో ఇలా చెప్పుకోవచ్చు. ప్రదర్శనాబుద్ధితో మాత్రం చెప్పరాదు.

26-2. ఈ ఉల్లేఖనం 'కితాబుల్ మగాజీ'లో వివరంగా రానుంది.

169-1. ఉహుద్ యుద్ధ సందర్భంగా ఒక దశలో తల్హా (రజి), సాద్ (రజి) మాత్రమే దైవప్రవక్త(సఅసం) దగ్గర ఉండిపోయారు. తల్హా (రజి) చేయి అప్పుడు చచ్చుబడి పోయింది. ఎందుకంటే దైవప్రవక్త(స)పై జరిగే నిరంతర దాడులకు ఆయన తన చేతిని అడ్డుపెట్టి ప్రవక్త(స)ను రక్షించారు.

ప్రవక్తా! లాభాలు గనక తేలికగా లభిస్తే, ప్రయాణం సులభతరమైతే వారు తప్పకుండా మీ వెంట రావటానికి సిద్ధపడేవారు. కాని వారికి ఈ మార్గం ఎంతో శ్రమతో కూడినదిగా కనిపించింది. ఇప్పుడు వారు దేవునిపై మాటిమాటికీ ప్రమాణం చేసి మరీ అంటారు; మేము గనక రాగల స్థితిలో ఉన్నట్లయితే, నిశ్చయంగా మీ వెంట వచ్చిఉండేవారమని. వారు తమను తాము వినాశంలో పడవేసుకుంటున్నారు. వారు అబద్ధం చెప్పేవారని అల్లాహ్‌కు బాగా తెలుసు". *(అత్ తౌబా : 41,42)*

ఇంకా ఈ విధంగా సెలవిచ్చాడు: **"విశ్వసించిన ప్రజలారా! మీకు ఏమైనది, మీతో అల్లాహ్ మార్గంలో బయలుదేరండి అని చెప్పినప్పుడు, మీరు నేలకు అతుక్కుపోయారు? మీరు పరలోకానికి మారుగా ప్రాపంచిక జీవితాన్ని కోరుకున్నారా? అలా అయితే మీరు తెలుసుకోవాలి. ప్రాపంచిక జీవితపు సకల సామగ్రి పరలోక సుఖాల ముందు స్వల్పాతి స్వల్పమైనదిగా తేలుతుందని." (అత్ తౌబా : 38,39)**

**(మొదటి వచనానికి వ్యాఖ్యానంగా) హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఏమంటారంటే; వేర్వేరు (చిన్న చిన్న) దళాలను తయారు చేసి బయలుదేరండి.**

**170)** మక్కా విజయం నాడు మహనీయ ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించారని హ్రజత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖించారు :**"మక్కా విజయం తర్వాత (ఇప్పుడు మక్కా నుండి మదీనాకు) హిజ్రత్ చేసే ఆవశ్యకత మిగులలేదు. అయితే సంకల్పశుద్ధితో జిహాద్ చేసే ఆవశ్యకత మాత్రం మిగిలి ఉంది. కాబట్టి మిమ్మల్ని జిహాద్ కొరకు పిలిచినప్పుడు (వెంటనే) బయలుదేరండి."**

## అధ్యాయం : 28

## ఒకవేళ ఎవరయినా అవిశ్వాస స్థితిలో ముస్లింను చంపి, పిమ్మట ముస్లింగా మారితే, ఆ తర్వాత ఇస్లాంపై స్థిరంగా ఉంటే, అల్లాహ్ మార్గంలో సతత సమరం సాగిస్తే- అటువంటి వ్యక్తి ఘనత్వం

హ్రజత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు: "(ప్రళయదినాన) అల్లాహ్ ఇద్దరు మనుషుల పరిస్థితిపై నవ్వుతాడు. వారిలో ఒకతను మరొకతన్ని చంపాడు. కాని వారిద్దరూ స్వర్గంలో ప్రవేశించారు. మొదటి వ్యక్తి దైవమార్గంలో పోరాడి అమరగతి నొందాడు. ఆ తర్వాత అల్లాహ్ హంతకునికి పశ్చాత్తాపపడే సద్బుద్ధిని వొసగాడు. అందువల్ల

**అతను కూడా దైవమార్గంలో వీర మరణం పొందాడు. ఆ విధంగా వారిద్దరూ- హతుడు, హంతకుడు కూడా- ఎట్టకేలకు స్వర్గంలో ప్రవేశార్హత పొందారు." [1]**

**171) అబూహురైరా (రజి) తనకు తెలియజేశారని అన్‌బస బిన్ సయీద్ చెప్పారు. అబూ హురైరా(రజి) ఇలా తెలిపారు: నేను దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చి నప్పుడు, ఆయన(స) ఖైబర్‌లో విడిది చేసి ఉన్నారు. అప్పటికే ఖైబర్ కైవసమయింది. 'దైవప్రవక్తా! (యుద్ధప్రాప్తిలో) నాకూ వాటా ఇవ్వండి' అని నేను విన్నవించు కున్నాను. ఇది విని సయీద్ బిన్ ఆస్ కుమారులలో ఒకతను (అబ్బాన్ బిన్ సయీద్-రజి) 'దైవప్రవక్తా! ఈయన గారికి వాటా ఇవ్వకండి' అని చెప్పాడు. దానికి సమాధానంగా అబూహురైరా (రజి), 'ఇతగాడు ఇబ్నె ఖౌఖల్ (నూమాన్ బిన్ మాలిక్-రజి) హంతకుడు కదూ!' అన్నారు. దీనిపై స్పందిస్తూ అబ్బాన్ బిన్ సయీద్(రజి)ఇలా అన్నారు: 'ఎంత ఆశ్చర్యకరం! పర్వతంపై గొర్రెల్ని మేపుకునే ఈ పశువు (అంటే అబూహురైరా -రజి) ఇపుడిపుడే ఇక్కడ ఊడి పడి, నన్ను హంత కుడని ఆరోపిస్తున్నాడు. అల్లాహ్ ఎవరికయితే నా చేతుల మీదుగా (వీర మరణాన్ని ఆస్వాదించే) గౌరవం వొసగాడో, ఇంకా నన్ను అతని ద్వారా పరాభవంపాలు కాకుండా కాపాడాడో ఆయనకు కృతజ్ఞతలు. (ఒకవేళ నేను గనక ఆ సమయంలో వధించబడి ఉంటే) నేను నరకాగ్నికి ఆహుతి అయ్యేవాడినే. ఈ సంగతి ఈయన గారికి తెలియదు'. మరి ప్రవక్త మహనీయులు(స) అబూహురైరా (రజి) వాటా నిర్ధారించారో లేదో తనకు తెలియలేదని అన్‌బసా చెప్పారు - సుఫ్యాన్ ఇలా**

---

28-1. నియమం ప్రకారం హంతకుడు, హతుడు- ఇద్దరూ ఒకేచోట ఉండకూడదు. వీర మరణం పొందిన హతుడైన ముస్లిం స్వర్గానికి వెళితే, నరహంతకుడు కచ్చితంగా నరకంలో పడవెయ్యబడాలి. కాని అల్లాహ్‌కు స్వయంగానే తన లీలలపై ఆశ్చర్యమేసింది. వారిద్దరూ స్వర్గంలో ప్రవేశార్హత సంపాదించటమే అల్లాహ్ ఆశ్చర్యానికి కారణం. అందుకే అల్లాహ్ నవ్వేశాడు. మరి చూడబోతే హంతకుడైన అవిశ్వాసికి పశ్చాత్తాప పడే సద్బుద్ధిని వొసగి, అతనికి విశ్వాస (ఈమాన్) భాగ్యాన్ని కూడా ప్రసాదించి, స్వర్గవాసిగా అతనికి మార్గం చూపిన వాడు అల్లాహ్‌యే.

ఈ హదీసు ద్వారా తేటతెల్లమైనదేమంటే; జిహాద్ చేయటం వల్ల అవిశ్వాస స్థితిలో జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి. కాని ఒక వ్యక్తి ముస్లిం అయివుండి కూడా ఉద్దేశపూర్వకంగా తోటి ముస్లింను చంపి, దైవమార్గంలో అమరగతి నొందితే అతని పాపాలు క్షమించబడవు.

**అన్నారు: సయీదీ తన తాత గారి ఆధారంగా నాకు ఈ విషయాన్ని వినిపించారు. ఆయనేమో అబూహురైరా (రజి) నుండి ఉటంకించారు. ఇక్కడ 'సయీదీ' అంటే అమ్ర్ బిన్ యహ్యా బిన్ సయీద్ బిన్ అమ్ర్ బిన్ సయీద్ బిన్ ఆస్ అని ఇమామ్ బుఖారీ (రహ్మ) పేర్కొన్నారు.[1]**

## అధ్యాయం : 29

## జిహాద్ (నఫిల్) ఉపవాసాలకన్నా మిన్న

**172) అబూ తల్హా జైద్ బిన్ సుహైల్ (రజి) మహాప్రవక్త(సఅసం) కాలంలో జిహాద్‌లో పాల్గొనే ఉద్దేశంతో (నఫిల్) ఉపవాసాలుండేవారు కారు. అయితే మహా ప్రవక్త(సఅసం) పరమపదించిన తరువాత ఆయన ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్హా తప్ప మిగిలిన రోజులలో ఉపవాసం పాటించకుండా ఉండటం నేను చూడలేదని హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు.**

---

171–1. ఉల్లేఖనంలో వచ్చిన 'ఇబ్నె ఖౌఖల్' అంటే నోమాన్ బిన్ మాలిక్ బిన్ సాలబా బిన్ ఇఫ్రామ్ బిన్ ఫుహర్ బిన్ గనమ్ సహాబి. **ఖౌఖల్** అనేది ఈయన తాతగారి బిరుదు. ఆయన ఉహుద్ యుద్ధం జరిగిన రోజు అబ్బాన్ చేత అమరగతినొందారు. 'ఓ అల్లాహ్! సూర్యాస్తమయం కాకముందే స్వర్గంలో సైరు చేసే భాగ్యాన్ని నాకు ప్రసాదించు' అని ఆయన ఆ రోజు వేడుకున్నారు. అల్లాహ్ ఆయన ప్రార్థనను ఆలకించి ఆమోదించాడు. సూర్యుడు అస్తమించక ముందే ఆయన వీర మరణాన్ని ఆస్వాదించారు.

**'వబ్ర్'** అనేది అరేబియా ప్రదేశంలో ఉండే ఒక జంతువు. అది పిల్లికన్నా పొట్టిగా ఉంటుంది. దాని చెవులు, తోక కూడా మరీ చిన్నవి. దౌస్ తెగకు చెందిన అబూహురైరా పొట్టిగా ఉండటం వల్ల అబ్బాన్ ఆయన్ని వబ్ర్‌తో పోల్చారు. వ్యంగ్యంగా మాట్లాడారు. అసలు విషయం ఏమిటంటే అబ్బాన్ అప్పటికింకా ముస్లిం కాలేదు. ఉహుద్ యుద్ధం తరువాత (హుదైబియా సంధి జరిగిన కాలంలో) ఈయన ఇస్లాం స్వీకరించారు.

అజ్ఞాన కాలంలో అబ్బాన్ నోమాన్‌ను చంపారు. అల్లాహ్ ఆయనకు 'షహాదత్' భాగ్యాన్ని ప్రసాదించాడు. మరోవైపు అబ్బాన్‌కు కూడా విశ్వాస (ఈమాన్) భాగ్యం వొసగాడు. ఒకవేళ అబ్బాన్ గనక అవిశ్వాస (కుఫ్ర్) స్థితిలో మరణించి ఉంటే నరకాగ్నికి ఆహుతి అయ్యేవారే. హుదైబియా ఒడంబడిక జరిగిన తరువాత ఆయన ఇస్లాం స్వీకరించారు.

అబ్బాన్ చెప్పిన మాటలు విని ప్రవక్త మహనీయులు(సఅసం) మౌనం వహించారు. అధ్యాయంలోని ప్రధానాంశం ఇదే. (హంతకుడు, హతుడు ఇద్దరూ స్వర్గంలో ప్రవేశించారు). దైవప్రవక్త(స) అబూహురైరా (రజి)కు యుద్ధప్రాప్తిలో వాటా ఇవ్వలేదని కూడా తెలుస్తోంది.

## అధ్యాయం : 30

## దైవమార్గంలో చంపబడటం గాకుండా అమరగతికి సంబంధించిన మరో ఏడు రకాలున్నాయి.

**173)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : అమరవీరులు అయిదు రకాల వారుంటారు– ప్లేగు వ్యాధితో అంతమైనవాడు, ఉదర జబ్బుతో మరణించినవాడు, ముంపునకు గురై ప్రాణం కోల్పోయినవాడు, (ఏదైనా బరువు క్రింద) అణగి ఊపిరాడక చనిపోయిన వాడు, దైవమార్గంలో వీర మరణం పొందినవాడు."

**174)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ఉపదేశించారు : "ప్లేగు వ్యాధి వల్ల వచ్చే మరణం ప్రతి ముస్లిం పాలిట షహాదత్(అమరగతి) స్థాయి కలిగి ఉంటుంది."[1]

## అధ్యాయం : 31

## దైవోపదేశం

"కారణమేదీ లేకుండానే ఇంటి వద్ద కూర్చుండిపోయే ముస్లిములు, అల్లాహ్ మార్గంలో తమ ధనప్రాణాలతో "జిహాద్" చేసే ముస్లిములు – ఉభయుల స్థానం సమానం కాదు. కూర్చుండిపోయేవారి స్థానం కంటే ధన ప్రాణాలతో "జిహాద్" చేసేవారి స్థానాన్ని అల్లాహ్ సమున్నతం చేశాడు. ప్రతి ఒక్కరికి అల్లాహ్ మేలునే వాగ్దానం చేసిన మాట వాస్తవమే అయినా ఆయన వద్ద ముజాహిద్‌ల సేవలకు లభించే ప్రతిఫలం, కూర్చుండిపోయే వారికి లభించే ప్రతిఫలం కంటే ఎంతో ఎక్కువ. వారి కొరకు అల్లాహ్ తరపు నుండి ఉన్నత స్థానాలూ ఉన్నాయి. క్షమాభిక్ష, కారుణ్యం కూడా ఉన్నాయి. అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడూ అమితంగా కరుణించేవాడూను." *(అన్ నిసా: 95, 96)*

---

174–1. అందుకే ప్లేగు వ్యాధి సోకిన ప్రాంతాల నుండి పరారవటం అవాంఛనీయం. వారించ దగిన విషయం. ఈ వ్యాధి లక్షణాలలో ఒకటేమంటే దానికి గురైన మనిషి మెడపై లేదా చంకలో వాపు వస్తుంది. తీవ్రమైన జ్వరం వచ్చి రోగి రెండుమూడు రోజులలోపే మృత్యు వాతన పడతాడు. దీనిని అరబీ, ఉర్దూ భాషలలో 'తావూన్' అంటారు.

**175) అబూ ఇస్‌హాఖ్ కథనం: నేను బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా విన్నాను. ఆయన ఇలా అనేవారు- లా యస్తవిల్ ఖాయిదూన మినల్ మోమినీన్ (అన్ నిసా- 95) ఆయత్ అవతరించినప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసం) జైద్ బిన్ సాబిత్(రజి)ని పిలిచారు. ఆయన(రజి) ఒక వెడల్పాటి ఎముకతో సహా హాజరై ఈ ఆయత్‌ను లిఖించారు. ఇబ్నె ఉమ్మె మక్తూమ్ తన అంధత్వపు వైకల్యం గురించి బాధతో చెప్పుకున్నప్పుడు ఈ ఆయత్ అవతరించింది.[1]: లా యస్తవిల్ ఖాయిదూన....**

**176) హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ (రజి) వివరించారు : నేను మర్వాన్ బిన్ హకమ్ (అప్పటి మదీనా పురపాలకుడు)ను మస్జిదె నబవీలో కూర్చుని ఉండగా చూచి, ఆయనకు దగ్గరగా వెళ్ళాను. ఆఖరికి ఆయన ప్రక్కనే కూర్చున్నాను. పిదప ఆయన మాకు ఇలా తెలిపారు - జైద్ బిన్ సాబిత్ అన్సారీ (రజి) నాతో ఏమన్నారంటే; ప్రవక్త మహనీయులు(సఅసం) తన చేత ఈ ఆయత్ వ్రాయించారు: లా యస్తవిల్ ఖాయిదూన మినల్ మోమినీన వల్ ముజాహిదూన ఫీ సబీలిల్లాహి... అంతలోనే అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి) అక్కడికి విచ్చేశారు. 'దైవప్రవక్తా! ఒకవేళ నాలో ధర్మయుద్ధం చేసేటంతటి సామర్థ్యం ఉంటే నేను కూడా ధర్మ యుద్ధంలో పాల్గొనేవాణ్ణి కదా!' అని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు. ఎందుకంటే ఆయన అంధులు. అప్పుడు అల్లాహ్ తన ప్రవక్త(స)పై దివ్యవాణి (వహీ)ని అవతరింపజేశాడు. ఆ సమయంలో ఆయన(స) తొడ నా తొడపైన ఉంది. ఆయన (స)పై అవతరించిన దివ్యవాణి ఒత్తిడి కారణంగా ఆయన(స) తొడ ఎంత బరువుగా ఉందనిపించిందంటే, బహుశా నా తొడ విరిగిపోతుందేమోనని నేను భయపడ్డాను. ఆ తర్వాత క్రమేణా ఆ స్థితి దూరమవసాగింది. అల్లాహ్ ఈ ఆయత్‌లో ఒక పదం అదనంగా చేర్చుతూ 'ఘైరు ఊలిజ్జరర్' (తగు కారణమేదీ లేకుండానే)ను అవతరింపజేశాడు.**

---

175-1. అంధత్వం, కుంటితనం, పక్షవాతం వంటివి అంగవైకల్యం క్రిందికి వస్తాయి. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ అంధులు. ఇలాంటి దివ్యాంగులు షరీఅత్ పరమైన కారణం వల్ల యుద్ధంలో పాల్గొనలేక పోయినప్పటికీ వారి స్థాయికి వాటిల్లే ముప్పేమీ లేదు. అల్లాహ్ ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన బరువు మోపడు.

## అధ్యాయం : 32

## అవిశ్వాసులతో పోరాడేటప్పుడు మొక్కవోని సాహసాన్ని చూపాలి

**177) సాలిమ్ అబూ నజర్ కథనం : అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి) గారు (ఉమ్ర్ బిన్ ఉబైదుల్లాహ్‌కు) వ్రాసిన ఉత్తరాన్ని నేను చదివాను. అందులో దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లు ఉంది: "మీరు అవిశ్వాసులను మార్కొన్న పుడు స్థయిర్యాన్ని (నిలకడను) ప్రదర్శించండి."[1]**

## అధ్యాయం : 33

## సత్య తిరస్కారులతో పోరాడండి అని ముస్లింలను ప్రేరేపించటం

దైవోపదేశం: **"ప్రవక్తా! ముస్లింలను యుద్ధానికి పురికొలుపు."**

***(అల్ అన్‌ఫాల్– 65)***

**178) హజ్రత్ అనస్ (రజి) చెప్పగా తాను విన్నానని హుమైద్ తెలిపారు. ఆయన ఇలా చెబుతుండేవారు : (కందక యుద్ధం మొదలవక కొన్నాళ్ళ ముందు కందకం త్రవ్వుతుండగా) ప్రవక్త మహనీయులు(స) ఆ కందక ప్రదేశం వైపునకు వెళ్ళారు. ముహాజిర్లు, అన్సార్లు తీవ్రమైన చలికి సైతం లెక్క చేయకుండా తెలతెల వారుతుండగానే కందకం త్రవ్వటంలో నిమగ్నులైపోయారు. ఆ పనిలో సహాయ పడటానికి వారి వద్ద బానిసలు కూడా లేరు. వారి అలసటను, ఆకలిబాధను చూసి దైవప్రవక్త(స) ఇలా ప్రార్థించారు–"ఓ అల్లాహ్! జీవితమంటే పరలోక జీవితమే. కనుక అన్సార్లను, ముహాజిర్లను మన్నించు." దీనికి జవాబుగా ప్రవక్త ప్రియ సహచరులు (రజిఅల్లాహు అన్‌హుమ్) ఇలా అన్నారు: 'ప్రవక్త ముహమ్మద్ (సఅసం) చేతిలో చెయ్యేసి విధేయతా ప్రమాణం చేసినవారము మేము. మా బొందిలో ప్రాణమున్నంత వరకూ మేము పోరాడుతూనే ఉంటాము.'**

---

177–1. అంటే తగు కారణమేదీ లేకుండా రణరంగంలో నుండి వెన్నుచూపి పారిపోకండి. రణరంగంలో మొక్కవోని సాహసాన్ని, నిలకడను ప్రదర్శించటం చాలా అవసరం. రణతంత్రపుటెత్తుగడలో భాగంగా వెనక్కి జరిగితే తప్పులేదుగాని అకారణంగా పారిపోకూడదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "విశ్వాసులారా! సహనం ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి. సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు."

*(అల్ బఖరా : 153)*

## అధ్యాయం : 34

## కందకం (అగడ్త) త్రవ్వకం గురించి

**179)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: (అరేబియాలోని కూటము లన్నీ కలసి మదీనాపై దండెత్తే ప్రమాదం పొంచి ఉన్నప్పుడు) మదీనా నగరం చుట్టుపక్కల కందకం త్రవ్వటంలో ముహాజిర్లు, అన్సార్లు నిమగ్నులైపోయారు. వారు మట్టిని తమ వీపులపై మోస్తూ ఈ విధంగా పలకసాగారు–

"ముహమ్మద్ (స) చేతిలో చెయ్యేసి జిహాద్ చేస్తామని ప్రతిజ్ఞ చేసినవారము మేము. మా బొందిలో ప్రాణమున్నంత వరకూ ఈ మాటకు కట్టుబడి ఉంటాము."

వారి ఈ పలుకులకు సమాధానంగా దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రార్థించేవారు :

"అల్లాహ్! పరలోకంలోని శుభం తప్ప మరొక శుభం లేదు. కనుక (ఓ ప్రభూ!) నీవు అన్సార్లలో ముహాజిర్లలో శుభాన్నీ, సమృద్ధిని వొసగు."

**180)** బరా బిన్ ఆజిబ్(రజి) చెబుతుండగా తాను విన్నానని అబూ ఇస్హాఖ్ తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసం) కందకం త్రవ్వుతున్నప్పుడు మట్టిని లేపుతూ, "ఓ అల్లాహ్! నీవే గనక లేకపోతే మాకు సన్మార్గ భాగ్యం ప్రాప్తమయ్యేది కాదు"[1] అని పలికేవారు.

**181)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) కథనం : నేను అహ్జాబ్ (కందక) యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(సఅసం)ను చూశాను. ఆయన (స) స్వయంగా మట్టి(తట్ట)ని మోస్తున్నారు. ఆ మట్టి వల్ల ఆయన(స) పొట్టపైని తెలుపుదనం దాగిపోయింది. ఆ సమయంలో ఆయన(స) ఇలా పలుకుతున్నారు–

"నీవే గనక మాకు సన్మార్గం చూపకపోతే మోక్షం ఎలా లభించేది? మేము నమాజ్ ఎలా చేసేవారము? జకాత్ ఎలా ఇచ్చేవారము? ఓ మహోన్నత సద్గుణ సంపన్నుడా! మాపైన ప్రశాంత స్థితిని అవతరింపజెయ్యి. మా పాదాలకు నిలకడను వొసగు, యుద్ధంలో మాకు స్థయిర్యమొసగు. ఈ సత్యతిరస్కారులు అకారణంగా

180–1. కందక యుద్ధాన్ని 'అహ్జాబ్ యుద్ధం'గా కూడా వ్యవహరిస్తారు. ఈ యుద్ధం హిజ్రీ 5వ సంవత్సరం షవ్వాల్ మాసంలో జరిగింది. అరేబియాలోని ప్రధాన సైనిక కూటములన్నీ ఒక్కటై మదీనాపై దండెత్తి వచ్చాయి. అయితే అల్లాహ్ వారిని పరాభవం పాల్జేసి వెనక్కి తిప్పాడు. ఈ యుద్ధానికి సంబంధించిన కొన్ని భయంకర సన్నివేశాలు సూరయె అహ్జాబ్‌లో వచ్చాయి.

మాపై దండెత్తి వచ్చారు. వారు మమ్మల్ని పెడత్రోవ పట్టిస్తే మేమిక వారి మాటను వినబోము". [1]

## అధ్యాయం : 35

## తగు కారణం వల్ల ధర్మయుద్ధంలో పాల్గొనలేకపోయిన వారి గురించి

**182)** అనస్ బిన్ మాలిక్(రజి) వివరించారు: "మేము దైవప్రవక్త (సఅసం)తో పాటు తబూక్ యుద్ధం నుండి తిరిగి వచ్చాము."

**183)** మహనీయ అనస్ బిన్ మాలిక్ (రజి) తెలిపారు: మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఒక యుద్ధ ప్రయాణంలో ఉన్నప్పుడు ఇలా అన్నారు- "కొంత మంది మా వెనుక మదీనాలోనే ఉండిపోయారు. కాని మనం ఏ పర్వత కనుమలో నుండి, లోయలో నుండి సాగిపోతున్నా పుణ్యఫలం పొందే విషయంలో వారూ మనతోనే ఉన్నారు. వారు తగు కారణంవల్ల మాత్రమే మన వెంట రాలేకపోయారు."

## అధ్యాయం : 36

## జిహాద్‌లో ఉపవాసముండటం

**184)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించగా తాను విన్నానని అబూ సయీద్ ఖుద్రీ (రజి) చెప్పారు : "ఎవరయితే దైవమార్గంలో (జిహాద్ చేస్తూనే) ఒక్క ఉపవాసమైనా ఉంటాడో, అల్లాహ్ అతన్ని నరకానికి డెబ్భయి ఏండ్ల ప్రయాణ దూరానికి దూరంగా ఉంచుతాడు."

## అధ్యాయం : 37

## దైవ మార్గం (జిహాద్)లో ఖర్చు : దాని మహత్తు

**185)** హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "ఎవరయితే అల్లాహ్ మార్గంలో (ఏ వస్తువు అయినా) ఒక జత ఖర్చుపెడతాడో[1], అతనిని స్వర్గ ద్వారపాలకులు

---

181-1. అంటే, "ఓ అల్లాహ్! శత్రువులు మాపై దాష్టీకానికి పాల్పడ్డారు. మాపై కయ్యానికి కాలుదువ్వారు. అందువల్ల మార్గాంతరంలేక మేము ప్రతిఘటనకు సన్నద్ధులం అయ్యాము"- దీనినిబట్టి అవగతమయ్యేదేమంటే, ఆత్మరక్షణ కోసం, పీడనను అంతమొందించటం కోసం ఇస్లామీయ యుద్ధం జరుగుతుంది.

185-1. ఈ హదీసులో కూడా 'దైవ మార్గం' అంటే అది ధర్మయుద్ధమేనని చెప్పటం జరిగింది. ఒక జత ఖర్చుపెట్టడం అంటే, ఏ వస్తువు అయినా కనీసం రెండుకు తగ్గకుండా ఇవ్వాలి.

పిలుస్తారు. స్వర్గం యొక్క ప్రతి ద్వారపాలకుడు అతనిని (తన వైపునకు) పిలుస్తూ, 'ఓ ఫలానా వ్యక్తీ! ఇదిగో, ఈ ద్వారం నుండి ప్రవేశించు' అంటుంటాడు." ఇది విన్న అబూబకర్(రజి), 'దైవప్రవక్తా! అలాగైతే ఆ వ్యక్తికి ఎలాంటి భయం ఉండదు కదా!' అని చెప్పగా, "నీవు కూడా ఆ సౌభాగ్యవంతులలో ఒకడివని నేను ఆశిస్తు న్నాను" అని మహాప్రవక్త (స) అన్నారు.

**186)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసం) వేదికపైకి వచ్చి ఇలా ఉపన్యసించారు– "నా తదనంతరం మీపైన మేళ్ళ (శుభాల) ద్వారాలు తెరిచివేయబడతాయి (అంటే ధనధాన్యాలు, సిరిసంపదలు మీ వద్ద ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడతాయి). మీరు వాటిలో ఎక్కడ మునిగిపోతారోనని మీ గురించి భయపడుతున్నాను." తరువాత ఆయన(స) ప్రాపంచిక తళుకుబెళు కుల గురించి ప్రస్తావించారు. మొదట ప్రాపంచిక శుభాల గురించి ప్రస్తావించి, పిదప వాటి రంగుల గురించి విశదీకరించారు. అంతలో ఒక సహచరుడు లేచి, 'దైవప్రవక్తా! ఏమిటి, మేలు కూడా కీడును సృజిస్తుందా?' అని సందేహపడగా, దైవప్రవక్త(స) కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఆయన(స)పై దివ్యవాణి (వహీ) అవతరిస్తోందని మేము తలపోశాము. అందరూ ఎంత నిశ్శబ్దంగా, నిశ్చ లంగా ఉండిపోయారంటే, వారి తలలపై పక్షులు వాలి ఉన్నాయా! అనిపించింది. ఆ తరువాత ఆయన(స) తన మోముపైనున్న చెమట బిందువులను తుడుచుకుని, "ప్రశ్నించిన వాడెక్కడ?" అనడిగారు. "ఏమిటి, ఇవి కూడా (ప్రాపంచిక మేళ్ళు, సిరిసంపదలు కూడా) మేళ్ళేనా?" మొత్తం మూడుసార్లు ఆయన(స) ఈ వాక్యాన్ని పునరుక్తం చేశారు. ఆపైన ఇలా అన్నారు: "చూడండి! వసంత రుతువులో మొలిచిన పచ్చగడ్డి పశువును చంపేస్తుంది. లేదా చావుకు దగ్గరగా తీసుకుపోతుంది. కాని ఏపుగా పెరిగిన ఆ గడ్డిని తిన్న పశువు బ్రతికిపోతుంది. కడుపు నిండగానే అది సూర్యుని ముందు నిలబడి నెమరువేస్తుంది. లద్దె పేడ వేస్తుంది. ఉచ్చపోస్తుంది. (గడ్డి) జీర్ణమవగానే మళ్ళీ మేత మేస్తుంది. ఈ సిరిసంపదలు కూడా అంతే. పైకి పచ్చగా నవనవలాడుతూ, తియ్యగా ఉంటాయి. ధర్మసమ్మతమైన పద్ధతుల ద్వారా ఆర్జించి, కూడబెట్టి ఆ తర్వాత దైవమార్గంలో, అనాథల కోసం, అగత్యపరుల కోసం అంకితం చేసిన ముసల్మాను సంపద ఎంత చక్కనిది! కాని ఎవరయితే అధర్మ మార్గాల ద్వారా సంపాదించి కూడబెడతాడో అతడు ఎంత తిన్నా ఎప్పటికీ కడుపు నిండదు. ఆ సంపద ప్రళయదినాన అతనికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తుంది."

## అధ్యాయం : 38

## యోధుని కొరకు సామానును సమకూర్చిన వాని లేదా అతని వెనుక అతని ఇంటివారల మంచీ చెబ్బరలను పట్టించుకున్న వాని గొప్పతనం

**187)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని జైద్ బిన్ ఖాలిద్ (రజి) తెలిపారు : "ఎవరయితే దైవమార్గంలో పోరాడే వానికి కావలసిన వస్తువులను ఇచ్చాడో అతడు (ఒక విధంగా) యుద్ధంలో పాల్గొన్నవాడయ్యాడు."

**188)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసం) మదీనాలో తన సతీమణుల వద్దకు తప్ప మరే మహిళ ఇంటికీ వెళ్ళేవారు కారు. అయితే ఉమ్మె సులైమ్ వద్దకు మాత్రం వెళుతూ ఉండే వారు. దీనికి కారణమేమిటని జనులు ఆయన్ని(స) అడగ్గా, "నాకు ఆమె మీద జాలే స్తుంది. ఆమె సోదరుడు (హరామ్ బిన్ మిల్హాన్) నా పని మీద వెళ్ళి అమరగతి నొందాడ"ని[1] ఆయన(స) వివరించారు.

## అధ్యాయం : 39

## యుద్ధ సందర్భంగా సువాసన పూయటం

**189)** మూసా బిన్ అనస్ కథనం : ఈయన యమామా యుద్ధం[1] గురించి ప్రస్తావించినపుడు, ఇలా అన్నారు- మా నాన్నగారైన అనస్ బిన్ మాలిక్(రజి) సాబిత్ బిన్ ఖైస్(రజి)[2] వద్దకు వచ్చినపుడు ఆయన తన తొడలకు సువాసన పూసుకుంటున్నారు. "బాబాయి! మీరు యుద్ధరంగానికి ఎందుకు రాలేదు?" అని అనస్ (రజి) అడిగితే, "అబ్బాయి! ఇప్పుడే వస్తున్నాను" అంటూ మళ్ళీ సువాసన పూసుకోసాగారు. ఆ తరువాత (కఫన్ వస్త్రం తొడిగి) సిపాయిల పంక్తిలో వచ్చి

---

188–1. హరామ్ బిన్ మిల్హాన్(రజి) గురించి ఇంతకుముందు కూడా వచ్చింది. దైవప్రవక్త(స) పంపిన 70 మంది ధర్మప్రచారకులలో ఆయన ఒకరు. బైరె మవూనా వద్ద మోసంతో వధించబడిన ఆ 70 మంది అమరవీరులలో హరామ్ బిన్ మిల్హాన్(రజి) ఒకరు.

ఇకపోతే ఉమ్మె సులైమ్ (ర.అ) దైవప్రవక్త(స) కొరకు మహ్రమ్ మహిళ. ఆయన ఆమెకు పాలవరుస పిన తల్లి అని పేర్కొనటం జరిగింది. అందువల్లనే దైవప్రవక్త(స) ఆమె ఇంటికి రాకపోకలు సాగించేవారు.

**కూర్చున్నారు. 'ఈ యుద్ధంలో ముస్లింల శ్రేణుల్లో బలహీనత పొడసూపింది' అని అనస్ చెప్పబోతే, సాబిత్ కోపంతో, "జరగండి, సత్య తిరస్కారులపై విరుచుకుపడటానికి మాకు చోటు ఇవ్వండి. దైవప్రవక్త(స) వెంట ఉండగా మనం ఇలా ఊగిసలాడే వారం కాము. మీరు మీ శత్రువులకు అలుసైపోయారు.[3] (అంటే యుద్ధరంగం నుండి పలాయనం చిత్తగించి మీ బలహీనతను బయట పెట్టుకున్నారు) అందువల్ల శత్రువులు మిమ్మల్ని వెంటాడుతున్నారు" అని అన్నారు.**

## అధ్యాయం : 40

## శత్రువుల కదలికలను పసిగట్టే గూఢచార దళం- దాని విశిష్ఠత

**190) హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖనం: ప్రవక్త మహనీయులు (సఅసం) కందక యుద్ధం నాడు, "శత్రు సేనల సమాచారాన్ని నాకు చేరవేసే వారెవరు?" అని ప్రశ్నించగా, 'నేను' అని జుబైర్(రజి) బదులిచ్చారు. ఆయన(స) మళ్ళీ ఇలాగే ప్రశ్నించగా, ఈసారి కూడా 'నేను' అని జుబైర్(రజి) సమాధానమిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(సఅసం), "ప్రతి ప్రవక్తకు నికార్సయిన సహాయకులు(హవారీలు) ఉంటారు. నా సహాయకుడు జుబైర్" అని పలికారు.**

---

189–1. బూటకపు ప్రవక్త ముసైలిమా కిజ్జాబ్‌తో జరిగిన యుద్ధం అది. హిజ్రీ 12వ యేట ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబకర్(రజి) కాలంలో ఈ యుద్ధం జరిగింది. తాయఫ్‌కు రెండు 'మంజిల్'ల దూరంలో ఉన్న ప్రదేశం యమామా.

189–2. ఈయన అన్సార్లలోని సుప్రసిద్ధ వక్త. గొప్ప యోధుడు.

189–3. తిబ్రానీలోని ఒక ఉల్లేఖనం ప్రకారం సాబిత్ బిన్ ఖైస్(రజి) రెండు తెల్లటి వస్త్రాలను (కఫన్ వస్త్రం) చుట్టుకుని, సువాసన పూసుకుని రణరంగానికి వచ్చారు. అప్పటికి ముస్లింలు ఓటమి అంచున ఉన్నారు. "ఓ అల్లాహ్! నేను సత్య తిరస్కారుల చేష్టలతో తెగత్రెంపులు చేసుకుంటున్నాను. ముస్లింల నిర్వాకంపై కూడా క్షమాపణ కోరుకుంటున్నాను" అని చెబుతూ శత్రువులపై విరుచుకుపడ్డారు. వీరోచిత పోరాటం సాగిస్తూ వీర మరణాన్ని ఆస్వాదించారు. ఈయన యుద్ధ కవచాన్ని ఎవరో దొంగిలించారు. ఒక ముస్లిం సిపాయికి ఈయన కలలో కనిపించి, "నా కవచం ఫలానా స్థలంలో దాచిపెట్టబడింది" అని అంటూ కొన్ని వసీయతులు చేశారు. వెళ్ళి చూస్తే, ఆయన చెప్పినచోటే కవచం కనిపించింది. ఆయన చేసిన వసీయతులన్నీ అమలుపరచబడ్డాయి. సుబ్‌హానల్లాహ్!

## అధ్యాయం :41

## గూఢచర్యం కొరకు ఒక్కగానొక్క వ్యక్తిని పంపించవచ్చునా?

**191)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) తన సహచరులను (బనూ ఖురైజా సమాచారం తీసుకురమ్మని) కోరారు. (ఇమామ్ బుఖారీ గురువర్యులైన) సదఖా ఇలా అన్నారు. 'నాకు తెలిసినంతవరకు ఇది కందక యుద్ధ సంఘటన'- ప్రవక్త మహనీయుల(స) పిలుపుపై జుబైర్ 'చిత్తం. నేను హాజరయ్యాను' అన్నారు. దైవప్రవక్త(స) రెండవసారి పిలువగా, ఈసారి కూడా జుబైర్(రజి) 'నేను హాజరయ్యాను' అని సమాధానమిచ్చారు. అప్పుడు దైవ ప్రవక్త(స): "ప్రతి ప్రవక్తకు హవారీలుంటారు. ఇక నా విషయానికి వస్తే, నా హవారీ జుబైర్ బిన్ అవ్వామ్(రజి)" అన్నారు.

## అధ్యాయం : 42

## ఇద్దరు వ్యక్తులు కలసి ప్రయాణించటం

**192)** మాలిక్ బిన్ హువైరిస్ (రజి) తెలిపారు: మేము ప్రవక్త మహనీయుల (సఅసం) వద్ద నుండి మా ప్రదేశానికి తిరిగి వస్తున్నప్పుడు ఆయన(స) మా ఇద్దరికీ- నేనొకణ్ణి, మరొకరు నా సహవాసికీ - ఇలా ఉపదేశించారు. "(ప్రతి రోజు నమాజు వేళ) అజాన్ ఇవ్వాలి. ఇఖామత్ పలకాలి. మీరిద్దరిలో వయసులో పెద్ద వారు నమాజ్‌కు నేతృత్వం వహించాలి."

## అధ్యాయం : 43

## ప్రళయం వరకూ అశ్వం నుదుటికి శుభం కట్టబడి ఉంటుంది.[1]

**193)** ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు: "ప్రళయదినం వరకూ గుర్రం నుదుటిని

43-1. వాహనాలలోకెల్లా శ్రేష్ఠమైనది అశ్వం. విశ్వాస పాత్రత, తెగింపు రీత్యా ఈ పశువు మనిషికి ఎంతో ప్రియమైనది. యుద్ధ సమయంలో అశ్వదళం పోషించే పాత్ర ఎటు వంటిదో జగద్విదితమే. అధునాతన యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ట్యాంకర్లు, క్షిపణులు కలిగిఉన్న దేశాలు సయితం నేడు అశ్వ దళాన్ని ప్రోత్సహించటం గమనార్హం. అశ్వం ఉన్నచోట శుభం తప్పక ఉంటుంది. కాబట్టి అశ్వాన్ని పోషించేవానికి దేవుడు శుభం ప్రసాదిస్తాడు. కాకపోతే గుర్రాన్ని పెంచే వ్యక్తి సంకల్పం శుభ సంకల్పం అయి వుండాలి.

**శుభం, సమృద్ధి అంటిపెట్టుకుని ఉంటుంది. (ఎందుకంటే దానిని ధర్మయుద్ధంలో ఉపయోగించుకుంటారు)"**

**194) ఉర్వా బిన్ జాద్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా వక్కాణించారు: "ప్రళయదినం వరకూ గుర్రం నుదుటితోపాటు శుభం, మేలు పెనవేసుకుని ఉంటుంది."**

## అధ్యాయం : 44

## ముస్లింల రాజు న్యాయవర్తనుడైనా, అన్యాయవర్తనుడైనా అతని నేతృత్వంలో జిహాద్ మాత్రం నెలకొని ఉంటుంది

**ఎందుకంటే, "గుర్రం నుదుటితో ప్రళయదినం వరకూ శుభం, సమృద్ధి ముడిపడి ఉంటుంద"ని ప్రవక్త మహనీయులు(స) ఉద్బోధించారు.** [1]

**195) ఉర్వా బారిఖీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "శుభము, సమృద్ధి అనేది ప్రళయదినం వరకూ గుర్రం నొసటికి కట్టబడి ఉంటుంది- అంటే దానివల్ల పరలోకంలో పుణ్యఫలం, ప్రపంచంలో యుద్ధప్రాప్తి లభిస్తూ ఉంటుంది."**

## అధ్యాయం : 45

## ఎవరయితే ధర్మసంస్థాపనార్థం గుర్రం పెంచాడో...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **"మీరు వాళ్ళను ఎదుర్కోవటానికి శాయశక్తులా**

44-1. గుర్రం యుద్ధపరికరం వంటిది. కనుకనే అది శుభప్రదమైనదిగా ఖరారయింది. దీనినిబట్టి విదితమయ్యే మరొక విషయం ఏమిటంటే, జిహాద్ ప్రళయదినం వరకు ఉంటుంది. ఇమామ్ బుఖారీ(రహ్మ) గారు ఇమామ్ దావూద్ హదీసును ఇక్కడ తీసుకురాలేకపోయారు. అందులో ఇలా వుంది: "జిహాద్ మీపై తప్పనిసరి. ముస్లిం చక్రవర్తి సజ్జనుడైనా, పాపాత్ముడైనా జిహాద్ మాత్రం అతనిపై నుండి తొలగిపోదు." అనస్ (రజి) ఉల్లేఖించిన హదీసులో ఇలా ఉంది: "అల్లాహ్ నన్ను పంపినప్పటి నుంచి ప్రళయం వరకు జిహాద్ నెలకొని ఉంటుంది. చివరకు నా అనుచర సమాజం దజ్జాల్‌తో పోరాడుతుంది. ఒక అన్యాయవర్తనుని అన్యాయాల ద్వారా గానీ, న్యాయశీలుని న్యాయం ద్వారా గానీ జిహాద్ వీగిపోదు". అయితే ఈ రెండు హదీసులు కూడా ఇమామ్ బుఖారీ (రహ్మ) షరతుల ప్రకారం లేకపోవటం వల్ల వాటిని ఆయన తన గ్రంథంలో పొందు పరచలేదు.

**బలాన్ని కూడగట్టుకోవడం ద్వారా, కట్టి ఉంచిన గుర్రాల ద్వారా సన్నద్ధులై ఉండండి." *(అల్ అన్ఫాల్ : 60)***

**196) ప్రవక్త మహనీయులు(సఅసం) ఇలా ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "ఎవరయినా అల్లాహ్‌పై నిష్కల్మషమైన విశ్వాసంతో, అల్లాహ్ పుణ్యఫలం ప్రసాదిస్తాడన్న వాగ్దానాన్ని సత్యమని నమ్ముతూ అల్లాహ్ మార్గంలో (పోరాడేందుకు) గుర్రాన్ని పోషిస్తే, దాని తినటం, త్రాగటం[1], దాని మూత్రం, లద్దె- ఇవన్నీ ప్రళయదినాన అతని (ఆచరణల) త్రాసులో ఉంటాయి. వాటన్నింటిపై అతనికి ప్రతిఫలం లభిస్తుంది."**

## అధ్యాయం : 46

## గుర్రానికి, గాడిదకు పేరు పెట్టడం

**197) అబ్దుల్లాహ్ బిన్ అబూ ఖతాదా తన తండ్రి అబూ ఖతాదా చెప్పినట్లుగా ఉటంకించారు : ఆయన (అబూ ఖతాదా) హుదైబియా ఒడంబడిక జరిగిన సందర్భంగా దైవప్రవక్త(సఅసం)తో కలసి బయలుదేరారు. అబూ ఖతాదా (రజి) తన స్నేహితులు కొంతమందితో ప్రయాణంలో వెనుకబడిపోయారు. ఈయన స్నేహితులు ఇహ్రామ్ దీక్షబూనారు. కాని ఈయన మాత్రం ఇహ్రామ్ కట్టుకోలేదు. ఈయన స్నేహితులు ఒక అడవి గాడిదను చూశారు. అబూ ఖతాదా(రజి) దృష్టి దానిపై పడకముందే వాళ్ళు దానిని చూశారు. కాని వాళ్ళు దానిని వదిలేశారు. అయితే దానిపై తన దృష్టి పడగానే అబూ ఖతాదా (రజి) తన గుర్రంపై స్వారీ అయ్యారు. ఆయన గుర్రం పేరు 'జరాదా'.[1] క్రిందపడి ఉన్న తన కొరడాను తనకు అందజేయమని ఆయన తన సహచరులను అభ్యర్థించారు (ఎందుకంటే కొరడా తీసుకోకుండానే ఆయన గుర్రం ఎక్కారు). కాని వారంతా ఇహ్రామ్ దీక్షబూని ఉండటం వల్ల కొరడా అందించేందుకు నిరాకరించారు. అందువల్ల ఆయన స్వయంగానే ఆ కొరడాను తీసుకుని, అడవి గాడిదను వేటాడారు. దాని గిట్టెల్ని కోసేశారు. ఆయన స్వయంగానూ దాని మాంసం తిన్నారు. ఇతర స్నేహితులు**

---

196-1. అంటే ఆ గుర్రానికి మేత వేయటం, దానా వేయటం, దానిని కడగటం, సాకటం- ఇవన్నీ అతని ఖాతాలో సత్కార్యాలుగా లిఖించబడతాయి.

197-1. ఆ గుర్రం పేరు 'జరాదా'. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం.

**కూడా తిన్నారు. తరువాత వారంతా దైవప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చి నప్పుడు, "ఏమి, దాని మాంసం మీ వద్ద ఇంకా మిగిలి ఉందా?" అని దైవ ప్రవక్త (స) అడిగారు. 'అవును. దాని తొడ ఒకటి మా వద్ద మిగిలి ఉంది' అని ఖతాదా చెప్పారు. అప్పుడు దైవప్రవక్త(స) కూడా ఆ మాంసాహారాన్ని ఆరగించారు.**

**198) ఉబై బిన్ అబ్బాస్ బిన్ సహ్ల్ కథనం: ఈయనకు ఈయన తండ్రి, మరి ఆయనకేమో ఆయన తాతగారు (సహ్ల్ బిన్ సాద్ సాయిదీ-రజి) తెలిపారు: "మా తోటలో దైవప్రవక్త(సఅసం) గుర్రం ఒకటి ఉండేది. దాని పేరు 'లుహైఫ్'. కొంతమంది దానిని 'లుఖైఫ్'గా పేర్కొన్నారని ఇమామ్ బుఖారీ (రహ్మ) చెప్పారు.**

**199) హజ్రత్ ముఆజ్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసం) స్వారీ అయివున్న గాడిద వెనుక నేను కూడా కూర్చుని ఉన్నాను. ఆ గాడిద పేరు 'ఉఫైర్'.[1] ఆయన(స), "ఓ ముఆజ్! తన దాసులపై అల్లాహ్‌కు గల హక్కు ఏమిటో, దాసులకు అల్లాహ్‌పై గల హక్కు ఏమిటో నీకు తెలుసా?"అని అడిగితే, 'అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త(స)కే ఆ విషయం బాగా తెలుసు' అని నేను చెప్పాను. అప్పుడు ఆయన(స)ఇలా అన్నారు: "తన దాసులపై అల్లాహ్‌కు గల హక్కు ఏమిటంటే, వారు ఆయన్నే ఆరాధించాలి. ఆయనకు సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టరాదు. ఇక అల్లాహ్‌పై దాసులకు గల హక్కు ఏమిటంటే, తన దాస్యంలో ఇతరులకు భాగ స్వామ్యం కల్పించకుండా జాగ్రత్తపడిన దాసుణ్ణి అల్లాహ్ శిక్షించకూడదు." 'అలాగైతే ఓ దైవప్రవక్తా! నేనీ శుభవార్తను ప్రజలకు వినిపించనా!' అని నేను విన్నవించుకోగా, "జనులకు ఈ శుభవార్త వినిపించకు. ఎందుకంటే వారు వట్టి చేతులతో నమ్మక ముంచి కూర్చుంటారు" అని ఆయన(స) చెప్పారు.**

**200) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ఒకరోజు రాత్రి మదీనా నగరానికి ప్రమాదం పొంచి ఉన్నట్టు అనిపించింది. దైవప్రవక్త(సఅసం) మా గుర్రం (అంటే అబూ తల్హా- రజి గుర్రం) తెప్పించారు. ఆ గుర్రం పేరు 'మందూబ్'. తరువాత ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా అన్నారు: "ప్రమాదమైతే మాకేమీ కనిపించలేదు. అయితే ఈ గుర్రాన్ని మాత్రం మేము (దుమికే) నదీ ప్రవాహంలా కనుగొన్నాము."**

---

199-1. ఈ హదీసులో గాడిద పేరు 'ఉఫైర్' అని తెలుపటం జరిగింది. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం. షిర్క్ ఎంత ఘోరమైన అపరాధమో ఈ హదీసు ద్వారా విదితమవుతోంది.

## అధ్యాయం : 47

## కొన్ని గుర్రాలు దరిద్రపుగొట్టు అయి ఉంటాయి!?

**201)** ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: **"దరిద్రం కేవలం మూడు వస్తువులలో ఉంటుంది- అశ్వంలో, అతివలో, ఆవాసంలో."**

**202)** సహ్ల్ బిన్ సాద్ సాయిదీ(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(సఅసం) ఈ విధంగా ప్రవచించారు : **"దరిద్రమనేదే ఉంటే అది గుర్రంలో, స్త్రీలో, నివాస గృహంలో ఉంటుంది."**[1]

## అధ్యాయం : 48

## గుర్రం పెంచేవారు మూడు రకాలవారై ఉంటారు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **"ఆయన గుర్రాలనూ, కంచర గాడిదలనూ,**

---

202-1. అంటే దరిద్రం అనేది నిజంగా ఉంటే ఈ మూడు వస్తువులలో ఉంటుందని దీనిద్వారా తెలుస్తోంది. అపశకునం అనేది పరిగణనలోకి తీసుకోదగ్గ విషయమే కాదని, ఒకవేళ అది ఉండేటట్లయితే ఇల్లు, స్త్రీ, అశ్వంలో ఉంటుందని అబూదావూద్‌లోని ఉల్లేఖనంలో ఉంది.

ఇబ్నె ఖుజైమా, హాకిమ్ వెలికి తీసిన ఒక ఉల్లేఖనం ప్రకారం, ఇద్దరు వ్యక్తులు సయ్యిదా ఆయిషా(ర.అ) దగ్గరకు వచ్చి, 'గుర్రం, ఇల్లు, స్త్రీ- ఈ మూడు వస్తువులలో దరిద్రం ఉంటుందన్న హదీసును హజ్రత్ అబూహురైరా (రజి) ప్రజలకు ఉపదేశిస్తున్నార'ని చెప్పగా, అది విని అమ్మ ఆయిషా(ర.అ) కోపంతో మండిపడ్డారు. "దైవప్రవక్త(స) ఎన్నడూ ఆ విధంగా చెప్పలేదు. ఆ మూడు వస్తువులలో అశుభం ఉందన్న అజ్ఞానుల ఆలోచనను ప్రవక్త ప్రస్తావించారంతే" అని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై విద్వాంసుల మధ్య భేదాభిప్రాయం ఏర్పడింది. నిజంగానే ఈ మూడు వస్తువులలో దరిద్రం ఉందా? లేదా? చాలామంది దీనిని వ్యతిరేకించారు. ఎందుకంటే అపశకునం ఎన్నదగ్గ విషయమే కాదని, అలాగే, తేరాతేజీ కూడా ఎన్నదగినది కాదని వేరొక ప్రామాణిక హదీసు ద్వారా సుబోధకం అవుతోంది. మరికొంతమంది ఏమంటారంటే, హానికరమైన గుర్రం, దుర్నడత కల స్త్రీ, ఇరుకైన కంపుకొట్టే ఇల్లు దరిద్ర సూచకం. అబూ దావూద్ లోని ఒక ఉల్లేఖనం ప్రకారం, ఒక వ్యక్తి 'దైవప్రవక్తా! మేమొక ఇంట్లో నివాసమేర్పచుకున్నప్పటి నుంచీ మా సంఖ్య తగ్గిపోయింది. సంపద క్షీణించింది' అని విన్నవించుకోగా, "ఆ చెడ్డ ఇల్లును విడిచిపెట్టండి" అని ఆయన(స) సలహా ఇచ్చారు.

గాడిదలనూ సృష్టించాడు. మీరు వాటిపై స్వారీ చేయటానికి, అవి మీ జీవితాలకు శోభను చేకూర్చటానికి.” *(అన్ నహ్ల్ – 8)*

**203)** ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: గుర్రం యజమానులు మూడు రకాల వారై ఉంటారు. కొందరి కొరకు అవి పుణ్యప్రదమై ఉంటాయి. మరికొందరికి అవి పరువు నిలబెట్టేవి అయి ఉంటాయి. ఇంకా కొందరి పాలిట అవి యాతనగా పరిణమిస్తాయి. ఎవరి కొరకు గుర్రం పుణ్యప్రదమో ఆ వ్యక్తి గుర్రాన్ని దైవమార్గంలో పోరాడే సంకల్పంతో పెంచుతాడు. అతడు బాగా పచ్చిక ఉన్నచోట లేదా ఏపుగా పచ్చగడ్డి పెరిగిన చోట గుర్రాన్ని కడతాడు. ఆ గుర్రం ఆ పచ్చికలో స్వేచ్ఛగా తిరిగి మేత మేసేందుకుగాను త్రాడును బాగా పొడవుగా ఉంచుతాడు. ఆ గుర్రం అక్కడ ఏంతిన్నా త్రాగినా తత్కారణంగా గుర్రం యజమానికి సత్కార్యాలు ప్రాప్తిస్తాయి. ఒకవేళ ఆ గుర్రం త్రాడును తెంపుకుని ఒక్క ఉదుటున లేదా రెండు ఉదుటున ఉరికి ముందుకు పోయినా, అది వేసే లద్దెలో, దాని అడుగుల చిహ్నాలలో కూడా యజమానికి పుణ్యం ఉంటుంది. ఒకవేళ ఆ గుర్రం కాలువ గుండా సాగిపోయినా, అందులో అది నీరు త్రాగినా– యజమానికి నీరు త్రాపే ఉద్దేశం లేకపోయినా సరే– దానిపై కూడా అతనికి సత్కార్యాలు ప్రాప్తిస్తాయి. మరొక వ్యక్తి గర్వంతో ప్రదర్శనా బుద్ధితో, ఇస్లాం అనుయాయుల పట్ల శత్రుభావంతో గుర్రాన్ని కట్టి ఉంచుతాడు. ఆ గుర్రం అతని పాలిట యాతనగా పరిణమిస్తుంది.”[1] ఇక, గాడిదల గురించి ఒక వ్యక్తి దైవప్రవక్త(సఅసం)ను ప్రశ్నించగా, “నాపైన ఈ సమగ్రమైన, విలక్షణమైన ఆయత్ తప్ప వీటికి సంబంధించి మరేమీ అవతరించలేదు” అని ఆయన(స) చెప్పారు. ఆ ఆయత్ ఇది: “ఎవడయినా రవ్వంత సత్కార్యం చేసి ఉన్నా సరే దాన్ని అతను చూసుకుంటాడు. అలాగే ఎవడయినా రవ్వంత దుష్కార్యం చేసి ఉన్నా సరే దాన్నీ అతను చూసుకుంటాడు.” *(అజ్ జిల్‌జాల్: 7,8)*

---

203–1. ఈ ఉల్లేఖనంలో పరువును కాపాడుకునే ఉద్దేశంతో గుర్రాన్ని పెంచే వ్యక్తి గురించి వివరాలు రాలేదు. మరొక ఉల్లేఖనంలో అతని గురించిన వివరాలు వచ్చాయి. ఆ వ్యక్తి తన స్థోమత దృష్ట్యా గుర్రాన్ని పెంచుతాడు. అంటే అవసరం ఏర్పడినప్పుడు వాహనం కొరకు వేరొకరి వద్ద ముష్టెత్తుకునే పరిస్థితి ఏర్పడకూడదన్నది అతని ఉద్దేశ్యమై ఉంటుంది. అలాగే ఎవరయినా అవసరార్థుడు వచ్చి వాహనం అడిగితే, అతనికి అరువుగా ఇచ్చినట్లవుతుందన్నదీ అతని సంకల్పం అయి ఉంటుంది.

## అధ్యాయం : 49

## జిహాద్‌లో ఇతరుల పశువును కొట్టడం

**204)** అబూ ముతవక్కిల్ (అలీ బిన్ దావూద్) తెలిపారు: నేను జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) దగ్గరకు వెళ్ళి, 'మీరు ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా విన్న హదీసులలో ఏదైనా ఒకటి నాకు వినిపిస్తారా?' అని అభ్యర్థించుకోగా, ఆయన(రజి) ఇలా వివరించారు - 'నేను దైవప్రవక్త(సఅసం)తో కలసి ఒక ప్రయాణం చేశాను. ఆ ప్రయాణం జిహాద్ నిమిత్తం జరిగిందా లేక ఉమ్రా నిమిత్తమా అన్నది తెలియలేదని ఉల్లేఖకులైన అబూ అఖీల్ చెప్పారు. తిరుగు ప్రయాణంలో మదీనా నగరం కనిపించగానే, "తన ఇంటికి తొందరగా వెళ్ళగోరే వాడు వెళ్ళవచ్చు" అని దైవప్రవక్త(సఅసం) చెప్పారు. జాబిర్ ఇలా అన్నారు: 'మేము ముందుకు సాగిపోతున్నాము. నేను ముదురు ఎరుపు రంగు, మచ్చలేని ఒంటెపై స్వారీ అయి ఉన్నాను. చాలామంది నాకన్నా వెనుకే ఉన్నారు. ఉన్నట్టుండి నా ఒంటె (అలసిపోయి) ఆగిపోయింది. ఇది గమనించిన దైవప్రవక్త(సఅసం), "జాబిర్! నీ ఒంటెను గట్టిగా పట్టుకో" అని చెప్పారు. తరువాత ఆయన(స) తన గుర్రంపై నుంచే నా ఒంటెను కొట్టారు. [1] అంతే, ఒంటె ఒక్కసారిగా ముందుకు దూకింది. తరువాత ఆయన(స) నన్నుద్దేశించి, "ఈ ఒంటెను అమ్ముతావా?" అనడిగారు. నేను 'అవున' న్నాను. మదీనా నగరానికి చేరుకోగానే దైవప్రవక్త(స) తన ప్రియ సహచరులతో మస్జిద్‌లో ప్రవేశించారు. నేను కూడా ఆయన(స) సేవలో హాజరయ్యాను. మస్జిద్ బయట ఒక మూలన రాయికి ఒంటెను కట్టేసి, 'ఇదిగో మీ ఒంటె' అని ప్రవక్త మహనీయుల(స)కు విన్నవించుకున్నాను. ఆయన(స) బయటకు వచ్చి, ఒంటెను అటూఇటూ కాసేపు తిప్పారు. పిదప "ఈ ఒంటె మాదే" అని పలికారు. ఆ తరువాత ఆయన(స) నాకు కొన్ని ఊఖియాల బంగారం ఇప్పించి, "నీకు ముట్ట వలసిన ధర ముట్టిందా?" అని అడిగారు. నేను 'అవున'న్నాను. అప్పుడు ఆయన (స) "వెళ్ళు. ఈ ఒంటె, దీని ధర రెండూ నీవే" అని సెలవిచ్చారు.

---

204-1. అయితే ఇమామ్ అహ్మద్(రహ్మ) రివాయతులో ఇలా వుంది : "కాస్త ఈ ఒంటెను కూర్చోబెట్టు" అని ఆయన(స) ఆదేశించగా, నేను దానిని కూర్చొబెట్టాను. "ఆ కర్ర కాస్త అందిస్తావా?" అని ఆయన(స) చెప్పగా, నేను కర్రను అందించాను. ఆ కర్రతో ఆయన(స) దానిని కొట్టారు. ఆ తరువాత, "సరే. ఇప్పుడు స్వారీ అవ్వు" అని

## అధ్యాయం : 50
## పొగరుబోతు జంతువుపై, పోతు గుర్రంపై స్వారీ అవటం

ప్రవక్త ప్రియ సహచరులు మగ గుర్రంపై స్వారీ చేయడానికి ఇష్టపడేవారని రాషిద్ బిన్ సాద్ తెలిపారు. ఎందుకంటే అది వేగంగా పరుగెత్తుతుంది. పరాక్రమ శాలి అయి ఉంటుంది.

**205)** అనస్ బిన్ మాలిక్ (రజి) చెప్పగా తాను విన్నానని ఖతాదా తెలిపారు: మదీనాలో (ఒక రోజు రాత్రి) భయోత్పాతం నెలకొన్నట్లు అనిపించింది. అప్పుడు దైవప్రవక్త(స) అబూతల్హా (రజి) యొక్క గుర్రాన్ని తీసుకుని దానిపై స్వారీ అయ్యారు. దాని పేరు 'మందూబ్'. తిరిగి వచ్చిన తరువాత ఆయన(స) "భయపడవలసిన విషయం మాకేదీ కనిపించలేదు. కాకపోతే ఈ గుర్రం పరవళ్ళు తొక్కే జలపాతంలా ఉంది" అన్నారు.

## అధ్యాయం : 51
## యుద్ధప్రాప్తి నుండి గుర్రం వాటా ఇవ్వవలసి వస్తే...

అరేబియన్ గుర్రాలయినా, టర్కీ గుర్రాలయినా అన్నీ సమానమేనని ఇమామ్ మాలిక్(రహ్మ) అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "ఆయన గుర్రాలనూ, కంచర గాడిదలనూ, గాడిదలనూ సృష్టించాడు – మీరు వాటిపై స్వారీ చెయ్యటానికి." (16: 8). స్వారీ అయ్యే ప్రతి వ్యక్తికి ఒకే గుర్రం వాటాగా ఇవ్వబడుతుంది (అతని దగ్గర అనేక గుర్రాలున్నప్పటికీ).

**206)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: దైవప్రవక్త(సఅసం) (యుద్ధ ప్రాప్తిలో నుండి) గుర్రానికి రెండు వాటాలను నిర్ధారించారు. దాని యజమానికి ఒక వాటా ఇచ్చారు.[1]

---

ఆజ్ఞాపించారు. నేను స్వారీ అయ్యాను. దైవప్రవక్త(స) వేరొకరి ఒంటెను కర్రతో కొట్టారు. ఇదే అధ్యాయంలోని ప్రధానాంశం. ఈ ప్రయాణం తబూక్ యుద్ధానికి సంబంధిం చినది.

206–1. అంటే స్వారీ అయిన వ్యక్తికి మూడు వాటాలు లభించగా, కాలినడకన వచ్చిన వారికి ఒక వాటా.

## అధ్యాయం : 52

## ఒకవేళ యుద్ధంలో ఎవరయినా ఇతరుల జంతువును లాక్కుని తోలితే

**207)** అబూ ఇస్‌హాఖ్ కథనం: ఒక వ్యక్తి బరా బిన్ ఆజిబ్(రజి)ను, 'ఏమిటి, మీరు హునైన్ యుద్ధంలో దైవప్రవక్త(సఅసం)ను విడిచి పారిపోయారా?' అని అడిగాడు. సమాధానంగా బరా బిన్ ఆజిబ్(రజి) ఇలా అన్నారు: 'అవును. కాని ప్రవక్త మహనీయులు (సఅసం) మాత్రం పారిపోలేదు. హవాజిన్ ప్రజలు విలు విద్యలో ఆరితేరిన వారు. మేము వారిని మార్కొన్నప్పుడు, మొదట్లో మేమే మెరుపు దాడి చేసి వారిని ఓటమి అంచుకు చేర్చాము. కాని ముస్లింలు యుద్ధప్రాప్తిని పోగు చేసుకోవటంలో పడిపోయినప్పుడు, శత్రువులు మాపై బాణాల వర్షం కురిపించ సాగారు. అయినా దైవప్రవక్త(స) తన స్థానం నుండి కదలలేదు. ఆ సమయంలో ఆయన(స) తన తెల్లటి కంచర గాడిదపై స్వారీ అయి ఉండటం నేను గమనించాను. అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి) దాని కళ్ళెం పట్టుకుని ఉన్నారు. అప్పుడు దైవప్రవక్త(సఅసం) అధరాల మీదుగా ఈ కవితా కుసుమాలు జాలువారుతూ ఉన్నాయి– "దైవప్రవక్తను నేను. ఇందులో అబద్ధమన్నదే లేదు.[1] నేను అబ్దుల్ ముత్తలిబ్ పుత్రుడను (పౌత్రుడను)."

## అధ్యాయం : 53

## పశువుపై 'రికాబు' లేదా 'గర్జ్' పెట్టడం

**208)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) వివరించారు: "మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) తన పాదాన్ని 'రికాబు'లో వేయగానే ఒంటె లేచింది. ఆయన(స) జుల్‌హులైఫా మస్జిద్ వద్ద లబ్బైక్ పలికారు (అంటే అక్కడే ఇహ్రామ్ కట్టుకున్నారు).

## అధ్యాయం : 54

## (జీను లేకుండా) గుర్రం వీపుపై స్వారీ అవటం

**209)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : "ఒకసారి ప్రవక్త

---

207–1. అంటే నేను సత్య సందేశహరుడను. నాకు సహాయం చేస్తానని అల్లాహ్ చేసిన వాగ్దానం సత్యం. అలాంటప్పుడు నేను యుద్ధ రంగం నుండి పారిపోవటమా? ఇదెలా సంభవం?

మహనీయులు(సఅసం) గుర్రంపై స్వారీ అయ్యారు. కాని గుర్రం వీపుపై జీను లేదు. ఆయన(స) తోటి సహచరులకంటే ముందుకు దూసుకుపోయారు. ఆ సమయంలో ఆయన(స) మెడలో ఖడ్గం వ్రేలాడుతూ ఉంది."

## అధ్యాయం : 55

## మంద గమనం కల గుర్రంపై స్వారీ అవటం

**210)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) తెలిపారు: ఒకసారి (రాత్రి సమయంలో) మదీనాకు శత్రు ప్రమాదం పొంచి ఉన్నట్లు అనిపించింది. అప్పుడు దైవ ప్రవక్త (సఅసం) అబూతల్హా (రజి)కు చెందిన ఒక గుర్రం (మందూబ్)పై స్వారీ అయ్యారు. మరి ఆ గుర్రం మంద గమనం కలది (లేదా ఉల్లేఖకుడు ఇలా అన్నారు) దాని నడక మందకొడిగా ఉండేది.[1] అయితే తిరిగి వచ్చిన మీదట ప్రవక్త మహనీయులు (సఅసం), "నీ గుర్రాన్ని మేము పరవళ్ళు తొక్కే జలపాతంలా కనుగొన్నాము (అంటే ఇది చాలా వేగంగా పరుగెత్తుతోంది)" అని చెప్పారు. ఆనాటి నుండీ ఆ గుర్రాన్ని మరే గుర్రమూ దాటిపోలేదు.

## అధ్యాయం : 56

## గుర్రపు పందెం గురించి

**211)** ఇబ్నె ఉమర్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసం) పందెం కొరకు తయారు చేయబడిన గుర్రాలను 'హఫ్యా' అనే స్థలం నుండి 'సనియ్యతిల్ వదా' వరకు పరుగెత్తించారు. మరే గుర్రాలయితే (పందెం కొరకు) సిద్ధం చేయబడలేదో, వాటిని 'సనియ్యతిల్ వదా' నుండి మస్జిదె బనీ జురైఖ్ వరకు పరుగెత్తించారు. గుర్రపు పందెంలో పాల్గొన్న వారిలో తాను కూడా ఉన్నానని ఇబ్నె ఉమర్ చెప్పారు.. మరొక ఉల్లేఖనం ప్రకారం హఫ్యాకి-సనియ్యతిల్ వదాకి మధ్య అయిదు

---

210-1. ఆ గుర్రం వేగంగా పరుగెత్తలేకపోయేది. కాని ప్రవక్త మహనీయుల(స) శుభం వల్ల అది ఒక్కసారిగా మెరుపు వేగంతో పరుగెత్తసాగింది. మదీనాలోని ఏ గుర్రం కూడా దాంతో పోటీ పడలేకపోయేది. దైవప్రవక్త(స) ఆపద సమయంలో గుర్రంపై స్వారీ అయి ఇస్లాం ప్రతినిధులకు ఇచ్చిన సందేశం ఏమిటంటే, వారెన్నడూ ఏ విషయంలో కూడా నిర్లిప్తంగా ఉండిపోకూడదు. బద్ధకంగా వ్యవహరించకూడదు. ధైర్యసాహసాలతో తమ జాతికి మార్గదర్శకత్వం వహించి, ఆదర్శప్రాయం కావాలి.

**మైళ్ళ దూరం ఉంటుంది. కాగా; సనియ్యతిల్ వదా నుండి మస్జిదె బనీ జురైఖ్ కేవలం ఒక మైలు దూరం ఉంటుంది.[1]**

## అధ్యాయం : 57

## పరుగు పందాల కొరకు గుర్రాలను సిద్ధం చేయటం

**212) అబ్దుల్లాహ్ (రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసం) పందానికి సిద్ధం చేయబడని గుర్రాలను కూడా దౌడు తీయించారు. ఈ పరుగు సనియ్యతిల్ వదా నుండి మస్జిదె బనీ జురైఖ్ వరకు సాగింది. మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కూడా ఈ పరుగులో పాల్గొన్నారు. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఏమన్నా రంటే, (హదీసులో) అమదన్ అనే పదం చివరి హద్దు అన్న అర్థంలో ఉంది.**

## అధ్యాయం : 58

## తయారు చేయబడిన గుర్రాలను ఎంతవరకు పరుగెత్తించవచ్చు?

**213) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం: ప్రవక్త మహనీయులు (సఅసం) శిక్షణ ఇవ్వబడిన గుర్రాల మధ్య పరుగు పందెం వేయించారు. ఈ పరుగు 'హైఫా' స్థలం నుండి మొదలైంది. సనియ్యతిల్ వదా దాని ఆఖరి హద్దు. (ఉల్లేఖకులైన అబూ ఇస్హాఖ్ ఇలా అన్నారు) "దాని అంతరం ఎంత?" అని నేను అబూ మూసాను అడిగితే ఆరు లేక ఏడు మైళ్ళు అని ఆయన చెప్పారు. దైవ ప్రవక్త(స) తర్ఫీదు ఇవ్వబడని గుర్రాలను కూడా దౌడు తీయించారు. అలాంటి గుర్రాల పరుగు సనియ్యతిల్ వదా నుండి మొదలై మస్జిదె బనీ జురైఖ్ వరకు సాగింది. ఆ రెండింటి మధ్య గల అంతరం ఎంత? అని నేను అడిగితే, సుమారు ఒక మైలు, ఇబ్నె ఉమర్ (రజి) కూడా ఆ పరుగు పందెంలో పాల్గొన్నారని ఆయన చెప్పారు.**

## అధ్యాయం : 59

## ప్రవక్త మహనీయుల(సఅసం) వారి ఒంటె గురించి

**ఇబ్నె ఉమర్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(స) ఉసామా (రజి)ను**

211-1. 'హఫ్యా', 'సనియ్యతిల్ వదా' అనేవి రెండు వేర్వేరు స్థలాల పేర్లు. ఇవి మదీనా నగరానికి వెలుపల ఏర్పాటు చేయబడ్డాయి. అంటే 'ఇజ్మార్' చేయబడ్డాయి. ఇజ్మార్ అని దేనినంటారంటే, ముందు గుర్రాన్ని బాగా మేపి, అది బాగా బలిసిన తరువాత, దానికి వేయవలసిన దానాను తగ్గించివేస్తారు. కొట్టంలో బందీగాఉంచి, బాగా చెమట పట్టేలా చేస్తారు. ఆ విధంగా అది బరువు తగ్గి, పరుగుపందానికి పనికి వచ్చేలా చేస్తారు.

ఖస్వా అనే ఒంటెపై తన వెనుక కూర్చోబెట్టుకున్నారు. మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసం) ఇలా అన్నారు: "ఖస్వా (ఎన్నడూ) మొండికేయలేదు."

**214)** అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని హుమైద్ తెలిపారు: అనస్ ఇలా చెప్పారు- "దైవప్రవక్త(సఅసం) ఒంటె పేరు అజ్బా." [1]

**215)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారని హుమైద్ తెలిపారు: మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) వద్ద ఒక ఆడ ఒంటె ఉండేది. దాని పేరు అజ్బా. ఏ ఒంటె కూడా దానిని దాటిపోయేది కాదు.లేదా హుమైద్ ఇలా అన్నారు: దాన్ని వెనుక పడవేయడానికి దరిదాపుల్లో కూడా ఉండేది కాదు. తరువాత ఒక పల్లెటూరి యువకుడు ఒక బలిష్టమైన ఒంటెపై స్వారీ అయి వచ్చాడు. దైవప్రవక్త(స) స్వారీ అయి ఉన్న ఒంటెను ఆ ఒంటె దాటి ముందుకు వెళ్ళిపోయింది. ఈ సంఘటన ముస్లింలకు బాధ కలిగించింది. ఈ విషయాన్ని పసిగట్టిన దైవప్రవక్త(సఅసం), "ప్రపంచంలో ఏ వస్తువు ఎంత ఎత్తుకు ఎదిగినా (ఒక్కోసారి) దానిని పడగొట్టడం దైవ సంప్రదాయం"[1] అన్నారు.

## అధ్యాయం : 60

## మహాప్రవక్త(సఅసం) వారి తెల్ల కంచెర గాడిద గురించి

హజ్రత్ అనస్(రజి) తన హదీసులో దీని గురించి ప్రస్తావించారు. 'అయ్‌లా' రాజు దైవప్రవక్త(సఅసం)కు ఒక తెల్లని కంచెర గాడిదను కానుకగా పంపించాడని అబూ హుమైద్ సాయిదీ చెప్పారు.

---

214-1. ఈ తాలీఖ్‌ను అబూదావూద్ వసల్ చేశారు. 'ఖస్వా', 'అజ్బా' ఒకే ఒంటె పేర్లనీ, జద్యా, షుహ్‌బా అనే పేర్లు కూడా దానికి ఉన్నాయని అనబడుతోంది. 'వహీ' (దివ్యవాణి) అవతరించినప్పుడు, ఈ ఒంటె మాత్రమే ఆ ఒత్తిడికి తట్టుకోగలిగేది,ఇది తప్ప మరే ఒంటె కూడా తట్టుకోలేకపోయేది. ఈ ఒంటెగాక మరి కొన్ని ఒంటెలు కూడా ఆయన వద్ద ఉండేవి.

215-1. పెరుగుట విరుగుట కొరకే అనే నానుడి తెలుగునాట ఉండనే ఉంది. ఎదిగిన కొద్దీ ఒదగటంలోనే అందం ఉంది. లోకంలో తలబిరుసులుగా చెలరేగిపోయే శక్తులను దేవుడు ఏదో ఒకరోజు, వారి తలబిరుసుతనం వారికే బెడిసికొట్టేలా చేస్తాడు. ఈ హదీసు ద్వారా సంకేత ప్రాయంగా లభించే సందేశం ఇదే.

**216)** అమ్ర్ బిన్ హారిస్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ వివరించారు: "ప్రవక్త మహనీయులు(సఅసం) తన తదనంతరం తన తెల్లని కంచెరగాడిదను, తన ఆయుధాలను, తాను దానం చేసిన భూమిని తప్ప మరే మీరాశీని వదలిపెట్టలేదు."[1]

**217)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ చెప్పారు. ఆయన్ని (బరా బిన్ ఆజిబ్‌ను) ఒక వ్యక్తి, "ఓ అబూ అమ్మారా! మీరంతా (అంటే ముస్లిం సేనలు) హునైన్ యుద్ధంలో వెన్నుచూపి పారిపోయారా?" అని అడగ్గా, "లేదు, దైవసాక్షి! దైవప్రవక్త(సఅసం) వెన్ను చూపలేదు. కాకపోతే ఔత్సాహికులు తొందరపడి (యుద్ధప్రాప్తిని ప్రోగు చేసుకునేందుకు యుద్ధ రంగం నుండి) ఎగబడ్డారు. వారు యుద్ధప్రాప్తిని పోగు చేసుకోవటంలో మునిగిపోయారు. హవాజిన్ తెగవారు వారిపై బాణవర్షం కురిపించసాగారు. అయితే దైవప్రవక్త(స) మాత్రం తన కంచెరగాడిదపైనే ఉన్నారు. అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ దాని త్రాడును పట్టుకుని అక్కడే నిలబడ్డారు. ఆ సమయంలో దైవప్రవక్త(సఅసం) నోట వెలువడ్డ వాక్యాలివి: "నేను దైవ సందేశహరుడను. అబద్ధీకుడను కాను. నేను అబ్దుల్ ముత్తలిబ్ సంతతి వాడను (పౌత్రుడను)."[1]

## అధ్యాయం : 61

## మహిళల సతతమైన సమరం ఏది?

**218)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : దైవమార్గంలో

---

216–1. ఆ కంచెరగాడిద 'దల్‌దల్' పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆయన(స) మరణం తర్వాత కూడా అది బ్రతికి ఉంది. ఇక భూముల విషయానికివస్తే ఫదక్‌లోని సగ భాగం, వాదియే ఖురాలో మూడోవంతు భాగం, ఖైబర్‌లో 'ఖుముస్'గా ప్రాప్తించిన దానిలోని తన వాటా, బనూ నజీర్‌లోని భాగంలో తాను ఎంపిక చేసుకున్నది. హజ్రత్ అబూబకర్ (రజి) ప్రథమ ఖలీఫాగా ఉన్న కాలంలో మహాప్రవక్త పుత్రిక హజ్రత్ ఫాతిమా (ర.అ) ఆ భూభాగాలనే ఇవ్వమని కోరారు. అప్పుడు హజ్రత్ అబూబకర్(రజి) మహాప్రవక్త(స) చేసిన ఈ ప్రవచనాన్ని వినిపించారు– "దైవప్రవక్తలమైన మాకు వారసులెవరూ ఉండరు. మేము వదలిపోయినదంతా– మా తదనంతరం– దానం చేయబడుతుంది."

217–1. అంటే ఆయన(స) తాతగారు అబ్దుల్ ముత్తలిబ్. అరేబియాలో అబ్దుల్ ముత్తలిబ్ పేరు సుప్రసిద్ధం. అందువల్ల ఈ క్లిష్ట సమయంలో ఆయన(స) తన తాత గారి పేరును ప్రస్తావించారు. ఈ హదీసులో కంచెర గాడిద ప్రస్తావన వచ్చింది. అందువల్ల ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ ఈ హదీసును పొందుపరిచారు.

**జిహాద్ చేసేందుకు మాకు (మహిళలకు) ఆనతి ప్రసాదించమని నేను దైవప్రవక్త (సఅసం)ను అభ్యర్థించగా, "హజ్జ్ చేయడమే మీ (ఆడవాళ్ళ) జిహాద్" అని ఆయన (స) అన్నారు.**

**అబ్దుల్లాహ్ బిన్ వలీద్ గారు తనకు సుఫ్యాన్ సౌరీ తెలిపారనీ, ఆయనకేమో ముఆవియా ఇదే హదీసును వినిపించారని చెప్పారు.**[1]

**219) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఆధారంగా ఆయిషా బిన్తె తల్హా తెలిపారు : తమకు జిహాద్‌లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వమని ప్రవక్త సతీమణులు విన్నవించుకోగా, "హజ్జ్ చేయడం ఉత్తమ జిహాద్"[1] అని ఆయన(సఅసం) సమాధానమిచ్చారు.**

## అధ్యాయం: 62
## సముద్రంలో ప్రయాణమై స్త్రీ ధర్మయుద్ధం చేయడం

**220) హజ్రత్ అనస్(రజి) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ అబ్దుర్రహ్మాన్ అన్సారీ తెలిపారు. ఆయన(అనస్-రజి) ఇలా చెప్పేవారు: ప్రవక్త మహనీయులు ఉమ్మె హరామ్‌గా పిలువబడే మిల్హాన్ కూతురు (ఆమె అనస్‌కు పినతల్లి కూడా) వద్దకు వెళ్ళారు. అక్కడే ఆయన ఒరుగు దిండుకు ఆనుకుని నిద్రించారు. మెలకువ వచ్చినప్పుడు ఆయన(స) చిరుమందహాసం చేశారు. 'దైవ ప్రవక్తా! తమరు ఎందుకు చిరునవ్వు చిందించారో తెలుసుకోవచ్చా?' అని ఉమ్మె హరామ్ అడగ్గా, "నా అనుచర సమాజానికి చెందిన కొంతమంది వ్యక్తులు దైవమార్గంలో పోరాడేందుకు నీలి సముద్రం గుండా ప్రయాణం చేస్తున్నారు. చూడబోతే వారు సింహాసనాన్ని అధీష్టించిన రాజుల వలె ఉన్నారు" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. 'దైవప్రవక్తా! నన్ను కూడా వారిలో ఒకదానిగా చేర్చమని తమరు అల్లాహ్‌ను ప్రార్థించండి' అని ఆమె అభ్యర్థించగా, "దేవా! ఈమెను కూడా వారిలో ఒక సభ్యురాలిగా చేర్చు" అని ఆయన(స) ప్రార్థించారు. తరువాత ఆయన(స) నిద్రలోకి జారుకున్నారు. నిద్రలేవగానే మళ్ళీ చిరునవ్వు నవ్వారు. ఆమె**

---

218-1. సుఫ్యాన్ సౌరీ గారి 'జామె'లో ఇది మౌసూలన్‌గా ప్రస్తావించబడింది.

219-1. హజ్జ్ యాత్ర స్త్రీల పాలిట ధర్మయుద్ధం కన్నా తక్కువేమీ కాదు. అయితే అప్పుడప్పుడూ మహిళలు కూడా జిహాద్‌లో పాల్గొన్న దాఖలాలున్నాయి.

**ఈసారి కూడా అదేవిధంగా ప్రశ్నించగా, ఆయన(స) మొదట చెప్పినదే చెప్పారు. ఆమె ఈసారి కూడా అభ్యర్థించారు– నన్ను కూడా ఆ పయన బృందంలో చేర్చమని ప్రార్థించండి అని. సమాధానంగా ఆయన(స) ఇలా అన్నారు: "నీవు అందరికంటే ముందే ఆ సైనిక దళంలో చేర్తావు. అయితే తరువాత వారిలో నీవు ఉండవు". అనస్(ర.జి) ఇలా అన్నారు. 'ఆమె ఉబాదా బిన్ సామిత్‌ను వివాహమాడారు. (ముఆవియా– రజి భార్య) బిన్తె ఖరజ్‌తో కలసి ఆమె సముద్ర ప్రయాణం చేశారు. తిరిగి వస్తుండగా ఆమె తన వాహనమెక్కినప్పుడు, అది ఆమె మెడను విరిచేసింది. ఆ వాహనంపై నుంచే క్రిందపడి ఆమె మరణించారు.'[1]**

## అధ్యాయం : 63

## మనిషి తన భార్యలలో ఒకామెను జిహాద్‌కు తన వెంట తీసుకెళ్ళినా, తీసుకుని వెళ్ళకపోయినా (అది సమంజసమే)

**221) ఇబ్నె షిహాబ్ జుహ్రీ ఇలా అంటున్నారు : నేను ఉర్వా బిన్ జుబైర్, సయీద్ బిన్ ముసయ్యిబ్, అల్ఖమా బిన్ వక్కాస్, ఉబైదుల్లా బిన్ అబ్దుల్లాహ్ ద్వారా ఆయిషా(ర.అ) హదీసు విన్నాను. వీరు నలుగురూ ఆయిషా(ర.అ) గారి హదీసును నాకు కొద్దికొద్దిగా వివరించారు. ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసం) బయటకు (జిహాద్ నిమిత్తం) వెళ్ళినప్పుడు, తన భార్యల మధ్యన చీటీలు వేసేవారు. ఎవరి పేరు వస్తే వారిని తన వెంట తీసుకువెళ్ళేవారు. ఒకానొక యుద్ధ సందర్భంగా ఆయన(స) మా మధ్య చీటీలు వేశారు. అప్పుడు నా పేరు వచ్చింది. నేను దైవప్రవక్త(సఅసం) వెంట వెళ్ళాను. ఇది పరదా ఆజ్ఞ అవతరించిన తరువాత జరిగిన సంఘటన.[1]**

220–1. ఈ నికాహ్ వ్యవహారం మరొక ఉల్లేఖనానికి వ్యతిరేకంగా ఉంది. ఈమె ఆ సమయంలో ఉబాదా బిన్ సామిత్(రజి) నికాహ్‌లో ఉన్నట్లు ఉంది. బహుశా ఆమెకు ఆయన విడాకులు ఇచ్చి, తరువాత ఆమెను మళ్లీ వివాహమాడి ఉండవచ్చు. హజ్రత్ ఉస్మాన్ (రజి) కాలంలో జరిగిన యుద్ధమిది. అమీర్ ముఆవియా (రజి) అమీరుల్ మోమినీన్ అనుమతితో ఈ దండయాత్రకు వెళ్ళి ఉంటారు.

221–1. దీనినిబట్టి బోధపడేదేమంటే, పరదా అనగానే స్త్రీలు ఇంటి బయటకు వెళ్ళకూడదని కొందరనుకుంటారు. ఇది తప్పు. పరదా ఆజ్ఞలకు కట్టుబడి, షరీఅత్ పరిధిలో ఉంటూ స్త్రీ తన అవసరాల కొరకు బయటకు వెళ్ళగలదు. ముఖ్యంగా ముస్లిం యోధులకు సహాయపడటానికి యుద్ధంలో కూడా పాల్గొనగలదు.

## అధ్యాయం : 64

## స్త్రీలు యుద్ధం చేయటం- పురుషులతో కలసి పోరాటంలో పాల్గొనటం

**222)** హ(జత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ఉహుద్ యుద్ధ సందర్భంగా-ఒక దశలో-ముస్లింలు దైవప్రవక్త(స)నుండి వేర్పడిపోయారు. ఆయన(రజి) ఇంకా ఇలా అన్నారు : "నేను ఆయిషా బిన్తె అబీ బకర్(ర.అ)ను, ఉమ్మె సులైమ్(ర.అ)ను చూశాను. వారిద్దరూ తమ ఇజారును కొద్దిగా పైకి లేపి- వడివడిగా నీళ్ళ తిత్తులు మోసుకుంటూ వచ్చి, (క్షతగాత్రులకు) నీరు త్రాపారు. ఆ సమయంలో నేను వారి పాదాల తెల్లదనాన్ని చూశాను."[1]

## అధ్యాయం : 65

## ధర్మయుద్ధంలో స్త్రీలు నీళ్ళ తిత్తులు మోసుకుంటూ పురుషుల వద్దకు వెళ్ళటం

**223)** సాలబా బిన్ అబీ మాలిక్ తెలిపారు : ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) మదీనాలో కొంతమంది స్త్రీలకు కొన్ని దుప్పట్లు పంచి పెట్టారు. చివరకు ఒక కొత్త దుప్పటి మిగిలిపోయింది. ఆ సమయంలో ఆయన దగ్గరలోనే ఉన్న కొంతమంది, "అమీరుల్ మోమినీన్! ఈ దుప్పటిని మీ ఇంట్లోనే ఉన్న దైవప్రవక్త(సఅసం) మనవరాలికి ఇచ్చేయండి" అని సలహా ఇచ్చారు. అంటే (ఆయన భార్య అయిన) ఉమ్మె కుల్సుమ్ బిన్తె అలీ (ర.అ)ని దృష్టిలో పెట్టుకుని వారలా అన్నారు. కాని ఉమర్ (రజి) దానికి సమాధానమిస్తూ, "ఉమ్మె సలీత్ (ర.అ) దీనికి ఎక్కువ అర్హురాలు" అన్నారు. ఉమ్మె సలీత్(ర.అ) ఎవరో కాదు, దైవప్రవక్త(సఅసం) సమక్షంలో విధేయతా ప్రమాణం చేసిన మహిళ. ఉహుద్ యుద్ధ సందర్భంగా ఆమె మా కోసం నీళ్ళ తిత్తులు మోసుకుంటూ వచ్చేదని ఉమర్(రజి) చెప్పారు.

## అధ్యాయం : 66

## యుద్ధ సందర్భంగా స్త్రీలు క్షతగాత్రులకు కట్లు కట్టవచ్చు

**224)** రబీ బిన్తె మవూజ్(ర.అ) తెలిపారు: "మేము ప్రవక్త మహనీయుల(స) వెంట ధర్మయుద్ధానికి వెళ్ళేవారం. ముస్లిం యోధులకు నీరు త్రాపేవారం.

222-1. పరదా ఆజ్ఞలు అవతరించక పూర్వం జరిగిన సంఘటన ఇది. అప్పటికి అనస్(రజి) పిన్నవయస్కులు. హోరాహోరీ పోరాటం జరుగుతున్న సమయంలో బాల అనస్(రజి) దృష్టి వారి పాదాలపై పడింది.

**క్షతగాత్రులకు కట్లు కట్టేవారం. వీర మరణం పొందినవారి (మృతదేహాల)ని మదీనాకు తీసుకువచ్చేవారం."**

## అధ్యాయం : 67

## క్షతగాత్రులను, అమరవీరులను స్త్రీలు తరలించగలరు

**225) రబీ బిన్తె మవూజ్(ర.అ) తెలిపారు: "మేము దైవప్రవక్త(సఅసం)తో కలసి జిహాద్‌లో పాల్గొనేవారం. యోధులైన ముస్లింలకు నీరు త్రాపేవాళ్లం. వారికి సపర్యలు చేసేవాళ్ళం. గాయపడిన వారిని, అమరగతి నొందిన వారిని మదీనాకు తరలించేవాళ్ళం.**

## అధ్యాయం : 68

## (సిపాయిాల) శరీరాల నుండి బాణాలను వెలికి తీయటం

**226) అబూ మూసా అష్అరీ(రజి) తెలిపారు: అబూ ఆమిర్(రజి) మోకాలిలో బాణం దిగబడినప్పుడు, నేను ఆయన దగ్గరికి వెళ్ళాను. ఆ బాణాన్ని లాగి తీసేయమని ఆయన నాతో చెప్పారు: అందువల్ల నేను ఆ బాణాన్ని బయటకు లాగాను. దాంతో అదే పనిగా రక్తం స్రవించసాగింది. తరువాత నేను ప్రవక్త మహ నీయుల (సఅసం) సన్నిధికి వెళ్ళి ఈ సంఘటనను గురించి సమాచారం అందిం చాను. "ఓ అల్లాహ్! ఉబైద్ అబూ ఆమిర్‌ను మన్నించు"[1] అంటూ ఆయన(స) దుఆ చేశారు.**

## అధ్యాయం : 69

## దైవమార్గంలో- యుద్ధ సందర్భంగా- కాపలా కాయటం

**227) హ్రజత్ ఆయిషా(ర.అ) చెప్పగా తాను విన్నానంటూ అబ్దుల్లాహ్ బిన్ రబీయ బిన్ ఆమిర్ తెలియజేశారు: ఆమె ఇలా చెప్పేవారు– ప్రవక్త మహనీయులు**

---

226–1. అవ్‌తాస్ యుద్ధ సందర్భంగా జరిగిన సంఘటన ఇది. ఆ రోజుల్లో రక్తం స్రవించకుండా చేసే ఇంజెక్షన్లు గానీ, శస్త్రచికిత్స పరికరాలు గానీలేవు. క్షతగాత్రుల శరీరాల్లో దిగబడిన బాణాలను చేత్తోనే లాగేసేవారు. బాణం గుచ్చుకున్న కారణంగా గాయపడి వీర మర ణాన్ని ఆస్వాదించిన వారిలో అబూ ఆమిర్(రజి) ఒకరు. ఈయన అబూ మూసా అష్అరీ(రజి) గారి పినతండ్రి, దైవప్రవక్త(స) ఆయన పేరున మన్నింపునకై వేడు కున్నారంటే, ఆయనకు అమరగతి లభించిందన్నమాటే.

**(సఅసం) రాత్రంతా నిద్రలేకుండా గడిపారు. మదీనా చేరుకున్న తరువాత ఆయన (సఅసం) ఇలా అన్నారు– "నా ప్రియ సహచరులలోని సత్పురుషుడెవరయినా రాత్రంతా నాకు పహరాగా ఉంటే ఎంత బాగుండు!" ఇలా మాట్లాడుకుంటూ ఉండగానే మాకు ఆయుధ సవ్వడి వినిపించింది. "ఎవరు?" అని దైవప్రవక్త(స) అడగ్గా, 'నేను సాద్ బిన్ అబీ వక్కాస్‌ను. మీకు పహరాగా ఉండటానికి హాజ రయ్యాను' అని ఆ వచ్చిన వ్యక్తి బదులిచ్చారు. (ఈ సమాధానం విని ఆయన– సఅసం– సంతోషించారు. సాద్ కొరకు దుఆ చేశారు). ఆయన(స) నిద్రలోకి జారు కున్నారు.[1]**

**228) ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖించారు: "దీనార్ల దాసుడు, దిర్హంల దాసుడు,దుప్పటి దాసుడు, కంబలి దాసుడు అంతమయ్యాడు. అతని పరిస్థితి ఎటువంటిదంటే, తనకే దన్నా ఇస్తే సంతోషిస్తాడు. ఇవ్వకపోతే కినుక వహిస్తాడు". అబూ హురైరా (రజి) గారి వేరొక ఉల్లేఖనంలో మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారని ఉంది : "దీనార్ల, దిర్హంల, కంబళ్ళ దాసుడు నాశనమయ్యాడు. తనకేదైనా ఇస్తే సంబరపడ తాడు. ఇవ్వకపోతే కస్సుబుస్సుమంటాడు. అలాంటి వ్యక్తి నాశనమయ్యాడు. అతనికి ముల్లు గుచ్చుకుంటే, దేవుడు దానిని బయటికి తీయకుండుగాక! దైవమార్గంలో (యుద్ధం జరిగే సమయంలో) తన గుర్రం కళ్ళాన్ని పట్టుకుని స్థిరంగా ఉన్న దాసు నికి శుభమవుగాక! అతని జుట్టు చిందరవందరగా ఉంటుంది. అతని పాదాలు దుమ్ము ధూళి కొట్టుకుని ఉంటాయి. ఒకవేళ అతనికి పహరాగా ఉండే బాధ్యత అప్పగిస్తే అతను తన విధి నిర్వహణలో పూర్తిగా అప్రమత్తుడై ఉంటాడు. ఒకవేళ సైనికుల వెనుక (పర్యవేక్షణా) బాధ్యత అప్పగించినా అతడు దానిని పూర్తి ఏకాగ్రతతో, బాధ్యతా భావనతో విధులను నిర్వర్తిస్తాడు. (ఒకవేళ అతను బీదవాడైన**

---

227–1. మరో ఉల్లేఖనం ప్రకారం ఆయన(స) గురక పెట్టి మరీ నిద్రపోయారు. హజ్రత్ ఆయిషా(ర.అ) గారి ఈ ఉల్లేఖనం ఆధారంగా తిర్మిజీ ఏమని పొందుపరిచారంటే, దైవ ప్రవక్త(స) తన కొరకు పహరా ఉంచేవారు. అయితే "అల్లాహ్ నిన్ను జనుల (కీడు) నుండి రక్షిస్తాడు" (అల్ మాయిదా– 67) అన్న ఆయత్ అవతరించిన మీదట ఆయన (స) ఈ సెక్యూరిటీని ఎత్తివేశారు. మరొక ఉల్లేఖనం ప్రకారం, యుద్ధ సందర్భంగా ఒక రాత్రి పహరా కాయటం వెయ్యి రాత్రుల ఆరాధనకన్నా, వెయ్యి దినాలు ఉపవాసం ఉండటం కన్నా శ్రేష్టమైనది.

కారణంగా అతన్ని ఎవరూ పట్టించుకోకపోయినా సరే) అతను ఎవరినయినా కలుసుకునేందుకు అనుమతి కోరినప్పుడు, అతనికి అనుమతి లభించకపోయినా సరే, అతను ఎవరి కోసమైనా సిఫారసు చేసినప్పుడు అతని సిఫారసు ఆమోదించ బడకపోయినా సరే (అతను తన విధి నిర్వహణ పట్ల విముఖత చూపడు)"[1]

## అధ్యాయం : 70

## ధర్మయుద్ధంలో చేసే సేవలకు గల ప్రాముఖ్యత

**229)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా అంటున్నారు : నేను జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) వెంట ఉన్నప్పుడు, ఆయన నాకు సేవలు చేసేవారు. మరి చూడబోతే ఆయన వయసులో నా కన్నా పెద్దవారు. ఇక జరీర్(రజి) ఏమన్నా రంటే; "అన్సార్లు ఎల్లవేళలా (అల్లాహ్ మరియు ఆయన సందేశహరుని) సేవలో నిమగ్నులై ఉండటం నేను గమనించి ఉన్నాను. అందువల్ల వారిలో ఎవరు నాకు తారసపడినా నేను వారిని ఆదరిస్తాను."[1]

**230)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) చెప్పగా తాను విన్నానని మౌలా అమ్ర్ బిన్ అబీ అమ్ర్ తెలిపారు: అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా చెప్పారు– నేను మహాప్రవక్త ముహమ్మద్(సఅసం)తో కలసి ఖైబర్ (యుద్ధానికి) వెళ్ళాను. నేను ఆయన(సఅసం) సేవలో నిమగ్నుణ్ణి అయి ఉండేవాణ్ణి. ఆయన(స) తిరిగి వచ్చిన తరువాత, ఉహుద్ పర్వతంపై దృష్టి పడగానే, "ఈ పర్వతాన్ని మేము ప్రేమిస్తు న్నాము. ఇది మమ్మల్ని ప్రేమిస్తోంది" అని అన్నారు. ఆ తరువాత ఆయన(సఅసం) తన చేత్తో మదీనా నగరం వైపు సంజ్ఞ చేసి ఇలా అన్నారు: "ఓ అల్లాహ్! ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) మక్కా నగరాన్ని పవిత్ర నగరంగా ఖరారు చేసినట్లే, నేను దీని

---

228–1. ఈ హదీసులో దైవమార్గంలో పహరా కాసే ఒక పేద యోధుని ప్రస్తావన వచ్చింది. ఇదే ఈ అధ్యాయంలోని కీలకాంశం. సిసలైన చిత్తశుద్ధి కల మహనీయులు ఇలాగే అనామకులుగా ఉంటారు. అయితే అల్లాహ్ వారి మొరలను ఆలకించి ఆమోదిస్తాడు. ఈ అంతస్తు ప్రతి ఒక్కరికీ లభించదు.

229–1. దైవసందేశహరుని (సఅసం) యెడల అన్సార్లకు గల ఆదరాభిమానాలు ఎనలేనివి. దైవం పట్ల, దైవప్రవక్త(స) పట్ల గౌరవాదరణలు కలిగి ఉండేవారిని ఆదరించి, వారికి సేవలు చేయటం కూడా మహాభాగ్యమే.

మధ్యన గల రెండు రాతి మైదానాల భూభాగాన్ని పవిత్రమైనదిగా ఖరారు చేస్తున్నాను. ఓ అల్లాహ్! మా (కొలమానాలైన) 'సా', 'ముద్'లలో శుభాన్ని వొసగు".

**231)** హజ్రత్ అనస్(రజి) కథనం: మేము (ఒక ప్రయాణంలో) ప్రవక్త మహనీయుల(సఅసం) వెంట ఉన్నాము. మాలోని కొంతమంది ప్రవక్త సహచరులు ఉపవాసం ఉండగా, మరికొంతమంది ఉపవాసం పాటించలేదు. అది వేసవి కాలం. మాలో ఎవరికి మంచి నీడ లభించినా వారు దుప్పటి కప్పుకుని పడుకోసాగారు. ఉపవాసం పాటించేవారు ఏ పనీ చేయలేకపోయారు. ఉపవాసం ఉండనివారు మాత్రమే ఒంటెలకు కావలసినవన్నీ సమకూర్చారు. తోటి ఉపవాసకులకు సపర్యలు కూడా చేశారు. వేరితర పనులు కూడా చేశారు. అప్పుడు ప్రవక్త మహనీయులు (సఅసం) "ఈ రోజు ఉపవాసం లేనివారు పుణ్యఫలాన్ని జుర్రుకున్నార"[1] ని చెప్పారు.

## అధ్యాయం : 71

## ప్రయాణంలో తోటి సహవాసి సామానును ఎత్తిన వాని గొప్పతనం

**232)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "ప్రతి రోజూ ప్రతి మనిషికి అతని ప్రతి కీలుపై సదఖా (దానం) అనివార్యం. ఒకవేళ ఎవరయినా తోటి సహవాసికి తోడ్పడే ఉద్దేశంతో అతన్ని అతని వాహనంపై ఎక్కించడంలో సాయపడితే లేదా అతని సామానును ఎత్తి అతనిపై మోపితే అది కూడా సదఖాయే(దానమే). ఒక మంచి మాటను పలకటం కూడా దానమే. నమాజు కొరకు వేసే ప్రతి అడుగు కూడా దానమే. (ఎవరయినా ఒక బాటసారికి) దారి చూపటం కూడా దానమే."[1]

---

231–1. అంటే ఉపవాసం పాటించే వారికన్నా ఎక్కువ పుణ్యం ఉపవాసం లేనివారికి లభించింది. ధర్మయుద్ధ సందర్భంగా యోధులకు సేవలు చేయుటం ఉపవాసం కన్నా శ్రేష్ఠమైనది. ఉపవాసం ఒక వ్యక్తిగత సత్కార్యం. కాని యోధులకు చేసే సేవ సాముదాయికమైనది. ఉపవాసం పాటించడం పుణ్యప్రదం కాదని ఈ హదీసు అర్థం ఎంతమాత్రం కాదు. నిశ్చయంగా ఉపవాసం ఓ మంచి కార్యమే. కాని ధర్మయుద్ధ సందర్భంగా ఉపవాసాన్ని విడనాడి, శక్తిని కూడదీసుకుని పోరాడటం, వీరులకు సహాయపడటం చాలా గొప్ప సత్కార్యం.

232–1. హదీసు సర్వసాధారణమే అయినప్పటికీ ఇది ధర్మయుద్ధం కొరకు ప్రయాణం చేసేవారికి ప్రత్యేకంగా వర్తిస్తుంది. అందుకే ఇమామ్ బుఖారీ (రహ్మ) దీనిని 'కితాబుల్ జిహాద్'లో పొందుపరిచారు. ఈ ప్రయాణంలో ఎవరయినా తోటి సోదరుడు అలసిపోయినా లేదా

## అధ్యాయం : 72

## దైవమార్గంలో- సరిహద్దుల్లో- ఒక రోజు పహరా కాయటం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **"విశ్వాసులారా! సహనంతో వ్యవహరించండి. శత్రువుల ముందు పరాక్రమం చూపండి. మీరు మోహరించిన చోట స్థిరత్వం కనబరచండి."[1]** ***(ఆలి ఇమ్రాన్ : 200)***

**233) హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసం) ఇలా ప్రవచించారు : "అల్లాహ్ మార్గంలో శత్రువు (రాజ్యాని)కి ఆనుకుని ఉన్న సరిహద్దులో ఒకరోజు పహరాగా ఉండటం ఈ ప్రపంచంకన్నా, ప్రపంచంలో ఉన్న దానికన్నా మేలైనది. స్వర్గంలో ఎవరికయినా ఒక కొరడా అంతటి స్థలం దొరికినా అది ఈ జగతి కన్నా, అందులో ఉన్న వాటన్నింటి కన్నా శ్రేష్ఠమైనది. ఎవరయినా ఒక వ్యక్తి అల్లాహ్ మార్గంలో ఉదయం లేదా సాయంత్రం నడిచిపోతే అది ఈ లోకంకన్నా, అందులో ఉన్న సమస్త వస్తువులకన్నా గొప్పది. [1]**

## అధ్యాయం: 73

## ఎవరయినా ఒక పిల్లవాణ్ణి సేవ కోసం యుద్ధ ప్రయాణానికి తీసుకువెళ్ళడం

**234) హజ్రత్ అనస్ (రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసం) అబూ**

---

అతని సామాను చాలా బరువుగా ఉన్నా అతనికి సహాయపడటం ఎంతో పుణ్యప్రదం. ఆ మాటకొస్తే ప్రతి బాటసారికి తోడ్పడటం ఎంతో మేలైన కార్యమే. అలాగే వినేవారికి సంతోషం కలిగేవిధంగా ఒక మంచిమాటను పలకటం కూడా పుణ్యకార్యమే. దానం చేసిన మీదట గ్రహీత మనస్సు నొచ్చుకునే విధంగా దెప్పిపొడవటం కన్నా మృదు భాషణం మిన్న అని ఖుర్ఆన్ అంటోంది. అలాగే సామూహిక నమాజ్ చేయడానికి వెళుతూ మనిషి వేసే ప్రతి అడుగు దానం అని చెప్పబడటం గమనార్హం.

72-1. మానవుని చాలా గొప్ప శక్తి సహనం, స్థయిర్యం. ఇది అతని వజ్రాయుధం. దీని మూలంగా మానవులు చరిత్రలో ఎన్నో ఘన విజయాలు సాధించారు. సహన స్థయిర్యాలలో, మొక్కవోని సాహసంలో మహాప్రవక్త(సఅసం) ఉపమానం సూర్యుని తేజస్సు వంటిది.

233-1. ఎందుకంటే ఈ ప్రపంచం నశ్వరమైనది. అస్థిరమైనది. కాగా, స్వర్గం శాశ్వతమైనది, మిగిలి ఉండేది. ఇక్కడ 'కొరడా'ను ప్రస్తావించటంలోని ఉద్దేశ్యమేమంటే కొరడా 'జిహాద్'తో ముడివడి ఉంది. అది చాలా చిన్న వస్తువే. కాని దానికి బదులుగా స్వర్గం లభిస్తే అది ఈ ప్రపంచంకన్నా శ్రేష్ఠమైనదవుతుంది.

తల్హా (రజి)తో, "నీ పిల్లల్లో ఎవరయినా ఒక పిల్లవాణ్ని ఖైబర్ యుద్ధప్రయాణంలో నా సేవకై నియోగించు. నేను ఖైబర్‌కు బయలుదేరినప్పుడు అతను నాకు చేదోడు వాదోడుగా ఉంటాడ"ని అన్నారు. అబూ తల్హా (రజి) తన వాహనంపై ఆయన వెనుక నన్ను కూర్చోబెట్టుకుని వెళ్ళారు. నేనప్పటికి ఇంకా బాలుణ్ణే. ప్రాజ్ఞ వయస్సుకు దగ్గరలో ఉన్నాను. దైవప్రవక్త(సఅసం) ఎక్కడ విడిది చేసినా నేను ఆయన(స) సేవ చేసేవాణ్ణి. ఆయన(స) తరచూ ఈ విధంగా వేడుకోవటం నేను వినేవాణ్ణి: *"అల్లాహుమ్మ ఇన్నీ అఊజుబిక మినల్ హమ్మి వల్ హుజని వల్ అజ్‌జి వల్ కసలి వల్ బుఖ్‌లి వల్ జుబ్‌ని వ జలయిద్దయ్‌ని వ ఘలబతిర్రిజాలి"* (ఓ అల్లాహ్! నేను దుఃఖం నుండి, దీనావస్థ నుండి, బద్ధకం నుండి, పిసినారితనం నుండి, పిరికితనం నుండి, రుణభారం నుండి, దౌర్జన్యపరులు నాపై ఆధిపత్యం వహించటం నుండి నీ శరణు వేడుతున్నాను). ఎట్టకేలకు మేము ఖైబర్ చేరుకున్నాము. అల్లాహ్ ఖైబర్ కోటపై ఆయన(స)కు విజయం ప్రసాదించాడు. ఆ సందర్భంగా సఫియ్యా బిన్తె హుయి బిన్ అఖ్తబ్(రజి) సౌందర్య ప్రస్తావన వచ్చింది. ఆమె భర్త (యూదుడు) యుద్ధంలో వధించబడ్డాడు. అప్పటికి ఆమె పెళ్ళికూతురే. (పైగా ఆమె యూదు తెగ నాయకుని పుత్రిక). అందువల్ల దైవప్రవక్త(స) ఆమెను సత్కరించే ఉద్దేశంతో, తన కోసం ప్రత్యేకించుకున్నారు. ఆయన (స) ఆమెను వెంటబెట్టుకుని అక్కడి నుండి బయలుదేరారు.మేము 'సద్దస్సహ్బా' వద్దకు చేరుకునేసరికి ఆమె బహిష్టు స్థితి నుండి పరిశుద్ధత నొందారు. అప్పుడు ఆయన(సఅసం) ఆమెతో శయనించారు. ఆ తరువాత ఆయన(స) 'హైస్' అనే వంటకాన్ని తయారు చేయించి (అది ఖర్జూరం, జున్ను ముక్కలు, నెయ్యితో తయారు చేయబడింది) ఒక చిన్న విస్తరిపై వడ్డించమని ఆదేశించారు. పిదప "మనకు దగ్గరలో ఉన్నవారిని విందుకు పిలువు" అని నాతో చెప్పారు. హజ్రత్ సఫియ్యా (ర.అ)ను మనువాడినప్పుడు దైవప్రవక్త(స) ఇచ్చిన వలీమా విందు ఇదే. తరువాత మేము మదీనా వైపు సాగిపోయాము. అనస్ (రజి) ఇలా అన్నారు : నేను గమనించాను– సఫియ్యా (ర.అ) కూర్చుని ఉండటం వల్ల దైవప్రవక్త(స) ఒంటె మూపురం చుట్టు తన తలగుడ్డతో ఆమెకు పరదా చేశారు. హజ్రత్ సఫియ్యా (ర.అ) వాహనంపై ఎక్కేటప్పుడు, దైవప్రవక్త(స) ఒంటె ప్రక్కనే కూర్చుని, తన మోకాలును నిలబెట్టేవారు. ఆమె తన కాలును దైవప్రవక్త(స) మోకాలిపై పెట్టి ఒంటె ఎక్కేవారు. ఆ విధంగా మేము ప్రయాణం సాగించాము.

**మేము మదీనా నగరాన్ని సమీపించగానే ఆయన(స) ఉహుద్ పర్వతాన్ని చూసి, "ఈ పర్వతం మమ్మ అభిమానిస్తోంది. మేము దీనిని అభిమానిస్తున్నాము" అని పలికారు. ఆ తరువాత ఆయన(స) మదీనా వైపు దృష్టిని సారించి, "అల్లాహ్! మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) మక్కా నగరాన్ని పవిత్ర నగరంగా ఖరారు చేసినట్లే, నేను దీని రెండు రాతి ప్రదేశాల మధ్య గల భూభాగాన్ని పవిత్రమైనదిగా ఖరారు చేస్తున్నాను. ఓ అల్లాహ్! మదీనా వాసుల 'ముద్', 'సా'లలో శుభాన్ని వొసగు" అని ప్రార్థించారు.** [1]

## అధ్యాయం : 74

## ధర్మయుద్ధం కొరకు సముద్రంలో ప్రయాణమవటం

**235) ఉమ్మె హరామ్(ర.అ) తనతో ఈ విధంగా చెప్పిందని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసం) ఒకరోజు ఆమె ఇంటికి వచ్చి, నిద్రలోకి జారుకున్నారు. మెలకువ వచ్చినప్పుడు ఆయన(స), చిరుమందహాసం చేశారు. 'దైవప్రవక్తా(స)! తమరి మందహాసం వెనుక ఉన్న విశేషం ఏమిటి?' అని ఆమె అడిగితే, "నా అనుచర సముదాయంలోని ఒక బృందాన్ని (కలలో) చూసి నాకు సంతోషం కలిగింది. వారు (యుద్ధం కొరకు) సముద్రయానం చేస్తూ రాజులు సింహాసనంపై కూర్చున్నట్లే కూర్చొని ఉన్నారు" అని ఆయన(స) చెప్పారు. 'దైవ ప్రవక్తా! నాకు కూడా ఆ పయన బృందంలో చేరే భాగ్యం కల్పించమని దైవాన్ని ప్రార్థించండి' అని ఉమ్మె హరామ్ విన్నవించుకోగా, దానికి ఆయన(స) "నీవు కూడా**

234-1. ప్రవక్త మహనీయులు (స) ఖైబర్ యుద్ధ సందర్భంగా అనస్(రజి)ను తన సేవకై నియోగించుకున్నప్పుడు ఆయన చిన్నపిల్లవాడే. ఇంకా ప్రాజ్ఞతకు చేరుకోలేదు. ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం ఇదే. ఈ యుద్ధానంతరం హజ్రత్ సఫియ్యా (ర.అ) దైవప్రవక్త(స) దాంపత్య జీవితంలో ప్రవేశించారు. ఆమె ఉన్నత వంశీయురాలు. ఇస్లాంలో ఆమె రాక వల్ల ఎన్నో ధార్మిక ప్రయోజనాలు చేకూరాయి. ఈ హదీసులో ఒక దుఆ (వేడుకోలు) కూడా వచ్చింది. దానిని తరచూ పఠించటం వల్ల పలు ధార్మిక ప్రాపంచిక లాభాలు ఒనగూడుతాయి.

మదీనా నగరం మక్కా నగరం మాదిరిగా పవిత్రమైనదన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా రూఢీ అయింది. హజ్రత్ అనస్(రజి) బాల్యం నుండే దైవప్రవక్త(స)కు సేవలు చేశారు. అయితే ఖైబర్ యుద్ధ ప్రయాణంలో తొలిసారిగా ఆయన(స) వెంట వెళ్లే అవకాశం అనస్(రజి)కు లభించింది.

ఆ బృందంలో ఉన్నావు" అని పలికారు. ఆ తరువాత ఆయన(స) మళ్ళీ నిద్ర పోయారు. మేల్కొన్నప్పుడు ఆయన(స) నగుమోముతో కనిపించారు. ఆయన(స) ఈసారి కూడా అదేమాట అన్నారు. ఈ విధంగా రెండు మూడుసార్లు జరిగింది. 'దైవప్రవక్తా(స)! నన్ను కూడా ఆ పయన బృందంలో చేర్చమని తమరు నా కోసం ప్రార్థించండి' అని ఆమె విజ్ఞప్తి చేశారు. దానికి ఆయన(స), "నువ్వు అందరికన్నా ముందే ఆ బృందంలో చేర్తావు" అని చెప్పారు. ఆమె హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) వివాహబంధంలో ఉన్నారు. ఆయన ఆమెను (ఇస్లాంలోని మొట్టమొదటి నౌకాదళంలో) తన వెంట తీసుకువెళ్ళారు. తిరుగు ప్రయాణంలో ఆమె స్వారీ అయ్యేందుకు వాహనాన్ని సమీపించారు. వాహనం ఎక్కుతుండగా లేదా ఎక్కిన తరువాత క్రింద పడిపోయారు. దాంతో ఆమె మెడ విరిగి అమరగతి నొందారు.[1]

## అధ్యాయం : 75

## యుద్ధంలో బలహీనుల (ఉదాహరణకు- స్త్రీల, బాలల, అంధుల, వికలాంగుల, దీనుల) సహాయం కోరటం, సజ్జనుల చేత దుఆ చేయించటం

**236)** ముస్‌అబ్ బిన్ సాద్ తనతో చెప్పారని ముహమ్మద్ బిన్ తల్హా తెలియజేశారు: తనకు (తన సిరిసంపదల రీత్యా, శౌర్య పరాక్రమాల దృష్ట్యా) ఇతర సహాబాపై ప్రాధాన్యత ఉందని సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) తలపోసేవారు. అందు వల్ల ప్రవక్త మహనీయులు (సఅసం) ఆయన్ని ఉద్దేశించి, "మీరు బలహీనులు, వికలాంగుల ప్రార్థనల ఫలంగా అల్లాహ్ తరఫు నుండి సహాయం చేయబడు తున్నారు. వారి ప్రార్థనల ఫలితంగానే మీకు ఉపాధి వొసగబడుతోంది"[1] అని ఉద్బోధించారు.

**237)** మహనీయ అబూ సయీద్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ఉద్బోధించారు : "ఒక కాలం రానున్నది. అప్పుడు ముస్లింలు తండోపతండాలుగా కదలి వచ్చి ధర్మయుద్ధం చేస్తారు. 'మీలో

---

235-1. ఈ హదీసు ఇంతకుముందు అనేకసార్లు వచ్చింది.

236-1. అంటే ఆ దీనులపై దేవుని ప్రత్యేక కృప ఉంటుంది. వారు ఎప్పుడు దైవాన్ని ప్రార్థించినా ఎంతో ఆర్ద్రతతో, అశక్తతతో ప్రార్థిస్తారు. వారి ఆంతర్యం నిష్కల్మషంగా ఉంటుంది. అందువల్ల అలాంటి బలహీనుల చేత వేడుకోళ్ళు చేయించటం ఎంతో శుభప్రదం.

**దైవప్రవక్త(సఅసం) సహచర్యం పొందిన పుణ్యాత్ముడు ఎవరైనా ఉన్నారా?' అని వారిని ప్రశ్నించటం జరుగుతుంది. 'అవును. ఉన్నారు' అని సమాధానం రాగానే, ఆ పుణ్యాత్ముని చేత విజయం కొరకు ప్రార్థన చేయించటం జరుగుతుంది. ఆ తరువాత మరొక కాలం రానున్నది. అప్పుడు దైవప్రవక్త(స) సహచర్యం పొందిన సహబీల శిష్యుల కొరకు గాలించటం జరుగుతుంది (అంటే తాబయి కొరకు అన్వేషిస్తారు). అలాంటి మహనీయుడు ఎవరయినా కనబడితే అతనిచేత విజయం కొరకు దుఆ చేయిస్తారు. ఆ తరువాత ఇంకొక కాలం రానున్నది. అప్పుడు దైవ ప్రవక్త ప్రియసహచరుల సాంగత్యంలో ఉన్న శిష్యుల సహచర్యం పొందిన వారెవరైనా ఉన్నారా? అని ప్రశ్నిస్తూ తిరుగుతారు. అలాంటి మహానుభావుడు ఎవరయినా అగుపిస్తే అతని చేత విజయం కొరకు దుఆలు చేయించటం జరుగుతుంది."[1]**

## అధ్యాయం : 76

## ఫలానా వ్యక్తి అమరవీరుడు అని ఖచ్చితంగా అనరాదు (ఎందుకంటే సంకల్పం గురించి, మరణ ఘడియలోని పరిస్థితి గురించి తెలియదు)

**ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "తన మార్గంలో జిహాద్ (ధర్మయుద్ధం) చేసేదెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు. తన మార్గంలో గాయపడేదెవరో కూడా అల్లాహ్‌కు బాగా తెలుసు."[1]**

---

237-1. దేవుని ప్రియతములైన దాసుల చేత దుఆలు చేయించి, లబ్ది పొందటం ధర్మసమ్మతమే నని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. నా కాలం, ఆపైన నా సహాబా కాలం, ఆ తర్వాత తాబయీల కాలం ఉత్తమమైన కాలం అని దైవప్రవక్త(స) చెప్పారు. శుభప్రద మైన ఆ కాలంలో ముస్లింలు నిజభావంలో ముస్లింలుగా ఉండేవారు. వారి ప్రార్థనలు దైవసన్నిధిలో ఆమోదముద్ర పొందేవి. అలాంటి పుణ్యాత్ములు అన్ని కాలాల్లో ఉండటం అవసరం. వారి సాంగత్యంలో ఉండటం, వారిచేత వేడుకోళ్ళు చేయించటం, వారి ద్వారా ఆధ్యాత్మిక ప్రయోజనం పొందటం నిజంగా అదృష్టమే. ఇలాంటి వారే దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా అభివర్ణించబడ్డారు. "వారు విశ్వసించినవారై, దైవానికి భయ పడే వారై ఉంటారు" (10: 63). ఇలాంటి సద్గుణాలు లేనివారిని 'ఔలియా అల్లాహ్'గా భావించటం అవివేకం, మూర్ఖత్వం.

76-1. హదీసు ద్వారా ఖచ్చితంగా తెలియనంతవరకూ ఎవరినీ స్వర్గవాసి అని అనకూడదు. అయితే, ఫలానా వ్యక్తి స్వర్గవాసి అని దైవప్రవక్త(స) చెబితే గనక, అప్పుడు ఆ వ్యక్తిని

**238)** హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ(రజి) కథనం: దైవప్రవక్త(స) తన సహచరులతో కలసి (ఉహుద్ లేదా ఖైబర్ యుద్ధంలో) బహుదైవారాధకులను మార్కొన్నారు. యుద్ధం అనివార్యమైంది. తరువాత ఆయన(స) ఆ రోజు యుద్ధ రంగం నుండి తన విడిది స్థలానికి చేరుకున్నారు. బహుదైవారాధకులు కూడా తమ తమ విడిది స్థలాలకు వెళ్ళిపోయారు. ఆయన(స) సైనికులలోని ఒక వ్యక్తి పోరాట పటిమలో తిరుగులేని వాడు. ముష్రిక్కులలోని ఏ వ్యక్తి అతనికి ఎదురుపడినా, అతనిని వెంటాడి తన ఖడ్గపువ్రేటుతో చంపేసేవాడు. సహ్ల్ (రజి) ఆ వ్యక్తి గురించి వ్యాఖ్యానిస్తూ, 'ఈ రోజు పోరాటంలో ఆ వ్యక్తి చూపిన పరాక్రమాన్ని మనలో ఎవరూ చూపలేకపోయార'ని అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) ఆ వ్యక్తి గురించి చెబుతూ, "కాని అతడు నరకవాసి" అన్నారు. ముస్లిములలోని ఒక వ్యక్తి (మనసులో ఇలా అనుకున్నాడు), సరే. నేను అతన్ని వెంబడిస్తూ, కనిపెడుతూ ఉంటాను. (దైవప్రవక్త ఆ వ్యక్తి గురించి అతను నరకవాసి అని ఎందుకు అన్నారో చూడాలి). అతనిలా అన్నాడు- మరునాడు నేను అతని వెంటే ఉన్నాను. యుద్ధంలో అతను నిలబడితే నేనూ నిలబడ్డాను. అతను వేగంగా నడవసాగితే నేను కూడా వేగంగా నడవ సాగాను. కడకు అతను గాయపడ్డాడు. గాయం చాలా తీవ్రమైనది. అందువల్ల తనను మృత్యువు తొందరగా కబళించాలని ఆ వ్యక్తి కోరుకున్నాడు. తన ఖడ్గపు పిడిని నేలపై ఉంచి, దాని మొనను తన గుండెవైపు ఉండేలా చేసుకున్నాడు. ఆ విధంగా బలవంతంగా ఖడ్గంపై పడి ప్రాణం విడిచాడు. అప్పుడు అతనిని వెంటాడిన వ్యక్తి దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చి, 'తమరు దేవుని సత్యసందేశహరులని నేను సాక్ష్య మిస్తున్నాను' అన్నాడు. "ఇంతకూ ఏమయింది?" అని ఆయన(స) అడగ్గా, 'ఫలానా వ్యక్తి నరకవాసి అని తమరు చెప్పినప్పుడు, ఆ మాట సహచరులకు బాధ కలిగించింది. మీరు ఊరుకోండి. మీ అందరి తరపున నేను ఆ వ్యక్తి గురించి వాకబు చేస్తానని వారితో చెప్పాను. చెప్పినట్లే ఆ వ్యక్తిని వెంబడించాను. తరువాత ఆ వ్యక్తి (యుద్ధ

---

స్వర్గవాసి అని అనవచ్చు. ఇమామ్ అహ్మద్ వెలికి తీసిన ఒక హదీసును ఇమామ్ బుఖారీ ప్రస్తావించారు. అది ఇలా వుంది: "మీరు మీ యుద్ధాలలో ఫలానా వ్యక్తి అమర గతినొందాడని అంటుంటారు. అలా అనకండి. అల్లాహ్ మార్గంలో మరణించినవాడు షహీద్ అని మాత్రం అనండి." వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది : "చాలామంది శత్రువు బాణం గుచ్చుకుని చనిపోతుంటారు. కాని వారు దైవం దృష్టిలో అమరగతులు కారు. ఎందుకంటే వారు ప్రపంచంలో కీర్తిప్రతిష్టల్ని ఆశించి పోరాడారు. చనిపోయారు."

**రంగంలో) తీవ్రంగా గాయపడ్డాడు. కాని తనను తొందరగా మృత్యువు కబళించాలని కాంక్షించాడు. అందుకే అతను తన ఖడ్గపు పిడిని నేలపై ఉంచి, ఖడ్గపు మొన తన ఛాతీకి గుచ్చుకునే విధంగా పెట్టి ఆత్మాహుతి చేసుకున్నాడు' అని అతను వివరించాడు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "ఒక వ్యక్తి జీవితాంతం స్వర్గానికి గొనిపోయే పనులు చేస్తుంటాడు. కాని అతను నరకవాసి అయి ఉంటాడు. అలాగే ఒక వ్యక్తి పైకి నరకానికి ఆహుతి చేసే పనులు చేస్తుంటాడు. నిజానికి అతను స్వర్గవాసులలో ఒకడై ఉంటాడు."[1]**

## అధ్యాయం : 77

## విలు విద్యకై ప్రోత్సహించటం

అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: **"మీరు మీ శక్తి మేరకు అత్యధిక బలాన్నీ,[1] కట్టివేసి సిద్ధంగా ఉన్న గుర్రాలను వారిని (శత్రువులను) ఎదుర్కోవటానికి సమాయత్తపరచుకోండి, తద్వారా అల్లాహ్ శత్రువులనూ, మీ శత్రువులనూ, ఇంకా మీరు ఎరుగని, కాని అల్లాహ్ ఎరిగిన ఇతర శత్రువులనూ భయకంపితులుగా చెయ్యండి." *(అల్ అన్ఫాల్ : 60)***

**239) సలమా బిన్ అక్వయి (రజి) కథనం: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బనూ అస్లం తెగకు చెందిన కొంతమంది సహచరుల వైపునుండి**

---

238-1. హదీసులో ప్రస్తావించబడిన వ్యక్తి రణరంగంలో పైకి గొప్ప యోధునిలా కానవచ్చాడు. కాని అతని విధివ్రాతలో నరకం రాసిపెట్టి ఉంది. దైవప్రవక్త(స)కు ఈ విషయం దివ్యావిష్కృతి ద్వారా ముందుగానే తెలియజేయబడింది.కడకు ప్రవక్త(స) చెప్పినట్లే జరిగింది. ఆత్మహత్య ద్వారా ఆ వ్యక్తి హరామ్ చావు చచ్చాడు. నరకానికి ఆహుతి అయ్యాడు. అందుకే అంతిమ పరిణామం గురించి సర్వదా చింతిస్తూ ఉండాలి. అల్లాహ్ మనందరికీ మేలైన ముగింపును ఇవ్వుగాక!

77-1. కాలం మారింది. యుద్ధ పరికరాలు మారాయి. అయితే సర్వవిధాలా శత్రువును ప్రతిఘటించేందుకు, శాయశక్తులా ఆయుధాలను సమకూర్చుకున్న రాజ్యాలే నేటికీ ప్రపంచంలో నిర్భయంగా మనగలుగుతున్నాయి. అణ్వాయుధాలను తయారు చేసుకునే రాజ్యాలు సైతం 'శాంతి కోసమే అణ్వాయుధం' అనే మంత్రాన్ని వల్లె వేస్తున్నాయి. ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆర్జించకుండా, తమ దేశ ఒనరుల్ని కేవలం భోగలాలస జీవితం కొరకు, విలాసవంతమైన మోటారు కార్ల కొరకు వెచ్చించే రాజ్యాలు క్షణం క్షణం భయపడుతూ జీవిస్తున్నాయి.

**సాగిపోతున్నప్పుడు, వారు విలువిద్యను అభ్యసిస్తున్నారు. దైవప్రవక్త(స) వాళ్ళను ఉద్దేశించి, "ఇస్మాయీల్ పుత్రులారా! విలువిద్యను నేర్చుకోండి. మీ పూర్వీకుడైన ఇస్మాయీల్ (అ) కూడా విలుకాడే. అవును. విలు విద్యలో ప్రావీణ్యం సంపాయించండి. నేను ఫలానా(ఇబ్నుల్ వరా) తరఫువాణ్ణి" అని అన్నారు. ఆయన(సఅసం) ఒక పక్షాన చేరి పోటీకి సిద్ధమవగానే రెండవ వైపున ఉన్నవారు తమ చేతులను ఆపేశారు. "ఏమయింది? బాణ ప్రయోగం ఆపేశారేమిటి?" అని ఆయన(స) ప్రశ్నించగా, 'తమరు ఒక పక్షాన ఉండగా మేము ఎలా పోటీ పడగలం?' అని అవతలివారు చెప్పారు. అప్పుడు, "ఫరవాలేదు. బాణాలను ప్రయోగించండి. నేను మీ అందరి పక్షాన ఉన్నాన"[1] ని దైవప్రవక్త(స) పలికారు.**

**240) హమ్జా బిన్ ఉసైద్ తన తండ్రి నుండి సంగ్రహించి ఇలా వివరించారు: బద్ర్ యుద్ధ సందర్భంగా మేము ఖురైషులకు ఎదురుగా పంక్తులు తీరి నిలబడినప్పుడు, వారు కూడా మాకు ఎదురుగా సర్వసన్నద్ధమై ఉన్నప్పుడు, ప్రవక్త మహనీయులు(సఅసం) మాతో ఇలా అన్నారు: "ఒకవేళ (మీపైన దాడి చేస్తూ) ఖురైషులు మీకు దగ్గరగా వచ్చినట్లయితే, మీరు వాళ్ళపై ఎడతెగకుండా బాణాల వర్షం కురిపించండి- అలా చేసినట్లయితే వారు వెనక్కి తగ్గుతారు."[1]**

---

239-1. దైవప్రవక్త(స) నిత్యం తన సహచరులను సిపాయిలుగా జీవించేలా తీర్చిదిద్దారన్న సంగతి సీరత్‌ను అధ్యయనం చేసినవారికి తెలుసు. ఈ హదీసు ద్వారా విదితమయ్యేది కూడా ఇదే. అరబ్బుల ముత్తాత యగు హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) గొప్ప విలుకాడు అన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా ప్రస్ఫుటమయింది. ప్రస్తుతం బాణాల స్థానాన్ని తుపాకులు, రివాల్వర్లు, మిజైళ్ళు, వేరితర ఆయుధాలు ఆక్రమించాయి. కాబట్టి కాలపు అవసరాలకు తగ్గట్టుగా ఆయుధాలను సమకూర్చుకుని, వాటిని ప్రయోగించే విషయంలో తర్ఫీదు పొందటం అవసరం.

240-1. సుబ్‌హానల్లాహ్! అల్లాహ్ తన అంతిమ ప్రవక్త(సఅసం)కు సర్వతోముఖ ప్రజ్ఞను ప్రసాదించాడు. ఆయన(స) రణతంత్రంలో కూడా సాటిలేని మేటి. తీరా ప్రత్యర్థి దాడికి సిద్ధమైనప్పుడే ఆయుధాలను ప్రయోగించమని ఆదేశించటం ఒక సేనాధిపతి దక్షతకు, స్థితప్రజ్ఞతకు చిహ్నం. అలా చేయకపోతే సైనికుల ఆయుధ సామగ్రి సద్వినియోగం అవదు. దైవప్రవక్త(స) అదే చేశారు. శత్రు సైన్యానికి భయపడరాదని, వారు కయ్యానికి కాలు దువ్వినప్పుడే ధీటుగా సమాధానం ఇవ్వాలని తాకీదు చేశారు.

## అధ్యాయం : 78

## ఈటెలతో సాము (విన్యాసం) చేయటం

**241) మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం : అబీసీనియా (హబషా, ఇథియోపియా)కు చెందిన కొంతమంది (నీగ్రోలు) ప్రవక్త మహనీయుల(సఅసం) సమక్షంలో ఈటెల సాము చేస్తుండగా హజ్రత్ ఉమర్(రజి) వచ్చి, కంకరరాళ్ళు ఎత్తుకుని వారిపై రువ్వసాగారు. అప్పుడు దైవప్రవక్త(స) ఆయన్ని వారిస్తూ "ఉమర్! వారి విన్యాసానికి అడ్డు తగలకు, వారిని ఆడుకోనివ్వు" అని చెప్పారు. ప్రవక్త(స) ప్రియసహచరుల ఈ విన్యాసం మస్జిద్‌లో జరిగిందని అలీ బిన్ మదీనీ వివరించారు.[1]**

## అధ్యాయం : 79

## 'డాలు'ను గురించి... తన తోటి వాని డాలును వాడుకోవటం గురించి.

**242) హజ్రత్ అనస్(రజి) కథనం: అబూ తల్హా (రజి) తననూ, దైవప్రవక్త (సఅసం)ను కాపాడటానికి ఒకే డాలును ఉపయోగించేవారు. అబూ తల్హా (రజి) విలు విద్యలో ప్రవీణులు. ఆయన బాణం ప్రయోగించినప్పుడు, దైవప్రవక్త(స) తల ఎత్తి అది ఎక్కడి వరకు వెళుతుందో తిలకించేవారు.**

**243) సహ్ల్ బిన్ సాద్ సాయిదీ (రజి) ఇలా వివరించారు: ఉహుద్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (సఅసం) శిరస్త్రాణం ధరించి ఉన్నారు. ఆయన (స) శిరస్త్రాణం పగులగొట్టబడింది. ఆయన(స) ముఖారవిందం రక్తసిక్తమైపోయింది. ఆయన(స) దంతాలు ఊడిపోయాయి. ఆ సమయంలో హజ్రత్ అలీ(రజి)**

---

241-1. ఇది యుద్ధ శిక్షణలో భాగంగా జరిగిన అభ్యాసం. మస్జిద్‌లో ఈ విధమైన అభ్యాసం చేయటం మర్యాదకు విరుద్ధమని ఉమర్(రజి) భావించారు. అందుకే ఆయన నీగ్రోలపై కోపాన్ని ప్రదర్శించారు. అయితే దైవప్రవక్త(స) ఉమర్‌ను వారిస్తూ, ఆ విన్యాసాన్ని కొనసాగించారు. మహాప్రవక్త(స) హయాంలో మస్జిద్ ఒక ఇస్లామిక్ సచివాలయంగా, శిక్షణా కేంద్రంగా కూడా ఉండేది. అక్కడి నుండి రక్షణ శాఖకు సూచనలందేవి. వివిధ రాజ్యాలకు ఉత్తరాలు వెళ్ళేవి. పరిపాలనా వ్యవస్థకు సంబంధించిన ఆదేశాలు కూడా జారీ అయ్యేవి.

**'డాలు'లో నీళ్ళు తెచ్చి ఇస్తుంటే, హ(జత్ ఫాతిమా (ర.అ) గాయాలు కడగసాగారు. కాని (స్రవించే రక్తం నీళ్ళకన్నా ఎక్కువగా ఉండటంతో, ఆమె గారు ఒక చాపను కాల్చి దాని బూడిదను గాయాలపై అద్దారు. దాంతో రక్తస్రావం ఆగిపోయింది.**[1]

**244) హ(జత్ ఉమర్(రజి) కథనం : "యుద్ధం జరగకుండానే అల్లాహ్ తన ప్రవక్త(సఅసం)కు వొసగిన సొమ్ములలో బనూ నజీర్ తోటలు కూడా ఉన్నాయి. ముస్లింలు వాటిని పొందడానికి గుర్రాలను గానీ, ఒంటెలను గానీ పరుగెత్తించలేదు. అందువల్ల ఆ సొమ్ములు దైవప్రవక్త(స)కు ప్రత్యేకించబడ్డాయి. ఆ ఆస్తిలో నుండే దైవప్రవక్త(స) తన సతీమణులకు సాలీనా భత్యం చెల్లించేవారు. మిగిలిన సొమ్ము లను యుద్ధ సామగ్రిని సమకూర్చుకోవడానికి, గుర్రాల పోషణకై వెచ్చించేవారు. దైవమార్గంలో (పోరాటానికి) సర్వవిధాలా సంసిద్ధమై ఉండాలన్నదే దీని ఉద్దేశ్యం.**

**245) హ(జత్ అలీ (రజి) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ షద్దాద్ తెలియజేశారు : ఆయన (అలీ– రజి) ఇలా చెప్పేవారు : సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) తరువాత నేను ఎవరి గురించి కూడా దైవప్రవక్త(స) ఈ విధంగా చెబుతుండగా వినలేదు. ఆయన(సఅసం) ఇలా పలికేవారు. "(సాద్!) బాణ వర్షం కురిపించు. నీపైన నా తల్లిదండ్రులు సమర్పితం."**[1]

---

243–1. దైవప్రవక్త(స) పల్లు ఊడటానికి కారకుడైన ఆ ధూర్తుడు ఎవరో కాదు, హ(జత్ సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) సోదరుడు ఉతబా బిన్ అబీ వక్కాస్, వాడు దైవప్రవక్త(స)కు దగ్గరగా వెళ్ళి, రాయి విసిరాడు. అంతే, అప్పటికప్పుడే హాతిబ్ బిన్ అబీ బల్తా (రజి) అతనిపై మెరుపుదాడి చేసి, ఒక్క వ్రేటుతో అతని కథను సమాప్తం చేశారు. అబ్దుల్లాహ్ బిన్ ఖుమియ్యా ఆయన(స)పై రాళ్ళు రువ్వాడు. "అల్లాహ్ నిన్ను నాశనం చెయ్య" అని దైవప్రవక్త(స) శపించారు. అలాగే జరిగింది. ఒక కొండ జాతి పొట్టేలు అతన్ని కొమ్ములతో పొడిచి, ముక్కలు ముక్కలు చేసేసింది.

245–1. ఉహుద్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(స) నోట వెలువడిన పలుకులు ఇవి. ఈ హదీసు ప్రకారం విలువిద్య గొప్పతనం తేటతెల్లమవుతుంది. ఎందుకంటే దైవప్రవక్త(స) సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) బాణ ప్రయోగాన్ని మెచ్చుకుని ఈ విధంగా పలికారు. రణరంగంలో ప్రావీణ్యం సంపాదించటం కూడా దైవప్రసన్నతను చూరగొనటంలో భాగమేనని దీని ద్వారా ద్యోతకమవుతోంది.

## అధ్యాయం :80

## డాలు గురించి....

**246) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసం) నా దగ్గరకు విచ్చేసినప్పుడు, ఇద్దరు (అన్సార్) బాలికలు 'బుఆస్' యుద్ధానికి సంబంధించిన గీతాలు ఆలపిస్తున్నారు.[1] ఆ సమయంలో ఆయన(స) పడకపై మేను వాల్చి, ముఖం మరోవైపు తిప్పుకున్నారు. అంతలోనే అబూబకర్(రజి) అక్కడకు వచ్చి, 'దైవప్రవక్త(స) సమక్షంలో ఇలాంటి షైతానీ పాటలా?' అంటూ నన్ను మందలించారు. అయితే ఆయన(స) నా తండ్రి వైపు తిరిగి, "వాళ్ళను పాడుకోనివ్వు" అని పలికారు.[2] తరువాత అబూబకర్(రజి) వేరే పనిలో నిమగ్నమయ్యారు. నేనేమో ఆ బాలికలను సైగ చేశాను. వాళ్ళు నిష్క్రమించారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు : పండుగ దినాన కొంతమంది సూడానీ (నీగ్రో) యువకులు తమ డాలు,ఈటెలతో విన్యాసాలు చేస్తున్నారు. ఆయన(స)తో నేనే స్వయంగా అన్నాను లేదా ఆయనే(స), "నువ్వు కూడా చూడదలుస్తున్నావా?" అని అడిగారు. నేను 'అవున'న్నాను. ఆయన(స) నన్ను తన వెనుక నిలబెట్టారు. నా ముఖం ఆయన(స) ముఖారవిందానికి తగులుతూ ఉండగా**

---

246-1. 'బుఆస్' యుద్ధం మదీనాలోని ఔస్- ఖజ్రజ్ తెగల మధ్యన జరిగేది. ఒకసారి అది మొదలైందంటే ఏళ్ళ తరబడి కొనసాగేది. హిజ్రత్‌కు మూడేళ్ళక్రితం ఆ యుద్ధం ముగిసింది. వేరొక ఉల్లేఖనంలో 'ఆ బాలికలు (గీతాలాపన చేయటం బదులు) డప్పు వాయించారు' అని ఉంది.

246-2. వేరొక ఉల్లేఖనంలో, "అబూబకర్! ప్రతి జాతికీ ఒక పర్వదినం ఉంటుంది. ఇది మన పర్వదినం" అని అదనంగా ఉంది. దీనినిబట్టి తెలిసేదేమంటే ఆనంద ఘడియలలో, ఉదాహరణకు- వివాహం, వలీమా, అఖీఖా లాంటి సమయాలలో సంతోషంతో కేరింతలు కొట్టడం, డప్పు వాయించటం, గీతాలాపన చేయటం సమ్మతమే. అహ్లెహదీసు జమాఅత్ వారు దీనిని అవలంబించారు. కాని హనఫీలు మాత్రం దీనిని అధర్మంగా భావించారు. షేఖ్ ఇబ్నె ఖయ్యిమ్ కూడా దీనిని నిషిద్ధంగానే తలపోస్తున్నారు. కాగా; షేఖ్ ఇబ్నె హజం (రహ్మ) దీనిని సమ్మతంగా తలపోస్తున్నారు. మొత్తానికి ఈ విషయంలో విద్వాంసుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి.కాని ఈ విషయంలో అతిశయిల్లటం ఎంతమాత్రం భావ్యం కాదు. చివరకు సూఫీలు సయితం కొన్ని షరతులకు కట్టుబడి మరీ పాటలు వింటారు. అవేమంటే 1) గాయకుడు పురుషుడై ఉండాలి. అపరిచిత స్త్రీ అయి ఉండకూడదు. 2) పాటలు అశ్లీలంతో కూడినవై ఉండరాదు. అవి షరీఅత్‌కు

(అంటే నేను ఆయన వీపు వెనుక తెరచాటుగా ఉండగా) నేనా విన్యాసాన్ని వీక్షించాను. "అర్ఫిదా తెగవారలారా![3] తనవితీరా ఆడుకోండి" అని దైవప్రవక్త(స) చెప్పారు. నేను అలసిపోవటం గమనించి, "చాలా!" అన్నారాయన(స). 'చాలు' అని నేనన్నాను. "సరే. వెళ్ళు" అని ఆయన(స) అన్నారు. అహ్మద్ ద్వారా వివరించబడిన వేరొక ఉల్లేఖనంలో, అబూబకర్ (రజి) వచ్చిన మీదట మరో పనిలో పడిపోయారు అనే బదులు 'ఫలమ్మా గఫల' అనే వాక్యం ఉంది. (అంటే 'ఆమె పరధ్యానంలో పడినప్పుడు అని ఉంది)

## అధ్యాయం : 81

## ఖడ్గాలను మెడలో వ్రేలాడదీయటం

**247)** హజ్రత్ అనస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసం) అందరికన్నా సుందర స్వరూపులు, అందరికన్నా ధైర్యశాలి. ఒక రోజు రాత్రి మదీనాపై (ఒక అరుపు వినబడి) భయోత్పాతం ఆవరించింది. అందరూ ఆ అరుపు వైపు పరుగులు తీశారు. ఆ సమయంలో దైవప్రవక్త(సఅసం) అందరికన్నా ముందుండి ఆ సంఘటన నిజానిజాలను విచారించారు. ఆ సందర్భంగా ఆయన(స) అబూ తల్హా (రజి) గుర్రంపై స్వారీ అయ్యారు. దాని వీపు నగ్నంగా ఉంది (అంటే గుర్రం వీపుపై జీను లేదు). ఆయన(స) మెడలో ఖడ్గం వ్రేలాడుతూ ఉంది. "భయపడవలసిన అవసరం లేద"ని ఆయన(స) అంటున్నారు. చివరకు ఆయన(స) ఇలా అన్నారు : "మేము ఈ గుర్రాన్ని ఉప్పొంగే జలపాతంలా వేగవంతమైనదిగా కనుగొన్నాము" లేదా "ఈ గుర్రం సముద్రంలా ఉంది" అన్నారు.

## అధ్యాయం : 82

## ఖడ్గాన్ని ఆభరణంతో అలంకరించటం

**248)** అబూ ఉమామా బాహిలీ (రజి) తెలిపారు: ఒకానొక జాతి (మహాప్రవక్త-సఅసం- ప్రియ సహచరుల బృందం) ఎన్నో విజయాలు సాధించింది. వారి ఖడ్గాలు వెండీ బంగారు ఆభరణాలతో కాకుండా ఒంటె వీపు మీది చర్మంతో, సీసంతో, లోహంతో అలంకరించబడేవి.[1]

---

విరుద్ధంగా ఉండకూడదు. 3) పైగా ఆ పాటల వల్ల దైవం, దైవప్రవక్త(స) పట్ల ప్రేమ జనించాలి.

246-3. హబషీలను (నీగ్రోలను) 'అర్ఫిదా'గా కూడా వ్యవహరిస్తారు.

## అధ్యాయం : 83

## ప్రయాణ సందర్భంగా- మధ్యాహ్న సమయంలో- విశ్రమించినప్పుడు తమ ఖడ్గాన్ని చెట్టుకు వ్రేలాడదీయటం

**249)** **జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలియజేశారు : ఈయన నజ్ద్ క్షేత్రంలో జరిగిన ఒక యుద్ధంలో దైవప్రవక్త(సఅసం) వెంట ఉన్నారు. దైవప్రవక్త(సఅసం) జిహాద్ నుండి తిరిగి వస్తున్నప్పుడు ఈయన కూడా తోడుగా ఉన్నారు. మధ్యాహ్నం విశ్రాంతి కొరకు ఒకానొక లోయలో విడిది చేశారు. అక్కడ తుమ్మచెట్లు ఎక్కువగా ఉన్నాయి. దైవప్రవక్త(స) ఆ లోయనే విడిది కొరకు ఎంపిక చేశారు. సహచరులంతా నలుమూలలా విస్తరిల్లారు (అంటే నీడ ఉన్నచోట మేను వాల్చారు). దైవప్రవక్త(స) కూడా ఒక తుమ్మ చెట్టు క్రింద పడుకుంటూ తన ఖడ్గాన్ని చెట్టుకు వ్రేలాడదీశారు. మేమంతా నిద్రలోకి జారుకున్నాము. దైవప్రవక్త(స) కేక విని మాకు మెలకువ వచ్చింది. ఆ సమయంలో ఒక పల్లెటూరి బైతు ఆయన(స) ఎదుట నిలబడి ఉన్నాడు. "నేను నిద్రిస్తున్న సమయంలో ఇతను నా ఖడ్గాన్ని తీసుకుని నా మీదే దాడి చేశాడు. నాకు మెలకువ వచ్చి చూస్తే ఒరలేని ఖడ్గం ఇతని చేతిలో ఉంది" అని ఆయన(స) చెప్పారు. "నా బారి నుండి నిన్ను రక్షించేవారెవరు?" అని ఇతగాడు ప్రశ్నించాడు. "అల్లాహ్" అని నేను మూడు సార్లు బదులిచ్చాను (అంతే, ఆ క్షణమే అతని చేతిలోనుండి ఖడ్గం జారి క్రింద పడిపోయింది). దైవప్రవక్త(స) ఆ పల్లెటూరి వ్యక్తిని శిక్షించలేదు. లేచి కూర్చున్నారంతే.** [1]

---

248-1. పూర్వం అజ్ఞాన కాలంలో ఖడ్గాలను వెండీ బంగారు ఆభరణాలతో అలంకరించేవారు. అయితే ముస్లిములు ఇలాంటి బాహ్య అలంకరణలకు, కృత్రిమ పద్ధతులకు పోకుండా సీసంతో, లోహంతోనే ఆయుధాలను అలంకరించేవారు. యుద్ధ పరికరాలను వీలైనంత వరకు మంచి పద్ధతిలో ఉంచే ఆచారం ఇప్పటికీ నాగరిక జాతులలో ఉంది. విద్వాంసులు కూడా ఆయుధాల అలంకరణకు అనుమతించారు. కాని బంగారాన్ని ఉపయోగించరాదని సూచించారు.

249-1. ఇబ్నె ఇస్హాఖ్ 'మగాజీ'లో పొందుపరచిన ఉల్లేఖనంలో ఇలా వుంది : అవిశ్వాసులు 'దాఘూర్' అనే ఆ మొరటోణ్ణి దైవప్రవక్త(స)పై ఉసిగొల్పారు. 'చూడు! ముహమ్మద్(స) అక్కడ పడుకుని ఉన్నారు. ఆయన్ని హతమార్చు' అని అతనికి సూచించారు. ఆ పల్లెటూరి వ్యక్తి ఒక ఖడ్గం పట్టుకుని వచ్చి ఆయన(స) తల వద్ద నిలబడ్డాడు. 'ఈ క్షణంలో నా బారి నుండి నిన్ను రక్షించేదెవరు?' అని అరిచాడు. ఆయన(స) ఎంతో

## అధ్యాయం : 84
## శిరస్త్రాణం ధరించటం

**250) మహనీయ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ (రజి) ఉల్లేఖనం: ఉహుద్ యుద్ధంలో ప్రవక్త మహనీయులు (సఅసం) గాయపడటం గురించి ఈయన్ని ప్రశ్నించగా ఈయన ఇలా వివరించి చెప్పారు: "ఆయన(స) ముఖారవిందంపై గాయాలయ్యాయి. ఆయన(స) ముందు వరుస పల్లు ఊడిపోయాయి. ఆయన ధరించిన శిరస్త్రాణం సయితం విరిగిపోయింది (తత్కారణంగా ఆయన తలకు కూడా గాయమయింది). హ్జ్రత్ ఫాతిమా (ర.అ) రక్తాన్ని కడుగుతుంటే హ్జ్రత్ అలీ(ర.అ) నీళ్ళు పోస్తున్నారు. రక్తస్రావం ఎంతకీ ఆగకపోవడంతో ఫాతిమా (ర.అ) ఒక చాపను కాల్చి ఆ బూడిదను ఆయన(స) గాయాలపై అద్దారు. దాంతో రక్తస్రావం ఆగిపోయింది."[1]**

## అధ్యాయం : 85
## ఒకరి మరణం తర్వాత, అతని ఆయుధాలను విరగ్గొట్టడం సమంజసం కాదు

**251) అమ్ర్ బిన్ హారిస్(రజి) కథనం: మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) తన తదనంతరం తన ఆయుధాలను, ఒక తెల్లని కంచెర గాడిదను, ఒక భూభాగాన్ని– దానిని ఆయన ముందే దానం చేసి ఉన్నారు– తప్ప మరే వస్తువునూ వదలలేదు.[1]**

---

ప్రశాంతంగా "అల్లాహ్" అని పలికారు. ఆయన(స) ఈ విధంగా పలకగానే దైవదూత జిబ్రీల్(అ) వచ్చి, అతని గుండెపై ఒక్క గుద్దు గుద్దారు. అంతే, అతని చేతిలోని ఖడ్గం క్రింద పడిపోయింది. అప్పుడు ఆయన(స) ఆ ఖడ్గాన్ని వశపరచుకుని, "ఇప్పుడు నిన్ను రక్షించేవాడెవడో చెప్పు?" అనడిగారు. 'ఎవరూ రక్షించలేర'ని అతనన్నాడు. "సరే. పో" అంటూ ఆయన (స) క్షమించారు. ఆ పల్లెటూరి బైతు తరువాత ఇస్లాం స్వీకరించాడని, తన తెగ వారిని కూడా ఇస్లాం వైపునకు ఆహ్వానించాడని అనబడుతోంది.

250–1. ఉహుద్ సంగ్రామంలో ఎదురయిన అత్యంత హృదయ విదారక సంఘటన స్వయంగా దైవప్రవక్త(స) గాయపడటం. ఇబ్నె ఖుమయ్యా ద్వారా ఆయన(స) ముఖారవిందం గాయపడింది. ఉతబా బిన్ అబీ వక్కాస్ ద్వారా ఆయన (స) దంతాలకు నష్టం వాటిల్లింది. ఆయన(స) ధరించిన శిరస్త్రాణాన్ని విరగ్గొట్టినవాడు అబ్దుల్లాహ్ బిన్ హిషామ్. శిరస్త్రాణం రణభూమిలో రక్షణ నిమిత్తం తొడగటం జరుగుతుంది.

251–1. పూర్వం అజ్ఞాన కాలంలో అరేబియాలో ఎవరయినా ఒక ప్రముఖ యోధుడు, తెగ నాయకుడు మరణించినప్పుడు అతని ఆయుధాలను విరగ్గొట్టేవారు. ఆ ఆయుధాలను

## అధ్యాయం : 86

## మధ్యాహ్న సమయంలో సైనికులు తమ నాయకుని ఆనతితో వేరై చెట్ల నీడలను ఆశ్రయించగలరు

**252) హజ్రత్ జాబిర్ అబ్దుల్లాహ్ (రజి) తెలియజేశారు: ఈయన దైవప్రవక్త (సఅసం)తో కలసి ఒక యుద్ధ ప్రయాణంలో పాల్గొన్నారు. తుమ్మచెట్లు అధికంగా ఉన్న ఒక అడవి గుండా సాగుతున్నారు. మధ్యాహ్నం విశ్రాంతి తీసుకునే సమయం అది. ప్రియ సహచరులంతా (ఆ లోయలో తుమ్మచెట్ల నీడను ఆశ్రయించేందుకు) విస్తరిల్లారు. దైవప్రవక్త(స) కూడా ఒక వృక్షం క్రింద మేను వాలుస్తూ తన ఖడ్గాన్ని వృక్షం మొదలుకు వ్రేలాడదీశారు. ఆయన(స)కు నిద్రపట్టింది. మెలకువ వచ్చేసరికి, ఆయన ఎదుట ఒక ఆగంతకుడు నిలబడి ఉన్నాడు. 'నా బారి నుండి నిన్ను రక్షించే వాడెవడు?' అని ఘీంకరించాడు. దైవప్రవక్త(స) కేక వేయడంతో సహాబా అంతా అక్కడికి చేరుకున్నారు. అప్పుడు ఆయన(స)ఇలా అన్నారు: "చూడండి, ఈ వ్యక్తి నా ఖడ్గాన్ని లాక్కుని నాపైనే దాడి చేయబోయాడు. 'నా బారి నుండి నిన్ను రక్షించే వాడెవడు?' అని అడిగాడు. 'అల్లాహ్' అని నేను సమాధానమిచ్చాను. అంతే, అతను తన ఖడ్గాన్ని తానే ఒరలో పెట్టేసుకున్నాడు. ఇదిగో, ఇలా చతికిలపడ్డాడు." కాని ఆయన(స) అతనిపై పగ తీర్చుకోలేదు.[1]**

## అధ్యాయం : 87

## ఈటెల (బల్లెముల) గురించి...

**మహనీయ ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "నా జీవనోపాధి నా ఈటెల నీడలో ఉంచబడింది. నా షరీఅత్‌ను వ్యతిరేకించే వానికి పరాభవం, దైన్యమే గతి."[1]**

---

మోసేవాడెవడూ ఇక ఎవ్వడూ లేదు అన్నదానికి అది సంకేతం. కాని ఇస్లాంలో అలాంటి ఆచారమేదీ ధర్మసమ్మతం కాదు. దైవప్రవక్త(సఅసం) పరమపదించిన తరువాత ఆయన(స) ఆయుధాలు, తదితర వస్తువులు భద్రపరచబడ్డాయి. అధ్యాయంలో ముఖ్యాంశం ఇదే. అలాంటి వస్తువులను దైవమార్గంలో దానం చేస్తే అది మరీ మంచిది.

252-1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. ఇమామ్ బుఖారీ (రహ్మా) దీనిని మరోసారి ఇక్కడ పునరావృతం చేయడంలోని ఉద్దేశ్యం, యుద్ధ ప్రయాణంలో సైనికులు తమ సేనాధిపతి అనుమతితో మధ్యాహ్నం వేళ విశ్రాంతి కొరకు చెట్ల నీడలను ఆశ్రయిం చటం సబబేనని చెప్పడమే.

**253)** అబూ ఖతాదా (రజి) కథనం: ఈయన ప్రవక్త మహనీయుల (సఅసం)తో కలసి ఒక ప్రయాణంలో పాల్గొన్నారు (హుదైబియా ఒడంబడిక జరిగిన సంవత్సరం అది). మక్కాకు వెళుతుండగా ఈయన వెంట ఉన్న కొంతమంది సహవాసులు ఇహ్రామ్ ధరించి ఉన్నారు. ఈ మిత్ర బృందం ప్రయాణంలో వెనుకబడి పోయింది. ఖతాదా (రజి) అప్పటికింకా ఇహ్రామ్ దీక్ష పూనలేదు. అంతలో ఆయనకు ఒక అడవి గాడిద కనిపించింది. ఆయన తన గుర్రంపై స్వారీ అయ్యారు (దానిని వేటాడే ఉద్దేశ్యంతో). ఆ తరువాత ఆయన (ఇహ్రామ్ కట్టుకుని ఉన్న తన మిత్రులతో) 'కొరడా అందించండి' అని కోరారు. కాని వారంతా అందుకు నిరాకరించారు. తన ఈటెనయినా ఇవ్వమని అభ్యర్థిస్తే, దానిని కూడా ఇవ్వలేదు. చివరకు ఆయన స్వయంగా దానిని తీసుకుని అడవి గాడిదపై లంఘించారు. దానిని వధించారు. ప్రవక్త సహచరులలోని కొంతమంది ఆ అడవి గాడిద మాంసాన్ని తిన్నారు. మరి కొంతమంది (తాము ఇహ్రామ్ దీక్షలో ఉన్నామన్న కారణంగా) తినలేదు. దైవప్రవక్త(స)ను కలుసుకున్నప్పుడు, ఈ విషయమై సందేహపడగా, "అది తినే వస్తువే. దానిని అల్లాహ్ మీకు ప్రసాదించాడ"ని ఆయన(స) చెప్పారు. వేరొక ఉల్లేఖనంలో దైవప్రవక్త(స) తన సహచరుల సందేహానికి సమాధానమిస్తూ, "ఏమిటి, ఆ మాంసంలో ఏ భాగమైనా మీ వద్ద మిగిలి ఉందా?" అని అడిగారు.[1]

## అధ్యాయం : 88

## మహాప్రవక్త (సఅసం) యుద్ధంలో కవచం ధరించటం. అలాగే (లోహపు) చొక్కా తొడగటం

ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా అన్నారు : "ఖాలిద్ బిన్ వలీద్ తన యుద్ధ కవచాలను దైవమార్గంలో అంకితం చేసేశాడు (కనుక అతని నుండి జకాత్ అడగటం భావ్యం కాదు)".

**254)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసం) బద్ర్ యుద్ధం జరిగిన రోజున దైవాన్ని వేడుకుంటూ ఉన్నారు.

---

87-1. ఈ హదీసును ఇమామ్ అహ్మద్(రహ్మ) వసల్ చేశారు. దీని అర్థం ఏమిటంటే, నా వృత్తి సేనానిది. మరో హదీసు ప్రకారం, నా ఉమ్మత్ వర్తకం జిహాద్.

253-1. ఈ హదీసులో అబూ ఖతాదా (రజి) ఈటెతో సాయుధులై ఉన్న ప్రస్తావన ఉంది. ఇదే ఈ అధ్యాయంలోని అసలు అంశం.

**ఆ సమయంలో ఆయన(స) గుడారంలో ఉన్నారు. "దేవా! నేను నీతో జరిగిన ఒడంబడికను, వాగ్దానాన్ని ఉదాహరిస్తూ చెబుతున్నాను– ఒకవేళ అదే (అసత్యవాదుల ప్రాబల్యమే) నీ అభిమతమై ఉంటే ఈ రోజు తరువాత నీ ఆరాధన జరగదు"[1] అని పలికారు. ఈ మాట వినగానే అక్కడున్న హ్రజత్ అబూబకర్(రజి) ఆయన(స) చేయి పట్టుకుని, 'దైవప్రవక్తా! ఇక చాలించండి. మీరు మీ ప్రభువు సన్నిధిలో వేడుకోవటంలో ఆఖరి హద్దు వరకూ వెళ్ళిపోయారు' అని పలికారు. దైవప్రవక్త(స) బయటకు వచ్చినప్పుడు ఆయన(స) నోట ఈ దైవవచనం జాలువారుతోంది: "త్వరలోనే ఆ వర్గం పరాజయం పాలవుతుంది. వారంతా వెన్నుచూపి పారిపోతూ కనిపిస్తారు. కాని వారి పీచం అణచటానికి అసలు వాగ్దానం చేయబడిన సమయం ప్రళయమే." (అల్ ఖమర్:45, 46). అది బద్ర్ సంగ్రామం నాడు జరిగిన సంఘటన.**

**255) హ్రజత్ ఆయిషా(ర.అ) తెలియజేశారు: "మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) పరమపదించినప్పుడు, ఆయన(స) యుద్ధ కవచం ఒక యూదుని వద్ద ముప్ఫయి 'సా'ల యవలకు బదులుగా కుదువ పెట్టబడి ఉంది." ఆమష్ కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఒక ఇనుప కవచాన్ని తాకట్టుపెట్టి ఉన్నారు. యాలా అందజేసిన సమాచారం ప్రకారం 'ఇనుప కవచం (ఆ యూదుని వద్ద) తాకట్టుగా ఉంచబడింది.'**

---

254–1. అంటే, 'ఓ అల్లాహ్! ఈ రోజు నీవు నీ వాగ్దానాన్ని నెరవేర్చు' అని భావం. ఇంతకీ వాగ్దానం ఏమిటి? అంటే, వస్తే వర్తక బిడారు వస్తుంది లేదా అవిశ్వాసులపై విజయం లభిస్తుంది. దైవప్రవక్త(స)కు దైవ వాగ్దానంపై గట్టి నమ్మకం ఉంది. అయితే ఒక వైపు ముస్లిం సిపాయిల వద్ద ఉన్న అరకొర సౌకర్యాలను, మరో వైపున శత్రువుల భారీ సంఖ్యను చూసి ఆయన(స) మానవ సహజమైన బలహీనత చేత అలా పలికారు (ఈ రోజు తరువాత నిన్ను సేవించేవారుండరని). అంటే ఈ లోకంలో స్వచ్ఛమైన నీ దాస్యం చేసేవారు ఈ 313 మంది మాత్రమే. ఒకవేళ నీవే గనక వీళ్ళను తుదముట్టించదలిస్తే ప్రళయదినం వరకూ నిన్ను పూజించేవారుండరు. నేను అంతిమ దైవప్రవక్తను గనక మానవ సంస్కరణ కొరకు వచ్చే వారెవరూ ఉండరు. ప్రళయ దినం వరకూ బహుదైవారాధన ఆధిక్యంలో ఉంటుంది.

అల్లాహ్ తన సందేశహరుని మొరను ఆలకించాడు. బద్ర్ మైదానంలో సత్య తిరస్కారులను ఓటమిపాలు చేసి, వారి నడ్డి విరిచేశాడు. ఇస్లాం ప్రాబల్యం వహించేందుకు మార్గం సుగమం అయింది. ఈ హదీసు ద్వారా యుద్ధరంగంలో కవచం తొడగటం సరైనదేనని రుజువయింది.

**256)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "(జకాత్ ఇవ్వని) పిసినారి, జకాత్‌ను విధిగా చెల్లించే దాత ఉపమానం ఇనుప కవచాలను ధరించిన ఇద్దరు వ్యక్తుల్లాంటిది. వారిద్దరి చేతులు వారి మెడలకు కట్టబడి ఉన్నాయి. జకాత్ ఇచ్చే దాత జకాత్ ఇవ్వాలని సంకల్పించు కోగానే అతని ఇనుప చొక్కా వదులైపోతుంది. అది ఎంతగా వదులైపోతుందంటే దానిని నేలపై ఈడ్చుకుంటూ పోవచ్చు. కాని పిసినారి జకాత్ ఇవ్వాలని సంకల్పించు కున్నప్పుడు, అతని కవచంలోని ఒక భాగం అతని శరీరానికి మరింతగా బిగుసుకు పోతుంది. తత్కారణంగా అతని చేతులు అతని మెడకు అతుక్కుపోతాయి. దైవ ప్రవక్త(స) ఇలా చెబుతూ ఉండగా కూడా అబూహురైరా (రజి) విన్నారు : "మరి పిసినారి ఆ కవచాన్ని వదులు చేయడానికి తంటాలు పడతాడు. కాని అది వదులు అవదు."[1]

## అధ్యాయం : 89

## ప్రయాణంలో, యుద్ధంలో జుబ్బా తొడగటం

**257)** ముగీరా బిన్ షూబా (రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసం) కాలకృత్యాలు తీర్చుకోవటానికి వెళ్ళారు. ఆయన తిరిగి వచ్చినప్పుడు నేను నీళ్ళు తీసుకుని ఆయన(స) సేవలో హాజరయ్యాను. ఆయన(స) సిరియా దేశంలో తయారైన ఒక జుబ్బా (పొడవాటి అంగీ)ని తొడిగి ఉన్నారు. ఆయన(స) పుక్కిలించారు. ముక్కు శుభ్రపరచుకున్నారు. తన ముఖం కడుక్కున్నారు. ఆ తరువాత (చేతులు కడుక్కోవడానికి) చొక్కా చేతులు పైకెక్కించే ప్రయత్నం చేశారు. కాని అవి బిగుతుగా ఉండటం వల్ల తన చేతులను క్రింది నుంచే బయటకు తీసి కడిగారు. అనంతరం తల భాగంపై, మేజోళ్ళపై మసహ్ చేశారు.

---

256–1. ఈ హదీసు ఇంతకుముందు జకాత్ ప్రకరణంలో కూడా వచ్చింది. దీని అర్థం ఏమిటంటే దాత హృదయం జకాత్ ఇవ్వటం వల్ల విశాలంగా, సంతోషంగా ఉంటుంది. ఇక పిసినారి అంటారా, అతను అసలు జకాత్ చెల్లించడు. ఒకవేళ బలవంతం మీద ఇచ్చినా అతని ఆంతర్యం ఇరుకైపోతుంది. అతని కవచం శరీరానికి బిగుసుకుపోవటం అంటే అర్థం ఇదే. పిసినారితనాన్ని ఖండించే హదీసులు అనేకం ఉన్నాయి. విశ్వాసి అయినవాడు దైవమార్గంలో ఏది ఇచ్చినా సంతోషంగా, మనస్ఫూర్తిగా ఇస్తాడు. అందుకే అతను ధరించే చొక్కా అతనికి బాగా వదులుగా ఉంటుంది.

## అధ్యాయం : 90
## యుద్ధంలో పట్టు వస్త్రం ధరించటం[1]

**258)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి), జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)లకు దురద జబ్బు వచ్చిన కారణంగా పట్టు వస్త్రాలు ధరించేందుకు అనుమతి ప్రదానం చేశారు.[1]

**259)** మహనీయ అనస్ (రజి) కథనం : అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, జుబైర్ బిన్ అవ్వామ్(రజి.అన్హుమా)లిద్దరూ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి తమకు పేలు పడినట్లు ఫిర్యాదు చేయడంతో, వారికి పట్టువస్త్రాలు ఉపయోగించుకునేందుకు దైవప్రవక్త(సఅసం) అనుమతి ఇచ్చారు. ఆ తరువాత నేను వారిద్దరినీ యుద్ధ సమయంలో పట్టువస్త్రాలు ధరించి ఉండగా చూశాను.

**260)** హజ్రత్ అనస్(రజి) తనతో ఈ విధంగా చెప్పినట్లు ఖతాదా తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసం)తన సహచరులైన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, జుబైర్ బిన్ అవ్వామ్(ర.అన్హుమా)లకు పట్టు వస్త్రాలు ధరించేందుకు అనుమతి ప్రదానం చేశారు.

**261)** హజ్రత్ అనస్ (రజి) తెలియజేశారు : ఆ మహానుభావులిద్దరికీ దురద జబ్బు కారణంగా పట్టువస్త్రాలు ధరించేందుకు దైవప్రవక్త(సఅసం) అనుమతి ఇచ్చారు.

---

90-1. ఈ విషయంలో అభిప్రాయ భేదం ఉంది. ఇమామ్ మాలిక్(రహ్మ), ఇమామ్ అబూ హనీఫా(రహ్మ)లు ఎట్టి పరిస్థితుల్లోనయినా సరే పురుషులకు పట్టు వస్త్రాలు ధరించటం ధర్మసమ్మతం కాదన్నారు. ఇమామ్ షాఫయి (రహ్మ), ఇమామ్ అబూ యూసుఫ్ (రహ్మ)ల దృష్టిలో అవసరం మేరకు ధరించవచ్చు. ఉదాహరణకు-దురద జబ్బు ఉన్నప్పుడు. అహ్లె హదీసు వారి ప్రకారం యుద్ధంలో పట్టువస్త్రాలు ధరించవచ్చు.

258-1. ఇక్కడ ఇమామ్ బుఖారీ(రహ్మ) ఈ హదీసును తెచ్చి మరో అంశం వైపునకు సంజ్ఞ చేశారు. అది ముమ్ముందు రాబోతోంది. యుద్ధరంగంలో లభించిన ప్రత్యేక ఆనతి ఇది. కాగా; ఈ అనుమతి ప్రయాణ సందర్భంలో ఇవ్వబడిందని అబూదావూద్ ఉల్లేఖనంలో ఉంది. రెండవ ఉల్లేఖనంలో అనుమతికి కారణం పేలు అని ఉంది. ఈ ఉల్లేఖనంలో నేమో దురద అని ఉంది. ఈ రెండింటినీ అన్వయించే పద్ధతి ఏమిటంటే, మొదట పేలు పడి, దానివల్ల దురద పుట్టి ఉండవచ్చు. పట్టు వస్త్రం ధరించటం వల్ల దురద తగ్గుతుందని, పేలు కూడా చనిపోతాయని అనబడుతోంది.

## అధ్యాయం : 91
## చాకును ఉపయోగించటం సమంజసమే

**262)** తన తండ్రి తనతో చెప్పినట్లుగా జాఫర్ బిన్ అమ్ర్ బిన్ ఉమయ్యా తెలిపారు : ప్రవక్త ముహమ్మద్ (సఅసం) చాకుతో తొడ మాంసం కోసి తింటూ ఉండగా నేను చూశాను. అంతలోనే నమాజ్ కొరకు అజాన్ పిలుపు వినబడింది. ఆయన(స) నమాజ్ చేశారు. కాని వుజూ చేయలేదు.

**263)** అబుల్ యమాన్ ద్వారా అందిన హదీసు ప్రకారం నమాజ్ కొరకు పిలుపు రాగానే ఆయన(స) చాకును పడవేశారు.[1]

## అధ్యాయం : 92
## క్రైస్తవులతో పోరాడటం

**264)** ఉమైర్ బిన్ అస్వద్ అన్సీ తెలిపారు: ఆయన ఉబాదా బిన్ సామిత్ (రజి) సేవలో హాజరయ్యారు. ఆయన హమస్ తీరప్రాంతంలోని తన నివాస గృహంలో ఉండేవారు. ఆయనతోపాటు (ఆయన సతీమణి) ఉమ్మె హరామ్ (ర.అ) కూడా ఉండేది. ఉమైర్ ఇలా అంటున్నారు: ఉమ్మె హరామ్(ర.అ) మాతో ఇలా అంది: నేను దైవప్రవక్త(సఅసం) చెప్పగా విన్నాను. దైవప్రవక్త(సఅసం) ఇలా అన్నారు: "నా అనుచర సమాజంలో అందరికన్నా ముందు ఏ సైనిక దళం సముద్ర ప్రయాణం చేసి ధర్మయుద్ధానికి వెళుతుందో అది తన కొరకు (దైవ కారుణ్యాన్ని, మన్నింపును) తప్పనిసరి చేసుకుంది." ఉమ్మె హరామ్ (ర.అ) ఇలా అంటున్నారు– 'దైవప్రవక్తా! నేను కూడా ఆ సైనిక దళంలో ఉంటానా?' అని నేను ప్రశ్నించగా, "అవును. నీవు కూడా వారి వెంట ఉంటావు" అని ఆయన(స) సమాధానమిచ్చారు. ఆ తరువాత దైవప్రవక్త(స) మళ్ళీ ఇలా అన్నారు: "నా అనుచర సమాజానికి చెందిన మొట్టమొదటి సైనిక దళం రోము చక్రవర్తి (ఖైసర్) పట్టణంపై దండెత్తుతుంది. ఆ

---

263–1. ఈ హదీసు 'వుజూ ప్రకరణం'లో కూడా వచ్చింది. ఇక్కడ ఇమామ్ బుఖారీ (రహ్మా) దీనిని మళ్ళీ తీసుకురావటంలోని ఉద్దేశం చాకును ఉపయోగించటం సమంజసమేనని చెప్పటమే. యుద్ధ సందర్భంగా కూడా దీనిని వెంట ఉంచుకోవచ్చు. ఇది కూడా ఒక ఆయుధమే. ఎన్నో పనులలో ఇది ఉపయోగపడుతుంది. కాబట్టి దీనిని ప్రయాణ సందర్భంగా తీసుకెళ్ళటం సమ్మతమే.

**సైనికులు క్షమాభిక్షకు నోచుకుంటారు.” ‘నేను కూడా వారితో పాటు ఉంటానా దైవ ప్రవక్తా!’ అని నేను సందేహపడగా, “లేదు”[1] అని ఆయన(స) సమాధానమిచ్చారు.**

## అధ్యాయం : 93

## యూదులతో యుద్ధం జరగటం గురించి...

**265)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు : **“(ఒక కాలం రానున్నది. అప్పుడు) మీరు యూదులతో యుద్ధం చేస్తారు (వారు ఓడిపోయి అటూ ఇటూ పారిపోతారు). ఏ యూదుడైనా రాయి వెనుక దాగినాసరే. ‘ఓ దైవదాసుడా! నా వెనుక దాగి ఉన్నవాడు యూదుడు. ఇతన్ని వధించు’ అని ఆ రాయి చెబుతుంది.”**

**266)** ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: ఆయన(స) ఇలా ప్రవచించారు : **“యూదులతో మీరు యుద్ధం చేయనంతవరకూ ప్రళయం నెలకొనదు. అప్పుడు రాయి కూడా (దైవాజ్ఞతో) మాట్లాడుతుంది. తన వెనుక నక్కి ఉన్న యూదుని ఆచూకీ తెలుపుతూ, ‘ఓ ముస్లిం! ఈ యూదుడు నా వెనుక దాగి ఉన్నాడు. అతన్ని సంహరించు’ అని అంటుంది.”**

---

264-1. వీటిలో మొదటి ధర్మయుద్ధం హజ్రత్ ఉస్మాన్(రజి) పరిపాలనా కాలంలో (హజ్రత్ ముఆవియా- రజి- నేతృత్వంలో) హిజ్రీ 28వ సంవత్సరంలో జరిగింది. ఖబరస్ ద్వీపంలోని క్రైస్తవులపై జరిగిన దండయాత్ర అది. ఆ యుద్ధంలో ఉమ్మె హరామ్(ర.అ) పాల్గొన్నారు. తిరుగు ప్రయాణంలో వాహనం పైనుండి క్రింద పడిపోయి అమరగతి నొందారామె. రెండవ ధర్మయుద్ధం హిజ్రీ 55లో హజ్రత్ ముఆవియా (రజి) పరిపాలనా కాలంలో జరిగింది. అది ఖుస్తుంతునియా (కానిస్టాంట్ నోపుల్)పై జరిగిన జైత్రయాత్ర. మహనీయ అబూ అయ్యూబ్ అన్సారీ(రజి) ఆ సందర్భంగానే అమరగతి నొందారు. కాన్స్టాంటినోపుల్లోనే ఆయన ఖనన సంస్కారం జరిగింది. ఈ సైనిక దళానికి యజీద్ బిన్ ముఆవియా సారథ్యం వహించాడు. కాని ఖిలాఫత్ మాత్రం హజ్రత్ ముఆవియాదే. అందువల్ల ఆ దండయాత్రను యజీద్ హయాంగా భావించటం తప్పు. హదీసులో “సైనికులు క్షమాభిక్షకు నోచుకుంటారు” అని శుభవార్త వినిపించబడినంత మాత్రాన ఆ క్షమాభిక్ష సైనిక దళంలోని ప్రతి ఒక్కరికీ అవశ్యంగా వర్తించాలన్న నిబంధన ఏమీ లేదు. స్వయంగా దైవప్రవక్త(స)తో కలసి పోరాడిన వారిలో ఒక వ్యక్తి వీరోచిత పోరాటం సాగించాడు. అయితే “అతను నరకవాసి” అని దైవప్రవక్త(స) వక్కాణించారు. మనిషి స్వర్గవాసి అవుతాడా లేక నరకానికి ఆహుతి అవుతాడా? అన్నది అతని “ముగింపు” పై ఆధారపడి ఉంటుంది.

## అధ్యాయం : 94

## తుర్కీలతో పోరాటం గురించి[1]

**267)** అమ్ర్ బిన్ తగ్లిబ్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు : "ప్రళయ సూచనలలో ఒకటేమంటే, మీరు ఒకానొక జాతి వారితో పోరాడుతారు. వారు వెంట్రుకల చెప్పులు తొడిగి ఉంటారు (లేదా వారి వెంట్రుకలు చాలా పొడవుగా ఉంటాయి) (ఇంకా ప్రళయ సూచనలలో మరొకటి ఏమిటంటే) డాలు మాదిరిగా వెడల్పాటి ముఖాలు కలవారితో మీరు యుద్ధం చేస్తారు. అంటే వారి ముఖాలపైని చర్మం చాలా మందంగా ఉంటుంది."

**268)** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "మీరు తుర్కీలతో యుద్ధం చేయనంతవరకూ ప్రళయం రాదు. వారి కళ్ళు చిన్నవిగా ఉంటాయి. ముఖాలు ఎర్రగా ఉండి, ముక్కులు మాత్రం బొద్దుగా ఉంటాయి. వారి ముఖాలు తోలు అతుకు వేయబడిన డాలు మాది రిగా ఉంటాయి. వెంట్రుకలతో తయారు చేయబడిన చెప్పులు ధరించిన వారితో మీరు యుద్ధం చేయనంతవరకూ ప్రళయం సంభవించదు."

## అధ్యాయం : 95

## వెంట్రుకల చెప్పులు ధరించినవారితో యుద్ధం చేయటం గురించి

**269)** ప్రవక్త మహనీయులు ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా

94–1. ఇక్కడ 'తుర్క్' అంటే యాఫిస్ బిన్ నూన్ సంతతి అని గ్రహించాలి. తాతారీలు మహా ప్రవక్త(స) కాలం వరకూ, మార్గదర్శక ఖలీఫాల హయాం వరకు కూడా అవిశ్వాసులు గానే ఉన్నారు. కడకు హలాకూ ఖాన్ అరబ్బులపై దండయాత్ర చేసి అబ్బాసియా ఖిలాఫత్‌కు చరమ గీతం పాడాడు. ఆ తర్వాత కొంతమంది ఇస్లాం స్వీకరించారు. ఈ వంశీయుల్లో నుండే అబ్దుల్ హమీద్ ఖాన్ రోము చక్రవర్తిగా ఉన్నాడు. చాలామంది టర్కీయులు అవిశ్వాసులుగానే ఉండేవారు. వారిలో కొందరు క్రైస్తవం పుచ్చుకుంటే మరికొందరు బౌద్ధులుగా ధర్మపరివర్తన చెందారు. కొందరైతే విగ్రహారాధకులుగానే ఉండిపోయారు. వహబ్ బిన్ ముంబా ఏమంటారంటే, ఈ టర్కీయులు వరుసకు యాజూజ్ మాజూజ్‌ల సోదరులు. గోడ నిర్మించబడుతున్నప్పుడు వీళ్ళు ఎవరికీ కనబడకుండా పోయారు. అంటే వారు గోడకు అవతలి వైపున దాక్కున్నారు. అందువల్లనే వారు తుర్కీలుగా పిలువబడ్డారు. అంటే 'మత్రూక్' (విడువబడినవారు).

**(రజి) ఉల్లేఖించారు : "వెంట్రుకల చెప్పులు ధరించిన జాతి వారితో మీరు యుద్ధం చేయనంతవరకూ ప్రళయం సంభవించదు. సొట్ట వచ్చిన డాలుల మాదిరి ముఖాలు కల వారితో మీరు యుద్ధం చేయనంత వరకూ ప్రళయం నెలకొనదు." వేరొక ఉల్లేఖనంలో అబూ హురైరా ఈ వాక్యాన్ని అదనంగా పలికినట్లుగా ఉంది: "వారి కండ్లు చిన్నగా, ముక్కులు లావుగా ఉంటాయి. మడత వేయబడిన తోలు గల డాలు మాదిరిగా వారి ముఖాకృతులు ఉంటాయి."[1]**

## అధ్యాయం : 96

## ఓడిపోగానే నాయకుడు వాహనం పైనుండి దిగిపోయి, మిగిలిన వారందరితో వరుసలు తీరి దైవాన్ని ప్రార్థించటం

**270) బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ వివరించారు: ఒక వ్యక్తి ఆయన్ని ఉద్దేశించి, "అబూ అమ్మారా! మీరంతా హునైన్ యుద్ధ సందర్భంగా పలాయనం చిత్తగించారా?" అని అడగ్గా, బరా (రజి) ఇలా విడమరిచి చెప్పారు– "లేదు. దైవసాక్షిగా! దైవప్రవక్త(సఅసం) వెన్ను చూపలేదు. కాకపోతే ఆయన సహచరులలోని యువకులు కొందరు ఎలాంటి సన్నాహాలు లేకుండా కదన రంగానికి కదలి వచ్చారు. వారి వద్ద కవచాలు గానీ, శిరస్త్రాణాలు గానీ లేవు. వారు ఆయుధాలు కూడా తీసుకుని రాలేదు. అలాంటి వారు యుద్ధ రంగాన్ని వదలి పరారైన మాట నిజమే. ఎందుకంటే అవతల ప్రత్యర్థులుగా ఉన్న హవాజిన్ తెగవారు విలు విద్యలో ఆరితేరిన వారు. వారు ప్రయోగించిన బాణాలలో ఒకటీ అరా తప్పితే ఏవీ గురి తప్పేవి కావు. వారు ఎడతెరిపి లేకుండా బాణ వర్షం కురిపించారు. వాటిలో ఏ ఒక్కటీ గురి తప్పలేదు (ఈ లోగా ముస్లింలు) అందరూ దైవప్రవక్త(స) వద్దకు వచ్చి గుమిగూడారు. ఆ సమయంలో ఆయన(స) తన తెల్లని కంచెర గాడిదపై స్వారీ అయి ఉన్నారు. ఆయన పెత్తండ్రి కుమారుడు అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ ఆయన వాహనం త్రాడును పట్టుకుని**

269–1. ఈ హదీసులో కూడా తుర్క్ జాతి గురించి వివరించటం జరిగింది. ఇది వారి ఇస్లాం స్వీకరణకు పూర్వ పరిస్థితి. ప్రపంచంలో మూడు జాతుల వారు ఒక్కుమ్మడిగా ఇస్లాం స్వీకరించారని అనబడింది. వారెవరంటే 1) అరబ్బులు, 2) తుర్కీలు 3) అఫ్గానీలు– జాలిక ఫజలుల్లాహి యూతీహి మంయ్యషావు.

ఉన్నారు. దైవప్రవక్త(స) తన వాహనం నుండి దిగి దైవ సహాయాన్ని కోరుతూ ప్రార్థించారు. తరువాత ఇలా ఎలుగెత్తి చాటారు : "నేను దైవప్రవక్తను. నేను అబద్ధీకుడను కాను. నేను అబ్దుల్ ముత్తలిబ్ పు(పౌ)త్రుడను." ఆ తరువాత ఆయన(స) సరికొత్తగా సైనిక పంక్తులను తీర్చిదిద్దారు.

## అధ్యాయం : 97

## బహు దైవారాధకులను ఓడించమని, వారిని చిందర వందర చేయమని దైవాన్ని ప్రార్థించటం

**271)** హజ్రత్ అలీ (రజి) కథనం: అహ్జాబ్ (కందక) యుద్ధ సందర్భంగా దైవప్రవక్త ముష్రిక్కులనుద్దేశించి ఈ విధంగా శపించారు: "ఓ అల్లాహ్! వీరి నివాస గృహాలను, సమాధులను అగ్నితో నింపు. వీళ్ళు మమ్మల్ని మధ్యస్థ నమాజు (సలాతుల్ అస్ర్) చేసుకోనివ్వలేదు." (ఆయన ఈ విధంగా ఎప్పుడు పలికారో తెలుసా?) అప్పటికి సూర్యాస్తమయం అయింది (అస్ర్ నమాజ్ ఖజా అయిపోయింది).

**272)** మహనీయ అబూ హురైరా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) ఫజ్ర్ నమాజు రెండవ రకఅతులో (రుకూ తర్వాత) దుఆయె ఖునూత్‌లో ఇలా పలికేవారు: "ఓ అల్లాహ్! సలమా బిన్ హిషామ్‌కు ముక్తిని ప్రసాదించు. ఓ అల్లాహ్! వలీద్ బిన్ వలీద్‌కు మోక్షం వొసగు. ఓ అల్లాహ్! అయాష్ బిన్ అబీ రబీయాకు మోక్షం ప్రసాదించు. ఓ అల్లాహ్! బలహీనులైన ముస్లింలకు మోక్షం ప్రసాదించు (ఆ రోజుల్లో వీళ్ళంతా మక్కాలో ముష్రిక్కుల వేధింపులను సహిస్తూ ఉండేవారు). ఓ అల్లాహ్! ముజర్ తెగపై నీ కఠినశిక్షను అవతరింపజెయ్యి. ఓ అల్లాహ్! యూసుఫ్ (అలైహిస్సలాం) కాలంలో వచ్చినటువంటి దుర్భిక్షాన్ని వాళ్ళపై అవతరింపజెయ్యి."

**273)** అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్‌ఫా (రజి) చెప్పగా తాను విన్నానని ఇస్మాయీల్ బిన్ అబీ ఖాలిద్ తెలిపారు – అహ్జాబ్ (కందక) యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(సఅసం) ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్! గ్రంథాన్ని అవతరింపజేసినవాడా! (ప్రళయదినాన) శీఘ్రంగా లెక్క తీసుకునేవాడా! ఓ అల్లాహ్! (ముస్లిములను కొల్లగొట్టడానికి వచ్చిన) బహుదైవారాధకుల, అవిశ్వాసుల సమూహాలను ఓడించు. ఓ అల్లాహ్! వారిని పరాభవం పాల్జేయి. వారిని కుదిపివెయ్యి."

**274)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం : మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) కాబా పవిత్ర గృహం నీడలో నమాజ్ చేసుకుంటూ ఉండగా అబూ జహల్, ఖురైషులకు చెందిన మరి కొంతమంది చూశారు. 'ఒంటె పొట్టను, ప్రేగులను తెచ్చి ఈయనగారిపై వేసేవారెవరు?' అని ఒకరన్నారు. మక్కాలో కొంత దూరాన ఒక ఒంటె కోయబడింది. (ఆ ఒంటె పేగులు తేవడానికి) వారు ఒక మనిషిని పంపారు. అతను ఆ పేగులు తెచ్చి, దైవప్రవక్త(స) నమాజులో (సజ్దాలో) ఉండగా ఆయన మీద వేశాడు. ఆ సంగతి తెలుసుకున్న ఫాతిమా (ర.అ) వచ్చి, ఆయన వీపు మీద ఉన్న ప్రేగులను, కసువును తొలగించారు. ఆ సమయంలో దైవ ప్రవక్త(స) ఈ విధంగా శపించారు: "ఓ అల్లాహ్! ఖురైషుల సంగతి నీవు చూసుకో. ఓ అల్లాహ్! ఖురైషుల వ్యవహారాన్ని నీవు చూసుకో. ఓ అల్లాహ్! నీవే ఖురైషుల పనిపట్టు." అబూజహల్ బిన్ హిషామ్, ఉతబా బిన్ రబీయ, షైబా బిన్ రబీయ, ఉబై బిన్ ఖలఫ్, ఉఖబా బిన్ అబీ ముఅయ్త్ – వీళ్ళందరినీ పట్టుకో." అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా అంటున్నారు: నేను వాళ్ళందరి (శవాల)నీ బద్ర్ (యుద్ధా నంతరం) బావిలో చూశాను. వారందరినీ వధించి బావిలో పడవేయటం జరిగింది."

**275)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర.అ) చెప్పారని ఇబ్నె అబీ ములైకా తెలిపారు : ఆయిషా(ర.అ) ఏమన్నారంటే; కొంతమంది యూదులు దైవ ప్రవక్త(సఅసం) దగ్గరకు వచ్చి 'అస్సాము అలైకుమ్' (మీకు చావు వచ్చుగాక) అని పలికారు. దానికి జవాబుగా నేను వాళ్ళకు శాపనార్థాలు పెట్టాను. దైవప్రవక్త(స) నన్నుద్దేశించి, "ఆయిషా! ఏమయింది?" అని ప్రశ్నించారు. 'వీళ్ళేమన్నారో మీరు వినలేదా?' అని నేను చెప్పాను. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "వారి పలుకులకు జవాబుగా నేనేమన్నానో నీవు వినలేదా? 'వ అలైకుమ్' అని నేనన్నాను. అంటే మీకూ అదే రావాలి అని అన్నాను[1] (అంటే నేను వారిని దూషించలేదు. కాకపోతే వారి మాటను వారికే తిప్పికొట్టాను)".

275–1. పెడసరి మాటలకు జవాబు దీటుగానే ఉండాలి. చెడును మంచి ద్వారా తొలగించ మన్నది (41: 34) ఖుర్ఆన్ ప్రబోధన. కాని యూదుల నైజమే అంత. దౌష్ట్యం, దుర్మార్గం వారి అణువణువునూ పెనవేసుకుని ఉంటుంది. ఇతరుల సంగతిని అలా వుంచితే, వారు స్వయంగా తమ జాతిలో ప్రభవించిన ప్రవక్తల యెడల కూడా

## అధ్యాయం : 98

## ముస్లింలు గ్రంథవహులకు ధార్మిక విషయాలు తెలుపాలి లేదా ఖుర్ఆన్ నేర్పాలి.

**276)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: "మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) రోము చక్రవర్తి ఖైసర్‌కు ఉత్తరం ఇలా వ్రాశారు: "నీవు గనక (ఇస్లాం పిలుపు పట్ల) వైముఖ్యం ప్రదర్శించావంటే నీ పాపంతోపాటు నీవు అధికారం చెలాయిస్తున్న వ్యవసాయదారుల పాపం కూడా నీ మీద పడుతుంది."[1]

## అధ్యాయం : 99

## బహుదైవారాధకుల హృదయాలను కదిలించటానికి వారికి సన్మార్గం చూపమని ప్రార్థించటం

**277)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం : తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ (రజి) తన సహచరులతో కలసి ప్రవక్త మహనీయుల(స) దగ్గరకు (ఖైబర్) వచ్చి, 'దైవప్రవక్తా! దౌస్ తెగ వారు తలబిరుసులుగా తయారయ్యారు. వారిని శపించండి' అని విన్నవించుకున్నారు. అప్పుడు అక్కడున్న ప్రియ సహచరులంతా, దౌస్ తెగ వారంతా ఇక నాశనమైనట్లే అని చెప్పుకున్నారు. కాని ఆయన(సఅసం) మాత్రం "దేవా! దౌస్ తెగ వారికి సన్మార్గం ప్రసాదించు. వారిని (ఇస్లాం పరిధిలోనికి) తీసుకురా" అని ప్రార్థించారు.[1]

---

సద్భావంతో మెలగలేదు. ఇక అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(సఅసం)ను బాధించటంలో యూదులు తమకు లభించిన ఏ అవకాశాన్నీ జారవిడువలేదు. సలాం చేయవలసి వచ్చినప్పుడు నాలుకను సాగదీసి 'అస్సాము అలైకుమ్' (మీకు చావు మూడ) అనేవారు. దైవప్రవక్త (స) వారి దురుద్దేశాన్ని పసిగట్టి కేవలం "వ అలైకుమ్" (మీక్కూడా) అన్నారు. అంటే మీరు మీ నోటితో ఏదైతే పలుకుతున్నారో అదే మీకు ప్రాప్తించాలి. వారికి శాపనార్థాలు పెట్టిన ఆయిషా(ర)ను ఆయన వారించటం ఆయన ఉత్తమ నైతికతకు దర్పణం.

276-1. ఈ హదీసు వెనుకటి సంపుటంలో కూడా వివరంగా వచ్చింది. ఆ ఉత్తరంలో ఆయన(స) దివ్య ఖుర్ఆన్ ఆయత్ కూడా లిఖించారు. అధ్యాయంలోని మకుటం దీని ఆధారంగానే ఏర్పరచబడింది. గ్రంథం కల ప్రజల నుండి మేలు జరుగుతుందన్న ఆశ ఉన్నప్పుడు ఖుర్ఆన్ నేర్పవచ్చు. కాని వారు దాని పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తారన్న అనుమానం ఉన్నప్పుడు నేర్పకూడదు.

## అధ్యాయం : 100

## యూదులు, క్రైస్తవులను ఎలా ఆహ్వానించాలి? దేని ఆధారంగా వారితో పోరాడాలి?

**ఈరాన్, రోము చక్రవర్తులకు మహాప్రవక్త(సఅసం) ఉత్తరాలు వ్రాయటం, యుద్ధానికి ముందు వారిని ఇస్లాం వైపు ఆహ్వానించటం.**

**278) హజ్రత్ అనస్(రజి) చెప్పగా తాను విన్నానని ఖతాదా తెలిపారు : దైవప్రవక్త(సఅసం) రోము చక్రవర్తికి లేఖ రాయాలని సంకల్పించుకున్నప్పుడు, లేఖపై ముద్ర (సీలు, స్టాంపు) లేనంతవరకూ చక్రవర్తులు దానిని స్వీకరించరని ఆయన(స)కు చెప్పటం జరిగింది. అప్పుడు దైవప్రవక్త(సఅసం) వెండి ఉంగరం ఒకదానిని తయారు చేయించారు. చేతికి తొడిగిన ఆ ఉంగరం తాలూకు తెలుపు దనం ఇప్పటికీ నా కళ్ళ ముందు కదలాడుతూ ఉంది. ఆ ఉంగరంపైన "ముహమ్మదుర్రసూలుల్లాహ్" (దైవప్రవక్తయగు ముహమ్మద్) అని చెక్కబడి ఉండేది.**

**279) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి)వివరించారు: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈరాన్ చక్రవర్తి పేర ఒక లేఖ రాశారు. ఈ ఉత్తరాన్ని బహ్రాయిన్ గవర్నర్‌కు అందజేయమని, బహ్రాయిన్ గవర్నర్ ఆ లేఖను ఈరాన్ చక్రవర్తికి చేరవేస్తాడని (తన దూతతో) చెప్పటం జరిగింది. ఆ పవిత్ర లేఖను ఈరాన్ చక్రవర్తి (కిస్రా) చదివి కోపావేశంతో దానిని చించిపారేశాడు. సయీద్ బిన్ ముసయ్యిబ్ చెప్పినట్లు నాకు బాగా గుర్తు - ఈరాన్ చక్రవర్తి చేష్ట గురించి తెలిసి నప్పుడు దైవప్రవక్త(స) అతనిని శపిస్తూ, "అతను కూడా తునాతునకలైపోవుగాక!" అన్నారు (అలాగే జరిగింది)."[1]**

---

277-1. అబూహురైరా (రజి) కూడా దౌస్ తెగకు చెందినవారే. ఆ తెగ వారిని శపించమని ప్రజలు అభ్యర్థించినపుడు దైవప్రవక్త(స) దీవెనల వర్షం కురిపించారు. ఆయన(స) మొర ఆలకించబడింది. ఆ తెగ వారంతా హృదయపూర్వకంగా ఇస్లాంలో ప్రవేశించారు.

279-1. ఇది చరిత్రకెక్కిన చరిత్ర. నవ యువకుడైన ఈరాన్ చక్రవర్తి కుమారుడు భోగలాలసుడు. తన తండ్రిని కడతేర్చినట్లయితే సింహాసనం తనకు దక్కుతుందని, ఆ తరువాత తన ఇష్టారాజ్యానికి తిరుగు ఉండదని తలపోశాడు. ఒకరోజు రాత్రి తండ్రి గదిలోకి వెళ్ళి, కడుపులో కత్తితో పొడిచి చంపేశాడు.పిదప సింహాసనాన్ని అధీష్టించి తండ్రి ఖజానాలను తనిఖీ చేయటం మొదలెట్టాడు. ఆ ఖజానాలో ఒక మందుల సీసా కనిపించింది. దానిపైన 'లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందు' అని వ్రాసి ఉంది. ఓహో! నా తండ్రి

## అధ్యాయం : 101

## మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇస్లాం వైపునకు (ముస్లిమేతరులను) ఆహ్వానించటం- ఇంకా అల్లాహ్‌ను వదలి ఒకరింకొకరిని తమ ప్రభువు లుగా చేసుకోరాదని పిలుపు ఇవ్వటం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **ఏ వ్యక్తికయినా అల్లాహ్ గ్రంథాన్ని, వివేకాన్ని, ప్రవక్తా పదవిని ప్రసాదిస్తే అతడు ప్రజలతో, "మీరు అల్లాహ్‌కు బదులుగా నాకు దాసులు కండి" అని అనటం తగదు.** ***(ఆలి ఇమ్రాన్: 79)***

**280) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) తనకు తెలియజేశారని ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉతబా వివరించారు: మహాప్రవక్త ముహమ్మద్ ఖైసర్ (రోము చక్రవర్తి హెరిక్లస్)కు ఒక లేఖ రాస్తూ అతన్ని ఇస్లాం వైపునకు ఆహ్వా నించారు. తన సహచరులైన దిహ్యా కల్బీ (రజి)కి ఆయన(స) ఆ లేఖను ఇచ్చి దానిని బస్రా గవర్నర్‌కు అందజేయాలనీ, అతను దానిని ఖైసర్ వరకు చేరవేస్తా డని ఆదేశించారు. పారసీక సైన్యం (రోము చేతిలో) ఓడిపోయి వెనక్కి తగ్గింది. (దాంతో పారసీకులు ఆక్రమించుకున్న రోమనుల ప్రాంతాలన్నీ వారికి కైవసం అయినాయి. దైవ ప్రసాదితమయిన ఈ కానుకకు గాను కృతజ్ఞతా సూచకంగా ఖైసర్ హమస్ నుండి ఏలియా (జెరూసలేం) వరకు పాదయాత్ర చేసివచ్చాడు. ఆ సందర్భం గానే దైవప్రవక్త(స) లేఖ అతనికి చేరింది. ఆ లేఖను అతనికి చదివి వినిపించి నప్పుడు, "ఆయన జాతివాడు (అంటే దైవప్రవక్త–సఅసం–తెగకు చెందినవాడు) గనక ఎవరయినా ఇక్కడ ఉంటే అతన్ని వెతికి తీసుకుని రండి. నేను ఆ ప్రవక్త(స) గురించి అతనికి కొన్ని ప్రశ్నలు అడగదలుస్తున్నాను" అన్నాడు.**

---

విషయ లోలత్వం వెనుక ఉన్న రహస్యం ఇదన్నమాట! అనుకున్నాడు. ఆ మందును తాను కూడా సేవిస్తే ఇక తన మగసిరికి అడ్డూ ఆపూ ఉండదని భావించాడు. కాని అది లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందు కాదు, విషం. దానిని తాగగానే చచ్చి ఊరు కున్నాడు. ఆ విధంగా ఈరాన్ (కిస్రా) సామ్రాజ్యం తునాతునకలైపోయింది. ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) పరిపాలనా కాలంలో ఆ సామ్రాజ్యమంతా ఇస్లామీయ వ్యవస్థలో విలీనమైపోయింది. దేవుని సత్యవంతుడైన ప్రవక్త(స) చేసిన ప్రార్థన అక్షరాలా ఆమోదించబడింది. హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) సైనిక సారథ్యంలో ఈ మహా సామ్రాజ్యం జయించబడింది.

మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అంటున్నారు : ఆ సమయంలో తాను ఒక వర్తక బిడారుతోపాటు సిరియాలోనే ఉన్నానని అబూ సుఫ్యాన్ నాతో చెప్పారు. ఆ వర్తక బృందం వ్యాపారం నిమిత్తం సిరియాకు వచ్చి ఉంది. అప్పటికే దైవప్రవక్త (స)కు-మక్కా అవిశ్వాసులైన ఖురైషులకు మధ్య నిర్యుద్ధ సంధి (హుదైబియా ఒప్పందం) జరిగి ఉంది. అబూ సుఫ్యాన్ ఇలా అన్నారు: ఒకరోజు ఖైసర్ మనుషులు సిరియాలో ఒకచోట నన్ను, నా తోటి వారిని కలుసుకుని ఖైసర్ దర్బారుకు గొనిపోయారు. మేము ఏలియా (బైతుల్ మఖ్దిస్- జెరూసలేం)కు చేరుకో గానే, మమ్మల్ని ఖైసర్ దర్బారులో హాజరుపరచటం జరిగింది. ఆ సమయంలో ఖైసర్ (రోము చక్రవర్తి) దర్బారులో ఆసీనుడై ఉన్నాడు. అతని తలపై కిరీటం ఉంది. అక్కడి రోము ప్రముఖులంతా అతని చుట్టూ చేరి ఉన్నారు. అతడు తన దుబాసీ (ద్విభాషి) నుద్దేశించి, “వారి రాజ్యంలో తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తికి వంశపరంగా చాలా దగ్గరివారెవరో వీళ్ళని అడగండి!” అన్నాడు. అబూ సుఫ్యాన్ ఇలా అన్నారు: ‘వంశపరంగా ఆయనకు నేను దగ్గరివాడను’ అని నేనన్నాను. “నీకూ- అతనికీ మధ్య గల బంధుత్వం ఎటువంటిది?” అని రోము చక్రవర్తి ప్రశ్నిం చగా, ‘బంధుత్వంలో ఆయన నాకు పినతండ్రి కుమారుడవుతారు’ అని సమాధాన మిచ్చాను. యాదృచ్ఛికంగా ఈసారి నా వెంట అబ్దె మునాఫ్‌కు చెందిన ఒక్క మనిషి కూడా లేడు. “ఈ వ్యక్తి (అబూ సుఫ్యాన్)ని నాకు దగ్గరగా తీసుకువచ్చి నిలబెట్టండి” అని రాజు ఆజ్ఞాపించాడు. అందువల్ల నా వెంట ఉన్న వారంతా నా వెనుక నిలబెట్ట బడ్డారు. ఆ తరువాత రాజు తన దుబాసీనుద్దేశించి, “దైవప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి గురించి నేను ఈ వ్యక్తి (అబూ సుఫ్యాన్)కి కొన్ని ప్రశ్నలు అడుగుతాను. ఒకవేళ ఇతను గనక అబద్ధం చెబితే తక్షణం ఇతనిని అబద్ధీకరించమని ఇతని సహవాసులతో చెప్పండి” అని ఆజ్ఞాపించాడు. అబూ సుఫ్యాన్ ఇలా అంటున్నారు: దైవసాక్షి! నా సహచరులు నన్ను అబద్ధీకరిస్తారన్న సంశయమే గనక నాకు లేకుంటే, ఆ రోజు నేను దైవప్రవక్త(స) గురించి అతను వేసే ఆ ప్రశ్నలకు సమాధానంగా తప్పకుండా అబద్ధం చెప్పి ఉండేవాణ్ణి. కాని నా తోటి మిత్రులు నన్ను ఎక్కడ ఖండిస్తారోనన్న భయం నన్ను వెంటాడింది. అందుకే నేను సత్యానికే కట్టుబడ్డాను.

తరువాత చక్రవర్తి తన దుబాసీతో, “మీలో అతని వంశం ఎటువంటిదను కుంటున్నారు?” అని ఇతన్ని అడగండి అన్నాడు. ‘మాలో అతని వంశం అత్యుత్తమ

మైందని భావించబడుతోంది' అని అన్నాను నేను– "ఓహో! ఇంతకు మునుపు ఎవరయినా మీ ప్రదేశంలో తమను ప్రవక్తగా ప్రకటించుకుని ఉన్నారా?" అని అడిగితే 'లేద'ని అన్నాను. "ప్రవక్తగా ప్రకటించుకోక పూర్వం ఆయన(స)పై ఏదయినా అబద్ధపు ఆరోపణ ఉందా?" అన్న ప్రశ్నకు నేను 'లేద'ని జవాబిచ్చాను. "ఈయన తాత ముత్తాతలలో ఎవరయినా రాజ్యాధిపతులుగా ఉన్నారా?" అని అతను అడిగితే, 'లేదు' అని నేనన్నాను. "ఇప్పుడు ధనవంతులు ఆయన్ని అనుసరిస్తున్నారా? లేక బీదసాదలు, బడుగు వర్గాల వారు అనుయాయులుగా ఉన్నారా?" అని అతను ప్రశ్నించగా, 'సామాన్య ప్రజలే (చాలా వరకు) ఆయన అనుచరులుగా ఉన్నార'ని నేను బదులిచ్చాను. "ఆయనను అనుసరించే వారి సంఖ్య పెరుగుతోందా? లేక తరుగుతూ పోతోందా?" అని ప్రశ్నాస్త్రం సంధించగా, 'ఆయన అనుచరుల సంఖ్య అనుదినం పెరుగుతూ ఉంది' అని నేను జవాబిచ్చాను. "ఇస్లాం స్వీకరించిన తరువాత ఎవరయినా ఆయన జీవన విధానం పట్ల విసుగెత్తిపోయి వైముఖ్యం ప్రదర్శించారా?"అని అతను మళ్ళీ అడిగితే, 'లేదు' అని అనటం తప్ప నా దగ్గర మరో మాట లేకపోయింది. "ఆయన ఎప్పుడయినా వాగ్దాన భంగానికి పాల్పడ్డాడా?" అని మరో ప్రశ్నాస్త్రం సంధించాడు చక్రవర్తి. దానికి నేను, 'లేదు. అయితే ఆయనకు– మాకూ మధ్యన ఇటీవల ఒక ఒడంబడిక జరిగింది. ఆయన ఆ ఒడంబడికను ఉల్లంఘిస్తారేమోనన్న భయం మాకుంది' అని చెప్పాను. మొత్తం ప్రశ్నోత్తరాలలో ఈ ఒక్క విషయం తప్ప మరొక దానిలో నేను దైవప్రవక్త(స)ను కించపరిచే ఏదన్నా అబద్ధం కల్పించే అవకాశం నాకు దొరకనేలేదని అబూ సుఫ్యాన్ అన్నారు. నా మిత్రులు కూడా దీనిని ఖండిస్తారని నేననుకోలేదు. "మీరెప్పుడయినా ఆయనతో యుద్ధం చేశారా? లేదా ఆయన గాని మీపై యుద్ధం చేశారా?" అని రాజు ప్రశ్నించినప్పుడు, నేను, 'అవున'న్నాను. "మరైతే ఆ యుద్ధాల ఫలితం ఎలా ఉంది?" అని అతను ప్రశ్నించగా, 'ఫలితం ఎప్పుడూ ఒకే విధంగా లేదు. కొన్నిసార్లు ఆయన మమ్మల్ని ఓడిస్తే, కొన్నిసార్లు మేము ఆయన్ని ఓడించామ'ని నేనన్నాను. "ఆయన ఏ ఏ పనులు చేయమని మిమ్మల్ని ఆదేశిస్తారు?" అని అడగ్గా, 'మేము ఒకే దైవాన్ని ఆరాధించాలనీ, ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ ఎంచరాదనీ ఆయన మమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నారు. మా పూర్వీకులు కొలిచే విగ్రహాలను పూజించటం నుండి మమ్మల్ని వారిస్తున్నారు. నమాజు చెయ్యమనీ, దానధర్మాలు చేస్తూ

ఉండమని, సౌశీల్యాన్ని, సత్ప్రవర్తనను అలవరచుకోవాలనీ, అప్పగింతలను చెల్లించే విషయంలో నిజాయితీగా వ్యవహరించాలని మాకు ప్రబోధిస్తున్నారు' అని నేను వివరించాను.

నేనీ విషయాలన్ని విడమరచి చెప్పిన మీదట, అతను తన దుబాసీతో ఇలా అన్నాడు :

ఇతనితో చెప్పు– ఆయన వంశపారంపర్యం గురించి నేను నిన్ను అడిగినప్పుడు, మీ అందరిలోకీ ఆయన వంశపరంగా మర్యాదస్తుడుగా పరిగణించబడుతున్నారని నీవు చెప్పావు. దైవప్రవక్తలు కూడా తమ జాతి వారిలో ఉన్నత వంశీయులలో నుండే ప్రభవింపజేయబడేవారు– లోగడ ఎవరయినా మీ దగ్గర తమను తాము దైవప్రవక్తగా ప్రకటించుకుని ఉన్నారా? అని నేను నిన్ను అడిగితే, మా దగ్గర ఎవరూ ఇంతకుముందు ఆ విధంగా దావా చేయలేదని నీవు సమాధానం ఇచ్చావు. ఒకవేళ అలా దావా చేసి వుంటే, ఈ వ్యక్తి కూడా తమ పూర్వీకుల మాదిరిగా ప్రకటిస్తున్నాడని నేను భావించేవాణ్ణి. ప్రవక్తగా ప్రకటించుకోక పూర్వం మీరెప్పుడయినా అతనిపై అబద్ధపు ఆరోపణ చేసి ఉన్నారా? అని నేను నిన్ను అడిగాను. అలా ఎన్నడూ జరగలేదని నువ్వే చెప్పావు. తద్వారా నేను గ్రహించినదేమంటే; ప్రజల విషయంలో ఎన్నడూ అబద్ధం చెప్పని వ్యక్తి దేవుని విషయంలో అబద్ధం చెప్పటం సంభవం కాదు. ఆయన తాతముత్తాతలలో ఎవరయినా రాజులు గడిచారా? అని నేను నిన్ను అడిగాను. లేదని నీవన్నావు. దీనిద్వారా నేను నిర్ధారించుకున్నదేమిటంటే, ఒకవేళ ఆయన తాతముత్తాతలలో ఎవరయినా, ఆయన (ప్రవక్తనని ప్రకటించుకోవడం ద్వారా) తన తాతముత్తాతల అధికార పీఠాన్ని చేజిక్కుంచుకునేందుకు ప్రయత్నించేవాడు. ఆయన్ని అనుసరించేవారిలో ఆయన జాతికి చెందిన ప్రముఖులు ఉన్నారా? లేక బలహీనులు, సామాన్య ప్రజలున్నారా? అని నేను నిన్నడిగాను. బలహీనులు, పేదవారు ఆయన్ని అనుసరిస్తున్నారని నీవు చెప్పావు. ఈ బడుగువర్గం వారే అన్ని కాలాలలో దైవప్రవక్తలను అనుసరించారు. ఆయన అనుచరుల సంఖ్య పెరుగుతోందా? లేక తరుగుతోందా? అని నేను నిన్ను అడిగాను. అనుయాయులు క్రమంగా పెరుగుతున్నారని నీవన్నావు. విశ్వాసం (ఈమాన్) పరిస్థితి కూడా ఇంతే. కడకు అది పరిపూర్ణం అవుతుంది. ఆయన ప్రబోధించే మతధర్మంలో ఎవరయినా ప్రవేశించిన తరువాత, దాని నుండి తిరిగిపోయారా? అని నేను నిన్ను అడిగాను.

అలా ఎన్నడూ జరగలేదని నీవే అన్నావు. విశ్వాస పరిస్థితి కూడా ఇంతే. అది గనక ఒకసారి (మానవ) మనోక్షేత్రంలో నాటుకుపోయిందంటే, ఏ వస్తువు కూడా దాని నుండి విశ్వాసి (మోమిన్)ని తొలగించజాలదు. ఆయన ఏనాడయినా వాగ్దానానికి విరుద్ధంగా వ్యవహరించాడా? అని నేను నిన్నడిగాను. లేదని నీవు జవాబిచ్చావు. దైవప్రవక్తల చిహ్నం కూడా ఇదే. వారెన్నడూ వాగ్దానానికి విరుద్ధంగా ప్రవర్తించరు. ఆయన మీతోగానీ, మీరు ఆయనతోగానీ యుద్ధం చేయటం జరిగిందా? అని నేను నిన్నడిగాను. అలా జరిగిందని నీవన్నావు. ఆ యుద్ధాల ఫలితాలు ఏకపక్షంగా లేవనీ, ఒక్కోసారి మీరు ఓడిపోతే, ఒక్కోసారి ఆయన ఓడిపోతారని కూడా నీవు చెప్పావు. దైవప్రవక్తల పట్ల కూడా ఇలాగే జరుగుతుంది. వారు పరీక్షించబడతారు. కాని అంతిమ విజయం వారిదే అవుతుంది. ఆయన మిమ్మల్ని ఏ ఏ పనుల గురించి ఆజ్ఞాపిస్తారని నేను అడిగాను. ఆయన మమ్మల్ని ఏక దైవారాధన చేయమని ఆదేశిస్తారని, దైవానికి సహవర్తులుగా ఎవరినీ ఎంచరాదని అంటారని, మీ తాత ముత్తాతలు పూజిస్తూ వచ్చిన ఇలవేల్పుల పూజ నుండి మిమ్మల్ని వారిస్తారని నీవే చెప్పావు. ఇంకా నమాజ్, దానధర్మాలు, సౌశీల్యం, వాగ్దాన పాలన, నిజాయితీ తత్పరత గురించి ప్రబోధిస్తారని కూడా నీవు చెప్పావు. ఒక దైవప్రవక్తలోని ముఖ్య చిహ్నం ఇదేనని, ఆ ప్రవక్త రానున్నారన్న విషయం నాకూ తెలిసిందని ఖైసర్ అన్నాడు. అతనింకా ఇలా అన్నాడు: "నీవు చెప్పిన విషయాలే గనక నిజమైతే, ఈ రోజు నేనిక్కడ నా రెండు పాదాలు మోపి ఉన్న స్థలం ఆయన ఏలుబడిలోకి వచ్చే రోజు సమీపంలోనే ఉంది. ఒకవేళ నాకు గనక ఆయన వరకు చేరుకునే అవకాశం ఉంటే నేను కూడా ఆయన సేవలో హాజరయ్యేందుకు శాయశక్తులా ప్రయత్నించే వాణ్ణి. ఒకవేళ నేను ఆయన సేవలో ఉండి ఉంటే ఆయన పాదాలు కడిగేవాణ్ణి."

అబూ సుఫ్యాన్ ఇలా అన్నారు: ఆ తరువాత రోము చక్రవర్తి ఖైసర్ దైవ ప్రవక్త(స) పవిత్ర లేఖను తెమ్మని కోరాడు. ఆ లేఖ అతని ముందు చదివి వినిపించటం జరిగింది. అందులో ఇలా లిఖించబడి ఉంది:

(అనువాదం) అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. అల్లాహ్ దాసుడు, ఆయన సందేశహరుడైన 'ముహమ్మద్' తరఫున రోము చక్రవర్తి హర్ఖల్ (హెరిక్లస్) పేర... సన్మార్గాన్ని స్వీకరించే వానిపై శాంతి కురియుగాక! అమ్మాబాద్. నేను నిన్ను ఇస్లాం వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఇస్లాం

**స్వీకరించు. నీకూ శాంతి సౌఖ్యాలు ప్రాప్తిస్తాయి. ఇస్లాం స్వీకరించు. అల్లాహ్ నీకు రెండింతల పుణ్యఫలం ప్రసాదిస్తాడు. (ఒకటి; నీవు ఇస్లాం స్వీకరించినందుకు. రెండు; నీ మూలంగా నీ జాతి ప్రజలు ఇస్లాంలో ప్రవేశించినందుకు). కాని ఒకవేళ నీవు గనక ఈ పిలుపునకు విముఖత చూపితే నీ ప్రజల పాపం కూడా నీ మీదే పడుతుంది." గ్రంథ ప్రజాలారా! మాకూ– మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చేయ కూడదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు." ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే, వారితో స్పష్టంగా ఇలా అను: "మేము ముస్లింలము అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి." (ఆలి ఇమ్రాన్: 64)**

**అబూ సుఫ్యాన్ ఇలా అన్నారు : హర్ఖల్ (హెరిక్లస్) తన మాటను పూర్తి చేయ గానే రోము సర్దారులంతా అతన్ని చుట్టుముట్టారు. అందరూ ఒక్కసారిగా అరిచారు. అరుపులు మిన్నంటాయి. వారేమన్నారో నాకైతే అర్థం కాలేదు. తరువాత మమ్మల్ని అక్కడి నుండి వెళ్ళగొట్టాలని ఆజ్ఞాపించటం జరిగింది. నేను నా సహవాసులతో పాటు అక్కడి నుండి బయటికి వచ్చాక, ఏకాంతంలో వారితో అన్నాను– 'ఇబ్నె అబూ కబషా (అంటే మహాప్రవక్త ముహమ్మద్–సఅసం) వ్యవహారం చాలా ముందుకు వెళ్ళిపోయింది. బనీ అస్ఫర్ (రోమనుల) చక్రవర్తి కూడా ఆయనకు భయపడుతున్నా డ'ని అన్నాను. అబూ సుఫ్యాన్ ఇంకా ఇలా అన్నారు: దైవసాక్షి! నాకు ఆ రోజు నుంచే నా పరాభవం గురించి భయం పట్టుకుంది. దైవప్రవక్త(స) తప్పకుండా ప్రాబల్యం వహిస్తారన్న దృఢ నమ్మకం కూడా నాకు కలిగింది. ఎట్టకేలకు అల్లాహ్ నా హృదయాంతరాళంలో కూడా ఇస్లాంను ప్రవేశింపజేశాడు. నిజానికి నేను అంతకు ముందు ఇస్లాంను ఏవగించుకునేవాణ్ణి.**[1]

---

280–1. సుదీర్ఘమయిన ఈ హదీసును ఇమామ్ బుఖారీ (రహ్మ) అనేక ప్రకరణాలలో తీసుకు వచ్చారు. దీని ఆధారంగా ఎన్నో ధార్మిక అంశాలను కూడా వెలికి తీశారు. ఇక్కడ ఈ హదీసును పొందుపరచటంలోని ఉద్దేశం ముస్లిమేతరులకు ఇస్లాం సందేశం అంద జెయ్యటం చాలా అవసరం అన్నదే. ఆఖరికి రాజ్యాధిపతికి కూడా ఈ సందేశం అందజేయబడింది. రోము చక్రవర్తి పేరు హెరిక్లస్. ఖైసర్ అనేది అతని బిరుదు.

అబూ సుఫ్యాన్ మహాప్రవక్త(స)ను తన పెత్తండ్రి కుమారుడుగా చెప్పుకున్నారు.

**281) ఖైబర్ యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా చెప్పగా తాను విన్నానని మహనీయ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ (రజి) అన్నారు. (మహాప్రవక్త–స– ఇలా చెప్పారు): "రేపు నేను ఒక వ్యక్తి చేతికి నేతృత్వ ధ్వజాన్ని ఇవ్వబోతున్నాను. అల్లాహ్ అతని చేతుల మీదుగా ఖైబర్ విజయం వొసగు తాడు." ఈ మాట వినగానే సహచరులంతా లేచి నిలబడ్డారు. తెల్లవారాక దైవ ప్రవక్త(స) ఆ పతాకాన్ని తమ చేతికే ఇస్తారని వారిలో ప్రతి ఒక్కరూ ఆశించారు. కాని, "అలీ (రజి) ఎక్కడ?" అని ఆయన(స) అడిగారు. 'ఆయన కళ్ళ జబ్బుతో బాధపడుతున్నార'ని జనులు చెప్పారు. "అతన్ని పిలవండి?" అని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించారు. ఆయన(రజి) వచ్చారు. దైవప్రవక్త(స) ఆయన కళ్లలో తన లాలా జలాన్ని పూశారు. అంతే, అసలు ఆయనకు ఏ బాధా లేనట్లుగానే స్వస్థత చేకూ రింది. 'వారు కూడా మనలాగే ముస్లింలుగా పరివర్తన చెందే వరకూ మనం వారితో పోరాడాలా?' అని హజ్రత్ అలీ(రజి) దైవప్రవక్త(స)ను అడగగా, "వారి గడ్డపైకి వెళ్ళేవరకు సంయమనం పాటించు. తొలుత నీవు వారిని ఇస్లాం వైపునకు ఆహ్వా నించు. వారు ఏ ఏ విషయాలను పాటించాలో విడమరిచి చెప్పు. దైవసాక్షిగా! నీ ద్వారా ఒక్క మనిషి సన్మార్గానికి వచ్చినా అది నీ పాలిట ఎర్రని ఒంటెలకన్నా శ్రేష్ఠ మైనది."[1] అని ఆయన(స) చెప్పారు.**

---

వాస్తవానికి ఆయన(స), అబూసుఫ్యాన్ తాతగారి పినతండ్రి కుమారులు. ఆ వంశ వృక్షం ఇలా ఉంది– *అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ బిన్ ఉమయ్యా బిన్ అబ్దె షమ్స్ బిన్ అబ్దె మునాఫ్.* దైవప్రవక్త(స) వంశ వృక్షం ఇది. *ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్ బిన్ అబ్దె మునాఫ్.* అబూ సుఫ్యాన్ దైవప్రవక్త(స)ను ఇబ్నె ఉబై కబ్షాతో పోల్చటం కూడా గమనార్హమే. బనూ ఖుజాఅ తెగకు చెందిన ఒక వ్యక్తి ఉండేవాడు. అతడు యావత్ అరేబియాకు వ్యతిరేకంగా 'షీరా' నక్షత్రాన్ని పూజించే వాడు. అరబ్బులందరినీ కాదని అతను ఒక్కడే మొండిగా ఆ నక్షత్రాన్ని పూజించటం వల్ల అబూ సుఫ్యాన్ మహాప్రవక్త(స)ను కూడా ఇబ్నె ఉబై కబ్షాతో పోల్చారు.

281–1. యుద్ధం చేయడానికి ముందు ప్రత్యర్థి సేనలను ఇస్లాం వైపు ఆహ్వానించాలని దైవ ప్రవక్త(స) అలీ (రజి)కి సూచించారు. ముందుగా శత్రువులను సన్మార్గానికి తేవడానికి ప్రయత్నించు. బాగా గుర్తుంచుకో! నీ సందేశ ప్రధానమైన కృషి వల్ల ఒక్కగానొక్క వ్యక్తి సన్మార్గానికి వచ్చినా, అది నీ యెడల ఎర్రని ఒంటెల కన్నా విలువైన విషయమవుతుంది. అరేబియాలో నల్లని ఒంటెలకన్నా ఎర్రని ఒంటెలు చాలా విలువైనవిగా పరిగణించ బడేవి. అందుకే ఉపమానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు. అకారణంగా ఇస్లాం

**282)** హజ్రత్ అనస్(రజి) చెప్పగా తాను విన్నానని హుమైద్ తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసం) ఏదయినా జాతిపై దండెత్తినప్పుడు, పూర్తిగా తెల్ల వారే వరకూ దానిపై సైనిక చర్యకు పూనుకునేవారు కారు. ఉషోదయ సమయంలో అక్కడ అజాన్ పిలుపు వినవస్తే సైనిక చర్య నుండి ఆగిపోయేవారు. ఒకవేళ అజాన్ పిలుపు వినబడకపోతే తెల్లవారిన తరువాత దాడి చేసేవారు. తాము ఖైబర్‌కు రాత్రిపూట చేరుకున్నామని హజ్రత్ అనస్(రజి) తెలిపారు.

**283)** హజ్రత్ అనస్ (రజి) తనతో చెప్పినట్లుగా హుమైద్ తెలిపారు: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మాతో కలసి యుద్ధం చేసినప్పుడు...(తరువాత అదే హదీసును పూర్తిగా వినిపించారు).

**284)** హజ్రత్ అనస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు రాత్రివేళ ఖైబర్ చేరుకున్నారు. ఆయన(స) అలవాటు ఏమిటంటే, ఎప్పుడయినా ఏదయినా జాతి వద్దకు రాత్రి పూట చేరుకున్నప్పుడు తెల్లవారక ముందే ఆ జాతి వారిపై దండెత్తే వారు కారు. తెల్లవారాక యూదులు పారలు, తట్టలు తీసుకుని (తమ పొలాలకు) బయలుదేరారు. వారు ఇస్లామీయ సైన్యాన్ని చూడగానే 'ఓహ్! ముహమ్మద్! దైవ సాక్షిగా ఆయన సైన్యంతో సహా వచ్చేశార'ని అరిచారు. ఇది విన్న దైవప్రవక్త(స), "అల్లాహు అక్బర్! ఖైబర్‌కు ఇక మూడినట్లే. మేము (దైవప్రవక్తలం, ముస్లిములం) అవిశ్వాసం (కుఫ్ర్) గురించి హెచ్చరించబడిన ఏ జాతి ఆవరణలోనయినా వాలా మంటే, ఇక వారి ఉదయం విపత్కరమైన ఉదయమే కాగలదు."

**285)** హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు: "లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదు) అనే దానిని జనులు అంగీకరించనంతవరకూ వారితో యుద్ధం చేస్తూ ఉండమని నాకు ఆజ్ఞాపించటం జరిగింది. ఎవరయితే 'లా ఇలాహ ఇల్లల్లాహ్'ను అంగీకరించారో వారి ధన ప్రాణాలు మా నుండి సురక్షితంగా ఉన్నాయి. కాని ఏదయినా హక్కు విషయం ఉంటే (ఉదాహరణకు- ఖిసాస్) ఆ లెక్క అల్లాహ్‌పైన ఉంటుంది."- ఈ హదీసును మహనీయ ఉమర్(రజి), అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) దైవప్రవక్త(స) నుండి ఉటంకించారు.

---

ఒకరిపై కయ్యానికి కాలు దువ్వదు. అది శాంతిని, సంధిని, మైత్రిని కోరుకుంటుంది. కాని ప్రతిఘటన లేదా సైనిక చర్య అనివార్యమైనప్పుడు దానికి సర్వవిధాలా సన్నద్ధ మవుతుంది.

## అధ్యాయం : 102

## యుద్ధ స్థలాన్ని రహస్యంగా ఉంచటం (వేరొక ప్రదేశాన్ని సూచించటం), గురువారం నాడు బయలుదేరడం

**286)** అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ తెలిపారు : అబ్దుల్లాహ్ బిన్ కాబ్ గారు తన తండ్రి కాబ్ బిన్ మాలిక్(రజి)ను (వృద్ధాప్యంలో అంధత్వం వచ్చిన కారణంగా) పట్టుకుని ముమ్ముందు నడిచేవారు. నేను నా తండ్రి కాబ్ (రజి) చెప్పగా విన్నానని ఆయన అన్నారు: తబూక్ యుద్ధ సందర్భంగా ఆయన వెనుకబడిపోయారు (దైవప్రవక్త-సఅసం-తో కలసి యుద్ధానికి వెళ్ళలేక పోయారు). దైవప్రవక్త(స) ఏదైనా యుద్ధానికి బయలుదేరాలని సంకల్పించుకున్న ప్పుడు (దూరదృష్టితో) వేరొక ప్రదేశం పేరు చెప్పేవారు.[1]

**287)** అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ తెలిపారు- కాబ్ బిన్ మాలిక్(రజి) చెబుతుండగా తాను విన్నానని అన్నారు: ఆయన ఏమనేవారంటే; ప్రవక్త మహనీయులు(సఅసం) ఎప్పుడయినా ఏదైనా ప్రదేశానికి యుద్ధ సంకల్పం చేసుకున్నప్పుడు సరిగ్గా ఆ ప్రదేశం పేరు చెప్పటం అనేది బహు అరుదుగానే జరిగేది. కాని తబూక్ యుద్ధ సందర్భంగా అలా జరగలేదు. ఆ ప్రదేశం పేరును ముందస్తుగానే ప్రకటించారు. ఎందుకంటే ఆ యుద్ధ సన్నాహాలు ప్రారంభించి నప్పుడు ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయి. ప్రయాణం కూడా సుదీర్ఘమైనది. అడవుల గుండా సాగిపోవాలి. శత్రువులు కూడా భారీ సంఖ్యలో ఉన్నారు. అందు వల్ల (తబూక్‌కు వెళ్ళబోతున్నట్లు) ఆయన(స) చాలా స్పష్టంగా తెలియజేశారు. శత్రువుకు వ్యతిరేకంగా పూర్తి సన్నాహాలు చేసుకునేందుకే ఆయన(స) యుద్ధ స్థలాన్ని ముందుగానే సూచించారు. కాబ్ బిన్ మాలిక్(రజి) ఈ విధంగా కూడా చెప్పారు: దైవప్రవక్త(స) శనివారం, గురువారం తప్ప వేరితర దినాలలో ప్రయాణానికి బయలుదేరటం అనేది అరుదుగానే జరిగేది.[1]

---

286-1. అంటే శత్రువును ఏమార్చే ఉద్దేశంతో ఈ స్ట్రాటజీని అవలంబించేవారు. ఇదీ రణ తంత్రంలో ఒక భాగం క్రిందికే వస్తుంది.

287-1. "బారకల్లాహు యౌముస్సబ్త్ వల్ ఖమీస్" అని ఒక హదీసులో ఉంది. అందువల్ల విద్వాంసులు కూడా గురువారం లేదా శనివారం నాడు ప్రయాణానికి బయలుదేరడాన్ని సంప్రదాయం (మస్నూన్)గా ఖరారు చేశారు.

**288) మహనీయ కాబ్ బిన్ మాలిక్(రజి) తెలిపారు : మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తబూక్ పోరాటం కొరకు గురువారం నాడు బయలుదేరారు. గురువారం నాడు ప్రయాణం చేయడాన్ని ఆయన(స) ఇష్టపడేవారు.**

## అధ్యాయం : 103

## జుహ్రా నమాజ్ అనంతరం ప్రయాణించటం

**289) హజ్రత్ అనస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసం) మదీనాలో నాలుగు రకతుల జుహ్రా నమాజ్ చేసి బయలుదేరారు. జుల్‌హులైఫాలో రెండు రకతుల అస్ర్ నమాజ్(ఖస్ర్) చేశారు. ఆయన సహచరులు హజ్జ్ మరియు ఉమ్రాల కొరకు 'లబ్బైక్' పలుకుతూ ఉండగా నేను విన్నాను.** [1]

## అధ్యాయం : 104

## నెల చివరి రోజుల్లో ప్రయాణించటం

**ఇబ్నె అబ్బాస్(రజి) ఆధారంగా కురైబ్ ఉటంకించిన దాని ప్రకారం జీఖఅద నెల అయిదు రోజుల్లో పూర్తవుతుందనగా దైవప్రవక్త(స) మదీనా నుండి హజ్జ్ యాత్రకు బయలుదేరారు. ఆయన(స) మక్కా చేరుకునేటప్పటికి జిల్‌హజ్జా నెల నాలుగు రోజులు గడిచిపోయాయి.** [1]

**290) హజ్రత్ ఆయిషా(రజి.అ) చెప్పగా తాను విన్నానని అమ్రా బిన్తె అబ్దుర్రహ్మాన్ తెలిపారు : (అంతిమ హజ్జ్ యాత్ర నిమిత్తం) దైవప్రవక్త(స)తోపాటుగా మదీనా నుండి మేము బయలుదేరినప్పుడు జీఖఅద నెలలో మరో అయిదు రోజులు మిగిలి ఉన్నాయి. మా ఉద్దేశం హజ్జ్ చేయటం తప్ప మరేమీ కాదు. (కాని 29 రోజులకే చంద్ర దర్శనం అవటం వల్ల 4 రోజులే మిగిలినాయి). మేము మక్కా సమీపానికి చేరుకోగానే దైవప్రవక్త(స) ఇలా ఆదేశించారు: "ఎవరి వద్దనయితే ఖుర్బానీ**

---

289–1. ఇది దైవప్రవక్త(స) గారి హజ్జ్ యాత్ర. అయితే జిహాద్ కొరకు బయలుదేరవలసి ఉన్నా జుహ్రా నమాజ్ చేసి బయలుదేరటం మంచిది.

104–1. అంటే నెల చివరి రోజులలో ప్రయాణం చేయటం ధర్మసమ్మతమే. అందులో తప్పేమీ లేదు. చాంద్రమానం మొదటి 15 రోజుల్లోనే ప్రయాణానికి బయలుదేరాలనీ, చివరి అర్థభాగంలో ప్రయాణం చేయరాదని కొందరు అజ్ఞానులు భావిస్తారు. దీనికి ఎలాంటి ఆధారం లేదు.

పశువు లేదో వారు కాబా గృహ ప్రదక్షిణ చేసి, సఫా– మర్వాల మధ్య సయీ చేయగానే 'ఇహ్రామ్'ను విడువాలి. (తరువాత వారు హజ్జ్ కొరకు వేరుగా ఇహ్రామ్ కట్టుకోవచ్చు)". హజ్రత్ ఆయిషా(రజి.అ) ఇలా అంటున్నారు: జిల్‌హజ్జా 10వ తేదీన మా వద్దకు ఆవు మాంసం పంపబడింది. 'ఈ మాంసం ఎక్కడిది?' అని నేను అడిగితే, 'దైవప్రవక్త(స) తమ భార్యల తరఫున ఇచ్చిన ఖుర్బానీ మాంసం ఇది' అని చెప్పబడింది. యహ్యా ఇలా తెలిపారు: ఆ తరువాత నేను ఈ హదీసును ఖాసిమ్ బిన్ ముహమ్మద్ ముందు ప్రస్తావించగా, 'దైవసాక్షిగా! అమ్రా బిన్తె అబ్దుర్రహ్మాన్ నీకు ఈ హదీసును సరిగ్గా వినిపించింది' అని ఆయన అభిప్రాయపడ్డారు.

## అధ్యాయం : 105

## రమజాన్ మాసంలో ప్రయాణం చేయటం

**291)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం: (మక్కా విజయం నిమిత్తం) ప్రవక్త మహనీయులు(స) రమజాన్ మాసంలో మదీనా నుండి బయలు దేరినప్పుడు ఆయన(స) ఉపవాసం పాటిస్తూ ఉన్నారు. (మక్కా నగరానికి కొంత దూరాన ఉన్న) 'కదీద్' స్థలానికి చేరుకోగానే ఆయన(స) ఉపవాసాన్ని విరమించారు.[1]

## అధ్యాయం : 106

## ప్రయాణీకునికి వీడ్కోలు పలకటం

మహనీయ అబూ హురైరా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసం) మమ్మల్ని ఒక సైనిక దళంలో పంపుతూ, "ఫలానా ఖురైషు వ్యక్తులిద్దరూ మీకు గనక కనిపిస్తే, వారిని అగ్నికి ఆహుతి చేయండి" అని సూచించారు. అబూ హురైరా(రజి) ఇలా అంటున్నారు: ఆయన నుండి సెలవు తీసుకునేందుకు మేము ఆయన(స) సన్నిధికి వచ్చినప్పుడు, "ఫలానా ఫలానా ఖురైషు వ్యక్తులు మీకు తారసపడితే వారిద్దరినీ కాల్చివేయమని నేను మీకు ఇంతకుముందు చెప్పాను. కాని ఎవరినయినా

---

291–1. రమజాన్ మాసంలో ప్రయాణం చేసేవారు, అవసరమైతే ఉపవాసాన్ని విరమించవచ్చని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. "వ్యాధిగ్రస్తులైన వారు లేదా ప్రయాణంలో ఉన్నవారు ఆ ఉపవాస దినాలను వేరే దినాలలో పూర్తి చెయ్యాలి" (అల్ బఖరా– 185) అన్న దైవవచనం ఈ సందర్భంగా గమనార్హం. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఇక్కడ తీసుకురావటంలోని ముఖ్య ఉద్దేశం; రమజాన్ నెలలో ప్రయాణం చేయటం వాంఛనీయం కాదని చెప్పేవారి మాట సరైనది కాదని బోధపరచటమే.

**అగ్నికి ఆహుతి చేసే శిక్ష విధించటం అల్లాహ్‌కు తప్ప వేరితరులకు శోభించదు. కాబట్టి వారు గనక మీకు కనబడితే వారిని సంహరించండి (అంతేగాని వారిని కాల్చకండి)"[1] అని ఆదేశించారు.**

## అధ్యాయం : 107

## ఇమామ్ (నాయకుడు లేదా రాజ్యాధికారి)కి విధేయత చూపటం

**292) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "(సమకాలీన రాజ్యాధికారి) పాపం, అవిధేయత గురించి ఆజ్ఞాపించకుండా ఉన్నంతవరకూ అతని ఆజ్ఞను వినటం, శిరసావహించటం (ప్రతి ముస్లింకు) విధి. ఒకవేళ అతను గనక పాపం గురించి ఆజ్ఞాపిస్తే దానిని వినవలసిన, ఆచరించవలసిన అవసరం లేదు."[1]**

## అధ్యాయం : 108

## నాయకునితో కలసి యుద్ధం చేయటం...

**293) మహాప్రవక్త(సఅసం) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: మహాప్రవక్త(సఅసం) ఇలా చెప్పారు– "మనం ఈ ప్రపం**

---

106–1. ఇంతకీ ఎవరా ఇద్దరు వ్యక్తులు? వారు చేసిన నేరం ఏమిటి?

వారిలో ఒకడు రహ్బా బిన్ అస్వద్, మరొకడు నాఫె బిన్ అబ్దె అమ్ర్. ఆ శాపగ్రస్తులు ఇద్దరూ కలసి గర్భవతి అయిన దైవప్రవక్త(స) కుమార్తె కడుపులో బరిసె పొడిచారు. తత్కారణంగా ఆమెకు గర్భస్రావం జరిగిపోయింది. అందుకే వారిద్దరూ కనబడగానే అగ్నికి ఆహుతి చేయమని దైవప్రవక్త(స)ఆజ్ఞాపించారు. తరువాత "హతమార్చండి చాలు" అని అన్నారు. ఎందుకంటే అగ్నికి ఆహుతి చేయటం అధర్మం (హరామ్). ఆయన(స) మొదటి ఆజ్ఞ తన స్వంత అభిప్రాయంతో జారీ చేశారు. రెండవ ఆజ్ఞ దైవ వాణి ఆధారంగా వినిపించారు.

292–1. ఎందుకంటే, వేరొక హదీసు ప్రకారం సార్వభౌమాధికారి అల్లాహ్. ఆయన ఆజ్ఞకు వ్యతిరేకంగా ఎవరి ఆజ్ఞను కూడా శిరసావహించనవసరం లేదు. ఒకవేళ ఏ రాజ్యాధికారి అయినా షరీఅత్‌కు విరుద్ధమయిన ఆజ్ఞను జారీ చేస్తే అతనికి నచ్చజెప్పాలి. వినకపోతే అందరూ కలసి అతన్ని పదవీచ్యుతుణ్ణి చేయాలి. ఈ హదీసు ఆధారంగానే ఇమామ్ హుసైన్(రజి) యజీద్‌కు విధేయత చూపలేదు. దివ్య ఖుర్ఆన్‌లో కూడా తల్లిదండ్రులకు విధేయత చూపమని ఆదేశించిన చోటే, ఒకవేళ వారు షిర్క్ చేయమని ఆజ్ఞాపిస్తే వారి మాట వినాల్సిన అవసరం లేదని కూడా చెప్పటం జరిగింది.

**చంలో అందరికన్నా చివర్లో వచ్చాము. కాని (పరలోకంలో) స్వర్గంలో అందరికన్నా ముందు ఉంటాము. ఎవరయితే నాకు విధేయత చూపారో వారు అల్లాహ్‌కు విధేయత చూపారు. ఎవరయితే నా పట్ల అవిధేయులుగా వ్యవహరించారో వారు అల్లాహ్ యెడల అవిధేయులుగా వ్యవహరించారు. ఎవరయితే నాయకుని (అమీర్)కి విధేయత కనబరిచారో వారు నాకు విధేయత కనబరిచారు. ఎవరయితే నాయకుని పట్ల అవిధేయులుగా మసలుకున్నారో వారు నా పట్ల అవిధేయులుగా మసలుకున్నారు. నాయకుని దృష్టాంతం 'డాలు' వంటిది. అతని వెనుక ఉండి, అతని చాటున (అంటే అతనితో కలసి) యుద్ధం చేయటం జరుగుతుంది. అతని ద్వారానే (శత్రువు దాడి నుండి) రక్షణ పొందటం జరుగుతుంది. కనుక నాయకుడు గనక అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి అని మిమ్మల్ని ఆజ్ఞాపిస్తే, న్యాయంగా వ్యవహరిస్తే దాని మంచి ప్రతిఫలం అతనికి లభిస్తుంది. కాని ఒకవేళ అన్యాయంగా ప్రవర్తిస్తే దాని దుష్ఫలితం అతని మీదే పడుతుంది."[1]**

## అధ్యాయం : 109

## యుద్ధం నుండి పరారు అవనని మాటివ్వటం. కొంతమంది ప్రకారం ప్రాణత్యాగంపై ప్రతిజ్ఞ చేయటం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు, అల్లాహ్ వారిని చూసి సంతోషించాడు.**[1] **(అల్ ఫతహ్ : 18)**

---

293–1 అంటే నాయకుని అస్తిత్వం ప్రజల పాలిట ఒక 'డాలు' లాంటిది. అది వారిని రక్షిస్తూ ఉంటుంది. నాయకుడు సమర్థుడై ఉంటే ఒకరింకొకరి పట్ల అన్యాయంగా ప్రవర్తించరు. అతని మూలంగానే శత్రువు దాడుల నుండి కూడా రక్షణ ఉంటుంది. ఎందుకంటే అతను ఎల్లవేళలా రక్షణ నిమిత్తం సిద్ధంగా ఉంటాడు.

ఈ హదీసుల ద్వారా సమకాలీన నాయకుని వ్యక్తిత్వం, అతని బలపరాక్రమం ఎంత మహత్తరమైనదో విదితమవుతోంది. ఇస్లామీయ ప్రభుత్వం, షరీఅత్(శాసనాంగం) ఆవశ్యకత కూడా అవగతం అవుతుంది. అది లేకపోవటం వల్లనే నేడు సర్వత్రా ఇస్లాం దీనస్థితిలో ఉంది. ముస్లింలు బానిసలుగా జీవించవలసిన దురవస్థ ఏర్పడింది.

మరో విషయం–

నాయకుడు గనక పాపాత్ముడై ఉన్నప్పుడు, ప్రజలు అతనిని పదవి నుండి తొలగించ లేనంత బలహీన స్థితిలో ఉంటే ఆ పాప ఫలం నాయకుని మీదే పడుతుంది.

**294) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : (హుదైబియా ఒడంబడిక జరిగిన) మరుసటి సంవత్సరం మేము ఖజా ఉమ్రా చేయడానికి తిరిగి వచ్చినప్పుడు, (చెట్టు కింద దైవప్రవక్త(స)తో విధేయతా ప్రమాణం చేసిన వారిలో) ఏ ఇద్దరు వ్యక్తులు కూడా ఆ చెట్టును ఖచ్చితంగా గుర్తుపట్టడంలో ఏకీభవించలేక పోయారు. ఇది కేవలం దైవ కృప.[1] నేను నాఫేను ఇలా అడిగానని జువేరియా చెప్పారు: "దైవప్రవక్త(స) ఏ విషయం మీద తన సహచరుల నుండి ప్రమాణ స్వీకారం చేయించారు? మరణం మీదేనా?" దానికి సమాధానమిస్తూ "లేదు. సహన స్థయిర్యాల మీద ప్రమాణం స్వీకరించారు"[2] అని ఆయన అన్నారు.**

**295) అబ్దుల్లాహ్ బిన్ జైద్(రజి) వివరించారు: 'హర్రా' యుద్ధం జరిగిన కాలంలో ఒక వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చి, "అబ్దుల్లాహ్ బిన్ హంజలా(యజీద్‌కు వ్యతిరేకంగా) ప్రజలను సమీకరించి 'మరణం'పై ప్రతిజ్ఞ చేయిస్తున్నార"ని చెప్పారు.**

---

109-1. హుదైబియా ఒడంబడికకు ముందు ప్రియ సహచరులు దైవప్రవక్త(స) చేతిలో చెయ్యేసి రిజ్వాన్ వృక్షం క్రింద చేసిన విధేయతా ప్రమాణమిది. సుమారు 1500 మంది ఈ ప్రతిజ్ఞ చేసినవారిలో ఉన్నారు. ప్రాణాలకు తెగించి కడ దాకా పోరాడతామని, ఎట్టి పరిస్థితిలోనూ వెన్ను చూపబోమని వారు ఒట్టేసి మరీ చెప్పారు.

294-1. హుదైబియా సంధి జరగక ముందు మక్కాలో హజ్రత్ ఉస్మాన్(రజి) హత్య గావించబడినట్లు వదంతులు వ్యాపించాయి. మోసపూరితమైన ఈ హత్యకు ప్రతీకారం తీర్చుకునేందుకు దైవప్రవక్త(స) ఒక తుమ్మచెట్టు క్రింద కూర్చుని తన ప్రియసహచరుల నుండి ప్రమాణం (బైఅత్) తీసుకున్నారు. ప్రాణాలకు తెగించి చివరి రక్తపు బొట్టు చిందేవరకూ పోరాడతామని ప్రియ సహచరులు ఆ సందర్భంగా మాటిచ్చారు. ఈ ప్రమాణ తీరును చూసి అల్లాహ్ కూడా ప్రసన్నుడయ్యాడు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఏమంటున్నారంటే, మరుసటి సంవత్సరం ఖజా ఉమ్రా చేయడానికి తాము మదీనా నుండి ఇక్కడికి వచ్చినప్పుడు, విధేయతా ప్రమాణం చేసిన వందలాది మందిలో ఏ ఇద్దరు కూడా 'అది ఖచ్చితంగా ఈ వృక్షమే" అని చెప్పలేక పోయారు. అంటే అల్లాహ్ వారిని మరిపింపజేశాడు. అందులో కేవలం దైవకృప ఇమిడి ఉంది. ఆ చెట్టు (షజ్రె రిజ్వాన్) అదేనన్న నమ్మకం కుదిరితే రేపటి రోజున అజ్ఞానులు కొందరు అక్కడ ఉరుసులు, పూజలు మొదలెట్టేందుకు ఆస్కారం ఉంది. సాధారణంగా షిర్క్ మొదలయ్యేది ఇలాగే.

294-2. అంటే యుద్ధ రంగంలో స్థిరంగా నిలబడి పోరాడతామని, వెన్నుచూపి పారిపోము అని మాట తీసుకున్నారు. ప్రాణాలకు తెగించి పోరాడతామన్నా అర్థం ఇదే.

**దీనికి సమాధానంగా ఆయన, "దైవప్రవక్త(స) ఎదుట విధేయతా ప్రమాణం చేసిన మీదట ఇక నేను ఎవరి ముందు కూడా ప్రతిజ్ఞ చేయను"[1] అని నిర్ద్వంద్వంగా చెప్పారు.**

**296) సలమా బిన్ అక్వయి (రజి) తెలిపారు: (హుదైబియా ఒడంబడిక జరగకముందు) నేను ప్రవక్త మహనీయుల(సఅసం) సమక్షంలో ప్రతిజ్ఞ (బైఅత్) చేశాను. తరువాత నేను ఒక వృక్షం నీడలో వచ్చి నిలబడ్డాను. జనసందోహం తగ్గిన తరువాత దైవప్రవక్త(స), "అక్వయి పుత్రుడా! ప్రతిజ్ఞ చేయవా?" అని అడిగారు. 'దైవప్రవక్తా! నేను ఇందాకే ప్రతిజ్ఞ చేశాను కదా!' అని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "ఫరవాలేదు. మళ్ళీ చెయ్యి" అన్నారు. అందువల్ల నేను మరోసారి విధేయతా ప్రమాణం చేశాను. (యజీద్ బిన్ అబీ ఉబైదుల్లాహ్ ఇలా అంటున్నారు) 'ఓ అబూ ముస్లిం! ఇంతకీ ఆ రోజు మీరు ఏ విషయంపై విధేయతా ప్రమాణం చేశారు?' అని సలమా బిన్ అక్వయి (రజి)ని అడగ్గా, 'మరణంపైన'[1] అని ఆయన చెప్పారు.**

---

295–1. 'హర్రా' యుద్ధం హిజ్రీ 63లో జరిగింది. దీని వివరాల్లోకి పోతే, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ హంజలా పలువురు మదీనా వాసులతో కలసి యజీద్‌ను చూడటానికి వెళ్ళారు. ఆ సమయంలో అతను తన ఖిలాఫత్ (ప్రాతినిధ్యం)పై ప్రజల నుండి విధేయతా ప్రమాణం స్వీకరిస్తున్నాడు. మదీనావాసులు అతని చేష్టల్ని చూసి, అసమర్థునిగా కనుగొన్నారు. అసభ్యకరమైన అతని ప్రవర్తనకు వారు విసిగిపోయి మదీనాకు తిరిగి వచ్చారు. మదీనాలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ చేతిపై వారు విధేయతా ప్రమాణం (బైఅత్) చేశారు. ఈ సమాచారం విన్న యజీద్ ముస్లిం బిన్ ఉఖబా నేతృత్వంలో ఓ భారీ సైనిక పటాలాన్ని మదీనాకు పంపించాడు. అతను మదీనా వాసులపై విపరీతంగా దౌర్జన్యం చేశాడు. వేలాది మంది సహాబా, తాబయీలు, సామాన్య ప్రజలు, ప్రముఖులు, స్త్రీలు, పురుషులను అతను దారుణంగా చంపేశాడు. ఆఖరికి చిన్న పిల్లలను కూడా విడిచిపెట్టలేదు. ఈ దారుణ మారణహోమం మదీనాకు సమీపంలో ఉన్న 'హర్రా' మైదానంలో జరిగింది.

హదీసు ఉల్లేఖకులైన అబ్దుల్లాహ్ బిన్ జైద్ మరోసారి ఎవరి చేతిలో కూడా చెయ్యేసి 'మరణం'పై ప్రతిజ్ఞ చేయనని చెప్పటం గమనార్హం. ఒకసారి తాము దైవప్రవక్త(స) ఎదుట ఈ ప్రతిజ్ఞ చేశామని, మరోసారి దాని అవసరం లేదన్నది ఆయన అభిప్రాయం.

296–1. ఇదీ హుదైబియా సంధి నేపథ్యంలో జరిగిన సంభాషణే. ఇది 'బైఅతె రిజ్వాన్'గా ప్రసిద్ధి చెందింది. అల్ ఫతేహ్ సూరాలో అల్లాహ్ ఈ సహాబా అందరి పట్ల ప్రసన్నుడయ్యాడు– రజిఅల్లాహు అన్హుం వ రజూఅన్. ఈ సూరాలోని 18వ ఆయత్‌ను గమనించగలరు.

**297)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నానని హుమైద్ తెలిపారు. ఆయన(రజి) ఇలా చెప్పేవారు– (కందక యుద్ధ సందర్భంగా) అన్సార్లు కందకం త్రవ్వుతూ ఇలా అనేవారు :

"మా బొందిలో ప్రాణం ఉన్నంతవరకూ ధర్మయుద్ధం చేస్తామని ముహమ్మద్ (స) సమక్షంలో ప్రతిజ్ఞ చేసినవారము మేము."

దీనికి సమాధానంగా మహాప్రవక్త(స) ఇలా అనేవారు :

"ఓ అల్లాహ్! జీవితమైతే అసలు పరలోక జీవితమే. కనుక నీవు (పర లోకంలో) అన్సార్లను, ముహాజిర్లను సత్కరించు."

ముజాషా బిన్ మస్ఊద్ సలమీ (రజి) ఇలా అన్నారు : నేను నా సోదరునితో పాటు (మక్కా విజయం తర్వాత) దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై, 'మా చేత హిజ్రత్‌పై ప్రతిజ్ఞ చేయించుకోండి' అని విన్నవించుకున్నాను. దానికి దైవప్రవక్త(స) "హిజ్రత్ అనేది హిజ్రత్ చేసి వచ్చిన వారితోనే సమాప్తమైపోయింది" అని చెప్పారు. మరైతే మా చేత ఏ విషయంపై ప్రతిజ్ఞ చేయించుకుంటారు?" అని నేను విన్నవించు కోగా "ఇస్లాంపైన, జిహాద్‌పైన" అని ఆయన(స) చెప్పారు.

## అధ్యాయం : 110

## శాయశక్తులా చక్రవర్తికి విధేయత చూపాలి

**298)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) వివరించారు : నా దగ్గరకు ఒక వ్యక్తి వచ్చాడు. అతడు అడిగిన ప్రశ్నకు ఏమని జవాబు ఇవ్వాలో నాకు అర్థం కాలేదు. అతనిలా అడిగాడు: "ఒక వ్యక్తి సాయుధుడై చాలా సంతోషంగా మా సైన్యాధికారితో పాటు ధర్మయుద్ధానికి వెళతాడు. తరువాత ఆ అధికారి అతని శక్తికి మించిన పని చేయమని ఆజ్ఞాపిస్తాడు (అప్పుడు అతనేం చేయాలి?)". నేనిలా అన్నాను : "దైవసాక్షిగా! నీ సందేహానికి ఏం సమాధానం ఇవ్వాలో నాకు తోచటం లేదు. అయితే మేము దైవప్రవక్త(సఅసం) వెంట ఉన్నప్పుడు, ఏ విషయంలోనయినా ఒకే ఒక్కసారి ఆజ్ఞాపించవలసిన అగత్యం ఏర్పడేది. మేము తక్షణమే దానిని శిరసావహించేవారం. గుర్తుంచుకోండి. మీరు అల్లాహ్‌కు భయపడుతూ ఉన్నంత వరకూ మీలో మేలు ఉంటుంది. ఏదేని వ్యవహారంలో (ఏం చేయాలి? ఏం చేయ కూడదు?) అన్న మీమాంస మీ మనసులో జనించినప్పుడు, ఒక విద్వాంసుణ్ణి

ప్రశ్నించి సంతృప్తి పొందండి. ఒక కాలం రానున్నది. అప్పుడు మీకు సరైన (సమాధానం ఇచ్చే) మనిషి కూడా దొరకడు. ఏ శక్తిమంతుడు తప్ప మరో ఆరాధ్య దైవం లేడో ఆయనపై ప్రమాణం చేసి చెబుతున్నాను. ఇప్పుడు మిగిలి ఉన్న ప్రపంచం ఉపమానం ఒక గుంట లాంటిది. అందులోని స్వచ్ఛమైన నీరు త్రాగటం జరిగింది. ఇప్పుడు బురద నీరు మాత్రమే మిగిలి ఉంది."[1]

## అధ్యాయం : 111

## ప్రవక్త మహనీయులు(స) సూర్యోదయ సమయంలో గనక యుద్ధం మొదలెట్టకపోతే, (ఆగిపోయి) పొద్దు వాలిన మీదట మొదలెట్టేవారు.

**299)** ఉమర్ బిన్ ఉబైదుల్లాహ్ గారి బానిస (గుమాస్తా కూడా) అయిన సాలిమ్ అబూ నజర్ వివరించారు: అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్ఫా (రజి) తనకు ఒక లేఖ వ్రాశారు. దానిని నేను చదివాను– దైవప్రవక్త(స) తాను యుద్ధాలు చేసే కొన్ని దినాలలో మధ్యాహ్నం పొద్దువాలే వరకూ నిరీక్షించేవారు (ఆ తరువాతే యుద్ధం మొదలెట్టేవారు). తరువాత ఆయన(స) తన సహచరులనుద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు : "ప్రజలారా! శత్రువును మార్కొనాలన్న కాంక్షను కలిగి ఉండకండి (సంధి ప్రియులై ఉండండి). శాంతిని నెలకొల్పమని అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి. ఒకవేళ శత్రువును మార్కొనడం అనివార్యమైనట్లయితే సహన స్థయిర్యాలను ప్రదర్శించండి. తెలుసుకోండి! స్వర్గం ఖడ్గాల నీడలో ఉంది." ఆ తరువాత ఆయన (స) ఇలా ప్రార్థించారు :"ఓ అల్లాహ్! గ్రంథాన్ని అవతరింపజేసినవాడా!! మేఘాన్ని నడిపించేవాడా! (శత్రు) సేనలను ఓడించేవాడా!! వీళ్ళను (ఈ అవిశ్వాసులను) ఓడించు. వీరికి వ్యతిరేకంగా మాకు సహాయపడు."[1]

---

298–1. మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) సూటిగా సమాధానం ఇవ్వకుండా విషయాన్ని సాగదీశారు. దాని సారాంశం మాత్రం సుస్పష్టమే– అధికారి ఆజ్ఞ షరీఅత్‌కు విరుద్ధంగా లేనంతవరకూ, దానిని శిరసావహించటం అనివార్యం. ఆయన గారు దివ్య ఖుర్ఆన్‌లోని ఈ క్రింది ఆయత్ ప్రకారం చెప్పారు :

"మీకు గనక తెలియకపోతే జ్ఞాపిక కలవారిని అడగండి." (అన్ నహ్ల్ : 43)

పామరుడు చేయాల్సిన పనేమిటంటే దైవభీతిపరుడైన పండితుణ్ణి అడిగి ధర్మసందేహం తీర్చుకోవాలి.

299–1. దీని ద్వారా తెలిసేదేమంటే, సాధ్యమైనంతవరకు యుద్ధ పరిస్థితి రాకుండా చూడాలి. సంధి చేసుకునే అవకాశం వస్తే దాన్ని జారవిడువరాదు. ఎందుకంటే ఇస్లామ్

## అధ్యాయం : 112

## ఎవరయినా యుద్ధ రంగం నుండి తిరిగి రాదలిస్తే లేదా యుద్ధానికి వెళ్లదలచకపోతే, ఆ మేరకు నాయకుని నుండి అనతి పొందాలి.

**అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తనూ హృదయపూర్వకంగా విశ్వసించేవారు ఏదైనా సామూహిక కార్యం నిమిత్తం దైవప్రవక్తతో ఉన్నప్పుడు అతని అనుమతి లేకుండా వెళ్ళని వారు మాత్రమే అసలైన విశ్వాసులు. ప్రవక్తా! నిన్ను అనుమతి అడిగేవారే అల్లాహ్‌ను, ప్రవక్తను విశ్వసించేవారు. కనుక వారు తమ ఏ పనికైనా అనుమతి అడిగితే నీవు కోరిన వారికి అనుమతి ఇస్తూ ఉండు. అటువంటి వారిని క్షమించు అని అల్లాహ్‌ను ప్రార్థించు. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించే వాడూను. (అన్ నూర్: 62)**

**300)** మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) నుడివారు: నేను దైవప్రవక్త (సఅసమ్)తో కలసి ఒక యుద్ధంలో పాల్గొన్నాను. ఆయన(స) నా వెనుక నుండి వచ్చి నన్ను కలుసుకున్నారు. నేను నీళ్ళు మోసే ఒక ఒంటెపై స్వారీ అయి ఉన్నాను. అది బాగా అలసిపోవటం వల్ల నెమ్మదిగా నడుస్తోంది. “జాబిర్! ఇంతకీ నీ ఒంటెకే మయింది?” అని ఆయన(స) నన్నడిగారు. ‘ఇది బాగా అలసిపోయింది’ అని నేను విన్నవించుకున్నాను. అప్పుడు దైవప్రవక్త(స) దాని వెనక్కివెళ్ళి, గట్టిగా గద్దించి, దాని కోసం ప్రార్థించారు. అంతే, ఆ ఒంటె నడకలో ఇతర ఒంటెలకన్నా ముందంజ వేసింది. తరువాత దైవప్రవక్త(స) జాబిర్(రజి)తో, “చెప్పు, నీ ఒంటె గురించి ఇప్పుడేమంటావ్?” అని అడిగారు. ‘మీ శుభం వల్ల ఇప్పుడిది బాగానే ఉంది’ అని నేనన్నాను. “మరైతే దీన్ని అమ్మగలవా?” అని ఆయన(స) అడిగేసరికి, నేను సిగ్గుపడిపోయాను. ఎందుకంటే మా (ఇంటి) వద్ద నీళ్ళు మోసుకురావడానికి ఇదొక్కటి తప్ప మరొక ఒంటె లేదు. అయినప్పటికీ నేను ‘సరే’ అన్నాను. “అలాగైతే అమ్మేసేయ్”అని ఆయన(స) అన్నారు. అందువల్ల నేను ఆ ఒంటెను ఆయన(స)

---

ఉపద్రవానికి, పీడనకు వ్యతిరేకం. కాని శత్రువు సంధికి ససేమిరా అంటూ కయ్యానికి కాలుదువ్వినట్లయితే సాహసంతో ప్రతిఘటించి, మెడలు వంచాలి.

‘స్వర్గం ఖడ్గాల నీడలో ఉంది’ అంటే అర్థం, స్వర్గం కొరకు ధన ప్రాణాల త్యాగం చేయ వలసి ఉంటుంది. స్వర్గప్రవేశం అన్నది చవుక బేరం కాదు. ఖుర్‌ఆన్‌లో చెప్పబడినట్లు “విశ్వాసుల నుండి అల్లాహ్ వారి ప్రాణాలనూ, వారి సంపదలనూ స్వర్గానికి బదులుగా కొన్నాడు.” (తౌబా – 111)

**గారికి అమ్మివేశాను. మదీనా నగరానికి చేరుకునే వరకు నేను దాని మీద స్వారీ అయ్యేటట్టు బేరం కుదిరింది. జాబిర్ (రజి) ఇంకా ఇలా అన్నారు : 'దైవప్రవక్తా! మొన్నీమధ్యనే నేను పెళ్ళి చేసుకున్నాను. అందువల్ల మీకన్నా ముందే (నేను నా ఇంటికి) వెళ్ళటానికి అనుమతి ప్రదానం చేయండి' అని నేను విన్నవించుకోగా, ఆయన(స) నాకు అనుమతిని ప్రదానం చేశారు. అందువల్ల నేను అందరికన్నా ముందే మదీనాకు చేరుకున్నాను. నేను నా మేనమామను కలుసుకున్నప్పుడు, ఆయన ఒంటె పరిస్థితి గురించి నన్ను అడగారు. ఒంటె విషయంలో జరిగినదంతా నేనాయనకు చెప్పేశాను. అది విని ఆయన నాపై మండిపడ్డారు (నీ దగ్గర ఉన్న ఆ ఒక్క ఒంటెనూ అమ్మేశావు. ఇప్పుడు నీళ్ళు దేనిపై మోపుతావు? అని కోపగించుకున్నారు). పెళ్ళి విషయం ప్రస్తావించి, నేను దైవప్రవక్త(స) నుండి అనుమతిని కోరినప్పుడు, "కన్యను పెళ్ళాడావా? వితంతువును వివాహమాడావా?" అని ఆయన(స) ఆరా తీశారు. 'వితంతువును మనువాడాన'ని చెప్పాను. "కన్యను ఎందుకు చేసుకోలేదు? కన్య అయితే ఎంచక్కా ఆమె నీతో, నువ్వు ఆమెతో ఆడుకునే వారు కదా!" అని దైవప్రవక్త(స) అభిప్రాయపడ్డారు (ఎందుకంటే మహనీయ జాబిర్ అప్పటికి నవ యువకుడు). దానికి నేను, 'అయ్యా దైవప్రవక్తా! నా తండ్రి చని పోయారు (లేదా ఉహుద్ యుద్ధంలో అమరగతినొందారని చెప్పారు). నాకు చిట్టి చెల్లెళ్ళు ఉన్నారు. అందువల్ల వారిలాంటి ఒక కన్నె పిల్లనే మనువాడటం నాకు నచ్చలేదు. కన్నెపిల్ల అయితే (నా చెల్లెళ్ళకు) సంస్కారం నేర్పజాలదు. వాళ్ళ ఆలనా పాలనా కూడా తగు విధంగా చేయజాలదు. అందుకే నేను వితంతువుకు ప్రాధాన్యత ఇచ్చాను. వితంతువైతే వాళ్ళ బాగోగుల్ని చూసుకుంటుందని, వారికి సంస్కారం నేర్పుతుందని భావించాను' అని వివరించాను. జాబిర్(రజి) ఇంకా ఇలా అన్నారు: దైవప్రవక్త(స) మదీనా చేరుకున్న మీదట ప్రభాత సమయాన నేను ఆ ఒంటెపై స్వారీ అయి, ఆయన(స) సేవలో హాజరయ్యాను. దైవప్రవక్త(స) నాకు ఆ ఒంటె వెలను ఇవ్వడమేగాక, ఆ ఒంటెను కూడా (కానుకగా) ఇచ్చేశారు. ఉల్లేఖకులైన ముగీరా ఏమన్నారంటే, మా దృష్టిలో క్రయ విక్రయాలలో ఇలాంటి షరతు విధించటం సమంజసమే, అది అనుచితం ఏమీ కాదు.**[1]

300–1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును పలు ప్రకరణాలలో, అనేక అధ్యాయాల క్రింద పునరావృతం చేశారు. ఇక్కడ ఈ అధ్యాయంలో ఈ హదీసును పొందుపరచటంలోని ఉద్దేశం, హజ్రత్ జాబిర్(రజి) దైవప్రవక్త(స) నుండి అనుమతిపొందిన మీదట వేరయ్యారన్నదే.

## అధ్యాయం : 113

## కొత్తగా పెళ్ళయినప్పటికీ జిహాద్‌కు వెళ్ళినవారు

**ఈ అధ్యాయంలో జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) హదీసు వచ్చింది.**

## అధ్యాయం : 114

**కొత్త పెళ్ళి కొడుకు తన వధువుతో సమాగమం జరిపిన మీదటే జిహాద్‌కు వెళ్ళాలి.[1]**

**ఈ అధ్యాయం క్రింద మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖించిన మహా ప్రవక్త(స) ప్రవచనం ఉంది.**

## అధ్యాయం : 115

## భయాందోళనల సమయంలో నాయకుడు (పరిస్థితిని తెలుసుకోవ డానికి) ముందుకు పోవటం.

**301)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ఒకసారి మదీనా వాసుల్లో భయోత్పాతం నెలకొంది. తక్షణం ప్రవక్త మహనీయులు(స) అబూ తల్హా (రజి) గుర్రంపై స్వారీ అయి (పరిస్థితిని సమీక్షించడానికి) వెళ్ళారు. తరువాత ఆయన(స), "మాకైతే ఎలాంటి విపత్కర పరిస్థితి గోచరించలేదు. కాకపోతే ఈ గుర్రం వేగంగా పరుగెత్తడంలో నదీ ప్రవాహంలా ఉంది" అని చెప్పారు.

## అధ్యాయం : 116

## భయాందోళనల సమయంలో గుర్రాన్ని వేగంగా పరుగెత్తించటం

**302)** **మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: (మదీనా) ప్రజలలో భయాందోళనలు వ్యాపించినప్పుడు, మహాప్రవక్త(సఅసం) అబూ తల్హా (రజి)కు చెందిన ఒక గుర్రంపై స్వారీ అయ్యారు. అది చాలా నిదానంగా వెళ్ళే గుర్రం. కాని దైవప్రవక్త(స) దానిని పరుగెత్తించేసరికి (వేగంగా పరుగెత్త సాగింది) ప్రజలు కూడా ఆయన(స) వెనుకే తమ వాహనాలపై స్వారీ అయ్యారు. తరువాత ఆయన(స) తిరిగి వచ్చి "భయపడాల్సిన పనేమీ లేదు. కాకపోతే ఈ గుర్రం నదీ ప్రవాహం" అన్నారు. ఆనాటి నుంచీ ఆ గుర్రం (పరుగులో) ఎన్నడూ వెనుకపడలేదు.**

---

114-1. ఒక ప్రవక్త ధర్మయుద్ధానికి బయల్దేరుతూ, "కొత్తగా పెళ్ళి చేసుకుని తన వధువుతో సంయోగం జరపని వ్యక్తి నా వెంట రాకూడదు" అని పలికారు. ఈ హదీసు ముందు రాబోతుంది.

## అధ్యాయం: 117
## భయోత్పాతం నెలకొన్నప్పుడు ఒంటరిగా బయలుదేరడం[1]

## అధ్యాయం : 118
## ఎవరికయినా వేతనమిచ్చి, తన తరఫున ధర్మయుద్ధానికి పంపటం- దైవ మార్గంలో వాహనం ఇవ్వటం

**ముజాహిద్ నుడివారు: "నేను హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ముందు ధర్మయుద్ధంలో పాల్గొనాలన్న" ఉద్దేశ్యాన్ని వెలిబుచ్చినప్పుడు, "నేను కూడా ఈ పద్దు క్రింద నా ధనంలోని కొంత మొత్తాన్ని ఖర్చుపెట్టి నీకు సహాయపడాలనుకుంటు న్నాన"ని ఆయన అన్నారు. దానికి నేను, "ఫరవాలేదు. అల్లాహ్ నాకు ప్రసాదించి నది నాకు సరిపోతుంది" అన్నాను. కాని ఆయన ఇలా అన్నారు: "అది కాదు, నీ మూలధనం నీ కోసం. నా ధనంలో కూడా కొంతభాగం దైవమార్గంలో ఖర్చు అవ్వాలన్నది నా అభిలాష". హజ్రత్ ఉమర్(రజి) ఏమన్నారంటే; ఎంతోమంది ఈ ధనాన్ని జిహాద్ చేస్తామన్న షరతుపై (ప్రభుత్వ కోశాగారం నుండి) తీసుకుంటూ ఉంటారు. కాని వారు జిహాద్‌లో పాల్గొనరు. అందుచేత ఈ చేష్టకు ఒడిగట్టిన వాని ధనానికి మేము హక్కుదారులం. (ప్రభుత్వ ఖజానా నుండి) అతను తీసుకున్న ఆ మొత్తాన్ని మేము అతన్నుంచి తిరిగి తీసేసుకుంటాము"- తావుస్, ముజాహిద్‌లు ఇలా అన్నారు : ఎవరయినా మీకు ధర్మయుద్ధానికి బయలుదేరే షరతుపై ఏదయినా వస్తువును ఇచ్చినట్లయితే, మీరు కోరిన పద్దులో దాన్ని వెచ్చించవచ్చు. మీ ఆలుబిడ్డల అవసరాలకు కూడా ఖర్చుపెట్టుకోవచ్చు. (కాని షరతు ప్రకారం ధర్మయుద్ధంలో పాల్గొనటం తప్పనిసరి)[1]**

---

117-1. ఈ అధ్యాయం భారతదేశంలోని ప్రతులలో లేదు. అయితే షేఖ్ ఫవ్వాద్ అబ్దుల్ బాఖీ పరిశోధించిన ప్రతిలో ఉంది.

118-1. వేతనం తీసుకుని ఎవరి తరఫున అయినా జిహాద్ చెయ్యడాన్ని షాఫియీలు ధర్మ సమ్మతంగా పరిగణిస్తున్నారు. కాని మాలికీలు, హనఫీలు మాత్రం దీనిని అవాంఛ నీయం (మక్రూహ్)గా తలపోస్తున్నారు. అయితే ప్రభుత్వ బొక్కసంలో ధనం లేనప్పుడు, అదే సమయంలో ముస్లింలు నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు ఇలా చేయవచ్చు. కాకపోతే సమరయోధుని విషయం వేరు. అతనికి ఎవరయినా, ఎప్పుడయినా సహాయం చేయ వచ్చు- అతను ధనికుడైనా సరే.

**303)** మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఇలా అన్నారు: నేను దైవ మార్గంలో నా గుర్రం ఒక దానిని (జిహాద్ నిమిత్తం) ఒక వ్యక్తికి వాహనంగా ప్రదానం చేశాను. అయితే తర్వాత ఆ గుర్రం మార్కెట్లో అమ్మకానికి పెట్టి ఉండటం నేను చూశాను. మరైతే నేను ఆ గుర్రాన్ని కొనవచ్చునా? అని మహాప్రవక్త (సఅసం)ను అడగ్గా, "వద్దు. నువ్వు ఆ గుర్రాన్ని కొనవద్దు. ఈ పని చేసి నీవు నీ దానాన్ని వాపసు తీసుకోకు" అని ఆయన(స) నాకు ఉపదేశించారు.

**304)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) తన గుర్రం ఒక దానిని దైవమార్గంలో వాహనంగా ఇచ్చారు. అయితే (కొన్నాళ్ళ తరువాత) ఆ గుర్రం మార్కెట్లో విక్రయించబడుతుండగా చూసి, ఆయన ఆ గుర్రాన్ని కొనదలిచారు. ఈ విషయమై ఆయన దైవప్రవక్త(సఅసం)ను సంప్రదించగా, "నీవు దానిని కొనబాకు. ఈ విధంగా నీవు చేసిన దానాన్ని వాపసు తీసుకోకు" అని దైవప్రవక్త(స) హితవు పలికారు.

**305)** మహనీయ అబూ హురైరా (రజి) చెప్పగా తాను విన్నానని అబూ సాలెహ్ వివరించారు. ఆయన(రజి) ఇలా చెప్పారు: దైవప్రవక్త(సఅసం) ఇలా ప్రవచించారు– "నా అనుచర సమాజం (ఉమ్మత్) ఇబ్బంది పడుతుందన్న చింత గనక నాకు లేకపోయినట్లయితే, నేను ప్రతి చిన్న సైనిక దళం (సరియ్యా) వెంట (యుద్ధానికి) బయలుదేరేవాణ్ణి. కాని అందరికీ స్వారీ చేయగలిగినన్ని వాహనాలు నా దగ్గర ఎక్కడివి!? నేను బయలుదేరినప్పుడు కొంతమంది నా వెనుక (నిస్సహాయులుగా) ఉండిపోవటం నాకు బాధ కలిగిస్తుంది. ఇక నా విషయానికొస్తే, దైవ మార్గంలో పోరాడి అమరగతినొందాలి, మళ్ళీ బ్రతికించబడాలి, మళ్ళీ వీర మరణం పొందాలి, మళ్ళీ బ్రతికించబడాలి అన్నది నా అభిలాష."

## అధ్యాయం : 119

## వేతనం పుచ్చుకుని ధర్మయుద్ధంలో పాల్గొనే వ్యక్తి

యుద్ధప్రాప్తి (విజయ ధనం, మాలే గనీమత్) నుండి కూలివానికి కూడా వాటా ఇవ్వబడుతుందని ఇమామ్ హసన్ బస్రీ, ఇబ్నె సీరీన్‌లు వక్కాణించారు. అతియ్యా బిన్ ఖైస్ యుద్ధప్రాప్తి నుండి చెరిసగం తీసుకునే షరతుపై ఒక గుర్రాన్ని తీసుకున్నారు. విజయానంతరం(యుద్ధప్రాప్తి నుండి) గుర్రం భాగంగా నాలుగు

**వందల దీనార్లు లభించాయి. వాటిలో రెండు వందల దీనార్లను అతియ్యా తీసుకుని, మిగతా రెండు వందల దీనార్లను గుర్రం యజమానికి ఇచ్చారు.**

**306) తన తండ్రి యాలా బిన్ ఉమయ్యా(రజి) వివరించారని సఫ్వాన్ బిన్ యాలా తెలిపారు: నేను మహాప్రవక్త(సఅసం)తో కలసి తబూక్ యుద్ధంలో పాల్గొన్నాను. నేనొక పడుచు ఒంటెను కూడా దైవమార్గంలో సమకూర్చాను. నా ఉద్దేశంలో నేను చేసుకున్న సత్కార్యాలన్నింటిలోకీ ఇది మహత్తరమైనది. (ఇది దైవసన్నిధిలో స్వీకృతి పొందుతుందని భావించాను). నేనొక కూలివాణ్ణి కూడా నా వెంట పెట్టుకున్నాను. తరువాత ఆ కూలివాడు ఒక వ్యక్తితో (స్వయంగా యాలా బిన్ ఉమయ్యాతో) గొడవపడ్డాడు. వారిద్దరిలో ఒకడు రెండవ వాని చేతిని పల్లతో కొరికాడు. రెండవవాడు తక్షణం తన చేతిని అతని నోట్లో నుండి లాక్కున్నాడు. దాంతో అతని ముందు పన్ను ఒకటి ఊడిపోయింది. ఆ వ్యక్తి దైవప్రవక్త(స) సమక్షంలో హాజరై ఫిర్యాదు చేశాడు. కాని తన చెయ్యి లాగేసుకున్న వ్యక్తిపై దైవ ప్రవక్త(స) ఎలాంటి జరిమానా విధించలేదు. పైగా ఇలా సెలవిచ్చారు: "అతను తన చేతిని నీ నోట్లోనే ఉంచి ఉంటే నువ్వు దానిని ఒంటె నమలినట్లుగా నమలే వాడివే."[1]**

## అధ్యాయం : 120

## మహాప్రవక్త(స) పతాకం గురించి... [1]

**307) సాలబా బిన్ అబీ మాలిక్ ఖురజీ తెలిపారు : జిహాద్‌లో దైవప్రవక్త(స)**

---

306–1. ఆ కూలివాని పేరేమిటో తెలియలేదు. అబూ దావూద్‌లోని ఉల్లేఖనం ప్రకారం నేను (యాలా బిన్ ఉమయ్యా– రజి) ముసలివాణ్ణి, నా వెంట సేవకుడు ఎవడూ లేడు. అందువల్ల నేను ఒక కూలివాణ్ణి పెట్టుకున్నాను. అతనికి రెండు వాటాలు ఇచ్చేటట్లు మాట్లాడుకున్నాను. తీరా ప్రయాణానికి బయలుదేరేముందు అతనొచ్చి 'వాటా గీటా జాన్తా నై, నాకు కూలి నిర్ధారించు' అని పేచీ పెట్టాడు. నేను అతనికి మూడు దీనార్ల కూలీ నిర్ధారించాను. 'ముస్లిమ్' రివాయతులో, చెయ్యి కొరికిన వారు యాలా అనీ, కూలి వాడు తన చేతిని లాగేయగానే యాలా గారి పన్ను ఊడిపోయిందని ఉంది.

120–1. హదీసు మూలంలో 'లివా' అనే పదం వచ్చింది. 'లివా' అన్నా, 'రాయ'అన్నా ఒక్కటే. అయితే తిర్మిజీ ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) గారి 'రాయ' నలుపు రంగులో, 'లివా' తెలుపు రంగులో ఉండేది. దీనినిబట్టి వాటి మధ్య వ్యత్యాసం ఉంది. కొంతమంది ప్రకారం 'లివా' ఈటెకు తగిలించబడేది, ముడివేయబడేది కాదు. కాగా; 'రాయ'

**ధ్వజవాహకులుగా ఉండే ఖైస్ బిన్ సాద్ అన్సారీ (రజి) హజ్జ్ యాత్రకు సంకల్పించు కున్నప్పుడు (ఇహ్రామ్ దీక్ష బూనకముందు) తల దువ్వుకున్నారు.**[1]

**308) సలమా బిన్ అక్వా (రజి) కథనం : ఖైబర్ యుద్ధ సందర్భంగా హజ్రత్ అలీ(రజి) మహాప్రవక్త(సఅసం) వెంట రాలేకపోయారు. ఆ సమయంలో ఆయన కళ్ళలో బాధ ఉంది. తరువాత ఆయన 'ఏమిటి, (కేవలం కళ్ళలో బాధ ఉన్నంత మాత్రానికే) నేను దైవప్రవక్త(స)తో కలసి యుద్ధంలో పాల్గొనకపోవటమా?! అని పలికారు. పిదప ఆయన బయలుదేరి, దైవప్రవక్త(స)ను కలుసుకున్నారు. రేపు ఉదయం విజయం వరించనుండగా, ఆ రోజు సాయంత్రం దైవప్రవక్త(స)ఇలా అన్నారు : "నేను ఇస్లామీయ పతాకాన్ని ఆ వ్యక్తి చేతికిస్తాను. లేదా (ఆయన ఇలా అన్నారు) దైవం, దైవప్రవక్త ప్రేమించే వ్యక్తి చేతిలో ఇస్లామీయ ధ్వజం ఉంటుంది. లేదా ఆయన(స) ఇలా అన్నారు: అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను ప్రేమించే వ్యక్తి చేతుల మీదుగా అల్లాహ్ విజయం వొసగుతాడు." అంతలోనే మహనీయ అలీ (రజి) కూడా వచ్చేశారు. నిజానికి ఆయన వస్తారన్న ఆశ మాలో ఎవరికీ లేదు. (ఎందుకంటే ఆయన కంటి జబ్బుకు గురై ఉన్నారు). ఆయన్ని చూడగానే 'ఇదిగో, అలీ వచ్చేశారం'టూ జనులు హర్షం వెలిబుచ్చారు. దైవప్రవక్త(స) ఇస్లామీయ పతాకాన్ని ఆయన చేతికే అందించారు. అల్లాహ్ ఆయన చేతుల మీదుగానే విజయం వొసగాడు.**[1]

**309) నాఫె బిన్ జుబైర్ వివరించారు: "ఏమిటి, దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లమ్) మీకు ఇక్కడ జెండాను ప్రతిష్ఠించమని (ఎగురవేయమని)**

---

ముడివేసి కట్టబడేది. దానినే 'అలమ్'గా కూడా వ్యవహరించేవారు. మహాప్రవక్త(స) హయాంలో ఈ ధ్వజాన్ని సేనాధిపతి పట్టుకునేవాడు. ఆయన(స) ధ్వజం పేరు 'అకాబ్'.

307-1. హదీసులో ఖైస్ బిన్ సాద్ అన్సారీ (రజి) ప్రస్తావన వచ్చింది. ఈయన తన తలను-ఒకవైపు దువ్వుకోగానే, ఈయన బానిస లేచి నిలబడి ఖుర్బానీ పశువు మెడలో దండ వేశాడు. ఇది గమనించగానే ఆయన హజ్జ్ కొరకు లబ్బైక్ నినాదం చేశారు. రెండవ వైపు తల దువ్వుకోలేదు. ఈ ఖైస్ ఎవరో కాదు, ఖజ్రజ్ తెగ నాయకుడైన సాద్ బిన్ ఉబాదా (రజి) కుమారుడు. హజ్రత్ ఖైస్ గొప్ప సహాబాల్లో ఒకరు. రణరంగంలో మంచి వ్యూహకర్తగా పేరొందారు. హజ్రత్ అలీ (రజి) ఈయన్ని ఈజిప్టు గవర్నర్‌గా నియమించారు. మదీనాలో హిజ్రీ 60వ యేట పరమపదించారు- రజియల్లాహు అన్హు)

308-1. మహనీయ అలీ (రజి) గొప్పతనాన్ని గురించి చెప్పడానికి ఇదొక్కటి చాలు. అల్లాహ్

**ఆజ్ఞాపించారా?" అని హజ్రత్ అబ్బాస్(రజి) హజ్రత్ జుబైర్ (రజి)తో చెబుతుండగా నేను విన్నాను.**

## అధ్యాయం : 121

## ఒక నెల ప్రయాణ దూరం నుండే అల్లాహ్ నా పట్ల (శత్రువు గుండెల్లో) దడ పుట్టించి నాకు తోడ్పడ్డాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **సత్య తిరస్కారుల హృదయాలను మేము భయంతో నింపే సమయం త్వరలోనే రాబోతోంది. ఎందుకంటే ఎవరిని గురించి అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ అవతరింపజేయలేదో, వారిని, వారు అల్లాహ్‌తో పాటు భాగస్వాములుగా నిలబెట్టారు. వారి తుది నివాసం నరకం. ఆ దుర్మార్గులకు లభించే ఈ నివాసం ఎంతో చెడ్డది.** ***(ఆలి ఇమ్రాన్ : 151)***

**310) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు: "నేను సమగ్రమయిన పలుకులు (జవామెవుల్ కలిమ్– అంటే మాటలు క్లుప్తంగా ఉంటాయి. కాని వాటి అర్థం ఎంతో విస్తారమైనది) ఇచ్చి పంపబడ్డాను. 'భయం' ద్వారా నాకు సహాయం చేయటం జరిగింది. నేను నిద్రిస్తూ ఉండగా భూమండలంలోని ఖజానాల తాళం చెవులు నా దగ్గరకు తీసుకువచ్చి, నా చేతిలో పెట్టడం జరిగింది"[1] అబూ హురైరా (రజి) ఇలా అన్నారు : మహాప్రవక్త (తన ప్రభువు వద్దకు) వెళ్ళిపోయారు. (ఆ ఖజానాలను) ఇప్పుడు మీరు వెలికి తీస్తున్నారు.**

---

ఈయన చేతుల మీదుగా ఖైబర్ కోటను ముస్లింలకు స్వాధీనపరిచాడు. ఆ సమయంలో అలీ(రజి) చేతుల్లో విజయ పతాకం రెపరెపలాడుతూ ఉంది. ఈ హదీసు ద్వారా మహాప్రవక్త(స) దివ్యావిష్కృతి కూడా రూఢీ అవుతోంది. ఈ కారణంగానే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ సంఘటనను ఇక్కడ పొందుపరిచారు.

310–1. అంతిమ దైవప్రవక్త(స)కు ఇవ్వబడిన శుభవార్త ఇది. ఆయన అనుచర సమాజం మహా సామ్రాజ్యాలను జయిస్తుందనీ, వాటి ఖజానాలకు వారు యజమానులవుతారని చెప్ప బడింది. మహాప్రవక్త(స) తదనంతరం ముస్లింలు దీనిని చవిచూశారు. రోము, ఈరాన్‌తో సహా ప్రపంచంలోని పెద్దపెద్ద రాజ్యాలు వారి కైవసం అయినాయి. అబూ హురైరా(రజి) చెప్పినట్లుగా దైవప్రవక్త(స) తన కర్తవ్యాన్ని నిర్వర్తించి ఈ లోకం నుండి నిష్క్రమించారు. ఆ సిరిసంపదలు ఇప్పుడు మీ చేతుల్లో ఉన్నాయి.

**311) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి)కు అబూ సుఫ్యాన్(రజి) అందించిన సమాచారం: (దైవప్రవక్త – సఅసమ్ – వ్రాయించిన సందేశ లేఖ రోము చక్రవర్తి హెరిక్లస్‌కు అందినప్పుడు, అతను) తన మనుషులను ఈయన(అబూ సుఫ్యాన్) వద్దకు పంపించాడు. ఆ సమయంలో ఈయన 'ఏలియా' (సిరియా)లోనే ఉన్నారు. చాలాసేపు తర్జనభర్జన జరిగిన తరువాత రోము చక్రవర్తి దైవప్రవక్త(స) వారి ఉత్తరాన్ని తెప్పించాడు. ఆ ఉత్తరం చదవటం పూర్తవగానే రాజదర్బారులో కలకలం రేగింది. (నలువైపుల నుండీ) అరుపులు కేకలు వినిపించాయి. మేము రాజదర్బారు నుండి బయటకు గెంటివేయబడ్డాము. అప్పుడు నేను నా సహవాసులతో, "అబూ కబ్షా[1] వ్యవహారం ఇప్పుడు చాలా ముందుకు వెళ్ళిపోయింది. బనీ అస్ఫర్(రోము చక్రవర్తి) సయితం ఆయనకు భయపడుతున్నాడ"ని అన్నాను.**

## అధ్యాయం : 122

## యుద్ధ ప్రయాణంలో సామగ్రిని (ఖర్చులను) తీసుకెళ్ళటం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **ప్రయాణ సామగ్రిని (ఖర్చులను) మీ వెంట తీసుకెళ్ళండి.[1] భయభక్తులు (తఖ్వా) అన్నిటికంటే ఉత్తమమైన సామగ్రి.**

***(అల్ బఖరా : 197)***

**312) హజ్రత్ అస్మా బిన్తె అబీబకర్(రజి.అన్హా) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనాకు వలసపోవాలని నిశ్చయించుకున్నప్పుడు, నేను (నా**

---

311–1. దైవప్రవక్త(స)నే 'అబూ కబ్షా' పేరుతో స్మరించారు అబూ సుఫ్యాన్. అప్పటికి ఆయన ధర్మపరివర్తన చెందలేదు. ఇంతకీ అబూ కబ్షా దైవప్రవక్త(స)కు పాల వరుస తండ్రి అవుతారు.

సిరియా రాజ్యం మదీనా నగరానికి నెలరోజుల ప్రయాణ దూరంలో ఉంది. రోము చక్రవర్తి అక్కడే ఉండేవాడు. నెలరోజుల ప్రయాణ దూరంలో ఉండగానే నా యెడల శత్రువు భయపడేవిధంగా అల్లాహ్ నాకు సహాయపడ్డాడన్న వాక్కు ద్వారా అధ్యాయం లోని నిగూఢార్థం బయల్పడింది. మహాప్రవక్త(స) గారి అనేక అద్భుతాలలో ఇదీ ఒకటి.

122–1. అంటే సుదీర్ఘ ప్రయాణానికి బయలుదేరుతున్నప్పుడు చద్ది మూటను, వంట సామగ్రిని తీసుకెళ్ళటం మంచిది. అలాగే ప్రయాణ ఖర్చులు కూడా వెంట ఉంచుకోవాలి. ఈ ఏర్పాట్లు 'తవక్కుల్' (దేవునిపై మోపే భారం)కు వ్యతిరేకం కాదు. దేవుడు వారించిన విషయాలకు దూరంగా ఉండటమే ముఖ్యం.

**తండ్రి) అబూ బకర్(రజి) ఇంట్లో ఆయన(స) కోసం భోజన సామగ్రిని సిద్ధం చేశాను. ఆ సమయంలో చద్దిమూటను, నీళ్ళ తిత్తెను కట్టడానికి ఏ వస్తువూ దొరక్క పోవటంతో, 'నా పైట (లేక దుపట్టా) తప్ప మరొక వస్తువేదీ కట్టడానికి లేద'ని నాన్న అబూబకర్ (రజి)తో చెప్పాను. దానికాయన, 'ఫరవాలేదు. దానినే రెండు ముక్క లుగా చింపి, ఒక దాంతో చద్దిమూటను కట్టు. రెండవ దానితో నీళ్ళ తిత్తెను కట్టు' అని సూచించారు. నేను అలాగే చేశాను. ఈ కారణంగానే నాకు "జాతున్నతాఖైన్" (రెండు దుపట్టాలు కల మహిళ) అని పేరు పడింది.[1]**

**313) మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు : మేము దైవ ప్రవక్త (సఅసమ్) కాలంలో ఖుర్బానీ పశువుల మాంసాన్ని (భోజన సామగ్రిగా) మదీనాకు తీసుకువెళ్ళేవారం.**

**314) సువైద్ బిన్ నోమాన్ తెలిపారు: ఈయన ఖైబర్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్) వెంట వెళ్ళారు. సైన్యం ఖైబర్‌కు దిగువ ప్రాంతంలో ఉన్న 'సహ్‌బా'కు చేరుకోగానే, అందరూ అస్ర్ నమాజ్ చేశారు. దైవప్రవక్త(స) భోజనం తెప్పించారు. ఆ సందర్భంగా ఆయన(స)వెంట సత్తు పిండి తప్ప మరో ఆహార పదార్థమేదీ లేదు. మేము ఆ సత్తు పదార్థాన్నే తిన్నాము, త్రాగాము, భోజనానంతరం దైవప్రవక్త(స) నిలబడి పుక్కిలించారు. మేము కూడా పుక్కిలించి (మగ్రిబ్) నమాజ్ చేశాము.[1]**

**315) మహనీయ సలమా (రజి) కథనం: (ఒకానొక ప్రయాణంలో) జనుల వద్ద భోజన సామగ్రి అయిపోవచ్చినప్పుడు, వారు దైవప్రవక్త(సఅసమ్) సన్నిధిలో హాజరై, తమ తమ ఒంటెలను జిబహ్ చేసుకునేందుకు అనుమతిని ఇవ్వమని**

---

312-1. ఈమె హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి) పెద్ద కుమార్తె. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) తల్లి. తొలి కాలంలోనే మక్కాలో ఇస్లామ్ స్వీకరించారు. హజ్రత్ ఆయిషా(ర.అ) కన్నా పదేండ్ల పెద్దవారు. తన కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) అమరగతినొందిన తరువాత- హిజ్రీ 73వ యేట- వందేళ్ళ ప్రాయంలో మక్కాలోనే పరమపదించారు. దానధర్మాలలో సాటిలేని మేటి. దైవప్రవక్త(స) హిజ్రత్‌కు సంకల్పించుకున్నప్పుడు, ఆయన(స) బోజనసామగ్రిని సమకూర్చిన ఘనత ఈ మహాతల్లికి దక్కింది.

314-1. ఈ సత్తుపిండినే భోజన సామగ్రిగా తీసుకెళ్ళటం జరిగింది. ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం ఇదే.

**కోరారు. ఆయన(స) అనుమతిని ప్రదానం చేశారు కూడా. అంతలో వారికి హజ్రత్ ఉమర్(రజి) తారసపడ్డారు. తమకు లభించిన అనుమతిని గురించి వారు ఉమర్(రజి)కు తెలియజేశారు. ఇది విని ఆయన, 'ఈ ఒంటెల తరువాత ఇంక మీ వద్ద మిగిలేదేమిటి? (ఈ ఒంటెల మీద స్వారీ కానంతవరకూ ఇంత దూరం ప్రయాణం చేయలేరు కదా!)' అని ఆశ్చర్యపోయారు. తరువాత ఉమర్(రజి) దైవప్రవక్త(స) సమక్షంలో హాజరై, 'దైవప్రవక్తా! ప్రజలు ఈ విధంగా తమ తమ ఒంటెల్ని కూడా కోసేసుకుంటే, ఆ తరువాత వారి వద్ద మిగిలి ఉండేదేమిటి?' అని సందేహం వ్యక్త పరిచారు. అప్పుడు దైవప్రవక్త(స), "అలాగైతే (వారు తమ ఒంటెల్ని జిబహ్ చేసే బదులు) తమ దగ్గర మిగిలి ఉన్న ఆహార సామగ్రిని తీసుకుని ఇక్కడకు రమ్మని ప్రకటన గావించండి" అని సూచించారు. (సిపాయిలంతా తమవద్ద మిగిలి ఉన్న భోజన సామగ్రిని తెచ్చి దైవప్రవక్త ముందు సమర్పించారు). ఆయన (స) శుభం కొరకు ప్రార్థించగా, అందులో శుభం, సమృద్ధి జరిగింది. అందరూ తమ తమ కంచాలతో రమ్మని ఆయన(స) పిలుపు ఇచ్చారు. అందరూ తమ పాత్రలను నింపు కున్నారు. అందరి భోజనాలూ అయ్యాక, "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదని, నేను అల్లాహ్ సందేశహరుడనని సాక్ష్యమిస్తున్నాను"[1] అని ఆయన(స) పలికారు.**

## అధ్యాయం : 123

## భోజన సామగ్రిని తమ భుజాలపై ఎత్తుకుని వెళ్ళటం

**316) హజ్రత్ జాబిర్ (రజి) కథనం: మేము (ఒక యుద్ధానికి) బయలు**

315-1. ఈ 'అద్భుతాన్ని' చూసి మహాప్రవక్త(స) స్వయంగా తన దైవదౌత్యంపై తానే సాక్ష్యం పలికారు. అద్భుతం (మౌజీజా) అల్లాహ్ తరఫున జరుగుతుంది. తన ప్రవక్తల సచ్ఛీలతను వ్యక్తపరచడానికి ఆయన వారి చేతుల మీదుగా ఇలాంటి అద్భుతాలు చేయిస్తాడు.

హజ్రత్ ఉమర్(రజి) ఇచ్చిన సలహా కూడా శ్రేయోభిలాషతో కూడుకున్నది. ఒంటెలన్నీ జిబహ్ చేయబడితే, ముస్లింల వద్ద ప్రయాణం చేయడానికి వాహనాలెక్కడుంటాయి? అని ఆయన ఆవేదనతో ప్రశ్నించారు. సమంజసమైన ఈ సలహాను దైవప్రవక్త(స) ఆమోదించారు. తరువాత సిపాయిల వద్ద మిగిలి ఉన్న కొద్దిపాటి భోజన సామగ్రిని సమీకరించి, అందులో శుభం (బరకత్) కొరకు ప్రార్థించారు. అల్లాహ్ అందులో ఎంతో సమృద్ధిని ప్రసాదించాడు. అది సిపాయిలందరికీ సరిపోయింది.

దేరాము. మేము మూడు వందల మందిమి ఉన్నాము. మేము మా చద్ది మూటలను మా భుజాలపైన ఎత్తుకున్నాము. కడకు మా చద్దిమూట (దాదాపు) ఖాళీ అయి పోతుండగా, ఒక్కో వ్యక్తికి రోజూ ఒక్క ఖర్జూరపు పండు మాత్రమే ఇవ్వబడేది. 'ఓ అబూ అబ్దుల్లాహ్ (జాబిర్– రజి)! ఒక్క ఖర్జూరపు పండు ఎలా సరిపోతుంది?' అని ఒక శిష్యుడు ప్రశ్నించగా, "ఆ ఒక్క ఖర్జూరం కూడా లేకుండా పోయినప్పుడు మాకు దాని విలువ ఏమిటో తెలిసి వచ్చింది" అని ఆయన బదులిచ్చారు. ఆ తరువాత మేము సముద్ర తీరానికి చేరుకున్నప్పుడు ఒక భారీ చేప లభ్యమయింది. సముద్రం దానిని బయట పడవేసింది. మేము **18** రోజుల వరకూ దానిని తనివి తీరా భుజిస్తూ ఉన్నాము.[1]

## అధ్యాయం : 124

## స్త్రీ తన సోదరునితోపాటు ఒకే ఒంటెపై స్వారీ అవటం

**317)** హజ్రత్ ఆయిషా (ర.అ) తనతో ఇలా చెప్పారని ఇబ్నె అబీ ములైకా తెలియజేశారు– 'దైవప్రవక్తా! మీ సహచరులు హజ్జ్, ఉమ్రా– రెండూ ఆచరించి తిరిగి వెళుతున్నారు. కాని నేనేమో హజ్జ్ మాత్రమే చేయగలిగాను' అని ఆయిషా (ర.అ) ఆవేదనతో విన్నవించుకోగా దానికి ఆయన(సఅసం), "అలాగైతే వెళ్ళు (ఉమ్రా చేసిరా). నీ సోదరుడు అబ్దుర్రహ్మాన్(రజి) నిన్ను తన వాహనంపై కూర్చో బెట్టుకుంటాడు" అని సెలవిచ్చారు. తరువాత ఆయన(స) అబ్దుర్రహ్మాన్‌కు, 'తన్‌యీమ్' వరకూ వెళ్ళి (ఇహ్రామ్ దీక్షబూని) ఆయిషా(ర.అ)ను ఉమ్రా చేయించు కుని రా అని ఆజ్ఞాపించారు. ఆమె వచ్చే వరకూ దైవప్రవక్త(స) మక్కాలోని మెరక ప్రదేశంలో ఆమె కొరకు నిరీక్షించారు.

---

316–1. బహుశా తిమింగిలం (whale) అయి ఉండవచ్చు. కొన్ని ప్రదేశాలలో అది 80 నుంచి 100 అడుగుల వరకూ పొడవుగా ఉంటుంది. ఇది కూడా దైవ సూచనలలోనిదే. 18 రోజులకు సరిపడా ఆహారం లభించటం కూడా దైవ సహాయమే. మూడువందల మంది సిపాయిలు తమ ఆహారాన్ని తమ భుజాలపైకి మోసుకుని వెళ్ళటం గమనార్హం. అది సౌకర్యాలు లేని కష్టకాలం. సౌలభ్యాలు పుష్కలంగా ఉన్న ఈ ఆధునిక యుగంలో సయితం సిపాయిలు ఒక్కోసారి తమ ఆహారాన్ని తాము మోయక తప్పని పరిస్థితి ఎదురవుతూ ఉంటుంది.

**318)** అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ సిద్దీఖ్(రజి) తెలిపారు: ప్రవక్త మహో దయులు (సఅసం) నన్ను ఈ విధంగా ఆదేశించారు– "నీ వాహనంపై నీ వెనుక ఆయిషా(ర.అ)ను కూర్చోబెట్టుకుని వెళ్ళు. 'తన్‌యీమ్' నుంచి (ఇహ్రామ్ దీక్షబూని) ఉమ్రా చేయించుకుని రా."

## అధ్యాయం : 125

## యుద్ధ ప్రయాణంలో, హజ్జ్ యాత్రలో ఇద్దరేసి వ్యక్తులు ఒక వాహనంపై స్వారీ అవటం

**319)** హజ్రత్ అనస్(రజి) కథనం : నేను అబూ తల్హా (రజి) వాహనంపై ఆయన వెనుక కూర్చుని ఉండగా, ప్రవక్త ప్రియ సహచరులంతా హజ్జ్ మరియు ఉమ్రా– రెండింటి కొరకు లబ్బైక్ నినాదం చేయసాగారు.

## అధ్యాయం : 126

## ఒక గాడిదపై ఇద్దరు వ్యక్తులు స్వారీ అవటం

**320)** మహనీయ ఉసామా బిన్ జైద్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) ఒక గాడిదపై, దాని మెత్తపై కూర్చుని స్వారీ అయ్యారు. ఆ మెత్త (పాలాన్)పై ఒక దుప్పటి పరచబడి ఉంది. ఉసామా (రజి)ను ఆయన(స) తన వెనుక కూర్చోబెట్టుకున్నారు.[1]

**321)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలియజేశారు : మక్కా జయించబడిన సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) మక్కా మెరక ప్రదేశం నుండి తన వాహనంపై స్వారీ అయి వచ్చారు. ఉసామా (రజి)ను ఆయన తన వాహనంపై వెనుక కూర్చోబెట్టుకున్నారు. ఆయన (స) వెంట బిలాల్(రజి), కాబా గృహం తాళం చెవుల రక్షకులైన ఉస్మాన్ బిన్ తల్హా (రజి) కూడా ఉన్నారు. మహాప్రవక్త(స) మస్జిదె హరామ్ ప్రాంగణంలో తన వాహనాన్ని కూర్చోబెట్టి, పవిత్ర కాబా గృహం తాళం చెవులు తీసుకురమ్మని ఉస్మాన్ బిన్ తల్హా (రజి)ను కోరారు. ఆయన కాబా గృహం తలుపులు తెరిచారు. దైవప్రవక్త పవిత్ర కాబా గృహంలోనికి ప్రవేశించారు. ఆయన (స) వెంట బిలాల్, ఉస్మాన్ కూడా ఉన్నారు. ఆయన(స) చాలా సేపు లోపలే ఉన్నారు. చివరకు ఆయన (స) వెలుపలికి రాగానే (లోనికి వెళ్ళేందుకు) జనులు

320–1. ఒక గాడిదపై ఇద్దరు వ్యక్తులు కూర్చోగలరని దీని ద్వారా విదితమవుతోంది. కాకపోతే, ఆ గాడిద బలిష్టమైనదై ఉండాలి.

పరస్పరం పోటీపడ్డారు. అందరికంటే ముందు లోనికి వెళ్ళే అవకాశం అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కి దక్కింది. ఆ సమయంలో ఆయన బిలాల్(రజి)ను తలుపు వెనకాల నిలబడి ఉండటం గమనించి, దైవప్రవక్త(స) ఎక్కడ నమాజ్ చేశారు? అని అడిగారు. దైవప్రవక్త(స) నమాజ్ చేసిన స్థలాన్ని బిలాల్(రజి) చూపించారు. 'ఎన్ని రకతుల నమాజ్ చేశారు?' అనే విషయం అడగటం మరచిపోయాను' అని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పారు.[1]

## అధ్యాయం : 127

## రికాబు పట్టుకుని ఎవరినయినా వాహనంపై కూర్చోబెట్టినందుకు లేదా అలాంటిదే మరేదైనా సహాయం చేసినందుకు లభించే పుణ్యం

**322)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ప్రబోధించారని మహనీయ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : పొద్దుపొడిచే ప్రతి దినమునా మనిషికున్న ప్రతి కీలుకు ఒక్కో సదకా (దానం) అనివార్యమవుతుంది. అతను ఇద్దరు వ్యక్తుల మధ్య న్యాయం చేస్తే అదీ ఒక సదకాయే. ఎవరికయినా వాహనం విషయంలో సహాయం గనక చేస్తే (వాహనంపై కూర్చోపెడితే) లేదా అతని సామానును తెచ్చి వాహనంపై పెడితే అది కూడా ఒక సదకాయే. ఒక మంచి మాటను పలకటం కూడా సదకాయే. నమాజ్ కొరకు వేయబడే ఒక్కో అడుగు ఒక సదకా అవుతుంది. ఒకవేళ దారిలో పడివున్న ఏదయినా బాధాకరమైన వస్తువును తొలగిస్తే అది కూడా ఒక సదకాయే."

## అధ్యాయం : 128

## ఖుర్ఆన్ వ్రాత ప్రతిని తీసుకుని శత్రు రాజ్యంలోనికి వెళ్ళరాదు

**ముహమ్మద్ బిన్ బిష్ర్‌చే ఇలాగే ఉల్లేఖించబడింది.... ఇబ్నె ఉమర్(రజి) ఇలా తెలిపారు : ప్రవక్త ముహమ్మద్(సఅసమ్), ఆయన ప్రియసహచరులు (రజిఅల్లాహు**

---

321-1. దైవప్రవక్త(స) తన ఒంటెపై తన వెనుక ఉసామా (రజి)ను కూర్చోబెట్టుకున్నారనేది ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును వివిధ ప్రకరణాల్లో పునరావృతం చేసి, సందర్భోచితంగా పలు ధార్మిక పరమార్థాలను సంగ్రహించారు. ఎంతైనా ఇమామ్ బుఖారీ (రహ్మ) తిరుగులేని, శాసనాన్వయకర్త. షరీఅత్ సూత్రాలను వివిధ సమస్యలకు అన్వయింపజేయటంలో ఆయన సాటిలేని మేటి, గొప్ప ముజ్తహిద్.

**అన్హుమ్) శత్రు రాజ్యంలో పర్యటించారు. మరి చూడబోతే వారంతా ఖుర్ఆన్ బోధకులే.**[1]

**323) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం) శత్రువుల ప్రదేశంలో దివ్య ఖుర్ఆన్ తీసుకువెళ్ళటాన్ని వారించారు.**[1]

## అధ్యాయం : 129

## యుద్ధ సమయంలో బిగ్గరగా తక్బీర్ పలకటం

**324) మహనీయ అనస్(రజి) కథనం: తెలతెలవారుతుండగా ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఖైబర్కు చేరుకున్నారు. అప్పటికే స్థానికులు (ఖైబర్లోని యూదులు) గడ్డపారలు తమ భుజాలపై పెట్టుకుని బయలుదేరారు. వారు దైవప్రవక్త(స)ను చూడగానే, "ముహమ్మద్(స)సైనికుల సమేతంగా వచ్చారహో" అని అరవటం మొదలెట్టారు. అలా అరుస్తూనే వారు తమ కోటవైపు పరుగులు తీసి, అందులో శరణు పొందారు. అప్పుడు దైవప్రవక్త(స) తన రెండు చేతులెత్తి, "అల్లాహు అక్బర్!" అని నినదించారు.[1] ఇంకా ఇలా సెలవిచ్చారు: "ఖైబర్కు మూడింది. మేము ఏ జాతి ముంగిట అయినా వాలామంటే, హెచ్చరిక చేయబడిన ప్రజల ఉదయం చెడ్డదై ఉంటుంది." అనస్(రజి) ఇలా వివరించారు: 'మాకు గాడిదలు చేజిక్కాయి. మేము వాటిని జిబహ్ చేసి వండటం మొదలెట్టాము. అంతలో దైవప్రవక్త(స) తరఫున ప్రకటన గావించేవారొకరు, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స) మిమ్మల్ని గాడిద మాంసం (తినటం) నుండి వారించారు అని ప్రకటిం**

---

128-1. ఖుర్ఆన్ వ్రాత ప్రతి విషయం వేరు, ఖుర్ఆన్ సంస్మర్త (హాఫిజె ఖుర్ఆన్) సంగతి వేరు. ఖుర్ఆన్ సంస్మర్త శత్రు రాజ్యంలోనికి వెళ్ళటాన్ని ఎవరూ వారించలేదు. వ్రాత ప్రతిని తీసుకుని శత్రు రాజ్యంలోనికి వెళ్ళకూడదన్నదే ఈ అధ్యాయం ఉద్దేశం. ఖుర్ఆన్ సంస్మర్తల విషయానికి వస్తే అనుక్షణం దివ్య ఖుర్ఆన్ వారి మనోమస్తిష్కాలలో పదిలమై ఉంటుంది.

323-1. అంటే అవిశ్వాసులైన శత్రువుల రాజ్యంలోనికి దివ్య ఖుర్ఆన్ వ్రాత ప్రతి (లేక ముద్రిత ప్రతి)ని తీసుకెళ్ళటాన్ని వారించారు. ఎందుకంటే శత్రువు దానిపట్ల అమర్యాదగా వ్యవహరించే ప్రమాదం ఉంది.

324-1. దైవప్రవక్త(స) ఖైబర్లో ప్రవేశించగానే బిగ్గరగా తక్బీర్ పలికారన్నదే అధ్యాయంలో ప్రధానాంశం.

చారు. అంతే, కుండలలో ఉన్నదంతా క్రింద పారబోయటం జరిగింది. అబ్దుల్లాహ్ బిన్ ముహమ్మద్‌తోపాటు అలీ బిన్ మదీనీ కూడా ఈ హదీసును సుఫ్యాన్ నుండి ఉటంకించారు. అందులో కూడా, ఆయన(స) తన రెండు చేతుల్ని ఎత్తారని ఉంది.

## అధ్యాయం : 130

## మరీ బిగ్గరగా అరుస్తూ తక్బీర్ పలకరాదు

**325)** మహనీయ అబూ మూసా అష్అరీ (రజి) తెలిపారు: మేము ఒక ప్రయాణంలో ప్రవక్త మహనీయుల(సఅసం) వెంట ఉన్నాము. మేము ఏదయినా లోయలోకి వెళ్ళినప్పుడు 'లా ఇలాహ ఇల్లల్లాహ్', 'అల్లాహు అక్బర్' అని బిగ్గరగా నినదించేవాళ్ళం. దాంతో పరిసరాలన్నీ ప్రతిధ్వనించేవి. అందుచేత దైవప్రవక్త(స), "ప్రజలారా! మీరు మీ ఆత్మలపై దయదలచండి. ఎందుకంటే మీరు మొరపెట్టుకునేది ఏ చెవిటివాడినో, కనిపించని వాడినో కాదు. ఆయనైతే మీతోపాటే ఉన్నాడు. నిశ్చయంగా ఆయన వినేవాడు, మీకు చాలా సమీపంలో ఉన్నవాడు"[1] అన్నారు.

## అధ్యాయం : 131

## పల్లపు ప్రాంతంలో ప్రవేశిస్తున్నప్పుడు 'సుబ్‌హానల్లాహ్' అనాలి

**326)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తెలిపారు : మేము ఏదైనా (ఎత్తయిన) చోటికి ఎక్కినప్పుడు 'అల్లాహు అక్బర్' అని పలికేవారం. ఏదయినా (పల్లపు) ప్రదేశంలోనికి దిగుతున్నప్పుడు 'సుబ్‌హానల్లాహ్' అని పలికేవారం.

## అధ్యాయం : 132

## ఎత్తయిన ప్రదేశం పైకెక్కినప్పుడు 'అల్లాహు అక్బర్' పలకాలి

**327)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలియజేశారు: "మేము ఎత్తయిన

---

325-1. ఖుస్తులానీ గారు తబ్రీ నుండి నకలు చేసిన దాని ప్రకారం ఈ హదీసులో మరీ బిగ్గరగా దైవనామస్మరణ చేయటం పట్ల అయిష్టత వ్యక్తపరచబడింది. ప్రముఖ సహాబా, తాబయీల ద్వారా కూడా ఇదే విషయం చెప్పబడింది. ఇక నేనేమంటానంటే, మనం సున్నత్‌ను అనుసరించాలి. దైవప్రవక్త(స) బిగ్గరగా పలకమన్నచోట బిగ్గరగా పలకాలి. ఉదాహరణకు– అజాన్ పిలుపు. ఇతర చోట్ల కాస్త నెమ్మదిగా పలకటం మంచిది. మరి కొంతమంది అభిప్రాయం ప్రకారం, మన నినాదాలు ప్రజలకు ఇబ్బందికరంగా ఉండకూడదు. సమయోచితంగా మసలుకోవాలి. (వహీదుజ్జమా)

**ప్రదేశంపైకి ఎక్కినప్పుడు 'అల్లాహు అక్బర్' అని పలికేవారం. పల్లపు ప్రదేశంలోనికి దిగినప్పుడు 'సుబ్‌హానల్లాహ్' అనేవారం.**

**328) సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ కథనం ప్రకారం అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇలా వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) హజ్జ్ లేదా ఉమ్రా నుండి తిరిగి వస్తున్నప్పుడు- ఆయన(స) జిహాద్ నుండి వాపసు అవుతున్నప్పుడు అని చెప్పారనుకుంటాను- ఆయన మెరక ప్రదేశానికి ఎక్కినప్పుడు లేదా (పల్లపు ప్రదేశం నుండి) కంకరరాళ్ళు ఉన్న ప్రాంతానికి చేరుకున్నప్పుడు మూడుసార్లు 'అల్లాహు అక్బర్' అని పలికేవారు. ఇంకా ఇలా అనేవారు: "లా ఇలాహ ఇల్లల్లాహు, వహ్‌దహూ లా షరీకలహు, లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు, వహువ అలా కుల్లి షయ్ఇన్ ఖదీర్, ఆయిబూన, తాయిబూన, ఆబిదూన సాజిదూన లి రబ్బినా హామిదూన, సదఖల్లాహు వాదహూ వ హజమల్ అహ్‌జాబ వహ్‌దహూ" – అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదు. ఆయన ఒకే ఒక్కడు, ఆయనకు ఎవరూ సాటిలేరు. రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయనకే శోభాయమానం. ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు. మేము మరలి వస్తున్నాము- పశ్చాత్తాపపడుతూ! ఆరాధన చేస్తూ!! మా ప్రభువు సన్నిధిలో ప్రణమిల్లుతూ!!! ఆయన్ని స్తుతిస్తూ!!!! అల్లాహ్ తన వాగ్దానాన్ని నిజం చేసి చూపించాడు.[1] తన దాసునికి (మహనీయ ముహమ్మద్-స)కి తోడ్పడ్డాడు. తానొక్కడే (అవిశ్వాసుల) సైనిక కూటములన్నింటినీ ఓడించాడు"-సాలెహ్ ఇలా అంటున్నారు: అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)గారు 'ఆయిబూన' అనే పదం తరువాత 'ఇన్‌షాఅల్లాహ్' అని పలకలేదా?' అని నేను సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్‌ను అడిగితే, 'లేదు'[2] అని ఆయన చెప్పారు.**

---

328-1. 'అల్లాహ్ తన వాగ్దానాన్ని నిజం చేసి చూపాడు' అనే మాటను దైవప్రవక్త(స) కందక యుద్ధం సందర్భంగా పలికారు. అంతిమ హజ్జ్ యాత్ర నుండి తిరిగి వస్తున్నప్పుడు కూడా ఆయన(స) అధరాలు అల్లాహ్ పట్ల కృతజ్ఞతా భావంతో ఇలా పలికాయి. ఎందుకంటే దైవ సహాయం లేకుండా ఇట్టి సంపూర్ణ విజయం వరించటం అసంభవం.

328-2. 'ఇన్‌షాఅల్లాహ్' (దైవచిత్తమయితే) అనే పదం భవిష్యత్తుతో ముడివడి ఉంది గాని గత కాలంతో కాదు. అందుకే మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) 'ఇన్‌షా అల్లాహ్' అని పలకలేదు.

## అధ్యాయం : 133

## ప్రయాణీకుడు తన ఇంటి వద్ద చేసుకునే ఆరాధనలు ప్రయాణావస్థలో చేసుకోలేకపోయినప్పటికీ పుణ్యం ప్రాప్తించటం.

**329) అబూ బుర్దా బిన్ అబీ మూసా కథనం : ఈయన మరియు యజీద్ బిన్ అబీ కబ్షా ఒక ప్రయాణంలో తోడుగా ఉన్నారు. యజీద్ ప్రయాణావస్థలో కూడా ఉపవాసం ఉండేవారు. అబూ బుర్దా ఇలా అంటున్నారు– నేను నా తండ్రి ఎన్నోమార్లు చెప్పగా విన్నాను. దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రవచించేవారని ఆయన చెబుతుండేవారు : "దాసుడు వ్యాధిగ్రస్తుడైనప్పుడు లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు, అతనికి అతను ఆరోగ్యంగా ఉన్నప్పుడు లేదా ఇంటి వద్ద ఉన్నప్పుడు చేసుకునే ఆరాధనలకు లభించినంత పుణ్యం లభిస్తుంది."** [1]

## అధ్యాయం : 134

## ఒంటరిగా ప్రయాణించటం[1]

**330) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) చెబుతుండేవారు :కందక యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) తన సహచరులను పిలిచినప్పుడు, జుబైర్ (రజి) 'చిత్తం. హాజరయ్యాను' అని బదులిచ్చారు. రెండవసారి ఆయన(స) తన సహాబాను పిలిచినప్పుడు, ఈసారి కూడా 'నేను హాజరయ్యాను' అంటూ జుబైర్ (రజి) సమాధానమిచ్చారు. ఆయన(స) ఇంకొకసారి పిలిస్తే అప్పుడు కూడా**

---

329–1. ఇక్కడ ప్రయాణీకుడు అంటే, యుద్ధ ప్రయాణంలో ఉన్న వ్యక్తి అని గ్రహించాలి. ఇకపోతే, సజ్జనుడైన ప్రతి ప్రయాణీకుడు ప్రయాణావస్థలో స్వచ్ఛంద (నఫిల్) ఆరాధనలు చేయలేడు. జబ్బు చేసిన వ్యక్తి కూడా అంతే. ఈ స్థితిలో వారు నఫిల్ ఆరాధనలు చేయలేకపోయినప్పటికీ– సాధారణ పరిస్థితుల్లో వారి ఆచరణ ఎలా ఉండేదో దాని ప్రకారం సత్కార్యాల మంచి ప్రతిఫలం వారికి లభిస్తూ ఉంటుంది. ఇది అల్లాహ్ తరఫున సదాచార సంపన్నులకు లభించిన ప్రత్యేక వెసులుబాటు.

134–1. చాలామంది విద్వాంసులు దీనిని అవాంఛనీయం (మక్రూహ్)గా ఖరారు చేశారు. ఎందుకంటే ఒంటరి ప్రయాణీకుడు షైతాన్. అప్పుడు ఇద్దరు షైతానులవుతారు. ముగ్గురుంటే అది 'జమాఅత్' అవుతుంది. ఇమామ్ బుఖారీ ఈ అధ్యాయాన్ని ఇక్కడ పొందుపరచటంలోని ఉద్దేశం ఏమిటంటే, తప్పనిసరి పరిస్థితుల్లో, ఉదాహరణకు– గూఢచర్యం వంటి పనుల నిమిత్తం ఒంటరిగా వెళ్ళవచ్చు.

**జుబైర్(రజి) 'చిత్తం. సెలవీయండి ' అని బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స), " ప్రతి ప్రవక్తకు 'హవారీ'లుంటారు. నా హవారీ జుబైర్" అని పలికారు- హవారీ అంటే 'సహాయకుడు' అని సుఫ్యాన్ చెప్పారు (విశ్వాసపాత్రుడు లేదా ఆంతరంగికుణ్ణి కూడా హవారీగా వ్యవహరిస్తారు).[1]**

**331) అబుల్ వలీద్ మాకు తెలియజేశారు... ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రవచించారని ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖించారు.**

రెండవ సనదు

**332) అబూ సుఐమ్ మాకు తెలిపారు... ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు: "నాకు తెలిసినంతగా ప్రజలకు గనక ఒంటరిగా ప్రయాణించటం (లోని చెడుగు) గురించి తెలిసి ఉంటే, రాత్రి పూట ఎవ్వరూ ఒంటరిగా ప్రయాణం చేయరు."**

## అధ్యాయం : 135

## ప్రయాణంలో వేగంగా నడవటం

**అబూ హుమైద్ సాయిదీ కథనం ప్రకారం (ఒక ప్రయాణంలో) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా పలికారు: "నేను తొందరగా మదీనా చేరాలనుకుంటు న్నాను. అందువలన వేగంగా నడవగోరే వారు నా వెంట రావచ్చు." మదీనా జనాభా తనకు కనిపించినప్పుడు ఆయన(స) ఈ విధంగా శీఘ్రుతను కనబరిచేవారు.**

**333) తన తండ్రి తనకు తెలియజేశారని హిషామ్ చెప్పారు: దైవప్రవక్త (సఅసం) అంతిమ హజ్జ్ యాత్ర సందర్భంగా ఏ ఏ విధంగా నడిచేవారు? అని ఉసామా బిన్ జైద్(రజి)ను అడగటం జరిగింది. దానికి ఉసామా (రజి), "ఆయన**

---

330-1. దైవప్రవక్త హజ్రత్ ఈసా(అలైహిస్సలాం)ను నమ్మేవారిని 'హవారీ'లంటారని, ఎందుకంటే వారు శ్వేతాంబరులై ఉంటారని కొందరు అభిప్రాయపడ్డారు. ఖిలాఫత్ బాధ్యతలకు అర్హులైన వారిని లేదా మంత్రిని హవారీ అంటారని ఖతాదా చెప్పారు. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ అధ్యాయాన్ని ఇక్కడ తీసుకురావటంలోని ఉద్దేశం ఏమంటే, హజ్రత్ జుబైర్(రజి) శత్రు సమాచారాన్ని తీసుకురావటానికి ఒంటరిగా వెళ్ళారు. కందక యుద్ధం సందర్భంగా జరిగిన సంఘటన ఇది. ఈ యుద్ధాన్ని అహ్జాబ్ యుద్ధం అని కూడా అంటారు. దివ్య ఖుర్ఆన్‌లోని అహ్జాబ్ సూరాలో ఇది వివరంగా వచ్చింది.

(స) కొంత వేగంగా నడిచేవారు. దారి విశాలంగా ఉంటే వాహనాన్ని దౌడు తీయించేవారు..” అని చెప్పారు.

**334)** జైద్ బిన్ అస్లమ్ తన తండ్రి నుండి ఉటంకించారు. ఈయన తండ్రి ఇలా అన్నారు- నేను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)తోపాటు మక్కా మార్గంలో ఉన్నాను. ఇంతలో ఆయనకు (ఆయన భార్య) సఫియ్యా బిన్తె ఉబైద్(రజి.అన్హా) తీవ్ర అస్వస్థతకు గురైందన్న సమాచారం అందింది. దాంతో ఆయన వేగంగా ప్రయాణం సాగించారు. (సూర్యాస్తమయం అయి) అరుణిమ కూడా తొలగిపోయాక వాహనం నుంచి దిగి, మగ్రిబ్ ఇషా నమాజులు రెండూ కలిపి ఆచరించారు. నమాజ్ అనంతరం ఆయన ఇలా అన్నారు: “నేను దైవప్రవక్త(స)ను గమనించాను. ఆయన(స) శీఘ్రంగా ప్రయాణం చేయదలచినప్పుడు మగ్రిబ్‌లో కాస్త ఆలస్యం చేసి, రెండు నమాజుల్ని (మగ్రిబ్, ఇషా నమాజులను) ఒకేసారి చేసేవారు.”

**335)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: “ప్రయాణం (కూడా) యాతనలో ఒక భాగమే. అది మనిషి నిద్రకు అంతరాయం కలిగించడంతోపాటు అన్నపానీయాల విషయంలో కూడా అవరోధంగా మారుతుంది. అందుచేత ప్రయాణీకుడు తన పని కాగానే వీలైనంత తొందరగా ఇంటికి తిరిగి వచ్చేయాలి.”

## అధ్యాయం : 136

## దైవమార్గంలో వాహనంగా గుర్రాన్ని ఇచ్చి, పిదప అది అమ్మబడుతూ ఉండగా చూస్తే...

**336)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) దైవ మార్గంలో ఒక గుర్రాన్ని వాహనంగా ఇచ్చారు. తరువాత అదే గుర్రం విక్రయించ బడుతూ ఉండగా ఆయన చూసి, దానిని కొనుగోలు చేయాలనుకున్నారు. కాని ఆ మేరకు ఆయన దైవప్రవక్త(సఅసం) ఆనతి కోరగా, “ఇప్పుడు నీవు దానిని కొని, నీ దానాన్ని మళ్ళించుకోకు” అని ఆయన(స) చెప్పారు.[1]

336-1. తన వస్తువు ఏదయినా సరే దైవమార్గంలో దానంగా ఇచ్చిన మీదట మూల్యం చెల్లించి అయినా సరే దానిని తిరిగి తీసుకోరాదు. హదీసులో చెప్పబడిన దాని ప్రకారం ఇలా చేయటం ధర్మసమ్మతం కాదు.

**337)** తన తండ్రి తనతో ఈ విధంగా చెప్పినట్లు జైద్ బిన్ అస్లమ్ తెలియ జేశారు: ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) చెప్పగా నేను విన్నాను. ఆయన(రజి) ఇలా చెప్పారు– 'నేను దైవమార్గంలో ఒక గుర్రాన్ని దానంగా ఇచ్చాను. నేనెవరికి ఆ గుర్రాన్ని ఇచ్చానో, ఆ వ్యక్తి దానిని అమ్మకానికి పెట్టాడు. లేదా (ఆయన ఇలా అన్నారు) అతను దానిని బక్కచిక్కిపోయేలా చేశాడు. అందువల్ల నేను దానిని కొనుగోలు చేయాలని సంకల్పించుకున్నాను. ఆ వ్యక్తి దానిని చాలా చవుకగా అమ్మే స్తాడని నేను భావించాను. నేను ఈ విషయమై దైవప్రవక్త(స)ను సంప్రతించగా, ఆయన(స) ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ ఆ గుర్రం నీకు ఒక్క దిర్హమ్‌కు లభించినా సరే దానిని కొనవద్దు, ఎందుకంటే, తాను చేసిన దానాన్ని తిరిగి తీసేసుకునేవాని ఉపమానం తాను కక్కిన దానిని తానే నాకే కుక్క లాంటిది."

## అధ్యాయం : 137

## తల్లిదండ్రుల అనుమతితో జిహాద్‌కు వెళ్ళాలి.[1]

**338)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పగా తాను విన్నానని అబుల్ అబ్బాస్ తెలిపారు. ఆయన(ఇబ్నె ఉమర్) చెబుతుండేవారు: ఒక వ్యక్తి దైవ ప్రవక్త(సఅసమ్) సన్నిధిలో హాజరై జిహాద్ (ధర్మయుద్ధం)లో పాల్గొనేందుకు తనకు ఆనతి వొసగమని అభ్యర్థించాడు. దానికాయన(స), "నీ తల్లిదండ్రులు జీవించి ఉన్నారా?" అని ప్రశ్నించారు. 'అవున'ని అతను బదులిచ్చాడు. "అలాగైతే వారిలోనే జిహాద్ చెయ్యి (అంటే వారిని సంతోషపరచేందుకు యత్నించు)"[1] అని ఆయన(స) బోధించారు.

---

137–1. తల్లిదండ్రులకు విధేయత చూపటం, వారి యెడల సద్భావంతో మెలగటం ఫర్జె ఐన్ (విధ్యుక్త ధర్మం). కాగా; జిహాద్ 'ఫర్జె కిఫాయ'. అంటే సమాజంలోని కొందరు దానిని నిర్వర్తించినా సరిపోతుంది. అందుచేత అత్యధిక మంది విద్వాంసులేమంటారంటే; తల్లిదండ్రులు గనక ముసలివారై ఉండి, కుమారుణ్ణి జిహాద్‌కు వెళ్ళేందుకు ఆనతి ఇవ్వకపోతే, అట్టి పరిస్థితిలో జిహాద్‌కు వెళ్ళటం అతనికి నిషిద్ధం (హరామ్). ఒకవేళ జిహాద్ 'ఫర్జె ఐన్'గా అయినప్పుడు, తల్లిదండ్రుల ఆనతి పొందనవసరం లేదు.

338–1. అంటే, వారి సేవ చెయ్యి, అదే నీ జిహాద్. ధర్మయుద్ధంలో పాల్గొనటంకన్నా తల్లిదండ్రుల సేవ మిన్న. హజ్రత్ అవేస్ ఖర్నీ(రజి) తల్లి వృద్ధురాలనీ, ఈయన ఆమె సేవలో నిమ గ్నులై ఉండేవారని అనబడుతోంది.

## అధ్యాయం : 138

## ఒంటెల మెడలలో శబ్దం వచ్చే గంటల్లాంటివి కట్టడం[1]

**339)** అబూ బషీర్(రజి) అన్సారీ ఒకానొక ప్రయాణంలో దైవప్రవక్త (సఅసమ్) వెంట ఉన్నారు. (హదీసు ఉల్లేఖకులైన) అబ్దుల్లాహ్ బిన్ అబీబకర్ ఇలా అన్నారు: నా ఉద్దేశంలో అబూ బషీర్ ఇలా అన్నారు– జనులు తమ తమ శయనాగారాల్లో ఉండగా ప్రవక్త మహనీయులు(స) తన దూత ఒకరి (జైద్ బిన్ హారిసా) చేత ఈ విధంగా ప్రకటన చేయించారు: "ఏ వ్యక్తికి చెందిన ఒంటె మెడలో తాయెత్తు పాశం ఉందో, (లేదా ఇలా చెప్పారు) పాశం ఉందో దానిని కోసివేయాలి."[1]

## అధ్యాయం : 139

## ఎవరైనా తమ పేరును సైనికుల జాబితాలో రాయించాక, అతని భార్య హజ్జ్ యాత్రకు బయలుదేరితే లేదా మరేదైనా కారణం ఎదురైతే అట్టి పరిస్థితిలో అతనికి (యుద్ధానికి వెళ్ళకుండా ఉండేందుకు) అనుమతి ఇవ్వవచ్చునా?

**340)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్)చెప్పగా తాను విన్నానని మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలియజేశారు: "ఏ పురుషుడూ (మహ్రమ్‌కాని) పరాయి స్త్రీతో కలసి ఏకాంతంలో కూర్చోరాదు. (అలాగే) ఏ స్త్రీ కూడా తన వెంట మహ్రమ్ పురుషుడు[1] లేనంతవరకూ ప్రయాణం చేయరాదు". ఈ పలుకులు వినగానే ఒక సహచరుడు లేచి నిలబడి, 'దైవప్రవక్తా! నేను ఫలానా యుద్ధ ప్రయాణానికి వెళ్ళేందుకు నా పేరు రాయించాను. కాని ఇటు నా భార్య

---

138–1. చాలామంది విద్వాంసులు దీనిని మక్రూహ్(అవాంఛనీయం)గా ఖరారు చేశారు. వేరొక హదీసు ప్రకారం; గంట ఉన్న సహచరుల మధ్యన దైవదూతలు ఉండరు.

339–1. బహుశా అది యుద్ధ ప్రయాణం అయి ఉండవచ్చు. ఒంటెల మెడలలో ఉన్న గంటలు గణగణమని మ్రోగుతున్నట్లయితే శత్రువు తమ కదలికలను తొందరగా పసిగట్టగలడు. ఈ ఉద్దేశంతోనే ఆ పాశాలను తొలగించమని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించి ఉండవచ్చు.

340–1. 'మహ్రమ్' అంటే ఒక స్త్రీతో శాశ్వతంగా వైవాహిక సంబంధానికి నిషేధించబడిన పురుషుడు అని అర్థం.

**హజ్జ్ యాత్రకు సిద్ధమయింది' అని విన్నవించుకున్నారు. ఇది విని, "అలాగైతే నువ్వు వెళ్ళి నీ భార్యతోపాటే హజ్జ్ చెయ్యి"[2] అని దైవప్రవక్త(స) ఆదేశించారు.**

## అధ్యాయం : 140

## గూఢచర్యం గురించి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **"విశ్వసించిన ఓ ప్రజలారా! నాకూ మీకూ శత్రువులైన వారితో స్నేహం చేయకండి."[1]** *(అల్ ముమ్తహినహ్ : 1)*

**341) మహనీయ అలీ(రజి) ద్వారా తాను విన్నానని ఉబైదుల్లాహ్ బిన్ అబీ రాఫె తెలియజేశారు. అలీ (రజి) ఇలా చెప్పేవారు: దైవప్రవక్త(సఅసం) నన్ను, జుబైర్‌ను, మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి అల్లాహు అన్‌హుమ్)ను ఒక ప్రత్యేకమైన పనిపై పంపిస్తూ, "బయలుదేరండి. మీరు 'రౌజె ఖాఖ్' (అది మదీనాకు 12 మైళ్ళ దూరాన ఉన్న ఊరు)కు చేరుకోగానే, అక్కడ ఒక వృద్ధురాలు మీకు కనిపిస్తుంది. ఆమె ఒంటెపై స్వారీ అయి ఉంటుంది. ఆమె దగ్గర ఒక ఉత్తరం ఉంటుంది. దానిని మీరు తీసేసుకోవాలి" అని సూచించారు. మేము బయలుదేరాము. మా గుర్రాలను వేగంగా పోనిచ్చాము. మేము 'రౌజెఖాఖ్'కు చేరుకోగానే, ఒక వృద్ధ మహిళ ఒంటెపై పోతూ కనిపించింది. 'నీ దగ్గర ఉన్న ఉత్తరాన్ని ఇటివ్వు' అని మేము ఆమెతో అన్నాము. 'నా దగ్గర ఉత్తరమేదీ లేదే!' అని ఆమె అంది. 'నీవు మర్యాదగా ఉత్తరం ఇస్తే సరి. లేకుంటే మేము నిన్ను వివస్త్రను చేసి సోదా చేయాల్సి ఉంటుంద'ని**

---

340-2. ఎందుకంటే, ఆ స్త్రీతోపాటు మరో పురుషుడు హజ్జ్‌కు వెళ్ళలేడు. అయితే ఆ పురుషుని స్థానంలో మరో పురుషుడు ధర్మయుద్ధానికి వెళ్ళగలడు. ఇకపోతే, స్థితిమంతురాలైన ఒక మహిళ తన డబ్బుతో హజ్జ్ చేయగలదు. కాని ఆమె వెంట భర్త గానీ, లేదా ఎవరయినా ఒక మహ్రమ్ పురుషుడు గానీ ఉండటం అవసరం.

140-1. అంటే సత్య తిరస్కారుల తరపున గూఢచర్యం చేయటం పట్ల వారించటం జరిగింది. ఉదాహరణకు– ముస్లింలు దండెత్తి వస్తున్నారని హాతిబ్ బహు దైవారాధకులకు రహస్య సమాచారం అందించినట్లుగా. అయితే ముస్లింల తరపున గూఢచారిగా పని చేయటం సరైనదే. దైవప్రవక్త(స) ఒక వ్యక్తిని గూఢచారిగా చేసి పంపి ఉన్నారు. ఇకపోతే గూఢచర్యం రణనీతిలో భాగమే. ముమ్తహినహ్ సూరాలోని పై ఆయత్ ఆధారంగా ఇమామ్ బుఖారీ(రహ్మ), అవిశ్వాసుల తరపున గూఢచర్యం జరపడం నిషిద్ధమన్న విషయాన్ని సంగ్రహించారు.

**బెదిరించగానే, ఆమె తన జడ కొప్పులో నుంచి ఉత్తరాన్ని తీసి ఇచ్చింది. మేము ఆ ఉత్తరాన్ని తీసుకుని దైవప్రవక్త(స) సమక్షంలో హాజరయ్యాము. ఆ ఉత్తరంలో ఇలా వ్రాసి ఉంది: 'హాతిబ్ బిన్ అబీ బత్‌లా తరఫున మక్కాలోని కొందరు ముష్రిక్కులకు వ్రాయునదేమనగా...' ఆ ఉత్తరంలో దైవప్రవక్త(స)కు సంబంధించిన కొంత రహస్య సమాచారం ఉంది.[1] (హాతిబ్‌ను పిలిపించి) "ఓ హాతిబ్! ఎందుకు చేశావ్ ఈ పని?" అని దైవప్రవక్త(స) నిలదీసి అడిగితే, ఆయన ఇలా విన్నవించుకున్నారు: 'దైవప్రవక్తా! నా వ్యవహారంలో తొందరపడి చర్య గైకొనకండి. (మక్కా నగరంలో) నా పరిస్థితి ఎలాంటిదంటే, నేను ఖురైషులతో సహజీవనం సాగించేవాణ్ణి. వారితో నాకెట్టి బంధుత్వ సంబంధం లేదు. మీ వెంట ఉన్న ముహాజిర్లందరికీ మక్కా వారితో ఏదో ఒక విధంగా బంధుత్వ సంబంధం ఉంది. ఈ కారణంగా మక్కా వారు వారి బంధువుల్ని, వారి ఆస్తిపాస్తుల్ని కనిపెట్టుకుని ఉంటారు. వారిని ఆదుకుంటారు. కాని నా సంగతి వేరు. మక్కా వారితో నాకెలాంటి బంధుత్వం లేదు. అందుచేత, నేను వారికేదైనా ఉపకారం చేస్తే, ప్రత్యుపకారంగా వారు నా వాళ్ళను రక్షిస్తారని భావించాను. తిరస్కార భావం (కుఫ్ర్) వల్లనో, ధర్మభ్రష్టత (ఇర్తెదాద్) కారణంగానో నేను ఈ చేష్టకు ఒడిగట్టలేదు. ఇస్లాం స్వీకారం తర్వాత అవిశ్వాసం (కుఫ్ర్) పట్ల మక్కువతో కూడా ఈ పని చేయలేదు'. దైవ ప్రవక్త(స) ఇదంతా విని "హాతిబ్ నిజం చెప్పాడ"ని అన్నారు. అక్కడున్న ఉమర్ (రజి), 'దైవప్రవక్తా! తమరు ఆనతినిస్తే ఈ నయ వంచకునికి శిరచ్ఛేదనం చేస్తాన'ని అన్నారు.[2] "వద్దు. ఈయన బద్ర్ యుద్ధంలో (ముస్లింలతో కలసి) పోరాడిన యోధుడు. నీకు తెలియదు. అల్లాహ్‌కు బద్ర్ యోధుల స్థితిగతుల గురించి ముందు నుంచే తెలుసు. "మీరేం చేసినా నేను మిమ్మల్ని క్షమించాన"ని ఆయన స్వయంగా సెలవిచ్చాడు- 'ఈ హదీసు సనదు కూడా ఎంత మంచిది!' అని సుఫ్యాన్ బిన్ ఉయైనా అభిప్రాయపడ్డారు.**

---

341-1. "అమ్మాబాద్. ఖురైషు ప్రజలారా! దైవప్రవక్త(స) ఒక బలోపేతమైన సైన్యంతో మీపైన దండెత్తి వస్తున్నారు. ఒకవేళ ఆయన(స) ఒంటరిగా వచ్చినాసరే అల్లాహ్ ఆయనకు తోడ్పడతాడు, తన వాగ్దానాన్ని నెరవేరుస్తాడు. ఇక మీరు ఆత్మరక్షణ చేసుకోండి- వస్సలామ్" అన్నది ఆ ఉత్తరంలోని ముఖ్యాంశం.

341-2. 'శిరచ్ఛేదనం' అంటూ హ్రజత్ ఉమర్(రజి) షరీఅత్ శాసనం, రాజకీయ చట్టం ప్రకారం తన అభిప్రాయం తెలిపారు. అంటే ఎవరయినా తన జాతికి, తన రాజ్యానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేస్తే అతడు మరణ దండనకు పాత్రుడు.

## అధ్యాయం : 141

## ఖైదీలకు వస్త్రాలు సమకూర్చటం

**342)** మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం: బద్ర్ యుద్ధా నంతరం (మక్కా ముష్రిక్కులు) బందీలుగా తేబడ్డారు. వారిలో హజ్రత్ అబ్బాస్(రజి) కూడా ఉన్నారు. ఆయన ఒంటిపై నూలుపోగు ఏదీలేదు. దైవప్రవక్త(సఅసమ్) ఆయన కొరకు చొక్కా వెతికారు (ఆయన చాలా పొడుగరి). అందుచేత (మునాఫిక్) అయిన అబ్దుల్లాహ్ బిన్ ఉబై చొక్కా మాత్రమే ఆయన ఒంటికి సరిపోయింది. దైవప్రవక్త(స) ఆ చొక్కానే ఆయనకు తొడిగించారు. అబ్దుల్లాహ్ బిన్ ఉబై చనిపోయి నప్పుడు దైవప్రవక్త(స) తన చొక్కాను విప్పి, అతనిపై (కఫన్‌గా) కప్పారు. ఆ విధంగా అతడు చేసిన ఉపకారానికి దైవప్రవక్త(స) 'ప్రత్యుపకారం' చేశారని ఇబ్నె ఉయైనా చెప్పారు.[1]

## అధ్యాయం : 142

## సన్మార్గానికి కారకుడైన వ్యక్తి గొప్పతనం

**343)** సహ్ల్ బిన్ సాద్ అన్సారీ (రజి) తెలిపారు : మహాప్రవక్త ముహమ్మద్ ఖైబర్ యుద్ధ దినాన ఇలా సెలవిచ్చారు: "రేపు నేను ఏ వ్యక్తి చేతికి ఇస్లామీయ ధ్వజం ఇస్తానో అతని చేతుల మీదుగా విజయం వరిస్తుంది. ఆ వ్యక్తి అల్లాహ్‌ను,

---

అయితే దైవప్రవక్త(స)కు, హాతిబ్ సంకల్పంలో ఎలాంటి కుట్ర కనిపించలేదు. అదీగాక ఆయన బద్రీ సహాబీ. ఆయన గారి చిన్న చిన్న తప్పులను అల్లాహ్ ముందే క్షమిం చేశాడు. అందువల్లనే ఆయన గారి రాజకీయ తప్పును దైవప్రవక్త(స) ఉపేక్షించారు. హజ్రత్ ఉమర్(రజి) అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు.

ఈ సంఘటన ద్వారా తెలిసే ఒక ముఖ్య విషయం ఏమిటంటే; ఒక్కోసారి బాధ్యతా యుతులైన వ్యక్తుల ద్వారా జరిగే వ్యక్తిగత లేక సామూహిక పొరపాట్లను పెద్ద మనసుతో ఉపేక్షించాలి. అంతేకాదు, తీర్పు ఇచ్చే ముందు వ్యవహారానికి సంబంధించిన అన్ని కోణాలను తరచి చూడాలి. స్థూల దృష్టితో తొందరపడి ఇచ్చే తీర్పులు ఒక్కోసారి ఉపద్రవానికి కారణభూతం కావచ్చు.

342-1. బద్ర్ యుద్ధ సమయానికి హజ్రత్ అబ్బాస్(రజి) ఇస్లాం స్వీకరించలేదు. ఆయన ఒక అవిశ్వాస ఖైదీగా పట్టుబడ్డారు. యుద్ధ ఖైదీలు నగ్నంగా ఉంటే, వారిని వారి మానాన వదలివేయకుండా తగురీతిలో వస్త్రాలు సమకూర్చటం అవసరం. ఇదే ఈ అధ్యాయం లోని ప్రధానాంశం.

**ఆయన ప్రవక్తను ప్రేమించేవాడై ఉంటాడు. అల్లాహ్, ఆయన ప్రవక్త కూడా అతన్ని ప్రేమిస్తారు.” (రేపు ఉదయం) జెండా అందుకునే ఆ వ్యక్తి ఎవరై ఉంటారా! అని ప్రియ సహచరులు రాత్రంతా ఆలోచించుకుంటూ ఉండిపోయారు. తెల్లవారాక ప్రతి వ్యక్తీ, ఆ గౌరవం తనకు దక్కాలని ఆశించారు. కాని “అలీ ఎక్కడ?” అని దైవ ప్రవక్త (సఅసమ్) ప్రశ్నించారు. ‘ఆయన కళ్ళలో నొప్పి ఉంది’ అని సమాధానం ఇవ్వ బడింది. దైవప్రవక్త(స) తన శుభవంతమైన లాలాజలాన్ని ఆయన కన్నులలో పూశారు. దాంతో ఆయనకు స్వస్థత చేకూరింది. ఎలాంటి బాధా లేకుండా పోయింది. పిదప ఆయన(స) అలీ (రజి) చేతికి జెండా ఇచ్చారు. ‘వారు మనలాగా ముస్లింలుగా పరివర్తన చెందనంతవరకూ నేను వారితో పోరాడాలా?’ అని అలీ (రజి) సందేహపడగా, దైవప్రవక్త(స) ఆయనకు ఇలా ఉపదేశించారు: “ఇలాగే ముందుకు సాగిపో. వారి సరిహద్దుల్లోకి వెళ్ళిన మీదట నీవు వారిని ఇస్లాం వైపునకు పిలువు. (ఇస్లాం స్వీకరించిన పక్షంలో) వారిపై ఏ ఏ పనులు విధితమవుతాయో విడమరిచి చెప్పు. దైవసాక్షి! నీ ద్వారా ఒక్కగానొక్క వ్యక్తి సన్మార్గం పొందినాసరే, అది నీ పాలిట ఎర్రని ఒంటెలకన్నా మేలైనది.”[1]**

---

343–1. యుద్ధానికి ముందు ఇస్లాం ధర్మాన్ని పరిచయం చెయ్యమని దైవప్రవక్త(స) అలీ (రజి)కి సూచించటం గమనార్హం. అంటే సాధ్యమైనంతవరకు యుద్ధాన్ని నివారించాలి. యుద్ధం ఆఖరి అస్త్రం. తప్పనిసరి పరిస్థితిలోనే యుద్ధానికి పూనుకోవాలి. శత్రువు సంధికి వచ్చినా లేదా ఇస్లాం స్వీకరించినా, ఈ సత్కార్యం దైవసన్నిధిలో ఎంతో విలువైనది. ఈ హదీసు ద్వారా మహనీయ అలీ (రజి) విశిష్ఠత విదితమయింది. ఆయన చేతుల మీదుగానే ఖైబర్‌పై విజయం లభించింది.

“నీ ద్వారా ఒక్కగానొక్క వ్యక్తికి సన్మార్గం లభించినా అది నీ కొరకు ఎర్రని ఒంటెల కన్నా మేలైనది” అన్న హదీసు పలుకులు ప్రత్యేకంగా గమనించదగినవి. సుబ్‌హానల్లాహ్! మార్గవిహీనుడుగా ఉన్న ఏ వ్యక్తికయినా సన్మార్గానికి తీసుకురావటం ఎంత గొప్ప పుణ్యకారం! ముస్లింలు సదా సత్యధర్మ పరిచయ కార్యాన్ని నిర్వర్తిస్తూ ఉండాలని దీనిద్వారా విదితమవుతోంది. ఎందుకంటే ఇది దైవప్రవక్తల మీరాశి. ఈ విషయంలో నిర్లిప్తత, అనాసక్తత మంచిది కాదు. ముఖ్యంగా విద్వాంసులు తమ శక్తియుక్తులను ఈ పనిలో వెచ్చించకుండా కూర్చోవటం దైవాగ్రహానికి కారణం అవుతుంది. నేటి మన మౌల్వీలు, మషాయఖ్‌లు తామున్నచోటే ఉండి పంచభక్ష పరమాన్నాలు లాగించేస్తు న్నారు. తమ వీధిలోనే, తమ కళ్ళ ఎదుటే షరీఅత్‌కు విరుద్ధమైన పనులు జరుగుతూ

## అధ్యాయం : 143

## ఖైదీలను సంకెళ్ళతో బిగించి కట్టడం

**344) హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచనం : "సంకెళ్ళతో బంధించబడి ఉన్న స్థితిలో స్వర్గంలో ప్రవేశించే వారిని చూసి అల్లాహ్ ఆశ్చర్యపోతాడు."[1]**

## అధ్యాయం : 144

## యూదులు లేదా క్రైస్తవులు ముస్లింలుగా పరివర్తన చెందితే ప్రాప్తించే పుణ్యం

**345) అబూ బుర్దా తన తండ్రి (అబూ మూసా అష్అరీ– రజి) ద్వారా విన్న దాని ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "మూడు రకాల మనుషులున్నారు. వారికి (వారి ఆచరణల దృష్ట్యా) రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది. మొదటి వ్యక్తి: తన వద్ద ఒక బానిస స్త్రీ ఉంటే ఆమెకు ఉత్తమ రీతిలో విద్యాబోధన చేసి, మంచి సంస్కారం ఇచ్చి, ఉత్తమ రీతిలో పని చేయించుకుని, పిదప ఆమెకు బానిసత్వం నుండి స్వేచ్ఛను ప్రసాదించి, ఆమెను వివాహం చేసుకుంటే దానికిగాను అతనికి రెండింతల పుణ్యఫలం లభిస్తుంది. రెండవ అతను: మొదట గ్రంథం కల వారిలో ఒకడుగా ఉండి మొదట (తన**

---

ఉన్నా నోరు విప్పి మాట్లాడరు. వారు పొద్దస్తమానం శ్రీమంతులపై ప్రశంసల వర్షం కురిపించటంలోనే నిమగ్నులై ఉన్నారు. రేపు ప్రళయదినాన వీరు దైవప్రవక్త(స) ముందు ఏం జవాబు చెబుతారు?

దైవ ప్రసాదితమైన జ్ఞానాన్ని సత్యధర్మ ఉన్నతికై వెచ్చించాలి. తద్వారానే దైవానుగ్రహాలకు కృతజ్ఞతలు చెల్లించినట్లవుతుంది. ఒకవేళ సత్యధర్మవ్యాప్తిలో ఏదయినా కష్టం ఎదురైనట్ల యితే దానిని తమ పాలిట అదృష్టంగా, శుభవంతంగా భావించాలి. అంతిమ దైవ ప్రవక్త(స) ఈ మహత్కార్యంలో ఎన్నెన్ని బాధలు భరించారో ఆలోచించండి! ఆయన(స) గాయపడ్డారు. తల పగిలింది. పల్లు రాలాయి. దూషణలు భరించారు. అయినా తాను తలపెట్టిన ఈ గొప్ప కార్యాన్ని ఆపలేదు. 23 ఏండ్ల వ్యవధిలో ఈ పని పూర్తి చేశారు.

344–1. వారు యుద్ధ ఖైదీలు. తరువాత వారు ముస్లింలుగా ధర్మపరివర్తన చెంది స్వర్గ ప్రవేశార్హత పొందారు.

**ప్రవక్తను)విశ్వసించి, తరువాత ముహమ్మద్(స) ప్రవక్తను విశ్వసించిన విశ్వాసి. ఇతనికి కూడా రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది. మూడవ వ్యక్తి : అల్లాహ్ హక్కులను నెరవేర్చటంతోపాటు తన యజమాని పట్ల కూడా ఉత్తమ రీతిలో వ్యవహరించే బానిస"[1]. ఆ తర్వాత (హదీసు ఉల్లేఖకులైన) షాబీ ఇలా అన్నారు : 'నేను ఈ హదీసును మీకు ఎలాంటి కష్టం, శ్రమ లేకుండా అందజేశాను. ఒకప్పుడు దీనికన్నా చిన్న హదీసు కోసం జనులు మదీనా మునవ్వరా వరకు ప్రయాణం చేయాల్సి వచ్చేది'.**

## అధ్యాయం : 145

## ఒకవేళ (కయ్యానికి కాలు దువ్వే) అవిశ్వాసులపై రేదాడి చేస్తే, ఆ దాడిలో పొరపాటున స్త్రీలు, పిల్లలు కూడా గాయపడితే...[1]

**346) సాబ్ బిన్ జస్సామా (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) 'అబ్వా' లేదా 'వద్దాన్'[1]లో నా దగ్గరి నుండి సాగిపోతుండగా, 'ఏ ముష్రిక్కులతో పోరు ఉందో వారిపై రేదాడి గనక చేస్తే, ఆ రేదాడిలో స్త్రీలు, పిల్లలు వధించబడటం ఎట్టిది?' అని ప్రశ్నించబడగా, "వారు కూడా వాళ్ళలోని వారే"[2] అని ఆయన(స) బదులిచ్చారు... "సురక్షితమైన మేత ప్రదేశం[3] అల్లాహ్‌ది, ఆయన ప్రవక్తది" అని ఆయన(స) చెప్పటం కూడా నేను విన్నాను. వేరొక ఉల్లేఖనం ప్రకారం, "వారి స్త్రీలు, పిల్లలు కూడా వారి తాతలు తండ్రుల సంతానమే కదా!" అని ఆయన(స) చెప్పినట్లు ఉంది.**

---

345-1. అంటే దైవారాధన కూడా ఏకాగ్రతతో చేసి, తన యజమాని పట్ల శ్రేయోభిలాషిగా బాధ్యతలను నెరవేర్చే బానిస అన్నమాట.

145-1. అంటే రాత్రి చీకటిలో స్త్రీలు, పిల్లలను గుర్తు పట్టలేని స్థితిలో వారికేదన్నా నష్టం జరిగితే అది తప్పుగా భావించబడదు. కాని తెలిసీ స్త్రీలకు, పసిపిల్లలకు హాని తలపెట్టకూడదు. మరొక హదీసులో దీని వివరణ రానున్నది.

346-1. 'అబ్వా' అనేది ఒక స్థలం పేరు. ఇది మదీనా నగరానికి 12 మైళ్ళ దూరాన ఉంది. ఇక 'వద్దాన్' అనేది కూడా ఒక స్థలం పేరే. ఇది అబ్వాకు 8 మైళ్ళ దూరంలో ఉంది.

346-2. అంటే వారు కూడా ముష్రిక్కులలోని వారే. ఒకవేళ పొరపాటున వారు దాడికి గురైతే అది పాపం కాదు. ఇస్లాం నియమం ప్రకారం వృద్ధులు, చిన్నపిల్లలు,స్త్రీలకు హాని కలిగించకూడదు. కాని రేదాడి జరిగినప్పుడు చీకటిలో పిల్లలెవరో, స్త్రీలెవరో గుర్తు

## అధ్యాయం : 146
## యుద్ధంలో పసిపిల్లలను వధించటం...

**347) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) పాల్గొన్న ఒక యుద్ధంలో ఒక మహిళ వధించబడినట్లు కనిపించింది. ఇది గమనించిన దైవప్రవక్త(స) స్త్రీలను, పిల్లలను వధించటం నుండి వారించారు.[1]**

## అధ్యాయం : 147
## యుద్ధంలో స్త్రీలను వధించటం...

**348) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) కాలంలో జరిగిన ఒక యుద్ధంలో వధించబడిన ఒక మహిళ కంటబడగానే ఆయన(స), (రణరంగంలో) మహిళలను, పసిపిల్లలను వధించ టాన్ని నిషేధించారు.**

## అధ్యాయం : 148
## అల్లాహ్ విధించే (అగ్ని) శిక్షతో ఎవరినీ శిక్షించకూడదు

**349) హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మమ్మల్ని ఒక పనిపై పంపిస్తూ, "మీకు గనక ఫలానా ఫలానా వ్యక్తులు కనిపిస్తే వారిని అగ్నికి ఆహుతి చేయండి" అని సూచించారు. తీరా మేము ప్రయా ణానికి సంకల్పించుకున్నప్పుడు ప్రవక్త మహనీయులు(స) ఇలా ఉద్బోధించారు:**

---

పట్టడం కష్టమవుతుంది. అలాంటి పరిస్థితిలో– పొరపాటున– వారు వధించబడితే అది పాపం కాదు.

346–3. "మేత ప్రదేశాలకు" సంబంధించినంతవరకు పూర్వం అరబ్బుల నియమం ఏమిటంటే, వారు పచ్చిక ఉన్న ప్రాంతాలకు చేరుకున్నప్పుడు, తమ కుక్కకు సంజ్ఞ చేసేవారు. దాంతో ఆ కుక్క మొరిగేది. ఆ మొరిగిన శబ్దం ఎంతవరకు వెళుతుందో అంతవరకూ వారు ఆ మేత ప్రదేశాన్ని తమ కొరకు స్వంతం చేసుకునేవారు. అన్యాయంతో కూడిన ఈ ఆచారాన్ని దైవప్రవక్త(స) నిర్మూలించారు. ఇలాంటి మేత ప్రదేశాలు దైవానికి, దైవ ప్రవక్త(స)కు చెందినవి అని చెప్పారు. ఆయా కాలాల నాయకులకు, ప్రభుత్వాలకు కూడా ఈ శాసనం వర్తిస్తుంది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలు పచ్చగడ్డి కోసం వేలంపాట ద్వారా పాడుకుంటూ ఉంటారు.

347–1. ఉద్దేశపూర్వకంగా పసివాళ్ళను, స్త్రీలను వధించటాన్ని ఇస్లామ్ వారిస్తుంది.

**"చూడండి! ఫలానా ఫలానా వారు కనిపిస్తే వారిని అగ్నికి ఆహుతి చేయమని నేను మిమ్మల్ని ఆదేశించి ఉన్నాను. కాని అగ్ని ఎటువంటిదంటే, ఆ శిక్ష ఒక్క అల్లాహ్ మాత్రమే విధించగలడు. కాబట్టి ఒకవేళ వారు మీకు కనిపిస్తే వారిని వధించండి (కాని అగ్నికి ఆహుతి చేయకండి)".**

**350)** ఇక్రిమా కథనం: **(అబ్దుల్లాహ్ బిన్ సబా అనుయాయులమనీ, హజ్రత్ అలీ– రజి– తమ దైవమని చెప్పుకునే) ఒక వర్గాన్ని హజ్రత్ అలీ (రజి) అగ్ని యాతనకు గురి చేశారు.[1] ఈ సమాచారం మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి)కు అందినప్పుడు, "నేనే గనక (ఖలీఫాగా) ఉండి ఉంటే ఎన్నటికీ వారిని అగ్నియాతనకు గురిచేసేవాణ్ణి కాను. ఎందుకంటే, 'అల్లాహ్ మాత్రమే విధించే శిక్షను ఎవరికీ విధించకండి' అని మహాప్రవక్త(స) చెప్పారు. నేను గనక ఉంటే వారిని తప్పకుండా హతమార్చేవాణ్ణి. ఎందుకంటే, 'ధర్మాన్ని భ్రష్టుపట్టించే వానిని వధించండి' అని దైవప్రవక్త(స) చెప్పి ఉన్నార"ని అన్నారు.**

## అధ్యాయం : 149

## ఖైదీలకు మేలైనా చేయండి లేదా వారి నుండి పరిహారం తీసుకుని వదలి వేయండి (అని సూరయె ముహమ్మద్‌లో అల్లాహ్ ఆదేశించటం). యుద్ధంలో తన ఆయుధాలు క్రింద పడవేసే వరకు (ఇలా జరగాలి)

**(ముహమ్మద్-4)**

**ఈ అధ్యాయం క్రింద సుమామా గారి హదీసు ఉంది.[1]**

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"ధరణిలో శత్రువులను పూర్తిగా అణచనంత వరకు, తన వద్ద యుద్ధ ఖైదీలను ఉంచుకోవటం అనేది ఏ ప్రవక్తకూ తగదు. మీరు ప్రాపంచిక ప్రయోజనాలను కాంక్షిస్తున్నారు."** ***(అల్ అన్‌ఫాల్ : 67)***

---

350–1. వారు 'సబాయీ వర్గం'గా పేరు మోశారు. అబ్దుల్లాహ్ బిన్ సబా (యహూదీ) అనుయాయులు. ముస్లింల శిబిరంలో కలతలు రేపే ఉద్దేశంతో అబ్దుల్లాహ్ బిన్ సబా ముస్లింగా మారాడు. కాని లోపలి నుండి అతడు ఒక అవిశ్వాసి. హజ్రత్ అలీ(రజి) మనిషి కారని, ఆయన దైవమని అతడు తన అనుయాయులకు నూరిపోశాడు (దేవుని శరణు). వాళ్ళు విగ్రహారాధన కూడా చేసేవారని మరి కొందరంటారు. రాఫిజీలలో నసీరీ అనే ఒక వర్గం ఉంది. ఈ వర్గీయులు కూడా మహనీయ అలీ(రజి)ని పెద్దల దేవుడనీ, ఇమామ్ జాఫర్ సాదిక్‌ని పిన్నల దేవుడని అంటారు– లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్.

## అధ్యాయం : 150

## ఒకవేళ ఏ ముస్లిం అయినా అవిశ్వాసి చెరలో ఉంటే, అతనిని చంపటం లేదా అవిశ్వాసులను మోసగించి తన బందీని విడిపించుకోవటం ధర్మ సమ్మతమేనా?

ఈ నేపథ్యంలో మహాప్రవక్త(సఅసమ్) ప్రవచించినట్లుగా మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) ఉల్లేఖనం ఉంది.

## అధ్యాయం : 151

## ఎవరయినా ఒక బహుదైవారాధకుడు ఏ ముస్లిమునైనా అగ్నికి ఆహుతి చేస్తే, ప్రతీకారంగా అతనిని కూడా కాల్చవచ్చునా?

**351)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ఉక్ల్ తెగకు చెందిన ఎనమండుగురు వ్యక్తుల బృందం ఒకటి దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో (ఇస్లాం స్వీకరించడానికి) హాజరయింది. కాని మదీనా గాలి, నీరు వారికి పడలేదు. అందు వల్ల వారు, 'దైవప్రవక్తా! మాకు పాలు ఏర్పాటు చేయండి' అని కోరారు. దానికి ఆయన (స) "నేను మీ కొరకు పాలు ఏర్పాటు చేయలేను. ఒక పని చేయండి. (మదీనా పొలిమేరల్లో సదఖా) ఒంటెలున్నాయి. మీరు అక్కడికెళ్ళండి. స్వస్థత చేకూరేవరకు వాటి పాలు, మూత్రం త్రాగండి" అని సూచించారు. వారంతా అక్కడి కెళ్ళి, ఒంటెల పాలు మూత్రం త్రాగి ఆరోగ్యవంతులయ్యారు. కాని వాళ్ళు ఒంటెల కాపరిని చంపేసి, ఒంటెల్ని తోలుకుని పరారయ్యారు. ఇస్లాం స్వీకరించిన తరువాత తిరిగి అవిశ్వాసానికి ఒడిగట్టారు. ఒక వ్యక్తి ఈ సమాచారాన్ని దైవప్రవక్త(స)కు చేరవేశాడు. వెంటనే ఆయన (స) వాళ్ళ అన్వేషణలో వాహన స్వారీలను పరుగెత్తిం చారు. మధ్యాహ్న సమయానికి ముందే వాళ్ళు బందీలుగా తేబడ్డారు. వారి కాళ్ళు చేతులు కోసివేయబడ్డాయి. తరువాత ఆయన(స) ఆజ్ఞానుసారం కాల్చబడిన

---

149-1. సుమామా బిన్ ఉసాల్ హదీసును ఇమామ్ బుఖారీ (రహ్మ) పలుచోట్ల పొందుపరిచారు. అతను దైవప్రవక్త(స)తో, 'తమరు గనక నన్ను చంపితే నా తరఫున ప్రతీకారం తీర్చుకునేవారు చాలా మంది ఉన్నారు. ఒకవేళ తమరు నాకు మేలు చేసినట్లయితే నేను మీకు కృతజ్ఞుడనై ఉంటాను. ఒకవేళ తమరు నా నుండి ధనం ఆశిస్తున్నట్లయితే, ఎంత కావాలో చెప్పండి, ఇస్తాను' అన్నాడు. ఈ మాట విని దైవప్రవక్త(స) మౌనం వహిం చారు. చివరకు సుమామా ఇస్లాం స్వీకరించారు.

**ఇనుప చువ్వలు వాళ్ళ కన్నులలో పొడవబడ్డాయి. పిదప వాళ్ళను మదీనాలోని రాతి ప్రదేశంలో వదలివేయటం జరిగింది. వారు (దాహంతో) నీరు అడగసాగారు. కాని వారికి నీరు ఇవ్వబడలేదు. కడకు వారంతా చచ్చిపోయారు (ఎందుకంటే వాళ్ళు ఒంటెల కాపరిపట్ల సరిగ్గా అలాగే వ్యవహరించారు). అబూ ఖిలాబా ఇలా అన్నారు: "వాళ్ళు హత్యానేరానికి పాల్పడ్డారు. దొంగతనం చేశారు. అల్లాహ్‌తో, ఆయన ప్రవక్త(స)తో యుద్ధం చేశారు. భువిలో కల్లోలాన్ని రేకెత్తించేందుకు యత్నించారు."[1]**

## అధ్యాయం : 152

## ఒక దైవప్రవక్తకు చీమ కుట్టినప్పుడు...

**352) ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూ హురైరా (రజి) చెప్పారు. ఆయన(సఅసమ్) ఇలా ప్రవచించారు: "ఒక చీమ దైవప్రవక్తలలో ఒకరిని (ఉజైర్‌ను లేదా మూసా అలైహిస్సలామ్‌ను) కుట్టింది. అంతే, ప్రవక్త ఆదేశంతో ఆ చీమల పుట్టంతా తగలబెట్టడం జరిగింది. అప్పుడు అల్లాహ్ ఆయన వద్దకు 'నిన్ను కుట్టింది ఒకే ఒక్క చీమ కదా! మరి నువ్వు నా పవిత్రతను కొనియాడే అసంఖ్యాకమైన జీవాలను ఎందుకు దగ్ధం చేసినట్టు!?' అని వహీ (సందేశం) పంపాడు."[1]**

---

351–1. అలాంటి విశ్వాసఘాతకులకు, వంచకులకు, నమ్మక ద్రోహులకు కఠిన శిక్ష పడాల్సిందే. అలా జరిగినప్పుడే ప్రజలకు గుణపాఠం కలుగుతుంది; శిష్ట రక్షణ సాధ్యమవుతుంది.

అయితే అధ్యాయంలోని మకుటానికి– హదీసులోని విషయానికి సారూప్యం కనిపించటం లేదు.

352–1. 'ఆ ప్రవక్త' సర్వనాశనం చేయబడిన ఒక పట్టణం మీదుగా సాగిపోతూ "దేవా! ఈ పట్టణంలో దోషులతోపాటు నిర్దోషులు కూడా ఉన్నారు. పసిపిల్లలు, పశువులు కూడా ఉండేవి. నీవు వారందరినీ నాశనం చేసేశావు" అని విన్నవించుకుని, ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. అక్కడి ఒక చీమ ఆ ప్రవక్తను కుట్టింది. ఆయనకు కోపం వచ్చి చీమల పుట్ట అంతటినీ తగులబెట్టారు. అప్పుడు అల్లాహ్ ఆయన విన్నపానికి బదులిస్తూ, "నీవు ఎందువల్ల ఏ దోషం లేని చీమలన్నింటినీ కాల్చేశావ్?" అన్నాడు.

ఇమామ్ బుఖారీ(రహ్మ) ఈ హదీసు ఆధారంగా, అగ్ని ద్వారా శిక్షించటం సరైనదే అన్న అంశాన్ని వెలికితీశారు... మన షరీఅత్‌లో మాత్రం చీమను, తేనెటీగను చంపటాన్ని వారించటం జరిగింది.

## అధ్యాయం : 153

## (శత్రువులైన అవిశ్వాసుల) ఇండ్లను, వృక్షాలను కాల్చటం

**353)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) నన్నుద్దేశించి, "జుల్ ఖలసాను ధ్వంసం చేసి నాకు నెమ్మది ఎందుకు ఇవ్వవు?" అన్నారు. ఈ జుల్ ఖలసా ఖష్అమ్ తెగ వారి విగ్రహాలయం. దానిని వారు 'యమనీల కాబా'గా వ్యవహరించేవారు. జరీర్ ఇలా అన్నారు : నేను అహ్మస్ తెగకు చెందిన 150 మంది అశ్వారూఢులను తీసుకుని బయలుదేరాను. వాళ్ళంతా మంచి రౌతులు. కాని నాకు గుర్రపు స్వారీ సరిగ్గా రాదు. దైవప్రవక్త(స) తన పవిత్ర హస్తాన్ని నా ఛాతీపై చరచారు. నేను నా ఛాతీపైన ఆయన (స) చేతివ్రేళ్ళ గుర్తు లను తిలకించాను. ఆయన(స) ఇలా ప్రార్థించారు : "దేవా! గుర్రపు వీపుపై ఇతనికి స్థిరత్వాన్ని ప్రసాదించు. ఇతనిని ఇతరులకు సన్మార్గం చూపే వానిగానూ, స్వయంగా సన్మార్గంపై ఉండేవానిగానూ చెయ్యి". ఆ తరువాత జరీర్ (రజి) పయనమయ్యారు. జుల్ ఖలసా కట్టడాన్ని కూల్చి, దానిని దగ్ధం చేశారు. పిదప దైవప్రవక్త(స)కు ఆ సమాచారం పంపారు. జరీర్(రజి) దూత దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరై, 'తమరికి సత్యం ఇచ్చి పంపినవాని సాక్షిగా! జుల్ ఖలసాను మేము ఖాళీ కడుపుతో ఉన్న ఒంటె మాదిరిగా చేసిన మీదటే నేను మీ వద్దకు వచ్చాను. లేదా (ఇలా అన్నారు) దురద జబ్బుతో లాక్కునే ఒంటె మాదిరిగా చేయనంతవరకూ నేను హాజరు కాలేదు'. జరీర్ (రజి) ఇలా అన్నారు : ఇది విని దైవప్రవక్త(స) అహ్మస్ తెగ రౌతులకు, ఆ తెగ వారందరికీ శుభం వొసగమని అయిదుసార్లు ప్రార్థించారు.[1]

**354)** ఇబ్నె ఉమర్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) బనూ నజీర్ (యూదుల)కు చెందిన ఖర్జూర తోటల్ని తగులబెట్టారు.[1]

---

353-1. 'జుల్ ఖలసా' ఒక విగ్రహాలయం. అది ముస్లింలతో శత్రుత్వం వహించిన అవిశ్వాసు లది. యమన్‌లో దానిని పవిత్ర కాబా గృహానికి ప్రత్యామ్నాయంగా ఖష్అమ్ తెగవారు నిర్మించారు. అవిశ్వాసులు జుల్ ఖలసాను కేంద్రంగా చేసుకుని ముస్లింలకు వ్యతి రేకంగా కుట్రలు పన్నేవారు. అందుకే దానిని నిర్మూలించాలని దైవప్రవక్త(స) ఆదేశిం చారు. ఇకపోతే, 'జిమ్మీ' అవిశ్వాసులకు చెందిన ఆరాధనాలయాలను కాపాడే బాధ్యత ముస్లిం ప్రభుత్వాలదైపోతుంది.

## అధ్యాయం : 154

## (శత్రువర్గానికి చెందిన) ముష్రిక్కు నిద్రిస్తున్నప్పుడు అతనిని కడతేర్చటం సమంజసమా?[1]

**355)** బరా బిన్ ఆజిబ్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) కొంతమంది అన్సార్లను అబూ రాఫె అనే యూదుణ్ణి హతమార్చడానికి పంపారు. వారిలోని ఒక వ్యక్తి (అబ్దుల్లాహ్ బిన్ అతీక్) కోటలోనికి జొరబడి పశువుల చావిడిలో తిష్టవేశారు. రాత్రి చీకటి పడింది. అబూ రాఫె మనుషులు కోట ద్వారాన్ని మూసివేశారు. తీరా చూస్తే ఆ పశువుల్లో ఒక గాడిద వారికి కనిపించలేదు. అందువల్ల గాడిదను వెతకటానికి వారంతా బయటికి వచ్చారు. అబ్దుల్లాహ్ ఇలా అంటున్నారు : నేను కూడా వాళ్ళతోపాటే బయటికి వచ్చాను. నేను వారి మనిషినేనని, గాడిదను వెతకటానికి వారితోపాటే బయటికి వచ్చానని అనిపించేలా అభినయం చేశాను. గాడిద తొందరగానే దొరికింది. వారంతా తిరిగి కోటలోపలికి వచ్చేశారు. నేను కూడా వాళ్ళను అనుసరించాను. వాళ్ళు రాత్రివేళ కోట ద్వారాన్ని మూసివేసి తాళం గుత్తిని ఒక మూలపెట్టారు. వారు నిద్రలోకి జారుకోగానే ఆ తాళం చెవులను చేజిక్కించుకుందామని అనుకున్నాను. అబూ రాఫె పడుకున్న గదికి తాళం వేసి ఉంది. నేను ఆ ద్వారాన్ని తెరచి అతని గదిలోనికి ప్రవేశించాను. నేనతన్ని పేరు పెట్టి పిలిచాను.[1] అతను సమాధానం పలికాడు. అంతే, నేనతని సమాధానం ఆధారంగా ఖడ్గంతో అతనిపై లంఘించి ఒక్క వేటు వేశాను. అతను పెద్దగా అరిచాడు. తక్షణం నేను బయటికి వచ్చేశాను. కొన్ని క్షణాల తర్వాత మళ్ళీ

---

354-1. యుద్ధం జరుగుతున్నప్పుడు రణతంత్రంలో భాగంగా ఒక్కోసారి శత్రువు మెడలు వంచడానికి ఇలాంటి కఠినచర్య అనివార్యం అవుతుంది. కాని సాధారణ పరిస్థితుల్లో పంట పొలాలను, తోటలను తగులబెట్టడం తగదు.

154-1. అబూ రాఫె యూదుడు. కరడుగట్టిన ఇస్లాం విరోధి. కాబ్ బిన్ అష్రఫ్ మాదిరిగా దైవ ప్రవక్త(స)ను వేధించేవాడు. దైవప్రవక్త(స) గురించి ప్రజలకు చెడుగా చెప్పేవాడు. ప్రవక్త(స)కు వ్యతిరేకంగా పోరాడమని ప్రజలను పురికొలిపేవాడు.

355-1. అబూ రాఫె కంఠాన్ని అబ్దుల్లాహ్ (రజి) గుర్తు పట్టగలరు. ఆ సమయంలో చీకటి అలుముకుని ఉంది. పొరపాటున వేరొకరిని హతమారుస్తానేమోనన్న అనుమానం వల్ల ఆయన 'అబూ రాఫె' అని పేరు పెట్టి పిలిచారు.

లోనికి వెళ్ళి, నేనతనికి సహాయపడటానికి వచ్చిన వానివలె మభ్య పెట్టాను. ఈసారి నా కంఠస్వరాన్ని మార్చి 'అబూ రాఫె!' అని పిలిచాను. దానికతను, "నీ తల్లి నాశనమవ్వ! ఏం కావాలో చెప్పు" అన్నాడు. అతని సేవకులలో నేనొకడినని అబూ రాఫె తలపోశాడు. 'ఇంతకీ ఏమయిందో చెప్పారు కాదు' అన్నాను. "ఇందాక ఎవడో వచ్చి నాపై దాడి చేశాడు" అని అన్నాడతను. ఈ మాట వినగానే నేను నా ఖడ్గాన్ని అతని పొట్టలో దిగబెట్టాను. నా శరీర బరువంతా ఆ ఖడ్గంపై పెట్టి బలంగా నొక్కాను. దాంతో అతని ఎముకలు సయితం తెగిపోయాయి. ఆ తరువాత నేను బయటికొచ్చి కోట మెట్లను సమీపించాను. ఆ సమయంలో నేను భయాందోళనకు గురై ఉన్నాను. కంగారులో మెట్లపై నుంచి క్రిందపడ్డాను. దాంతో నా కాలు బెణికింది. ఇంకా నయం, ఎముక విరగలేదు, పిదప నేను కోట వెలుపలకు వచ్చి, నా కోసం నిరీక్షిస్తున్న నా సహవాసుల వద్దకు వెళ్ళాను. 'మరణ సూచనగా స్త్రీల ఏడ్పులు, ఆక్రందనలు విననంత వరకూ నేను ఇక్కడి నుండి వెళ్ళేది లేదు' అని నేను వారితో నిర్ద్వంద్వంగా చెప్పేశాను. కాస్సేపటికే నేను అతని మరణ వార్తను విన్నాను– 'హిజాజ్ వాసుల వ్యాపారవేత్త అబూ రాఫె ఇక లేడు' అంటూ ఆడవారు ఏడ్వసాగారు. నేనక్కడి నుండి నిష్క్రమిస్తున్నప్పుడు నాకెలాంటి నొప్పి అనిపించలేదు. మేము ప్రవక్త మహనీయుల(స) సన్నిధికి వచ్చి ఆ శుభవార్తను వినిపించాము.[2]

**356)** బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) అన్సార్లలోని కొంతమందిని అబూ రాఫె వద్దకు (అతనిని కడతేర్చడానికి) పంపారు. అందువల్ల రాత్రిపూట అబ్దుల్లాహ్ బిన్ అతీక్(రజి) కోటలోనికి వెళ్ళి, నిద్రిస్తున్న అబూ రాఫేను వధించారు.

## అధ్యాయం : 155
## శత్రువును మార్కొనాలని ఎన్నడూ కోరుకోరాదు

**357)** ఉమర్ బిన్ అబ్దుల్లాహ్ బానిసయగు సాలిమ్ అబున్నజర్ తెలిపారు:

---

355–2. నిద్రలో ఉన్న వ్యక్తిని హతమార్చటం ఎంతవరకు సబబు? అన్న సందేహం ఇక్కడ కలగవచ్చు. కాని అబూ రాఫె ముస్లిం శిబిరాలలో చిచ్చుపెట్టి వేడుక చూసేవాడు. దైవ ప్రవక్త(స)పై పరోక్ష నింద వేసేవాడు. ప్రవక్త(స)కు, ఇస్లాంకు వ్యతిరేకంగా అన్యులను రెచ్చగొట్టేవాడు.

**నేను ఉమర్ బిన్ అబ్దుల్లాహ్ గారి గుమాస్తాగా ఉన్నాను. ఈయన ఇంకా ఏమన్నా రంటే, నేను ఖవారిజ్ వర్గంతో పోరాడటానికి బయలుదేరినప్పుడు, తనకు అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి) ఉత్తరం అందింది. నేనా ఉత్తరాన్ని చదివాను. అందులో ఆయన ఇలా వ్రాశారు: ఒకానొక యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు (సఅసమ్) నిరీక్షించారు. పొద్దువాలిన తరువాత ఆయన(స) ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఇలా అన్నారు: "ప్రజలారా! శత్రువును మార్కొనాలని మాత్రం కోరుకోకండి. పైగా, ప్రశాంత స్థితిని నెలకొల్పి ఉంచమని అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి. ఒకవేళ యుద్ధం అనివార్యమైనట్లయితే స్థయిర్యాన్ని ప్రదర్శించండి. (శత్రువును) దీటుగా ఎదుర్కొనండి. స్వర్గం ఖడ్గాల ఛాయలలో ఉందని తెలుసు కోండి." తరువాత ఆయన(స) ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్! (ఖుర్ఆన్) గ్రంథాన్ని అవతరింపజేసినవాడా! మేఘాలను నడిపించేవాడా! సైనిక కూటములను (కందక యుద్ధంలో) చిత్తు చేసినవాడా! మా శత్రువులను ఓడించు. వారికి వ్యతిరేకంగా మాకు సహాయపడు." సాలిమ్ బిన్ అబున్నజర్ తనతో చెప్పారని మూసా బిన్ ఉఖబా తెలియజేశారు: "నేను ఉమర్ బిన్ అబ్దుల్లాహ్ దగ్గర గుమాస్తాగా ఉన్నాను. ఆయన వద్దకు అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి)గారి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో దైవప్రవక్త(సఅసమ్) ఇలా చెప్పినట్లుగా ఉంది: "మీరు శత్రువుతో యుద్ధం చేయాలని కోరుకోకండి."... దైవప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించా రని హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు: "శత్రువుతో యుద్ధంలో తలపడా లని వాంఛించకండి. అయితే ఒకవేళ యుద్ధం మొదలైనట్లయితే నిలకడ చూపండి (పలాయనం చిత్తగించకండి).**

## అధ్యాయం : 156

## ఎత్తుగడలకు మరో పేరే యుద్ధం[1]

**358) హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త**

156–1. రణతంత్రంలో భాగంగా ఎత్తులు, పై ఎత్తులు సర్వసాధారణమే. కాని వాగ్దాన భంగం జరగరాదు. కందక యుద్ధ సందర్భంగా యూదులు, ఖురైషులు, గిత్ఫాన్ తెగవారు ఒక్కటై ముస్లింలపై కయ్యానికి కాలు దువ్వారు. అప్పుడు దైవప్రవక్త(స) నయీమ్ బిన్ మస్ఊద్(రజి)ను పంపి శత్రువుల శిబిరంలో అయోమయాన్ని సృష్టించమని చెప్పారు. కుట్రలు పన్నే వారికి తగిన శాస్తి ఇదే.

**ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు: "కిస్రా (ఈరాన్ చక్రవర్తి) నాశనమై పోయాడు. ఇక అతని తదనంతరం ఏ కిస్రా రాడు. ఖైసర్ (రోము చక్రవర్తి) కూడా నాశనమైపోయాడు. అతని తర్వాత (సిరియాలో) ఇక ఏ ఖైసర్ కూడా మిగిలి ఉండదు. వారి ఖజానాలు దైవమార్గంలో పంపకం అవుతాయి."[1]**

**359) మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) వక్కాణించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "యుద్ధం అంటే ఏమనుకున్నారు? అదొక ఎత్తుగడ."**

**360) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ప్రవచించినట్లుగా జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు : "యుద్ధం ఎత్తుగడకు మరో పేరు."**

## అధ్యాయం : 157

## రణతంత్రపుటెత్తుగడలో భాగంగా అబద్ధం చెప్పటం సరైనదే.[1]

**361) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్), "కాబ్ బిన్ అష్రఫ్ కథను పరిసమాప్తం చేసేవారెవరు? అతడు దైవానికి, దైవప్రవక్త(స)కు చాలా బాధ కలిగించాడు"[1] అని చెప్పినప్పుడు, 'దైవప్రవక్తా! నేనతన్ని కడతేర్చి రావడానికి తమరు ఆనతి ప్రదానం చేస్తారా?' అని ముహమ్మద్**

---

358–1. ఆ కాలంలో ఈరాన్, రోము మహా సామ్రాజ్యాలు తిరుగులేనివి. ఈరాన్ చక్రవర్తి 'కిస్రా'గా పిలువబడేవాడు. రోము చక్రవర్తి 'ఖైసర్'గా బిరుదాంకితుడయ్యాడు. ప్రజలు ఆ రాజులను దైవాంశ సంభూతులుగా భావించేవారు. వారి ఆజ్ఞలకు రాజ్యంలో తిరుగు లేదు. వారు ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చి తమ పబ్బం గడుపుకునేవారు. ఈ దౌర్జన్యాన్ని, అనువంశిక– నిరంకుశ– రాజరికాన్ని అల్లాహ్ ఇస్లాం ద్వారా అంత మొందించాడు. దాంతో తోటి మనుషుల ఊడిగం చేసే బడుగు ప్రజలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు.

157–1. 'తిర్మిజీ'లోని ఒక ఉల్లేఖనం ప్రకారం మూడు చోట్ల అబద్ధం చెప్పటంలో తప్పులేదు– 1) అలిగిన తన భార్యను మెప్పించడానికి భర్త అబద్ధం చెప్పటం 2) రణతంత్రపుటెత్తు గడలో భాగంగా 3) ఇద్దరు వ్యక్తుల మధ్య సయోధ్యకు. అయితే ఆ అబద్ధం తేలికపాటిదై ఉండాలి. మహాప్రవక్త(స) యుద్ధ ప్రయాణానికి బయలుదేరేముందు 'తౌరియ' చేసేవారు. అంటే– ఫలానా ప్రాంతంలోని పరిస్థితులేమిటి? అని విచారించేవారు. ఆ ప్రాంతం వైపు వెళ్ళబోతున్నామని సహచరులు అనుకునేవారు. తీరా ప్రయాణానికి బయలుదేరినప్పుడు తెలిసేది– అది మరొక ప్రాంతమని.

**బిన్ మస్లమా (రజి) విన్నవించుకున్నారు. దానికాయన(స), "సరే" అన్నారు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు : తరువాత ముహమ్మద్ బిన్ మస్లమా (రజి) యూదుడైన కాబ్ బిన్ అష్రఫ్ దగ్గరకు వచ్చి, 'మిత్రమా! దైవప్రవక్త(స) మమ్మల్ని అలసిపోయేలా చేశారు. (నమాజ్ చేయమని అంటారు, ఉపవాసాలుండమంటారు). ఇప్పుడేమో జకాత్ చెల్లించమంటున్నారు' అని ఫిర్యాదు చేశారు. దానికి కాబ్, 'అప్పుడే ఏమయింది? ముందుముందు ఇంకా ఏం జరుగుతుందో చూడు' అన్నాడు.[2] దానికి ముహమ్మద్ బిన్ మస్లమా (రజి), 'మిత్రమా! ఏం చేయమంటారు? మేము ఆయన విధేయతకు కట్టుబడి ఉన్నాము. ఒక్కసారిగా ఆయనతో తెగత్రెంపులు చేసుకోవటం కూడా మంచిది కాదు కదా! ఆయన తలపెట్టిన కార్యం ఎలా పరిణమిస్తుందోనని వేచి చూస్తున్నాం'. ఈ విధంగా ముహమ్మద్ బిన్ మస్లమా అతన్ని మాటల్లో పెట్టి, అవకాశం దొరకగానే అతన్ని హతమార్చారు.[3]**

## అధ్యాయం : 158

## శత్రువు అయిన అవిశ్వాసిపై అకస్మాత్తుగా మెరుపు దాడి చేసి చంపటం[1]

---

361–1. అబూ రాఫె మాదిరిగా ఈ ధూర్త్కారి కూడా ముస్లింల పట్ల శత్రుత్వం వహించాడు. దైవప్రవక్త(స)ను తూలనాడటమేగాక, ఇస్లాం ధర్మం కన్నా బహుదైవారాధన నయం అని నమ్మబలికేవాడు. ముస్లింలపై దండెత్తమని బహు దైవారాధకులను పురిగొల్పేవాడు.

361–2. ముహమ్మద్ బిన్ మస్లమా (రజి) అతని ముందు అభినయం చేశారంతే. ఆ మేరకు ఆయన దైవప్రవక్త(స) నుండి అనుమతి కూడా పొందారు. కాని కాబ్ బిన్ అష్రఫ్ ముహమ్మద్ బిన్ మస్లమా మాటల్ని నమ్మేశాడు.

361–3. ఆఖరిలో ముహమ్మద్ బిన్ మస్లమా(రజి) కాబ్‌తో చనువు పెంచుకుని, 'అబ్బ! నీ తల నుండి సువాసన ఘుమఘుమలాడుతోంది' అన్నారు. దానికతను, 'నా దగ్గర ఒక స్త్రీ ఉంది. ఆమె అరేబియాలోకెల్లా శ్రేష్ఠమైనది' అన్నాడు. 'మిత్రమా! నీ తలలోని సువాసనను కాస్త నన్ను కూడా పీల్చుకోనివ్వు' అని అతనిని అడిగి, అతడు తలవంచగానే, జుట్టు పట్టుకున్నారు ముహమ్మద్ బిన్ మస్లమా. మిగతా పనిని ఆయన సహచరులు పూర్తి చేశారు.

158–1. ఇది కూడా రణతంత్రపుటెత్తుగడలో భాగమే. సాంకేతికంగా అభివృద్ధి చెందిన నేటి ఆధునిక యుగంలో సయితం శత్రువును ఏమార్చే కొంగ్రొత్త పద్ధతులు అమల్లో ఉన్నాయి. వాటిలో ఒకటి 'సర్జికల్ స్ట్రైక్'.అయితే ఇస్లాంలో కేవలం ఇలాంటి దాడులకు అనుమతి శత్రు వర్గం వరకే పరిమితం. అన్యథా సాధారణ పరిస్థితుల్లో మోసగించి చంపటం అధర్మం (హరామ్).

**362) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్), "కాబ్ బిన్ అష్రఫ్‌ను కడతేర్చడానికి మీలో సాహసించేవాడెవడు?" అని ప్రశ్నించినప్పుడు, 'దైవప్రవక్తా! నేనతన్ని (మాటల్లో పెట్టి) హతమార్చడానికి సిద్ధమే. తమరు దీనిని ఇష్టపడతారా?' అని విన్నవించుకున్నారు. దానికాయన(స), "సరే కానివ్వు" అన్నారు.**

## అధ్యాయం : 159

## ఒకవేళ ఎవరి ద్వారానయినా ఉపద్రవం పొంచి ఉన్నప్పుడు, అతన్ని ఏమార్చవచ్చు

**అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసం) యూదుల బాలుడైన ఇబ్నె సయ్యాద్ ఉన్న చోటికి బయలుదేరారు. ఆయన(స) వెంట ఉబై బిన్ కాబ్(రజి) కూడా ఉన్నారు. (ఇబ్నె సయ్యాద్ యొక్క చిత్ర విచిత్రమైన పరిస్థితులను ఆయన–సఅసం– దర్యాప్తు చేయదలిచారు). ఆ సమయంలో ఇబ్నె సయ్యాద్ ఖర్జూర చెట్ల మాటున ఉన్నాడని దైవప్రవక్తకు సమాచారం అందింది. అందువల్ల ఆయన(స) అక్కడికి వెళ్ళినప్పుడు ఖర్జూర మట్టల చాటున నడువ సాగారు. ఆ సమయంలో ఇబ్నె సయ్యాద్ దుప్పటి కప్పుకుని, నెమ్మదిగా కూని రాగాలు తీస్తున్నాడు. అతని తల్లి దైవప్రవక్త(స)ను చూడగానే, 'ఒరేయ్ ఇబ్నె సయ్యాద్! ఇదిగో ముహమ్మద్(స) వచ్చేశార'ని అరిచింది. తక్షణం అతను అప్రమత్తుడయ్యాడు. అప్పుడు, "ఈవిడ గనక అతన్ని సావధానపరచి ఉండకపోతే అతని గుట్టు రట్టయ్యేది"[1] అని దైవప్రవక్త(స) చెప్పారు.**

---

159–1. ఇబ్నె సయ్యాద్ అనే బాలుడు మదీనాలో యూదు కుటుంబీకుడు. జ్యోతిష్కుల మాదిరిగా జనులను మభ్యపెట్టేవాడు. అప్పుడప్పుడూ తనను తాను దైవసందేశహరునిగా కూడా చెప్పుకునేవాడు. ఇతను కూడా ఒక రకంగా దజ్జాలే. ఎందుకంటే ఇతను దజ్జాల్ మాదిరి గానే మోసపూరిత మాటలు చెప్పేవాడు. అతన్ని చంపితే పీడ విరగడ అవుతుందని హజ్రత్ ఉమర్(రజి) అభిప్రాయపడ్డారు. కాని కారుణ్యమూర్తి ముహమ్మద్(స) దేశ ప్రయోజనాల, సామాజిక పరమార్థాల దృష్ట్యా దానిని సమంజసంగా భావించలేదు. ఎందుకంటే మార్గ బోధన చేయటం వరకే దైవప్రవక్త పని. సన్మార్గాన నడిపించటం దేవుని పని.

దైవప్రవక్త(స) ఖర్జూర మట్టల చాటున నడుస్తూ ఇబ్నె సయ్యాద్ రహస్యాన్ని విప్పాలని భావించారు. అందుకే అతన్ని ఏమార్చారు. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం.

## అధ్యాయం : 160

## యుద్ధంలో కవిత్వం చెప్పటం, కందకం త్రవ్వేటప్పుడు గొంతెత్తి ఘోషిం చటం

ఈ అధ్యాయంలో సహ్ల్, అనస్(రజిఅల్లాహు అన్‌హుమా)లు దైవప్రవక్త(స) నుండి హదీసులను ఉటంకించారు. యజీద్ బిన్ అబీ ఉబైద్ కూడా ఈ అధ్యా యంలో సలమా బిన్ అక్వా (రజి) నుండి ఒక హదీసును ఉల్లేఖించారు.

**363)** బరా బిన్ ఆజిబ్(రజి) ఇలా వివరించారు: అహ్జాబ్ యుద్ధ సంద ర్భంగా (కందకం త్రవ్వుతూ) ప్రవక్త మహనీయులు(సఅసమ్) స్వయంగా మట్టి ఎత్తటం నేను కళ్ళారా చూశాను. కడకు ఆయన(స) ఛాతీపైని వెంట్రుకలు దుమ్ము కొట్టుకుపోయాయి. ఆ సమయంలో ఆయన(స) అబ్దుల్లాహ్ బిన్ రవాహ కవితను పఠిస్తూ ఉన్నారు. ఆ కవిత ఇది :

(అనువాదం) "ఓ అల్లాహ్! నీవే గనక సన్మార్గం ప్రసాదించి ఉండకపోతే మేమెన్నటికీ సన్మార్గం పొందలేకపోయేవారం. దానధర్మాలు చేయటంగానీ, నమాజ్ ఆచరించటం గానీ మా వల్ల అయ్యేది కాదు. కనుక ఓ అల్లాహ్! ఇప్పుడు నీవు మా హృదయాలకు నెమ్మదినివ్వు. శత్రువుతో మార్కొనటమే గనక జరిగితే మా పాదాలకు నిలకడను ప్రసాదించు. శత్రువులు అకారణంగా- అన్యాయంగా- మాపై దండెత్తి వచ్చారు. వారెప్పుడు మమ్మల్ని ఉపద్రవానికి గురిచేయజూసినా మేము తిప్పి కొట్టాము"- ఈ కవితను ఆయన(స) బిగ్గరగా పఠించారు.

## అధ్యాయం : 161

## గుర్రంపై బాగా కూర్చోలేని వానికై (దుఆ చేయటం)

**364)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) తెలిపారు: నేను ఇస్లాం స్వీకరిం చిన నాటినుంచీ ప్రవక్త మహనీయులు (సఅసం) నన్ను (పరదా నియమాలకు కట్టుబడుతూ) తన ఇంట్లోకి రావటానికి నిరాకరించలేదు. ఆయన(స) నన్ను చూసినప్పుడల్లా సంతోషంతో చిరునవ్వు చిందించేవారు. ఒకసారి నేనాయన (స) సన్నిధిలో, 'నేను గుర్రపు వీపుపై కుదురుగా కూర్చోలేకపోతున్నాను' అని చెప్పు కున్నాను. అప్పుడు ఆయన(స), తన చేత్తో నా ఛాతీపై చరచి, ఇలా ప్రార్థించారు:

**"అల్లాహ్! ఇతనికి గుర్రపు వీపుపై స్థిరత్వాన్ని ప్రసాదించు. ఇతనిని ఇతరులకు సన్మార్గం చూపేవానిగా, స్వయంగా ఇతను కూడా సన్మార్గాన ఉండేవానిగా చెయ్యి."[1]**

## అధ్యాయం : 162

## చాపను కాల్చి గాయానికి మందుగా అద్దటం, స్త్రీ తన తండ్రి ముఖంపైనున్న రక్తాన్ని కడగటం, డాలులో నీళ్ళు నింపుకుని రావటం

**365) (ఉహుద్ సంగ్రామంలో) దైవప్రవక్త(స)కు అయిన గాయాలకు ఏ మందుతో చికిత్స చేయబడింది? అని హజ్రత్ సహ్లా బిన్ సాద్ సాయిదీ (రజి)ని శిష్యులు అడిగితే, సమాధానంగా సహ్లా (రజి) ఇలా అన్నారు: ఈ విషయం గురించి నాకన్నా ఎక్కువగా తెలిసినవారు ఇప్పుడు సహాబాలో ఎవరూ జీవించి లేరు. మహనీయ అలీ (రజి) తన 'డాలు'లో నీరు నింపుకుని తెస్తుండేవారు. సయ్యిదా ఫాతిమా (రజి.అన్హా) గారు దైవప్రవక్త(సఅసం) ముఖారవిందంపైని రక్తాన్ని కడిగే వారు. అలాగే ఒక చాప కాల్చి, దాని బూడిదను ఆయన (స) గాయాలకు అద్దటం జరిగింది.**

## అధ్యాయం : 163

## యుద్ధ సందర్భంగా పరస్పరం గొడవ పడటం, విభేదించుకోవటం అవాంఛనీయం. నాయకుణ్ణి ఎదిరించటం, అందుకుగాను శిక్ష

అల్ అన్ఫాల్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"పరస్పరం కలహించుకోకండి. అలా జరిగితే మీలో బలహీనత ప్రవేశిస్తుంది. మీ శక్తి (ప్రభంజనం) సన్నగిల్లిపోతుంది." (8: 46)**

**పై ఆయత్‌లో 'రీహుకుమ్' అనే పదం వచ్చింది. దీనికి 'గాలి' అని అర్థం. ఈ పదం యుద్ధ రంగంలో శక్తి అన్న భావంలో ఉంది.**

---

364-1. ముజాహిద్‌కి (యోధునికి) ఏ అవసరం ఏర్పడినా అతని కొరకు దుఆ చేయటం సరైనదే నని దీని ద్వారా రూఢీ అవుతోంది. మహనీయ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ(రజి) గుర్రంపై కుదురుగా కూర్చోలేకపోయేవారు. అల్లాహ్ తన ప్రియతముని ప్రార్థన ద్వారా ఆయన గారి ఈ బలహీనతను దూరం చేశాడు. మరి ఈ మహనీయులే యమన్‌లోని విగ్రహాలయాన్ని (జుల్ ఖలసాను) కూల్చివేశారు.

**366)** మహనీయ అబూ మూసా అష్అరీ (రజి) కథనం : మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ముఆజ్, అబూ మూసాలను యమన్ ప్రదేశానికి పంపిస్తూ ఇలా ఉపదేశించారు : "(ప్రజల కొరకు) సౌలభ్యాలను సమకూర్చండి. కష్టాలకు గురి చెయ్యకండి. వారిని సంతోషపరచండి. వైషమ్యానికి ఆస్కారం ఇవ్వకండి. మీరిరువురూ పరస్పరం ఐకమత్యంతో మెలగండి. విభేదించుకోకండి."

**367)** బరా బిన్ ఆజిబ్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) ఉహుద్ యుద్ధ సందర్భంగా అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)ను యాభై మంది (విలుకాండ్ర)కి అధిపతిగా నియమించి, "మీరిక్కడినుండి కదలవద్దు. పక్షులు (గద్దలు) మనపై పడి తన్నుకుపోతున్నట్టు కనిపించినా సరే కదలవద్దు. నేను మీకు కబురంపే వరకూ ఇక్కడే ఉండాలి.[1] అవిశ్వాసులను మేము ఓడించినట్టు, తొక్కి వేసినట్లు మీరు చూసినా సరే, నేను మిమ్మల్ని పిలిపించే వరకూ మీరు ఇక్కడి నుండి కదలవద్దు" అని కర్తవ్యబోధ చేశారు. పిదప ఇస్లామీయ సేనలు సత్య తిరస్కారులను ఓడించాయి. బరా బిన్ ఆజిబ్(రజి) ఇలా అన్నారు: దైవసాక్షిగా! నేను ముష్రిక్కు స్త్రీలను చూశాను– వారు చాలా వేగంగా పరుగులు తీశారు. ఆ సమయంలో వారి పిక్కలు సైతం కనిపించాయి. వారు తమ బట్టలను పైకెత్తి మరీ పరుగు తీశారు. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) సహచరులు, "యుద్ధ ప్రాప్తిని పోగు చేసుకోండి. జాతి జనులారా! యుద్ధప్రాప్తి (గనీమత్) మీ కళ్ళ ముందరే ఉంది. మీ స్నేహితులు విజయం సాధించారు కదా, ఇక భయం దేనికి?" అని అరవ సాగారు. దానికి అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)అభ్యంతరం తెలుపుతూ, "ఆగండి, దైవప్రవక్త(స) హితోపదేశాన్ని మరచిపోయారా?" అన్నారు. కాని వారు తమ ఇతర స్నేహితులతో కలసి యుద్ధప్రాప్తిని పోగు చేసుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారు. వీరు (వీరిలోని చాలామంది) తామున్న గుట్టను వదలివెళ్ళగానే, పారిపోతున్న అవిశ్వాసులు కాస్తా తిరిగి వచ్చారు. ముస్లింలు ఓటమి భయంతో పలాయనం చిత్తగిస్తున్నారని తలపోసి, దండెత్తి వచ్చారు, అది చాలా సంక్లిష్టమైన ఘడియ. (ఆలి ఇమ్రాన్ సూరాలో చెప్పబడినట్లు) "దైవప్రవక్త(స) వెనుక నిలబడి మిమ్మల్ని పిలుస్తూనే ఉన్నాడు"[2] ఆ క్షణంలో దైవప్రవక్త (స) వెంట 12 మంది సహచరులు మాత్రమే మిగిలారు[3] అవిశ్వాసుల చేతుల్లో డెబ్భయి మంది విశ్వాసులు అమరగతి నొందారు. (అంతకుముందు) బద్ర్ సంగ్రామంలో దైవప్రవక్త(స) తన సహచరులతో కలసి

ముష్రిక్కులకు చెందిన 140 మందికి నష్టం చేకూర్చి ఉన్నారు. వారిలో 70 మంది యుద్ధ ఖైదీలుగా పట్టుబడగా, మరో 70 మంది వధించబడ్డారు. (యుద్ధం ముగిసిన తర్వాత ఒక పర్వతంపై నిలబడి) అబూ సుఫ్యాన్ "ముహమ్మద్(స) తన జాతి వారి మధ్యన ఉన్నారా?" అని బిగ్గరగా కేకేసి అడిగాడు. మూడుసార్లు ఇలా అడిగాడు. కాని దైవప్రవక్త(స), సమాధానం ఇవ్వరాదని సూచించారు. ఆ తర్వాత, "ఇబ్నె అబీ ఖుహాఫా (అబూబకర్-రజి) తన వాళ్ళ మధ్యన ఉన్నాడా?" అని అరిచాడు. ఈ ప్రశ్న కూడా మూడుసార్లు వేశాడు. తరువాత, "ఖత్తాబ్ పుత్రుడు (ఉమర్-రజి) తన జాతి వారిలో ఉన్నాడా?" అని కేకేశాడు. ఈ ప్రశ్న కూడా మూడుసార్లు వేశాడు. ఆ తరువాత అతను తన స్నేహితుల వైపు తిరిగి "వారు ముగ్గురూ వధించ బడ్డార"ని అన్నాడు. ఇది విని ఉమర్(రజి) ఓర్చుకోలేకపోయారు. "ఓయీ దైవ విరోధీ! నీవు చెప్పేదంతా అబద్ధం అన్నదానికి అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు. ఇప్పుడు నీవు ఎవరెవరి పేర్లు చెప్పావో వారంతా బ్రతికే ఉన్నారు. ఇక నీ సంగ తంటావా, నీకు చెడ్డ రోజు రానున్నది" అని ఉమర్(రజి) సమాధానమిచ్చారు. అబూ సుఫ్యాన్ దీనిపై స్పందిస్తూ, "అవునా! ఈ రోజు బద్ర్ దినానికి ప్రతీకారం తీర్చుకున్న రోజు. యుద్ధం కూడా ఒక 'చేద' లాంటిది. (అటూ ఇటూ దోబూచు లాడుతుంది) మీ వర్గం వారిలో కొందరు 'ముస్‌లా' చేయబడి ఉంటారు (చూసుకోండి).[4] ఆ పని చేయమని నేను నా వాళ్ళకు చెప్పలేదు. కాని జరిగిన దానిపై నేను బాధపడటమూ లేదు" అన్నాడు. ఆ తరువాత అతను గర్వాహంకారంతో, 'హుబల్ కీ జై'[5] 'మహెూన్నతుడు హుబల్' అని నినదించసాగాడు. ఇది విన్న దైవప్రవక్త(స), "మీరు అతని ప్రేలాపనలకు జవాబు ఇవ్వరేమి?" అని ప్రియ సహచరులను అడిగారు. 'దైవప్రవక్తా! ఏమని జవాబివ్వాలి?' అని సహచరులు విన్నవించుకోగా, "అల్లాహ్‌యే సర్వోన్నతుడు, అందరికంటే గొప్పవాడు[6] అని చెప్పండి" అని దైవప్రవక్త(స) సూచించారు. "ఉజ్జా మా సహాయకుడు, మీకెవడూ సహాయకుడు లేడు"[7] అని అబూ సుఫ్యాన్ పలికినప్పుడు, "జవాబివ్వరేమిటి?" అని దైవప్రవక్త(స) అడిగారు. 'దైవ ప్రవక్తా! దీనికి జవాబేమిటి?' అని ప్రియ సహచరులు విన్నవించుకోగా, "అల్లాహ్‌యే మా సంరక్షకుడు, సహాయకుడు. మీకెవడూ సహాయకుడు లేడు" అని చెప్పండి అన్నారు.

---

367-1. ఉహుద్ యుద్ధ దినం ఇస్లామీయ చరిత్రలో ముస్లింల పాలిట ఒక దుర్దినం. ఈ యుద్ధంలో ముస్లింలు భారీ ఎత్తున ధన ప్రాణ నష్టానికి గురికావలసి వచ్చింది. ఘోర

## అధ్యాయం : 164

## రాత్రివేళ శత్రు భయం పట్టుకుంటే...

**368) హజ్రత్ అనస్(రజి) కథనం: "మహాప్రవక్త ముహమ్మద్(సఅసం)**

---

పరాజయాన్ని చవిచూడవలసివచ్చింది. ఈ పరాజయానికి ముఖ్య కారణం దైవ ప్రవక్త(స) సూచనను కొంతమంది సహచరులు పాటించకపోవటమే. ఎట్టి పరిస్థితిలోనూ ఈ గుట్టపై నుండి కదలకూడదని దైవప్రవక్త(స) గట్టిగా తాకీదు చేశారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) కూడా పదేపదే దైవప్రవక్త(స) హితోపదేశాన్ని విలుకాండ్రకు గుర్తు చేశారు. కాని వారు తొందరపడి విజయప్రాప్తి కోసం ఎగబడటంతో ఖాలిద్ బిన్ వలీద్ కొండ వెనుక వైపు నుంచి వచ్చి మెరుపు దాడి చేశారు. దాంతో విజయం కాస్తా అపజయంగా మారిపోయింది.

367–2. దైవదాసులారా! మీరు పారిపోతున్నారెందుకు? తిరిగి రండి, ధైర్యంగా సత్య తిరస్కారులను ఎదుర్కొనండి అని దైవప్రవక్త(స) పిలిచారు.

367–3. ఆ క్లిష్ట ఘడియలో దైవప్రవక్త(స) వెంట ఉన్న సహచరులు వీరు: అబూబకర్ సిద్దీఖ్, ఉమర్ ఫారూఖ్, అలీ ముర్తుజా, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, సాద్ బిన్ అబీ వక్కాస్, తల్హా బిన్ ఉబైదుల్లాహ్, జుబైర్ బిన్ అవ్వామ్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్, ఖబ్బాబ్ బిన్ మంజర్, సాద్ బిన్ ముఆజ్, ఉసైద్ బిన్ హుజైర్ (రజిఅల్లాహు అన్హుమ్).

367–4. అంటే 'ముస్లా' చేయటం పిరికితనానికి ఆనవాలు. మృతుల శరీరావయవాలను కోయమని నేను ఆజ్ఞాపించలేదు. అయితే జరిగిన దానిపై నేను బాధపడటమూ లేదు. అన్నాడు అబూసుఫ్యాన్. ఉహుద్ యుద్ధంలో అమరగతి నొందిన మృతుల శరీరావయ వాలను ముష్రిక్కులు కోసివేశారు. అబూ సుఫ్యాన్ భార్య హిందా మహనీయ హమ్జా (రజి) రొమ్మును చీల్చి, ఆయన పచ్చి కాలేయాన్ని కసితీరా నమిలింది. హమ్జా (రజి) భౌతిక కాయంపై నిలబడి వికటాట్టహాసం చేస్తూ గీతాలాపన చేసింది.

367–5. 'హుబల్' ఒక విగ్రహం పేరు. ఆ విగ్రహాన్ని మక్కా విగ్రహారాధకులు కాబా గృహం వద్ద ప్రతిష్టించేవారు. 'హుబల్ కి జై' అని పలకటం ద్వారా అబూ సుఫ్యాన్ తాము పూజించే దేవతకు శుభాకాంక్షలు తెలిపాడు. అంతిమ విజయం నీదే అని, నీ విరోధులైన ఏకేశ్వరోపాసకులు ఓటమి పాలయ్యారని హుబల్కి సంకేత ప్రాయంగా తెలియ పరిచాడు. అబూ సుఫ్యాన్ తెలివికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాదు. ఎందుకంటే హుబల్ ఒక నిర్జీవమైన విగ్రహం మాత్రమే. అది వినజాలదు, కనజాలదు, మాట్లాడజాలదు.

367–6. అంటే అందరికంటే గొప్పవాడు, సాటిలేని వాడు, ఆది మధ్యాంతరహితుడు, అజరుడు, నిత్యుడు అల్లాహ్ మాత్రమే.

367–7. 'ఉజ్జా' కూడా మక్కా ముష్రిక్కులు పూజించే ఒక విగ్రహమే.

**జనులలో అందరికన్నా సుందర స్వరూపులు, అందరికన్నా ఎక్కువ దాతృగుణం కలవారు, అందరికన్నా గొప్ప శూరులు." ఆయన(రజి) ఇంకా ఇలా అన్నారు: ఒకసారి రాత్రి సమయంలో మదీనా వాసులు కలవరం చెందారు. ఎందుకంటే వారికి ఒక (భయంకరమయిన) అరుపు వినిపించింది. తరువాత ఆయన (స) అబూ తల్హాకు చెందిన ఒక గుర్రం-దాని వీపుపై జీను కూడా లేదు- పై స్వారీ అయి పరిస్థితుల నిజస్వరూపాన్ని గురించి తెలుసుకునేందుకు, ఒంటరిగా మదీనా పరిసరాలలోకి వెళ్ళారు. ఆ సమయంలో ఆయన(స) అందరికన్నా ముందున్నారు. పిదప ఆయన(స) తిరిగి వచ్చి, ప్రియ సహచరులను కలుసుకున్నారు. అప్పుడు ఆయన (స) మెడలో ఖడ్గం వ్రేలాడుతూ ఉంది. ఆయన(స) ఇలా అన్నారు : "భయ పడాల్సిన పనిలేదు. భయపడాల్సిన పనిలేదు." ఆ తరువాత దైవప్రవక్త(స) ఇలా పలికారు: "నేనైతే దీనిని ఉప్పొంగే సముద్రంలా కనుగొన్నాను." ఆ గుర్రాన్ని గురించి ఆయన(స) అలా అన్నారు.**

## అధ్యాయం : 165

## శత్రువును చూసి బిగ్గరగా 'యా సబాహా' అని నినదించటం...[1]

**369)** సలమా బిన్ అక్వా (రజి)తెలిపారు : నేను మదీనా మునవ్వరా నుండి **(సిరియా వెళ్ళే మార్గంలో ఉన్న) 'గాబా' ప్రదేశానికి వెళుతున్నాను. గాబా కొండల పైకి చేరుకుంటూ ఉండగానే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు చెందిన ఒక బానిస (రబాహ్) నాకు తారసపడ్డాడు. "ఏమిటి విశేషం?" అని నేను అడిగితే, 'దైవప్రవక్త (స) వారి పాలిచ్చే ఒంటెలు అపహరించబడ్డాయి' అని అతనన్నాడు. "ఎవరు అపహరించార"ని నేనడగ్గా, 'గత్ఫాన్, ఫజారా తెగలవారు' అని అతనన్నాడు. అప్పుడు నేను చాలా బిగ్గరగా (దిక్కులు పిక్కటిల్లేలా) మూడుసార్లు 'యా సబాహా! యా సబాహా' అని నినదించాను. దాంతో మదీనా నలువైపులా నా పిలుపు ప్రతిధ్వనించింది. ఆ తరువాత నేను చాలా వేగంగా ముందుకు వెళ్ళి బందిపోటు దొంగలను చేరుకున్నాను. ఆ ఒంటెలు వారితోపాటే ఉన్నాయి. నేను వాళ్ళపై బాణవర్షం కురిపిస్తూ,**

---

165-1. ఇది అరబ్బు నాట ఆచారం. తమ ఊరికి ఏదయినా విపత్తు వచ్చిపడినప్పుడు వారు ఈ విధంగా పిలుస్తారు. "యా సబాహా" అంటే విపత్కరమైన ఉదయం లేదా అయ్యో! ఉదయ విపత్తు! తొందరగా రండి, మాకు సహాయం చేయండి అని అర్థం.

**"నేను అక్వా పుత్రుడను**

**ఈ రోజు తుచ్ఛులు అంతమయ్యే రోజు"**

**అని అరిచాను. ఆ విధంగా ఒంటెలన్నింటినీ నేను వారి నుండి విడిపించుకున్నాను. వాళ్ళు ఇంకా నీరు త్రాగనే లేదు, వాటిని నేను తోలుకుని రాసాగాను. అంతలో దైవప్రవక్త(స) కూడా వచ్చి నన్ను కలుసుకున్నారు. 'దైవప్రవక్తా! బందిపోటు దొంగలు దాహంతో ఉన్నారు. నా శర పరంపర ధాటికి వాళ్ళు నీరు కూడా త్రాగలేకపోయారు. అందువల్ల వాళ్ళను నిర్బంధించడానికి కొంతమందిని పంపించండి' అని విన్నవించుకున్నాను. దానికి దైవప్రవక్త(స), "ఓ అక్వా పుత్రుడా! నీవు వాళ్ళపై ఎలాగూ ఆధిపత్యం వహించావు. కాబట్టి ఇక పోనివ్వు. మన్నింపుల వైఖరిని అవలంబించు. వాళ్ళు ఇప్పటికే తమ వాళ్ళ వద్దకు చేరుకున్నారు.[1] అక్కడ వారికి ఆతిథ్యం ఇవ్వబడుతోంది" అని సెలవిచ్చారు.**

## అధ్యాయం : 166

## దాడి చేసే సమయంలో, "ఇదిగో చూసుకో, నేను ఫలానా వ్యక్తి పుత్రుడను" అని ఎలుగెత్తి ప్రకటించడం

సలమా బిన్ అక్వా (రజి) బందిపోటు దొంగలపై బాణ ప్రయోగం చేస్తూ, "చూడు, నేను ఫలానా వ్యక్తి కుమారుడను"[1] అని పలికారు.

**370) అబూ ఇస్‌హాఖ్ కథనం ప్రకారం; బరా బిన్ ఆజిబ్(రజి)ను, 'ఓ అబూ ఉమారా! మీరంతా హునైన్ యుద్ధ సందర్భంగా నిజంగానే పరారయ్యారా?' అని ఒక వ్యక్తి ప్రశ్నించగా, బరా బిన్ ఆజిబ్(రజి) ఇచ్చిన సమాధానాన్ని తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ అన్నారు. బరా బిన్ ఆజిబ్ (రజి) ఇలా అన్నారు : "ఆ రోజు ప్రవక్త మహనీయులు (స) తానున్న స్థలం నుండి ఏమాత్రం వెనక్కి తగ్గలేదు.**

---

369–1. సలమా బిన్ అక్వా (రజి) విన్నపానికి సమాధానంగా దైవప్రవక్త (స) చెప్పిన మాట ఆయన(స) గారి అద్భుతాలలో ఒక అద్భుతం. నిజంగానే ఆ బందిపోటు దొంగలు తమ తెగవారైన 'గత్ఫాన్'ను చేరుకున్నారు. ఇకపోతే 'గాబా'; అది సిరియా వెళ్ళే దారిలో ఉన్న ఒక అడవి ప్రదేశం. అక్కడ దట్టమైన వృక్షాలున్నాయి. మహాప్రవక్త(స) వారి ప్రసంగ వేదిక (మింబర్) కొరకు ఈ ప్రాంతంలోని కొయ్యనే ఉపయోగించారు.

166–1. పోరాట సమయంలో శత్రువుపై దాడి చేస్తూ, ఈ విధంగా పలకటం ధర్మసమ్మతమే. ఇది గర్వాతిశయంగా పరిగణించబడదు.

**అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ ఆయన(స) వాహనమైన కంచెర గాడిద పగ్గాలను పట్టుకుని ఉన్నారు. ఆ సమయంలో బహు దైవారాధకులు నలు వైపుల నుండీ ఆయన్ని ముట్టడించారు. ఆయన(స) వాహనం పైనుండి దిగి, (పారి పోతున్న వారినుద్దేశించి) "నేను దైవ సందేశహరుడను. అబద్ధీకుడను కాను. నేను అబ్దుల్ ముత్తలిబ్ పు(పౌ)త్రుడను" అని ఎలుగెత్తి చాటసాగారు. బరా (రజి) ఇలా అంటున్నారు: "ఆ రోజున దైవప్రవక్త(స) కంటే గొప్ప శూరుడు ఎవడూ లేడు."**

## అధ్యాయం : 167

## ఒకవేళ సత్య తిరస్కారులు ఒక ముస్లిం తీర్పును అంగీకరించి తమ కోట నుండి దిగి వస్తే...

**371) హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) వివరించారు: బనూ ఖురైజా యూదులు (మదీనాలోని ఒక కోటలో ఉన్నారు) సాద్ బిన్ ముఆజ్(రజి) మధ్యవర్తిత్వం వహించే షరతుపై కోట విడిచి రావటానికి అంగీకరించారు. దైవప్రవక్త (సఅసమ్) సాద్‌ను పిలిపించారు. ఆ సమయంలో సాద్ ఆ ప్రాంతానికి సమీపంలోనే ఉన్నారు (గాయపడి ఉన్న) సాద్ గాడిదపై స్వారీ అయి వచ్చారు. ఆయన దైవప్రవక్త(స)ను సమీపిస్తుండగా, "మీ నాయకుని కొరకు లేచి నిలబడండి"[1] అని తన సహచరులను ఆదేశించారు. ఎట్టకేలకు ఆయన వాహనం నుండి దిగి, దైవ ప్రవక్త(స) దగ్గరకువచ్చి కూర్చున్నారు. "వారు (బనూ ఖురైజా యూదులు) మీ మధ్యవర్తిత్వానికి అంగీకరించి, ఆయుధాలు పడవేశార"ని ప్రవక్త మహనీయులు(స) అన్నారు (కాబట్టి మీరు వారి వ్యవహారంలో తీర్పు ఇవ్వండి). ఆయన(సాద్) ఇలా అన్నారు: "అలాగైతే నా తీర్పు వినండి. వారిలో యుద్ధం చేయగల వారందరినీ హతమార్చాలి. స్త్రీలు, పిల్లలను బానిసలుగా చేసుకోవాలి."[2] ఈ తీర్పు విని, "మీరు దైవాదేశానుసారం తీర్పు ఇచ్చారు" అని దైవప్రవక్త(స) పలికారు.**

---

371–1. కొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం సాద్ బిన్ ముఆజ్ (రజి) ఆ సమయంలో అస్వస్థతకు గురై ఉన్నారు. ఆయన్ని వాహనం మీదినుంచి క్రిందికి దించటానికి ఇతరుల సహాయం అవసరం అయింది. అందుచేతనే, మీరు నిలబడి ఆయన్ని క్రిందికి దించండి అని దైవప్రవక్త(స) తన సహచరులను ఆదేశించారు.

371–2. సాద్ బిన్ ముఆజ్(రజి) ఇచ్చిన తీర్పు యూదుల షరీఅత్ ప్రకారమే ఉంది. ఆ తీర్పును అమలు పరచనంతవరకూ అక్కడ శాంతిభద్రతలు నెలకొనవు.

## అధ్యాయం : 168

## ఖైదీని హతమార్చటం, ఎవరినయినా నిలబెట్టి లక్ష్యాన్ని ఛేదించటం

**372)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : మక్కా విజయం నాడు ప్రవక్త మహనీయులు(సఅసం) నగరంలో ప్రవేశించినప్పుడు, ఆయన(స) తలపై శిరస్త్రాణం ఉంది. ఆయన(స) ఆ శిరస్త్రాణాన్ని దించుతూ ఉండగా ఒక వ్యక్తి (అబూ బర్జా అస్లమీ) వచ్చి ఇస్లామ్ బద్ధ విరోధి అయిన ఇబ్నె ఖతల్ కాబా గృహ తెరను పట్టుకుని వ్రేలాడుతున్నాడని తెలియపరచగా, "అతనిని అక్కడికక్కడే చంపేయండి"[1] అని ఆయన(స) ఆజ్ఞాపించారు.

## అధ్యాయం : 169

## తమ అధీనంలో ఉన్న వారిని బంధించటం... వధించబడే సమయంలో రెండు రకతుల నమాజ్ చేయటం

**373)** మహనీయ అబూహురైరా (రజిఅన్) తెలియజేసినట్లుగా, అబూ హురైరా మిత్రులు నుడివారు: అవిశ్వాసుల కదలికలను పసిగట్టేందుకు ప్రవక్త మహనీయులు (సఅసమ్) పది మంది ప్రియ సహచరులను పంపారు. ఆసిమ్ బిన్ ఉమర్ బిన్ ఖత్తాబ్ తాతగారైన ఆసిమ్ బిన్ సాబిత్ అన్సారీ(రజి)ని ఆ పయన బృందానికి నాయకునిగా నియమించారు. ఈ పయన బృందం అస్ఫాన్– మక్కాల మధ్యలో నున్న 'హదాత' స్థలానికి చేరుకోగానే, హుజైల్ తెగకు చెందిన ఒక ఉప తెగ బనూ లిహ్యాన్‌కు ఎవరో సమాచారం అందజేశారు. అంతే, ఆ తెగవారు రెండు వందల మంది విలుకాండ్ర దళాన్ని తీసుకుని ఈ గూఢచారుల అన్వేషణలో బయలు దేరారు. వీళ్ళంతా ప్రవక్త సహచరుల అడుగుజాడల్లో నడుస్తూ చివరకు సహాబా కూర్చుని ఖర్జూర పండ్లు తిన్న చోటికి చేరుకున్నారు. అవి మదీనా నగరం నుండి తమ వెంట తెచ్చుకున్న ఖర్జూరాలు. వారిని వెంటాడుతున్నవారు, 'ఇవి యస్రిబ్

---

372–1. ఇబ్నె ఖతల్ పూర్తి పేరు అబ్దుల్లాహ్ బిన్ ఖతల్. ఇతను మొదట్లో ముస్లిమే. కాని అతను ధర్మభ్రష్టుడై, ఒక ముస్లింను వధించి అవిశ్వాసుల్లో చేరిపోయాడు. వేశ్యల చేత దైవ ప్రవక్త(స)ను, ముస్లింలను తూలనాడుతూ పాటలు పాడించేవాడు. నరరూప రాక్షసులపై పవిత్ర కాబా గృహంలో కూడా ప్రతీకారం తీర్చుకోవచ్చునన్న దానికి ఈ హదీసు తార్కాణం.

(మదీనా) ఖర్జూర విత్తనాల'ని అన్నారు. ఆ తరువాత కూడా వారు సహాబా అడుగు జాడలను గమనిస్తూ ముందుకు సాగారు. చివరకు ఆసిమ్(రజి) బృందం వాళ్ళను చూడగానే ఒక పర్వత శిఖరంపైకెక్కి రక్షణ పొందింది. 'ఆయుధాలు పడవేసి క్రిందికి దిగి రండి. మీకూ– మాకూ మధ్య నిర్యుద్ధ ఒడంబడిక ఉంది. మేము మీలో ఎవరినీ చంపబోము' అని ముష్రిక్కులు వారితో అన్నారు. ఆ బృందానికి నాయకుడుగా ఉన్న ఆసిమ్ బిన్ సాబిత్(రజి), "ఈ రోజు నేను ఏ అవిశ్వాసి రక్షణలోకీ రాను. ఓ అల్లాహ్! మేము ముట్టడించబడిన సంగతిని దైవప్రవక్త(స)కు తెలియపరచు" అని పలికారు. దాంతో ఆ విలుకాండ్రు బాణాలు ప్రయోగించారు. ఆసిమ్ బిన్ సాబిత్ (రజి) సహా ఏడుగురు సహాబా అమరగతి నొందారు. మిగిలిన ముగ్గురు సహాబా వాళ్ళ మాటను నమ్మి కొండ దిగివచ్చారు. వారిలో ఒకరు ఖుబైబ్ అన్సారీ, రెండవ వారు ఇబ్నె దసినా, మూడవ వారు అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్ బల్వీ (రజి అల్లాహు అన్హుమ్). ఈ ముగ్గురు సహాబా వారి అదుపులోకి రాగానే, వారు తమ ధనుస్సుల త్రాళ్ళను తీసి వారిని బంధించారు. "దైవసాక్షిగా! ఇది మీ మొదటి మోసం. నేను సుతరామూ మీతో రాను. నేను అమరవీరులైన నా సహవాసుల వైఖరికే కట్టుబడి ఉంటాను" అని అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్(రజి) చెప్పారు. కాని ముష్రిక్కులు ఆయన్ని బలవంతంగా తమ వైపు లాగారు. ఆయన ఎంతకీ లొంగక పోవడంతో ఆయన్ని కూడా చంపేశారు. చివరకు వారు ఖుబైబ్‌ను, ఇబ్నె దసినాను బంధించి తమ వెంట తీసుకెళ్ళి, మక్కాలో అమ్మివేశారు. ఇది బద్ర్ సంగ్రామం తరువాత జరిగిన సంఘటన. ఖుబైబ్ (రజి)ను హారిస్ బిన్ ఆమిర్ బిన్ నౌఫల్ కొడుకులు కొన్నారు. బద్ర్ సంగ్రామంలో హారిస్ బిన్ ఆమిర్‌ను చంపినది ఖుబైబ్ (రజి)గారే. ఆయన వాళ్ళ వద్ద కొన్నాళ్ళపాటు ఖైదీగా ఉన్నారు. (జుహ్రీ ఇలా అంటున్నారు) నాకు అబ్దుల్లాహ్ బిన్ అయాజ్ తెలియపరిచారు. ఆయనకేమో హారిస్ కూతురు (జైనబ్–ర.అ) చెప్పారు. (ఖుబైబ్‌ను హతమార్చడానికి) జనులు గుమిగూడుతుండగా, ఆయన జైనబ్‌నుండి మంగలి కత్తి అడిగి తెప్పించుకున్నారు– నాభి క్రింది వెంట్రుకలను క్షవరం చేసుకోవడానికి. ఆమె కత్తి ఇచ్చారు (జైనబ్– ర.అ– ఇలా అన్నారు): ఖుబైబ్ నా పిల్లవాణ్ని తన వద్దకు పిలిచారు. ఆ పిల్లవాడు ఆయన దగ్గరకు వెళ్ళినప్పుడు నేను పరధ్యానంలో ఉన్నాను. జైనబ్ ఇలా అంటున్నారు: నా పిల్లవాడు ఆయన తొడపై కూర్చుని ఉన్నాడు. మరోవైపు ఆయన

చేతిలో కత్తి ఉంది. ఆ దృశ్యం చూసి నేను భయాందోళన చెందాను. ఖుబైబ్(రజి) నా ముఖ కవళికలను పసిగట్టి “నేనీ పిల్లవాణ్ణి చంపేస్తానని భయపడుతున్నావేమో! బాగా తెలుసుకో. నేనెన్నటికీ అలా చేయలేను” అన్నారు. ‘దైవసాక్షి! నేను ఖుబైబ్(రజి) కన్నా మంచి ఖైదీని చూడలేదు. దైవసాక్షిగా చెబుతున్నాను. నేనొక రోజు ఆయన చేతిలో ద్రాక్షపండ్ల గుత్తిని చూశాను. వాటిని ఆయన తింటున్నారు. నిజానికి ఆ సమయంలో ఆయన ఇనుప సంకెళ్ళతో బంధించబడి ఉన్నారు. మక్కాలో అది పండ్లు ఫలాలు లభించే సీజన్ కూడా కాదు. అది దైవప్రసాదిత ఉపాధి. దానిని అల్లాహ్ ఖుబైబ్(రజి) కొరకు పంపాడు’.

బహుదైవారాధకులు ఆయన్ని వధించడానికి హరమ్(పుణ్యక్షేత్రం) పరిధి వెలుపల– వధ్య స్థలానికి – తీసుకువచ్చినప్పుడు, “నాకు కేవలం రెండు రకతుల నమాజ్ ఆచరించేందుకు అనుమతించండి” అని ఖుబైబ్(రజి) ఆ ముష్రిక్కులను కోరారు. వాళ్ళు ఆయనకు అనుమతి ఇచ్చారు. ఖుబైబ్(రజి) రెండు రకతుల నమాజ్ చేసుకుని, “నేను (హత్యకు) భయపడుతున్నానన్న ఆలోచన మీకు రాకుండా ఉండే మాటైతే, నేను (నమాజు) రకతులను మరింత సుదీర్ఘం చేసి ఉండేవాడిని. ఓ అల్లాహ్! ఈ దౌర్జన్యపరులలో ఒక్కొక్కడిని అంతమొందించు” అని పలికారు. ఆ తరువాత అరబీలో కవితలు చదివారు. వాటి సారాంశమిది : “నేను ముస్లిమునై వధించబడుతుండగా నాకు చింత ఏల? దైవమార్గంలో నేను ఏ వైపు నుండి గాయ పరచబడినా, అది కేవలం దైవప్రసన్నతను బడయటానికే. ఆయన గనక తలచు కుంటే ముక్కలుముక్కలుగా నరకబడినవాని శరీరావయవాల ముక్కల్లో కూడా శుభం వొసగగలడు.” చివరకు హారిస్ కొడుకు (ఉఖబా) ఆయన్ని షహీద్ చేశాడు. ఖైదీగా పట్టుకున్న తర్వాత హత్య చేసే ముందు రెండు రకతుల నమాజ్ చేసుకోవటం అనే సంప్రదాయం హజ్రత్ ఖుబైబ్(రజి)తోనే మొదలయింది. ఈ దుస్సంఘటన ప్రారంభమైనప్పుడే (ఆ బృందానికి నాయకుడైన) మహనీయ ఆసిమ్ బిన్ సాబిత్ (రజి) ప్రార్థనను అల్లాహ్ ఆలకించి జరిగినదంతా తన ప్రవక్త(స)కు ఎరుకపరి చాడు. తరువాత దైవప్రవక్త(స) తన ప్రియ సహచరులకు ఎదురైన ఆ ఘోరకలిని గురించి సహాబాకు విడమరచి చెప్పారు. హజ్రత్ ఆసిమ్(రజి) అమరగతి నొందా రన్న సమాచారం విన్న ఖురైష్ అవిశ్వాసులు, ఆయన మృతదేహాన్ని తెమ్మని కొంత మంది మనుషుల్ని పంపారు. మహనీయ ఆసిమ్(రజి) బద్ర్‌యుద్ధంలో ఖురైషుల

**ఒక నాయకుణ్ణి (ఉఖబా బిన్ అబీ ముఅయ్‌త్‌ని) చంపి ఉన్నారు. ప్రతీకారంగా ఆసిమ్(రజి) మృత శరీరాన్ని 'ముస్‌లా' చేయాలని మక్కాలోని సత్య తిరస్కారులు అనుకున్నారు. అయితే అల్లాహ్ కందిరీగల ఒక గుంపును ఆసిమ్(రజి) భౌతిక కాయంపై నియుక్తం చేశాడు. అవి ఖురైషు ముష్కరుల బారి నుండి ఆసిమ్(రజి) మృతదేహాన్ని కాపాడాయి. తత్కారణంగా వారు ఆసిమ్ శరీరంలోని ఏ అవయవాన్ని కూడా కోయలేకపోయారు.** [1]

## అధ్యాయం : 170

## (ముస్లిమ్) ఖైదీలకు స్వేచ్ఛ నొసగటం

**374) ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూ మూసా అష్అరీ(రజి) తెలియజేశారు: "ఖైదీని విడుదల చేయండి, ఆకలిగొన్నవానికి అన్నం పెట్టండి, రోగిని పరామర్శించండి".** [1]

**375) అబూ జుహైఫా(రజి) తెలిపారు: నేను హజ్రత్ అలీ(రజి)ని అడిగాను - '(ప్రవక్త ఇంటివారలైన) మీ దగ్గర దైవగ్రంథం తప్ప వేరే ఏదైనా 'వహీ' (దివ్య వాణి) కూడా ఉందా?' అని. దానికి ఆయన ఇచ్చిన జవాబు ఇది- "నేలను చీల్చి విత్తనాన్ని మొలకెత్తించిన వాని సాక్షిగా! ప్రాణాన్ని సృష్టించిన వాని తోడు!! (ఖుర్‌ఆన్‌లో లేని) 'వహీ' గురించి నాకు తెలీదు. కాకపోతే 'అవగాహన'(ప్రావీణ్యం)**

---

373-1. ఉజల్, ఖార్రా ప్రాంతాలకు చెందిన కొంతమంది చేసుకున్న అభ్యర్థనపై దైవప్రవక్త(స) ఈ పయన బృందాన్ని పంపారు. ఇంతకీ ఏం జరిగిందంటే, ఉహుద్ యుద్ధం తర్వాత కొంతమంది ప్రవక్త(స) సన్నిధికి వచ్చి, తాము ఇస్లాం స్వీకరించదలిచామని, తమ శిక్షణ కొరకు కొంతమంది సహాబాను పంపమని కోరారు. అందువల్ల దైవప్రవక్త(స) 1) ముర్సిద్ బిన్ అబీ ముర్సిద్ 2) ఖాలిద్ బిన్ బుకైర్ 3) ఖుబైబ్ బిన్ అదీ 4) ఆసిమ్ బిన్ సాబిత్ 5) జైద్ బిన్ దసినా 6) అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్ (రజి.అన్‌హుమ్)లను వారి వెంట పంపారు. దారిలో బనూ లిహ్యాన్ తెగవారు మోసంతో వారిపై దాడిచేసి చంపేశారు.

374-1. ఈ మూడు సత్కార్యాలు విశ్వాస జగతిలోనూ, నైతిక ప్రపంచంలోనూ గొప్ప ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. బాధితుడైన ఒక ఖైదీని విడుదల చేయటం ఎంత గొప్ప పుణ్యకార్యమంటే, దాని మహత్తును గురించి ఎవరూ ఊహించనైనాలేరు. ఒక ఆకలిగొన్నవానికి అన్నం పెట్టడం గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో ఆయత్‌లే అవతరించాయి. అలాగే వ్యాధి గ్రస్తుడైన వ్యక్తిని పరామర్శించటం గొప్ప సత్కార్యమని హదీసుల ద్వారా తెలుస్తోంది.

**అనేది వేరే వస్తువు. దానిని అల్లాహ్ ఏ దాసునికైనా ఖుర్ఆన్ ద్వారా ప్రసాదిస్తాడు (తద్వారా అతను ఖుర్ఆన్ నుండి రకరకాల మతలబులను వెలికితీస్తాడు) లేదా ఈ 'పత్రం'లో ఉన్నది". 'ఈ పత్రంలో ఏమని లిఖించబడి ఉంది?' అని నేనడిగితే, "దియత్ (రక్తశుల్కపు) ఆదేశాలు, ఖైదీని విడిపించటం, ఒక ముస్లిం సత్య తిరస్కారికి బదులుగా చంపబడకుండా ఉండటం (ఈ ఆదేశాలు మాత్రమే ఈ పత్రంలో లిఖించబడి ఉన్నాయి)"[1] అని ఆయన చెప్పారు.**

## అధ్యాయం : 171

## బహుదైవారాధకుల నుండి పరిహారం పుచ్చుకోవడం

**376) అనస్ బిన్ మాలిక్(రజి) తెలియజేశారు : అన్సార్ వర్గానికి చెందిన కొంతమంది సహచరులు దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! మేము మా మేనల్లుడైన[1] అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ 'ఫిదియా' (నష్టపరిహారం)ను మన్నించి వదలిపెట్టాలని అనుకుంటున్నాము. ఇందుకుగాను తమరి ఆనతి అవసరం' అని విన్నవించుకోగా, "ఆయన ఫిదియాలో నుండి ఒక్క దిర్హమ్ కూడా వదలిపెట్టకండి" అని ప్రవక్త మహనీయులు(స) సెలవిచ్చారు.**

**వేరొక సనదు ద్వారా అందిన హదీసు ప్రకారం మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా తెలిపారు : ప్రవక్త మహనీయుల (సఅసమ్) వద్దకు బహ్రైన్ నుండి సొమ్ము వచ్చింది. అప్పుడు హజ్రత్ అబ్బాస్(రజి) ప్రవక్తశ్రీ(స) సన్నిధికి**

---

375–1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. దీని ద్వారా షియా ప్రబుద్ధులు అల్లిన కట్టుకథలు ఖండించబడ్డాయి. దివ్య ఖుర్ఆన్‌లో మరెన్నో ఆయత్‌లున్నాయని, వాటిని దైవప్రవక్త(స) అందరికీ తెలియపరచకుండా కేవలం 'అహ్లె బైత్' (ప్రవక్త ఇంటివారలకు) మాత్రమే తెలియపరిచారని షియా వర్గీయులంటారు. ఇది పచ్చి అబద్ధం.

మహాప్రవక్త (స) ముష్రిక్కుల మధ్యన నిస్సహాయులుగా ఉన్నప్పుడే దేనినీ కప్పిపుచ్చకుండా బాహాటంగా ప్రకటించారు. అలాంటప్పుడు మదీనాలో వేలాది శిష్యుల మధ్యన ఉండగా ఏవైనా కొన్ని వాక్యాలను రహస్యంగా ఉంచవలసిన అవసరం ఏముంటుంది?

376–1. హజ్రత్ అబ్బాస్(రజి) అన్సార్ల మేనల్లుడు కారు. 'ఈయన తల్లి కూడా అన్సార్ మహిళ కారు. అయితే హజ్రత్ అబ్బాస్ నాన్నగారైన అబ్దుల్ ముత్తలిబ్ అన్సార్ల మేనల్లుడు. ఆయన తల్లి సలమా బనీ నజ్జార్ తెగకు చెందినవారు. అబ్బాస్ తండ్రి మేనల్లుడు కావటాన కొడుకును కూడా వారు మేనల్లుడుగా సంబోధించారు.

**వచ్చి, 'దైవప్రవక్తా! ఈ సొమ్ములో నుండి నాకూ ఇవ్వండి. ఎందుకంటే లోగడ (బద్ర్ యుద్ధ సందర్భంగా) నేను నా తరఫున, అఖీల్ తరఫున కూడా నష్టపరిహారం (ఫిదియా) చెల్లించాను' అని విన్నవించుకున్నారు. ఇది విన్న దైవప్రవక్త(స), "అలా గైతే ఇదిగో తీసుకోండి"[2] అంటూ ఆయన వస్త్రంలో నగదు సొమ్ము కట్టించి ఇచ్చారు.**

**377) తన తండ్రి (జుబైర్ బిన్ ముత్యిమ్– రజి) తెలియజేసినట్లు ముహమ్మద్ బిన్ జుబైర్ వివరించారు. ఆయన బద్ర్ యుద్ధ ఖైదీలను విడిపించడానికి దైవప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చినప్పుడు (అప్పటికి ఆయన ఇస్లాం స్వీకరించ లేదు). "మగ్రిబ్ నమాజులో దైవప్రవక్త(స) తూర్ సూరా పారాయణం చేసినట్లుగా నేను విన్నాను" అని చెప్పారు.**

## అధ్యాయం : 172

## శత్రు వర్గానికి చెందిన అవిశ్వాసి రక్షణ పొందకుండానే ముస్లింల రాజ్యంలోనికి జొరబడితే...

**378) తనకు తన తండ్రి (సలమా–రజి) తెలిపినట్లుగా ఇయాస్ బిన్ సలమా బిన్ అక్వాయి (రజి) చెప్పారు: ఆయన చెప్పిన దాని ప్రకారం; దైవప్రవక్త(స) ఒక ప్రయాణంలో ఉండగా, బహు దైవారాధకులకు చెందిన ఒక గూఢచారి వచ్చాడు (ఆ సమయంలో దైవప్రవక్త– సఅసం– హవాజిన్ యుద్ధరంగానికి వెళుతున్నారు). ఆ గూఢచారి ప్రవక్త సహచరుల సమూహంలో కూర్చుని, వారితో ముచ్చటించి మరీ వెళ్ళాడు. అప్పుడు దైవప్రవక్త(స), "అతన్ని వెతికి చంపేసేయండి" అని ఆదేశిం చారు. అందువల్ల (సలమా బిన్ అక్వాయి–రజి) అతన్ని వెతికి చంపేశారు. హతుని ఆయుధాలను, వస్తు సామగ్రిని దైవప్రవక్త(స) సలమాకు ఇప్పించారు.**

## అధ్యాయం : 173

## జిమ్మీ[1] అవిశ్వాసుల రక్షణకై పోరాడటం. వారిని బానిసలుగా చేసుకోరాదు

**379) మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) (మరణ సమయంలో) ఈ**

---

376–2. అబ్బాస్ తరఫున 'ఫిదియా' చెల్లిస్తామని అన్సార్లు విన్నవించుకున్నప్పుడు దైవప్రవక్త(స) అంగీకరించలేదు. ఎందుకంటే ఆ సమయంలో అబ్బాస్ దగ్గర ధనం ఉంది. మరోవైపు ముస్లింలు పేదరికంలో మగ్గుతున్నారు. అలాంటప్పుడు బంధుప్రీతితో తన వారికి సహాయం చేయటం న్యాయం కాదు. అందుకే దైవప్రవక్త(స) నిష్పక్షపాతంగా వ్యవహ రించారు.

**విధంగా పలికినట్లు అమ్ర్ బిన్ మైమూన్ తెలిపారు : నా తదనంతరం అధికారం లోనికి వచ్చే ఖలీఫాకు నేను చేసే వసీయతు ఏమిటంటే; (జిమ్మీలతో) దైవం, దైవప్రవక్త(స) చేసుకున్న ఒడంబడికను అతను సజావుగా నెరవేర్చాలి. ఇంకా వారికి అండగా వారి శత్రువులతో యుద్ధం చేయాలి. వారి శక్తికి మించిన బరువును వారిపై మోపకూడదు.**

## అధ్యాయం : 174

## (దౌత్యం కొరకు వచ్చిన) అవిశ్వాసులతో ఎలా వ్యవహరించాలి?

## అధ్యాయం : 175

## జిమ్మీల కొరకు సిఫారసు. వారి పట్ల వ్యవహారం

**380) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఈ విధంగా చెప్పినట్లు సయీద్ బిన్ జుబైర్ తెలిపారు: అది గురువారం రోజు. గురువారం రోజు గురించి మీకేం తెలుసు? ఇలా అన్న తరువాత ఆయన(రజి) ఎంతగా ఏడ్చారంటే, నేలపైని కంకర రాళ్లు సయితం (కన్నీటితో) తడిసి పోయాయి. చివరకు ఆయన ఇలా అన్నారు: గురువారం నాడే దైవప్రవక్త(సఅసం) వ్యాధి తీవ్రతరం అయింది. అప్పుడాయన(స) తన ప్రియ సహచరులతో, 'కలము, సిరా తీసుకురండి. నేను మీ కొరకు ఒక పత్రం వ్రాయించి వెళతాను. మీరు (నా తదనంతరం) తదనుగుణంగా నడుచుకుందురు గాని. తద్వారా మీరు ఎన్నటికీ దారి తప్పరు"[1] అని చెప్పారు. దానిపై సహాబాలో**

---

173-1. ముస్లింలతో ఒడంబడిక చేసుకుని, అభయం పొందిన అవిశ్వాసులను 'జిమ్మీ'లంటారు. ఒడంబడికననుసరించి వారు ముస్లిం పరిపాలకులకు 'జిజ్యా' చెల్లిస్తారు. జిజ్యా పుచ్చుకున్నందుకుగాను జిమ్మీల ధన మాన ప్రాణాలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత ముస్లిం పాలకునిపై ఉంటుంది. ఒకవేళ జిమ్మీలు ఒడంబడికను ఉల్లంఘించి ద్రోహం చేసినట్లయితే, అప్పుడు వారిపై సైనిక చర్యకు ఆస్కారముంటుంది.

380-1. ప్రవక్త మహనీయులు(స) దేని గురించి 'పత్రం' వ్రాయించదలిచారు? అంటే అది అబూబకర్ సిద్దీఖ్(రజి) ఖిలాఫత్ గురించే. అయితే ఆయన(స) ఒక వైపున తన సహచరుల మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాన్ని, మరో వైపున తన అస్వస్థతను దృష్టిలో ఉంచుకుని తన సంకల్పాన్ని ఉపసంహరించుకున్నారు. అదలా ఉంచితే తన జీవిత కాలంలోనే దైవప్రవక్త(స) నమాజ్‌కు నాయకత్వం (ఇమామత్) వహించమని అబూ

అభిప్రాయభేదం పొడసూపింది. అది గమనించిన ప్రవక్త మహనీయులు(స), "దైవ ప్రవక్త సమక్షంలోనే గొడవ పడుతున్నారా? ఇది మీకు శోభాయమానం కాద" న్నారు. ఇది విన్న సహచరులు, 'అయ్యో, ప్రవక్త మహెూదయులు(స) (తీవ్ర అస్వస్థత కారణంగా) వ్యాకులతకు లోనవుతున్నార'ని అన్నారు. "నన్ను మరింత బాధించకండి. ఇప్పుడు నేనున్న స్థితిలోనే నన్ను వదలిపెట్టండి. మీరు చేయించ దలచిన దానికంటే ఇదే మెరుగైనది" అని ప్రవక్త మహనీయులు(స)పలికారు. ఎట్టకేలకు ఆయన(స) తన మరణ సమయంలో మూడు వసీయతులు చేశారు– అవేమంటే 1) బహు దైవారాధకులను అరేబియా ద్వీపం నుండి వెళ్ళగొట్టాలి 2) దౌత్యబృందాలతో నేను వ్యవహరించినట్లుగానే మీరూ వ్యవహరించాలి (అంటే వారికి తగు రీతిలో మర్యాద చేయాలి) 3) మూడవ సూచనను నేను మరిచి పోయాను. యాఖూబ్ బిన్ ముహమ్మద్ ఇలా అంటున్నారు: అరబ్బు ద్వీపం గురించి నేను ముగీరా బిన్ అబ్దుర్రహ్మాన్‌ను అడిగితే, 'మక్కా, మదీనా, యమామ, యమన్‌ల పరిధిలో ఉన్న ప్రదేశమే అరేబియా ద్వీపం' అని ఆయన అన్నారు. 'తిహామా' 'అర్జ్' నుండి మొదలవుతుందని యాఖూబ్ చెప్పారు. (మక్కా- మదీనా మార్గంలో ఉన్న ఒక మజిలీ పేరే 'అర్జ్')

## అధ్యాయం : 176

## ప్రతినిధి బృందాలతో సమావేశమయ్యేందుకు తగు రీతిలో సన్నద్ధమవడం

**381)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పినట్లుగా సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ తెలియజేశారు : బజారులో పట్టుతో నేయబడిన ఒక జత దుస్తులు అమ్మకానికి ఉంచగా, గమనించి ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) దానిని దైవప్రవక్త(సఅసం) సన్నిధికి

బకర్(రజి)ను ఆదేశించి, తన తదనంతరం జరగవలసిందేమిటో సూచనప్రాయంగా చెప్పనే చెప్పారు. ముస్లింలోని హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖనం ప్రకారం తన సతీమణి ఆయిషా(ర.అ)తో దైవప్రవక్త(స) ఇలా చెప్పారు : "నీ తండ్రి అబూబకర్‌ను పిలిపించు. నీ సోదరుణ్ణి కూడా– నేను ఒక పత్రం వ్రాయించి ఇవ్వగలందులకు. నా తదనంతరం ఎవరయినా ఖిలాఫత్‌ను ఆశించవచ్చనీ, తానే ఆ పదవికి హక్కుదారుడనని ప్రకటించ వచ్చునని నేను భయపడుతున్నాను. వాస్తవానికి అల్లాహ్ మరియు విశ్వాసులంతా ఈ గొప్ప సేవకై అబూబకర్(రజి)ను ఎంపిక చేసుకున్నారు".

తీసుకువచ్చి 'దైవప్రవక్తా! ఈ దుస్తుల్ని తమరు కొనుగోలు చేయండి- పండుగ సందర్భాలలోనూ, ప్రతినిధి బృందాలతో సమావేశమవుతున్నప్పుడూను దీనిని ధరించండి, బేషుగ్గా ఉంటుంది' అని విన్నవించుకున్నారు. దానికి ప్రవక్త మహనీయులు (స), "పరలోకంలో ఏ వాటా కూడా లభించని వారు ధరించే దుస్తులివి. (లేదా ఇలా అన్నారు) పరలోకంలో వాటా దొరకని వారే ఈ దుస్తుల్ని ధరించగలరు" అని పలికారు. ఆ తరువాత అల్లాహ్ కోరినంత కాలం హజ్రత్ ఉమర్(రజి) మౌనం వహించారు. పిదప దైవప్రవక్త(స) ఆయన దగ్గరకు ఒక పట్టు జుబ్బాను పంపించగా, ఉమర్(రజి) దానిని తీసుకుని దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై ఇలా విన్నవించుకున్నారు : 'అయ్యా! దైవప్రవక్తా! పరలోకంలో ఏ భాగం లభించని వారివి ఈ దుస్తులు' అని తమరన్నారు కదా! మరి ఇలాంటి దుస్తుల్నే తమరు నాకు ఎందుకు పంపించినట్టు?' దీనికి సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "నీవు దీనిని అమ్ముకుని, తద్వారా వచ్చిన సొమ్ముతో నీ అవసరం ఏదైనా తీర్చుకుంటావన్న ఉద్దేశ్యంతోనే దీనిని నీ వద్దకు పంపించాను."

## అధ్యాయం : 177

## చిన్నపిల్లవానికి ఇస్లామ్ గురించి ఎలా చెప్పాలి?

**382)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ప్రవక్త మహనీయుల (స)తో కలసి ఆయన సహచరులు కొంతమంది- ఆ బృందంలో ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కూడా ఉన్నారు- (యూదు కుర్రాడైన) ఇబ్నుస్సయ్యాద్ దగ్గరకు వెళుతున్నారు. చివరకు ఇబ్నుస్సయ్యాద్ (అన్సార్ల తెగ అయిన) బనూ మగాలా వాడలో పిల్లలతో ఆడుకుంటూ వారి కంటపడ్డాడు. ఇబ్నుస్సయ్యాద్ అప్పుడప్పుడే ప్రాజ్ఞ వయస్సుకు చేరుకుంటున్నాడు (తనను పలకరించడానికి) మహాప్రవక్త(స) వస్తున్నారన్న సంగతి అతనికి తెలీదు. మహాప్రవక్త(స) తన చేతిని అతని వీపుపై చరచి, "నేను దైవసందేశహరుణ్ణి అని నీవు సాక్ష్యం ఇస్తున్నావా?"[1] అని అడిగారు. ఇబ్నుస్సయ్యాద్ ఆయన(స) వైపు ఎగాదిగా చూసి, 'అవును, మీరు నిరక్షరాస్యుల (అరబ్బుల)

382-1. "నేను దైవసందేశహరుణ్ణి అని నీవు సాక్ష్యమిస్తున్నావా?" అని మహాప్రవక్త(స) ప్రశ్నించారు. ఇదే ఈ హదీసులోని ముఖ్యాంశం. ఇబ్నుస్సయ్యాద్ నుండి మహాప్రవక్త(స) కొంత సమాచారం రాబట్టాలనుకున్నారు. అబద్ధీకుడవైన నీవు దైవప్రవక్తవు ఎలా అవుతావు? అని అడిగి వుంటే బహుశా అతను రెచ్చిపోయేవాడు. అందుకే

**ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాన'న్నాడు. ఆ తరువాత అతను దైవప్రవక్త (సఅసం) నుద్దేశించి, 'నేను దైవప్రవక్తనని తమరు సాక్ష్యమిస్తున్నారా?' అని ప్రశ్నించాడు. దానికి ఆయన(స)"నేను అల్లాహ్‌ను, ఆయన (సత్య) సందేశహరులను విశ్వసించాన"ని మాత్రం సమాధానమిచ్చారు. ఆపైన ప్రవక్త మహనీయులు(స), "మరైతే నువ్వేం చూస్తున్నావ్?" అని ప్రశ్నించగా, 'నా దగ్గరకు వచ్చే సమాచారాల్లో ఒకటి నిజమైనదై ఉంటే, మరొకటి అబద్ధం కూడా అయి ఉంటుంది' అని ఇబ్నుస్సయ్యాద్ జవాబిచ్చాడు. దానికి ఆయన(స) "యథార్థం గురించి నీవు సంశయంలో పడ్డావు" అన్నారు. "సరే. నీ గురించి నేను నా మనసులో ఒకటి తలంచాను. అదేమిటో చెప్పు" అని ఆయన(స) ప్రశ్నించగా, 'పొగ' అని ఇబ్నుస్సయ్యాద్ బదులిచ్చాడు. ఇది విని, "దౌర్భాగ్యుడా! నీవున్న స్థితి నుండి ముందుకు వెళ్ళలేవు" అని దైవప్రవక్త (స) పలికారు. 'దైవప్రవక్తా! తమరు ఆనతినిస్తే ఇతని తల నరికేస్తాన'ని మహనీయ ఉమర్(రజి) విన్నవించుకోగా, "ఒకవేళ వీడు వాడే (దజ్జాల్) అయివుంటే, వీణ్ణి నీవు నియంత్రించలేవు. ఒకవేళ వాడు కాకపోతే వీడి ప్రాణం తీయటం నీకు మంచిది కాద"ని ప్రవక్త మహనీయులు (స) అన్నారు.**

**మరొక సనదు ప్రకారం మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా తెలిపారు : ఒకసారి ప్రవక్త మహనీయులు(సఅసం) ఉబై బిన్ కాబ్ (రజి)తో కలసి ఇబ్నుస్సయ్యాద్ మకాం వేసిన ఖర్జూరతోటకు వెళ్ళారు. ఆయన(స) తోటకు చేరుకుని ఖర్జూరపు మట్టల చాటున ముందుకు నడవసాగారు. తన రాక గురించి అతనికి తెలియకూడదనీ, తాను మాత్రం అతని మాటల్ని చాటుగా వినాలని దైవప్రవక్త(స) భావించారు. ఆ సమయంలో ఇబ్నుస్సయ్యాద్ తన పడకపై కంబలి కప్పుకుని పడుకుని, ఏవో కూనిరాగాలు తీస్తున్నాడు. అంతలో అతని తల్లి ఖర్జూర పొదలచాటున ముందుకు వస్తున్న దైవప్రవక్త(స)ను చూసి, "ఓ సాఫ్!" అని అరచి అతన్ని సావధానపరచింది. సాఫ్ అతని అసలు పేరు. తల్లి అరుపు విని ఇబ్నుస్సయ్యాద్ ఉలిక్కిపడ్డాడు. "అతని తల్లి గనక అతన్ని అలాగే ఉండనిస్తే అతని గుట్టు రట్టయ్యేది"[2] అని దైవప్రవక్త(స) చెప్పారు.**

---

దైవప్రవక్త(స) ఎంతో పారదర్శకంగా వ్యవహరించారు. చివరకు అతని మాటల ద్వారా అతని తిరస్కార ధోరణి వ్యక్తమయింది.

382-2. ఇబ్నుస్సయ్యాద్ బండారాన్ని బట్టబయలు చేయాలని అంతిమ దైవప్రవక్త(స) తలపోశారు. కాని అతని తల్లి అతన్ని సావధానపరచడంతో అతను ఉలిక్కిపడి లేచాడు.

**(వేరొక సనదు ప్రకారం) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తనతో చెప్పారని సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసం) తన సహచరుల నుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన(స) అల్లాహ్ ఘనతకు తగ్గట్టుగా ఆయన్ని కీర్తించారు. ఆ తరువాత దజ్జాల్‌ను గురించి ప్రస్తావిస్తూ, "నేను కూడా వాడి (ఉపద్రవాల) గురించి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. వాడి ఉపద్రవాల గురించి తన జాతి జనులకు హెచ్చరించని ప్రవక్త ఎవరూ గడవలేదు. మహనీయ నూహ్ (అలైహిస్సలామ్) కూడా తన జాతి వారికి వాడి గురించి భయపెట్టారు. అయితే నేను వాడి గురించి గతంలో ఏ ప్రవక్తా చెప్పని ఒక విషయాన్ని మీకు చెబుతున్నాను. అదేమిటంటే దజ్జాల్ ఒంటి కన్నువాడై ఉంటాడు. కాగా; అల్లాహ్ ఇలాంటి లోపానికి అతీతుడు, పవిత్రుడు"[3] అన్నారు.**

## అధ్యాయం : 178

## "మీరు గనక ఇస్లామ్ స్వీకరిస్తే (ఇహపరాలలో) శాంతినొందుతార"ని దైవప్రవక్త(స) (యూదులతో) చెప్పటం

**సయీద్ మఖ్‌బరీ మహనీయ అబూహురైరా (రజి) నుండి ఈ హదీసును ఉటంకించారు.**

## అధ్యాయం : 179

## ఒకవేళ ఎవరయినా 'దారుల్ హరబ్'లో ఉంటూ, ఇస్లామ్ స్వీకరిస్తే, వారి స్థిరచరాస్తులు వారికే చెందుతాయి.[1]

లేకుంటే ఆ అబద్ధీకుని నిజస్వరూపం బయట పడేదే.

382-3. పంజాబ్ రాష్ట్రంలోని ఖాదియాన్‌లో కూడా ఒక అబద్ధాగ్రేసరుడు తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్నాడు. అతని అనుయాయులు ప్రపంచమంతా విస్తరించారు. వారు తమ్ము తాము ముస్లింలుగా చెప్పుకుంటారు. కాని వారు ఇస్లాం పరిధిలో లేరు. వారి విశ్వాసాలు ఖుర్‌ఆన్ హదీసులకు విరుద్ధమైనవి. ప్రఖ్యాత ముస్లిం విద్వాంసులు ఖాదియానీల మిథ్యా విశ్వాసాలను ఖండిస్తూ పుస్తకాలు రాశారు. ధార్మిక తీర్పులు వెలువరించారు.

179-1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ అధ్యాయాన్ని తీసుకువచ్చి హనఫీల దృక్పథం సరైనది కాదని నిరూపించారు. హనఫీలేమంటారంటే ఎవరయినా హరబీ అవిశ్వాసి ముస్లింగా ధర్మపరివర్తన చెంది 'దారుల్ హరబ్'లోనే నివాసమున్నట్లయితే, అదే సమయంలో

**383) ఉసామా బిన్ జైద్(రజి) వివరించారు : నేను వీడ్కోలు హజ్జ్ యాత్ర సందర్భంగా, 'దైవప్రవక్తా! తమరు రేపు (మక్కాలో) ఎక్కడ విడిది చేస్తార'ని ప్రవక్త మహనీయుల(సఅసం)ను అడిగితే, "అఖీల్ మా కొరకు ఏ ఇల్లు విడిచిపెట్టాడని (అక్కడ విడిది చేయడానికి)?"[1] అని ఆయన(స) చెప్పారు. తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు: "రేపు మన విడిది స్థలం ఖైఫ్ బనీ కనానాకు చెందిన 'ముహస్సబ్' లోయ అయి ఉంటుంది. అక్కడ ఖురైషులు తమ తిరస్కార వైఖరి (కుఫ్ర్)పై శపథం చేశారు." ఇంతకీ ఏం జరిగిందంటే బనీ కనానా (కనానా తెగవారు), ఖురైషులు ఆ లోయలోనే గుమిగూడి, బనూ హాషిమ్‌కు వ్యతిరేకంగా ప్రతినబూనారు. బనూ హాషిమ్‌తో క్రయ విక్రయాలు జరపబోమని, (దైవప్రవక్తను తమకు అప్పజెప్పే వరకూ) వారిని తమ ఇండ్లలోనికి రానివ్వబోమని శపథం చేశారు– పర్వత లోయను 'ఖైఫ్' అంటారని జుహ్రీ అభిప్రాయపడ్డారు.**

**384) తన తండ్రి తనతో ఇలా చెప్పారని జైద్ బిన్ అస్లమ్ తెలియజేశారు: ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) హునీ అనే తన బానిసను (ప్రభుత్వ) మేత ప్రదేశాలపై అధికారిగా నియమిస్తూ అతనికి ఇలా సూచించారు : "హునీ! జాగ్రత్త! ముస్లింల వ్యవహారంలో నీ చేతిని కట్టిపెట్టుకో (వారిపై దౌర్జన్యం చేయకు). బాధితుల ఆక్రం దన నుండి ఎల్లవేళలా తప్పించుకుంటూ ఉండు. ఎందుకంటే బాధితుల వేడుకోలు**

---

ముస్లింలు దారుల్ హరబ్‌పై దండెత్తి విజయం సాధించినట్లయితే, అక్కడి స్థిరచరాస్తులు ఆ న్యూ ముస్లింలకు దక్కవు. అవి విజేత అయిన ముస్లిం రాజ్యానికి దత్తమవుతాయి.

383–1. అబూ తాలిబ్ అబ్దుల్ ముత్తలిబ్ పెద్ద కుమారుడు. అబ్దుల్ ముత్తలిబ్ తదనంతరం అక్కడి (అజ్ఞాన) ఆచారం ప్రకారం ఆ కుటుంబ ఆస్తినంతటినీ అబూ తాలిబ్ స్వాధీనం చేసుకున్నారు. అబూ తాలిబ్ చనిపోయిన కొన్ని రోజుల తరువాత దైవప్రవక్త(స), హజ్రత్ అలీ (రజి) మదీనాకు వలస వచ్చారు. అప్పటివరకూ అఖీల్ ముస్లిం కాలేదు. మక్కాలోనే ఉన్నాడు. ఆయన అబూ తాలిబ్ నుండి సంక్రమించిన స్థిరచరాస్తులన్నింటినీ అమ్ముకుని జలసా చేశాడు.

ఈ హదీసు ఆధారంగా ఇమామ్ బుఖారీ (రహ్మా) ఏర్పరచిన అధ్యాయం చెప్పేదేమంటే; మక్కా విజయం తర్వాత కూడా ఆ ఇండ్ల, భూముల అమ్మకాన్ని దైవప్రవక్త(స) రద్దు పరచలేదు. అంతేకాదు, అఖీల్ స్వాధీనంలో ఉన్న ఆస్తికి కూడా అధికారికంగా గుర్తింపు నిచ్చారు– అంటే ఇస్లాం స్వీకారానికి ముందు అఖీల్‌కు ఏవిధంగా యాజమాన్యపు హక్కులుండేవో, ఇస్లాం స్వీకారం తరువాత కూడా ఉంటాయని అంగీకరించారు.

(దుఆ– చాలా తొందరగా) ఆమోదించబడుతుంది. చూడు! ఇబ్నె ఔఫ్, ఇబ్నె అఫ్ఫాన్, ఇంకా ఇలాంటి ధనికులకు చెందిన పశువుల విషయంలో భయపడుతూ ఉండు (అంటే వారు ధనికులైన కారణంగా మేత ప్రదేశాలలో వారికి బీదసాదలపై ప్రాధాన్యత వొసగకు).[1] ఎందుకంటే ఒకవేళ వారి పశువులు చచ్చిపోయినా, ఆ సంపన్నులు తమ తోటల, పంట పొలాల ద్వారా తమ ఫలసాయాన్ని రాబట్టగలరు. కాని లెక్కించదగిన కొన్ని ఒంటెలు, మేకలున్న పేద యజమాని పరిస్థితి ఏమిటి? అతని పశువులు గనక చచ్చిపోతే, అతను తన పిల్లల్ని తీసుకుని నా దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేస్తాడు– 'అమీరుల్ మోమినీన్! అమీరుల్ మోమినీన్! (వీళ్ళని పోషించు). తండ్రి లేకపోయినంత మాత్రాన, నేను వీళ్ళను (పోయి చావండి అని) వదులుకో గలనా ఏమి?' అని నిలదీసి అడుగుతాడు. నేను వాళ్ళ కోసం వెండీ బంగారాలను సమకూర్చటంకన్నా (ముందు నుంచే) వారి కోసం పశుగ్రాసం, నీరు సమకూర్చటం ఎంతో సులభం. అల్లాహ్ సాక్షిగా! నేను వాళ్ళ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నానని వాళ్ళు (మదీనావాసులు) అనుకుంటున్నారేమో! ఎందుకంటే ఈ భూములు వారివే. వారు అజ్ఞాన కాలంలో ఈ భూముల కోసం యుద్ధాలు చేశారు. వారు ఇస్లాం స్వీక రించిన మీదట కూడా వారి యాజమాన్యపు హక్కును కొనసాగించటం జరిగింది. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను. జిహాద్ కొరకు యోధులకు వాహనాలను (గుర్రం తదితరాలను) సమకూర్చే బాధ్యత నాపైన లేకుండా ఉంటే, ఈ ప్రాంతాలలో ఒక్క జానెడు భూమిని కూడా నేను మేత మేసే స్థలంగా వదలిపెట్టేవాణ్ణి కాను."

## అధ్యాయం : 180

## ఖలీఫా తరఫున జనగణన

**385**) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించినట్లుగా హ్రజత్ హుజైఫా(రజి) తెలిపారు : "ఎవరయితే ఇస్లామ్ కలిమా (సద్వచనం)

---

384–1. మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్; మహనీయ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజిఅల్లాహు అన్హుమా) మదీనాలో పెద్ద ధనికులు. అంతమాత్రాన వారి పశువులకు మేత ప్రదేశాలలో తొలి ప్రాధాన్యత ఇవ్వటం న్యాయం కాదు. ఆ విషయానికి వస్తే సన్నకారు రైతులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఒకవేళ ఈ పేదల పశువులు చచ్చిపోతే ప్రభుత్వ ధనాగారం నుండి వారికి నష్టపరిహారం చెల్లించాలి. కలవాడు ఏదో ఒకవిధంగా నెట్టుకు వస్తాడు. లేనివాడికి అప్పు పుట్టదు కదా!

పఠించి ముస్లింలుగా పరివర్తన చెందారో వారి పేర్లు లిఖించి నాకు సమర్పించండి"– హుజైఫా ఇలా అంటున్నారు : మేము వెయ్యిన్నరమంది పురుషుల పేర్లు లిఖించి, ఆయన(స) సేవలో సమర్పించాము. 'మా జనసంఖ్య వెయ్యిన్నరకు చేరుకుంది. ఇక మాకు భయమేల?' అని దైవప్రవక్త(స) ముందు అభిప్రాయపడ్డాము. కాని (మహాప్రవక్త–సఅసం– తదనంతరం) మేము చూస్తున్నాము, మేము ఉపద్రవాలలో ఎలా చిక్కుకుపోయామంటే, ఇప్పుడు ముసల్మాను ఒంటరిగా నమాజ్ ఆచరించడానికి కూడా భయపడుతున్నాడు.

**386)** వేరొక సనదు ద్వారా ఉటంకించబడిన ఇదే హదీసులో ఈ జనాభా సంఖ్య ఐదువందలు అని ఉంది. అబూ ముఆవియా ద్వారా ఉల్లేఖించబడిన దానిలో ఈ సంఖ్య ఆరువందల నుండి ఏడువందల వరకు ఉంటుంది అని ఉంది.

**387)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం: ఒక వ్యక్తి మహాప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! ఫలానా యుద్ధంలో పాల్గొనవలసిన వారి జాబితాలో నా పేరు వ్రాయబడింది.[1] మరో వైపున నా భార్య హజ్జ్ యాత్రకు బయలుదేరుతోంది (ఇప్పుడు నేనేం చేయాలి?)' అని విన్నవించుకోగా, "నువ్వు తిరిగి వెళ్ళు. (ముందు) నీ భార్యతో కలసి హజ్జ్ విధిని ఆచరించు"[2] అని ప్రవక్త మహనీయులు(స) ఆదేశించారు.

## అధ్యాయం : 181

## ఒక్కోసారి ఒక పాపాత్ముని చేత కూడా అల్లాహ్ ధర్మసేవ చేయించుకుంటాడు

**388)** మాకు అబుల్ యమాన్ చెప్పారు. తనకు షుఐబ్ తెలియపరిచారని ఆయనన్నారు. ఆయనకేమో జుహ్రీ తెలియజేశారు...

(వేరొక సనదు ప్రకారం)

**389)** మహనీయ అబూహురైరా(రజి) వివరించారు. మేము దైవప్రవక్త(స)తో కలసి ఒక యుద్ధంలో పాల్గొన్నాము. దైవప్రవక్త(స), తనను ముస్లింగా

387–1. ఈ హదీసు ద్వారా కూడా జనాభా సేకరణ ఆవశ్యకత విదితమవుతోంది.

387–2. ఒక స్త్రీ హజ్జ్ యాత్రకు వెళుతున్నప్పుడు ఆమె భర్త గానీ లేదా ఆమె 'మహ్రమ్' పురుషుడుగానీ తోడుగా వెళ్ళవలసిన అవసరం ఉందని దీని ద్వారా బోధపడుతున్నది.

చెప్పుకునే ఒక వ్యక్తి గురించి చెబుతూ, "అతడు నరకానికి ఆహుతి అయ్యేవారిలో ఒకడు" అని అన్నారు. యుద్ధం మొదలైనప్పుడు ఆ వ్యక్తి (ముస్లింల తరఫున) తన పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ పోరాడాడు. చివరకు అతను గాయపడ్డాడు. అప్పుడు ప్రియసహచరులు, 'దైవప్రవక్తా! తమరు ఏ వ్యక్తి గురించి, అతను నరకానికి ఆహుతి అవుతాడని అన్నారో, అతను ఈ రోజు వీరోచితంగా పోరాడాడు (గాయపడి) మృత్యువాతన పడ్డాడు' అని విన్నవించుకోగా, ఆయన(స) అప్పుడు కూడా అదే సమాధానమిచ్చారు– "అతడు నరకానికి ఆహుతి అయ్యాడ"ని. హజ్రత్ అబూ హురైరా ఇలా అంటున్నారు– ఆ వ్యక్తి విషయమై జనుల ఆంతర్యంలో సంశయం రేకెత్తే ఆస్కారం కనిపించింది. దాని గురించి ప్రజలు చింతాగ్రస్తులై ఉండగానే, 'అతనింకా చావలేదు. క్షతగాత్రుడయ్యాడు' అని ఎవరో అన్నారు. అయితే రాత్రయ్యాక ఆ వ్యక్తి గాయాల బాధను భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారం దైవప్రవక్త(సఅసం)కు అందజేసినప్పుడు, "అల్లాహు అక్బర్! నేను అల్లాహ్ దాసుణ్ణి. ఆయన సందేశహరుణ్ణి అని నేను సాక్ష్యమిస్తున్నాను" అని ఆయన (స) పలికారు. తరువాత ఆయన(స) బిలాల్ (రజి)ని పిలిచి ఆజ్ఞ జారీ చేశారు. బిలాల్ ప్రజల మధ్యన ప్రకటన గావించారు– "ముస్లింలు తప్ప వేరెవరూ స్వర్గంలో ప్రవేశించలేరు. కాకపోతే అల్లాహ్ అప్పుడప్పుడూ అవిధేయుల చేత కూడా తన ధర్మానికి (దీన్‌కు) సేవ చేయించుకుంటాడు."

## అధ్యాయం : 182

## ఏ వ్యక్తి అయినా శత్రు భయం ఉన్నప్పుడు, నాయకుని తదుపరి ఆజ్ఞకై నిరీక్షించకుండానే సేనాధిపతిగా బాధ్యత స్వీకరించడం

**390)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసం) ముతా యుద్ధ సందర్భంగా (మదీనాలో) ఉపన్యసిస్తూ ఇలా అనసాగారు: ఇదిగో, ఇస్లామీయ ధ్వజం ఇప్పుడు జైద్ బిన్ హారిసా చేతిలో ఉంది. కాని ఆయన వీర మరణం పొందాడు. ఇదిగో, జాఫర్ ఆ జెండాను తన చేతిలోకి తీసుకున్నాడు. ఆయన కూడా అమరగతి నొందాడు.. ఇప్పుడు ఆ జెండా అబ్దుల్లాహ్ బిన్ రవాహ చేతిలోకి వచ్చింది. అయితే ఆయన కూడా షహీద్ అయ్యాడు. ఎట్టకేలకు ఖాలిద్ బిన్ వలీద్ – ఎవరి ఆజ్ఞ కొరకు కూడా వేచి ఉండకుండా– సమయస్ఫూర్తితో ఇస్లామీయ ధ్వజవాహకుడయ్యాడు. ఆయన చేతుల మీదుగా విజయం ప్రాప్తించింది.

**నా కొరకు అందులో ఎలాంటి సంతోషం లేదు లేదా ఆయన(స) ఇలా అన్నారు: వారు మన వద్ద జీవించి ఉండటం వారి కొరకు సంతోష దాయకం కాదు. (ఎందు కంటే అమరగతి నొందిన తరువాత వారు స్వర్గంలో ఓలలాడుతున్నారు).” ఈ మాటలంటున్నప్పుడు దైవప్రవక్త(స) కంట కన్నీరొలికిందని హ్రజత్ అనస్(రజి) చెప్పారు.**

## అధ్యాయం : 183

## సహాయం కొరకు సైన్యాన్ని పంపించడం

**391) మహనీయ అనస్(రజి) కథనం: రీల్, జక్వాన్, ఉసైయ్యా, బనూ లిహ్యాన్ తెగలకు చెందిన కొంతమంది ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) సన్నిధికి వచ్చి, తాము ఇస్లాం స్వీకరించినట్లు నమ్మబలికారు. అవిశ్వాస జనులకు వ్యతిరేకంగా తమకు సర్వవిధాలా తోడ్పడమని అభ్యర్థించారు. ధార్మిక శిక్షణ, ధర్మప్రచారం విషయంలో కూడా తమకు సహాయపడమని విన్నవించుకున్నారు. వారి వినతిని పురస్కరించుకుని డెబ్భయి మంది అన్సార్ సహాబాను దైవప్రవక్త(స) వాళ్ళ వెంట పంపారు. అనస్ ఇలా అంటున్నారు: మేము ఆ సహాబీలను ‘ఖారీలు’ అనేవారం. ఆ త్యాగధనులు పగటి పూట కట్టెల్ని ప్రోగుచేసేవారు. రాత్రి వేళ నమాజులో నిమగ్నులై ఉండేవారు. వారంతా ఆ తెగ వారి వెంట వెళ్ళిపోయారు. కాని బీరె మవూనా వద్దకు చేరుకోగానే ఆ తెగవారు మోసంతో ఈ సహాబాను చంపే శారు. దైవప్రవక్త(స) నెలరోజుల వరకూ ఈ అమరగతుల తరఫున (నమాజులో) ఖునూత్ వేడుకోలు చేశారు– అనస్(రజి) తనతో చెప్పినట్లు ఖతాదా తెలిపారు. (ఆ అమరవీరుల గురించి) మేము ఖుర్ఆన్‌లోని ఆయత్‌ను ఈ విధంగా పఠించే వారం; (అనువాదం) “మేము మా ప్రభువు వద్దకు చేరుకున్నామనీ, ఆయన మా యెడల ప్రసన్నుడయ్యాడనీ, మమ్మల్ని కూడా ఆయన పట్ల సంతుష్టుల్ని చేశాడని మా (జాతి) జనులకు తెలియపరచండి”[1] – తరువాత ఈ ఆయత్ రద్దయింది.**

---

391–1. ఆ విద్వాంసులను ఆమిర్ బిన్ తుఫైల్ వధించాడని, ఈ అమానుష చర్య కోసం అతడు బనూ సులైమ్ జనాన్ని సమీకరించాడని అనబడుతోంది. కాగా; రీల్, జక్వాన్, బనూ లిహ్యాన్ తెగల వారు ఆసిమ్(రజిఅన్)ను ఆయన సహచరులను హతమార్చారు. హ్రజత్ ఖుబైబ్(రజి)ను మక్కాలో అమ్మేశారు. ఈ రెండు సంఘటనల సమాచారం దైవ ప్రవక్త(స)కు తెలిసిపోయింది. నెలరోజల వరకూ (నమాజులో) ఆయన ఖునూత్ దుఆ చేశారు.

## అధ్యాయం : 184

## శత్రువుపై విజయం సాధించిన వ్యక్తి మూడు రోజుల వరకూ వారి మైదానంలో ఆగి ఉండటం

**392)** అనస్ బిన్ మాలిక్(రజి) మహనీయ అబూ తల్హా (రజి) నుండి సంగ్ర హించి వివరించిన హదీసు : మహాప్రవక్త ముహమ్మద్(సఅసం)కు ఎప్పుడయినా, ఏదయినా జాతిపై విజయం లభించినప్పుడు, ఆ సమరక్షేత్రంలో ఆయన(స) మూడు రాత్రుల వరకూ ఆగి ఉండేవారు- రౌహ్ బిన్ ఉబాదాతోపాటు ఈ హదీసును ముఆజ్, అబ్దుల్ ఆలా కూడా ఉటంకించారు.

## అధ్యాయం : 185

## ప్రయాణంలోనూ, యుద్ధంలోనూ విజయప్రాప్తిని పంపిణీ చేయటం

రాఫె బిన్ ఖదీజ్ తెలిపారు : మేము జుల్ హులైఫాలో దైవప్రవక్త(సఅసం) వెంట ఉన్నాము. మాకు మేకలు, ఒంటెలు విజయప్రాప్తి (మాలె గనీమత్)గా లభిం చాయి. దైవప్రవక్త(స) పది మేకల్ని ఒక ఒంటెకు సమానంగా ఖరారు చేసి, పంచి పెట్టారు.

**393)** మహనీయ అనస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(స) 'జీరానా' (తాయఫ్- మక్కాల మధ్యన ఉన్న ఒక స్థలం పేరు) నుండి 'ఇహ్రామ్' దీక్షబూనారు. అక్కడే ఆయన(స) 'హునైన్' యుద్ధప్రాప్తిని కూడా పంచిపెట్టారు.[1]

## అధ్యాయం : 186

## ఏ ముస్లిం సంపదనయినా బహుదైవారాధకులు దోచుకుని వెళితే, తరువాత ఆ సంపద ఆ ముస్లింకు లభిస్తే...

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ఈయన గారి గుర్రం ఒకటి పరారై నప్పుడు శత్రు రాజ్యానికి చెందినవారు దానిని పట్టుకున్నారు. తరువాత ఆ శత్రురాజ్యంపై ముస్లింలు విజయం సాధించినప్పుడు ఆ గుర్రం ఆయనకు తిరిగి

393-1. 'హునైన్' అనేది ఒక లోయ పేరు. ఇది మక్కా నగరానికి మూడు మైళ్ళ దూరాన ఉంది. అక్కడే ఒక భీకర యుద్ధం జరిగింది. అధ్యాయం (185)లోని మకుటంలో యుద్ధ ప్రస్తావన ఉంది. ఇదే ఇందలి ప్రధానాంశం.

**ఇవ్వటం జరిగింది. ఈ సంఘటన దైవప్రవక్త(సఅసం) కాలంలో జరిగింది. అలాగే ఈయన గారి బానిస ఒకడు పారిపోయి రోము రాజ్యంలో శరణు పొందాడు. తరువాత ముస్లింలకు ఆ రాజ్యంపై విజయం వరించినప్పుడు ఖాలిద్ బిన్ వలీద్(రజి) ఆయన బానిసను ఆయనకు తిరిగి అప్పగించారు. మహాప్రవక్త(స) తదనంతరం జరిగిన సంఘటన ఇది.**[1]

**394)** నాఫె కథనం ప్రకారం ఇబ్నె ఉమర్(రజి)కు చెందిన ఒక బానిస **పరారై రోము రాజ్యంలోని అవిశ్వాసులలో చేరిపోయాడు. తరువాత ఖాలిద్ బిన్ వలీద్(రజి) సారథ్యంలో (ముస్లిం సేనకు) విజయం వరించినప్పుడు, ఖాలిద్(రజి) ఆ బానిసను ఆయనకు తిరిగి ఇప్పించారు. ఇంకా, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కే చెందిన ఒక గుర్రం పారిపోయి రోము చేరుకుంది. ఖాలిద్ బిన్ వలీద్(రజి) రోమనులపై విజయం సాధించినప్పుడు, ఆయన ఆ గుర్రాన్ని కూడా వాపసు చేసేశారు.**

**395) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ముస్లిం సైన్యం రోమనులను మార్కొన్న రోజున ఆయన ఒక గుర్రంపై స్వారీ అయి ఉన్నారు. హజ్రత్ అబూబక్ర్(రజి) తరఫున ఖాలిద్ బిన్ వలీద్(రజి) ఆ సైన్యానికి అధిపతిగా ఉన్నారు. ఆ గుర్రం రోము సైన్యానికి పట్టుబడింది. అయితే ఆ యుద్ధంలో రోమనులు ఓటమి పొందిన తరువాత ఖాలిద్ బిన్ వలీద్(రజి) ఆ గుర్రాన్ని అబ్దుల్లాహ్(రజి)కు తిరిగి ఇచ్చేశారు.**

## అధ్యాయం : 187

## పారసీక భాషలో లేదా మరేదయినా అజమీ భాషలో మాట్లాడటం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **"(ఇంకా దైవ సూచనలలో) మీ భాషల, రంగుల వైవిధ్యాలూ ఉన్నాయి."** ***(అర్ రూమ్: 22)***

**"మేము మా సందేశాన్ని అందజేసే నిమిత్తం ప్రవక్తను పంపినప్పుడల్లా,**

---

186-1. ఈ విషయంలో భిన్నాభిప్రాయం ఉంది. అవిశ్వాసులు ముస్లింల సొమ్ముకు యజమానులు కాలేరని, ఒక ముస్లింకు చెందిన సొమ్ము వారి వద్ద లభ్యమైనప్పుడు దానిని ఆ ముస్లింకు ఇప్పించటం జరుగుతుందని షాఫియీలు, అహ్లెహదీసు వర్గం వారు అంటారు. ఒకవేళ ఆ సొమ్ము పంపిణీ అయిపోయి ఉంటే అది తిరిగి ఇప్పించబడదని ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. కాగా; అవిశ్వాసులు ముస్లింల ధనాన్ని దోచుకుని తమ రాజ్యానికి తీసుకుపోయినప్పుడు దానికి వారు యజమానులైపోతారని ఇమామ్ అబూ హనీఫా(రహ్మ) అంటారు.

**అతడు తన జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే మా సందేశాన్ని అందజేశాడు, వారికి అతను విషయాన్ని చక్కగా అర్థమయ్యేటట్టు చెప్పటానికి."[1] (ఇబ్రాహీమ్ : 4)**

**396) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ చెప్పగా తాను విన్నానని సయీద్ బిన్ మీనా తెలియజేశారు. (జాబిర్ ఇలా చెప్పారు) : నేను (కందక యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయుల– సఅసం–ను ఆకలితో ఉండటం పసిగట్టి, ఆయన దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా) 'దైవప్రవక్తా! మేము ఒక చిన్న మేకపిల్లను జిబహ్ చేశాము. ఒక 'సా' యవల పిండిని కూడా వండాము. అందువల్ల తమరు ఇద్దరు ముగ్గురు మనుషుల్ని వెంటబెట్టుకుని భోజనానికి రండి' అని విన్నవించుకున్నాను. కాని ప్రవక్త మహనీయులు(స) హెచ్చు స్వరంతో, "కందకం త్రవ్వేవారలారా! జాబిర్ మన కోసం భోజనం తయారు చేశాడు. త్వరగా పదండి"[1] అని పిలిచారు.**

**397) ఉమ్మె ఖాలిద్ బిన్తె ఖాలిద్ బిన్ సయీద్(ర.అ) కథనం : నేను మా నాన్న గారితో కలసి ప్రవక్త మహనీయుల(సఅసం) సన్నిధిలో హాజరయ్యాను. ఆ సమయంలో నేను కుంకుమపువ్వు రంగు చొక్కా ధరించి ఉన్నాను. దైవప్రవక్త(స) దానిని గమనించి, "సనా... సనా" అని పలికారు– ఈ పదం అబిసీనియన్ల భాషలో "బాగుంది" అన్న అర్థంలో వాడుతారని అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ చెప్పారు–**

---

187–1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ ఈ అధ్యాయాన్ని ఏర్పరచటంలోని ఉద్దేశం– ప్రపంచంలోని ఏ భాషలో మాట్లాడటమైనా, ఏ భాషను నేర్చుకోవటమయినా సరైనదేనని చెప్పటమే. ఎందుకంటే భాషలన్నీ దేవుని తరపునయే.

"హెచ్చరిక చేసేవాడెవ్వడూ రాని జాతి ఏదీ లేదు" (ఫాతిర్– 24) అన్న దైవవచనం కూడా ఈ సందర్భంగా గమనార్హమే. మరి ఆ హెచ్చరిక చేసే ప్రవక్త ఏ జాతిలో వచ్చినా, ఆ జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే సంభాషించాడు. కాబట్టి ఆంగ్లమైనా, హిందీ అయినా, తెలుగు అయినా, ఫ్రెంచి భాష అయినా– ఏ భాష అయినాసరే నేర్చుకోవటం, మాట్లాడటం సరైనదే.

396–1. విందు భోజనం అన్న అర్థంలో దైవప్రవక్త(స) 'సూరన్' అనే పదాన్ని ప్రయోగించారు. ఇది పారసీక పదం. మాటల మధ్యలో దైవప్రవక్త(స) ఒక అరబ్బేతర –పారసీక– పదాన్ని ప్రయోగించి తన విశాల హృదయతను చాటుకున్నారు. మానవ సముదాయాల మధ్య కలహాలకు, కలతలకు గల కారణాలలో ఒకటి భాషా దురభిమానం. మరి చూడబోతే భాషలన్నీ దైవంచేత సృష్టించబడినవే. ప్రపంచం ఒక్కటిగా కుంచించుకుపోతున్న ఆధునిక యుగంలో కూడా భాషా దురభిమానం ప్రజల మధ్య ఉండటం శోచనీయం.

**తరువాత ఆమె ఇలా అన్నారు: తరువాత నేను ఆయన(స) (రెండు భుజాల మధ్యన- వీపుపై- ఉన్న) దైవ దౌత్యపు 'ముద్ర'తో ఆడుకోసాగాను. ఇది గమనించిన మా నాన్నగారు నన్ను మందలించారు. దానిపై దైవప్రవక్త(స) "ఆమెను మందలించకు (చిన్నపిల్ల కదా!)" అని సముదాయించారు. పిదప ఆయన(స) ఉమ్మె ఖాలిద్ కోసం (దీర్ఘాయుష్షు కొరకు) ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన(స) "చొక్కాను బాగా తొడిగి పాతబడేలా చెయ్యి"[1] అని మూడు సార్లు పలికారు. అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ ఇలా అంటున్నారు : తరువాత ఆ చొక్కా ఎంతకాలం వరకు చినగకుండా ఉందంటే, దాని గురించి జనులు చర్చించుకోసాగారు.**

**398) మహనీయ అబూ హురైరా (రజి) కథనం : హసన్ బిన్ అలీ (రజి) సదకాగా వచ్చిన ఖర్జూరపండ్లలో నుంచి ఒక ఖర్జూరాన్ని తీసుకుని నోట్లో వేసుకోబో తుండగా, ప్రవక్త మహనీయులు(సఅసమ్) పారశీక భాషలోని ఒక పదాన్ని పలు కుతూ (తన మనవణ్ణి) ఆపారు. "కజ్... కజ్[1] మనం సదకా సొమ్ము తినము అన్న విషయం నీకు తెలియదా?" అని చెప్పారు. ఇక్రిమా ఇలా అంటున్నారు: హబషీ భాషలో మంచిది, బాగుంది అని అనడానికి 'సనా' అనే పదాన్ని ప్రయోగిస్తారు.**

## అధ్యాయం : 188

## యుద్ధప్రాప్తి పంపిణీ అవకముందే అందులో నుండి కొంత అపహరించటం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **నమ్మకద్రోహానికి ఒడిగట్టినవాడు ప్రళయం నాడు తన నమ్మకద్రోహంతోపాటు హాజరవుతాడు** ***(ఆలి ఇమ్రాన్: 161)***

**399) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) మమ్మల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ నమ్మకద్రోహం (ఖియానత్, గులూల్) గురించి ప్రస్తావించారు. ఆ నేరం వల్ల మూడే ముప్పును గురించి**

---

397-1. చొక్కా బాగుంది అని చెప్పడానికి ప్రవక్త మహనీయులు(స) అజమీ పదం (ఇథియో పియన్ల భాష) పలికారు- 'సనా... సనా' అని. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం. ఉమ్మె ఖాలిద్ చాలాకాలం జీవించి ఉన్నారు. ఆమె ఆ చొక్కాను చాలా ఎక్కువగా తొడగటం వల్ల అది నల్లబడిపోయింది. ఇది కూడా దైవప్రవక్త(స) ప్రార్థనా ఫలమే.

398-1. పిల్లలు ఏదయినా చెయ్యకూడని పని చేస్తున్నప్పుడు, దానిపట్ల అయిష్టతను వ్యక్తం చేస్తూ పారసీక భాషలో 'కజ్ కజ్' అంటారు.

వివరిస్తూ ఇలా అన్నారు: "నేను మీలో ఎవరినీ ప్రళయదినాన, అతని భుజం మీద మేక మోపబడి ఉండగా అతడు అరుస్తూ ఉన్న స్థితిలో చూడకూడదు సుమా! లేదా అతని భుజం మీద గుర్రం మోపబడి ఉండగా అతను అరుస్తూ ఉన్నస్థితిలో కనుగొన కూడదు సుమా! అతను నన్ను కేకవేసి పిలుస్తూ, 'దైవప్రవక్తా! నన్ను ఆదుకోండి' అంటుంటాడు. కాని నేను అతని పిలుపునకు సమాధానంగా,"నేను నిన్ను ఏవిధంగానూ ఆదుకోలేను. నేనైతే (దైవ సందేశాన్ని) నీ వరకూ చేరవేశాను" అని అంటాను. అతని భుజంపై ఒంటె మోపబడి ఉండగా, అతడు 'యా రసూలల్లాహ్! నాకు సహాయపడండి' అని అరుస్తూ ఉన్న స్థితిలో ఎవరూ నాకు తారసపడరాదు సుమా! నేనతని పిలుపునకు జవాబుగా, "నేను నీకు ఏవిధంగానూ సహాయపడ లేను. నేను ప్రభువు సందేశాన్ని నీ వరకూ చేరవేశాను" అని అంటాను. లేదా అతను తన భుజంమీద బంగారం, వెండి, తదితర సామగ్రి మోపబడి ఉన్న స్థితిలో (వచ్చి) 'దైవప్రవక్తా! నాకు తోడ్పడండి' అని దీనంగా అభ్యర్థించే దురవస్థ రానీయరాదు. నేనతని అభ్యర్థనకు సమాధానంగా "నేను నీకు ఏవిధంగా కూడా తోడ్పడలేను. నేను దైవసందేశాన్ని నీకు ముందే చేరవేశాను కదా" అంటాను. లేదా అతని భుజం మీద (వస్త్రపు) థాను ముక్కలు మోపబడి ఉండగా, (గాలికి అవి) రెపరెపలాడుతూ ఉండగా, 'దైవప్రవక్తా! నాకు సహాయం చేయండి' అని అరిచే దుస్థితిని రానీయ కూడదు. నేనతని అరుపులకు జవాబుగా, "నేను నీకు ఏవిధంగానూ సహాయం చేయలేను. నేనైతే దైవ సందేశాన్ని ముందుగానే చేరవేశాను" అని అంటాను– అబూ అయ్యూబ్ సుఖ్తియానీ కూడా అబూ హయ్యాన్ నుండి ఉటంకించిన దానిలో "సకిలించే గుర్రం మోపబడి ఉండగా చూస్తే" అని ఉంది.

## అధ్యాయం : 189

## యుద్ధ ప్రాప్తిలో నుండి కొద్దిపాటి సొమ్ము కాజేయటం

**400)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు: మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) వారి సామాన్లు, సరుకులపై ఒక వ్యక్తి పర్యవేక్షకుడుగా నియమితుడై ఉన్నాడు. అతని పేరు కిర్కిరా (అతనొక అబిసీనియన్). అతను మరణించినప్పుడు,"అతను నరకాగ్నికి ఆహుతి అయ్యాడ"ని ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పారు. ప్రవక్త సహచరులు ఆ వ్యక్తిని చూడటానికి వెళ్ళినప్పుడు, అతడు దొంగిలించిన కంబలి అతని వద్ద లభించింది.[1]

## అధ్యాయం : 190

## విజయప్రాప్తి (మాలె గనీమత్)గా వచ్చిన మేకలు, ఒంటెలను పంపిణీకి ముందే జిబహ్ చేయటం అవాంఛనీయం

**401)** రాఫె బిన్ ఖదీజ్ (రజి) కథనం: మేము ప్రవక్త మహనీయులు (సఅసం)తో కలసి 'జుల్ హులైఫా'లో విడిది చేశాము. ప్రజలు ఆకలితో నకనక లాడుతున్నారు. మరోవైపు మాకు విజయప్రాప్తిగా ఒంటెలు, మేకలు చేజిక్కాయి. (తిరుగు ప్రయాణంలో) దైవప్రవక్త(స) సైన్యం వెనుక ఉన్నారు. ఆకలి కారణంగా సైనికులు తొందరగా పొయ్యి వెలిగించి కుండలు పెట్టారు. తరువాత దైవప్రవక్త(స) ఆదేశానుసారం ఆ కుండలన్నింటినీ ఒలకబోయటం జరిగింది. ఆ తరువాత దైవప్రవక్త (స) విజయప్రాప్తిని పంపిణీ చేయటం మొదలెట్టారు. పదేసి మేకల్ని ఒక ఒంటెకు సమానంగా ఖరారు చేశారు. యాదృచ్ఛికంగా విజయప్రాప్తిలోని ఒక ఒంటె పరారైంది. సైన్యంలో గుర్రాలు చాలా తక్కువగా ఉన్నాయి. అందువల్ల జనులు ఆ ఒంటె వెనుక పరుగెత్తారు. మొత్తానికి ఆ ఒంటె చాలామందిని అలసిపోయేలా చేసింది. ఎట్టకేలకు ఒక సహాబీ (రాఫే గారే) ఆ ఒంటెపై బాణం సంధించారు. అంతే, దైవాజ్ఞతో ఆ ఒంటె ఉన్నచోటనే ఉండి పోయింది. దానిని గమనించిన దైవ ప్రవక్త(స), "ఈ పెంపుడు జంతువులలో కూడా కొన్ని అడవి మృగాల్లా క్రూరంగా ఉంటాయి. కాబట్టి వీటిలో ఏదయినా అదుపులోకి రాకపోతే దానిపట్ల ఇలాగే వ్యవహరించండి" అని సెలవిచ్చారు. అబాయా ఇలా అంటున్నారు- మా తాత గారైన రాఫే (రజి)[1] దైవప్రవక్త(స) సన్నిధిలో 'రేపు మేము మా శత్రువును మార్కొన వలసి వస్తుందేమోనని అనుకుంటున్నాము (లేదా ఇలా అన్నారు) రేపో మాపో మేము మా శత్రువును ఎదుర్కోవలసి ఉంటుందని భయపడుతున్నాము. అదే గనక జరిగితే మా దగ్గర కత్తులు కటార్లు లేవు. మరయితే మేము పదునైన వెదురు వాసా లతో జిబహ్ చేయవచ్చునా?' అని విన్నవించుకోగా, "రక్తాన్ని ప్రవహింపజేసే ప్రతి దానితో కోయవచ్చు. కాకపోతే జిబహ్ చేసే సమయంలో అల్లాహ్ పేరు స్మరించాలి.

---

400-1. విజయప్రాప్తిగా వచ్చిన సొమ్ము నుండి ఏ చిన్న వస్తువును అపహరించినా అది మనిషి పరలోక జీవితాన్ని నాశనం చేసేస్తుందని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. విశ్వాసి (మోమిన్) ఎన్ని పాపాలు చేసినా తన పాపకార్యాల కారణంగా నరకానికి పోడని చెప్పేవారి వాదన కూడా దీనిద్వారా ఖండించబడింది.

**అలా జరిగినట్లయితే ఆ మాంసాన్ని తినటం ధర్మసమ్మతమే. అయితే దంతాలతోగానీ, గోళ్ళతోగానీ జిబహ్ చేయకూడదు. ఎందుకో నేను మీకు చెబుతాను. దంతం ఎముకల కోవకు చెందినది (అది జిన్నుల ఆహారం). గోళ్ళు అబిసీనియన్ల కత్తులు.**[2]

## అధ్యాయం : 191

## విజయ (శుభ)వార్తను వినిపించడం

**402) జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసం) నన్నుద్దేశించి, "జుల్ ఖలసాను నేలమట్టం చేసి నాకు శుభవార్త ఇవ్వరేమి?" అని అడిగారు. 'జుల్ ఖలసా' అనేది ఖషమ్ తెగవారి విగ్రహాలయం. అది కాబాకు పోటీగా నిర్మించబడింది. దానిని వారు 'యమనీల కాబా'గా వ్యవహరించేవారు– అందువల్ల నేను నా తెగ వారైన అహ్మస్‌కు చెందిన నూట యాభైమంది గుర్రపు స్వారీ ప్రవీణులను వెంటబెట్టుకుని ప్రయాణానికి సిద్ధమయ్యాను. వారంతా మంచి రౌతులు. ఆ తరువాత నేను దైవప్రవక్త(స)తో 'నేను గుర్రపు వీపుపై కుదురుగా కూర్చోలేను' (ఎలా?) అని విన్నవించుకోగా, ఆయన(స) నా ఛాతీపై చేత్తో చరిచారు. ఆయన(స) చేతివ్రేళ్ళ గుర్తుల్ని కూడా నేను నా ఛాతీపై చూశాను. తరువాత దైవప్రవక్త(స) ఇలా ప్రార్థించారు: "అల్లాహ్! ఇతన్ని గుర్రంపై స్థిరంగా కూర్చునేలా సహాయపడు. ఇతన్ని సన్మార్గం చూపేవానిగా చెయ్యి. ఇతను స్వయంగా కూడా సన్మార్గంపై ఉండేలా చెయ్యి". ఆ తరువాత జరీర్(రజి) తన కార్యక్రమం కొరకు పయనమయ్యారు. 'జుల్ ఖలసా'ను ధ్వంసం చేసి, దగ్ధం చేశారు. ఆ తరువాత దైవప్రవక్త(స) వద్దకు శుభవార్తను పంపించారు. జరీర్(రజి) తరఫున పంపబడిన దూత (హుసైన్ బిన్ రబీయ) వచ్చి, 'దైవప్రవక్తా! మిమ్మల్ని సత్యవంతుడైన ప్రవక్తగా చేసి పంపిన వాని సాక్షిగా! దురద జబ్బు ఉన్న ఒంటె నల్లగా మారినట్లుగా[1] ఆ విగ్రహాలయం కాలి నల్లబడనంతవరకూ నేను మీ సన్నిధికి హాజరు**

---

401–1. రాఫే (రజి) సందేహం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటంటే, మా దగ్గర ఉన్న ఖడ్గాలను మేము ఒంటెల్ని, మేకల్ని కోయడానికి ఉపయోగిస్తే, వాటి పదును తగ్గిపోతుంది. అవి యుద్ధంలో శత్రు సంహారానికి ఉపయోగపడవు.

401–2. అబిసీనియన్లు అప్పటికి ఇస్లాం స్వీకరించలేదు. ఇస్లాంకు పూర్వం వారు క్రూర మృగాల గోళ్ళను కత్తుల మాదిరిగా వాడుకునేవారు.

**కాలేదు' అన్నాడు. ఇది విని దైవప్రవక్త(స) అహ్మస్ తెగ రౌతుల కోసం, వారి కాల్బలం కోసం ఐదుసార్లు -శుభం వొసగమని- దైవాన్ని వేడుకున్నారు- 'జుల్ ఖలసా' ఖష్అమ్ తెగలోని ఒక గృహం అని ముసద్దిద్ అన్నారు.**

## అధ్యాయం : 192

## శుభవార్త వినిపించిన వానికి కానుక ఇవ్వటం

**తన తౌబా (పశ్చాత్తాపం) ఆమోదించబడిందన్న శుభవార్తను వినిపించిన వ్యక్తికి మహనీయ కాబ్ బిన్ మాలిక్(రజి) రెండు వస్త్రాలను కానుకగా ఇచ్చారు.[1]**

## అధ్యాయం 193

## మక్కా విజయం తర్వాత ఇక అక్కడినుండి ప్రస్థానం చేయనవసరం లేదు.

**403) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) మక్కా విజయం నాడు ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు : "ఇప్పుడు (మక్కా నుండి మదీనాకు) వలసపోయే (హిజ్రత్ చేసే) పరిస్థితి మిగుల లేదు.[1] అయితే శుభ సంకల్పం, జిహాద్ (దైవమార్గంలో సతత సమరం) మాత్రం మిగిలే ఉంది. కాబట్టి మిమ్మల్ని ఎప్పుడు జిహాద్ కొరకు పిలిచినా మీరు వెంటనే బయలుదేరండి."**

---

402-1. దురద జబ్బు ఉన్న ఒంటె శరీరంపైని వెంట్రుకలు రాలిపోయి, బక్కచిక్కి నల్లగా కని పిస్తుంది. అలాగే 'జుల్ ఖలసా' విగ్రహాలయం కూడా కాలి, దాని కప్పు నేల కూలిపోయి, నల్లగా కనిపించింది. జరీర్(రజి) తనకు అప్పజెప్పబడిన కార్యాన్ని పూర్తి చేశాకే దైవ ప్రవక్త(స)కు శుభవార్త పంపారు. శాంతిస్థాపన నిమిత్తం కలహాలకు కుట్రలకు కేంద్రా లుగా ఉన్న స్థావరాలను కూల్చివేయటం అవసరం. దైవప్రవక్త(స) మదీనా నగరంలోని మస్జిదె జిరార్‌ను సయితం నేలమట్టం చేయించటం గమనార్హం.

192-1. ఈ శుభవార్తను వినిపించిన వ్యక్తి సలమా బిన్ అక్వా లేదా హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ. ఈ హదీసును ఇమామ్ బుఖారీ (రహ్మ) కితాబుల్ మగాజీలో వసల్ చేశారు.

403-1. ఈ వాక్యం కేవలం మక్కా- మదీనాల నేపథ్యంలో ప్రవచించబడింది. పూర్వం మక్కా నగరం 'దారుల్ ఇస్లాం'లో భాగంగా ఉండేది కాదు. అక్కడి ముస్లింలకు షరీఅత్ ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ ఉండేది కాదు. అందుచేత వారికి హిజ్రత్ (ప్రస్థానం, వలస) అనివార్యమయింది. కాని ఆ తర్వాత మక్కాపుణ్యపురి దారుల్ ఇస్లాంలో విలీన మయ్యింది. కాబట్టి ఇకమీదట అక్కడి నుండి వలసపోవలసిన ఆవశ్యకత మిగులలేదు.

**404)** ముజాషా బిన్ మస్‌ఊద్(రజి) తెలిపారు : నేను నా సోదరుడు ముజాలిద్ బిన్ మస్‌ఊద్(రజి)ను తీసుకుని దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరయ్యాను. ఇలా విన్నవించుకున్నాను: 'ఇతను ముజాలిద్. హిజ్రత్ నిమిత్తం మీ సమక్షంలో ప్రతిజ్ఞ (బైఅత్) చేయగోరుతున్నాడు.' కాని దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "మక్కా విజయం తర్వాత ఇప్పుడిక హిజ్రత్ మిగిలి లేదు. కాకపోతే నేను ఇస్లామ్ ధర్మావలంబన గురించి ఇతని చేత ప్రమాణ స్వీకారం (బైఅత్) చేయించుకుంటాను."

**405)** అతా ఇలా చెబుతుండేవారు: నేను ఉబైద్ బిన్ ఉమైర్‌తో కలసి అమ్మ హజ్రత్ ఆయిషా(ర.అ) దగ్గరకు వెళ్ళాను. ఆ సమయంలో ఆమె గారు సబిరా పర్వత సమీపంలో విడిది చేసి ఉన్నారు. ఆమె గారు మాతో ఇలా అన్నారు : దైవప్రవక్త (సఅసం)కు అల్లాహ్ మక్కా నగరంపై విజయం ప్రసాదించిన నాటి నుండే హిజ్రత్ పరంపర ముగిసింది.

## అధ్యాయం : 194

## అత్యవసర పరిస్థితిలో జిమ్మీలు లేదా ముస్లిం స్త్రీల శిరోజాలు చూడటం సరైనదే. అలాగే వారు దైవధిక్కారానికి ఒడిగట్టినప్పుడు వివస్త్రను చేసి సోదా చేయటం కూడా సరైనదే.

**406)** మహనీయ అలీ (రజి) కథనం: నన్నూ, జుబైర్ బిన్ అవ్వామ్(రజి)ను ప్రవక్త మహనీయులు(సఅసం) పంపిస్తూ, "మీరిద్దరూ 'రౌజె ఖాక్' అనే తోట వద్దకు చేరుకోగానే మీకొక స్త్రీ కనిపిస్తుంది. హాతిబ్ బిన్ అబీ బల్తఅ(రజి) ఆమెకు ఒక ఉత్తరం ఇచ్చి పంపాడు (మీరు ఆ ఉత్తరం తీసుకుని రండి)" అని సూచించారు. మేము ఆ తోట వద్దకు చేరుకోగానే మాకు తారసపడిన ఓ స్త్రీతో, "ఏదీ ఆ ఉత్తరం ఇటివ్వు" అని అడిగాము. హాతిబ్ నాకు ఏ ఉత్తరమూ ఇవ్వలేదని ఆమె బుకాయించింది. "చూడు. నీ అంతట నీవుగా ఆ ఉత్తరం ఇస్తే సరి. లేదంటే (సోదా చేసేం

---

అంతమాత్రాన అసలు హిజ్రత్ అన్నదే మిగిలిలేదు అని చెప్పటం సరైనది కాదు. ఈ లోకం ఉన్నంతవరకూ, సత్యాసత్యాల మధ్య సంఘర్షణ సాగినంత వరకూ, భూమండలంలోని ఏదేని ప్రదేశంలో ముస్లింలకు తమ ధర్మాదేశాల ప్రకారం జీవించే స్వేచ్ఛ లేనంతవరకూ వారు 'దారుల్ ఇస్లాం' వైపునకు వలసపోవలసి ఉంటుంది.

**దుకు) నీ బట్టలు విప్పదీయాల్సి ఉంటుంద”ని హెచ్చరించాము. అంతే. ఆమె వెంటనే తన నాడా సందులో దాచిన ఉత్తరాన్ని తీసి ఇచ్చింది. (మేము ఆ ఉత్తరాన్ని తీసుకుని ప్రవక్త మహనీయుల వద్దకు రాగానే) ఆయన హాతిబ్ (రజి)ని పిలిపించారు. ఆయన వచ్చి ‘ప్రవక్తా! నా వ్యవహారంలో తొందరపాటు చర్య తీసుకోకండి. దైవసాక్షి! నేను అవిశ్వాస (కుఫ్ర్) వైఖరికి ఒడిగట్టలేదు. ఇస్లాం నుండి వైదొలగనూ లేదు. కేవలం కుటుంబ ప్రీతి నన్ను ఈ దుస్సాహసానికి ఒడిగట్టేలా చేసింది. మీ ప్రియ సహచరులైన ముహాజిర్లందరికీ మక్కాలో బంధువులున్నారు. వారి ద్వారా అల్లాహ్ వారి కుటుంబీకులకు, ఆస్తిపాస్తులకు భద్రత కల్పించాడు. కాని నాకు అక్కడ నా అన్నవాళ్ళు ఎవరూ లేరు. అందువల్ల నేను మక్కా జనులకు ఒక ఉపకారం చెయ్యాలనుకున్నాను (నా ఈ ఉపకారానికి బదులుగా మక్కా అవిశ్వాసులు నా కుటుంబీకుల జోలికి పోకుండా ఉంటారని ఆశించాను)’. దైవ ప్రవక్త(స) కూడా ఆయన మాటల్ని నిజమని ధ్రువీకరించారు. ‘వీడి తల నరకటానికి నాకు ఆనతి ప్రదానం చేయండి. వీడు మునాఫిక్(కపటి) అయిపోయాడ’న్నారు ఉమర్(రజి) ఆవేశంతో. దానికి దైవప్రవక్త(స), “నీకేం తెలుసు? బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నవారి పరిస్థితుల గురించి అల్లాహ్ బాగా ఎరుగు. ‘ఇక మీరు ఏం చేసుకున్నా ఫరవాలేద’ని ఆయన స్వయంగా సెలవిచ్చాడు” అని చెప్పారు. ‘ఇక మీరు ఏం చేసుకున్నా ఫరవాలేద’న్న[1] ఈ ఉపదేశమే హజ్రత్ అలీ(రజి)కి మొండి ధైర్యం ఇచ్చిందని అబూ అబ్దుర్రహ్మాన్ అభిప్రాయపడ్డారు.**

## అధ్యాయం : 195

## యోధులకు స్వాగతం పలకడానికి వెళ్ళడం

**407) అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) గారు అబ్దుల్లాహ్ బిన్ జాఫర్(రజి)తో**

406–1. అబూ అబ్దుర్రహ్మాన్ మాట అతిశయిల్లింది. హజ్రత్ అలీ(రజి) ధర్మపరాయణత, దైవ భీతిని శంకించే హక్కు ఎవరికీ లేదు.

ఇకపోతే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఇక్కడ పొందుపరచటంలోని ఉద్దేశం, అనివార్యమైనప్పుడు స్త్రీలను నగ్నంగా సోదా చేయటం సరైనదేనని చెప్పటమే. మరి కొన్ని ఉల్లేఖనాలలో ఆ స్త్రీ ఆ ఉత్తరాన్ని తన జడ కొప్పులో నుంచి తీసి ఇచ్చిందని ఉంది. దానిపై హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ) ఏమంటారంటే, ఈ విభిన్న రివాయతుల మధ్య వైరుధ్యం ఏమీలేదు. ఎందుకంటే ఆ స్త్రీ జడ చాలా పొడవుగా ఉంది. ఆ జడను ఆమె తన ఇజారు నాడాతో పెనవేసి కట్టింది.

ఇలా అన్నారని ఇబ్నె అబీ ములైకా తెలిపారు: "నీకు ఆ సంఘటన జ్ఞాపకముందా? (జిహాద్ చేసి తిరిగి వస్తున్నప్పుడు) నేను, నువ్వూ, అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి)- ముగ్గురం దైవప్రవక్త(సఅసం)కు ఎదురుగా వెళ్ళాము (గుర్తుందా!) దానికి అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ (రజి), 'అవును, జ్ఞాపకముంది. దైవప్రవక్త(స) నన్నూ, ఇబ్నె అబ్బాస్(రజి)ను తన వాహనంపై కూర్చోబెట్టుకుని, మిమ్మల్ని వదలేశారు' అని చెప్పారు.

**408)** సాయబ్ బిన్ యజీద్(రజి) చెప్పారు : (దైవప్రవక్త-సఅసం- తబూక్ యుద్ధం నుండి తిరిగి వస్తున్నప్పుడు) బాలలమైన మేమందరం 'సనియ్యతిల్ వదా' వరకూ వెళ్ళి ఆయన(స)కు స్వాగతం పలికాము.[1]

## అధ్యాయం : 196

## జిహాద్ నుండి తిరిగి వస్తున్నప్పుడు ఏమని చెప్పాలి?

**409)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) కదనరంగం నుండి తిరిగి వస్తున్నప్పుడు మూడు సార్లు 'అల్లాహు అక్బర్' అని పలికిన మీదట ఇలా వేడుకునేవారు : "*ఆయిబూన ఇన్షా అల్లాహు తాయిబూన, ఆబిదూన, హామిదూన, లిరబ్బినా సాజిదూన, సద ఖల్లాహు వాదహు, వ నసర అబ్దహు, వ హజమల్ అహ్జాబ వహ్దహు*" (అనువాదం: దైవచిత్తమయితే మేము అల్లాహ్ వైపునకు మరలనున్నాము. మేము తౌబా చేయనున్నాము, మా ప్రభువును సేవించనున్నాము, ఆయనకు స్తోత్రం చెల్లించనున్నాము. ఆయన సన్నిధిలో సాష్టాంగ ప్రమాణం చేయనున్నాము. అల్లాహ్ తన వాగ్దానాన్ని నిజం చేశాడు. తన దాసునికి సహాయపడ్డాడు. అవిశ్వాసుల సైన్యాన్ని తానొక్కడే ఓడించాడు)"

**410)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : (హిజ్రీ 6వ సంవత్సరంలో జరిగిన బనూ లిహ్యాన్ యుద్ధ సందర్భం) 'ఉస్ఫాన్' నుండి తిరిగివస్తున్న

---

408-1. కదన రంగానికి వెళ్ళిన యోధులు తమ స్వస్థలానికి తిరిగి వస్తున్నప్పుడు వారికి హృదయపూర్వక స్వాగతం పలకటం సత్సంప్రదాయం. ఇమామ్ బుఖారీ(రహ్మా) ఈ ఉద్దేశాన్నే ఇక్కడ స్పష్టం చేశారు. మదీనావాసులు తమ అతిథులకు వీడ్కోలు పలకడానికి పొలిమేరల్లోని పర్వత కనుమ వరకూ వెళ్ళేవారు. ఆ కనుమ పేరే 'సనియ్యతిల్ వదా'.

**ప్పుడు[1] మేము ప్రవక్త మహనీయుల(సఅసం) వెంట ఉన్నాము. ఆయన(స) తన ఒంటెపై స్వారీ అయి ఉన్నారు. ఒంటెపై తన వెనుక (విశ్వాసుల మాత) హజ్రత్ సఫియ్యా బిన్తె హుయి(ర.అ)ని కూర్చోబెట్టుకున్నారు. యాదృచ్ఛికంగా ఆయన(స) ఒంటె జారి క్రిందపడిపోయింది. దైవప్రవక్త(స), సఫియ్యా- వీరిద్దరూ క్రింద పడిపోయారు. ఈ పరిస్థితిని గమనించిన మహనీయ తల్హా (రజి) తక్షణం తన వాహనం మీది నుండి క్రిందికి దూకి, 'దైవప్రవక్తా! అల్లాహ్ నన్ను మీ కొరకు అర్పించుగాక! మీకు గాయమైతే కాలేదు కదా!' అని విచారించారు. దానికి ఆయన (స), "ముందు మహిళ క్షేమం కనుక్కోండి" అన్నారు. అబూ తల్హా (రజి) ఒక గుడ్డను తన ముఖంపై కప్పుకుని ఆమె దగ్గరకు వచ్చారు.[2] అదే గుడ్డను ఆమెపైన వేశారు. ఆ తరువాత వారిద్దరూ కూర్చున్న వాహనాన్ని సర్దారు. వారిద్దరూ స్వారీ అయ్యాక మేము దైవ ప్రవక్త(స)కు నలువైపులా గుమిగూడాము. పిదప మదీనా నగరం కనిపించగానే ప్రవక్త మహనీయులు(స) ఇలా వేడుకోసాగారు: ''*ఆయిబూన తాయిబూన ఆబిదూన బి రబ్బినా హామిదూన*" (మేము అల్లాహ్ వైపునకు మరలి పోనున్నాము, తౌబా చేయనున్నాము, మా ప్రభుదాస్యం చేయనున్నాము, ఆయనకు స్తోత్రం ఘటించనున్నాము)". మదీనా నగరంలో ప్రవేశించేవరకూ ఆయన(స) ఆ విధంగా వేడుకుంటూనే ఉన్నారు.**

**411) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) తెలియజేశారు : ఆయన మరియు అబూ తల్హా(రజి) దైవప్రవక్త(సఅసం) వెంట ఉన్నారు. విశ్వాసుల మాత హజ్రత్ సఫియ్యా (ర.అ)ను దైవప్రవక్త(స) తన వాహనంపై- వెనుక- కూర్చోబెట్టు కున్నారు. దారిలో ఆయన (స) ఒంటె కాకతాళీయంగా జారిపడిపోయింది. దాంతో దైవప్రవక్త(స) క్రింద పడిపోయారు. విశ్వాసుల మాత కూడా పడిపోయారు. అప్పుడు అబూ తల్హా (రజి) ఇలా అన్నారు- ఆయన కూడా ఒంటె మీది నుండి తనను తాను పడవేసుకున్నారని నేను భావిస్తున్నాను- ప్రవక్త మహనీయుల(స) దగ్గరకు వచ్చి,**

---

410-1. ఇక్కడ హదీసు ఉల్లేఖకుని ద్వారా 'మరపు' జరిగింది. "దైవప్రవక్త(స) ఖైబర్ నుండి తిరిగి వస్తున్నప్పుడు" అని ఉండాల్సింది. ఎందుకంటే హజ్రత్ సఫియ్యా (ర.అ) ఖైబర్ యుద్ధ సందర్భంగానే 'యుద్ధ ప్రాప్తి'గా లభించారు. ఇది హిజ్రీ 7వ సంవత్సరంలో జరిగిన సంఘటన.

410-2. తన దృష్టి హజ్రత్ సఫియా (ర.అ)పై పడరాదన్న ఉద్దేశంతోనే తల్హా (రజి) గుడ్డను తన ముఖంపై వేసుకున్నారు.

‘ఓ దైవప్రవక్తా! అల్లాహ్ నన్ను మీకు అర్పితం చేయుగాక! తమరికి ఏదైనా గాయమైతే కాలేదు కదా!” అనడిగారు. దానికి ప్రవక్త మహోదయులు (స), “లేదు. కాని ఆ మహిళ సంగతి చూడు” అన్నారు. అందువల్ల ఆయన ఒక గుడ్డను తన ముఖంపై కప్పుకుని, విశ్వాసుల మాత వైపునకు నడిచి వెళ్ళారు. మరి ఆ గుడ్డనే ఆమెపైన వేశారు. అప్పుడు విశ్వాసుల మాత లేచి నిలబడ్డారు. ఆ తరువాత అబూ తల్హా(రజి) వారిద్దరి కోసం వాహనాన్ని సిద్ధం చేశారు. ఆయన(స) ఒంటెపై స్వారీ అయి, ప్రయాణం సాగించారు. మదీనా నగరాన్ని సమీపించగానే లేదా (ఉల్లేఖకుడు ఇలా అన్నారు) మదీనా నగరం కానరాగానే దైవప్రవక్త(స) ఇలా ప్రార్థించారు : “మేము అల్లాహ్ వైపునకు మరలిపోనున్నాము. తౌబా చేయనున్నాము. మా ప్రభువును ఆరాధించనున్నాము– ఆయన్ని స్తుతించనున్నాము.” మదీనా నగరంలో ప్రవేశించే వరకూ ఆయన(స) ఇలా ప్రార్థిస్తూనే ఉన్నారు.

## అధ్యాయం : 197

## ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు (కృతజ్ఞతా పూర్వకంగా నమాజ్ చేయటం)

**412)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) చెప్పగా తాను విన్నానని ముహారిబ్ బిన్ దిసార్ తెలిపారు: ఆయన ఏమన్నారంటే; నేను ఒక ప్రయాణంలో దైవప్రవక్త(సఅసం) వెంట ఉన్నాను. మదీనా చేరుకోగానే దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: “మస్జిద్‌లోనికి వెళ్ళి రెండు రకతుల (నఫిల్) నమాజ్ ఆచరించు.”

**413)** అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ కాబ్‌తో, ఆయన తండ్రి (అబ్దుల్లాహ్) మరియు పినతండ్రి ఉబైదుల్లాహ్ బిన్ కాబ్(రజి) చెప్పారు: “ప్రవక్త మహనీయులు(సఅసం) పొద్దెక్కినప్పుడు ప్రయాణం నుండి తిరిగివస్తే ఉపవిష్ఠులయ్యే ముందు మస్జిద్‌కు వెళ్ళి రెండు రకతుల నఫిల్ నమాజ్ చేసేవారు.”

## అధ్యాయం: 198

## ప్రయాణీకుడు దూర ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు జనులకు (విందు) భోజనం చేయించటం

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు, తనను కలుసుకోవడానికి వచ్చిన వారి కారణంగా (నఫిల్) ఉపవాసం ఉండేవారు కారు.

**414)** మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసం) తబూక్ యుద్ధం నుండి– మదీనా నగరానికి తిరిగి వచ్చినప్పుడు ఒంటె లేదా ఆవును (ఇక్కడ ఉల్లేఖకుడు సంశయంలో పడ్డారు) జిబహ్ చేశారు. .... మరో రివాయత్ ప్రకారం జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) చెప్పగా ముహారిబ్ విన్నారు : ప్రవక్త మహనీయులు(స) నా ఒంటెను రెండు ఊఖియాల ఒక దిర్హమ్ వెలకు లేదా రెండు దిర్హములకు కొనుగోలు చేశారు. 'సిరార్' స్థలానికి చేరుకోగానే ఆయన(స) ఆజ్ఞను పురస్కరించుకుని ఆవును జిబహ్ చేయటం జరిగింది. ప్రజలు ఆ మాంసాన్ని భుజించారు. తరువాత మేము మదీనా చేరుకోగానే, "ముందు మస్జిద్‌కి వెళ్ళి రెండు రకతుల నమాజ్ చెయ్యి" అని నన్ను ఆదేశించారు. ఆ తరువాత నాకు ఒంటె ధరను తూకం వేయించి ఇచ్చారు.

**415)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : నేను ప్రయాణం నుండి తిరిగి మదీనాకు చేరుకోగానే, "మస్జిద్‌లోనికి వెళ్ళి రెండు రకతుల నఫిల్ నమాజ్ ఆచరించు" అని ప్రవక్త మహనీయులు(సఅసం) నన్ను ఆజ్ఞాపించారు.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 6. 'ఖుముస్'★ ప్రకరణం

## అధ్యాయం : 1

**416) మహనీయ అలీ (రజి) కథనం: బద్ర్ యుద్ధంలో చేజిక్కిన విజయ ప్రాప్తి (మాలె గనీమత్)లో నుండి నా వాటాగా ఒక ఒంటె లభించింది. ప్రవక్త మహ నీయులు(సఅసమ్) కూడా ఒక పడుచు ఒంటెను 'ఖుముస్' (అయిదవ భాగం) సొమ్ములో నుండి నాకు ఇచ్చారు.[1] దైవప్రవక్త పుత్రిక ఫాతిమా(ర.అ)ను వివాహ మాడాలని సంకల్పించుకుని, కంసాలి పనిచేసే ఖైనుఖా తెగ వ్యక్తిని (యూదుని) వెంటబెట్టుకుని ఎడారి ప్రదేశానికి వెళ్ళాను– 'ఇజ్ఖిర్' గడ్డి పరకలను తేవడానికి. ఆ గడ్డిని కంసాలులకు అమ్మి తద్వారా వచ్చిన సొమ్ముతో వలీమా విందు చేయ**

---

★ 'ఖుముస్' అంటే ఐదవ భాగం అని అర్థం. సత్య తిరస్కారులతో యుద్ధం జరిగినప్పుడు యుద్ధ ప్రాప్తి (మాలె గనీమత్)గా లభించిన సొమ్ములోని 5వ భాగం దైవం, దైవ ప్రవక్త(స), అనాథల కొరకు వేరు చేయటం జరుగుతుంది. బద్ర్ సంగ్రామం తర్వాత ఈ 'ఖుముస్' విధితమయింది.

416–1. సుదీర్ఘమైన ఈ హదీసును ఇమామ్ బుఖారీ(రహ్మ) ఇక్కడ తీసుకురావడంలోని ఉద్దేశం ఏమిటంటే విజయప్రాప్తిగా వశమయిన 'ఖుముస్' (ఐదవ భాగం) నుండి హజ్రత్ అలీ (రజి)కి ఒక పడుచు ఒంటె లభించిన ప్రస్తావన ఇందులో ఉండటమే. అబ్దుల్లాహ్ బిన్ జహష్(రజి) ఆధ్వర్యంలో సైనికులు చేజిక్కించుకున్న సొమ్ములోనిది ఈ ఒంటె. బద్ర్ యుద్ధానికి రెండు మాసాల క్రితం జరిగిన సంఘటన ఇది. అప్పటివరకూ 'ఖుముస్'కు సంబంధించిన ఆజ్ఞ ఏదీ అవతరించలేదు. అయితే అబ్దుల్లాహ్ బిన్ జహష్ నాలుగు భాగాలను సైనికుల మధ్య పంపిణీ చేసి, అయిదవ భాగాన్ని తన స్వంత అభిప్రాయం ప్రకారం దైవప్రవక్త(స) కొరకు అట్టే పెట్టారు. పిదప ఖుర్ఆన్లో కూడా ఇలాంటి ఆదేశమే అవతరించింది.

**వచ్చని అనుకున్నాను. ఆ రెండు ఒంటెలకు కావలసిన సామగ్రిని, తొట్లను, సంచులు, త్రాళ్ళను సమకూర్చుకోవటంలో నిమగ్నుణ్ణి అయ్యాను. నా ఈ రెండు ఒంటెలు ఒక అన్సారీ సహాబీ చావిడి వద్ద కూర్చుని ఉన్నాయి. నేను సామగ్రినంత టినీ సమకూర్చుకుని తిరిగి వచ్చేసరికి ఆ రెండు ఒంటెల మూపురాలను ఎవరో కోసివేశారు. వాటి రొమ్ముల్ని చీల్చి, వాటి కాలేయాలను కోసుకున్నారు. ఆ పరిస్థితిని చూసిన నాకు ఉన్నపళంగా ఏడుపు వచ్చేసింది. ఈ అఘాయిత్యానికి పాల్పడినవారె వరు? అని నేను అడిగితే, "హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్. ఆయన ఇక్కడే ఈ ఇంట్లోనే ఉన్నారు. కొంతమందితో కలసి సారా త్రాగుతున్నార"[2] ని అక్కడున్న జనులు చెప్పారు. నేను తిన్నగా దైవప్రవక్త(స) దగ్గరకు వెళ్ళాను. ఆ సమయంలో జైద్ బిన్ హారిసా (రజి) కూడా అక్కడే కూర్చుని ఉన్నారు. దైవప్రవక్త(స) నన్ను చూడగానే, నేనేదో ఆపదలో ఉన్నట్లు పసిగట్టారు. "అలీ! ఇంతకీ ఏమైంది?" అని అడిగారు. దానికి నేను, "దైవప్రవక్తా! నాకు ఈ రోజు కలిగినంత దుఃఖావేదన ఎన్నడూ కలగలేదు. హమ్జా (రజి) నా రెండు ఒంటెలపైన దారుణానికి ఒడిగట్టారు. వాటి మూపురాలను కోసేశారు. వాటి రొమ్ముల్ని కూడా చీల్చేశారు. ఇప్పటికీ ఆయన ఆ ఇంట్లోనే అనేకమంది మిత్రులతో కలసి మద్యం సేవిస్తున్నారు" అని చెప్పాను. ఇది విని దైవప్రవక్త(స) దుప్పటి ఇవ్వమని కోరారు. దుప్పటి కప్పుకుని అటువైపు నడవసాగారు. నేను, జైద్ బిన్ హారిసా(రజి) కూడా ఆయన్ని అనుసరించాము.**

---

416-2. వేరొక ఉల్లేఖనం ప్రకారం ఆ సమయంలో ఒక గాయకురాలు కూడా హజ్రత్ హమ్జా (రజి) వద్ద ఉంది. ఆమె పాటపాడుతూ హమ్జాను రెచ్చగొట్టింది– పడుచు ఒంటెల కాలే యాన్ని కాల్చి దాని కబాబులు తినమని. తాగిన మైకంలో ఉన్న హమ్జా (రజి) వెంటనే లేచి దగ్గరలోనే ఉన్న ఒంటెల్ని చీల్చి వాటి కాలేయాన్ని తీసుకున్నారు.

హజ్రత్ అలీ(రజి) ఆవేదన కూడా అర్థం చేసుకోదగినది. అయితే ఆయన తన పినతండ్రి పట్ల దురుసుగా ప్రవర్తించలేదు సరికదా, కోపాన్ని, బాధను దిగమ్రింగారు, సరాసరి దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, జరిగినదంతా నివేదించుకున్నారు. పరిస్థితుల స్వరూపాన్ని తెలుసుకోవడానికి దైవప్రవక్త(స) స్వయంగా సంఘటనా స్థలికి ఏతెంచారు. కాని మత్తులో జోగుతున్న పెత్తండ్రి హమ్జా(రజి)ను విచారించటం సమంజసం కాదని తలచి, తిరిగి వచ్చేశారు. అప్పటికింకా మద్యపానం నిషేధించబడలేదు. ఆయన మత్తు దిగిన తరువాత దైవప్రవక్త(స) ఆయన్ని పిలిపించి, ఆయన నుండి హజ్రత్ అలీ(రజి)కి నష్టపరి హారం ఇప్పించారని ఇబ్నె అబీ షైబా ఉల్లేఖనంలో ఉంది.

చివరకు హమ్జా కొలువుతీరి ఉన్న ఇంటివరకూ చేరుకుని, లోనికి వచ్చేందుకు అనుమతి కోరారు. జనులు లోనికి వచ్చేందుకు అనుమతి ఇచ్చారు. ఆ సమయంలో అక్కడున్న వారంతా సారా త్రాగుతున్నారు. హమ్జా పాల్పడిన అఘాయిత్యానికి గాను దైవప్రవక్త(స) గట్టిగా చీవాట్లు పెట్టసాగారు. తప్పతాగిన మైకంలో హమ్జా (రజి) కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆయన దైవప్రవక్త(స) వైపు ఎగాదిగా చూశారు. తరువాత ఇంకాస్త పైకి చూశారు. ఆ తరువాత ప్రవక్త(స) మోకాళ్లపై దృష్టిని కేంద్రీకరించారు. ఆపైన ఇంకాస్త పైకి కళ్ళెత్తి ప్రవక్త(స) నాభి వైపు చూడసాగారు. చివరకు ప్రవక్త(స) ముఖారవిందంపై దృష్టి నిలిపి, "మీరంతా నా తండ్రి బానిసలు" అని అరిచారు. హమ్జా (రజి) మత్తులో ఉన్నారన్న సంగతిని గ్రహించి దైవప్రవక్త(స) అక్కణ్ణుంచి వెనుతిరిగారు. మేము కూడా ఆయన(స) వెనుకే బయల్దేరాము.

**417)** మహనీయ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) హజ్రత్ ఫాతిమా(ర.అ)కు ప్రవక్త మహనీయులు (సఅసం) తన జీవితకాలంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మహాప్రవక్త(స) ఇలా అన్నారు: "దైవప్రవక్తలు (అలైహిముస్సలామ్) వదలివెళ్ళినది (తరకా) వారసుల్లో పంపిణీ అవదు. మేము వదలి వెళ్ళినది (తరకా) 'సదఖా'గా పరిగణించబడుతుంది"- ఈ మాట విన్న హజ్రత్ ఫాతిమా(ర.అ)కు కోపం వచ్చింది. ఆమె గారు ఆనాటి నుంచీ జీవితాంతం హజ్రత్ అబూబక్ర్(రజి)ను కలుసుకోవటం మానేశారు. ఆమెగారు దైవప్రవక్త(స) తదనంతరం కేవలం ఆరు మాసాలు మాత్రమే జీవించి ఉన్నారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: దైవప్రవక్త(స) వదలి వెళ్ళిన ఖైబర్, ఫదక్, మదీనా సదకాలను వారసత్వంగా పంచి ఇవ్వమని ఫాతిమా(ర.అ) అబూబక్ర్(రజి)ని కోరారు. కాని అబూబక్ర్(రజి) అందుకు సుముఖంగా లేరు. "దైవప్రవక్త(స) తన జీవిత కాలంలో చేసిన ఏ ఆచరణనూ నేను పరిత్యజించలేను. ఎందుకంటే నేను గనక ప్రవక్త(స) వారి ఏ ఆచరణనయినా పరిత్యజిస్తే మార్గభ్రష్టుణ్ని అయిపోతానన్న భయం నాకుంది" అని అబూ బక్ర్(రజి) చెప్పేవారు. (అమ్మ ఆయిషా-ర.అ- ఇంకా ఇలా అన్నారు). దైవ ప్రవక్త(స) మదీనాలో వదలిపోయిన తరకాను హజ్రత్ ఉమర్(రజి) తన పరిపాలనా కాలంలో హజ్రత్ అలీ(రజి), హజ్రత్ అబ్బాస్(రజి)లకు పంచి ఇచ్చేశారు. అయితే ఖైబర్, ఫదక్ ఆస్తుల్ని మాత్రం ఇవ్వకుండా- నిలిపి ఉంచారు. ఇలా అన్నారు: "ఇవి రెండూ దైవప్రవక్త(స) యొక్క సదఖా. అత్యవసరంగా చెల్లించవలసిన హక్కుల నిమిత్తం లేదా తత్కాల అసాధారణ సంఘటనల దృష్ట్యా ఇవి ప్రత్యేకించబడ్డాయి.

**ఈ ఆస్తులు ఆయా కాలాల ఖలీఫాల పర్యవేక్షణలో ఉంటాయి"[1] జుహ్రీ ఇలా అన్నారు: ఈ రెండు ఆస్తులు ఇప్పటివరకూ అక్కడి ప్రభుత్వ అదుపు అజమాయిషీ లోనే ఉన్నాయి...**

**418) జుహ్రీ వివరించారు: ముహమ్మద్ బిన్ జుబైర్ నాతో (రాబోయే హదీసు గురించి) చెప్పారు. అందుకే నేను దీనిని ధ్రువపరచుకోవడానికి మాలిక్**

---

417-1. సుదీర్ఘమైన ఈ హదీసులో ఎన్నో ముఖ్యాంశాలతోపాటు 'ఖుముస్' ప్రస్తావన కూడా ఉంది. అందుకే ఇమామ్ బుఖారీ (రహ్మ) దీనిని ఇక్కడ పొందుపరిచారు. ప్రవక్తలమైన తాము వదలి వెళ్ళినది (ఆస్తి) పంపకం అవదని, అది ఏమైనా సరే సదకాగా పరిగణించబడుతుందని మహాప్రవక్త(స) చాలా స్పష్టంగా చెప్పి ఉన్నారు. అయితే దైవ సందేశహరుని ముద్దుల పుత్రిక హజ్రత్ ఫాతిమా(ర.అ) అప్పటి ఖలీఫా హజ్రత్ అబూబక్ర్(రజి) దగ్గరకు వెళ్ళి, తమకు రావలసిన వారసత్వ హక్కును పంచి ఇవ్వమని అడిగారు. కాగా; తాము వదలి వెళ్ళిన సదఖాకు ఎవరూ వారసులు కాజాలరన్న ప్రవక్త ప్రవచనం (హదీసు)ను అబూబక్ర్(రజి) స్వయంగా విని ఉన్నారు. మరలాంటప్పుడు ఆయన దానికి వ్యతిరేకంగా ఎలా వ్యవహరించగలరు? ఇకపోతే హజ్రత్ ఫాతిమా (ర.అ) గారి కోపానికి కారణం; ఈ హదీసు సమాచారం ఆమెకు అందకపోవటమే. అందుకే ఆమె తన తండ్రి వదలి వెళ్ళిన ఆస్తిలో భాగం ఇవ్వమని అడిగారు.

**ఆ ఆస్తుల వివరాలు**

'ఫదక్' అనే ప్రదేశం ఒకటి ఉంది. అది మదీనా నగరానికి మూడు మంజిల్‌ల దూరాన ఉంది. అక్కడి భూమిని దైవప్రవక్త(స) తన కోసం ఉంచుకున్నారు. ఇంకా మదీనాలోని బనూ నజీర్‌కి చెందిన ఖర్జూర తోటలు, ఏడు మఖ్‌రీఖ్ తోటలు, అన్సారీ ఇచ్చిన భూమి, వాదియె ఖురాలోని మూడో వంతు మొదలగునవి- వీటిని పంచి ఇవ్వడానికి ఖలీఫా అబూబక్ర్ సిద్దీఖ్(రజి) నిరాకరించారు. ఆయన గనక ఫాతిమా(ర.అ) వాటాను వేరుచేసి ఇచ్చే మాటైతే, ప్రవక్త సతీమణుల వాటాను, హజ్రత్ అబ్బాస్(రజి) వాటాను కూడా తెగ్గొట్టి ఇవ్వాల్సి వచ్చేది. అదే గనక జరిగేటట్లయితే దైవప్రవక్త(స) ఆశించినది నెరవేరదు. అందుకే దీని పంపకానికి ఆయన నిరాకరించారు. దైవప్రవక్త(స) జీవిత కాలంలో ఆ భూముల ద్వారా వచ్చే ఫలసాయం ఎలా పంపిణీ అయ్యేదో, భవిష్యత్తులో కూడా అలాగే పంపిణీ అవుతూ ఉండాలని ఆయన భావించారు. ఇది అబూబక్ర్ ధర్మనిష్ఠకు, జాగరూకతకు పరాకాష్ఠ.

బైహఖీలోని ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఫాతిమా(ర.జి) అస్వస్థతకు గురైనప్పుడు ఆమెను పరామర్శించడానికి ప్రథమ ఖలీఫా అబూబక్ర్(రజి) వెళ్ళారు. అప్పుడు వారిద్దరి మధ్య ఉన్న మనస్పర్థ తొలగిపోయింది.

**బిన్ ఔన్ దగ్గరకు వెళ్ళాను. మాలిక్ ఇలా అన్నారు: అసలేం జరిగిందంటే, ఒక రోజు నేను పొద్దెక్కే వరకూ నా ఇంటి వారలతో గడుపుతున్నాను. అంతలో హజ్రత్ ఉమర్(రజి) తరఫు నుండి పిలిచేవాడొకరు నా దగ్గరకు వచ్చి, అమీరుల్ మోమినీన్ మిమ్మల్ని పిలుస్తున్నారని చెప్పారు. నేను ఆ దూత వెంటే వెళ్ళి, ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) సమక్షంలో హాజరయ్యాను. అక్కడ ఒక మంచంపై చాప పరచబడి ఉంది. దానిపైన పడక లేదు. కేవలం ఒక తోలుదిండు మాత్రమే ఉంది. ఖలీఫా దానికి ఆనుకుని కూర్చుని ఉన్నారు. నేను సలామ్ చేసి కూర్చున్నాను. ఆయన నన్ను ద్దేశించి, "మాలిక్! నీ జాతి వారు కొందరు[1] నా దగ్గరకు వచ్చారు. నేను వారికి కొద్దిపాటి సొమ్ము ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. నీవు నీ పర్యవేక్షణలో ఆ సొమ్మును వారికి పంచిపెట్టు" అని చెప్పారు. దానికి నేను, 'ఓ విశ్వాసుల నాయకా! తమరు ఈ బాధ్యతను వేరొక వ్యక్తికి అప్పగిస్తే బాగుంటుందేమో!' అని విన్నవించు కున్నాను. కాని ఉమర్(రజి) అందుకు సమ్మతించకుండా "లేదు, నీ సారథ్యంలోనే ఈ పంపిణీ జరగాలి" అని పురమాయించారు. నేనక్కడ ఉండగానే ఆయన దర్బారు లోని ఉద్యోగి యర్ఫా వచ్చి, 'ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, జుబైర్ బిన్ అవ్వామ్, సాద్ బిన్ అబీ వక్కాస్(రజి అన్హుమ్)లు లోనికి రావడానికి అనుమతి కోరుతున్నార'ని చెప్పాడు. దానికి ఉమర్(రజి), "సరే. వాళ్ళను లోనికి పిలువు" అని అన్నారు. ఆయన ఆనతిపై ఆ మహానుభావులు లోనికి వచ్చి సలామ్ చేసి కూర్చున్నారు. యర్ఫా కూడా కాసేపు కూర్చున్నారు. ఆ తరువాత ఆ వ్యక్తి మళ్ళీ వచ్చి, అలీ, అబ్బాస్(రజిఅల్లాహు అన్హూమా)లకు కూడా లోనికి వచ్చేందుకు అనుమతి ఉందా? అని విన్నవించుకోగా, "అవును. వారిని కూడా లోపలికి పిలువు" అని ఖలీఫా ఉమర్(రజి) పురమాయించారు. ఆయన ఆనతిపై వారిద్దరు కూడా లోనికి ప్రవేశించారు. ఇద్దరూ సలామ్ చేసిన మీదట అక్కడ ఉపవిష్ఠ**

---

మొదటి ఇద్దరు ఖలీఫాలు అబూబక్ర్, ఉమర్ తమ పరిపాలనా కాలంలో ఆ ఆస్తిపాస్తుల నుండి వచ్చే ఆదాయాన్ని ప్రవక్త సతీమణుల అవసరాల కొరకు, ఇతర ఖర్చుల కొరకు వెచ్చించేవారు. కాని తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(రజి) తన హయాంలో ఫదక్ ఆస్తిని 'మక్తా' రూపంలో మర్వాన్‌కు ఇచ్చేశారు. ఆయన (ఉస్మాన్) స్వయంగా సంపన్నుడై ఉండటం చేత ఫదక్ ఆస్తి నుండి లబ్ధి పొందే అవసరం ఆయనకు లేకపోయింది.

418–1. అంటే హవాజిన్ తెగవారి మధ్యన దుర్భిక్షం తాండవించినప్పుడు, వారిలోని కొందరు మదీనాకు పారిపోయి వచ్చారు.

**లయ్యారు. తరువాత అబ్బాస్(రజి), 'ఓ అమీరుల్ మోమినీన్! నాకూ- ఈయన గారికి మధ్య (తలెత్తిన వివాదం మీద) తీర్పు చేయండి' అని విన్నవించుకున్నారు. అల్లాహ్ తన ప్రవక్త(స)కు బనూ నజీర్ ఆస్తులలో నుండి (అయిదవ భాగంగా) ఇచ్చిన దానిపై వారిద్దరి మధ్యన తలెత్తిన వివాదమది. ఇదంతా విన్న ఉస్మాన్ మరియు ఆయన వెంట ఉన్న సహచరులు, 'అవును. అమీరుల్ మోమినీన్! వీరుభయుల మధ్య న్యాయ నిర్ణయం చేసి ఒండొకరి పట్ల నిశ్చింతగా ఉండేలా చేయండి' అని అభ్యర్థించారు. అప్పుడు హ్రజత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: "అవునా! అలాగైతే కాస్త ఆగండి. కాస్త నెమ్మదించండి. ఏ అల్లాహ్ ఆదేశంపై భూమ్యాకాశాలు నెలకొని ఉన్నాయో, ఆయనపై ఒట్టేసి అడుగుతున్నాను- 'ప్రవక్తల మైన మాకు (మా ఆస్తికి) వారసులెవరూ ఉండరు. మేము వదలిపోయినదంతా సదఖాయే' అని మహాప్రవక్త(స) వక్కాణించారన్న సంగతి మీ అందరికీ తెలుసా?" ఇది తన స్వయానికి కూడా వర్తిస్తుందన్నది దైవప్రవక్త(స) అభిమతం. 'అవును. దైవప్రవక్త(స) ఈ విధంగా వక్కాణించారన్నది నిజమే'నంటూ ఆ మహనీయు లందరూ ధ్రువపరిచారు. అప్పుడు హ్రజత్ ఉమర్(రజి) అలీ, అబ్బాస్‌ల వైపునకు తిరిగి ఇలా అడిగారు: "నేను మీరిద్దరినీ అల్లాహ్‌పై ఒట్టేసి అడుగుతున్నాను- దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రవచించారా? లేదా? మీరే చెప్పండి". అప్పుడు వారిద్దరు కూడా 'అవును నిజమే'నని ధ్రువీకరించారు. హ్రజత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు: ఇప్పుడు నేను ఈ వ్యవహారానికి సంబంధించిన తప్సీళ్ళను మీ అందరికీ విశదీక రిస్తాను. యథార్థం ఏమిటంటే, అల్లాహ్ తన ప్రవక్త(స) కొరకు ఈ విజయప్రాప్తి లోని ఒక భాగాన్ని ప్రత్యేకించాడు. దానిని దైవప్రవక్త(స) సయితం వేరితరులకు ఇవ్వలేదు. ఆ తరువాత ఆయన ఈ ఆయత్‌ను పఠించారు:** "మా అఫాఅల్లాహు అలా రసూలిహీ మిన్‌హుమ్..." **(ఏ ఆస్తులను అల్లాహ్, వారి అధీనంలో నుండి తీసుకుని తన ప్రవక్త వైపునకు తరలించాడో, అవి మీరు మీ గుర్రాలనూ, ఒంటె లనూ పరుగెత్తించగా లభించినటువంటి ఆస్తులు కావు. అల్లాహ్ తన ప్రవక్తలకు తాను కోరిన వారిపై ఆధిపత్యాన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ప్రతి దానిపై అధికారం కలిగి ఉన్నాడు- అల్ హష్ర్ 59: 6) - ఈ దైవోపదేశం ప్రకారం ఆ భాగం దైవ ప్రవక్త(స)కు ప్రత్యేకంగా కేటాయించబడింది. కాని దైవసాక్షిగా! దైవప్రవక్త(స) ఈ ఆస్తిని మీ కొరకు వదలి, తన కొరకు వినాయింపు ఇచ్చుకోలేదు. ప్రత్యేకంగా దానిని తన ఖర్చుల క్రింద వాడుకోనూ లేదు. పైగా దానిని మీకే ఇచ్చారు. మీ కార్యాలలోనే**

ఖర్చుపెట్టారు. మిగిలిన దానిని తన భార్యల సాలీనా ఖర్చులకై వెచ్చించేవారు.[2] ఆ తరువాత కూడా ఏమన్నా మిగిలి ఉంటే దానిని దైవకార్యంలో కలిపేసేవారు (అంటే జిహాద్ కొరకు కావలసిన సామగ్రిని సమకూర్చేవారు). దైవప్రవక్త(స) తాను జీవించి ఉన్నంత కాలం ఇలాగే చేస్తూ వచ్చారు. మహాశయులారా! దైవంపై ఒట్టేసి మరీ అడుగుతున్నాను. ఈ విషయం మీకు తెలీదా? 'నిశ్చయంగా. ఈ సంగతి మాకు తెలుసు' అని అక్కడున్న వారంతా ధ్రువపరిచారు. తరువాత ఖలీఫా ఉమర్ (రజి), అలీ, అబ్బాస్(రజిఅల్లాహు అన్హుమా)లిద్దరినీ సంబోధించి, "దైవసాక్షిగా నేను మిమ్మల్ని కూడా అడుగుతున్నాను- ఈ సంగతి మీకు తెలియదా?" అని అడిగారు. 'అవును, తెలుసు' అని ఆ మహనీయులిద్దరూ ధ్రువీకరించారు. ఆపైన హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: "అటు పిమ్మట అల్లాహ్ తన సందేశహరుణ్ణి (సఅసమ్) ఈ ప్రపంచం నుండి లేపుకున్నాడు. అప్పుడు అబూబక్ర్(రజి), 'తాను దైవప్రవక్త ప్రతినిధి'గా ముందుకు వచ్చారు. అందువల్ల ఆయన (దైవప్రవక్తకు ప్రత్యేక మయిన) ఆ ఆస్తిని తన అధీనంలోనికి తీసుకుని, దైవప్రవక్త దానిని ఏ ఏ పద్దులలో ఖర్చుపెట్టేవారో, ఆ పద్దులలోనే ఖర్చుపెట్టసాగారు. ఈ కార్యనిర్వహణలో మహనీయ అబూబక్ర్(రజి) నికార్సయినవారు. సద్వర్తనులు, న్యాయశీలురు అన్న విషయం అల్లాహ్‌కు బాగా తెలుసు. తరువాత అల్లాహ్ అబూబక్ర్(రజి)ను కూడా తన వద్దకు పిలుచుకున్నాడు. ఆపైన నేను అబూబక్ర్(రజి) ప్రతినిధిగా ఎంపికయ్యాను. నేను ఖలీఫాగా బాధ్యతలు చేపట్టి రెండేళ్ళు పూర్తయ్యాయి. నేను కూడా ఆ ఆస్తిపాస్తుల్ని నా పర్యవేక్షణలోనే ఉంచాను. దైవప్రవక్త, అబూబక్ర్‌లు ఏ ఏ పద్దుల్లో వాటిని కేటాయించేవారో ఆ పద్దుల్లోనే నేనూ ఖర్చుపెట్టసాగాను. ఈ వ్యవహారంలో నేను నిజాయితీపరుణ్ణి, ధర్మబద్ధుణ్ణి అన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు. అటుపిమ్మట మీరిద్దరూ నాతో మాట్లాడటానికి వచ్చారు. ఈ వ్యవహారంలో మీరిద్దరిదీ ఒకే మాట, ఒకే బాట(అని నేను గ్రహించాను). "అబ్బాస్ గారూ! మీరు మీ సోదర తనయునికి దక్కవలసిన వారసత్వ వాటాను గురించి దావా చేయడానికి నా వద్దకు వచ్చారు." తరువాత అలీ (రజి)తో, "మీ సతీమణి (ఫాతిమా-ర.అ)కి లభించవలసిన

418-2. 'ఖుముస్' (అయిదవ భాగం) నుండి దైవప్రవక్త(స) కొంత మొత్తం మాత్రమే తన భార్యల అవసరాల కోసం తీసుకునేవారు. ఆయన(స) పరమపదించినప్పుడు ఆయన(స) ఇనుప కవచం ఒకటి తాకట్టుగా ఉంది. ఎందుకంటే ఇంటి ఖర్చుల కోసం దానిని తాకట్టు పెట్టవలసి వచ్చింది.

వారసత్వ భాగం ఆమెకు ఆమె తండ్రి (దైవప్రవక్త(స) నుండి లభించాలని చెప్పడానికి మీరు నా దగ్గరకు వచ్చారు. నేను మీరిద్దరితో చాలా స్పష్టంగా చెప్పే శాను– 'ప్రవక్తలమైన మా ఆస్తి పంపకం అవదు. మేము వదలిపోయినదంతా సదఖాగా పరిగణించబడుతుంది' అని దైవప్రవక్త(స) వక్కాణించారని. తరువాత నేను బాగా ఆలోచించిన మీదట, ఈ ఆస్తుల్ని మీకు స్వాధీనపరచటం సముచితమని నాకనిపించింది. అప్పుడు నేను మీతో, 'చూడండి! మీరు కోరితే ఈ ఆస్తిని నేను మీకప్పగించగలను. కాని ఒక నిబంధన– అదేమంటే, దీనిద్వారా వచ్చే ఆదాయాన్ని మీరు దైవప్రవక్త మాదిరిగా, అబూబక్ర్ తన ఖిలాఫత్ హయాంలో పంపిణీ చేసిన మాదిరిగా నిర్ణీత పద్దుల్లో ఖర్చుపెడుతూ ఉండాలి. (అంటే మీరు ఈ ఆస్తికి వ్యవహార కర్తలుగా మాత్రమే ఉండాలి) అని చెప్పాను. పరిపాలనా బాధ్యతలు చేపట్టినప్పటి నుండీ ఈ వ్యవహారాన్ని నేనే పర్యవేక్షించేవాణ్ణి. కాని మీ అభ్యర్థనను పురస్కరించు కుని, నేను పెట్టిన షరతుకు మీరు కూడా అంగీకరించటం వల్ల దీనిని మీకు అప్పగించాను.[3] ఇక్కడ హాజరై ఉన్న వారలారా! నేను ఈ ఆస్తిని ఈ షరతు ప్రకారం వీళ్ళకు అప్పగించానో లేదో చెప్పండి. దానికి వారు, 'ఖచ్చితంగా! ఈ షరతుపైనే మీరు దానిని వీరుభయులకూ ఇచ్చారు' అని సాక్ష్యమిచ్చారు. తరువాత ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) అలీ, అబ్బాస్‌లతో, "అల్లాహ్‌పై ఒట్టేసి మిమ్మల్ని అడుగుతు న్నాను– నేను ఇదే షరతుపై మీకు ఆ ఆస్తిని అప్పగించానా? లేదా?" అని అడగ్గా, 'ఖచ్చితంగా' అని వారిద్దరూ చెప్పారు. "మరైతే ఇప్పుడు ఏ విషయంపై నా చేత తీర్పు చేయించాలనుకుంటున్నారు? (ఏమిటి, ఆస్తి పంపకం గురించా?) ఏ దేవుని ఆజ్ఞతో గగన భువనాలు నెలకొని ఉన్నాయో ఆ శక్తి సాక్షిగా చెబుతున్నాను. ఆ దేవుడు తప్ప వేరెవరూ దీనిపై తీర్పు చెయ్యలేరు. ఒకవేళ దీని నిర్వహణ మీ వల్ల కాదంటే, ఆ ఆస్తిని నాకు తిరిగి స్వాధీనపరచండి. ఆ పనిని కూడా నేనే చూసుకుం టాను" అని ఉమర్(రజి) నిర్ద్వంద్వంగా తన నిర్ణయం ప్రకటించారు.

---

418–3. ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబక్ర్(రజి) ఆ ఆస్తిని ఇవ్వడానికి నిరాకరించినప్పుడు ద్వితీయ ఖలీఫా ఉమర్(రజి) ఎలా ఇచ్చారన్న సందేహం ఎవరికయినా కలగవచ్చు. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, ఆ ఆస్తిని వారిద్దరికీ రాసి ఇవ్వ లేదు. పర్యవేక్షణా బాధ్యతలు మాత్రమే ఇచ్చారు. దైవప్రవక్త(స) మాదిరిగా, అబూ బక్ర్(రజి) మాదిరిగా ఫలసాయాన్ని నిర్ణీత పద్దుల్లో ఖర్చుపెట్టాలని షరతు కూడా విధించారు.

## అధ్యాయం : 2

### యుద్ధప్రాప్తి నుండి ఐదవ భాగాన్ని చెల్లించడం ధర్మం (విశ్వాసం)లో అంతర్భాగం

**419)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పేవారు: అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన ఒక ప్రతినిధి బృందం దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! మేము రబీఅ తెగ సంబంధీకులము. మీకూ– మాకూ మధ్యన ముజర్ తెగ అవిశ్వాసులు అవరోధంగా ఉన్నారు. అందువల్ల (వారిని దాటి) మేము కేవలం నిషిద్ధ (మర్యాదలు పాటించే) మాసాలలో మాత్రమే మీ వద్దకు రాగలము. కాబట్టి తమరు మాకేదన్నా స్పష్టమైన ఆదేశాన్ని జారీ చేయండి, మేము దానికి గట్టిగా బద్ధులమై ఉంటాము. మా వెంట రాలేకపోయిన వారికి కూడా దానిని విడమరిచి చెబుతాము' అని విన్నవించుకున్నారు. దానికి సమాధానంగా దైవప్రవక్త(సఅసం) ఇలా ఉపదేశించారు: "నేను మీకు నాలుగు విషయాలు పాటించమని ఆజ్ఞాపిస్తున్నాను– నాల్గింటి నుండి వారిస్తున్నాను– అల్లాహ్‌ను విశ్వసించాలి, అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదు– ఇలా చెబుతున్నప్పుడు ఆయన(స) తన చేతివ్రేళ్ళపై లెక్కించసాగాడు. నమాజును స్థాపించాలి, జకాత్ ఇస్తూ ఉండాలి, రమజాన్ (నెల) ఉపవాసాలు ఉండాలి, యుద్ధప్రాప్తిగా మీకు ఏం లభించినా, అందులోని ఐదవ భాగం అల్లాహ్ కొరకు కేటాయించాలి (అంటే మీ పరిపాలనాధికారులకు ఇవ్వాలి). ఇంకా నేను మిమ్మల్ని 'దుబ్బా' నుండి 'నఖీర్' నుండి, 'హంతిమ్' నుండి, 'బంక (జిడ్డు) పాత్ర' నుండి నిరోధిస్తున్నాను".

## అధ్యాయం : 3

### మహాప్రవక్త(స) పరమ పదించిన తరువాత, ఆయన భార్యామణుల జీతభత్యాల గురించి....

**420)** హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖించిన దాని ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "నా వారసులు నా తదనంతరం ఒక్క దీనార్ కూడా పంచిపెట్టరాదు (అంటే నేను వదలిపోయినది పంపిణీ చేయ కూడదు). నేను వదలిపోయిన ఆస్తిలో నుంచి నా కార్యకర్తలకు ఇవ్వాలి. నా భార్యల ఖర్చులు తీయాలి. మిగిలినదంతా సదఖా (దానం)."

**421)** హజ్రత్ ఆయిషా (రజిఅన్‌హా) వివరించారు: దైవప్రవక్త(సఅసం) పరమపదించినప్పుడు నా ఇంట్లో అర్థ వసఖ్ యవలు తప్ప ఒక ప్రాణికి ఆహారంగా

**పనికివచ్చే మరో వస్తువు ఏదీ లేదు. ఆ యవలు ఒక మంచెపై పెట్టబడి ఉన్నాయి. నేను దానినే తీసుకుని తినేదానిని. ఇలా చాలా రోజులు గడిచాయి. ఆ తర్వాత నేను వాటిని కొలిచి తీసుకోవటం మొదలెట్టాను. అంతే, అవి తొందరగానే అయి పోయాయి.**[1]

**422) అమ్ర్ బిన్ హారిస్ చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ తెలిపారు: ఆయన ఇలా చెబుతుండేవారు- ప్రవక్త మహనీయులు(సఅసం) తన తదనంతరం- తన ఆయుధాలు, ఒక తెల్లని కంచెర గాడిద, తాను స్వయంగా దానం చేసిన భూమి తప్ప మరేదీ తన ఆస్తిగా వదలిపోలేదు.**

## అధ్యాయం : 4

## దైవప్రవక్త(సఅసం) సతీమణుల కుటీరాల గురించి...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **(ప్రవక్త సతీమణులారా!) మీరు మీ ఇళ్ళల్లోనే ఉండండి.** ***(అల్ అహ్‌జాబ్ -33)***

**"దైవప్రవక్త ఇళ్ళల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించకండి."**[1]

***(అల్ అహ్‌జాబ్ : 53)***

**423) మహాప్రవక్త(స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) తెలిపారు:**

421-1. అంటే ఆ ఆహార వస్తువులో అల్లాహ్ ఎంతో శుభాన్ని, సమృద్ధిని పొందుపరిచాడు. కాని ఆయిషా (ర.అ) కొలిచి తీసుకునే సరికి అల్లాహ్‌పై గల భరోసా (తవక్కుల్)లో తేడా వచ్చేసింది.

వేరొక హదీసులో ధాన్యాన్ని కొలవండి, అందులో శుభం ఉంటుందని ఉంది. దీని అర్థం ఏమిటంటే కొనేటప్పుడు లేదా అరువుగా తీసుకునేటప్పుడు కొలవాలి. అల్లాహ్‌పై భారం మోపాలి.

ఇంతకీ ఈ ఆహార ధాన్యం హజ్రత్ ఆయిషా(ర.అ)కు 'తరకా'గా లభించినది కాదు. పైగా అది సాలీనా ఖర్చుల క్రింద బైతుల్‌మాల్ నుండి లభించినదే. ఈ ఖర్చుల బాధ్యత బైతుల్‌మాల్‌పై లేకుంటే, ప్రవక్త(స)మరణానంతరం ఆ ధాన్యాన్ని బైతుల్‌మాల్ వారు తమ స్వాధీనంలోకి తీసేసుకునేవారే.

4-1. మొదటి ఆయత్‌లో ప్రవక్త సతీమణులకు ఆదేశం ఉంది. రెండవ ఆయత్ ఆధారంగా షరీఅత్ సూత్రాల అన్వయింపులో సాటిలేని మేటి అయిన ఇమామ్ బుఖారీ (రహ్మా) ఇక్కడ చెప్పదలచిందేమిటంటే, అవి దైవప్రవక్త(స) నివాస గృహాలు. ప్రవక్త తదనంతరం

ప్రవక్త మహనీయుల(సఅసం)కు వ్యాధి తీవ్రతరమైనప్పుడు, ఆయన(స) తన సతీమణులందరినీ (పిలిచి), ఈ వ్యాధిగ్రస్త స్థితిలో తాను నా కుటీరంలో ఉండేం దుకు అనుమతి కోరారు. అందుకు (అందరి తరఫున) అనుమతి లభించింది.

**424)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(రజి.అన్హా) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసం) నా ఇంట్లో, నా వంతు రోజున, నా గొంతుకు– నా ఛాతీకి మధ్య భాగాన తల ఆనించి తనువు చాలించారు. ఆయన (మరణ సమయంలో) నా లాలాజలాన్ని–ఆయన లాలాజలాన్ని అల్లాహ్ కలిపాడు. (అదెలాగంటే నా సోదరుడైన) అబ్దుర్రహ్మాన్ మిస్వాక్ పుల్ల తీసుకుని లోనికి వచ్చాడు, ఆయన(స) దానిని నమలలేకపోయారు. నేను నా చేతిలోకి తీసుకుని దానిని బాగా నమలిన తరువాత, దాంతో ఆయన పల్లు తోమాను.

**425)** ప్రవక్త మహనీయుల (సఅసం) వారి సతీమణి హజ్రత్ సఫియ్యా (రజి అన్హా) తనకు ఈ విధంగా తెలియజేశారని హుసైన్ కుమారుడగు అలీ–జైనులాబిదీన్– చెప్పారు: ప్రవక్త మహనీయులు(స) రమజాన్ నెల చివరి దశకంలో మస్జిద్‌లో ఏతెకాఫ్ పాటిస్తూ ఉండగా ఆయన్ని(స) పలకరించడానికి సఫియ్యా వెళ్ళారు. తరువాత ఆమె తిరిగి రావడానికి లేచినప్పుడు, దైవప్రవక్త(స) ఆమెతో పాటే లేచి, కొంతదూరం నడిచివెళ్ళారు. చివరకు ఆయన(స) మస్జిదె నబవీ ద్వారా నికే సమీపంలో ఉన్న తన (మరో) భార్య హజ్రత్ ఉమ్మె సలమా (రజి.అన్హా) కుటీర ద్వారం వరకూ చేరుకున్నారు. అంతలోనే ఇద్దరు అన్సార్ సహాబీలు (ఉసైద్ బిన్ హుజైర్, అబ్బాద్ బిన్ బిష్ర్– రజి.అన్హుమా) అటువైపుగా నడిచి వెళుతున్నారు. వారిద్దరూ దైవప్రవక్త(స)కు సలామ్ చేసి (గబగబా) ముందుకు సాగి పోయారు. అయితే దైవప్రవక్త(స) వారిద్దరినీ పిలిచి, "కాస్త ఆగండి (ఇప్పుడు ఇక్కడ నా వెంట ఉన్న ఈవిడ ఎవరో కాదు, నా భార్య సఫియ్యా సుమా!)" అన్నారు. దానికి వారిద్దరూ, 'సుబ్హానల్లాహ్ దైవప్రవక్తా' అన్నారు. అంటే దైవప్రవక్త(స) వారిద్దరినీ ఉద్దేశించి అలా అనటం వారిని బాధకు గురిచేసింది.[1] అందువల్ల దైవప్రవక్త(స) ఈ విధంగా చెప్పారు: "అది కాదు. మనిషి శరీరంలో రక్తం ప్రవహించినట్లే షైతాన్

---

తమ ఖర్చులకు సంబంధించి ప్రవక్త భార్యలకు ఎలా హక్కు ఉందో, అలాగే ఆ ఇళ్ళపై కూడా వారికి హక్కు ఉంది. ఎందుకంటే అల్లాహ్ వారిని విశ్వాసుల మాతలుగా ఖరారు చేశాడు. వారిని మరే పురుషుడూ వివాహమాడలేదు.

**మనిషిలో పారుతూ ఉంటాడు. వాడు మీ అంతర్యాలలో కూడా ఎక్కడ దుష్ప్రేరణ (కలత)ను జనింపజేస్తాడోనని నాకు అనుమానం వచ్చింది."[2]**

**426) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వివరించారు : నేను (నా బాల్యంలో ఉమ్ముల్ మోమినీన్) హజ్రత్ హఫ్సా (రజి.అన్హా) ఇంటి కప్పుపైకి ఎక్కాను. అప్పుడు నా దృష్టి కాలకృత్యం తీర్చుకుంటున్న దైవప్రవక్త(సఅసం)పై పడింది. ఆ సమయంలో ఆయన(స) వీపు ఖిబ్లా వైపునకు, ముఖం సిరియా వైపునకు ఉంది.**

**427) అమ్మ హజ్రత్ ఆయిషా(రజిఅల్లాహు అన్హా) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసం) అస్ర్ నమాజ్‌ని ఆచరించినప్పుడు, ఎండ ఆయన కుటీరంపై నిలిచి ఉండేది.[1]**

**428) అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రసంగిస్తూ ఆయిషా(ర.అ) కుటీరం వైపు సంజ్ఞ చేసి, 'ఆ వైపు నుండే (అంటే తూర్పు ప్రదేశాల నుండే) కల్లోలాలు, ఉపద్రవాలు పొడసూపుతాయి. అక్కడి నుండే షైతాన్ తల ఉదయిస్తుంది."[1]– ఈ విధంగా ఆయన(స) మూడుసార్లు పలికారు.**

**429) హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ప్రవక్త మహనీయులు(స) తన ఇంట్లో ఉన్న సమయంలో– అకస్మాత్తుగా– ఒక వ్యక్తి కంఠస్వరం ఆమె గారికి**

---

425–1. ఎందుకంటే వారిద్దరూ నికార్సయిన ముస్లింలు. దైవప్రవక్త(స) గురించి తమలో అనుమానాలు రేకెత్తుతాయని ఆయన(స) ఎలా ఊహించారు? ఆయన మాకు ఇలా సంజాయిషీ ఇచ్చుకోవలసిన ఆవశ్యకత ఏముంది? అన్నది ఆ అన్సార్ సహాబీల బాధ.

425–2. 'ఏతెకాఫ్' వ్రతంలో ఉన్న దైవప్రవక్త(స) రాత్రివేళ ఈ విధంగా ఒక అపరిచిత స్త్రీతో కలసి రావటం ఏమిటి?! అన్న దురాలోచన గనక అంతర్యంలో జనిస్తే ఆ ఇద్దరు సహాబీల విశ్వాసం (ఈమాన్) ప్రమాదంలో పడిపోతుంది. ఇలాంటి సందర్భాల కోసమే షైతాన్ వేచి ఉంటాడు. అందుకే దైవప్రవక్త(స) తన ప్రియసహచరుల ఈమాన్‌ను కాపాడటానికి– వారిద్దరూ అడగకపోయినా– తాను స్వయంగా విషయాన్ని విడమరచి చెప్పారు.

427–1. అంటే హజ్రత్ ఆయిషా(ర.అ) కుటీరం అన్నమాట. అస్ర్ నమాజ్‌ను దైవప్రవక్త(స) సాధ్యమైనంతవరకు తొలి వేళలో ఆచరించేవారని దీని ద్వారా విదితమవుతోంది.

428–1. అంటే రకరకాల ధార్మిక ఉపద్రవాలు, సంక్షోభాలు తూరుపు రాజ్యాల నుండి పుట్టుకు వస్తాయి. దజ్జాల్ కూడా అటువైపు నుండే తలెత్తుతాడు.

వినిపించింది. ఆ వ్యక్తి హఫ్సా (ర.అ) గారి ఇంట్లోకి రావడానికి అనుమతి కోరు తున్నాడు. (ఆయిషా-ర.అ- ఇలా అన్నారు) 'దైవప్రవక్తా! మీరు వింటున్నారా! ఆ వ్యక్తి లోపలికి వచ్చేందుకు అనుమతి కోరుతున్నాడు'. దానికి దైవప్రవక్త(స) "బహుశా అతను ఫలానా వ్యక్తి అయి ఉంటాడు, అతను హఫ్సా (ర.అ)కు పాల వరుస బాబాయి. రక్త సంబంధాలు ఎలా (వైవాహిక) సంబంధాలను నిషిద్ధం (హరామ్)గావిస్తాయో అలాగే పాలవరుస సంబంధాలు కూడా నిషిద్ధం గావిస్తాయి" అని పలికారు.

## అధ్యాయం : 5

## దైవప్రవక్త(స) కవచం, లాఠీ, ఖడ్గం, చెంబు, ఉంగరం గురించి....

ఆయన(స) తదనంతరం ఖలీఫాలుగా వచ్చినవారు వాటిని ఉపయోగించారు. అంతేగాని వాటిని పంచిపెట్టలేదు. ఇకపోతే ఆయన(స) ఉపయోగించిన పిడతలు, పాదరక్షలు, కుండలు మొదలగువాటిని గురించి చెప్పాలంటే, ఆయన సహచరులు వాటిని ఆయన(స) తదనంతరం (చారిత్రకంగా) శుభప్రదమైనవిగా తలపోశారు.

**430)** హజ్రత్ అనస్(రజి) కథనం: మహనీయ అబూబక్ర్(రజి) ఖలీఫా అయినప్పుడు, ఆయన్ని (అంటే అనస్-రజి-ను) జకాత్ వసూళ్ళ నిమిత్తం బహ్రయిన్‌కు పంపుతూ ఒక ఫర్మానా వ్రాసి, దానిపై దైవప్రవక్త(సఅసం) వారి ఉంగరం ముద్రవేశారు. ఆ పవిత్ర ఉంగరంపై మూడు పంక్తులున్నాయి. ఒక పంక్తిలో 'ముహమ్మద్'అనీ, రెండవ పంక్తిలో 'రసూల్' అనీ, మూడవ పంక్తిలో 'అల్లాహ్' అనీ లిఖించబడి ఉంది.[1]

**431)** ఈసా బిన్ తహ్మాన్ తెలిపారు : అనస్ బిన్ మాలిక్(రజి) మాకు రెండు పాత చెప్పులు తీసి చూపించారు. వాటికి రెండు వార్లు తగిలి ఉన్నాయి-

430-1. అది ప్రవక్త మహనీయులు(స) ఉపయోగించిన 'ముద్ర'. ఒక విధంగా అది రాజముద్ర వంటిది. దానిపై 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని చెక్కబడింది. ఈ ఉంగరాన్ని దైవప్రవక్త(స) తదనంతరం ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబక్ర్(రజి) ఉపయోగించారు. అబూబక్ర్(రజి) తరువాత ఉమర్(రజి) వద్ద అది ఉపయోగంలో ఉండేది. ఆయన తదనంతరం ఉస్మాన్(రజి) వద్దకు వచ్చింది. ఆయన చేతుల మీదుగానే అది ఒక బావిలో పడిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు. ఆనాటి నుండే ఖిలాఫత్ వ్యవస్థ క్షీణ దశ మొదలయింది.

ఆ తరువాత సాబిత్ బునానీ గారు అనస్(రజి) ఆధారంగా నాతో ఏమన్నారంటే, ఆ రెండు చెప్పులు దైవప్రవక్త(సఅసం)వి.

**432)** అబూ బుర్దా బిన్ అబూ మూసా ఇలా అన్నారు: హజ్రత్ ఆయిషా (ర.అ) మాకు అతుకులు వేయబడిన ఒక వస్త్రాన్ని తీసి చూపించారు. ఆ వస్త్రం ధరించి ఉన్న స్థితిలోనే ప్రవక్త మహనీయులు(సఅసం) తనువు చాలించినట్లు ఆమె చెప్పారు. కాగా; సులైమాన్ బిన్ ముగీరా గారు హుమైద్ నుండి ఉటంకించారు. మరాయనేమో అబూ బుర్దా నుండి. అందులో అదనంగా ఇలా ఉంది: ఆయిషా (ర.అ) యమన్‌లో నేయబడిన ఒక ముతక ఇజారు (లుంగీ)ను, ఒక కంబళిని చూపించారు. వాటికి అతుకు వేయబడి ఉంది.[1]

**433)** అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: "ప్రవక్త మహనీయుల(సఅసం) వారి నీరు త్రాగే పాత్ర పగిలిపోయినప్పుడు, ఆయన(స) పగుళ్ళు వచ్చిన చోట్ల వెండి రజను అతికించుకున్నారు". తాను ఆ పాత్రను చూశానని, అందులోని నీరు కూడా త్రాగానని ఆసిమ్ చెప్పారు.

**434)** అలీ బిన్ హుసైన్ (హుసైన్ కుమారుడగు అలీ) కథనం : మేమందరం హజ్రత్ హుసైన్ (రజి) వీరమరణం తర్వాత యజీద్ బిన్ ముఆవియా వద్ద నుండి మదీనా మునవ్వరాకు వచ్చినప్పుడు మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) నన్ను కలుసుకుని, "మీకేదైనా అవసరం ఉంటే నన్నాదేశించండి" అని చెప్పారు. (హజ్రత్ జైనుల్ ఆబిదీన్ ఇలా అన్నారు) "నాకేమీ అవసరంలేద"ని అన్నాను. తరువాత మిస్వర్ ఇలా విన్నవించుకున్నారు : "మరైతే మీరు దైవప్రవక్త(స) కరవాలాన్ని నాకు ఇవ్వగలరా? ఎందుకంటే (బనూ ఉమయ్యాకు చెందిన) కొందరు ఈ కరవాలాన్ని

---

432-1. దీనికి వ్యాఖ్యానంగా ఖుస్తులానీ ఇలా అంటారు: బహుశా వినమ్రత కొద్దీ లేక యాదృచ్ఛికంగా ఆయన(స) ఆ కంబళిని కప్పుకుని ఉన్నారేమో! అంతేగాని అతుకులు వేసిన కంబళినే కప్పుకోవాలనేది ఆయన పద్ధతి కాదు. సాధారణంగా ఎప్పుడు, ఎలాంటి దుస్తులు లభ్యమవుతాయో అప్పుడు అలాంటివి తొడిగేవారు. ఆయన(స) ధరించే దుస్తులు పరిశుభ్రంగా, పరిశుద్ధంగా, తళతళలాడుతూ ఉండేవి. అయితే అలంకరణకు మాత్రం దూరంగా ఉండేవారు. ఆయన చెప్పులు, కంబళి, నీళ్ళ చెంబు, ఆయన ఉంగరం (ముద్ర)– వీటన్నింటినీ జ్ఞాపికలుగా భద్రపరచటం జరిగింది. అంతేగాని వాటిని పంచిపెట్టలేదు.

**మీనుండి లాక్కుంటారేమోనని నాకు భయంగా ఉంది. దైవసాక్షి! ఆ కరవాలాన్ని గనక మీరు నాకు ఇచ్చినట్లయితే, నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకూ ఎవరూ దానిని నా నుండి తీసుకోలేరు- తరువాత మిస్వర్(రజి) ఒక వృత్తాంతాన్ని వినిపిం చారు. అలీ బిన్ అబీ తాలిబ్(రజి) ఫాతిమా-ర.అ- జీవించి ఉండగానే అబూ జహల్ పుత్రిక (జమీలా)కు వివాహ సందేశం పంపారు. దైవప్రవక్త(స) ఈ వ్యవ హారంపై ఇదే వేదిక నుంచి తన సహచరులనుద్దేశించి ప్రసంగించటం నేను విన్నాను. నేను అప్పటికే ప్రాజ్ఞతకు చేరుకున్నాను. ఆయన(స) తన ప్రసంగంలో ఇలా అన్నారు: "ఫాతిమా (ర.అ) నాకు చెందినది (నా కన్నకూతురు). (ఈ సంబంధం కారణంగా) ఆమె వల్ల ఎక్కడ పాపం జరుగుతుందోనని, ధర్మావలంబనలో ఆమె ఎక్కడ ఉపద్రవంలో పడుతుందోనని నేను భయపడుతున్నాను."[1] ఆ తరువాత దైవప్రవక్త(స), బనీ అబ్దెషమ్స్‌కు చెందిన తన అల్లుడు ఒకతని (ఆస్ బిన్ రబీఅ) గురించి ప్రస్తావించారు. ఒక అల్లుడిగా అతను నిర్వహించిన భూమికను ప్రస్తుతిస్తూ, "అతను నాకిచ్చిన మాటను నిలుపుకున్నాడు. నాతో నిజం చెప్పాడు. నేను ఏదయినా ఒక ధర్మసమ్మతమైన దానిని (రెండో పెళ్ళిని) అధర్మంగా ఖరారు చేయలేను. అధర్మ మైన దానిని ధర్మబద్ధమైనదిగా కూడా చేయలేను. కాని దైవసాక్షిగా చెబుతున్నాను- దైవప్రవక్త(స) పుత్రిక, దైవవిరోధి పుత్రిక ఒకచోట (ఒక భర్త దాంపత్యంలో) ఇమడలేరు"[2] అని చెప్పారు.**

**435) ముహమ్మద్ బిన్ హనఫియ్య కథనం: ఈయన ఇలా అన్నారు- మహనీయ అలీ (రజి)యే గనక మహనీయ ఉస్మాన్(రజి) గురించి చెడుగా చెప్పే**

434-1. అంటే ఫాతిమా (ర.అ) బ్రతికి ఉండగా, అలీ(రజి) మరొకామెను భార్యగా తెచ్చుకుంటే, అది ఫాతిమా పాలిట పరీక్ష అవుతుంది. ఆమె తన సవతి పట్ల దురుసుగా ప్రవర్తించ వచ్చు లేదా భర్తను వేధించవచ్చు. ఇదంతా ధార్మికంగా ఆమెకు హానికరం కావచ్చు.

434-2. వేరొక రివాయతు ప్రకారం; దైవప్రవక్త(స) ఇలా అన్నారు : అలీ (రజి) ఫాతిమాకు విడాకులు ఇచ్చేమాటైతే, అతను రెండో పెళ్ళి చేసుకోవచ్చు. ఎందుకంటే అబూజహల్ ఇస్లాంకు, ప్రవక్తకు బద్ధ శత్రువుగా ఉండేవాడు. అందువల్ల ఫాతిమా అతని భార్యగా ఉండగా, అతను ఏరికోరి ఆ శత్రువు కుమార్తెనే ఎలా వివాహమాడతాడు?
దైవప్రవక్త(స) మనసులోని మాటను విన్న మీదట హజ్రత్ అలీ(రజి) తన సంకల్పాన్ని విరమించుకున్నారు. ఫాతిమా (ర.అ) జీవించి ఉండగా ఆయన మరో భార్యను చేసుకో లేదు. దీని ఆధారంగా ఖుస్తులానీ ఏమన్నారంటే, దైవప్రవక్త పుత్రిక దాంపత్య జీవితంలో దైవ విరోధి కూతురును భాగస్వామిగా చేర్చటం నిషిద్ధం (హరామ్).

**వారైతే, ఉస్మాన్ ఉద్యోగుల (జకాత్ వసూలు చేసే కార్యకర్తల) గురించి కొంతమంది జనులు ఫిర్యాదు చేయడానికి ఆయన దగ్గరకు వచ్చిన రోజే చెప్పేవారు. ఆ రోజు ఆయన ఇలా అన్నారు: "ఉస్మాన్(రజి) దగ్గరకు వెళ్ళు. జకాత్ వసూళ్ళకు సంబంధించిన ఈ ఫర్మానాను తీసుకువెళ్ళు. ఈ ఫర్మానా దైవప్రవక్త(స) వ్రాయించినదనీ, దీని ప్రకారమే అమలుపరచమని తన కార్యకర్తలకు ఆజ్ఞాపించమని ఆయన గారికి చెప్పు". నేను ఆ ఫర్మానాను పట్టుకుని హజ్రత్ ఉస్మాన్(రజి) సన్నిధిలో హాజరయ్యాను. అలీ(రజి) సందేశాన్ని ఆయనకు చేరవేశాను. కాని ఆయన, "మాకు దాని అవసరం లేదు (ఎందుకంటే దాని నకలు మా దగ్గర ఉంది)" అని చెప్పారు. నేను హజ్రత్ అలీ(రజి) దగ్గరకు వెళ్ళి, జరిగినదంతా చెప్పాను. "సరే, అలాగైతే ఆ ఫర్మానాను ఎక్కడ నుండి తీశావో అక్కడే పెట్టు" [1] అని ఆయన సెలవిచ్చారు.**

## అధ్యాయం : 6

### విజయప్రాప్తిలోని ఐదవ భాగం (ఖుముస్) దైవప్రవక్త అవసరాలకు (అంటే అతిథి మర్యాద కొరకు, జిహాద్ సామగ్రిని సమకూర్చడానికి), అవసరార్థుల కొరకు ఉద్దేశించినది అన్న దానికి ఆధారం...

**ఎందుకంటే ప్రవక్త మహనీయులు(స) అరుగువాళ్ళ (అస్హాబె సుఫ్ఫా), వితంతు స్త్రీల అవసరాలకు హజ్రత్ ఫాతిమా (ర.అ) అవసరాలపై మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ఆమెగారు ఖైదీలలోనుంచి ఒక సేవకుణ్ణి ఇవ్వమని, పిండి నానబెట్టడంలో, తిరుగలి రాయిని త్రిప్పడంలో తనకు బాధ కలుగుతోందని విన్నవించుకున్నప్పుడు ఆయన(స) ఆమెగారి అవసరాలను దైవంపై వదిలేశారు.**

---

435-1. అసలేం జరిగిందంటే ముహమ్మద్ బిన్ హనఫియ్యా సమక్షంలో ఒక వ్యక్తి హజ్రత్ ఉస్మాన్ (రజి)ను ఘాటుగా విమర్శించాడు. దానికి ఆయన, ''ఊరుకో'' అని మందలించారు. అప్పుడు అక్కడున్న జనులు కొందరు ఏమిటి, హజ్రత్ అలీ, హజ్రత్ ఉస్మాన్‌ను తూలనాడేవారా? అని ప్రశ్నించగా ముహమ్మద్ బిన్ హనఫియ్యా ఈ సంఘటనను వినిపించారు, అలీయే గనక ఉస్మాన్‌ను తూలనాడేవారైతే ఆనాడే తూలనాడేవారు. కాని అలా చేయలేదు.

ఈ హదీసు ద్వారా తెలిసే ఒక ముఖ్య విషయం ఏమిటంటే, ఆ ఫర్మానా హజ్రత్ అలీ (రజి) వద్ద ఉండేది. అందులో జకాత్ వసూళ్ళకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలున్నాయి. దాని ద్వారా ఆయన లబ్ది పొందారు.

**436) మహనీయ అలీ (రజి) తెలిపారు: (పిండి కోసం) తిరుగలి రాయి త్రిప్పటంలో ఫాతిమా (ర.అ) చాలా ఇబ్బంది పడేది. ఆ కాలంలోనే దైవప్రవక్త (సఅసం) వద్దకు కొందరు యుద్ధ ఖైదీలు వచ్చినట్లు ఆమెకు తెలిసింది. అందువల్ల ఆమె కూడా ఆ ఖైదీలలోనుంచి ఒక సేవకురాలినో లేక సేవకుడినో ఇవ్వమని అడగటానికి వెళ్ళారు. కాని దైవప్రవక్త(స) లేరు. ఆమె హజ్రత్ ఆయిషా(ర.అ)కు ఆ విషయం చెప్పి, తిరిగి వచ్చేశారు. తరువాత ప్రవక్త మహనీయులు(స) రాగానే హజ్రత్ ఆయిషా(ర.అ), ఫాతిమా (ర.అ) ఇబ్బందిని గురించి చెప్పారు. (హజ్రత్ అలీ ఇలా అంటున్నారు) ఈ సంగతి తెలుసుకున్న ప్రవక్త మహనీయులు(స) మా వద్దకు (ఆ రోజు రాత్రే) వచ్చారు. అప్పటికే మేము పడకలపై మేను వాల్చాము. దైవప్రవక్త(స)ను చూడగానే మేము లేచి నిలబడబోయాము. కాని ఆయన(స), "ఫరవాలేదు. మీరలాగే పడుకుని ఉండండి" అని చెప్పి ఫాతిమాకు– నాకూ మధ్యన కూర్చున్నారు. ఎంతగా దగ్గరయ్యారంటే, నేను ఆయన (స) పాదాల చల్లదనాన్ని సయితం నా గుండెలో ఆస్వాదించాను. ఆ తర్వాత ఆయన(స) ఇలా ఉపదేశించారు: "మీరు అడిగినదానికంటే (బానిస లేదా బానిస స్త్రీ) ఎక్కువ మేల్తరమైన దానిని నేను మీకు సూచించనా! మీరిద్దరూ పడకపై మేను వాల్చినప్పుడు 34 సార్లు అల్లాహుఅక్బర్ అనీ, 33 సార్లు సుబ్‌హానల్లాహ్ అనీ, 33 సార్లు అల్హందులిల్లాహ్ అనీ పలకండి. మీరిరువురూ అడిగేదానికన్నా ఇది మీ కొరకు శుభకరమైనది."[1]**

---

436–1. ఈ 'వచనాల' ద్వారా అల్లాహ్ మీకు ఎంత శక్తిని ప్రసాదిస్తాడంటే, మీకు సేవకుని అవసరమే ఏర్పడదు. మీ ఇంటి పనిని మీరు చేసుకోగలుగుతారు.

పైకి ఈ హదీసు అధ్యాయానికి అనుగుణంగా కనిపించదు. కాని ఇమామ్ బుఖారీ (రహ్మ) దీని ద్వారా మరో విధానం (హదీసు) వైపు సంజ్ఞ చేశారు. దానిని ఇమామ్ అహ్మద్(రహ్మ) వెలికి తీశారు. అందులో ఇలా ఉంది : "దైవసాక్షిగా! ఇది నా వల్లకాదు. నీకు (సేవకుణ్ణి) ఇచ్చి అరుగువాళ్ళను వంచితుల్ని చేయలేను. వారు ఆకలి బాధకు తాళలేక గంజితో కడుపులు నింపుకుంటున్నారు. వారిపై ఖర్చుపెట్టడానికి నా దగ్గర ఏమీలేదు. ఈ ఖైదీలను అమ్మి తద్వారా వచ్చిన సొమ్మును వారిపై ఖర్చుపెడతాను." దైవప్రవక్త(స)లోని కారుణ్య గుణాన్ని అంచనా వేయడానికి ఈ ఒక్క దృష్టాంతం చాలు– సల్లల్లాహు అలైహి వ సల్లమ్.

## అధ్యాయం : 7

## అల్ అన్ఫాల్ సూరాలో అల్లాహ్ ఆదేశం.

"మీరు యుద్ధ సంపదగా పొందిన దానిలో ఐదవ భాగం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ చెందుతుంది." *(8: 41)*

అంటే ఈ భాగాన్ని దైవప్రవక్త(సఅసం) పంపిణీ చేస్తారు. ఎందుకంటే "నేను పంచిపెట్టేవాణ్ణి. కోశాధికారి, ప్రదాత మాత్రం అల్లాహ్‌యే" అని ప్రవక్త మహనీయులు(స) చెప్పారు.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) కథనం: అన్సారులమైన మా తెగ వారిలో ఒక అన్సారీ ఇంట ఒక పిల్లవాడు పుట్టాడు. అతను తన పిల్లవానికి ముహమ్మద్ అని నామకరణం చేయదలిచాడు.

షూబా గారు మన్సూర్ నుండి ఉటంకిస్తూ ఇలా వివరించారు: ఆ అన్సార్ వ్యక్తి, ఆ పిల్లవాణ్ని తన భుజంపై ఎత్తుకుని దైవప్రవక్త (స) సేవలో హాజరయ్యాడు.

సులైమాన్ ఉల్లేఖనంలో ఇలా ఉంది: అతనికి పిల్లవాడు కలిగినప్పుడు, అతను ఆ పిల్లవానికి ముహమ్మద్ అని పేరుపెట్టదలిచాడు. దానిపై ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా సెలవిచ్చారు: "నా పేరు మీద పేరు పెట్టుకోండి. కాని నా నామాంతరం (అబుల్ ఖాసిమ్)పై – అంటే కునియత్‌పై– కునియత్ పెట్టకండి. ఎందుకంటే నన్ను పంచిపెట్టేవాని (ఖాసిమ్)గా చేయటం జరిగింది. నేను మీ మధ్యన పంచిపెట్టేవాడను."

హుసైన్ (తన రివాయతులో) ఇలా అన్నారు: "నన్ను పంపకం చేసేవాని (ఖాసిమ్)గా చేసి పంపటం జరిగింది. నేను మీ మధ్యన పంపిణీ చేస్తాను" అని ప్రవక్త(స) సెలవిచ్చారు.

అమ్ర్ బిన్ మర్జూఖ్ ఇలా అన్నారు: మాకు షూబా తెలిపారు– ఆయనకు ఖతాదా వివరించారు– ఆయనేమో సాలిమ్ చెప్పగా విన్నారు– ఆయన జాబిర్(రజి) చెప్పగా విన్నారు: ఆ అన్సార్ సహాబీయే తన పిల్లవానికి 'ఖాసిమ్' అని పేరు పెట్టదలచినప్పుడు, "నా పేరు మీద పేరు పెట్టుకోండి. కాని నా కునియత్ మీద పెట్టుకోకండి" అని ప్రవక్త మహనీయులు(స) ఉపదేశించారు.

**437)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) తెలిపారు : మా తెగ వారిలో ఒకరి ఇంట ఒక పిల్లవాడు పుట్టాడు. అతను ఆ పిల్లవానికి ఖాసిమ్ అని పేరు పెట్టాడు. అప్పుడు అన్సార్ జనులు 'మేము నిన్ను 'అబుల్ ఖాసిమ్' (ఖాసిమ్ తండ్రి)

**అని పిలిచి, నీ కంటికి చలువను ఇవ్వబోము'[1] అని కరాఖండీగా చెప్పేశారు. ఇది విన్న ఆ అన్సార్ వ్యక్తి దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! నాకొక పిల్లవాడు కలిగాడు. నేనతనికి ఖాసిమ్ అని నామకరణం చేశాను. అయితే అన్సార్లు దీనిపై అభ్యంతరం తెలుపుతూ, మేము నిన్ను అబుల్ ఖాసిమ్ అని పిలువము అని అంటు న్నార'ని నివేదించుకున్నాడు. ప్రవక్త మహనీయులు(స) ఈ మాట విని, "అన్సార్లు సరిగ్గానే చెప్పారు. నా పేరు మీద పేరు (ముహమ్మద్ అని) పెట్టుకో. కాని నా 'కునియత్' (ఖాసిమ్)పై వద్దు. ఎందుకంటే 'ఖాసిమ్'ను నేను"[2] అని చెప్పారు.**

**438) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని ముఆవియా (రజి) తెలిపారు: "అల్లాహ్ మేలు చేయదలచిన వానికి ధర్మావగాహనను ప్రసాదిస్తాడు.[1] ఇచ్చేవాడైతే అల్లాహ్యే. నేను కేవలం పంచిపెట్టేవాణ్ణి మాత్రమే. తన వ్యతిరేకులకు ఎదురుగా ఈ ఉమ్మత్(ముస్లిం సముదాయం) సదా ఆధిక్యత వహిస్తుంది. కడకు దైవాజ్ఞ (ప్రళయం) వచ్చేస్తుంది.[2] అప్పుడు కూడా ఇదే ఆధిక్యత పొందుతుంది.**

**ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "నేను మీకు ఏదైనా ఇచ్చేవాడను గానీ, ఇవ్వకుండా ఆపుకునే**

---

437–1. అంటే నీవు ఆశిస్తున్నట్లుగా ఓ అబుల్ ఖాసిమ్ (ఓయీ ఖాసిమ్ తండ్రీ!) అని పిలిచి నిన్ను సంతోషపరచబోము.

437–2. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ సుఫియాన్ సౌరీ ఉల్లేఖనాన్ని తెచ్చి ఈ విషయానికి బలం చేకూర్చారు. అన్సార్ వ్యక్తి తన పిల్లవానికి 'ఖాసిమ్' అనే పేరు పెట్టదలచినప్పుడు, అన్సార్ తెగ వారు చాలా స్పష్టంగా దానిని నిరాకరించారు. దైవప్రవక్త(స) కూడా అన్సార్ల అభిప్రాయాన్ని ప్రశంసించారు.

438–1. ఇక్కడ 'ధర్మావగాహన' అంటే అర్థం ధర్మం (దీన్)లో ప్రావీణ్యం, తెలివిడి, ప్రజ్ఞ, వివేచన, బుద్ధికుశలత. ఈ వరం ఎవరికి లభించినా అతనికి అపారమైన మేళ్ళు ప్రాప్తమైనట్లే. ఈ భాగ్యం అందరికీ స్వంతం కాదు. అల్లాహ్ మేలు చేయదలచిన వారికే అది ప్రాప్త మవుతుంది.

438–2. నేడు ప్రపంచంలో ముస్లింల అధోగతిని, క్షీణ దశను చూసినవారికి ఇక్కడ సంశయం కలగవచ్చు. వారు అడుగడుగునా పరీక్షల్ని ఎదుర్కొంటున్న విషయం నిజమే. వారు రాజకీయంగా, సైనికంగా, ఆర్థికంగా సర్వత్రా ఓటమి పాలవుతున్నదీ నిజమే. కాని వారి వద్ద సత్యబలం ఉంది. అణచివేసే కొద్దీ అది పైకి ఎగిసిపడుతుంది. సైనిక బలంతో వారిని లొంగదీసుకునేవారే సత్యం రీత్యావారిని అక్కున చేర్చుకుంటారు. ప్రళయం వరకూ సత్యబలం ఉన్న సముదాయం పెరుగుతూనే ఉంటుంది.

**వాణ్ణి గానీ కాను. నేను కేవలం పంపకం చేసేవాడను మాత్రమే. ఎవరికి ఇవ్వమని ఆదేశించబడుతుందో వారికే ఇస్తాను."[3]**

**439)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) చెప్పగా తాను విన్నానని ఖౌలా బిన్తె ఖైస్ అన్సారియా (రజి.అన్హా) తెలిపారు: **"కొంతమంది దేవుని సొమ్మును అనుచితంగా (అన్యాయంగా) ఖర్చుపెడతారు. అలాంటి వారికి ప్రళయదినాన నరకాగ్నే గతి."[1]**

## అధ్యాయం : 8

## "మీ కొరకు విజయ సంపద ధర్మసమ్మతం గావించబడింద"న్న ప్రవక్త(స) ప్రవచనం

**దైవోపదేశం :** అల్లాహ్ మీకు అమితమైన విజయ ధనాలను వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరు పొందుతారు. వెంటనే ఆయన మీకు ఈ విజయాన్ని ప్రసాదించాడు. *(అల్ ఫత్హ్ : 20)*

**కాబట్టి ఈ విజయ ధనం (ఖుర్ఆన్ ప్రకారం) అందరి హక్కు... కాని దానికి అసలు హక్కుదారులెవరో ప్రవక్త మహనీయులు(స) విడమరచి చెప్పారు.[1]**

---

438-3. 'విజయ ప్రాప్తి' పంపిణీ నేపథ్యంలో చెప్పిన మాటలివి. అంటే నేను చేసే పంపిణీ దైవాజ్ఞాబద్ధమై ఉంటుంది. ఇచ్చేవాడు దైవమే కనుక ఎవరికి ఏది లభించినా వారు దానిని సంతోషంగా పుచ్చుకోవాలి. ఆంతర్యంలో ఎలాంటి సంకుచితత్వానికి, కల్మషానికి చోటివ్వకూడదు.

439-1. జీవనోపాధిని ధర్మసమ్మతంగా ఆర్జించటం ఎంత ముఖ్యమో, ఆ ఉపాధిని ధర్మబద్ధంగా వెచ్చించటం కూడా అంతే ముఖ్యం. తన దగ్గర డబ్బు ఉంది కదా అని దుబారాగా ఖర్చుపెట్టడం, అధర్మకార్యాల్లో వెచ్చించటం పాపం. అలాగే ప్రజా ప్రతినిధులుగా అధికారం చేపట్టినవారు ప్రజల అవసరాల గురించి పట్టించుకోకుండా, ప్రజల సొమ్ముతో జలసాలు చేయటం కూడా గర్హించదగినదే. ఇలాంటి వారందరికీ ఈ హదీసు హెచ్చరిక.

8-1. ఖుర్ఆన్ సూత్రప్రాయంగా విషయం చెప్పింది. దాని ప్రకారం విజయ ధనం ముస్లిం లందరికీ చెందుతుంది. అయితే హదీసు దానికి తఫ్సీలు వంటిది. ఆ హక్కు ఎవరెవరికి, ఎంత దక్కుతుందో దైవప్రవక్త(స) విశదీకరిస్తారు. అంటే యుద్ధంలో పాల్గొని, యుద్ధప్రాప్తిని వశపరచుకున్నవారు. ఇకపోతే ఆ విజయ ధనంలోని ఐదవ భాగాన్ని సమకాలీన పరిపాలకుడు ముస్లింల సాధారణ ప్రయోజనాల నిమిత్తం వేరుపరుస్తాడు.

**440) ఉర్వా బారిఖీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(సఅసం) ఇలా ప్రవచించారు : "అశ్వాల నుదుటికి శుభం, సమృద్ధి, విజయప్రాప్తి కట్టబడి ఉంది."[1]**

**441) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: మహాప్రవక్త(సఅసం) ప్రవచనం– "కిస్రా (ఈరాన్ చక్రవర్తి) చనిపోయిన తరువాత మరో కిస్రా ఉండడు. ఖైసర్ (రోము చక్రవర్తి) అంతమైన మీదట మరో ఖైసర్ ప్రభవించడు. ఎవరి స్వాధీనంలో నా ప్రాణముందో ఆ శక్తి సాక్షిగా చెబుతున్నాను. మీరు ఆ ఇద్దరు చక్రవర్తుల ఖజానాలను దైవమార్గంలో పంచిపెడతారు."[1]**

**442) ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లుగా జాబిర్ బిన్ సమురా(రజి) తెలియజేశారు : కిస్రా (ఈరాన్ చక్రవర్తి) చనిపోయిన తరువాత మరో కిస్రా ఎవడూ పుట్టడు. ఖైసర్ (రోము చక్రవర్తి) మరణించిన పిదప, అతనికి ప్రత్యామ్నాయంగా మరో ఖైసర్ పుట్టడు. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! మీరు వారి ఖజానాలను దైవమార్గంలో ఖర్చుపెడతారు."**

**443) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసఎం) ఇలా ప్రవచించారు: "నా (ఉమ్మత్) కొరకు విజయ ధనాలు ధర్మసమ్మతం (హలాల్) గావించబడ్డాయి."[1]**

**444) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: మహాప్రవక్త(సఅసం) ఇలా ప్రవచించారు: "ఎవరయితే అల్లాహ్ హక్కును (వాగ్దానాన్ని) సత్యంగా గ్రహించి అల్లాహ్ మార్గంలో జిహాద్ చేస్తాడో, జిహాద్ సంకల్పంతో బయలుదేర్తాడో అతని పక్షాన అల్లాహ్ జామీనుగా ఉంటాడు– అల్లాహ్ అతనికి అమరగతిని వొసగి స్వర్గాని**

---

ఇమామ్ బుఖారీ (రహ్మ) తీసుకున్న ఈ అంశం ఆధారంగా, ముస్లింలకు ఖుర్ఆన్ ఒక్కటి చాలని, హదీసుల అవసరం లేదని వాదించేవారి మాట ఖండించినట్టయ్యింది.

440–1. అంటే యుద్ధం (జిహాద్)లో పాల్గొన్నవారికి గౌరవోన్నతులతోపాటు విజయ ధనం కూడా ప్రాప్తమవుతుంది.

441–1. మహాప్రవక్త(స) వారి ఈ భవిష్యవాణి అక్షర సత్యమయింది. ప్రాచీన ఈరాన్ సామ్రాజ్యం పతనమైంది. అక్కడ శాశ్వతంగా– ఇస్లాం వచ్చేసింది. సిరియాలో కూడా అదే జరిగింది. రోము రాజు ఖజానాలు ముస్లింల వశమయ్యాయి. వారు ఆ విజయధనాన్ని దైవమార్గంలో ఖర్చుపెట్టారు.

443–1. విజయ ధనం గత సమాజాల వారికి ధర్మసమ్మతం (హలాల్)గా లేదు.

కయినా చేరుస్తాడు లేదా అతనికి పుణ్యఫలాన్ని, యుద్ధప్రాప్తిని ఇప్పించి అతని ఇంటికయినా చేరుస్తాడు."

**445)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "బనీ ఇస్రాయీల్ ప్రవక్తలలోని ఒక ప్రవక్త (యోషే– అలైహిస్సలాం) యుద్ధ సంకల్పం చేసుకున్నప్పుడు, తన జాతి ప్రజలనుద్దేశించి ఇలా అన్నారు: "ఎవరయితే ఇప్పుడిప్పుడే కొత్తగా పెళ్ళి చేసుకున్నాడో, భార్యతో రాత్రి కూడా గడపలేదో, రాత్రి గడపాలనుకుంటున్నాడో, మరెవరయితే ఇల్లు కట్టాడో కాని పైన కప్పు వేయలేదో, ఇంకా ఎవరయితే సూడి మేకను లేదా సూడి ఒంటెల్ని కొను గోలు చేసి అవి ఈనుతాయని నిరీక్షిస్తున్నాడో అలాంటి వారిలో ఏ ఒక్కరూ మా వెంట రాకూడదు"– తరువాత ఆయన యుద్ధం చేశారు. (అరీహా) జనవాసాన్ని సమీపించినప్పుడు అస్ర్ (నమాజ్) వేళ అయింది లేదా అస్ర్ వేళ దగ్గర పడింది. అప్పుడాయన సూర్యుణ్ణి ఉద్దేశించి, "చూడు, నువ్వు కూడా దైవాజ్ఞాబద్ధుడవే. నేను కూడా దైవాజ్ఞాబద్ధుడనే. ఓ దేవా! మా కొరకు నీవు దీనిని (సూర్యుణ్ణి) అది ఉన్న చోటే నిలిపి ఉంచు" అని వేడుకున్నారు. అంతే, కాలచక్రం స్తంభించింది. కడకు అల్లాహ్ ఆయనకు విజయం చేకూర్చాడు. తరువాత ఆయన విజయ ధనాన్ని సమీకరించారు. దానిని కాల్చి భస్మీపటలం చేయడానికి అగ్ని వచ్చింది. కాని కాల్చలేక పోయింది. అప్పుడు ఆ ప్రవక్త తన జాతివారితో, "మీలో ఎవడో యుద్ధ ప్రాప్తిని దొంగిలించాడు. కాబట్టి మీలో ప్రతి తెగ నుంచీ ఒక్కో వ్యక్తి చొప్పున వచ్చి, నా చేతిలో చెయ్యేసి ప్రమాణం (బైఅత్) చేయాలి" అని ఆదేశించారు. (వారు ప్రమాణం చేస్తున్నప్పుడు) ఒక తెగకు చెందిన ఒక ప్రతినిధి చెయ్యి ఆ ప్రవక్త చేతికి అతుక్కుపోయింది. అప్పుడాయన, "మీ తెగవాడే ఈ ద్రోహానికి పాల్పడ్డాడు. కాబట్టి ఇప్పుడు మీ తెగ వారంతా వచ్చి, నా సమక్షంలో ప్రమాణం చెయ్యాలి" అన్నారు. అందువల్ల వారంతా హాజరయ్యారు. ఆ తెగ వారిలోని ఇద్దరు లేక ముగ్గురు వ్యక్తుల చేతులు ఆయన చేతికి అతుక్కుపోయాయి. "దొంగతనానికి పాల్పడినది మీరే కదూ!" అన్నారాయన. (వారు తమ అపరాధాన్ని అంగీకరించారు) తరువాత వాళ్ళు ఆవు తలకాయ మాదిరిగా ఉన్న ఒక బంగారు తలను తీసుకువచ్చారు. (యుద్ధ ప్రాప్తిలోనుంచి అపహరించబడిన బంగారం అది). అది యుద్ధప్రాప్తి రాశిలో కలుపబడింది. అప్పుడు అగ్ని వచ్చి దానిని కాల్చివేసింది. ఆ తరువాత

**అల్లాహ్ యుద్ధప్రాప్తి (మాలె గనీమత్)ని మన కోసం ధర్మసమ్మతం గావించాడు- ఆయన మన బలహీనతను, నిస్సహాయ స్థితిని చూశాడు. అందుకే దానిని మన కొరకు హలాల్ చేశాడు.[1]**

## అధ్యాయం : 9

## యుద్ధంలో పాల్గొన్న వారికే 'యుద్ధప్రాప్తి'

**446) మహనీయ ఉమర్(రజి అల్లాహు అన్హు) ఈ విధంగా వక్కాణించినట్లు జైద్ బిన్ అస్లం తండ్రి తెలిపారు: "భావి తరాలకు చెందిన ముస్లింల చింత గనక నాకు లేకుండా ఉంటే, దైవప్రవక్త(స) ఖైబర్ యుద్ధప్రాప్తిని పంచిపెట్టినట్లుగా నేను కూడా విజయం లభించిన చోటల్లా అక్కడి విజయధనాన్ని విజేతల మధ్యన పంచిపెట్టేసేవాణ్ణి."**

## అధ్యాయం : 10

## ఒకవేళ ఎవరయినా విజయధనాన్ని పొందే ఉద్దేశంతో పోరాడినట్లయితే (కాని అతని సంకల్పం ధర్మోన్నతి అయి ఉంటే) అతని పుణ్యఫలం తగ్గుతుందా?[1]

---

445-1. హదీసులో బనీ ఇస్రాయీల్ ప్రవక్త మహనీయ యోషే (అలైహిస్సలాం) ప్రస్తావన వచ్చింది. యుద్ధ సమయంలో అస్ర్ వేళ అవగానే ఆయన దైవ సహాయం కొరకు అర్థించారు. దేవుడు ఆయన మొరను ఆలకించి, ఆమోదించాడు. ఇలాంటి దానినే ధార్మిక పరిభాషలో 'మోజిజా' (అద్భుతం) అంటారు. ఇలాంటి అద్భుతాలు సత్యం.

ప్రాచీన కాలంలో యోధులకు యుద్ధప్రాప్తి నిషిద్ధమై ఉండేది. విజయానంతరం విజయధనాన్నంతా ఒక చోట ప్రోగు చేసిన మీదట ఆకాశం నుండి అగ్ని వచ్చి, దానిని కాల్చివేసేది. అది దైవసన్నిధిలో స్వీకృతి పొందిందనడానికి సంకేతం. విజయ ధనంలో నమ్మకద్రోహం చేయటం పూర్వకాలంలో కూడా ఘోర అపరాధంగానే పరిగణించబడేది. ఇప్పుడు కూడా అది మహాపరాధమే.

అయితే ముస్లిం సముదాయం కొరకు అల్లాహ్ విజయ ధనాలను ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. ఇవి షరీఅత్ ఆదేశం ప్రకారం పంపిణీ అవుతాయి. "ముస్లింల బలహీనతను, నిస్సహాయ స్థితిని అల్లాహ్ చూశాడు" అంటే అర్థం, ఆర్థికంగా వారు పేదవారు, నిరాధార జీవులుగా ఉండటం గమనించాడు. వారు అల్లాహ్ సన్నిధిలో అణకువతో, వినమ్రతతో హాజరై వేడుకోవడం కూడా దైవానికి నచ్చింది. చివరకు ఆయన వారివైపు దయా దృష్టితో మరలి, అప్పటివరకూ హరామ్‌గా ఉన్న మాలె గనీమత్‌ని ఉమ్మతె ముస్లిమా కొరకు హలాల్ చేశాడు.

**447)** మహనీయ అబూ మూసా అష్‌అరీ (రజి) కథనం: ఒక పల్లెటూరి వ్యక్తి (లాహిఖ్ బిన్ జమీరా బాహిలీ) దైవప్రవక్త(సఅసం) సన్నిధికి వచ్చి ఇలా అడిగాడు: 'ఒక వ్యక్తి విజయ ధనాన్ని పొందాలన్న కాంక్షతో యుద్ధం చేస్తాడు. మరొక వ్యక్తి, తన సాహసాన్ని, శౌర్యాన్ని గురించి నలువైపులా చర్చ జరగాలనీ, తన పేరు మారుమ్రోగిపోవాలని ఆశించి యుద్ధం చేస్తాడు. ఇంకొక వ్యక్తి కదన రంగంలో జనులు తన వీరోచిత పోరాటాన్ని చూసి అబ్బురపడాలని భావించి జిహాద్‌లో పాల్గొంటాడు. మరైతే వీరిలో దైవమార్గంలో పోరాడిన వారెవరు?' దీనికి సమాధానంగా దైవప్రవక్త(స), "దైవవాక్కు ఉన్నతి కొరకు యుద్ధంలో పాల్గొన్న వాడు" అని చెప్పారు.

## అధ్యాయం : 11

## ముస్లింల ఖలీఫా వద్దకు అన్యులు పంపిన కానుకలను పంచి పెట్టడం. ఆ సమయంలో అక్కడలేని వారికోసం వాటిని భద్రపరచటం

**448)** అబ్దుల్లాహ్ బిన్ అబీ ములైకా కథనం: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) వద్దకు కొన్ని పట్టువస్త్రాలు (చొక్కాలు) కానుకగా వచ్చాయి. ఆ చొక్కాలకు బంగారు గుండీలు ఉన్నాయి. వాటిని దైవప్రవక్త(స) తన సహచరులకు పంచిపెట్టారు. ఒక చొక్కాను మాత్రం మఖ్రమా బిన్ నౌఫల్(రజి) కొరకు ఉంచుకున్నారు. తరువాత మఖ్రమా (రజి) వచ్చారు. ఆయన వెంట ఆయన కుమారుడు మిస్వర్ కూడా ఉన్నారు. ఆయన తలుపు దగ్గరే నిలబడి, 'నా పేరు చెప్పి దైవప్రవక్త(స)ను పిలుచుకుని రా' అని కుమారుణ్ణి పురమాయించారు. దైవ ప్రవక్త(స) ఆయన కంఠస్వరం విని, ఆ చొక్కాను తీసుకుని బయటికి వచ్చారు. ఆ చొక్కాలోని గుండీలు ఆయనకు కనిపించేలా ఉంచి,[1] "ఓ అబూ మిస్వర్! ఈ

---

10-1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ ఈ అధ్యాయాన్ని ఏర్పరచటంలోని ఉద్దేశ్యమేమిటంటే; జిహాద్ ద్వారా దైవవాక్కును సమున్నతం చేయటం ప్రధాన లక్ష్యమై ఉన్నప్పుడు, దానికి అనుబంధంగా యుద్ధప్రాప్తి (మాలె గనీమత్) కూడా దక్కితే పుణ్యఫలం లభించటంలో ఎలాంటి తేడా రాదు. ఉదాహరణకు– బద్ర్ సంగ్రామానికి ముందు సహాబా బయలు దేరినది వర్తక బిడారును అడ్డగించి వస్తుసామగ్రిని వశపరచుకోవడానికే. కాని కేవలం విజయ ధనాన్ని పొందటమే ఉద్దేశ్యమై ఉన్నప్పుడు పుణ్యం తగ్గటం అటుంచి, అసలు పుణ్యమే ప్రాప్తమవదు.

చొక్కాను నేను నీ కోసమే దాచిపెట్టాను. అబూ మిస్వర్! ఈ చొక్కాను నేను నీ కోసమే దాచిపెట్టాను" అన్నారు. మఖ్రమా కాస్త కరకు స్వభావి.[2]

## అధ్యాయం : 12

## దైవప్రవక్త(స) బనూ నజీర్, బనూ ఖురైజా ఆస్తులను ఎలా పంచిపెట్టారు? తన స్వంత అవసరాల కొరకు వాటిని ఎలా ఖర్చుపెట్టారు?

**449)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : సహాబా (అన్సార్లు) కొన్ని ఖర్జూర వృక్షాలను దైవప్రవక్త(సఅసం)కు కానుకగా సమర్పించుకునేవారు. అయితే అల్లాహ్ బనూ నజీర్, బనూ ఖురైజా తెగలవారిపై విజయాన్ని ప్రసాదించిన తరువాత దైవప్రవక్త(స) తనకు అన్సార్ల నుండి లభించిన – ఈ రకమైన– కానుకలను వాపసు చేసేవారు.

## అధ్యాయం : 13

## ప్రవక్త (స) సహచరుల త్యాగాలు

**450)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) కథనం: జమల్ యుద్ధ సమయంలో జుబైర్(రజి) నిలబడి నన్ను పిలిచారు. నేను వెళ్ళి ఆయన ప్రక్కలో నిలుచున్నాను. ఆయన ఇలా అన్నారు: "బాబూ! ఈ రోజు దౌర్జన్యపరుడు వధించ బడతాడా? లేక బాధితుడు వధించబడతాడా? ఈ రోజు బాధితుడనైన నేనే వధించ బడతానని అనుకుంటున్నాను. నాకు అన్నిటికన్నా ఎక్కువ చింత నా అప్పుల గురించే. నీకేమైనా అంచనా ఉందా? అప్పులు తీర్చిన తరువాత మనకు ఏదన్నా ఆస్తి మిగులుతుందంటావా?"– తరువాత ఆయన ఇలా అన్నారు: "ఒరేయ్ అబ్బాయి! మన ఆస్తిని అమ్మి (అయినా సరే) అప్పులు తీర్చేయాలి". ఆ తరువాత ఆయన గారు తన ఆస్తిలోని మూడవ భాగాన్ని వీలు చేశారు. ఆ మూడవ భాగం లోని మూడవ వంతును (1/3) అబ్దుల్లాహ్ బిన్ జుబైర్– రజి పిల్లలకు (అంటే

---

448–1. మఖ్రమాను సంతోషపెట్టే ఉద్దేశంతో దైవప్రవక్త(స) ఆ చొక్కా గుండీలు కనిపించే విధంగా పట్టుకున్నారు.

448–2. మఖ్రమా (రజి) గారిది దుందుడుకు వైఖరి. తొందరగా కోపం వచ్చేది. తన సహచరుల్లో వివిధ మనస్తత్వాలు గలవారున్నప్పటికీ, వారందరినీ కలుపుకుపోయేవారు దైవ ప్రవక్త(స). వారి సైకాలజీని బట్టి వారితో వ్యవహరించేవారు.

మనవళ్ళకు) చెందాలని వసీయతు చేశారు. (ఎందుకంటే అబ్దుల్లాహ్‌కు సంతానం ఎక్కువ) ఆయన ఇలా విడమరచి చెప్పారు– ఆ మూడవ భాగాన్ని మూడు వాటాలుగా చెయ్యాలి. అప్పులు తీర్చిన తరువాత మన ఆస్తిలో ఏమన్నా మిగిలితే అందులోని మూడవ భాగం (మూడవ భాగంలో మూడో వంతు) నీ పిల్లలదవుతుంది– ఉల్లేఖకులైన హిషామ్ ఇలా అన్నారు : అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) గారి పిల్లల్లో కొంతమంది జుబైర్(రజి) కొడుకులకు సమ వయస్కులు. ఉదాహరణకు– ఖుబైబ్, అబ్బాద్. జుబైర్(రజి)కు ఆ సమయంలో తొమ్మండుగురు మగపిల్లలు, తొమ్మండుగురు ఆడపిల్లలు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఇలా అన్నారు : జుబైర్ (రజి) నాకు అప్పులు తీర్చే విషయమై వసీయతు చేస్తూ, 'బాబూ! అప్పులు తీర్చడంలో నిస్సహాయ స్థితి ఏర్పడితే నా యజమాని, సంరక్షకుణ్ణి (మౌలాను) సహాయం అర్థించు' అన్నారు. అబ్దుల్లాహ్ (రజి) ఇలా అన్నారు : "దైవసాక్షి! ఆయన గారి ఈ మాటను నేను అర్థం చేసుకోలేకపోయాను. 'నాన్నా! మీ సంరక్షకుడు (మౌలా) ఎవరు?' అనడిగాను. 'అల్లాహ్' అని ఆయన చెప్పారు.

అబ్దుల్లాహ్(రజి) తెలిపారు: "దైవసాక్షి! అప్పులు తీర్చడంలో ఇబ్బంది ఎదురైనప్పుడు నేను అలాగే వేడుకున్నాను (నాన్నగారు సూచించినట్లుగా). 'ఓ జుబైర్ సంరక్షకుడా (మౌలా)! ఆయన పక్షాన ఆయన అప్పులు తీర్చు' అని నేను ప్రార్థించినప్పుడల్లా అప్పులు తీరే మార్గాలు తెరచుకునేవి. (జమల్ యుద్ధ సందర్భంగా) జుబైర్(రజి) అమరగతి నొందినప్పుడు, 'తరకా'గా ఆయన దీనార్లను దిర్హములను తన వెనుక వదలిపెట్టలేదు. ఆయన వదలిన ఆస్తి అంతా భూముల రూపంలో ఉంది. అందులో 'గాబా' భూమి కూడా ఉంది. మదీనాలో 11 ఇళ్ళు ఉన్నాయి. బస్రాలో రెండు ఇళ్లు, కూఫా, ఈజిప్టులలో ఒక్కో ఇల్లు చొప్పున ఉన్నాయి. ఆయన గారిపై అప్పుల భారం అంత ఎక్కువ అవడానికి ప్రధాన కారణం ఏమిటంటే, ఆయన దగ్గరకు ఎవరు తన సొమ్మును అప్పగింత (అమానతు)గా భద్రపరచడానికి వచ్చినా, 'అది నా వల్ల కాదు. అయితే మీరు ఈ సొమ్మును నా దగ్గర అప్పుగా ఉంచడానికి అంగీకరిస్తే భద్రపరుస్తాను. ఎందుకంటే, ఈ అమానతు నా దగ్గర వృధా అవుతుందేమోనన్న భయం నాకుంది' అని అనేవారు. హజ్రత్ జుబైర్(రజి) ఏ ప్రాంతానికీ పాలనాధికారిగా నియుక్తులు కాలేదు. రెవిన్యూ అధికారిగా కూడా నియమితులు కాలేదు. ఇతర హోదాలు కూడా ఆయన

స్వీకరించలేదు. కాకపోతే దైవప్రవక్త(స)తో,అబూబక్ర్ (రజి)తో, ఉమర్(రజి)తో కలసి యుద్ధాలలో పాల్గొన్నారు.

అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఇలా అంటున్నారు : "ఆయనపై ఉన్న అప్పుల భారాన్ని నేను మదిస్తే, 22 లక్షలని తేలింది". తరువాత ఇలా అన్నారు : హకీమ్ బిన్ హిజామ్(రజి) గారు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)ని కలుసుకుని, 'అబ్బాయ్! నా ధార్మిక సోదరుడు ఎంత బాకీ పడ్డాడు?' అని అడిగారు. అబ్దుల్లాహ్(రజి) ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలనుకున్నారు. అందుకే "ఒక లక్ష" అని టూకీగా చెప్పారు. దానికి హకీమ్ బిన్ హిజామ్(రజి) 'దైవసాక్షి! నీ దగ్గరున్న డబ్బుతో ఈ అప్పు తీర్చలేవు' అన్నారు. అబ్దుల్లాహ్(రజి) ఇప్పుడు రహస్యం విప్పుతూ, "ఒకవేళ ఈ అప్పు 22 లక్షలైతే, అప్పుడు మీరేమంటారు?" అనడిగారు. 'ఏమంటాను? ఇది నీ తలకు మించిన భారం అనుకుంటాను. కాని ఏదన్నా ఇబ్బంది ఎదురైతే మాత్రం నాకు చెప్పు' అన్నారాయన. హజ్రత్ జుబైర్ (రజి) 'గాబా' భూమిని ఒక లక్షా డెబ్బయి వేలకు కొన్నారు. కాని అబ్దుల్లాహ్ ఆ భూమిని 16 లక్షలకు అమ్మారు. "జుబైర్(రజి) ఎవరెవరికి బాకీ పడి ఉన్నారో వారంతా గాబా వచ్చి, తమ సొమ్మును నా నుండి తీసుకోవచ్చు" అని ఆయన ప్రకటన గావించారు. ఈ ప్రకటనను పురస్కరించుకుని అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ వచ్చారు. జుబైర్(రజి) ఆయనకు 4 లక్షలు ఇవ్వవలసి ఉంది. 'నువ్వు గనక కోరితే ఈ అప్పును నేను (క్షమించి) వదలిపెడతాన'ని ఆయన ఆఫర్ ఇచ్చారు. కాని అబ్దుల్లాహ్ మృదువుగా తిరస్కరించారు. 'పోనీ, ఒక పని చెయ్యండి. మీ అప్పులన్నీ తీరిపోయినాక నాకు రావలసిన బకాయిని తీసుకుంటాను' అని చెప్పారు అబూ తాలిబ్ మనవడు. కాని అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఈ ఆఫర్‌ను కూడా మృదువుగా తిరస్కరిస్తూ, అప్పు తీర్చే విషయంలో తాత్సారం మంచిది కాదన్నారు. 'మరి అలాగయితే నాకు రావలసిన బాకీ క్రింద గాబా భూభాగంలో నా వాటా ఎంతో తెగ్గొట్టి ఇవ్వండి' అన్నారు అబ్దుల్లాహ్ బిన్ జాఫర్. "సరే. మీకు ముట్టవలసిన బాకీ క్రింద 'ఇక్కడినుండి అక్కడి వరకూ' గల భూమిని తీసేసుకోండి"అన్నారు జుబైర్ పుత్రుడు.

(ఉల్లేఖకుడు) ఇలా అన్నారు : జుబైర్ భూముల్ని, ఇళ్ళను అమ్మి అప్పులన్నీ తీర్చటం జరిగింది. 'గాబా' భూమిలో నాలుగున్నర వాటాలు ఇంకా మిగిలి ఉన్నాయి (వాటి అమ్మకం జరగలేదు). అందువల్ల అబ్దుల్లాహ్ (రజి) గారు ముఆవియా (రజి)

**దగ్గరకు (సిరియా) వెళ్ళారు. ఆ సమయంలో అక్కడ అమ్ర్ బిన్ ఉస్మాన్, మున్జిర్ బిన్ జుబైర్, ఇబ్నె జమా ఉన్నారు. 'గాబా' ఆస్తి వెల నిర్ధారితమయిందా?అని ముఆవియా(రజి) అడగ్గా, ఒక్కో వాటాను ఒక్కో లక్షగా నిర్ధారించామని అబ్దుల్లాహ్ చెప్పారు. ఇప్పుడు ఇంకా ఎన్ని వాటాలు మిగిలి ఉన్నాయి? అని ముఆవియా దర్యాప్తు చేయగా, "నాలుగున్నర వాటాలు" అని ఆయన చెప్పారు. ఒక వాటా ఒక లక్షకు నేను తీసుకుంటానని మున్జిర్ బిన్ జుబైర్ చెప్పారు. ఒక వాటాను ఒక లక్షకు నేను కూడా తీసుకుంటానని అమ్ర్ బిన్ ఉస్మాన్ అన్నారు. ఒక లక్షకు ఒక వాటా నేను కూడా కొంటానని ఇబ్నె జమా మాటిచ్చారు. 'ఇంకా ఎన్ని వాటాలు మిగిలాయి?' అని ముఆవియా అడిగారు. "ఒకటిన్నర" అని అబ్దుల్లాహ్ (రజి) చెప్పగా, 'ఆ ఒకటిన్నర వాటాను ఒకటిన్నర లక్షకు నేను తీసుకుంటాన'ని ముఆవియా (రజి) అన్నారు. ఆ తర్వాత అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ (రజి) తన వాటాను ఆరు లక్షలకు ముఆవియా (రజి)కు అమ్మారు.**

**అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) గారు అప్పులన్నీ తీర్చివేసిన పిమ్మట, జుబైర్ (రజి) పిల్లలు వచ్చి, "ఇప్పుడు మా వారసత్వ హక్కును మాకు పంచి ఇవ్వండి" అని కోరారు. దానికి అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి), "నాలుగేళ్ళపాటు హజ్జ్ దినాలలో ప్రకటన చేయాల్సి ఉంది. జుబైర్ ఎవరికి బాకీ పడి ఉన్నా వారొచ్చి తీసుకోవచ్చు అని ప్రకటిస్తాను (ఆ తరువాతే ఆస్తి పంపకం)" అన్నారు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు: అన్నట్టుగానే అబ్దుల్లాహ్ ప్రతి ఏటా హజ్జ్ దినాలలో ప్రకటన చేయించారు. నాలుగేళ్ళు పూర్తయ్యాక వారికి ఆస్తి పంచి ఇచ్చారు. ఉల్లేఖకులు ఇలా అన్నారు : "జుబైర్ (రజి)కు నలుగురు భార్యలుండేవారు. (వసీయతు ప్రకారం) మూడవ వంతును వేరుపరచినప్పటికీ ఒక్కో భార్యకు పన్నెండు లక్షల చొప్పున డబ్బు దక్కింది. హజ్రత్ జుబైర్(రజి) గారి పూర్తి ఆస్తి విలువ ఐదు కోట్ల రెండు లక్షలని తేలింది.**[1]

---

450–1. ఈ జుబైర్ ఎవరో కాదు, జుబైర్ బిన్ అవ్వామ్(రజి), అలనాటి ముస్లిం సముదాయంలో ఎన్నదగ్గ ముగ్గురు నలుగురు సంపన్నుల్లో ఒకరు. ఈయన కునీయత్ అబూ అబ్దుల్లాహ్ ఖురైషీ. ఈయన తల్లి సఫియ్యా(ర.అ) అబ్దుల్ ముత్తలిబ్ కుమార్తె, దైవ సందేశహరుని(స) మేనత్త. ఈమె పదహారేళ్ళ ప్రాయంలోనే ఇస్లాం స్వీకరించారు.

జుబైర్ (రజి) దైవప్రవక్త(స) కాలంలో జరిగిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. స్వర్గలోక శుభవార్త వినిపించబడిన పదిమంది సహాబా (అష్రె ముబష్షిరా)లో ఒకరు. జమల్ యుద్ధంలో వీర మరణం పొందారు. ఈ యుద్ధం హజ్రత్ ఆయిషా(ర.అ)కి– హజ్రత్ అలీ(రజి)కి మధ్య హి.శ. 36 జమాదివుల్ ఊలా నెలలో బస్రాలో జరిగింది. ఆ

## అధ్యాయం : 14

## ఒకవేళ నాయకుడు ఎవరినయినా దౌత్యంపై పంపిస్తే లేదా ఏదయినా ముఖ్యమైన కార్యంపై ఆగి ఉండమని ఆదేశిస్తే (ఐదవ భాగంలో) అతనికి కూడా వాటా ఉంటుందా?

**451)** ఇబ్నె ఉమర్(రజి) కథనం: మహనీయ ఉస్మాన్(రజి) బద్ర్ సంగ్రామంలో పాల్గొనలేకపోయారు. (ఎందుకంటే) ఆయన వివాహ బంధంలో ఉన్న దైవప్రవక్త(స) పుత్రిక ఒకామె ఆ సమయంలో అస్వస్థతకు గురై ఉంది. దైవ ప్రవక్త(స) ఆయన్ని ఉద్దేశించి, "నీకు బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి లభించినంత పుణ్యం లభిస్తుంది. అంతే వాటా (యుద్ధప్రాప్తిలో) కూడా లభిస్తుంది.[1] అన్నారు.

---

సందర్భంగా హ‌జ్రత్ ఆయిషా(ర.అ) ఒంటె మీద స్వారీ అయి ఉన్నారు. అందువల్ల ఆ యుద్ధానికి 'జమల్ యుద్ధం' అని పేరొచ్చింది. యుద్ధానికి ప్రధాన కారణం హ‌జ్రత్ ఉస్మాన్(రజి) దారుణహత్యకు గాను హంతకుల ప్రతీకారం తీర్చుకోనివ్వమని కోరటం. యుద్ధంలో హ‌జ్రత్ ఆయిషా(ర.అ) పక్షాన ఉన్నవారు ప్రతీకార న్యాయం కోరారు.

ఈ యుద్ధంలో హ‌జ్రత్ జుబైర్(రజి) హ‌జ్రత్ ఆయిషా(ర.అ) పక్షాన నిలిచారు. హ‌జ్రత్ ఉస్మాన్(రజి) హంతకులు హ‌జ్రత్ అలీ(రజి) సైనికుల్లో కలసిపోయారు. ఉస్మాన్ హంతకుల్ని వెంటనే తమకు అప్పగించాలని ఆయిషా కూటమి వారు డిమాండ్ చేశారు. హంతకులు ఎవరో, ఎందుకు హత్య చేశారో న్యాయవిచారణ జరగనంతవరకు తాను వారిని ఎలా అప్పగించగలను? అన్నది అలీ (రజి) వాదన. రాయబారుల ద్వారా ఈ వ్యవహారం పరిష్కారం కాలేదు. ఇరువైపుల నుంచీ కోపావేశం బుసలు కొట్టింది. కడకు యుద్ధం అనివార్యమైంది. అంతేగాని, ఇది ఖిలాఫత్ కోసం జరిగిన యుద్ధం కానేకాదు. హ‌జ్రత్ ఆయిషా(ర.అ) కూటమిలో చేరిన సహాబా అందరూ హ‌జ్రత్ అలీ(రజి)ని ఖలీఫాగా అంగీకరించినవారే.

యుద్ధం భీకర రూపం దాల్చినప్పుడు హ‌జ్రత్ అలీ(రజి) హ‌జ్రత్ జుబైర్(రజి)ని పిలిపించి, దైవప్రవక్త(స) ప్రవచించిన హదీసును జ్ఞాపకం చేశారు– "జుబైర్! ఒక రోజు రానున్నది. అప్పుడు నీవు అలీతో పోరాడతావు. అప్పుడు నీవు దౌర్జన్యపరుడవై ఉంటావు" అన్నది ఆ హదీసు సారాంశం. ఈ హదీసును వినగానే హ‌జ్రత్ జుబైర్(రజి) యుద్ధ రంగం నుండి తిరుగుముఖం పట్టారు. మార్గమధ్యంలో ఒకచోట నిద్రించారు. దుర్మార్గుడైన అమ్ర్ బిన్ జర్మూజ్ సబా లోయలో నిద్రిస్తున్న జుబైర్(రజి)ను చంపి, ఆయన తలను అలీ(రజి) దగ్గరకు తీసుకువచ్చాడు. అది చూసి, "జుబైర్ హంతకుడు నరకానికి ఆహుతి అవుతాడ"ని దైవప్రవక్త(స) చెప్పగా నేను విన్నానని అలీ(రజి) అన్నారు.

## అధ్యాయం : 15

## ఎవరయితే 'ఐదవ భాగం' ముస్లింల అవసరాల నిమిత్తం ఉందని చెప్పారో, దానికి ఆధారం

హవాజిన్ తెగవారి సంఘటన. ఆ తెగవారు దైవప్రవక్త(స)తో గల పాల వరుస సంబంధాన్ని జ్ఞాపకం చేసి, తాము కోల్పోయిన సంపదను, తమ ఖైదీలను తమకు తిరిగి ఇవ్వమని అభ్యర్థించారు. అప్పుడు దైవప్రవక్త(స) తన సహచరులను సంప్రతించి వారి అభ్యర్థనను ఆమోదించారు. యుద్ధం జరగకుండానే చేజిక్కిన సొమ్ములో నుండి ఇస్తానని, ఐదవ భాగంలో నుండి బహుమానంగా ఇస్తానని ప్రజలకు దైవప్రవక్త(స) వాగ్దానం చేసిన విషయం కూడా ఒక ఆధారమే. ఐదవ భాగం (ఖుముస్)లో నుంచి ఆయన(స) అన్సార్‌కు ఇచ్చారన్నది, జాబిర్(రజి)కు ఖైబర్ ఖర్జూరాలు ఇచ్చారన్నది కూడా ఒక ఆధారమే.

**452)** మర్వాన్ బిన్ హకమ్,[1] మిస్వర్ బిన్ మఖ్రమాలిద్దరూ తనకు తెలియజేశారని ఉర్వా చెప్పారు : హవాజిన్ తెగకు చెందిన ప్రతినిధి బృందం ఒకటి ప్రవక్త మహనీయుల(సఅసం) సన్నిధిలో హాజరై, తమ సొమ్ములను, ఖైదీలను తమకు తిరిగి ఇచ్చివేయాలని కోరారు.[2] దానికి సమాధానంగా ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు: "సత్యబద్ధమైన విషయం నాకు అన్నిటికన్నా ప్రియమైనది. ఈ రెండింటిలో మీరు ఏదో ఒక్క దానిని మాత్రమే తీసుకోగలరు. మీరు ఖైదీలనయినా తీసుకోండి. లేదంటే మీ సొమ్ములనయినా తీసుకోండి. నేను మీ (రాక) కోసం నిరీక్షించాను కూడా." దైవప్రవక్త(స) దాదాపు పదిరోజులపాటు తాయఫ్ నుండి తిరిగి వస్తున్నప్పుడు వాళ్ళ కోసం నిరీక్షించారు. దైవప్రవక్త(స) వాళ్ళ ప్రతిపాదనల్లో ఏదో ఒక్క దానిని (సొమ్ము లేదా ఖైదీలు) మాత్రమే ఆమోదిస్తారన్న విషయం వాళ్ళకు బాగా అర్థమయ్యాక, "మేము మా ఖైదీలను తీసుకుంటామ"ని వాళ్ళు చెప్పారు. అప్పుడు దైవప్రవక్త(స) ముస్లిములనుద్దేశించి ప్రసంగించారు: (ఈ సందర్భంగా) ఆయన(స)

---

451-1. ఇమామ్ అబూ హనీఫా(రహ్మా) ఈ హదీసుననుసరించి ఏమని ఆదేశించారంటే; నాయకుని ఆజ్ఞననుసరించి బయటికి వెళ్ళినవాడు లేదా తానున్నచోటే ఆగిపోయిన వానికి కూడా విజయ ధనంలో వాటా ఇవ్వటం జరుగుతుంది. కాగా; ఇమామ్ షాఫియి, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ ప్రభృతులు దీనికి వ్యతిరేకంగా ఉన్నారు. ఈ హదీసు కేవలం హజ్రత్ ఉస్మాన్(రజి)కే ప్రత్యేకమని వీరంటారు.

**అల్లాహ్ ఔన్నత్యాన్ని తగిన రీతిలో స్తుతించారు. పిదప ఇలా అన్నారు: "మీ ఈ సోదరులు పశ్చాత్తాపం చెందిన మీదట మన వద్దకు వచ్చారు. వీళ్ళ ఖైదీలను వీళ్ళకు తిరిగి ఇచ్చేయటం సమంజసమని నేను భావిస్తున్నాను. కనుక ఎవరయితే తమ వాటాగా వచ్చిన ఈ యుద్ధప్రాప్తిని (ఖైదీలను) మనస్ఫూర్తిగా వాపసు చేయదలుస్తారో, వారు వాపసు చేయవచ్చు. మరెవరయితే తమ వాటా తమ వద్ద మిగిలి ఉండాలని కోరుకుంటున్నారో వారికి మేము, ఇక మీదట యుద్ధప్రాప్తి (మాలె గనీమత్) లభించినప్పుడు, మొట్టమొదట వారికి ఇస్తాము, కనుక ప్రస్తుతానికి ఖైదీలను వాపసు చేయండి". ఇది విన్న ప్రియసహచరులు, 'దైవప్రవక్తా! మేము సంతోషంగా మా వాటాలను (ఖైదీలను) వీరికి తిరిగి ఇచ్చేస్తున్నాము' అన్నారు. "కాని ఎవరు సంతోషంగా తిరిగి ఇస్తున్నారో, ఎవరు ఇవ్వదలచటం లేదో మాకు తెలియలేదు. అందువల్ల మీరంతా (మీ మీ గుడారాలలోకి) తిరిగి వెళ్ళండి. తరు**

---

452-1. ప్రవక్త మహనీయుల(స) నుండి మర్వాన్ వినలేదు, ప్రత్యక్షంగా ప్రవక్త సహచర్యాన్ని అతను పొందనూ లేదు. పైగా అతను మంచివాడు కాడు. అలాంటప్పుడు, మర్వాన్ నుండి ఎలా ఉటంకించారంటూ కొంతమంది ఇమామ్ బుఖారీ(రహ్మ)ని ఘాటుగా విమర్శించారు.

కాని ఇమామ్ బుఖారీ (రహ్మ) కేవలం ఒక్క మర్వాన్ ఆధారంగా ఈ హదీసును తీసుకోలేదు. మర్వాన్‌తోపాటుగా మిస్వర్ బిన్ మఖ్రమా కూడా ఉన్నారు. ఈయన సహాబీ కూడా.

ఒక్కోసారి ఏం జరుగుతుందంటే, ఒక వ్యక్తి ఎన్నదగినవాడై ఉండడు. కాని హదీసు విషయంలో సత్యవంతుడు, జాగ్రత్త వహించేవాడై ఉంటాడు. హదీసువేత్తలు అతని నుండి హదీసులు గ్రహిస్తారు. అలాగే ఒక్కోసారి ఒక వ్యక్తి సజ్జనుడై ఉంటాడు. దైవారాధనల్లో, జ్ఞానార్జనలో నిమగ్నుడై ఉండటం వల్ల అతను హదీసులోని కొన్ని పదాలను మరచిపోతాడు. ఈ కారణంగా హదీసువేత్తలు అతని ఉల్లేఖనాన్ని స్వీకరించరు. స్వీకరించినా దానిని 'జయీఫ్'గా ఖరారు చేస్తారు.

452-2. మహాప్రవక్త(స)కు పసితనంలో పాలిచ్చిన హలీమా సాదియా (ర.అ) హవాజిన్ తెగకు చెందిన మహిళే. అందుకే హవాజిన్ తెగ ప్రతినిధులు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చినప్పుడు, 'తమరు ఏ స్త్రీల పాలు త్రాగి ఉన్నారో వారికి ఉపకారం చేయండి' అని విజ్ఞప్తి చేశారు. అందుచేత దైవప్రవక్త(స) హవాజిన్ తెగవారిని, తన పాల వరుస సోదరులుగా పరిగణించి, తన సహచరులను సంప్రతించిన మీదట, వారి ఖైదీలను వారికి తిరిగి ఇప్పించారు.

వాత మీమీ నాయకులు వచ్చి మీ మనోగతాన్ని మాకు తెలియపరచాలి" అని దైవ ప్రవక్త(స) ఆదేశించారు. అందరూ తమ తమ గుడారాలలోకి వెళ్ళిపోయారు. వారి నాయకులు మాత్రం ఈ వ్యవహారంపై వారితో చర్చించుకుని, తరువాత దైవ ప్రవక్త (స) సన్నిధికి వచ్చి, 'అందరూ హృదయపూర్వకంగా అంగీకరించార'ని చెప్పారు. హవాజిన్ తెగ వారి ఖైదీలకు సంబంధించి మాకు తెలిసిన సమాచారం ఇదే.

**453)** ఖాసిమ్ బిన్ ఆసిమ్ కులైబీ తెలిపారు: మేము అబూ మూసా అష్అరీ (రజి) గారి సదనంలో కూర్చుని ఉన్నాము (భోజనం సిద్ధం చేయబడింది). అక్కడ కోడి ప్రస్తావన వచ్చింది. ఆ సమయంలో బనీ తైముల్లా తెగకు చెందిన ఒక ఎర్రని మనిషి కూడా అక్కడున్నాడు. బహుశా అతను రోము ఖైదీలలోనివాడు.అతన్ని కూడా అబూ మూసా (రజి) భోజనానికి పిలిచారు. అతను,'కోడి పెంట తింటూ ఉండగా నేను చూశాను. అందువల్ల అదంటే నాకు అసహ్యం కలిగింది. ఎన్నటికీ కోడి మాంసం తినకూడదని ఒట్టేసుకున్నాను' అని చెప్పాడు. ఆ మాట విన్న అబూ మూసా(రజి) ఇలా అన్నారు: "ఇలా దగ్గరకు రా. (నువ్వు వేసుకున్న ఒట్టుపై) నేను నీకొక హదీసు వినిపిస్తాను, విను. అష్అర్ తెగకు చెందిన కొంతమందిని వెంట పెట్టుకుని నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యాను. (తబూక్ యుద్ధంలో పాల్గొనగలందులకు) వాహనాలు సమకూర్చమని అభ్యర్థించాను. ఇది విన్న దైవ ప్రవక్త(స) 'దేవుని తోడుగా! నేను మీ కొరకు వాహనాలను సమకూర్చలేను. ఎందు కంటే మీకు వాహనాలుగా ఉపయోగపడేవేవీ ప్రస్తుతం నా దగ్గర లేవు' అని చెప్పారు. ఆ తరువాత దైవప్రవక్త(స)వద్దకు విజయప్రాప్తికి సంబంధించిన కొన్ని ఒంటెలు వచ్చాయి. అప్పుడాయన మా గురించి వాకబు చేస్తూ, 'అష్అర్ తెగ వారెక్కడ?' అని అడిగారు. కడకు ఆయన(స), మాకు బాగా బలిసిన ఐదు ఒంటె లివ్వమని ఆదేశించారు. ఒంటెలు తీసుకుని తిరిగి వస్తూ మేము పరస్పరం చర్చించు కున్నాము– మేము అవలంబించిన వైఖరి సరైనది కాదనీ, దీనివల్ల శుభం కలగదని తలపోశాము. అందుకే మేము మళ్ళీ దైవప్రవక్త(స) సన్నిధికి తిరిగి వచ్చి, 'అయ్యా దైవప్రవక్తా! మేము మొదటిసారి వచ్చి, వాహనాలు సమకూర్చమని తమరిని కోరినప్పుడు, తమరు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, 'నేను మీ కోసం వాహనాలను సమకూర్చలేన'ని నిర్దిష్టంగా చెప్పారు. బహుశా మీకు ఆ ప్రమాణం సంగతి జ్ఞాపకం లేదేమో! అని విన్నవించుకున్నాము. ఇది విన్న దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు:

**"నేను మీకు నిజంగానే వాహనాలను సమకూర్చలేదు. నిజానికి అల్లాహ్‌యే మీకు ఈ వాహనాలను ఇచ్చాడు. అల్లాహ్‌పై ఒట్టు! మీరు నమ్మండి, దైవచిత్తమయితే, నేను ఏ విషయం గురించి ప్రమాణం చేసినా, దీనికన్నా మేల్తరమైనది మరొకటి ఉందని ప్రస్ఫుటమైనప్పుడు, నేను మేల్తరమైన దానిని అవలంబిస్తాను. ప్రమాణ భంగానికిగాను పరిహారం (కఫ్ఫారా) చెల్లిస్తాను."[1]**

**454) నాఫే గారు ఇబ్నె ఉమర్(రజి) నుండి ఉటంకించారు : ప్రవక్త మహనీయులు(సఅసం) ఒక సైనిక దళాన్ని 'నజ్ద్' వైపునకు పంపారు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కూడా ఆ సైనిక దళంలో ఉన్నారు. యుద్ధప్రాప్తిగా భారీ సంఖ్యలో ఒంటెలు ఆ దళానికి చేజిక్కాయి. అందువల్ల ఒక్కో సైనికుడికి పన్నెండేసి, పద కొండేసి ఒంటెల చొప్పున లభించాయి. తలా ఒక ఒంటె చొప్పున కానుకగా కూడా లభించాయి.[1]**

**455) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు : మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) కొన్ని సందర్భాలలో యుద్ధాలలో పాల్గొన్న కొంతమంది యోధులకు విజయ ప్రాప్తిగా లభించిన సొమ్ములలో నుండి సాధారణ వాటాలే గాకుండా ('ఖుముస్' నుండి) తన తరపున అదనంగా కూడా ఇచ్చేవారు.**

**456) అబూ మూసా అష్అరీ(రజి) కథనం: మాకు ప్రవక్త మహనీయుల (స) వారి హిజ్రత్ సమాచారం అందినప్పుడు మేము యమన్ దేశంలో ఉన్నాము. అందువల్ల మేము కూడా కాందిశీకులుగా ఆయన(స)వద్దకు చేరుకోవాలని నిశ్చ**

---

453–1. అబూ మూసా అష్అరీ (రజి) ఆ వ్యక్తికి ఈ హదీసు వినిపించడంలోని ఉద్దేశం; ఇక మీదట ఎన్నడూ కోడిమాంసం తినకూడదని నీవు వేసుకున్న ఒట్టు సరైనది కాదు. ఎందుకంటే కోడి హలాల్ జంతువు. కాబట్టి నీవు నిస్సంకోచంగా కోడిమాంసం తిను. కాకపోతే ప్రమాణ భంగానికి గాను పరిహారం (కఫ్ఫారా) ఇవ్వు అని తెలియపరచటమే.

ఇకపోతే; దైవప్రవక్త(స) విజయప్రాప్తిగా వచ్చిన ఐదవ భాగం (ఖుముస్)లోని ఒంటెల్ని అష్అరీ తెగ వారికి ఇచ్చారు. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం.

తాను ప్రమాణం చేసిన సంగతిని బహుశా దైవప్రవక్త(స) మరచిపోయి ఉంటారని అష్అరీ తెగ మనుషులు అనుకున్నారు. ఒకవేళ అదే నిజమైతే, తాము దైవప్రవక్త(స)ను మోసగించిన వారమవుతామని భయపడ్డారు. ఇది వారి నిజాయితీకి తార్కాణం.

454–1. సేనాధిపతి ఈ ఒంటెల్ని ఐదవ భాగం (ఖుముస్) నుండి బహుశా కానుకగా ఇచ్చి ఉంటాడు. దైవప్రవక్త(స) జీవిత కాలంలో జరిగిన సంఘటన ఇది. దీనిపై దైవప్రవక్త(స) మౌనం వహించారు. ఈ మౌనం అంగీకారానికి సంకేతం అయింది.

**యించుకుని బయల్దేరాము. నేనూ, నా ఇద్దరు సోదరులు కూడా ఉన్నారు. వయసులో నేను వారిద్దరికన్నా చిన్నవాణ్ణి. వారిలో ఒకరు అబూ బుర్దా, మరొకరు అబూ రుహ్మ్ లేదా ఆయన ఇలా అన్నారు : "నా తెగవారైన కొందరు మనుషులు నా వెంట ఉన్నారు." లేదా "యాభై మూడు మంది లేక యాభై రెండు మంది"అని అన్నారు. మేము ఓడలో పయనమయ్యాము. కాని మా ఓడ నజాషీ రాజ్యం అబిసీనియా తీరానికి చేరుకుంది. అక్కడ జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి) తన సహచరులతోపాటు మమ్మల్ని కలుసుకుని, 'దైవప్రవక్త(స) మమ్మల్ని ఈ దేశానికి వెళ్ళమన్నారు. ఇక్కడే ఉండమని ఆదేశించారు. కాబట్టి మీరు కూడా మాతోపాటే ఇక్కడే ఉండిపొండి' అని చెప్పారు. అందువల్ల మేమూ అక్కడే ఉండిపోయాము. తరువాత మేమంతా కలసి మదీనాకు వచ్చాము. మేము దైవప్రవక్త(స)ను కలుసు కునే సమయానికి ఖైబర్ పట్టణం ముస్లింల కైవసం అయింది. దైవప్రవక్త(స) మాకు సయితం (ఇతర ముజాహిద్‌లతో పాటే) విజయధనంలో వాటా ఇప్పించారు. లేదా 'విజయప్రాప్తిలో నుండి మాకూ ఇచ్చారు' అని అన్నారు. నిజానికి దైవప్రవక్త(స) యుద్ధంలో పాల్గొనని వారికెవరికీ వాటా ఇవ్వలేదు. యుద్ధం చేసినవారికి మాత్రమే వాటా దొరికింది. అయితే ఓడలో ప్రయాణం చేసిన మా సహచర బృందానికి, జాఫర్ మరియు ఆయన సహచరులకు కూడా ఆయన(స) విజయప్రాప్తిలో భాగస్వాముల్ని చేసుకున్నారు[1] (వాస్తవానికి మేము యుద్ధంలో పాల్గొనలేదు).**

**457) హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) కథనం : "బహ్రైన్ నుండి సొమ్ము వసూలై నా దగ్గరకు వచ్చినప్పుడు నేను నీకు ఇంత ఇంత ఇంత (మూడు దోసిళ్ళ నిండా) ఇస్తాను" అని ప్రవక్త మహనీయులు(సఅసం) నాతో చెప్పారు. ఆ తరువాత ప్రవక్త మహనీయులు(స) పరమపదించారు. అప్పటికి బహ్రైన్ సొమ్ము రాలేదు. ఎట్టకేలకు అక్కడి నుండి సొమ్ము వచ్చినప్పుడు (ఖలీఫా) అబూ బక్ర్(రజి)**

---

456-1. ఈ వాటాను ఆయన(స) మాలె గనీమత్‌లో నుంచి గానీ, ఐదవ భాగం (ఖుముస్)లో నుంచి గానీ ఇప్పించలేదని తేటతెల్లమవుతోంది. మరి అలాంటప్పుడు ఈ అధ్యాయంతో ఇది ఎలా సమన్వయం చెందుతుంది? అన్న సందేహం కలగటం సహజం. యోధుల హక్కు అయిన విజయప్రాప్తి నుండి ఇతరులకు వాటా కల్పించే అధికారం నాయకునికి ఉన్నప్పుడు, ఐదవ భాగం (ఖుముస్) నుండి వాటా ఇచ్చే అధికారం కూడా కచ్చితంగా ఉంటుంది. అధ్యాయంలోని మర్మం ఇదే.

ఆజ్ఞపై ప్రకటన చేసే వ్యక్తి చాటింపు వేశాడు – దైవప్రవక్త(స) ఎవరికి బాకీ పడి వున్నా లేదా ఆయన(స) ఎవరికయినా వాగ్దానం చేసి ఉన్నా అలాంటి వారంతా మా వద్దకు రావచ్చుని. నేను అబూబక్ర్(రజి) దగ్గరకు వెళ్ళి 'దైవప్రవక్త(స) నాతో ఇలా చెప్పి ఉన్నార'ని అన్నాను. అందువల్ల ఆయన నాకు మూడు దోసిళ్ళ నిండా ఇచ్చారు – సుఫ్యాన్ బిన్ ఉయైనా తన రెండు చేతులతో సంజ్ఞ చేస్తూ (దోసిళ్ళ నిండా) ఇచ్చిన వైనాన్ని తెలిపారు. ఆ తరువాత సుఫ్యాన్ చెప్పారు : ఇబ్నె మున్కదిర్ కూడా మాకు ఇలాగే విడమరచి చెప్పారు. ఒకసారి సుఫ్యాన్ (గత సనదు ప్రకారం) జాబిర్ తనతో ఇలా చెప్పినట్లు వివరించారు: "నేను అబూబక్ర్(రజి) సన్నిధిలో హాజరయ్యాను. కాని ఆయన నాకేమీ ఇవ్వలేదు. రెండోసారి హాజరయ్యాను. ఈసారి కూడా నాకేమీ ఇవ్వలేదు. తరువాత నేను మూడోసారి ఆయన దగ్గరకు వెళ్ళి 'నేను ఒకసారి మిమ్మల్ని అడిగాను. కాని మీరేమీ ఇవ్వలేదు. మరోసారి అడిగాను. అయినా మీరేమీ ప్రదానం చేయలేదు. మళ్ళీ అడిగాను కాని మీరు ఇవ్వలేదు. ఇక ఇప్పుడు మీరు నాకు ఇవ్వనయినా ఇవ్వండి లేదంటే పిసినిగొట్టుగానయినా వ్యవహ రించండి' అని కరాకండీగా చెప్పేశాను. దీనికి జవాబుగా అబూబక్ర్(రజి) ఇలా అన్నారు : "నీ విషయంలో పిసినారిగా ప్రవర్తిస్తున్నానని నువ్వంటున్నావా? నిజానికి ఇచ్చే విషయంలో నేనెప్పుడు నీ నుండి ముఖం త్రిప్పుకున్నా, ఏదో ఒక రోజు నీకు తప్పక ఇవ్వవలసి ఉందన్న మాట నా మనసులో మెదిలేది." జాబిర్ ఇలా అన్నారు: కడకు అబూబక్ర్ (రజి) నాకు ఒక దోసిలి నిండా నింపి ఇచ్చి, "లెక్కపెట్టుకో" అన్నారు. నేను లెక్క పెడితే ఐదొందలు (నాణేలు) ఉన్నాయి. "అంతే లెక్కన మరో రెండు సార్లు తీసుకో" అని అబూబక్ర్(రజి) అన్నారు. "పిసినారితనం కన్నా నీచమయిన జబ్బు ఇంకేమి కాగలదు?" అని అబూబక్ర్(రజి) ఈ సందర్భంగా పలికినట్లు ఇబ్నె మున్కదిర్ తెలిపారు.

**458)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖించారు: ప్రవక్త మహ నీయులు(సఅసం), 'జీరానా'లో విజయ ధనాన్ని పంచి పెందుతుండగా (జుల్ ఖువైసరా అనే) ఒక వ్యక్తి వచ్చి, 'న్యాయంగా వ్యవహరించండి' అని చెప్పాడు. దానికాయన(స), "అయ్యో, నేనే న్యాయంగా వ్యవహరించకపోయినట్లయితే దౌర్భాగ్యుడనవుతాను" [1] అని పలికారు.

## అధ్యాయం : 16

### ఉపకార భావంతో దైవప్రవక్త(స) ఖైదీలను ఉచితంగా విడుదల చేయటం...[1]

**459) తన తండ్రి తనతో ఇలా చెప్పారని ముహమ్మద్ బిన్ జుబైర్ తెలిపారు: (దీని ప్రకారం) ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు: (అవిశ్వాస స్థితిలో ప్రాణం విడిచిన) ముత్ఇమ్ బిన్ అదీ గనక బ్రతికి ఉండి, ఈ అపరిశుద్ధ జనుల కొరకు సిఫారసు చేసినట్లయితే, నేను ఆయన సిఫారసును ఆమోదించి (నష్టపరిహారం పుచ్చుకోకుండానే) వీళ్ళను విడుదల చేసి ఉండేవాణ్ణి."[1]**

## అధ్యాయం : 17

### ఐదవ భాగం (ఖుముస్) నాయకునికి ప్రత్యేకం అన్న దానికి ఆధారం

**దానిని అతను (నాయకుడు) అవసరార్థులైన తన బంధువులకు ఇచ్చుకో గలడు. అక్కర లేదనుకున్న వారికి ఇవ్వకనూపోవచ్చు. అది అతని ఇష్టం. దీనికి సాక్ష్యాధారమేమిటంటే, దైవప్రవక్త(స) ఖైబర్‌లో ఐదవ భాగంగా లభించిన దాని నుండి బనీ హాషిమ్‌కు, బనీ అబ్దుల్ ముత్తలిబ్‌కు ఇచ్చారు (ఇతర ఖురైషులకు ఇవ్వ**

---

458-1. నాయకుడే 'దౌర్భాగ్యుడు' అయ్యే మాటైతే అనుయాయి గతేంకాను? ఈ హదీసు మున్ముందు వివరంగా రానున్నది. ఈ పుడమిపై దైవప్రవక్తల కన్నా న్యాయశీలురు, ఉదార స్వభావులు ఎవరై ఉంటారు? అయినా విలువ నెరుగని అనుచరులు ప్రవక్తల్ని సయితం వదలిపెట్టలేదు. దైవప్రవక్త మహనీయ మూసా(అ)ను బనీ ఇస్రాయీల్ జాతి వారు ఎంతగా వేధించారో తెలిసిందే. అలాగే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)ను కూడా కొందరు అనాగరికులు, కపటులు చాలా తీవ్రంగా నిందించారు.

16-1. 'విజయ ప్రాప్తి' పంపిణీ వ్యవహారమంతా నాయకుని చెప్పుచేతల్లో ఉంది. అతను గనక తలచుకుంటే పంపిణీ కాకముందే యుద్ధ ఖైదీలను విడుదల చేయగలడు. లేదా వారిని శత్రు రాజ్యాధినేతలకు అప్పగించనూ గలడు. ఒకసారి పంపిణీ అయినట్లయితే అది ముజాహిద్‌ల (యోధుల) స్వంత ఆస్తి అయిపోతుంది.

459-1. ముత్ఇమ్ బిన్ అదీ అనే వ్యక్తి బద్ర్ యుద్ధానికి పూర్వమే అవిశ్వాస స్థితి (కుఫ్ర్)లో మరణించాడు. "బనూ హాషిమ్‌తో, బనూ అబ్దుల్ ముత్తలిబ్ జనులతో వైవాహిక సంబంధాలు ఏర్పరచుకోరాదు. వారితో క్రయ విక్రయాలు చేయరాదు" అని ఖురైషులు లిఖించిన ఆంక్షల పత్రాన్ని అతను తన ప్రయత్నంతో నిర్వీర్యం చేశాడు. ఈ కారణం గానే అతని మాటకు విలువ ఇచ్చి, అవిశ్వాసుల ఖైదీలను విడిచిపెట్టే వాడినని దైవప్రవక్త(స) చెప్పారు.

లేదు). ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్(రహ్మ) ఇలా అన్నారు: "ప్రవక్త మహనీయులు (స) బంధువులందరికీ ఇవ్వలేదు. సమీప బంధువులకు మాత్రమే ఇవ్వాలన్న నిబంధనకూ కట్టుబడలేదు. అవసరార్థులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారు- వారు దూరపు బంధువులైనా సరే. దైవప్రవక్త(స)తో బంధుత్వం ఉన్న కారణంగా తమ జాతి జనుల వారి తరఫున నష్టం కలిగిన వారికి కూడా ప్రాధాన్యత ఇచ్చేవారు."

**460)** జుబైర్ బిన్ ముత్‌యిమ్(రజి) కథనం : నేనూ, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి)- ఇద్దరం కలసి ప్రవక్త మహనీయుల (సఅసం) సన్నిధిలో హాజరై, 'దైవ ప్రవక్తా! తమరు బనూ ముత్తలిబ్‌కు ఇచ్చారు. కాని మమ్మల్ని వదిలేశారు. నిజానికి బనూ ముత్తలిబ్‌కు మీతో ఎట్టి బంధుత్వం ఉందో అట్టి బంధుత్వమే మాకు మీతో ఉంది' అని విన్నవించుకున్నాము. దానికి దైవప్రవక్త(స), "బనూ ముత్తలిబ్, బనూ హాషిమ్ ఒక్కరే" అన్నారు. వేరొక సనదు ప్రకారం జుబైర్(రజి) అదనంగా ఇలా అన్నారు: "దైవప్రవక్త(స) బనూ అబ్దె షమ్స్‌కి, బనూ నౌఫల్‌కు ఇవ్వలేదు". ఇబ్నె ఇస్‌హాఖ్ ఇలా అన్నారు: అబ్దె షమ్స్, హాషిమ్, ముత్తలిబ్ ఒకే తల్లి బిడ్డలు. వారి తల్లి పేరు ఆతికా బిన్తె ముర్రా. నాఫల్,తండ్రి తరఫున వారి సోదరుడు (తల్లి మాత్రం వేరు).

## అధ్యాయం : 18

## హతుని శరీరంపై ఉన్న వస్తువులు (వస్త్రాలు, ఆయుధాలు మొదలగునవి) పంపకంలో గానీ, ఖుముస్‌లోకి గానీ రావు. అవన్నీ హంతకునికే చెందుతాయి. నాయకుడు ఈ విధంగా ఆజ్ఞాపించటం గురించి....

**461)** సాలెహ్ బిన్ ఇబ్రాహీమ్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ కథనం : తన తాతగారు (అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్-రజి) ద్వారా ఈ విషయం తనకు తెలిసినట్లు ఆయన అన్నారు- బద్ర్ సంగ్రామంలో నేను నాకు కేటాయించబడిన పంక్తిలో నిలబడి ఉన్నాను. కుడి ఎడమల వైపు దృష్టిని సారించగా నాకు నా ఇరువైపులా అన్సార్ తెగకు చెందిన ఇద్దరు నూనూగు మీసాల కుర్రాళ్ళు కనిపించారు. నేను ఈ కుర్రాళ్ళ బదులు ఇంకా పెద్ద వయస్కులైన యోధుల వరుసలో నిలబడి ఉంటే బాగుండేదే! అని (మనసులో) అనుకున్నాను. అంతలో ఒక కుర్రవాడు నా వైపు సైగ చేసి, 'బాబాయి! మీకు అబూజహల్ కూడా తెలుసా?' అని అడిగాడు. దానికి నేను, 'తెలుసు. కాని ఓ అబ్బాయి! అతనితో మీకేమిటి పని?' అని చెప్పాను. సమా

**ధానంగా ఆ అబ్బాయి, 'వాడు దైవప్రవక్త(స)ను దూషిస్తాడని విన్నాను. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తి సాక్షి! వాడు గనక నా చేతికి చిక్కితే, మా ఇద్దరిలో ఎవరి జాతకంలో మరణం రాసిపెట్టి ఉందో వారు మరణించేవరకూ నేనతని నుండి వేరవను' అన్నాడు. అతని మాటలు విని నాకు అమితాశ్చర్యం కలిగింది. తరువాత రెండో అబ్బాయి కూడా సైగ చేసి, అలాంటి అభిప్రాయాన్నే వ్యక్తపరిచాడు. కొన్ని నిమిషాలు గడిచాయో లేదో నాకు అబూజహల్ కనిపించాడు. అతడు (అవిశ్వాసుల) సైనిక పంక్తుల మధ్యన సంచరిస్తున్నాడు. నేను ఆ కుర్రాళ్ళతో, 'ఇందాక మీరు అడిగిన ఆ వ్యక్తి అదిగో, అతగాడే. అటూఇటూ తిరుగుతున్నాడు చూడండి' అన్నాను. ఇద్దరూ తమ ఖడ్గాలను చేబూని అమాంతం అతనిపై లంఘించి, అతన్ని చంపేశారు. ఆ తరువాత వారిద్దరూ దైవప్రవక్త(సఅసం) సమక్షంలో హాజరై అబూజహల్ వధ గురించి సమాచారం అందించారు. "మీరిద్దరిలో అతనిని వధించినదెవరు?" అని ఆయన(స) అడగ్గా, 'నేనే' అని ఆ కుర్రాళ్ళిద్దరూ పలికారు. "మీరిద్దరూ మీమీ ఖడ్గాలను శుభ్రపరచుకున్నారా?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, 'లేదు' అని సమాధానమిచ్చారు. పిదప దైవప్రవక్త(స) ఆ రెండు ఖడ్గాలను పరిశీలనగా చూసి, "మీరిద్దరూ అతన్ని వధించార"ని సెలవిచ్చారు.[1] "అయితే హతుని వస్తు సామగ్రి అంతా ముఆజ్ బిన్ అమ్ర్ బిన్ జమూకు దక్కుతుంది" అని పలికారు. ఆ ఇద్దరు కుర్రవాళ్ళ పేర్లు–1) ముఆజ్ బిన్ అఫ్రా 2) ముఆజ్ బిన్ అమ్ర్ బిన్ జమూ.**

---

461–1. ఇద్దరూ ఒకేసారి అబూజహల్‌పై మెరుపుదాడి చేశారు. అయితే ముఆజ్ బిన్ అమ్ర్ బిన్ జమూ వేసిన వేటుకు అబూ జహల్ కుప్పకూలి ప్రాణం విడిచాడు. అందువల్ల ఆ దైవవిరోధిని వధించినవాడుగా ఆ అబ్బాయే ఖరారయ్యాడు.

ఆ కుర్రాళ్ళిద్దరినీ మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) అనుభవం లేనివారుగా తలపోశారు. యుద్ధం మొదలయ్యాక నిలదొక్కుకుంటారో లేదోనని కూడా అనుమానించారు. ఒకవేళ ఆ కుర్రాళ్ళిద్దరూ పలాయనం చిత్తగిస్తే తన అంతరంగంలో ఎక్కడ భయం పుడుతుందోనన్నది ఆయన ఆందోళన. కాని ఆ యువ కిశోరాలు పరాక్రమానికి, ధైర్యసాహసాలకు పెట్టింది పేరని క్షణాల్లో తేలిపోయింది. అప్పటివరకూ అబూ జహల్‌పై కసితో, ఆవేశంతో రగులుతున్న ఆ టీనేజర్లు అతని కథను సమాప్తం చేసిన మీదట శాంతించారు. ఎందుకంటే అబూ జహల్ దైవప్రవక్త(స)ను విపరీతంగా వేధించాడన్న వార్త వారిని కలచివేసింది. వారు మదీనా వాసులవటంచేత, మక్కా వాసి అయిన అబూ జహల్ ఎలా ఉంటాడో తెలియదు. అందుకే వారు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)ను అడిగి, నిర్ధారణ చేసుకున్నారు.

**462)** అబూ ఖతాదా (రజి) కథనం: హునైన్ సంగ్రామం జరిగిన సంవత్సరం మేము ప్రవక్త మహనీయుల(సఅసం)తో కలసి ప్రయాణమయ్యాము. శత్రువుతో మేము తలపడినప్పుడు మొదట్లో ఇస్లామీయ సైన్యం అడుగులు తడబడ్డాయి. వారు ఓటమి అంచుల వరకూ వెళ్ళిపోయారు. అంతలో నా దృష్టి ఒక ముస్లిం యోధునిపై పడింది. ఒక ముష్రిక్ సైనికుడు అతనిపైకెక్కి ఉన్నాడు. అంతే, నేను తక్షణం అతని వెనక్కి వెళ్ళి ఖడ్గంతో అతని మెడపై ఒక్క వ్రేటు వేశాను. అతను తమాయించుకుని నాపై ఎదురు దాడికి దిగాడు. అతని ధాటికి తాళలేక నాకు నా ప్రాణం పోయేలా అనిపించింది. కాని అతన్ని మృత్యువు కబళించింది. దాంతో అతని బారినుండి నేను బయటపడ్డాను. అంతలో ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)నాకు తారసపడ్డారు. "ఇప్పుడు ముస్లింల పరిస్థితి ఎలా ఉంది?" అని అడిగాను నేనాయన్ని. దానికి ఆయన, "దైవాదేశం మేరకే జరిగింది. కాని ముస్లింలు ఓటమి తరు వాత కదనరంగంపై మళ్ళీ పట్టు బిగించారు. అందువల్ల దైవప్రవక్త(స) కూర్చున్నారు" అని చెప్పారు. "ఎవరయినాసరే అవిశ్వాసిని వధించి ఉంటే, వారు సాక్ష్యాన్ని సమర్పించాలి. అట్టి వారికి హతుని సామగ్రి అంతా లభిస్తుంది" అని దైవప్రవక్త(స) ప్రకటించారు. (అబూ ఖతాదా ఇలా అన్నారు) నేను కూడా లేచి నిలబడి, 'నా పక్షాన సాక్ష్యం ఇచ్చేవారెవరు?'అని అడిగాను. కాని నా పక్షాన సాక్ష్యం ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో నేను కూర్చుండిపోయాను. దైవప్రవక్త(స) రెండవసారి ఇలా అన్నారు : "(ఈ రోజు) ఎవరయినాసరే అవిశ్వాసి (కాఫిర్)ని వధించి, దానికి సాక్షులుగా ఎవరినయినా హాజరుపరిస్తే వారికి హతుని వస్తు సామగ్రి అంతా లభిస్తుంది". ఈసారి కూడా నేను లేచి నిలబడి, 'నా తరఫున సాక్ష్యమిచ్చేవారెవరు?' అని అడిగాను. కాని ఫలితం శూన్యం. నేను మళ్ళీ కూర్చొనక తప్పలేదు. మూడవ సారి దైవప్రవక్త(స) తిరిగి అలాగే అడిగారు. నేను లేచి నిలబడడంతో దైవప్రవక్త(స) స్వయంగా దర్యాప్తు చేశారు- "ఏ విషయం గురించి అడుగుతున్నావు ఖతాదా?" అని. అప్పుడు ఒక వ్యక్తి (అస్వద్ బిన్ ఖుజాయి అస్లమీ) కల్పించుకుని, 'దైవప్రవక్తా! అబూ ఖతాదా నిజం చెబుతున్నారు. ఆ హతుని సామానంతా నా దగ్గర సురక్షితంగా ఉంది (ఈ సామానును నాకు విడిచిపెట్టేలా) ఈయన్ని ఒప్పించండి' అని విజ్ఞప్తి చేశాడు. అయితే అబూబక్ర్ సిద్దీఖ్(రజి) జోక్యం చేసుకుని, 'దైవసాక్షిగా! అలా జరగదు. దైవం మరియు దైవప్రవక్త కోసం పోరాడిన కిశోరం పట్ల ఇలా (అన్యాయం) జరగనేరదు. ఇలా జరగటాన్ని దైవప్రవక్త

అంగీకరించరు' అన్నారు. "అబూబక్ర్ చెప్పింది నిజం" అని ధ్రువపరిచారు దైవప్రవక్త(స). పిదప ఆ సామగ్రిని అబూ ఖతాదాకు ఇప్పించారు. అబూ ఖతాదా (రజి) ఇలా అన్నారు: "ఆ వస్తు సామగ్రిలోని కవచాన్ని అమ్మి నేను బనీ సలమా వాడలో ఒక తోటను కొనుగోలు చేశాను. ఇస్లామ్ స్వీకరించిన మీదట నాకు ప్రాప్త మయిన మొదటి సంపద అది."

## అధ్యాయం : 19

## హృదయాలను గెలవటానికి దైవప్రవక్త(స) కొంతమందికి 'ఖుముస్' నుండి ఇవ్వటం

**463)** మహనీయ హకీమ్ బిన్ హిజామ్(రజి) వివరించారు : నేను దైవ ప్రవక్త(సఅసం) దగ్గర కొంత డబ్బు అడిగాను. ఆయన(స) నాకు ఇచ్చారు. మరో సారి అడిగాను. ఈసారి కూడా ఆయన(స) ఇచ్చారు. తరువాత ఇలా ఉపదేశిం చారు: "హకీమ్! ఈ సొమ్ము చూడ్డానికి ఎంతో పచ్చగా, తియ్యగా, రుచి కరంగా ఉంటుంది. కాని ఎవరయితే నిరపేక్షా భావంతో పుచ్చుకుంటారో వారి పాలిట ఇది శుభకరం అవుతుంది. అత్యాశతో పుచ్చుకునే వారి సంపదలో శుభం ఉండదు. ఇలాంటి వ్యక్తి ఉపమానం ఎంత తిన్నా కడుపు నిండని వాని వంటిది. పైచేయి (ఇచ్చేవాని చెయ్యి) క్రింది చెయ్యి (పుచ్చుకునేవాని) కన్నా మేలైనది". హకీమ్ బిన్ హిజామ్(రజి), 'దైవప్రవక్తా! దీని తరువాత ఇక నేను ఎన్నడూ ఎవరినీ అర్థించను. ఈ లోకాన్ని విడిచిపోయే వరకూ (దీనికి కట్టుబడి ఉంటాను)' అని మాటిచ్చారు. (మహాప్రవక్త-సఅసం- తదనంతరం) హజ్రత్ అబూబక్ర్(రజి) ఆయనకు ఇవ్వడానికి పిలిపిస్తారు. కాని ఆయన అందులోనుంచి (ఖుముస్‌లో నుండి) ఒక్క పైసా కూడా పుచ్చుకోలేదు. తరువాత హజ్రత్ ఉమర్-రజి- (తన పరిపాలనా కాలంలో) ఆయనకు ఇవ్వడానికి పిలిపించారు. ఆయన నుండి కూడా స్వీకరించ డానికి హకీమ్ నిరాకరిస్తారు. అప్పుడు హజ్రత్ ఉమర్(రజి) ప్రజల్ని సంబోధించి, 'ముస్లింలారా! 'ఫై' సొమ్ము నుండి ఆయనకు లభించవలసి ఉన్న వాటాను ఆయనకు ఇవ్వడానికి నేనాయన్ని పిలుస్తున్నాను. కాని ఆయన దీనిని కూడా స్వీకరించటం లేదు (దీనికి మీరంతా సాక్ష్యంగా ఉండాలి)" అన్నారు. ఆ విధంగా స్వాభిమాని అయిన హకీమ్ బిన్ హిజామ్(రజి) తనువు చాలించారు. కాని దైవప్రవక్త(స) తరువాత ఆయన ఎవరి నుండీ ఏమీ పుచ్చుకోలేదు. [1]

**464) నాఫె కథనం: 'దైవప్రవక్తా! నేను అజ్ఞాన కాలంలో (కుఫ్ర్ స్థితిలో) ఒక రోజు ఏతెకాఫ్ పాటిస్తానని మొక్కుకున్నాను' అని హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ విన్నవించుకోగా, "దానిని నెరవేర్చు (మొక్కుబడి తీర్చుకో)"అని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించారు. నాఫె ఇలా అన్నారు: హునైన్ యుద్ధ ఖైదీలలో నుంచి ఉమర్(రజి)కు ఇద్దరు బానిస స్త్రీలు (సేవకురాండ్రు) లభించారు. వారిద్దరినీ ఆయన మక్కాలోని ఒక గృహంలో ఉంచారు. తరువాత దైవప్రవక్త(స) హునైన్ యుద్ధ ఖైదీలపై ఉపకార భావంతో- ఉచితంగా- స్వేచ్ఛ ప్రసాదించినప్పుడు, వారు వీధులలో కేరింతలు కొడుతూ పరుగులు తీశారు. ఇది గమనించిన ఉమర్(రజి), 'అబ్దుల్లాహ్! అసలేం జరిగిందో కనుక్కో' అన్నారు. 'దైవప్రవక్త(స) వారికి మేలు చేశారు (స్వేచ్ఛ వొసగారు)' అని ఆయన చెప్పడంతో, 'అలాగైతే నువ్వు వెళ్ళి ఆ అమ్మాయిలిద్దరిని కూడా విడిచిపెట్టు' అని ఆదేశించారు. దైవప్రవక్త(స) 'జీరానా' స్థలం నుండి ఇహ్రామ్ దీక్ష బూనలేదని, ఒకవేళ ఆయన(స) అక్కడి నుంచి ఇహ్రామ్ దీక్షబూని ఉంటే, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కు ఇది తప్పకుండా తెలిసి ఉండేదని నాఫే చెప్పారు.**

**జరీర్ బిన్ హాజిమ్ గారు అయ్యూబ్ నుండి ఉటంకించిన దానిలో ఇలా ఉంది : మహనీయ ఉమర్(రజి)కు లభించిన ఆ ఇద్దరు బానిస స్త్రీలు 'ఖుముస్' (ఐదవ భాగం) నుండి లభించినవారే. ఇకపోతే ఏతెకాఫ్‌కు సంబంధించి మామర్ గారు అయ్యూబ్ నుండి సంగ్రహించిన దానిలో... 'ఒక రోజు' అనే పదం లేదు.[1]**

**465) అమ్ర్ బిన్ తగ్లిబ్ (రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసం) కొంతమందికి ఇచ్చారు, మరి కొంతమందికి ఇవ్వలేదు. దైవప్రవక్త(స) ఎవరికి**

---

463-1. ఇంతకీ ఎవరి హృదయాలను జయించవలసి ఉంది? అంటే అప్పుడప్పుడే ఇస్లాం ధర్మంలోనికి ప్రవేశించినవారు, న్యూ ముస్లింలు. హకీమ్ బిన్ హిజామ్(రజి) కూడా అప్పటికి న్యూ ముస్లిమే. ఈయన హృదయాన్ని గెలవటానికి దైవప్రవక్త(స) కొంత ధనం ఇచ్చారు. రెండవసారి కూడా ఇచ్చిన మీదట 'నిరపేక్షా భావం' గురించి ఉపదేశించారు. స్వాభిమాని అయిన హకీమ్ జీవితాంతం ఎవరి నుండీ ఆశించనని మాటిచ్చారు. ప్రవక్తకు ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. కడకు తనకు ముట్టవలసిన 'ధర్మబద్ధమైన హక్కు'ను కూడా వదులుకున్నారు. తన మనస్సు పరాన్న భుక్తికి ఎక్కడ కక్కుర్తి పడుతుందోనని భయపడ్డారు. నిరపేక్షాభావం గురించి ఉపన్యాసాలిచ్చేవారు మహనీయ హకీమ్ బిన్ హిజామ్ (రజి)ను ఆదర్శంగా తీసుకోవాలి.

**ఇవ్వలేదో వారు కించిత్ అసంతృప్తికి గురయ్యారు. అప్పుడు ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా అన్నారు: "ఎవరు అపమార్గానికి లోనవుతారో, అసహనానికి గురవుతారోనన్న భయం నాకు ఉంటుందో వారికి నేను ఇస్తాను. మరెవరిపై నాకు నమ్మకం ఉందో, ఎవరి ఆంతర్యాలలో అల్లాహ్ మేలును, నిరపేక్షాభావాన్ని పొందుపరిచాడో (వారికి నేను ఇవ్వను)". అమ్ర్ బిన్ తగ్లిబ్(రజి) ఇలా అంటున్నారు : ప్రవక్త మహనీయులు(స) నా గురించి పలికిన ఈ వాక్యం (నన్నెంతగా ప్రభావితం చేసిందంటే) దీనికి బదులుగా ఎర్రని ఒంటెలిచ్చినా సరే నేను సంతోషించేవాణ్ణి కాను. వేరొక రివాయతు ప్రకారం అమ్ర్ బిన్ తగ్లిబ్(రజి) ఇలా అనేవారు : దైవ ప్రవక్త(స) దగ్గరకు డబ్బు వచ్చింది. లేదా యుద్ధ ఖైదీలు వచ్చారు. కాని ఆయన(స) వారికే పంచిపెట్టారు.[1]**

**466) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించారని అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు : "ఖురైషులకు నేను, వారి హృదయాలను కలపడానికి ఇస్తుంటాను. ఎందుకంటే వారు ఇప్పుడిప్పుడే అజ్ఞాన యుగం నుండి బయటపడ్డారు. (అందువల్ల వారి హృదయాలను చూరగొనటం అవసరం)"**

**467) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: అల్లాహ్ తన సందేశ హరుని (సఅసమ్)కి హవాజిన్ తెగ సంపదలో నుండి విజయ ధనం వొసగినప్పుడు,**

---

464-1. దైవప్రవక్త(స) ఐదవ భాగం (ఖుముస్)లో నుంచి హజ్రత్ ఉమర్(రజి)కు ఇద్దరు బానిస స్త్రీలను ప్రదానం చేశారు. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం.

ఈ హదీసు ద్వారా తేటతెల్లమైన ఒక ముఖ్యాంశం ఏమిటంటే, ఎవరయినా అవిశ్వాస (కుఫ్ర్) స్థితిలో ఏదైనా సత్కార్యం చేస్తానని మొక్కుకుని ఉంటే, ఇస్లాం స్వీకరించిన తరువాత ఆ మొక్కుబడిని తీర్చుకోవాలి. హునైన్ యుద్ధ ఖైదీలను దైవప్రవక్త(స) మానవతా దృక్పథంతో- ఉచితంగా-విడుదల చేశారు.

465-1. విజయ ధనాన్ని గానీ, రెవిన్యూ (శిస్తు) రూపంలో వచ్చిన సంపదను గానీ పంపిణీ చేసేటప్పుడు ప్రవక్త మహనీయులు(స) ధార్మిక ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చేవారు. ఒకవైపు అవసరార్థులున్నారు. వారు అప్పుడప్పుడే ఇస్లాం స్వీకరించారు. వారి మనోక్షేత్రాలలో ఈమాన్ (విశ్వాసం) అనే విత్తనం ఇంకా గట్టిగా నాటుకోలేదు. ఆ సమయంలో వారి నిత్యావసరాలు గనక తీరకపోతే వారు ధర్మం నుండి తిరిగిపోయే (ముర్తద్ అయిపోయే) ప్రమాదం ఉంది. అందుకే దైవప్రవక్త(స) అలాంటి వారి హృదయాలను జయించడానికి, వారికి ఎంతగానో ఇచ్చేవారు. అదే సమయంలో ఈ 'పంపిణీపైన' అభ్యంతరం వెలిబుచ్చిన వారిని సహేతుకంగా సమాధానపరిచేవారు.

ఆయన(స) ఖురైషుల్లోని కొంతమందికి (వారి హృదయాలను జయించే ఉద్దేశ్యంతో) వందేసి ఒంటెల చొప్పున ఇవ్వసాగారు. ఇది గమనించిన కొందరు అన్సార్లు 'దేవుడు తన ప్రవక్త (స)ను క్షమించుగాక! ఆయన ఖురైషులకైతే ఇస్తున్నారు. మమ్మల్ని విడిచిపెట్టేశారు. నిజానికి వాళ్ళ రక్తం ఇప్పటివరకూ మా ఖడ్గాల నుంచి కారుతూనే ఉంది (ఖురైషులను ఇటీవలెనే మేము వధించాము. వారి నగరాన్ని మేమే జయించాము)' అని పలికారు. అనస్(రజి) ఇలా అన్నారు: ఈ సంగతి దైవప్రవక్త(స)కు తెలిసినంతనే ఆయన అన్సార్లను పిలిపించి, వారందరినీ ఒక తోలు గుడారులో సమావేశపరిచారు. అన్సార్లను తప్ప వేరితర సహచరులెవరినీ ఆయన(స) ఈ సమావేశానికి పిలువలేదు. అన్సార్లంతా హాజరైన మీదట, ఆయన(స) కూడా విచ్చేసి, "మీరు చెప్పుకుంటున్న విషయం నా వరకూ చేరింది. దాని నిజానిజాలేమిటో చెప్పండి" అని అడిగారు. అప్పుడు అన్సార్లలోని విజ్ఞులు 'దైవప్రవక్తా! మాలోని వివేకవంతులెవరూ ఈ విధంగా చెప్పలేదు. కొంతమంది ఔత్సాహిక నవయువకులే తొందరపడి ఇలా అన్నారు:'అల్లాహ్ తన ప్రవక్త(స)ను క్షమించుగాక! ఆయన(స) ఖురైషులకైతే ఇస్తున్నారు. కాని మాకు ఇవ్వటంలేదు. చూడబోతే ఇప్పటివరకూ మా ఖడ్గాలనుండి వారి రక్తం కారుతూనే ఉంది అన్న మాటలు వారి నోట వెలువడ్డాయి' అని విన్నవించుకున్నారు. దానికి సమాధానంగా మానవ మహోపకారి (సఅసం) ఇలా అన్నారు: "ఇప్పుడిప్పుడే అజ్ఞాన కాలం నుండి విముక్తి పొందిన వారికి నేను ఇస్తూ ఉంటాను (ఇలా ఇవ్వటం ద్వారా వేరైన వారి మనసుల్ని ఒకటిగా కలుపుతుంటాను). కొంతమంది సంపద తీసుకుని తమ తమ ఇళ్ళ వైపునకు మరలుతుండగా, మీరేమో మీ మీ ఇండ్లకు దైవప్రవక్త(స)ను తీసుకుని వెళుతుండటం మీకు సంతోషకరం కాదా! దైవసాక్షి! జనులు తమ వెంట తీసుకెళ్ళే దానికన్నా మీరు మీ వెంట తీసుకెళుతున్నది ఎంతో మేలైనది."[1] ఈ మాట విని,

467–1. దైవప్రవక్త(స) నుండి విరివిగా విజయధనం పొందినవారు ఇటీవలెనే ఇస్లాం స్వీకరించిన ఖురైషు ప్రముఖులు. వారి హృదయాలను జయించే ఉద్దేశంతో దైవప్రవక్త(స) వారికి చాలా ఎక్కువగా ప్రదానం చేశారు. ఆ లబ్దిదారుల పేర్లు వరుసగా ఇవి : 1) అబూ సుఫ్యాన్ 2) ముఆవియా బిన్ అబీ సుఫ్యాన్ 3) హకీమ్ బిన్ హిజామ్ 4) హారిస్ బిన్ హారిస్ 5) హారిస్ బిన్ హిషామ్ 6) సహ్లా బిన్ అమ్ర్ 7) హువైతిబ్ బిన్ అబ్దుల్ ఉజ్జా 8) అలా బిన్ హారిసా 9) ఉయైనా బిన్ హుసైన్ 10) సఫ్వాన్ బిన్ ఉమయ్యా 11) అఖ్రా బిన్ హాబిస్ 12) మాలిక్ బిన్ ఔఫ్.

**'కచ్చితంగా ఓ దైవప్రవక్తా! దీనిపై మేమందరం సంతుష్టులమై ఉన్నాము' అని అన్సార్లంతా ముక్త కంఠంతో బదులిచ్చారు. తరువాత ప్రవక్త మహనీయులు(స) ఇలా పలికారు: "నా తదనంతరం మీరు చూస్తారు– మీపైన ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుంది. అప్పుడు మీరు సంయమనంతో మెలగాలి. (గొడవ చేయవద్దు). కడకు అల్లాహ్‌ను చేరుకునే వరకూ, ఆయన ప్రవక్తను కౌసర్ సరస్సు వద్ద కలుసుకునేవరకూ ఓపిక పట్టండి"– ఇది విని మమ్మ మేము నిగ్రహించుకోలేక పోయామని అనస్(రజి) చెప్పారు.**

**468) జుబైర్ బిన్ ముత్‌యిమ్(రజి) కథనం: మేము ప్రవక్త మహనీయుల (సఅసం) వెంట ఉన్నాము. మరికొంతమంది సహాబా కూడా ఆయన(స) వెంట ఉన్నారు. అప్పుడు మేము హునైన్ యుద్ధరంగం నుండి తిరిగివస్తున్నాము. మార్గమధ్యంలో కొంతమంది పల్లెటూరి బైతులు ఆయన్ని(స) ముట్టడించి సొమ్ము ఇవ్వమని అడిగారు. వారు ఆయన్ని ఎంత మొరటుగా దిగ్బంధం చేశారంటే, ఆయన్ని ఓ తుమ్మ చెట్టు వైపునకు తీసుకుపోయారు. చివరకు ఆయన(స) దుప్పటి తుమ్మ ముళ్ళలో చిక్కుకుపోయింది. వెంటనే ఆయన లేచి నిలబడి, "(సోదరులారా!) నా దుప్పటిని నాకివ్వండి. నా దగ్గరే గనక ఈ ముళ్ళ చెట్ల సంఖ్యకు సమానంగా ఒంటెలున్నాసరే, వాటిని మీ మధ్యన పంచిపెడతాను. మీరు నన్ను పిసినారిగా, అబద్ధీకునిగా, పిరికిపందగా కనుగొనరు" అని చెప్పారు.**

**469) అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: నేను ప్రవక్త మహనీయుల (సఅసం)తో కలసి వెళుతున్నాను. ఆయన(స) నజరాన్[1] లో నేయబడిన వెడల్పాటి చారలు గల దుప్పటి కప్పుకుని ఉన్నారు. అంతలో ఒక పల్లెటూరి వ్యక్తి[2] ఆయన్ని చుట్టుముట్టి చాలా వేగంగా ఆయన్ని లాగాడు. ఆ రాపిడికి ఆయన(స) తొడపై దుప్పటి అంచు ఒడుసుకుపోయిన గుర్తును నేను చూశాను. తరువాత అతను దైవప్రవక్త(స)నుద్దేశించి, 'నీ దగ్గర ఉన్న దేవుని సంపదలో నుంచి నాక్కూడా ఇప్పించు' అని మొరటుగా అడిగాడు. ఆయన(స) అతని వైపు ఓసారి చూసి నవ్వేశారు. పిదప, "ఇతనికి ఇవ్వండి"[3] అని ఆజ్ఞాపించారు.**

469–1. 'నజరాన్' అనేది యమన్‌లో ఉన్న ఒక పట్టణం పేరు. అక్కడి దుప్పట్లు, కంబళ్ళు సుప్రసిద్ధం.

469–2. అతని పేరేమిటో తెలియలేదు.

469–3. సుబ్‌హానల్లా! ఈ సత్ప్రవర్తన, ఉపకార భావం గురించి ఏమని చెప్పేది.

**470)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) వివరించారు : హునైన్ యుద్ధానంతరం ప్రవక్త మహనీయులు(సఅసం) విజయ ధనాన్ని పంపిణీ చేస్తూ కొంతమందికి ఎక్కువ ప్రదానం చేశారు. ఉదాహరణకు అఖ్రా బిన్ హాబిస్(రజి)కు నూరు ఒంటెలిచ్చారు. ఉయైనా బిన్ హుసైన్(రజి)కు కూడా అంతే ఇచ్చారు. ఇంకా అనేకమంది అరబ్బు నాయకులకు కూడా అలాగే ఉదారంగా పంచిపెట్టారు. దానిపై ఒక కపట విశ్వాసి (మాతబ్ బిన్ ఖుషైర్ మునాఫిక్), 'దైవసాక్షి! ఈ పంపకంలో న్యాయాన్ని దృష్టిలో పెట్టుకోవటంగానీ, దైవప్రసన్నతను చూరగొనే లక్ష్యంగానీ లేద'ని వ్యాఖ్యానించాడు. దైవసాక్షి! ఈ విషయాన్ని నేను దైవప్రవక్త(స)కు తెలియజేయక తప్పదని సంకల్పించుకున్నాను. అందుకే నేను ఆయన(స) దగ్గరకు వెళ్ళి, ఈ సమాచారం అందజేశాను. ఈ మాట విన్న దైవప్రవక్త(స), "దైవసాక్షి! అల్లాహ్, ఆయన సందేశహరుడే న్యాయం చేయకపోతే మరెవరు న్యాయం చేస్తారు? అల్లాహ్ మూసా (అలైహిస్సలామ్)పై దయజూపుగాక! ఆయనకు ప్రజల ద్వారా దీనికన్నా ఎక్కువ బాధే కలిగింది. కాని ఆయన ఓర్పు వహించారు"[1] అని పలికారు.

**471)** అస్మా బిన్తె అబీబక్ర్(ర.అ) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసం) జుబైర్(రజి)కు 'మక్తా'గా ఇచ్చిన భూమి నుండి నేను ఎండు ఖర్జూరాల (తట్ట)ను తలపై మోపుకుని వచ్చేదానిని. ఆ భూమి నా ఇంటికి రెండు మైళ్ళ దూరాన ఉండేది. ముర్సల్‌గా అందిన మరో రివాయతు ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) జుబైర్(రజి)కు బనూ నజీర్ భూముల నుండి ఒక భూభాగాన్ని 'మక్తా'గా ప్రదానం చేశారు.

**472)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) యూదులు క్రైస్తవులను హిజాజ్ క్షేత్రం నుండి తరలించి వేరొక చోట నివాసం ఏర్ప రచారు. దైవప్రవక్త (సఅసం) ఖైబర్‌ను జయించినప్పుడు కూడా ఇలాగే అను కున్నారు. అప్పుడు ఖైబర్‌లోని కొంత భూమి యూదుల స్వాధీనంలో ఉండేది. అత్యధిక భూమి మాత్రం దైవప్రవక్త(స) స్వాధీనంలో, ముస్లింల స్వాధీనంలో

---

470-1. కాని ఆయన(స) ఆ కపట విశ్వాసిని శిక్షించలేదు. కారణం బహుశా అతను అలా చెప్పలేదు అని అంటాడు. అతని మాటలకు సాక్షిగా ఉన్నది అబ్దుల్లా బిన్ మస్ఊద్(రజి) ఒక్కరే. ఒక్కరి సాక్ష్యం ఆధారంగా నేర నిరూపణ జరగదు. లేదా ధార్మిక పరమార్థాల దృష్ట్యా దైవప్రవక్త(స) ఆ వ్యక్తి పట్ల చూపోపు వహించి ఉండవచ్చు.

**ఉండేది. అయితే, 'మా భూమిని మా స్వాధీనంలోనే ఉండనివ్వండి. మేము పొలాలలో, తోటలలో శ్రమదానం చేస్తాము. ఉత్పత్తిలో చెరి సగం పంచుకుందాం' అని యూదులు విన్నవించుకున్నారు. దానికి ఆయన(స), "అలాగైతే మేము కోరి నంత కాలం మాత్రమే ఈ నిబంధనకు కట్టుబడి మిమ్మల్ని ఉండనిస్తాం" అన్నారు. అందువల్ల వారు అక్కడే ఉండి వ్యవసాయం చేసేవారు. కాని ద్వితీయ ఖలీఫా హ్రజత్ ఉమర్(రజి) తన పరిపాలనా కాలంలో (ముస్లింలకు వ్యతిరేకంగా యూదులు పన్నుతున్న కుట్రల కారణంగా) వారిని 'తైమా', 'అరీహా' ప్రాంతాలకు తరలించారు.**

## అధ్యాయం : 20

## తినుబండారమేదైనా అవిశ్వాసుల భూమిలో చేజిక్కితే...

**473) అబ్దుల్లాహ్ బిన్ ముగఫ్ఫల్(రజి) వివరించారు : "మేము ఖైబర్‌లోని ఒక ప్రాసాదాన్ని ముట్టడించాము. ఎవరో ఒక వ్యక్తి ఒక సంచిని పారవేశారు. అందులో కొవ్వు పదార్థం కూడా ఉంది. నేను దానిని తీసుకోవడానికి ముందుకు పోయాను. కాని వెనక్కి తిరిగి చూస్తే సమీపంలోనే దైవప్రవక్త(స) కనిపించారు. నేను సిగ్గుతో నిలువెల్లా కుంచించుకుపోయాను."[1]**

**474) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : "మాకు (దైవప్రవక్త-సఅసం- కాలంలో) యుద్ధాలలో తేనె, ద్రాక్ష వంటి ఆహార వస్తువులు లభించేవి. వాటిని మేము అప్పటికప్పుడే తినేసేవారం (పంపిణీ కొరకు నిల్వ చేసే వారం కాము)"[1]**

**475) ఇబ్నె అబీ ఔఫా (రజి) చెప్పగా తాను విన్నానని షైబానీ తెలిపారు: ఖైబర్ యుద్ధ సందర్భంగా మేము నిర్విరామంగా పస్తులుండాల్సిన పరిస్థితి**

473-1. ఆ వస్తువును తినకూడదని మాత్రం దైవప్రవక్త(స) అనలేదు. అందుచేత అత్యధిక మంది విద్వాంసులేమంటారంటే, అన్నపానీయాల కోవకు చెందిన వస్తువు గనక 'విజయప్రాప్తి'గా చేజిక్కితే, పంపకానికి ముందు కూడా దానిని తినవచ్చు. అలాగే గడ్డిని కూడా పశువులకు మేతగా వేయవచ్చు.

474-1. ఈ హదీసు ద్వారా విదితమయ్యేదేమంటే ఆహార వస్తువులలో కొన్ని నశ్వరమైనవై ఉంటాయి. పంపిణీ అయ్యేవరకు వాటిని ఆపి ఉంచితే అవి చెడిపోవచ్చు. కాబట్టి అలాంటి పదార్థాలను వినియోగించుకోవటంలో తప్పులేదు.

ఏర్పడింది. ఎట్టకేలకు ఖైబర్‌పై మాకు విజయం వరించిన నాడు (విజయప్రాప్తిగా) మాకు కొన్ని పెంపుడు గాడిదలు కూడా చేజిక్కాయి. అందువల్ల మేము వాటిని జిబ్హ్ చేసి (కోసి) వండసాగాము. తీరా కుండలలో అవి ఉడుకుతుండగా దైవప్రవక్త(స) తరఫున ప్రకటన గావించే వ్యక్తి ఒకరు ప్రకటించారు (చాటింపు వేశారు) : "కుండలను ఒలకబోయండి. పెంపుడు గాడిదల మాంసాన్ని సుతరామూ తినకూడదు". అబ్దుల్లాహ్ బిన్ ఔఫా (రజి) ఇలా అన్నారు : బహుశా విజయప్రాప్తిలో నుండి ఐదవ భాగాన్ని వేరుపరచకపోవటం చేత దైవప్రవక్త(స) దీనిని నిలిపివేసి ఉంటారని కొంతమంది చెప్పుకున్నారు. మరికొంతమంది సహాబా ఏమన్నారంటే, దైవ ప్రవక్త(స) గాడిద మాంసాన్ని నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేశారు. (షైబానీ ఇలా అంటున్నారు) : ఈ విషయమే నేను జుబైర్(రజి)ను అడిగితే, దైవప్రవక్త(స) దానిని ఖచ్చితంగా నిషేధించారని చెప్పారు.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 7. జిజ్‌యా, యుద్ధ విరమణ ప్రకరణం

## అధ్యాయం : 1

### జిజ్‌యా గురించి, అవిశ్వాసులతో ఒక నిర్ణీత వ్యవధి వరకు యుద్ధ విరమణ గురించి...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"గ్రంథ ప్రజలలో అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ విశ్వసించని వారునూ, అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించిన దానిని నిషిద్ధంగా భావించని వారునూ, ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోని వారునూ అయిన వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. వారు స్వయంగా తమ చేతులతో జిజ్‌యా ఇచ్చేవరకూ, లోబడి ఉండేవరకూ (వారితో పోరాడండి)".** ***(అత్ తౌబా : 29)***

**పై ఆయత్‌లో 'సాగిరూన్' అంటే అణగిమణగి ఉండేవారు, లోబడి ఉండే వారు అన్న అర్థాలొస్తాయి. పై ఆయత్‌లో యూదులు, క్రైస్తవులు, పారసీకులు, అజమీలైన ప్రతి ఒక్కరి నుండీ 'జిజ్‌యా' తీసుకోవాలని సెలవీయబడింది. సిరియా దేశానికి చెందిన వారి నుండి నాలుగు దీనార్లు (జిజ్‌యా రూపంలో) వసూలు చేసి, యమన్‌వాసుల నుండి కేవలం ఒకే దీనార్ తీసుకుంటున్నారు. ఎందువలన? అని ఇబ్నె అబీ నజీహ్ గారు ముజాహిద్‌ను అడిగితే, సిరియా దేశపు అవిశ్వాసులు సంపన్నులని ఆయన చెప్పారు.**[1]

1-1. దీనినిబట్టి స్పష్టమయ్యేదేమంటే, జిజ్‌యాను తగ్గించే లేక పెంచే అధికారం నాయకునికి ఉంటుంది. 'జిజ్‌యా' అనేది నిజానికి రక్షణా సుంకం. ముస్లిం పరిపాలకుడు తన

**476)** అమ్ర్ బిన్ దీనార్ చెప్పగా తాను విన్నానంటూ సుఫ్యాన్ బిన్ ఉయైనా తెలిపారు : ఆయన (అమ్ర్) ఇలా అన్నారు: నేను జాబిర్ బిన్ జైద్, అమ్ర్ బిన్ ఔస్‌తోపాటే కూర్చుని ఉండగా ఇద్దరు పెద్ద వయస్కులకు బజాలా ఇలా వివరించారు– హి.శ. 70లో ముస్అబ్ బిన్ జుబైర్ (రజి) బస్రా వాసులతో కలసి హజ్జ్ చేసిన సంవత్సరం జమ్‌జమ్ బావి మెట్ల వద్ద నిలబడి ప్రసంగిస్తూ ఇలా అన్నారు: నేను అహ్‌నఫ్ బిన్ ఖైస్(రజి) బాబాయి గారైన జజ్ బిన్ ముఆవియా దగ్గర లేఖకునిగా ఉన్నాను. మరణానికి ఒక సంవత్సరం క్రితం ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) గారి లేఖ ఒకటి మా వద్దకు వచ్చింది. అందులో ఇలా ఉంది: "ఏ పారసీకుడైనా తనకు నిషిద్ధమైన (మహ్రమ్ అయిన) స్త్రీని భార్యగా చేసుకుంటే, వారిని వేరు పరచండి"– హజ్రత్ ఉమర్(రజి) పారసీకుల నుండి 'జిజ్‌యా' పుచ్చుకోలేదు. అయితే, దైవప్రవక్త(స) హజర్ పారసీకుల నుండి జిజ్‌యా తీసుకున్నారని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) సాక్ష్యమిచ్చిన తరువాత ఆయన కూడా జిజ్‌యా తీసుకోవటం మొదలెట్టారు.[1]

**477)** అమ్ర్ బిన్ ఔఫ్ అన్సారీ (రజి) అందించిన సమాచారం : ఆయనకు బనీ ఆమిర్ బిన్ లువై తెగతో మైత్రి ఉండేది. బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. ఆయన ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసం) అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజి)ను 'జిజ్‌యా' వసూళ్ళ నిమిత్తం బహ్రైన్‌కు పంపించారు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు(స) బహ్రైన్ వారితో సంధి చేసుకుని అలా బిన్ హజ్రమీ (రజి)ని

---

రాజ్యంలో ముస్లిమేతరులకు సర్వవిధాలా రక్షణ కల్పించినందుకుగాను సాలీనా అతి స్వల్పమైన పైకం వారి నుండి వసూలు చేస్తాడు. ఒకవేళ ముస్లిం పరిపాలకుడు గనక వారికి రక్షణ ఇవ్వలేకపోతే, వారి నుండి జిజ్‌యా వసూలు చేసే హక్కును కూడా కోల్పోతాడు.

476–1. పారసీకుల వ్యవహారం కూడా గ్రంథవహుల వంటిదేనని దీనిద్వారా తెలుస్తోంది. కాని తరువాతి కాలంలో పారసీకుల నాయకుడు తన తోబుట్టువులతో సమాగమం జరిపాడు. అలా చేయటంలో తప్పులేదని, ఆదమ్(అలైహిస్సలాం) కూడా తన కూతుళ్ళ నికాహ్ తన కొడుకులతో చేశారని వాదించాడు. ప్రజల్లో కొంతమంది అతని మాట విన్నారు. కొంతమంది వినలేదు. మాట వినని వారిని చంపేశాడు. కడకు వారి గ్రంథం తుడిచి పెట్టుకు పోయింది. పారసీకులతో కూడా గ్రంథవహుల మాదిరిగానే వ్యవహరించమని 'ముఅత్తా'లో మర్ఫూ హదీసు ఉంది.

అక్కడి గవర్నర్‌గా నియమించారు. అబూ ఉబైదా (రజి) బహ్‌రైన్ సొమ్మును తీసుకుని వచ్చినప్పుడు, అబూ ఉబైదా వచ్చిన సంగతి అన్సార్లకు తెలిసిపోయింది. అందరూ దైవప్రవక్త(స)తో కలసి ఫజ్ర్ నమాజ్ ఆచరించారు. నమాజు ముగిసిన తరువాత ప్రజలు ఆయన(స) ముందుకు వచ్చారు. వారిని చూసి దైవప్రవక్త(స) చిరుమందహాసం చేశారు. "బహుశా మీకు తెలిసిపోయినట్టుంది, అబూ ఉబైదా సొమ్ము తీసుకువచ్చారని" అని దైవప్రవక్త(స) చెప్పగా, 'అవును దైవప్రవక్తా!' అని అన్సార్లు బదులిచ్చారు. దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "మీకు శుభవార్త! మీరు దేనిని ఆశించారో, దేనివల్ల మీరు సంతసిస్తారో (అది వచ్చింది). కాని దైవసాక్షిగా! నేను మీ విషయంలో పేదరికం గురించి భయపడటం లేదు. నేను భయపడేదల్లా ఒక్కటే- మీకు పూర్వం గతించిన వారిపై ప్రాపంచిక సిరిసంపదల ద్వారాలు తెరువబడినట్లే మీపైన కూడా తెరువబడతాయి- అప్పుడు మీరు ఒకరింకొకరిని చూసి అసూయతో రగిలిపోయే పరిస్థితి ఏర్పడరాదు సుమా! ఈ రగిలిపోవటం అనేది మీ పూర్వీకుల్ని నాశనం చేసినట్లే మిమ్మల్ని కూడా నాశనం చేసేస్తుంది (మీ విషయంలో నేను భయపడేది దీని గురించే)".[1]

**478)** జుబైర్ బిన్ హయ్యా కథనం : అవిశ్వాసులతో యుద్ధం కొరకు ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) తన సైన్యాలను పెద్దపెద్ద పట్టణాల వైపునకు పంపారు. తరువాత హుర్ముజాన్ (మదాయన్ పాలకుడు) ఇస్లామ్ స్వీకరించినప్పుడు "(పారసీక సామ్రాజ్యంలోని) వివిధ ప్రాంతాల్లో సైనికుల్ని పంపే విషయమై నీ సలహా కావాలి. (ఫారస్, అస్ఫహాన్, ఆజర్ బాయ్‌జాన్‌లలో ఎక్కడి నుండి యుద్ధం మొదలెట్టాలి?)" అని హజ్రత్ ఉమర్(రజి) అడిగినప్పుడు, అతనిలా అన్నాడు; 'చాలా మంచి ప్రశ్న వేశారు. ఈ రాజ్యాల ఉపమానం, అక్కడ నివసించే ప్రజల దృష్టాంతం ఒక పక్షిలాంటిది. దానికి తలకాయ ఉంది, రెండు రెక్కలున్నాయి. దాని ఒక రెక్క విరిచేస్తే అది తన రెండుకాళ్ళపై, ఒక రెక్క, తల ఆధారంగా నిలదొక్కుకో

477-1. సుబ్‌హానల్లాహ్! ఎంత గొప్ప ఉపదేశం! చరిత్ర చాటి చెప్పేదేమంటే ఈ పరస్పర అసూయాద్వేషాల మంటల్లోనే రాజ్యాధికారాలు కాలి బూడిదయ్యాయి. సిరిసంపదలు కాలి భస్మీపటలం అయ్యాయి. రక్తపుటేరులు ప్రవహించాయి. నేడు పశ్చిమాసియా రాజ్యాలలో గుండెకొక గునపం తయారయింది. యూదులు అరబ్బుల ఉనికికే సవాలుగా పరిణమించగా, అరబ్బులేమో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

గలదు. ఒకవేళ దాని రెండవ రెక్క కూడా విరిచేసినా సరే రెండు కాళ్ళపై తలతో సహా నిలబడగలదు. కాని దాని తలను గనక తీసేస్తే, రెండు రెక్కలు, రెండు కాళ్ళు ఉండి కూడా ప్రయోజనం ఉండదు. ఇంతకీ ఆ తలకాయ ఏదంటారా, అదే కిస్రా (ఈరాన్ చక్రవర్తి). దాని ఒక రెక్క ఖైసర్ (రోము) సామ్రాజ్యమైతే, మరో రెక్క ఫారస్. అందుకే మొదట కిస్రాపై దండెత్తమని మీరు ముస్లిం సైన్యాన్ని ఆదేశించండి'.

బుకర్ బిన్ అబ్దుల్లాహ్, జియాద్ బిన్ జుబైర్‌లిద్దరూ జుబైర్ బిన్ హయ్య నుండి ఉటంకించారు : హజ్రత్ ఉమర్ (రజి) మమ్మల్ని పిలిచి నోమాన్ బిన్ ముఖర్రిన్‌ని మా నాయకునిగా నియమించారు. మేము శత్రు రాజ్యాన్ని (నిహావంద్) సమీపించగానే కిస్రా (ఈరాన్)కు చెందిన ఒక అధికారి **40** వేల మంది సైనికుల్ని తీసుకుని మమ్మల్ని మార్కొనడానికి రాసాగాడు. అతని తరఫున ఒక దుబాసీ వచ్చి, "మీలోని ఒక వ్యక్తి మాత్రమే (ఈ వ్యవహారంపై) మాట్లాడాలి" అన్నాడు. అప్పుడు ముగీరా బిన్ షూబా (రజి) (ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తూ) "ఇంతకీ మీ డిమాండ్లు ఏమిటో చెప్పండి" అన్నారు. దానికతను, "ఇంతకీ ఎవరు మీరు? ఎచటి వారు?" అని అడిగాడు. ముగీరా (రజి) ఇలా అన్నారు: "మేము అరేబియా వాసులము. మేము దౌర్భాగ్యానికి (కుఫ్రికి), కటిక దారిద్ర్యానికి లోనై ఉండేవారము. ఆకలిబాధకు తాళలేక తోలును, టెంకలను చప్పరించేవారం. ఉన్ని, వెంట్రుకలే మా శరీరాలకు ఆచ్ఛాదనగా ఉండేవి. చెట్టుపుట్టలను, రాయిరప్పలను మేము పూజించేవారం. ఇన్ని కష్టాలలో మేము మ్రగ్గుతుండగా గగన భువనాల ప్రభువు మా వైపునకు స్వయంగా మా జాతి నుండే ఒక ప్రవక్తను పంపాడు. ఆయన తల్లి దండ్రుల గురించి మాకు బాగా తెలుసు. ఒక్కడైన అల్లాహ్‌ను ఆరాధించడానికి అంగీకరించనంత వరకూ మీతో యుద్ధం చేయమని దైవప్రవక్త(స) మమ్మల్ని ఆజ్ఞాపించారు. లేదా ఇస్లాం స్వీకరించని పక్షంలో 'జిజ్‌యా' చెల్లించడానికి ఒప్పు కోవాలి. మా ప్రవక్త(స) మాకు ఈ సందేశాన్ని కూడా అందజేశారు. (ఇస్లాం కొరకు పోరాడుతూ) యుద్ధంలో మా మనిషి ఎవరు హతుడైనా అతనెప్పుడూ చూడనయినా చూడని స్వర్గంలో ప్రవేశిస్తాడు. మరెవరయితే యుద్ధంలో సజీవంగా మిగిలారో వారు (విజేతలై) మీపై పాలకులవుతారు." (ముగీరా–రజి– ఈ సంభాషణ పూర్తయ్యాక యుద్ధం మొదలెట్టండని నోమాన్ (రజి)తో అన్నారు)

**నోమాన్(రజి) ఇలా అన్నారు: “అల్లాహ్ మీలో అనేకమందికి అనేక యుద్ధాలలో దైవప్రవక్త(సఅసం)తో కలసి పోరాడే అవకాశం కల్పించాడు. ఆయన మిమ్మల్ని (యుద్ధానికి ఆలస్యం చేసినందుకు) సిగ్గుపడేలా చేయటంగానీ, పరాభవం పాల్జేయడంగానీ చేయలేదు. నేను కూడా ప్రవక్త మహనీయుల(స)తో కలసి యుద్ధం చేశాను. ఆయన(స) నియయం ఏమిటంటే, తెల్లవారుతుండగా యుద్ధం మొదలెట్టక పోతే– పొద్దెక్కినట్లయితే– పొద్దువాలిపోయి, చల్లని గాలులు వీచేవరకూ నమాజుల సమయం ఆసన్నమయ్యేవరకూ ఆగి ఉండేవారు.[1]**

## అధ్యాయం : 2

## ఒకవేళ పురపాలకునితో సంధి కుదిరితే పుర జనులతో కూడా సంధి జరిగినట్లుగానే భావించబడుతుంది.

**479) అబూ హుమైద్ సాయిదీ (రజి) వివరించారు: మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం)తో కలసి తబూక్ యుద్ధంలో పాల్గొన్నాము. ఆ సందర్భంగా ‘అయ్‌లా’ పురపాలకుడు (యోహానా బిన్ రూబా) దైవప్రవక్త(స)కు**

478–1. ఇంతకీ జరిగిందేమిటంటే ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) హయాంలో ముస్లిం సేన ఈరాన్ వైపునకు సాగింది. వారు ‘ఖాద్‌సియా’ చేరుకునేసరికి ఈరాన్ చక్రవర్తి యజ్దగర్ద్ ఒక పెద్ద సైనిక పటాలాన్ని ప్రతిఘటన కొరకు పంపాడు. హిజ్రీ శకం 14వ యేట ఈ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ముస్లింలకు చాలా పెద్ద నష్టం వాటిల్లింది. తలైహా అసదీ, అమ్ర్ బిన్ మాదీకరబ్, జిరార్ బిన్ ఖత్తాబ్(రజిఅల్లాహు అన్‌హుమ్) లాంటి పరాక్రమశాలురు అమరగతినొందారు. తరువాత దేవుడు అవిశ్వాసులపై ప్రచండమైన ఇసుక తుఫాను పంపాడు. వారి గుడారాలన్నీ గాలికి ఎగిరిపోయాయి. ఇదే అదనుగా మరోవైపు నుండి ముస్లింలు మెరుపుదాడి చేశారు. దాంతో ఈరాన్ సైనికులు పలాయనం చిత్తగించారు. వారి సుప్రసిద్ధ పహిల్వాన్ రెండవ రుస్తుం కూడా వధించబడ్డాడు. ముస్లిం సైన్యం శత్రువును వెంబడిస్తూ మదాయన్ వరకు చేరుకుంది. అక్కడి పురపాలకుడు హుర్‌ముజాన్ ముట్టించబడ్డాడు. చివరకు అతను లొంగిపోయి, సంతోషంగా ఇస్లాం స్వీకరించాడు.

సైన్యాధిపతి అయిన అబూ మూసా అష్అరీ (రజి) అతనిని ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) వద్దకు చేర్చారు. ఖలీఫా అతనిని గౌరవించారు. అతనిలోని విజ్ఞతను పసిగట్టి, తన సలహాదారుగా చేసుకున్నారు. హుర్‌ముజాన్ కూడా తన అనుభవాన్నంతా రంగరించి, నిజాయితీగా సలహా ఇచ్చాడు. ఆ యుద్ధతంత్రం ఫలించింది.

ఒక తెల్లటి కంచెర గాడిదను (కానుకగా) పంపాడు. అప్పుడు దైవప్రవక్త(స) అతనికి ఒక శాలువాను బహూకరించి, ఒక లిఖితపూర్వక పత్రం ద్వారా అతని పట్టణంపై అతన్ని పరిపాలకునిగా ఉండనిచ్చారు.[1]

## అధ్యాయం : 3

## దైవప్రవక్త(స) భద్రత కల్పించిన అవిశ్వాసులకు, వారి భద్రతను కొనసాగించేలా వసీయతు చేయటం

'జిమ్మీ' అంటే ఒడంబడిక, ఖరారు, కట్టుబడి ఉండటం అని అర్థం. 'ఖరాబత్' అంటే బంధుత్వ సంబంధం.

**480)** ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) చెప్పగా తాను విన్నానంటూ జువేరియా బిన్ ఖుదామా తమీమీ తెలిపారు (ఉమర్-రజి-తీవ్రంగా గాయపడినప్పుడు) 'మాకు ఏదైనా వసీయతు చేయండి' అని మేము అభ్యర్థించాము. అప్పుడాయన ఇలా అన్నారు: "నేను మీకు (జిమ్మీలతో మీరు చేసుకున్న) ఒడంబడిక గురించి వసీయతు చేస్తున్నాను. (దానికి కట్టుబడి ఉండే విషయంలో లోటు కనబరచకండి. జిమ్మీలను వేధించకండి). ఎందుకంటే వారు మీ ప్రవక్త ద్వారా రక్షణ కల్పించబడినవారు. మీ ఇంటి వారలకు జీవనోపాధిగా ఉన్నారు (అంటే వారిచ్చే 'జిజ్‌యా' ద్వారా మీ ఆలుబిడ్డల పోషణ జరుగుతోంది).

## అధ్యాయం : 4

## దైవప్రవక్త(స) బహ్‌రైన్ సొమ్ము నుండి (యోధులకు ఆర్థిక) సహాయం చేయటం-

బహ్‌రైన్ నుండి వచ్చే ఆదాయం నుండి, జిజ్‌యా నుండి ఎవరికయినా ఏదయినా ఇస్తానని వాగ్దానం చేయటం. 'ఫై' సొమ్ము నుండి, 'జిజ్‌యా' నుండి ఎవరెవరికి ఇవ్వవచ్చు? దాని గురించి...

**481)** హజ్రత్ అనస్(రజి) కథనం : దైవ సందేశహరులు(సఅసం)

479-1. ఈ ఉల్లేఖనం ఇబ్నె ఇస్‌హాఖ్‌లో ఇలా ఉంది: దైవసందేశహరులు (సఅసం) తబూక్ వైపు వెళుతుండగా 'అయ్‌లా' పరిపాలకుడైన యోహానా ఆయన(స) సన్నిధికి వచ్చి 'జిజ్‌యా' ఇవ్వడానికి అంగీకరించాడు. అప్పుడాయన(స) అతనితో సంధి చేసుకుని, అభయపత్రం రాయించి ఇచ్చారు. ఆ విధంగా యోహానా చేసుకున్న సంధి కారణంగా 'అయ్‌లా' వాసులందరికీ శాంతిభద్రతలు కల్పించబడ్డాయి.

అన్సార్లను పిలిపించారు– బహ్రైన్‌లో కొంత భూమిని వారికి వ్రాసి ఇవ్వాలని ఆయన (స) సంకల్పించుకున్నారు. కాని అన్సారులు 'దైవప్రవక్తా! అలా చేయకండి. దైవసాక్షిగా! తమరు అంతే భూమిని (ముహాజిర్లు అయిన) మా ఖురైషు సోదరులకు కూడా రాసి ఇవ్వనంతవరకూ ఇది మాకు స్వీకారయోగ్యం కాదు' అని మృదువుగా విజ్ఞప్తి చేశారు. దానికాయన(స), "దైవానికి సమ్మతం అయినంతవరకూ వారికి కూడా (అంటే ఖురైషులకు కూడా) ఈ లబ్ది చేరుతుంది" అని చెప్పారు. కాని అన్సార్లు మాత్రం 'ఖురైష్ సోదరుల కొరకు లిఖితపూర్వక పత్రం ప్రదానం చేయండి' అని పట్టుబట్టారు. అందువల్ల దైవప్రవక్త(స) అన్సార్లను సంబోధించి ఇలా ఉపదేశించారు: "నా తదనంతరం ఇతరులకు మీపైన ప్రాధాన్యత ఇవ్వటం మీరు చూస్తారు. కాని మీరు మాత్రం కౌసర్ సరస్సు వద్ద నన్ను కలుసుకునే వరకూ నిగ్రహం వహించండి (అసంతృప్త జ్వాలలకు ఆజ్యం పోసి, కల్లోల కారకులు కావద్దు)."

**482)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖించారు: దైవ సందేశ హరులు (సఅసం) నాతో, "ఒకవేళ మా వద్దకు బహ్రైన్ నుండి డబ్బు గనక వస్తే నేను నీకు ఇంత ఇంత ఇంత ఇస్తాన"ంటూ (మూడు దోసిళ్ళతో) సంజ్ఞ చేశారు. తరువాత దైవప్రవక్త(స) పరమపదించారు. ఆ తరువాత బహ్రైన్ సొమ్ము వచ్చినప్పుడు అబూబక్ర్(రజి), "దైవప్రవక్త(స) ఎవరికయినా, ఏదయినా ఇస్తానని వాగ్దానం చేసి ఉంటే వారు నా దగ్గరకు రావచ్చు" అని ప్రకటన చేయించారు. అందువల్ల నేను ఆయన సన్నిధిలో హాజరై, దైవప్రవక్త(స) నాతో, "బహ్రైన్ నుండి డబ్బు గనక వస్తే నేను నీకు ఇంత ఇంత ఇంత ఇస్తాన"ని చెప్పి ఉన్నారు అని అన్నాను. దానికాయన, "అలాగా! అయితే ఒక దోసిలి నింపుకో" అన్నారు. నేను ఒక దోసిలి నింపుకున్నాను. "అవి ఎన్ని ఉన్నాయో లెక్కపెట్టు" అని ఆయన పురమాయించారు. నేను వాటిని లెక్కిస్తే ఐదు వందలున్నాయి. తరువాత ఆయన నాకు మొత్తం పదిహేను వందలు ఇచ్చారు.

మరొక సనదు...

మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : దైవ సందేశహరుల(సఅసం) వద్దకు బహ్రైన్ నుండి పన్ను రూపంలో డబ్బు వచ్చింది. "దానిని మస్జిద్‌లో కుమ్మరించండి" అని దైవప్రవక్త(స) ఆదేశించారు. బహ్రైన్ నుండి వచ్చిన ఆ సొమ్ము

ఇప్పటివరకూ దైవప్రవక్త(స) వద్దకు వచ్చిన సొమ్ములన్నింటికన్నా అధికం. అంతలో మహనీయ అబ్బాస్(రజి) వచ్చి, 'దైవప్రవక్తా! నాకు వొసగండి (నా మీద అప్పుల భారం ఉంది). ఎందుకంటే నేను బద్ర్ యుద్ధ సందర్భంగా నా ఫిదియా (నష్టపరిహారం)తోపాటు అఖీల్ (రజి) ఫిదియా కూడా చెల్లించాన'న్నారు. దానికి దైవ ప్రవక్త(స), "సరే. తీసుకోండి" అని పలికారు. తరువాత ఆయన తన అంగవస్త్రంలో డబ్బు నింపుకున్నారు (కాని దానిని ఎత్తుకోలేకపోయారు. అందువల్ల కొంత (కొన్ని నాణాలు) తగ్గించారు. తగ్గించిన మీదట కూడా ఆ బరువును లేపలేక పోయారు. అప్పుడాయన 'దైవప్రవక్తా! ఈ బరువును ఎత్తటంలో నాకు సహాయపడమని ఎవరికయినా పురమాయించండి' అని విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త(స), "లేదు. అలా కుదరదు" అని చెప్పారు. 'మరైతే మీరే కాస్త లేపండి' అని అబ్బాస్ (రజి) అభ్యర్థించగా, "అది కూడా జరగని పని" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు. అందువల్ల ఆయన ఆ బరువును మరింత తగ్గించుకోవలసి వచ్చింది. అప్పటికిగాని ఆ డబ్బు మూటను ఆయన తన భుజంపైన మోపుకోలేకపోయారు. ఆయన మా నుండి కనుమరుగయ్యేంతవరకు దైవప్రవక్త(స) ఆయన్ని తదేకంగా తిలకిస్తూనే ఉన్నారు. అబ్బాస్(రజి) గారిలోని అత్యాశపై ఆయన(స) ఆశ్చర్యచకితులయ్యారు. అక్కడ ఒక దిర్హమ్ కూడా లేకుండా పంపిణీ అయ్యేవరకూ దైవప్రవక్త(స) అక్కడి నుండి లేవలేదు.

## అధ్యాయం : 5

## 'జిమ్మీ'గా ఉన్న ఒక అవిశ్వాసిని అన్యాయంగా చంపటం ఎంత పెద్ద నేరమంటే...

**483)** ప్రవక్త మహనీయులు(సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ఈ విధంగా ప్రవచించినట్లు అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) ఉల్లేఖించారు: "ఏ 'జిమ్మీ' అవిశ్వాసినయినా అన్యాయంగా చంపినవాడు స్వర్గలోక సువాసనను కూడా ఆఘ్రాణించలేడు. మరి చూడబోతే స్వర్గసువాసన నలభై ఏండ్ల ప్రయాణ దూరం నుండి కూడా గుబాళిస్తూ ఉంటుంది."

## అధ్యాయం : 6

## యూదులను అరేబియా క్షేత్రం నుండి వెళ్ళగొట్టడం

హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: దైవ సందేశహరులు-సఅసం-

(ఖైబర్‌లోని యూదులనుద్దేశించి), "అల్లాహ్ మిమ్మల్ని ఇక్కడ ఉండనిచ్చినంతకాలం మేము మిమ్మల్ని ఇక్కడ ఉండనిస్తాము" అని చెప్పి ఉన్నారు.

**484)** మహనీయ అబూహురైరా (రజి) ఉల్లేఖనం : మేము మస్జిదె నబవీలో కూర్చుని ఉండగా ప్రవక్త మహనీయులు(సఅసం) విచ్చేసి, "యూదుల వైపునకు పదండి" అని సెలవిచ్చారు. అందువల్ల మేము బయలుదేరాము. బైతుల్ మదారిస్ (యూదుల విద్యాసంస్థ)కు చేరుకోగానే, దైవప్రవక్త(స) యూదులనుద్దేశించి, "ఇస్లామ్ స్వీకరించండి. నిశ్చింతగా ఉంటారు. ఈ భూమి అల్లాహ్‌ది, ఆయన ప్రవక్తదని తెలుసుకోండి. మిమ్మల్ని ఇక్కడి నుండి వెలికి తీయాలన్నది నా ఉద్దేశం. ఒకవేళ మీలో ఎవరి ఆస్తికయినా తగు మూల్యం వస్తే దానిని అమ్ముకోవటం మంచిది. మీరు గనక అందుకు సిద్ధంగా లేకపోతే (ఈ) భూమి దైవానిది, దైవప్రవక్తదని బాగా తెలుసుకోండి"[1] అని చెప్పారు.

**485)** ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పగా తాను విన్నట్లు సయీద్ బిన్ జుబైర్ (రజి) తెలిపారు: ఆయన (ఇబ్నె అబ్బాస్-రజి) గురువారం గురించి ప్రస్తావిస్తూ, "గురువారం నాడు గురించి మీకేం తెలుసు? అయ్యో, అది ఎలాంటి దినం?" అంటూ ఆయన వలవలా ఏడ్చేశారు. ఆయన కన్నీళ్ళ వల్ల నేలపైని కంకరరాళ్ళు సయితం తడిసిపోయాయి- సయీద్ ఇలా అన్నారు: 'ఓ అబుల్ అబ్బాస్! (మీ దృష్టిలో) గురువారం నాటి విశేషం ఏమిటి?' అని నేను విచారించగా, ఆయన ఇలా చెప్పారు: ఆ రోజే దైవప్రవక్త(స) గారి బాధ (మరణ వ్యాధి) తీవ్రతరమయింది. అప్పుడాయన (స), "నాకు ఒక (వ్రాసే) పత్రం ఇవ్వండి, నేను మీ కోసం ఒక దస్తావేజు వ్రాసి పోతాను, దాని తర్వాత మీరెన్నడూ దారి తప్పరు" అని పలికారు. దానిపై ప్రజల మధ్యన అభిప్రాయ భేదం పొడసూపింది. ఆ తర్వాత దైవప్రవక్త(స) స్వయంగా కల్పించుకుని, "దైవప్రవక్త సమక్షంలో ఇలా గొడవపడటం ఏమాత్రం సమంజసం కాద"ని చెప్పారు. మరికొంతమంది, 'దైవప్రవక్త(స) ఏదన్నా చెప్పాలనుకుంటే అది నిరర్థకమైన విషయం అయి ఉండదు కదా! అందుకే (ఆయన వద్దకు) పదండి' అన్నారు. ఇది విన్న దైవప్రవక్త(స), "నన్ను నా మానాన

---

484-1. దైవప్రవక్త(స) తన జీవిత కాలంలోనే యూదులను వెళ్లగొట్టాలని సంకల్పించుకున్నారు. కాని ఆయన(స) పరమ పదించటంతో హజ్రత్ ఉమర్(రజి) తన పరిపాలనా కాలంలో, యూదుల నిరంతర కుట్రల కారణంగా వారిని అక్కడి నుండి వెళ్ళగొట్టారు.

వదలిపెట్టండి, ఎందుకంటే ప్రస్తుతం నేనున్న పరిస్థితి మీరు పిలుస్తున్న దాని కంటే మేలైనది" అని పలికారు. ఆ తరువాత దైవప్రవక్త(స) మూడు విషయాల గురించి ఆజ్ఞాపించారు. **1)** బహు దైవారాధకులను అరబ్బు ద్వీపం నుండి తీసివేయాలి **2)** దౌత్య బృందాల పట్ల నేనెలా మర్యాదగా మసలుకునేవాడినో అలాగే మీరు వారి పట్ల మసలుకోవాలి. **3)** మూడవ విషయం కూడా మేలైనదే. సయీద్ దానిని వివరించలేదు లేదా నేను దానిని మరచి పోయాను. సుఫ్యాన్ ఏమన్నారంటే ఆ (మూడవ) విషయం[1] మేలైనదే, అది సులైమాన్ అహ్వాల్ వాక్యం.

## అధ్యాయం : 7

## ఒకవేళ అవిశ్వాసులు ముస్లింలను మోసగిస్తే వారికి క్షమాభిక్ష పెట్టవచ్చునా? లేదా??

**486)** మహనీయ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : ఖైబర్ జయించబడినప్పుడు యూదుల తరపున దైవప్రవక్త(సఅసం) సేవలో మేక మాంసం కానుకగా సమర్పించబడింది. అందులో విషం కలుపబడింది. "ఎంతమంది యూదులు ఇక్కడ ఉన్నారో వారందరినీ సమావేశపరచండి" అని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఎట్టకేలకు వారంతా ఒకచోట గుమిగూడారు. అప్పుడు దైవప్రవక్త(స) వారిని సంబోధించి, "చూడండి, నేను మిమ్మల్ని ఒకటి అడుగుతాను. మీరంతా నిజం చెబుతారా?" అని అడిగారు. దానికి వారంతా 'అవున'న్నారు. "మీ తండ్రి ఎవరు?" అని ఆయన(స) వారిని ప్రశ్నించారు. 'ఫలానా వారు' అని వారు జవాబిచ్చారు. దానికాయన(స), "మీరు చెప్పేది అబద్ధం. మీ తండ్రి ఫలానా వారు" అని అన్నారు. దానికి వారంతా 'తమరు చెప్పేది నిజం' అని ధ్రువపరిచారు. "నేను మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. జరిగిందేమిటో మీరు ఉన్నదున్నట్టు చెబుతారా?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, 'తప్పకుండా చెబుతాము అబుల్ ఖాసిమ్. ఒకవేళ మేము గనక అబద్ధం చెబితే మీరు అప్పటికప్పుడే మా అబద్ధాన్ని పట్టుకుంటారు; మా తండ్రి

---

485-1. ఆ మూడవ విషయం ఏమై ఉంటుంది? 'ఉసామా (రజి) సారథ్యంలో సైనిక దళం సిద్ధం చేయండి' అన్నదే ఆ పలుకు అని కొందరంటే, 'నమాజులను కాపాడుకోండి' అన్న మహితోక్తే ఆ ముఖ్య విషయం అని మరికొందరు అంచనా వేశారు. 'బానిసల పట్ల, బానిస స్త్రీల పట్ల ఉత్తమ రీతిలో వ్యవహరించండి' అన్నదే ఆ ఉపదేశం అని ఇంకొంత మంది అభిప్రాయపడ్డారు.

విషయంలో మేము చెప్పిన అబద్ధాన్ని పట్టుకున్నట్లే" అని వారంతా సమాధాన మిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) వారిని అడిగారు, "నరకానికి పోయే వారెవరు?" అని. 'కొన్నాళ్ళపాటు మేము దానికి ఆహుతి అవుతాము. కాని ఆ తరువాత మీరు (ముస్లింలు) మా స్థానంలో నరకంలో వేయబడతార'ని యూదులు చెప్పారు. దాని కాయన(స), "దౌర్భాగ్యులారా! దైవసాక్షిగా మేము మీ స్థానంలో ఎన్నడూ అందులో ప్రవేశించము" అని వారి మాటను ఖండించారు. తరువాత ఆయన (స) వారి నుద్దేశించి, "నేనేదన్నా విషయం అడిగితే మీరు జరిగిందేమిటో నిజం చెబుతారా?" అని అడిగితే, ఈసారి కూడా వారు 'నిజమే చెబుతాము అబుల్ ఖాసిమ్' అని బదు లిచ్చారు. దైవప్రవక్త(స) అప్పుడు అడిగారు,"మీరు ఈ మేక మాంసంలో విషం కలిపారా?" అని. దానికి వారు 'అవును కలిపాము' అన్నారు. "మీరీ పని ఎందుకు చేశారు?" అని ఆయన(స) నిలదీసి అడిగితే, వారిలా సమాధానమిచ్చారు. "ఒకవేళ మీరు (దైవదౌత్యం) విషయంలో అబద్ధీకులై ఉంటే, మీ బారి నుండి మాకు శాశ్వతంగా విముక్తి లభిస్తుందని అనుకున్నాము. ఒకవేళ మీరు నిజంగా దైవప్రవక్త అయివుంటే ఈ విషం మీకు ఎలాంటి (ప్రాణ) హాని కలిగించదని తలపోశాము."[1]

## అధ్యాయం : 8

## ఒడంబడికను భగ్నపరచినవారిని నాయకుడు శపించటం

**487)** ఆసిమ్ అహ్వాల్ తెలియజేశారు: దుఆయె ఖునూత్ గురించి నేను అనస్(రజి)ను అడిగితే, 'అది రుకూకు ముందే చేయాలి' అని ఆయన చెప్పారు. 'రుకూ తర్వాత చేయాలని మీరన్నట్లు ఫలానా వ్యక్తి (ముహమ్మద్ బిన్ సీరీన్) అంటున్నారు కదా!' అని నేను విన్నవించుకోగా, 'ఆయన చెప్పింది సరైంది కాదు' అని అనస్(రజి) చెప్పారు. తరువాత ఆయన మాకు ఈ హదీసు వినిపించారు: 'దైవప్రవక్త(స) ఒక నెల రోజుల వరకూ రుకూ తరువాత ఖునూత్ దుఆ చేశారు.

486-1. తనపై విష ప్రయోగం చేసిన యూదు మహిళ జైనబ్ బిన్తె హారిస్‌ను దైవప్రవక్త(స) క్షమించి వదిలిపెట్టేశారు. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం.

అయితే ఆ విషాహారం తిన్న బషర్ బిన్ బరా (రజి) సహాబీ చనిపోయారు. అందువల్ల ఆయన(స) షరీఅత్ ప్రకారం ప్రతీకార న్యాయం కోరుతూ ఆమెకు మరణ దండన విధించారు.

**ఆ దుఆలో ఆయన(స) బనూ సులైమ్ తెగ వారిని శపించారు.' ఆయన ఇంకా ఇలా అన్నారు. 'దైవప్రవక్త(స) నలభై లేదా డెబ్భయి మంది ఖుర్ఆన్ విద్వాంసులైన తన సహచరుల బృందాన్ని- ఇక్కడ ఉల్లేఖకుడు సహాబా సంఖ్యపై సంశయంలో పడ్డారు- ముష్రిక్కుల వద్దకు పంపారు. కాని ఈ బనూ సులైమ్ తెగవారు (దారిలో ఒకచోట) వారిని అటకాయించి చంపేశారు. మరి చూడబోతే దైవప్రవక్త(స)తో వారు ఒడంబడిక చేసుకుని ఉన్నారు. (కాని వారు మోసగించారు). ఈ సహాబా అమరగతిపై దైవప్రవక్త(స)కు కలిగినంత దుఃఖావేదన మరే విషాదకర ఘటనపై కూడా కలిగినట్లు నేను చూడలేదు.'[1]**

## అధ్యాయం : 9

## (ముస్లిమ్) స్త్రీలు గనక ఎవరికయినా (ఏ ముస్లిమేతరునికైనా) రక్షణ కల్పిస్తే...

**488) ఉమ్మె హానీ బిన్తె అబీ తాలిబ్(రజిఅల్లాహు అన్హా) చెప్పగా తాను విన్నానని ఆమె బానిస అబూ ముర్రా తెలిపారు: ఆమె గారు ఇలా చెబుతుండేవారు- నేను మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త(సఅసం) సేవలో హాజరయ్యాను. (మక్కాలో) ఆయన(స) స్నానం చేస్తుండగా, ఆయన పుత్రిక ఫాతిమా (ర.అ) చాటు కోసం తెర పట్టుకుని ఉన్నారు. నేనాయనకు సలామ్ చేశాను. "ఎవరమ్మా!" అని ఆయన(స) అడిగితే, 'నేను అబూ తాలిబ్ పుత్రిక ఉమ్మె హానీని' అని చెప్పాను. "రా అమ్మా ఉమ్మె హానీ. నీకు స్వాగతం" అని పలికారాయన(స). స్నానం చేసిన తరువాత ఆయన(స) నిలబడి ఎనిమిది రకతుల 'చాష్త్ నమాజ్' ఆచరించారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) తన పవిత్ర దేహానికి ఒకే ఒక్క వస్త్రం (లుంగీ) చుట్టు కుని ఉన్నారు. అప్పుడు నేను, 'దైవప్రవక్తా! నా మాతా సుతుడు హజ్రత్ అలీ (రజి),**

---

487-1. ఎందుకంటే ఆ అమరగతులు ఖారీలు, ఖుర్ఆన్ పండితులు. వారు గనక జీవించి ఉంటే, వారి ద్వారా ఉమ్మత్‌కు చాలా ప్రయోజనం కలిగి ఉండేది. 'పండితుని మరణం ప్రపంచానికి పెద్ద విపత్తు' అన్నది లోకోక్తి.

ఇకపోతే దుఆయె ఖునూత్ రుకూకి ముందు పఠించాలా? రుకూ తరువాత? అన్న విషయంలో సహాబా మధ్య ద్వంద్వాభిప్రాయం ఉండేది. కొందరు రుకూకి ముందు పఠిస్తే, కొందరు రుకూ తర్వాత పఠించేవారు.

అయితే 'ఖునూతె నాజిలా' మాత్రం కేవలం ఫర్జ్ నమాజులలోనే- అదీ రుకూ తర్వాతే- పఠించబడుతుందని పై హదీసు ద్వారా తేటతెల్లమవుతుంది.

నేను రక్షణ ఇచ్చిన ఒక వ్యక్తిని హతమారుస్తానని అంటున్నారు.[1] ఆ వ్యక్తి ఎవరో కాదు, హుబైరా కుమారుడగు జాదా' అని విన్నవించుకోగా, "ఉమ్మె హానీ! నీవు రక్షణ కల్పించిన వ్యక్తికి మా తరపున కూడా రక్షణ ఉంటుంది" అని ఆయన (స) సెలవిచ్చారు. అది పొద్దెక్కుతున్న సమయం అని ఉమ్మె హానీ (ర.అ) చెప్పారు.

## అధ్యాయం : 10

## ముస్లిములంతా పరస్పరం సమానులే. ఒక సాధారణ ముస్లిం అయినా సరే ఒక అవిశ్వాసికి శరణు ఇస్తే అందరూ దానిని అంగీకరించవలసిందే

**489)** తన తండ్రి (యజీద్ బిన్ షరీక్ తైమి) తనకు ఈ విధంగా తెలియజేశారని ఇబ్రాహీమ్ తైమీ అన్నారు: "మహనీయ అలీ(రజి) మమ్మల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు– దైవగ్రంథం మరియు (షరీఅత్ ఆదేశాలను విశ్లేషించే) ఈ పత్రం తప్ప మేము పఠించే మరే గ్రంథం కూడా మా వద్ద లేదు". తరువాత ఆయన (రజి) ఇలా అన్నారు: "ఇందులో గాయపరచినందుకు గాను ఖిసాస్ (పరిహారం) చెల్లించే ఆజ్ఞలున్నాయి. రక్తశుల్కం (దియత్)గా ఇవ్వబడే ఒంటెల వయస్సుకు సంబంధించిన ఆదేశాలున్నాయి." ఇంకా ఏమిటంటే "మదీనా నగరం అయిర్ పర్వతం నుండి ఉహూద్ పర్వతం వరకు హరమ్(పవిత్రమైనది, నిషిద్ధమైనది)గా పరిగణించబడుతుంది. అందువల్ల ఎవరయినా (షరీఅత్‌లో లేని ఏదేని కొత్త విషయాన్ని ధర్మంలో) కల్పించినా లేదా అలాంటి కొత్త పుంతలు తొక్కే వ్యక్తికి ఆశ్రయం కల్పించినా అతనిని దేవుడు, దైవదూతలు, మనుషులు– అందరూ ధూత్కరిస్తారు. అతని ఫర్జ్ ఆరాధనలుగానీ, నఫిల్ ఆరాధనలు గానీ స్వీకరించబడవు. ఇందులో ఇంకా ఇలా వుంది : ఎవరయినా ఒక బానిస స్త్రీ తన యజమానిని కాదని మరెవరినయినా యజమానిగా చేసుకుంటే, ఆమె కూడా ఇలాగే ధూత్కారానికి గురవుతుంది. ఇంకా– ముస్లిములంతా సమానులే. కాబట్టి ఎవరయినా ఒక ముస్లిం

---

488–1. 'హుబైరా' ఎవరో కాదు, ఉమ్మె హానీ భర్త. జాదా అతని కుమారుడు. మరి అలీ (రజి) స్వయంగా తన మేనల్లుణ్ణి ఎందుకు చంపుతానన్నారో అర్థం కాదు. ఆ హుబైరా 'ఈ హుబైరా' కాదని కొందరు అభిప్రాయపడ్డారు. మొత్తానికి ఈ హదీసు ఆధారంగా ఒక స్త్రీ ఎవరికయినా రక్షణ (శరణు) ఇవ్వగలదని విదితమయింది. నలుగురు ఇమాముల అభిప్రాయం కూడా ఇదే.

రక్షణలో ఉంటే (అతను అవిశ్వాసి అయినాసరే) అతని విషయంలో జోక్యం చేసుకో రాదు. జోక్యం చేసుకుంటే, అతను కూడా ధూత్కరించబడతాడు."[1]

## అధ్యాయం : 11

## ఒకవేళ యుద్ధ సమయంలో ఏ అవిశ్వాసి అయినా కలవరం చెంది 'నేను ముస్లింనయ్యాను' అని అనకుండా 'నేను ధర్మపరివర్తన చెందాను, ధర్మపరివర్తన చెందాను' అనంటే అప్పుడేం చేయాలి?

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: ఖాలిద్ బిన్ వలీద్(రజి) అవిశ్వాసులను (బనీ హదబా యుద్ధంలో) వధించటం మొదలెట్టారు. నిజానికి వారు 'మేము మతం మార్చుకున్నాము... మతం మార్చుకున్నాము' అని చెబుతూనే ఉన్నారు. ఈ విషయం దైవప్రవక్త(స)కు తెలిసినప్పుడు, 'యా అల్లాహ్! నాకు ఖాలిద్ చేష్టతో ఎట్టి సంబంధం లేదు" అని పలికారు. హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: "ఏ ముస్లిం అయినా ఒక పారసీకుణ్ణి ఉద్దేశించి, 'మత్రస్' (భయపడకు) అని అన్నాడంటే అతను ఆ వ్యక్తికి అభయం (శరణు) ఇచ్చినట్లే. ఎందుకంటే అల్లాహ్ అన్ని భాషలను ఎరిగినవాడు"- హజ్రత్ ఉమర్(రజి) దగ్గరకు ముస్లింలు హుర్ముజాన్‌ను బంధించి తీసుకువచ్చినప్పుడు, "నీవు ఏం చెప్పదలచుకున్నావో చెప్పు. భయపడకు" అన్నారు.

## అధ్యాయం : 12

## బహుదైవారాధకుల నుండి ధనం పుచ్చుకుని సంధి చేసుకోవటం, యుద్ధ విరమణ చేయటం. ఒడంబడికను నెరవేర్చకపోవటం పాపం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :"ప్రవక్తా! శత్రువు గనక సంధీశాంతుల వైపునకు

---

489-1. దీనినిబట్టి అవగతమయ్యేదేమంటే, మహనీయ అలీ(రజి) కూడా అందరూ పారాయణం చేసే ఖుర్ఆన్‌నే పారాయణం చేసేవారు. కాకపోతే సూరాలు వెనుకాముందు అయి ఉండవచ్చు. హజ్రత్ ఉస్మాన్(రజి) పరిపాలనా కాలంలో గ్రంథరూపం దాల్చిన కారణంగా కొందరు సంకుచిత మనస్కులు, అలీ (రజి) వద్ద ఉన్న ఖుర్ఆన్ వేరే అని అంటే అది దుస్సాహసంగా, అపవాదుగా భావించబడుతుంది. అలాంటి వారు కూడా దైవాగ్రహానికి పాత్రులవుతారు.

మొగ్గు చూపితే, నీవు కూడా దానికి సిద్ధపడు. అల్లాహ్‌పై భారం వెయ్యి; ఆయనే అంతా వినేవాడూ అన్నీ తెలిసినవాడూను." *(అల్ అన్‌ఫాల్ : 61)*

**490)** సహ్లా బిన్ అబీ హస్మా వివరించారు: అబ్దుల్లాహ్ బిన్ సహ్లా, ముహయ్యసా బిన్ మస్‌ఊద్ బిన్ జైద్(ర.అన్‌హుమా)లు ఇరువురూ ఖైబర్ ప్రాంతానికి వెళ్ళారు. (ఖైబర్ యూదులకూ- ముస్లింలకూ మధ్య) సంధి జరిగివున్న కాలమది. ఆ మహనీయులిద్దరూ ఖైబర్‌కు చేరుకున్న వెంటనే (తమకు అప్పజెప్ప బడిన బాధ్యతల నిర్వహణకై) వేరుపడిపోయారు. ఆ తరువాత ముహయ్యసా (రజి) అబ్దుల్లాహ్ బిన్ సహ్లా (రజి) దగ్గరకు వచ్చేసరికి ఆయన నెత్తుటి మడుగులో- కొనఊపిరితో- కొట్టుకుంటున్నారు. ఎవరో ఆయన్ని హత్య చేశారు. ముహయ్యసా (రజి) అబ్దుల్లాహ్ (రజి)ను ఖననం చేసి, మదీనాకు తిరిగి వచ్చారు. పిదప (హతుని సోదరుడైన) అబ్దుర్రహ్మాన్ బిన్ సహ్లా (రజి)గారు, మస్‌ఊద్ గారి ఇద్దరు కుమారులైన ముహయ్యసా, హువైసాలను తీసుకుని దైవప్రవక్త(స) సమక్షంలో హాజరయ్యారు. అబ్దుర్రహ్మాన్ (రజి) సంభాషణను మొదలెట్టారు. దానికి దైవప్రవక్త(స), "మీలోని పెద్దవారు ముందు మాట్లాడాలి" అన్నారు. అబ్దుర్రహ్మాన్ వారిలో అందరికన్నా పిన్న వయస్కులు. అందువల్ల ఆయన నిశ్శబ్దంగా ఉండిపోయారు. ముహయ్యసా, హువైసాలిద్దరూ మాట్లాడసాగారు. వారి మాట విన్న తర్వాత, "హంతకుని నుండి మీరు మీ హక్కును రాబట్టాలనుకున్నప్పుడు, అతను హత్య చేసినట్లుగా సాక్ష్యాధారం సమర్పించాలి. మరి మీ దగ్గర సాక్ష్యాధారాలున్నాయా?" అని అడిగారు దైవ ప్రవక్త (స). దానికి వారు, 'మేము కళ్ళారా చూడనిదే అతడు హత్య చేసినట్లు ఎలా ప్రమాణం చేసి చెప్పగలం?' అన్నారు. "మరి అలాగైతే యూదులు యాభైసార్లు ప్రమాణం చేసి అయినా సరే మీ నిందారోపణల నుండి బయట పడగలర"ని దైవ ప్రవక్త(స) చెప్పారు. అవిశ్వాసుల ప్రమాణాలను మేము నమ్మేదెలా? అని వారు విన్నవించుకోగా, దైవప్రవక్త(స) స్వయంగా తన వద్ద నుండి వారికి 'రక్తశుల్కం' (దియత్) ఇచ్చారు.[1]

---

490-1. ఇక్కడ హంతకుడు యూదుడు, హతుడు ముస్లిం. హత్య జరిగింది యూదుల వాడలో. అయినా దైవప్రవక్త(స) ఎంతో ఉదారబుద్ధితో హతుల వారసులకు తన తరఫున రక్త శుల్కం (దియత్) చెల్లించారు. ఎందుకంటే యూదులతో సంధి జరిగి ఉంది. అందువల్ల

## అధ్యాయం : 13

## ఒడంబడికను నెరవేర్చటం- దాని మహత్తు

**491) అబూ సుఫ్యాన్ బిన్ హరబ్(రజి) తెలిపారు:(రోము చక్రవర్తి అయిన) హెరిక్లస్, తనను ఖురైషుల వర్తక బృందంతో సహా అతని దర్బారుకు రమ్మని కబురంపాడు. (ఆ సమయంలో వారంతా వ్యాపార నిమిత్తం సిరియా వెళ్ళి ఉన్నారు). అంతకుముందే దైవప్రవక్త (సఅసం) అబూ సుఫ్యాన్‌తో (హుదైబియా ఒడంబడిక సందర్భంగా) ఖురైషు అవిశ్వాసులలో సంధి చేసుకుని ఉన్నారు.[1]**

## అధ్యాయం : 14

## ఏ 'జిమ్మీ' వ్యక్తి అయినా క్షుద్ర విద్య (చేతబడి) చేస్తే అతన్ని క్షమించవచ్చునా?

**ఏ 'జిమ్మీ' అయినా, ఎవరికయినా 'చేతబడి' చేస్తే అతన్ని హతమార్చవచ్చునా? అని ఇబ్నె షిహాబ్(రజి) గారిని ఎవరో అడగ్గా, ఆయన ఇలా చెప్పారు: మాకు అందిన ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త(సఅసం)పై చేతబడి చేయటం జరిగింది. అయితే దైవప్రవక్త(స) ఈ కారణంగానే చేతబడికి ఒడిగట్టిన వానిని చంపించలేదు.[1] ఆయన(స)కు చేతబడి చేసిన వ్యక్తి గ్రంథవహులలోని వాడు.**

---

శాంతిభద్రతలను కాపాడటం అవసరం అని దైవప్రవక్త(స) భావించారు. ఇలాంటి సంఘటనల నుండి యూదులు గుణపాఠం నేర్చుకోవాల్సింది. కాని వంచనా శిల్ప నిష్ణాతులైన యూదులు తమ వెకిలి చేష్టలను మానుకోలేదు. తత్కారణంగా ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) తన పరిపాలనా కాలంలో వారిపై కఠినచర్య తీసుకోవలసిన అగత్యం ఏర్పడింది.

491–1. హుదైబియా ఒడంబడిక హిజ్రీ 6వ యేట జరిగింది. దీని వివరాలు ఇంతకుముందు హదీసులో వచ్చాయి. "దైవప్రవక్తలు ఒడంబడికను భగ్నపరచరు'' అని హెరిక్లస్ చెప్పాడు. దీని ఆధారంగానే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ అధ్యాయాన్ని ఇక్కడ తీసుకు వచ్చారు. ఒడంబడికను భగ్నం చేయటం, మోసగించటం షరీఅత్‌కు విరుద్ధం.

14–1. ఎందుకంటే దైవప్రవక్త(స) తన వ్యక్తిగత విషయంలో ఎవరిపైనా ప్రతీకారం తీర్చుకోలేదు. అదీగాక ఆ చేతబడి (క్షుద్ర విద్య) వల్ల ఆయన(స)కు పెద్దగా నష్టం వాటిల్లలేదు. కాకపోతే ఏకాగ్రతకు కొంత భంగం కలిగింది. ఒక పని చేయకపోయినా చేశానన్న తలంపు కలిగేది. అల్లాహ్ తొందరగానే ఆయన గారి ఈ బాధను కూడా దూరం చేశాడు. ఆయన(స) ఆ మాంత్రికుణ్ణి చంపించలేదు. అధ్యాయంలోని ప్రధానాంశం ఇదే.

**492) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖనం : ప్రవక్త మహనీయుల(సఅసం)పై చేతబడి చేయబడింది. అందువల్ల ఒక్కోసారి ఆయన(స) ఫలానా పని చేసేశానని తలపోసేవారు. కాని ఆ పని చేసి ఉండేవారు కారు.**

## అధ్యాయం : 15

## మోసం నుండి తప్పించుకోవాలా?

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"(ప్రవక్తా!) ఒకవేళ నిన్ను మోసం చేసే ఉద్దేశ్యమే వారికి ఉంటే, నీకు అల్లాహ్ చాలు. తన సహాయంతోనూ, ముస్లింల ద్వారానూ నిన్ను ఆదుకున్నవాడూ, ఇంకా ముస్లిముల మనస్సులను ఒకదానితో ఒకటి కలిపి ఉంచినవాడూ ఆయనే కదా!"** ***(అల్ అన్‌ఫాల్: 62)***

**493) ఔఫ్ బిన్ మాలిక్(రజి) వివరించారు: నేను తబూక్ యుద్ధ సంద ర్భంగా ప్రవక్త మహనీయుల(సఅసం) సేవలో హాజరయ్యాను. ఆ సమయంలో ఆయన (స) ఒక తోలు గుడారులో ఆసీనులై ఉన్నారు. ఆయన(స) ఇలా ప్రవచిం చారు : "ప్రళయదినానికి సంబంధించిన ఆరు సూచనలను లెక్కించుకోండి– 1) నా మరణం 2) బైతుల్ మఖ్దిస్‌పై విజయం 3) మేకలలో ప్లేగు వ్యాపించినట్లే మీలో ఒక మహమ్మారి చాలా తీవ్రంగా ప్రబలుతుంది 4) (ప్రజా బాహుళ్యంలో) సంపద ఎంత ఎక్కువగా ఉంటుందంటే, ఎవరయినా ఒక వ్యక్తికి వంద దీనార్లు ఇచ్చినా దాంతోనూ అతను సంతోషించడు 5) ఉపద్రవం (కల్లోలం) ఎంతగా సర్వ సామాన్యం అవుతుందంటే, అరేబియాలోని ఏ ఒక్క ఇల్లూ దాని వాతన పడకుండా (సురక్షితంగా) ఉండదు 6) మీకూ– బనీ అస్ఫర్ (రోమను క్రైస్తవుల)కు మధ్యన సంధి జరుగుతుంది. కాని వాళ్ళు మోసంతో ఒక పెద్ద సేనావాహినిని తీసుకుని మీపై దండెత్తి వస్తారు. అందులో ఎనభై ధ్వజాలుంటాయి. ప్రతి ధ్వజం క్రింద పన్నెండు వేల మంది సైనికులుంటారు (అంటే తొమ్మిది లక్షల అరవై వేల మంది సైనికులు మీపై దండయాత్ర చేస్తారు).[1]**

493–1. మొదటి రెండు సూచనలు ఇప్పటికే ప్రస్ఫుటం అయ్యాయి. మూడోది కూడా పూర్తయిం దని అంటారు. హజ్రత్ ఉమర్(రజి) పరిపాలనా కాలంలో పెచ్చరిల్లిన ప్లేగు వ్యాధి వల్ల వేలాది మంది ముస్లింలు మృత్యువాతన పడ్డారు. నాల్గవ సూచన కూడా బహిర్గతం అయింది. ఈరాన్ రోము సామ్రాజ్యాలను జయించిన మీదట ముస్లింలు

## అధ్యాయం : 16
## ఒడంబడికను ఎలా త్రిప్పికొట్టాలి?

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"ఒకవేళ మీకు ఎప్పుడయినా, ఏ జాతి వల్ల నయినా నమ్మకద్రోహం కలుగుతుందనే భయం ఉంటే, బాహాటంగా వారి ఒప్పం దాన్ని వారి ముందు విసిరివేయండి."**[1] ***(అల్ అన్ఫాల్: 58)***

**494) మహనీయ అబూ హురైరా (రజి) కథనం : (అంతిమ హజ్జ్ యాత్రకు పూర్వ సంవత్సరం– హిజ్రీ 9లో జరిగిన హజ్జ్ సందర్భంగా) హజ్రత్ అబూ బక్ర్(రజి) కొంతమందిని 'మినా'లో ప్రకటన చేయడానికి పంపారు. అలా పంపబడిన వారిలో నేనూ ఉన్నాను. ఆ ప్రకటన సారాంశం ఏమిటంటే, ఈ ఏడాది తర్వాత ఏ బహుదైవారాధకుడు కూడా హజ్జ్ చేయడానికి రాకూడదు. మరే వ్యక్తీ కాబా గృహ ప్రదక్షిణ నగ్నంగా చేయరాదు. జిల్‌హజ్జ్ 10వ తేదీ హజ్జె అక్బర్ (పెద్ద హజ్జ్) దినం. దీనిని హజ్జె అక్బర్‌గా ఎందుకు ఖరారు చేశారంటే జనులు (ఉమ్రాను) హజ్జె అస్గర్ (చిన్న హజ్జ్)గా చెప్పుకోసాగారు. ముష్రిక్కులతో జరిగి ఉన్న ఒడం బడికను ఆ సంవత్సరం అబూబక్ర్(రజి) వాపసు చేశారు. మరుసటి సంవత్సరం దైవప్రవక్త(స) హజ్జ్ చేసినప్పుడు ఒక్క బహు దైవారాధకుడు కూడా హజ్జ్‌కు రాలేదు.**[1]

---

సంపన్నులయ్యారు. అయిదవ సూచన బనూ ఉమయ్యా వల్ల ప్రబలిన ఉపద్రవం అని అంటుంటారు. ఆరవ సూచన ప్రళయానికి సమీపంలో సంభవిస్తుంది. ఈ హదీసు ఆధారంగా ఇమామ్ బుఖారీ (రహ్మ) వెలికితీసిన అంశం ఏమిటంటే అవిశ్వాసులు మోసంతో మిమ్మల్ని ఏమార్చవచ్చు. మీకు నష్టం కలిగించవచ్చు. ఇలాంటి మోసపూరిత చర్యలు ప్రళయానికి ముందు సర్వసామాన్యం అయిపోతాయి.

16–1. అంటే ఇక మీదట మీతో మాకు స్నేహ సంబంధాలు ఉండవు అని చెప్పి వేయటం అన్నమాట. అంతేగాని అకస్మాత్తుగా వారిపై దండెత్తటం అని అర్థం ఎంతమాత్రం కాదు.

494–1. నిజానికి 'హజ్జ్' పేరే 'హజ్జె అక్బర్' అని ఈ హదీసు ద్వారా నిరూపితం అయింది. 'అరఫా దినం' శుక్రవారం నాడు వస్తే, అది హజ్జె అక్బర్ అవుతుందన్న విషయం ప్రజా బాహుళ్యంలో సర్వసామాన్యం అయింది. కాని దీనికి ఎలాంటి ఆధారం లేదు.

## అధ్యాయం : 17

## ఒడంబడిక చేసుకున్న తర్వాత నమ్మకద్రోహం చేసేవానికి అయ్యే పాపం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **వారిలో నీవు ఒప్పందం కుదుర్చుకున్నవారు; అవకాశం దొరికినప్పుడల్లా వారు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారు. అల్లాహ్‌కు ఏమాత్రం భయపడరు.** ***(అల్ అన్‌ఫాల్ : 56)***

**495) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) తెలిపారు: "నాలుగు(చెడు) అలవాట్లు ఎటువంటివంటే, అవన్నీ గనక ఎవరయినా ఒక వ్యక్తికి అబ్బితే అతడు కరడుగట్టిన కపటి అన్నమాటే- (అవేమంటే) 1) అతడు మాట్లాడితే అబద్ధం చెబుతాడు 2) వాగ్దానం చేస్తే దానిని భంగపరుస్తాడు 3) ఒడంబడిక చేసుకుంటే దానిని నెరవేర్చడు 4) ఎవరితోనయినా తగవు పడితే తిట్లకు దిగుతాడు. ఒకవేళ ఏ వ్యక్తిలోనయినా ఈ నాలుగు (చెడు) అలవాట్లలో ఏ ఒక్కటి ఉన్నా, అతనిలో కాపట్యానికి సంబంధించిన ఒక (చెడు) గుణం ఉన్నట్లే- అతను దానిని విడనాడనంతవరకూ ఆ కాపట్య గుణం (నిఫాఖ్) అతన్ని వెంటాడుతూనే ఉంటుంది."[1]**

**496) మహనీయ అలీ (రజి) కథనం: మేము ప్రవక్త మహనీయుల (సఅసం) నుండి ఈ ఖుర్‌ఆన్‌నే, ఇంకా ఈ పత్రంలో ఉన్న దానినే వ్రాసుకున్నాము. ప్రవక్త మహనీయులు(స) ఇలా ప్రవచించారు : "మదీనా నగరం ఆయిర్ పర్వతం నుండి ఫలానా పర్వతం వరకు పవిత్రం (నిషిద్ధం, హరమ్)గా ఖరారయింది. కాబట్టి ఎవరయినా ఇక్కడ (ధర్మంలో) ఏదయినా కొత్త విషయాన్ని ప్రవేశపెడితే లేదా అలాంటి కొత్త పుంతలు తొక్కేవాడినెవడికయినా 'ఈ పరిధి'లో ఆశ్రయం కల్పిస్తే అతనిపై దేవుడు, దైవదూతలు, సమస్త మానవుల శాపం పడుతుంది. అతని ఏ ఫర్జ్ ఆరాధన గానీ, నఫిల్ ఆరాధన గానీ స్వీకృతి పొందదు. ఆశ్రయం కల్పించ డంలో (శరణు ఇవ్వటంలో) ముస్లిములంతా సమానులే. అతి సామాన్యమైన ముస్లిం**

495-1. ఈ హదీసు వివరణ ఇంతకుముందు 'విశ్వాస ప్రకరణం'లో వచ్చింది. ఇక్కడ ఈ హదీసును ఇమామ్ బుఖారీ (రహ్మ) పునరావృతం చేయటంలోని ఉద్దేశం; ఒడంబడికను ఉల్లంఘించటం, నమ్మకద్రోహం చేయడం కూడా కాపట్యం (నిఫాఖ్)లో ఒక భాగం అని చెప్పటమే.

కూడా ఎవరయినా ఒక అవిశ్వాసికి ఆశ్రయం ఇవ్వగలడు. మీరెవరయినా ఒక ముస్లింతో చేసుకున్న ఒప్పందాన్ని భగ్నపరిస్తే అతనిపై దేవుడు, దైవదూతలు, సమస్త మానవుల శాపం పడుతుంది. అతని విధిత (ఫర్జ్) ఆరాధనలుగానీ, స్వచ్ఛంద (నఫిల్) ఆరాధనలు గానీ ఆమోదించబడవు. ఇంకా మరే బానిస అయినా లేక బానిస స్త్రీ అయినా తన యజమాని అనతి లేకుండా వేరెవరినయినా తన యజమానిగా చేసుకుంటే అలాంటి వారిపై దేవుని శాపం, దైవదూతల శాపం, మానవులందరి శాపం పడుతుంది. వారి ఏ ఫర్జ్ ఆరాధన గానీ, నఫిల్ ఆరాధన గానీ (దైవ సన్నిధిలో) ఆమోదముద్ర పొందదు.

(వేరొక సనదు)

మహనీయ అబూ హురైరా (రజి) ఇలా అన్నారు : "(జిజ్‌యా సొమ్ములలో నుండి) మీకు దీనారుగానీ, దిర్హము గానీ లభించనప్పుడు మీ పరిస్థితేం కాను?" దానిపై ఒకరు, 'అయ్యా! అబూ హురైరా! ఇలా జరుగుతుందని మీరెందుకు తలపోస్తున్నారు?' అని సందేహపడగా, అబూ హురైరా (రజి) ఇలా విడమరచి చెప్పారు : "ఏ శక్తిమంతుని చేతిలో అబూహురైరా ప్రాణం ఉందో ఆయన సాక్షి! సచ్ఛీలుడు (సాదిక్) చెప్పగా నాకీ సంగతి తెలిసింది. మరి ఆ సచ్ఛీలుని(సఅసమ్)కి సత్యమే చెప్పబడింది" 'ఇలా ఎందుకు జరుగుతుంది?' అని జనులు ఆయన్ని అడిగితే, "ఎందుకంటే అల్లాహ్, ఆయన ప్రవక్త ఒప్పందాన్ని ఉల్లంఘించటం జరుగుతుంది (అంటే మీ ధన మాన ప్రాణాలకు రక్షణ కల్పిస్తామని 'జిమ్మీ' ముస్లిమేతరులకు ఇచ్చిన హామీని మీరు నిలుపుకోరు) అందువల్ల అల్లాహ్ కూడా 'జిమ్మీల'ను కఠిన మనస్కులుగా చేసేస్తాడు. వారు జిజ్‌యా చెల్లించటం మానేస్తారు (పైగా మీ మీద కయ్యానికి కాలు దువ్వుతారు).

## అధ్యాయం : 18

**497)** ఆమష్ ఇలా అనేవారు : '(అలీకి-ముఆవియాకి మధ్య) సిఫ్ఫీన్ యుద్ధం జరిగినప్పుడు మీరు అక్కడ ఉన్నారా?' అని నేను అబూ వాయల్‌ని అడిగితే, ఆయన ఇలా చెప్పారు : "అవును (నేను ఉన్నాను). ఆ సందర్భంగా సహ్లా బిన్

**హునైఫ్ (రజి) ఇలా చెబుతూ ఉండగా నేను విన్నాను– 'మీరు స్వయంగా మీ అభిప్రాయం తప్పు అని భావించండి (ఎందుకిలా పరస్పరం కత్తులు దూసుకుని వస్తున్నారు?) ఏ రోజున (హుదైబియా ఒడంబడిక దినమున) అబూ జందల్ వచ్చాడో, అప్పుడే నేను దైవప్రవక్త(స) ఆజ్ఞను మళ్ళించగలిగితే, ఆ రోజునే మళ్ళించి ఉండేవాడిని.[1] మేమెప్పుడూ ఏదేని భయోత్పాతానికి భయపడి మా ఖడ్గాలను మా భుజాలపై ఉంచుకోలేదు. ఒక కార్యానికి సత్పరిణామం వెలువడే ఆశ ఉన్నప్పుడే మేము నిగ్రహం పాటించాము. అయితే ఈ వ్యవహారంలో (సిఫ్ఫీన్ యుద్ధంలో) మాత్రం పరిణామం ఎలా ఉండబోతుందో నేను చెప్పలేను (పరిస్థితి సంక్లిష్టంగా ఉంది)'.**

**498) అబూ వాయల్ వివరించారు: మేము 'సిఫ్ఫీన్' ప్రదేశంలో గుడారాలు వేశాము. అప్పుడు సహ్ల్ బిన్ హునైఫ్ నిలబడి ఇలా ఉపన్యసించారు: ప్రజలారా! మీరు స్వయంగా మీ అభిప్రాయం తప్పని భావించండి. మనం హుదైబియా ఒడంబడిక సందర్భంగా దైవప్రవక్త(స) వెంట ఉన్నాము. యుద్ధం అనివార్యం అనుకుంటే అప్పుడే తప్పక యుద్ధం చేసేవారం. ఆ సందర్భంగా ఉమర్ వచ్చి, 'దైవప్రవక్తా! మనం సత్యంపై లేమా? వారు అసత్యవాదులు కారా?' అని అడిగారు. "ఎందుకు కారు?" అని దైవప్రవక్త(స) బదులిచ్చారు. 'ఏమీ, మన శిబిరంలోని హతులు స్వర్గంలో ప్రవేశించగా, వారి శిబిరంలోని హతులు నరకాగ్నికి ఆహుతి అవరా?' అని ఉమర్ ప్రశ్నించారు. "ఎందుకు అవరు?" అని దైవప్రవక్త(స) బదులిచ్చారు. 'మరలాంటప్పుడు మనం మన ధర్మం (దీన్) విషయంలో అణగిమణగి ఉండాల్సిన అవసరం ఏముంది? మనం (మదీనాకు) తిరిగి వెళ్ళి పోవాల్సిందేనా? అల్లాహ్ మనకూ– వారికీ మధ్యన తీర్పు చేయడా? అని ఉమర్(రజి) ప్రశ్నించగా,**

497–1. అంటే, ఖురైషులతో వీరోచిత పోరాటం చేసేవాణ్ణి. ఎందుకంటే వారు ఆ రోజు ముస్లింల యెడల ఎంతో అవమానకరంగా ప్రవర్తించారు. కాని దైవప్రవక్త(స) మాత్రం యుద్ధం సమంజసం కాదని భావించారు. మేము దైవప్రవక్త(స) ఆజ్ఞకు బద్ధులమై సంయమనం పాటించాము. అలాగే దైవప్రవక్త(స) ముస్లింలపై చెయ్యెత్తడాన్ని వారించారు. సిఫ్ఫీన్ యుద్ధ రంగంలో మీరు ఎందుకు దూకటం లేదు? అని జనులు విమర్శించినప్పుడు సహ్ల్ (రజి) పలికిన మాటలివి.

**"ఖత్తాబ్ పుత్రుడా! నేను దైవ సందేశహరుడను. అల్లాహ్ నన్నెన్నటికీ వృధా గావించడు" అని ఆయన(స) సమాధానమిచ్చారు. ఆ తర్వాత హజ్రత్ ఉమర్(రజి) అబూబక్ర్(రజి) దగ్గరకు వెళ్ళారు. దైవప్రవక్త(స)కు వేసిన ప్రశ్నలే అబూబక్ర్(రజి)కు కూడా వేశారు. ఆయనా అదే సమాధానమిచ్చారు- ముహమ్మద్(స) దైవప్రవక్త అనీ, అల్లాహ్ ఆయన్ని వృధా గావించడని! పిదప అల్ ఫత్హ్ సూరా అవతరించింది. దైవప్రవక్త(స) ఆ సూరాను ఉమర్(రజి)కు మొదటి నుంచీ చివరి వరకూ వినిపించారు. ఇది విన్న ఉమర్(రజి), 'ఏమిటి, ఇది విజయమా!?' అన్నారు ఆశ్చర్య చకితులై. "అవును, ఖచ్చితంగా ఇది స్పష్టమైన విజయమే" అని దైవప్రవక్త(స) చెప్పారు.[1]**

**499) అస్మా బిన్తె అబీబక్ర్(ర.అ) తెలిపారు: దైవప్రవక్త(సఅసం)కు- ఖురైషులకు మధ్య సంధి (హుదైబియా ఒడంబడిక) జరిగి ఉన్న కాలంలో నా తల్లి (ఖుతైలా) తన తండ్రి (హారిస్ బిన్ మద్రక్)తోపాటు నా దగ్గరకు వచ్చింది. ఆమె ఇస్లాం స్వీకరించలేదు. ఈ విషయమై నేను దైవప్రవక్త(స)ను సంప్రదించాను. 'దైవప్రవక్తా! నా తల్లి వచ్చింది. మమకారంతో ఆమె నన్ను కలుసుకోవాలనుకుంటోంది. మరైతే నేను ఆమె పట్ల ఉత్తమ రీతిలో వ్యవహరించగలనా? (బంధుత్వ హక్కును ఇవ్వగలనా?)' అని అడిగితే, "అవును. ఆమెకు రక్త సంబంధపు హక్కును ఇవ్వు"[1] అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు.**

## అధ్యాయం : 19

## మూన్నాళ్ళ కొరకు లేదా ఒక నిర్ణీత వ్యవధి కొరకు సంధి చేసుకోవటం

**500) బరా బిన్ ఆజిబ్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం)**

---

498-1. ఇక్కడ ఈ సంఘటనను ఉదహరించటంలో హజ్రత్ సహ్ల్ (రజి) ఉద్దేశం ఏమిటంటే, దైవసందేశహరులే(సఅసం) సత్య తిరస్కారులను మార్కోడానికే తొందరపడనప్పుడు, వారితో సంధి చేసుకున్నప్పుడు, ముస్లిములైన మీరు పరస్పరం కత్తులు దూసుకోవడానికి ఎందుకింతగా ఆరాటపడుతున్నారు? అసలీ యుద్ధం ధర్మసమ్మతమో కాదో బాగా ఆలోచించుకోండి. దీని పరిణామం ఎలా ఉండబోతుందో కూడా కాస్త ఊహించండి-

499-1. ఆమె తల్లి ముస్లిం కాదు. కాని కన్నతల్లి. అదీగాక, ఆ రోజుల్లో అవిశ్వాసులైన ఖురైషులకు- దైవప్రవక్త(స)కు మధ్య నిర్యుద్ధ సంధి జరిగి ఉంది. ఈ కారణంగా కూడా ఆమె పట్ల సత్ప్రవర్తన అవసరం. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం.

'ఉమ్రా' చేయదలచినప్పుడు, మక్కాలో ప్రవేశానికి అనుమతి పొందేందుకు మనిషిని పంపారు. మక్కాలో మూడు రోజులకు మించి విడిది చేయరాదన్న షరతుపై వారు అనుమతి ఇచ్చారు. ఆ సందర్భంగా ఖడ్గాలు ఒరల్లోనే ఉంచి నగరంలో ప్రవేశించాలి. ఎవరయినా తమ వెంట రాదలచినాసరే, ఏ ఒక్క మక్కావాసినీ తమ వెంట బెట్టుకుని వెళ్ళరాదు– ఆయన ఇంకా ఇలా వివరించారు : ఈ షరతులను (సంధి పత్రంపై) అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) రాయటం మొదలెట్టారు– "దైవ సందేశహరుడగు ముహమ్మద్ తరపున వ్రాయించి ఇవ్వబడిన సంధి పత్రమిది..." దీనిపై మక్కావారు అభ్యంతరం తెలుపుతూ, "మీరు దైవసందేశహరులని మేము తెలుసుకోగలిగితే మిమ్మల్ని ఎందుకు అడ్డుకుంటాము? పైగా మిమ్మల్ని విశ్వసించేవారము. కాబట్టి ఈ వ్రాత ఇలా ఉండాలి... ఇది అబ్దుల్లాహ్ కుమారుడగు ముహమ్మద్ వ్రాయించి ఇచ్చిన సంధి పత్రం..." దానిపై దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "నేను అబ్దుల్లాహ్ కుమారుణ్ణి అన్నదానికి అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు. అలాగే నేను అల్లాహ్ సందేశహరుణ్ణి అన్నదానికి కూడా అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు"– దైవప్రవక్త(స)కు వ్రాయటం రాదు. ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు : "దైవసందేశహరుడు (స) అన్న పదాన్ని చెరిపివెయ్యి అని దైవప్రవక్త(స) అలీని ఆజ్ఞాపించారు. దానికి అలీ (రజి) 'దైవసాక్షి! ఈ పదాన్ని నేనెన్నటికీ చెరపను' [1] అన్నారు. "అలాగైతే ఆ పదం ఎక్కడుందో నాకు చూపించు" అని దైవప్రవక్త(స) అడగ్గా, అలీ (రజి) ఆ పదాన్ని దైవప్రవక్త(స)కు చూపించారని ఉల్లేఖకుడు తెలిపారు. దైవప్రవక్త(స) స్వయంగా తన చేత్తో దానిని చెరిపివేశారు. అనంతరం దైవప్రవక్త(స) మక్కా వెళ్ళారు. మూడు రోజులు గడిచిన తర్వాత ఖురైషులు హజ్రత్ అలీ (రజి) దగ్గరకు వచ్చి, 'ఇక ఇక్కణ్ణుంచి దయచేయమని మీ సహవాసికి చెప్పండి' అని కోరారు. (అలీ–రజి– ఇలా అన్నారు) నేనీ

500–1. 'ఆ పదాన్ని నేను చెరపను' అని హజ్రత్ అలీ(రజి) నిర్ద్వంద్వంగా పలకటం ధిక్కార వైఖరి క్రిందికి రాదు. పైగా దైవప్రవక్త(స) యెడల అభిమానంతో, శ్రేయోభిలాషతో ఆయన అలా అన్నారు. అలాగే దైవప్రవక్త(స) మరణవ్యాధికి గురై ఉన్నప్పుడు, ఏదైనా పత్రం తీసుకురండి అన్న ప్రవక్త ఆదేశాన్ని హజ్రత్ ఉమర్(రజి) లక్ష్యపెట్టకపోవటం కూడా అవిధేయత క్రిందికి రాదు. దైవప్రవక్త(స) అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన అలా వ్యవహరించారు.

విషయం దైవప్రవక్త(స) ముందు ప్రస్తావించగా, 'సరే' అంటూ ఆయన(స) అక్కణ్ణుంచి బయలుదేరారు.

## అధ్యాయం : 20

## సంధి : నిరవధిక గడువు

దైవప్రవక్త(సఅసం) ఖైబర్‌లోని యూదులనుద్దేశించి, "అల్లాహ్ కోరినంత కాలం నేను మిమ్మల్ని ఇక్కడ ఉండనిస్తాను" అని అన్నారు.

## అధ్యాయం : 21

## ముష్రిక్కుల మృతదేహాలను బావిలో పడవేయటం- వారి మూల్యం తీసుకోకపోవటం

**501)** అబ్దుల్లాహ్ (రజి) కథనం : మక్కాలో జరిగిన ఒక సంఘటన. (ఇస్లామ్ తొలి కాలమది) దైవప్రవక్త(స) 'సజ్దా' స్థితిలో ఉన్న సమయంలో దగ్గరలోనే ఖురైష్ ప్రముఖులు కూర్చుని ఉన్నారు. అంతలో ఉఖబా బిన్ అబీ ముఅయ్‌త్ ఒంటె పొట్టలోని ప్రేగులు (కసువుతో సహా) తెచ్చి దైవప్రవక్త(స) వీపుపై పడవేశాడు. దైవప్రవక్త(స) సజ్దా స్థితి నుండి తన తలను ఎత్తలేకపోయారు. చివరకు ఫాతిమా (ర.అ) వచ్చి ఆయన(స) వీపు మీద ఉన్న కసువును తొలగించారు. ఆ దుశ్చేష్టకు ఒడిగట్టిన వ్యక్తికి చీవాట్లు పెట్టారు. దైవప్రవక్త(స) కూడా వారిని శపిస్తూ, "ఓ దేవా! ఖురైషుల ఈ సమూహాన్ని పట్టుకో. ఓ అల్లాహ్! అబూ జహ్లా బిన్ హిషామ్‌ను, ఉతబా బిన్ రబీయాను, ఉఖబా బిన్ అబీ ముఅయ్‌త్‌ను, ఉమయ్యా బిన్ ఖలఫ్ లేదా ఉబై బిన్ ఖలఫ్‌ను నాశనం చెయ్యి" అని వేడుకున్నారు. ఆ తర్వాత (కొంత కాలానికి) వారంతా బద్ర్ సంగ్రామంలో వధించబడటం నేను కళ్ళారా చూశాను. వాళ్ళందరినీ బావిలో పడవేయటం జరిగింది–[1] ఒక్క ఉమయ్య లేదా ఉబై మినహా. ఆ వ్యక్తిది భారీకాయం. ప్రవక్త సహచరులు అతని మృతదేహాన్ని లాగితే బావిలో పడవేయక ముందే అతని కళేబరంలోని ఏ భాగానికాభాగం వేరై పోయింది.

---

501–1. ఈ హదీసు ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మ) వెలికి తీసిన ముఖ్యాంశం ఏమిటంటే దైవప్రవక్త(స) ఆ ఖురైషు ప్రముఖుల మృతదేహాలను సొమ్ము చేసుకోలేదు. ఆయన గనక తలిస్తే ఖురైషుల నుండి మూల్యం తీసుకుని మృతదేహాలను వారికి అప్పగించేవారు. కాని అలా చేయలేదు.

## అధ్యాయం : 22

## నమ్మకద్రోహం చేసిన వానికి పాపం. నమ్మకద్రోహం మంచి వానికి చేసినా, దుర్మార్గునికి చేసినా ద్రోహం ద్రోహమే

**502)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ప్రవచించారని హజ్రత్ అనస్(రజి) తెలిపారు "ప్రళయదినాన ప్రతి నమ్మకద్రోహి కొరకు ఒక జెండా ఉంటుంది". ఒక ఉల్లేఖకుడు ఏమంటారంటే ఆ జెండా అతని వెనుక పాతిపెట్టబడు తుంది. మరో ఉల్లేఖకుడు ఇలా అన్నారు : అతనిని ప్రళయదినాన అందరూ చూస్తారు. జెండా ఆధారంగా అతడు నమ్మకద్రోహి అని తెలుసుకుంటారు.

**503)** ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా తాను విన్నానని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు. ఆయన(స) ఇలా చెప్పారు : 'ప్రతి నమ్మకద్రోహి కొరకు ప్రళయదినాన– అతని నమ్మకద్రోహానికి తగ్గట్టుగా– ఒక జెండా (అతని వెనుక) పాతిపెట్టబడుతుంది." [1]

**504)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖించారు : మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మక్కా విజయం రోజున ఇలా వక్కాణించారు : "ఇక మీదట (మక్కా నుండి) హిజ్రత్ విధిగా ఉండదు. కాకపోతే జిహాద్ సంకల్పం, జిహాద్ ఆజ్ఞ మిగిలి ఉంది. కనుక మిమ్మల్ని జిహాద్ కొరకు బయల్దేరమని అన్నప్పుడు వెంటనే బయల్దేరండి"– దైవప్రవక్త(స) మక్కా విజయం నాడు ఈ విధంగా కూడా చెప్పారు: "అల్లాహ్ ఏ రోజున భూమ్యాకాశాలను సృష్టించాడో, అదే రోజున ఈ నగరము (మక్కా)ను 'హరమ్' (పవిత్రం, నిషిద్ధం)గా ఖరారు చేశాడు. కాబట్టి ఈ నగరం దేవుడు ఖరారు చేసిన పవిత్రతతోపాటు ప్రళయం వరకూ పవిత్రంగానే ఉంటుంది. నాకు పూర్వం ఇక్కడ ఎవరికీ యుద్ధం చేయటం ధర్మసమ్మతంగా ఉండేది కాదు. నాకైనా దినములో కేవలం ఒక గడియ కాలం మాత్రమే ధర్మసమ్మతం చేయబడింది. కనుక ఇప్పుడు ఈ శుభప్రదమయిన నగరం అల్లాహ్ విధితం గావించిన పవిత్రతతో

---

503–1. అన్యాయంగా రక్తపాతం సృష్టించటం, నమ్మకద్రోహంతో ఒకరిని చంపటం, ధరణిలో కల్లోలం రేకెత్తించటం ఎట్టి పరిస్థితిలోనూ సమ్మతం కాదు. ఎవరయినా ఈ అమానుషానికి ఒడిగట్టినట్లయితే దాని శిక్షను వారు అనుభవించక తప్పదు.

**సహా ప్రళయకాలం వరకు పవిత్రమైనదే. దీని పరిధిలోనున్న (బాధాకరంకాని) ఏ ముల్లునూ తుంచరాదు, ఇక్కడి వేట జంతువులను బెదిరించటంగానీ, క్రింద పడివున్న వస్తువును ఎత్తుకోవటంగానీ చేయరాదు. (ఆ వస్తువును దాని యజమాని వరకూ చేర్చేందుకు) ప్రకటన చేసే వ్యక్తి తప్ప. ఇక్కడి పచ్చగడ్డి కూడా కోయరాదు." 'అయ్యా దైవప్రవక్తా! ఇజ్ఖిర్ గడ్డిని కోసుకునేందుకు అనుమతి ప్రదానం చేయండి. అది ఇక్కడి కంసాలులకు ఉపయోగపడుతుంది. ఇళ్ళ కప్పులకు వేసుకునేందుకు కూడా పనికి వస్తుంది' అని హ్రజత్ అబ్బాస్(రజి) విజ్ఞప్తి చేయగా, "సరే. ఇజ్ఖిర్ విషయంలో అనుమతి ఉంటుంది"[1] అని ఆయన(స) అన్నారు.**

---

504–1. ఈ హదీసు ఇంతకుముందు కూడా అనేకసార్లు వచ్చింది. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ ఎత్తిచూపదలచిన ప్రధానాంశం ఏమిటంటే, మక్కా నగరిలో రక్తపాతం సృష్టించే అనుమతి ఎవరికీ లేకపోయినప్పటికీ మక్కాజనులు దైవప్రవక్త(స)తో చేసుకున్న నిర్యుద్ధ సంధి షరతును ఉల్లంఘించారు. ఒప్పందాన్ని భగ్నపరిచారు– బనూ బకర్ తెగవారితో కుమ్మక్కై బనూ ఖుజాఅ తెగ వారిపై కయ్యానికి కాలుదువ్వారు. అందుచేత అల్లాహ్ ఆ పవిత్ర నగరిలో సయితం– ఆ నేరానికి శిక్షగా– కొన్ని నిమిషాలపాటు తన ప్రవక్తకు నమ్మకద్రోహులను చంపటానికి ఆనతినిచ్చాడు. దీనినిబట్టి నమ్మకద్రోహం ఎటువంటి మహాపాతకమో విదితమవుతోంది.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 8. సృష్టి ఆరంభ ప్రకరణం

## అధ్యాయం : 1

దైవగ్రంథంలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : **ఆయనే మొదటిసారి సృష్టిని ప్రారంభిస్తాడు. మరి మలిసారి (మరణానంతరం) దానిని సృష్టించేది కూడా ఆయనే. ఇది ఆయనకు మరింత సులభతరం. (అర్ రూమ్: 27)**

**505) ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) ఉల్లేఖించారు: బనీ తమీమ్ తెగకు చెందిన కొంతమంది దైవప్రవక్త(సఅసం) సన్నిధిలో హాజరయ్యారు. అప్పుడాయన (స) వారితో, "ఓ బనీ తమీమ్ తెగవారలారా! మీకు శుభవార్త" అన్నారు. దానికి వారు, 'మీరు మాకు శుభవార్త ఎలాగూ ఇచ్చారు కాబట్టి, మాకిక కొంత సొమ్ము కూడా ఇవ్వండి' అని చెప్పారు. ఈ మాట వినగానే దైవప్రవక్త(స) ముఖారవిందం రంగు మారిపోయింది. అంతలోనే ఆయన(స)సేవలో కొంతమంది యమన్ వాసులు వచ్చారు. ఆయన(స)వాళ్ళను కూడా ఉద్దేశించి, "ఓ యమన్ ప్రజలారా! బనూ తమీమ్ తెగవారు శుభవార్తను ఎలాగూ స్వీకరించలేదు. మీరైనా దానిని స్వీకరించండి" అని పలకగా, 'చిత్తం. మేము స్వీకరించామ'ని వారు సమాధాన మిచ్చారు. ఆ తరువాత ఆయన(స) సృష్టితాల గురించి, దైవ సింహాసనం సృష్టి గురించి సంభాషించసాగారు. అంతలోనే ఒక అపరిచిత వ్యక్తి వచ్చి 'ఇమ్రాన్! మీ ఒంటె పారిపోయింది' అని చెప్పాడు. (ఇమ్రాన్–రజి– ఇలా అన్నారు) 'అయ్యో! నేను ఆయన(స) సభ నుంచి లేచి వెళ్ళకపోతే బాగుండేది!'[1]**

---

505–1. ఇస్లామ్ స్వీకరించిన కారణంగా పరలోకంలో సాఫల్యం పొందుతారన్న శుభవార్తను దైవప్రవక్త(స) బనూ తమీమ్‌కు వినిపించారు. కాని బనూ తమీమ్ తెగవారు తమ

**506) ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) కథనం : నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) సేవలో హాజరయ్యాను. నా ఒంటెను నేను (మస్జిద్) ద్వారం వద్దనే కట్టాను. తర్వాత బనూ తమీమ్ తెగకు చెందిన కొంతమంది దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చారు. ఆయన(స) వారితో, "బనూ తమీమ్ తెగవారలారా! శుభవార్తను స్వీకరించండి" అన్నారు. దానికి ఆ తెగవారు రెండుసార్లు, 'తమరు మాకు శుభవార్త ఎలాగూ వినిపిస్తున్నారు కాబట్టి, ఇప్పుడు ధనం కూడా ఇవ్వండి' అని అన్నారు. అంతలోనే యమన్ ప్రాంతం నుండి కొంతమంది దైవప్రవక్త(స) వద్దకు వచ్చారు. ఆయన(స) వారినుద్దేశించి, "శుభవార్తను స్వీకరించండి యమన్ వారలారా! బనూ తమీమ్ తెగవారైతే దానిని స్వీకరించలేదు" అని పలికారు. దానికి వారు, 'దైవప్రవక్తా! శుభవార్తను మేము సంతోషంగా స్వీకరించామ'ని బదులిచ్చారు. తరువాత వారు తమ రాకలోని ఉద్దేశాన్ని తెలియజేస్తూ, 'ఈ సృష్టి ఆరంభం గురించి మిమ్మల్ని అడుగుదామని వచ్చాము' అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా చెప్పారు : "అల్లాహ్ ఆది నుంచే ఉన్నాడు. ఆయన తప్ప మరే వస్తువూ ఉండేది కాదు. ఆయన సింహాసనం నీటిపై ఉండేది. సురక్షిత ఫలకంపై ఆయన ప్రతిదీ వ్రాసుకున్నాడు. పిదప అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించాడు"[1] (ఈ సంభాషణ జరుగుతుండగానే) అకస్మాత్తుగా ప్రకటన చేసే ఒక వ్యక్తి 'ఓ ఇబ్నె హుసైన్! మీ ఒంటె పారిపోయింది' అని కేకేశాడు. నేను ఆ ఒంటె వెనకాలే పరుగెత్తాను. తీరా చూడబోతే అది ఎండ మావి (అంటే మండుటెండలో నీళ్ళలా మెరిసే ఇసుక) మాటున ఉంది. దైవసాక్షి! నేనెంతో మనో వ్యాకులతకు లోనయ్యాను- అయ్యో! నేను దీనిని వదలివేస్తే ఎంత బాగుండేది (ఎంచక్కా దైవప్రవక్త చెప్పిన హదీసు వినగలిగేవాణ్ణి) అనుకున్నాను.**

---

అవివేకం వల్ల ఆ శుభవార్తలోని మర్మాన్ని గ్రహించలేక, తమకు ప్రాపంచిక సొమ్ము ఇవ్వబోతున్నారని తలపోశారు. వారి మూర్ఖత్వంపై దైవప్రవక్త(స) ఆవేదన చెందారు. సొమ్ము అడిగిన ఆ వ్యక్తి అఖ్రా బిన్ హాబిస్ అనే అనాగరికుడని అనబడుతోంది.

506-1. ఈ హదీసు ద్వారా అవగతమయ్యేదేమిటంటే ఒక్క అల్లాహ్ తప్ప ప్రతిదీ అస్థిరమే, కొత్తగా సృష్టించబడినదే. నింగికీ, నేలకూ పూర్వమే అల్లాహ్ అస్థిత్వం ఉండేది. ఇంకా ఈ హదీసు ద్వారా విదితమయ్యేదేమిటంటే అల్లాహ్ అన్నింటికన్నా ముందు నీటిని సృష్టించాడు. ఆ తర్వాత భూమ్యాకాశాలు ఉనికిలోనికి వచ్చాయి.

**ఉమర్ బిన్ ఖత్తాబ్ ఇలా అన్నారు : ఒకసారి దైవప్రవక్త(స) వేదికపై నిలబడి ప్రసంగిస్తూ, సృష్టి ఆరంభం గురించి మాకు తెలియజేశారు. చివరకు స్వర్గవాసులు తమ తమ గమ్యానికి చేరుకుంటారు. నరకవాసులు కూడా తమ తమ స్థావరాలకు చేరుకుంటారు (ఇక్కడి వరకు ఆయన వివరంగా చెప్పారు)– ఇక ఈ హదీసును జ్ఞాపకం ఉంచుకోవాల్సిన వారు జ్ఞాపకం ఉంచుకున్నారు. మరచిపోవలసిన వారు మరచిపోయారు.**

**507) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు– అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు– "ఆదం పుత్రుడు (ఎంతగా బరితెగించిపోయాడు! అతడు) నన్ను దూషించాడు. నన్ను దూషించటం అతనికి ఎంతమాత్రం శోభాయమానం కాదు. అతను నన్ను అబద్ధీకరించాడు. ఇది అతనికి ఎంతమాత్రం సమంజసం కాదు. ఇంతకీ అతని దూషణ ఏమిటంటే; నాకు కుమారుడున్నాడని అతను అంటున్నాడు. నన్ను అబద్ధీకరించటమంటే, అల్లాహ్ తనను మొదటిసారి పుట్టించినట్లుగా మలిసారి (మరణానంతరం) పుట్టించడు అని అతను చెబుతున్నాడు."**

**508) ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: అల్లాహ్ ఈ సృష్టిని సృష్టించినప్పుడు, తన సింహాసనం (అర్ష్) పైనున్న తన గ్రంథం (లౌహె మహ్ఫూజ్)లో, "నా కారుణ్యం నా క్రోధంపై ఆధిపత్యం వహించి ఉంది" అని లిఖించాడు.**

## అధ్యాయం : 2

## ఏడు భూభాగాల గురించి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **సప్తాకాశాలనూ, అలాంటివే ఎన్నో భూములనూ సృష్టించిన వాడు అల్లాహ్‌యే. వాటిపై అల్లాహ్ ఆజ్ఞ అవతరిస్తూ ఉంటుంది. అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం కలిగి ఉన్నాడనీ, అల్లాహ్ జ్ఞానం ప్రతి వస్తువును పరివేష్టించి ఉన్నదని మీరు తెలుసుకోవడానికి.** ***(అత్ తలాఖ్ : 12)***

**తూర్ సూరాలో వస్సఖ్ఫిల్ మర్ఫూయి అని వచ్చింది. దీనికి ఆకాశం అని అర్థం. అన్నాజియాత్ సూరాలో రఫఅ సమ్కహా అని ఉంది. సమ్కహా అంటే నిర్మాణం, కట్టడం అని అర్థం. అజ్జారియాత్ సూరాలో హుబుకి అనే పదం**

**వచ్చింది. సమానం అవటం, చదునుగా ఉండటం అని దీనికి అర్థం. ఇన్‌షిఖాఖ్ సూరాలో 'అజినత్' అనే పదం వచ్చింది. దీనికి ఆలకించాడు, ఆమోదించాడు అన్న అర్థాలొస్తాయి. అల్‌ఖత్ అంటే భూమి తన లోపల ఉన్న మృతులందరినీ బయట పడవేసి ఖాళీ అయిపోయిందని అర్థం. అష్ షమ్స్ సూరాలో తహాహా అనే పదం వచ్చింది. తహాహా అంటే 'పరచాడు' అన్న అర్థం వస్తుంది. అన్ నాజియాత్ సూరాలో బిస్సాహిరతి అని వచ్చింది. దీనికి భూమండలం అని అర్థం. అక్కడే ప్రాణులు నిద్రిస్తాయి, మేల్కొంటాయి.**[1]

**509) అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ గారికి ఒకానొక భూమి వ్యవహారంలో మరొక వ్యక్తితో వివాదం ఉండేది. ఆ వ్యక్తి హజ్రత్ ఆయిషా(ర.అ) దగ్గరకు వచ్చి, ఆ వివాదం పుట్టుపూర్వోత్తరాలన్నీ వివరించారు. (సమాధానంగా) ఆమె ఇలా అన్నారు: అబూ సలమా! ఒకరి భూమిని అన్యాయంగా కబ్జా చేయకండి. ఎందుకంటే... "ఎవరయినా ఒక జానెడు (భూమి వ్యవహారంలో) అన్యాయం చేసినా ప్రళయదినాన అతనికి ఏడు భూభాగాల గుదిబండ తొడిగించబడుతుంద"ని దైవప్రవక్త(సఅసం) చెప్పారు.**

---

2–1. ఆ ప్రాణుల పాలిట భూమండలం పాన్పుగా ఉంది. దానిని అల్లాహ్ స్వయంగా పరచాడు. ఈ సందర్భంగా క్రింది దైవోపదేశం గమనార్హం: "ఈ నేల నుండే మిమ్మల్ని సృష్టించాము. దాని లోనికే మేము మిమ్మల్ని తిరిగి తీసుకుపోతాము. దాని నుండే మిమ్మల్ని మళ్ళీ వెలికి తీస్తాము" (తాహా : 55)

ఏడు ఆకాశాల మాదిరిగా ఏడు భూములను కూడా ఆయన సృష్టించాడు. కొందరు ఏడు భూములు అంటే ఏడు ఖండాలు అని అభిప్రాయపడ్డారు. కాని ఇది సరైనది కాదు. ఒక భూమండలానికీ– మరో భూమండలానికీ మధ్య చాలా పెద్ద అంతరం ఉంది. ప్రతి భూమండలంలోనూ దేవుని జీవరాశులున్నాయి (ఖుర్తుబీ). హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ఉదాహరణకు– ఒకసారి మహాప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "ఎవరయినా ఇతరులకు చెందిన ఒక జానెడు నేలను ఆక్రమించుకున్నా ప్రళయదినాన ఆ నేలంతటి భాగం ఏడు భూమండలాల నుండి గుదిబండగా తయారుచేసి అతని మెడలో వేయటం జరుగుతుంది" (సహీహ్ బుఖారీ– కితాబుల్ బుయూ)

ఇమామ్ అహ్మద్ అబూ హురైరా (రజి) నుండి వెలికి తీసిన హదీసులో దైవప్రవక్త(స) ఇలా అంటారు: "మీ నేల క్రింద ఏముందో తెలుసా? మరో నేల ఉంది. రెండు భూభాగాల మధ్యన అయిదు వందల సంవత్సరాల అంతరం ఉంది"– ఈ విధంగా ఆయన(స) ఏడు భూమండలాలను లెక్కించారు.

**510)** సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ గారు తన తండ్రి (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్-రజి) నుండి గ్రహించిన హదీసు ప్రకారం మహాప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "ఎవరయినా వేరొకరి భూమి నుండి అన్యాయంగా ఏ కొద్ది భాగం కబళించినా ప్రళయదినాన అతనిని ఏడు భూభాగాలలోకి కూర్చివేయటం జరుగుతుంది."[1]

**511)** అబూ బక్రా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : కాలచక్రం తిరిగి తిరిగి అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాడున్న స్థితికి చేరుకుంది. సంవత్సరం పన్నెండు మాసాలతో కూడుకున్నది. అందులో నాలుగు మాసాలు పవిత్రమైనవి (నిషిద్ధమైనవి). వాటిలో మూడు మాసాలు ఒకదాని తరువాత ఒకటిగా వస్తాయి- జీఖఅద, జిల్‌హజ్జా, ముహర్రమ్. (నాలుగవ నెల అయిన) రజబ్ జమాదివుల్ ఉఖ్రాకి- షాబాన్‌కి మధ్యన ఉంటుంది."[1]

**512)** సయీద్ బిన్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్(రజి) తెలిపారు : అర్వా బిన్తె అబీ ఔస్‌తో ఒకానొక (భూమి) వ్యవహారంలో ఈయనకు వివాదం ఏర్పడింది. ఈ వివాదం తీర్పు కొరకు మదీనా పురపాలకుడైన మర్వాన్ దగ్గరకు వచ్చింది. కేసుపై విచారణ జరిగినప్పుడు సయీద్(రజి) ఇలా అన్నారు : "ఏమిటి, నేను ఈమె హక్కును కాజేయడమా! ఎంతమాట! 'ఎవరయినా ఒక జానెడు భూమిని కూడా అన్యాయంగా కబళిస్తే ప్రళయదినాన ఏడు భూభాగాల గుదిబండ అతని మెడలో వేయటం జరుగుతుంది' అని దైవప్రవక్త(స) చెప్పారని నేను సాక్ష్యమిస్తున్నాను"- వేరొక సనదు ప్రకారం సయీద్ బిన్ జైద్(రజి) ఇలా అన్నారు : "దైవప్రవక్త(స) ఈ హదీసును వినిపించినప్పుడు నేను ఆయన(స) సేవలోనే ఉన్నాను".

---

510-1. ఈ హదీసు ద్వారా 'ఏడు భూమండలాలు' సత్యం అని రూఢీ అవుతోంది.

511-1. అజ్ఞానకాలంలో అరబ్బులు నెలల్ని తమ స్వప్రయోజనాల కొరకు ముందుకి- వెనక్కి జరుపుకునేవారు. ఒక్కోసారి వారు 'ముహర్రమ్'ను 'సఫర్' మాసంగా చేసుకునేవారు. జిల్‌హజ్జా నెలను ముహర్రమ్‌గా పరిగణించేవారు. ఈ విధంగా వారు ఇష్టారాజ్యం చేసేవారు. అల్లాహ్ తన సందేశహరుని (స)కి నెలల సరైన లెక్కను తెలియపరిచాడు. కాలం తిరిగి తిరిగి పూర్వస్థితికే రావటమంటే అర్థం భూమ్యాకాశాలను సృష్టించినప్పుడు దేవుడు నిర్ధారించిన లెక్క ప్రకారం ఇప్పుడు ఖచ్చితంగా నెలల లెక్క నెలకొందన్నదే.

## అధ్యాయం : 3

## నక్షత్రాల గురించి

"మేము మీకు దగ్గరగా ఉన్న ఆకాశాన్ని (నక్షత్రాలనే) మహోజ్వలమైన దీపాలతో అలంకరించాము" అన్న ఖుర్ఆన్ వాక్యంపై ఖతాదా ఇలా అన్నారు : "అల్లాహ్ ఈ నక్షత్రాలను మూడు ప్రయోజనాల నిమిత్తం సృష్టించాడు. వాటిని ఆకాశానికి అలంకరణగా చేశాడు. షైతానులను తరిమి కొట్టేవిగా చేశాడు. (రాత్రి చీకట్లలో) వాటిని సరైన దారి చూపేవిగా ఖరారు చేశాడు. ఎవరయితే ఇవి మినహా నక్షత్రాల గురించి వేరితర మాటలు చెప్పాడో అతను తప్పు చేశాడు. తన భాగాన్ని పాడు చేసుకున్నాడు (తన సమయాన్ని వృధా చేశాడు. తన విశ్వాసాన్ని నష్టపరచుకున్నాడు) ఎవరికీ తెలియజాలని అగోచర విషయాన్ని తెలుసుకోగోరాడు.

## అధ్యాయం : 4

## సూర్యుడు, చంద్రుడు ఒక నియమావళికి కట్టుబడి ఉన్నాయనే అర్రహ్మాన్ సూరా ఆయత్(5) గురించి...

అవి తిరుగలిరాయిలా తిరుగుతున్నాయని ముజాహిద్ వ్యాఖ్యానించారు. నిర్ధారిత కక్ష్యలలో లెక్క ప్రకారం తిరుగుతున్నాయని మరికొందరు అభిప్రాయపడ్డారు. చంద్రుణ్ణి పట్టుకోవడం సూర్యుడి తరం కాదు *(యాసీన్: 40)* అంటే ఒక దాని వెలుగు రెండవ దానిని ప్రభావితం చేయజాలదు. అదేవిధంగా రాత్రి పగలును దాటిపోజాలదు. అవన్నీ వేర్వేరు కక్ష్యలలో తేలియాడుతూ ఉన్నాయి **(36 : 40)...**

**513)** హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) కథనం: సూర్యాస్తమయం జరిగినప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసం) నన్ను ఉద్దేశించి, "ఈ సూర్యుడు ఎక్కడికెళుతుందో నీకు తెలుసా?" అని అడిగారు. దానికి నేను, 'అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త (స)కే బాగా తెలుసు' అన్నాను. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా చెప్పారు: "ఇది (వెళ్ళి) దైవ సింహాసనం క్రిందికి చేరుకుని ప్రణమిల్లుతుంది. తరువాత (మళ్ళీ వచ్చేందుకు) అనుమతి కోరుతుంది. దానికి అనుమతి ఇవ్వబడుతుంది. ఆ రోజు దగ్గరలోనే ఉంది. అప్పుడది సజ్దా చేస్తే అది స్వీకరించబడదు. అనుమతి కోరుతుంది. కాని అనుమతి కూడా లభించదు. పైగా దానితో, "ఎక్కణ్ణుంచి వచ్చావో అక్కడికే తిరిగి

వెళ్ళు" అని అనబడుతుంది. అందువల్ల అది పడమటి దిక్కు నుండే ఉదయిస్తుంది. "సూర్యుడు తన నిజస్థానం దిశగా పయనిస్తున్నాడు. ఇది మహాశక్తిమంతుడూ, గొప్ప జ్ఞానీ అయిన దేవుడు నిర్దేశించిన నియమావళి" అన్న దైవవాక్కు **(36: 37)**లోని మర్మం ఇదే.

**514)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించినట్లుగా అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "ప్రళయదినాన సూర్యుడు, చంద్రుడు– రెండూను కాంతిహీనం అయిపోతాయి."

**515)** ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా చెబుతూ ఉండేవారని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: "ఒకరి జీవన్మరణాలకు సూర్యచంద్రుల గ్రహణంతో ఎట్టి సంబంధం లేదు. పైగా ఇవి దైవ సూచనలలోని ఒక సూచన. కనుక వీటిని (ఆ స్థితిలో) చూసినప్పుడు నమాజ్ చేయండి."

**516)** మహాప్రవక్త(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖించారు: "సూర్యచంద్రులు దైవ నిదర్శనాలలోని రెండు నిదర్శనాలు. ఒకరి జీవన్మరణాల కారణంగా వాటికి గ్రహణం పట్టదు. కాబట్టి మీరు గ్రహణాన్ని చూసినప్పుడు, అల్లాహ్ స్మరణలో నిమగ్నులవండి."

**517)**విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : సూర్యగ్రహణం పట్టిన రోజు దైవప్రవక్త(సఅసం) నిలబడి 'అల్లాహు అక్బర్' అని పలికారు. చాలా సేపటివరకు (నమాజులో) ఖుర్ఆన్ పారాయణం చేశారు. ఆ తరువాత ఆయన(స) రుకూ చేశారు. – చాలా సుదీర్ఘమైన రుకూ అది. పిదప 'సమీ అల్లాహు లిమన్ హమిదహ్' అంటూ తల పైకెత్తి మునుపటి వలెనే లేచి నిలబడ్డారు. ఈసారి ఖియామ్‌లో కూడా సుదీర్ఘ పారాయణం చేశారు. అయితే ఇది తొలిసారి పారాయణం కన్నా తక్కువ. తరువాత రుకూలోకి వెళ్ళారు. చాలాసేపు రుకూ స్థితిలోనే ఉన్నారు. కాకపోతే తొలిసారి రుకూ కన్నా కొంచెం తక్కువ సమయం. ఆ తరువాత సజ్దా చేశారు. చాలా సుదీర్ఘమైన సజ్దా. రెండవ రకఅతులో కూడా ఆయన(స) ఇలాగే చేశారు. పిదప సలామ్ చేశారు. అప్పటికి సూర్యగ్రహణం పూర్తిగా వీడింది. అప్పుడాయన(స) తన ప్రియ సహచరులనుద్దేశించి, సూర్యచంద్రుల గ్రహణంపై ప్రసంగిస్తూ ఇలా అన్నారు: "చూడండి, ఇది దైవ నిదర్శనాలలోని ఒక నిదర్శనం.

అంతేగాని ఒకరి జీవన్మరణాల కారణంగా వీటికి గ్రహణం పట్టదు. కనుక మీరెప్పు డయినా గ్రహణం పట్టినట్లు చూస్తే వెంటనే నమాజ్ వైపునకు ఉపక్రమించండి.”

**518)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ మస్ఊద్ అన్సారీ (రజి) ఉల్లేఖించారు: “ఒకరి జీవన్మరణాల మూలంగా సూర్య చంద్రులకు గ్రహణం పట్టదు. నిజానికి ఇవి దైవ నిదర్శనాలలోనివి. కాబట్టి మీరు వాటికి గ్రహణం పట్టినట్లు గమనిస్తే నమాజ్ చేయండి.”

## అధ్యాయం : 5

## అల్లాహ్ ఈ విధంగా సెలవీయటం...

“తన కారుణ్యానికి ముందు గాలులను శుభవార్తలుగా చేసి పంపేవాడు ఆయనే.” *(అల్ ఫుర్ఖాన్ : 48).* బనీ ఇస్రాయీల్ సూరాలో *‘ఖాసిఫా’* **(69)** అనే పదం వచ్చింది. ప్రతి దానినీ పెకలించివేసే ప్రచండ గాలి అని దీని అర్థం. అలాగే అల్ హిజ్ర్ సూరాలో *‘లవాఖిహ’* అనే పదం ప్రయోగించబడింది **(22).** లవాఖిహ అంటే ఫలప్రదమైన, ఉత్పత్తి కారకమైన (గాలి) అని అర్థం.[1] అల్‌బఖరా సూరాలో *‘ఈసార్’* **(226)** అనే పదం వచ్చింది. *ఈసార్* అంటే నిప్పులు చిమ్మే సుడిగాలి అని అర్థం. ఆలి ఇమ్రాన్ సూరాలో సిర్రున్ **(117)** అనే పదం వచ్చింది. సిర్రున్ అంటే మంచుగాలి, శీతల పవనం అన్న అర్థం వస్తుంది. ‘నుషరా’ అంటే వేరు పరిచేది, చిందర వందర చేసేది అని అర్థం.

**519)** ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవ చనం: “తూరుపు గాలి (సబా) ద్వారా నాకు సహాయం చేయబడింది. పడమటి గాలి (దబూర్) ద్వారా అద్ జాతి అంతమొందించబడింది.”

**520)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : వర్ష సూచన ఉన్న మబ్బు

---

5-1. ‘లవాఖిహ్’ (ఫలవంతమైన, ఉత్పత్తి కారకమైన) అన్న పదానికి అర్థం విడమరచి చెబుతూ మౌలానా జమాలుద్దీన్ అఫ్గానీ ఇలా అంటారు : “స్పష్టంగా చెప్పాలంటే ఈ గాలులు వృక్షాల గర్భధారణకు తోడ్పడతాయి. వృక్ష శాస్త్రం (Botany)లో నిరూపితమైన ఒక విషయం ఏమిటంటే గాలి మగ వృక్షంలోని ధాతువును లేపుకుని వెళ్ళి ఆడ వృక్షంపై పడవేస్తుంది. తత్ఫలితంగా ఆడవృక్షం పంట పండుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఆడవృక్షం గర్భం ధరిస్తుంది.”

**తునకను చూసినప్పుడు దైవప్రవక్త(సఅసం) ఒకింత ఆందోళనతో వెనకా ముందు పచార్లు చేసేవారు. ఒక్కోసారి ఇంట్లోకి వస్తే, ఒక్కోసారి బయటికి వెళ్ళేవారు. ఆ సమయంలో ఆయన(స) ముఖారవిందం రంగు మారిపోయేది. అయితే వర్షం కురవటం మొదలయ్యాక ఆయనలో ఈ ఆందోళన కనిపించేది కాదు- ఒకసారి హజ్రత్ ఆయిషా(ర.అ) దీని గురించి ఆయన్ని(స) అడిగితే ఆయన(స) ఇలా అన్నారు : ఏమో నాకేం తెలుసు (ఆ మబ్బులో ఏముందో)? ఆద్ జాతివారు; ఆద్ జాతి వారు కూడా తమ లోయ వైపునకు కదలివస్తున్న మబ్బు తునకను చూసి మితిమీరిన ధీమాతో, తమ కోసం కారుణ్యమేఘం వచ్చిందని చెప్పుకున్నారు. (వాస్తవానికి అది విపత్కరమైన మేఘం).**

## అధ్యాయం : 6

## దైవ దూతల గురించి...[1]

హజ్రత్ అనస్(రజి) ఇలా అన్నారు : **అబ్దుల్లాహ్ బిన్ సలామ్-రజి (ఇస్లాంకు పూర్వం ఆయన యూదుల గొప్ప పండితునిగా పరిగణించబడేవారు) దైవప్రవక్త (సఅసం) సమక్షంలో, 'యూదులు దైవదూతలలో మహనీయ జిబ్రయీల్ (అ)ని తమ శత్రువుగా భావిస్తున్నార'ని[2] విన్నవించుకున్నారు. ఇబ్నె అబ్బాస్(రజి) గారు అస్ సాఫ్ఫాత్ సూరాలోని (165వ) ఆయత్‌లో 'మేము పంక్తులు తీరి ఉన్న సేవకులం' పై వ్యాఖ్యానిస్తూ, "వారు దైవదూతలు"అని చెప్పారు.**

**521) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పిన విషయాన్ని మాలిక్ బిన్ సాసా (రజి) సంగ్రహించి వివరించారు- దీని ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా అన్నారు: నేనొకసారి దైవగృహం (కాబా) సమీపంలో నిద్రకు ఉపక్రమించాను. నిద్రకు- మెలకువకు మధ్య స్థితిలో -మగతలో- ఉన్నాను.**

---

6-1. దైవదూతలపై 'విశ్వాసం' కలిగి ఉండటం ఈమానియాత్‌లో అంతర్భాగం. దైవదూతలు దేవుని ప్రియతమ దాసులు. ఎల్లవేళలా దైవాజ్ఞాబద్ధులై ఉంటారు. వారు ఏ రూపంలో నయినా అవతరిస్తారు. వారు పురుషులుగానీ, స్త్రీలు గానీ కారు. వారు తినరు, త్రాగరు. వివాహం చేసుకోరు.

6-2. యూదులు తమ అజ్ఞానం వల్ల హజ్రత్ జిబ్రయీల్(అలైహిస్సలాం)ను తమ శత్రువుగా తలపోసేవారు. "ఆయన మా రహస్య విషయాలన్నీ ముహమ్మద్(స)కు చెప్పేస్తున్నాడు. ఎప్పుడు భూమిపై అవతరించినా శిక్షలే తీసుకు వస్తున్నాడు" అని చెప్పేవారు.

తరువాత ప్రవక్త మహనీయులు(సఅసం) ఇద్దరు మనుషుల మధ్యన విశ్రాంతి తీసు కుంటున్న మూడవ వ్యక్తిని గురించి కూడా ప్రస్తావించారు– ఆ తరువాత నా వద్దకు ఒక బంగారు పళ్లెం తేబడింది. అది విజ్ఞత (హిక్మత్)తో, విశ్వాసం (ఈమాన్)తో నిండి ఉన్నది. నా రొమ్మును పొట్ట చివరి భాగం వరకూ చీల్చటం జరిగింది. తరువాత నా కడుపు జమ్‌జమ్ పవిత్ర జలంతో కడగబడింది. దానిని విజ్ఞతతో, విశ్వాసంతో నింపటం జరిగింది. ఆ తరువాత నా దగ్గరకు ఒక వాహనం తీసుకు రావటం జరిగింది. అది తెల్లగా ఉంది. కంచెర గాడిదకన్నా చిన్నది, గాడిద కన్నా పెద్దది –అంటే 'బురాఖ్'. నేను ఆ వాహనమెక్కి జిబ్రయీల్ (అలైహిస్సలాం)తో పాటు బయలుదేరాను.

– మేము సమీప ఆకాశానికి చేరుకున్నప్పుడు, 'ఎవరు?' అని ప్రశ్నించటం జరిగింది. "నేను జిబ్రయీల్‌ని" అని ఆయన చెప్పారు. 'మరైతే మీ వెంట వచ్చిన వారెవరు?' అన్న ప్రశ్న వేయబడింది. "ఈయన ముహమ్మద్(స)" అని చెప్పా రాయన. 'ఏమిటి, ఈయన్ని పిలుచుకురావడానికే మీరు పంపబడ్డారా?' అన్న ప్రశ్న ఎదురయింది. "అవును" అని ఆయన జవాబిచ్చారు. దానికి, 'మీరు బహు విశాల మైన చోటికి వచ్చారు. స్వాగతం. మీ రాక శుభదాయకం' అన్న స్వాగత వచనాలు పలకబడ్డాయి. తరువాత నేను ఆదమ్ (అలైహిస్సలాం) సన్నిధిలో హాజరై, ఆయనకు సలామ్ చేశాను. 'రా. నా ముద్దుల పుత్రుడా! నీవు బహు మంచి ప్రవక్తవు' అని స్వాగతించారాయన. ఆ తరువాత మేము రెండవ ఆకాశానికి చేరుకున్నాము. అక్కడా అవే ప్రశ్నలు ఎదురయ్యాయి– 'ఎవరు?' "జిబ్రయీల్‌ని". 'మీతోపాటు వచ్చిన మరో వ్యక్తి ఎవరు?' అని ప్రశ్నించగా "ముహమ్మద్(స)" అని సమాధానం ఇవ్వటం జరిగింది. 'ఈయన్ని పిలుచుకురావటానికే మీరు పంపబడ్డారా?' అని ప్రశ్నించగా, "అవున"ని ఆయన చెప్పారు. 'సరే. విశాలమైన చోటుకు వచ్చారు. మీ రాక శుభదాయకం' అని స్వాగతించటం జరిగింది. ఆ తర్వాత నేను ఈసా (క్రీస్తు– అలై)ని, యహ్యా (అలై)ని కలుసుకున్నాను. ఆ మహనీయులిరువురూ నన్ను స్వాగతించారు– తమ సోదరుణ్ణి, దైవ సందేశహరుణ్ణి. తరువాత మేము మూడవ ఆకాశానికి చేరుకున్నాము. అక్కడా అవే ప్రశ్నలు... 'ఎవరు?' "నేను జిబ్రయీల్‌ని" 'మీ వెంట ఉన్న వారెవరు?' "ముహమ్మద్(స)". 'ఈయన్ని పిలుచుకు రావడానికే

తమరు పంపబడ్డారా?' "అవును". అప్పుడిలా అనబడింది: 'వచ్చినవారు బహు విశాలమైన స్థలానికి వచ్చారు. చాలా చక్కనివారు'. అక్కడ నేను యూసుఫ్ (అలైహిస్సలాం)ని కలుసుకుని ఆయనకు సలామ్ చేశాను. దానికాయన "చాలా విశాలమైన చోటికి వచ్చారు నా సోదరా, దైవ సందేశహరుడా!" అని పలికారు. అక్కడి నుండి మేము నాల్గవ ఆకాశానికి చేరుకున్నాము. అక్కడా అవే ప్రశ్నోత్తరాలు.. 'ఎవరు?' "జిబ్రయీల్" అని సమాధానం. 'మీ వెంట ఎవరో ఉన్నట్టున్నారు?' "అవును. ముహమ్మద్(స) ఉన్నారు". 'ఆయన్ని పిలుచుకు వచ్చేందుకు మీరు పంపబడ్డారా?' "అవును", 'వచ్చినవారు ఎంత మంచివారు! ఆయన బహు విశాలమైన ప్రదేశానికి వచ్చారు'. అక్కడ నేను ఇద్రీస్(అలైహిస్సలామ్)ను కలుసుకుని, ఆయనకు సలాం చేశాను. "మర్హబా నా సోదరా! దైవ సందేశహరుడా?" అంటూ ఆయన స్వాగతం పలికారు. ఇక అక్కడినుండి మేము ఐదవ ఆకాశానికి చేరుకున్నాము. 'ఎవరండి?' అన్న ప్రశ్న ఎదురయింది. "నేను జిబ్రయీల్ని" అని సమాధానం ఇవ్వడం జరిగింది. 'మీ వెంట ఇంకా ఎవరున్నారు?' అని ప్రశ్నించగా, "ముహమ్మద్(స)" అని జవాబివ్వటం జరిగింది. 'ఈయన్ని పిలుచుకురావడానికి మిమ్మల్ని పంపటం జరిగిందా?' అన్న ప్రశ్నకు "అవున"ని ఆయన బదులిచ్చారు. దీనికి సమాధానంగా, 'ఎంతో విశాలమైన క్షేత్రానికి వచ్చారు. వచ్చిన వారెంతో మంచివారు!' అనబడింది. అక్కడ మేము హారూన్ (అలైహిస్సలాం)ని కలుసుకున్నాము. నేనాయనకు సలామ్ చేశాను. 'నీకు శుభం సోదరా! దైవ సందేశహరుడా! బహు విశాలమైన చోటికి వచ్చారు' అన్నారాయన. అక్కడి నుండి మేము ఆరవ ఆకాశానికేగాము. అక్కడా ప్రశ్నలు తప్పలేదు– 'ఎవరు?' "జిబ్రయీల్". 'మీతోపాటు మరెవరయినా ఉన్నారా?' "అవును. నా వెంట ముహమ్మద్(స) ఉన్నారు?" 'ఏమిటి, ఆయన పిలువబడ్డారా?' "అవును". 'వచ్చిన వారు సువిశాలమైన ప్రదేశానికి వచ్చారు. స్వాగతం' అక్కడ నేను మూసా (అలైహిస్సలాం)ను కలుసుకుని సలామ్ చేశాను. దానికాయన, "నా సోదరా! దైవ సందేశహరుడా! విశాలమైన స్థలికి నీ రాక శుభదాయకం" అని స్వాగతించారు. అక్కడి నుండి నేను ముందుకు పోసాగితే, ఆయన దుఃఖంతో విలపించసాగారు. 'మీ దుఃఖానికి కారణమేమిటి?' అని ఎవరో అడిగితే, సమాధానంగా ఆయన, "ఓ అల్లాహ్! నా తరువాత దైవదౌత్యం వొసగబడిన ఈ

యువకుని అనుచర సమాజం (ఉమ్మత్)లో స్వర్గానికి వెళ్ళేవారు నా ఉమ్మత్ నుంచి స్వర్గానికి వెళ్ళేవారికన్నా అధికంగా ఉంటార"ని ఆయన చెప్పారు. ఆ తరువాత మేము ఏడవ ఆకాశానికి వెళ్ళాము. అక్కడ కూడా అవే ప్రశ్నలు.. 'ఎవరు?' అని. "జిబ్రయీల్‌ని" అని జవాబు ఇవ్వటం జరిగింది. 'మీ వెంట మరెవరైనా ఉన్నారా?' అని ప్రశ్నించగా, "ముహమ్మద్(స) ఉన్నార"ని సమాధానం ఇచ్చారు. 'ఆయన్ని పిలుచుకురావడానికే మీరు పంపబడ్డారా?' "అవును". 'అలాగైతే మీకు స్వాగతం! మీ రాక శుభకరం'. అక్కడ నేను ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్)ను కలుసుకుని ఆయనకు సలామ్ చేశాను. దానికాయన, "నా కుమారుడా! దైవ సందేశహరుడా! నీకు శుభం. బహు విశాలమైన క్షేత్రానికి వచ్చావు" అని పలికారు. ఆ తరువాత నాకు 'బైతుల్ మామూర్' చూపించబడింది. దాని విశేషం గురించి నేను జిబ్రయీల్ (అ)ని అడగ్గా, ఆయన ఇలా చెప్పారు : "ఇది బైతుల్ మామూర్. ఇందులో ప్రతి రోజూ డెభ్భయి వేల మంది దైవదూతలు నమాజ్ చేస్తారు. ఒకసారి ఇందులో నమాజ్ చేసి వెడలిన వారు ఇక ఎన్నడూ అందులో ప్రవేశించలేరు." ఆ తరువాత నాకు 'సిద్రతుల్ ముంతహా' కూడా చూపించబడింది. దాని కాయలు హిజ్ర్ ప్రదేశం లోని పిడతల మాదిరిగా ఉన్నాయి. దాని ఆకులు ఏనుగు చెవుల మాదిరిగా (వెడల్పుగా) ఉన్నాయి. దాని వ్రేళ్ళ నుండి నాలుగు కాలువలు వెలువడ్డాయి. వాటిలో రెండు అంతర్గతమైనవి, రెండు బాహ్యమైనవి. వాటి గురించి నేను జిబ్రయీల్ (అ)ని అడిగితే, రెండు అంతర్గతమైన కాలువలు స్వర్గంలోనివనీ, రెండు బాహ్య కాలువలు ఇహలోకంలోని నైలునది, ఫరాత్ నది అని ఆయన చెప్పారు. ఆ తరువాత నాపైన (రోజుకు) యాభై నమాజులు విధితం గావించబడ్డాయి. నేను తిరిగి వస్తున్నప్పుడు మూసా (అలైహిస్సలామ్)ను కలుసుకుంటే, 'ఏమిటి, సంగతి?' అని ఆయన అడిగారు. "నాపైన రోజుకు యాభై నమాజులు విధించబడ్డాయి" అని చెప్పాను. దానికాయన "మానవుల గురించి మీకన్నా ఎక్కువగా నాకు తెలుసు. బనీఇస్రాయీల్ విషయంలో నేను ఎంతో అనుభవం గడించాను. మీ అనుచర సమాజం వద్ద కూడా అంతటి శక్తి లేదు. అందువల్ల ప్రభువు సన్నిధిలో మరోసారి హాజరై నమాజుల సంఖ్యను తగ్గించమని ప్రాధేయపడండి" అని సలహా ఇచ్చారు. నేను తిరిగి వెళ్ళి అభ్యర్థించగా అల్లాహ్ నమాజుల సంఖ్యను నలభైకి కుదించాడు. అయినా మూసా (అ) ఈ కుదింపుపై పట్టు వీడలేదు. ఈసారి ఆ సంఖ్య ముప్ఫయికి

**తగ్గింది. అయినా ఆయన సమ్మతించకపోవటంతో, అల్లాహ్ ఆ సంఖ్యను ఇరవైకి తగ్గించాడు. కాని మూసా (అలై) ఈసారి కూడా ససేమిరా అనడంతో నేను మరో సారి దైవదర్బారులో హాజరై విన్నవించుకున్నాను. నా అభ్యర్థనపై అల్లాహ్ నమాజుల సంఖ్యను పదిగా ఖరారు చేశాడు. తరువాత నేను మూసా(అ) దగ్గరకు రాగా, ఈసారి కూడా ఆయన(అ) తగ్గింపు గురించి పట్టుపట్టారు. ఈసారి అల్లాహ్ నమాజుల సంఖ్యను అయిదు(5)కు తగ్గించాడు. ఇప్పుడు నేను మూసా(అ)ను కలుసుకుంటే, "ఏమయింది?" అని ఆయన అడిగారు. అల్లాహ్ అనుదినం అయిదు నమాజులు ఖరారు చేశాడని నేను చెప్పాను. ఈసారి కూడా ఆయన, "ఇంకా తగ్గించమని చెప్పండి" అని కోరారు. దానికి నేను,"ఇక నా వల్ల కాదు. ఈ వ్యవహారాన్ని నేను అల్లాహ్‌కు అప్పగించాను" అని నిర్దిష్టంగా చెప్పేశాను. అప్పుడు ఈ వాణి వినిపించింది– "నేను ఐదుపూటల నమాజును విధిగా ఖరారు చేశాను. నా దాసులపైన గల భారాన్ని తగ్గించాను. వారు చేసిన ఒక సత్కార్యానికి గాను పదింతల ప్రతిఫలం ప్రసాదిస్తాను" [1].... అబూహురైరా (రజి) గారు 'బైతుల్ మామూర్' గురించి దైవప్రవక్త(స) నుండి వేరుగా ఉల్లేఖించారు.**

**522) సచ్ఛీలురు, సత్య వాగ్దానం చేయబడిన దైవప్రవక్త(సఅసం) తమకు ఇలా చెప్పారని అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు: "మీలో ప్రతి ఒక్కరి పుట్టుక ప్రక్రియ మీ మాతృ గర్భాశయాలలో నలభై రోజుల వరకూ ఘనీభవించిన రక్తం రూపంలో ఉంటుంది. మరి అన్నే (40) రోజుల వరకు మాంసపు ముద్దలా ఉంటుంది. ఆ తరువాత అల్లాహ్ ఒక దూతను పంపి, అతనికి నాలుగు విషయాల గురించి**

---

521–1. సుదీర్ఘమైన ఈ హదీసు మేరాజ్ యాత్రకు సంబంధించినది. ఇమామ్ బుఖారీ (రహ్మ) దీనిని ఇక్కడ పొందుపరచటంలోని ముఖ్య ఉద్దేశం ఇందులో దైవదూతల ప్రస్తావన ఉండటమే. దైవదూతలు లెక్కకు మించిన సంఖ్యలో ఉన్నారు. వేరొక హదీసు ప్రకారం సజ్దా చేసే దైవదూతలతో ఆకాశం కిక్కిరిసిపోయి ఉంది. జానెడు స్థలం కూడా ఖాళీగా లేదు.

మేరాజ్ సంఘటన (యాత్ర) 'హతీమ్' నుండి మొదలయింది. అక్కడ మహాప్రవక్త(స) హమ్జా– జాఫర్‌ల మధ్యన నిద్రిస్తూ ఉన్నారు. అక్కణ్ణుంచి ఆయన యాత్ర 'బురాఖ్' అనే వాహనంపై మొదలయింది. 'బర్ఖ్' అంటే విద్యుత్తు అని అర్థం. మేరాజ్ యాత్ర సత్యం. దీనిని కాదన్న వారు మార్గవిహీనులు.

**(లిఖించమని) ఆజ్ఞాపిస్తాడు- అతనితో ఇలా అనబడుతుంది: అతని ఆచరణ, అతని ఉపాధి, అతని జీవన వ్యవధి, ఇంకా అతను మంచివాడా లేక దుష్టుడా అనేది వ్రాసుకో. పిదప అందులో ప్రాణం పోయబడుతుంది. (గుర్తుంచుకో) ఒక వ్యక్తి జీవితాంతం సదాచరణ చేస్తుంటాడు, అతనికీ- స్వర్గానికి మధ్య ఒక బారెడు దూరం ఉండగా, అతని జాతకం (తలరాత) ముందుకు వస్తుంది. అంతే, అతను నరక వాసుల ఆచరణను మొదలెడతాడు. అలాగే ఒక వ్యక్తి (జీవితాంతం) దురాచరణ చేస్తాడు. తీరా అతనికీ- నరకానికి మధ్యన ఒక బారెడు అంతరం ఉండగా అతని విధి వ్రాత అతనిపై ఆధిపత్యం వహిస్తుంది. దాంతో అతను స్వర్గవాసుల ఆచరణ మొదలెడతాడు.[1]**

**523) మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు: "అల్లాహ్ ఎవరయినా ఒక దాసుణ్ణి ప్రేమిస్తున్నప్పుడు, 'నేను ఫలానా దాసుణ్ణి ప్రేమిస్తున్నాను కాబట్టి మీరు కూడా అతనిని ప్రేమించండి' అని జిబ్రీల్(అ)తో అంటాడు. జిబ్రీల్(అ) కూడా ఆ వ్యక్తిని ప్రేమించసాగుతారు. తరువాత జిబ్రీల్(అ) ఆకాశాలలో ఉండేవారిని ఎలుగెత్తి పిలుస్తూ, 'అల్లాహ్ ఫలానా వ్యక్తిని ప్రేమిస్తున్నాడు. కాబట్టి మీరందరూ కూడా అతనిని ప్రేమించండి' అంటారు. అంతే, ఆకాశవాసులంతా ఆ వ్యక్తిని ప్రేమించసాగుతారు. ఆ తరువాత భూ మండలంలోని వారు కూడా ఆ వ్యక్తిని ఆమోద ముద్ర పడినవాడుగా తలపోస్తారు.[1]**

---

522-1 ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే, 'ఖాతిమా బిల్ ఖైర్" (మేల్తరమైన ముగింపు) కీలకం. అందుకే మనిషి చెడు ముగింపు పట్ల సదా భయ పడుతూ ఉండాలి. గొప్పవారు తమ అనుభవపూర్వకంగా చెప్పేదేమిటంటే హదీసుల పట్ల ప్రేమ, గౌరవం ఉన్నవారు, హదీసుల పరివ్యాప్తిలో నిమగ్నులై ఉన్నవారికి దీర్ఘాయుష ప్రాప్తమవుతుంది. వారి ముగింపు కూడా ఉత్తమంగా ఉంటుంది.

523-1. ఇస్మాయిల్ రివాయత్‌లో అదనంగా ఈ విధంగా కూడా ఉంది : అల్లాహ్ ఏ దాసునితో అయినా శత్రుత్వం వహించినప్పుడు జిబ్రయీల్ (అలైహిస్సలామ్)తోపాటు దైవ దూతలంతా ఆ వ్యక్తికి శత్రువులైపోతారు. కడకు భూమండలంలో కూడా అతని చెడుగు ప్రబలిపోతుంది. ఈ హదీసు ద్వారా దైవవాక్కులో 'శబ్దం' ఉందన్న విషయం రూఢీ అవుతోంది. దైవవాక్కుకు రూపంగానీ, అక్షరంగానీ లేదని చెప్పేవారి వాదన కూడా దీనిద్వారా ఖండించబడింది.

**524)** ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా తాను విన్నానని ఆయన పవిత్ర సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు. ఆయన(స) ఇలా చెప్పారు: "దైవదూతలు 'అనాన్'లో అవతరిస్తారు. అనాన్ అంటే మేఘాలు. అక్కడ దైవ దూతలు ఆకాశాలలో నిర్ణయించబడిన విషయాలను ప్రస్తావించుకుంటారు. అక్కడి నుంచే షైతానులు దొంగచాటుగా కొన్ని విషయాలు తన్నుకుపోయి, జ్యోతిష్కులకు తెలియజేస్తారు. జ్యోతిష్కులు వాటికి తమ తరఫున నూరు అబద్ధాలు తగిలించి వివరిస్తారు."

**525)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "శుక్రవారం రోజు రాగానే, దైవదూతలు ప్రతి మస్జిద్ ద్వారంపై నిలబడి అందరికన్నా ముందు వచ్చేవారి పేరు నమోదు చేసుకుంటారు. ఆ తరువాత మస్జిద్‌కు వచ్చేవారి పేర్లు క్రమసంఖ్యలో వ్రాసుకుంటారు. ఆపైన ఇమామ్ (ప్రసంగించడానికి) వేదికపై కూర్చోగానే దైవదూతలు తమ తమ రిజిస్టర్లను మూసివేసి, దైవస్మరణ వినటంలో నిమగ్నులై పోతారు."[1]

**526)** సయీద్ బిన్ ముసయ్యిబ్ కథనం : మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) మస్జిద్‌లోనికి వచ్చినప్పుడు హస్సాన్ (రజి)కవితలు చదువుతున్నారు. ఆయన మస్జిద్ లోపల కవితలు చదవటంపై ఉమర్(రజి) తన అయిష్టతను వ్యక్తపరచగా హస్సాన్ (రజి) ఇలా అన్నారు: "మీకన్నా ఉత్తములు (ముహమ్మద్ ప్రవక్త-సఅసం) ఇక్కడ ఉండగా నేను (మస్జిద్‌లో) కవితలు చెప్పేవాణ్ణి". ఆ తరువాత హస్సాన్(రజి) అబూ హురైరా (రజి) వైపు తిరిగి, "నేను మిమ్మల్ని అల్లాహ్ సాక్షిగా ఒక విషయం అడుగుతున్నాను- 'హస్సాన్! (అవిశ్వాసులకు) నా తరఫున దీటుగా జవాబు ఇవ్వు. ఓ అల్లాహ్! రూహుల్ ఖుదుస్ ద్వారా హస్సాన్‌కు తోడ్పడు' అని దైవప్రవక్త(స) చెప్పగా మీరు వినలేదా?" అని అడిగారు. దానికి అబూ హురైరా (రజి) "ఔను, నేను విన్నాను" అని ధ్రువపరిచారు.[1]

---

525-1. ఈ హదీసు 'జుమా ప్రకరణం'లో కూడా వచ్చింది. మళ్ళీ ఇక్కడ దీనిని ఇమామ్ బుఖారీ (రహ్మ) పొందుపరచటంలోని ఉద్దేశం; దైవదూతల ఉనికిని రూఢపరచటమే.

26-1. 'రూహుల్ ఖుదుస్' అంటే పరిశుద్ధాత్మ అని అర్థం. ఈ పదం దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలామ్)కు ప్రత్యేకించబడింది. ఈ హదీసు ద్వారా దైవ కీర్తన, ప్రవక్త(స) ప్రశంసకు సంబంధించిన కవితలు చెప్పటం సమ్మతమేనని రూఢీ అవుతోంది.

**527)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) హస్సాన్(రజి)తో ఇలా అన్నారు: "నీవు కూడా మక్కా బహుదైవారాధకులను తూలనాడు లేదా (ఇలా అన్నారు) వారి దుర్విమర్శలకు దీటుగా జవాబివ్వు. జిబ్రయీల్(అలైహిస్సలాం) నీకు తోడుగా ఉన్నారు." [1]

**528)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం : "హజ్రత్ జిబ్రయీల్– అలైహిస్సలాం– వెంట వచ్చిన దైవదూతల (సైనికుల) కారణంగా బనీ గన్మ్ కుటుంబీకుల వీధిలో రేగిన దుమ్ము ధూళి (ఇప్పటికీ) నా కళ్ళ ముందరే ఉంది."

**529)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖించారు: 'దైవవాణి (వహీ) మీ వద్దకు ఏ విధంగా వస్తుంది?' అని హారిస్ బిన్ హిషామ్(రజి) దైవప్రవక్త(సఅసం)ను అడిగినప్పుడు, ఆయన(స) చెప్పారు: "పలు విధాలుగా వస్తుంది. ఒక్కోసారి దైవదూత వచ్చినప్పుడు గంట మ్రోగిన శబ్దం వస్తుంది. 'వహీ' అవతరణ పూర్తయ్యేసరికి నేను దానిని కంఠస్థం చేసుకుని ఉంటాను. వహీ అవతరించే ఈ స్థితి నా పాలిట చాలా కష్టంగా ఉంటుంది. ఒక్కోసారి దైవదూత నా ఎదుట ఒక పురుషుని ఆకారంలో వస్తాడు, అతడు నాతో సంభాషిస్తాడు. అతను చెప్పినదంతా నేను జ్ఞాపకం చేసుకుంటాను."

**530)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు. దైవప్రవక్త(స) ఇలా ప్రబోధించారు : "ఎవరైతే దైవమార్గంలో ఒక జత (బట్టలుగానీ, మరేదైనా వస్తువుగానీ) ఇస్తాడో అతన్ని స్వర్గానికి కాపలాగా ఉన్న దైవదూతలు పిలుస్తూ, 'ఓయీ ఫలానా వ్యక్తీ! ఈ ద్వారం గుండా లోనికి రా' అని అంటూ ఉంటాడు. ఇది విన్న అబూబక్ర్ (రజి), 'అలాగైతే ఆ వ్యక్తికి నష్టం కలిగే మాటే ఉండదు కదా!' అని అభిప్రాయపడగా, "మీరు కూడా అలాంటి వారిలో ఒకరుగా ఉంటారని నేను భావిస్తున్నా"నని దైవప్రవక్త(స) పలికారు.

**531)** హజ్రత్ ఆయిషా (ర.అ) ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసం) ఒకసారి తన సతీమణిని పిలుస్తూ, "ఆయిషా! ఇదిగో జిబ్రయీల్(అ)

---

527–1. దైవప్రవక్త(స) ఇచ్చిన ప్రేరణతో హజ్రత్ హస్సాన్(రజి) విజృంభించారు. ఆయన కవితా ధాటికి తట్టుకోలేక బహుదైవారాధకులు విలవిల్లాడిపోయారు.

**వచ్చారు. నీకు సలామ్ చెబుతున్నారు" అని చెప్పగా, నేను, 'వ అలైహిస్సలాము వ రహ్మతుల్లాహి వబరకాతుహు'. నేను చూడలేని వస్తువులను మీరు చూస్తారు' అని బదులిచ్చాను. ఆయిషా(ర.అ) గారు దైవప్రవక్త(స)ను దృష్టిలో పెట్టుకుని ఇలా అన్నారు.**

**532) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒకసారి హజ్రత్ జిబ్రయీల్(అ)నుద్దేశించి, "మీరు నన్ను కలుసుకోవడానికి ఎన్నిసార్లు వస్తున్నారో, అంతకన్నా ఎక్కువసార్లు ఎందుకు రారు?" అని అడిగినప్పుడు ఈ ఆయత్ అవతరించింది: "ప్రవక్తా! మేము నీ ప్రభువు ఆజ్ఞ లేకుండా క్రిందికి దిగిరాము. మా ముందు ఉన్నదానికీ, మా వెనుక ఉన్న దానికీ, ఈ రెండింటి మధ్యన ఉన్న దానికీ, ప్రతి దానికీ ప్రభువు ఆయనే. నీ ప్రభువు ఎన్నడూ మరచిపోయేవాడు కాదు." *(మర్యమ్ : 64)***

**533) ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖించారు: "జిబ్రయీల్(అలైహిస్సలాం) మొదట్లో (అరబ్బుల) ఒకే తరహా మాండలికంలో నాకు ఖుర్ఆన్ నేర్పారు. ఇతర మాండలికాల్లో కూడా చదివి వినిపించమని నేను పదేపదే కోరాను. చివరకు ఏడు మాండలికాల్లో దాని అవతరణ జరిగింది." [1]**

**534) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసం)అందరికన్నా ఎక్కువ దాతృగుణం కలవారు. హజ్రత్ జిబ్రయీల్(అ) రమజాన్ నెలలో ఆయన్ని కలుసుకోవడానికి అనుదినం వస్తున్నప్పుడు ఆయన(స) దానధర్మాలు మరింతగా అధికమయ్యేవి. హజ్రత్ జిబ్రయీల్(అ) రమజాన్ నెలలోని ప్రతి రాత్రి ఆయన్ని కలుసుకోవడానికి వస్తుండేవారు. ఆయన(స) ద్వారా ఖుర్ఆన్ పారాయణం చేయించేవారు. [1] దైవప్రవక్త(స) ప్రత్యేకించి జిబ్రయీల్(అ) ఏతెంచే**

---

533–1. అరబ్బుల– అరబీ– భాష ఒక్కటే అయినా వివిధ ప్రదేశాల యాసల్లో, మాండలికాల్లో స్వల్పమైన వ్యత్యాసం ఉంది. హిజాజ్ క్షేత్రంలోని యాస ఒకటైతే, బనీ తమీమ్ తెగవారి యాస కొంత భిన్నంగా ఉంటుంది. అల్లాహ్ తన దాసులకు సౌలభ్యం చేకూర్చే ఉద్దేశంతో ఖుర్ఆన్‌ను అరబ్బుల ఏడు మాండలికాల్లో పఠించేందుకు ఆనతినిచ్చాడు.

534–1. అంటే ప్రతి సంవత్సరం ఒకసారి దైవప్రవక్త(స) చేత పూర్తి ఖుర్ఆన్ పారాయణం చేయించేవారు. అయితే ప్రవక్త(స) పరమ పదించిన సంవత్సరం రెండుసార్లు పూర్తి

ఆ కాలంలో మేలుచేసే కార్యాల్లో వేగంగా వీచే గాలులకన్నా ఎక్కువ ఉదార స్వభావి అయిపోయేవారు... అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ ఉల్లేఖనం, ఆయనగారి నుండి మాయర్ ఇవే సనదులతోపాటు సరిగ్గా ఇలాగే వివరించారు. హజ్రత్ అబూ హురైరా (రజి), హజ్రత్ ఫాతిమా(ర.అ) నకలు చేసిన దాని ప్రకారం దైవప్రవక్త(స) జిబ్రయీల్(అ)తో కలసి ఖుర్‌ఆన్ పారాయణం చేశారు.

**535)** ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా తాను విన్నానని అబూ మస్‌ఊద్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు(స) ఇలా చెప్పారు– జిబ్రయీల్(అ) వచ్చి నాకు నమాజ్ చేయించారు. నేను ఆయనతో కలసి నమాజ్ చేశాను. తరువాత (రెండవ పూట) నమాజ్ ఆయనతో కలసి ఆచరించాను. ఆ తరువాత మూడవ పూట ఆయనతో కలసి నమాజ్ చేశాను. ఆ తరువాత నాల్గవ పూట నమాజ్, ఆపైన ఐదవ పూట ఆచరించాను– ఈ విధంగా ఆయన తన చేతివేళ్ళపై ఐదుపూటల నమాజులను లెక్కించి చెప్పారు.

**536)** దైవప్రవక్త(సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూజర్ (రజి) ఉల్లేఖించారు : జిబ్రయీల్(అలైహిస్సలాం) చెప్పి వెళ్ళారు– మీ అనుచర సముదాయంలోని ఏ వ్యక్తి అయినా అల్లాహ్‌కు భాగస్వామిగా ఎవరినీ కల్పించని (షిర్క్ చేయని) స్థితిలో మరణిస్తే అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడని. (లేదా ఇలా చెప్పారు) అతడు నరకాగ్నికి ఆహుతి కాడని." 'ఒకవేళ అతడు తన జీవితంలో వ్యభిచారం చేసినా, దొంగతనం చేసినా స్వర్గానికి పోతాడా?' అని అబూజర్(రజి) విన్నవించుకోగా, "అతడు వ్యభిచారం చేసేవాడైనా, దొంగతనం చేసేవాడైనా సరే" అని ఆయన(స) అన్నారు.

**537)** హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : దైవదూతలు ముందూ వెనకా భువిపైకి వస్తూ పోతుంటారు. కొంతమంది దైవదూతలు రాత్రివేళ విధి నిర్వహణపై ఉంటే, మరి కొంతమంది పగటిపూట విధుల్లో ఉంటారు. వీరంతా ఫజ్ర్, అస్ర్ నమాజుల్లో సమావేశమవుతారు. రాత్రివేళ మీ వద్ద ఉన్న దైవదూతలు అల్లాహ్ సన్నిధికి

ఖుర్‌ఆన్ పారాయణం చేయించారు. జైద్ బిన్ సాబిత్ గారి పఠనాశైలి దైవప్రవక్త(స) చివరి పారాయణాన్ని పోలి ఉండేదని అంటారు.

వెళ్ళినప్పుడు, అల్లాహ్ వారిని అడిగి తెలుసుకుంటాడు– వాస్తవానికి అల్లాహ్ అన్నీ ఎరిగినవాడు– మీరు నా దాసుల్ని ఏ స్థితిలో వదలి వచ్చారని. దైవదూతలు ఇలా విన్నవించుకుంటారు: 'మేము వారిని వదలి వస్తున్నప్పుడు వారు (ఫజ్ర్) నమాజ్ ఆచరిస్తూ ఉన్నారు. అలాగే మేము వారి వద్దకు వెళ్ళినప్పుడు, వారు (అస్ర్) నమాజ్ చేస్తూ ఉన్నారు'. ఆయన(సఅసం) ఇలా అన్నారు : "మీలో ఎవరయినా 'ఆమీన్' అని పలికినప్పుడు దైవదూతలు కూడా ఆకాశంలో 'ఆమీన్' అని పలుకుతారు. ఈ విధంగా రెండు ఆమీన్‌లు(ధ్వనులు) పరస్పరం కలసి ప్రతిధ్వనిస్తాయి. దాంతో ఆ దాసుని వల్ల జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి".

**538)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: నేను దైవప్రవక్త(సఅసం) కోసం ఒక దిండును నింపాను. దాని (గిలాఫు)పై రూపచిత్రాలున్నాయి. అది ఓ నగిషీ దిండులా తయారయింది. దైవప్రవక్త(స) విచ్చేశారు. కాని తలుపు వద్దనే ఆగి పోయారు. ఆయన(స) ముఖం రంగు మారసాగింది.'దైవప్రవక్తా (స)! నా వల్ల ఏదైనా తప్పు జరిగిందా!?' అని అడిగాను. దానికాయన(స) "ఈ దిండును ఇక్కడ ఎందుకు ఉంచావ్?" అని ప్రశ్నించారు. 'దీనిని నేను ప్రత్యేకంగా మీ కోసమే తయారు చేశాను, మీరు దీనికి ఆనుకుని కూర్చుంటారని' అని విన్నవించుకున్నాను. అప్పుడాయన(స) ఇలా అన్నారు: "ఏమిటి, (ప్రాణుల) రూపచిత్రాలున్న ఇంట్లో దైవ దూతలు ప్రవేశించరన్న సంగతి నీకు తెలియదా? ఇంకా ఎవరైతే రూపచిత్రాలు చేస్తాడో, అతన్ని ప్రళయదినాన శిక్షించడం జరుగుతుంది.'ఏ ఆకృతిని నీవు తయారు చేశావో, అందులో ప్రాణం పొయ్యి' అని అతనితో అనటం జరుగుతుంది."

**539)** అబూ తల్హా (రజి) చెప్పగా తాను విన్నానని ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు. దైవప్రవక్త(సఅసం) ప్రవచించగా తాను విన్నానని అబూ తల్హా చెప్పారు. దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "కుక్కలున్న ఇంట్లోకి దైవదూతలు రారు. ప్రాణుల చిత్రాలున్న ఇంట్లోకి కూడా దైవదూతలు ప్రవేశించరు."

**540)** దైవప్రవక్త(సఅసం) ప్రవచించారని అబూ తల్హా (రజి) ఉల్లేఖించారు: "(ప్రాణుల) రూపచిత్రాలున్న ఇంట్లోకి దైవదూతలు రారు". బుస్ర్ ఇలా వివరించారు: జైద్ బిన్ ఖాలిద్(రజి) అస్వస్థతకు గురైన కారణంగా మేము ఆయన్ని పరామర్శించడానికి ఆయన ఇంటికి వెళ్ళాము. ఆ ఇంట్లో వ్రేలాడుతున్న ఒక తెరపై

**రూపచిత్రాలున్నాయి. అప్పుడు నేను ఉబైదుల్లాహ్ ఖౌలానీతో, 'ఏమిటి, ఈయన గారు మనకు రూపచిత్రాల గురించి ఒక హదీసు వినిపించలేదా?' అని సందేహ పడగా, ఆయన ఇలా అన్నారు: 'వస్త్రంపై (ప్రాణం లేని వస్తువు యొక్క) నగిషీ ఉంటే అది వేరే విషయం అని జైద్(రజి) చెప్పారు. మీరు ఆ హదీసులోని ఈ వాక్యం వినలేదా?' దానికి నేను 'లేద'న్నాను. 'అదీ సంగతి! హజ్రత్ జైద్(రజి) ఈ విషయం కూడా చెప్పారు'[1] అని ఆయన నా సందేహ నివృత్తి చేశారు.**

**541) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : ఒకసారి హజ్రత్ జిబ్రయీల్– అలైహిస్సలాం– దైవప్రవక్త(సఅసం)తో తాను రాబోతున్నానని వాగ్దానం చేశారు (కాని చెప్పిన సమయానికి రాలేదు). తరువాత ఆయన ఏతెంచి నప్పుడు రాకపోవడానికి కారణం ఏమిటని దైవప్రవక్త(స) అడగ్గా, "రూపచిత్రాలు, కుక్కలు ఉన్న ఇంట్లో (దైవదూతలమైన) మేము ప్రవేశించము" అని జిబ్రయీల్(అ) చెప్పారు.[1]**

**542) మహనీయ ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : "(నమాజ్‌లో) ఇమామ్ 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అని పలికినప్పుడు మీరు 'అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్దు' అని బదులు పలకండి. ఈ విధంగా ఎవరి పలుకు దైవదూతల పలుకుతో కలు స్తుందో వారి వల్ల జరిగిన వెనుకటి పాపాలు క్షమించబడతాయి."**

**543) హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "ఏ వ్యక్తి అయినా నమాజ్**

---

540–1. దైవదూతలు పాపకార్యాలను అసహ్యించుకుంటారు. ప్రాణుల రూపచిత్రాలను తయారు చేయటం కూడా దేవుని దృష్టిలో పాపకార్యమే. అందుకే అలాంటి చోట్ల కారుణ్య దూతలు రారు. అలాంటి నివాస గృహాలు దైవకారుణ్యానికి నోచుకోకుండా పోతాయి. దైవప్రవక్త(స) ప్రవచించిన హదీసు సత్యం. అందులో కూపీలు లాగటం బిద్అత్(కొత్త పోకడ). దైవదూతలు ఆధ్యాత్మిక జీవులు. వారెలాంటివారో, వారి కార్యకలాపాలు కూడా అలాగే– పవిత్రంగా– ఉంటాయి. ఇకపోతే; హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్(రజి) ఇంట్లో వ్రేలాడుతున్న తెరపై చిత్రాలున్న సంగతి నిజమేగాని అవి ప్రాణుల రూపచిత్రాలు కావు.

541–1. ధన ప్రాణాల రక్షణ కోసం పెంచబడే కుక్కల వ్యవహారం, శాంతిభద్రతల కోసం తర్ఫీదు ఇవ్వబడే కుక్కల విషయం ఈ ఆజ్ఞా పరిధిలోకి రాదు. ఇతర రివాయతులలో దీనికి సంబంధించిన వివరాలు ఉన్నాయి.

**కారణంగా– ఎక్కడయినా– వేచి ఉన్నట్లయితే అతని ఆ సమయమంతా నమాజ్‌గానే లెక్కించబడుతుంది. దైవదూతలు అతని కోసం ప్రార్థిస్తారు– 'అల్లాహ్! ఇతన్ని మన్నించు. ఇతనిపై నీ కారుణ్యాన్ని కురిపించు' అని. అతను నమాజ్‌ను ముగించి ఆ స్థలం నుంచి లేవనంత వరకూ లేదా మాట్లాడనంత వరకూ (ఈ పరిస్థితి నెలకొని ఉంటుంది).**

**544) తన తండ్రి (యాలా బిన్ ఉమయ్యా– రజి) తనతో చెప్పారని సఫ్వాన్ బిన్ యాలా తెలిపారు: నేను దైవప్రవక్త(స) నోట విన్నాను– ఆయన వేదికపై జుఖ్‌రుఫ్ సూరాలోని ఈ ఆయత్ పఠిస్తూ ఉన్నారు: "వ నాదవ్ యా మాలికు.." (ఓ మాలిక్! అని నరకవాసులు మొరపెట్టుకుంటారు). అయితే అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) పారాయణంలో "వ నాదవ్ యా మాలి" [1] అని ఉందని సఫ్వాన్ చెప్పారు.**

**545) దైవప్రవక్త(సఅసం) పవిత్ర సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: ఈమెగారు దైవప్రవక్త(స)ను, 'ఉహుద్ దినంకన్నా గడ్డు దినం ఏదైనా మీపై గడిచిందా?' అని అడిగినప్పుడు, ఆయన(స) ఇలా చెప్పారు: "(ఆయిషా!) నీ జాతి (ఖురైషు)వారి చేత నేను ఎన్నెన్ని కష్టాలు ఎదుర్కొన్నానో! అయితే 'అఖబా దినం'[1] వీటన్నింటికంటే నా పాలిట ఎంతో విపత్కరమైనది. నేను (తాయిఫ్ సర్దారైన) కనానా బిన్ అబ్దె యాలైల్ దగ్గరకెళ్ళి రక్షణ కోరిన సందర్భమది.[2] కాని అతడు (ఇస్లాం స్వీకరించలేదు సరికదా) నా అభ్యర్థనను త్రోసిపుచ్చాడు. నేనక్కడి నుండి దుఃఖ వదనుణ్ణి అయి వెనుదిరిగాను (నాలో నేను లేని పరిస్థితి అది). 'ఖర్నుస్సాలిబ్' స్థలానికి చేరుకునేసరికి ఏదో అలికిడి. తలెత్తి పైకి చూశాను– ఒక మేఘ మాలిక**

---

544–1. జుఖ్‌రుఫ్ సూరాలోని ఆయత్ (77) పూర్తిగా ఇలా ఉంది: "ఓ మాలిక్! నీ ప్రభువు మమ్మల్ని అంతం చేసేస్తే బాగుంటుంది" అని నరకవాసులు మొరపెట్టుకుంటారు. 'మాలిక్' నరక పాలకుడుగా ఉన్న దైవదూత. ఈ హదీసుల్లో –నిరంతరం– దైవదూతల ప్రస్తావన వస్తోంది. మాలిక్ కూడా ఒక దైవదూతే గనక ఇమామ్ బుఖారీ (రహ్మా) ఈ హదీసును ఇక్కడ తీసుకువచ్చారు.

545–1. 'అఖబా' అనేది ఒక ప్రదేశం పేరు. అది తాయిఫ్‌కు వెళ్ళే దారిలో ఉంది.

545–2. పినతండ్రి అబూతాలిబ్ మరణానంతరం దైవప్రవక్త(స) 'తాయిఫ్'కు వెళ్ళారు. తాయిఫ్ సర్దారుల రక్షణ తనకు లభిస్తుందని ఆశించారు. అలాగే అక్కడి బనీ సఖీఫ్ తెగవారు

నాకు నీడ కల్పిస్తూ ఉంది. ఆ మేఘంలో నేను హజ్రత్ జిబ్రయీల్ (అ)ని చూశాను. ఆయన నన్ను ఎలుగెత్తి పిలుస్తూ, "మీ జాతి వారు మీ గురించి చెప్పిన మాటలన్నీ అల్లాహ్ విన్నాడు. మీ అభ్యర్థనను త్రోసిపుచ్చుతూ చెప్పిన దానిని కూడా విన్నాడు. మీ వద్దకు అల్లాహ్ పర్వతాల పర్యవేక్షణా దూతను పంపించాడు. మీరు మీ జాతి వారిని ఏ విధంగా శిక్షించాలో మీరే ఆజ్ఞాపించండి" అన్నారు. ఆ తరువాత పర్వతాల పర్యవేక్షకుడుగా ఉన్న దైవదూత కూడా నన్ను ఎలుగెత్తి పిలిచాడు. ఆయన నాకు సలామ్ చేసి, "ఓ ముహమ్మద్!"అన్నాడు. ఆ తరువాత ఆయన కూడా ఆ మాటే అన్నాడు. (తమరు ఆదేశించండి) తమరు సరేనంటే వారికి ఇరువైపులా ఉన్న పర్వతాలను పరస్పరం కలిపి వారిని నుజ్జునుజ్జు చేసేస్తాను అని. దానికి దైవ ప్రవక్త (వద్దు... వద్దు... అలా చేయవద్దు) అల్లాహ్ వారి జాతి నుండి ఓ నవతరాన్ని సృష్టిస్తాడనీ, వారంతా ఒక్కడైన అల్లాహ్‌ను ఆరాధిస్తారనీ, వారు షిర్క్ చేయరన్న ఆశ నాకుంది" అన్నారు.[3]

**546)** అబూ ఇస్‌హాఖ్ షైబానీ ఇలా అన్నారు: నేను జిర్ బిన్ హుబైష్ గారిని, సూరయె నజ్మ్‌లోని ఈ దైవోపదేశం గురించి అడిగాను (అందులో ఇలా ఉంది): ఆయన(జిబ్రయీల్- అలైహిస్సలాం- రెండు ధనుస్సుల అంత లేదా అంతకంటే కొంచెం తక్కువ దూరంలో ఆగిపోయాడు. అప్పుడు ఆయన అల్లాహ్ దాసునికి (ముహమ్మద్-సఅసం-కు) చేరవేయవలసి ఉన్న వహీని చేరవేశాడు- అన్ నజ్మ్: **9,10).** దీని అర్థం ఏమిటి? దానికి సమాధానమిస్తూ ఆయన ఇబ్నె మస్‌ఊద్(రజి) చెప్పిన విషయాన్ని ఉదహరించారు : "దైవప్రవక్త(స) హజ్రత్ జిబ్రయీల్(అ)ను నిజరూపంలో చూశారు. అప్పుడాయనకు ఆరువందల రెక్కలున్నాయి."

**547)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి), లఖద్ రఅ మిన్ ఆయాతి

---

తన సందేశాన్ని స్వీకరిస్తారని ఎంతో ఆశ పెట్టుకున్నారు. కాని వారంతా ఆయన సందేశాన్ని తిరస్కరించారు. తుంటరి వాళ్ళ చేత ఆయనపై రాళ్ళ వర్షం కురిపించారు. దైవదౌత్యం కొరకు నీలాంటి ఒక అనామకుడే దైవానికి కావలసి వచ్చాడా! అని అవమానించారు.

545-3. సుబ్‌హానల్లాహ్! దైవప్రవక్త(స)కు తన జాతి జనులపై ఎంతటి వాత్సల్యం! వారిపట్ల ఎంతటి ఆశాభావం! ఆయన(స) ఆశించినట్లే తాయిఫ్ ప్రజలు చివరకు ఏకేశ్వరోపాసకులయ్యారు.

**రబ్బిహిల్ కుబ్రా (అతను తన ప్రభువు యొక్క గొప్ప సూచనలను చూశాడు- అన్ నజ్మ్ : 18) అన్న దైవోపదేశం గురించి చెబుతూ, ప్రవక్త మహనీయులు(స) ఒక పచ్చని రంగు గల పడకను చూశారనీ, అది ఆకాశంలోని అన్ని అంచులను పరివేష్ఠించి ఉందని (దానిపైన జిబ్రయీల్ కూర్చుని ఉన్నారు లేదా ఆయన రెక్కలున్నాయి) అని చెప్పారు.**

**548) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: "ఎవరయితే మహాప్రవక్త ముహమ్మద్(స)తన ప్రభువును చూశారని అన్నాడో, అతను చాలా పెద్ద అబద్ధం చెప్పాడు.[1] కాకపోతే ఆయన(స) జిబ్రయీల్‌ను మేరాజ్ (గగన యాత్ర) సందర్భంగా నిజరూపంలో చూశారు. ఆయన ఉనికి ఆకాశపుటంచులను ఆవరించి ఉంది."**

**549) మస్రూఖ్ వివరించారు : నేను హజ్రత్ ఆయిషా(ర.అ)ను అడిగాను- (అమ్మా! మీరేమో దైవప్రవక్త-సఅసం- అల్లాహ్‌ను చూడలేదని అంటున్నారు కదా!) మరైతే సుమ్మ దనా ఫతదల్లా- ఫకాన ఖవ్‌సైనీ అవ్ అద్‌నా అన్న ఆయత్‌ల గురించి మీరేమంటారు? అనడిగాను. దానికామెగారు (ర.అ) "ఈ ఆయత్‌లు హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను ఉద్దేశించినవి, ఆయన మానవాకారంలో దైవప్రవక్త(స) వద్దకు వస్తూ ఉండేవారు. ఈసారి మాత్రం ఆయన తన సిసలైన ఆకృతిలో అవతరించారు. ఆయన ఈ సందర్భంగా ఆకాశపుటంచులన్నింటినీ (తన రెక్కలతో) కప్పేశారు" అని చెప్పారు.**

**550) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ సమురా బిన్ జుందబ్(రజి) ఉల్లేఖించారు: "ఈ రోజు రాత్రి నేను (కలలో) చూశాను- ఇద్దరు వ్యక్తులు నా దగ్గరకు వచ్చి ఇలా అన్నారు: అగ్నిని ప్రజ్వలింపజేస్తున్న అతను నరక పాలకుడు. అతని పేరు మాలిక్. నేను జిబ్రయీల్‌ని, ఇతనేమో మీకాయిల్."[1]**

**551) మహా ప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని మహనీయ అబూ**

---

548-1 ఈ విషయంలో అభిప్రాయ భేదం ఏర్పడింది. అత్యధిక మంది విద్వాంసులు 'ఆయన (స) తన ప్రభువును చూశార'నే అంటున్నారు.

550-1. ఈ హదీసు సుదీర్ఘమైనది. ఇంతకుముందు 'కితాబుల్ జనాయిజ్'లో వచ్చింది.

హురైరా (రజి) ఉల్లేఖించారు: "ఒకవేళ భర్త తన భార్యను (సంయోగం కొరకు) తన పడకపై పిలిచినప్పుడు, భార్య (అకారణంగా) రావడానికి నిరాకరిస్తే, తత్కారణంగా భర్త ఆమె పట్ల అసంతృప్తితో పడుకుంటే- తెల్లవారే వరకూ ఆ స్త్రీని దైవదూతలు శపిస్తూ ఉంటారు."[1]

**552)** ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా తాను విన్నానని జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తెలిపారు : ఆయన(స) ఇలా చెప్పారు– (మొదట 'హిరా' గుహలో దైవదూత జిబ్రయీల్(అ) ప్రత్యక్షమై నా చేత 'ఇక్రా' సూరా చదివించి వెళ్ళిన తరువాత) నాపైన 'వహీ' అవతరణ (మూడేళ్ళ వరకూ) ఆగిపోయింది. ఒకసారి నేను ఎక్కడికో వెళుతుండగా, ఆకాశంలో ఒక శబ్దం విని, తలెత్తి చూశాను. హిరా గుహలో నా వద్దకు వచ్చిన దైవదూత ఆకాశానికీ– భూమికీ మధ్యన ఒక కుర్చీపై కూర్చుని ఉన్నాడు. ఆ దృశ్యాన్ని చూసి నేను ఎంతగా భయకంపితుణ్ణి అయ్యానంటే ఒక్కసారిగా నేలపై కుప్పకూలిపోయాను. తరువాత నేను ఇంటికి వచ్చి, "నా మీద ఏదైనా కప్పండి, ఏదైనా కప్పండి" అని చెప్పసాగాను. ఆ తరువాత అల్లాహ్ ఈ ఆయత్‌లను అవతరింపజేశాడు– *యా అయ్యుహల్ ముద్దస్సిర్– ఖుమ్ ఫఅన్‌జిర్–* నుండి *వర్రుజ్‌జ ఫహ్‌జుర్* వరకు. ఆయత్‌లోని 'రిజ్‌జ్'కు అర్థం 'విగ్రహం' అని అబూ సలమా చెప్పారు.

**553)** దైవప్రవక్త(సఅసం) ఈ విధంగా ప్రవచించారని ఆయన(స) పెత్తండ్రి కుమారుడగు అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: మేరాజ్ రాత్రి సందర్భంగా నేను మూసా (అలైహిస్సలామ్)ని చూశాను. గోధుమ వర్ణం, పొడుగరి, వంకీలు తిరిగిన జుత్తు. షనూఅ తెగకు చెందిన వ్యక్తిలా అనిపించారు. నేను ఈసా (అలైహిస్సలామ్)ని కూడా చూశాను. మరీ అంత పొడుగరీ కాదు, పొట్టీ కాదు. ఎరుపు, తెలుపు కలగలసిన వర్ణంలో ఉన్నారాయన, జులఫాలు తిన్నగా ఉన్నాయి (ఉంగరాల జుత్తు కాదు). నేను నరక పాలకుణ్ణి కూడా చూశాను. దజ్జాల్‌ను కూడా. అల్లాహ్ నాకు చూపించిన ఈ మొత్తం సూచనలు (అస్ సజ్దా సూరాలో ప్రస్తావించ

---

551–1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకురావటంలోని ముఖ్య ఉద్దేశం దైవదూతల ఉనికిని నిరూపించటమే. అదలా ఉంచితే– షరీఅత్ పరమైన కారణమేదీ లేకుండా– భార్య తన భర్త లైంగిక కోర్కెను తీర్చకపోవటం, అతనితో సహక రించకపోవటం ఆమె దౌర్భాగ్యానికి ఆనవాలు.

బద్దాయి). కనుక (ప్రవక్తా!) ఆయన్ని కలుసుకున్న విషయమై నీవు సంశయానికి లోను కావద్దు- అంటే మూసా(అ)ను కలుసుకున్న విషయమై. మహాప్రవక్త(స) ఈ విధంగా వక్కాణించినట్లు అనస్,అబూబక్ర్ (రజి.అన్హుమా) చెప్పారు. "దజ్జాల్ బయల్పడినప్పుడు దైవదూతలు మదీనా నగరాన్ని రక్షిస్తారు".

## అధ్యాయం: 7

## స్వర్గం గురించి : స్వర్గం సృష్టించబడింది[1] అన్న దాని గురించి...

అల్ బఖరా సూరాలో 'ముతహ్హారతున్' అనే పదం వచ్చిందని, దానికి అర్థం స్వర్గ కన్యలనీ అబుల్ ఆలియా అంటారు. వారికి బహిష్టు రాదు. మూత్ర విసర్జన జరగదు. వారు ఉమ్మి కూడా వేయరు. వారు ఇలాంటి మాలిన్యాలన్నింటి నుండి పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉంటారు.

(స్వర్గంలో) కాలువలు ప్రవహించే ఉద్యానవనాలు వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి. ఆ వనాలలోని పండ్లు ఆకారంలో భూలోకంలోని పండ్లను పోలి ఉంటాయి. తినడానికి ఏమైనా పండ్లు ఇవ్వబడినప్పుడల్లా వారు "ఇలాంటి పండ్లే పూర్వం భూలోకంలో మాకు ఇవ్వబడేవి" అని అంటారు. అక్కడ వారి కొరకు పవిత్రలైన భార్యలు ఉంటారు. వారు అక్కడే శాశ్వతంగా ఉంటారు. *(అల్ బఖరా : 25)*

అరబీ మూలంలో 'ముతషాబిహన్' అనే పదం వచ్చింది. దీనికి ఆకృతిలోనూ, రంగులోనూ పరస్పరం పోలి ఉంటాయి అని అర్థం. అల్ హాఖ్ఖా సూరాలో 'ఖుతూఫుహా దానియా' అన్న పదం వచ్చింది. దీనికి అర్థం, వాటి పండ్ల గుత్తులు వ్రేలాడుతూ ఉంటాయి. అవి ఎంత దగ్గరగా ఉంటాయంటే స్వర్గవాసులు నిలబడి ఉన్నా, కూర్చుని ఉన్నా- ఏ స్థితిలోఉన్నా- వాటిని సులువుగా కోసుకోగలరు. 'అరాయిక' అంటే పీఠం అని అర్థం. 'నజ్రతా' అని నోటి తాజాదనాన్ని ఉద్దేశించి అంటారనీ, 'సురూర్' అంటే మనో రంజనం అనీ ఇమామ్ హసన్ బస్రీ వ్యాఖ్యానించారు. 'సల్ సబీలా' అంటే పరవళ్ళు తొక్కుతూ- వేగంగా- ప్రవహించేది అనీ,

---

7-1. స్వర్గంతోపాటు నరకం కూడా సృష్టించబడింది. 'అహ్లె సున్నత్' చెప్పేది ఇదే. దీని ఆధారంగా, 'స్వర్గం ప్రళయదినాన సృష్టించబడుతుంద'న్న మోతజిలా వర్గీయుల వాదనను ఖండించినట్లయింది. సంకలనకర్త ఇక్కడ ప్రస్తావించిన హదీసుల ద్వారా స్వర్గం ఉనికి నిరూపించబడింది.

'ఘౌల్' అంటే కడుపు నొప్పి అనీ అర్థం. 'యున్‌జఫూన్' అంటే వారి బుద్ధి తికమక పడదు అని అర్థం. మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అంటారు : 'అన్ నబా' సూరాలో 'దిహాఖా' అనే పదం వచ్చింది. దిహాఖా అంటే పూర్తిగా నింపబడి ఒలుకు తున్న మధుపాత్రలని భావం. 'కవాయిబ్' అంటే వక్షోజాలు ఉబికి యవ్వనం ఉప్పొంగే సుందరాంగులు అని అర్థం. 'రహీఖ్' అంటే స్వర్గంలోని స్వచ్ఛమైన మద్యం. 'తస్నీమ్' అనేది ఓ ప్రత్యేకమైన అరకు. అది స్వర్గవాసులకు ఇచ్చే మద్యం పైన చిలకరించబడుతుంది. స్వర్గవాసులు ఆ మద్యాన్ని సేవిస్తారు. 'ఖితామ్' అంటే మధుపాత్రలకు సీలు వేయడానికి ఉపయోగించే ధాతువు. 'నజ్జాఖతాన్' అంటే పొంగిపొరలే సెలయేరులు. 'మౌజూన' అంటే ప్రత్యేకంగా తయారు చేయబడినది అని అర్థం. దీని నుండే 'ఒంటె జీను నేయబడినది' అన్న పదం వచ్చింది. ... 'జవాతా అఫ్‌నాన్' అంటే స్వర్గంలోని ఆ తోటలు శాఖోపశాఖలుగా విస్తరించి ఉంటాయి. 'వ జనల్ జన్నతైని దాన్'. ఆ రెండు తోటల పండ్లు స్వర్గవాసులకు చాలా దగ్గరగా ఉంటాయి. 'ముద్‌హామ్మతాన్' అంటే ఆ (మరో రెండు) తోటలు ఏపుగా పెరిగి ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి.

**554)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు: "ఎవరయినా ఒక వ్యక్తి మరణించి నప్పుడు (ప్రతి రోజూ) ఉదయం, సాయంత్రం– రెండు పూటలా– (అతను పర లోకంలో ఉండవలసిన) నివాస స్థలం అతనికి చూపించబడుతుంది– ఒకవేళ అతను స్వర్గవాసి అయివుంటే స్వర్గంలో[1], అతను నరకవాసి అయివుంటే నర కంలో."

**555)** హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహ నీయులు (సఅసం) ఇలా ప్రవచించారు : "నేను స్వర్గంలోనికి తొంగి చూసినప్పుడు స్వర్గవాసులలో చాలామంది పేదవారు కనిపించారు. నేను నరకంలోనికి తొంగి చూసినప్పుడు, నరకవాసులలో అధికంగా స్త్రీలు కనిపించారు."

---

554–1. హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ) ఈ హదీసు ఆధారంగా స్వర్గనరకాలు ఇప్పటికే నెలకొని ఉన్నాయని, అవి అనుదినం అక్కడికి చేరుకునే వారికి చూపించబడుతూ ఉన్నాయని పేర్కొన్నారు. ప్రళయదినాన– తీర్పు అనంతరం– వారు పూర్తి స్థాయిలో తమ తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు.

**556) హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: మేము దైవప్రవక్త (సఅసం)తో కలసి కూర్చుని ఉండగా ఆయన(స) ఇలా అన్నారు : "నేను కలలో స్వర్గాన్ని చూశాను. అందులో నేను ఒక స్త్రీని చూశాను. ఆమె ఒక మేడ ప్రక్కన 'వుజూ' చేస్తూ ఉంది. 'ఈ మేడ ఎవరిది?' అని నేను అడిగితే, 'ఇది ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)ది' అని దైవదూతలు చెప్పారు. నాకు ఆయన పౌరుషం గుర్తొచ్చి, వెంటనే అక్కడి నుంచి తిరిగి వచ్చేశాను". ఇది విన్న ఉమర్(రజి) వలవలా ఏడ్చే శారు. 'దైవప్రవక్తా! మీ యెడల నాకు పౌరుషం ఏమిటి?' [1] అని చెప్పారు.**

**557) దైవప్రవక్త(సఅసం) ప్రవచించినట్లుగా తన తండ్రి (అబూ మూసా అష్అరీ-రజి) తనతో చెప్పారని అబూబక్ర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ అష్అరీ తెలిపారు: "(స్వర్గవాసుల) గుడారం అంటే ఏమనుకున్నారు? అదొక ముత్యం. దాని ఎత్తు పైన ముప్ఫయి మైళ్ళ వరకూ ఉంటుంది. దాని ప్రతి మూలన విశ్వాసి యొక్క ఒక భార్య ఉంటుంది. ఆమెను వేరెవరూ చూడలేరు."**

**558) ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "నేను సజ్జనులైన నా దాసుల కొరకు ఎటువంటి వస్తువులను సిద్ధంగా ఉంచానంటే, వాటిని ఏ కన్నూ కానలేదు, వాటి గురించి ఏ చెవీ వినలేదు. ఏ మానవ హృదయమూ వాటి గురించి ఊహించనైనా లేదు"- మీరు గనక కోరుకుంటే ఈ ఆయత్ చదువుకోండి: "వారి కర్మలకు ప్రతిఫలంగా, కళ్లకు చలువ కలిగించే ఎటువంటి సామగ్రి వారి కొరకు దాచిపెట్టబడిందో ఆ సామగ్రి గురించి ఏ ప్రాణికీ తెలియదు" (అస్ సజ్దా: 17)**

---

556-1. ఈ హదీసులన్నింటినీ ఇక్కడ పొందుపరచటంలో ఇమామ్ బుఖారీ(రహ్మ) ఉద్దేశం; స్వర్గాన్నీ, స్వర్గంలోని వర ప్రసాదాలను సత్యమైనవిగా నిరూపించడమే. స్వర్గం ఏదో ఊహాజనితమైనది కాదు. దానిని అల్లాహ్ స్వయంగా సృష్టించాడు. అందులోని అనుగ్రహ భాగ్యాలన్నీ తమవైన ఉనికిని కలిగి ఉన్నాయి.

హజ్రత్ ఉమర్(రజి) స్వర్గవాసి అన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా రూఢీ అయింది. ఈ శుభవార్త విన్న ఉమర్ (రజి) సంతోషాతిశయంతో ఏడ్చేశారు. 'అయ్యా! దైవప్రవక్తా! నాకు మీ పట్ల పౌరుషమా? ఎంతమాట! నేను మీ సేవకుడను, మీరు నా శిక్షకులు. నా జీవితాన్ని తీర్చిదిద్దినవారు. నా భార్యలంతా మీ సేవకురాండ్రు' అంటూ తన వినయాన్ని వ్యక్తపరిచారు.

**559)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "స్వర్గంలో అందరికన్నా ముందు ప్రవేశించే వర్గీయుల ముఖాలు పున్నమి చంద్రుని వలె వెలిగిపోతుంటాయి. అందులో వారు ఉమ్మటం గానీ, వారి ముక్కుల నుండి ఏదైనా చీమిడు కారటం గానీ ఉండదు. వారికి మలమూత్ర విసర్జన కూడా జరగదు. వారుపయోగించే పాత్రలు బంగారు పాత్రలై ఉంటాయి. వారి దువ్వెనలు వెండీ బంగారాలతో చేయబడి ఉంటాయి. వారి ఉంగరాల నుండి 'ఊదు' అనే ప్రత్యేక సాంబ్రాణి సువాసన గుబాళిస్తూ ఉంటుంది. వారి చెమట కస్తూరి (ముష్క్) సువాసన మాదిరిగా ఘుమఘుమ లాడుతూ ఉంటుంది. అందులో ప్రతి వ్యక్తికీ ఇద్దరేసి భార్యలుంటారు. వారి సౌందర్యం గురించి ఎలా చెప్పేది! వారి పిక్కలలోని మూలగ కూడా మాంసంపై నుంచి కానవస్తూ ఉంటుంది. స్వర్గవాసుల మధ్యన పరస్పరం అభిప్రాయ భేదంగానీ, విరోధంగానీ ఉండదు. వారి హృదయాలు ఏకమై ఉంటాయి. వారు ఉదయం, సాయంత్రం అల్లాహ్ పవిత్రతను కొనియాడటంలో లీనమై ఉంటారు."

**560)** హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "స్వర్గంలో ప్రవేశించే మొట్ట మొదటి వర్గీయుల ముఖాలు పున్నమి చంద్రునిలా వెలిగిపోతుంటాయి. ఆ తరువాత ప్రవేశించే వర్గీయుల ముఖాలు అందరికన్నా ఎక్కువగా- మెరిసే నక్షత్రాల మాదిరిగా- దేదీప్యమానంగా ఉంటాయి. వారి హృదయాలు ఒక్కటై ఉంటాయి. వారి మధ్యన భేదాభిప్రాయాలు ఉండవు. ఇంకా వారికి పరస్పరం అసూయా ద్వేషాలు కూడా ఉండవు. అక్కడ ప్రతి వ్యక్తికీ ఇద్దరు భార్యలుంటారు. వారెంత సుందర స్వరూపులై ఉంటారంటే, వారి పిక్కలలోని గుజ్జు సయితం మాంసం పైనుండి కానవస్తూ ఉంటుంది. వారు ఉదయం, సాయంత్రం అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ ఉంటారు. వారికెలాంటి జబ్బు ఉండదు. వారి ముక్కుల నుండి చీమిడు కారటంగానీ, వారి నోట ఉమ్మి రావటంగానీ ఉండదు. వారి పాత్రలు వెండీ బంగారాలవై ఉంటాయి. వారి దువ్వెనలు బంగారంతో తయారై ఉంటాయి. వారి ఉంగరాలలో 'ఉలువ్వాహ్' ప్రజ్వలిస్తూ ఉంటుంది. సాంబ్రాణిని 'ఉలువ్వాహ్' అంటారని అబుల్ యమాన్ చెప్పారు. వారి చెమట కస్తూరిలా (గుబాళిస్తూ)

ఉంటుంది" 'ఇబ్‌కార్' అంటే ఉషోదయం అనీ, 'అషియ్యి' అంటే సూర్యుడు అస్తమించే సమయమనీ ముజాహిద్ వ్యాఖ్యానించారు.

**561)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించినట్లుగా సహ్లా బిన్ సాద్(రజి) ఉల్లేఖించారు: "నా అనుచర సముదాయంలోని డెభ్భయి వేల మంది లేదా (ఆయన-స-ఇలా అన్నారు) ఏడు లక్షల మంది సమూహం స్వర్గంలో ఒకేసారి ప్రవేశిస్తుంది. వారందరి ముఖాలు పున్నమి చంద్రునిలా ప్రకాశిస్తూ ఉంటాయి.

**562)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ప్రవక్త మహనీయుల (సఅసం) సమక్షంలో 'సుందుస్' అనే ఓ ప్రత్యేక రకం పట్టు చొక్కా సమర్పించ బడింది. ఆయన (పురుషుల కొరకు) పట్టు వస్త్రాల వినియోగాన్ని అంతకుముందే వారించి ఉన్నారు. జనులు ఆ చొక్కాను ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పుడు దైవ ప్రవక్త(స), "స్వర్గంలో సాద్ బిన్ ముఆజ్‌కు వొసగబడే కండువాలు దీనికన్నా మెరుగ్గా ఉంటాయి" అని పలికారు.

**563)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ తెలి పారు: బరా బిన్ ఆజిబ్ ఇలా చెప్పారు- ప్రవక్త మహనీయుల(సఅసం) సమక్షంలో ఒక వస్త్రం సమర్పించబడింది. దాని నాణ్యతని, లావణ్యాన్ని చూసి జనులు అచ్చెరువొందారు. అప్పుడు దైవప్రవక్త(స)ఇలా వక్కాణించారు: "(ఏమిటి, దీని మృదుత్వాన్ని చూసి మీరు ఆశ్చర్యపోతున్నారా?) స్వర్గంలో సాద్ బిన్ ముఆజ్‌కు ప్రదానం చేయబడే రుమాళ్ళు దీనికన్నా శ్రేష్ఠమైనవి."[1]

**564)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించారని హజ్రత్ సహ్లా బిన్ సాద్ సాయిదీ (రజి) ఉల్లేఖించారు : "స్వర్గంలో ఒక కొరడా ఉంచడానికి పట్టే స్థలం ఈ ప్రపంచంకన్నా, ప్రపంచంలో ఉన్న వాటన్నింటికన్నా శ్రేష్ఠమైనది."

**565)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు : "స్వర్గంలో ఒక వృక్షం ఉంది. దాని నీడలో ఒక గుర్రపు రౌతు నూరేళ్ళు ప్రయాణించినా ఆ నీడ తరగదు."

---

563-1. దైవప్రవక్త(స) ఈ విధంగా పలకటంలోని ఉద్దేశం; ఇహలోకంలో లభించే అతి గొప్ప వస్తువు కూడా స్వర్గవాసి ముక్కు ముఖం తుడుచుకునే రుమాలు (టవల్) కన్నా విలువైనదేమీ కాదన్నదే.

**566)** హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్(సఅసం) ఇలా ప్రబోధించారు: "స్వర్గంలో ఒక చెట్టు ఉంది. ఆ చెట్టు నీడలో ఒక గుర్రపు రౌతు నూరేళ్ళ వరకు ప్రయాణం చేయగలడు. మీరు కావాలనుకుంటే ఈ ఆయత్‌ను చదువుకోండి – **వ జిల్లిమ్ మమ్‌దూద్.** ***(56 : 30)*** ఒక ధనుస్సు అంత స్థలం స్వర్గంలో లభించినా అది ప్రపంచంలో సూర్యుడు ఏ ఏ వస్తువులపై ఉదయిస్తాడో, అస్తమిస్తాడో వాటన్నింటికన్నా శ్రేష్ఠమైనది."

**567)** మహనీయ అబూ హురైరా(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "అందరికన్నా ముందుగా స్వర్గంలో ప్రవేశించే వర్గీయుల ముఖాలు పున్నమి చంద్రునివలే ప్రకాశమానంగా ఉంటాయి. ఆ తరువాత ప్రవేశించే వారి ముఖాలు ఆకాశంలో ముత్యాల్లా మెరిసే నక్షత్రాలలో అన్నింటికన్నా దేదీప్యమానమైన నక్షత్రంలా ఉంటాయి. వారందరి మనసులు ఒక్కటై ఉంటాయి. వాటిలో అక్కసు గానీ, అసూయ గానీ ఉండదు. ప్రతి స్వర్గవాసికి రెండు పెద్దపెద్ద కన్నులు గల స్వర్గ కన్యలు (సతీమణులు) ఉంటారు. వారెంత సుందరాంగులంటే వారి కాళ్ళ పిక్కల పైని మాంసంలోనుంచి, ఎముకలో నుంచి లోపలి మూలగ సైతం కానవస్తూ ఉంటుంది."

**568)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అదీ బిన్ సాబిత్ తెలిపారు: అంతిమ దైవప్రవక్త(సఅసం) కుమారుడు ఇబ్రాహీమ్(రజి) చనిపోయి నప్పుడు, "స్వర్గంలో అతనిని పాలు త్రాపే ఒక ఆయాకు అప్పగించటం జరిగింద"ని (అక్కడ ఆమె అతనికి పాలు ఇస్తుందని) దైవప్రవక్త(స) చెప్పారు.

**569)** అబూ సయీద్ ఖుద్రీ(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు: "స్వర్గవాసులు తమ కన్నా పైనున్న గదుల్లో ఉండే వారిని చూసినప్పుడు వారు ప్రభాత సమయాన మెరిసే నక్షత్రాల్లా గోచరిస్తారు– ఆకాశపుటంచుల్లో ప్రాక్ పశ్చిమాలలో చూసినట్లుగా! వారిలో ప్రతి ఒక్కరూ ఇతరులకన్నా శ్రేష్ఠులై ఉంటారు." 'అయ్యా దైవప్రవక్తా! బహుశా అవి దైవప్రవక్తల మేడలై ఉంటాయి! వారు తప్ప ఇతరులెవరైనా వాటికి ఎలా నోచుకోగలరు?' అని జనులు విన్నవించుకోగా, "లేదు. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! దైవాన్ని విశ్వసించి, దైవప్రవక్తలను సత్యవంతులుగా

**ధ్రువపరిచిన వారికి ఈ అనుగ్రహ భాగ్యాలు ప్రాప్తిస్తాయి"** [1] **అని ఆయన(స) చెప్పారు.**

## అధ్యాయం : 8

## స్వర్గ ద్వారాల గురించి....

**570) అంతిమ దైవప్రవక్త(సఅసం) ప్రవచించినట్లుగా సహ్ల్ బిన్ సాద్ సాయిదీ (రజి) ఉల్లేఖించారు: "స్వర్గానికి ఎనిమిది ద్వారాలు ఉన్నాయి. వాటిలో ఒక ద్వారం పేరు రయ్యాన్. ఆ ద్వారం గుండా (స్వర్గంలో) ప్రవేశించేవారు ఉపవాసకులై ఉంటారు."**

**"ఎవరయితే ఏదైనా ఒక వస్తువు యొక్క జతను (దైవమార్గంలో) ఖర్చు చేస్తాడో, అతన్ని స్వర్గపు ద్వారం నుండి పిలవటం జరుగుతుంది-" ఈ అధ్యాయంలో ఉబాదా బిన్ సామిత్ దైవప్రవక్త(స) నుండి ఉటంకించారు.**

## అధ్యాయం : 9

## నరకం తీరుతెన్నుల గురించి... అది ఇప్పటికే సిద్ధంగా ఉందన్న విషయం గురించి...

**అన్ నబా సూరాలో 'గస్సాఖా' అనే పదం వచ్చింది. దీనికి చీము నెత్తురు అని అర్థం. అరబ్బు ప్రజలు *గసఖత్ అయ్‌నుహూ* అంటారు. అంటే అతని కళ్ళు ప్రవహిస్తున్నాయి, అతని కంట కన్నీరొలుకుతుంది అని అర్థం.. అల్ హాఖ్ఖా సూరాలో 'గస్‌లీన్' అని ఉంది. అంటే 'కడుగు' అన్నమాట. ఏదైనా ఒక వస్తువును కడిగినప్పుడు దాని నుండి వెలువడే మురికి లేదా మనిషి గాయాల కడుగు అన్న మాట. ఇక్రిమా ఇలా అంటారు: అల్ అంబియా సూరాలో 'హసబు జహన్నమా' అనే పదం వచ్చింది. అంటే నరకపు ఇంధనం అని అర్థం. ఇది అబిసీనియన్ల భాష... అంటే వారు నరకంలో పడవేయబడతారు, నరకానికి ఇంధనం అవుతారు అన్న భావంలో ఈ పదప్రయోగం జరిగింది... అర్రహ్మాన్ సూరాలో 'మారిజున్' అనే పదం ప్రయోగించబడింది. అంటే ప్రత్యేకమైన అగ్ని. అరబ్బు జనులు మరజల్ అమీరు రయియ్యతహూ అంటుంటారు. అంటే రాజ్యాధిపతి తన ప్రజలను వదలి**

569-1. ఇహలోక జీవితంలో దైవప్రవక్తల(అలైహిముస్సలాం) విధానానికి కట్టుబడి, విశ్వసించిన మీదట సదాచరణ చేస్తూ ఉన్నవారికి ఈ మేడలు, మిద్దెలు లభిస్తాయి.

పెట్టేశాడు అని అర్థం. ఖాఫ్ సూరాలో 'మరీజ్' అనే పదం వచ్చింది. అంటే కలసి పోయినది. అనుమానాస్పదమైనది. మరజ అమ్రున్నాసి ఇఖ్తలత్. అంటే ప్రజల వ్యవహారం కలగాపులగమై పోయింది అని అర్థం. అర్రహ్మాన్ సూరాలో మరజల్ బహ్రైని అని ఉంది. ఇది మరజ్త దాబ్బతక్ నుండి వెలువడింది. అంటే నీవు నీ పశువును వదలిపెట్టేశావు అని అర్థం.

**571)** అబూజర్(రజి) చెప్పగా తాను విన్నానని జైద్ బిన్ వహబ్ తెలిపారు: ఆయన ఇలా చెప్పేవారు– దైవప్రవక్త(సఅసం) ఒక ప్రయాణంలో ఉన్నప్పుడు (హ్రజత్ బిలాల్–రజి–జుహ్ర్ అజాన్ ఇవ్వడానికి లేచి నిలబడ్డారు), "ఆగు, కాస్త చల్లబడనివ్వు" అని ఆయన (స) పలికారు. మరి రెండవసారి కూడా (బిలాల్ అజాన్ ఇవ్వడానికి సిద్ధమైనప్పుడు) "ఇంకాస్త చల్లబడనివ్వు" అని ఆయన(స) పురమాయించారు. చివరకు గుట్టల నీడ బాగా వాలిపోయినప్పుడు ఆయన(స) ఇలా ఉద్బోధించారు: "చల్లని వేళల్లో నమాజ్ చేయండి. ఎందుకంటే గ్రీష్మతాపం నరకం సెగ నుండి పుడుతుంది."

**572)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రబోధించారని హ్రజత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖించారు: "చల్లని వేళ నమాజ్ చేయండి. ఎందుకంటే వేసవి తీవ్రత నరకం ఆవిరి నుండి ఉద్భవిస్తుంది."

**573)** దైవప్రవక్త(సఅసం) ఇలా ప్రవచించారని హ్రజత్ అబూ హురైరా (రజి) చెబుతుండేవారు: "నరకం తన గోడును తన ప్రభువుకు వినిపిస్తూ 'నా ప్రభూ! నాలోని కొన్ని భాగాలు మరికొన్ని భాగాలను తినేస్తున్నాయి' అని చెప్పింది. అప్పుడు అల్లాహ్ దానికి రెండు శ్వాసల అనుమతి ఇచ్చాడు. ఒక శ్వాస (నిశ్వాసం) శీతాకాలంలో పీల్చడానికి, ఒక శ్వాస (ఉఛ్వాసం) వేసవి కాలంలో వదలడానికి. మీరు ఎండా కాలంలో తీవ్రమైన గ్రీష్మతాపాన్ని, శీతాకాలంలో కూడా తీవ్రమైన చలిని ఎదుర్కోవడానికి కారణమిదే".

**574)** అబూ జమ్రా నస్ర్ బిన్ ఇమ్రాన్ జుబ్'యీ తెలిపారు : నేను మక్కాలో ఇబ్నె అబ్బాస్(రజి) దగ్గర కూర్చునేవాణ్ణి. అక్కడ నాకు జ్వరం వచ్చింది. అప్పుడు ఇబ్నె అబ్బాస్(రజి) నాతో, "జ్వరాన్ని జమ్'జమ్ జలంతో చల్లబరచు. ఎందుకంటే దైవప్రవక్త(స), 'జ్వరం నరకం ఆవిరి ప్రభావం వల్ల వస్తుంది. అందువల్ల దానిని

నీటితో చల్లార్చుకోండి' అని ఉద్బోధించారు. లేదా ఇలా అన్నారు: "జమ్‌జమ్ జలంతో"– ఇక్కడ ఉల్లేఖకుడు హమ్మామ్ సంశయంలో పడ్డారు.

**575)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించగా తాను విన్నానని రాఫె బిన్ ఖదీజ్(రజి) తెలిపారు: ప్రవక్త(స) ఇలా చెప్పారు– "జ్వరం అనేది నరకం ఉగ్రరూపం వల్ల వస్తుంది. కాబట్టి దానిని నీళ్ళతో చల్లార్చండి."

**576)** ప్రవక్త మహనీయులు(సఅసం) ఉద్బోధించినట్లుగా హజ్రత్ ఆయిషా (ర.అ) ఉల్లేఖించారు: "జ్వరం అనేది నరకం ఆవిరి ప్రభావం వల్ల వస్తుంది. కనుక దానిని చన్నీళ్ళతో చల్లబరచండి."

**577)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త (సఅసం)ఇలా ఉద్బోధించారు: "జ్వరం అన్నది నరకం సెగ ప్రభావం వల్ల వస్తుంది. కాబట్టి దానిని నీటితో చల్లార్చండి."

**578)** మహనీయ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: "మీ (ఇహలోక) అగ్ని నరకాగ్ని ముందు (తన తీవ్రత రీత్యా) డెబ్భయ్యవ వంతు". ఇది విన్న వారిలో ఒకరు, 'దైవప్రవక్తా! (పాపాత్ములను, దైవ ధిక్కారులను శిక్షించడానికి) ఈ ప్రాపంచిక అగ్ని కూడా ఎక్కువే కదా!' అని విన్నవించుకోగా, "ప్రాపంచిక అగ్నికన్నా నరకాగ్ని **69** రెట్లు ఎక్కువ. ప్రతి ఒక్క భాగం ప్రపంచాగ్నికి సమానమైనది" అని మహాప్రవక్త(స) చెప్పారు.

**579)** సఫ్వాన్ బిన్ యాలా తన తండ్రి నుండి ఉటంకించారు. దాని ప్రకారం; ఆయన దైవప్రవక్త(సఅసం)ను వేదికపై "వ నాదవ్ యా మాలిక్" (ఓ మాలిక్! అని నరకవాసులు పిలుస్తారు) అని పఠించగా విన్నారు.

**580)** అబూ వాయల్ తెలిపారు: ఉసామా బిన్ జైద్(రజి)ను ఉద్దేశించి ఒకాయన, 'మీరు ఫలానా వ్యక్తి (హజ్రత్ ఉస్మాన్–రజి) దగ్గరకు వెళ్ళి, ఆయనతో మాట్లాడితే బావుంటుందేమో! (అలాగయినా ఆయన ఉపద్రవాన్ని అణచటానికి ఏదైనా ఉపాయం ఆలోచిస్తారేమో!) అని సలహా ఇవ్వగా, ఆయన (రజి) ఇలా అన్నారు: "ఏమిటి, నేను మీకు వినిపించేలా (మీ ముందరే) మాట్లాడతానని

అనుకుంటున్నారా? నేను ఏకాంతంలో ఆయనతో సంభాషిస్తాను– కల్లోల ద్వారం తెరచుకునేలా మాత్రం కాదు. అందరికన్నా ముందు నేను కల్లోల (ఉపద్రవ) ద్వారం తెరిచేవానిగా ఉండాలని కోరుకోవటంలేదు. దైవప్రవక్త(సఅసం) గారి హదీసును విన్న మీదట, నాపై అధినేతగా ఉన్నవాడు జనులందరిలోకెల్లా శ్రేష్ఠుడు అని కూడా నేను చెప్పను". దానికి ప్రజలు 'ఇంతకీ మీరు దైవప్రవక్త(స) నోట విన్న హదీసు ఏమిటి?' అని అడగ్గా మహనీయ ఉసామా (రజి) ఇలా చెప్పారు : నేను దైవ ప్రవక్త(స) ఈ విధంగా చెప్పగా విన్నాను– "ప్రళయదినాన ఒక వ్యక్తిని తీసుకువచ్చి, నరకంలో పడవెయ్యడం జరుగుతుంది. ఆ అగ్నికి కాలి అతని ప్రేగులు బయటికి వచ్చేస్తాయి. గాడిద తన గానుగ చుట్టూ తిరిగినట్లుగా ఆ వ్యక్తి ప్రదక్షిణ చేస్తూ ఉంటాడు. నరకానికి ఆహుతి అయినవారు అతని దగ్గరకు వచ్చి, గుమిగూడి 'ఓయీ ఫలానా వ్యక్తీ! ఈ రోజు ఏమిటీ నీ దుస్థితి! ఏమిటి, నీవు మాకు మంచి పనులు చేయమని చెప్పేవాడవు కాదా? చెడు పనుల నుండి మమ్మల్ని వారించేవాడవు కాదా??' అని అడుగుతారు. దానికతను, 'అవును నిజమే, నేను మిమ్మల్ని మంచి పనులు చేయమని ఆదేశించేవాణ్ణి. కాని నేను స్వయంగా ఆచరించేవాడిని కాను. చెడు పనుల నుండి మిమ్మల్ని వారించే వాణ్ణి. కాని నేను స్వయంగా వాటికి ఒడిగట్టే వాణ్ణి' అంటాడు.[1] ఈ హదీసును గుందర్ షూబా నుండి సంగ్రహించారు. ఆయనేమో ఆమష్ నుండి ఉల్లేఖించారు.

## అధ్యాయం : 10

## ఇబ్లీసు, అతని సైనిక దళం గురించి...[1]

అస్ సాఫ్ఫాత్ సూరాలో వచ్చిన 'యుఖ్‌జఫూన్' అనే పదానికి విసిరివేయ బడతారని అర్థం అని ముజాహిద్ అన్నారు. అదే సూరాలో 'దుహూరా' అనే పదం వచ్చింది. అంటే ధూత్కరించబడినవారు. ఇదే సూరాలో 'వాసిబున్' అనే పద ప్రయోగం జరిగింది. దీనికి 'శాశ్వతమైన' అన్న అర్థం వస్తుంది. ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు :అల్ ఆరాఫ్ సూరాలో 'మద్‌హూరా' అనే పదం వచ్చింది. దీనికి

580–1. ఈ రివాయతును ఇమామ్ బుఖారీ (రహ్మ) స్వయంగా 'కితాబుల్ ఫితన్'లో వసల్ చేశారు. దైవచిత్తమయితే ఈ హదీసు వివరణ ఆ ప్రకరణంలో రాగలదు.

**'ధూత్కరించబడినవాడు' అని అర్థం. సూరయె నిసాలో వచ్చిన 'మరీదా' అనే పదానికి దుష్టుడు అన్న అర్థం వస్తుంది.**

**581) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(రఅ) కథనం : ప్రవక్త మహనీయులు– సఅసం– (హుదైబియా ఒడంబడిక చేసుకుని తిరిగి వచ్చిన రోజుల్లో) ఆయనపై చేతబడి జరిగింది. ఈ చేతబడి ప్రభావం వల్ల, ఆయన(స) ఫలానా పని చేస్తున్నానని తలపోసేవారు. కాని నిజానికి ఆ పని చేస్తుండేవారు కారు. చివరకు ఆయన (స) ఒకరోజు దుఆ చేశారు. మరోసారి కూడా, "నా ప్రభూ! ఈ చేతబడి ప్రభావాన్ని నిర్వీర్యం చెయ్యి" అని ప్రార్థించారు. ఆ తరువాత ఆయన(స) ఆయిషా (ర.అ)తో, "అల్లాహ్ నాకు స్వస్థత చేకూరే ఉపాయం సూచించాడు, తెలుసా?" అన్నారు. (పిదప ఇలా వివరించి చెప్పారు :) "నా వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకరు నా తలవైపు కూర్చోగా, మరొకరు నా కాళ్ళ వైపు కూర్చున్నారు. తరువాత ఒకరింకొకరిని ప్రశ్నించసాగారు–**

**'ఇంతకీ ఈయన గారికి ఏమయింది?'**

**'ఈయన గారిపై చేతబడి (క్షుద్ర విద్య) చేయబడింది'– సమాధానమిచ్చాడు రెండవ అతను.**

**'ఇంతకీ చేతబడి ఎవరు చేశారు?'**

**'లబీద్ బిన్ ఆసమ్ (అనే యూదుడు)'**

**'ఆ చేతబడి ఏ ఏ వస్తువుల్లో ఉంచబడింది?'**

**'దువ్వెనలో. పట్టువస్త్రంలో. ఎండిన ఖర్జూరపు గుత్తి గలేపులో.'**

**'ఇంతకీ ఆ వస్తువులు ఎక్కడ ఉంచబడ్డాయి?'**

---

10–1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఇక్కడ ఈ అధ్యాయాన్ని తీసుకువచ్చి, షైతాన్ ఉనికిని నిరాకరించేవారి వాదనను ఖండించారు. మన మనసే ఒక షైతాన్ అనీ, షైతాన్ లేక ఇబ్లీస్ అనేవారి ఉనికి అసలు లేనే లేదని నిరాకరించే వారంటారు.

'ఇబ్లీస్' అనేవాడు ఒక వ్యక్తి అనీ, అతను అగ్నితో సృష్టించబడ్డాడని ఖుస్తులానీ అంటారు. వాడు జిన్నులకు, షైతానులకు పితామహుడని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. మరికొంతమంది ఏమంటారంటే; వాడు దైవదూతల్లోనివాడు. కాని దైవాజ్ఞను ధిక్కరించిన కారణంగా ధూత్కరించబడి, జిన్నుల కోవలో చేర్చబడ్డాడు.

**'బీ'రె జర్వాన్(అనే బావి)లో'.**

**తరువాత దైవప్రవక్త(సఅసం) అక్కడికి వెళ్ళి, తిరిగి వచ్చిన మీదట ఆయిషా (ర.అ)తో,**

**"అక్కడి ఖర్జూరపు చెట్లు షైతాను పుర్రె మాదిరిగా ఉన్నాయి" అన్నారు.**

**'ఆ చేతబడి వస్తువులను తమరు అక్కడి నుండి తీసి వేయించారా? లేదా?' అని నేను దైవప్రవక్త(స)ను అడిగితే,**

**"లేదు. అల్లాహ్ స్వయంగా నాకు సంపూర్ణ స్వస్థతను ప్రసాదించాడు. దీని కారణంగా జనుల మధ్యన కలహం జరగరాదన్న ఉద్దేశంతో కూడా నేను దానిని తీసివేయించలేదు" అని ఆయన(స) చెప్పారు. ఆ తరువాత ఆ బావి మూసివేయ బడింది.[1]**

**582)** ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: **"మీలోని వారెవరయినా (రాత్రి) నిద్రించినప్పుడు, షైతాన్ అతని తల వెనుక భాగంపై మూడు ముళ్ళు వేసేస్తాడు. బాగా పెనవేసి ముడి**

---

581–1. ఈ చేతబడి (బాణామతి, క్షుద్ర విద్య) ప్రభావంగా ఆయన(స) తన భార్యలతో సమాగమం జరిపినట్లుగా తలపోసేవారని, వాస్తవానికి సమాగమం జరిగి ఉండేది కాదని వేరొక ఉల్లేఖనంలోఉంది. ఆయన(స) గారి కొన్ని ఆలోచనలపై దీని ప్రభావం పడింది. అయితే దైవదౌత్య కార్యం, వహీ (దైవవాణి) అవతరణపై దాని ప్రభావం ఏమాత్రం పడలేదు.

మదీనాలోని బనీ జురైఖ్ తోటలో ఒక బావి ఉండేది. దాని పేరు 'బీ'రె జర్వాన్', ఆయన (స) గనక ఆ క్షుద్ర విద్య పరికరాలను అందులోనుంచి తీసివేయించి ఉంటే ప్రజలు దానిని చూసి ఆగ్రహోదగ్రులై, ఆ యూదుణ్ణి చంపేసేవారు. దాని కారణంగా అరాచకం మొదలయ్యేది.

వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది: యూదుడు దైవప్రవక్త(స) ఆకారంలో ఒక మైనపు బొమ్మను తయారుచేసి, అందులో సూదులు గుచ్చాడు. ఒక త్రాడులో 11 ముడులు వేశాడు. అప్పుడు అల్లాహ్ 'ముఅవ్విజతైన్' (సూరయె ఫలఖ్, సూరయె నాస్) అవతరింప జేశాడు. దైవప్రవక్త(స) ఆ సూరాలలోని ఒక్కో ఆయత్‌ను చదువుతూ ఉంటే ఒక్కో ముడి విచ్చుకోసాగింది. అలాగే ఆ బొమ్మలోనుంచి సూదులు తీస్తుంటే ఆయన (స)కు నొప్పి ఉండేది. ఆ తర్వాత ఆయన(స)కు పూర్తిగా ఉపశమనం కలిగింది.

**వేస్తాడు. ప్రతి ముడిపై 'ఇంకా చాలా రాత్రి ఉంది' అనే మంత్రం ఊదుతాడు. అయితే ఆ వ్యక్తి మేల్కొని దైవనామాన్ని స్మరించగానే ఒక ముడి విచ్చుకుంటుంది. అతను వుజూ చేయగానే రెండవ ముడి విచ్చుకుంటుంది. ఫజ్ర్ నమాజ్ చేయగానే మూడవ ముడి కూడా విచ్చుకుంటుంది. తెల్లవారగానే అతను ప్రఫుల్ల వదనంతో– హాయిగా– ఉంటాడు. అన్యథా దురాత్మలా, దరిద్రపు గొట్టులా ఉండి పగలు గడుపు తాడు."[1]**

**583) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) తెలిపారు : నేను దైవప్రవక్త(సఅసం) సేవలో ఉండగా, ఆయన(స) ముందు ఒక వ్యక్తి ప్రస్తావన వచ్చింది. అతను రాత్రంతా పడుకున్నది చాలక, ఉదయం పొద్దెక్కేవరకూ నిద్రిస్తూనే ఉంటాడని చెప్పటం జరిగింది. ఇది విన్న దైవప్రవక్త(స), "అతను ఎలాంటి వాడంటే షైతాన్ అతని చెవిలో లేదా రెండు చెవులల్లో మూత్రం పోశాడు" అని పలికారు.**

**584) ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖించారు : ఏ వ్యక్తి అయినా తన భార్య వద్దకు వచ్చినప్పుడు ఈ దుఆ చేస్తే 'బిస్మిల్లాహి– అల్లాహుమ్మ జన్నిబ్‌నష్షయితాన వ జన్నిబిష్షయితాన**

---

582–1 ఈ హదీసు ఒక విధంగా సర్వరోగ నివారిణి లాంటిది. అనుభవ పూర్వకంగా రుజువయిన విషయం ఏమిటంటే, తహజ్జుద్ వేళకు లేదా ఫజ్ర్ వేళకు లేచి చక్కగా తహారత్ చేసి, నమాజ్ చేసిన వారి పగలంతా ప్రశాంతంగా–సంతోషంగా– గడుస్తుంది. మరెవరయితే పొద్దున పొద్దెక్కేవరకూ నిద్రిస్తూ ఉంటారో, వారిలో చాలామంది రోగ గ్రస్తులుగా, సోమరిపోతుల్లా కాలం వెళ్ళదీస్తుంటారు. ఉదయం పెందలాడే మేల్కొని, ప్రాతః కాలపు స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ నడయాడటం ఆరోగ్యానికి లాభదాయకం అని వైద్యులు కూడా ఏనాడో తేల్చి చెప్పారు.

నేనేమంటానంటే; తెల్లవారుజామునే నిద్రలేచి, పరిశుద్ధతనొంది, నమాజ్ చేసి, దైవాన్ని స్మరించి తమ కార్యక్రమాలలో నిమగ్నులయ్యే వారి జీవనోపాధిని అల్లాహ్ వికసింపజేస్తాడు. వారి లోగిళ్ళలో శుభాలు, సంతోషాలు పొంగిపొరలుతాయి. మరెవరయితే నమాజ్‌కు లేవకుండా పొద్దెక్కేవరకు పక్కలను వదలరో వారిలో అత్యధికులు అనారోగ్యానికి, అభాగ్యానికి లోనై ఉంటారు. వారి ఇండ్లల్లో శాంతీ శుభాలుండవు. ఆ మాటకొస్తే ఐదుపూటల నమాజ్‌లు కూడా విధితమైనవే. కాని ఫజ్ర్ నమాజ్ విషయంలో మరింత శ్రద్ధ వహించాలి. ఎందుకంటే ప్రాపంచిక స్వస్థత, ఆనందం దీని ద్వారానే ప్రాప్తిస్తాయి. **– ఉర్దూ అనువాదకుడు**

మా రజఖ్తనా (ఓ అల్లాహ్! షైతాన్‌ను మా నుండి దూరంగా ఉంచు. నీవు మాకు ప్రసాదించే దాని నుండి- సంతానం నుండి- కూడా షైతాన్‌ను దూరంగా ఉంచు). తరువాత వారికి సంతానం కలిగితే షైతాన్ దానికి ఎలాంటి హాని కలిగించలేదు.

**585)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వివరించారు: "సూర్యుని పై భాగం ఉదయిస్తూ ఉండగా నమాజ్ చేయకండి. సూర్యోదయం పూర్తిగా జరిగేవరకూ (వేచి ఉండండి). అలాగే సూర్యాస్తమయం జరుగుతున్నప్పుడు కూడా నమాజ్ చేయకండి. సూర్యాస్త మయం పూర్తిగా జరిగేవరకు నిరీక్షించండి. సూర్యోదయం, సూర్యాస్తమయాల గడియలలో నమాజ్ చేయకూడదు. ఎందుకంటే సూర్యుడు షైతాన్ తల లేదా షైతానుల తల యొక్క రెండు మూలల మధ్య నుండి ఉదయిస్తాడు-" హిష్షామ్ గారు షైతాన్ తల అని అన్నారో లేదా షైతానుల తల అని చెప్పారో తనకు తెలియదని ఉబైదా అన్నారు.

**586)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "ఒకవేళ మీలో ఎవరయినా నమాజ్ చేస్తుండగా, ఎవరయినా అతని ముందు నుంచి నడచి పోతుంటే అతన్ని ఆపండి, అతను గనక ఆగకపోతే మళ్ళీ ఆపండి. ఒకవేళ అతను ఈసారి కూడా ఆగకపోతే అతనితో పోరాడండి (ఎందుకంటే) అతను షైతాన్."

(వేరొక సనదు)

మహనీయ అబూ హురైరా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసం) నన్ను ఒకసారి ఫిత్రా దానాల ధాన్యాలపై కావలివానిగా నియమించారు: ఆ సందర్భంగా ఒక వ్యక్తి వచ్చి రెండు చేతులతో ధాన్యం నింపుకోసాగాడు. నేనతన్ని పట్టుకుని, "నేను నిన్ను దైవప్రవక్త(స) సమక్షంలో హాజరుపరుస్తాన"ని అన్నాను. ఆ తరువాత ఆయన పూర్తి హదీసును వినిపించారు. వాడు (ఆ దొంగ) అబూ హురైరా (రజి)తో ఇలా అన్నాడు: 'తమరు మీ పడకపై నిద్రించడానికి మేను వాల్చి నప్పుడు ఆయతుల్ కుర్సీ చదువుకోండి. దాని శుభం వల్ల, అల్లాహ్ తరఫున మీపై ఒక పర్యవేక్షకుడు నియుక్తుడవుతాడు, తత్కారణంగా తెల్లవారే వరకూ షైతాన్ మీ దరిదాపుల్లోకి కూడా రాడు'. (ఈ సంగతి విన్న) దైవప్రవక్త(స), "వాడు చెప్పిన మాట నిజమే. కాని వాడు స్వయంగా అబద్ధీకుడు, వాడు షైతాన్" అని చెప్పారు.

**587)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హ్రజత్ అబూ హురైరా(రజి) తెలిపారు : "మీలో ఎవరి వద్దయినా షైతాన్ వచ్చి, మీ అంతర్యంలో 'ఆ వస్తువును పుట్టించినదెవరు? ఈ వస్తువును పుట్టించినదెవరు?' అనే ప్రశ్నను రేకెత్తిస్తాడు. చివరకు ఈ వ్యవహారం, 'మీ ప్రభువును పుట్టించినదెవరు?' వరకూ పోతుంది. కాబట్టి ఏ వ్యక్తిలోనయినా వాడు ఇలాంటి శంకను రేకెత్తిస్తే అతను అల్లాహ్ శరణు వేడుకోవాలి. (అవూజుబిల్లాహ్ పఠించాలి). పైశాచిక ఆలోచనను వదలిపెట్టాలి."[1]

**588)** మహనీయ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅస) ఇలా ప్రవచించారు : "రమజాన్ నెల వచ్చినప్పుడు స్వర్గ ద్వారాలు తెరచివేయబడతాయి. నరక ద్వారాలు మూయబడతాయి. షైతానులను సంకెళ్ళతో బిగించి కట్టడం జరుగుతుంది."

**589)** ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా తాను విన్నానని ఉబై బిన్ కాబ్ (రజి) తెలిపారు : దైవప్రవక్త(సఅసం) ఇలా చెప్పారు– "మూసా తన ప్రయాణ సహచరుని (యోషే బిన్ నూన్)తో, 'మా భోజనం తీసుకుని రా' అని చెప్పినప్పుడు, ఆయన 'చూశారా! మనం ఆ చట్టుబండపై మకాం వేసినప్పుడు, చేప సంగతి మీకు చెప్పటం మరచేపోయాను. మీకు ఈ విషయం చెప్పకుండా షైతాన్ నన్ను పరధ్యానానికి గురి చేశాడు' అని అన్నారు. అల్లాహ్ సూచించిన హద్దును దాటిపోయేవరకూ మూసాకు కూడా ప్రయాణ బడలిక తెలియలేదు".

**590)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : నేను ప్రవక్త మహనీయుల(సఅసం)ను చూశాను. ఆయన(స) తూరుపు వైపు సంజ్ఞ చేసి, "అవును, ఉపద్రవం (ఫిత్నా) ఆ వైపు నుండే, షైతాన్ తల కొమ్ము ఉదయించే చోటు నుండే పొడసూపుతుంది" అని చెప్పారు.

---

587–1. షైతాన్ వేసే శంకలు రకరకాలుగా ఉంటాయి. మొదట వాడు కారణాలు అడుగుతాడు. ఒక వస్తువు పుట్టి ఉంటే, మరి ఆ వస్తువును పుట్టించినదెవరు? లాంటి ప్రశ్నల్ని ఉత్పన్నం చేస్తాడు. ఉదాహరణకు– కొడుకు తండ్రి నుండి పుట్టాడు. తండ్రి తాత నుండి, తాత ముత్తాత నుండి.... చివరకు ఈ ప్రశ్నావళి సృష్టికర్త వరకూ పోతుంది. సృష్టికర్త అయిన అల్లాహ్‌ను కూడా ఎవరో పుట్టించి ఉంటారు కదా! అని అంటాడు. కనుక ఈ శాప గ్రస్తుని శంకలకు విరుగుడుగా 'అవూజు బిల్లాహ్' పఠించాలి.

**591)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రబోధించారని హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు: "రాత్రి చీకటి అలుముకుంటున్నప్పుడు లేదా రాత్రి అవుతున్న ప్పుడు మీ పిల్లల్ని మీ వద్దనే (ఇండ్లల్లోనే) ఆపి ఉంచండి. ఎందుకంటే షైతానులు (పైశాచిక శక్తులు) ఆ సమయంలోనే భూమిలో విస్తరిల్లుతుంటారు.[1] మరి ఇషా వేళ ఒక గడియ గడిచిన తరువాత వారిని విడిచిపెట్టండి. ఆ తరువాత దేవుని పేరుతో మీ తలుపును మూసివేయండి. అల్లాహ్ పేరుతో మీ దీపాలను ఆర్పి వేయండి. అల్లాహ్ పేరుతో నీళ్ళ పాత్రలపై మూతలు వేయండి. ఇతరత్రా పాత్రలను కూడా అల్లాహ్ పేరుతోనే మూసివేయండి. ఒకవేళ మూత లేకపోతే వేరితర వస్తువు ఏదన్నా వాటిపై అడ్డంగా ఉంచండి."

**592)** విశ్వాసుల మాత హజ్రత్ సఫియ్యా బిన్తె హుయ్యి (ర.అ)తెలిపారు: దైవప్రవక్త(సఅసం) 'ఏతెకాఫ్' వ్రతం పాటిస్తూ ఉండగా నేను రాత్రివేళ ఆయనతో మాట్లాడటానికి (మస్జిద్‌లోనికి) వెళ్ళాను. కొంతసేపు ఆయన(స)తో మాట్లాడుతూ గడిపాను. తరువాత నేను తిరిగి రావడానికి లేచి నిలబడినప్పుడు, ఆయన(స) కూడా నన్ను సాగనంపడానికి నాతో వచ్చారు - ఉమ్ముల్ మోమినీన్ సఫియ్యా (ర.అ) నివాస గృహం ఉసామా బిన్ జైద్(రజి) ఇంట్లోని ఒక భాగమే- ఆ సమయంలో ఇద్దరు అన్సార్ సహాబీలు (ఉసైద్ బిన్ హుజైర్, అబ్బాద్ బిన్ బిష్ర్) అటువైపుగా నడచివెళుతున్నారు. వారు దైవప్రవక్త(స)ను చూడగానే, వడివడిగా నడవసాగారు. అప్పుడాయన(స) వారినుద్దేశించి, "కాస్త ఆగండి, ఈవిడ ఎవరో కాదు, సఫియ్యా బిన్తె హుయ్యి" అని చెప్పారు. దానికి వారిద్దరూ, 'సుబ్‌హానల్లాహ్! యా రసూలల్లాహ్ (మేము మీ విషయంలో సంశయానికి లోను కాగలమా!?)' అని పలికారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "షైతాన్ మనిషి శరీరంలో రక్తం మాదిరిగా ప్రవహిస్తాడు. అందుకే, వాడు మీ అంతర్యాలలో కూడా శంకలు వేస్తాడేమోనని నేను భయపడ్డాను."[1]

---

591-1. నేలలో విస్తరిల్లే షైతానులు అంటే, దుష్టశక్తులైన జిన్నులు అని అర్థం. 'అవి విష సర్పాలని' మరికొందరు అభిప్రాయపడ్డారు. సాధారణంగా ఆ వేళలోనే పాములు తమ తమ కన్నాల (పుట్టల)లో నుంచి చల్లని గాలుల్ని పీల్చడానికి బయటికి వస్తుంటాయి.

592-1. రాత్రివేళ దైవప్రవక్త(స) తన భార్యతో కలసి వెళుతున్నప్పుడు ఎదురుపడిన ఇద్దరు సహచరులు పక్కా విశ్వాసులే. అయినప్పటికీ వారి అంతర్యాలలో సంశయం, అనుమానం

**593) సులైమాన్ బిన్ సుర్ద్ (రజి) తెలిపారు: నేను ప్రవక్త మహనీయుల (సఅసం) సన్నిధిలో కూర్చుని ఉండగా, (సమీపంలోనే) ఇద్దరు వ్యక్తులు పరస్పరం తిట్టుకుంటున్నారు. వారిలోని ఒక వ్యక్తి ముఖం ఎఱ్ఱగా కందిపోయింది. అతని మెడ నరాలు ఉబ్బిపోయాయి. అప్పుడు దైవప్రవక్త(స), "నాకొక వచనం (కలిమా) తెలుసు. ఈ వ్యక్తి గనక ఆ కలిమాను పఠిస్తే ఇతని కోపం తగ్గుతుంది. ఇతను గనక అఊజుబిల్లాహి మినష్షైతాన్ (నేను షైతాన్ బారి నుండి అల్లాహ్ శరణు వేడు తున్నాను) అని పలికితే ఇతని కోపావేశం చల్లారుతుంది" అన్నారు. అప్పుడు (అక్కడ ఉన్న) జనులు అతనితో, 'నీవు షైతాన్ బారి నుండి శరణు కోరటం మంచిదని దైవ ప్రవక్త(స) సూచిస్తున్నార'ని చెప్పగా, 'నేనేమైనా పిచ్చివాడినా?'[1] అని ఆ వ్యక్తి అన్నాడు.**

**594) ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖించారు: "మీలోని వారెవరయినా తన భార్య వద్దకు పోయినప్పుడు 'అల్లాహుమ్మ జన్నిబ్నష్షైతాన వ జన్నిబిష్షైతాన మా రజఖ్తనీ 'ఓ అల్లాహ్! నన్ను షైతాన్ నుండి దూరంగా ఉంచు. నీవు మాకు ప్రసాదించే దానిని (సంతానాన్ని) కూడా షైతాన్ బారి నుండి కాపాడు' అని ప్రార్థిస్తే, ఆ 'సమాగమం' ద్వారా వారికి గనక సంతాన ప్రాప్తి కలిగితే, షైతాన్ ఆ సంతానానికి ఎలాంటి హాని కలిగించలేడు. ఆ సంతానంపై తన పెత్తనాన్ని చెలాయించలేడు."**

**595) మహనీయ అబూ హురైరా (రజి) తెలిపారు: ఒకసారి దైవప్రవక్త (సఅసం) నమాజ్ ఆచరించిన తరువాత ఇలా అన్నారు: "షైతాన్ నా ముందుకు వచ్చి, నాపైన ఆధిపత్యం చెలాయించి నా నమాజ్‌ను భగ్నపరచాలని ప్రయత్నిం చాడు. అయితే అల్లాహ్ నాకు అతనిపై ఆధిపత్యం ప్రసాదించాడు."**

---

రావడానికి ఆస్కారం లేకపోలేదు. ఎందుకంటే షైతాన్ ఇలాంటి అవకాశాల కోసమే ఎదురు చూస్తుంటాడు. అందుకే దైవప్రవక్త(స) వారిద్దరినీ కేకవేసి పిలుస్తూ 'ఈవిడ నా భార్య' అని స్పష్టం చేయాల్సి వచ్చింది.

593-1. మనిషికి పిచ్చి పట్టుకున్నప్పుడే షైతాన్ బారి నుండి శరణు వేడటం జరుగుతుందని ఆ వ్యక్తి భావించాడు. వాస్తవానికి క్రోధావేశం కూడా ఒక రకంగా పిచ్చితనమే (ఉన్మాదమే). బహుశా ఆ వ్యక్తి కపటి (మునాఫిక్) అయి ఉంటాడని ఖుస్తులానీ అభిప్రాయపడ్డారు.

**596)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "నమాజ్ కొరకు అజాన్ పిలుపు ఇచ్చినప్పుడు, షైతాన్ వీపు తిప్పుకుని, పెడబొబ్బలు పెడుతూ, అపానవాయువు విసర్జిస్తూ పారిపోతాడు. అజాన్ ఇవ్వటం ముగియగానే మళ్ళీ తిరిగి వస్తాడు. తక్బీర్ చెప్పటం మొదలెట్టి నప్పుడు మళ్ళీ పలాయనం చిత్తగిస్తాడు. తక్బీర్ ముగియగానే మళ్ళీ తిరిగి వచ్చి (నమాజ్ చేసే) మనిషి హృదయంలో కలతలు రేపుతాడు. 'ఫలానా విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకో, ఫలానా మాటను గుర్తుకు తెచ్చుకో' అని ప్రేరేపిస్తుంటాడు. తత్ఫలితంగా అతనికి నమాజ్ మూడు రకతులు చేశానా? లేక నాలుగు రకతులు చేశానా? అన్నది జ్ఞాపకం ఉండదు. ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు మరపునకు సంబంధించిన రెండు సజ్దాలు చేసుకోవాలి".

**597)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "ప్రతి మనిషి పుట్టుక సమయంలో షైతాన్ తన వ్రేళ్లతో అతని ప్రక్కలో గిల్లుతాడు. అయితే మర్యమ్ కుమారుడగు ఈసా(ఏసుక్రీస్తు-అలైహిస్సలాం)ను మాత్రం అతను గిల్లలేకపోయాడు. గిల్లటానికి వెళ్ళాడు. కాని పొరను మాత్రమే తాకగలిగాడు (గర్భాశయంలో శిశువుపైన ఉండే పొరను మాత్రమే తాకగలిగాడు. అల్లాహ్ ఈసా-అలై-ని ఆ ధూర్తుడి బారి నుండి రక్షించుకున్నాడు).

**598)** అల్ఖమా తెలిపారు: నేను సిరియా రాజ్యానికి వెళ్ళినప్పుడు అక్కడి ప్రజలు, "అబూదర్దా వచ్చి, 'మీలో ఆ వ్యక్తి ఉన్నారా? ఆయన్ని అల్లాహ్ తన ప్రవక్త నోట షైతాన్ బారి నుండి కాపాడాడు' అని అన్నారు" అని చెప్పారు.

ముగీరా ద్వారా ఉల్లేఖించబడిన ఇదే హదీసులో ఇలా వుంది: అల్లాహ్ ఆయన్ని తన ప్రవక్త నోట షైతాన్ బారి నుండి తన రక్షణలోకి తీసుకునే ప్రకటన చేశాడు. ఇక్కడ 'ఆయన' అంటే హజ్రత్ అమ్మార్(రజి)[1] అని గమనించాలి.

**599)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "దైవదూతలు మేఘంలో (సమావేశమై)

598-1. దీని అర్థం ఏమిటంటే హజ్రత్ అమ్మార్(రజి) షైతాన్ వలలో పడే రకం కాదు. జరిగింది కూడా అదే. ఆయన సత్యబద్ధులైన హజ్రత్ అలీ(రజి) పక్షాన నిలిచారు. తిరుగుబాటు దారుల్లో చేరలేదు. ఈ హదీసు ద్వారా హజ్రత్ అమ్మార్(రజి) విశిష్టత తెలిసి వస్తోంది. ఆయన దైవప్రవక్త(స) ప్రత్యేక సహచరులు, ప్రియ శిష్యులు.

**భూమండలంలో సంభవించబోయే దానిని గురించి పరస్పరం చర్చించుకుంటారు. అప్పుడు షైతానులు అందులో ఏదో ఒక మాట- చాటుమాటుగా- విని, దానిని జ్యోతిష్కుల చెవిలో పడవేస్తారు- ఒక సీసాలోనిది మరొక సీసాలో వేసేటప్పుడు వాటి మూతులను ఎలా కలుపుతారో అలా తమ నోటితో వారి చెవుల్లో ఊదుతారు. జ్యోతిష్కులు అందులో నూరు అబద్ధాలను తమ తరఫున కలుపుతారు.[1]**

**600) హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు :"ఆవులింత షైతాన్ తరఫున ప్రేరేపితం. కాబట్టి ఎవరికయినా ఆవులింత వస్తుంటే, సాధ్యమైనంతవరకు దానిని ఆపాలి. ఎందుకంటే, ఎవరయినా (ఆవులిస్తూ) 'హాహ్'అంటుంటే అప్పుడు షైతాన్ ముసి ముసిగా నవ్వుకుంటాడు."[1]**

**601) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: ఉహుద్ సంగ్రామంలో బహు దైవా రాధకులకు ఓటమి ఎదురైనప్పుడు ఇబ్లీస్ అరుస్తూ, 'దైవదాసులారా! (ముస్లింలారా!) మిమ్మల్ని వెంబడిస్తున్న వారి బారి నుండి మీరు రక్షించుకోండి' అన్నాడు. అందువల్ల ముస్లింలు వెనుక వైపు తిరిగి, తమ వెనుకనున్న వారిని (ముస్లింలను) కొట్టడం మొదలెట్టారు. హుజైఫా(రజి) చూసినప్పుడు, ఆయన తండ్రి యమాన్(రజి) కూడా ఆ వెనుకనున్న వారిలో ఉన్నారు. 'దైవదాసులారా! ఈయన మా నాన్నగారు, ఈయన మా నాన్న గార'ని అరచినా, మొత్తుకున్నా లాభం లేకపోయింది. దైవసాక్షి! ఆయన్ని హతమార్చే వరకూ వారు వినిపించుకోలేదు. చివరకు హుజైఫా(రజి) 'సరే. అల్లాహ్ మిమ్మల్ని మన్నించుగాక!' అని మాత్రం అన్నారు.[1] (అంటే మీరు అపార్థం వల్ల ఒక ముస్లింని సంహరించారన్నది ఆయన ఉద్దేశ్యం). ఉర్వా ఇలా అంటు న్నారు: తన తండ్రి హంతకుల కోసం హుజైఫా (రజి) మన్నింపు వేడుకోలు**

---

599-1. ఒక సీసాలోని అరకును లేదా నూనెను మరొక సీసాలో వేసేటప్పుడు ఆ రెండు సీసాల మూతులను పరస్పరం కలిపి- ద్రవ పదార్థం క్రింద పడకుండా చేసినట్లే- షైతానులు తమకు కావలసిన జ్యోతిష్కుల దగ్గరకు వెళ్ళి, వారి చెవులకు ముఖం తగిలించి గుట్టుగా ఆ మాట వేస్తారు.

600-1. దీనినిబట్టి తెలిసేదేమంటే ఆవులించేటప్పుడు, వీలయినంతవరకు నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని, శబ్దం బయటికి రాకుండా జాగ్రత్తపడాలి. ఎందుకంటే ఇది సుస్తీకి, బద్ధకానికి చిహ్నం.

601-1. ఈ సంగతి తెలుసుకున్న దైవప్రవక్త(స) హుజైఫా(రజి)కు ఆయన తండ్రి రక్తశుల్కం (దియత్) చెల్లించడానికి వెళ్ళారు. కాని హుజైఫా (రజి) దానిని కూడా ముస్లింల కొరకు

చేస్తుండేవారు. కడకు వారంతా అల్లాహ్‌ను చేరుకునే వరకూ ఈ వేడుకోలు చేస్తుండేవారు.”

**602)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖించారు: నేను దైవ ప్రవక్త (సఅసం)ను, నమాజులో అటూ ఇటూ చూడటం గురించి అడిగితే, “అది షైతాన్ ఎగదన్ను. వాడు మీలోని ఒక నమాజీ నుంచి కొంత ఎగదన్నుకుపోతాడు”[1] అని చెప్పారు.

**603)** అబ్దుల్లాహ్ బిన్ అబూ ఖతాదా, తన తండ్రి నుంచి ఉటంకించిన దాని ప్రకారం కూడా దైవప్రవక్త(స) ఇలాగే ప్రవచించారు.

**604)** అబ్దుల్లాహ్ బిన్ అబూ ఖతాదా, తన తండ్రి ఆధారంగా ఉటంకించిన దాని ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసం) ఇలా ఉద్బోధించారు: “మంచి కల అల్లాహ్ తరఫున వస్తుంది. పీడ కల షైతాన్ తరఫున అయి ఉంటుంది. కాబట్టి ఎవరయినా పీడ కల గానీ, భయంకరమయిన కల గానీ కంటే ఎడమ వైపునకు తిరిగి ‘థూ..థూ...’ అనాలి. షైతాన్ బారి నుండి అల్లాహ్ శరణు వేడుకోవాలి. ఇలా చేయటం వల్ల షైతాన్ అతనికెలాంటి నష్టం చేకూర్చలేడు.”

**605)** మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: ఎవరయినా ఒక రోజులో నూరు సార్లు -లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహు లా షరీకలహు లహుల్‌ముల్కు వ లహుల్ హమ్దు. వ హువ అలాకుల్లి షయ్‌యిన్ ఖదీర్ (అనువాదం : అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేనేలేడు. ఆయనకు భాగస్వామి అంటూ ఎవడూ లేడు. రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయనకు మాత్రమే శోభాయమానం. ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు)- అనే దుఆ చేస్తే అతనికి పది మంది బానిసలకు స్వేచ్ఛనొసగినంత పుణ్యం లభిస్తుంది. నూరు సత్కార్యాలు అతని ఆచరణా పత్రంలో లిఖించబడతాయి. నూరు దుష్కార్యాలు దాని నుండి తొలగించబడతాయి. ఆ రోజు పగలంతా- సాయంత్రమయ్యే వరకూ ఈ దుఆ షైతాన్ బారినుండి అతన్ని

---

మన్నించి వదలిపెట్టేశారు. సుబ్‌హానల్లాహ్! సహాబా (రజి) చేసుకున్న ఒక్కగానొక్క సత్కార్యం మనం జీవితమంతా చేసుకున్న ఆరాధనలన్నింటికన్నా గొప్పది.

602-1. అంటే వాడు నమాజీలను ఏమార్చి, వారిలో కలతలను రేపి వారికి లభించే పుణ్యంలో కొంత భాగాన్ని తగ్గిస్తాడు.

**రక్షిస్తుంది. ఏ వ్యక్తీ ఇతనికన్నా మంచి ఆచరణను తీసుకుని రాలేదు– ఇతనికన్నా అధికంగా ఈ కలిమాను పఠించినవాడు తప్ప.[1]**

**606) హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్ (రజి) కథనం: ఒకసారి ఉమర్ (రజి), దైవప్రవక్త(సఅసం) సన్నిధిలో హాజరయ్యేందుకు అనుమతి కోరారు. ఆ సమయంలో కొంతమంది ఖురైషీ మహిళలు (దైవప్రవక్త సతీమణులు) ఆయన(స) దగ్గర కూర్చుని మాట్లాడుతున్నారు. ఇంటి ఖర్చుల క్రింద డబ్బు పెంచమని హెచ్చు స్వరంలో అడుగుతున్నారు. అయితే ఉమర్(రజి) లోనికి వచ్చేందుకు అనుమతి కోరగానే వారంతా తుర్రుమన్నారు (తెర వెనక్కి వెళ్ళిపోయారు). దైవప్రవక్త(స) ఉమర్‌కు అనుమతి ప్రదానం చేశారు. ఆ సమయంలో ఆయన(స) చిరునవ్వు చిందిస్తూ ఉన్నారు. ఇది గమనించిన ఉమర్(రజి), 'దైవప్రవక్తా! అల్లాహ్ మిమ్మల్ని సదా నవ్విస్తూనే ఉంచుగాక! (కాని ఈ చిరునవ్వుకు కారణమేమిటో తెలుసుకోవచ్చా?)' అన్నారు. దానికాయన (స) "నాకు ఈ స్త్రీల ప్రవర్తన వింతగా తోచింది. ఇప్పుడే వాళ్ళంతా నా ముందు కూర్చుని స్వేచ్ఛగా మాట్లాడారు. కాని మీ కంఠస్వరం వినగానే -భయపడి- పరదా వెనక్కి పారిపోయారు" అని చెప్పారు. ఇది విన్న ఉమర్(రజి), 'దైవప్రవక్తా! వారు నాకన్నా ఎక్కువగా మీకు భయపడాల్సింది. దానికి తగినవారు మీరే' అన్నారు. తరువాత విశ్వాసుల మాతలను ఉద్దేశించి, 'ఓయీ మీ ప్రాణ శత్రువులారా! మీరు దైవప్రవక్త(స)కు భయపడాల్సింది పోయి నాకు భయపడుతున్నారా?' అని ప్రశ్నించగా, 'నిజమే. కాని మీరు దైవప్రవక్త(స)కు ప్రతిగా కఠిన మనస్కులు' అని వారు బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! (ఉమర్!) ఒకవేళ దారిలో షైతాన్ మీకు ఎదురుపడినా తక్షణం వాడు ఆ దారి నుండి తప్పించుకుని మరో దారి గుండా వెళ్ళిపోతాడు."[1]**

---

605–1. అంటే రెండు లేక మూడు వందల సార్లు పఠించినవానికి, ఇతనికన్నా ఎక్కువ పుణ్యఫలం లభిస్తుంది.

ఖుస్తులానీ ఇలా అంటారు: ఈ కలిమాను అనుదినం వందసార్లు నిరంతరాయంగా పఠించినా లేక కొంత కొంత చొప్పున పఠించినా, ఎట్టి పరిస్థితిలోనూ పుణ్యం లభిస్తుంది. అయితే ఉదయంపూట, సాయంత్రం పూట నూరేసి సార్లు చదువుకుంటే పగలు రేయి కూడా షైతాన్ కీడునుండి సురక్షితంగా ఉండవచ్చు.

**607)** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "ఎవరయినా నిద్ర నుండి మేల్కొని వుజూ చేసినప్పుడు, మూడుసార్లు ముక్కు చీదాలి. ఎందుకంటే షైతాన్ రాత్రంతా నాసిక పుటాలపై కూర్చుని ఉంటాడు" (తత్కారణంగా మనిషిపై బద్ధకం ఆవహిస్తుంది. ముక్కు చీదటం వల్ల అతని బద్ధకం కాస్తా దూరమవుతుంది."[1]

## అధ్యాయం : 11

ఎందుకంటే (అల్ అన్ ఆమ్ సూరాలో) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"జిన్నాతులారా! మానవులారా! మా ఆయతులను మీకు వినిపించే, ఈనాటి ఫలితాన్ని గురించి హెచ్చరించే ప్రవక్తలు మీ వద్దకు స్వయంగా మీ నుండే రాలేదా?"

*(అల్ అన్ ఆమ్ : 130)*

వారు (అవిశ్వాసులు) దైవానికీ – దైవదూతలకూ మధ్యన రక్త సంబంధాన్ని కల్పించారు. వాస్తవానికి వారు (లెక్కల దినాన) నేరస్తులుగా ప్రవేశపెట్టబడేవారని దైవదూతలకు బాగా తెలుసు. (37 : 158)

అల్ కహ్ఫ్ సూరాలోని 'మస్రిఫన్' అనే పదానికి మరలవలసిన చోటు అని అర్థం. అహ్ఖాఫ్‌లోని 'సరఫ్నా' అనే పదానికి 'పంపాము' అని అర్థం.

**608)** అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ సా'సా అన్సారీ కథనం : ఈయన గారికి ఈయన తండ్రి తెలియజేశారు. ఆయనతో అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఇలా అన్నారు:

"అడవిలో ఉండి గొర్రెల్ని మేపటం నీకు ఎంతో ఇష్టకరమైన వ్యాపకంలా ఉందని నేను గమనించాను. అందువల్ల నీవు నీ గొర్రెలతోపాటు ఎప్పుడు అడవిలో

---

606–1. వేరొక ఉల్లేఖనంలో ఉమర్(రజి) నీడను సయితం చూసి షైతాన్ భయపడి పారిపోతాడని ఉంది. దైవప్రవక్త(స) ఆ కాలపు చక్రవర్తి, మూర్తీభవించిన కారుణ్యం. దుర్మార్గులు సయితం చక్రవర్తుల ఉదార స్వభావంపై ఎంతో ఆశతో దర్బారుకు వస్తారు. కాగా, హజ్రత్ ఉమర్ దర్బారుకు రక్షకభటుడు వంటివారు. దుర్మార్గులను, బందిపోటు దొంగలను పట్టుకోవలసిన బాధ్యత రక్షక భటునిపై ఉంటుంది. అందుకే దర్బారుకు వచ్చేవారు రక్షక భటునికి ఎక్కువగా భయపడతారు.

607–1. ఈ హదీసులన్నింటి ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మ) షైతానుల ఉనికిని రూఢీ చేశారు. వారు ఎన్నెన్ని విధాలుగా మనిషిని పెడదారి పట్టించే ప్రయత్నాలు చేస్తారో ఈ హదీసుల్లో వివరించటం జరిగింది.

ఉన్నా వేళ అవగానే నమాజ్ కొరకు 'అజాన్' ఇచ్చినప్పుడు బిగ్గరగా ఇవ్వు. ఎందు కంటే 'ముఅజ్జిన్' పిలుపును పరిసరాలలో ఏ మనిషి, జిన్ను లేక మరే వస్తువు విన్నా వారు ప్రళయదినాన సాక్షిగా ఉంటారు."– ఈ హదీసును తాను దైవప్రవక్త(స) చెప్పగా విన్నానని అబూ సయీద్ ఖుద్రీ(రజి) అన్నారు.

## అధ్యాయం : 12

(ఆ సంఘటన కూడా ప్రస్తావించదగినదే) అప్పుడు మేము జిన్నాతుల ఒక వర్గాన్ని ఖుర్ఆన్ వినేందుకు నీ వద్దకు తీసుకువచ్చాము. నీవు ఖుర్ఆన్ పఠిస్తూ ఉండిన స్థలానికి చేరిన తరువాత, వారు పరస్పరం "నిశ్శబ్దంగా ఉండండి" అని చెప్పుకున్నారు. అది చదవటం ముగిసిన పిదప, వారు హెచ్చరిక చేసేవారుగా తమ జాతి వైపునకు తిరిగి వెళ్ళిపోయారు. వారు అక్కడకు వెళ్ళి ఇలా అన్నారు, "ఓ మా జాతి ప్రజలారా! మేము ఒక గ్రంథాన్ని విన్నాము. అది మూసా ప్రవక్త తరువాత అవతరించింది. తనకు పూర్వం అవతరించిన గ్రంథాలను ధ్రువీకరిస్తుంది, సత్యం వైపునకూ, రుజుమార్గం వైపునకూ దారి చూపుతుంది. ఓ మా జాతి ప్రజలారా! అల్లాహ్ వైపునకు పిలిచే వాని సందేశాన్ని స్వీకరించండి, అతనిని విశ్వసించండి. అప్పుడు అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు, మిమ్మల్ని భయంకరమైన శిక్ష నుండి రక్షిస్తాడు." అల్లాహ్ వైపునకు పిలిచేవాని మాటను విననివాడు భూమిలో అల్లాహ్‌ను అశక్తుడుగా చేసే శక్తిని కలిగిలేడు. అతనిని అల్లాహ్ నుండి రక్షించేందుకు ఎలాంటి మద్దతుదారులుగానీ, సంరక్షకులు గానీ ఎవరూ ఉండరు. అటువంటి వారు స్పష్ట మైన మార్గభ్రష్టత్వంలో పడివున్నారు. *(అల్ అహ్ఖాఫ్ 46: 29-32)*

## అధ్యాయం : 13

అల్ బఖరా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"భువిలో రకరకాల ప్రాణులను వర్థిల్లజేశాము."** ***(2: 164)***

ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: దివ్య ఖుర్ఆన్‌లో వచ్చిన 'సూ'బాన్' అనే పదం మగ సర్పానికి వర్తిస్తుంది. మరికొందరి ప్రకారం సర్పాలలో ఎన్నో రకాలుం టాయి. 'జాన్ను' అంటే సన్నగా, తెల్లగా ఉండేది. 'అఫాయి' అంటే విష సర్పం. 'అస్వద్' అంటే నల్లత్రాచు...

**609)** ప్రవక్త మహనీయులు(సఅసం) చెప్పగా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) విని తెలియజేశారు : ప్రవక్త మహనీయులు(స) 'మింబర్'పైనుంచి ప్రసంగిస్తూ ఇలా అన్నారు- "పాములను చంపేయండి. ముఖ్యంగా తలలపై రెండు టీకా లున్న పాములను, తోక తెగిన పాములను కూడా చంపివేయండి. ఎందుకంటే ఇవి కంటిచూపును సయితం పోగొడతాయి. గర్భవతుల గర్భస్రావం చేయిస్తాయి."

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: ఒకసారి నేను ఒక పామును చంపే ప్రయత్నం చేస్తుండగా నన్ను అబూ లుబాబా(రజి) కేకవేసి పిలుస్తూ, 'దానిని చంప కండి' అన్నారు. దానికి నేను, 'దైవప్రవక్త(స) మాత్రం పాములను చంపమని ఆదేశించారు కదా!' అని చెప్పగా, 'ఇళ్ళ ఆవరణలో సంచరించే పాములను కనబడగానే చంపకండి అని తరువాత చెప్పారులెండి. ఎందుకంటే ఆ పాముల్లో కొన్ని జిన్నులై ఉంటాయి అన్నారు'[1] అని అబూ లుబాబా తెలిపారు.

వేరొక సనదుచే అందిన ఇదే కథనంలో 'నన్ను అబూ లుబాబా, జైద్ బిన్ ఖత్తాబ్‌లు (ఇద్దరూ) చూశారు' అని ఉంది.

## అధ్యాయం : 14

## ముస్లిం సంపదలో అత్యుత్తమమైనది గొర్రెల సంపద. వాటిని మేపడానికి అతను పర్వత శిఖరాలపై తిరుగుతాడు

**610)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖించారు : ఒక కాలం రానున్నది. అప్పుడు ముసల్మానుని అన్నిటికన్నా ఉత్తమ సంపద అతని మేకలు, గొర్రెలై ఉంటాయి. వాటిని తోలుకుని అతడు పర్వత శిఖరాలకు, వర్షాలు కురిసే లోయలకు చేరుకుంటాడు- ఆ విధంగా తాను తన ధర్మాన్ని (దీన్‌ను) ఉపద్రవాల నుండి రక్షించుకోగలనని భావిస్తాడు."

---

609-1. ఇండ్లలో తిరిగే సర్పాలను గురించి ముస్లిం రివాయతు ఇలా ఉంది : "మీరు మూడు రోజుల వరకూ వాటిని భయపెట్టండి, మా ఇంటి నుండి వెళ్ళిపొమ్మని గద్దించండి. ఆ తరువాత కూడా వెళ్ళకపోతే వాటిని చంపేయండి" అని దైవప్రవక్త(స) చెప్పారు. విష సర్పాలలోకెల్లా అత్యంత ప్రమాదకరమైనది నల్లత్రాచు. అది కాటేసిన మనిషి తొందరగా చనిపోతాడు.

**611)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు: "సత్య తిరస్కార (కుఫ్ర్) శిఖ తూరుపులో ఉంది. గర్వాతిశయంతో మిడిసి పడటం అనేది గుర్రాల యజమానులలో, ఒంటెల యజమానులలో, జమీందారులలో ఉంటుంది. (సాధారణంగా) వారు పల్లెవాసులై ఉంటారు. కాగా; గొర్రెలున్నవారిలో మనో నిబ్బరం ఉంటుంది.[1]

**612)** ఉఖబా బిన్ అమ్ర్ అబూ మస్ఊద్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు యమన్(ప్రదేశం) వైపు తన చేత్తో సంజ్ఞ చేస్తూ, "విశ్వాసం (ఈమాన్) అనేది అటు వైపున- యమన్‌లో-ఉంది.[1] అవును! కాఠిన్యం, కర్కశత్వం ఒంటెల తోకలు పట్టుకుని నడిచేవారిలో ఉంది. అక్కడి నుండే షైతాన్ కొమ్ములు ప్రస్ఫుటమవుతాయి- అంటే రబీయా, ముజర్ జాతులలో నుండి".

**613)** హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం- మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రబోధనం: "కోడి(పుంజు) కూసినప్పుడు అల్లాహ్ నుండి ఆయన కృపను (జీవనోపాధిని) అర్థించండి. ఎందుకంటే అది దైవదూతను చూసింది.[1] గాడిద స్వరం విన్నప్పుడు షైతాన్ కీడు నుండి అల్లాహ్ శరణు వేడుకోండి. ఎందుకంటే అది షైతాన్‌ను చూసింది."

**614)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "రాత్రి చీకటి అలుముకుంటున్నప్పుడు లేదా (ఆయన ఇలా అన్నారు) సాయంత్రమైనప్పుడు మీ పిల్లల్ని మీ వద్దనే ఆపుకోండి. ఎందుకంటే ఆ సమయంలో షైతానులు (భువిలో) వ్యాపిస్తారు. అయితే రాత్రి ఒక గడియ కాలం గడిచాక వారిని వదలిపెట్టవచ్చు. అల్లాహ్ పేరుతో (రాత్రి పూట) తలుపులు మూసివేయండి. ఎందుకంటే మూసివున్న ఏ తలుపునూ షైతాన్ తెరువలేడు."

---

611-1. సత్య తిరస్కారం (కుఫ్ర్) యొక్క సిగ తూరుపు ప్రాంతంలో ఉంటుందని చెప్పటం గమనార్హం. ఈరాన్, మంగోలియా రాజ్యాలు అరేబియాకు తూర్పున ఉన్నాయి. ఆ కాలంలో అక్కడి రాజులు గర్విష్ఠులుగా పేరు మోశారు. ఈరాన్ చక్రవర్తి దైవప్రవక్త(స) ఉత్తరాన్ని చించివేయటం గుర్తుంచుకోదగిన అంశం. ఇకపోతే గొర్రెల కాపరులు, వారు పేదవారైనప్పటికీ అత్యాశాపరులై ఉండరు.

612-1. యమన్ ప్రజలు ఎలాంటి యుద్ధంగానీ, ప్రతిఘటన గానీ చేయకుండా- సంతోషంగా, మనస్ఫూర్తిగా- ఇస్లాం స్వీకరించారు. అందుకే దైవప్రవక్త(స) యమన్ వాసులను

**615) ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "బనీ ఇస్రాయీల్‌లో కొంతమంది మాయమై పోయారు (వారి ఆకృతులు మార్చివేయబడ్డాయి). నా అనుమానం ఏమిటంటే, వారిని ఎలుకలుగా రూపాంతరం చేయటం జరిగింది. ఎందుకంటే ఎలుకల ముందు ఒంటె పాలు ఉంచబడినప్పుడు అవి దానిని త్రాగవు. (ఎందుకంటే బనీ ఇస్రాయీల్ ధర్మంలో ఒంటె మాంసం నిషిద్ధంగా ఉండేది). కాని మేకపాలు ఉంచబడితే అవి త్రాగేస్తాయి."[1] మరి నేను ఈ హదీసును కాబ్ అహ్‌బార్‌కు వినిపిస్తే ఆయన ఆశ్చర్య పోతూ, 'ఏమిటి, మీరు నిజంగా దైవప్రవక్త(స) ద్వారా ఈ హదీసును విన్నారా?' అని అడిగారు. ఈ విధంగా ఆయన పలుమార్లు అడిగారు. దానికి నేను (దైవప్రవక్త-సఅసం- నోట వినకపోతే మరెవరి నోట విన్నాననుకుంటున్నారు?) 'నేనేమైనా తౌరాతు గ్రంథం చదివానా? అందలి విషయాలు వివరించడానికి?' అన్నాను.**

**616) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: ప్రవక్త మహోదయులు (సఅసం) బల్లె గురించి చెబుతూ, "అది స్వల్పంగా హాని కలిగించే జంతువు" అన్నారు. కాని ఆయన(స) దానిని చంపమని చెప్పినట్లుగా నేను వినలేదు. అయితే దానిని చంపమని దైవప్రవక్త(స) చెప్పేవారని సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) అన్నారు.**

**617) ప్రవక్త మహనీయులు(సఅసం) తొండను చంపేయమని ఆజ్ఞాపించి నట్లుగా ఉమ్మె షరీక్ (ర.అ) తెలియజేశారు.**

---

ప్రశంసించారు. వారు విశ్వాసంలో దృఢచిత్తం కలవారై ఉంటారన్న సంకేతం ఇమిడి ఉంది. యమన్‌లో గొప్ప హదీసు సేవకులు, దేవుని ప్రియతములైన దాసులు పుట్టారు. చివరి కాలంలో అల్లామా ఖాజీ ముహమ్మద్ బిన్ అలీ షౌకానీ (రహ్మ) అనే గొప్ప హదీసు వేత్త గడించారు.

613-1. ఈ హదీసు ద్వారా కోడిపుంజు విశిష్టత బహిర్గతమైందని హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ) అభిప్రాయపడ్డారు, అబూ దావూద్ ప్రామాణికంగా సంకలనం చేసిన సనదులో 'కోడిపుంజును దూషించకండి. ఎందుకంటే అది నమాజ్ కొరకు పిలుస్తుంది' అని ఉంది. అంటే నమాజువేళ దగ్గర పడుతుండగా అది మేల్కొలుపుతుంది.

615-1. రూపురేఖలు మార్చివేయబడిన వారి సంతతి మిగిలి ఉంటుందా? లేదా? అన్న విషయమై భేదాభిప్రాయం ఉంది. అత్యధిక మంది విద్వాంసుల దృష్టిలో 'మిగిలి ఉండదు'. దీనికి సంబంధించి దైవప్రవక్త(స)పై 'వహీ' అవతరించి ఉండదని, ఆయన(స) తన అభిప్రాయంగా మాత్రమే అలా అని ఉంటారని మరి కొందరన్నారు.

**618)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(సఅసం) ఇలా ప్రవచించారు : "తల మీద రెండు టీకాలున్న పాములను చంపేయండి. ఎందుకంటే అవి మనిషిని అంధుల్ని చేసేస్తాయి. గర్భవతుల గర్భానికి నష్టం చేకూరుస్తాయి".

**619)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఉల్లేఖించారు: దైవప్రవక్త(సఅసం) రెండు చారలు గల పామును చంపివేయమని ఆజ్ఞాపించారు. "అది కళ్ళకు హాని కలిగిస్తుంది. గర్భవతుల గర్భస్రావం చేయిస్తుంది"[1] అని చెప్పారు.

**620)** అబీ ములైకా తెలిపారు: ఇబ్నె ఉమర్(రజి) పాములను మొదట్లో చంపివేసేవారు. కాని తరువాత ఆయన స్వయంగా వాటిని చంపటాన్ని వారించ సాగారు. ఆయన ఇలా అన్నారు. దైవప్రవక్త(స) తన గోడ ఒకటి పడగొట్టించి నప్పుడు అందులో పాము కుబుసం ఒకటి కనిపించింది. "మరయితే ఆ పాము ఎక్కడుందో చూడండి" అని దైవప్రవక్త(స) చెప్పడంతో సహచర మాన్యులు దాని కోసం వెతికారు. అది దొరికినప్పుడు "దానిని చంపేయండి" అని దైవప్రవక్త(స) ఆదేశించారు.

ఆ తరువాత నేను అబూ లుబాబా (రజి)ను కలుసుకున్నప్పుడు, "సన్నగా ఉన్న పాములను, తెల్లని పాములను చంపకండి. అయితే రెండు తెల్లటి చారలున్న తోక తెగిన పామును మాత్రం చంపేయండి. ఎందుకంటే అది విషపూరితమైనది. అది గర్భవతుల గర్భాన్ని పడగొట్టేస్తుంది. మనిషి కంటిచూపును పోగొడుతుంది" అని దైవప్రవక్త(స) చెప్పినట్లు నాకు తెలియజేశారు. [1]

**621)** నాఫె ఇలా వివరించారు : ఇబ్నె ఉమర్(రజి) పాములను చంపేసే వారు. తరువాత అబూ లుబాబా (రజి) ఆయనతో, 'దైవప్రవక్త(స) ఇండ్లలో ఉండే సన్నని, తెల్లని పాములను చంపటాన్ని వారించార'ని చెప్పడంతో, ఆయన వాటిని చంపటం మానుకున్నారు.

## అధ్యాయం : 15

## అయిదు రకాల జంతువులు చాలా చెడ్డవి (మనిషికి హాని కలిగిస్తాయి). వాటిని 'హరమ్ క్షేత్రం'లోనయినా సరే చంపవచ్చు.

---

619–1. అంటే, అది కాటేయడం సంగతి అలా ఉంచండి. అది మనిషిని దగ్గరినుండి తీక్షణంగా చూసినా, విషం కక్కినా దాని ప్రభావంగా కంటిచూపు పోతుంది. అలాగే గర్భవతులకు గర్భస్రావం అయిపోతుంది. ఇక అలాంటి విష సర్పం గనక కాటేస్తే ఎలా ఉంటుందో ఊహించవచ్చు.

**622)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ ఆయిషా (ర.అ) ఉల్లేఖించారు: "అయిదు రకాల జంతువులు హానికరమైనవి. వాటిని హరమ్‌లో (పవిత్ర కాబా పరిధిలో) నయినా చంపటం సరైనదే. అవి 1) ఎలుక 2) తేలు 3) గ్రద్ద 4) కాకి 5) కాటేసే కుక్క."

**623)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "అయిదు రకాల జంతువులు ఎటువంటివంటే, ఒకవేళ ఎవరయినా ఇహ్రామ్ దీక్షలో ఉండి వాటిని చంపేసినా, అది పాపంగా పరిగణించబడదు– అవేమంటే; తేలు, ఎలుక, కాటేసే కుక్క, కాకి, గ్రద్ద.

**624)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) కథనం: మహనీయ ముహమ్మద్ (సఅసం) ప్రవచనం "నీటి పాత్రలను మూసి ఉంచండి. నీటితిత్తుల మూతులను బాగా బిగించి కట్టండి. తలుపులను మూసి ఉంచండి. మీ పిల్లలను మీ దగ్గరలోనే సమీకరించండి. ఎందుకంటే సాయంత్రమవగానే జిన్నాతులు (భూమండలంలో) విస్తరిల్లుతారు. ఎగురుతూ దుముకుతూ సంచరిస్తారు. నిద్రించే సమయంలో దీపాలు అర్పివేయండి. ఎందుకంటే ఎలుకలాంటి హానికర జంతువు ఒక్కోసారి వెలిగే దీపాన్ని లాక్కుని వస్తుంది. ఆ విధంగా అది ఇల్లంతటినీ తగులబెడుతుంది". ఇబ్నె జురైజ్, హబీబ్ కూడా దీనిని అతా నుండి ఉటంకించారు. అందులో 'జిన్నాతులు' బదులు 'షైతానులు' అని ఉంది.

**625)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) వివరించారు : మేము ('మినా' ప్రదేశంలో) దైవప్రవక్త(సఅసం)తోపాటు ఒక గుహలో కూర్చుని ఉండగా 'వల్ ముర్సలాతి ఉర్ఫా' ఆయత్ అవతరించింది. ఆయన(స) నోట మేము అప్పుడే, ఆ ఆయత్‌ని వింటుండగానే ఒక పాము అక్కడి కన్నంలో నుండి బయటికి వచ్చింది. మేము దానిని చంపటానికి ముందుకు ఉరకగానే అది వేగంగా తన కన్నంలోనికి

620–1. ఇంతకుముందు కడచిన హదీసులో చారలు గల పామును, తోక తెగిన పామును చంపమని ఆజ్ఞాపించారు. ఇక్కడ కూడా అదే ఆజ్ఞ వచ్చింది. ఏ పాములోనయితే ఈ రెండు లక్షణాలుంటాయో, అది మరింత ప్రమాదకరమయింది. ఈ హదీసు కడచిన హదీసుకు విరుద్ధమేమీ కాదు. అంటే ఏ పాములోనయితే ఈ రెండు గుణాలుంటాయో, దానిని వెంటనే చంపివేయండి అని అర్థం.

దూరిపోయింది. ఇదంతా గమనించిన దైవప్రవక్త(స), "దాని కీడు నుండి మిమ్మల్ని మీరు కాపాడుకున్నట్లే, మీ బారి నుండి అది తప్పించుకుని పోయింది" అన్నారు.

**626)** ప్రవక్త మహనీయులు(సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు : "ఒక స్త్రీ ఒక పిల్లి కారణంగా నరకానికి ఆహుతి అయింది. ఆమె పిల్లిని కట్టి ఉంచింది. కాని ఆమె ఆ పిల్లికి ఆహారం పెట్టనూ లేదు. అది ఎక్కడయినా పురుగు పుట్రా తిని బ్రతికేలా వదలిపెట్టనూలేదు." వేరొక సనదు ప్రకారం అబూ హురైరా (రజి) కూడా ఈ హదీసును దైవప్రవక్త(స) నుండి ఇలాగే ఉల్లేఖించారు.

**627)** హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(సఅసం) ఇలా ప్రవచించారు: దైవప్రవక్తల వర్గంలోని ఒక ప్రవక్త ఒక వృక్షం క్రింద విడిది చేశారు. అప్పుడక్కడ ఆయనకు ఒక చీమ కుట్టింది. తన సామానంతటినీ అక్కడి నుండి తరలించమని ఆయన ఆదేశించారు. తరువాత చీమల పుట్టనంతటినీ దగ్ధం చేయించారు. దానిపై దేవుడు 'వహీ' (దైవవాణి)ని అవతరింపజేసి, "నిన్ను కుట్టింది ఒకే చీమ కదా, మరలాంటప్పుడు దాని నొక్కదాన్నే కాల్చాల్సింది కదా!" అని మంద లించాడు.

## అధ్యాయం : 16

## ఈగ గనక నీరు, ఆహార (ద్రవ) పదార్థంలో పడినప్పుడు దానిని పూర్తిగా ముంచటం గురించి....

**628)** హజ్రత్ అబూ హురైరా (రజి) చెప్పగా తాను విన్నానని ఉబైద్ బిన్ హునైన్ తెలియజేశారు (అబూహురైరా ఇలా చెబుతుండేవారు): ప్రవక్త మహనీ యులు(సఅసం) ఇలా ప్రవచించారు: "ఈగ గనక ఎవరి పానీయంలోనయినా (లేదా ఆహార పదార్థంలోనయినా) పడితే దానిని పూర్తిగా ముంచిన తరువాత తీసి పారేయండి. ఎందుకంటే, దాని ఒక రెక్కలో 'వ్యాధి' ఉంటే, రెండవ రెక్కలో 'వ్యాధి నివారణ' ఉంటుంది."

**629)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు: "ఒక దుర్నడత గల స్త్రీ దేవుని మన్నింపు భాగ్యానికి

నోచుకుంది. ఆమె బావి దగ్గర ఉన్న ఒక కుక్క సమీపం నుండి వెళుతుండగా, ఆ కుక్క దాహంతో రొప్పుతూ ఉంది. దాని పరిస్థితి చూస్తే ప్రాణం విడిచేలా ఉంది. అప్పుడు ఆ స్త్రీ తన (తోలు) మేజోడును తీసి, తన వోణీని త్రాడుగా ఉపయోగించి, బావిలోని నీరు తోడి ఆ కుక్కకు త్రాపింది. తత్కారణంగా ఆమె (పాపం) మన్నించ బడింది."

**630)** ఇబ్నె అబ్బాస్(రజి) గారు అబూ తల్హా (రజి) నుండి ఉటంకించిన హదీసు ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు : "ఏ ఇళ్ళల్లో కుక్క లేదా (ప్రాణమున్న వాటి) రూపచిత్రాలుంటాయో వాటిలో దైవదూతలు ప్రవేశించరు."

**631)** దైవప్రవక్త(సఅసం) కుక్కలను చంపమని ఆజ్ఞాపించారని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు.[1]

**632)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచనం: "ఎవరయితే కుక్కను పెంచుతాడో, అతని సదాచరణలో అనుదినం ఒక ఖీరాత్ (యూనిట్ పుణ్యం) చొప్పున కోత విధించబడుతుంది. పొలం కొరకు లేదా పశువుల (రక్షణ) కొరకు పెంచబడే కుక్కల సంగతి వేరు."

**633)** ప్రవక్త మహనీయులు(సఅసం) ప్రవచించగా తాను విన్నట్లు సుఫ్యాన్ బిన్ అబీ జుహైర్ షనవ్వీ (రజి) తెలిపారు: ఆయన(స) ఇలా ప్రవచించారు– "ఎవ రయినా కుక్కను పెంచినట్లయితే, ఆ పెంపకంలోని ఉద్దేశం పంట పొలం రక్షణ గానీ, పశువుల రక్షణ గానీ కాకుండా ఉంటే, ప్రతి రోజూ అతని సదాచరణలో ఒక ఖీరాత్ (ఒక యూనిట్ పుణ్యం) క్షీణిస్తూ ఉంటుంది" – 'ఏమిటీ, మీరు స్వయంగా దైవప్రవక్త(స) ఇలా చెప్పగా విన్నారా?' అని సాయబ్ అడిగితే, 'అవును, ఆ ఖిబ్లా ప్రభువు తోడుగా! (నేను స్వయంగా ఈ హదీసును దైవప్రవక్త –సఅసం– నుండి విన్నాను)' అని ఆయన చెప్పారు.

**-: నాల్గవ సంపుటం సమాప్తం :-**

---

631–1. అంటే, కుక్కలన్నింటినీ కాదు. పిచ్చికుక్కలను, మనుషులను కాటేస్తున్న కుక్కలను చంపేయాలి. వేటకుక్కల్ని, ఆస్తిపాస్తుల రక్షణకు ఉంచిన కుక్కల జోలికి పోరాదు. అలాగే ఎవరికీ హాని కలిగించకుండా తిరిగే కుక్కల్ని కూడా చంపరాదు.